# గీర్వాణ కవుల

# కవితా గీర్వాణం-3

## గబ్బిట దుర్గాప్రసాద్

ప్రచురణ:

**సరసభారతి**

ఉయ్యూరు, కృష్ణాజిల్లా

# Geervana kavula kavithaa geervanam-3

by

**Gabbita Durga Prasad**

First Edition: **December 24, 2017**

Copies: 500

© **Author**

Price. Rs.**400/-**

Cover Design: **Kalasagar**

For Copies: **Gabbita Durga Prasad**
President, "Sarasabharathi"
H.No.2-405, Sivalayam Street,
Near Raja gari kota, Vuyyuru- 521 165
Krishna Dist. Phone:08676- 232797
Cell: 9989066375
e-mail: gabbita.prasad@gmail.com
sarasabharati.vuyyuru@gmail.com
http/sarasabharati.wordpress.com
http/suvarchalanjaneyaswamy.wordpress.com

Type Setting: **"Ramya Bharathi"** vja

Printed : **Rainbow Graphics,** vijayawada-2

## అంకితం



దయార్ద్ర హృదయులైన హృద్రోగ నిపుణులు

శ్రీ డా. బండారు రాధాకృష్ణ మూర్తి,

డా. శ్రీమతి సులోచన దంపతులకు

# జీవిత విశేషాలు

## జననం

ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా నదీతీరాన నందిగామ తాలూకా వేములపల్లి గ్రామంలో శ్రీ బందారు రాధాకృష్ణ మూర్తిగారు కీ.శే. శ్రీ బందారు రాజేశ్వరరావు, కీ.శే.శ్రీమతి సత్యవతి దంపతులకు 1-7-1929న జన్మించారు. వీరి అన్నగారు శ్రీ భోగేశ్వరావు గారు స్వాతంత్ర సమర యోధులు, నందిగామలో ప్రముఖ సాంఘిక సేవకులు. వీరికి ఇద్దరు అక్క చెల్లెళ్ళు. అమరావతి పాలకులు శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు గారు వీరి కుటుంబానికి వేములపల్లి గ్రామాన్ని ఈనాముగా రాసిచ్చారు. కనుక వీరు వేములపల్లి అగ్రహారీకులు.

## కళాశాల విద్య -ఉద్యమ నిర్వహణ

శ్రీ రాధాకృష్ణ మూర్తిగారు 1946లో విజయవాడలోని ఎస్ ఆర్ ఆర్.అండ్ సి.వి.ఆర్.కాలేజీలో ఇంటర్ చదివి ఉత్తీర్ణులయ్యారు. స్వాతంత్రోద్యమం దేశంలో విస్తృతంగా విస్తరిస్తున్న కాలంలో దేశభక్తి వారిలో పురివిప్పగా మాతృదేశ సేవలో తరించాలన్న ధ్యేయంతో నాయకుల పిలుపు నందుకొని విద్యకు ఎగనామం పెట్టి స్వాతంత్రోద్యమంలో స్వచ్ఛందంగా చేరి, తమ వంతు పాత్ర పోషించిన దేశభక్తులు. తరువాత 1947లో దేశం స్వతంత్ర పొందాక భారత దేశంలోని సంస్థానాలను భారత దేశ అంతర్భాగంలో చేయటానికి నాటి హోమ్ మంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేస్తున్న ప్రయత్నాలకు దాదాపు అందరు సంస్థానాధిపతులు స్వచ్ఛందంగా కలిసి వస్తే, ఒక్క నైజాం నవాబు మాత్రం మొండికేసి నయానా భయానా చెప్పినా లొంగకపోతే, నైజాం నవాబు పెంచి పోషించిన రజాకార్లు ప్రజల ధన మాన ప్రాణాలను హరిస్తుంటే రజాకార్ల దౌష్ట్యాన్ని యెదిరించి పోరాడే ప్రజా ఉద్యమంలో ప్రజల తరఫున ప్రాణాలకు తెగించి పోరాడిన పోరాట యోధులు శ్రీ మూర్తిగారు. గత్యంతరం లేని పరిస్థితులలో సర్దార్ పటేల్ 1949 లో పోలీస్ యాక్షన్ జరిపి తరతరాలబూజు నైజాం నవాబును

గద్దె దింపి నైజాం సంస్థానాన్ని భారత దేశంలో విలీనం చేశాడు .

## ఉన్నత విద్యాభ్యాసం-ఉద్యోగం-రచన

పోలీస్ యాక్షన్ తర్వాత నాటి ముఖ్యమంత్రి మహా విద్యావేత్త డా.బూర్గుల రామకృష్ణారావు, డా. మేల్కొటే మొదలైన ప్రముఖుల సలహాతో శ్రీ మూర్తిగారు ఉస్మానియా యూనివర్సిటీలో చేరి ఆగిపోయిన విద్యను కొనసాగించి విద్యారంగంలోను మేటి అనిపించారు. ప్రముఖ స్వతంత్ర సమరయోధులు, మహా విద్యావేత్త, గ్రంథకర్త, ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ ప్రధమ సభాపతి డా. శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు గారు వీరికి ముఖ్య బంధువు.

మూర్తిగారు ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి 1953లో ఏం ఎస్ సి, 1958లో పి.హెచ్.డి పొందారు. 1953 నుంచి 61 వరకు యూనివర్సిటీ సైన్స్ కాలేజీ లెక్చరర్గా పని చేశారు. 1961లో "ఫుల్ బ్రైట్ ఎక్స్చేంజి ప్రోగ్రాం"లో అమెరికాలోని లూసియానా రాష్ట్రయూనివర్సిటీ కాలేజీ మెడికల్ కాలేజీలో హృద్రోగంపై రీసెర్చ్ చేయటానికి, గ్రాడ్యుయేట్ స్కూల్లో బయో కెమిస్ట్రీ బోధించటానికి అమెరికా వెళ్లారు. 1961 నుంచి 1992 వరకు లూసియానా స్టేట్ యూనివర్సిటీ మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా చేరి, అసోసియేట్ ప్రొఫెసర్గా, ప్రొఫెసర్గా పదోన్నతి పొంది మూడు దశాబ్దాలు సేవలందించారు. 1992 నుంచి టులేన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్లో గుండె జబ్బులపై పరిశోధనలు చేశారు. హృద్రోగాలకు సంబంధిన అనేక అమెరికా జాతీయ, అంతర్జాతీయ రీసెర్చ్ సమావేశాలలో ఆహ్వానితులుగా పాల్గొన్నారు. గుండె జబ్బులపై 200లకు పైగా రీసెర్చ్ పేపర్లు సమర్పించారు. "గుండె జబ్బు - నివారణోపాయాలు'' పుస్తకాన్ని మూర్తిగారు ఆంగ్లంలో రచిస్తే, వారి అర్ధాంగి సులోచనగారు తెలుగులోకి అనువాదం, చేసి ప్రచురించిన ఘనవైద్యులు శ్రీ మూర్తిగారు.

## వివాహ బంధం -సంతానం

రాధాకృష్ణ మూర్తిగారు శ్రీమతి శకుంతల గారిని వివాహమాడారు. వీరి సంతానం 1) శ్రీ రాజేశ్వరరావు 2) శ్రీమతి ఉమ 3) కుమారి హేమ 4) శ్రీనివాస ప్రసాద్ గార్లు. ఈ నలుగురూ అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రంలో ఆరోగ్యశాఖా

సంబంధ వృత్తులలో స్థిరపడ్డారు. దురదృష్ట వశాత్తు శ్రీమతి శకుంతలగారు కేన్సర్ వ్యాధితో 1981లో మరణించి కుటుంబానికి తీరని శోకం కలిగించారు.

## బండారు వారి బంగారు దాంపత్యం

1983లో మూర్తిగారు గుంటూరు జిల్లా రేపల్లెలోని యల్లాప్రగడ వారి ఆడబడుచు ప్రొఫెసర్ శ్రీ యల్లాప్రగడ రామమోహనరావు గారి చెల్లెలు డా. శ్రీమతి సులోచన ఎం.డి.గారిని ద్వితీయ వివాహం చేసుకొన్నారు. శ్రీమతి సులోచన గారు 1969 కాకతీయ యూనివర్సిటీలో ఎం.బి.బి.ఎస్,1973లో ఉస్మానియా యూనివర్సిటీలో డి.జి.ఓ చేశారు. 1985లో అమెరికాలో టులేన్ యూనివర్సిటీలో ఎం.పి.హెచ్ చేశారు. 1983 నుండి లూసియానా స్టేట్ యూనివర్సిటీ మెడికల్ కాలేజీ పాథాలజి డిపార్ట్మెంట్‌లో గుండె జబ్బులకు సంబంధించిన రీసెర్చ్ ప్రోగ్రాంలో 17 సంవత్సరాలు అమూల్య సేవలందించి 2000 సంవత్సరంలో పదవీ విరమణ చేశారు. ఈ బండారు డాక్టర్ దంపతులు జీవికా జీవులుగా బంగారు దాంపత్యంతో వర్ధిల్లుతున్నారు.

## విశ్రాంత జీవితం

హృద్రోగ నిపుణులైన ఈ వైద్య దంపతులు పదవీ విరమణ తర్వాత సంఘ సేవ చేస్తూ, ఆధ్యాత్మిక చింతనతో గడుపుతున్నారు. మహాభక్తులైన మూర్తిగారు లూసియానా రాష్ట్రంలోని న్యూ ఆర్లీన్స్ నగరంలో ఉన్న శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయానికి ఫౌండేషన్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారు. నిత్య ఆధ్యాత్మిక భావనా పరులైన ఈ దంపతులు కుర్తాళం పీఠాధిపతులు శ్రీ శ్రీ సిద్ధేశ్వరా నంద భారతీ స్వాముల (పూర్వాశ్రమంలో పుంభావ సరస్వతీ మూర్తులు అవధాన సరస్వతీ స్వరూపులైన శ్రీ ప్రసాదరాయ కులపతి గారు) వారి సంపూర్ణాను గ్రహం పొందిన భాగ్యశాలురు. కొద్దికాలం క్రితం వారు బండారు దంపతుల ఇంట్లో మూడు రోజులు విడిది చేసి, శ్రీ లలితా పరాభట్టారిక అమ్మవారి నిత్యార్చనలతో అనుగ్రహ భాషణలతో గృహాలయాన్ని ఆధ్యాత్మిక భావ తరంగాలతో పునీతం చేశారు.

## అంకితం


హృదయపు లోతులను పరిశీలించి చూడటమేకాక, హృదయ వైశాల్యం కలిగి,

సాంఘిక సేవతో పునీతమవుతూ సరిలేని ఆధ్యాత్మిక సంపదతో వర్ధిల్లుతున్న దయార్ద్ర హృదయులైన హృద్రోగ నిపుణులు జ్ఞాన వయోవృద్ధులు డా.శ్రీ బండారు రాధాకృష్ణ మూర్తి, డా. శ్రీమతి సులోచన దంపతులకు నేను రాసిన 16 పుస్తకం సరస భారతిచే ప్రచురింపబడుతున్న 28వదైన "గీర్వాణ కవుల కవితా గీర్వాణం-3 మూడవ భాగం" అయిన అరుదైన ఆచూకీ బృహద్గ్రంథం అంకితమివ్వటం సముచితం, శ్రేయస్కరం అని భావిస్తున్నాను.

ఈ గ్రంథాన్ని తమ బావ గారికి, సోదరికి అంకితమిస్తే సముచితంగా ఉంటుందేమో ఆలోచించమని ఆర్ష ధర్మాను సారి, విద్యా వయో వృద్ధులు డా. శ్రీ యల్లాప్రగడ రామ మోహనరావు గారు (అమెరికా) సరసభారతికి ఆతీయులైన తమ ప్రాణస్నేహితులు శ్రీ మైనేని గోపాలకృష్ణ (అమెరికా) గారి ద్వారా నన్ను సంప్రదించటం, నేను అంగీకరించటం దీనిని అంతర్జాలంలో రాస్తున్నప్పుడే జరిగిపోయిన విషయం. ఈ గ్రంథానికి తామే "ప్రాయోజకులు" (స్పాన్సర్)గా ఉండి సరసభారతి ద్వారా గ్రంథ ముద్రణ జరిపించటానికి అయ్యే ఖర్చులు భరించటానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చిన సుమనస్కులు డా. శ్రీ యల్లాప్రగడ రామమోహనరావు గారి ఔదార్యం, సోదరి, బావ గార్ల పట్ల ఉన్న గౌరవ ఆదరాభిమానాలకు సరస భారతి అభినందనలతో కృతజ్ఞతలను తెలియజేస్తోంది. ఇంతటి బృహత్కార్య నిర్వహణకు సలహాలిచ్చి, సారధ్యం వహించి విజయవంతం చేస్తున్న ఆప్తులు శ్రీ మైనేని గోపాలకృష్ణ గారికి కృతజ్ఞతాభి వందనాలు. ❁

**– గబ్బిట దుర్గా ప్రసాద్**

**19-9-17**



## గ్రంథ ప్రాయోజకులు (స్పాన్సర్)

**విద్యాసంపన్నులు వితరణశీలి దేశభక్తి పరాయణులు**

## ప్రొఫెసర్ యల్లాప్రగడ రామమోహనరావు గారు

**కుటుంబ నేపథ్యం-జననం**

శ్రీ యల్లాప్రగడ రామమోహనరావు గారు గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పెదమట్ల పూడి గ్రామంలో 13-12-1933న కీ.శే.శ్రీ యల్లాప్రగడ నరసింహారావు గారు కీ.శే.శ్రీమతి మహాలక్ష్మమ్మ పుణ్య దంపతులకు జన్మించారు. 11 మంది సంతానంలో 7గురు అన్నదమ్ములు, 4 గురు అప్ప చెల్లెళ్ళలలో రావుగారు 6వ వారు. వీరి వరుసక్రమం 1) కీ.శే.శ్రీమతి నరసమాంబ 2) కీ.శే.శ్రీ గోపాలకృష్ణమూర్తి 3) శ్రీ నారాయణ శర్మ 4) శ్రీ కామేశ్వరరావు 5) శ్రీమతి లలితాదేవి 6) శ్రీ రామ మోహనరావు 7) శ్రీమతి సులోచన 8) శ్రీమతి సీతాదేవి 9) శ్రీ శ్రీనివాసరావు 10) కీ.శే.శ్రీ శంకరరావు 11) శ్రీ అప్పాజీ.

తండ్రి గారికి వంశపారంపర్యంగా సంక్రమించిన కరణీకం ఉండటంతో గ్రామంలో, సంఘంలో పెద్దరికం ఉండేది. సుక్షేత్రమైన అనేక ఎకరాల వ్యవసాయ భూమి, పాడి,

పంట వ్యవసాయంతో వీరిల్లు ఎప్పుడూ నిత్య కళ్యాణం పచ్చతోరణంగా ఉండేది. న్యాయ వాది అవటం ఆధ్యాత్మిక మార్గదర్శి అవటం వలన గ్రామంలో ఎవరికి ఏ సలహా సంప్రదింపులు కావలసివచ్చినా వీరి వద్దకు వచ్చి మనసువిప్పి చెప్పుకొని, వారి సూచనలను పాటించి సమస్యలను పరిష్కరించుకునేవారు.

రావుగారి తండ్రి విద్యా సంపన్నులైనందున సంతానాన్ని క్రమశిక్షణతో గొప్ప విద్యావేత్తలను చేశారు. కీ.శే.శ్రీ గోపాల కృష్ణమూర్తిగారు జువలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు డైరెక్టర్. శ్రీ నారాయణ శర్మ గారు తండ్రిగారి వలెనే లా చదివి ఎం. ఏ. ఎల్.ఎల్.బి, సైకాలజీలో ఎం.ఏ చేశారు. శ్రీ కామేశ్వరరావు గారు డాక్టరీ చేసి ఎం.డి అయ్యారు. శ్రీ రామమోహన రావుగారు ఎం.ఏ, ఎం. బి.ఏ., పి.హెచ్.డి. చేసి ప్రొఫెసర్ అయ్యారు. ఈ శతాబ్ది హాబీ అయిన క్రికెట్‌లో కూడా రావుగారు ప్రావీణ్యులు. వీరు పైలట్ లైసెన్స్ పొంది హాయిగా హాబీగా విమానాలు నడిపే వారు . .శ్రీమతి సులోచన గారు డాక్టరీ చదివి,ఏం. డి .ఏం. పి.హెచ్. చేసి హృద్రోగ స్పెషలిస్ట్ అయ్యారు. శ్రీమతి సీతాదేవిగారు బి.ఏ డిగ్రీ అందుకొన్నారు. శ్రీ శ్రీనివాసరావు గారు బి.ఎస్.సి., బి.ఎల్ చేసి కో ఆపరేటివ్ సొసైటీ జిల్లా రిజిస్ట్రార్ చేసి రిటైరై, వ్యవసాయం చేస్తున్నారు. కీ.శే. శ్రీ శంకరరావు గారు జియాలజీలో ఎం.ఎస్. ఎయిర్ ఇండియా ఇంటర్నేషనల్ బోయింగ్ విమాన ప్రధాన పైలట్. శ్రీ అప్పాజీ గారు జియాలజీ పి.హెచ్‌డి చేసి వరంగల్‌లో ప్రొఫెసర్‌గా ప్రిన్సిపాల్‌గా చేసి రిటైరై, ప్రస్తుతం చెరుకుపల్లిలో వ్యవసాయం చేస్తున్నారు. రావు గారి పెద్దబావ గారు కీ.శే.శ్రీ ఆమంచర్ల రామమూర్తిగారు ఆంధ్రప్రదేశ్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫాక్టరీస్‌గా పని చేసి, నీతి నిజాయితీలకు ప్రతిరూపంగా నిలిచారు. రామమోహనరావు గారిది ఇంతటి విద్యాకుటుంబం. తండ్రిగారి కట్టుబాట్లు సంస్కారం వలననే తామందరం ఇంతటికి వారమయ్యా మని రామమోహనరావు గారు వినయంగా కృతజ్ఞతా పూర్వకంగా చెప్పుకొంటారు. ఆ తలిదండ్రుల కడుపు పంట ఇంతగా వన్నె కెక్కటం తలిదండ్రుల ఆశీస్సుల ఫలితం, వారందరి అదృష్టం.

## ప్రొఫెసర్ యల్లాప్రగడ రామమోహన్‌రావు గారి విద్యా, ఉద్యోగ సోపానం

శ్రీ రామమోహనరావు గారు 1948–50లో విజయవాడ ఎస్.ఆర్.ఆర్.అండ్ సి.వి.ఆర్.కాలేజీలో ఇంటర్ చదివారు. 1950–52లో మద్రాస్ లయోలా కాలేజీలో ఇంగ్లిష్ లిటరేచర్ అండ్ మేథమాటిక్స్ చదివి డబల్ మేజర్ బి.ఎ. డిగ్రీ సాధించారు.

1952-58 వరకు ఆరేళ్ళు పూర్తిగా వ్యవసాయానికి అంకితమయ్యారు. తండ్రిగారి న్యాయవాద వృత్తికి ఆకర్షితులై ప్రయివేట్‌గా లా చదివి 1958లో ఉస్మానియా యూనివర్సిటీనుండి ఎల్.ఎల్.బి.అందుకున్నారు. చదివిన చదువుకు సార్ధకత కలిపించటానికి 1958-నుండి 1970 వరకు 12 ఏళ్ళు రేపల్లె జిల్లా మునిసిపల్ కోర్ట్‌లో న్యాయవాద వృత్తి చేశారు.

విద్యాతృష్ణ తీరని రావు గారు 1970-72 కాలంలో అమెరికా వెళ్లి టెన్నెస్సీ రాష్ట్రంలో నాష్ విల్‌లోని టెన్నెస్సీ స్టేట్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ అండ్ ఎకనామిక్స్ చదివి ఎం.ఏ. డిగ్రీ తీసుకొన్నారు. 1972-78లో టెన్నెస్సీ స్టేట్ రిఫర్మెటరీ అండ్ కరెక్షనల్ సిస్టమ్‌లో వివిధ సబ్జెక్ట్‌లను బోధించారు . నాష్ విల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టెన్నెస్సీ సాయంకాల తరగతులకు హాజరై ఎం.బి.ఏ చేశారు. టెక్సాస్ రాష్ట్రంలోని హ్యూస్టన్ యూనివర్సిటీలో 1978-82 వరకు చదివి అకౌంటింగ్‌లో పి.హె.డి. పొందారు.

రామమోహనరావు గారు "డిగ్నిటీ ఆఫ్ లేబర్" ఉన్న వ్యక్తి. ఉదాహరణకు విద్యార్థిగా ఫుల్‌టైం కోర్సులు తీసుకొంటూ సాయంత్రం నుండి అర్ధరాత్రి వరకు 1) స్టూడెంట్ డార్మిటరిలో జూనియర్‌గా బాత్ రూములు, టాయిలెట్లు శుభ్రం చేస్తూ 2) ఫార్మర్స్ మార్కెట్‌లో కూలీగా కాయగూరల బళ్ళు తోస్తూ 3) క్రోగర్ స్టోర్స్‌లో పార్ట్ టైం, మేనేజర్‌గా, ఫ్రెష్ ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్ సెక్షన్‌లో కాటా వేస్తూ, రకరకాల కృషి చేసి కృషిలో ఆనందాన్ని అనుభవిస్తూ, మేనేజిమెంట్ ప్రశంసలతోబాటు పారితోషికాలు కూడా అందుకొన్నారు అంటే ఆశ్చర్యాతి ఆశ్చర్యమేస్తుంది. ఇన్ని పనులు చేసికూడా, అర్ధరాత్రి బస్‌లో మా అపార్ట్‌మెంట్‌కు వచ్చి, ఘుమఘుమలాడే వేడి వేడి సాంబారు తయారుచేసి, మళ్ళీ మమ్మల్నందర్నీ రెండో డిన్నర్ చేయించేవారంటే నమ్మ శక్యం కాదు మాకే ఆశ్చర్యమేసేది. అంతటి ఎనర్జీ ఆయనది. ఆయన చేతితో వేసిన "ఊతప్పం" రుచిచూడాల్సిందే అదరహో, అద్భుతః అనిపించేది.

విద్యార్థిగా ఉన్నప్పుడు సంకట పరిస్థితులలో ఉన్న స్నేహితులకు టర్మ్ పేపర్లు, అసైన్‌మెంట్లు డెడ్ లైన్‌లో పూర్తి చేయటానికి రావు గారు సహాయ పడటానికి నేనే ప్రత్యక్ష సాక్షిని. ఇంతేనా - "టీచింగ్ కెరీర్‌లో కూడా రావుగారు స్నేహితులకెవరికైనా ఉద్యోగం, ప్రమోషన్ ఆగిపోయే ప్రమాద పరిస్థితి వచ్చినపుడు, వీరి పరిశోధనా పత్రాలలో వాళ్లకూ స్థానం కలిపించి సహాయ పడిన త్యాగశీలి, దయార్ద్ర హృదయులు రావు గారు.

ప్రొఫెసర్‌గా పని చేసినప్పుడు తన విద్యార్థులకు, మేనేజిమెంట్ వారికి బహుప్రీతి పాత్రులై అత్యంత అభిమానులై గౌరవనీయు లయ్యారు. అందుకే ప్రొఫెసర్ రావు గారిని 84 సంవత్సరాల వయసు వరకు ప్రోత్సహించి ఉద్యోగ విరమణ చేయనివ్వ లేదంటే అతిశయోక్తి కాదు. యదార్థం. ముమ్మాటికీ నిజం, వారిపై ఉన్న అపార గౌరవానికి నిదర్శనం. ఇదొక అరుదైన సంఘటన. అందరికీ ఆదర్శ ప్రాయం కూడా" అంటూ శ్రీ రామమోహనరావు గారికి పనియెడల గల ఉన్న గౌరవాన్ని, అంటే డిగ్నిటీ ఆఫ్ లేబర్‌ను నిబద్ధతను, కార్యదీక్షను, పాకశాస్త్ర ప్రావీణ్యాన్ని, సేవాపరాయణత్వాన్ని, స్నేహ ధర్మాన్నీ, త్యాగశీల దయార్ద్ర హృదయాన్నీ, ఉద్యోగ నిర్వహణలో అంకిత భావాన్నీ విద్యార్థుల ఆత్మీయ గౌరవాలను, పై అధికారుల ఆదరణ, ప్రోత్సాహం మన్నన, మర్యాదలను ప్రత్యక్షంగా చూసి అనుభవించిన రావు గారి ప్రాణ మిత్రులు, నాకు, సరసభారతి అత్యంత ఆప్తులు శ్రీ మైనేని గోపాలకృష్ణ గారు స్వయంగా రాసి నాకు తమ అనుభవాలను పొందుపరచి తెలియజేశారు. ఉత్తమ వ్యక్తిలోని ఉత్తమ గుణగణాలను దర్శించాలంటే ఉత్తమ వ్యక్తికే సాధ్యం. అలాంటి ఉత్తమ గుణ సంపన్నులు శ్రీ రావు గారు, శ్రీ గోపాల కృష్ణగారు. ఇలాంటి గుణ గరిష్ఠులు నాకు పరిచయమవటం నా అదృష్టం. 1982-నుంచి 2015 వరకు ప్రొఫెసర్ ఆఫ్ అకౌంట్స్‌గా యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్, శాన్ ఆంటోనియో, యూనివర్సిటీ ఆఫ్ లూసియానా, యూనివర్సిటీ ఆఫ్ లాఫె యెట్టి యునివర్సిటీలలో పనిచేసి చివరగా 2015లో నార్త్ కరోలినా రాష్ట్రంలోని ఫియెట్టివిల్ స్టేట్ యూనివర్సిటీలో పదవీ విరమణ చేశారు.

**జన్మభూమిపై మమకారం**

ఉన్న ఊరు, రాష్ట్రం దేశం వదిలి అమెరికాలో పలుచోట్ల చదువు, ఉద్యోగాలలో ఉన్నప్పటికీ రావుగారికి స్వగ్రామం మీద, తాను నేర్చిన వ్యవసాయం మీదా మక్కువ పోలేదు. ప్రతి జూన్ నెలలో రేపల్లె వెళ్లి తమ స్వగ్రామం పెదమట్ల పూడి వ్యవసాయ క్షేత్రాన్ని, అక్కడి మామిడి తోటలను పర్యవేక్షించి వస్తారు. ఇప్పటికీ అక్కడ వ్యవసాయం చేస్తూ పంటపండించి పులకిస్తూ, మామిడి సపోటా జామ ఉసిరి నిమ్మ మొదలైన ఫల వృక్షాలను తనివితీరా చూసి ఆనందాన్ని పొంది, తమ తోటలోని కాయలతోనే ఊరగాయలు పెట్టించి అమెరికాకు తెచ్చి, బంధు మిత్రులతో పంచుకొని ఆనందాన్ని

అనుభవిస్తారు. అక్కడ పొలంలో ఒక కుటీరం ఆవులు, గేదెలు పాడి పంట చూడటానికి నిఘామాను, పనివాళ్ళు ఉన్నారు ఈ విషయంలో రావుగారు అందరికి ఆదర్శ ప్రాయులయ్యారు.

**కుమార్తె శ్రీలక్ష్మి**

అచ్చిరాని వివాహ బంధంతో జీవితంలో అనేక ఆటుపోట్లు, ఒడిదుడుకులను స్థిరచిత్తంతో ఎదుర్కొని తట్టుకొని నిలబడ్డారు శ్రీ రావుగారు. వీరి ఏకైక కుమార్తె శ్రీలక్ష్మి అకౌంటింగ్ అండ్ కంప్యూటర్ సైన్స్‌లో బాచిలర్ డిగ్రీ పొందింది. భారతీయ సంప్రదాయ సంగీతం భారత నాట్యాలలో శిక్షణ పొందింది. నార్తు కరోలినా దర్హాంలోని డ్యూక్ యూనివర్సిటీలో ఇంగ్లిష్ కోర్స్‌కు యెన్ రోలయింది.

**ఘనత వహించిన ప్రొఫెసర్ రావు గారి సహ విద్యార్థులు**

ప్రొఫెసర్ రామమోహనరావుగారికి దేశవ్యాప్తంగా అనేక మంది స్నేహితులు క్లాస్ మేట్లు ఉన్నారు. నేను రాసి సరసభారతి ప్రచురిస్తున్న "ఆధునిక ప్రపంచ నిర్మాతలు–జీవితాలలో చీకటి వెలుగులు, గ్రంథాన్ని అంకితమిచ్చిన ప్రపంచ ప్రసిద్ధ మాథమాటికల్ స్టాటస్టీషియన్ కీ.శే. శ్రీ పరుచూరి రామకృష్ణయ్యగారు మైనేనివారి బావమరిది, రావుగారి రేపల్లె వాసి రేపల్లె హైస్కూల్ సహ విద్యార్థికూడా. రావుగారు విజయవాడ ఎస్ ఆర్ ఆర్ అండ్ సి వి ఆర్ కాలేజీ క్లాస్‌మేట్స్‌లలో ప్రపంచ ప్రఖ్యాత ఆర్థికవేత్త, అమెరికాలోని అంతర్జాతీయ ద్రవ్యనిధిలో ఉన్నతాధికారిగా పని చేసి రిటైరయిన శ్రీ ఆరిగపూడి ప్రేమ్‌చంద్ గారు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పోలీస్ డైరెక్టర్ జనరల్, తమిళనాడు మాజీ గవర్నర్ శ్రీ పీఎస్ రామమోహనరావు గార్లు ఉన్నారు. మైనేని గారూ నేనూ కూడా ఆ కాలేజి విద్యార్థులమవటం మా అదృష్టం.

**రావు గారి విశ్రాంత జీవితం**

అమెరికాలో నార్త్ కెరొలినా రాజధాని ర్యాలీ పట్టణం లోని "కారీ"లో స్వగృహంలో స్థిరపడి అనునిత్యం సంధ్యావందనం చేస్తూ, గంటల తరబడి దైవపూజలో గడుపుతూ, శ్రీ ఆంజనేయ భక్తితో పులకిస్తూ, శ్రీ సుందర హనుమన్మంత్రాన్ని జపిస్తూ, గీతామకరందాన్ని, సంస్కృత సాహిత్యామృతాన్నీ గ్రోలుతూ, సత్కాలక్షేపం చేస్తూ,

శాశ్వతానందాన్నిచ్చే పవిత్ర ఆధ్యాత్మిక సార్ధక జీవితం గడుపుతూ శ్రీ యల్లాప్రగడ రామమోహనరావు గారు సార్ధక జీవితం గడుపుతున్నారు. వీరి చెల్లెలు డా. శ్రీమతి సులోచన గారిని డా. శ్రీ బండారు రాధాకృష్ణ మూర్తి గారికిచ్చి వివాహం వివాహం చేశారు. డా. బండారు దంపతులు కూడా కారీలో స్వగృహంలో స్థిరపడ్డారు. బావా బావ మరదులిద్దరూ ఉన్నత విద్యా, సంపన్న కుటుంబాలకు చెందిన వారు కావటం హర్షణీయం.

## మా రేపల్లె, సాహిత్యాను బంధం

సరసభారతి ఆప్తులు, రావుగారికి ప్రాణ స్నేహితులు శ్రీ మైనేని గోపాలకృష్ణగారి అత్తగారి వూరు, రావుగారి స్వగ్రామం రేపల్లె కావటం, అక్కడ మా బాబాయి స్వర్గీయ శ్రీ రాయప్రోలు శివరామ దీక్షితులు గారిల్లు రావుగారింటి ప్రక్కనే ఉండటం, మా బాబాయి కుటుంబ సభ్యులంతా వారికి చిన్నప్పటి నుంచి బాగా పరిచయమై ఉండటం, మేము షార్లెట్‌లో ఉన్నప్పుడు వారు వారానికోసారి ఫోన్‌లో మాట్లాడుతూ ఎన్నెన్నో విషయాలు చెప్పటంతో మా ఇద్దరి మధ్యా సాన్నిహిత్యం పెరిగింది. వారు ఇదివరకే సరసభారతి పుస్తకాలను శ్రీ మైనేని గారి ద్వారా అందుకొని చదివి ఆనందించటంతో సాహిత్య బంధమూ దృఢమైంది. అందులో ముఖ్యంగా సంస్కృత కవులపై నేను రాసి ప్రచురించిన "గీర్వాణకవుల కవితా గీర్వాణం" రెండు భాగాలు వారికీ వారి బావగారు డా. శ్రీ బండారు రాధా కృష్ణమూర్తి గారికి బాగా నచ్చాయి.

## బావ బావమరదుల ఆతిధ్యం, మన్నన

3-9-17 ఆదివారం మా అమ్మాయి చి. సౌ. విజయలక్ష్మి మనవళ్లు చి. శ్రీకేత్, అశుతోష్ పీయూష్‌లతో నేనూ మా శ్రీమతి ప్రభావతి దంపతులం అమెరికాలోని మేముంటున్న "షార్లెట్" నుండి వారుంటున్న "కేరీ"కు వారి ఆహ్వానంపై వీరందరిని చూడటానికి వెళ్ళినప్పుడు రావుగారి బావ గారు శ్రీ డా.బండారు దంపతులు, బావమరది డా. ఎల్లాప్రగడ రావుగారు కుమార్తె కుమారి శ్రీలక్ష్మి మాకు ఇచ్చిన హార్దిక ఆతిధ్యానికి "ఆంధ్రమాత" గుంటూరు గోంగూర పచ్చడితో, ఆవకాయ పండుమిరపకాయల ఊరగాయలతో, రావు గారి స్పెషల్ అయిన ఘుమఘుమల వేడి వేడి సాంబారు (మైనేని గారన్నట్లు) వడ్డించిన అచ్చ తెలుగు భోజనానికి, రావు గారు స్వయంగా పెంచిన

తమలపాకు తోటలోని లేత తమలపాకులతో, జాజికాయ, జాపత్రి మొదలైన సుగంధ ద్రవ్యాలతో స్వయంగాకట్టి తినిపించిన "కప్పురపు విడెం" అంటే కిళ్ళీలు, చూపిన ఆదరాభిమానాలు, మర్యాద, మన్ననలు మరచి పోరానివై ఈ సాహిత్య బాంధవ్యం మరింత దృఢమైంది. ఇక్కడినుంచే మైనేనిగారితో ఫోన్ సంభాషణ మరింత మాధుర్యాన్నిచ్చింది. శ్రీ హనుమ భక్తులైన రావుగారి సమక్షంలో "శ్రీ సువర్చలేశ్వర శతకం" చదివి వినిపించటం మరింత సుందరతరమైన మధు రానుభూతిగా నిలిచింది.

## ప్రాయోజక బంధం

మూడవ గీర్వాణం రాస్తుండగానే శ్రీ మైనేని గోపాలకృష్ణ గారితో సంప్రదించి ఈ గ్రంథాన్ని తమభావ గారు డా. శ్రీ భండారు రాధాకృష్ణమూర్తి, తమ సోదరి డా. శ్రీమతి సులోచన దంపతులకు అంకితమివ్వవలసినదిగా కోరటం, నేను వెంటనే అంగీకరించటం ఈ పుస్తకాన్ని సరసభారతి ద్వారా ముద్రించటానికి అవసరమయ్యే ఖర్చు అంతా తామే భరించి ప్రాయోజకులుగా (స్పాన్సర్ )గా ఉండటానికి శ్రీ రామ మోహనరావు గారు స్వచ్ఛందంగా ముందుకు రావటం, వారికి ఆర్ష సంప్రదాయంపై ఉన్న మక్కువ, పెద్దలయెడ ఉన్న అపార గౌరవాభిమానాలకు నిదర్శనం. నేను రాసిన 16వ పుస్తకం, సరసభారతి ప్రచురిస్తున్న 28వ గ్రంథం రిఫరెన్స్ లాంటిది ఈ ఉద్గ్రంథం. దీన్ని రావుగారి కోరికపై డా.బండారు దంపతులకు అంకితమిస్తూ స్పాన్సర్‌గా ముందుకిచ్చిన శ్రీ యల్లాప్రగడ వారి ఔదార్యానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. దీనికంతటికి సూత్రధారి మా శ్రీ మైనేని గోపాలకృష్ణగారి స్ఫూర్తి, ఆలోచనలకు సదా కృతజ్ఞుడను.

## వినయంతో విన్నపం

రిసెర్చ్ కృషి లాంటి ఈ బృహద్గ్రంథం "గీర్వాణకవుల కవితాగీర్వాణం-3 మూడవ భాగం ప్రచురణలో నాకు, సరసభారతికి, ప్రాయోజకులకు, అంకితం పొందుతున్నవారికీ ఎవరికీ ప్రతిఫలాపేక్ష, వ్యాపార దృష్టి లేదని, కేవలం ఇంతటి సమాచారాన్ని అభిరుచి ఉన్నపాఠకుల దృష్టికి తెచ్చి అందుబాటులో ఉంచటమేనని మనస్ఫూర్తిగా తెలియబరుస్తున్నాను.❁

**– గబ్బిట దుర్గా ప్రసాద్**



## భజత గీర్వాణ పర్వాన్నమ్

అసమాన అవధాన సార్వభౌమ,

"కాశీకవి", విశ్రాంత ప్రాచార్య

- డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్

**శ్రీ మాత్రే నమః**

బ్రహ్మవాదిని గార్గితో ఆరంభించి, బ్రహ్మవేత్త ఉమాపతి శర్మ గారి వరకు నాలుగు వందల అరువది రెండు మంది గీర్వాణ కవుల కవితా గీర్వాణాన్ని సుపర్వ పర్వ పర్వాన్న ప్రసాదంగా, సర్వ జనహృద్యంగా సంస్కృత భాషా నైవేద్యంగా అందించిన బ్రహ్మశ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ గారి కృషితో సంస్కృత సాహిత్య చరిత్ర సుభిక్షం అయింది. సంస్కృత సాహిత్య సమాచారం ఇంత ప్రణాళికా బద్ధంగా, కాలానుక్రమణికతో, పరిశోధనాత్మకంగా, నిరాడంబరంగా అందించటం ఆంజనేయోపాసకులకు మాత్రమే సాధ్యం. "ఆ ప్రాతం బాసాయంబు"గా, సూర్య భగవానుని వెంట ఎగురుతూ, సమస్త విద్యలు అభ్యసించిన ఆంజనేయస్వామిని ఆవాహన చేసుకొని "నా రుద్రో రుద్ర మర్చయేత్" అన్నట్టు గబ్బిట వారు తూర్పు నుంచి పడమరకు యెగిరి మరీ నవవ్యాకరణ స్వరూపంగా, విస్తృతాధ్యయన విశ్లేషణలతో గీర్వాణ కవుల కవితా గీర్వాణం-3ను సాధికారంగా, సప్రశ్రయంగా, సప్రమాణంగా విశ్వ మానవ సమాజానికి అందిస్తున్నారు. బ్రహ్మశ్రీ దుర్గాప్రసాద్ గారు ఒక సంస్థ చేయవలసిన పనిని ఒంటరి పోరాటంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆత్మీయ కవి పండితులు, బంధు మిత్రుల సహాయ సహకారాలతో సాధించగలగటం శతధా, సహస్రధా అభినందనీయం. ప్రత్యక్షంగా ఎందరినో కలిసి వారి సమాచారాన్ని సేకరించే క్షేత్రస్థాయి శ్రమను కూడా వారు ఈ పెద్ద వయస్సులో వ్యయ ప్రయాసలకోర్చి చేశారు.

## గీర్వాణ కవుల కవితా గీర్వాణం-3

**కోటి దండాలు**

వేదోపనిషత్తుల నుండి నేటి వరకు భారత దేశంలోని నాలుగు దిక్కులలో అన్ని ప్రాంతాలలో అన్నికాలాలో వెలువడిన సంస్కృత సాహిత్యం ,కవి పండితుల పరిచయం వెతికి వెతికి పట్టుకొని వెలికి తీసిన ఘనత ,శాశ్వత కీర్తి గబ్బిట వారికి ఈ రచన ద్వారా లభిస్తున్నాయి. "భారతస్య ప్రతిష్ఠే ద్వే సంస్కృతం సంస్కృతి స్తథా" భారత దేశ ప్రతిష్ఠకు రెండు కారణాలు. ఒకటి సంస్కృత భాష. రెండవది సంస్కృతి. పరస్పరాశ్రయాలైన ఈ రెండు ప్రతిష్ఠలను ప్రపంచానికి తెలియజెప్పే పాఠ్య గ్రంథంగా ఈ రచయిత ఈ పుస్తకాన్ని తీర్చిదిద్ది మానవ జాతికి మహోపకారం చేశారు.

దేవ, ఋషి, పితృ ఋణాలను తీర్చుకోవటానికి అవసరమైన దేవ భాషా విశేషాలను, విలాసాలను, విహారాలను సరళ సుందరమూ, చమత్కార భరితమూ అయిన వ్యావహారిక భాషలో తెలుగులో అందించిన గబ్బిట వారు మాతృ భాషా ఋణం కూడా తీర్చుకున్న వారవుతున్నారు. విశ్వ విద్యాలయాలు, సంస్కృతాచార్యులు జేజేలు పలికే పరిశోధనా గ్రంథంగా అలరారుతున్న ఈ ముఖ పుస్తకం ఆకర గ్రంథాలకు ముఖ పుస్తకంగా రాజముద్ర ను నిస్సందేహంగా పొందుతుంది. భర్తృహరి మహాకవి– "జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః– నాస్తి యేషాం యశః కాయే జరా మరణ జం భయం" అని నోటిమాటగా చెప్పి వెళ్ళిన మాటను గబ్బిట వారు తమ రచన ద్వారా సోదాహరణంగా నిరూపించారు. వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు వంటి సనామకులకే వర్తిస్తున్న భర్తృ హరి సుభాషితాన్ని మారుమూల ఉన్న అనామకులకు కూడా అన్వయింప జేస్తున్న మహామనీషి శ్రీ దుర్గా ప్రసాద్ గారు. చేస్తున్న అని ఎందుకంటున్నానంటే, ఇంతటితో ఆగిపోకుండా ఇంకా చెప్పవలసిన వారు ఉండే ఉంటారు కనుక, ఉన్నారు కనుక. ఈ ప్రణాళికను కొనసాగించ గలందులకు మనవి చేస్తూ అలా అన్నాను.

యుగాల వారీగా ఋషులకే కాక ఋషికలను కూడా పరిచయం చేసి స్త్రీ వాదులకు చేయూత నిస్తున్న ఈ గ్రంథంలో మరో విశేషం శ్రీరాముడు, రావణ బ్రహ్మ, ఆంజనేయుడు కూడా గీర్వాణ కవులలో చోటు చేసుకున్నారు. భగవద్గీతను చెప్పిన కృష్ణుడు సరేసరి.

మొదటి రెండు సంపుటాలకంటే ఈ మూడవ సంపుటంలో మరింత వైవిధ్యంతో అన్ని రంగాల్లో సంస్కృత భాషలో వెలువడిన వాఙ్మయ పరిచయం అందరికీ ఉపకరిస్తుంది. కాశ్మీర్, అస్సాం కేరళ వంటి రాష్ట్రాల్లో ఆసేతు శీతాచలం సంస్కృత భాషలో ఎంత కృషి జరిగిందో ఈ పుస్తకాన్ని తిరగేస్తే, యువతరానికి పై తరానికి కరతలామలకంగా తెలిసిపోతుంది.

భారత దేశంలోకి ప్రవేశించిన మహమ్మదీయ క్రైస్తవాది ఇతర సంస్కృతులు

సంస్కృత భాషను ఎలా ఉపయోగించుకున్నాయో ఇందులో చూడవచ్చు. బౌద్ధ జైనాది అవైదిక మతాలను కూడా సంస్కృత భాష తనలో ఇముడ్చుకుంది. సంస్కృత భాష పరిధి యెంత విస్తృతమో మూడవ సంపుటిలో స్పష్టమౌతుంది. అనేక శాస్త్రాల ఆకరాలు దీనిలో గోచరిస్తాయి. సంగీతం, సాహిత్యం, తర్కం, వ్యాకరణం, కామశాస్త్రం, గణితం, భౌతిక, రసాయన, వైద్య, ధర్మ, నీతి, న్యాయశాస్త్రాల వంటి రచనలు ఈ పుస్తక విషయ సూచిక చూచినా తెలిసేట్టు శీర్షికలు నిర్ణయించిన మేధావి గబ్బిట వారు. సంస్కృతంలో సినిమా తీసిన జి.వి.అయ్యర్ గారి ఋణం కూడా పాఠకులు అందరి పక్షాన వారు తీర్చుకున్నారు. సంస్కృత అంతర్జాల ప్రవేశకర్త వి.ఆర్.పంచముఖి గారిని ప్రస్తావించి కృతజ్ఞతలు చెప్పుకోవటం అభినందనీయం. దీనిని బట్టి సంస్కృత కవుల పేర్లు, కాలం, రచనలు వరుసగా ఎక్కాల పుస్తకం లాగా రాసి ముక్కున బట్టి మొక్కు తీర్చుకునే, పి.హెచ్‌డి ప్రణాళికయో, కొలతలు, కోచింగులతో ఎన్నికయ్యే ప్రపంచ సుందరి పథకమో కాక "జనని సంస్కృతంబు సకల భాషలకును" అన్న సంపూర్ణ విశ్వాసంతో, ఆత్మీయతతో, నిబద్ధతతో, అనాద్యనవచ్ఛిన్న పారంపరిక సంస్కృతికి కేంద్రంగా సంస్కృత భాషలో జరుగుతున్న కృషిని యధాశక్తి సమగ్రంగా, బహుముఖీనంగా, నిసర్గ రమణీయంగా ఆవిష్కరించి వండి వడ్డించిన గీర్వాణ పర్వాన్నమ్‌గా వర్తమాన భావి తరాలకు "గీర్వాణ కవుల కవితా గీర్వాణం –3"ను అందిస్తున్న రచయిత బ్రహ్మశ్రీ గబ్బిట దుర్గా ప్రసాద్ గారికి, అంకితం చేసుకొంటున్న పెద్దలు డా.శ్రీ బండారు రాధాకృష్ణమూర్తి డా.శ్రీమతి సులోచన దంపతులకు, ప్రాయోజకులుగా ఉన్న డా. శ్రీ యల్లాప్రగడ రామమోహనరావు గారికి గీర్వాణ వాణీ రూపిణి శ్రీమాత ఆయురారోగ్య భోగ భాగ్యములను, పుత్రపౌత్రాభివృద్ధిని అనుగ్రహించుగాక!

దుర్గా ప్రసాద సంకీర్ణం, గబ్బిటాన్వయ నిక్వణం
గీర్వాణ కవి గీర్వాణం,తార్తీయీకం గణం భజే.
సమస్త సన్మంగళాని భవన్తు
స్వస్తి.❁

**– డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్**




# ముచ్చటైన మూడవ గ్రంథం

- డా. ఎల్లాప్రగడ రామమోహనరావు
(అమెరికా)

దేశ, విదేశాలకు చెందిన సంస్కృత కవుల జీవితం, కవిత్వ విశేషాలపై ఇప్పటికే రెండు గ్రంథాలు రచించి, తృప్తి చెందక, గాలించి, శోధించి, విషయ సేకరణ చేసి ఇప్పుడు ముచ్చటైన మూడవ గ్రంథం "గీర్వాణ కవుల కవితా గీర్వాణం -3" మూడవ భాగం వెలువరించిన శ్రీ గబ్బిట దుర్గా ప్రసాద్ గారు అభినందనీయులు. జైన, బౌద్ధ, శైవ, వీర శైవ, శాక్తేయ, వైష్ణవ, శ్రీ వైష్ణవ, అద్వైత గ్రంథకర్తలను, వివిధ పీఠాదిపతుల గ్రంథాలను, దర్శన, చారిత్రక, జీవిత చరిత్ర, ఆత్మకథ, కావ్య, మహాకావ్య, శతక నాటక, నాటిక, నవల, కథా, పత్రికా రచన, తాళపత్ర, శిలా, తామ్రపరిశోధన లేఖాది వివిధ ప్రక్రియలలో ఆ కవుల ప్రతిభావ్యుత్పత్తుల విశేషాలను తెలియజేసిన గ్రంథం ఇది. వేద కాలం నుండి ఆధునిక 21వ శతాబ్ది వరకు ఉన్న కవులను స్పర్శించిన తీరు ముచ్చటగా ఉన్నది. ఆ సేతు హిమాలయ పర్యంతవ్యాప్తమైన ఈ కవులు దేశ కాలాలకు అతీతులు, చిరస్మరణీయులు. దుర్భిణీ వేసి చూసినట్లు ఆ కవులను వెతికి పట్టుకొన్నారు. అందరిపై సమాన ఆదరం చూపించారు. వారి బిరుదులను, పొందిన గౌరవ పురస్కారాలను, చేసిన భాషా సేవనూ మన ముందుంచారు. ప్రాచీన తెలుగు కవులనే మరచిపోతున్న ఈ కాలంలో ఎప్పటెప్పటివారో, ఏయే ప్రాంతాలవారో కూడా సరిగ్గా తెలియని గీర్వాణ కవుల వివరాలు అందించటం మహత్తర కార్యం. గీర్వాణ భాషా వ్యాప్తికి ప్రభుత్వాలు గ్రామాలు చేసిన, చేస్తున్న విశేష కృషికి దర్పణం ఈ గ్రంథం.

విషయ సేకరణ ఒక ఎత్తు అయితే, విషయ వివరణ మరో ఎత్తు. సులభ గ్రాహ్యంగా రాయటం మరో ఎత్తు. ఈ మూడిటి త్రివేణీ సంగమమే ఈ గ్రంథం. ఈ నాటి యువతరానికి ఆనాటి కవుల ప్రతిభా సామర్థ్యాలు అందజేయటమే ప్రధాన లక్ష్యంగా శ్రీ దుర్గా ప్రసాద్ రచించి మనముందుంచారు. ఇంతటి ఉత్కృష్ట గ్రంథాన్ని మా బావగారు డా. శ్రీ బందారు రాధా కృష్ణ మూర్తి, మా సోదరి డా. శ్రీమతి సులోచన దంపతులకు అంకితమిస్తే ఉచితంగా ఉంటుందని నా మిత్రుడు శ్రీ మైనేని గోపాల కృష్ణ (అమెరికా) ద్వారా చెప్పించగానే అంగీకరించిన శ్రీ దుర్గా ప్రసాద్ గారికి ధన్యవాదాలు సరసభారతి ద్వారా ఈ గ్రంథం ముద్రించటం, నేను స్పాన్సర్‌గా ఉండటం నాకు దక్కిన అరుదైన అదృష్టం **- డా.ఎల్లాప్రగడ రామమోహనరావు** కారీ-యు ఎస్ ఎ -4-10-17



# నా మనవి మాటలు

"గీర్వాణ కవుల కవితా గీర్వాణం-2" రెండవ భాగం ముద్రణ జరుగుతున్న సమయంలోనే మూడవ భాగం కూడా అంతర్జాలంలో రాయటం ప్రారంభించాను. మొదటగా డా. శ్రీ హయగ్రీవ శర్మగారిని నెట్‌లో వెదికి రాసి, ఇంకా ఎవరైనా ఆంధ్ర, కాకతీయ, కృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం వారెవరైనా ఉన్నారేమోనని చూస్తే ఎవరూ దొరకలేదు. మైనేని గారూ వెదికి లాభం లేదన్నారు. తర్వాత మూక కవి, కంచి పరమాచార్యలను గురించి రాశా. డా. బూరగడ్డ నరసింహా చార్య గారు ఫోన్ చేసి విశ్వనాథ వారి వేయిపడగలను సంస్కృతంలోకి అనువాదం చేసిన డా. అయ్యగారి ప్రభావతి గారి గురించి రాయమని, ఆమె ఫోన్ నంబర్ ఇస్తే మాట్లాడి, హైదరాబాద్‌లో స్వయంగా వారింటికి వెళ్లి మాట్లాడి ఇంటర్ వ్యూ చేసి ఆమె రాసిన గ్రంథాలు ఇవ్వగా ఆమె గురించి సవివరంగా రాశా. రెండవ గీర్వాణానికి నాకు సారధి సచివులు అయిన డా. తూములూరు శ్రీ దక్షిణామూర్తి గారు తమ సహ సంస్కృత ఉపన్యాసకులు మహా పండితులు డా. శ్రీ నిష్ఠల సుబ్రహ్మణ్య శాస్త్రి గారి గురించి రెండవ భాగంలోనే రాయాల్సి ఉంది, అయినా మించిపోలేదని వారి నంబర్ ఇవ్వగా మాట్లాడి మన పుస్తకాలు వారికి పంపి వారి గ్రంథాలు అందుకొని వారి గురించి సమగ్రంగా రాయగలిగాను. డా. వెంపటి కుటుంబ శాస్త్రి గారు నెట్‌లో దొరికారు సమగ్రంగా విషయం లేకపోయినా రాశానని తృప్తి చెందా. దాదాపు అందరి గురించి రాసేశాననుకొన్నా. ఈ పుస్తకంలో 100 మంది కంటే ఉండరనిపించింది. గీర్వాణం-2 లో డా. గబ్బిట ఆంజనేయ శాస్త్రి గారి గురించి రాశాను కాని నాకే సంతృప్తి కలగలేదు. వారు మార్చిలో ఉయ్యూరులో మా ఇంటికి వచ్చినప్పుడు వారిని అన్ని వివరాలు అడిగి తెలుసుకొని సమగ్రంగా వారి గురించి మళ్ళీ రాసి దీనిలో చేర్చటమే కాదు దీనినీ వారి గురువులు శ్రీ మద్దులపల్లి

మాణిక్య శాస్త్రి గారిపై రాసిన దానిని ఆధారంగా ఒక చిన్న బుక్‌లెట్ తయారు చేసి మద్దులపల్లి వారి శత జయంతికి ఆవిష్కరణ జరిపాం. అదే సమయంలో మా ఇంటికి వచ్చిన వారి ఇద్దరు కుమారులు డా. మాణిక్య శాస్త్రి డా. శ్రీనివాస శాస్త్రిల సంస్కృత సేవల గురించీ తెలుసుకొని చదివీ రాశా. ఈ ముగ్గురు ఈ గ్రంథంలో ఉండటం కడు విచిత్రం రమణీయం అనిపించింది. గబ్బిట వారి ద్వారా పరిచయమైన డా.ఇనగంటి ఉమారావు గారి భాషాసేవనూ వారిచ్చిన గ్రంథం ఆధారంగా వెంటనే రాసేశాను. ఋగ్వేద మంత్రద్రష్టలైన మహర్షులను గార్గి మైత్రేయి లోపాముద్ర మొదలైనవారినీ, బ్రాహ్మణ అరణ్యక, ఉపనిషత్తులు, వాల్మీకి వ్యాసాదులను గంధర్వ రాజు పుష్పదంతుని “శివ మహిమ్న స్తోత్రం”, ఋభు గీత, అష్టావక్ర గీత మొదలైన వాటిని గురించి రాసి వీరందరినీ కాలాతీత వ్యక్తులుగా భావించి వీరినందరిని “వేద ఉపనిషత్ పురాణ ఇతిహాస కాలం” వారుగా పేర్కొని తర్వాత క్రీస్తు పూర్వయుగం తర్వాత 10వ శతాబ్దం వరుసగా 21వ శతాబ్దం వరకు రాశాను. ఇలా ఏప్రిల్ మొదటివారం అమెరికా వెళ్ళేలోపు 138 కవులను గురించి రాశాను.

అమెరికా వెళ్లి ఇక్కడ మొదలు పెట్టిన “వ్యాఖ్యాన చక్రవర్తి మల్లినాద సూరి మనీష”ను అక్కడ పూర్తి చేయటంతో ఇది ప్రక్కకు వెళ్ళింది. అక్కడ చదివిన ఇంగ్లిష్ పుస్తకాలలోని సారాన్ని కొన్ని వ్యాసాలుగా రాయటంతో కొంత సమయం గడిచింది. మళ్ళీ గీర్వాణం పని మొదలు పెట్టా. కాశ్మీర్ కవులెవరైనా ఉన్నారేమోనని వెతికితే అమూల్య నిధి బయట పడింది. కాశ్మీరీ పండితుల గీర్వాణ సేవ నిరుపమానమైనది. పాణిని కల్హణుడు వంటి పాతతరం వారు తప్పితే తరువాతవారెవరూ మన దృష్టిలోకి రాలేదని పించి వరుసగా దొరికిన వారిని దొరికినట్లు సంతృప్తిగా రాయగలిగాను. లల్లాదేవి రచనలనూ రాశాను. కాశ్మీర్ సర్వజ్ఞపీఠం గురించి రాసి తృప్తి చెందాను. ఇంకెవరు ఉంటారులే అనుకొంటూ మహా అయితే 200 మంది అవుతారనుకొన్నాను. దృష్టి ఒరిస్సా మీద పడింది. అక్కడ మనకు జయదేవుడు తప్ప ఎవరూ పెద్దగా తెలియదు. త్రవ్విన కొద్దీ మహా కవులు, వారి ఉద్గ్రంథాలు బయట పడ్డాయి. అసలు ఆ కవుల పేర్లు రచనలూ మధుర మధురంగా ఉన్నాయి. మహదానందంగా వారందరి గురించి రాశాను. ఈసారి చూపు అస్సాం మీద పడింది. ఆ రాష్ట్రమూ ఏమీ వెనుకబడి లేదని అక్కడి కవుల గురించి రాస్తుంటే అర్ధమయింది.

కంచి, శృంగేరి పీఠాధిపతుల రచనలకోసం గురు పరంపర శోధించా. కావలసినంత మంది మహానుభావులు గొప్ప రచనలతో గీర్వాణ భారతిని అలంకరించటం గమనించి వదిలి పెట్టకుండా రాశా. శంకరాచార్య గురువు గోవింద భాగవత్పాదులు

గౌడ పాదులు శిష్యులు సురేశ్వరాచార్య మొదలైనవారు, ఉభయభారతిలను గురించి రాశాను. పూరీ, జ్యోతిర్ మఠ్, ద్వారకా పీఠాదిపుల కోసం వెతికా. చాలా తక్కువ సమాచారమే దొరికింది. శైవ వైష్ణవ, మధ్వ అద్వైత విశిష్టాద్వైత ఆచార్యులను వెతికి వెతికి రాయ గలిగాను. జైన, బౌద్ధాచార్యులు వారి ఉద్గ్రంథాలగూర్చి రాయగలిగాను. తర్వాత వాగ్గేయకారులను ఆరా తీస్తుంటే అన్నమయ్య దగ్గరనుంచి ఎందరెందరో తెలుగు తమిళ మళయాళ, కన్నడ సంగీతకారులు అద్భుత సంస్కృత కృతులు కీర్తనలు రాసినట్లు తెలిసి వారిని పొదివి పట్టుకొని రాశాను. అన్ని రాష్ట్రాలలోను సంస్కృత విశ్వ విద్యాలయాలలో జరుగున్న సంస్కృత పరిశోధనలను వెతికి కొంత సేకరించి రాశా. 21వ శతాబ్ది రచనలు కూడా సేకరించి రాశాను. మధ్య ప్రదేశ్, అస్సాం, హర్యానా కర్నాటక ఉత్తరాఖండ్ రాష్ట్రాలు సంస్కృత వ్యాప్తికి చేస్తున్న మహత్తర కృషినీ వదిలిపెట్టకుండా రాశా. సంస్కృత చలన చిత్రాలు నిర్మించి దర్శకత్వం వహించిన శ్రీ జి వి అయ్యర్ గురించి రాయకపోతే అసమగ్రం అవుతుందని రాశా. కర్నాటక, మధ్యప్రదేశ్‌లలో సంస్కృతంలోనే మాట్లాడే గ్రామాల గురించి మంచి విలువైన సమాచారం రాశా. టీనేజి కుర్రాళ్ళు సంస్కృతం నేర్చి పెద్దలకు కూడా సంస్కృతం నేర్పటం గ్రహించి వారినీ చేర్చా. ముస్లిం, క్రైస్తవ సోదరులు సంస్కృత వ్యాప్తికి చేసిన, చేస్తున్న సేవలను ప్రస్తుతించాను. బైబిల్ సంస్కృతానువాద మహాకావ్యంగా రాసిన శ్రీ దేవాస్సియా ప్రతిభకు ఆశ్చర్య చకితుడనయ్యాను. ఈ శతాబ్ది సంస్కృత ముస్లిం మహిళా శిరోమణి పద్మశ్రీ శ్రీమతి నాహీద్ అబీదీ, నడయాడే సంస్కృత సర్వస్వం పండిట్ ముష్తి మొహమ్మద్ సర్వర్ ఫరూకీ విజ్ఞానానికి అబ్బురపడ్డాను. వారి అమూల్య గ్రంథాలను తెలియజేశాను. అమెరికాలో ఉన్న రోజుల్లో ఉదయం 9-30౹కు కంప్యూటర్ ఎక్కి మధ్యాహ్నం 1 గంటవరకు, కాసేపుభోజన విశ్రాంతి తర్వాత మళ్ళీ మధ్యాహ్నం 3-30కు కూర్చుని రాత్రి 8 గంటల వరకు ఇదే పని- శోధించటం, రాయటం. జీవిత చరిత్రలు, ఆత్మ కథలు సందేశ కావ్యాలు, విలాస కావ్యాలు, లేఖా స్రవంతి నాటిక నాటకాలు, గీతాలు దేశభక్తి గీతాలు, గాంధీ మొదలైన జాతీయ నాయకులపై రచనలు, యాత్రా సాహిత్యం, సంస్కృత డైరీ రాసిన విస్తృత యాత్రికుడు రాహుల్ సాంకృత్యాయన్, చివరకు ఆధునిక కవితా ప్రక్రియ "హైకూ"నూ సంస్కృతంలో ప్రవేశ పెట్టిన కవులందరూ ఇందులో కొలువై కూర్చున్నారు.

అమెరికా నుంచి వచ్చాక వేద గణితవేత్త డా.రేమేళ్ల అవధానులు గారిని వారింటి వద్ద కలిసి వారి కృషికి అభినందనలు తెలియజేసి మన పుస్తకాలు అందజేయగా

వారు తాము ఈమధ్యనే రెండు భాగాలుగా ప్రచురించిన “గణిత శాస్త్ర చరిత్ర”ను నాకు కానుకగా ఇచ్చారు. ఇందులో మొదటిభాగం ఆధారంగా శ్రీ బాలగంగాధర తిలక్ మొదలైనవారి గురించి రాయగలిగాను. కేరళలో అన్ని రంగాలవారూ సంస్కృత రచనలు అన్ని ప్రక్రియలలో చేశారు. ముఖ్యంగా నంబూద్రి కుటుంబం చేసిన గీర్వాణ సేవ అతి విలువైనది. స్వామి శివానంద స్వామి చిన్మయా నంద ఆధ్యాత్మిక సేవలనూ చిత్రించాను. ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే గీర్వాణం –3లో కవుల సంఖ్య 462 మంది అయ్యారు. నాకు ఆశ్చర్యం తోపాటు పరమానందం కలిగింది. అంటే అమెరికాలో ఉండగా 324 మంది కవుల గురించి రాయ గలిగానన్నమాట. ఇంకా ఎందరో ఉండి ఉంటారు. తీవ్ర శోధన సాధనా చేస్తే మరింత గీర్వాణ భాండారం బయట పడుతుంది. మనకు ఓపికా తీరికా ఉండాలి అంతే. పుస్తకం చేతిలో పట్టుకుంటే ఆసక్తిగా చదివించే లక్షణం ఉండాలన్నది నా ప్రయత్నం. ముఖ్యంగా యువతకు చేరువవ్వాలని తపన. అందుకే శీర్షికలు అర్థవంతంగా ఆకర్షణీయంగా పెట్టాను. కవి గ్రంథాన్ని ముందు రాసి తర్వాత కవి పేరు వచ్చే ప్రయత్నం చేశా. సామాన్య వాడుక భాషలోనే చెప్పే ప్రయత్నం చేశా. ఎంత వరకు కృత కృత్యుడనయ్యానో కాలం తేల్చాలి.

ఇందులో నేను రాసిన కవుల గురించి నాకు లభించిన సమాచారం అంతా సద్వినియోగం చేసుకొని రాశాను. కొందరి గురించి ఒకటి రెండు వాక్యాలే ఉండవచ్చు. మరికొందరిపై పది పేజీలదాకా రాసి ఉండవచ్చు. పిండికొద్దీ రొట్టె. వారి గ్రంథాలను వెతికి పట్టుకొని కనీసం ఒకటి రెండు శ్లోకాలైనా చేర్చి సంతృప్తి పడ్డాను. నాగర లిపిలో ఉన్నా, కష్టపడి ఇష్టపడి చదివి రాయగలిగాను. సమాచారం లేకపోతే నేను చేయగలిగిందేమీ లేదు. ఇంత రాసినా కవుల సమగ్ర సమాచారం గ్రంథాలలో, వీకీ పీడియాలో కూడా సమగ్రంగా లభించకపోవటం బాధిస్తోంది. ఇదివరుకు రెండు భాగాలలో నేను మనవి చేసినట్లు ఇది సమగ్రమూ కాదు సంపూర్ణమూ కాదు. అభిరుచి ఉన్నవారికి ఒక చిన్న దారి మాత్రమే. మొదటిభాగంలో 146 మంది రెండవ దానిలో 482 మంది, ఈ భాగంలో 462 మంది గీర్వాణ కవుల గురించి రాసే అదృష్టం నాకు లభించింది. అంటే మొత్తం 1,090 ఒక వెయ్యి తొంభై మంది కవుల గురించి రాయగలిగాను. వీరే కాక వీరి గురు పరంపరనూ స్పృశించటం వలన ఈ సంఖ్య 1200 దాకా ఉండవచ్చు. ఇదంతా అంతర్జాలంలోనే రాశాను కనుక చాలామంది చదివే ఉంటారు. ఇది నాకు లభించిన మహత్తర అవకాశం. సంస్కృతంలో నాకున్న జ్ఞానం పూజ్యం. తెలుగులో అంతంత మాత్రం. ఆంగ్లం అంటారా నాకు గ్రీక్ అండ్

లాటిన్. అయినా ఏదో తపన నన్ను ఇంత పని చేయించింది. సరస్వతీ దేవి కటాక్షం, మా ఇలవేలుపు శ్రీ సువర్చలాంజనేయ స్వామి కరుణ, మా తలిదండ్రులు కీ.శే.లు శ్రీ గబ్బిటమృత్యుంజయ శాస్త్రి శ్రీమతి భవానమ్మ గార్ల ఆశీస్సులే నన్ను గట్టెక్కించాయి. సాహితీ బంధువుల అండ దండలు గొప్ప ఉత్సాహం స్ఫూర్తి కలిగించాయి.

దీని చివర "గీర్వాణభాషా వైభవం"పై నిర్వహించిన పద్య కవిసమ్మేళనంలోని కవితలను అనుబంధంగా చేర్చి దానిని కంచి పరమాచార్యులు శ్రీ శ్రీ చంద్రశేఖర యతీంద్ర మహాస్వాములకు అంకితమిచ్చి ఋణం తీర్చుకొన్నాం.

గీర్వాణం-3ని డా.శ్రీ బండారు రాధాకృష్ణమూర్తి, డా.శ్రీమతి సులోచన దంపతులకు అంకితమిస్తున్నందుకు, దీని ముద్రణకు అయ్యే ఖర్చుకు ప్రాయోజకులుగా ఉంటామని స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన డా.ఎల్లాప్రగడ రామమోహనరావు గారి సౌజన్యానికి, దీనికంతటికి సూత్రధారి అయిన ఆత్మీయులు శ్రీ మైనేని గోపాలకృష్ణగారి సహృదయతకు, దీనిని శ్రద్ధగా పరిశీలించి తమ అమూల్యమైన ముందుమాటలు రాస్తానని అమెరికాలో ఉండగానే తెలియజేసి, అభిమానంతో రాసి పంపిన అసమాన అవధాన సార్వభౌమ, "కాశీకవి" విశ్రాంత ప్రాచార్య డా. శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గారి సహృదయతకు, అందమైన కవర్‌పేజీ డిజైన్ చేసిన శ్రీ కళాసాగర్ గారికి, నిర్దుష్టంగా డిటిపి చేసి ముద్రించి అందజేసిన ఆప్త మిత్రులు శ్రీ చలపాక ప్రకాష్ గారికి, సరసభారతి కార్యవర్గానికి కృతజ్ఞతలు. నా రచనా వ్యాసంగానికి ప్రోత్సహిస్తున్న మా శ్రీమతి శ్రీమతి ప్రభావతికి, కుటుంబ సభ్యులకు అభినందనలు. ❀

**– గబ్బిట దుర్గాప్రసాద్**

## వినయంతో విన్నపం

రిసెర్చ్ కృషి లాంటి ఈ బృహద్గ్రంథం "గీర్వాణకవుల కవితాగీర్వాణం-3" మూడవ భాగం ప్రచురణలో నాకు, సరసభారతికి, ప్రాయోజకులకు, అంకితం పొందుతున్నవారికీ ఎవరికీ ప్రతిఫలాపేక్ష, వ్యాపార దృష్టి లేదని, కేవలం ఇంతటి సమాచారాన్ని అభిరుచి ఉన్నపాఠకుల దృష్టికి తెచ్చి అందుబాటులో ఉంచటమేనని మనస్ఫూర్తిగా తెలియబరుస్తున్నాను. ❀

**– గబ్బిట దుర్గాప్రసాద్**

19-10-17

# గీర్వాణ కవుల కవితా గీర్వాణం-3 మూడవ భాగం రచనకు ముఖ్యమైన ఆధార గ్రంథాలు

1- తెలుగు,ఆంగ్ల వీకీ పీడియా. 2- డా. నిష్ఠల సుబ్రహ్మణ్య శాస్త్రిగారి రచనలు-బాలా త్రిపుర సుందరీ సుప్రభాతం, రసానంద చైతన్య నందనం కావ్యాంజలి. 3- డా అయ్యగారి ప్రభావతీదేవి రచనలు - సహస్ర ఫణాః, కుతోవా మానుష్యం, బాలికా పంచాశికా, శశిరేఖా పరిణయం. 4- డా పరాశరం భావనా చార్య గారి-కళ్యాణ చంపు. 5- డా ఇనగంటి ఉమారావు గారి-తత్వ చింతామణ్యాలోక సిద్ధాంజనం. 6- డా. రేమెళ్ళ అవధానులు గారి -గణిత శాస్త్ర చరిత్ర. 7- డా. పి జి లాల్యే ఆంగ్ల రచన - మల్లినాథ సూరి, 8- ఆచార్య సార్వభౌమ శ్రీ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి గారి వ్యాఖ్యానంతో ఉన్న పుష్పదంతుని "శివ మహిమ్న స్తోత్రం. 9- హిందూస్తాన్ బుక్ ట్రస్ట్ వారి - భారతీయ ఆలంకారికులు. 10- హిస్టరీ ఆఫ్ క్లాసికల్ సాంస్క్రిట్ లిట రేచర్. 11 -జగద్గురూస్ ఆఫ్ శ్రింగేరి శారదా పీఠం. 12- ది ఎర్లి ఆచార్యాస్ ఆఫ్ శ్రింగేరి శారదాపీఠం. 13- గురుపరంపరాస్ ఆఫ్ కంచి కామకోటి పీఠం. 14- అర్క ప్రకాశ. 15- ప్రభావాక చరిత్ర బై ప్రభా చంద్ర. 16- స్కందిలా చార్యాస్ జైన వచన. 17- ప్రొఫెసర్ జాకోబి రచనలు. 18- యోగా చార భూమి శాస్త్ర. 19- భాద్రేశ్వరాస్- కథావలి. 20- జెమ్స్ ఆఫ్ కాశ్మీరీ లిటరేచర్. 21- కాశ్మీరీ పండిట్ పర్సనాలిటీస్- ఫేసెస్ ఆఫ్ గ్లోరి. 22- శ్రౌత శైవ సిద్ధాంతం. 23- సాంస్క్రిట్ స్కాలర్స్ ఆఫ్ ఒడిస్సా. 24- సంస్కృత పోయెట్స్ అండ్ స్కాలర్స్ ఆఫ్ ఒడిస్సా. 25- సంస్కృత గ్రామర్ ఇన్ అస్సాం అండ్ ఇట్స్ ట్రెడిషన్. 26- సంస్కృత స్టడీస్ ఇన్ అస్సాం. 27- ప్రెసిడెంట్ సర్టిఫికేట్ అవార్డీస్ఇన్ సాంస్క్రిట్. 28- సాంస్క్రిట్ రిసెర్చ్ స్కాలర్స్-రాంచి. 29- హిస్టరీ ఆఫ్ సాంస్క్రిట్ లిటరేచర్. 30- కేరళ కల్చర్ అండ్ ట్రాన్స్ లేషన్. 31- సాంస్క్రిట్ పండిట్స్ ఆఫ్ కర్ణాటక లాండ్. 32- యూని వర్సిటి ఆఫ్ కాలికట్- డిస్టంట్ ఎడ్యుకేషన్. 33- ట్రేసేస్ ఆఫ్ హిస్టారికల్ ఫాక్ట్స్ ఫ్రం సందేశ కావ్యాస్ అండ్ షార్ట్ పోయెమ్స్. 34- కర్నాటిక్ కంపోజర్స్. 35- ఆంధ్రజ్యోతి, ది హిందూ మొదలైన పత్రికలు.❀

**- గబ్బిట దుర్గా ప్రసాద్**

**20-10-17**

**ఉయ్యూరు**

# యుగాల వారీగా కవుల వరుసక్రమం

## వేద ఉపనిషత్ పురాణ ఇతిహాస కాలం


1- బ్రహ్మవాదిని -గార్గి ....................................................43
2- అద్వైత వేదాంతిని -మైత్రేయి ...............................................45
3- అశ్వినీ దేవతా స్తోత్రకర్త -ఘోష ..............................................46
4- పంచదశి కర్త -లోపాముద్ర ......................................48
5- 27 గురు ఋషికలు ...............................48
6- ఋషికలు దర్శించిన సూత్రాలు ...............................................48
7- ఋగ్వేద 7వ మండల ద్రష్ట -వసిష్ఠ మహర్షి ..................................49
8-గాయత్రి మంత్ర ద్రష్ట ః విశ్వామిత్ర మహర్షి - .....................................50
9-ఋగ్వేద మంత్ర ద్రష్ట -కశ్యప మహర్షి .............................50
10- ఋగ్వేద ప్రథమ మండల ముఖ్యమంత్ర ద్రష్ట - ఆంగీరసమహర్షి ..........51
11-అధర్వ వేద ద్రష్ట -అధర్వ మహర్షి .............................51
12-వివిధ ఋషుల పేర్లతో వర్ధిల్లిన- బ్రాహ్మణాలు ........................52
13- అరణ్యాలలో మహర్షులు దర్శించిన -ఆరణ్యకాలు .....................53
14-ఉపనిషత్తులు - యాజ్ఞ వల్క్య, ఉద్దాలకాది మహర్షులు ..................54
15-అగస్త్య గీత కర్త -అగస్త్య మహర్షి ........................................61
16-గృహ్యా సూత్ర కర్త -అశ్వలాయన .......................62
17-శ్రౌత సూత్ర కర్త -బోధాయన .................63
18-ఆపస్తంభ సూత్ర కర్తలు -ఆపస్తంభ మహర్షి మొదలైనవారు ..................63
19-ఋగ్వేద ప్రాతి శాఖ్య కర్త - కౌశిక మహర్షి ........................64
20-పరాశర స్మృతి,పరాశర హోర గ్రంథ రచయిత -పరాశర మహర్షి ...........65
21- ఋగ్వేద 5వ మండల మంత్రద్రష్ట, త్రిమూర్తుల తండ్రి -అత్రి మహర్షి .....66
22 -అష్టావక్ర గీత కర్త -అష్టావక్ర మహర్షి ..................67
23-భృగు సంహిత జ్యోతి శ్శాస్త్ర కర్త -భృగు మహర్షి .............................68
24-మృత సంజీవని విద్యా వేత్త -శుక్రాచార్యుడు ..............................69
25-భక్తి సూత్ర కర్త -నారద మహర్షి ...................70
26-ఋభు గీత చెప్పిన -ఋభుడు ........................71
27-న్యాయ సూత్ర కర్త -గౌతమ మహర్షి .......................72
28-ఋగ్భాష్య మను సూత్ర కర్త -దేవలుడు ...........................73
29-అను గీత విని చెప్పిన -వైశంపాయన .........................74

30-త్రిపురా రహస్య కర్త -హరితాయన ........................................75
31-శ్రీ మద్రామాయణ కర్త - ఆదికవి వాల్మీకి మహర్షి ............76
32- భుజంగ తాండవ స్తోత్ర కర్త -రావణ బ్రహ్మ ........................85
33-శ్రీ హనుమద్వారా వెల్లడైన హనుమద్గీత -శ్రీ ఆంజనేయస్వామి ..............88
34-శ్రీ రామ గీత చెప్పిన -శ్రీరాముడు ............................88
35-శ్రీ హనుమద్రామాయణ కర్త - శ్రీ హనుమంతుడు ..........................92
36-వేద విభజన చేసి బ్రహ్మ సూత్రాలు, పురాణాలు రాసిన -వేద వ్యాస మహర్షి 94
37-శివ మహిమ్న స్తోత్రకర్త - గంధర్వ రాజు పుష్పదంతుడు ..................104

## క్రీస్తు పూర్వ కాలం

38 -అశ్వశాస్త్ర కర్త -శైల హోత్రుడు - బిసి 2350 ..............................112
39-అన్వీక్షకి వ్యాఖ్యాత - కపిలుడు -బిసి -650-575 ........................113
40-జైనాగమ కర్తలు -జైన చిరంజీవి, సుధర్మ స్వామి -బిసి 607-507 .......114
41-నటసూత్ర కర్త -శిలానిన్ కృణశ్వ -బిసి-600 ...........................115
42-నాట్య శాస్త్ర ప్రామాణికులు -భరతముని పుత్ర శతం -బిసి 500 ..........115
43-సంక్షేప శారీరకం కర్త -శ్రీ సర్వజ్ఞాత్మానేంద్ర సరస్వతి -బిసి -407-367...115
44-చందశ్శాస్త్ర కర్త -పింగళ -బిసి -400 ..................................116
45-పాణిని చెప్పిన స్త్రీ విద్యావేత్తలు -బిసి -400 .............................117
46-పాదుకా శతకకర్త -సత్య బోధేంద్ర సరస్వతి -బిసి -367-268 .........117
47-జైన నియుక్తి కర్త -భద్ర బాహు -బిసి -300 ................118
48-చంద్రిక కర్త -జ్ఞానానందేంద్ర సరస్వతి -బిసి -268-205 ...............118
49-సురేశ్వర వార్తిక వ్యాఖ్యాత -ఆనంద జ్ఞానేంద్ర సరస్వతి -బిసి -124-55.. 118
50-మహా యాన బౌద్ధ ప్రజ్ఞా పారమిత - బిసి-100-13 .....................119

## క్రీ.శ. 1-నుండి-1000వరకు (పదవ శతాబ్దం)

51-సమయ సార గ్రంథకర్త - కుంద కుందాచార్య - -08-44 ................120
52-భక్తి పూజా విధానకర్త -శ్రీ కృష్ణ శంకరేంద్ర సరస్వతి -28-68 .......121
53-షట్కాండాగమకర్త -భూతబలి ఆచార్య -66-99 ........................121
54-శతఖండాగమనం కర్త -పుష్పదంత భూతబలి ఆచార్యులు -160 .........122
55-శంకర భాష్యకర్త -శబరుడు -200 ......................122
56-యోగా చార్య భూమి శాస్త్రకర్త -హుయాన్ సాంగ్ 300-350 ............123

57- అలభ్య నాటక కర్త -మహాకవి చంద్ర -319 ....................124
58-స్థానాంగ సూత్ర కర్త -దేవర్షి గని శ్రమణ -300 ....................124
59-మూక పంచశతి కర్త -మూక కవి -398-437 ....................126
60-సమ్మతి భువనాభ్యుదయ కర్త -సిద్ధ సేన దివాకర -500-600 ..........136
61-రత్న శాస్త్రకర్త -వరాహ మిహిరుడు -505-587 ....................138
62-తిలోయ పన్నతి కర్త -యతి వృషభ -551 ....................139
63-మాండూక్య వార్తిక కర్త -గౌడ పాదాచార్య -600 ....................141
64-గణిత మేధావి -విరహంక -600 ....................142
65-బృహద్దేశి సంస్కృత సంగీతకర్త -మతంగముని -600 ...............142
66-సేతు బంధం కావ్య కర్తలు -మూలసిన, సర్వ సేన, ప్రవర సేన -600 ...143
67-ఆచార్య దండి కే సమాధానం చెప్పిన -విజ్జిక -600 .................143
68-ప్రమాణ వార్తిక కర్త -ధర్మ కృతి -600-700 .........144
69 -వాస్తు శాస్త్ర కర్తలు -తక్కురు పేరు, రామ చంద్ర భట్టారక నర్మదా
శంకర వరాహ -600-1000 ....................145
70- మీమాంసలో తన స్వంత మార్గాన్ని ఏర్పరచిన
మార్గదర్శి -ప్రభాకరుడు -700 ..................146
71-ఇద్దరు వామనులు -700-779, 813 ..................146
72-కాశ్మీర్‌లో సంస్కృత కావ్య రచన -650-884 ...................147
73-అస్సాంలో సంస్కృత వ్యాప్తి -700-1300 ...................148
74-శైవ శాస్త్ర నిష్ణాత -అత్రి గుప్త -720- .................149
75- అభినవ శంకరులు -శ్రీ అభినవ శంకరేంద్ర సరస్వతి -788-840 .....149
76 ఆది శంకరుల గురు పాదులు - గోవింద భగవత్పాదులు -800 ........150
77- హిందూ మత పరిరక్షణకు బౌద్ధం స్వీకరించి ప్రాయశ్చిత్తం
చేసుకున్న కుమారిల భట్టు (భట్టిపాదుడు) -800 .............151
78- మీమాంస అద్వైత దర్శనాలపై రచనలు చేసిన
మండన మిశ్రుడే -సురేశ్వరాచార్యులు - 800 ..........152
79- పంచ పాదిక కర్త-పూరీ పీఠాధిపతి -పద్మ పాదాచార్య - 800 ..........154
80-శ్రుతిపార సముద్ధరణకర్త -తోటకాచార్య -800 ..........156
81-అజ్ఞాని జ్ఞానిగా మారిన -హస్తామలకాచార్య -800 ..........157
82- కామశాస్త్రంలో శంకరాచార్యతో వాదించిన విదుషీమణి
-ఉభయభారతి -800 ....................158
83 -తాంత్రిక బౌద్ధ శాస్త్ర కర్త -సర్వజ్ఞ మిత్ర -800 ....................160

84 -సిద్ధాంత శిక్షామణి కర్త -రేణుకా చార్య -800 ..........................161
85-నిగమాగమవేత్త - జగద్గురు సదానంద శివయోగి -800 ...............162
86-తిరుమూల మంత్ర కర్త -తిరుమూలర్ 800 ..................162
87-న్యాయ బిందు టీక కర్త -ధర్మోత్తర -800 ................163
88-లక్షణ శాస్త్ర కర్త -శకటాయన -818-867 ...........163
89-తత్వ శుద్ధి గ్రంథకర్త - శృంగేరి జగద్గురు -శ్రీ జ్ఞానఘన-848-954 .....164
90-రసాను భూతికర్త-శ్రీ శంకుకుడు -850 .................164
91-ప్రకరణ పంచిక కర్త -శైలకాంత -900 .................165
92-రాజశేఖర పూర్వ కవులు -900 .................165
93-ఈశ్వర ప్రతిజ్ఞాభిజ్ఞా కర్త -ఉత్పలాచార్య -900 .................165
94-న్యాయ మంజరి కర్త -జయంతి భట్టు -900 .................166
95-అవధూత గీత కర్త -దత్తాత్రేయ స్వామి -900-1000 .................167
96-ఆకాశగామి - మల్లికార్జున శివాచార్య -900 ..................167
97 -విద్యాశ్రీ కర్త -జ్ఞానోత్తమ -910-954 ..................168
98 -స్తోత్ర రత్నకర్త -యామునాచార్య -916-1024 ..................168
99-భోజమహారాజు తండ్రి -సింధు రాజు -950 ..................170
100-ఉపమితాభవ ప్రపంచ కర్త -సిద్ధ ఋషి - 950 ..................170
101-అభినవ గుప్తుని గురువులు -960 ..................171
102-జ్ఞాన ప్రమేయం శర కర్త -దేవరాజ ముని-975 ..................171
103-మనుస్మృతి భాష్య కర్త -మేధాతిథి -1000 ..................172
104-మృత సంజీవని కర్త -హలయూధ -1000 ..................172
105 -ఆయుర్వేద భాష్యకర్త -ఊవటుడు-100 ..................173
106 - గొమ్మట సార కర్త -నేమి చంద్ర- 1000 ...............173

## 1001-నుండి 1100 వరకు -11వ శతాబ్దం

107-శివ గీత వ్యాఖ్య -పరమ శివేంద్ర సరస్వతి -1040 ..............174
108-బ్రహ్మసూత్ర భాష్యకర్త -పండితారాధ్యుడు -1060 .............175
109- కథా సరిత్సాగర కర్త -సాంద్రానంద బోధేంద్ర సరస్వతి
-1061-1099 .............175
110-హేమ చంద్రాచార్యను ఓడించిన -శ్రీ చంద్ర శేఖర సరస్వతి
-1061-1099 ..............176
111-అలంకార సర్వస్వము కర్త -సముద్ర బంధ -1070 ...........176

112-భాస్వతి కర్త -శతానంద -1099 ...........176
113-కావ్య ప్రకాశికలో కొంత రాసిన -అల్లట /అల్లక -1100 ...........177
114 -మమ్మట కుటుంబ కవులు-1100 ...........177
115 -కాశికా వృత్తి వ్యాఖ్యాత -పదమంజరి -1100 ...........177

## 1101-నుండి-1200 -12వ శతాబ్దం

116 -భగవద్ గుణ దర్పణ కర్త -పరాశర భట్టర్ -1122-1174 ...........178
117 -ఇష్ట సిద్ధి కర్త -నృసింహ తీర్థ -1146-1229 ...........178
118 -ప్రపన్న పారిజాత కర్త -వరద విష్ణు ఆచార్య -1165-1278 ...........179
119 -బ్రహ్మ విద్యాభరణ కర్త -అద్వైతానంద బోధేంద్ర - 1166-1200 .... 179
120 -ప్రిహోతి క్షేత్ర సమాస వృత్తి కర్త -సిద్ధ సూరి -1170- ...........179

## 1201-1300-13వ శతాబ్దం -

121 -సాయన భాష్య కర్త -శ్రీ విద్యాతీర్థ -1229-1333 ................180
122 -మధ్వ విజయ కర్త -నారాయణ పండితాచార్య -1240-1320 ........181
123 -పార్శ్వ నాథ చరిత్ర కర్త-సాగర చంద్ర -1252-1276 ..............181
124 -ధర్మ శాస్త్ర గ్రంథకర్త -శంభుకార వాజపేయి -1260-1330 ...........181
125 -విష్ణు పురాణ వ్యాఖ్యాత -విష్ణు చిత్తుడు -1280 ...............182
126 -మల్లపురాణ కర్త -జ్యేష్ఠ మల్ల -1300 ...............182

## 1301-నుండి -1400 -14వ శతాబ్దం

127-సాంబ పంచాదశిక కర్త -సాంబ 1315-1392 ..............183
128-లల్లవాక్యాని కర్త -లల్లాదేవి -1320-1392 ...............184
129 -నరహరి యతి చరిత్ర కర్త -నరహరి తీర్థ -1324-1333 ..............186
130-విద్యాచార పద్ధతికర్త -విద్యాకార్ వాజపేయి -1330 ...............186
131 -భారతీ తీర్థ -1333-1380 .................187
132 -సింహ తిలక సూరి -1345-1395 ..................187
133 -లోచన వ్యాఖ్యాత -అనంత దాసు -1350 ..................188
134 -మహాకవులైన విశ్వనాథ కవిరాజు తండ్రి తాత,
చినతాత తండ్రి -1350 ...................188
135 -యతి రాజ వింశతి కర్త -మనవాల మాముని -1370-1450 ........189

136 - ఉపనిషత్తులపై "దీపిక"లు రచించిన -
శ్రీ శంకరానందేశ్వర సరస్వతి -1385-1417 ...........190
137-కాశ్మీర్ సర్వజ్ఞ శారదా శక్తిపీఠం - (1400) ...........190
138-భాగవత భావార్ధ దీపిక కర్త -శ్రీధర స్వామి -1400 ...........193
139-హంస సందేశ కావ్య కర్త -పూర్ణ సరస్వతి -1400 ...........193

## 1401-నుండి 1500 -15వ శతాబ్దం

140-భ్రమర గీత కర్త -శ్రీ పాద రాజు -1404-1502- .............194
141-సంస్కృత సంకీర్తనాచార్య -అన్నమాచార్య -1409-1503 .............195
142-అభినవ గీత గోవిందకర్త -కవి చంద్ర రాయ్,
దివాకర మిశ్ర, ముక్తాబాయి-1409 .............197
143-ద్వితీయ రాజ తరంగిణీ కర్త -జోనరాజు -1420-1485 .............197
144-శ్రీ వెంకటేశ్వర సుప్రభాత కర్త -
ప్రతివాది భయంకర అనంతాచార్య -1430 ...............199
145-ఒరిస్సా గజపతుల కాల సంస్కృత సాహిత్యం -1435-1588 ......201
146-భారత వ్యాఖ్య కర్త -అర్జున మిశ్ర -1450-1500 .........202
147-కాతంత్ర కౌముదికర్త -పుండరీకాక్ష విద్యాసాగర్ -1450-1500 .......202
148-యతి జీతక వృత్తి కర్త -సాధురత్న సూరి -1455 ...........202
149-తృతీయ రాజ తరంగిణి కర్త -శ్రీ వరుదు -1459 ...........203
150-భారతామృత కావ్యకర్త - కవి చంద్రాచార్య దివాకర మిశ్ర 1464 -308 ..204
151-ముక్తి చింతామణికర్త -గజపతి పురుషోత్తమ -1466 ...........205
152-బలభద్ర సంగ్రహ కర్త -బలభద్ర మిశ్ర -1466 ...........205
153-భక్తి వైభవ మహా కావ్య కర్త- డిండిమ జీవ దేవాచార్య -1475 .......206
154 -కృష్ణ భక్తి కల్పలత ఫల కర్త -జగన్నాధ దాసు -1491-1550 .......207
155 -జగన్నాధవల్లభ నాటక కర్త -రాయ రామానంద -1497-1540 .....207
156 -ప్రౌఢ ప్రతాప మార్తాండ కర్త -గజపతి ప్రతాప రుద్ర దేవ
- 1497-1535 ........208
157 -చైతన్య చంద్రోదయ నాటక కర్త -పరమానంద
దాస కవి హర్షకర్ణ -1497-1540 ............208
158 -ఛందో మంజరికర్త -గంగ దాసు -1500 .........209
159 -ధనుర్వేద కర్త -సారంగధర -1500 .........209
160-హఠ యోగ ప్రదీపిక -స్వాత్మారాం -1500 ..........210

161 -గౌర కృష్ణోదయ కావ్యకర్త -ఎం.ఎం. గోవింద- 1500 ................211

## 1501-నుండి 1600 వరకు -16 వ శతాబ్దం

162-రామానంద సంగీత నాటక కర్త -రాయ చంద్ర పట్నాయక్ -1509 .....211
163-హరి హర చతురంగ యుద్ధ తంత్ర కర్త -గోదావరి శర్మ -1515 ....212
164-చైతన్య చరితామృత కర్త -కృష్ణ రాజకవి గోస్వామి -1520-1617 .....212
165 -సింహ వాజపాయ వంశావళి కర్త -
నరసింగ మిత్ర వాజపాయి -1520-1580 ..........213
166 -ఆయుర్వేద సార సంగ్రహ కర్త -విశ్వనాథ సేన-1530 ...........213
167 -ప్రాయశ్చిత్త మనోహర కర్త -మురారి మిశ్ర -1550 ...........213
168-ఖేట కౌతుక కర్త -అబ్దుల్ రహీం ఖాన్ -ఎ -ఖానా -1556-1627 ...214
169-గీత ప్రకాశ సంగీత కర్త -కృష్ణదాసబోధ జేన మహా పాత్ర -1559 .....215
170-దశగ్రీవ కావ్యకర్త -మార్కండేయ కవి చక్రవర్తి -1559 ......216
171-దుర్గోత్సవ చంద్రిక కర్త -భారతీ భూషణ
వర్ధమాన మహా పాత్ర -1568-1600 ...........216
172 -వాఙ్మయ వివేక కర్త -చింతామణి మిశ్ర -1574 ...........216
173 -వైదిక నిర్ణయ కర్త -నృసింహ భారతి-5 -1576-1600 ...........217
174 -రుద్ర భాష్య కర్త -ఆత్మ బోధేంద సరస్వతి -1586-1638 ...........217
175 -పంచ నంది వ్యాకరణ కర్త -బనార్సి దాస్ - 1587-1643 ...........218
176 -సుధా పరిమళ వ్యాఖ్య కర్త -
మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి-1595-1671 ............220
177 -వాసుదేవ విజయం కర్త -వాసుదేవ -1600 ............221
178 - శివ గీత వ్యాఖ్యాత -అభినవ నృసింహ భారతి -1600-1623 .....221
179 -హరినాయక రత్నమాల కర్త -హరి నాయక -1600 ...........222
180-వేదాంత పరమార్ధ గీత వ్యాఖ్యాత -నిజ గుణ శివ యోగి -1600 ......222
181-మల్లికార్జున శివ యోగి -1600 ......223
182-కేరళ వివిధ రూపాలలో వర్ధిల్లిన సంస్కృత నాటకాలు -1600-1900 .....223
183 -హంస సందేశ కావ్య కర్త-పూర్ణ సరస్వతి (1600) ...........224
184-మయూర సందేశం కర్త -ఉదయ -1600 .............225
185 -కామ సందేశం కర్త -మాతృదత్త -1600 ............225
186 -శుభగ సందేశం కర్త -నారాయణ -1600 ...............226
187 -ప్రయోగ రత్నమాల వ్యాకరణ కర్త -పురుషోత్తమ విద్యా వాగీశ -1600 ..226

## క్రీ.శ 1601-నుండి 1700 వరకు -17వ శతాబ్దం


188-యానక భాగవత కర్త -కవి రత్న పురుషోత్తమ మిశ్ర -1606-1680 .....226
189-కోసలానంద కర్త -గంగాధర మిశ్ర -1620 .............227
190-రామ చంద్ర మహోదయ కర్త -సచ్చిదానంద భారతి -1623-1663 ....227
191-వసంతోత్సవ మహా కావ్య కర్త -హాలాధర -1623-1647 ............228
192-లక్ష భగవన్నాశ్లోక కర్త -బోధేంద్ర సరస్వతి -1638-1692 ...........229
193-కాళీపూజ కర్త -కృష్ణానంద వాగీశ -1650- ........... 229
194-సంగీత నారాయణకర్త -గజపతి నారాయణ దేవ-1650 ............230
195-మనోహారిణి టీక కర్త -కవి రత్న నారాయణ మిశ్ర -1650 .............230
196-కళానిధి -దేవర్షి శ్రీ కృష్ణ భట్ -1675-1761 ...........231
197 -గురు కృతి కర్త -ఉత్తక్కోడు వేంకటకవి
(వెంకట సుబ్బయ్యర్) -1700-1765 .............234
198- యంత్ర చింతామణి కర్త -దామోదరభట్ - 1700 ..............236
199-త్రికాండ శేఖర నిఘంటు కర్త -పురుషోత్తమ దేవ -1700 ..............236
200- దుర్గా యజ్ఞ దీపిక కర్త -జగన్నాధ ఆచార్య -1700 ..............236
201-కౌముది వ్యాఖ్యాత -అభిరామ విద్యాలంకార -1700 ..............236
202-సారార్ధ దీపిక కర్త -గోపాల చక్రవర్తి -1700 ................236
203-ఘోరండ సంహిత కర్త -ఘోరండ-1700 ...............237
204-శివ సంహిత కర్త -అజ్ఞాత కవి -1700 ................237


## 1701-నుండి 1800 వరకు -18వ శతాబ్దం -


205-మార్తాండ శతక కర్త -మార్తాండ వర్మ -1705-1758 .................238
206-మూకాంబికా స్తోత్ర కర్త -రెండవ సచ్చిదానంద
భారతీ స్వామి -1706-1741 ................238
207-సత్య నారాయణ పాంచాలీ కర్త - భరత చంద్ర రే (1712 -1760) ....239
208-మణిమాల నాటక కర్త -ఆదికవి -1713 ..........241
209-చాతక సందేశం కర్త -బ్రాహ్మణ కవి -1728-1798 ..........241
210-శివాష్టపది కర్త - అయిదవ చంద్ర శేఖర స్వామి -1746-1783 ......241
211 - విదగ్ధ ముఖ మండనం కర్త -ధర్మ దాసు -1748 ...........242
212-సమృద్ధి మాధవ నాటక కర్త -గోవింద సమంత రాయ్ -1750 ........242
213-కళా నిర్ణయ, శ్రద్ధా నిర్ణయ కర్త -రఘునాధ దాస్ -1750 ........243
214-సప్త తాళేశ్వర కర్త -వీణ వెంకట సుబ్బయ్య -1750-1839 ........243

215–మధ్వ మత వ్యాఖ్యాత –అడవి విజయ తీర్ధ స్వామి –1756–1806 .....243
216–అబ్ద దూత కర్త –కృష్ణ చందన –1760– ...........243
217–గంగ వంశాను చరిత కర్త –వాసుదేవ సోమజాతి –1761–1770 ...... 244
218–గోవింద భాష్య కర్త –బలదేవ విద్యా భూషణ్ –1764 ......244
219–వరరుచి వ్యాకరణ కర్త –వాగీశ భట్టాచార్య –1765 .......245
220–ఉత్తర నైషధ కర్త –ఆరూర్ మాధవన్ అతితిరి – (1765–1836) ........245
221–నీల కంఠ సందేశం కర్త –శ్రీధరన్ నంబి –1774–1830 ........245
222–శబ్ద బోధకర్త –విరజానంద వాగీశ –1777–1868 ........246
223–ముస్లిం అభిమానం పొందిన –16వ మహా
దేవేంద్ర సరస్వతి –1783–1813 ...........247
224 –సంస్కృత –సంస్కృత నిఘంటు కర్త –రాధా కాంత దేవ్
–1784–1867 .............248
225–రుషికవి – స్వామి పరమానంద (1792–1885) ...............248
226–సౌందర్య లహరి వ్యాఖ్యాత ప్రాతస్మణీయుడు –
చార్లెస్ ఫిలిప్ బ్రౌన్–1796–1884 ..............250
227 – స్వర జాతులకర్త –మైసూర్ వాసుదేవరావు –1799–1879 ..........254
228 –మహాభారత అద్వైత వ్యాఖ్యకర్త – నీల కంఠ చతుర్ధ –1800 ..........254
229 –ప్రబోధ చంద్రిక కర్త –వైజాల దేవ రాజు–1800 ..........255
230– విద్యాహృదయ నందన కర్త –ప్రహరాజ మహా పాత్ర –1800 .........255
231–తంత్ర కళాసుధ కర్త –రామ చంద్ర ఉద్గాత –1800 ..........255
232–సిద్ధాంత దర్పణ కర్త –సమంత చంద్ర శేఖర –1800 ..........256
233–ఆశుబోధ వ్యాకరణ కర్త –నారాయణ చంద్ర విద్యా భూషణ –1800 ....256
234–పద్మనాభోదయం కర్త –శంకు కవి –1800 ...........257
235 – చంద్రికా వీధి నాటక కర్త –రామ పనివాద –1800 ...........257

## 1801–నుండి 1900 వరకు –19వ శతాబ్దం –

236–తంజావూర్ సంగీత చతుష్టయం –1801–1856 ...........258
237 –సంస్కృతం లో క్రైస్తవ సాహిత్యం –1808–1978 ...........259
238 – కనకాభిషేకం పొందిన –
శ్రీ చంద్ర శేఖరేంద్ర సరస్వతి –6 (1813–1850) ...........260
239 –సంస్కృత కీర్తనకర్త –పాల్ఘాట్ పరమేశ్వర భాగవతార్–1815–1892 ....260
240– సంగీత సార సంగ్రహ కర్త –

మతుకు మిల్లి నరసింహ శాస్త్రి -1816-1873 ...........261
241 -తిరువనంతపురం స్థల పురాణకర్త -
కుట్టి కుంజన్ తంగాచ్చి 1820-1904-413 ...........261
242-శృంగార లహరి కర్త -లింగరాజ అర్స్-1823-1874 ...........262
243 -జ్యోతిష చింతామణి సంకలనకర్త -
చింతామణి రఘునాధాచార్య (1828) ...........262
244-సంస్కృత -కాశ్మీరీ నిఘంటు కర్త -ఈశ్వర కౌల్ -1833-1893 ........263
245-కృష్ణ యజుర్వేద పీఠిక కర్త-న్యాయరత్న-మహేష్
చంద్ర భట్టాచార్య-1836-1906 ................264
246 -ప్రబంధ సార కర్త -గంగా సహాయ్ -1840 ................266
247 -స్యేన సందేశ కర్త -వయస్కార ఆర్యన్
నారాయణ్ నంబూద్రి -1841-1902 ..............266
248 -సంస్కృత కృతికర్త -వీణ పద్మనాభయ్య- 1842-1900 ...........267
249- -కర్ణాటక జాతీయ గీత కర్త -బసవప్ప శాస్త్రి -1843-1891 ...........267
250 -72 మేళకర్త రాగాలతో రాగమాలిక అల్లిన -
మహా వైద్య నాధ శివన్ (అయ్యర్)- 1844-1893 .............268
251- -అభినవ కల్హణ -పండిత గోవింద కౌల్ -1846-1899 ...........268
252 -జానకీ రామ భాష్య కర్త -ఆనంద రామ బారువా -1850-1889 ....269
253 -భారత మహిళ కర్త -మహామహోపాధ్యాయ
హర ప్రసాద శాస్త్రి -1853-1931 .............270
254- వేదాధికార నిరూపణకర్త కట్టాంబి స్వామి -1853-1924 ..........271
255- సంగీత సుబోధిని కర్త -మైసూర్ కరగిరి రావు-1853-1927 .......272
256- జ్యోతిర్గణిత సంకలనకర్త - వేంకటేశ బాపూజీ కేత్కర్ -1853 .........272
257- వ్రతారాధన కర్త -వల్లన సేరి వాసున్ని మూసన్ -1855-1914 ......272
258-కుల శేఖరీయం కర్త -ఇందూర్ కేశవన్ నంబూద్రి -1855-1932 .....273
259- మృగ శీర్ష (ఓరియన్) గ్రంథకర్త -
లోకమాన్య బాలగంగాధర తిలక్ -1856 ...........273
260 -కేరళలో మరికొన్ని సంస్కృత సందేశ కావ్యాలు -1858-1926 ........274
261- "వైనాయ కీయ ద్వాదశాధ్యాయీ" తాజిక గ్రంథకర్త-
వినాయక పాండురంగ ఖానాపూర్కర్ - (1858) ...........274
262-దీర్ఘ వృత్త లక్షణ కర్త - సుధాకర ద్వివేది - (1860) .............275
263-సంస్కృత -అరేబిక్ దిట్ట -పండిట్ సహజ భట్ -1862-1935 ........275

264 –ఆంగ్ల సామ్రాజ్య కావ్యం కర్త –
ఎ.ఆర్.రాజరాజ వర్మ –1863–1953 ................277
265–రామాయణం స్వర కర్త –మైసూర్ వాసుదేవాచార్య –1865–1961 .......277
266– సంస్కృత జావళికర్త –వీణ శివ రామయ్య –1866–1946 ........278
267–జ్యోతిర్మఠ పీఠాధిపతి–శ్రీ చక్ర ఉపాసకులు –
స్వామి బ్రహ్మానంద సరస్వతి (1868 –1953) ...........278
268– స్తవ రత్నావళికర్త –సంస్కృత మున్షి –కె సి.కేశవ పిళ్ళై –1868–1914 ......280
269– చతుర్వర్గచింతామణి కర్త –హేమాద్రి పంత్ –1868–1953 .......281
270– చాణక్య అర్థశాస్త్ర ప్రచురణకర్త –రుద్ర పట్నం శ్యామా శాస్త్రి
–1868–1944 ...........282
271–శబ్ద మంజరి కర్త –చంద్ర కాంత విద్యాలంకార –1870 ...........284
272 –లంకావతార సూత్ర కర్త –సతీష్ చంద్ర విద్యాభూషణ్ –1870–1920 ...285
273–ప్రౌఢ లేఖక్ –పండిట్ దామోదర్ –1870 ...........286
274 –తైత్తిరీయ ఉపనిషత్ భాష్య కర్త –నిత్యానంద శాస్త్రి –1871 ...........287
275 –పంచస్తని వ్యాఖ్యాత –పండిట్ హరభట్ట శాస్త్రి జాదూ –1874–1951 ...289
276 –విద్యాదనం సర్వ ధన ప్రధానం అన్న–అత్తూర్ కృష్ణ పిశరోడి
–1875–1964 ............291
277 –రక్షా రుద్రాక్ష చంద్ర మార్తాండ కర్త –ముదిగొండ
నాగ లింగ శాస్త్రి – 1876–1948 ...........293
278– ప్రసూనాంజలి కర్త –న్యాయాచార్యపండిత రాజ –
కుంచు నంబూద్రి –1877–1959 ...........295
279–108 చాముండీ అష్టోత్తర కృతికర్త –ముత్తయ్య భాగవతార్
–1877–1945 ...........296
280– సంగీత సాహిత్య శిరోమణి, త్యాగరాజ ఆరాధనోత్సవ
ప్రారంభకురాలు–బెంగళూర్ నాగరత్నమ్మ (1878–1952) ...........296
281–తిలపర్వత దాన కర్త –కృష్ణన్ భట్టాద్రి పాది –1879–1964 ..........298
282–ధర్మ శాస్త్ర చరిత్ర కర్త –పాండురంగ కాణే –1880–1972 ...........299
283–శివ సూత్ర విమర్శన కర్త –ముకుంద రామ శాస్త్రి –1880–1921 ......301
284–లఘురత్నమాలకర్త – –శివనాధ భుజర్బారువా –1880–1964 .........303
285 –108 రాగాలతో 108 కీర్తనల కర్త –
ఎన్నపాదం వెంకటరామ భాగవతార్ –1880–1965 ...........303
286 – దర్శన మాల కర్త –నారాయణ గురు –1885–1928 ............304

287- "ఋగ్ భాష్య భూమిక" కర్త, మహోన్నత వేదవేత్త ,
మహా సంస్కృత పండితుడు-కపాలి శాస్త్రి -1886-1953 ...........306
288- పతంజలి భాష్య వ్యాఖ్యాత -గోపీ నాధ్ కవిరాజ్ -1887-1976 .......308
289- సమన్వయ యోగ ప్రచారకులు -స్వామి శివానంద -1887-1963 ....309
290- కొత్త సంగీత రూపం "నగ్మ" సృష్టికర్త -
వీణ వెంకట గిరియప్ప -1887-1952 ..........311
291 - కాళిదాస జన్మస్థలంపై పరిశోధించిన జ్యోతిష కర్త -
లక్ష్మీధర్ కల్లా -1890 .........311
292-మహాభాష్య ఆంగ్లకర్త -పిఎస్.సుబ్రహ్మణ్య శాస్త్రి - 1890-1978 ......312
293-మణిప్రవాళ స్వరరాగ కర్త -తమస్సేరి కృష్ణన్ భట్టాత్రి 1890-1963 ...314
294- వీర శైవ ఉద్గ్రంథకర్త -సిద్దేశ్వర శివాచార్య -1890 ..........314
295 - డాన్ క్విక్సోట్ సంస్కృతానువాదకర్త -
ప్రొఫెసర్ జగద్ధార్ జాదూ -1890-1975 ...........315
296- అద్వైత సభ నిర్వహించిన -చంద్ర శేఖర సరస్వతి -1891-1907.....317
297-జాతకాదేశ కర్త -శంకరం నంబూద్రిపాద్ కానిప్పయ్యూర్ (1891) ......317
298- యక్ష ప్రశ్న నాటక కర్త -జగ్గు సింగరాచార్య -1891 .........318
299- వాసుదేవ కర్ణామృతం కర్త -వాసుదేవన్ నంబూద్రి -1891-1947 ....319
300- 34వ శృంగేరి పీఠాధిపతి -చంద్ర శేఖర భారతీ స్వామి
-1892-1954 ............319
301- యదు వంశ కావ్యకర్త -గలగరి రామాచార్య -1893 .......321
302- సంస్కృత డైరీ రాసిన యాత్రాసాహిత్యపిత -
రాహుల్ సాంకృత్యాయన్ -1893-1963 ...........322
303-శిలాతామ్ర శాసన లిపి పరిశోధకుడు-
పద్మభూషణ్ వాసు దేవ విష్ణు మిరాసి -1893-1995 ...........325
304 - "జయతి జయతి భారతమాత" దేశభక్తి గీత కర్త -
మయూరం విశ్వనాధ శాస్త్రి -1893-1958 ............326
305- నడయాడే దైవం, దుర్గాస్తోత్ర కర్త -కంచిపరమాచార్య
శ్రీ శ్రీ చంద్ర శేఖరసరస్వతి యతీంద్ర మహాస్వాములవారు-1894-1994 ....326
306 - గణేష్ గీత మాలాస్తోత్రంకర్త - గుంటూరు వెంకటాచలశర్మ -1894 ...332
307- సంస్కృత తిల్లాన కర్త -టి చౌడయ్య -1894-1967 .......332
308-మహమ్మద్ ప్రవక్త చరిత్ర కర్త -కె ఎస్ నీలకంఠన్ ఉన్ని -1895-1990 ..333
309- నివాపాంజలికర్త -అచ్యుత వాసుదేవ మూసన్ -1895-1983 ........333

310- వేద వృత్తి ప్రకాశిక కర్త – క్షేత్రేశ చంద్రోపాధ్యాయ -1896 ...........334
311-భారత జాతీయ గీతం కావాల్సిన "జయజయ ప్రియ భారత జనయిత్రి
పుణ్య ధాత్రి" గీతకర్త -దేవులపల్లి కృష్ణ శాస్త్రి -1897-1980-366 ...335
312- నైషధ తిలక కర్త ,త్రయోదశ భాషావేత్త పద్మ భూషణ్ -
కృష్ణ కాంత హాండీకీ -1898-1982 ...........339
313-ఆమ్నాయ మతానాం కర్త -ఎక్కార రామన్ నంబూద్రి -1898-1983 ...341
314- పిప్పలాద సంహిత పరిశోధకుడు -
ప్రొ.దుర్గామోహన్ భట్టాచార్య (1899-1965) ...........341
315-వ్రజ విలాస కర్త -కమల లోచన ఖడ్గ రాయ్ -1900 ...........343
316- వేదసార పద్మావళికర్త – పద్మభూషణ్ ఉప్పులూరి గణపతి శాస్త్రి-1900 ..343
317 -కేరళ విలాస కావ్యాలు -1900 ..........346

## 1901-నుండి 2000 వరకు -20వ శతాబ్దం -

318- భారత పర్యటన -కర్త -కుట్టి కృష్ణ మారార్-1900-1991 ...........347
319- "శుద్ధి సర్వస్వ కర్త"- తర్క తీర్ధ లక్ష్మణ శాస్త్రి జోషి -1901-1994 ....348
320- కాశ్మీర్ సమస్య నాటక కర్త-నిరపజే భీమ దత్త -1903 ...........350
321- రుక్ విసర్గ కర్త -వట కృష్ణ మోహన్ -1905-1950 ............350
322-సర్వజ్ఞ చంపు కర్త -హిట్టన హళ్లి గోవింద్ -1905- ............351
323-శౌనక శిక్ష కర్త -కె యెన్ ఏం దివాకరన్ నంబూద్రి -1906 ............351
324 -క్రీస్తు భాగవతమహా కావ్య కర్త -పి .సి.దేవాస్సియా -1906-2006 ....352
325- అద్వైత బోధ దీప్తికర్త -స్వామి కరపాత్ర -1907-1982 ...........353
326-ఉత్తర రాఘవ ప్రచురణ కర్త -వి.రాఘవన్ -1908-1979 ...........354
327 -శిల్ప కళాధ్యయన శీలి -కంబార్ శివరామమూర్తి -1909-1983-55 ...355
328-మణి దీప కర్త -కె. .పి .యెన్ .పిశోడి -1909-2004 ...........358
329-ఉషానిరుద్ధ నాటకకర్త -విఘ్నేశ్వర శర్మ -1909 ...........359
330- లోక్‌సభకు ఎన్నికైన సంస్కృత ,మైధిలీ భాషా కవి -
సురేంద్ర ఝూ (సుమన్) -1910-2002 ...........359
331- ధ్రువ చరిత్ర కావ్యకర్త -కానరాది విఠలో పాధ్యాయ -1910 ..........361
332-గౌరీ కళ్యాణ శతక కర్త -కె.నంజుండ ఘనాపాఠీ -1910 ...........362
333- ఋగ్వేద భాష్యభాష్య కర్త -ఓ.ఏం సి.నారాయణన్
నంబూద్రి-1910-1989 ...........362
334-లయకు ప్రాధాన్య మిచ్చిన -జి యెన్ బాల సుబ్రహ్మణ్యం

-1910-1965 ...........363
335-నాచరమ్మ విజయ కర్త-కవి శేఖర హెచ్ .వి నారాయణ శాస్త్రి -1910 ..364
336-ఉన్మత్త కీచకం కర్త -కె.ఎస్. నాగరాజన్ -1911 ...........365
337-కుంభాభిషేక చంపు కర్త -కృష్ణ జాయిస్ -1912 ...........367
338-చిత్రోదయ మణికర్త -సాంబశివ శాస్త్రి 1912-1991 ...........367
339-భారతీయ శాస్త్ర దర్శన కర్త -జి. విశ్వనాధ శర్మ -1912-1998 ........368
340-భవానీ నామ సహస్ర స్తుతికర్త -జానకీ నాధ కౌల్ (కమల్) -1914 ...368
341-గాంధీ మోహనాయన కావ్య కర్త -
బొమ్మలాపురపు వెంకట రామ భట్టు -1915 ...........369
342- గీతాజ్ఞాన యజ్ఞ సారధి -స్వామి చిన్మయానంద సరస్వతి
-1916-1993 ..............370
343-బాహుబలి నాటక కర్త -యెన్.రంగనాధ శర్మ -1916-2014 ...........372
344-సంస్కృత సినీ దర్శకుడు -జి వి అయ్యర్ -1917-2003 ...........373
345-భాషా సౌందర్య లహరి కర్త -శ్రీధరన్ నంబూద్రి చంద్రమన్ -1917 .....375
346-కేరళోదయ కావ్యకర్త -డా కె యెన్ ఎళుత్తచ్చన్ -1917-1981 ...........375
347-సంగీత దర్పణం కర్త -వి.రామ నాధం -1917-2008 ...........376
348-రవీంద్ర భావ ప్రచారక్ -కె.టి పాండురంగి -1918 ...........377
349-సంస్కృత వీర బ్రహ్మేంద్ర సుప్రభాత కర్త -
కళాప్రపూర్ణ కొండవీటి వేంకటకవి -1918-1991 .............378
350-స్తోత్రాలకర్త -బాలగణపతి భట్ -1919 ............383
351-మేదర చిన్నయ్య కర్త -ఏం జి నంజుండాచార్య -1919 .............383
352-అనేక సంస్కృత రచనలకర్త -పండిట్ సుధాకర శుక్ల -1919-1985 ......384
353-దేవీ విలాస కర్త -కె ఎస్ భాస్కర భట్ట 1920 ...........384
354-క్రియా సూత్ర కర్త -ఆత్మేశ్వరానంద -1920 ...........385
355-నిత్యకామ్య కర్మ మీమాంస కర్త -రేమెళ్ళ సూర్య ప్రకాశ శాస్త్రి -1920 ...385
356-పంచ ఐశ్వర్య నాటకకర్త -శ్రీలంక ఆగమ పండిట్
-కైలాసనాధ కూరకార్ -1921-2000 ...........386
357-కాతంత్ర వ్యాకరణ సిద్ధికర్త -దీనానాధ్ యక్ష -1921 ...........387
358-శ్రీకృష్ణ కంఠాభరణం కర్త -గలగిరి పండరి నాథాచార్య -1922-2015 ...389
359-పంచరత్న గీత కర్త -సత్యానంద సరస్వతి -1923-2009 ...........390
360-భావ లయకు ప్రాణం పోసిన -ఏం డి బి రామనాధన్ -1923-1984 ..391

361-మిలీనియం సంస్కృత పురస్కార గ్రహీత -
పద్మశ్రీ దేవదత్త శర్మ -1824 ...........392
362-లజపతి తరంగిణి కర్త -హరిశ్చంద్ర దేవ ఫణిక్కర్-1924 ...........392
363-కాశ్మీర్ శైవ దర్శన కర్త -నీలకంఠ గుర్తు -1925 ............393
364-కావ్య తరంగిణి కర్త -సి.జి.పురుషోత్తం -1925 ...........394
365-స్వర్ణ పుష్ప కర్త -వి.వెంకటాచలం -1925-2002 .............394
366-మహామానవ చంపు కర్త -జయంత మిశ్ర-1925-2010 .............396
367- మల్లినాధ మనీష కర్త ,పరిశోధకుడు -
ప్రొఫెసర్ ప్రమోద్ గణేష్ లాల్యే లాల్యే ...........396
368- భోజతత్వ ప్రకాశం వ్యాఖ్యాత -వి ఎస్.పాఠక్ -1926-2003 ...........397
369-పతంజలి భాష్య వ్యాఖ్యాత, ఆధునిక పాణిని -
శివరామ దత్తాత్రేయ జోషి -1926-2013 ...........398
370-సత్య సాయి గాయత్రి మంత్ర కర్త -
ఘండికోట వేంకట సుబ్బారావు -1926-2003 ............399
371-బాణ భట్ట రచనలో ప్రేక్ష్యా విలాస పరిశోధకుడు -
రాంజీ ఠాకూర్ (1926) .............403
372-పాథేయ శతక కర్త -డా.రామ్ కరణ్ శర్మ -1927 ...........404
373-శైవాగమ పరిశోధనాచార్య -ఎస్.సంబంధ శివా చార్య -1927 ...........405
374-లాల్ బహదూర్ శాస్త్రి సంస్కృత పీఠం ఏర్పరచిన -
మండన మిశ్ర -1929-2001 ............406
375-బలదేవ చరిత్రకర్త - శ్రీనివాసరథ్ -1930-2014 ............409
376-మదిరా విలాస కర్త -నారాయణ మధ్యస్థ -1930 ............411
377- బృహద్భారత కర్త -జ్ఞానపీఠ పురస్కార గ్రహీత -సత్యవ్రత శాస్త్రి-1930 ..411
378-సామవేద ఘనాపాఠీ -తొట్టం ఆర్యన్ నంబూద్రి -1930 .............413
379-అద్వైత గీతకర్త -మధురకవి ఉమాపతి పద్మనాభ శర్మ (1930-2017) ...414
380-పద్మశ్రీ వేదకుమారి ఘాయ్ -1931 ...........416
381-నృసింహ స్తుతి కర్త -శ్రీ విశ్వపతి తీర్థ -1931 ...........417
382- భూకైలాస నాటక కర్త -సాంబ దీక్షిత -1934 ...........417
383-నవ్య న్యాయ గ్రంథకర్త -బిమల్ కృష్ణ మాతీలాల్ -1935-1997 .......418
384-సంస్కృత వ్యాప్తి చేస్తున్న ముస్లిం సంస్కృత పండిట్ -
పండిట్ దస్తగిరి -1935 .............419

385-జీవన సాఫల్య పురస్కార గ్రహీత -దేవర్షి కాలనాధ శాస్త్రి -1936 ......421
386-నాట్య శాస్త్ర నిధి -కమలేష్ దత్త త్రిపాఠీ -1936 .........423
387-సంస్కృత అంతర్జాల ప్రవేశకర్త -వి ఆర్ పంచముఖి -1936 ...........424
388-విషాద లహరి కర్త - కవి చక్రవర్తి ద్విభాష్యం విజయ సారధి -1936 ....426
389- భాగవతాచార్య -శ్రీశైవ నాధ రామన్ నంబూద్రి -1940 ...........429
390 - బ్రహ్మ సూత్ర నామావళి గ్రంథకర్త -
వ్యాసంకర ప్రభంజనా చార్య -1940 .............430
391- రాళ్లబండి కవితాప్రసాద్ "ఒంటరి పూల బుట్ట" సంస్కృతీకరణ
-రాణి సదాశివ మూర్తి -1940 .............431
392-సోమలతను గుర్తించిన -వైద్య భైరవ దత్త -1940 .............433
393- గణిత వేదాంతకర్త - చక్రవర్తి -1940 .............435
394-కాశ్మీర్ పంచాంగ కర్త -పండిట్ ఆనంద శాస్త్రి -1940 .............437
395- బసవ భాస్కరోధయ కర్త -పరాడ్డి మల్లికార్జున -1940 .............438
396- భారత ధ్వని దర్శనకర్త -ప్రాచార్య శలాక రఘునాధ శర్మ -1941 ...........439
397-హరిహరేశ్వర సుప్రభాత కర్త ధర్మ శాస్త్ర విద్వాన్ -
గణపతి పాఠక్ -1941 .............443
398-తేజస్సంక్రమణం కర్త -గురుపాద హెగ్డే -1941 .............443
399- క్షణ విముక్తి నవలాకారుడు -హెచ్ వి నాగరాజారావు -1942 .............444
400- హర్ష నైషధ చరిత్ర కర్త వ్యాకరణ ఘనాఘనుడు -
హరినామ దత్త శాస్త్రి -1943-1985 .............445
401-హస్మత్ చంపుకర్త బహుభాషా వల్లభ -ఆర్యార్ శ్రీరామ శర్మ -1943 .. 446
402 -అంకపదీయ కర్త -నిశ్చలానంద సరస్వతి -1943 .............447
403- ముస్లిం మహిళకు వేదాంత మార్గ దర్శి -ఆర్.గంగాధర నాయర్ -1946...448
404- 7వ శతాబ్ది మహా కావ్య పరిశోధకుడు -రహస్ బిహారీ ద్వివేది -1947- 449
405-వేదగణిత గ్రంథకర్త - డా. రేమెళ్ళ అవధానులు -1948 .............450
406-చార్వాక లోకాయత కర్త -రామకృష్ణ భట్టాచార్య -1947 .............453
407- సంజ్ఞానామ కర్త -సమీర్ చంద్ర చక్రవర్తి -1950 .............454
408- రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ వైస్ ఛాన్సలర్-
డా. వెంపటి కుటుంబ శాస్త్రి -1950 .............455
409- శివానంద విలాస కర్త -రామకృష్ణ భట్టు -1950 .............456
410- సిద్ధ లింగ మహాకావ్య కర్త -బసవ రాజ శాస్త్రి -1950 .............456

411-యమ గోపాల కర్త -సి.జి.పురుషోత్తం -1950 .............457
412-భోజ విలాస ఏకాంకికకర్త -వాసుదేవ భల్లాల -1952 .............457
413-గాంధీ సంస్మరణ సంభ్రమ ఏకాంకిక కర్త -ఎస్.ఆర్.లీల -1952 ...........456
414-వాసుదేవ వాగ్గేయ కర్త -డా.ఉమా చంద్ర శేఖర వైద్య -1952 .............458
415-చైతన్య నందనం కర్త-నిష్ఠ ల సుబ్రహ్మణ్య శాస్త్రి -1953 ..............459
416 -విజ్ఞాన భైరవతంత్ర కర్త -సత్య సంగానంద సరస్వతి -1953 .............469
417-సంస్కృత హైకూ కర్త -హర్ష దేవ మాఖన్ -1954 ................470
418- మాణిక్య ప్రభ కర్త - భాషాశాస్త్ర వేత్త, న్యాయవిద్యా ప్రవీణ,
వేదాంతాచార్య శ్రీ గబ్బిట ఆంజనేయశాస్త్రి (1954) .............472
419 -సాక్షి శీలకర్త -హెచ్ వి.సత్యనారాయణ శాస్త్రి -1954 .............474
420- విశ్వనాథ "వేయిపడగలు" నవలను సంస్కృతీకరించిన
విదుషీమణి డా.-అయ్యగారి ప్రభావతీదేవి -1955 .............475
421-నైషధ ధర్మ శాస్త్రీయ ప్రతి ఫలాన కర్త -హరే కృష్ణ మెహర్ -1956 .............487
422- సంస్కృత ధ్వని విజ్ఞాన కర్త -దేవీ ప్రసాద్ ద్వివేదీ -1956 .............489
423- సూర్య శతక కర్త -డా.దేవీ ప్రసాద్ మిశ్రా -(1956) .............490
424- తత్వ చింతామణి సిద్ధాంజనకర్త -డా. ఇనగంటి ఉమారావు -1956 ...491
425-మహా మృత్యుంజయ మంత్ర భాష్య కర్త -స్వామి స్వరూపానంద -1960...493
426 -శ్రాద్ధ హాస్య నాటికకర్త -ఎస్.జగన్నాథం -1956 .............494
427- దేవాలయస్య దీపః -శ్రీమతి నాహీద్ అబీదీ -1961 .............494
428-సోక్రటీస్ నాటక కర్త-ఆత్మారామ శాస్త్రి -1962 .............495
429-ప్రస్థాన త్రయ భాష్య కర్త -భద్రేశ్ దాస స్వామి -1964 .............496
430-నడయాడే సంస్కృత సర్వస్వం -
పండిట్ ముఫ్తి మొహమ్మద్ సర్వర్ ఫరూకీ-1968 .............498
431-తత్వ చింతామణి కర్త -సచ్చిదానంద మిశ్ర -1971 .............499
432- "సంస్కృతం -మానవ భాషా పరిణామం" గ్రంథకర్త
-సంపదానంద మిశ్ర -1971 ..............500
433-బ్రహ్మ సూత్ర భాష్య పద భేద కర్త -వీర నారాయణ పాండురంగి -1973..501
434-వనౌషధి నిఘంటుకర్త -పరాశరం భావనాచార్యులు -1976 .............502
435- "ప్రమాణ మీమాంస" వెలువరించిన జైన విద్యావేత్త -
సుఖలాల్ సంఘ్వి -1978 .............503
436- ప్రజ్ఞా చక్షు రామభద్రాచార్య కర్త -నిత్యానంద మిశ్ర - 1982 ..........505
437- "సామాన్య నిక్కృతి క్రోడపత్ర"కర్త -


డా.శ్రీ గబ్బిట జయ మాణిక్య శాస్త్రి(1983) ..........506
438 -ప్రాచ్యసాఖ్యాన వివరణ కర్త - డా.గబ్బిట శ్రీనివాస శాస్త్రి -1987 .... 507
439-వేదాంగ శిక్ష కర్త - డా .కె. హయగ్రీవ శర్మ -20వ శతాబ్దం ..........509
440- కర్నాటక సంస్కృత గ్రామాలు -మత్తూర్, హంసహల్లి -20వ శతాబ్దం ........510
441- ఆధునిక అస్సాంలో సంస్కృతవ్యాప్తి -20వ శతాబ్దం ..........513
442-జయమతి ఖండ కావ్య కర్త -భావ దేవ భగవతి -20వ శతాబ్దం ..........513
443- భక్తి వివేక వ్యాఖ్య -జీవేశ్వర గోస్వామి- 2000 ..........513
444-శాక్త దర్శన కర్త -చక్రేశ్వర భట్టాచార్య -2000 ..........514
445-పతాకామ్నాయ కర్త -మనోరంజన్ శాస్త్రి -2000 ..........514
446-శ్రీకృష్ణ లీల కర్త -వైకుంఠ నాథ చక్రవర్తి -2000 ..........514
447-అవినాశి నవలాకారుడు -విశ్వనారాయణ శాస్త్రి -2000 ..........514
448- వ్యంజనా ప్రపంచ సమీక్ష కర్త -ముకుంద మాధవ వర్మ -2000 ..........514
449-బౌద్ధ వేదాంత పరిశోధకుడు -కాళీప్రసాద్ సిన్హా -2000 ..........515
450- విదేశీ భాషా గ్రంథాలపై సంస్కృత ప్రభావం -2000 ..........515
451- మధ్యప్రదేశ్‌లో గీర్వాణ సేవ -2000 ..........516
452- త్రిపుర కాంగ్రెస్ స్వాగతానంద కల్లోలహ్ -
పండిట్ లోకనాథ శాస్త్రి - 2000 ..........518
453-గాంధీ శతశ్లోకి కర్త -పండిట్ గణపతిశుక్ల -2000 ..........518
454-రామ వనాగమన నాటక కర్త - శ్రీమతి డా.వనమాల భావర్కర్ -2000.. 519
455- అజాత శత్రు నవలా కారుడు -డా.శ్రీనాధ శాస్త్రి -2000 ..........519
456-గణిత వేదాంత కర్త -చక్రవర్తి-2000 ..........520

## 2001 నుండి 21వ శతాబ్దం

457 -టీనేజ్ సంస్కృత బోధకులు -చి. అశోక్ (2001), చి. సిద్ధార్థ (2004)...522
458- 6వ శతాబ్ద రామాయణం -2100 ..........524
459- సంస్కృతాన్ని శిరోభూషణంగా ధరించిన ఉత్తరాఖండ్ -2100 ..........525
460-హర్యానా విశ్వ విద్యాలయ సంస్కృత పరిశోధన -2100 ..........526
461- మధ్యప్రదేశ్ సంస్కృత గ్రామాలు - ఝిరి, మోహద్ బాగువార్ (2100) ...527
462-21వ శతాబ్దంలో గీర్వాణ భాషాభ్యసనంలో నవీన విధానాలు -
బి.యెన్.శశికిరణ్, హరి రవికుమార్ (జూన్ 2017) ...........528
-529 నుండి 552 వరకు గీర్వాణ భాషా వైభవం (కవితలు) -

**1) వేద ఉపనిషత్ పురాణ ఇతిహాస కాలం**

# గీర్వాణకవుల కవితా గీర్వాణం మూడవ భాగం



## 1. బ్రహ్మవాదిని –గార్గి

ప్రాచీన తత్వవేత్త గార్గి పేరు వేదసాహిత్యంలో కూడా ప్రసిద్ధమైనది. ఆమె కాలం క్రీ.పూ 700గా భావిస్తారు. వేదాలను అత్యంత సహజంగా వివరించి చెప్పే నేర్పున్న మహిళా బ్రహ్మవాదిని అని గార్గిని గౌరవంగా సంబోధిస్తారు. బృహదారణ్యక ఉపనిషత్‌లో ఆరు ఎనిమిది అనువాకాలో ఆమె పేరు ప్రత్యేక్ష మౌతుంది. విదేహ రాజు జనకుని ఆస్థానంలో జరిగిన "బ్రహ్మ యజ్ఞ" చర్చలో గార్గి యాజ్ఞవల్క్యునితో సవాలు చేసి నిలిచింది. గార్గి ఋగ్వేదంలో చాలా సంహితలు దర్శించినట్లు ఉన్నది. హిందూ ధర్మాన్ని మనసా వాచా అనుసరించిన మహోత్కృష్ట మహిళ గార్గి.

గర్గ వంశానికి చెందిన వాచక్నుని కుమార్తె గార్గి. తండ్రి గార్గి వాచాక్నవి అని పేరు పెట్టారు. బాల్యం నుండి అసమాన మేధస్సుతో వేద, వేదాంగ విషయాలను నేర్చి ఆనాటి సమాజంలో ఉత్కృష్ట మహిళగా విరాజిల్లింది. ఉపనిషత్తులలో గార్గి, వాడవ ప్రతిహేయి, సులభ మైత్రేయి పేర్లు తరచుగా కనిపిస్తాయి. ప్రాచీన మహిళా విద్యావేత్తల పేర్లలో వీరు ముగ్గురు పేర్లే ముందు చెబుతారు. వేద విద్యా మహిళాత్రయంగా వీరిని పేర్కొనవచ్చు. అశ్వలాయన గృహ్య సూత్రాలలో, కూడా గార్గి పేరు తరచుగా కనిపిస్తుంది. కుండలిని మేల్కొల్పి బ్రహ్మజ్ఞానంతో ఆత్మజ్ఞానంపొందిన మహిళా మాణిక్యం గార్గి. విద్యా వ్యాప్తికి గార్గి సేవలు నిరుపమానం. జనకమహారాజు రాజ సూయ

యాగం చేసి దేశంలోని మహర్షులను రాజులను ఆహ్వానించి తానూ బ్రహ్మజ్ఞాని కనుక ఇందరు మహానుభావులు తన ఆస్థానానికి రావటంలో పరవశించి బ్రహ్మ జ్ఞాన చర్చను అందరి సమక్షంలో నిర్వ హించాలని భావించాడు. గెలుపొందినవారికి 1000 గోవులను ఒక్కో ఆవు కొమ్ములకు 10 గ్రాముల బంగారాన్ని తగిలించి కానుకగా ఇస్తానని చాటాడు. ఇలా ఆహ్వానిమ్పబడిన వారిలో కుండలిని మేల్కొల్పి ఆత్మజ్ఞానం సాధించిన బహుశాస్త్ర వేద నుపనిషత్ నిధి యాజ్ఞవల్క్యుడు కూడా ఉన్నాడు. తనతో వాదంలో ఎవరూ జయించలేరన్న ధీమాతో గెలుపుతనదేనని భావించి ఆ సహస్ర గోగణాన్ని తన ఆశ్రమానికి తరలించుకు వెళ్ళవలసినదిగా శిష్యుడు సంశ్రవుడిని ఆదేశించాడు. అక్కడున్న చాలామంది వాదం లేకుండా యాజ్ఞవల్క్యుడు ఇలా "ప్రయిజ్ మని" తీసుకు వెళ్ళటం ఇష్టం లేకపోయినా వాదించే దమ్ములేక గమ్మునుండి పోయారు. చివరికి గార్గితో ఎనిమిది మంది జనకుని పురోహితుడు అశ్వలుడు, ఆర్తభాగుడు, భూజ్యుడు, ఉషష్ఠ ఉద్దాలకుడు, గార్గి, మాత్రమే మిగిలారు. ఉద్దాలకుడు వాదం ప్రారంచాడు. చివరికి గార్గి యాజ్ఞవలయుని గొప్పతనాన్ని ఆధిక్యాన్ని సవాలు చేసి నిరూపించుకోమన్నది. ఆమె ఆధిభౌతిక విషయాలపై ప్రశ్నలు సంధించింది పర్యావరణంపై ప్రశ్నలు కురిపించింది. ప్రపంచమంతా నీటిపై ముందుకు వెనకకూ అల్లబడిందంటారు కదా ఈ ముందు వెనుకలు దేనిపై ఆధారపడ్డాయి? వాళ్ళిద్దరి సంభాషణ ఇలా జరిగింది- గాలిమీద అన్నది గార్గి గాలి దీనిపై ఆధారం? మధ్యనున్న ప్రదేశంపైన. అందులోని ప్రదేశాలు? గాంధర్వ లోకంపైనా అని గార్గి సమాధానం బృహదారణ్యక ఉపనిషత్‌లో కూడా ఉంది. అలాగే గార్గి సూర్య, చంద్ర ఇంద్ర ప్రజాపతులపై ప్రశ్నలు అడిగింది. యజ్ఞవాల్క్యుని గార్గి ఆకాశంపైన ఏమి ఉంది భూమిక్రింద ఏముంది గతం వర్తమానం భవిష్యత్తు అంటే ఏమిటి, వీటిని కలిపే పడుగూపేకల నేత ఏమిటి?అని ప్రశ్నిస్తే యాజ్ఞవల్క్యుడు "అంతరిక్షం" అని సమాధానం చెప్పాడు. సంతృప్తిపడక గార్గి చివరగా బ్రహ్మం అంటే ఏమిటి అని అడిగితే సమాధానంగా ఇంతకంటే ముందుకు వెళ్ళటం మంచిదికాదని వెడితే ఆమె మానసిక స్థితి దెబ్బతింటుందని చెప్పి వాదాన్ని ముగించాడు. ఈ ఆకస్మిక ముగింపు ఆమెకు నచ్చక "పోయినా యాజ్ఞవల్క్యుని అపార మేథా సంపత్తిని మెచ్చి అక్కడి బ్రహ్మవేత్తలతో'' మీరందరూ యాజ్ఞవల్క్యుని బ్రహ్మజ్ఞానానికి తలవంచవలసిందే. అందులో ఆయన్ను ఓడించగలిగే వాడు లేడు" అని చెప్పింది. గార్గికి ఉన్న ఆత్మజ్ఞాన విషయాలు చాందోగ్యోపనిషత్‌లో కూడా దర్శనమిస్తాయి. యాజ్ఞవల్క్య గార్గి సంవాదం "యోగ-యాజ్ఞవల్క్య" గ్రంథంగా వెలువడింది. జనక మహా రాజు ఆస్థానంలోని నవరత్నాలలో గార్గి ఒకరై విశేషస్థానం పొందింది.❋



## 2) 2 అద్వైత వేదాంతిని - మైత్రేయి

మైత్రి మహర్షి పుత్రిక సులభ మైత్రేయిగా అశ్వలాయన గృహ్యా సూత్రాలలో మైత్రేయి పేరు కనిపిస్తుంది. గృహ్యా సూత్రాలలో కూడా వేదకాలపు మహిళలతో మైత్రేయి పేరు కనిపిస్తుంది. తండ్రి విదేహ రాజ్య రాజధాని మిథిలలో జనక మహారాజు ఆస్థాన మంత్రిగా ఉండేవాడు. బృహదారణ్యక ఉపనిషత్‌లో మైత్రేయి యాజ్ఞవల్క్యుని భార్యగా చెప్పబడింది. ఆయన రెండవ భార్య కాత్యాయని. మహాభారతంలో మాత్రం మైత్రేయి అవివాహితగానే చెప్పబడింది. జనకునికి బ్రహ్మజ్ఞానం బోధించి జీవితాంతం యోగినిగా ఉండి పోయిందని ఉంది. సంస్కృత సాహిత్యం ఆమెను బ్రహ్మవాదిని అన్నది. కాత్యాయనితో యాజ్ఞవల్క్య మహర్షి సంసార జీవితాన్ని అనుభవిస్తుంటే మైత్రేయి బ్రహ్మజ్ఞానంతో ఆత్మజ్ఞానం సాధించింది.

ఋగ్వేదంలో 10 మంత్రాలను మైత్రేయి దర్శించినట్లు చెప్పబడింది. బృహదారణ్యక ఉపనిషత్ లో మైత్రేయి యాజ్ఞవల్క్య సంవాదం ఉన్నది. ఆత్మనుంచి ప్రేమ జనించి ఆత్మ స్వభావం బ్రహ్మంలను చర్చించి ఈ రెంటి ఐక్యతను తెలియ జేయటమే ఇందు లోని సారాంశం. ఇదే అద్వైత సిద్ధాంతం. మైత్రేయి యాజ్ఞవల్క్య సంవాదం రెండు భాగాల గ్రంథం మాధ్యమ దిన, కాణ్వ సిదాంతాలుగా కొద్దిమార్పులతో మారింది. యాజ్ఞవల్క్యుడు బ్రహ్మ చర్య గృహస్థ, వానప్రస్థాశ్రమాల జీవితానుభవం తర్వాత ముసలితనంలో సన్యాసాశ్రమం సవీకరించాలని భావించి భార్య మైత్రేయిని పిలిచి తనకున్న ఆస్తిని చెరిసగంగా ఇద్దరు భార్యలకు ఇస్తానన్నాడు. మైత్రేయి తనకు నశ్వరమైన ధనం కంటే అశ్వరమైన మోక్షం కావాలని చెప్పింది. అప్పుడు మైత్రేయి యాజ్ఞవల్క్యుల మధ్య జరిగిన సంవాదం ఇలా నడిచింది -స్వామీ! ప్రపంచం లోసంపదంతా నాకు చెందితే నాకు మోక్షం వస్తుందా? అని అడిగింది. "లేదు"అని చెప్పి మోక్షానికి ధనంతో సంబంధం లేదన్నాడు యాజ్ఞవల్క్యుడు. అశాశ్వతమైన దానికోసం నాకు ప్రాకులాటలేదు శాశ్వతమైన ముక్తి కావాలంటే మార్గం చెప్పండి? అడిగింది.

సంతోషించిన భర్త భార్య మైత్రేయికి ఆత్మజ్ఞానం బోధించి నిరంతరం మననం చేయమన్నాడు.

బృహదారణ్యక ఉపనిషత్‌లోని ఈ సంవాదానికి అబ్బురపడిన శంకరా చార్యులవారు దానికి చక్కని భాష్యం రచించారు. మైత్రేయి యాజ్ఞవల్క్య సంవాదంపై సురేశ్వరాచార్యులు "వార్తికం" రాశారు. ఢిల్లీలో మైత్రేయి పేరిట ఒక విద్యాలయం తమిళనాడులో "మైత్రేయి వేదిక్ విలేజ్" అనే రిట్రీట్ ప్రదేశం ఉన్నాయి.❋



## 3) అశ్వినీ దేవతా స్తోత్రకర్త - ఘోష

కక్ష వంతుని కుమార్తె, దీర్ఘతముని మనుమరాలుఘోష తండ్రి, తాతా ఋగ్వేదంలో రెండు మంత్రాలను దర్శించినట్లు ఉన్నది. ఘోషకు చర్మ వ్యాధి సోకి శరీరం రంగు మారిపోవటం వలన వివాహం చేసుకోకుండా తండ్రి ఇంటనే ఉండి పోయింది. తాను కూడా తన ఆరోగ్యం కోసం ఆరోగ్య ప్రదాతలైన అశ్వినీ దేవతలను స్థిర చిత్తంతో ప్రార్థించింది. వారు ఆమెకు "మధు విద్య" బోధించారు. దీన్ని రహస్యంగా అనుష్టించి అశ్వినీ దేవతల అనుగ్రహంతో శరీరారోగ్యం, సౌందర్యము, గొప్ప జ్ఞానము పొందింది. అప్పుడు వివాహం చేసుకొని, "శుష్య" అనే కుమారుని కన్నది. ఇతను కూడా ఋగ్వేదంలో ఒక మంత్రాన్ని దర్శించాడు.

ఋగ్వేదంలోని 10వ మండలంలో ఒక్కొక్క దానిలో 14 మంత్రాలున్న 39,40 అనే రెండు సూక్తాలను చెప్పింది. మొదటి అనువాకం అశ్వినీ దేవతలను స్తుతిస్తూ చెప్పింది రెండవదానిలో తనకు ఆరోగ్యం కలగాలని శరీరం కాంతివంతమై అందం రావాలని వివాహం చేసుకోవాలనే కోరికలను తెలియజేసింది. ఆమెకున్న మంత్ర శాస్త్ర ప్రావీణ్యతను గుర్తించి ఘోష ను "మంత్ర వాదిని" అన్నారు ఆమెకు బ్రహ్మవాదిని అనే పేరు కూడా ఉన్నది.❋



## 4) పంచదశి కర్త – లోపాముద్ర

కౌషితకి అని వరప్రద అని లోపాముద్రకు పేర్లున్నాయి అగస్త్యమహర్షి భార్య లోపాముద్ర. ఋగ్వేదంలో చాలామంత్రాలు ఆమె దర్శించినట్లు ఉన్నది. ఆమెను "ఋషికి" అంటారు శాక్త సంప్రదాయంలో "వేదాంత పంచ దశి" రచించింది. ఆమె గురించి మహాభారతంలోను గిరిధర రామాయణంలోనూ ఉంది. అగస్త్యమహర్షి ఒక కుమార్తెను సృష్టించి విదర్భ రాజుకు ఇచ్చాడు. ఆమెకు మంచి విద్య నేర్పించి పెంచి పెద్దదాన్ని చేశారు. ఆమెకు యుక్త వయసు రాగానే మహర్షి ఆమెను తనకిచ్చి పెళ్లి చేయమని రాజును కోరాడు. వివాహం తర్వాత రాజ ప్రాసాదం వదిలి దంపతులు దూరంగా వెళ్లి ఆమె సహాయంతో ఆయన చాలాకాలం తీవ్ర తపస్సు చేశాడు. తనను పట్టించుకోకుండా ఆయన తపస్సులో మునిగిపోవటంతో ఆమె వ్యధ చెంది రెండు మంత్రాల అనువాకం చెప్పింది. ఆమె మనసు గ్రహించిన మహర్షి తన సర్వశక్తి యుక్తులతో ఆమెకు సర్వ విధాలా సౌకర్యం సంతృప్తి కలిగించాడు. ఈ దంపతులకు "ద్రి దశ్యు" అనే కుమారుడు జన్మించాడు. ఇతను గొప్ప కవిగా ప్రసిద్ధుడయ్యాడు. ప్రసిద్ధ పతివ్రతలలో లోపాముద్ర కూడా ఒకరు. జంతువులూ వృక్షాలు తమ అందాలను అంటే "ముద్ర"లను ఇతరులకు త్యాగం చేసి తమకు ఏమీ మిగలకుండా చేసుకొని "లోపా"గా మిగలటమే లోపాముద్ర తత్వం. విష్ణు మూర్తి అవతారమైన హయగ్రీవుని నుండిఅగస్త్య మహర్షి గ్రహించిన లలితా సహస్ర నామాలను లోపాముద్ర భర్తతో కలిసి విస్తృతంగా ప్రచారం చేసింది.

లోపాముద్ర దర్శించిన ఋగ్వేద మంత్రాలు –1) "పరు వీరహం పురదః శాస్త్ర మణాదేష వస్తో ఋషస్లో జరయన్తి –మీనాతి శరియం జరీనా తనూనమష్యు ను పత్నీ ర్వృషణో జగమ్యుహః" భావం –ఎన్నో షరతులు గడిచిపోతున్నాయి శరీరం ముసలిదైపోతోంది. అందం మందగిస్తోంది. తెలివిగలవాళ్ళు పెళ్లాలను చేరాలి.
2) "ఏ చిదధి పూర్వం రత సాప అసన్ సాకం దేవీబీ రవద న్నతాని –చే చిదవస్తు ర్నహ్యాన్త మాషు హ్ సమూ ను పత్నీ ర్వర్షాభి ర్జగమ్యుహ్" భావం –సత్యారాధన చేసిన పూర్వీకులు దేవునితో సత్యాన్ని చర్చించారు కానీ వారు చివరికి చేరలేకపోయారు. భార్యలు ఇప్పుడు భర్తలతో సమాగమించాల్సిన సమయ మేర్పడింది.❁

## 5) -27 గురు ఋషికలు

గోధా గోషా విశ్వవరాపలోపనిషత్ -బ్రహ్మజయా, జుహు ఉర్నామ, అగస్త్యస్య స్వసాదితిహ్ -ఇంద్రాణి ఇంద్ర మతా చ సరమా రోమా షోర్వషి -లోపాముద్రా చ నాద్యశ్చ, యామి, నారీచ శాశ్వతి -శ్రీ ర్లక్షా సర్పరాజ్ జి వాక్ శ్రద్ధా మేధా చ దక్షిణా -రతి సూర్య చ సావిత్రి బ్రహ్మవాదిన్య యిరితః" అనే 27 గురు మహిళలు వేద కాలపు విద్యాధికులు. విద్యావేత్తలు వీరంతా పురుషులతో సరిసమానంగా అన్ని చర్చలలోనూ, విద్యా సంగీత నాట్య కార్యక్రమాలలోను పాల్గొన్నారని లాత్యాయనుడు తెలియ జేశాడు. వీరందరిని "ఋషికలు" అని వేదకాలం లో గౌరవంగా సంబోధించేవారు.❀

## 6) ఋషికలు దర్శించిన సూత్రాలు

1-అదితి-4,18
2-అదితి ర్దాక్షాయణి-10,72
3-ఆపాలాత్రే యి -8,91
4 -ఇంద్రాణి-10,86
5-ఊర్వశి-10,85
6-గోదా-10,134
7-ఘోషా కక్షవతి-10,39,10,40
8-జుహుర్బ్రహ్మ జయ-10 109
9-త్వష్ట, గర్భ కర్త-10 ,184
10-దక్షిణా ప్రజాపత్యా -- 10,107
11-యామీ-10,154
12-యామీ వైవస్వతి-10,10
13-రాత్రి భారద్వాజి-10,27
14-లోపాముద్ర -1,171
15-వసుక్రపత్ని-10,28
16-వాగామ్భృర్ని-10,125
17-విశ్వవర ఆత్రేయి-5,28
18-శాశ్వత్యాంగీరసీ-8,1
19-శ్రద్ధా కామాయని-10,151
20-శచీ పౌలోమి-10,159
21-సర్ప రాజ్ఞి -10 189

22-శిఖాతానివవారి-9,86
23-సూర్య సావిత్రి-10,85
24-రోమాషా-1,126
25-సరమా దేవ షునీ-10,108
26-శిఖండిన్యప్సరశు-9,104
27-కాశ్యపన జాన్త శర్నఘా-10,142
28-సుదీతీరాంగీరస-8,71
29-ఇంద్రమాతరో-10,153 ❁




## 7) ఋగ్వేద 7వ మండల ద్రష్ట -వసిష్ఠమహర్షి

అరుంధతీ దేవి భర్త వశిష్ఠమహర్షి రామాయణంలో రఘువంశ పురోహితుడు, సప్త ఋషులలో ఒకరు. ఋగ్వేదంలో 7వ మండల ద్రష్ట వసిష్ఠ మహర్షి ఋగ్వేదం 10-167-4 లో వశిష్ఠ ప్రస్తుతి ఉంది. ఋగ్వేదం 7-33-9లో వశిశుడు మహా వేదం వేదాంత పురాణ శాస్త్రాలలో నిష్ణాతుడని సింధునదీ ప్రాంతంలో ఒక ఆశ్రమంలో ఉండి వేదాంత బోధ చేశాడని ఉంది. వేదాంతానికి మొట్టమొదటి గురువు ఆయనే, యోగ వాశిష్టం వాశిష్ఠ సంహిత, అగ్నిపురాణంలో కొంతభాగం విష్ణుపురాణం వశిష్ఠ ధర్మ సూత్రాలు ఆయన రాశాడని నమ్ముతారు. పాతఈ భాషలోని బౌద్ధ రచన "దీఘా నికాయ"లో బుద్ధుడు ప్రాచీన హిందూ మహర్షులను స్మరించేవాడని అందులో వశిష్ఠమహర్షి పేరు కూడా స్మరించేవాడని ఉన్నది.❁



## 8) గాయత్రి మంత్ర ద్రష్టః - విశ్వామిత్ర మహర్షి

ఋగ్వేదంలో 3వ మండలం ద్రష్ట విశ్వా మిత్రుడు. అందులో 3-62-4వాడైన గాయత్రీ మంత్ర ద్రష్ట స్రష్ట విశ్వామిత్ర మహర్షి. గాయత్రి మంత్రాన్ని పూర్తిగా అర్థం చేసుకవారిలో ప్రథముడు విశ్వామిత్రుడు చివరివాడు యాజ్ఞ వల్క్యుడు. రాజర్షి బ్రహ్మర్షిగా మారినవాడు మేనకా విశ్వామిత్రుల కుమార్తె శకుంతలకు జన్మించిన భరతుని పేరే మన భారత దేశం చంద్ర వంశానికి చెందిన కన్యాకుబ్జ రాజు విశ్వామిత్రుడు. కుశుని కుమారుడు కనుక కౌశికుడు. విశ్వానికి మిత్రుడు కనుక విశ్వామిత్రుడయ్యాడు. హరిశ్చంద్రునికి పరీక్ష పెట్టి ఆయన సత్య ధర్మాన్నిలోకానికి చాటిన వాడు. త్రిశంకు స్వర్గం నిర్మించినవాడు. మిరపకాయ వంటి పదార్థ సృష్టికర్త విశ్వామిత్రుడే. రామాయణంలో తన యాగ సంరక్షణకు రామ లక్ష్మణులను తన వెంట తీసుకువెళ్లి బల, అతిబలాది శస్త్రాస్త్రాలను బోధించినవాడు.❀




## 9) ఋగ్వేద మంత్ర ద్రష్ట -కశ్యప మహర్షి

సప్తర్షులలో ఒకరైన కశ్యప మహర్షి ఋగ్వేదం 8, 9, 10 మండలాల్లో చాలా మంత్రాలకు ద్రష్ట. బృహదారణ్యకోపనిషత్‌లో 2-2-4లో వశిష్ఠ, విశ్వామిత్ర, జమదగ్ని, భరద్వాజ, గౌతమ మునులతోపాటు కశ్యప ముని ప్రస్తావన ఉంది.❀



## 10) ఋగ్వేద ప్రథమ మండల ముఖ్య మంత్ర ద్రష్ట – అంగీరస మహర్షి

ఋగ్వేద మంత్ర ద్రష్ట – అధర్వ వేదాన్ని అధర్వ అంగీరసం అంటారు సప్తర్షులలో స్థానమున్నవాడు. ఋగ్వేదంలో అగ్ని, ఇంద్ర, రుబుష, అశ్వినీ దేవతలు, ఉష, రుద్ర సూర్యులను స్తుతించే 1 మండలంలోని 101–నుంచి 115 మంత్రాలు, 2–1,5–35,36, 8–2 , 9–9710 మండల మంత్రాల ద్రష్ట అంగీరసుడే ఋగ్వేదంలో 3–31 మంత్రంలో అంగీరసుడు అగ్నిహోత్రుని ఆరాధకునిగా చెప్పబడ్డాడు. ఆత్మ జ్ఞానంతో పరబ్రహ్మను గూర్చి తీవ్ర తపస్సుచేసి అనంత శక్తులు అనంతమైన విజ్ఞానం సాధించాడని పురాణ కధనం బ్రహ్మమానసపుత్రుడు ప్రజాపతులలో ఒకరు.❁



## 11) అధర్వ వేద ద్రష్ట – అధర్వ మహర్షి

అంగీరస మహర్షితో పాటు అధర్వ మహర్షి అధర్వ వేదాన్ని దర్శించాడు.. సప్తర్షులలో ఒకడు వేదకాలంలో మొట్టమొదటిసారిగా యజ్ఞం చేసినవాడు అధర్వ మహర్షి అంటారు. కర్దమ మహర్షి కుమార్తె శాంతిని వివాహం చేసుకొని దధీచి మహర్షికి తండ్రి అయ్యాడు. వీరిది భృగు వంశం. బ్రహ్మ మానస పుత్రులలో అధర్వ మహర్షి పెద్దవాడు.❁

## 12) వివిధ ఋషుల పేర్లతో వర్ధిల్లిన- బ్రాహ్మణాలు

శృతి వాఙ్మయంలో భాగమైన బ్రాహ్మణాలు మంత్రాలు తంత్రాలు కర్మకాండలు వాతావరణ మార్పుల గురించి తెలియజేసే తాత్విక విషయాలను తెలియజేసేవి. వేదం భాష్యాలు వంటివి బ్రాహ్మణాలు. ఇవి ఒక్కొక్క వేదానికి వేరువేరుగా వివిధ ఋషుల పేర్లతో పిలువబడ్డాయి. వీటిలో ఏక సూత్ర నిర్మాణం కనిపించదు. ఆరణ్యకాల లేక ఉపనిషత్తుల సూత్రాలు కలిసి ఉంటాయి. ప్రతి వేదం శాఖకు దానికి సంబంధించిన బ్రాహ్మణ ఉంటుంది. పూర్వం బ్రాహ్మణాలు సంఖ్య చాలా ఉన్నా ఇప్పుడు మిగిలినవి కేవలం 19 మాత్రమే. అగ్నిహోత్ర విధానం వివాహం దంపతులు అనుసరించాల్సిన విధానాలు గర్భిణీ స్త్రీలుమంచి సంతానం కోసం పాటించాల్సిన నియమాలు. మంత్రోచ్చారణ, దోషాలతో మంత్రాలు చదివితే కలిగే దుష్పరిణామాలు, స్వాధ్యాయంతో వేదాలను కాపాడుకోవాల్సిన పద్ధతులు అన్నీ వీటిలో ఉంటాయి. వేద సంస్కృతం కంటే బ్రాహ్మణాలు సంస్కృతం వాటికి తరువాత వచ్చాయికనుక భిన్నంగా ఉంటుంది. ఇప్పుడు బ్రాహ్మణాలలో రకాలను తెలుసుకొందాం-

1- ఋగ్వేదం - సకల శాఖ -ఆత్రేయ బ్రాహ్మణం - దీనినే అశ్వలాయన బ్రాహ్మణం అనీ అంటారు. ఇందులో 40 అధ్యాయాలు సోమ హోమం గురించి వివరణ ఉంటుంది. 2 భాస్కల లేక ఇక్ష్వాకు శాఖ - కౌశతకి బ్రాహ్మణం లేక సాంఖ్యాయన బ్రాహ్మణం అంటారు. అధ్యయాలు మొదటి అధ్యాయాలలో అన్నహోమం గురించి, తర్వాత సోమ హోమం గూర్చి ఉంటుంది.

2- సామవేదం -ఇందులో 1.కౌతుమా 2.రణయానీయ శాఖలున్నాయి - తాండ్య మహా బ్రాహ్మణం లేక పంచ వింశ బ్రాహ్మణం అతి ప్రాచీనమైనది -25 అధ్యాయాలు - కథలు, వ్రాత్య స్తోమాలు ఉంటాయి. సద్వింశ బ్రాహ్మణంలో 26 ప్రపాఠ కాలున్నాయి. సంవి విధాన బ్రాహ్మణంలో 3 ప్రపాఠకాలు సూత్రం శైలిలో ఉంటాయి. ఆర్షేయ బ్రాహ్మణం సామ వేదానికి సూచిక. దేవతాధ్యాయ బ్రాహ్మణంలో 3 ఖండాలలో 26,11,25 ఖండికలున్నాయి. చాందోగ్య బ్రాహ్మణం 10 ప్రపంచకాలు. ఒక్కొక్కదానిలో 8 ఖండాలు నుంచి 10 ప్రపాతకాలు చాందోగ్య ఉపనిషత్‌లోనివి. సంహితోపనిషత్ బ్రాహ్మణంలో ఒకే ప్రపథకం 5 ఖండాలుగా ఉంది. వంశ బ్రాహ్మణం చిన్నదే. ఒక్క అధ్యాయంలోనే గురుశిష్య సంబంధ చర్చ ఉంటుంది.

జైమినీయ శాఖ-జైమినీయ బ్రాహ్మణం 3 కాండాలు. తాండ్య బ్రాహ్మణం కంటే ప్రాచీనమైనది. మహాబ్రాహ్మణం అంటారు కొద్దిభాగమే లభ్యం. జైమినీయ- ఆర్షేయ బ్రాహ్మణం-ఇది కూడా సామవేద సూచికయే. జైమినీయ ఉపనిషత్ బ్రాహ్మణం - దీనినే తల్వకార ఉపనిషత్ బ్రాహ్మణం అంటారు. ఛాన్దో గ్యానికి సమాంతరంగా ఉంటుంది.

2) యజుర్వేదం

1– కృష్ణ యజుర్వేదంలో మైత్రాయని సంహిత, చరక లేక కథా సంహిత, కపిస్థల కథా సంహిత, తైత్తిరీయ సంహితలున్నాయి.

2– శుక్ల యజుర్వేదం–మాధ్యందిన శాఖలో శతపథ బ్రాహ్మణం, కాన్వ శాఖలో కూడా అవే ఉంటాయి.

3–అధర్వ వేదం లో శౌనక పిప్పలాద శాఖలున్నాయి. పిప్పలాద బ్రాహ్మణం అలభ్యం. కానీ గోపథ బ్రాహ్మణం మాత్రమే ఉంది. దీనిని పిప్పలాద ఆరణ్యకంగా భావిస్తారు.❁

## 13) అరణ్యాలలో మహర్షులు దర్శించిన – ఆరణ్యకాలు

ఏకాంత వాసంలో దీర్ఘ ఆతపస్సులో అరణ్యవాసంలో మహర్షులు దర్శించినవి లేక ఆరాటంలో పుట్టినవి ఆరణ్యకాలు. ఇవి కర్మకాండల గురించి వ్రతాలు ప్రవర్గ్యలు గురించి తెలియజేస్తాయి. ఆరణ్యకాలు కర్మకాండకు సంబంధించినవైతే ఉపనిషత్‌లు జ్ఞానకాండకు సంబంధినవి. వేదం మంత్రం భాగాలను సంహితాలని వాటి వ్యాఖ్యానాలను బ్రాహ్మణాలని, వాటిలోకని కర్మకాండను తెలియజేసేవి ఆరణ్యకాలని వేదాలలోని జ్ఞానభాగాన్ని చెప్పేవి ఉపనిషత్‌లు వేదాంగాలని అంటారు.

ఆరణ్యకాలు కూడా వివిధ ఋషుల పేర్లతో పిలువ బడుతున్నాయి. ఋగ్వేదానికి ఐతరేయ ఆరణ్యకం కౌశిక ఆరణ్యకాలు –యజుర్వేదానికి తైత్తిరీయ ఆరణ్యకం మైత్రాయణీయ ఆరణ్యకం, కేదారణ్యకం, బృహదారణ్యకం సామవేదానికి తలవకార ఆరణ్యకం, ఆరణ్యక సంహిత, అధర్వ వేదానికి ఆరణ్యకం ఆలభ్యం.

ఐతరేయాఅరణ్యకం 5 అధ్యాయాలు మొదటి రెండిటిలో ప్రాణ విద్య ఉంటుంది. 3లో సంహితోపనిషత్‌లో స్వర చర్చ 4,5లలో మంత్రాల సాంకేతిక వివరణ ఉంటుంది దీన్ని మహానామ్ని అంటారు.

తైత్తిరీయ ఆరణ్యకంలో 10 భాగాలు. మొదటి దానిని కథాకాని అంటారు. అగ్ని ఛయన కాండ ఉంటుంది. 2వది మహాయజ్ఞాన నిర్వహణ విధానం మిగిలినవి మంత్రం తంత్ర సాంకేతిక వివరాలు.

కథారణ్యకం –తైత్తిరీయమే. సాంఖ్యాయన ఆరణ్యకంలో 15 అధ్యాయాలు. 2 అధ్యాయాలు మహా వ్రతాన్ని 3నుంచి 6 కౌశిక ఉపనిషత్‌ను 7,8 సంహితోపనిషత్, 9 ప్రాణ విశిష్టత, 10 అగ్నిహోత్ర విధి 11 అంత్య సంస్కారం 12 ప్రార్ధన ఫలితాలు 13 శ్రావణ మనన నిధి ధ్యాస వివరణ 14 అహం బ్రహ్మాస్మి వివరణ 15 బ్రహ్మ నుంచి గుణ సాంఖ్యాన వరకు గురు స్తుతి ఉంటాయి. బృహదారణ్యకం బృహదారణ్యక ఉపనిషత్‌ను, ముఖ్యంగా "పర్వాగ్య" కర్మ కాండను గురించి వివరిస్తుంది. ఆరణ్యకాలను "రహస్య బ్రాహ్మణాలు" అన్నారని నిరుక్తానికి వ్యాఖ్యానం రాసిన దుర్గాచార్య అన్నాడు.❁



## 14) ఉపనిషత్తులు - యాజ్ఞ వల్క్య, ఉద్దాలకాది మహర్షులు

❋ ఉపనిషత్

❋ ఉప అంటే సమీపంగా, ని అంటే కింద, షత అంటే కూర్చునుట

❋ ఉపనిషత్తులు జ్ఞానం ప్రధానంగా ఉన్నాయి. గురువు ముందు శిష్యుడు కూర్చొని జ్ఞానాన్ని ఆర్జించాడు. వీటిలో ప్రధానంగా విశ్వాంతరాళంలో మనిషికి ఉండే స్థానం గురించి చర్చ జరిగింది. ఉపనిషత్తులు తాత్త్విక గ్రంధాలు. ఆత్మ-అంతరాత్మ ప్రపంచానికి మూలం. ప్రకృతి రహస్యాలు మొదలైన వాటి గురించి ఇవి చర్చించాయి. వేదకాలం నాటి ఆలోచన ధోరణికి ఉపనిషత్తులు పరిపూర్ణతను కలిగించాయి. సరైన జ్ఞానానికి, సన్మార్గానికి ఇవి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చాయి. ఉపనిషత్తులు 108 వరకు ఉన్నా అందులో 12 అతి ముఖ్యమైనవి. వేద సాహిత్యం అంతిమ దశలో ఆవర్భవించాయి కాబట్టి వీటిని 'వేదాంతాలు' అని కూడా అంటారు. ఋగ్వేదయుగాన్ని తొలివేదయుగమని పిలుస్తారు. మిగిలిన సాహిత్యం-వేదాలు, బ్రహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు వెలువడిన యుగాన్ని మలివేద యుగమని అంటారు. తొలి వేదాయుగానికి, మలివేదయుగానికి మధ్య ఎన్నో మార్పులు సంభవించాయి.

❋ .ఉపనిషత్తుల అనేక మంది రచయితలకు ఆపాదించబడ్డాయి మరియు వారి పేరు మీద చేయబడ్డాయి: అవి యాజ్ఞవల్క్య, ఉద్దాలక మరియు అరుణి అనేవి ప్రారంభ ఉపనిషత్తులు ప్రముఖంగా కనిపిస్తాయి. ఇతర ముఖ్యమైన రచయితలు శ్వేతకేతు, శాండిల్య, ఐతరేయ, పిప్పలాద మరియు సనత్కుమార పేరు మీద ఉన్నాయి. ఇంకనూ చర్చించు, తర్కించు, విచారించు, వివేచించువారు అయిన గార్గి, మరియు యాజ్ఞవల్క

భార్య మైత్రేయిముఖ్యమైన మహిళలు పేరు మీద కూడా ఉన్నాయి.
❀ మొఘల్ చక్రవర్తి షాజహాన్ కుమారుడు, దారా షిఖ్, 1657లో. పెర్షియన్ భాషలోకి 50 ఉపనిషత్తులు అనువాదం చేయడము జరిగింది.
❀ ఉపనిషత్తులులో ఎక్కువగా బ్రాహ్మణాలు మరియు అరణ్యకములు యొక్క ముగింపు భాగంలోనివి.
❀ భగవద్గీత, ఉపనిషత్తులు మరియు బ్రహ్మసూత్రములును ప్రస్థానత్రయం అంటారు.

**అర్థము-మార్పు**

❀ వేదాల చివరి బాగాలు. గ్రంథ ప్రతిపాద్యమగు విద్య అని శ్రుతి వచనం. బ్రహ్మవిద్య అని కూడా ఉపనిషత్తులకు మరో పేరు. ఇది ద్వివిధం. 1.పరావిద్య, 2.అపరా విద్య.

**ఉపనిషత్తుల విభాగాలు-**

❀ ఉపనిషత్తులు వేదసారమనీ, వేదరహస్యమనీ వర్ణనలు ఉన్నాయి. ఒకప్పుడు వెయ్యిన్నీ ఎనిమిది ఉపనిషత్తులు ఉండేవనీ, ఇప్పుడు నూట ఎనిమిది మాత్రం లభ్యమవుతున్నాయనీ అంటారు. అందులోనూ పది మాత్రం ముఖ్యమైనవనీ, వాటికి మాత్రమే శంకరులు భాష్యం వ్రాశారనీ అంటారు. అవి: 1.ఈశోపనిషత్తు, 2.కేనోపనిషత్తు, 3.కఠోపనిషత్తు, 4.ప్రశ్నో పనిషత్తు, 5.ముండకోపనిషత్తు, 6.మాండూ క్యోపనిషత్తు, 7.తైత్తిరీయోపనిషత్తు, 8.ఐతరేయోపనిషత్తు, 9.ఛాందోగ్యోప నిషత్తు, 10.బృహదారణ్యకోపనిషత్తు.
❀ శైవ, వైష్ణవ వర్గాల వారు తమవిగా భావించే ఉపనిషత్ వర్గీకరణ ఒకటి ఉంది.
❀ శైవులు తమవని భావించే ఉపనిషత్తులు పదిహేను ఉన్నాయి: 1.అక్షమాలికోపనిషత్తు, 2.అథర్వ శిరోపనిషత్తు, 3.అథర్వ శిఖోపనిషత్తు, 4.కాలాగ్ని రుద్రోపనిషత్తు, 5.కైవల్యోపనిషత్తు, 6.గణపతి ఉపనిషత్తు, 7.జాబాలోపనిషత్తు, 8.దక్షిణామూర్తి ఉపనిషత్తు, 9.పంచబ్రహ్మోపనిషత్తు, 10.బృహజ్జాబాలోపనిషత్తు 11.భస్మజా బాలోపనిషత్తు, 12.రుద్రహృదయో పనిషత్తు, 13.రుద్రాక్ష జాబాలోపనిషత్తు, 14.శరభోప నిషత్తు, 15.శ్వేతాశ్వతరో పనిషత్తు.
❀ వైష్ణవులు తమవిగా చెప్పే పదునాలుగు ఉపనిషత్తులు: 1.అవ్యక్తోప నిషత్తు, 2.కలిసంతరణోపనిషత్తు, 3.కృష్ణోప నిషత్తు, 4.గారుడోపనిషత్తు, 5.గోపాలతాప సోపనిషత్తు, 6.తారసోపనిషత్తు, 7.త్రిపాద్వి భూతి ఉపనిషత్తు, 8.దత్తాత్రేయో పనిషత్తు, 9.నారాయణోపనిషత్తు, 10.నృసింహ తాపసీయోపనిషత్తు, 11.రామ తాపస ఉపనిషత్తు, 12.రామరహస్యో పనిషత్తు, 13.వాసుదేవ ఉపనిషత్తు, 14.హయగ్రీవ ఉపనిషత్తు.

❋ సన్యాసానికి సంబంధించిన లక్షణాలను, విధి విధానాలను తెలియజేసే 17 ఉపనిషత్తులను సన్యాసోపనిషత్తులని వర్గీకరించారు. అవి: 1.అరుణికోపనిషత్తు, 2.అవధూతోపనిషత్తు, 3.కఠశ్రుత్యుపనిషత్తు, 4.కుండినోపనిషత్తు, 5.జాబాలోపనిషత్తు, 6.తురీయాతీత అవధూతోపనిషత్తు, 7.నారద పరివ్రాజకో పనిషత్తు, 8.నిర్వాణోపనిషత్తు, 9.పరబ్రహ్మోపనిషత్తు, 10.పరమహంస పరివ్రాజకోపనిషత్తు, 11.పరమహంసో పనిషత్తు, 12.బ్రహ్మోపనిషత్తు, 13.భిక్షుక ఉపనిషత్తు, 14.మైత్రేయ ఉపనిషత్తు, 15.యాజ్ఞవల్క్య ఉపనిషత్తు, 16.శాట్యాయన ఉపనిషత్తు, 17.సన్యాసో పనిషత్

**❋ ఉపనిషత్తుల సంఖ్య**

ఉపనిషత్తులు ఎన్ని అనే ప్రశ్నకు అందరినీ సంతృప్తిపరచే సమాధానం లేదు. శంకరుడు వ్యాఖ్యానించిన ఈశకేనాది పది ఉపనిషత్తులే బహుళ ప్రాచుర్యంలో ఉన్నప్పటికీ తరచు మరికొన్ని ఉపనిషత్తుల ప్రస్తావన విన వస్తుంటుంది. ముక్తికోపనిషత్తు 108 ఉపనిషత్తులను ప్రస్తావిస్తున్నది. ఒక్కొక విశ్వాసం వారు ఒక్కొక్క విధంగా ఉప నిషత్తులను తమకు అనుకూలంగా ఉదహరిస్తున్నారు. ప్రామాణికంగా చెప్పడానికి ఆస్కారం లేదు. ఉదాహరణకు జాబాలి పేరు అనేక విధాలుగా ఉపనిషత్తుల పట్టికలో దర్శనమిస్తుంది. ఏమైనప్పటికీ, వైదిక వ్మాయంలో ఉపనిషత్తుల స్థానం విశిష్టమైనది. ఉపనిషత్తు అనే పదానికి సమీపానికి తీసుకునిపోవడం అనే అర్థం ఉన్నదనీ, మనిషి తన పరిమితమైన చైతన్యాన్ని, ప్రజ్ఞను బ్రహ్మ చైతన్యంతో, ప్రజ్ఞతో అనుసంధానం చేసి పరిమితత్వాన్ని దాటి శాశ్వత స్థితిని పొందడానికి ఉపయోగపడే మోక్షవిద్య ఉపనిషత్తులలో ఉన్నదని కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య అంటారు. ఒక్కోవేదానికి ఉపనిషత్తుల సంఖ్య ఇలా ఉంది.

❋ ఋగ్వేదానికి సంబంధించినవి-10

❋ కృష్ణ యజుర్వేదానికి సంబంధించినవి-32

❋ శుక్ల యజుర్వేదానికి సంబంధించినవి-19

❋ సామవేదానికి సంబంధించినవి-16

❋ అధర్వణ వేదానికి సంబంధించినవి-31 (మొత్తం-108)

❋ మొత్తం 108 ఉపనిషత్తులలో ప్రధానంగా 10 ఉపనిషత్తులను దశోపనిషత్తులుగా ముఖ్య ఉపనిషత్తులు.

❋ మొత్తం 108 ఉపనిషత్తులలో ప్రధానంగా 10 ఉపనిషత్తులను దశోపనిషత్తులుగా వ్యవహరిస్తున్నారు.

అవి:

1. ఈశావాస్య ఉపనిషత్తు (ఈశావాస్యోపనిషత్తు)

2. కేనోపనిషత్తు
3. కఠోపనిషత్తు
4. ప్రశ్నోపనిషత్తు
5. ముండకోపనిషత్తు
6. మాండూక్యోపనిషత్తు
7. తైత్తిరీయోపనిషత్తు
8. ఐతరేయోపనిషత్తు
9. ఛాందోగ్యోపనిషత్తు
10. బృహదారణ్యకోపనిషత్తు
11. శ్వేతాశ్వతరోపనిషత్తు
12. కౌశీతకి ఉపనిషత్తు
13. మైత్రాయణి ఉపనిషత్తు
14. బ్రహ్మోపనిషత్తు
15. కైవల్యోపనిషత్తు
16. జాబలోపనిషత్తు
17. హంసోపనిషత్తు
18. ఆరుణికోపనిషత్తు
19. గర్భోపనిషత్తు
20. నారాయణోపనిషత్తు
21. పరమహంస ఉపనిషత్తు
22. అమృతబిందు ఉపనిషత్తు
23. అమృతనాదోపనిషత్తు
24. అథర్వశిరోపనిషత్తు
25. అథర్వాశిఖోపనిషత్తు
26. బృహజ్జాబాలోపనిషత్తు
27. నృసింహతాపిన్యుపనిషత్తు
28. కళాగ్నిరుద్రోపనిషత్తు
29. మైత్రేయోపనిషత్తు
30. సుబాలోపనిషత్తు
31. క్షురికోపనిషత్తు
32. మంత్రికోపనిషత్తు

33. సర్వసారోపనిషత్తు
34. నిరలాంబోపనిషత్తు
35. శుకరహస్యోపనిషత్తు
36. వజ్రసూచ్యుపనిషత్తు
37. తేజోబిందూపనిషత్తు
38. నృసిందబిందూపనిషత్తు
39. ధ్యానబిందూపనిషత్తు
40. బ్రహ్మవిద్యోపనిషత్తు
41. యోగతత్వోపనిషత్తు
42. ఆత్మబోధోపనిషత్తు
43. నారదపరివ్రాజకోపనిషత్తు
44. త్రిశిఖిబ్రాహ్మణోపనిషత్తు
45. సీతోపనిషత్తు
46. యోగచూడామణ్యుపనిషత్తు
47. నిర్వాణోపనిషత్తు
48. మండల బ్రాహ్మణోపనిషత్తు
49. దక్షిణామూర్త్యుపనిషత్తు
50. శరభోపనిషత్తు
51. స్కందోపనిషత్తు
52 మహానారాయణోపనిషత్తు
53. అద్వయతారకోపనిషత్తు
54. రామరహస్యోపనిషత్తు
55. రామతాపిన్యుపనిషత్తు
56. వాసుదేవోపనిషత్తు
57. ముద్గలోపనిషత్తు
58. శాండిల్యోపనిషత్తు
59. పైంగలోపనిషత్తు
60. భిక్షుకోపనిషత్తు
61. మహోపనిషత్తు
62. శారీరకోపనిషత్తు
63. యోగశిఖోపనిషత్తు

64. తురియాతీతోపనిషత్తు
65. సన్యాసోపనిషత్తు
66. పరమహంస పరివ్రాజకోపనిషత్తు
67. అక్షమాలికోపనిషత్తు
68. అవ్యక్తోపనిషత్తు
69. ఏకాక్షరోపనిషత్తు
70. అన్నపూర్ణోపనిషత్తు
71. సూర్యోపనిషత్తు
72. అక్ష్యుపనిషత్తు
73. అధ్యాత్మోపనిషత్తు
74. కుండికోపనిషత్తు
75. సావిత్ర్యుపనిషత్తు
76. ఆత్మోపనిషత్తు
77. పశుపతబ్రహ్మోపనిషత్తు
78. పరబ్రహ్మోపనిషత్తు
79. అవధూతోపనిషత్తు
80. త్రిపురతాపిన్యుపనిషత్తు
81. శ్రీదేవ్యుపనిషత్తు
82. త్రిపురోపనిషత్తు
83. కఠరుద్రోపనిషత్తు
84. భావనోపనిషత్తు
85. రుద్రహృదయోపనిషత్తు
86. యోగకుండల్యుపనిషత్తు
87. భస్మజాబలోపనిషత్తు
88. రుద్రాక్షజాబలోపనిషత్తు
89. గణపత్యుపనిషత్తు
90. దర్శనోపనిషత్తు
91. తారాసారోపనిషత్తు
92. మహావాక్యోపనిషత్తు
93. పంచబ్రహ్మోపనిషత్తు
94. ప్రాణాగ్నిహోత్రోపనిషత్తు

95. గోపాలతాపిన్యుపనిషత్తు
96. కృష్ణోపనిషత్తు
97. యాజ్ఞవల్క్యోపనిషత్తు
98. వరాహోపనిషత్తు
99. శాట్యానీయోపనిషత్తు
100. హయగ్రీవోపనిషత్తు
101. దత్తాత్రేయోపనిషత్తు
102. గరుడోపనిషత్తు
103. కలిసంతారణోపనిషత్తు
104. బాల్యుపనిషత్తు
105. సౌభాగ్యలక్ష్మ్యుపనిషత్తు
106. సరస్వతీ రహస్యోపనిషత్తు
107. భహ్వృచోపనిషత్తు
108. ముక్తికోపనిషత్తు

దశోపనిషత్తులను చెప్పే ప్రామాణిక శ్లోకం:
ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః
ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా

❀ సిద్ధాంతకర్తలే స్వయంగా మరో ఉపనిషత్తును రచించడం జరిగింది. అలాంటి కొన్ని ఉపనిషత్తులను 1908వ సంవత్సరములో డా.ఫ్రెడ్రిక్ ష్రేడర్ అనే జర్మన్ భాషా శాస్త్రవేత్త కనుగొన్నాడు. అవి: బష్కళ, ఛాగలేయ, ఆర్షేయ మరియు శౌనక ఉపనిషత్తులు.
❀ కొత్త ఉపనిషత్తులు ముఖ్య ఉపనిషత్తుల్లోని అనుకరణలు అయి ఉండాలి అని వాదన ఉంది. ❀






## 15) అగస్త్య గీత కర్త – అగస్త్య మహర్షి

అగస్త్యుడు అనగానే సప్తసాగరాలను పుడిసిలి పట్టిన మహానుభావుడు "ఛులికీకృత సకల పాదోది పయస్కుడైన ముని"గా, వాతాపి ఇల్వల మర్దనుడిగా, వింధ్యాద్రి గర్వమడచిన లోకోద్ధారకునిగా రావణ సంహారానికి శ్రీరామునికి "ఆదిత్య హృదయం" బోధించిన మంత్రవేత్తగా, ఇంద్రుని భార్య శచీదేవిని పొందటానికి పల్లకీలో కూర్చుని సప్తర్షులను బోయీలుగా చేసుకొని వెళ్లిన గర్విష్టి నహుషుని కాలితో తన్ని త్రిశంకు స్వర్గంలో పడేసి గర్వమణచిన వానినిగా మహా పతివ్రతలోపాముద్రా వల్లభునిగా అందరికి తెలుసు. వేదకాలపు మహర్షి అగస్త్యుడు. ఆయన ఋగ్వేదంలో 1-65-నుండి 1-191 మంత్ర ద్రష్ట. తమిళ వాఙ్మయ పిత. తమిళ వ్యాకరణాన్ని "అగస్త్యం" అంటారు. అష్ట మహర్షులలో అగస్త్యుడున్నాడు. రామాయణ, మహా భారతాలలో అగస్త్యుని పాత్ర విశిష్టం. తమిళ శివమ్ లో అగస్త్యుని మొట్టమొదటి సిద్ధుడుగా భావిస్తారు శాక్తేయ, వైశ్వాలలో ఆయన పేరు తరచుగా వినిపిస్తుంది. అన్ని భారతీయ ప్రాచీన గ్రంథాలలో, దక్షిణాసియా ఆగ్నేయాసియా హిందూ దేవాలయాలలో ఆయన శిల్పాలు దర్శనమిస్తాయి. 11వ శతాబ్దికి చెందిన జావా భాషా సాహిత్యంలో ఆయన్ను ప్రాచీన గురు ఋషిగా పూజించినట్లు "అగస్త్య పర్వం"లో  ఉంది.

అగస్త్య మహర్షి వరాహ పురాణంలోని "అగస్త్య గీత" కర్త. స్కాందపురాణంలో "అగస్త్య సంహిత" ఉన్నది. "ద్వై ధ నిర్ణయం తంత్ర"లో ఆయన ప్రశస్తి ఉన్నది. ఆగస్త్యునికి "మన, కుంభజ, కుమ్భయోని, కలశజ  మైత్రావరుణి" అనే పేర్లు కూడా ఉన్నాయి. ఆయన అయోనిజుడైన మహర్షి. వరుణ, మిత్ర దేవతలు గొప్ప యజ్ఞం చేస్తే ఊర్వశి కనిపిస్తే చాంచల్యంతో ఇంద్రియాన్ని కారిస్తే అది ఒక మట్టి కుండలో పడి అగస్త్య మహర్షిగా ఆవిర్భవించాడని పురాణ కథనం. అగస్త్య అంటే అవిసె అనే పేరుంది. అగస్త్య నక్షత్రం ఆకాశంలో దర్శనమిచ్చినప్పుడు అవిసె పువ్వులు తింటే మంచి ఆరోగ్యం కలుగుతుంది. చీకటిలో కాంతి నిచ్చేదే అగస్త్యం.

మహారాష్ట్రలో నాసిక్ వద్ద గోదావరీ తీరాన అగస్త్యాశ్రమం ఉంది. అక్కడే అగస్త్యపురి, అక్షోలా పట్టణాలున్నాయి. ఉత్తరాఖండ్‌లో రుద్ర ప్రయాగ వద్ద అగస్త్యముని తపస్సు చేసిన ప్రదేశం ఆయన అర్చించిన శివలింగం, గుడి ఉన్నాయి. ప్రక్కనే పరవళ్ళు తొక్కుతూ అలకనందా నది ప్రవహిస్తుంది. 1997లో మేము కేదార్నాద్, బద్రీ నాద్ యాత్రలు చేసినప్పుడు ఈ గంగలో స్నానం చేసి తడిబట్టలతో నేనూ మా బావ శ్రీ వివేకానంద్ గారూ పై శివాలయంలో నమక చమకాలతో స్వయంగా అభిషేకం చేశాం మా జన్మ ధన్యం అనిపించింది. తమిళ్ నాడులో తిరునల్వేలి, తంజావూర్ మొదలైన చోట్ల ఆయన ఆశ్రమాలు కనిపిస్తాయి. క్రీశ బౌద్ధ గ్రంథాలలో అగస్త్యుని పేరు కనిపిస్తుంది. 10వ శతాబ్ది హిందూ గ్రంథం "అగస్తి మతం" అగస్త్యుడు రాసినట్లు అందులో ముత్యాలు పగడాలు వజ్రాలు మొదలైన విలువైన వాటి లక్షణాలు చెప్పబడినట్లు ఉన్నది.❁



## 16) గృహ్యా సూత్రకర్త - అశ్వలాయన


శౌనక మహర్షి శిష్యుడు అశ్వలాయనుడు మానవ జన్మ సంస్కారాలకు కొన్ని సూత్రాలు చెప్పాడు. ఇది నాలుగుభాగాల గ్రంథం. మొదటిభాగంలో గృహకృత్యాలు అగ్నిప్రతిష్టాపన, వివాహం అగ్నిహోత్రం, పురుష సంతానం కలగటానికి చేయవలసిన విధులు, జన్మ సంస్కారాలైన నామకరణం చెవులు కుట్టటం, అన్నప్రాసన విధానాలున్నాయి. రెండవభాగంలో-10 విభాగాలున్నాయి. అందులో శ్రావణ ఆశ్వయుజ మార్గశిర, మాసాలలో పౌర్ణమి నాటి విధులు హేమంత, శిశిరాలలో నాలుగు కృష్ణపక్షణాలలో చేయాల్సిన అష్టక విధానం ఉంటాయి.

మూడవదానిలో- అగ్ని హోత్రంలో వ్రేల్చాల్సిన పదార్ధ వివరణ విధానం, వేదమంత్ర ఉచ్చారణ పద్ధతి, అష్టక విధానం రథప్రయాణం ఇంటి నిర్మాణం వగైరా వివరాలున్నాయి. నాలుగవదానిలో- 9 విభాగాలలో అంత్యక్రియల విధానం చెప్పబడింది. ❁



## 17) శ్రౌత సూత్రకర్త – బోధాయన

వేద మంత్రాలను నిత్య విధులలో అంటే "కల్పం"లో ప్రయోగించే సూత్రాలు అన్నమాట. ఇవి బ్రాహ్మణాల కాలంలో వచ్చాయి. వేదలో చెప్పిన యజ్ఞ విధులు నిర్వహించటానికి నిర్మించే అగ్నిహోత్ర వేదిక నిర్మాణాలకొలతలను చెప్పే వాటిని సులభ సూత్రాలు అంటారు. సులభ అంటే కొలిచేతాడు అన్నమాట. సులభ సూత్రం గ్రంథాలు 5 మాత్రమే మిగిలాయి. బోధాయనుడు రాసిన బోధాయన సులభ సూత్రాలు, కాత్యాయనుడు చెప్పిన కాత్యాయని సులభ సూత్రాలు.❀




## 18) ఆపస్తంభ సూత్ర కర్తలు – ఆపస్తంభ మహర్షి మొదలైనవారు

ఆచారాలు పండుగలు విధులు చట్టం న్యాయం ధర్మ మొదలైనవాటిపై విస్తృతంగా చర్చించి రాసిన వారిలో మొట్టమొదటివారు ఆపస్తంభ మహర్షి. తరువాత గౌతమ, బోధాయన, వసిష్ఠ మహర్షులు చెప్పారు. ఇవే అతిప్రాచీన ధర్మ సూత్రాలు.❀

## 19) ఋగ్వేద ప్రాతిశాఖ్యకర్త - శౌనక మహర్షి

అథర్వ వేదంలో శౌనక శాఖకు ఆద్యుడు శౌనక మహర్షి. సంస్కృత వ్యాకరణానికి ఆద్యుడు. ఋగ్వేద ప్రాతిశాఖ్యకు కర్త. దీనికే బృహద్దేవత లేక చరణ వ్యూహం అనిపేరు. ఇదిగాక ఋగ్వేదంలో 6 అనుక్రమణికలు ఆయనవే. అశ్వలాయన, కాత్యాయనుల గురువు ఈయనే. ఋగ్వేదంలోని భాస్కల శకల శాఖలను ఏకీకృతం చేసినవాడు. ఈయనకే వేదకాలపు గృత్సమదకు సమానుడు అంటారు. ఈయన కుమారుడే శౌనకుడు. మానవ జీవితంలోని నాలుగు స్థాయిలున్నాయని చెప్పినవాడు. సూత మహర్షి వద్ద శౌనక మొదలైన మహర్షులు నైమిశారణ్యంలో ఎన్నో పురాణాలు విన్న సంగతి మనకు తెలుసు.

12 రోజులు జరిపే సత్రయాగంలో శౌనకుడు ఋగ్వేద ప్రాతిశాఖ్యను నైమిశారణ్యంలో తానే కర్త కనుక దానిని మహర్షులకు బోధించాడు. ఈ విషయాన్ని ఋగ్వేద ప్రాతిశాఖ్యకు ఉవటుడు రాసినవ్యాఖ్యానంలో ఉన్నది. మహాభారతం కథలను శౌనకునికి ఉగ్రశ్రవ సౌతి నైమిశారణ్యంలో బోధించినట్లు భారతంలో ఉంది. ❀



## 20) పరాశర స్మృతి, పరాశర హోర గ్రంథ రచయిత – పరాశర మహర్షి

శక్తి మహర్షికుమారుడు, వసిష్ఠర్షి మనవడు వ్యాసమహర్షికి తండ్రి పరాశర మహర్షి భార్య సత్యవతి. అద్వైత గురు పరంపరకు ఆద్యుడు. తండ్రి చిన్నప్పుడే చనిపోవటంతో పరాశరుడు తాత వశిష్ఠుని వద్ద పెరిగాడు. పరాశర ఆశ్రమంపై జరిగిన దాడిలో ఆయన కాలు దెబ్బతిని కుంటివాడయ్యాడు. ఒకసారి దట్టమైన అడవిలో కుంటుకుంటూ నడుస్తుంటే అడవి నక్కలు ఆయనపై పడి చంపేశాయని ఐతిహ్యం.

ఋగ్వేదంలో అగ్నిదేవుని స్తుతించే 1–65–73 మంత్రం. సోముని స్తుతించే 9–97 మంత్రం ద్రష్ట పరాశరామునియే–"దేవో నా యహ సవితా సత్య మన్మా క్రత్వా నిపాతి విజనాని విశ్వా– పురు ప్రశస్తో అమతిర్న సత్యా ఆత్మేవ సేవో దిది షయ్యో భూత్" భావం –ఎవరు సూర్య దేవునిలా, సత్యం తెలిసి చేతలు దాచి ప్రకృతిలాగా ఉంటాడో వాడు మార్పు చెందని మనసుతో ఆనంద సుఖాలను నిత్యం అనుభవిస్తాడు.


పరాశర మహర్షి రుగ్వేద మంత్రం ద్రష్ట మాత్రమేకాదు "పరాశర స్మృతి", "పరాశర సంహిత", జ్యోతిశ్శాస్త్రమైన "బృహత్ పరాశర హోర", వృక్షాయుర్వేదం మొదలైన గ్రంథాలు రచించాడు. పరాశరుడు అంటే "పరాశయణా తి పాపా తీత పరాశర" అంటే పరాశర ముని దర్శనం, నామ స్మరణం సమస్త పాప క్షయకరం. పరాశర మహర్షికి దేవాలయాలు హిమాచలప్రదేశ్‌లో మండి జిల్లాలో, మిగిలిన చాలాచోట్ల ఉన్నాయి. ❁



## 21) ఋగ్వేద 5వ మండల మంత్రద్రష్ట, త్రిమూర్తుల తండ్రి - అత్రి మహర్షి

సప్త ఋషులలో అత్రి మహర్షి మొదటివాడు పతివ్రత అనసూయా దేవికి భర్త. ఈ దంపతుల కుమారులే దత్తాత్రేయ దుర్వాస, సోమలు. అత్రిమహర్షి తపస్సుకు మెచ్చిన త్రిమూర్తులు బ్రహ్మ విష్ణు మహేశ్వరుడు ప్రత్యక్షమై వరం కోరుకోమనగా వారు తమకు సంతానంగా జన్మించాలని కోరాడు.

ఋగ్వేదంలోని 5వ మండలం ఉన్న 87 మంత్రాల ద్రష్ట అత్రిముని. ఇవి అగ్ని, ఇంద్ర, విశ్వ దేవ, మిత్ర–వరుణ, మరుత్తుల అశ్వినీ దేవతల స్తుతి మంత్రాలు. రెండేసి మంత్రాలు ఉషా, సావిత్రి లనుద్దేశించినవి. వీటినన్నిటిని "ఆత్రేయసం" అంటారు. రామాయణంలో సీతారామ లక్ష్మణులు అత్రిమహర్షి ఆశ్రమం సందర్శించి ఆశీస్సులు అందుకున్నారని తెలుసు. పురాణాలలో అత్రిపేరు సుప్రసిద్ధం వైఖానస ఆగమాలలో అత్రి ప్రాధాన్యం ఉంది. "అత్రి సంహిత"లో యోగ, నీతి ధర్మవిషయాలున్నాయి. ఇతరులకు అపకారం చేయకపోవటం బాధించకపోవటం దమము. ఉన్నదానితో కొంత ఇతరులకు సహాయం చేయటం దానము. అవతలివాడి దుఃఖాన్ని బాధను అర్ధం చేసుకొని సానుభూతి సహకారం అందించటం దయ. ❁




## 22) అష్టా వక్ర గీత కర్త – అష్టావక్రమహర్షి

"అష్టావక్ర గీత" జనక మహారాజు ఆస్థానంలో అష్టావక్ర మహర్షికి. జనక మహారాజుకు మధ్య జరిగిన అద్వైత విషయం చర్చ. ఇందులో 20 అధ్యాయాలున్నాయి. అవి సాక్షి, ఆశ్చర్యం, ఆత్మా ద్వైత, సర్వమాత్మా, లయ, ప్రకృతేహ్ పరా, శాంటా, మోక్ష, నిర్వేద, వైరాగ్య, చిద్రూప, స్వభావ, యథాసుఖం, ఈశ్వర, తత్త్వం, స్వాస్థ్యము, కైవల్య, జీవన్ముక్తి, స్వమహిమ, ఆకించభావం.

8 రకాల అంగ వైకల్యం ఉన్నవాడు అష్టావక్రుడు. మాతామహుడు అరుణి. తాతవద్దే అతని తల్లి సుజాత తండ్రి కహోదలు  కొడుకు కూడా వేద విద్య నేర్చారు. అష్టావక్రుడు తల్లిగర్భంలో ఉండగానే తాత గారు చదివే వేద మంత్రాలు విని స్వరంతో సహా చక్కగా పలకటం నేర్చుకున్నాడు. ఒక రోజు తండ్రి కహోదుడు వేద మంత్రాన్ని అపస్వరంతో పలుకుతూ ఉంటె గర్భస్థ శిశువైన అష్టావక్రుడు దాన్ని సరిచేసి సరైన స్వరంతో పలికాడు. ఆగ్రహోదగ్రుడైన తండ్రి పుట్టే కొడుకుని అష్ట వంకరలతో పుట్టాలని శపించాడు. అలా పుట్టినవాడే అష్టా వక్రుడు. మహాజ్ఞాన సంపన్నుడైన అష్టావక్రుడు గొప్ప మహర్షి అయ్యాడు. అద్వైత భావజాలాన్నిఅష్టావక్ర సంహిత లేక అష్టావక్ర గీతలో పొందుపరిచాడు. అష్టావక్ర గీతలో ఒకటి రెండు శ్లోకాలు చూద్దాం–

1– "కథం  జ్ఞాన మవాప్నోతి కథం  ముక్తిర్భవిష్య తి –వైరాగ్యం చ కథం ప్రాప్త మేతత్ బ్రూహి మామ ప్రభో ''

2– "ముక్తి మిచ్ఛన్ని కేతత్ విషయాన్ వివశ్వరన్ క్షమా ర్జవర – యశో సస్త్వం పోష్యమావజ"
అష్టావక్రుడు తండ్రితో ఒకసారి జనక సభకు వెళ్లి అక్కడ అద్వైత చర్చలను చూసి వారికేమీ రాదనీ చెప్పాడు నువ్వు చెప్పగలవా అంటే చెప్పగలనని, అయితే తాను ఉండే చోటుకు వస్తే చెబుతానన్నారు. అలాగేనని అరణ్యంలో ఆయన ఉండే చోటును వెతుక్కుంటూ వెళ్ళాడు జనకుడు. దూరంగా ఆయన్ను చూడగానే గుర్రం కాలు పైకెత్తిఆగి పోయింది. అప్పుడు అదే భంగిమలో ఉన్న జనకునికి ఆత్మ బోధ చేశాదని ఒక కథ ఉంది.❀



## 23) భృగు సంహిత జ్యోతి శ్శా స్త్ర కర్త – భృగు మహర్షి

సప్తర్షులలో ఒకరైన ప్రజాపతి భృగు మహర్షి బ్రహ్మ మానస పుత్రుడు. భృగు సంహిత అనే మొట్టమొదటి జ్యోతిష శాస్త్రాన్ని రచించాడు. జాతక చక్రాలు వేయటం దాన్నిబట్టి బిడ్డ గుణగణాలు వృత్తి వ్యాపారాలు తెలియజేయటం వంటివి అన్నీ అందులో ఉన్నాయి మనువుకు సమకాలీనుడు. దక్షుని కుమార్తె ఖ్యాతిని పెళ్ళాడి దాత, విధాత అనే కుమారులను శ్రీ అంటే లక్ష్మీదేవి అనే కుమార్తెకు తండ్రి అయ్యాడు. శుక్రాచార్యుడు, చ్యవన మహర్షి కూడా భృగుమహర్షి కుమారులే.❀



## 24) మృత సంజీవని విద్యావేత్త - శుక్రాచార్యుడు

రాక్షస గురువైన శుక్రాచార్యుడు మృత సంజీవనీ విద్యావేత్త. దేవగురువు బృహస్పతి కుమారుడు, అంగీరసుని మనుమడు అయిన కచుని దేవతలు ప్రేరేపించి శుక్రునివద్ద మృతసంజీవినీ విద్య నేర్చుకొని రమ్మని పంపటం, అతడు వచ్చి గురువు కుమార్తె దేవయాని ప్రేమలో పడటం శుక్రుడు బాగా మద్యం తాగి కచుని చితా భస్మాన్ని అందులో కలుపుకొని తాగటం, అప్పుడతనికి మృతసంజీవనీ విద్య నేర్పి బయటికి వచ్చేట్లు చేసి దానితో తానూ మళ్ళీ బ్రతకటం, అప్పటి నుంచి సురాపానం నిషిద్ధం చేయటం మనకు తెలిసిన కథయే. కనుక మొట్టమొదటి మద్య నిషేధ శాసన కర్త శుక్రాచార్యుడే.

శుక్రుడు నవగ్రహాలలో ఒకడు వివాహ కారకుడు. శుక్ర అంటే ప్రకాశం, స్వచ్ఛత అని అర్థం. బలి చక్రవరి వామనుడికి మూడడుగులు దానం చేస్తున్నప్పుడు వద్దని శుక్రుడు వారించినా ఒప్పుకోకపోతే రాజును రక్షించే నెపంతో కమండలంలోని నీటిలో దాగి ధార పడకుండా ఆపితే, దర్భ పుల్లతో పొడిచి కన్ను పోగొట్టాడు వామనుడు అప్పటినుంచి శుక్రుడు ఒంటి కంటివాడు - "ఏకా కన్నయ్య" అయ్యాడని మనకు తెలుసు.

శుక్రాచార్యులు మానవ జీవితానికి కావాల్సిన పాటించాల్సిన నియమాలను చెప్పాడు దానినే "శుక్ర నీతి శాస్త్రం" అంటారు. అందులో కొన్ని- 1-అమ్మాయి పేరు చెబితేనే వంకర్లు తిరిగిపోతారు అలాంటిది అందమైన అమ్మాయి కదిలించే కనురెప్పల సొగసు ఎందుకు చూడరు 2-తెలివైన మహిళ చక్కగా వంట చేసి హాయిగా తిని బాగా మాట్లాడి మగవాడి మనసు ఎందుకు దోచుకోదు 3- పరస్త్రీ వ్యామోహం వినాశహేతువుకనుకనే ఇంద్ర, నహుష రావణాదులు నశించారు. 4-రాజుకు పర స్త్రీ వ్యామోహం, పరధనాపేక్ష, కోపంతో శిక్షించటం పనికిరావు. వ్యామోహం, అపేక్ష క్రోదాలు పతన హేతువులు వగైరా. ❀



## 25) భక్తి సూత్ర కర్త – నారద మహర్షి

దేవఋషి నారదు విష్ణుమూర్తికి మహాభక్తుడు త్రిలోక సంచారి. మహతి ఆయన వీణ పేరు. భక్తిలో తరించటానికి “నారద భక్తి సూత్రాలు” చెప్పాడు. అవి అందరికి ఆచరణీయాలే. అజ్ఞానంలో ఉన్నవారికళ్ళు తెరిపించి జ్ఞానమార్గంలో పెట్టటమే ఆయన చేసేపని. ఆయన లేని పురాణం ఇతిహాసాలు లేవు. దివి భువి సంధానకర్త నారదుడు నారం దదాతి నారదః అంటే జ్ఞానాన్ని ఇచ్చేవాడు. నారం అంటే నీరు అనే అర్ధమూ ఉంది విష్ణువుకు నారదునికి అభేదం.

భక్తి ఉద్యమకారుడు నారదుడు. భక్తియోగం ఆయన చెప్పిన సిద్ధాంతం అందుకే భక్తి సూత్రాలు రాశాడు. ఇందులో నవవిధ భక్తిమార్గాలను తొమ్మిది అధ్యాయాలలో 84 శ్లోకాలలో తెలియబరచాడు. కొన్ని శ్లోకాలు చూద్దాం–

1– ఆదాతో భక్తి వ్యాఖ్యాస్యామః –2–సా త్వస్మిన్ పరమ ప్రేమ రూపా 3–అమృతస్వ రూపాచ 4–యల్లబ్ద్వా పుమాన్ సిద్ధో భవతి అమృతో భవతి తృప్తో భవతి 5–యత్ర్పాప్యకించి ద్వాంఛతి న శ్రోచ చతి, న ద్వేష్టి న రమతే నొసమాహి భవతి”

వీటన్నిటిభావం– భక్తి గురించి ఇప్పుడు తెలియజేస్తా. అది పరమపురుషుని తెలిపే గొప్ప ప్రేమ మార్గం. అలౌకికమైనది అది తెలిస్తే సంపుర్ణమైన సంతృప్తితో మోక్షం. ప్రేమను పొందినవాడు దేనినీ కోరదు, దీనిగురించి బాధపడదు దేనినీ ద్వేషించదు, దేనితోనూ తృప్తి ఆనందం పొందదు.

భక్తి మార్గాన్వేషకులకు నారద భక్తి సూత్రాలు “భక్తి వేదమే”.❀



## 26) ఋభు గీత చెప్పిన - ఋభుడు

పరమ శివుడు తన అంతే వాసి "ఋభు" మహర్షికి "శివరహస్యం" చెప్పాడు దీనినే "ఋభు గీత" అంటారు. ఋభు గీతను ఋభుడు తన శిష్యుడు "నిదాఘ మహర్షి"కి బోధించాడు. ఆయన శిష్యులకు బోధించగా అది లోకంలో వ్యాప్తి చెందింది. ఋభు గీతను భగవాన్ రమణ మహర్షి తన ప్రవచనాలతో తరచుగా ప్రస్తావించేవారు. అదంటే ఆయనకు ప్రాణం. 122 శ్లోకాలున్న ఋభు గీత తమిళంలో ముందు తర్వాత హిందీ ఇంగ్లీష్ తెలుగు భాషల్లోకి వ్యాఖ్యానాలతో వెలువడింది. అందులోని సారాంశం కొంత తెలుసుకొందాం- విశ్వం సృజింపబడింది, అభివ్యక్తమైంది నశించేది కాదు. పరిశుద్ధ చైతన్యం నిశ్చలమైనది. రూపాలు పేర్లూ అన్నీ ఛాయా మాత్రాలు విశ్వంలో ద్వంద్వాలున్నాయని కొందరు అంటారు. మనసుకు ఇంద్రియాలకు భేదం ఉన్నదా? మనసు లేకుండా అవి పని చేయగలవా? మనసు అంటే అనేక ఆలోచనల కట్టయే కదా. అవి నిశ్చల సముద్ర తరంగాలులాగా నిశ్చల అద్వితీయచైతన్యంలో స్పందనలే అని తెలుసుకొంటే మనసు స్థిరంగా ఉంటుంది.❀




## 27) న్యాయ సూత్రకర్త - గౌతమ మహర్షి

అక్షపాద గౌతముడు అని పిలువబడే గౌతమమహర్షి "న్యాయ సూత్రాలు" రచించాడు. అందువల్ల వీటిని "గౌతమ న్యాయ సూత్రాలు" అంటారు. ఇందులో 5 విభాగాలలో 528 సూత్రాలున్నాయి. జ్ఞాన మీమాంస, ఆధి భౌతిక, కారణం నిబంధనలు మొదలైన వాటిపై చెప్పిన సుత్రాలివి. వీటిలో వేద సంబంధ క్రతుక్రమాలేవీ లేవు. మొదటి భాగంలో ఉపోద్ఘాతం ,16 రకాల జ్ఞాన వివరాలు రెండవ భాగంలో ప్రమాణ, మూడవదానిలో ప్రమేయం, మిగతా రెండిటిలో వీటి గురించి తెలుసుకొనే విపులమైన వివరాలు ఉంటాయి. న్యాయ సంప్రదాయానికి ఇదే ఆధార భూతమైన గ్రంథం. న్యాయ సూత్రాలతో తర్క విద్య, వాద విద్యలపై విస్తృత చర్చ ఉంది. వైశేషిక జ్ఞనమీమాంస, ఆధి భౌతిక విషయాలపై సమగ్ర వివరాలున్నాయి. ఈ న్యాయ సూత్రాలపై తరువాత కాలంలో అనేక వ్యాఖ్యానాలు వచ్చాయి. అందులో వాత్సాయనుడు క్రీ.శ. 450-500లోను, 6, 7- శతాబ్దాలలో ఉద్యోతడు రాసిన న్యాయవార్తిక, 9వ శతాబ్దంలో వాచస్పతి రాసిన తాత్పర్య టీకా, 10వ శతాబ్దంలో ఉదయుని తాత్పర్య పరిశుద్ధి, జయంతుని న్యాయ మంజరి ప్రసిద్ధమైనవి.

ఈ న్యాయ సూత్రాలలో ప్రత్యక్ష అనుమాన ఉపమాన శబ్ద ప్రమాణాలపై విస్తృత చర్చ ఉంది. మొదటి భాగంలో సరైన చర్చా విధానానికి- ప్రతిజ్ఞ (ప్రతిపాదన), హేతు (కారణం) ఉదాహరణ, ఉపనయ (అనువర్తనం-అప్లికేషన్), నిగమన (నిర్ధారణ) ఉండాలని చెప్పాడు. ఇవికాక అనుమానం, దోషాలు, హేత్వాభాస సూత్రాలు కారణ సూత్రాలు,వ్యతిరేక సూత్రాల వివరణ ఉంది.

పూర్వపు న్యా సూత్రాలతో ఈశ్వరుడు సృష్టికర్త అని ఆయన వరాలు ఆశీస్సులు అందిస్తాడని చెప్పాయి.

సిద్ధాంతం- ఈశ్వరః కారణం పురుషకర్మ ఫల్య దర్శనాత్
పూర్వ పక్షం -న ,పురుష కర్మ భావే ఫేలా నిష్పం తే
సిద్ధాంత సూత్రహ్ -తత్కారితత్వా దహేతుహు
గౌతమ న్యాయ సూత్రాలు వేదాంత తత్వ శాస్త్రానికి దారి చూపాయి
గౌతమ న్యాయ సూత్రాల అంతిమ ధ్యేయం మోక్షం పొందటమే - దానికి అనుసరించాల్సిన సోపానాలు -ప్రమాణ, ప్రమేయ, సంశయ, ప్రయోజన దృష్టాంత, సిద్ధాంత, అవయవ, తర్క , నిర్ణయం వాద, జల్ప, వితండ, హేత్వాభాస, చల, జాతి, నిగ్రహస్థానాలు.❁



## 28) ఋగ్భాష్య మను సూత్రకర్త - దేవలుడు

దేవలుడు దేవతలకు మనుష్యులకు చక్కని వస్త్రాలు నేసేవాడే కాక దీనికోసం అనేక అవతారాలెత్తినవాడు. అంతేకాదు ఆమోదనగరం రాజధానిగా రాజ్యపాలన చేసిన మహారాజు. వేదాంతాన్ని ధర్మాన్ని బోధించినవాడు. అనేక గ్రంథాలు రచించినవాడు దేవలుడు. దేవల అవతారమే కాక విద్యాధరమొదలైన అవతారములు దాల్చినవాడు.

దేవలుని విద్యాధర అవతారంలో రచించిన గ్రంథ పరంపర -ఋగ్వేద భాష్య, మనుసుత్ర సంధ్యాభాష్య, మనుస్మృతి, దేవలోపనిధి దేవరాజ ఛందస్, దేవల-జెమినివద, వర్ణాశ్రమ మహోదధి, బ్రహ్మ సూత్రం నిఘంటు, మనుజ్ఞాన శిక్షా మణి మూడవది అయినపుష్పదంతుని అవతారంలో -శివ మహిమ్న స్తోత్రం, మేరు చరిత్ర వేదాంత కుష్, బ్రహ్మోపదేశ సిద్ధాంత, దేవీ భాగవత దేవ రత్నాకర, దేవ రాజా శేఖర, ఉత్తర మీమాంస, సుజన దీపికా రాశాడు.

నాలుగవది అయిన భేతాళ అవతారంలో-చతుస్సాశాస్త్ర సూత్రం, ధనుష్ శాస్త్ర, భేతాళ పంచతంత్ర, భేతాళాఖ్యాన, భూ సూక్త, స్మర శాస్త్ర మల్లసాధన నిర్ణయం, మల్ల భైరవ నిర్ణయం, మహా భైరవ సూక్త, మంత్రం శాస్త్రం.

అయిదవదైన వరరుచి అవతారంలో- ప్రకృతిర ప్రత్యక్ష సూత్రం తత్వ నిఘంటు, కథా గణిత శాస్త్ర, చంద్ర సిద్ధాంత సూర్య సిద్ధాంత, త్రిలింగ దత్తమీమాంస, శృతి షట్ సూత్రం నిర్ణయం, కౌముది శబ్ద శాస్త్ర, వాస్తవ్య నిర్ణయం, భగ శాస్త్ర, యోని తంత్ర, ఛంధోజ్ఞానం, సంధి సూత్రం, కారణ న్యాయ బోధిని , నర పింగళిశాస్త్ర, లక్షణ శాస్త్ర, స్వర శాస్త్ర, వేదాగమలాయుర్వేద, ఏతద్వింశతి శాస్త్రం.

ఆరవదైన దేవ శాలి అవతారంలో - పరమాన్య వధ, సుజ్ఞాన దీపికా, జ్ఞాన మంజరి, సుజ్ఞాన రత్నమాల, సద్వాద జ్ఞాన మంజరి, పంచ శిఖా నిర్ణయం, దేవా కల్ప తి మదర్పణ, ఊర్వాపరా ప్రయోగ, దేవ రహస్య, సత్కర్మ జ్ఞాన ప్రబోధకం ఏడవదైన దేవ దాస అవతారంలో వచనాలు రాశాడు.❀



## 29) అను గీత విని చెప్పిన – వైశంపాయన

మహా భారతంలో అశ్వమేధ పర్వంలో "అనుగీత" ఉంది అను అంటే అనుసరించినది అని అర్థం. అంటే కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునునికి శ్రీకృష్ణుడు చెప్పినది భగవద్గీత. యుద్ధం అయ్యాక కొంతకాలానికి అర్జునుడు తాను కృష్ణుడు చెప్పిన భగవద్గీతను మర్చిపోయానని, మళ్ళీ ఒక సారి చెప్పమని కోరగా అది అసాధ్యమని కానీ దానికి అనుసంధానంగా కొన్ని విషయాలు చెబుతానని చెప్పిందే అనుగీత. దీనిని వైశంపాయనుడు విని లోకంలో ప్రచారం చేశాడు. ధర్మ నీతి మొదలైనవాటి గురించి అనుగీతలో పరమాత్మ తెలియజేస్తాడు. ఉపనిషత్తులలో ముఖ్య విషయాలన్నీ ఇందులో ఉంటాయి. భార్యాభర్తల మధ్య ఉన్న చర్చలో మానవ శరీర నిర్మాణం జనన మరణాలు, దేహంలోని దేవతల వివరాలున్నాయి. అధ్వర్యునికి సన్యాసికి మధ్య సంభాషణలో జంతుబలి దానిపూర్వాపరాల విశేషాలున్నాయి. గురుశిష్య సంవాదంలో అత్యున్నతమైన సత్యం గురించి వివరణ ఉంది. తర్వాత ధర్మ యుద్ధం యుద్ధనీతి అహింస మొదలైన వివరాలుంటాయి. ఉత్తమ వ్యక్తి అనుసరించాల్సిన విధానాలన్నీ అనుగీతలో పొందుపరచ బడినాయి. ఇవికాక ఆనందం సుఖం అణకువ. జ్ఞానోదయం, భయరాహిత్యం, సంతృప్తి నమ్మకం, క్షమా ధైర్యం అపకారం చేయకపోవటం, సమానత్వం అహింస, అక్రోధనం, పగ ఈర్ష, ప్రతీకారేచ్ఛ, అసూయ మున్నగు విషయాల వివరణ ఉంది.


అనుగీత 36 భాగాలలో ఉంది. శంకరాచార్య, విజ్ఞాన భిక్షుల దృష్టిని అనుగీత ఆకర్షించింది. ❁



## 30) త్రిపురా రహస్య కర్త – హరితాయన

దత్తాత్రేయమహర్షి పరశురాముని బోధించిన అద్వైత తత్వమే త్రిపురా రహస్యం. ఒకరకంగా ఏ రహస్యము లేనిది అని అర్ధం. త్రిమూర్త్యాతీతమైన విషయం అని భావం. త్రిపురాలు అంటే మూడు పట్టణాలు మాత్రమేకాదు–జాగృతి, స్వప్న సుషుప్తులు. వీటిలోని అంతశ్చేతననే "శ్రీ త్రిపుర సుందరి" అంటారు. ఆమెయే మాతృమూర్తి చండిక. ఈ గ్రంథం అత్యున్నత ఆధ్యాత్మిక సత్యాన్ని బోధిస్తుంది. ఈ తత్వాన్ని పరమ శివుడు విష్ణుమూర్తికి బోధిస్తే, ఆయన మానవ రూపంలో దత్తాత్రేయ అవధూతగా జన్మించి పరశురాముని బోధిస్తే, ఆయన హరితయానుడికి చెప్పాడు. దత్తాత్రేయ, పరశురాముల సంవాదమే త్రిపురారహస్యం. దీనికే "హరితాయన సంహిత" అనే పేరుంది. హరితాయనుడు హరితుని కుమారుడు. ఈ గ్రంథం 3 ఖండాలలో 12 ,000 శ్లోకాలలో ఉంటుంది. మొదటిఖండం మహాత్మ్య ఖండం రెండవది జ్ఞాన ఖండం మూడవది చర్య ఖండం. అత్రి ముని అనసూయ దంపతుల ప్రార్ధనమన్నించి త్రిమూర్తులలో బ్రహ్మ చంద్రుడుగా శివుడు దూర్వాసమహర్షిగా, విష్ణువు నారాయణుడు అనే దత్తాత్రేయునిగా జన్మిస్తారు. జమదగ్ని రేణుకాదేవి దంపతుల కుమారుడు పరశురాముడు తండ్రి ఆజ్ఞతోతల్లిని చంపి దేశంలో క్షత్రియ వంశ నిర్మూలనకు దిగి, శ్రీరాముని చేతిలో పరాభవం పొంది గర్వం ఖర్వమై హిమాలయాలకు వెడుతూ దారిలో బృహస్పతి తమ్ముడైన అవధూత సంవర్తుని దర్శించగా దత్తాత్రేయుని శరణు వేడమని హితవు చెబుతాడు. దత్తాత్రేయునికి పరశురాముని జరిగిన జ్ఞాన సంవాదంలో వెలువడింది త్రిపురా రహస్యం. దీనితో ఆత్మ జ్ఞానం పొందిన పరశురాముడు మలయ పర్వతాలలో తపస్సులో కాలం గడిపాడు. దీనికి ఇంగ్లిష్ అనువాదాలు చాలా ఉన్నాయి. తెలుగులోనూ అనువాదాలు వచ్చాయి. మచిలీపట్నం జాతీయకళాశాల ప్రిన్సిపాల్ డా. శ్రీ భాగవతుల కుటుంబరావు గారు అద్భుత వ్యాఖ్యానం తెలుగులో చేశారు. దీనిని నాకు మా రెండవ కోడలు, మా అబ్బాయి శర్మ భార్య శ్రీమతి ఇందిరా మాతామహులు స్వర్గీయ శ్రీ నోరి సోమయాజులుగారు తతాము రాసిన అమూల్య గ్రంథాలతోపాటు బహూకరించారు. ఒకటి రెండు శ్లోకాలు చూద్దాం–

"ఏకైక భావ తుష్టై కర సైకత జనప్రియ –ఏ దమానప్రభా వైదర్భక్త పాతకనాశినీ ఏలామోద ముఖై నౌద్రి శక్రాయుధ సమాస్థితః –ఈహాశూన్యే ప్సితే శాది సేవ్యే శానా వర్గాతా"❁




## 31) శ్రీ మద్రామాయణ కర్త - ఆదికవి వాల్మీకి మహర్షి

వాల్మీకి సంస్కృత సాహిత్యంలో పేరెన్నికగల కవి– రామాయణాన్ని వ్రాశాడు. ఈయన్ని సంస్కృతభాషకు ఆదికవిగా గుర్తిస్తారు. ఇతడే శ్లోకమనే ప్రక్రియను కనుగొన్నాడు. ప్రచేతసుని పుత్రుడు కాబట్టి అతడు ప్రాచేతసుడు అని కూడా ప్రసిద్ధం.

**జీవిత విశేషాలు**

మహర్షి వాల్మీకి ఎవరు? వల్మీకము నుండి వెలుపలికి వచ్చిన వారు కావున వాల్మీకి. మరామరా అని తపస్సుచేసిన వారు కావున మహర్షి, రాముడి జీవిత చరిత్రను రామాయణముగా మహాకావ్యరచన గావించి నవాడిగా ఆదికవి అయ్యాడు. అయితే వాల్మీకి జన్మము ఎట్టిది? ఆయన తల్లితండ్రులు ఎవరు? అనే విషయ ము పై అనేక తర్జనభర్జనలు, కట్టుకథలు ప్రాచుర్యములో ఉన్నాయి. ఏ రచయత అయినా తన గురించి ఉపోద్ఘాతము, పరిచయము తదితర అంశములలో తెలుపుకోవటము ఈ నాటి రచయతలు పాటిస్తున్న విధానము. వేదవ్యాసుడు తాను మత్స్యగంధి, పరాశరుల కుమారుడనని తన రచనలలోనే చెప్పుకోవడముతో వ్యాసుడు ఎవరన్నది కచ్చితముగా తెలిసింది. అదేవిధముగా రచయతగా తాను ఎవరన్నది ప్రత్యేకముగా వాల్మీకి వ్రాయనప్పటికీ సందర్భానుసారముగా సీతను రాముడికి అప్పచెబుతున్న సమయములో ఉత్తరాకాండ - రామాయణములో వాల్మీకి ఇలా అన్నారు. “రామా నేను ప్రాచేతసుడను ప్రచేతసుడి ఏడవ (దశమ) కుమారుడిని. వేలసంవత్సరాలు తపస్సు చేసిన, ఏ పాపము చేయని, అబద్ధమాడని మహర్షిని. సీత నిన్ను తప్ప మనసా, వాచా పరపురుషుడిని ఎరగని మహాపతివ్రత. నా మాట నమ్ము, సీతను ఏలుకో. నా మా టలు తప్పు, అబద్దము అయితే ఇంతకాలము నేను చేసిన తపస్సు భగ్నము అవుగాక” (వాల్మీకి రామా యణము–తెలుగు అనువాదము, క్రీ.శే.పురిపండా అప్పలస్వామి)

వాల్మీకిగా పిలవబడుతున్న మహర్షి పేరు ప్రాచేతసుడని ఇక్కడ మనము

గుర్తించవచ్చును. ఇది వాల్మీకి తనకు తాను తన గురించి చెప్పుకున్న విషయము. ఆయన మాటలలో ఆర్ధత,నిజాయతీ ఉట్టి పడుతున్నాయి. అయితే ప్రచేతసుడు ఎవరు? ప్రచేతసుడు ఎవరి కుమారుడు? ఆయనది ఏ వంశము? ఈ విషయ ములను తెలుసుకోవటానికి అనేక పురాణములను, చరిత్రలను చదవాలి. ప్రచేతసుల గురించిన ప్రస్తావన "శ్రీ మత్భాగవతము"లో ఉంది.

శ్రీ మత్భాగవతము వేదవ్యాసవిరచితము. వ్యాసుడు రచించిన అష్టాదశ పురాణములలో శ్రీ మత్భాగవతము ఒక గొప్ప పురాణము. భారతదేశములోని మహాపురుషుల చరిత్రలు పురాణములుగా వ్రాయబడి ఉన్నాయి. భారతదేశముపై మొదటగా మహమ్మదీయులు దాడి చేయటముతో భారత చరిత్రను వ్రాసిన వారు చాలా తక్కువ. స్థిరత్వము లేని పరిస్తుతులలో ఏ రచయతా చరిత్రలను వ్రాసే స్థితిలో ఉండి ఉండరు. ఆంగ్లేయుల పాలన మొదలైన తరువాత ప్రశాంత వాతావరణము ఏర్పడింది. (శ్రే. వేమన పద్యసారామృతము-సి.పి.బ్రౌన్) చరిత్ర అనగా హిస్వ అతనియొక్క స్టోరీవ కథ అని ఆంగ్లేయులు వచ్చిన తరువాతే చరిత్ర అనే పదము వాడుకలోకి వచ్చి చరిత్రలను వ్రాయటము మొదలు పెట్టారు. అంతకు ముందు భారతదేశ చరిత్రలను పురాణముల పేరుతో తెలుసుకునేవారు. భారతదేశములో పురాణములను అనగా జరిగిపోయిన వాస్తవాలను (చరిత్రలను) కాలక్షేపానికో, పుణ్యానికో చదవటము, వినటము అలవాటుగా వస్తోంది. పురాణములంటే భారతీయులకు అత్యంత విశ్వాసము. పురాణములలోని వ్యక్తుల జీవితకథలను, అందులోని నీతి, నిజాయతీలను, సంఘటనలను నిజమనే నమ్ముతారు. వారిని ఆదర్శముగా తీసుకొంటారు. పురాణాలలోని ఆచార వ్యవహారాలను, వ్రతములను, పూజాది కార్యక్రమములను, జన్మ నుండి మరణము వరకు సాగే బారసాల, అన్నప్రాశన, అక్షరాభ్యాసము నుండి పుంసవనము, శ్రీమంతము, వివాహము తరువాత అప్పగింతలు, మరణము తరువాత పార్ధీవశరీరానికి చేసే క్రతువులు అన్నీపురాణాలలో వివరించిన విధముగానే పాటిస్తారు. పురాణ రచయతలను భగవత్ సమా నులుగా కొలుస్తారు. భగవంతుడే వాల్మీకిమహర్షిగాను (బ్రహ్మ), వేదవ్యాసుడు (శ్రీ మహావిష్ణువు)గాను జన్మించి పురాణములను రచించినారని, అవి విశ్వమానవ సౌభ్రాతత్వమును చాటుతాయని నమ్ముతారు. శ్రీ మత్ భాగ వతము, శ్రీ విష్ణు పురాణము అన్నవి భగవాన్ విష్ణువు, ఆయన భక్తుల కథలు. ఎవరైతే శ్రీ మహా విష్ణువును నమ్మి కొలుచుకున్నారో, ఆయన వారిని కష్టాలబారి నుండి ఎలా రక్షించాడో తెలిపే కథలు ఈ పురాణాలలో తెలుపబడ్డాయి.శ్రీ మథ్భాగవతము ద్వాదశస్కంధములుగా వ్రాయబడింది. శ్రీ మథ్భాగవతము చతుర్థ స్కంధములో త్రయోదశోధ్యాయములో విదుర ఉవాచ:

కే తే ప్రచేతసోనామ కస్యాపత్యాని సువ్ర

కస్యా న్వవాయే ప్రఖ్యాతా: కుత్ర వా సత్రామాసత
అర్థము: గొప్ప భగవత్ భక్తిని గలిగిన ఆచార్యా "ప్రచేతసులు చేయుచున్న సత్రయాగములో నారదులు గానము జేసితిరని చెప్పితిరి గదా. ఆ ప్రచేతసులు ఎవరు? వారెవరి కుమారులు? ఎవరి వంశమందు ప్రసిద్ధిని పొందిరి" అని విదురుడు ప్రశ్నిస్తూ మైత్రేయునితో ఇంకా ఇలా అన్నాడు.
స్వధర్మశీ లై:పురుషైర్భగవాన్ పురుషోత్తమ:
ఇజ్యమానో భక్తిమతా నారాదేనేరిత:కి ల
అర్థము:క్షత్రియులైన ప్రచేతసులు తమతమ ధర్మముల మూలకముగా శ్రీ హరిని యజ్ఞ యాగాదులచే పూజించుచుండిరి. అచ్చటికి వచ్చిన నారదులు, యజ్ఞమయుడు, పురుషో త్తముడైన విష్ణువును గురించి ఉపదేశించిరని వినియున్నాము.
ఇక్కడ తెలిసిన విషయము ప్రచేతసులు విష్ణుభక్తులు. క్షత్రియులు.వీరికి విష్ణువు, యజ్ఞయాగాదుల గురించి నారదుల వారు ఉపదేశము చేశారు.

ఆ తరువాత కథా క్రమములో ధ్రువుడి తపస్సు, శ్రీ హరి ప్రత్యక్షమవటము, వరాల అను గ్రహము, ధ్రువ వంశవిస్తరణ, (చూడుము) సూర్యవంశస్థులు, బోయలవంశక్రమము) వత్సరుడు, పుష్పార్ణుడు, సాయంకాలుడు, చక్షుడు, ఉల్కుడు, అంగుడు, వేనుడు, పృథ్వీరాజు, విజితాశ్వుడు, పావనుడు, హవిర్ధానుడు, ప్రచేతసుడు, ప్రాచేత సులు (10మంది) అని తెలియబడతారు. వీరి జన్మవృత్తాంతములు, అంగుడి బాధ, వేనుడి దుశ్చర్యలు, పృథ్వీ రాజుఔన్నత్యము, నిషాదుడు అడవులలోకి పంపబడి కిరాతరాజవ్వటము, ప్రచేతసుడికి 10 మంది ప్రాచేతసులు జననము వివరించబడ్డాయి. ఆ 10మంది ప్రాచేతసులలో 7వ (పదవ) వాడు వాల్మీకి మహర్షి

ప్రాచేతసుడు క్షత్రియవంశములో జన్మించాడు, నారదుల ఉపదేశము తోనూ, తండ్రి, తాతల, ముత్తాతల సుకృతము, శ్రీ హరిపై తరతరాల భక్తి విశ్వాసాలు వాల్మీకిమహర్షిగా రూపొందింప చేశాయి. వాల్మీకిమహర్షి యొక్క నిజ కథ ఇది. ఈ విషయములను కప్పిపుచ్చి అనేక కథలు తరతరాలుగా ప్రాచుర్యము పొందాయి. వాల్మీకి మహర్షి గురించి ఎవ్వరూ పరిశోధనలు గావించక పోవడముతో కట్టుకథలు ఇంత వరకు ప్రాచుర్యములో ఉన్నాయి. రాముడు అనే పాత్రను లోకానికి ఆదర్శపురుషుడిగా చూపించాలనే ఆదికవి తపనే గాని ఆ పాత్రకు గుణగణాలు రూపొందిచటమే తన దృష్టి తప్ప తన గురించి తానెవరో గొప్పలు కాదుకదా వాస్తవాన్ని కూడా చెప్పక పోవడముతో ఎవరికి తోచినది వారు ఊహాగానాలు చేశారు. మహానుభావులు ఎప్పుడూ ఇత రుల గురించి, వారి బాగు గురించి ఆలోచిస్తారే తప్ప వారి గురించి వారు తపించరు. శ్రీ షిర్డి సాయి విష యములో కూడా ఆయన ఎవరో, ఏ తండ్రి బిడ్డడో ఆయన

చెప్పలేదు, తాను హిందూవో, ముసల్మానో కూడా తెలియనీయక మశీదులో నివసిస్తూ, అక్కడే హిందువులకు ఆరాధ్యనీయమైన తులసిమొక్కలను, ధునిని ఏర్పరచి సర్వమానవ సౌభ్రాతత్వమును కోరిన మహనీయుడి వలె, వాల్మీకిని పవిత్రమైన వారిగా మనము గుర్తించాలి. షిర్డిసాయి ఎంతటి మహనీయులైనా వారిని తమ వాడంటే తమవాడనీ, హిందువులలో బ్రాహ్మణులు షిర్డిసాయిని భరద్వాజ గోత్రోత్భవుడని అంటూంటే, ముసల్మానులు తమవాడని ఇప్పటికీ ఆయన మంది రములో నమాజు చదువుతున్నారు. ఇవన్నీ ఎవరికి వారు ఏర్పరచుకొన్న భావనలే తప్ప నిజము ఆ భగవంతులకే ఎరుక. మహర్షివాల్మీకి ఎప్పుడూ, ఎక్కడా తాను తన జీవితచరిత్రను వెలిబుచ్చక పోవటముతో కొందరు వాల్మీకి పేరు రత్నాకరుడని ఆయన పూర్వాశ్రమములో దొంగ, దారిదోపిడీదారుడని వ్రాశారు. మరి కొందరు ఆయన బ్రాహ్మణుడని, పేరు అగ్నిశర్మ అని దొంగల ముటాలో పెరిగి దొంగ అయినాడని వ్రాశారు. ఈ కట్టు కథలకు ఎక్కడా ఆధారాలు లేవు (ఇలపావులూరి పాండురంగారావు, ఆచార్య సహదేవ, జస్టిస్ భల్లా). భగవత్ గీతలో కూడా అనేక మార్పులు, చేర్పులు జరిగాయని,మూల గీతలో లేని అనేక శ్లోక ములు చేర్చబడ్డాయని డాక్టర్ రాధాకృష్ణన్, రుడాల్ఫ్ ఓటో అభిప్రాయ బడ్డారు. (దర్శనములు-మతములు-విజ్ఞాన సర్వస్వము,నాలుగవ సంపుటము-ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి) వాల్మీకిమహర్షి గురించి కొందరు ఓర్వలేక, అసూయతో లేదా దొంగ కూడా తపస్సు చేసి మహర్షి కావచ్చు అనేందుకు ఉదాహరణగా చూపేందుకో అల్లిన కట్టు కథలు.

భారతీయ సాహిత్య నిర్మాతలు-వాల్మీకి అనే ఆంగ్లపుస్తకములో ఇలపావులూరి పాండురంగారావు గారు ఈ క్రింది విధముగా వాల్మీకిమహర్షిపై వ్యాఖ్యానించారు.

"వాల్మీకి తన జీవితారంభ దశలో కిరాతుడని, సప్తరుషులచే ఋషిగా పరివర్తన పొందగలిగాడని ప్రచారములో ఉన్న కథ వినడానికి ఉత్కంఠ భరితముగా ఉండవచ్చుగాని దానికి తగిన చారిత్రాత్మక ఆధారాలు లేవు. జీవి తాన్ని గూర్చి సంపూర్ణ అవగాహన గలిగి, శాస్త్రీయ ధృకృథముతో రసజ్ఞ సౌందర్యాన్ని కవితామయముగా మేళవించిన వ్యక్తిని గూర్చి అలా చెప్పడము భావ్యము కాదు. వాల్మీకి కిరాతుడు అనే కథ బహుళ ప్రచారములో ఉన్నందున ఆ ధృకృథముతోనే చూస్తున్నారు"

"కిరాతుడు"అనే పదానికి అర్థము తురాయి అనగా నెమలి పింఛము లేదా అటువంటి ఆకారములో ఉన్న పువ్వులు, ఆకులను, పక్షుల ఈకలను తల ముందు భాగములో కట్టుకొని, తల పాగ వలె ధరించి ఉన్నవాడు. "కి" అనగా కలిగి అని, రాతుడు అనగా తురాయివాడు అని అర్థము. అంతే గాని ఈనాడు వాడుకలో ఉన్నట్లుగా కిరాతుడు అంటే కసాయి వాడు లేదా కోడి, జింక, గొర్రె, బర్రె, మేక, తదితర సాధు జీవుల

తలను నిష్కర్షగా నరికే వాడు అని కాదు. ఆదిమానవకాలములో అడవులలో వేటకై వెళ్ళేప్పుడు ఇతర మాంసాహార జంతువుల బారి పడకుండా ఉండేందుకో, సరదాగా ఉంటుందనో,అలంకారానికో తురాయిని కట్టుకునే వారు. కిరాతుడు అంటే హింసాత్ముడు అనే అర్థము స్ఫురిస్తే ఈరోజులలో జీవాలను (కోళ్ళు, చేపలు, రొయ్యలు, గొ్రెలు,మేకలు) పెంచి, పోషించి మార్కెట్లో అమ్మకము చేసేవారు, కొనేవారు,తినేవారు అందరూ కిరాతులే.

వాల్మీకి శబ్దము చీమల పుట్ట అనే అర్థానికి, కఠోర ధ్యానానికి, నిశ్చల తపోముద్రకు ప్రతీక. అట్టి తపో ఫలితమే వాల్మీకి మహాకవి. వాల్మీకిని మహోన్నతముగా ఆరాధించే కాళిదాసు మేఘ సందేశములోని శ్లోకభాగములో ఇలా ప్రస్తుతించాడు. (ఇలపావులూరి పాండురంగారావు)

"వాల్మీకాగ్రాత్ ప్రభవతి ధను: ఖండమా ఖండాలస్య" అర్థము:సుదూరములో కనిపిస్తున్న ఆ పుట్టను చూడండి! అందులో నుండి ఇంద్రధనస్సు ప్రభవించింది. దీనికి భాష్యము చెబుతూ ఇలపావులూరి పాండు రంగారావు అంటారు- ఇంద్రధనస్సు అనే ఉపమానము వాల్మీకి కవితాత్మకు, ప్రబంధౌచిత్యానికి ప్రతీక. వాల్మీకి రామాయణములోని 7 కాండలు ఇంద్రధనస్సులోని సప్తవర్ణాలను గుర్తుకు తెస్తాయి. కిరాతులు క్షత్రియులే, వీరిలో ఉపనయనాది కర్మలు లోపించాయి అంటాడు మనువు (మనుస్మృతి).

కిరాతుడు ఋషిగా పరివర్తన చెందాడని చెప్పడము నిజము కావచ్చు. అంతేగాని ఆయన గురించి మరొక్క మాట దురాలోచనే. తపస్సు ఆయన ప్రధానసద్గుణము, నిరంతరాధ్యయనము, సత్ప్రవర్తనల ఫలితమే మహాఋషిగా ఆవిర్భవింప చేశాయి.

వాల్మీకి పేరు కలిగిన వారు నలుగురైదుగురు ఉన్నారని కొందరు విజ్ఞుల (వ్యాసుడు అని పేరు కలిగిన వారు కూడా 10 మంది ఉన్నారని) అభిప్రాయము. వారిలో రత్నాకరుడు, అగ్నిశర్మ కూడా ఉండి ఉండవచ్చును. వీరు మహర్షి, ఆదికవి వాల్మీకి ఉత్ప్రోధనలకు ప్రేరితులై తమ పేర్లను వాల్మీకిగా మార్చుకొని ప్రాచుర్యములోనికి వచ్చి ఉంటారు. ఆకతాయి రచయతలు ఎవరో వారిని మహర్షిని ఒక్కరే అని పొరబడి ఉండవచ్చును. ఈ విషయము నిజమే అని నమ్మటానికి పంజాబ్ మరియు హరియానా విశ్వవిద్యాలయుము వారు ఆచార్య, డాక్టరు సహదేవ ఆధ్వర్యములో 3 సంవత్సరములపాటు నిర్వహించిన పరిశోధనలు సహ కరిస్తున్నాయి. (మహర్షి వాల్మీకి వాస్ నెవర్ ఏ డేకోయిట్ నార్ ఏ రోడ్ సైడ్ రాబర్-జస్టిస్ భల్లా, ద టైమ్స్ ఆఫ్ ఇండియా,ఇంగ్లీష్ డైలీ, 2010 మే 22) పంజాబ్ మరియు హరియానా హైకోర్ట్ ఆదేశాల మేరకు పంజాబ్ మ రియు హరియానా, విశ్వవిధ్యాలయము వారు పరిశోధనలు గావించారు. డాక్టరు సహదేవ,చైర్ పర్సన్‌గా, వాల్మీకి చైర్ అనే విభాగమును,ఏర్పాటు

చేసి ఈ పరిశోధనలు, అధ్యాపకులచే నిర్వహింప బడ్డాయి. క్రీ.పూ.నుండి అందుబాటులో ఉన్న వేదములు, శిలాశాసనాలు, ఉపనిషత్తులు, పురాణములు, ఇతిహాసములు, చరిత్రలు క్షుణ్ణముగా పరిశీలించగా మహర్షివాల్మీకిని ఎక్కడా, ఎప్పుడూ దొంగగా,దారిదోపిడీదారుడిగా వ్రాయబడి లేదు. ఈ పరిశోధన ఫలితాల ఆధారముగా జడ్జిమెంట్ ను జస్టిస్ భల్లా ఇచ్చారు. ఈ జడ్జిమెంట్ ప్రకారము వాల్మీకి మహర్షిని ఎవ్వరూ దొంగ, దారి దోపిడీదారుడు అనకూడదు. ఆవిధముగా మాట్లాడకూడదు, నాటికలు, టి.వి.సీరియల్స్, సినిమాలు తీయరాదు, వాల్మీకిమహర్షిని దొంగ, దారిదోపిడీదారుడు అని బోయలను, వాల్మీకులను కించపరిచే విధముగా మాట్లాడితే నేరము, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవచ్చును. మహర్షి వాల్మీకి గురించి కొన్ని పురాణములలో (ఆధ్యాత్మిక రామాయణము, స్కాంధపురాణము, తదితర) వ్రాయబడినట్లుగా చెబుతున్న వాటికి వాస్తవాలకు పొంతన లేదని అవి మూలపురాణములో లేవని ఆ తరువాత చేర్చబడిన అవిశ్వాస కథలని ఇతిహాసికులు, చరిత్ర పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.

వాల్మీకిమహర్షిని ఆదికవి, బుక్షకుడు, భార్గవుడు, కవికోకిల, వాక్యావిశారదుడు, మహాజ్ఞాని, భగవాన్ అని కూడా పిలుస్తారు. వాల్మీకిమహర్షి "ఓం ఐం హ్రీం క్లీం శ్రీం" అనే బీజాక్షరాలు సరస్వతీ, లక్ష్మి, మాయ కటాక్షాన్ని కలుగచేసే మంత్రాలను లోకానికి పరిచయము చేశారు. (దేవిభాగవతము, వేదవ్యాసవిరచితము, తెలుగు అనువాదము)

వాల్మీకిమహర్షి జీవించిన కాలముపై అనేక పరిశోధనలు జరిగాయి. వాల్మీకి రామాయణము క్రీ.పూ.1000వ సంవత్సర ప్రారంభములో రచింపబడి వుంటుందని, వాల్మీకిపై విశేష పరిశోధనలు గావించిన జి.ఎస్.ఆల్టేకర్ (1895–1987) నిర్ధారించారు (ఇలపావులూరి పాండురంగారావు). క్రీ.పూ.100 సంవత్సరములకు చెందిన బుద్ధచరిత్ర రచయత అశ్వఘోషుడు వాల్మీకి ఆదికావ్యాన్ని గూర్చి ప్రశంశిస్తూ ఇలా వ్రాశాడు.

"వాల్మీకి రాదే చ ససర్జపద్యం జగ్రంధన్నచ్యవనో మహర్షి"– ఈ శ్లోకం వాల్మీకి క్రీస్తు శకానికి ముందువాడని ధ్రువ పరు స్తోంది (ఇలపావులూరి పాండురంగారావు). బుద్ధునికి పూర్వము అంటే క్రీ.పూ.800 సం.ల నాటి వాడు వాల్మీకి అని డా. హెచ్.జాకోబి అభిప్రాయము.

వాల్మీకి మహర్షి వద్ద శిష్యరికము గావించిన భరద్వాజుడు, లవుడు, కుశుడు మహర్షిని భగవాన్ అని సంబోధించేవారు. బ్రహ్మ సమానుడని, బ్రహ్మ రామాయణమును వ్రాయటానికి తానే వాల్మీకి మహర్షిగా అవుతరించాడని నమ్మేవారున్నారు. "విప్రో వాల్మీకిస్సు మహాశయా" అని బ్రహ్మ సరస్వతి దేవితో చెప్పాడని, అందువలన వాల్మీకిమహర్షి విప్రుడు అని పురాణ వ్యాఖ్యాతలు చెబుతున్నారు. స్వగుణధర్మముతో

బోయవాడిగా పుట్టినవాడు ఆదికవిగా, మహర్షిగా, బ్రాహ్మణుడిగా గుర్తించబడ్డారని ఆయన గణకీర్తిని కొనియాడారు.

ఆదికవి వాల్మీకి ఆ రోజులలోనే "అక్షరలక్ష" అనే ఈనాటి "ఎన్ సైక్లోపెడియా బ్రిటానికా" వంటి విజ్ఞాన సర్వస్వము, సర్వశాస్త్రసంగ్రహమును వెలువరించారు. (పెదబాలశిక్ష- గాజుల సత్యనారాయణ) ఈపుస్తకములో భూగర్భ శాస్త్రము, రసాయనశాస్త్రము, గణితశాస్త్రము, రేఖాగణితము, బీజ గణిత ము,త్రికోణమితి, 325 రకాల గణిత ప్రక్రియలు, గాలి, ఉష్ణము, విద్యుత్, జలయంత్ర శాస్త్రము, ఖనిజాలు తదితర అనేక అంశాలు వివరించబడి ఉన్నాయి. యోగవాశిష్టము అనే యోగా, ధ్యానముల గురించిన సంపూర్ణ విషయములు గల మరో పుస్తకము మహర్షి వాల్మీకి వ్రాశారు. ఈ పుస్తకము రామాయణములోని అంతర్భాగమే. రాముడు పది-పన్నెండు సంవత్సరాల వయసులో మానసిక అశాంతికి లోనై, మానసిక దౌర్బల్యమునకు గురి అయినప్పుడు వశిష్టుడి ద్వారాయోగా, ధ్యానములను శ్రీరాముడికి బోధించారు వ్రాసింది. వాల్మీకిమహర్షి, పలికింది, బోధించింది వశిష్టుడు, అందు వలన "యోగవాశిష్టము" అనే పేరు వచ్చింది. ఆదిత్య హృదయము అనెడి సూర్యస్తుతిని వ్రాసినవారు వాల్మీకి మహర్షియే. కౌసల్యా సుప్రజా రామ అనెడి సుప్రభాతమును వ్రాసిన వారు వాల్మీకియే. మహర్షివాల్మీకి "వాల్మీకి మతము" అనే దానిని నెలకొల్పారు.

తొమ్మిది లక్షణాలతో జీవితమును సంస్కరించుకోవాలని, ఈ తొమ్మిది గుణములు కలిగిన వారిని, పాటిస్తున్నవారిని వాల్మీకి మత స్తులుగా గుర్తించారు. ఆటవికజీవితములో వ్యవసాయముతెలియదు. అడవులలో దొరికిన ఆకులు, అలములు, దుంపలుకాయలు, పండ్లు, సాధుజీవుల (కుందేలు, కోడి, పంది, గొర్రె, మేకలువంటివి)ను పట్టి, అవి పట్టుబడక పోతే వాటితో పోరాడి స్వంతము చేసుకోవటమే అలవాటు. తమ వద్ద లేని ఇతరుల వద్ద ఉన్న వాటిని లాగుకోవటము, ఇవ్వకపోతే వారితో పోరాడి, చంపి అయినా సరే తమ స్వంతము చేసుకోవటము ఆటవికతనము, ఈ పోరాటము జరిపే, ధైర్యసాహసాలు గల వారినే "క్షత్రియులు" అని అంటారని భీష్ముడు మహాభారతములో క్షత్రియత్వము గురించి వివరణ ఇచ్చాడు. ఈ ఆటవికతనమును పారద్రోలి సంస్క రించటానికే వాల్మీకి తొమ్మిది లక్షణాలతో జీవనమును సాగించాలని బోధించారు. ఆటవికులలో సంస్కారమును కలుగచేయటానికే వాల్మీకిమతము ప్రారంభించబడింది. క్రీ.పూ.600 సంవత్సరములోనే ఆటవికులు సంస్కరించబడటము మొదలైంది అని చెప్పటానికి వాల్మీకి వ్రాసిన మొదటి శ్లోకమే గొప్ప ఉదాహరణ. ఆటవిక బాష సంస్కృతముగా రూపొందింది వాల్మీకి వలననే. "మా నిషాద" అనే పదముతో మొదలైన శ్లోకములోని మొదటి వ్యక్తి నిషాదుడే, అతనూ బోయవాడే. అజ్ఞానముతో

బోయవాడు చేసిన ఆడ పక్షిని చంపటము అనే ప్రక్రియ వాల్మీకిమహర్షిలో బోయలను, ఆటవికులను సంస్కరించాలనే ఆలోచనను కలిగింప చేసి ఒక ఆదర్శ మానవుడిని నాయకుడిగా చూపించాలని "రామాయణము" వ్రాసేలా చేశాయి.

మహర్షి వాల్మీకి గురించి అనేక పరిశోధనలు తరాతరాల నుండి విశ్వవిద్యాలయాలలో, పండితుల, పీఠాధిపతుల ఆధ్వర్యములో, మానవుడిమస్తిష్కములో కొనసాగుతూనే ఉన్నాయి. ఆ మహాను భావుడి ఆశయసిద్ధి కోసము అనేక రూపకల్పనలు, నూతన ఆవిష్కరణములు జరుగుతూనే ఉన్నాయి. మానవులంతా ఆయన మతమును స్వీకరిద్దాము, శ్రీరాముడి వంటి ఆదర్శ పురుషులు అవుదాము.ప్రతి భారత మహనీయుడు- శ్రీ షిర్డీశాయీ, శ్రీరామకృష్ణపరమహంస, శ్రీవివేకానంద మహాత్మాగాంధీ శ్రీరాముడిని, వాల్మీకిమహర్షి నాయకుడిని ఆదరించారు పూజించారు. పురాణములు,ఇతిహాసములు, రామాయణము, మహాభారతము తదితర కావ్య, నాటకాదులు మానవుడి బాల్యము నుండి మనసులో స్థిరముగా నాటుకొనేలా ధర్మబోధన గావించడానికే. సత్ప్రవర్తన సాధనకే. పురాణకాలక్షేపము కూడా సత్సంఘమును ఏర్పరుచుటకే. రచయత్మ డా.చిప్పగిరి జ్ఞానేశ్వర్ పేరు వ్యుత్పత్తి-మార్చు-

వల్మీకం అనగా పుట్ట అని అర్థం. వల్మీకం నుంచి ఉద్భవించిన వాడు కాబట్టి వాల్మీకి అయ్యాడు.

రామాయణకర్త వాల్మీకి- మార్చు-

వాల్మీక రామాయణంగా అందరికీ తెలిసిన వాల్మీకంలో 23వేల శ్లోకాలు 7 కాండాలుగా (ఉత్తరకాండ సహా) విభజించబడి ఉన్నాయి. రామాయణంలో 4 లక్షల ఎనభై వేల పదాలుఉన్నాయి. ఇది మహాభారత కావ్యంలో దాదాపుగా పావు వంతు భాగం. ప్రసిద్ధ ఆంగ్ల రచన ఇలియాడ్కు ఇది నాలుగు రెట్లు పెద్దది. రామాయణం దాదాపుగా క్రీపూ 500లో రాయబడిందని పాశ్చాత్యులు నమ్ముతారు. రామాయణంలో తెలుపబడిన విషయాలననుసరించి కనీసం లక్ష సంవత్సరాల ప్రాచీనమవవచ్చని భారత దార్శనికుల నమ్మకం. ఇతర ఇతిహాసాల్లాగానే రామాయణం కూడా ఎన్నో మార్పులకు, కలుపుగోరులకు, తీసివేతలకు గురి అయింది.

వాల్మీకి రామాయణంలో తాను శ్రీరాముడికి సమకాలీనుడని పేర్కొన్నాడు. శ్రీరాముడు వాల్మీకిని అరణ్యవాసంలో కలిసినట్టు, సీతను వనవాసానికి పంపినపుడు వాల్మీకాశ్రమంలోనే ఆవిడ ఉన్నట్టు తెలుస్తుంది. ఈ ఆశ్రమంలోనే సీత లవ-కుశలను కన్నట్టూ, వీరిద్దరి విద్యాభ్యాసం ఇక్కడే వాల్మీకికి శిష్యరికంలో జరిగినట్టు రామాయణం ద్వారా తెలుస్తుంది.

తొలి శ్లోకం-మార్చు-

**గీర్వాణ కవుల కవితా గీర్వాణం-3**

క్రౌంచ పక్షి జంటలో ఒకటి చనిపోవుట

వాల్మీకి తపస్సంపన్నత తరువాత ఆశ్రమవాసం చేయసాగారు. ఆశ్రమ ధర్మాలలో భాగంగా గంగానదీ తీరానికి సంధ్యకు రాగా. భరద్వాజుడనే శిష్యుడు అతని వస్త్రాలను తెస్తాడు. మార్గంలో తామస నది వద్దకు చేరుకుంటారు. తామస నది నిర్మలత్వాన్ని చూసి ఆ నదిలోనే స్నానం చేయాలని నిర్ణయించుకుంటాడు. స్నానానికి నదిలో దిగుతూ ఒక క్రౌంచ పక్షి జంటను సంగమించడం చూస్తాడు. చూసి పరవశానికి గురి అవుతాడు. అదే సమయంలో మగ పక్షి బాణంతో ఛేదింపబడి చనిపోతుంది. భర్త చావును తట్టుకోలేక ఆడ క్రౌంచ పక్షి గట్టిగా అరుస్తూ చనిపోతుంది. ఈ సంఘటనను చూసి వాల్మీకి మనసు కరిగి శోకానికి లోనవుతాడు. ఈ సంఘటనకు కారణం ఎవరా అని చుట్టూ చూస్తాడు. దగ్గరలో ఒక బోయవాడు ధనుర్బాణాలతో కనిపిస్తాడు. వాల్మీకికి కోపం వస్తుంది. ఆ శోకంతో కూడుకున్న కోపంలో ఆ బోయవాడిని శపిస్తూ ఈ మాటలు అంటాడు:

మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీః సమాః?
యత్క్రౌంచమిథునాదేకమవధీః కామమోహితం?
ఓ కిరాతుడా! నీవు శాశ్వతముగా అపకీర్తి పాలగుదువు.
ఎందుకంటే క్రౌంచ పక్షులజంటలో కామ పరవశమైయున్న ఒక (మగ) పక్షిని చంపితివి.

ఈ విధంగా వాల్మీకి నోట అప్రయత్నంగా వచ్చినదే సంస్కృత సాహిత్యంలో వచ్చిన మొదటి శ్లోకం. అలా మొదలయినది రామాయణ కావ్యం సొంతం రాసేవరకూ సాగింది.

**వాల్మీకి వలస-మార్పు-**

అటవీ తెగకు చెందిన వాల్మీకి కరువుల వల్ల బ్రతుకు తెరువు కోసం ఉత్తర భారతదేశం నుండి వలస బాట పట్టాడు. ఆర్య తెగకు చెందిన సప్తఋషులచే జ్ఞానోదయమైన తర్వాత, మహర్షిగా మారి దండకార్యణం (నల్లమల అడవులు) గూండా దక్షిణ భారతదేశం, ఆ తర్వాత శ్రీలంకకు వలస వెళ్ళాడు. మార్గమధ్యంలో వివిధ ప్రదేశాల్లో బసచేస్తూ, అడవి ఆకులు, దుంపలు తింటూ విశ్రాంతి సమయంలో తన రామాయణం కావ్యాన్ని దేవనాగరి లిపిలో వ్రాస్తూ, తను వెళ్ళిన ప్రదేశాల్ని కావ్యంలో పేర్కొన్నాడు. ఆంధ్ర దేశంలో ఉన్న గోదావరి నదీతీరంలో విశ్రమించి ఆ తర్వాత వృద్ధాప్య దశ వచ్చే సరికి తమిళనాడు రామేశ్వరం సముద్ర గట్టు వద్ద నున్న షోల్ మీదుగా శ్రీలంక ప్రవేశించాడు. శ్రీలంకలో తన రామాయణాన్ని యుద్ధకాండతో ముగించాడు. వాల్మీకి తన జీవిత కాలాన్ని శ్రీలంకలోనే ముంగిచాడని విష్లేషకుల భావవ.❁



## 32) భుజంగ తాండవ స్తోత్ర కర్త – రావణ బ్రహ్మ

లోక రావణుడని, దశకంఠుడని, రాక్షస నాయకుడని లంకా సామ్రాజ్యాధిపతి అని శివుని భక్తితో మెప్పించి ఆత్మలింగాన్ని పొందిన షట్కాల శివ పూజా దురంధుడని, సప్త సముద్రాలలో స్నానించిన ఆతరువాతే శివ పూజ చేసేవాడని సీతాపహరణం చేసి లోక నింద మూటగట్టుకొని శ్రీరామునికి యుద్ధంలో సరిజోదు అనిపించుకుని ఆయన చేతిలో మరణించిన రావణబ్రహ్మ విశ్వశ్రవస బ్రహ్మ కైకసిల కుమారుడు – దూరంలో ఉన్న శబ్దాన్ని కూడా అతి స్పష్టంగా వినగలిగినవాడైన వైశ్రవణుడనే బిరుదున్నవాడు రావణ బ్రహ్మ. శివుని మెప్పించటానికి ఘోర తపస్సు చేసి తన తొమ్మిది తలలను "చంద్ర హాసం" అనే ఖడ్గంతో కోసుకొని శివుని కర్పించి తన పదవ తలతో ప్రేగులనే వీణా తంత్రులుగా చేసి వాయించి అమోఘ వరాలుపొందాడు. ఆ వీణనే "రుద్ర వీణ" అంటారు. అతడు అన్నగారైన కుబేరుని జయించి లంకా సామ్రాజ్యాన్ని వశపరుచుకొని అన్నను బయటికి నెట్టి అపూర్వమైన "పుష్పక విమానం" లాక్కున్న ఘనుడు లోక రావణుడు. నవగ్రహాలను, అష్ట దిక్పాలకులను తన వశం చేసుకున్నవాడు.

తమ్ముళ్లు కుంభకర్ణుడు విభీషణుడు చెల్లెలు శూర్పణఖ. భార్య మండోదరి. కుమారుడు దేవతలని గడగడ లాడించిన ఇంద్ర జిత్ అనే మేఘనాధుడు. రావణుడు "సిద్ధ యోగం" ,రాజకీయ నీతి శాస్త్రంలలో అపార పాండిత్యం ఉన్నవాడని "అర్క ప్రకాశిక" గ్రంథంలో ఉన్నది. రావణుడు 1– "రావణ సంహిత" అనే జ్యోతిశాస్త్ర గ్రంథాన్ని, 2– అర్క ప్రకాశం అనే ఆయుర్వేద గ్రంథం రాశాడు.

బ్రహ్మవరం వలన పొందిన అమృత బాండాన్ని కడుపులో దాచుకొన్న సమర్ధుడు. ఉత్తర ప్రదేశ్ లోని "భిష్టకి" గ్రామంలో రావణుడు జన్మించాడని ఆ గ్రామస్తుల నమ్మకం. భౌద్ధుల "లంకావతార సూత్రంలో టిబెటన్ బుద్ధిజంలోని నింగ్యం"లలో రావణుడు ప్రధాన పాత్ర దారి. శ్రీలంకలో దక్షిణ కైలాసం అని పిలువబడే రావణ దేవాలయం ట్రిన్కోమలికి తూర్పున ఉంది. తల్లి కైకసి అంత్య క్రియలు నిర్వర్తించటానికి రావణుడు 7 చోట్ల భూమిని కత్తితో పొడిచాడు. ఆ ఏడు ప్రదేశాల నుండి వేడి నీరు భూమిపైకి ఎగతన్నింది ఆ ప్రదేశాన్ని "కన్నియ హాట్ వాటర్ స్ప్రింగ్స్" అంటారు ఇది గొప్ప టూరిస్ట్ స్పాట్.

గుజరాతులో "ఖచోరబ్రాహ్మణులు" తాము రావణ వంశానికి చెందినవారమని గొప్పగా చెప్పుకోవటమేకాక కొందరి ఇంటిపేరు "రావణ"గా ఉండటం మరీ ఆశ్చర్యం కలిగిస్తుంది. గౌతమ గోత్రానికి చెందిన రెండవ ఉపాధ్యాయ యశస్తరుడు తాము "రావణి" వంశనానికి చెందినవారమని చెప్పుకున్నాడు. బర్మా రామాయణంలో రావణునిపేరు "యవ్వన లేక దాత గిరి". థాయ్ రామాయణంలో రావణుని యక్షునిగా అసురునిగా చెప్పబడి, తోత్సపక్ అని రాపనాసూర్ అని చెప్పబడింది. జైనమతంలో రామ, రావణు లిద్దరు జైన్లు. మంత్రగాడైన విద్యాధరునికొడుకు రావణుడని రావణుడు రామునిచే కాక లక్ష్మణునిచేత చంపబడ్డాడని ఉంది.

ఇంతటితో ఈ చావు గోల వదిలేసి రావణ ప్రోక్త "భుజంగ తాండవ స్తోత్రం" చేస్తూ ఆ తాండవ శివుణ్ణి మెప్పిద్దాం. ఇది పంచచామరం వృత్తంలో ఉన్న 15శ్లోకాల స్తోత్రం. పంక్తికి 16 అక్షరాలున్న నాలుగు పంక్తులు ఒక శ్లోకం అయన పరమ శివ భక్తికి ప్రత్యక్ష నిదర్శనం. ఆ తాండవ శివుడిని మన కళ్ళ ముందు ప్రత్యక్షం చేసి చూపించిన కవితా వైభవం రావణునిలో ఉంది భావం తెలియకపోయినా భాష మనల్నే తాండవం చేయిస్తుంది. భావం తెలిస్తే అలౌకికానందమే, అఖండ సచ్చిదానందమే. అహో రావణ బ్రహ్మ అనిపిస్తుంది.

జటాటవీగలజ్జలప్రవాహపావితస్థలే
గలేవలంబ్య లంబితాం భుజంగతుంగమాలికామ్ బ
డమడ్డమడ్డమడ్డమన్నినాదవడ్డమర్వయం
చకార చండతాండవం తనోతు నః శివః శివమ్ బబ 1 బ
జటాభుజంగపింగళస్ఫురత్ఫణామణిప్రభా
కదంబకుంకుమద్రవప్రలిప్తదిగ్వధూముఖే బ
మదాంధసింధురస్ఫురత్త్వగుత్తరీయమేదురే
మనో వినోదమద్భుతం బిభర్తు భూతభర్తరి బబ 4 బబ
అగర్వసర్వమంగళాకళాకదంబమంజరీ
రసప్రవాహమాధురీ విజృంభణామధువ్రతమ్ బ
స్మరాంతకం పురాంతకం భవాంతకం మఖాంతకం
గజాంతకాంధకాంతకం తమంతకాంతకం భజే బబ 10 బబ
జయత్వదభ్రవిభ్రమభ్రమద్భుజంగమశ్వస-
-ద్వినిర్గమత్క్రమస్ఫురత్కరాలఫాలహవ్యవాట్ బ
ధిమిద్ధిమిద్ధిమిధ్వనన్మృదంగతుంగమంగళ
ధ్వనిక్రమప్రవర్తిత ప్రచండతాండవః శివః బబ 11 బబ
కదా నిలింపనిర్ఝరీనికుంజకోటరే వసన్
విముక్తదుర్మతిః సదా శిరఃస్థమంజలిం వహన్ బ
విముక్తలోలలోచనో లలాటఫాలలగ్నకః
శివేతి మంత్రముచ్చరన్ సదా సుఖీ భవామ్యహమ్ బబ 13 బబ
పూజావసానసమయే దశవక్త్రగీతం యః
శంభుపూజనపరం పఠతి ప్రదోషే బ
తస్య స్థిరాం రథగజేంద్రతురంగయుక్తాం
లక్ష్మీం సదైవ సుముఖీం ప్రదదాతి శంభుః బబ 15 బబ.❁




## 33) శ్రీ హనుమద్వారా వెల్లడైన హనుమద్గీత – శ్రీ ఆంజనేయస్వామి

శ్రీరామ పట్టాభి షేకం అయినతరువాత ఒక మంచిరోజున అందరు కొలువై ఉండగా రాముడు సీతాదేవిని తన అవతార రహస్యం హనుమంతునికి బోధించమని కోరాడు. ఆమె చెప్పినదే హనుమద్ గీత. హనుమ ద్వారా అది లోకంలో ప్రచారమైనది. సీతాదేవి హనుమంతుని చూసి ఆతను శివ స్వరూపుడని ఆయన తమ దంపతులకు చేసిన మహోపకారం మరువ లేనిదని మెచ్చుకొంటూ రాముని అనుమతితో శ్రీరామ తత్వాన్ని బోధించింది "శ్రీరాముడు సర్వకాల సర్వావస్థలలో ఉండేవాడు, అవినాశి నేను యోగమాయను. ఆయనను వదిలి ఎప్పుడూ ఉండను. నా ఉనికి ఆయనను ఎల్లప్పుడూ సేవించటానికే. మా ఇద్దరి ప్రేమ సార్వకాలికం" అని చెప్పగానే హనుమ ఆనందభాష్పాలు రాలుస్తూ గద్గద స్వరంతో లంకలో సీతకు జరిగిన అవమానాన్ని ఆమె అగ్ని ప్రవేశం చేసిన సంగతి గుర్తుచేసుకొని ఉద్వేగం తో 'తల్లీ! ఈసారి నువ్వు అగ్ని ప్రవేశం చేయాల్సివస్తే నేను తట్టుకోలేను నీతోపాటు నేను కూడా నిప్పుల్లో దూకుతా" అన్నాడు. హనుమను ఓదారుస్తూ రాముడు "సీతాదేవి ప్రకృతి. ఆమె మూర్తీభవించిన పవిత్రత. నిన్ను వదిలి ఎప్పుడూ ఎక్కడికీ వెళ్లదు. నువ్వు ఎప్పటికీ మా కుటుంబ సభ్యుడవే" అని అనునయించి జీవిత చక్ర భ్రమణం పుట్టుక చావు, గుణాలు బంధాలు, మిధ్యా ప్రపంచం, మాయ కమ్మి మనుషులు తాము పరమేశ్వర స్వరూపులని మరచి పోవటం ఆత్మ జ్ఞానికి ఇవన్నీ తెలుస్తాయని, రామాయణం మానవులను ఉత్తమ మార్గాలలో నడవటానికి

తోడ్పడుతుందని హనుమ చిరంజీవి అని ప్రతిదీ బ్రహ్మమని గ్రహించాలని ఎక్కడ రామనామస్మరణ వినిపిస్తే అక్కడ హనుమ ప్రత్యక్షమై ఆనందంతో పులకిస్తాడని తెలియజేశాడు. సితారాములు చెప్పిన ఈ మహోన్నత విషయాలను విన్న హనుమ అంతరంగం ప్రేమమయమైంది.

మర్నాటి సభలో హనుమ "నా జీవితం ధన్యమైంది. శ్రీ సీతా రామ సేవలో నేను తరిస్తాను. చిత్త చాంచల్యమే అన్ని దుఃఖాలకు మూలం. సత్య జ్ఞానమనంతం బ్రహ్మ. సర్వం బ్రహ్మమయమని భావించినవానికి లభించేది మోక్షమే" అన్నాడు. ఈ మాటలు అంటూ ఉండగానే హనుమ శిరసుపై అపూర్వ దివ్య తేజస్సు అవతరించింది కళ్ళు ఒళ్ళు పులకించి ఆనంద భాష్పవాలు రాలుతున్నాయి. హృదయమంతా సీతారాములు నిండిపోయారు. హనుమంతుని ఆత్మ జ్ఞానానికి దివ్యానుభూతికి కొలువు కూటం లోని ప్రతి ఒక్కరూ పులకించి ఆయన దివ్య తేజస్సుకు మురిసి పుష్పవృష్టి కురిపించి అభినందించారు. హనుమంతుడు ప్రేమ, భక్తి, ఆరాధన నిండిన నిస్వార్ధ సేవకుడు. ప్రేమ సత్య ధర్మాలను మనసా వాచా కర్మణా అనుష్టించిన పవిత్రమూర్తి. సదా అప్రమత్తుడై స్వామికార్యాని తననుఁ నమ్మినవారిని కాపాడటానికి సంసిద్ధమై ఉంటాడు హనుమ. సీతారాముల పవిత్ర ప్రేమను, వానరుడైనా హనుమకు మోక్షమార్గాన్ని ఉపదేశించి చిరంజీకిని చేసిన ఘన చరిత్రను తెలియజేస్తుంది.❁



## 34) శ్రీ రామ గీత చెప్పిన - శ్రీరాముడు

ఒకసారి శ్రీ రాముని దగ్గరకు తమ్ముడు చేరి అత్యంత వినయంగా తనకు జ్ఞాన విజ్ఞాన పూర్వక ఆత్మవిద్యను బోధించమని ప్రార్ధించాడు. వారిద్దరి సంవాదమే శ్రీరామ గీత. ఇది అద్వైత వేదాంతమే దీనిని స్వామి శివానంద బాగా ప్రచారం చేశారు. ఇందులోని సారాంశం తెలుసుకొందాం.

'శ్రుతులు వినటం ఉద్గ్రంథాలు చదవటం వలన వచ్చేది జ్ఞానం. నిధిధ్యాసాదుల వలన కలిగేది విజ్ఞానం. బ్రహ్మ విద్యను ఎవరికి పడితే వారికి చెప్పకూడదు. గురు శుశ్రూష చేసి గురు ముఖతా నేర్వాలి. ఉన్న జ్ఞానం అంతా తెలుసుకోవాలని ఇంద్రుడు 101 సంవత్సరాలు తపస్సు చేశాడు. యముడు నాచికేతుని అనేక విధాలా పరీక్ష చేసి ఆత్మ విద్య నేర్పాడు. గురువుకు శిష్యునిపై పూర్తి నమ్మకం కుదిరితేనే బ్రహ్మ విద్య నేర్పుతాడు. శరీరమే ఆత్మ అనుకోవటం మాయ. మాయవలన ప్రపంచ సృష్టి జరుగుతుంది. శరీరం ఆత్మకాదు. ఇంద్రియజ్ఞానం ద్వారా ఆత్మ తెలియదు. మాయ విక్షేప, ఆవరణ అని రెండురకాలు. సర్వకాల సర్వావస్థలలో ఉండేది సత్యం అదే ఆత్మ. అహంకారాదులను విసర్జించి ఇంద్రియాలను నియంత్రించి తదేక సాధన చేస్తే ఆత్మజ్ఞానం లభిస్తుంది. దానికి మించిన ఆనందమే లేదు. ఆత్మజ్ఞానమే బ్రహ్మజ్ఞానం" అని రాముడు రామగీతను తమ్ముడికి బోధించాడు. రామ గీత రెండుభాగాలలో ఉంది. శ్రీరామ హనుమల మధ్య సంభాషణే రెండవ రామ గీత. దీనిని "అనుభావాద్వైతం"


అంటారు. తత్వ సారాయణంలో దీనిని సంపూర్ణంగా ఆవిష్కరించి చెప్పబడింది. ఇవికాక చాలా గీతలు ఉన్నాయి మచ్చుకి కొన్ని–

**సిద్ధ గీత – జనక సభలో యోగుల జ్ఞానగానం**

మిథిలాధీశుడు రాజర్షి జనకమహా రాజు ఆస్థానంలో యోగులతో ఆయన చర్చల సారాంశమే "సిద్ధ గీత". దీని సారాంశం – చైతన్యం అనంతంగా వ్యాప్తి చెందటం, దీని అనుభవం స్వయం నియంత్రణ. కర్త కర్మల సంబంధ నిషేధత్వం వలన కలుగుతుంది. యోగ వాశిష్టం ఉపశాంతి ప్రకరణంలో ఉంది.

**బక గీత– ఇంద్ర –బక సంవాదం**

దేవేంద్రునికి బక మహర్షికి మధ్య జరిగిన సంవాదమే "బక గీత". ప్రపంచంలోని దుఃఖం లో మానవుడు అంతకాలం పడి ఉండి బాధలు అనుభవించటం దీని సారాంశం. ఇది మహాభారతంలో ఉంది. యమ గీతలో విష్ణుభక్తులు పాటించాల్సిన నియమాలుంటాయి. ఇది విష్ణుపురాణంలో ఉంది. ఉద్ధవుడికి కృష్ణుడు చెప్పింది "భిక్షుగీత భాగవతంలో ఉంది. దత్తాత్రేయుడు చెప్పింది జీవన్ముక్తి గీత, వగైరా. గీతలు అనంతం మన తలరాత మార్చటానికి.❀



## 35) శ్రీ హనుమద్రామాయణ కర్త – శ్రీ హనుమంతుడు

శ్రీరాముడు రావణాసుర సంహారం చేసి, అయోధ్యలో పట్టాభిషిక్తుడైన తర్వాత శ్రీ ఆంజనేయ స్వామి తపోధ్యానాల కోసం హిమాలయాలకు వెళ్ళాడు. అక్కడ ఆయనకు శ్రీరామగాధ అంతా జ్ఞప్తికి వచ్చి దానిని బహుసుందరమైన శైలిలో అక్కడి హిమాలయ పర్వతాలలోని రాళ్లమీద భక్తి భావ బంధురంగా తన చేతి గోళ్ళతో రామాయణ కథనంతా శ్రీరామ పరాక్రమ, క్షమాది గుణ సహితంగా రాశాడు. ఒక రోజు వాల్మీకి మహర్షి హనుమ రాయాణం రాస్తున్న సమయంలో అక్కడికి వచ్చాడు. మహర్షికి ఘనస్వాగతం పలికి హనుమ ఆయన్ను గాఢంగా కౌగిలించుకొన్నాడు. హనుమ రాసిన హనుమద్రామాయణం అంతా చదవాలని మహర్షి భావించగా హనుమ తాను శ్లోకాలను అందంగా రాసిన రాళ్లను చూపించాడు. ఒక్కొక్క రాయిని పరిశీలనగా చూస్తూ వాల్మీకి మహర్షి భక్తహనుమాన రాసిన రామాయణ శ్లోకాలు చదవటం ప్రారంభించాడు. శిలలపై హనుమ రాసిన రామాయణ శ్లోకాలన్నీ చదవటానికి వాల్మీకి మహర్షికి వెయ్యి ఏళ్ళు పట్టింది. మహర్షి హనుమ రచనా పాటవానికి భక్తి తత్వానికి చలించిపోయాడు. ఇంతటి ఉత్కృష్ట రచన అంతకు ముందు ఎవరూ చేయలేదని ఆ తర్వాత కూడా చేయలేరని భావించాడు మహర్షి. హనుమద్రామాయణం పూర్తిగా చదివాక వాల్మీకి చాలా నిరాశ చెందాడు. హనుమ మహర్షి బాధకు కారణం అడిగాడు దానికి వాల్మీకి తానూ ఎంతో కస్టపడి శ్రమించి రాసిన శ్రీమద్రామాయణం హనుమద్రామాయణం ముందు ఏ మాత్రం నిలవలేదని తన రామాయణాన్ని లోకంలో ఇక అందరూ మర్చేపోతారని బాధగా ఉందన్నాడు మహర్షి


హనుమ తాను రాసిన లక్షలాది రాళ్లను, వాటిని కలిగి ఉన్న ఆ పర్వతాన్ని తన భక్తి తాత్పర్య సర్వస్వాన్ని ఒక్క సారి కలయ తిరిగి చూసి వెంటనే ఒక నిర్ణయానికి

వచ్చి, ఆ పర్వతాన్ని దానిపై తాను శ్లోకాలలో రచించిన రామాయణమున్న లక్షలాది రాళ్లతో సహా క్షణంలో పెకలించి మారుత వేగంతో మారుతి దగ్గరలో ఉన్న సముద్రంలో ముంచేశాడు. అక్కడ ఏం జరుగుతోందో అని వాల్మీకి గ్రహించేలోపు ఈ పని అంతా పూర్తైంది. మహర్షి తీవ్ర దిగ్భ్రాంతి చెందాడు. హనుమతో తాను మరొక జన్మ దాల్చి హనుమద్రామాయణం అంతా మళ్ళీ తిరగ రాసి హనుమ కవితా శక్తిని భక్తి గరిమను, ధైర్య సాహసాలను లోకానికి తెలియ జేస్తానన్నాడు.

కాలం గడిచిపోయింది. మహాకవి కాళిదాసు కాలంలో హనుమద్రామాయణం రాయబడిన ఒకే ఒక్క రాయి సముద్ర తీరానికి కొట్టుకు వచ్చింది. దాన్ని ఒడ్డుకు చేర్చి అందులోని శ్లోక భావాన్ని విద్యావేత్తలెవరైనా చదివి అర్థం చెప్పటానికి వీలుగా దాన్ని ఒక బహిరంగ ప్రదేశంలో నెలకొల్పారు. కాళిదాస మహాకవి హనుమద్రామాయణం గురించి అంతకు ముందే విని ఉన్నాడు కనుక అది తన అదృష్టంగా భావించి కాలంలో కలిసిపోయిన ఆ లిపిని జాగ్రత్తగా పరిశీలించి ఆది పూర్తి శ్లోకం కాదని అందులో ఒక్క పాదమేనని గ్రహించి అందులోని భావాన్ని అందరకు ఇలా తెలియ జేశాడు – "ఓ రావణా !శివుని కైలాసాన్ని ఎత్తిన నీ పది తలలు ఇప్పుడు యుద్ధభూమిలో కాకులు గద్దలకు ఆహారంగా భూమిపై పడివున్నాయి. నీ దశగ్రీవాల పొగరు, గర్వాలు ఒక సత్ప్రవర్తకుని చేతిలో నేలరాలాయని గ్రహించు"

మహా పౌరాణికులు బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారు తమ రామాయణ, సుందర కాండ ప్రవచనాలతో హను మద్రామాయణాన్ని ఉదహరిస్తూ చెబుతూ "ఇది హనుమరాసుకున్న రామాయణం" అనటం నేను చాలాసార్లు విన్నాను. కానీ దానిప్రతి కోసం నెట్‌లో వెతికాను తెలుగు లిపిలో ఉన్నట్లు తెలిసింది కానీ లభ్యం కాలేదు.

సంస్కృతంలో వాల్మీకి మహర్షి రచించిన శ్రీ మద్రామాయణం కాక "ఆధ్యాత్మ రామాయణం" కూడా ఉంది. ఇది వ్యాసమహర్షి రచించిన బ్రహ్మాండ పురాణంలో ఉంది. ఇవికాక వశిష్ఠ రామాయణం లేక యోగ వాశిష్టం, ఆనందరామాయణం, అద్భుత రామాయణం ఉన్నాయి. వీటికర్త వాల్మీకి మహర్షి, అగస్త్యుడు రాసినట్లు చెప్పబడుతున్న అగస్త్య రామాయణం కూడా ఉంది. కాశ్మీర కవి అభినందన – యోగవాశిష్టాన్ని సంక్షిప్తీకరించి "లఘు యోగ వాశిష్ఠ" కూర్చాడు.❀



## 36) వేద విభజన చేసి బ్రహ్మ సూత్రాలు పురాణాలు రాసిన - వేద వ్యాసమహర్షి

అపౌరుషాలైన వేదాలు అనంతంగా పెరిగిపోతే వాటిని చదవటం కష్టమని భావించి వ్యాసమహర్షి చతుర్వేద విభజన చేసి వేద వ్యాసుడయ్యాడు. మహా భారత రచన చేసి మన సంస్కృతికి వ్యాప్తి కల్గించాడు. ఇంతటి ఉద్గ్రంథం ప్రపంచంలో ఏ భాషలోనూ లేదు. భారతంలో లేనిది లోకంలో లేదని లోకంలో ఉండనిది భారతంలో ఉండదని ఒక లోకోక్తి. సజీవ పాత్రలతో, రసమయ ఘట్టాలతో మనోహర వర్ణాలతో మానవ జీవితలోతులను తరచి ధర్మా ధర్మాలను, మంచి చెడ్డలను, సంప్రదాయాలను మహోత్కృష్టంగా ఆవిష్కరించి చెప్పినది భారతం. భారతంలో వ్యాసుడూ కూడా ఒక పాత్ర. దీనికే జయ అనే పేరు కూడా ఉంది. ఇది 24 వేల శ్లోకాలతో 18 పర్వాలతో చెరకుగడలా మధురమైన రచన, ఉద్గ్రంథం. పంచమ వేదంగా గుర్తింపు పొందింది. ఇందులో అర్జునునికి కృష్ణుడు 18 అధ్యాయాలతో బోధించిన భగవద్గీత విశ్వవ్యాప్తమైంది. సంస్కృత మహాకావ్యంగా ఇతిహాసంగా పురాణంగా ప్రసిద్ధి చెందింది మహాభారత రచనకు లేఖకుడుగా విఘ్నేశ్వరుడు ఉన్నాడు. ఇద్దరూ "బదరికాశ్రమం"లో ఏకాంత గుహావాసం చేసి రెండున్నర ఏండ్లలో రచించారు. కృష్ణ ద్వైపాయనుడనే సార్ధక నామం ఉన్నవాడు. అంటే నల్లని రంగుతో ద్వీపంలో జన్మించినవాడు. తల్లి సత్యవతి దాశరాజు కుమార్తె తండ్రి పరాశరమహర్షి 18 పురాణాలు రాశాడు. అద్వితీయ మైన బ్రహ్మ సూత్ర రచన చేశాడు. అంబిక వలన ధృతరాష్ట్రుని అంబాలిక వలన పాండురాజును దాసివలన విదురునికి జన్మనిచ్చి కురు వంశాన్ని తల్లి సత్యవతి అభ్యర్ధనపై నిలబెట్టినవాడు. పూర్వజన్మలో విష్ణుమూర్తి "భూ" శబ్దాన్ని పలుకగా అపాంతర తామసుడు అనే ఋషిగా జన్మించినవాడు. వైశాఖ శుద్ధ పౌర్ణమి వ్యాస పూర్ణమిగా గురు పూర్ణమిగా భావించి వ్యాస మహర్షిని అర్చిస్తారు .

వ్యా నేపాల్ దేశంలో తానాహుజిల్లా "దమౌళీ"లో వ్యాసుడు తపస్సు చేసి బ్రహ్మ సూత్రాలు పురాణాలు వేద విభజన చేసిన గుహ ఉంది అది గొప్ప యాత్రాస్థలం. విష్ణు మూర్తి

యొక్క "కాలావతారం" వ్యాసుడు. చిరంజీవులలో ఒకడు. అద్వైత ఋషిపరంపరలో నాల్గవవాడు. ప్రతి యుగంలో ఒక వ్యాసుడు పుడతాడు. వ్యాసుడు అనేది ఒక అధికారం. ద్వాపరంలో కృష్ణ ద్వైపాయనుడు లేక బాదరాయణుడు వ్యాసుడయ్యాడు. వ్యాస పరంపరలో 28వ వాడు. మొదటి ద్వాపరంలో స్వాయంభువు వ్యాసుడు అయ్యాడు. రెండవ ద్వాపరంలో ప్రజాపతి వ్యాసుడు. మూడవదానిలో శుక్రుడు వ్యాసుడు. ఆ తర్వాత వసిష్ఠుడు, త్రివర్షుడు, సనద్వాజుడు వగైరా 27 మంది వ్యాసులు అయ్యాక ద్వాపరంలో కృష్ణ ద్వైపాయనుడు వ్యాసుడు అయ్యాడు.

విష్ణుమూర్తి నాభికమలం నుంచి బ్రహ్మ పుట్టి నాలుగు ముఖాలనుండి నాలుగు వేదాలను ప్రసరింప జేయాలనుకొన్నప్పుడు విష్ణువు మనసులో తలచుకోగానే "అపాంతర తముడు" జన్మించాడు. పుత్రోత్సాహంతో నారాయణమూర్తి "వ్యాసా! రా నాయనా! నా మానస పుత్రుడివిగా పుట్టి నాకు ఆనందాన్నిచ్చావు. అన్ని మన్వంతరాలలోనూ ఇలానే జన్మించు. తర్వాత పరాశర కుమారునిగా పుట్టి, కురురాజుల అధర్మ క్రూర హింసా దౌర్జన్యాలను అదుపు చేసి, వేదాన్ని వ్యాపకం చెయ్యి. నీకు రాగద్వేష రహితుడైన కొడుకు పుట్టి నిన్ను మించిపోతాడు" అన్నాడు. రాబోయే సూర్య సావర్ణికాలంలో వ్యాసుడు సప్తర్షులలో ఒకడు అవుతాడు.

### కృష్ణ ద్వైపాయన వ్యాస జననం

లోకోద్ధరణ కోసం నారాయణుడు కొన్ని ధర్మాలు ఏర్పాటు చేశాడు. కాలక్రమంలో అవి లోపించాయి. బ్రహ్మ రుద్రా ఇంద్రాది దేవతలు విష్ణుమూర్తిని దర్శించి ధర్మ పునరుద్ధరణ చేయమని ప్రార్థించగా మూడవదైన ద్వాపర యుగంలో పరాశర సత్యవతి దంపతులకు ఆషాఢ శుద్ధ పౌర్ణమి నాడునారాయణుడు వ్యాసభగవానుడుగా అవతరించాడు. ఒక రోజు వ్యాసుడు సరస్వతీ నదిలో స్నానం చేసి తపోధ్యానాలు పూర్తి చేసి ఏకాంతం లో ఆసీనుడై దివ్య దృష్టితో యుగ విశేషాలను తెలుసుకున్నాడు. కాల ప్రభావాన భౌతిక భావనలు అంటే శక్తులు తగ్గుతున్నాయని గ్రహించాడు. శ్రద్ధ బలం ఆయుస్సు తగ్గి దౌర్బల్యం పెరిగినట్లు గుర్తించాడు అన్ని వర్ణాలవారికి ఉపయోగపడేట్లు వైదిక కర్మలను పరీక్షించి యజ్ఞ విస్తరణకు ఒక్కటిగా ఉన్న వేదాన్ని నాలుగుగా విభజించాడు. పంచమ వేదంగా మహాభారతం రచించాడు. పైలుడికి ఋగ్వేదం, వైశంపాయుడికి యజుర్వేదం జైమినికి సామం, సుమంతునికి అదర్వణం ఉప దేశించాడు. ఇతిహాస పురాణం అనే పంచమ వేదం భారతాన్ని రోమ హర్షుడు అనే సూతమునికి చెప్పాడు. వీరంతా తమ శిష్యులకు బోధిస్తే వారు వారి శిష్యులకు ఉపదేశించగా అనేక శాఖలయ్యాయి.

కొంచెం బుద్ధి తక్కువగా ఉన్నవారికి ఉపాఖ్యాన కథా, సంస్కృతి రూపంగా మహా భారతం రాశాడు. దీనిలో ధర్మం సంస్కృతీ మొదలైన విషయాలన్నీ చెప్పాడు వ్యాసుడు. ద్వాపరాంతంలో వచ్చే కలియుగంలో వచ్చే అనర్ధాలు, ఆపద గ్రహించటానికి భారత రచన చేశాడు. అన్ని వర్ణాలవారు జాతులవారు లింగ వయో భేదం లేకుండా ఆచరించదగిన ధర్మాలు ధర్మ సూక్ష్మాలు చిన్న చిన్న కథలలో చెప్పాడు.

దీనితో తృప్తిపడక జ్ఞానులకు పరబ్రహ్మ స్వరూపం తెలుసుకోవటానికి 545 బ్రహ్మ సూత్రాలు రాశాడు దీనికి శంకరాచార్య భాష్యం రాశారు. అష్టాదశ అంటే 18 పురాణాలు రచించాడు. వేదానికి అంతాలైన ఉపనిషత్తులు రాశాడు. వీటిలో దశోపనిషత్తులకు శంకర భాష్యం ఉంది. అంతా బాగానే ఉంది కానీ సర్వ వ్యాపకుడైన పరమేశ్వరుడి గురించి భక్తి తాత్పర్యాలతో రాయలేక పోయానని చింతిస్తుంటే నారదముని హితోపదేశంతో శ్రీ విష్ణు లీలామృతమైన శ్రీమద్ భాగవతం రాశాడు. దీన్ని పోతనామాత్యుడు మందార మకరంద తుందిలంగా తెలుగులోకి అనువదించాడు. భారతాన్ని నన్నయ తిక్కన ఎర్రనలనే కవిత్రయం అనువదించారు.

ఇవన్నీ లోక శ్రేయస్సుకోసం రాయబడినవే. భారతం హరివంశం కలిపి 1 లక్షా 25 వేలు పురాణాల్లో 5 లక్షల శ్లోకాలు మొత్తం 6 లక్షల 25 వేళా శ్లోకాలు రాశాడు భగవాన్ వేదం వ్యాసుడు. భారతం చివరలో వ్యాసుడు– "యదాహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి సతత్ క్వచిత్" అని ఒక ప్రతిజ్ఞ చేశాడు– అంటే "భరతంలో లేనిది ఎక్కడా ఉండదు– ఇందులో లేనిది ఇంకెక్కడా ఉండదు" శాంతి అనుశాశానిక స్వర్గారోహణ పర్వతాలలో 26 వేల శ్లోకాలలో రాజనీతి, ఆపద్ధర్మాలు, దానం ధర్మం, మోక్షప్రాప్తి, స్త్రీ ధర్మాలు వివవిడి విడిగా చెప్పాడు. అంటే పాత్రలచేత చెప్పించాడు. భారతంలోని పాత్రలు మనమే మన ఇళ్లల్లో జరిగే కథయే భారత కథ.

ఇన్ని ఇన్ని రకాలుగా చెప్పినా పెడ చెవిని పెట్టి వారిని చూసి జాలితో బాధతో వ్యథతో "ఊర్ధ్వ బాహుః విరోమ్యేష నహి కశ్చిత్ శృణోతిమే –పరోపకారాయ పుణ్యాయ, పాపాయి పర పీడనం" అని చేతు లెత్తి మొక్కాడు – అంటే "ఇతరులకు మేలు చేస్తే పుణ్యం–ఇతరులను బాధిస్తే పాపం" అని చేతులు పైకెత్తి నెత్తీ నోరూ మొత్తుకున్నా నా మాట ఎవరూ వినటం లేదే" అని పరితపించాడు ఆ విశాల దయార్ద్ర హృదయుడు వ్యాస భగవానుడు.

**భారతంలో వ్యాస పాత్ర**

భారత రచన చేయటమేకాక అందులో తానూ పాత్రధారియే వ్యాసుడు. తల్లికిచ్చిన మాటకోసం కురువంశాన్ని నిలపటానికి పాండవ ధృతరాష్ట్ర విదురులకు

జన్మనిచ్చాడు. అవసరమైనప్పుడు రంగప్రవేశం చేసి ధర్మ సూక్ష్మాలు చెప్పాడు. అర్జునుడు మత్స్య యంత్రాన్ని ఛేదించి ద్రౌపదిని దక్కించుకొంటే ధర్మరాజు ఆమె సోదరులందరికి భార్య అవ్వాలంటే ద్రుపదుడు వ్యాసుడిని తలచుకొంటే వచ్చి ఆమె సామాన్య మానవ స్త్రీ కాదు అయోనిజ యాజ్ఞ సేనీ కనుక పంచ భర్తృక అవటంలో తప్పు లేదని తీర్పు చెప్పాడు. వనవాసంలో పాండవులు కష్టాలు పడుతూ ప్రార్ధిస్తే "మీకే కాదు కష్టాలు మీ ముందు నలమహారాజు దమయంతి ఎన్నో కష్టాలుపడి చివరికి సుఖపడ్డారని ఆ కథ చెప్పి ఊరట కలిగిచాడు. అర్జుడిని శివుని మెప్పించి పాశుపతాస్త్రం సాధించామని సలహా ఇచ్చాడు. కురుపాండ బలాలను బేరీజు వేసి చెప్పమని గుడ్డిరాజు కోరితే ధర్మం కృష్ణ రూపంలో పాండవుల వద్ద ఉంది ధర్మం ఉన్నచోట విజయం తప్పదు అని నిష్కర్షగా చెప్పాడు. కురుక్షేత్ర సంగ్రామం ముందు వచ్చి "నువ్వు తెచ్చిన యుద్ధం యెంత అనర్ధాన్ని తెస్తోందో చాడాలని ఉంటే కళ్ళు ఇస్తానంటాడు. చేసిన తప్పు తెలుసుకనుక తాను ఆ భీభత్సాన్ని చూసి తట్టుకోలేను అంటే సూతుడికి దివ్య ద్రుష్టి ప్రసాదించి యుద్ధాన్ని ప్రత్యక్ష ప్రసారంగా చూసి గుడ్డిరాజుకు చెప్పించాడు.

అశ్వత్థామ కృష్ణార్జునులపై నారాయణాస్త్రం సాధించగా వారిద్దరో దానికి నస్కరించగానే అది నిర్వీర్యమై పోతే, కారణం తెలీక జుట్టు పీక్కొని వ్యాసుని స్మరిస్తే వచ్చి "మీ మీ శివ పూజా ఫలితం ఇది. వాళ్లిద్దరూ పూర్వ జన్మలో శివుడిని మట్టి లింగంగా చేసి ఆరాధిస్తే నువ్వు విగ్రహ రూపంలో పూజించావు. లింగా రాధన సర్వ శ్రేయస్కరం అది వారిని కాపాడింది" అని ధర్మ సూక్షం చెప్పాడు. వ్యాసునికి ఆంధ్రదేశానికీ సంబంధం ఉంది. ఏడు రోజులు కాశీలో వ్యాసునికి శిష్యులకు భోజనం దొరక్కపోతే కోపంతో కాశీని శపించాలని సంకల్పించి భిక్షా పాత్రను నేలమీద శతధా భిన్నం అయేట్లు పగలకొడితే ముదుసలి సాధ్వీరూపంలో పార్వతీదేవి వచ్చి విందుకు ఆహ్వానించి కమ్మని భోజనం పెడితే అప్పుడు శివపార్వతులు వారి వద్ద ప్రత్యక్షమవగా శివుడు కోపంతో "పుణ్యరాశి కాశీ పైశాపం పెడతావా పొమ్ము నిర్భాగ్య మా యూరి పొలము విడిచి" అని కాశీనుంచి గెంటేస్తే బ్రతిమాలితే దక్షిణకాశి దాక్షారామం వెళ్లి భీమేశ్వర సేవలో తరించమని చెబితే విధవ లేక విధవ లేక ద్రాక్షారామ చేరగా అక్కడ అగస్త్య మహర్షి ఊరట కలిగిస్తాడు. బాసర సరస్వతీ ఆలయం మనకు తెలుసు. వ్యాస బాసర అయింది. అలాగే కాశ్మీర్లో ప్రవహించే బియాస్ నది అంటే వ్యాస నది అని అర్ధం. ఇలా ప్రకృతితో మమేక అమినవాడు వ్యాసుడు.

రెండు చిలుకలు సంసారవీ చేస్తుంటే ముచ్చటపడి తనకు ఒక కొడుకు కావాలనుకొని హిమాలయాలకు వెళ్లి శక్తిని గూర్చి తీవ్ర అతపస్సు చెస్తే, తపోభంగానికి వచ్చిన ఘృతాచి అనే అప్సరస చేసిన ప్రయత్నాలు ఫలించక చిలుక రూపంలో వస్తే

రేతస్కలనం జరిగి పుట్టిన కుమారుడే శుకమహర్షి ఆయన మూతి చిలక మూతిలాగా ఉంటుందంటారు. పుట్టగానే సకలశాస్త్రాలు వచ్చేశాయి జనకమహా రాజు వద్ద బ్రహ్మ విద్య నేర్చాడు. పరీక్షిత్తుకు ఏడు రోజులలో మహాభారత కథ అంతా చెప్పాడు శుకమహర్షి. నిరీహుడు నిస్సంగుడు శుకుడు. తండ్రి పరాశరుని పేరా పరాశర సంహిత ఉంది. ఆంజనేయ చరిత్ర అంతా అందులో ఉంటుంది.

ఇంతటి జ్ఞానాన్ని ధర్మాలను నీతులను అక్షరరూపంగా ప్రసాదించిన భారత జాతి వ్యాసభగవానునికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలదు కనీసం వ్యాస పూర్ణిమ నాడైనా ఆ గురుమహారాజును స్మరిద్దాం. ఇలాంటి అరుదైన అవకాశం అమెరికాలో షార్లెట్‌లో సరసభారతి 104వ సమావేశంగా వ్యాస జయంతిని తమ ఇంట్లో జరిపించిన రాంకీ ఉషా దంపతులకు, ఆసక్తిగా వచ్చి పాల్గొన్న వారందరికీ సరసభారతి ధన్యవాదాలు తెలియజేస్తోంది. ప్రతి సంవత్సరం మా అమ్మాయి శ్రీమతి విజయలక్ష్మి అల్లుడు శ్రీ అవధాని శంకర జయంతి జరుపుతున్నట్లే వ్యాస జయంతిని గురుపౌర్ణమిగా నిర్వహించాలని ఈ దంపతులను కోరుతున్నాను" అని చెప్పి ఇక్కడ భారతీయ సంస్కృతిని ఆచరిస్తూ నిలబెడుతున్న చి.అడుసుమిల్లి రామకృష్ణ (రాంకీ)కు సరసభారతి ఆనందంగా "సంస్కృతీ ప్రదీపక" బిరుదు ప్రదానం చేస్తున్నానని అనగానే అందరు హర్ష ధ్వానాలతో చప్పట్లు మోగించారు. సరసభారతి గ్రంథం "గీర్వాణ కవుల కవితా గీర్వాణం -2 (రెండవ భాగం) రాంకీ దంపతులకు మా దంపతులం కానుకగా అంద జేశాము. మంత్ర పుష్పంతో కార్యక్రమం పూర్తయింది.

ఆ తర్వాత పప్పు, వంకాయ కూర చిక్కుడుకాయ కూర కాబేజీ కూర టమేటా చట్నీ, స్వీటు, పులిహోర, బజ్జీలు అప్పడం, మజ్జిగ పులుసు, చారు పెరుగు పల్లముక్కలతో కమ్మని భోజనం ఏర్పాటు చేశారు. అందరం తృప్తిగా తిని ఆనందించాం. మా దంపతులకు రాంకీ దంపతులు నూతన వస్త్రాలు సమర్పించి "ఘనమైన నగదు" తాంబూలం ఇచ్చి ఆశీర్వాదం పొందారు. ఇలా సుమారు 15 గంటల వ్యవధిలో సరసభారతి 104వ కార్యక్రమంగా వ్యాస జయంతిని అమెరికాలోని షార్లెట్‌లో జరిపి అందరి సహకారంతో రికార్డ్ సృష్టించింది.

**వ్యాసస్తుతి - "అచతుర్వేదో బ్రహ్మ ద్విబాహు రాపారోహరిహ్ -అఫాల లోచన శృం భుహ్ భగవాన్ బాదరాయణః" వ్యాస అష్టోత్తర స్తోత్రం**

1-వేద వ్యాసో విష్ణు రూపః పరాశరార్యాస్తపోనిధిః -సత్య సందహ్ ప్రశాంతస్య సత్య వాదీ సుతః

2-కృష్ణ ద్వైపాయనో దాంతో బాదరాయణ సంజ్ఞితః -బ్రహ్మ సూత్ర ప్రథితవాన్ భగవాన్

జ్ఞాన భాస్కరః
3–సర్వ వేదాంత తత్వజ్ఞః సర్వేజనా వేద మూర్తిమాన్–వేదం శాఖావ్యసన కృత కృత్యో మహా మునిః
4–మహా బుద్ధిర్మహాసిద్ధిర్మహా శక్తి ర్మహా ధృతిః మహా కర్మా మహా ధర్మా మహా భారత కల్పకః
5–మహా పురాణ క్రుజ్ఞానీ జ్ఞాన విజ్ఞాన భాజనం –చిరంజీవీ చిదాకారీ శ్చిత్త దోష నివారకః
6–వాశిష్ఠహః శక్తి పౌత్రస్య శుకదేవర్గునుర్గురుః –ఆషాఢ పూర్ణిమా పూజ్యా పూర్ణ చంద్ర నిభాననః
7–విశ్వనాథ స్తుతికరో విశ్వజనో జగద్గురుః – జితేన్ద్రియో జితక్రోధో వైరాగ్య నిరతః శుచిః
8–జైమిన్యాది సదాచార్యః సదాచార సదాస్థితః స్థితప్రజ్ఞః స్థిరమతిః సమాధి సంస్థితారతః
9–ప్రశాంతిదః ప్రసన్నాత్మా శంకరార్యప్రసాద కృత్ –నారాయణాత్మకః స్తవ్యః సర్వ లోక హితే రతః
10–అఛత్రవదన బ్రహ్మ ద్విభుజబర కేశవః –అఫాల లోచనశ్శివః పరబ్రహ్మ స్వరూపకః
11– బ్రహ్మన్యో బ్రహ్మణో బ్రాహ్మీ బ్రహ్మ విద్యా విశారదః –బ్రహ్మాత్మైకత విజ్ఞాతా బ్రహ్మ భూతః సుఖాత్మకః
12–వేదాంగ భాస్కరో విద్వాన్ వేద వేదాంత పారగః –ఉపాంతరతమో నామా వేదాచారో విచారవాన్.

**వ్యాసునిపై కొన్ని ప్రత్యేక శ్లోకాలు**

1–వేద వ్యాసః స్వాత్మ రూపం సత్య సంధం పరాయణం – శాంతం జితేంద్రియ క్రోధం సా శిష్యం ప్రణమామ్యహం
2–వ్యాసం వశిష్ఠ నప్తారం శక్తే పౌరుష మకల్మషం –పరాశరాత్మజం వన్దే శుక తాతం తపోనిధిమ్
3–వ్యాసాయ విష్ణు రూపాయ వ్యాస రూపాయ విష్ణవే –నమో వై బ్రహ్మ నిధ్యాయ వాసిష్టాయ నమోనమః
4–అవికారాయ శుద్ధాయ నిత్యాయ పరమాత్మనే –సదైక రూప రూపాయ విష్ణవే సర్వ జిష్ణవే
5–వ్యాస స్మరణ మాత్రేణ జన్మ సంసార బంధనాత్ విముచ్యతే –నమస్తస్మై విష్ణవే ప్రభ విష్ణవే

పరాశర స్తుతి

6–కరుణాతీత చిద్రూపం పరి పూర్ణ పరాయణం – పరమానంద సంతుష్టం పరాశర

మొహం శ్రయే

శుక స్తుతి

7-త్రికాలాతీత చిన్మాత్ర ప్రశాంత స్వాంత సంయుతం -వికార ఘోర సంస్పృష్టం శుకం గురు మొహం శ్రయే

శంకరాచార్య స్తుతి

8-శంకా రూపేణ మచ్చిత్తం పంకీకృత మాభూద్యేయా -కింకరీ యస్య సా మాయా శంకరాచార్య మాశ్రయే

భావం- మాయ అందర్నీ కప్పి ఆడిస్తుంది. మనసు బుద్ధిలలో కల్లోలాలు తుఫాన్లు సృష్టిస్తుంది. అలాంటి మాయను కింకరి అంటే సేవకురాలినిగా చేసుకొన్నశంకరాచార్యులు ప్రణామం.

**వేద వ్యాస చరిత్ర**

నేపాల్ దేశంలో తానాహుజిల్లా "దమౌళీ"లో వ్యాసుడు తపస్సు చేసి బ్రహ్మ సూత్రాలు పురాణాలు వేద విభజన చేసిన గుహ ఉంది అది గొప్ప యాత్రాస్థలం. విష్ణుమూర్తి యొక్క "కాలావతారం" వ్యాసుడు. చిరంజీవులలో ఒకడు. అద్వైత ఋషిపరంపరలో నాల్గవవాడు. ప్రతి యుగంలో ఒక వ్యాసుడు పుడతాడు. వ్యాసుడు అనేది ఒక అధికారం. ద్వాపరంలో కృష్ణ ద్వైపాయనుడు లేక బాదరాయణుడు వ్యాసుడయ్యాడు. వ్యాస పరంపరలో 28వ వాడు. మొదటి ద్వాపరంలో స్వాయంభువు వ్యాసుడు అయ్యాడు. రెండవ ద్వాపరంలో ప్రజాపతి వ్యాసుడు. మూడవదానిలో శుక్రుడు వ్యాసుడు. ఆ తర్వాత వసిష్ఠుడు, త్రివర్షుడు, సనద్వాజుడు వగైరా 27 మంది వ్యాసులు అయ్యాక ద్వాపరంలో కృష్ణ ద్వైపాయనుడు వ్యాసుడు అయ్యాడు.

విష్ణుమూర్తి నాభికమలం నుంచి బ్రహ్మ పుట్టి నాలుగు ముఖాలనుండి నాలుగు వేదాలను ప్రసరింప జేయాలనుకొన్నప్పుడు విష్ణువు మనసులో తలచుకోగానే "అపాంతర తముడు" జన్మించాడు. పుత్రోత్సాహంతో నారాయణ మూర్తి "వ్యాసా! రా నాయనా! నా మానస పుత్రుడివిగా పుట్టి నాకు ఆనందాన్నిచ్చావు. అన్ని మన్వంతరాలలోనూ ఇలానే జన్మించు. తర్వాత పరాశర కుమారునిగా పుట్టి, కురురాజుల అధర్మ క్రూర హింసా దౌర్జన్యాలను అదుపు చేసి, వేదాన్ని వ్యాపకం చెయ్యి. నీకు రాగద్వేష రహితుడైన కొడుకు పుట్టి నిన్ను మించిపోతాడు" అన్నాడు. రాబోయే సూర్య సావర్ణికాలంలో వ్యాసుడు సప్తర్షులలో ఒకడు అవుతాడు.

**కృష్ణ ద్వైపాయన వ్యాస జననం**

లోకోద్ధరణ కోసం నారాయణుడు కొన్ని ధర్మాలు ఏర్పాటు చేశాడు కాలక్రమంలో

అవి లోపించాయి. బ్రహ్మ రుద్ర ఇంద్రాది దేవతలు విష్ణుమూర్తిని దర్శించి ధర్మ పునరుద్ధరణ చేయమని ప్రార్ధించగా మూడవదైన ద్వాపర యుగంలో పరాశార సత్యవతి దంపతులకు ఆషాఢ శుద్ధ పౌర్ణమి నాడు నారాయణుడు వ్యాసభగవానుడుగా అవతరించాడు. ఒక రోజు వ్యాసుడు సరస్వతీ నదిలో స్నానం చేసి తపోధ్యానాలు పూర్తి చేసి ఏకాంతంలో ఆసీనుడై దివ్య దృష్టితో యుగ విశేషాలను తెలుసుకున్నాడు. కాల ప్రభావాన భౌతిక భావనలు అంటే శక్తులు తగ్గుతున్నాయని గ్రహించాడు. శ్రద్ధ బలం ఆయుస్సు తగ్గి దౌర్బల్యం పెరిగినట్లు గుర్తించాడు అన్ని వర్ణాలవారికి ఉపయోగ పడేట్లు వైదిక కర్మలను పరీక్షించి యజ్ఞ విస్తరణకు ఒక్కటిగా ఉన్న వేదాన్ని నాలుగుగా విభజించాడు. పంచమ వేదంగా మహాభారతం రచించాడు. పైలుడికి ఋగ్వేదం, వైశంపాయుడికి యజుర్వేదం జైమినికి సామం, సుమంతునికి అదర్వణం ఉపదేశించాడు. ఇతిహాస పురాణం అనే పంచమ వేదం భారతాన్ని రోమ హర్షుడు అనే సూతమునికి చెప్పాడు. వీరంతా తమ శిష్యులకు బోధిస్తే వారు వారి శిష్యులకు ఉపదేశించగా అనేకశాఖలయ్యాయి.

కొంచెం బుద్ధి తక్కువగా ఉన్నవారికి ఉపాఖ్యాన కథారూపంగా మహాభారతం రాశాడు దీనిలో ధర్మం సంస్కృతీ మొదలైన విషయాలన్నీ చెప్పాడు వ్యాసుడు. ద్వాపరాంతంలో వచ్చే కలియుగంలో వచ్చేఅనర్దాలు, ఆపద గ్రహించటానికి భారత రచన చేశాడు. అన్ని వర్ణాలవారు జాతులవారు లింగ వయో భేదం లేకుండా ఆచరించదగిన ధర్మాలు ధర్మ సూక్ష్మాలు చిన్న చిన్న కథలలో చెప్పాడు.

దీనితో తృప్తిపడక జ్ఞానులకు పరబ్రహ్మ స్వరూపం తెలుసుకోవటానికి 545 బ్రహ్మ సూత్రాలు రాశాడు దీనికి శంకరాచార్య భాష్యం రాశారు. అష్టాదశ అంటే 18 పురాణాలు రచించాడు. వేదానికి అంతాలైన ఉపనిషత్తులు రాశాడు. వీటిలో దశోపనిషత్తులకు శంకర భాష్యం ఉంది. అంతా బాగానే ఉంది కానీ సర్వ వ్యాపకుడైన పరమేశ్వరుడి గురించి భక్తి తాత్పర్యాలతో రాయలేక పోయానని చింతిస్తుంటే నారదముని హితోపదేశంతో శ్రీ విష్ణు లీలామృతమైన శ్రీ మద్ భాగవతం రాశాడు. దీన్ని పోతనామాత్యుడు మందార మకరంద తుందిలంగా తెలుగులోకి అనువదించాడు. భారతాన్ని నన్నయ తిక్కన ఎర్రనలనే కవిత్రయం అనువదించారు. ఇవన్నీ లోక శ్రేయస్సుకోసం రాయబడినవే. భారతం హరివంశం కలిపి 1 లక్షా 25 వేలు పురాణాల్లో 5 లక్షల శ్లోకాలు. మొత్తం 6 లక్షల 25 వేళా శ్లోకాలు రాశాడు భగవాన్ వేదం వ్యాసుడు. భారతం చివరలో వ్యాసుడు –"యదాహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి సతత్ క్వచిత్" అని ఒక ప్రతిజ్ఞ చేశాడు– అంటే "భారతంలో లేనిది ఎక్కడా ఉండదు – ఇందులో లేనిది ఇంకెక్కడా ఉండదు "శాంతి ఆనుశాశానిక స్వర్గా రోహణ పర్వతాలలో

26 వేల శ్లోకాలలో రాజనీతి, ఆపద్ధర్మాలు, దానం ధర్మం, మోక్షప్రాప్తి, స్త్రీ ధర్మాలు విడి విడిగా చెప్పాడు. అంటే పాత్రల చేత చెప్పించాడు. భారతంలోని పాత్రలు మనమే. మన ఇళ్లల్లో జరిగే కథయే భారత కథ.

ఇన్ని ఇన్ని రకాలుగా చెప్పినా పెడ చెవిని పెట్టి వారిని చూసి జాలితో బాధతో వ్యధతో "ఊర్ధ్వ బాహుః విరోమ్యేష నహి కశ్చిత్ శృణోతిమే –పరోపకారాయ పుణ్యాయ, పాపాయి పర పీడనం" అని చేతు లెత్తి మొక్కాడు – అంటే "ఇతరులకు మేలు చేస్తే పుణ్యం –ఇతరులను బాధిస్తే పాపం" అని చేతులు పైకెత్తి నెత్తీ నోరూ మొత్తుకున్నా నా మాట ఎవరూ వినటం లేదే" అని పరితపించాడు ఆ విశాల దయార్ద్ర హృదయుడు వ్యాస భగవానుడు.

**భారతంలో వ్యాస పాత్ర**

భారత రచన చేయటమేకాక అందులో తానూ పాత్రధారియే వ్యాసుడు. తల్లికిచ్చిన మాటకోసం కురు వంశాన్ని నిలపటానికి పాండవ ధృతరాష్ట్ర విదురులకు జన్మనిచ్చాడు. అవసరమైనప్పుడు రంగప్రవేశం చేసి ధర్మ సూక్ష్మాలు చెప్పాడు అర్జునుడు మత్స్య యంత్రాన్ని భేదించి ద్రౌపదిని దక్కించుకొంటే ధర్మరాజు ఆమె సోదరులందరికి భార్య అవ్వాలంటే ద్రుపదుడు వ్యాసుడిని తలచుకొంటే వచ్చి ఆమె సామాన్య మానవ స్త్రీ కాదు అయోనిజ యాజ్ఞ సేనీ కనుక పంచ భర్తృక అవటంలో తప్పు లేదని తీర్పు చెప్పాడు. వనవాసంలో పాండవులు కష్టాలు పడుతూ ప్రార్ధిస్తే "మీకే కాదు కష్టాలు మీ ముందు నలమహారాజు దమయంతి ఎన్నో కష్టాలుపడి చివరికి సుఖపడ్డారని ఆ కథ చెప్పి ఊరట కలిగిచాడు. అర్జుడిని శివుని మెప్పించి పాశుపతాస్త్రం సాధించామని సలహా ఇచ్చాడు. కురుపాండ బలాలను బేరీజు వేసి చెప్పమని గుడ్డిరాజు కోరితే ధర్మం కృష్ణ రూపంలో పాండవుల వద్ద ఉంది ధర్మం ఉన్న చోట విజయం తప్పదు అని నిష్కర్షగా చెప్పాడు. కురుక్షేత్ర సంగ్రామం ముందు వచ్చి "నువ్వు తెచ్చిన యుద్ధం యెంత అనర్ధాన్ని తెస్తోందో చాడాలని ఉంటె కళ్ళు ఇస్తానంటాడు. చేసిన తప్పు తెలుసుకనుక తాను ఆ భీభత్సాన్ని చూసి తట్టుకోలేను అంటే సూతుడికి దివ్య ద్రుష్టి ప్రసాదించి యుద్ధాన్ని ప్రత్యక్ష ప్రసారంగా చూసి గుడ్డిరాజుకు చెప్పించాడు.

అశ్వత్థామ కృష్ణార్జునులపై నారాయణాస్త్రం సాధించగా వారిద్దరో దానికి నంస్కరించగానే అది నిర్వీర్యమై పొతే, కారణం తెలీక జుట్టు పీక్కొని వ్యాసుని స్మరిస్తే వచ్చి "మీ మీ శివ పూజా ఫలితం ఇది. వాళ్లిద్దరూ పూర్వ జన్మలో శివుడిని మట్టి లింగంగా చేసి ఆరాధిస్తే నువ్వు విగ్రహ రూపంలో పూజించావు. లింగా రాధన సర్వ శ్రేయస్కరం అది వారిని కాపాడింది" అని ధర్మ సూక్ష్మం చెప్పాడు. వ్యాసునికి ఆంధ్రదేశానికీ సంబంధం ఉంది. ఏడు రోజులు కాశీలో వ్యాసునికి శిష్యులకు భోజనం దొరక్కపోతే

కోపంతో కాశీని శపించాలని సంకల్పించి భిక్షా పాత్రను నేలమీద శతధా భిన్నం అయేట్లు పగలకొడితే ముదుసలి సాధ్వీరూపంలో పార్వతీదేవి వచ్చి విందుకు ఆహ్వానించి కమ్మని భోజనం పెడితే అప్పుడు శివపార్వతులు వారి వద్ద ప్రత్యక్షమవగా శివుడు కోపంతో "పుణ్యరాశి కాశీపై శాపం పెడతావా పొమ్ము నిర్భాగ్య మాయూరి పొలము విడిచి" అని కాశీనుంచి గెంటేస్తే బ్రతిమాలితే దక్షిణకాశి దాక్షారామం వెళ్లి భీమేశ్వర సేవలో తరించామని చెబితే విడవ లేక విడవ లేక ద్రాక్షారామ చేరగా అక్కడ అగస్త్య మహర్షి ఊరట కలిగిస్తాడు. బాసర సరస్వతీ ఆలయంమనకు తెలుసు. వ్యాస బాసర అయింది.

అలాగే కాశ్మీర్లో ప్రవహించే బియాస్ నది అంటే వ్యాస నది అని అర్ధం.ఇలా ప్రకృతితో మమేక మైన వాడు వ్యాసుడు. రెండు చిలుకలు సంసారం చేస్తుంటే ముచ్చటపడి తనకు ఒక కొడుకు కావాలనుకొని హిమాలయాలకు వెళ్లి "శక్తిని గూర్చి తీవ్ర ఆతపస్సు చెస్తే, తపోభంగానికి వచ్చిన ఘృతాచి అనే అప్సరస చేసిన ప్రయత్నాలు ఫలించక చిలుక రూపంలో వస్తే రేతస్కలనం జరిగి పుట్టిన కుమారుడే శుకమహర్షి. ఆయన మూతి చిలక మూతిలాగా ఉంటుందంటారు. పుట్టగానే సకలశాస్త్రాలు వచ్చేశాయి. జనకమహా రాజు వద్ద బ్రహ్మ విద్య నేర్చాడు. పరీక్షిత్తుకు ఏడు రోజులలో మహాభారత కధ అంతా చెప్పాడు శుకమహర్షి. నిరీహుడు నిస్సంగుడు శుకుడు. తండ్రి పరాశరుని పేర పరాశర సంహిత ఉంది. ఆంజనేయ చరిత్ర అంతా అందులో ఉంటుంది.

తటి జ్ఞానాన్ని ధర్మాలను నీతులను అక్షరరూపంగా ప్రసాదించిన భారత జాతి వ్యాసభగవానునికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలదు కనీసం వ్యాస పూర్ణిమనాడైనా ఆ గురు మహారాజును స్మరిద్దాం. ఇలాంటి అరుదైన అవకాశం అమెరికాలో షార్లెట్‌లో సరసభారతి 104వ సమావేశంగా వ్యాస జయంతిని తమ ఇంట్లో జరిపించిన రాంకీ ఉషా దంపతులకు, ఆసక్తిగా వచ్చి పాల్గొన్న వారందరికీ సరసభారతి ధన్యవాదాలు తెలియజేస్తోంది. ప్రతి సంవత్సరం మా అమ్మాయి శ్రీమతి విజయ లక్ష్మి అల్లుడు శ్రీ అవధాని శంకర జయంతి జరుపుతున్నట్లే వ్యాస జయంతిని గురుపౌర్ణమిగా నిర్వహించాలని ఈ దంపతులను కోరుతున్నాను" అని చెప్పి ఇక్కడ భారతీయ సంస్కృతిని ఆచరిస్తూ నిలబెడుతున్న చి.అడుసుమిల్లి రామకృష్ణ (రాంకీ)కు సరసభారతి ఆనందంగా "సంస్కృతీ ప్రదీపక" బిరుదు ప్రదానం చేస్తున్నానని అనగానే అందరు హర్ష ధ్వానాలతో చప్పట్లు మోగించారు. సరసభారతి గ్రంథం "గీర్వాణ కవుల కవితా గీర్వాణం-2 (రెండవ భాగం) రాంకీ దంపతులకు మా దంపతులం కానుకగా అందజేశాము. మంత్ర పుష్పంతో కార్యక్రమం పూర్తయింది. ఇలా సుమారు 15 గంటల వ్యవధిలో సరసభారతి 104వ కార్యక్రమంగా వ్యాస జయంతిని -9-7-17న అమెరికాలోని షార్లెట్‌లో జరిపి అందరి సహకారంతో రికార్డ్ సృష్టించింది.❀



## 37) శివ మహిమ్న స్తోత్రకర్త – గంధర్వ రాజు పుష్పదంతుడు

పుష్పదంతుడు గంధర్వ రాజు, శివ భక్తుడు. సంగీత ప్రవీణుడు. కామ రూపంలో ఎవరికీ కన పడకుండా ఆకాశమార్గంలో సంచరించ గలవాడు. ఇతని సంగీతవైదుష్యాన్ని మెచ్చి ఇంద్రుడు తనకొలువు అయిన దేవేంద్ర సభలో పుష్పదంతుని సంగీత విద్వాంసునిగా నియమిస్తాడు.

ఒకసారి పుష్పదంత ప్రభువు ఆకాశమార్గంలో అదృశ్యంగా సంచరిస్తూ చిత్ర రథుడు అనే రాజు పాలిస్తున్న నగరాన్ని సందర్శిస్తాడు. చిత్ర రథ రాజూ గొప్ప శివ భక్తుడే. పరమేశ్వర పూజకోసం ఒక గొప్ప పూలతోటను పెంచుతాడు. అది వివిధ పుష్పాలతో ఎప్పుడూ శోభాయమానంగా ఉంటుంది. పుష్పదంతుడు ఈ ఉద్యానవనాన్ని చూసి పరవశించి పోతాడు. అందులో ప్రవేశించి పూలు కోస్తాడు. అదృశ్య రూపంలో ఉండటం వలన ఆతనిని రక్షక భటులు చూడలేక పోతారు. రెండు మూడు రోజులు ఇలాగే గడిచాక చిత్ర రథ రాజు పరమేశ్వర పూజకుతన తోటలో పూలు లేక పోవటం గమనిస్తాడు. భటులను ప్రశ్నిస్తే వాళ్ళు రాత్రీ పగలు తాము కళ్ళల్లో ఒత్తులు పెట్టుకొని కాపలా కాస్తున్నామని పూలు ఎవరు కోసి మాయం చేస్తున్నారో అర్థం కావటం లేదని రాజుకు విన్నవించారు. వారు అత్యంత విశ్వాస పాత్రులు కనుక వారి మాట నమ్మి రాజు పూల దొంగను ఎలా పట్టుకోవాలనే విషయమై చాలా మధన పడ్డాడు.

మర్నాడు రక్షక భటులను పిలిపించి రాజు అన్ని పూల చెట్ల కిందా మారేడు దళాలను వెదజల్లమని ఆజ్ఞాపిస్తాడు భటులు అలాగే చేశారు. మారేడు పత్రి శివునికి అత్యంత ప్రీతికరమైనది. దాన్ని కాలితో త్రొక్కితే పరమేశ్వరునికి విపరీతమైన ఆగ్రహం కలుగుతుందని రాజు భావించాడు. ఆ రోజు పుష్పదంతుడు యథాప్రకారం అదృశ్య రూపంలో పూదోటలో ప్రవేశించి నిర్భయంగా పూలు కోస్తాడు. అలాకోయటంలో అనుకోకుండానే మారేడు దళాలను కాళ్ళతో తొక్కుతాడు. అప్పుడు శివుని ధ్యానానికి భంగం ఏర్పడుతుంది. వెంటనే పుష్పదంతునిపై ఆగ్రహోదగ్రుడై దేవజాతికి చెందిన

గాంధర్వ రాజు పుష్పదంతుడు తనకు అత్యంత ప్రీతికరమైన పవిత్రమైన మారేడు దళాలను తొక్కటం, పూల దొంగతనానికి పాల్పడటం గొప్ప నేరంగా భావిస్తాడు. గంధర్వ రాజు పుష్ప దంతుని దివ్య సర్వశక్తులను నశింప జేస్తాడు శివుడు. ఆకారణంగా అతడు రక్షక భటులకు కనిపించి దొరికిపోతాడు. వాళ్ళు బంధించి చిత్ర రథ మహారాజు సమక్షంలోకి తీసుకు వెడతారు. రాజు విపరీతమైన కోపంతో పుష్పదంతుడిని కారాగార శిక్ష విధిస్తాడు.

చెరసాలలో బంధింప బడిన పుష్పదంతుడు విచారంతో కుమిలి పోతూ, తానేదో అపచారం చేసి పరమేశ్వరునికి ఆగ్రహం కలిగించటం వలన తన దివ్య శక్తులన్నిటినీ కోల్పోయానని గ్రహిస్తాడు. పరమ శివుని సంపూర్ణానుగ్రహం సాధించటానికి చెరసాలలో ఉంటూనే పరమ భక్తితో శివ మహిమలను వర్ణిస్తూ "శివ మహిమ్నః స్తోత్రం" రాశాడు. స్తోత్రం రచన పూర్తికాగానే పరమేశ్వరుడు, తన మహిమలను పరమాద్భుతంగా వర్ణించినందుకు పరమ ప్రీతిచెంది, అనుగ్రహించి పుష్పదంతుని దివ్య శక్తులన్నీ తిరిగి అనుగ్రహిస్తాడు. చెరసాల నుండి బయట పడిన పుష్పదంత గంధర్వ రాజు చిత్ర రథ మహారాజును దర్శించి తాను చేసిన అపరాధాన్ని మన్నించి, క్షమించమని ప్రార్థిస్తాడు. దయాళువు అయిన మహారాజు శాంతించి, క్షమించి పుష్పదంతుని విడిచి పెడతాడు. పుష్పదంతుడు మళ్ళీ తన గంధర్వ లోకానికి చేరుకొంటాడు.

ఈ కథ తర తరాలుగా ప్రచారంలో ఉంది. కాని ఈ కధకు ఆధారం కాని పుష్పదంతుని కాలం కాని ఇదమిత్థంగా నిర్ణయించటానికి వీలు లేకపోతోంది. పుష్పదంతుని శాపం మాత్రం, ఆస్తిక జనాలకు గొప్ప వరమై పుష్పదంత గంధర్వ రాజు శివ మహిమలను వర్ణిస్తూ రాసిన మహా గొప్ప శివస్తోత్రం "శివ మహిమ్నః స్తోత్రం" దక్కింది.

దీనికి, సంస్కృతాంధ్ర ఆచార్య సార్వభౌమ శ్రీ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి గారు తెలుగులో అర్థతాత్పర్యాలు రాసి శివమహిమతో బాటు పుష్పదంత కవి కవితా సామర్థ్యాన్ని తెలియజేశారు. ఇదే ఈ నా రచనకు ఆధారం అని సవినయంగా మనవి చేస్తున్నాను.

1-మహిమ్నః పారంతే పరమ విదుషో యద్య సదృశీ – స్తుతి ర్బ్రహ్మా దీనామపి తదవసన్నా స్త్వయి గిరః

అధా వాచ్యస్సర్వః స్వమతి పరిమాణావధి గృణన్-మమాప్యేష సోత్రే హర నిరప వాదః పరికరః

తాత్పర్యం– పరమేశ్వరా! నువ్వు నన్ను పిలిచి "పుష్పదంతా! నాసంపూర్ణ మైన మహిమను స్తుతించటానికి పూనుకున్నావు. నువ్వు పండితుడవు కాదు. ఇది నీలాంటి వాళ్లకు తగిన పని కాదు" అని అంటావేమో-అలాగైతే నీ మహిమ వర్ణించటానికి బ్రహ్మాది దేవతల మాటలూ శక్తిహీనాలే అవుతాయి కదా. వాళ్ళ స్తుతులూ అసమగ్రాలే. తమ

బుద్ధిశక్తిని బట్టి నిన్ను స్తుతిస్తూ ప్రతివాడూ సామర్థ్యం లేనివాడు అవటం వలన నిందింప దగ్గవాడే అవుతాడు. కాబట్టి నేను నిన్ను స్తుతించటానికి చేస్తున్న ప్రారంభం ఎలాంటి ఆక్షేపణా లేనిదే. మహా మహుల స్తోత్రాలే సరితూగనప్పుడు, నేను చేసే ఈస్తుతి ఏవిధంగానైనా దోషం లేనిదే అవుతుంది.

2-అతీతః పంధానం తవ చ మహిమా వాఙ్మనసయోః -అదద్వ్యావృత్యా యం చకిత మభిదత్తే శ్రుతి రపి

స కస్య స్తోతవ్యం? కతి విధ గుణః? కస్య విషయః?- పదేత్వర్వాచీనే పతతి న మనః కస్య న వచః?

భావం- పరమేశా! నీ మహిమ వాక్కుల ద్వారా, మనసుద్వారా, ఊహించటానికి అతీతమైనదే. వేదం కూడా నీమహిమ వర్ణించి చెప్పటానికి శక్యం కాక ఇది కాదు, ఇదికాదు అంటూ భయంతో చెబుతోంది. అలాంటి నీ మహిమను ఎవరు స్తుతించగలరు? గుణాల లెక్కకు అది అందదు. నీ మహిమ వర్ణించటానికి ఏదీ విషయమే కాలేదు. నీ మహిమ వర్ణించటంలో ఎవరి మనసైనా, వాక్కైనా అధోగతి పాలుగాక తప్పదు.

3-మధుస్ఫీతా వాచః పరమమృతం నిర్మితవత - స్తవబ్రహ్మన్ కిం వాగపి సుర గురో ర్విస్మిత పదం?

మమ త్వేతాం వాణీం గుణకధన పుణ్యేన భవతః - పునామీత్యర్థే స్మిన్ పుర మధన! బుద్ధి ర్వ్యవసితా.

**తాత్పర్యం-** సర్వ వ్యాపీ, పరబ్రహ్మ స్వరూపీ పరమేశ్వరా! అత్యంత శ్రేష్టమైన వేదవాక్కుల్ని నువ్వే కూర్చావు. అవి అమృత సమానాలు. తేనేలాగా మహా తియ్యనైనవి. అలాంటి వేదవాక్కుల్ని రచించిన నీపై దేవ గురువు బృహస్పతి స్తుతిస్తూ చెప్పిన మాట కూడా చాలా పేలవంగా ఉండి ఆశ్చర్యం కలిగిస్తుంది. అలాంటి నీ గుణాలను ఈ స్తోత్ర రూపంగా స్తుతించటం వలన కలిగే పుణ్యం వలన నా వాక్కును శుభ్రం చేసుకొంటాను. త్రిపుర సంహారీ ఈశ్వరా! ఈ విషయం లో నా బుద్ధి నన్ను ప్రోత్సహిస్తోంది. మన్నించు.

10-తదైశ్వర్యం యత్నాద్య ద్యుపరి విరించో హరి రధః - పరిచ్ఛేత్తుం యాతావనల మనల స్కంద వపుషః

తతో భక్తి శ్రద్ధా భర గురు గ్రుణద్భ్యాం గిరిశ! యత్ -స్వయం తస్థే తాభ్యాం తవ కిమను వృత్తిర్న ఫలతి"

**భావం-** పరమ శివా! ప్రజ్వలిస్తూ ఉండే అగ్ని స్తంభంగా నువ్వు ఉండగా, నీ మహిమ ఎలాంటిదో తెలుసుకోవాలనే చాపల్యంతో బ్రహ్మ తన వాహనం హంస నెక్కి ఊర్ధ్వ లోకాలకు, విష్ణువు యజ్ఞ వరాహ రూపంతో పాతాలలోకాల క్రిందకూ వెళ్ళారు. కాని

నీ శిఖరం, నీ మొదలు వాళ్లకు కనిపించనే లేదు. ప్రయత్న విఫలురైన వాళ్ళిద్దరూ నిన్ను స్తుతించారు. వారికి దర్శన భాగ్యం కలిగించి ఆదరించావు. నీకు చేసిన సేవ ఎప్పుడూ వృధా కాదని రుజువైంది.

14– అకాండ బ్రహ్మాండ క్షయ చకిత దేవాసుర కృపా – విదేయస్యాసీ ద్యస్త్రి నయన విషం సంహృత వతః

స కల్మాషః కంఠే న తవ కురుతే న శ్రియ మహో –వికారో పి శ్లాఘ్యో భువన భయ భంగ వ్యసనినః"

**భావం–** ముక్కంటీ! అమృతం కోసం సముద్ర మధనం చేసేటప్పుడువెలువడిన కాలకూట విషాన్ని చూసి దేవ రాక్షసులు ప్రళయం వస్తోందని భయపడ్డారు. వాళ్ళపై నీకు అపార కరుణ ఉండటం చేత ఆ విషాన్ని మింగి నీ కంఠంలో దాచుకున్నావు. దీనితో నీ కంఠంలో ఒక నల్లని మచ్చ ఏర్పడింది. తెల్లని నీ శరీరంలో ఆ నల్ల మచ్చ కూడా నీకు శోభనే తెచ్చింది. వికారంగా లేదు కూడా. లోకుల భయాలను తొలగించే వారి శరీర వికృతి కూడా కొనియాడ దగిందే అవుతుంది కదా.

15–అసిద్ధార్థా నైవ క్వచిదపి స దేవాసుర నరే – నివర్తంతే నిత్యం జగతి జయినో యస్య విశిఖాః

స పశ్యన్నీశ త్వామితర సుర సాధారణ మభూత్ – స్మరః స్మర్తవ్యాత్మా న హి పధ్యః పరి భవః"

**భావం–** సర్వ సృష్టికి అధిపతి ఐన సర్వేశా! సృష్టి దేవ రాక్షస మానవులతో కూడి ఉంది. మన్మధ బాణాలు ఎప్పుడూ వ్యర్ధం కావు. ఎవరిపై ప్రయోగిస్తే వారు దానికి తగుల్కొని బాధపడక తప్పదు. అవి జయ స్వభావం కల బాణాలు అలాంటి శక్తిగల మన్మధుడు నువ్వు సామాన్య దేవతగా భావించి నీపై పుష్పబాణాలు ప్రయోగించి నీ మూడవ కంటి అగ్నికి ఆహుతై శరీరం కోల్పోయి, అనంగుడు అయ్యాడు. ఇంద్రియ నిగ్రహమున్న వారిపై అవమానం లేక బల ప్రయోగం ఆరోగ్య ప్రదం కాదు. వినాశ హేతువే అవుతుంది.

20–క్రతౌ సుప్తే జాగ్రత్ త్వమసి ఫలయోగే క్రతుమతాం–క్వ కర్మ ప్రధ్వస్తం ఫలతి పురుషారాధన మృతే

అతతస్త్వాం సంప్రేక్ష్య క్రతుషు ఫలదాన ప్రతిభువం –శ్రుతౌ శ్రద్ధాం బధ్వా దృఢ పరికరః కర్మసు జనః"

**భావం–** యజ్ఞేశా! ఏ యజ్ఞం అయినా ఎప్పుడో ఒకప్పుడు పూర్తి కావాల్సిందే. యజ్ఞం చేసినవాడికి ఫలాన్ని అందించటంలో నువ్వు ఎప్పుడూ సంసిద్ధంగా ముందే ఉంటావు. యజ్ఞం అనిత్యమైంది, జడం కూడా. అది ఫలాన్ని ఇవ్వ లేదుకదా ఏకర్మకైనా ఫలదాతవు పురుషోత్తముడవైన నువ్వే. నిన్ను ఆరాదించకపోతే ఫలం ఎలా లభిస్తుంది? జనాలకు

ఈ విషయం బాగా తెలుసుకనుక, యజ్ఞం ద్వారా నీ అనుగ్రహం పొందాలని వేదంపై పూర్తి విశ్వాసంతో వేదోక్తాలైన యజ్ఞాలను నిర్వహిస్తున్నారు.

"పురి శరీరే శేతే పురి దేహే సీదతీతివా పురుషః" అని పురుష శబ్దానికివాచకమైన పరమాత్మకు నిర్వచనం. అంటే శరీరంలో ఉండేవాడు. "వేదో నిత్య మదీయతాం తదుదితం కర్మ స్వనుష్టీయతాం" అని శంకర భగవత్పాదులు ఆదేశించారు. అంటే వేదోక్త కర్మలను ఆచరించమని భావం. వేద ప్రతిపాదిత యజ్ఞ కర్మలకు ఫలప్రదాత పరమేశ్వరుడే.

24-స్మశానేష్వా క్రీడా స్మరహర! పిశాస్స హ చరాః-చితాభస్మా లేపః స్రగపి నృక కోటీ పరికరః

అమంగల్యం శీలం తవ భవతు నామైవమఖిలం - తదాపి స్మర్తృణాం వరద! పరమం మంగళమపి"

**భావం-** స్మర దహనా! శివా! నువ్వు విహరించేది స్మశానాలలో. నువ్వుపూసుకోనేది శవాలు కాలిస్తే వచ్చే బూడిద. నీ మెడలో మానవ కపాలాల దండ. ఇలా నీ స్వభావం సర్వం అమంగళమే. వరదాతవైన నువ్వు భక్తులకు పరమ శుభ దాయకుడవు అవటం ఆశ్చర్యం.

"శివం కల్యాణం తద్యో గాద్వా శివ ప్రదత్వా ద్వా శివః" అని శివ శబ్దానికి నిరుక్తి. శుభాలతో కూడి, శుభాలనిచ్చువాడు. అమంగళంగా కనిపించినా మంగళ కారుడు శివుడు అని తాత్పర్యం.

25-మనః ప్రత్యక్చి త్తే సవిధ మవధా యాత్త మారుతః -ప్రహృష్య ద్రోమాణః ప్రమద సలిలో త్సంగిత దృశః

యదా లోక్యా హ్లాదం హ్రద ఇవ నిమజ్యా మృత మయే - తధత్యంత స్తత్వం కిమపి యమిన స్తత్కిల భవాన్"

**భావం-** దుర్గేశా! యోగులు యోగ విధానంలో మనసును వాయు స్తంభన చేసి ప్రత్యగాత్మలో నిలుపుతారు. అప్పుడు వారు అలౌకికానందాన్ని పొందుతారు. ఆ ఆనందానుభవంగా వాళ్ళ ఒళ్ళు పులకరిస్తుంది. కళ్ళు ఆనంద బాష్పాలతో నిండిపోతాయి. ఆ స్థితిలో ఏ వస్తువును చూసి అమృత సరస్సులో మునిగినంత ఆనందం పొందుతారో దాన్ని వాక్కులచేత వివరింప శక్యం కాదు పరమాత్మా! ఆ వస్తువు నువ్వే. పరమేశ్వరుడు సచ్చిదానంద పరబ్రహ్మ అని తాత్పర్యం.

26-త్వమర్కస్త్వం సోమస్త్వమసి పవనస్త్వం హుతవహ-స్త్వమాపస్త్వం వ్యోమత్వము ధరణి రాత్మా త్వమితిచ

పరిచ్ఛిన్నా మేవం త్వయి పరిణతా బిభ్రతి గిరం -న విద్మస్తత్త్వం వయ మిహతు యత్వం న భవసి"

**భావం–** మహేశా! పండితులు నువ్వు సూర్యుడివి, చంద్రుడివి, వాయువు, అగ్ని, నీరు, ఆకాశం, భూమి, ప్రత్యగాత్మవు అని కూడా చెబుతున్నారు. అవన్నీ నీ స్వరూపాలుగా, నీ స్వరూపాన్ని పరిమితం చేస్తూ వాక్కులతో కొలుస్తున్నారు. మేము మాత్రమీ చరా చర సృష్టిలో నువ్వు అసలు ఏ వస్తువు కావో తెలుసుకోలేక పోతున్నాం.

27–త్రయీం తిస్రో వృత్తీ స్త్రిభువన మథో త్రీనపి సురా –నకారా ద్వైవర్ణై స్త్రిభిరభి దధత్తీర్ణ విక్రుతిః

తురీయా తే ధామ ధ్వనిభి రవరుంధాన మణుభిః– సమస్తం వ్యస్తం త్వాం శరణద గృణోత్యోమితి పదం"

**భావం–** భక్త హృదయావాసా పరమేశా! అకార ఉకార మకారాలు కలుపగా ఓం పదం ఏర్పడి మూడు వేదాలను, మూడైనా సత్వ రజస్ తమోగుణాల వృత్తులను, మూడులోకాలను, బ్రహ్మ విష్ణు రుద్ర అనే ముగ్గురు దేవతలనూ బోధిస్తోంది. గుణాలకు అతీతం, షడ్భావ వికార రహితం అయిన నీ నిర్గుణ రూపమే నీ నాల్గవ స్థితి. సూక్ష్మ నాదాలతో ఓంకారం ఆ స్థితినే స్తుతిస్తుంది విశ్వమంతా సూక్ష్మ ఓంకారనాదాలు వ్యాపించి నీ నాల్గవది అయిన నిర్గుణ తత్వాన్ని అభి వర్ణిస్తున్నాయి

"ఓమిత్యేకాక్షరం బ్రహ్మ" అని వేదం. ఓంకారమే పరబ్రహ్మ వాచకం. ఓంకార మహాత్మ్యాన్ని ఛాందోగ్య ఉపనిషత్ విశేషంగా వ్యాఖ్యానించింది.

28–భవః శర్వో రుద్రః పశుపతి రథోగ్రః సహ మహాన్ –తథా భీమేశా నా వితి యదభిధానాష్టక మిదం

అముష్మిన్ ప్రత్యేకం ప్రవిరచతి దేవా శ్రుతి రపి–ప్రియా యాస్మై ధామ్నే ప్రణిహిత నమస్యో స్మి భవతే"

**భావం–** శంభో! భవ, శర్వ, రుద్రా, పశుపతి, ఉగ్ర, మహాదేవా, భీమ, ఈశాన అని నీ నామ అష్టకం ప్రసిద్ధి చెందింది. ఒక్కొక్క నామాన్ని గురించి శ్రుతి చక్కగా ప్రత్యేకంగా నిన్ను స్తుతిస్తోంది. అందరికీ ఇష్టుడూ, ఈ రకమైన తేజస్స్వరూపుడు అయిన నిన్ను (నీకు) నమస్కరిస్తున్నాను.

ఈ నామాల అర్థం తెలుసుకొందాం–

భవః– "భవతి భవతే వా సర్వ మితి భవః –సర్వం తానె అయిన వాడు

శర్వః – "ప్రళయే భూతాని శ్రునాతి హినస్తీతి శర్వః–ప్రళయ కాలం లో సమస్త ప్రాణులను హింసించే వాడు

రుద్రః– "రోదయతి శత్రూనితి రుద్రః –"–శత్రువులను దుఖపెట్టేవాడు –"స్వయం రురోద ఇతి వా రుద్రా"–ఒకప్పుడు బ్రాహ్మ వలన జన్మ ప్రాప్తించగా దుఖించినవాడు –"రుదం రోదనం ద్రావయతి ఇతి వా రుద్రః"–దుఖాన్ని పోగొట్టేవాడు.

పశుపతిః– "పశూనాం జీవానాం పతిః" పశువులు అనే జీవులు ప్రమథులైన వారికి

ప్రభువు – "బ్రహ్మ విద్యాః స్తావరాంతా శ్చ పశవః పరికీర్తితాః–పశవః క్షేత్రజ్ఞాః తేషాం పతిః తేషాం త్రాతా ఇతి పశుపతిః"–పశువులు అనే జీవులను సంసార బంధం నుంచి రక్షించేవాడు.

ఉగ్రః – "ఉగ్రత్వాత్ ఉగ్రః –మిక్కిలి భయంకరుడు

మహా దేవః – "మహాం శ్చఅసౌ దేవః"–శ్రేష్టు డైన దేవుడు

భీమః – "బిభేతి అస్మాత్ త్రైలోక్యం ఇతి భీమః" –ముల్లోకాలను భయపెట్టేవాడు

ఈశానః – "ఈస్టే ఇతి ఈశానః" –ఐశ్వర్యం కలవాడు .

34–"అహరహరనవద్యం దూర్జటేః స్తోత్రమేతత్ –పరతి పరమ భక్త్యా శుద్ధ చిత్తః పుమాన్యః

స భవతి శివ లోకే రుద్రా తుల్య స్తథాత్ర–ప్రచురతర ధనాయుః పుత్రవా న్కీర్తి మాంశ్చ"

**భావం–** పరమేశ్వరుని సంబంధించిన ఈ స్తోత్రం ఉత్తమమైనది. ప్రతి రోజూ రాగ ద్వేషాదులతో కలుషితం కాని శుద్ధమనసు కలిగి, పరమభక్తితో దీన్ని పఠించేవాడు, ఈ లోకంలో అత్యధిక ధనాన్ని, పూర్ణాయుస్సును, పుత్రులను కీర్తినీ పొందుతాడు. మరణించాక శివ లోకంలో రుద్రునితో సమానుడవుతాడు.

ధూర్జటి అంటే–"ధూః భార భూతా జఃటిః జటా యస్యేతి ధూర్జటిః"–భారమైన జడలు కలవాడని అర్ధం

35–మహేశాన్నాపరో దేవో మహిమ్నోః నా పరాస్తుతిః–అఘోరాన్నాపరో మంత్రో నాస్తి తత్త్వం గురోః పరం"

**భావం–** సృష్టిలో పరమేశ్వరునికి మించిన దైవం లేదు. పరమేశ్వరునికి చెందిన అఘోర (సౌమ్యమైన) మంత్రమైన పంచాక్షరికి మించిన మరో మంత్రం లేదు, శివునికంటే, పంచాక్షరికంటే మించినవీ గురువు కంటే పరతత్వ మైనదీ ఏదీ లేదని తాత్పర్యం.

41–వపుః ప్రాదుర్భావాదనుమితమిదం జన్మని పురా – పురారే న క్వాపి క్షణమపి భవంతం ప్రణతవాన్

నమన్ముక్తస్సంప్రత్య హమతనురగ్రే ప్య నతిమా–నితీశక్షంతవ్యం తదిద మపరాద ద్వయమపి"

**భావం–** తిపురారీ శివా! పూర్వ జన్మలలో నేనెప్పుడూ నీకు క్షణకాలం కూడా నమస్కరించ లేదు. ఈ మనుష్య జన్మ ప్రాప్తి వలన ఆ విషయాన్ని ఊహిస్తున్నాను. అప్పుడు నీకు నమస్కరించి ఉంటే ఇప్పుడు ఈ జన్మ లభించేది కాదుకదా. ఇప్పుడు నీకు నమస్కరిస్తున్నాను. దీని ఫలితంగా సంసారబంధ విముక్తుడిని అవుతున్నాను కనుక జన్మ రాహిత్యం ప్రాప్తిస్తుంది. కాబట్టి రాబోయే జన్మలో కూడా నీకు నమస్కారం చేసే అవకాశం నాకు లభించదు. సర్వేశా! ఈ అపరాధ ద్వయాన్ని క్షమించు.

ఈశ్లోకం లోకంలో విస్తృతంగా ప్రచారంలో ఉంది.

42–ఆ సమాప్త మిదం స్తోత్రం పుణ్యం గాంధర్వ భాషితం – అనౌపమ్యం మనహారి శివ మీశ్వర వర్ణనం"

**భావం–** ఇది పరమేశ్వర మహిమా వర్ణన స్తోత్రం గంధర్వ ప్రభువు పుష్పదంతుడు పలికాడు. ఈ స్తోత్రం మొదటి నుంచి చివరిదాకా ఎంతో పవిత్రమైనది. మానసికానందాన్ని కలిగించేది. మంగళ ప్రదమైంది.

"గంధర్వ భాషితం" అన్నమాటలో పరమేశ్వరానుగ్రహం లభించి గంధర్వ రాజు పుష్ప దంతుడు చెప్పాడని అర్ధం.

43–యత్క్రృత్యం తన్న కృత్యం యదకృత్యం కృత్యవదాచరితం
ఉభయోః ప్రాయశ్చిత్యం శివ తవ నామాక్షర ద్వయో చ్చరితం"

**భావం–** శంకరా! జీవితంలో తప్పకుండా చేయాల్సిన పనులు చేయలేకపోయాను. ఆచరించ కూడనివి తప్పనిసరిగా చేశాను. రెండూ దోషాలే, పాపాలే. శిక్షార్హాలు కూడా. వాటి పరిహారం నీ పేరులోని "శివ" అనే రెండు అక్షరాలనూ భక్తితో పలకటమే కదా.

44–"ఏకకాలం ద్వికాలం వా త్రికాలం యః పఠేన్నరః–సర్వ పాప వినిర్ముక్తః శివ లోకే మహీ యతే"

**భావం–** ఉదయ మధ్యాహ్న సాయంకాలాలలో లేదా మూడు సమయాలలో ఈ స్తోత్రాన్ని భక్తితో పఠిస్తేసమస్త పాపాలనుండి విముక్తి లభిస్తుంది పరమేశ్వరాను గ్రహంతో కైలాస సిద్ధి లభిస్తుంది.

45–తవ తత్త్వం న జానామి కీదృశోసి మహేశ్వర –యాద్రుశో సి మహా దేవ తాదృశాయ నమో నమః"

**భావం–** శివా! నువ్వు ఎలాంటి మహిమ కలవాడవో ఆ యదార్ధ స్వరూపాన్ని తెలుసుకోలేక పోతున్నాను. నువ్వు ఎలాంటి వాడివైనా నాకేం గాని, అలాంటి నీకు నమస్కారం నమస్కారం.

46–ఇత్యేషా వాఙ్మయా పూజా శ్రీమచ్చంకర పాదయోః –అర్చితా తేన దేవేశః ప్రీయతాం మే సదా శివః"

**భావం–** ఈ విధమైన వాక్కులతో కూడిన శ్లోక రూప పూజ నిత్య శోభతో వెలుగొందే పరమేశ్వరుని పదద్వయానికి సమర్పించ బడింది. ఇలాంటి స్తుతి ప్రధాన శ్లోక రూప పూజ చేత సమస్త దేవతలకూ ప్రభువు, నిత్య శుభ ప్రదుడు అయిన మహేశ్వరుడు నా యందు సంతుస్టుడగు గాక".

"శ్రేయాన్ ద్రవ్య మయా దృఙ్ఞాత్ ఙ్ఞాన యఙ్ఞః పరంతపః" అని భగవద్వచనం. ద్రవ్యాలతో చేసిన పూజ కంటే ఙ్ఞాన పూర్వక శ్లోకాలతో చేసే పూజ ఎంతో శ్రేష్ట మైనది. పరమేశ్వర ప్రీతి పాత్రం కూడా.❁



## క్రీస్తు పూర్వ కాలం

## 38) అశ్వశాస్త్ర కర్త - శైల హోత్రుడు-బిసి-2,350

క్రీ.పూ.2350 కాలం వాడైన శైలహోత్రుడు "శైల హోత్ర సంహిత" అనే అశ్వ శాస్త్రాన్ని రాశాడు. తండ్రి హయఘోషుడు పశు వైద్యానికి ఆద్యుడు. ఉత్తరప్రదేశ్‌లోని గొండా బహ్రాచ్ సరిహద్దులలో ఉన్న శ్రావస్తి నగరవాసి. భరద్వాజ ఆయుర్వేదం ప్రకారం శైల హోత్ర అగ్నివేశులు ఇద్దరు ఒకే గురువు శిష్యులు. ఆయుర్వేదంపై "అగ్ని వేశ తంత్రం" రాసిన మొదటివాడు అగ్నివేశుడు. తరవాతే చరకుడు రాశాడు. ఆ తర్వాత శుశ్రుతుడు రాశారు.

యుద్ధాలలో గుర్రాలు చాలా ఎక్కువగా తోడ్పడుతాయి కనుక మేలు జాతి గుర్రాలను పుట్టించి పోషించటం అవసరమైంది. దానికోసం శైలహోత్రుడు "అశ్వ శాస్త్రము" రాశాడు అది ఆయన పేరుమీద "శైల హోత్ర సంహిత"గా పిలువ బడుతోంది. ఇది 12,000 సంస్కృత శ్లోకాల గ్రంథం. ఇది పర్షియన్, అరేబిక్ ఇంగ్లిష్ మొదలైన భాషలలోకి అనువాదం పొంది అందరకు మార్గ దర్శకమైంది. ఇందులో అశ్వ, గజ శరీర నిర్మాణం, వాటి వైద్య శాస్త్రం శస్త్ర చికిత్స విధానం, వాటికి వచ్చే రోగాలు వాటి నివారణ జబ్బులు రాకుండా కాపాడే విధానాలు అన్నీ సమగ్రంగా ఉన్నాయి. అనేక జాతుల గుర్రాలు వాటి శరీర నిర్మాణం, వాటి వయసు తెలుసుకొనే విధానం ఉన్నాయి. శైల హోత్రుడే మరొక రెండు గ్రంథాలు 1-అశ్వ లక్షణ శాస్త్రం 2-అశ్వ ప్రశంస రాశాడని అంటారు. అశ్వాలపై వెలువాడిన అనేక గ్రంథాలకు ముఖ్య ఆధారం శైల హోత్ర సంహిత. దీన్ని పెంచి లేక మార్చి రాయబడినవే. అయితే క్రీ.పూ 1800లో ముని పల్కాప్య "హస్తి ఆయుర్వేదం" రాశాడు. ఇందులో 4 భాగాలు, 152 అధ్యాయాలున్నాయి. క్రీ.పూ 1000-900 కాల మహాభారత పాండవ సోదరులలో నకులుడు అశ్వశాస్త్రంలో నిపుణుడని "అశ్వ చికిత్స" గ్రంథం రాశాడని, అతని తమ్ముడు సహదేవుడు గొప్ప పశు పాలకుడని పశువైద్యంలో దిట్ట అని అంటారు.



## 39) అన్వీక్షికి వ్యాఖ్యాత - కపిలమహర్షి (క్రీ.పూ.650-575)

అన్వీక్షికి సంప్రదాయ వ్యాఖ్యాత - కపిలమహర్షి. ఆత్మ విద్యకు మరోపేరు అన్వీక్షికి. మనువు తన ధర్మశాస్త్రంలో ఆత్మ విద్యను అన్వీక్షికి అని పేర్కొన్నాడు. తర్వాత ఇది ఉపనిషత్తులలో ఒక భాగమైంది. యదార్థానికి అన్వీక్షికి ఉపనిషత్తులకు ఆత్మ విద్యకు భేదంగా కనిపిస్తుంది. క్రీ.పూ 327 వాడైన కౌటిల్యుడు "త్రయీ అంటే వేదాలు వార్తికాలు, దండనీతి కంటే భిన్నమైన విశేష విషయాలున్నది అన్వీక్షికి అన్నాడు. ఆత్మవిద్య ఆత్మస్వభావాన్ని గురించి వివరిస్తే అలా భావించటానికి గల కారణాలను అన్వేషించి చెప్పింది అన్వీక్షికి అన్నాడు చాణక్యుడు. ఆత్మ, హేతువులను గురించి చెప్పిందే అన్వీక్షికి అన్నాడు. వాత్సాయనుడు ఉపనిషత్తు చెప్పింది ఆత్మవిద్య లేక ఆధ్యాత్మవిద్య మాత్రమే. హేతువులను చర్చింది అన్వీక్షికి. కానీ క్రీ.పూ 650 వరకు కపిలుడు దీనిపై సాంఖ్యం రాసేదాకా ఒక నిర్దిష్ట రూపం సంతరించుకోలేదు. అన్వీక్షికి సాటిలేని ఒక దర్శనశాస్త్రం అయింది తర్క శాస్త్రంలో ప్రాముఖ్యమైంది. హేతువిద్య లేక హేతుశాస్త్రంగా పిలువబడి చివరికి తర్క శాస్త్రంగా పేరు పొందింది. దీనినే వాద విద్య అన్నారు- ఇప్పుడు న్యాయ శాస్త్రంగా గుర్తింపు పొందింది. చార్వాక, జాబాలి మొదలైన వారు దీన్ని అనుసరించగా కపిలుడు గొప్ప వ్యాఖ్యానం రాశాడు.

కపిల మహర్షి క్రీ.పూ 650-575 కాలం వాడు. అజ్మీర్ దగ్గర పుష్కరం వద్ద జన్మించినట్లు పద్మపురాణంలో ఉంది. సాంఖ్య సూత్రాలు రాశాడు. దీని వివరణ అంతా సాంఖ్యకారికలో లభిస్తుంది. మహాభారతంలో కపిల మహర్షి అహింసా సిద్ధాంతాన్ని ప్రవచించినట్లు ఉంది. స్వేతాశ్వతర ఉపనిషత్‌లో కపిలునిపై విస్తృతంగా ఉన్నది.

బ్రహ్మ పురాణంలో వేనుడు అనే రాజు వేదాలను అధ్యయనాన్ని, క్రతువులను

నిషేధించి, వేద ధర్మానికి విఘాతం కలిగిస్తే, అతనిని సంహరించి కపిలుడు మహర్షులను వేనుని తొడను మధించమంటే నిషాదుడు పుట్టాడు. కుడి చేతిని మధిస్తే పృధువు జన్మించి భూమిని సస్యశ్యామలం చేశాడు. అందుకే భూమి పృథ్వి అని అతని పేరుతో పిలుస్తున్నాం. మహర్షులతో కలిసి కపిలుడు కపిల సంగమానికి వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు. సాగరపుత్రులు 60 వేలమంది అశ్వమేధ అశ్వాన్ని రక్షిస్తూ వస్తే విష్ణుమూర్తి కపిలముని వేషంలో పడుకొని నిద్రిస్తుంటే నిద్రాభంగమై కళ్ళు తెరవగానే సాగర పుత్రులు నలుగురైదుగురు తప్ప అందరూ కంటి మంటకు భస్మమైపోయారు.

భాగవతంలో కర్దమ ప్రజాపతి, దేవ హోతి దంపతులకు కపిలుడు జన్మించినట్లున్నది. మత్స్యపురాణంలో కశ్యప ప్రజాపతికి దక్షుని కూతురు దనుల 100 మంది సంతానంలో కపిలుడు ఒకడు సాంఖ్య సూత్రాలు ఒకటి రెండు చూద్దాం-

1-కృపయా చివి దదుహ్ కాత్యంతాని వృత్తి రత్యంత పురుషార్థః భావం మనిషిలోని మూడుబాధలు అతని అంతానికి కారణం.

2-న దృష్టాంత చ్చిద్దార్ణ వృత్తియే రవ్యను వృత్తిదర్శనాత్ -భావం- ఈ బాధ మందుమాకులవలన తగ్గేదికాదు

3-ప్రత్యాహి కక్షుత్మతీకర చేస్టనా త్పురుషార్థత్వం. భావం- మనసులోని కోరిక బాధకు కారణం. అది నిత్యం ఆకలిలాంటిది.❋



## 40) 12 జైన ఆగమాలు రచించిన "జైన చిరంజీవి" -సుధర్మ స్వామి (బిసి 607-507)

జైన మహావీరునికి 5వ గణదారుడు క్రీ.పూ 607-507కు చెందిన సుధర్మ స్వామి. క్రీ.పూ 615లో ఆత్మజ్ఞానం పొంది 507లో నూరవ ఏట నిర్వాణం చెందాడు. జైన చిరంజీవులలో సుధర్మ స్వామి చివరివాడుగా భావిస్తారు. ఈయన తర్వాత జంబుస్వామి ఉత్తరాధికారి అయ్యాడు. సుధర్మ స్వామి మహావీరుని బోధలను 12 భాగాలైన జైన ఆగమాలుగా రచించాడు. శిష్యుడు జంబుస్వామి అడిగిన ప్రశ్నలకు సుధర్మస్వామి చెప్పిన సమాధానాల "ప్రశ్నోత్తరావళి" అన్నమాట. ఇవి ఆద్యంతాలు లేని సత్యం యొక్క విషయం విచారణ. మహావీరుని చివరి శిష్యుడే సుధర్మ స్వామి.❋

## 41) నట సూత్ర రాసిన జంటకవులు – శిలానిన్ కృశస్వ (క్రీ.పూ 600)


క్రీ.పూ. 6వ శతాబ్దానికి చెందిన "శిలాలినన్", "క్రిశ స్వ"లు నటుల గురించి, వారి విధుల గురించి "నట సూత్ర" అనే గ్రంథం రాశారని పాణిని పేర్కొన్నాడు. కానీ అది లభ్యం కాలేదు. పాణిని ఆ గ్రంథంలో ఉన్న విషయాలను కానీ గ్రంథకర్తల జీవిత విశేషాలు కానీ ఏమీ చెప్పక పోవటం దురదృష్టం.❁

## 42) నాట్య శాస్త్ర ప్రామాణికులు – భరతముని పుత్ర శతం – బిసి 500-142

నాట్యశాస్త్ర కర్త భరతముని స్వర్గం నుంచి భూమికి రూపక కళను తెచ్చిన ఋషి అని, ఆ కళను తన పుత్ర శతం అయిన కోహల, దత్తిలక అస్మకుట్ట, నఖ కుట్ట మొదలైనవారికి బోధించాడని ఐతిహ్యం వీరిలో పేర్కొనబడిన పేరున్నవారు దానిలో ప్రవీణులని ప్రామాణికులని తెలుస్తోంది. వీరు గ్రంథాలులు రాశారని అలభ్యమని అంటారు.❁

## 43) సంక్షేప శారీరకం కర్త – శ్రీ సర్జ్ఞత్మానేంద్రసరస్వతి – బిసి -407-367

కంచికామ కోటి పీఠాధిపతి 3వ జగద్గురువు శ్రీ సర్వజ్ఞాత్మేంద్ర సరస్వతి శంకర భాష్యంపై వ్యాఖ్య రాశారు. దీనినే సంక్షిప్త "శారీరకం" అంటారు. 1267 సరళ భావ గర్భిత శ్లోకాలలో ఇది విరాజిల్లింది వీరు పీఠాధిపతి అవటం తమాషాగా జరిగింది. శ్రీ శంకర భగవత్పా దులు దేశంలోని అనేక పండితులతో అద్వైతవాదం చేసి ఓడించి ఆ విజయంతో దక్షిణ మోక్షభూమి కంచికి వచ్చారు. వారి విజయాన్ని విన్న తమిళనాడు వారంతా చూడాలని కంచికి వచ్చారు. బ్రహ్మదేశం నుంచి చాలామంది వేదశాస్త్ర వేత్తలు వారితో దేవ భేద మూర్తి భేద మొదలైన విషయాలపై వారితో వాదించటానికి వచ్చారు. వారిని అద్వైత భావ పరంపరతతో నిరుత్తరులను చేశారు. సర్వజ్ఞ పీఠం అధిరోహించారు అక్కడకు వచ్చినవారిలో 7 ఏళ్ళ బాలుడు వారిని ఆకర్షించాడు. అతనిలోని బ్రహ్మ తేజస్సును గుర్తించి అతనిని సురేశ్వరాచార్యుల తర్వాత ఉత్తర పీఠాధిపతి చేయ సంకల్పించి తలిదండ్రులకు వర్తమానం పంపారు. వాళ్ళు వచ్చి విషయం తెలుసుకొని పరమానందంతో తమ అంగీకారం తెలిపారు. శ్రీ శంకరులు ఆబాలునికి సన్యాసం దీక్ష నిచ్చి సర్వజ్ఞాత్మ అనే దీక్షానామమిచ్చి సురేశ్వరాచార్యులకు తీర్చిదిద్దామని బాధ్యత అప్పగించారు. సురేశ్వరుల తర్వాత కామకోటి పీఠాధిపత్యం వహించి చాలాకాలం ఉన్నారు. వీరు "సర్వజ్ఞ విలాస" అనే కావ్య పరిశోధన గ్రంథం కూడా రాశారు. ❁



## 44) ఛందశ్శాస్త్ర కర్త - పింగళ -బిసి -400

చందశ్శాస్త్రంపై వెలువడిన అతి ప్రాచీన గ్రంథాన్ని పింగళ క్రీ.పూ 4వ శతాబ్దంలో రాశాడు. పాణిని తమ్ముడుగా లోక ప్రసిద్ధి. లేక క్రీ.పూ. 2వ శతాబ్దంలో మహాభాష్యం రాసిన పతంజలి సోదరుడు. 8 అధ్యాయాల ఈ చందో శాస్త్రంలోని సూత్రాలను అర్థం చేసుకోవాలంటే వ్యాఖ్యానం తప్పనిసరిగా ఉండాల్సిందే. ఈ గ్రంథం క్రీ.పూ లో చివరికాలంలో కాని క్రీ.శ.ప్రారంభ కాలంలో కాని రాయబడి ఉంటుందని ఊహిస్తున్నారు. అంటే వేద ఛందస్సుకు, లౌకిక ఛందస్సుకు మధ్యకాలంలో సంధియుగంలో రాయబడి ఉండాలి. మౌర్యకాలానికి దగ్గరలో ఉండి ఉంటుంది. 10వ శతాబ్దికి చెందిన హలయూథ దీనిపై వ్యాఖ్యానం రాయటమేకాక విస్తృత పరచాడు కూడా.

ఛందశ్శాస్త్రంలో గురు, లఘువుల చర్చ ఉన్నది. ద్విసంఖ్యామానం ఆధారంగా రాశాడు. వివిధ ఛందస్సులు వాటి కలయికలు చూస్తే బైనామియన్ థీరం (ద్విపద సిద్ధాంతం) గుర్తుకు వస్తుంది. దీనికి హలయూధుని "మృతసంజీవిని" వ్యాఖ్యానం చూస్తుంటే "పాస్కల్ త్రిభుజం" గుర్తుకు వస్తుంది. ఈ శాస్త్రంలో "మాత్రా మేరు లేక మేరు ప్రస్తార" విధానం ఈ నాటి గణితం లోని "ఫైబో నాసి నంబర్"లను పోలి ఉంటుంది. Pingala system ranks binary patterns starting at one (four short syllables—binary "0000"—is the first pattern), the nth pattern corresponds to the binary representation of n-1 (with increasing positional values). Positional use of zero dates from c. the 7th century (Brahmagupta) and would have been known to Halayudha but not to Pingala.❀

## 45) పాణిని చెప్పిన స్త్రీ విద్యావేత్తలు -బిసి -400

వేదంలో కథా శాఖకు చెందిన మహిళా విద్యార్థినులను పాణిని “కథి” అన్నాడు. ఋగ్వేద మంత్రాధ్యయనంలో నిష్ణాతులైన మహిళా విద్యార్థులను పాణిని “భహ్వి రుచి” అన్నాడు. మీమాంస శాస్త్ర ఉపాధ్యాయినులను “ఉపాధ్యాయి” అని విద్యార్థినులను “ఛాత్రి” అనీ అన్నాడు. పాణిని అష్టాధ్యాయికి భట్టోజీ దీక్షితులు రాసిన “సిద్ధాంత కౌముది” వ్యాఖ్యానంలో గృహిణులుగా మాత్రమే కాకుండా సంస్కృత విద్యను బోధించిన వారిని “ఉపాధ్యాయి” అన్నాడు. వీరందరూ వేదవిద్య నేర్చి ఇతరులకు బోధించినవారే.❁



## 46) పాదుకా శతకకర్త - శ్రీ సత్య బోధేంద్రసరస్వతి - బిసి -367-268

కంచికామ కోటి పీఠ 4వ జగద్గురువులు శ్రీ సత్య బోధేంద్ర సరస్వతి చేర దేశంలో ఫలినీశ అనే పూర్వాశ్రమ నామ ధారి. “తల్లినేశ శర్మ” తనయుడు సాంఖ్య బౌద్ధ జైనులలను వాదంలో ఓడించి అద్వైత మత వ్యాప్తి చేశారు. వీరు శంకర భాష్యంపై “పాదక శత” రాశారు.❁

## 47) జైన నియుక్తి కర్త - భద్ర బాహు -బిసి -300

జైనాచార్యులలో చిట్టచివరి "సూత్ర కేవలి" అంటే జైన గ్రంథాలనన్నిటిని కంఠతా బట్టినవాడుగా భద్ర బాహు ఆచార్యకు పేరుంది. ఈ గ్రంథాలపై ఆయన రాసిన వ్యాఖ్యానాలు "నియుక్తి" పేరుతో పిలువబడుతున్నాయి. న్యాయసంబంధ కేసుల విషయాలపై "సంహిత" రాశాడు. మొదటి శతాబ్దంలో ఉమాస్వాతి రాసిన "తత్వార్ధఆగమ సూత్రం"లో జైనానికి సంబంధించిన ప్రాధమిక విషయాలున్నాయి. 8వ శతాబ్దికి చెందిన హరిభద్రుడు "యోగ దృష్టి సముచ్చయం" రచించాడు.❁


## 48) చంద్రిక కర్త - జ్ఞానానందేంద్ర సరస్వతి -బిసి -268-205

కామకోటి అయిదవ జగద్గురువులు శ్రీ జ్ఞానానందేంద్ర సరస్వతి పూర్వనామం జ్ఞానోత్తమ. ద్రావిడ బ్రాహ్మణుడైన నాగేశ కుమారుడు. సురేశ్వరాచార్యుల "నైష్కర్మ సిద్ధి"కి "చంద్రిక" వ్యాఖ్యానం రాశారు. ఇందులో సత్యబోధ సర్వజ్ఞాత్మ గురువుల ప్రస్తుతి ఉంది. ప్రొఫెసర్ హిరణయ్య సంపాదకత్వంలో దీన్ని మైసూర్ యూనివర్సిటీ ప్రచురించింది. కంచి సర్వజ్ఞాశ్రమానికి వీరు వెలుగులద్దారని భావిస్తారు.❁




## 49) సురేశ్వర వార్తిక వ్యాఖ్యాత - ఆనంద జ్ఞానేంద్ర సరస్వతి - బిసి -124-55

చేర దేశానికి చెందిన సూర్యనారాయణ మఖి కుమారుడు చిన్నయ్య పూర్వాశ్రమనామం. గౌరీదేవి పరమ భక్తులు అమ్మ కరుణాకటాక్షాలతో అద్భుత పాండిత్యం అబ్బింది. శంకర భాష్యం సురేశ్వర వార్తికలపై భాష్యాలు రాశారు. శ్రీశైలంలో ముక్తి పొందారు.❁



## 50) మహా యాన బౌద్ధ ప్రజ్ఞా పారమిత - బిసి-100-13

మహాయాన బౌద్ధ ఉద్గ్రంధం ప్రజ్ఞా పారమిత అంటే సర్వతోముఖ జ్ఞానం పొందే సాధన మార్గం. ఇందులో బోధిసత్వుని మాతృ దేవతగా భావించారు. ఇది మహాయానంలోని మూల సిద్ధాంతం. ఇందులోని సూత్రాలు అనుత్పాదమైనవిగా విశ్వసిస్తారు. ఒకరకంగా అపౌరుషేయాలు. ఇందులో 8 వేల సూత్రాలున్నాయి. వీటిని "అష్ట సాహస్రిక ప్రజ్ఞా పార మిత సూత్రాలు" అంటారు. ఇవన్నీ క్రీ.పూ ఒకటవ శతాబ్దికి చెందినవి అని పరిశోధకుడు ఎడ్వర్డ్ కాంజ్ రాశాడు. ఇందులోని సంస్కృతం నిర్దుష్టమైనది కాదని భావిస్తారు. వీటి చైనీ అనువాదం క్రీ.శ 2వ శతాబ్దిలో లభించాయి. ఇవే రత్న గుణ సముచ్ఛయగా పిలువబడుతున్నాయి. మహాయానంలోని భాగమైన "చాటిక"లవారు అభివృద్ధి చేశారని అనుకొంటారు. ఇవన్నీ ఆంధ్రదేశంలో కృష్ణా నదీ తీరాన అమరావతీ ధాన్యకటకం మహాయాన సంఘాలలో ఏర్పడినవిగా ఊహిస్తారు. వీటిలోని శాఖలను పూర్వశైల, అపర శైల అంటారు. వీటిలో ఒక్కొక్క వ్రాత ప్రతి ప్రాకృత భాషలో ఉన్నాయి. వీటిలో బుద్ధుని బోధలున్నాయని హుయాన్ సాంగ్ ధృవీకరించాడు. 2012లో హ్యారీపాక్, శేషి కరసీమలు శిధిలమైన దీని వ్రాతప్రతిని ముద్రించారు. రేడియో కార్బన్ డేటా ప్రకారం ఇది క్రీ.శ.75కు చెందినదిగా గుర్తించారు. బౌద్ధ గ్రంథాలలో అతిప్రాచీనమైనదిగా దీన్ని భావిస్తున్నారు. చైనా భాషలోకి అనువదించిన లోకేశేన- గాంధారీ భాష వ్రాతప్రతిని ఆధారంగా చేసుకొని చేశాడు. జపాన్ భౌద్ధులుమాత్రం దీనికంటే "వజ్రచ్ఛేదిక" ప్రాచీనమైనది అంటారు. చివరికి దీనికి వజ్రచేదికా ప్రజ్ఞా పారమిత అని పిలుస్తున్నారు. దీనికి ఆచార్య నాగార్జునుడు, మైత్రేయ అసంగ, వసుభద్ర ద్నిగాదులు వ్యాఖ్యానాలు రాశారు.❁



## క్రీ.శ.1-నుండి-1000వరకు (పదవ శతాబ్దం)

## 51) సమయ సార గ్రంథకర్త - ఆచార్య కుంద కుంద -08-44

క్రీ.శ.1వ శతాబ్దిలో ఆచార్య కుంద కుంద ఆత్మతత్త్వంపై "సమయ సార" గ్రంథాన్ని, సుశిక్షిత న్యాయంపై "నియమసార" పంచాస్తికా సార గ్రంథాలు రచించాడు. కుంద కుందాచార్యుల అసలు పేరు పద్మనంది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా కుంద కుందే గ్రామవాసిగా భావిస్తారు. కృష్ణానదీ తీర వాసి కృష్ణాజిల్లా వాసి అనే ప్రచారమూ ఉంది. కనుక గ్రామనామమే ఆయన పేరు అయి ఉంటుంది. క్రీ.పూ 8లో పుట్టి 33వ ఏట జైన మతాచార్యుడై 52 ఏళ్ళు ఆచార్యత్వంలో ఉండి 85 ఏళ్ళు జీవించి క్రీ.శ 44లో నిర్యాణం చెందాడు. రెండవ భద్రబాహు, అర్ధబలి, జినసేనుల సమకాలికుడు అంటారు. బోధ ప్రహుదాలో తాను భద్ర బాహు శిష్యుడనని చెప్పుకొన్నాడు. ఈ భద్రబాహు క్రీ.పూ 37-14 వరకు జీవించాడు. జైనంలో స్వేతాంబర దిగంబర మూల సంఘానికి నాయకుడు. ఆయన రాసిన గ్రంథాలు బాగా ప్రాచుర్యం పొందాయి. జైన మతాచార్యులలో మహావీరుడు, గౌతమ గంగాధరుని తరవాత స్థానం కుంద కుందదే. స్వయంకృషితో దిగంబర జైన దర్శనాలను సృజించిన మేధావిగా వినుతికెక్కాడు. దిగంబర జైనులు మహావీర, గౌతమ గంగాధరలతోపాటు కుంద కుందను స్మరించి ధన్యులౌతారు. "మంగళం భగవాన్ వీరో మంగళం గౌతమమ్ గని -మంగళం కుంద కందాయ జైన ధర్మో స్తు మంగళం" అని జైనులు స్మరిస్తారు. భద్రబాహు, విశాఖ లకంటే ఉన్నతస్థానాన్ని కుంద కుందకు కల్పించారు. అంతటి ప్రతిభా సంపన్నుడు. ఆయన రాసిన "ప్రవచన సార"లో సత్యానికున్న రెండు పార్శ్వాలను చెప్పాడు. 1-వ్యావహారన య -అంటే మోహం 2-నిశ్చయాయన అంటే పారమార్థం లేక శుద్ధ సత్యం.

ప్రాకృత భాషలో కుంద కుంద రాసిన గ్రంథాలు మూడు రకాలు -మొదటి వర్గం లోనివి -సారం కలవి -1-నియమసార -ఇందులో 187 శ్లోకాలున్నాయి. 2-పంచస్తికయ సారలో 153 శ్లోకాలున్నాయి. 3-సమయసార -లో 439 శ్లోకాలున్నాయి 4-ప్రవచనసార -లో 275 శ్లోకాలున్నాయి.

రెండవ రకంలో -జైన ఆచార్యులపై భక్తిపూర్వకంగా రాసిన శ్లోకాలు, జైన గ్రంథాలపై రాసినవి సాధకులు పాటించాల్సిన నియమాలు ఉంటాయి -వీటినే చరిత భక్తి ఉన్న శ్లోక కదంబం అంటారు. వీటిని స్వేతాంబర, దిగంబర జైనులు నిత్యపూజా విధానంలో విధిగా పఠిస్తారు,పాటిస్తారు కూడా.

మూడవ రకానికి చెందిన వాటిని "ప్రభ్రత" అంటారు-ఇందులో 8 చిన్న చిన్న గ్రంథాలున్నాయి. ఇవి పూర్వీకులు రాసిన వాటి నుండి సేకరింపబడినవి - వీటిలో దర్శన ప్రభృతలో 26 శ్లోకాలు చరిత ప్రభృతలో 44, సూత్ర ప్రభృతలో 27 శ్లోకాలు అలాగే మిగిలినవాటిలోనూ ఉన్నాయి. అనేక జైన గ్రంథాలలో కుంద కుందాచార్య 84 "పాహుర్"లు రాసినట్లు ఉంది. కానీ అన్నీ లభ్యం కాలేదు.❁



## 52) భక్తి పూజా విధానకర్త - శ్రీ కృపాశంకరేంద్ర సరస్వతి -28-68

గాంగేశో పాధ్యాయ పూర్వనామం. ఆంధ్ర బ్రాహ్మణులు. మనసా వాచా కర్మణా అతి పవిత్ర జీవితం గడిపి 9వ కామకోటి జగద్గురువులయ్యారు. శంకరాచార్యుల మార్గంలో అడుగులు వేస్తూ షణ్మత పూజా విధానాన్ని వ్యాప్తి చెందించారు. గణపతి స్కంద శివ విష్ణు అంబికా సూర్య దేవతా పూజా విధానాలు రచించి భవిష్యత్ శైవ నయనార్లకు మార్గదర్శి అయ్యారు. శైవ, వైష్ణవ మతాలు శ్రీ శంకర, శ్రీ కృపాచార్యులకు సదా కృతజ్ఞులై ఉండాలి. వింధ్య ప్రాంతంలో ముక్తి పొందారు.❁

## 53) షట్కాండాగమకర్త - భూతబలి ఆచార్య -66-99

క్రీ.శ 66లో జన్మించి 90లో సిద్ధి చెందిన స్వేతాంబర దిగంబర జైనాచార్యుడు భూతబలి. ఈయన "షట్కాండ ఆగమం"ను పుష్పదంతా చార్యునితో కలిసి ప్రాకృత భాషలో రచించాడు. మధుర ప్రాంతంలో జైన మత వ్యాప్తికి గొప్ప కృషి చేశాడు. జైనుల అయిదవ గ్రంథమైన "శృతి పంచమి"లో భూతబలి పుష్పదంతాచార్యులకు ప్రతి

ఏడాది సంస్మరణ ఉత్సవాలు చేస్తున్నట్లు ఉంది. ఈ జంట ఆచార్యులు "కాశయ పహూద" అనే గ్రంథం కూడా రాశారు. దీన్ని వాంఛా గ్రంథం (ట్రిటైజ్ ఆన్ పాషన్) అన్నారు.

క్రీ.శ మొదటి శతాబ్ది వాడైన దిగంబర పుష్పదంతాచార్య భూతబలితో కలిసి షట్కాండ ఆగమం" రాశాడు.

4వ శతాబ్ది గుణ భద్రుడు జైన సేనునితో కలిసి "మహా పురాణం" రాశాడు.

8వ శతాబ్ది దిగంబర జైనాచార్యుడు అపరాజిత దిగంబర జైనులు దిగంబరంగా ఉండటాన్ని పూర్తిగా సమర్ధించాడు. దిగంబరంగా ఉండటం అంటే బట్టలు లేకుండా ఉండటం మాత్రమే కాదని, కోరికలను, వస్తువులను పూర్తిగా విసర్జించటమేనని బోధించాడు.❋

## 54) శతఖండాగమన కర్త - పుష్పదంత భూతబలి ఆచార్యులు -160

క్రీ.శ 160లో దిగంబర జైనమతానికి చెందిన ఆచార్యులు పుష్పదంతుడు భూతబలి "శతఖండాగమం" రాశారు. దీన్ని మహాకర్మ ప్రభూత అంటారు. రెండవదైన "పూర్వాగమం"ను ఆగ్రయ నియ అంటారు. ఇది 6 భాగాల ఉద్గ్రంథం దీనికి ఆచార్య వీరసేనుడు 780లో రెండు వ్యాఖ్యలు -మొదటిదానిపై ధావ టీకా రెండవదానిపై మహాధావ టీకా రాశాడు. అయిదవ పూర్వాగమం లేక జ్ఞాన ప్రవాదంపై గుణధరాచార్య "కశ్య పహుద్" రాశాడు. వీరసేనుడు, శిష్యుడు జైన సేనుడు దీనికి వ్యాఖ్యను 780లో రాశారు.❋

## 55) శంకర భాష్య కర్త - శబరుడు -200

పూర్వ మీమాంస, ఉత్తర మీమాంస అనే రెండు మార్గాలున్నాయి. వాటికి గ్రంథా లున్నాయి. మీమాంస అంటే గౌరవమైన ఆలోచన. సత్యాన్ని, జ్ఞానాన్ని తెలుసుకొనే ఉత్తమ ఆలోచనా మార్గం. వేదాలలో మొదటిభాగాలను పూర్వ మీమాంస రెండవ భాగాలను ఉత్తర మీమాంస తెలియజేస్తాయి పూర్వ మీమాంసకు కర్మ మీమాంస అని ఉత్తర మీమాంసకు బ్రహ్మ మీమాంస అని అంటారు, క్లుప్తంగా పూర్వ మీమాంసకు మీమాంస అని ఉత్తర మీమాంసకు వేదాంతం అని పిలుస్తారు. మీమాంస సూత్రాలను రాసినవాడు జైమిని మహర్షి. ఇది 12 అధ్యాయాలతో 2500 సూత్రాలతో ఉంటుంది. అర్ధమవటం కష్టం. కనుక భాష్యం అవసరం. మీమాంసపై చాలామంది భాష్యాలు రాసినా కాలగర్భంలో కలిసిపోయాయి. లభించిన మొట్టమొదటి భాష్యం శబర భాష్యం. దీన్ని శబర స్వామి రాశాడు. ఇదే తర్వాత వచ్చిన అన్ని భాష్యాలకు ఆధారమైంది. కుమారుల భట్టు, ప్రభాకరుడు శబర భాష్యానికి వ్యాఖ్యానాలు రాశారు. మండన మిశ్రుడు కుమారుల భట్టును అనుసరించాడు. భట్టుకూడా దీనిపై వ్యాఖ రాశాడు కానీ ఆది శంకరాచార్యుల చేతిలో ఓటమిపాలై సురేశ్వరాచార్యులై దీన్ని వదిలేశాడు.❋



## 56) చైనా యాత్రికుడు హుయాన్ సాంగ్ అనువదించిన యోగాచార్య భూమి శాస్త్రం - (క్రీ.శ 300-350)


బౌద్ధ ధర్మ యోగుల యోగ విధానాన్ని సంపూర్ణంగా తెలియజేసే విజ్ఞాన సర్వస్వమే "యోగా చార్య భూమి శాస్త్రం" సంస్కృతంలో రచింపండిన ఈ ఉద్గ్రంథం క్రీ.శ 300-350 కాలపు రచన. ఇందులో 5 ముఖ్య విభాగాలున్నాయి. అందులో మొదటిదైన "విస్తృత భూమిక "అతి పెద్దది ఇందులో బౌద్ధజ్ఞానాన్ని పొందటానికి ఉన్న వివిధ భూమికలు వివరణ ,స్థాయిలు ధ్యాన స్థాయిలు, వినటం ఆలోచించటం అభ్యాసం చేయటం శ్రావక భూమి ప్రత్యేకబుద్ధభూమి బోధిసత్వ భూమి ఉన్నాయి. రెండవ భాగాన్ని వినిశ్చయా సంగ్రహం అంటారు. బహుభుమిలో చెప్పబడిన అనేక విషయాల నిర్వచనం వ్యాఖ్యానాలుంటాయి. మూడవదైన వివరణ సంగ్రహంలో విధి విధానాల వివరణాలున్నాయి. నాల్గవది పరన్యాయ సంగ్రహంలో ఆగమాలలో చెప్పబడినవాటి వివర్ణన విశ్లేషణ ఉంటాయి. చివరిదైన అయిదవది వాస్తు సంగ్రహంలో సంయుక్తాగమ సూత్ర వివరణ ఉంది. ఇందులో వినయ సంగ్రహం కూడా కలిసి ఉంటుంది.

దీని చైనా ప్రతిలో అభిధర్మ ఉంటె టిబెటన్ ప్రతిలో అది లుప్తమైంది. బహుభుమిలోని సంస్కృత భాగాలైన బోధిసత్వ భూమి శ్రావక భూమి ఇప్పటికీ కనిపిస్తాయి. చైనా బౌద్ధంలో అనేక విభేదాలకు కారణం సరైన వ్యాఖ్యానాలు లేకపోవటమేకాక అసలు గ్రంథంలోని భాగాలు లేకపోవటం కూడా కారణమని హుయాన్ సాంగ్ రాశాడు.

హుయాన్ సాంగ్ భారత దేశ సందర్శనానికి వచ్చినప్పుడు నలంద విశ్వ విద్యాలయ బౌద్ధాచార్యుడు శీల భద్రాచార్య హుయాంసాంగ్‌కు "యోగా చార్య భూమి శాస్త్రాన్ని" సుమారు 9 నుంచి 15 నెలలో బోధించాడు. దీన్నిహుయాన్ సాంగ్ చైనా భాషలోకి హాంగ్ ఫు మొనాస్టరీలో 646-648 కాలంలో అనువదించాడు. అందులో 100 భాగాలు లేక "జువాన్"లున్నాయి. హుయాన్ సాంగ్‌కు ముందే 394-468 కాలంలో ధర్మ క్షేత్ర, గుణ భద్ర, పరమార్ధలు కొంతభాగం చైనా భాషలోకి అనువదించారు.❁

## 57) అలభ్య నాటక కర్త – మహాకవి చంద్ర –319

క్షేమేంద్రుడు కల్హణుడు మంఖ కవుల చేత గుర్తింపబడిన కవి మహాకవి చంద్ర క్రీ.శ 319లో కాశ్మీర్ పాలకుడు తుంజీర అని పిలువబడే రణాదిత్యుని కాలం వాడు. ఆయన రాసిన నాటకం అన్నితరగతుల ప్రజలను విపరీతంగా ఆకర్షించిందని అభినవ గుప్తుడే చెప్పాడు కానీ అది అలభ్యం. ఆయన రాసినట్లు చెప్పబడే కొన్ని కవితలు కనిపిస్తాయి అందులో ఒకటి –ప్రేయసీ కాలం దుప్పిలాంటిది ఎగిరిపారిపోతే మళ్ళీ తిరిగిరాదు. "కాశ్మీరంలో కుంకుమపువ్వు యెంత బాగా ఎక్కువగా పండుతుందో కవిత్వమూ అంత విస్తృతంగా అందంగా పండుతుంది" అన్న బిల్హణకవి మాటపై కవితను చదివితే అర్ధమవుతుంది.❁




## 58) స్థానాంగ సూత్ర కర్త – దేవర్ధిగని క్షమా శ్రమణ (300)

జైన సంప్రదాయంలో మొదటి పదకొండు అంగాలు అంగ వాసర్పిణి కాలంలో బాగా శిధిలమైనా సంరక్షింప బడ్డాయని స్వేతాంబరుల విశ్వాసం. ఆ కారణం వలననే మూడవ శతాబ్దికి చెందిన దేవర్ధిగని క్షమా శ్రమణ ఆధ్వర్యంలో వాటిని కుదించి స్వేతాంబర జైనానికి ఉపయుక్తంగా గ్రంథీకరణం చేశాడు. ఈ పని అంటే సంక్షిప్తీకరణ కార్యాన్ని మహావీర నిర్యాణం తర్వాత 993 ఏళ్లకు గుజరాత్‌లోని వల్లభిలో చేసి అర్ధమాగధి ప్రాకృతంలో రాశారు. అసలు స్థానాంగ సూత్రం సంస్కృతంలోనే ఉంది. మూల సంస్కృత గ్రంథం టీకా, తాత్పర్యాలు లేకుండా అర్ధం చేసుకోవటం మిక్కిలి

కష్టం కనుక శ్రమణ అందరికి అందుబాటులోకి తేవాలని ఈ పని చేశాడు. 11వ శతాబ్దంలో అభయ దేవ సూరి స్థానాంగ సూత్రకు పూర్తిగా సంస్కృతంలో టీకా తాత్పర్య వ్యాఖ్యానం రచించాడు.

ఈ గ్రంథాన్ని ప్రాకృతంలో స్థానం అంటారు, అంటే క్వాంటం అంటే కొంత భాగం అని భావం. దీని శైలి చాలా ప్రత్యేకమైనది. ఇందులో 11 అధ్యాయాలు, ప్రతి అధ్యాయం కొన్ని స్థానాలతో ఉంటుంది. జైనుల మెటాఫిజిక్స్ అంతా ఇందులో దర్శనమిస్తుంది. ధర్మ కథానుయోగ, కరణానుయోగ, ద్రవ్యాను యోగ మొదలైన విషయాల చర్చ ఉంది. ఇందులోని పదజాలం, విషయాలు సరైన స్థానాలలో ఉండటం వలన చాలా తేలికగా కంఠతా చేసి గుర్తుంచుకోవచ్చు. ఇదొక మెమరీ ఎయిడ్‌గా ఉపయోగ పడుతుంది. కనీసం 8 ఏళ్ళు జైన పథంలో తీవ్రంగా కృషి చేసినవారికే దీని అంతరార్థం పూర్తిగా తెలుస్తుంది అని" వ్యవహార ఛేద సూత్ర" చెబుతోంది. ఇందులోని మొదటి సూత్రం – "సూయం మే ఔశం తేనం భగవయా ఏవం ఆఖ్యాయాం" అంటే "ఓ చిరంజీవీ! పూజ్యనీయులైన మహావీరులు ఇలా చెప్పారని నేను విన్నాను"

ఇందులో గణిత శాస్త్రమూ 747 సూత్రంలో ఉన్నది. 1– పరిశ్రమ అంటే చతుర్గణనం, 2–వ్యవహార, 3–రజ్జు –జామెట్రీ, 4–రాశి –ఘన వస్తువుల గణనం, 5–కాలసవర్ణ –భిన్నాలు, 6–యావత్తావత్ –సరళ సమీకరణాలు, 7–వర్గ –ద్వివర్ణ సమీకరణాలు, 8–ఘన –క్యూబిక్స్, 9–వర్గ –వర్గ –బై క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, 10–వికల్ప –పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్‌ల గణితంపై వివరాలున్నాయి.

ఈ గ్రంథానికి ఇంగ్లిష్, హిందీ, ప్రాకృత అనువాదాలు వచ్చాయి.❀



## 59) మూక పంచశతి కర్త - మూక కవి -398-437

**మూకం కరోతి వాచాలం**

"పరమపద వదూటీం-పాతుమాం కామకోటీ" అని ఒక మూగవాడు అమ్మవారి దర్శన భాగ్యంతో నోరు తెరచి పరవంశంతో స్తుతించాడు. ఆయనే కంచి కామాక్షీదేవిపై "పంచశతి" రచించి మూక కవిగా జగత్ ప్రసిద్ధుడైనాడు. "ప్రకృత్యా మూకానామపిచ కవితా కారణతయా" అమ్మవారి తాంబూల రసనా లేశ స్ఫురణ మాత్రం చేత సిద్ధకవిగా రూపాంతరం చెంది కామాక్షీదేవిపై 1-ఆర్యా శతకం, 2- పాదార వింద శతకం, 3- స్తుతి శతకం, 4- కటాక్ష శతకం, 5- మందస్మిత శతకం అనే 5 శతకాలు ఆర్యా వృత్తంలో రాసిన మహా భక్తుడు మూక కవి. కంచి పరమాచార్యులు శ్రీ శ్రీ చంద్ర శేఖర యతీంద్రులు తమ ఉపన్యాస లహరిలో తరచుగా మూక కవి కవితా వైభవాన్ని అమ్మవారిపై ఆయనకున్న భక్తి తాత్పర్యాన్ని బహుధా ప్రశంసించే వారు. కంచిలో అమ్మవారి దేవాలయం లోపలి ప్రాకారంలో మూక పంచ శతి శ్లోకాలను దేవనాగర లిపిలో చెక్కించి అమ్మవారి మహిమను భక్తులకు విశదమయేట్లు చేశారు. మూక పంచశతిని శ్రీ కల్లూరి వెంకట సుబ్రహ్మణ్య దీక్షితులుగారు తెలుగులోకి అనువదించి ఆకవి భక్త్యావేశాన్ని ఆంధ్రులకు అవగాహన కలిగించారు.

**మూక కవి జీవిత విశేషాలు**

మూకకవి అమ్మవారి తాంబూల రస మధుర బిందువులచే ధన్యుడై శతకాలు రాసి జగద్విఖ్యాతుడై కంచి కామకోటి పీఠానికి 20వ పీఠాదిపతిగా క్రీ.శ.398లో అధిరోహించి 27 సంవత్సరాలు 437 వరకు సేవ చేసి అద్వైత మత ప్రచారంలో జన్మ చరితార్ధం చేసుకొని గోదావరీ తీరంలో సిద్ధి పొందినట్లు కంచి మఠ వివరాల వలన తెలుస్తోంది. ఖగోళ జ్యోతిష శాస్త్ర వేత్త విద్యా వతి కుమారుడు. పుట్టు మూగ చెవిటి వాడైన ఈ కవి అనునిత్యం ఇరుగు వారు తోటి పిల్లలు అవహేళన చేస్తూ ఏడిపిస్తుంటే నిత్యం కంచిలోని శ్రీ కామాక్షీ దేవిని దర్శించి సాష్టాంగ నమస్కారం చేసిముగ్ధ

మనోహరంగా దర్శనమిచ్చి అమ్మవారిని ధ్యానం చేస్తూ మౌనంగా రోదిస్తూ మనశ్శాంతి పొందేవాడు. అతని భక్తి అనన్య సామాన్యమైనదని అమ్మ గ్రహించి అనుగ్రహించాలని భావించింది. అతని మూగ తనాన్ని పోగొట్టి అద్భుత వాక్శక్తి ప్రసాదించాలని, అతని ద్వారా లోకానికి మహత్తర మైన గ్రంథాన్ని కానుకగా ఇవ్వాలని సంకల్పించింది.

**కామాక్షి కరుణా కటాక్షం**

ఒక రోజు మూక కవితో పాటు మరొక సాధకుడు అమ్మవారి ఎదుట కూర్చుని ధ్యానంలో ఉన్నారు. అమ్మవారు వీరి భక్తికి మెచ్చి అనుగ్రహించాలనే తలంపుతో ఒక సాధారణ స్త్రీగా దర్శనమిచ్చి తన నోటిలోని తాంబూలం ముద్ద (పిడచ) కొంత తీసి మూకకవి ప్రక్కనే ఉన్న సాధకునికి ఇచ్చింది. ఆయన ఆమెను ఒక మామూలు స్త్రీ అనుకోని దాన్ని ఎంగిలిగా భావించి తీసుకోలేదు. వెంటనే జగదంబ దానిని మూకకవిని అనుగ్రహించి చేతిలో పెట్టింది. దాన్ని మహా ప్రసాదంగా భావించిన మూకకవి భక్తిగా కళ్ళకు అద్దుకొని నోట్లో వేసుకొన్నాడు. అంతే మూకకవికి మాట వచ్చి మహా ప్రవాహంగా ఆశువుగా కవిత జాలువారి అమ్మవారి దివ్య సుందర విగ్రహాన్ని కనులారా దర్శిస్తూ 500 శ్లోకాలు ఏకధాటిగా చెప్పాడు. అదే మూక పంచశతి అయింది. అమ్మవారి గొప్ప తనాన్ని వర్ణించినది ఆర్యా శతకం, అమ్మవారిని స్తుతిస్తూ చెప్పింది స్తుతి శతకం. కనులను వర్ణించేది కటాక్ష శతకం. అమ్మవారి నవ్వును వర్ణిస్తూ చెప్పింది మందస్మిత శతకం, పాదాలను వర్ణిస్తూ చెప్పింది పాదార వింద శతకం. మధుర మంజుల భావ గర్భిత శతకాలివి. అణువణువునా భక్తి కదం తొక్కింది. అందులో మహిమాన్వితమైన, మంత్రపూతమైన ఆ శ్లోకాలను అమ్మ మహా పరవశంగా ఆలకించి తానూ పులకించింది. అయిదు శతకాలు చెప్పిన తర్వాత అమ్మవారు ప్రత్యక్షమైంది. కవిని వరం ఏదైనా కోరుకోమన్నది. కనులనుండి ఆనంద బాష్పాలు రాలుతుండగా గద్గద స్వరంతో మూకకవి ఏదో అనబోయాడు. అతని ఆంతర్యం గ్రహించింది అమ్మ. బిడ్డ కోరిక తల్లికి తెలియదా! అయినా అతని నోటి నుండి వినాలని చెప్పమని కోరి ఆసక్తిగా విన్నది. “అమ్మా! జీవితాంతం మూగవాడిగానే వుండిపోతాననుకున్నాను. అదృష్టవశాత్తు మీ అనుగ్రహం వల్ల వాక్శక్తి సిద్ధించింది. మాట్లాడే శక్తి ఏర్పడడం భగవదనుగ్రహం చేతనే సాధ్యమవుతుందన్న విషయం స్వానుభవంతో గ్రహించాను. ఈ శ్లోకాలను శ్రద్ధా భక్తులతో పఠించే మూగవారికి చక్కని వాక్ శక్తిని ప్రసాదించు తల్లీ! నత్తిగా మాట్లాడే వారికి, తడబడుతూ మాట్లాడేవారిక సైతం ఈ పంచశతిని పఠించడంవల్ల ఆ దోషం తొలగిపోయేలా అనుగ్రహించు మాతా! నేను ఎవరినో, నా పేరు ఏమిటో, నేను ఏ కాలానికి చెందిన వాడినో ఈ లోకానికి తెలియనవసరం లేదు. ఈ శ్లోకాలు మూగకవి

నోటినుండి వెలువడ్డాయని మాత్రం ప్రపంచానికి చాటిచెప్పుతల్లీ!" ముకుళిత హస్తాలతో అమ్మను వేడుకున్నాడు మూక కవి. పరుల శ్రేయస్సును కాంక్షిస్తున్న అతని కోరిక నెరవేరేలా కామాక్షి అనుగ్రహించింది. వరాలు లోకహితానికి ఉపయోగపడాలి కానీ స్వప్రయోజనానికి ఉద్దేశించినవి కావని గ్రహించిన వివేకవంతుడైన అతన్ని అభినందనగా చూసింది జగన్మాత. "అలాగే నాయనా! మంత్రశక్తితో కూడిన ఈ శ్లోకాలను పఠించడంవల్ల మూగతనం, నత్తి, మాటలో తడబాటు తొలగిపోయి మధుర మంజులవాక్కు, కీర్తి, సిరిసంపదలు సిద్ధిస్తాయి. మంత్రపూరితమైన ఈ శ్లోకాల్లోని అక్షరాల విన్యాస వరసలో అంతటి శక్తి దాగి వుంది. నీవు కోరిన విధంగానే ఈ నామధేయంతో కాకుండా మూక మహాకవి పేరుతోనే ఈ పంచశతి విశ్వవ్యాప్తమవుతుంది. మూక పంచశతి పఠించేవారికి లక్ష్మీదేవి అనుగ్రహం, సరస్వతీదేవి ఆశీస్సులు లభిస్తాయని వరమిస్తున్నాను" మరుక్షణం కామాక్షి తాయి అతని ఎదుటనుండి అదృశ్యమైంది. విగ్రహంలోనుండి చల్లని చూపులతో దేవి కనిపిస్తోంది అతనికి. ఆర్యా శతకము, పాదారవింద శతకము, స్తుతి శతకము, కటాక్ష శతకము, మందస్మిత శతకము అనే ఐదు శతకాలతో కూడిన మూకపంచశతిలోని శ్లోకాలను భక్తి శ్రద్ధలతో పఠిస్తూ విశుద్ధి చక్రంలోని దోషాలను అధిగమించి ఎందరో ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారు. ఆ విధంగా లక్ష్మీ సరస్వతుల అనుగ్రహానికి ఏకకాలంలో పాత్రులవుతూ జ్ఞానాన్ని, ఆనందాన్ని పొందుతున్నారు. మూక కవిని గురువుగా భావిస్తూ కామాక్షీ మహాదేవి పట్ల భక్తివంతో శుభదాకమైన మూకపంచశతిలోని శ్లోకాలను పఠిస్తూ హరిప్రియ అనుగ్రహానికి వాగ్దేవి శుభాశీస్సులకు పాత్రులవుతున్నారు.

అతను మృదు మధురమైన మాటలతో "అమ్మా! మూగ వాడికి మాట ఇచ్చి అనుగ్రహించి నాలో ప్రవేశంచి నా చేత పంచశతి శతకం చెప్పించావు. ఈ నోటితో నీ స్వరూప స్వభావాలను వర్ణించేట్లు చేశావు. ఈ అనుగ్రహం చాలు. నిన్ను స్తుతించిన నోటితో వేరే మాటలు మాట్లాడలేను. దయతో మళ్ళీ నన్ను మూగవాడిని చేయి" అని సవినయంగా కోరాడు. అమ్మ అతనిని మళ్ళీ మూగవానిగా చేసింది అని ఒక కథ ప్రచారంలో ఉన్నది.

**మూక కవి మూక శంకరులైన విధం**

ఈ విషయం తెలిసిన 19వ కంచి పీఠాదిపతులు శ్రీ శ్రీ మార్తాండ విద్యా ఘనేంద్ర సరస్వతీ స్వాములవారు ఆ బాలుడి తలిదండ్రులకు కబురు చేసి పిలిపించారు. మూక కవిని ఉత్తరాధికారిగా అంటే 20వ పీఠాదిపతిగాచేయాలని సంకల్పించానని వారి అనుమతిని, బాలుడి అనుమతి కోరగా వారు సంతోషంగా అనుమతించారు.

యుక్త వయసు రాగానే వేద శాస్త్రాలలో మహా విద్వాంసుడయ్యాడు. 19వ పీఠాదిపతులైన శ్రీ శ్రీ మార్కండేయ విద్యాఘన స్వాములవారు మూక కవికి దీక్షనిచ్చి "మూక శంకర" నామ ధారణ చేశారు. మూక కవి ఊహా చిత్రాన్ని కంచి పీఠం చిత్రింప జేసింది. మూక కవి సామర్ధ్యం, ప్రభావం వర్ణనాతీతం. ఆయన ఎదుట పడిన అక్షర జ్ఞాన శూన్యులైన పశువుల కాపరులు కూడా మహా కవులై పోయారు. కాశ్మీర రాజు మాతృ గుప్తుడు, ప్రవర సేనుడు మొదలైన రాజులు అనన్య భక్తితో మూక శంకర సేవలో ధన్యులయ్యారు. కామాక్షీ కటాక్ష సిద్ధితో పీఠాదిపతులైన మూక శంకరులు ధాతు నామ సంవత్సర శ్రావణ పౌర్ణమినాడు గోదావరీ నదీ తీరంలో ముక్తిని పొంది శ్రీ కామాక్షీ- ఏకాంబరేశ్వర స్వామి వారలలో ఐక్యమయ్యారు.

**మూక పంచశతి ప్రాశస్త్యం**

మూక పంచశతిలో తంత్ర శాస్త్ర ప్రాధాన్యం ఉన్నది. బీజాక్షరాలతో కూడిన మంత్రములతో కూడిన శ్లోకాలు ఉన్నట్లు పరిశోధకులు తెలియజేశారు. ఆధ్యాత్మిక కుండలినీ యోగ రహస్యాలూ దీనిలో ఉండటం మరొక విశేషం. కంచి పరమేశ్వరి కొందరికి కాళికా మాతలా దర్శనమిస్తే మూక కవికి ఆ అమ్మ "కారణ పరచిద్రూపా కాంచీపురా సీమ్నికామ పీఠ గతా–కాచన విహరతి కరుణా కాశ్మీర స్తబ కోమలాంగ లతా"గా దివ్య దర్శనమిచ్చింది. అంటే "కాంచీ పురంలో ఒకానొక" కరుణ "యెర్రని శరీరంతో తిరుగుతోంది" అన్నాడు కవి. ఆమెను అమ్మ అనలేదు శక్తి అనీ అనలేదు. అనిర్వచనీయమైన కరుణకు మూర్తిస్వరూపం అని అర్ధం. అపార, అనంత, అనిర్వచనీయ దయాంత రంగ ఆమె. అఖండ మైన కరుణ అరుణగా కంచి పట్టణంలో విహరిస్తోందని మూక కవి భావన చేశాడు. అమ్మ వారి దివ్య తేజో స్వరూపాన్ని భక్త్యావేశంతో పరమాద్భుతంగా వర్ణించాడు మూకకవి. లీలాశుకుని శ్రీ కృష్ణ కర్ణామృతానికి సాటి మూక పంచశతి అని విజ్ఞుల అభిప్రాయం. అద్వైత స్థాపనాచార్యులైన జగద్గురువులు శ్రీ ఆది శంకరాచార్యపై మూకకవి "ప్రాచీన శంకర విజయం" రాశాడు. ఇందులో కంచి మఠ ప్రాచీనతతో పాటు, శ్రీ శంకరుల కాల నిర్ణయమూ ఉన్నది. ద్విసహస్రావధాని డా.శ్రీ మాడుగుల నాగఫణి శర్మగారు ఆర్యా శతకాన్ని గానం చేసి కేసెట్‌లుగా సి. డి.లుగా విడుదల చేసి మూకకవికి, మూక పంచశతికి గొప్ప ప్రచారం తెచ్చారు.

**మూక కవి గీర్వాణ కవితా వైభవం**

విద్యాపతి కుమారుడైన మూకకవి మూక శంకరులుగా కాంచీ కామకోటి 20వ పీఠాదిపతి అయిన సంగతి తెలుసుకొన్నాం. ఇప్పుడు మూక పంచశతిలోని

## గీర్వాణ కవుల కవితా గీర్వాణం-3

మొదటిదైన ఆర్యా శతక విశేషాలను తెలుసుకొందాం.

1- ఆర్యా శతకం

"కారణ పర చిద్రూపా-కాంచీ పుర సీమ్ని కామగత పీఠా
కాచన విహరతి కరుణా-కాశ్మీర స్తబక కోమలాంగ లతా" అన్నది అందులో మొదటి శ్లోకం-కుంకుమ పూల గుత్తి లా కోమలమైన తీగవంటి శరీరం కలిగి, కారణ పర చైతన్య స్వరూపిణిగా కామపీఠాన్ని ఆశ్రయించిన ఒకానొక దయారూపిణి కాంచీపురంలో విహరిస్తున్నది.

74వ శ్లోకం - "వేదమయీం నాద మయీం - బిందుమయీం పరపదోద్య దిందు మయీరమంత్రమయీం తంత్ర మయీం - ప్రకృతి మయీం నౌమి విశ్వ వికృతి మయీం"

భావం- పరమ పదం (సహస్రారం)లో ఉదయించే చంద్రుని స్వరూపం కలిగి ,వేద, నాద బిందు రూపిణి, మంత్రం తంత్రమయినది, విశ్వవికార రూపిణిగా ఉన్నది అయిన ప్రకృతి -అంటే కామాక్షీ దేవికి నమస్కరిస్తున్నాను.

99వ శ్లోకం- "కళ మంజుల వాగనుమిత-గళ పంజర శుక గ్రహౌత్కంఠత్యాత్
అంబ రదనాంబరం తే - బింబ ఫలం శంబరారి ణా న్యస్తం"

భావం- చెప్పటానికి వీలు లేనంత మధుర మృదు సౌందర్య పలుకులు పలికే చిలక, నీ కంఠం అనే పంజరంలో ఉందని తెలిసి, మన్మధుడు ఆ చిలుకను పట్టుకోవటానికి యెర్రని పెదవి అనే దొండ పండుని ఎరగా ఉంచాడు. అంటే అమ్మవారి మాటలు మంజుల మనోహరంగా ఉన్నాయని అర్థం.

ఈ శ్లోకాన్ని శ్రీ నాగఫణి శర్మ గారు ప్రతి విద్యాలయంలోని పిల్లలతో పాడించి గొప్ప వ్యాప్తి కలిగించి వారు అమ్మవారి అనుగ్రహానికి పాత్రులై గొప్ప విద్యా బుద్ధులు సాధించటానికి తోడ్పడ్డారు.

2-పాదార వింద శతకం

మొదటి శ్లోకం- "మహిమ్నః పంధానం మదన పరి పంధిప్రణయిని -ప్రభుర్నిర్ణేతుం తే భవతి యత మానోపి కతమః
తదాపి శ్రీకాంచీ విహ్రుతి రసికే కోపి మనసో - విపాకస్త్వాత్పాదస్తుతి విదిషు జల్పాక యతిమాం"

భావం- కంచిలో హాయిగా విహరించే మన్మధ విరోధి అయిన శివుని ప్రియురాలైన కామాక్షీ దేవీ! నీ దివ్యమహిమను తెలియ జెప్పే సమర్ధులో లోకంలో లేరు. నాపూర్వ జన్మ సుకృతం ఫలించి నీపాదార విందాలను స్తుతించే కవిత్వాన్ని నాతో పలికిస్తున్నావు.

33వ శోకం-

స్ఫురన్మధ్యే శుద్దే నఖ కిరణ దుగ్దాబ్ది పయసాం –వహన్నబ్జం చక్రం దరమపి చ రేఖాత్మ కతయా
శ్రితోమాత్స్యం రూపం శ్రియమపి దధానో నిరుపమాం–త్రిదామా కామాక్ష్యాఃపద నళిన నామా విజయతే.

భావం– నీపాదాల గోళ్ళకాంతి అనే పాల సముద్రం మధ్యలో శంఖ, చక్ర కమలాలను రేఖా మాత్రంగా ధరించి, గొప్పదైన లక్ష్మీ దేవిని కూడా ధరించి, కామాక్షీ దేవివైన నీ పాదపద్మాలు అనే పేరుగల విష్ణుమూర్తి చేప రూపంలో సర్వోన్నతుడుగా వర్ధిల్లుతున్నాడు. అంటే అమ్మవారి పాదాలలో శంఖ, చక్ర, కమల, మత్స్య రేఖలున్నాయని అర్ధం.

64వ శ్లోకం– "మహా భాష్య వ్యాఖ్యా పటు శయన మారో పయతి–స్మర వ్యాపారే ర్ష్యాపి శున నిటలంకారయతి వా
ద్విరేఫాణామధ్యాసయతి సతతం వాధి వసితం–ప్రణమ్రాన్కామాక్ష్యాః పద నళిన మహాత్మ్య గరిమా"

భావం– నీపద కమలాలు మహిమాన్వితమైనవి వాటికి నమస్కరించేవాడిని మహాభాష్య వ్యాఖ్యాతగా కాని కామాన్ని తిరస్కరించే సన్యాసిగా కాని, తుమ్మెదలకు ఆవాసమైన కమలాన్ని అంటే సహస్రార కమలానికి చేరే యోగాన్ని అధిష్టింప చేయటంకానీ చేస్తాయి.

96వ శ్లోకం– ''రణన్మంజీరాభ్యాంలలిత గమనాభ్యాంసుకృతినాం–మనో వాస్తవ్యాఖ్యాంమధిత తిమిరాభ్యాం నఖ రుచా
నిదేయాభ్యాం పత్యా నిజ శిరశి కామాక్షి సతతం–నమస్తే పాదాభ్యాం నళిన మ్రుదులాభ్యాం గిరి సుతే"

భావం– అమ్మవారి పాదాలు చక్కగా నాదం చేస్తున్న అందెలను ధరించి, అందమైన నడకలతో ప్రకాశిస్తున్నాయి. ఆమె కాలి గోళ్ళ కాంతులు చీకట్లను నాశనం చేస్తున్నాయి. అవి కమలాలులాగా అతి కోమలంగా ఉన్నాయి. భర్త అయిన శివుని శిరసుపై ఉంచబడుతున్నాయి. అలాంటి దేవిపాదాలకు నమస్కారం.

చివరిదైన 103వ శ్లోకం – "ఇదం యః కామాక్ష్యాః శ్చరణనళిన స్తోత్ర శతకం–జపేన్నిత్యం భక్త్వా నిఖిల జగదాహ్లాదజనకం
స విశ్వేషాంవంద్యస్సకల కవి లోకైక తిలక–శ్చిరం భుక్త్వా భోగా స్సరిణమపి చిద్రూప కలయా"

భావం– సకలలోకాలకు ఆనందాన్ని కలిగించే శ్రీ కామాక్షీదేవి పాదార వింద శతకంగా ప్రసిద్ధి చెందిన ఈ స్తోత్రాన్ని భక్తితో ప్రతి రోజూ పఠించే వారు అందరి చేత నమస్కరింపబడే గొప్ప కవీశ్వరులౌతారు. సకల సుఖ భోగాలు అనుభవించి చివరికి చిద్రూప కలగా మారి అమ్మవారిని చేరు కొంటారు అని ఫలశ్రుతి చెప్పాడు మూక కవి.

## గీర్వాణ కవుల కవితా గీర్వాణం-3

**3-స్తుతి శతకం**

1వ శ్లోకం- "పాండిత్యం పరమేశ్వరి స్తుతి విధౌ నైవాశ్రయంతేగిరాం-వైరించాన్యపి గుంఫనాని విగళద్గర్వాని శర్వాణి తే
స్తోతుం త్వాం పరిఫుల్ల నీల నళిన శ్యామాక్షి కామాక్షి మాం-వాచాలీ కురుతే తదాపి నితరాం త్వత్పాద సేవాదరః

భావం- వికసిత నీలోత్పల కనుల కాంతితో ప్రకాశించే కామాక్షీ దేవీ! పరమేశ్వరీ, శర్వాణీ! నిన్ను స్తుతించే పు్పుడు బ్రహ్మ వాక్కులు కూడా రసహీనమై పాండిత్యం కనిపించటం లేదు. అయినా నీపాద సేవ రాధకుడినైన నేను నిన్ను కీర్తించాటానికి వాచాలత్వం ప్రదర్శిస్తూ కవిగా పేరురుపొందుతున్నాను.

29- "మునిజనమనః పేటీ రత్నం స్ఫురత్కరుణా నటీ -విహరణ కలాగేహం కాంచీ, పురీ మణి భూషణం
జగతి మహతో మోహ వ్యాధే ర్నృణాం పరమౌషధం -పురహర దృశాం సాఫల్యం మే పురః పరిర్జుుంభతాం"

భావం- మునీశ్వరుల మనసు అనే పెట్టెలో ఉన్న రత్నం లాంటిది, ప్రకాశించే దయ అనే నటి విహరించటానికి నిలయమైనది, కాంచినగరానికి మణి భూషణంగా వెలుగొందుతున్నదీ, ఈ జగత్తులో వ్యాపించిన మోహం అనే వ్యాధికి దివ్యౌషధమైనది, శివుని నేత్రాలకు సాఫల్యమైనది అయిన కామాక్షి రూపం నా ముందు సాక్షాత్కరించు గాక.

96- "త్వయైవ జగదంబయా భువన మండలం సూయతే -త్వయైవ కరుణార్ద్రయా తదపి రక్షణం నీయతే
త్వయైవ ఖర కోపయా నయన పావకే హూయతే -త్వయైవకిల నిత్యయా జగతి సంతతం స్థితం"

భావం- అమ్మా! నీ వల్ల ఈ సకల భూమండలం ప్రసవం చెందుతుంది. నీదయా రసం తో నే జగత్తు పాలింప బడుతోంది, రక్షింప బడుతోంది. నీ తీక్ష్ణ కోపానికి, నీ నేత్రాగ్నిలో హరించబడుతోంది. నిత్యురాలైన నీ చేతనే ఎల్లప్పుడూ జగత్తు నిలుస్తోంది.

100- "క్వణ త్కాంచీ పుర మణివిపంచీ లయ ఝరీ-శిరః కంపాకంపా వసతి రను కంపా -జలనిధిః
ఘనశ్యామా శ్యామాకఠిన కుచ సీమా మనసిమే-మృగాక్షీ కామాక్షీ హర నటన సాక్షీ విహరతాం"

భావం- అందమైన వడ్డాణం ధరించి, కాంచీపురంలో మాణిక్య వీణ లయ ప్రవాహానికి ఆనందంగా తలూపేది, కంపా నదీ తీరమే నివాసంగా ఉన్నదీ దయసంద్ర మేఘంలా

నల్లనైన నిండు యవ్వన కఠిన స్తనాలు కలదీ, జింక కళ్ళవంటి విశాల కనుదోయి కలది, పరమేశ్వరుని నటనకు సాక్షీ భూతమైనదీ అయిన కామాక్షీ దేవి నా మనసులో నిత్యంవిహరించు గాక.

101– "సమర విజయ కోటీ సాధకానంద దాటీ –మృదు గుణ మణిపేటీ ముఖ్య కాదంబ వాటీ
మునిసుత పరిపాటీ మోహితాజాండకోటీ –పరమశివ వధూటీ పాతుమాం కామకోటీ"
భావం– రాక్షసులపై అనేక యుద్ధాలో విజయం సాధించినదీ, సాధకుల ఆనందానికి ఆవలి తీరమైనదీ, మృదు రత్నాలకు పెట్టె లాంటిది, కదంబ వృక్ష వనం కలదీ, మునుల చేత స్తుతింపబడే సుగుణ రాశి అయినదీ, కోట్లాది బ్రహ్మాండాలను మోహింప జేసేదీ, పరమేశ్వరుని అర్ధాంగి అయినదీ, కామకోటి అనే పేరుతో విఖ్యాతమైనదీ అయిన కామాక్షీ తల్లి నన్ను కాపాడుగాక.

**4–కటాక్ష శతకం**

1– "మోహాంధకార నివహం వినిహంతు మీడే–మూకాత్మనామది మహాకవితా వదాన్యాన్
శ్రీ కాంచి దేశ శిశిరీకృత జాగరూకా–నేకామ్రనాధ తరుణీ కరునణావ లోకాన్"
భావం– కాంచీనగర ప్రాంతాన్ని చల్లబరచటానికి మేల్కొనేవి, మూగ పోయిన మనసుకలవారికి సైతం గొప్ప కవిత్వాన్ని ప్రసాదించేవి, అయిన ఏకామ్రేశ్వరుని భార్య కామాక్షీ దేవి చల్లని చూపులను నాకు ఉన్న మోహమనే చీకటిరాశిని నశింపజేయమని స్తుతిస్తాను.

47– "కైవల్యదాయ కరుణారస కింకరాయ–కామాక్షి కందళిత విభ్రమ శంకరాయ
ఆలోకనాయ తవ భక్త వశంకరాయ మాతర్నమోస్తు పరతంత్రిత శంకరాయ"
భావం– మోక్ష దాయినీ, కరుణ రసమే సేవకునిగా కలిగి ఉన్నది, అంకురించిన విలాసాలతో సుఖాన్నిచ్చేది, భక్తపరాదీనుడైన పరమేశ్వరుని వశం చేసుకోన్నదీ అయిన నీ దివ్య కటాక్షం కోసం నేను నమస్కరిస్తున్నాను.

74– "మూకో విరించతిపరం పురుషః–కందర్పతి త్రిదశ రాజతి కింప చానః
కామాక్షి కేవల ముపక్రమకాల ఏవ –లీలాతరంగిత కటాక్ష రుచః క్షణం తే"
భావం– నీ విలాసవంత కటాక్ష కాంతి కొద్దిగా ప్రసరించటం ప్రారంభం కాగానే మూగవాడు బ్రహ్మగా, వికృత రూపుడు మన్మదుడుగా, పేదవాడు ఇంద్రుడుగా మారిపోతున్నారు.

93– "ఏషా తవాక్షి సుషమా విషమాయుధస్య–నారాచ వర్ష లహరీ నగరాజ కన్యే
శంకే కరోతి శతధా హృది ధైర్య ముద్రాం–శ్రీకామకోటి యదసౌ శిశిరాంశుమౌళే"

భావం- పార్వతీ కామకోటీ కామాక్షీ! నీ కటాక్ష కాంతి మన్మధుడు బాణవర్షం. ఎందుకంటే చంద్ర రేఖను శిగలో ధరించిన శివుని మనసులోని ధైర్యాన్ని వందముక్కలు చేస్తోందని నేను శంకిస్తున్నాను.

101- పాతేన లోచన రుచే స్తవ కామకోటి -పోతేన పాతక పయోధి భయాతురాణాం
పూతేన తేన నవకాంచన కుండ లాంశు-వీతేన శీతలయ భూధర కన్యకే మాం"

భావం- పాపాల సముద్రం ముంచేస్తుంది అని భయపడేవారికి నీ చూపు ఓడలా రక్షిస్తుంది. అది నీ చెవులకున్న నూతన కుండలాల కాంతితో పవిత్రమైనది. అలాంటి పావన మైన నీ కంటి ప్రసారంతో నన్ను ముంచెయ్యి తల్లీ.

**5-మందస్మిత శతకం**

1-బధ్నీమో వయ మంజలిం ప్రతిదినం బంధచ్చిదే దేహినాం-కందర్పాగమ మంత్రం మూల గురవే కళ్యాణ కేళీ భువే
కామాక్ష్యా ఘనసార పంజ రజసే కామద్రుహ శ్చ క్షుషాం-మందార స్తబక ప్రభా ముద ముషే మందస్మిత జ్యోతిషే"

భావం- సకల ప్రాణ భవబంధ విమోచని, మన్మధానురాగ తంత్రానికి గురు స్థానంలో ఉన్నదీ, కల్యాణం అనే ఆట ఆడుకొనే శివుడి కనులకు ముద్ద కర్పూరం పొడి వంటిది, మందార పూల మకరందాన్ని దొంగిలించేది అయిన కామాక్షీ దేవి చిరునవ్వు అనే వెలుగు కోసం ప్రతిరోజూ మేము దోసిలి ఒగ్గుతాము.

34- "క్రమేణ స్నాపయస్వ కర్మ కుహనా చోరేణ మారాగమ-వ్యాఖ్యా శిక్షణ దీక్షితేన విదుషా మక్షీణలక్ష్మీ పుషా
కామాక్షి స్మిత కందళేన కలుష స్ఫోటక్రియా చుంచునా -కారుణ్యామృత వీచికా విహరణ ప్రాచుర్య దుర్యేణమాం"

భావం- కమ్మగా ఉండి, కర్మ అనే కపతాన్ని దొంగిలించేది, మన్మధ తంత్ర వ్యాఖ్యానంలో దిట్ట, అపారజ్ఞాని, పాప హరణంలో అత్యంత సమర్ధురాలు, కరుణ అనే అమృత తరంగాలలో విహరించటానికి ముందుకు వచ్చేది, అయిన నీ చిరునవ్వు మొలకలతో నన్ను స్నానం చేయించు తల్లీ.

58- "యన్నాకంపిత కాలకూట కబళీకారేచుచుంబేనయ-గ్లాన్యా చక్షుషి రూక్షితానల శిఖే రుద్రస్య తతాదృశం
చేతో యత్రపసభం స్వరజ్వర శిఖి జ్వాలేన లేలిహ్యతే -తత్కామాక్షీ తవస్మితాం శుకణికా హేలాభవం ప్రాభవం"

భావం- కాలకూట విషాన్ని మింగటానికి ఏమాత్రం భయపడలేదో, కన్ను అగ్ని జ్వాలలు

కక్కుతున్నా హాని పొందలేదో, అలాంటి రుద్రుని మనసు ఈనాడు మన్మథాగ్నితో చుట్టుముట్ట బడింది. దీనికి కారణం నీ మధుర దరహాస వైభవమే.

92– శ్రీ కామాక్షి తవస్మితైం దవమహః పూరే పరిస్ఫూర్జతి–ప్రౌఢాం వారిధి చాతురీం కలయతే భాక్తాత్మనాం ప్రాతిభం
దౌర్గత్య ప్రసరాస్తమః పటలికా సాధర్మ్య మా భిభ్రతే –కిం కిం కైరవ సాహచర్య పదవీరీతిం నధత్తే పదం.

భావం– నీ దరహాస చంద్రికా ప్రవాహం చల్లగా ఉండగా, భక్తులైన జీవుల ప్రతిభా వ్యుత్పత్తులు సముద్రంలాగా పొంగిపోతాయి. దరిద్రంలాంటి దుర్గతులు చీకటి గుంపులో కలిసిపోతాయి. ఈ విధంగా జీవులకు చంద్రత్వం అంటే తెల్లకలువల సాహ చర్యం కలిగినపుడు ఏ కార్యాలు జరక్కుండా ఉంటాయి?

101– "ఆర్యామేవ విభాయన్మనసి యః పాదార విందం పురః –పశ్యన్నారభతే స్తుతిం స నియతం లబ్ధ్వా కటాక్షచ్ఛవిం
కామాక్ష్యా మృదుల స్మితాంశులహరీ జ్యోత్స్నా వయస్యాన్వితా –మారోహత్య పవర్గ సౌద వలభీ మానంద వీచీమయీం"

భావం– మనసులో ఎవరు ఆర్యాదేవి అయిన శ్రీ కామాక్షీ దేవిని భావిస్తాడో, ఆమె పాదకమలాల ఎదుట నిలబడి స్తోత్రం ప్రారంభిస్తాడో, అతడు దేవీ కటాక్షాన్ని తప్పక పొందుతాడు. కామాక్షీదేవికి మందస్మిత కాంతి ప్రవాహం అనే ఒక స్నేహితురాలు ఉన్నది. ఆమె మోక్షం అనే భవనంలో నివశిస్తుంది. శ్రీదేవి అనుగ్రహ, కటాక్షాలను పొందిన సాధకుడు, ఆ మోక్ష భవనం పైఅంతస్తులోని మొదటి భాగానికి అంటే అమ్మవారి పద సన్నిధికి చేరుకుంటాడు' అంటూ మూక కవి తన మూక పంచశతిని పూర్తి చేశాడు. ఆర్యాలో 101, పాదారవిందలో 103, స్తుతిలో 102, కటాక్షలో 101, మందస్మిత శతకంలో 101 శ్లోకాలున్నాయి. మొత్తం 508 శ్లోకాలు మూక పంచశతిలో ఉన్నాయి. ప్రతి శ్లోకం ఆణిముత్యమే. ఊహాపోహ సౌందర్యమే భక్తీ భావ విలసితమే. అమ్మ కరుణా కటాక్ష రసస్నానమే.

భావానికి ఆధారం– డాక్టర్ జయంతి చక్రవర్తి సరళ తాత్పర్యాలతో రచించి గొల్లపూడి వీరాస్వామి సన్స్ ప్రచురించిన "మూక పంచశతి". ❀



## 60) సమ్మతి భువనాభ్యుదయ కర్త - సిద్ధ సేన దివాకర -500-600

క్రీ.శ.-600 మధ్య బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన జైన సంస్కృత పండితుడు సిద్ధ సేన దివాకరుని గురువు వృద్ధవాది. ఒకసారి గురువుతో తనకు ప్రాకృత భాషలో ఉన్న జైన గ్రంథాలన్నీ సంస్కృతంలోకి మార్చాలని ఉందని చెప్పగా ప్రాయశ్చిత్తంగా దేశంలోని జైన దేవాలయాలనన్నిటిని 12 ఏళ్లపాటు సందర్శించి రమ్మని ఆజ్ఞాపించాడు. అలా తిరుగుతూ ఉజ్జయినిలోని లింగ దేవాలయం చేరి కాళ్ళు లింగంపైన పెట్టి గుడిలో పడుకున్నాడు. భక్తులు ఫిర్యాదు చేయగా విక్రమాదిత్య మహారాజు సిద్ధసేనుడిని చేసిన పాపానికి జైలులోపెట్టి కొరడాలతో కొట్టించాడు. గొప్ప మంత్రకారుడైన దివాకరుడు ఆ దెబ్బలు తనకు తగలకుండా రాణికి తగిలేట్లు చేశాడు. దీనికి ఆశ్చర్యపడిన రాజు వదిలేయగా ఆ గదిలో లింగాన్ని చేతులతో పీకేసి పార్శ్వనాథ విగ్రహాన్ని దాని స్థానంలో ప్రతిష్టించాడు.

జైనంలోని "అనేకత్వ వాదం"కు విశ్లేషణగా సిద్ధసేన దివాకర "సన్మతి తర్కప్రకారణ" రాశాడు. ఏడుగా ఉన్న జైన న్యాయాలను 1-ద్రవ్య శిక్షా న్యాయం, 2-పర్యాయ శిక్షా న్యాయం అనే రెండుగా కుదించాడు. అసిత్వాన్ని నమ్మేవారు మొదటివిభాగానికి అది అశాశ్వతం అని నమ్మేవారు రెండవ దానికి చెందుతారు. తర్వాత ఈ రెండిటిని భారతీయ తత్వశాస్త్రాలకు అనుసంధించాడు. సిద్ధ సేనుడు ఇదేకాక న్యాయావతారం కళ్యాణ మందిర స్తోత్రం కూడా రాశాడు. సన్మతి తర్కానికి స్వే తాంబర జైనాచార్య "అభయ దేవుడు "తత్వ బోధ విధాయిని" వ్యాఖ్యానం రాశాడు. ఇతడు ప్రద్యుమ్న సూరి శిష్యుడు. సిద్ధసేనుని గ్రంథం అసలు పేరు "సమ్మతి తర్క. ఇది ప్రాకృత భాషాపదం అందుకని "సన్మతి తర్క ప్రకరణం" అని తర్వాత సన్మతి తర్క"

అని వ్రాశాడు. ఆర్యా వృత్తంలో సంస్కృత శ్లోకాలలో ఈ గ్రంథం ఉన్నది. కొన్ని అనుష్టుప్, ఉపజాతిలను కూడా వాడాడు. ఉపోద్ఘాతంలో 166 శ్లోకాలున్నాయి. ప్రపంచసార లాగా మూడు భాగాల గ్రంథం. మూడు అధ్యాయాలను కాండాలు అన్నాడు వాటిలోని విషయం వివరణ ముందు చెప్పలేదు. రెండవది న్యాయకాండ మూడవది జీవకాండ. సన్మతిలోని ప్రతిదానిని సుత్త అని గాథలను కూడా అదే పేరుతో చెప్పాడు. అనేకాంత, ఏకాంత వాదాలపై విస్తృత చర్చ చేశాడు. ఆయన రాసిన ద్వా త్రింసి కాలను "ద్వా" అనే పేర్కొని తన జీవిత వివరాలు రాశాడు.

సిద్ధసేనుడు జైన బ్రాహ్మణుడు వేదం శాస్త్రాలను మహాయాన బౌద్ధాన్ని ముఖ్యంగా ఆజీవక సిద్ధాంతాన్ని బాగా అధ్యయనం చేశాడు. దయా దాక్షిణ్యాలున్నవాడు. ప్రతిదానిని నిశిత పరిశీలనంతో చూసే దృష్టి ఉన్నవాడు. తర్కంతో దేనినైనా అర్థం చేసుకునే వాడు కుదరకపోతే విశ్వాసాన్ని అనుసరించాడు. అనేకమందిరాజులతో తత్వవేత్తలతో గాఢమైన అనుబంధం ఉన్నవాడు. మహా జ్ఞాని –జీనియస్‌గా గుర్తింపు పొందాడు. గొప్ప సృజనశీలి. మహావీరుని అనుసరించటానికి కారణం విశ్వాసమేకాక అందులోని తర్క విధానం అని చెప్పాడు.

ఈ ద్వాత్రింశికలు సంస్కృతంలో ఉన్నా అత్యున్నత తత్వసారంగా ఉంటాయి. అలంకారాలతో పరిపుష్టమైన శైలీ విన్యాసంతో భాసిస్తాయి. కాళిదాసుని వైదర్భీ రీతి ఉంది. వీటిలో 17 రకాల ఛందస్సులను వాడాడు ఇందులోని 1 నుంచి 5, 11, 21 ఉన్న 7 కూడా స్తుతులు 6, 8 విశ్లేషణాత్మకమైనవి. మిగిలినవి వేదాంత తత్వ బోధకాలు సమంత భద్రుని స్వయం భూస్తోత్రంలో ముందుమాట స్వయం భూ చివరిమాట సమంత భద్ర ఉన్నట్లే ఈ ద్వాలలో కూడా మొదట స్వయంభు చివర సిద్ధ సేన ఉంటుంది. మూడవ దానిలో మహావీరుని "పురుషోత్తమ" అన్నాడు 4వ ద్వా ను "వైతాళీయ ఛందస్సులో రాశాడు. ఇది కుమారసంభవం 4 రఘువంశం 8 సర్గలను గుర్తుకు తెస్తుంది. మొత్తం మీద ఈ అన్ని ద్వాలలో మహావీర స్తోత్రమే దర్శనమిస్తుంది. ఈ విషయాలన్నీ "సన్మతి తర్క" ఉపోద్ఘాతంలో శ్రీ సుఖ లాల్ శ్రీ బేచార్ దాస్‌లు విస్తృత పరిశోధన చేసి ఆంగ్లంలో రాసిన విషయాలు. సిద్ధ సేన దివాకరుని సన్మతి తర్కంలో ఒక శ్లోకం చూద్దాం–

1– సిద్ధం సిద్ధాత్సాగం థాసా భగవోపమఅవగయాసాం–కుసుమయావి సాసగం జినాసం భావ జిఘాంసః"

భావం– జనులు బోధించిన ద్వేష అనురాగాలను జయించాలన్న భావాలు ఉత్కృష్టమైనవి. ఏవ్ ఆ మాటేగాంలో నడిచే వారికి రక్షకాలు అనతత్వాన్ని కాదన్నవారికి ఇవే సమాధానాలు.❁



## 61) రత్న శాస్త్ర కర్త - వరాహ మిహిరుడు -505-587

వేదకాలానికి పూర్వమే అంటే 5 వేల ఏళ్ళక్రితమే మహర్షులు అంతర్ దృష్టితో ఆకాశ గ్రహాలకు, మానవ శరీరానికి మధ్య ఉన్న సంబంధాన్ని కనిపెట్టారు. విశ్వంలోని గ్రహ, నక్షత్రాలకు కొన్ని రకాల శక్తులున్నాయి. అందుకనే "యత్ పిండే తత్ బ్రహ్మాండే" అనే సామెత వచ్చింది. భూమిపై ప్రతి మనిషి జీవితాన్ని గ్రహనక్షత్రాలు ప్రభావితం చేస్తాయి. నవగ్రహాలకు నవ రత్నాలకు సంబంధం ఉంది. సూర్యుడు కెంపు చంద్రుడు ముత్యం. కుజుడు పగడం. బుధుడు పచ్చ. గురుడు నీలం.. శుక్రుడు వజ్రం. శని నీలం. రాహువు గోమేధికం. కేతువు కనక పుష్యరాగం.

ఈ నవరత్నాల గురించి చెప్పే శాస్త్రమే రత్నశాస్త్రం "జెమ్మాలజీ". రత్నశాస్త్రం సృష్టితోపాటు ఏర్పడిందేనని నమ్మకం .దీని గురించి ఒక ప్రత్యేక మంత్రం ఉంది - "స శంఖ చక్రం స కిరీట కుండలం స పీత వస్త్రం సరసీ రుణేక్షణం -సహార్వ క్షస్థల కౌస్తుభాశ్రియమ్ నమామి విష్ణుం శిరసా చతుర్భుజం"

విష్ణుమూర్తి అనేక ఆయుధాలు ధరించినా అయన మెడలో కౌస్తుభహారం ఉంటుంది. శివుడు పాములు పులి చర్మం పుర్రెలహారం ధరించినా జపమాలలో దేవతలు భక్తితో సమర్పించిన "రుద్రమణి" ధరిస్తాడు. మధ్యయుగ కాలంలో కూడా రత్న శాస్త్రంపై చాలామంది దృష్టిపెట్టారు. ఆచార్య వరాహమిహిరుడు రచించిన "బృహత్ సంహిత"లో రత్నశాస్త్ర విషయాలు అనేకమున్నాయి. అందులో ఒక అధ్యాయాన్ని పూర్తిగా రత్న విషయాలకు కేటాయించి "రత్నా ధ్యాయం" అని పేరుపెట్టాడు. అందుకే వరాహ మిహిరుడిని రత్నశాస్త్ర వేత్తలలో అగ్రగణ్యునిగా భావిస్తారు. అగ్ని పురాణంలో కూడా రత్నశాస్త్ర విషయాలున్నాయి. జాతకుని జన్మ నక్షత్రాన్ని అనుసరించి ఏరకమైన రత్నాన్ని ఉంగరానికి ధరించాలో సంపూర్ణంగా అధ్యయనం చేసి చెప్పిన గ్రంథమిది.❋

## 62) తిలోయ పన్నతి కర్త - యతి వృషభ -551

జైన మతాచార్యుడు, గణిత శాస్త్రవేత్త, ఆర్య మంఖ, నాగహోస్తిల శిష్యుడు యతి వృషభ. తన గురించి పెద్దగా చెప్పుకోలేదు కానీ గుప్త యుగం పాలించిన 231 ఏళ్ళ తర్వాత అని చెప్పాడు. కనుక ఈయన కాలం క్రీ.శ.551 కావచ్చు అని తేల్చారు. క్రీ.శ. 609లో జైన భద్ర యతి వృషభ ప్రస్తావన తెచ్చాడు. క్రీ.శ 458 వాడైన శర్వానంది గురించి యతి వృషభుడు పేర్కొనటం వలన పైకాలాన్ని ధృవీకరించవచ్చు.

యతి వృషభ రచించిన "తిలోయ పన్నతి"లో చాలా పెద్ద దూరాలను కొలిచే అనేక ప్రమాణాలను, అనంత కాల గణన విధానాలను వివరించాడు. ఇది జైన మత విశ్వోద్భవ వర్ణనను తెలియజేసే గ్రంథం. దీనితో జైనుల గణిత, శాస్త్ర విజ్ఞాన గరిమను గురించి తెలుసుకొనే వీలు కలిగింది. అనంత అంతరిక్షం, అనంత కాలంలో అనంత ప్రపంచం ఉన్నదని జైనమత విశ్వాసం. దీని ఆధారంగా సుదూర ప్రాంతాల మధ్య దూరాన్ని, ఎక్కువ నిడివిగల కాల విరామాలు గణించగలిగారు. దీనితో అనంతాన్ని గురించిన అనేక విధాల గణనం వారికి వీలయింది. పాశ్చాత్య గణితవేత్త "కాన్ టార్ 'థీరీ ఆఫ్ ఇన్ఫినిట్ కార్డినల్స్" కనిపెట్టే దాకా ఈ జైన గణితం ఒక్కటే అందరికీ ఆధారంగా ఉండేది.

ఈ పుస్తకంలో 1-గణన విధానాలు, 2-సంఖ్యా విధానం, 3-ప్రతీకవాదం (సింబాలిజం), 3-రేఖా గణితం, 4-ఘన జ్యామితి (సాలిడ్ జామెట్రీ), 5-శ్రేణులు (సిరీస్), 6-సంవర్గమానం (లాగరిథమ్స్) ఉన్నాయి.

యతి వృషభ తిలోయ పన్నతితో పాటు కాశయ ప్రదూత చూర్ణి , శతక చూర్ణి, సిత్తారి చూర్ణి కర్మ సూత్ర కూడా రాశాడు కానీ అలభ్యాలు. ఆయన 8 కర్మ ప్రవాదాలలో నిపుణుడు, కర్మ ప్రకృతిపై ఆధిపత్యం ఉన్నవాడని నంది సూత్రం తెలియజేస్తోంది. జైనాచార్యుడేకాక గొప్ప శాస్త్ర పండితుడు. భూత బలితోపాటు సమాన ప్రతిభ కలవాడు. వీరిద్దరి అభిప్రాయాలకు జైన మతంలో విలువ ఉంది. చూర్ణిలలో గొప్ప పద్ధతి శైలిని వాడాడు. ఆగమ విధానాలలో కూడా మంచి ప్రవేశం ఉన్నవాడని భావిస్తారు. అన్ని రకాల సంప్రదాయాలను విశేషమైన అనుభవంతో సులభ విధానంలో బోధించే నేర్పున్న ఆచార్యుడు యతి వృషభ.

Yativrishabha who studied under arya Manksu and Nagahastin. He composed, along with other traditional Jain works, the Tiloyapa?? atti (in Sanskrit, Trilokaprajñapti or Knowledge on the three worlds), a work on Jain cosmography. This work describes the construction of the Universe expressed in specific numbers; for example, the diameter of the circular Jambu continent, upon which India is located, is 100,000 yojanas and its circumference is 316,227 yojanas, 3 krosas, 128 dandas ---13 angulas 1 riksa - 1 ratharenu -----3 trasarrences ----- yati vrishabha 6 karmabhumivalagras, 7 madhya bhogabhumivalagras, 5 uttamabhogabhumivalagras, 1 rathare?u, 3 trasare?us, 2 sannasannas, and 3 avasannasannas, plus a remainder of 23213/ 105409. Yativ??abha also gives formulas for computing the circumference (C) and the area (A) of a circle having a diameter of d: c= square root 10 d square a=c.d/4.❁



## 63) మాండూక్య వార్తిక కర్త - గౌడ పాదాచార్య -600


శంకరాచార్యుల గురువు గోవింద భాగవత్పాదులవారి గురువు గౌడపాదాచార్య క్రీ.శ. 6వ శతాబ్దికి చెందినవారుగా పరిగణిస్తారు. మధ్యయుగంలో వేదాంతశాస్త్ర వ్యాప్తి చేసినవారు ఆయన. ఆది శంకరులు వారిని "పరమాచార్య"గా పేర్కొని గౌరవించారు. మాండూక్య కారికను సంతరించిన మహాను భావులు గౌడపాదులవారు. దీన్ని గౌడపాద కారిక అని ఆగమ శాస్త్రం అని కూడా పిలుస్తారు. ఇది 4 అధ్యాయాల గ్రంథం. నాలుగు భాగాల పుస్తకం. ఇందులో నాలుగవది బౌద్ధ పదజాలంతో ఉంటుంది కనుక బౌద్ధ ప్రభావంతో రాయబడిందని అంటారు. కాని ఆచార్య స్వామి రాసింది హిందూ వేద ధర్మమే కాని బౌద్ధ ధర్మం కాదు. మొదటి మూడుభాగాలు అద్వైత భావవ్యాప్తికి దీప్తికి పట్టు గొమ్మలు. ఇందులో మొదటిభాగంలో మాండూక్య ఉపనిషత్ ఉన్నది. ఇది ద్వైత, విశిస్టాద్వైతులకూ ఆరాధనీయమే.

మాండూక్య కారిక కేవలం 12 వాక్యాల చిట్టి గ్రంథం. శంకరుల ముందుకూడా మాండూక్య ఉపనిషత్ "శ్రుతి"గా పేర్కొన బడేది. దీని వ్యాప్తి అనంతం ప్రభావం చెప్ప తరం కానిది. ఉపనిషత్ సారం అంతా వడకట్టి ఇచ్చింది. ఇందులోని మొదటిభాగం- 1- ఆగమ ప్రకరణం (29 శ్లోకాలు), 2-వైతత్య ప్రకరణ (38 శ్లోకాలు), 3-అద్వైత ప్రకరణ (48 శ్లోకాలు), 4-అలతశాంతి ప్రకరణ (100 శ్లోకాలు).

అగమ భాగంలో ఆత్మమనిషి శరీరంలో 1-విశ్వ, 2-తైజస, 3-ప్రజ్ఞ అనే మూడు రూపాలో ఉంటుందని చెబుతుంది. రెండవ ప్రకరణం వైతత్య అంటే అసత్యంలో బృహదారణ్యక ఉపనిషత్తు ఉంది. మూడులో అద్వైత విషయాలన్నీ క్రోడీకరించి ఉన్నాయి. నాలుగవ ప్రకరణ అలత శాంతి అంటే అగ్ని, శాంతిలో ప్రముఖుల సూక్తులు ఉన్నాయి. ధర్మం, సాంఖ్యం, అజాతివాదం, సంసారం ముక్తి విషయాలపై వివరణ ఉంది. ❁

## 64) గణిత మేధావి - విరహాంక -600

6వ శతాబ్దికి చెందిన విరహాంక గొప్ప ఛందస్ శాస్త్రవేత్త, గణిత మేధావి. 8వ శతాబ్దం వాడు అనే అభిప్రాయమూ ఉన్నది. క్రీ.పూ. 4వ శతాబ్దానికి చెందిన పింగళ కుని ఛందస్సూత్రాల నాధారంగా ఛందశ్శాస్త్రం రాశాడు. దీనికి వ్యాఖ్యానాన్ని 12వ శతాబ్దానికి చెందిన గోపాలకవి రాశాడు.❁



## 65) బృహద్దేశి సంస్కృత సంగీతకర్త - మతంగ ముని (600)

భారతీయ సాంప్రదాయ సంగీతంపై "బృహద్దేశి" గ్రంథం రాసిన మతంగ ముని కాలం క్రీ.శ. 6 -8 శాతాబ్ది మధ్య. సంగీత రాగాలపై వచ్చిన మొట్టమొదటి గ్రంథం బృహద్దేశి. ఇందులో మార్గదేశి రాగాల వివరణ ఉన్నది. స్వరం నోటేషన్‌ల వివరణ కూడా ఉంది. తన రచనలో భరతముని నాట్యశాస్త్రాన్ని మతంగముని చాలాసార్లు పేర్కొన్నాడు. సంగీత ప్రమాణాలు -మ్యూజికల్ స్కేల్స్, శృతిలపై విస్తృతంగా చర్చించాడు. బృహద్దేశి ప్రేమలతా శర్మ సంపాదకత్వంలో వెలువడింది. తెలుగులో కూడా శ్రీ ద్వారం భావనారాయణ వ్యాఖ్యానం రాసి 2002లో ప్రచురించారు.❁

## 66) సేతు బంధం కావ్య కర్తలు - మూలసేన, సర్వ సేన, ప్రవర సేన -600

దండి ఉదాహరించిన సాహిత్యకారులలో సర్వ సేన, ప్రవర సేనులున్నారు. ప్రవర సేనుని ప్రాకృత కావ్యం సేతుబంధం ప్రసిద్ధమైనది. కాళిదాసుతో సమానమైన ప్రతిభ ప్రదర్శించాడు. దీని వ్యాఖ్యాత 16వ శతాబ్దికి చెందిన రామ దాస భూపతి బాగా మెచ్చాడు. ఇది 15 అష్వకాలతో 1291 శ్లోకాల కావ్యం. ఈ కవి రెండవ ప్రవర సేన మహారాజని 410-440 మధ్య రాజ్యమే లాడని అతని కవిత్వ ప్రతిభ శ్రేష్టతరమనే భాసుడు దండి కూడా మెచ్చారని అంటారు.❋



## 67) ఆచార్య దండికే సమాధానం చెప్పిన - విజ్జిక -600

దండి చెప్పిన సాహిత్యకారులు జాబితాలో కన్నడ దేశ సంస్కృత కవయిత్రి విజ్జిక లేక విజ్జి అనే విదుషీమణి ఉంది.. భావోద్వేగ రచన లెన్నో చేసింది. బహుశా ఆమె శరీర ఛాయ నలుపు అవవచ్చు. దండికి సమాధానంగా చెప్పినట్లు ఒక శ్లోకం ప్రచారంలో ఉంది - "నీలోత్పల దళ శ్యామాం విజ్జాకామ్ మామ జా నతా - వృద్ధె వ దండి నా ప్రోక్తం సర్వ శుక్లా సరస్వతీ"

దండి తనకావ్యంలో సరస్వతీదేవిని శ్వేత వర్ణం కలదిగా వర్ణించాడు. తాను సరస్వతీ దేవి అవతారమని భావించే విజ్జికకు ఇది నచ్చలేదు. నల్లకలువ దళాలవలె నల్లగా ఉన్న సరస్వతీ స్వరూపమైన విజ్జికను యెరుగకుండా దండి సరస్వతిని తెలుపు వర్ణంగల దానినిగా వర్ణించాడు అన్నది. విజ్జికయే సరస్వతి అని తెలిస్తే అలా వర్ణించేవాడు కాదు అని భావం - "ఆచార్య దణ్డినో వాచమాచా నామృత సంపదాం -వికాసో వేధసః పరన్యా విలాపం మణి దర్పకం" అంటే మృత వాక్కుల దండి వాక్కు యొక్క తేజస్సు అద్దంలో మెరిసిన సరస్వతీదేవి యొక్క ఆభరణాల సోయగమే.❋



## 68) ప్రమాణ వార్తిక కర్త - ధర్మ కృతి -600-700

నలంద విశ్వ విద్యాలయ బౌద్ధాచార్యుడు ధర్మ కృతి క్రీశ 600–700 కాలం వాడు. యోగాచార్య సూత్రాన్తిక విధానాలలో నిష్ణాతుడు. గొప్ప అణు శాస్త్రవేత్త. ఆయన రచనలు మీమాంస న్యాయ శైవ హిందూ జైన తత్వశాస్త్రజ్ఞులను బాగా ఆకర్షించాయి. ఆయన రచన "ప్రమాణ వార్తిక" బృహద్గ్రంథం. ఇది భారత టిబెట్ దేశాలలో విస్తృత సంచలనం కలిగించింది.

ధర్మకృతి దక్షిణ భారత దేశంలో పుట్టిన బ్రాహ్మణుడని, మహా మీమాంసకారుడు కుమారిలభట్టు మేనల్లుడని అంటారు. ఇతని వస్త్ర ధారణచూసి మేనమామ కుమారిల భట్టు ఒకరోజు తీవ్రంగా ఆక్షేపించి తిట్టిపోశాడని చిన్నప్పుడే ఇల్లు వదిలి బౌద్ధంలో చేరాడని ఈశ్వర సేన వద్ద కొంత చదివి నలందా వెళ్లి 6వ శతాబ్ది ధర్మపాలతో సన్నిహితంగా మెలఁగి బౌద్ధ తర్క వేత్త దిజ్ఞాగుని ప్రభావంతో బౌద్ధ ధర్మావలంబనానికి మార్గదర్శక సూత్రాలు రాశాడని వీటినే టిబెట్‌లో కూడా అనుసరించారని అంటారు. నలందలో సామాన్య బౌద్ధుడుగానే ఉన్నాడు, ఎవరూ ఆయన జ్ఞానాన్ని అర్ధం చేసుకోలేకపోయారని అనుకొన్నాడు.

ధర్మ కీర్తి ఏదైనా కార్య కారణం సంబంధంగా హేతు బద్ధంగా తర్క విధానంలో ఉండాలని భావించాడు. పరమార్ధసత్ సంవృత సత్తుతో విభేదిస్తుంది. ప్రత్యభిజ్ఞానం నిశ్చయంలు వాసనలతో ఉద్బుద్ధమై, ప్రత్యక్షాభాసమౌతాయని అసలు సత్యమైన సంవిత్‌ను మరుగుపరుస్తామని, సహజ ప్రభాసమానమైన ప్రభాస్వరను అవిద్య కప్పేస్తుందని అంతర్జ్వాలగా ఉన్న చింతామణి ప్రజ్ఞను మేల్కొల్పితే పూర్ణ ప్రజ్ఞ లభిస్తుందని చెప్పాడు. ఇతని భావాలు మాధ్యమిక భావాలు. దిజ్ఞాగు ధర్మాకృతి లో బౌద్ధంలో ఒక నూతన ఆలోచనా విధానానికి మార్గదర్శకులయ్యారు. టిబెట్‌లో వీరిద్దర్నీ కారణకారులు అంటారు. ఇప్పటి కాలపు ప్రమాణ వాదులన్నమాట.

ధర్మ కృతి రచనలు– సంబంధ ప్రతీక్ష వృత్తి, ప్రమాణ వినిశ్చయా, ప్రమాణ వార్తిక, ప్రమాణ వార్తికస్వ వృత్తి, న్యాయ బిందు ప్రకాశన, హెత్రా బిందూనామ ప్రకారణ, సంతానాన్తర సిద్ధినినామ ప్రకారణ, వాద న్యాయ నామ ప్రకారణ.❁

## 69) వాస్తు శాస్త్ర కర్తలు- తక్కురుపేరు, రామచంద్ర భట్టారక నర్మద శంకర. వరాహ -600-1000-263

నిర్మాణ శాస్త్రాన్ని వాస్తు శాస్త్రం అంటారు. ఇది అనాదిగా ఉన్న శాస్త్రమే. వాస్తు విద్యలో భాగమే వాస్తు శాస్త్రం. సంస్కృతంలో వాస్తు అంటే నివాసం ఉండే ఇల్లు. వాస్తు శాస్త్రం అంటే ఇంటి నిర్మాణం అభివృద్ధి మొదలైనవి తెలిపేది. తక్కూర ఫెరు అనే ఆయన మొదట “వాస్తు శాస్త్రం” రాసి ఆలయ నిర్మాణాలు ఎలా చేయాలో సూచించాడు. 6వ శతాబ్దికి ఆలయ నిర్మాణం బాగా ఇండియాలో విస్తృతమైంది. దీనికి కారణం సంస్కృతంలో వాస్తు గ్రంథాలు రావటమే. 10వ శతాబ్దికి చెందిన ఒరిస్సా రచయిత రామచంద్ర భట్టారక కౌలాచార “శిల్ప ప్రకాశం” సంస్కృతంలో రాశాడు. ఇందులో ఆలయ నిర్మాణంలో ఉన్న రేఖీయ వివరణాలన్నీ ఉన్నాయి. మానవునిలో 16 భావోద్రేకాలకు సరి సమానమైన 16 స్త్రీమూర్తుల నిర్మాణం ఎలా నిర్మించాలో తెలిపాడు. 32రకాల నాటక స్త్రీలను శిల్ప ప్రకాశంలోని 16 స్త్రీలతో పోల్చి సౌరాష్ట్ర నిర్మాణంలో చెప్పారు. నర్మదశంకరుడు “శిల్ప రత్నాకరం” రాశాడు. రాజస్థాన్‌లోని పురాతన గ్రంథాలను పరిశీలిస్తే సూత్ర ధర మందనుడు రాసిన “ప్రకాశం ధర మండనం” అనే దేవాలయ, పట్టణ నిర్మాణ విషయాలున్న గ్రంథం లభించింది. దక్షిణ భారతంలోని “మనసారా శిల్పం, మాయమత గ్రంథాలు క్రీ.శ 5-7 శతాబ్దాల వాస్తు గ్రంథాలు. “ఇషనాశివ గురు దేవ పద్ధతి” అనే మరొక సంస్కృత వాస్తు గ్రంథం 9వ శతాబ్దానికి చెందింది. 6వ శతాబ్దపు వరాహమిహిరుని “బృహత్ సంహిత”లో పట్టణ నిర్మాణ విషయాలు చెప్పాడు. ఈ వాస్తు శాస్త్రాలన్నీ దేవాలయ గృహ పట్టణ నిర్మాణ విషయాలనే కాక వాటి పవిత్రతను కాపాడే విషయాలనూ చెప్పాయి.❁

## 70) మీమాంసలో తన స్వంత మార్గాన్ని ఏర్పరచిన మార్గదర్శి- ప్రభాకరుడు (700)

భారతీయ తత్వవేత్త వ్యాకరణవేత్త అయిన ప్రభాకరుడు 7వ శతాబ్దపు కవి. కుమారిల భట్టు మీమాంసపై ఖండనం చేసి తన మార్గంను వేరుగా ఏర్పాటు చేసుకొన్నాడు. ఇదే ప్రభాకర విధానం (ప్రభాకర స్కూల్) అని పిలువబడుతోంది. 8వ శతాబ్దంలో శైలకాంత ప్రభాకర సిద్ధాంతంపై వ్యాఖ్యానించాడు. పూర్వ మీమాంస సిద్ధాంతకర్తగా ప్రభాకరుని గుర్తిస్తారు.

ప్రభాకరుని సిద్ధాంతం ప్రకారం -పదాలు సూటిగా అర్ధాన్ని ఇవ్వలేవు. మిగిలిన శబ్దాలతో సంబంధం ఉన్నప్పుడే దాని అర్ధం తెలుస్తుంది. దీనికే అన్వితాభిధానం అన్నాడు. అన్విత అంటే అనుసంధానమైనది అని అర్ధం. అభిద అంటే వ్యక్తీకరణ అని అర్ధం. వాక్యంలో పదం ఏ సందర్భంగా ప్రయోగింప బడిందో తెలియాలంటే మిగతా పదాలమధ్య సంబంధం తెలియాలి. అప్పుడు ఆ వాక్యం మొత్తం భావం అవగాహన అవుతుంది. ఇది ఆధునిక లింగ్విస్టిక్స్‌లోని "అండర్ స్పెసిఫికేషన్" అన్నమాట. అనగా నిర్దేశిత ప్రయోజనం.

ప్రభాకర వాదాన్ని భట్టకులు వ్యతిరేకించారు. అభిహితాన్వయంను వాళ్ళు అంగీకరించారు. అంటే ప్రతి పదం యొక్క అర్ధం తెలిస్తేనే వాక్యం యొక్క మొత్తం భావం తెలుస్తుంది అని వీళ్ళ వాదం. వీరి భావనలో శబ్దాలు స్వతంత్రమైనవి, సంపూర్ణ స్వరూపమైనవి. ఇది ఈనాటి "ఫోడోరియన్" వాదానికి దగ్గరలో ఉంది.❁

## 71) ఇద్దరు వామనులు (క్రీ.శ. 700 మరియు 779-813)

పాణిని వ్రాసిన సంస్కృత వ్యాకరణానికి "కాశిక" పేరుతో వ్యాఖ్యానం రాసిన వామనుడు క్రీ.శ 700 కాలం వాడు. రాజశేఖరుడు, అభినవ గుప్తుడు మరొక వామనుడిని ప్రస్తావించారు. క్రీ.శ.779-813 మధ్యకాలంలో కాశ్మీరాన్ని పాలించిన జయగుప్తుని మంత్రి వామనుడు అనే వాడున్నాడు. అయితే ఈ వామనుడి కాశిక రాశాడనటానికి ఆధారం లేదు. అలంకార శాస్త్రం రాసిన వామనుడు, పాణినీయంకు కాశిక వ్యాఖ్య రాసిన వామనుడు ఒక్కరు కాదు అని తెలుసుకోవాలి. 7వ శతాబ్దికి ప్రారంభంలో హుయాన్ త్సాంగ్ భారత దేశ సందర్శనం ముందే "కాశిక" వ్రాయబడింది.❁

## 72) కాశ్మీర్‌లో సంస్కృత కావ్య రచన -650-884

కాశ్మీర్‌లో లభించిన మొట్టమొదటి రచన "నీలకంఠ పురాణం". ఇది కావ్యం కాదు. క్రీ.శ 650లో భూమాకుడు రాసిన "అర్జున రావణీయం" మొదటి కావ్యం. ఇది భట్టికావ్యానికి అనుసరణం. ఉపోద్ఘాతంలో కవి దీన్ని మహాకావ్యం అని చెప్పుకొన్నా ఇందులో పాణినీయ వ్యాకరణ సూత్ర వివరణమే ఎక్కువ. ఇందులోని 18 సర్గలు పాణిని అష్టాధ్యాయిలోని 18 గాన కూటాది పాదం భూవాది పాదాలకు సరిసమానం కథ -రావణ కార్త వీర్యార్జున మే. 500 శ్లోకాలు భారవి కిరాతార్జునీయం శ్రీ తో మొదలైనట్లే ఈ కవీ అలానే చేశాదు. 8వ శతాబ్దం దాకా కాశ్మీర సంస్కృత కవులు సృజన కంటే విమర్శనాత్మక రచనలకు ప్రాధాన్యమిచ్చారు. ఉద్భటకవితో కాశ్మీర్‌లో సంస్కృత సృజన రచన ప్రారంభమైందని అంటారు.

జయాపీడని ఆస్థానకవి దామోదర గుప్త రచన "కుట్టినీమతం" అశ్లీల సాహిత్యంగా ముద్రపడింది. 1058 శ్లోకాల ఈ కావ్యం వారణాసికి చెందిన మాలతి సలహా సంప్రదింపులకు వికరలను చేరటం అనేక ప్రేమ కిటుకులు, మన్మథోత్సవం శృంగారం దట్టించిన ప్రేమకథ. కొన్ని శ్లోకాల భావాలు చూద్దాం -1-పుష్పహారం ధరించిన ఆమె స్రగ్ధర అంటే అందమైన ముఖం కలది. ఆమె సువదన, ప్రహర్షిణి, తనుమధ్యమా, రుచిరా, సుభాషిణీ. ఈ పేర్లు అందానికి ఛందస్సు వైవిధ్యానికి సరిపోతోంది.

8వ శతాబ్దంలో సర్వజ్ఞ మిత్ర కవి "స్రగ్ధరా స్తోత్రం"లో 37 స్రగ్ధరా వృత్త శ్లోకాలున్నాయి. ప్రసన్నం చేసుకొనే దీనాక్రం దన శైలిలో పాపాలను క్షమించమనటం తన బలహీనతలను చెప్పుకోవటం కనిపిస్తుంది. ఒకశ్లోకంలో "నా తప్పులు బలహీనతలు మోసం ద్రోహం నన్ను వెంటాడుతున్నాయి. రెండవ శ్లోకంలో -చావుకు దగ్గరైన వాడినీ మంచి వైద్యం తెలిసిన వైద్యుదు నిర్లక్ష్యంగా వదిలేసినట్లుంది నా పరిస్థితి.

కవి సర్వజ్ఞ మిత్రుడు కాశ్మీరంలో పుట్టినా మగధలోని నలంద విశ్వ విద్యాలయంలో చదివి గొప్ప పండితుడు విజ్ఞాన శాస్త్ర వేత్త అయి "విక్రమ శీల మహా విహారాని"కి "రాజగురు, పండిత భిక్షు, జిన రక్షిత అయ్యాను" అని చెప్పుకున్నాడని "పాగ్సాన్ జాన్ సంగ్" అనే టిబెటన్ మత గురువు చెప్పాడు. సర్వజ్ఞ మిత్రుని భుజంగ స్తోత్రం కాశ్మీర్‌లోనే కాక టిబెట్‌లోని టాంగ్యూర్‌లో కూడా ప్రార్ధనలో ప్రాచుర్యంలో ఉంది.

కాశ్మీర్ పండిత గురువు రవి గుప్తుని శ్లోకాలు, శాక్య శ్రీ భద్రుని 21

అధ్యాయాలలో శ్లోకాలు టిబెట్‌లోనూ బాగా ప్రచారమైనాయి. దేశంలో చాలా ప్రాంతాలలో మహాకావ్యాల హవా తగ్గిపోతున్నప్పుడు కాశ్మీర్‌లో 9వ శతాబ్దంలో అంటే 855-884 కాలపు రాజైన అవంతీ వర్మకాలంలో మహాకావ్య విజృంభణ సాగింది. జయాపీడని ఆస్థానకవి రత్నాకరుడు “హరవిజయం” మహాకావ్యం రాసి తనను “శ్రీ బాల బృహస్పతి అనుజీవిని”గా చెప్పుకున్నాడు. అవంతివర్మ రాజ్యానికి రాక ముందు శంకుక కవి “భువనాభ్యుదయం”తో మహాకావ్యాలు కొంత వెనక్కు తగ్గాయి. ఇందులో 850లో మమ్మ, ఉత్పల మధ్య తీవ్ర పోరాట చరిత్ర ఉంది ఒక శ్లోక భావం- “వితస్త ప్రవాహం యుద్ధభూమిలో చనిపోయిన వీర సైనికుల కళేబరాల భీభత్సానికి ఆగిపోయింది. ఇది చాలా విచార సంఘటన.❁

## 73) అస్సాంలో సంస్కృత వ్యాప్తి -700-1300

వేద పురాణ కాలంలో అస్సామ్‌ను కామరూప లేక ప్రాగ్జోతిషపురం అనేవారు. భారత దేశంలోని మిగిలిన రాష్ట్రాలలో లాగానే మేఘాలయ, మిజోరాం, నాగాల్యాండ్‌లతో కూడిన ప్రాచీన అస్సామ్‌లో సంస్కృతంతోబాటు, అన్ని శాస్త్రాలు అధ్యయనం చేశారు. 7వ శతాబ్ద ప్రాగ్జ్యోతిష రాజుల కాలంలో లభించిన తామ్ర శాసనాలను బట్టి అప్పుడు సంస్కృతం ఎన్నో శతాబ్దాల నుండి ప్రజల వాడుక భాషగా ఉన్నట్లు తెలుస్తోంది. మధ్యయుగంలో అంటే 9వ శతాబ్దంలో ఇక్కడ “కాళికా పురాణం” వంటి సంస్కృత గ్రంథాలు అస్సామ్‌లో రాయబడినాయి. అప్పటి నుంచే తంత్ర, ధర్మ, జ్యోతిష వ్యాకరణ గ్రంథాలు కూడా ఇక్కడ రాయబడినాయి. వీటికి సంస్కృత వ్యాఖ్యానాలు వాటితోపాటు సంస్కృత సాహిత్య రచనలు వచ్చాయి.


ధర్మ శాస్త్రాలలో కామరూప సిద్ధాంతాన్ని ''కౌముది''లు రచించి మహామహోపాధ్యాయ పీతాంబర సిద్ధాంత వాగీశుడు సుసంపన్నం చేశాడు. పశ్చిమ అస్సామ్‌ను పాలించిన కామాట, కొచ్చి వంశ రాజులు, మధ్య అస్సామ్ పాలకులు మహామాణిక్య అతని వారసులు, ఉత్తర అస్సామ్ రాజులు సంస్కృత భాషను బాగా పోషించారు. ఉత్తర భారతంలోనే వాల్మీకి రామాయణాన్ని మొదటిసారిగా ప్రాంతీయ భాషలోకి అంటే అస్సామీ భాషలోకి అనువదించి రికార్డ్ సృష్టించాడు మహేంద్ర కందాలి కవి. సంస్కృత వ్యాకరణంలో మాత్రం పెద్దగా గ్రంథాలు రాలేదు కానీ వచ్చినవి మాత్రం బాగా గుర్తింపు పొందాయి.❁

## 74) శైవ శాస్త్ర నిష్ణాత - అత్రి గుప్త -720

ప్రముఖ ఆలంకారికుడు అభినవ గుప్తుని పూర్వీకులలో "అత్రి గుప్తుడు" అతి ప్రాచీనుడు. 730-740 ప్రాంతంలో కనౌజ్‌ను పాలించిన యశోవర్మ కాలంలో గంగా యమునాల మధ్య ప్రాంతమైన అంతర్వేదిలో ఆయన ఉండేవాడు. అన్ని విద్యలు తెలిసిన పండితుడుగా, ముఖ్యంగా శైవ శాస్త్రాలలో నిష్ణాతుడుగా అత్రిగుప్తునికి ప్రఖ్యాతి ఉంది. 721 -765 కాలంలో కాశ్మీర్‌ను పాలించిన లలితాదిత్యుడు అత్రిగుప్తుని పాండిత్యాన్ని విని తెలుసుకొని, తన ఆస్థాన పండితుని చేసి గౌరవించాలని భావించాడు. యశోవర్మను జయించాక తనతో కాశ్మీరానికి రమ్మని అర్థిస్తే ఇలా వెళ్ళాడు. ఇలా అత్రిగుప్తుని కుటుంబం కన్యా కుబ్జం నుంచి కాశ్మీర్‌కు వెళ్ళింది. రెండువందల ఏళ్ళ తరవాత శైవాచార్యుడైన అభినవ గుప్తుడు వీరి వంశంలో జన్మించాడు.❁

## 75) అభినవ శంకరులు - శ్రీ అభినవ శంకరేంద్ర సరస్వతి (క్రీ.శ. 788-840)


ఆదిశంకరాచార్యుల తర్వాత అంతటి కీర్తి పొందినవారు శ్రీ అభినవ శంకరేంద్ర సరస్వతి. వీరి జీవిత చరిత్రను "శంకర విజయం"లో వాక్పతి భట్టు వివరించాడు. తండ్రి చిదంబరానికి చెందిన విశ్వజిత్. 5వ ఏటనే ఉపనయనం జరిగి, వేదాధ్యయనం ప్రారంభించి సర్వశాస్త్రాలలో అద్వితీయుడనిపించారు. వేదాంత చర్చలంటే మహా ఇష్టం. తర్కంలో వాక్పతి భట్టును ఓడించారు. 38వ కామకోటి జగద్గురువయ్యారు. కాశ్మీర్ సర్వజ్ఞ పీఠం అధిరోహించారు.❁



## 76) ఆది శంకరుల గురు పాదులు - గోవింద భగవత్పాదులు (800)

అద్వైత మత స్థాపకులు శ్రీ శంకర భగవత్పాదుల గురువు గారే గోవింద భగవత్పాదుల వారు. ఆయన జీవితం రచనల గురించి పెద్దగా లోకానికి తెలియదు. కాని శంకరాచార్యులవారు తమ రచనలో వారి ప్రస్తావన చేశారు. శంకర విజయంలో కూడా ఆయన గురించి సమాచారం లేదు. గోవింద పాదుల గురువు గౌడపాదులవారు. శంకరాచార్య ప్రకరణ గ్రంథం వివేక చూడామణి మొదటి శ్లోకంలో గోవింద భగవత్పాదుల గురించిలో పేర్కొన్నారు. శృంగేరి శారదా పీఠం గురు పరంపరలో గౌడపాదుల తరువాత గోవింద భగవత్పాదులను తర్వాత శంకరాచార్యులను పేర్కొంటారు.

మాధవీయ శంకర విజయం ప్రకారం కేరళను వదిలి వెళ్ళిన ఆది శంకరులు నర్మదా నది తీరంలో ఉన్న ఓంకార క్షేత్రాన్ని చేరి అక్కడ కొండపై ఉన్న చిన్న గుహలో ఉంటున్న గోవింద భగవత్పాదుల దర్శనం చేశారు. శంకర విజయం ప్రకారం ఒకనాడు రేవా నదికి అకస్మాత్తుగా విపరీతంగా వరదలు వస్తే, శంకరులు తన కమండలాన్ని అడ్డం పెట్టి వరదను ఆపేసి సమాధిలో ఉన్న గురువుగారికి తపోభంగం కాకుండా కాపాడారని ఉన్నది. ఇప్పటికీ ఆగుహను మనం దర్శించవచ్చు. ఓంకార క్షేత్రంలో ఓంకార మహా శివుడు కొలువై ఉంటాడు. గోవింద పాదులు శంకరుని చూడగానే "నువ్వు ఎవరు? అని ప్రశ్నిస్తే "న భూమిర్నతోయం న తేజో నవాయుర్మఖంనేంద్రియం వా న తేషాం సమూహః
అనైకాంతి కత్వా త్సుషుప్త్యైక సిద్ధిస్తదేకోవ శిష్ట శ్శివ: కేవలోహం" అని శ్లోకం చెప్పారు. ఇదే దశ శ్లోకిగా లోకంలో ప్రసిద్ధి చెందింది భావం– "నేను నింగిని కాదు, భూమిని కాదు, నీటిని కాదు, అగ్నిని కాదు, గాలిని కాదు, ఎటువంటి గుణాలు లేని వాడిని. ఇంద్రియాలు కాని వేరే చిత్తం గాని లేనివాడిని. నేను శివుడను. విభజనలేని జ్ఞాన సారాన్ని.
ఇది విన్న గురువు చాలా సంతోషించి ఆయన అద్వైత వైదుష్యానికి అబ్బురపడి తన శిష్యునిగా స్వీకరించి సన్యాస దీక్ష అనుగ్రహించారు. గురువు గోవిందపాదుల ఆదేశంతో శ్రీ శంకరులు బ్రహ్మ సూత్రాలకు భాష్యం రాయటం ప్రారంభించారు. ❀



## 77) హిందూ మత పరిరక్షణకు బౌద్ధం స్వీకరించి ప్రాయశ్చిత్తం చేసుకున్న - కుమారిల భట్టు (భట్టిపాదుడు) (800)

తన 15వ ఏట, ఆది శంకరాచార్యులు ప్రయాగలో ఉన్న కుమారిల భట్టును కలవాలని నిర్ణయించుకొని బయలుదేరారు. భట్టు వేదాలను తంతు లేదా ఆచార సంబంధమైన కార్యాలకు వినియోగించే వైదిక వృత్తికి చెందిన వ్యక్తి. ఒకప్పుడు తాను నేర్చుకున్న బౌద్ధమత సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ప్రవర్తించి గురుద్రోహం చేసిన కారణంగా పశ్చాత్తాపంతో అగ్నిలో ప్రవేశించి ప్రాయశ్చిత్తం చేసుకునే ప్రయత్నాల్లో భట్టు ఉన్నాడు. శంకరులు ప్రయాగ చేరే సమయానికి భట్టు ఊకతో చేసిన అగ్ని గుండంలో నిలబడి ఉన్నాడు. భట్టు శంకరుల గుర్తించి, బౌద్ధానికి వ్యతిరేకంగా తాను చేసిన పనిని శంకరులకు వివరిస్తాడు. శంకరులు రాసిన భాష్యాల గురించి తనకు తెలుసుననీ, వాటికి వార్తికలు (వివరణాత్మక వ్యాసాలు) వ్రాయాలన్న కోరిక తనకు ఉన్నదని కూడా వెల్లడిస్తాడు. ప్రాయశ్చిత్తం చేసుకోవాలన్న తన నిశ్చయం కారణంగా వార్తికలు వ్రాయలేనని, మాహిష్మతిలో ఉన్న తన శిష్యుడైన మండన మిశ్రుడు వ్రాస్తాడని చెప్పాడు. శంకరుని దర్శనంతో తన సర్వపాపాలు హరించాయని అన్నాడు. అప్పుడు శంకరుడు “శివుని పుత్రుడైన కుమారస్వామిగా నిన్ను నేనెరుగుదును. నీ చెంతకు పాపాలు చేరవు. అగ్ని నుండి నిన్ను రక్షిస్తాను, నా భాష్యాలకు వార్తికలు రచించు” అని కోరాడు. భట్టు అందుకు నిరాకరించి, మాహిష్మతిలో ఉన్న తన శిష్యుడైన మండన మిశ్రుని తర్కంలో ఓడించి, శిష్యునిగా చేసుకుని, ఆతనిచేత వార్తికలు వ్రాయించమని శంకరునితో చెప్పాడు.

భట్టిపాదుడు వేదవేదాంగాలు చదివిన జ్ఞాని. అతడు పుట్టేనాటికి భౌద్ధమతం వ్యాప్తి జరిగి ఉంది. వైదిక ధర్మాలను హిందూ మత సిద్ధాంతాలను వ్యాప్తిచేయాలని అనుకొన్న భట్టిపాదుడు ముందు భౌద్ధం గురించి తెలుకుంటే తప్ప దానిలో తర్కం చేయలేనని భౌద్ధ బిక్షువుగా వేషం ధరించి ఒక భౌద్ధ మతగురువు వద్ద భౌద్ధ శాస్త్రాల గురించి తెలుసుకోసాగాడు. ఒకనాడు ఒక భౌద్ధ బిక్షువు హిందూ మతమును

విమర్శించుచుండగా సహింపక వాదించుటతో వారతడిని మేడపైనుండి పడదోయగా ఒక కన్ను పోతుంది. దీనిపై ఆ రాజ్య రాజు విచారణ చేయగా భౌద్ధ సన్యాసులతో ప్రసంగానికి పూనుకొని వారిని ఓడించి సభలో వేద ప్రభావం బోధించగా రాజు వేదప్రభావం గురించి చెప్పిన మిమ్ము పైనుంచి తోసివేసిన ఎలా పడినారు అని అడుగగా అది హఠాత్తుగా నేను ఏమరుపున ఉండగా జరిగింది. మీరు ఇపుడు పరీక్షించవచ్చు అని చెప్పగా రాజు మేడమీద నుండి త్రోయమని చెపుతాడు. భట్టిపాదుడు వేదపురుషుని ధ్యానిస్తూ వేదమే ప్రమాణమైతే నాకెటువంటి హానీ జరుగదు అనుకొంటూ దూకగా ఏ విధమైన దెబ్బలు తగలక వచ్చిన భట్టిపాదుని మరొక పరీక్షకు అహ్వానించి ఒక ఖాళీ కుండ తెప్పించి అందులో ఏమున్నది అని అడుగగా శ్రీమహావిష్ణువు ఉన్నాడని చెపుతాడు. అందులో రాజుకు భోగశయనుడైన శ్రీమహావిష్ణువు దర్శనం ఇవ్వడంతో వేదాలను శాస్త్రాలను మాత్రమే ప్రమాణముగా నమ్మి వైదిక కర్మలను ఆచరించని భౌద్ధ బిక్షులను అందరినీ చంపమని ఆదేశిస్తాడు. దానితో అతని గురువుతో సహా అందరినీ చంపగా గురువును చంపినను, భౌద్ధంలో ఉండగా ఈశ్వరుడే లేదని అన్నాను. ఇలా అనేక తప్పులు చేసిన నాకు చావే శరణ్యం అని తలచి చితి పేర్పించి కాల్చుకోడానికి తయారుకాగా శంకరుడు అక్కడకు వచ్చి వారిస్తాడు. తన సూత్ర భాష్యానికి వార్తికము రచించమని అడుగుతాడు. తనకు సాటికల మండన మిశ్రుడి ద్వారా ఆ కార్యము నెరవేర్చమని, శంకరుని చేతిమీదగా మోక్షము ప్రసాదించమని వేడుకొనగా శంకరుడు అంగీకరించి అతనికి బ్రహ్మ రహస్యాన్ని ఉపదేశించి ముక్తి ప్రసాదిస్తాడు.❀



## 78) మీమాంస, అద్వైత దర్శనాలపై రచనలు చేసిన మండన మిశ్రుడే సురేశ్వరాచార్యులు (800)

మండన మిశ్రుడు 8వ శతాబ్దపు హిందూ తత్వవేత్త, ఆది శంకరాచార్యుని శిష్యుడు. మీమాంస, అద్వైత దర్శనాలపై రచనలు చేశాడు. కర్మ మీమాంసపై అథారిటీ. స్ఫోట వాదానికి ప్రాణ ప్రతిష్ట చేసినవాడు. ఈయన సన్యాసము స్వీకరించిన తర్వాత

సురేశ్వరాచార్యుల అను పేరుతో ప్రసిద్ధిపొందాడు. శంకరాచార్యులను తర్క గోష్ఠిలో ఓటమి పాలై శంకరులను గురువుగా అంగీకరిస్తారు. ఆ ఓటమి సురేశ్వరాశ్వరాచార్యులకు విజయవంతమైన ఓటమి ఎందువలనంటే అ ఓటమి వల్ల జగద్గురువైన శంకరులకు శిష్యరికం చేసే అవకాశం దొరికింది. శంకరాచార్యులకు అత్యంత ప్రీతి పాత్రులైన శిష్యులలో సురేశ్వరచార్యులు ఒకరు. శంకరాచార్యులు అందువలన దక్షిణామ్నాయ మతమైన శారదా మతానికి మెదటి పీఠాదిపతిగా నియమిస్తారు. సురేశ్వరాచార్యులకు ఒక ప్రత్యేక ఉన్నది. సాధారణంగా గురువుల వయస్సు శిష్యుడి వయస్సు కంటే ఎక్కువగా ఉంటుంది. కాని సురేశ్వరాచార్యుల విషయంలో సాధారణానికి భిన్నంగా శిష్యుడి వయస్సు గురువు కన్నా ఎక్కువ. వేదాంత సంస్కృతిని అనుసరించి రెండు రకాలా మీమాంసలు ఉన్నాయి. ఒకటి పూర్వ మీమాంస (మీమాంస అని అంటే దాని అర్థం పూర్వమీమాంస) రెండో మీమాంస ఉత్తర మీమాంస దీనినే వేదాంత విద్య అని కూడా పిలుస్తారు. వేదాంత విద్య అంటే వేదం= జ్ఞనం, అంత= అంచులు అంటే జ్ఞానం యొక్క అంచులు తెలిపేది– పూర్ణ జ్ఞానం. పుర్వమీమాంస అనుసరించి వైదిక కర్మకండ, యజ్ఞ యాగాదులు నమ్మకాలు ఉంటాయి. ఉత్తర మీమాంస అంతా ఉపనిషత్తుల సారం, జ్ఞాన సముపార్జన గురించి ఉంటుంది.

మండన మిశ్రులు బీహారీ బ్రాహ్మణుడు. బీహార్‌లోని మహేశీ ప్రాంతంలో నివశించాడు. ఈ ప్రాంతాన్ని ఇప్పుడు మండలేశ్వర్ అంటారు. గుప్తేశ్వర మహా శివాలయంలో శంకరాచార్యుల వారితో వాదం చేశాడు. అందుకనే ఈ పట్నం ఆయన పేరు మీదనే పిలువ బడుతోంది. కుమారిలభట్టు ప్రచారం చేసిన మీమాంస సిద్ధాంతాన్ని ప్రచారం చేశాడు మండన మిశ్రుడు. అద్వైత భావనలతో "బ్రహ్మ సిద్ధి" గ్రంథం రాశాడు. బ్రహ్మ సిద్ధి మండన మిశ్రగా ప్రసిద్ధుడయ్యాడు. కర్మ మీమాంసపై అత్యంథ అభిమానం ఉన్నందున గొప్ప కర్మిష్టిగా మారిపోయాడు. వేదంలో చెప్పబడిన కర్మకాండలను తుచ తప్పక పాటించాడు. మండన మిశ్రుని బ్రహ్మ దేవుని అవతారంగా భావిస్తారు. అయన భార్య ఉభయ భారతి సాక్షాత్తు సరస్వతీ దేవియే.❀



## 79) పంచపాదిక కర్త  పూరీ పీఠాధిపతి – పద్మ పాదాచార్య (800)

శంకరుల కాశీ ప్రయాణంలో ఒక బ్రహ్మచారి ఆయన వద్దకు వచ్చి నేను బ్రహ్మణుడను, నా పేరు సనందుడు. నాది చోళదేశం మహాత్ములను దర్శించి జ్ఞానాన్ని ఆర్జించాలని వచ్చాను. మీ వద్ద శిష్యునిగా ఉండే వరమిమ్మని ప్రార్ధించాడు. అలా శంకరులకు అత్యంత ఆత్మీయునిగా మారాడు. సదానందుడు శంకరులకు అత్యంత సన్నిహితంగా ఉండడంవల్ల తోటి శిష్యులకు కొద్దిగా అసూయగా ఉండేది. అది శంకరులు గ్రహించి వారిలోని ఆ అసూయను పోగట్టదలచారు. ఒకరోజు గంగానదికి ఆవల ఉన్న సదానందుడ్ని పిలిచారు. వెంటనే సదానందుడు నది మీద నడుచుకొంటూ ఈవలకు వచ్చాడు. నది మీద సదానందుడు అడుగు వేసినచోటల్లా మునిగిపోకుండా పద్మాలు వచ్చాయి. అది చూసిన తోటి శిష్యులు, సదానందుడిపై అసూయ పడినందుకు సిగ్గుపడ్డారు. అప్పటి నుండి సదానందుడు పద్మపాదుడు అయ్యాడు. పద్మపాదునికి సంబంధంచిన మరొక కథ. శ్రీ శంకరులు శ్రీ శైల పరిసరములలో చాలా కాలం తపస్సు చేసారు. శంకరులు తపస్సు చేసుకొంటూ ఈపరిసరాలలో హిందూ ధర్మ ప్రచారము చేయుచున్నకాలమందు శంకరులు చేయు కార్యములు నచ్చని కొందరు ఆయనను అంత మొందిచు యత్నముతో ఆపరిసరాలయందు బీభత్సము సృష్టించుచున్న

ఒకపెద్ద దొంగలముతానాయకుని రెచ్చగొట్టి కొంత ధనమునిచ్చి పంపించారు. అతడు ఇదే ప్రదేశమున పెద్ద కత్తితో మాటువేసి తపమాచరించుచున్న శంకరుల వెనుకగా ఒకేవేటున తలఎగరగొట్టు ప్రయత్నమున ముందుకురికెను. ఇక్కడ ఇది జరుగుచున్న సమయమున శంకరుని ప్రధాన శిష్యుడైన పద్మపాదుడు మల్లికార్జునుని దేవాలయమున ఈశ్వరుని ధ్యానించుచూ కూర్చొని ఉండెను. ఈశ్వరునే మనసున ఉంచి ధ్యానిస్తున్న అతనికి హటాత్తుగా ఈదృశ్యము కనిపించెను. వెంటనే అతడు మహోదృగ్గుడై శ్రీలక్ష్మీనృసింహుని వేడనారంభించెను. ఇక్కడ శంకరులను వధించుటకు ఉరికిన ఆదొంగలనాయకునిపై ఎటునుండొ హటాత్తుగా ఒక సింహము దాడి చేసినది అతడి శరీరాన్ని ముక్కలుముక్కలుగా చీల్చివేసి ఎట్లు వచ్చినదో అట్లే మాయమయినది. తదనంతరము మిగిలిన శిష్యులకు ఈ విషయము తెలిసి పద్మపాదుని శక్తికి అతనికి శ్రీ శంకరులయందున్న భక్తికి అతనిని అభినందించారు.

శ్రీ శంకరులు స్థాపించిన నాలుగు ఆమ్నాయ పీఠాలలో పూరీ గోవర్ధన మఠానికి పద్మపాదాచార్యులు పీఠాది పతిని చేశారు. శంకరాచార్యులవారు. అసలు ఆయన కేరళలో తెక్కే మఠం అనేదాన్ని స్థాపించాడని కొందరు అంటారు కాదు. ఆయన దక్షిణ భారతంలో చోళప్రాంతం వాడని కొందరి అభిప్రాయం. సురేశ్వరాచార్యులతో కలిసి పద్మపాదుడు వివరణ భాష్యకారుడిగా గుర్తింపు పొందాడు. ఆయన రాసిన గ్రంథాలలో ఒకే ఒక్కటి "పంచ పాదిక" లభ్యం. శంకరులు తాను రచించిన బృహదారణ్య భాష్యంపై వివరణ వ్యాఖ్య రాయమని కోరితే పద్మ పాదుడు దీన్ని రాశాడు. అసూయతో ఉన్న మేనమామ దీన్ని తగలబెడితే శంకరాచార్యులవారి అమోఘ జ్ఞాపక ధారణాశక్తి వలన ఇప్పుడున్న రూపంలో మళ్ళీ పద్మపాదుడు రచించాడు. పద్మపాదుడు గురువే సర్వం గురువును మించినది లేదు అని అభిప్రాయపడ్డాడు. శంకర –పద్మ పాదుల గురుశిష్య బంధం మహా ఆదర్శప్రాయమైంది లోకంలో.

శంకరుల "అధ్యాస" భావాన్ని పద్మపాదుడు పంచ పాదికలో సంపూర్ణంగా ఆవిష్కరించాడు. జీవ బ్రాహ్మలు ప్రతిబింబ బింబాల వంటి వారు అని ఇందులో సారాంశం. ❁



## 80) శ్రుతి సార సముద్ధరణకర్త తోటకాచార్య (800)

ఆదిశంకరాచార్యులవారి శిష్యుడు తోటకాచార్య. ఉత్తరాభారతదేశాన బదరీనాధ క్షేత్రానికి దగ్గరలో ఉన్న జ్యోతిర్మఠ పీఠాధిపతి. అంతకు పూర్వం కేరళలో వాడక్కే మఠ స్థాపకుడు. ఆదిశంకరాచార్య శృంగేరిలో ఉన్నప్పుడు గిరి అనే మూగ బాలుడు వారిని దర్శించాడు. తమ శిష్యునిగా స్వీకరించారు. చాలా కష్టపడి చదువుతూ సేవ చేస్తూ గురు అనుగ్రహం అభిమానం పొందాడు. అంతగా తెలివి తేటలులేని గిరికి ప్రాదాన్యమిస్తున్న గురువుగారిపై మిగతా శిష్యులకు కోపం గిరిపై ఈర్ష్య అసూయలు కలిగాయి. శిష్యులకు అద్వైత వేదాంతాన్ని బోధించటానికి కూర్చునే సమయంలో శిష్యుడు గిరి గురువుగారి వస్త్రాలను ఉతుకు తూండేవాడు. గిరి వచ్చేదాకా పాఠం ప్రారంభించేవారు కాదు శంకరులు. ఒకరోజు పద్మపాదుడు గురువుగారికి ఎదురుగా ఉన్న గోడను చూపిస్తూ, దానికి పాఠం చెప్పటం ఎలాంటిదో గిరికి బోధించటం అలాంటినిది అని ఎద్దేవా చేశాడు.

శిష్యుని గురుభక్తికి, వినయ విదేయతలకు సంతోషించిన శ్రీ శంకరులు అతనిని అనుగ్రహించాలను కొన్నారు. మానసికంగానే శిష్యుడుగిరికి సర్వశాస్త్రాలను బోధించేశారు. గుర్వనుగ్రహంతో సకలశాస్త్ర పారంగతుడైన గిరి అకస్మాత్తుగా తోటక ఛందస్సులో గురువు శంకరులపై అష్టకం ఆశువుగా చెప్పాడు. అదే తోటకాస్టకంగా లోకంలో ప్రాచుర్యం పొందింది. మూగ గిరి తోటకాచార్యుడై ప్రసిద్ధి చెందాడు. తోటకాస్టకంలో కొన్ని రుచి చూద్దాం-

1-విదితాఖిల శాస్త్ర సుధాజలధే - మహితోపనిషతకధి తార్ధ నిధే-హృదయే కలయే విమలం చరణం -భవ శంకర దేశిక మే శరణం.

భావం- నేను శంకరుని శరణు వేడుతున్నాను. ఆయన దయామృత సాగరుడు. ఉపనిషత్ సారాన్ని గ్రహించి గ్రంథ రచన చేసిన శేముషీ విభవ సంపన్నుడు.

చివరి శ్లోకం- 8-విదితా న మయా విశదైకకలా -న చ కించన కాంచన మస్తి గురో.-ద్రుతమేవ విదేహి కృపాం సహజం -భవ శంకర దేశిక మే శరణం.

భావం- నేను శంకరుని శరణు వేడుతున్నాను . బుద్ధీ, జ్ఞానం లేని చేతిలో దమ్మిడీ కూడా లేని ఈ నాపై ఆయన కృపాకటాక్షం ప్రసరించాలి.❋




## 81) అజ్ఞాని జ్ఞానిగా మారిన- హస్తామలకా చార్య -800

అద్వైత బోధకులు ఆది శంకరాచార్యులవారి మరో శిష్యుడే హస్తామలకాచార్యులు. ద్వారకామ్నాయ పీఠాధిపతి. అంతకు పూర్వం కేరళలోని త్రిశూల్‌లో ఇడయిల్ మఠాన్ని స్థాపించాడు. కర్నాటకలోని కొల్లూర్‌లో ఆదిశంకరులున్నప్పుడు ఒకసారి భిక్షాటన చేస్తూ ఇప్పుడు శివల్లి అని పిలువబడే శ్రీ బాలి గ్రామానికి వచ్చినప్పుడు ప్రతి ఇంటిలోనూ అగ్ని హోత్రపు సుగంధం పరవశింపజేసి ప్రతి ఇల్లు భిక్షకు ఆహ్వానించింది. రెండు వేలకు పైగా ఉన్న ఆ గ్రామ బ్రాహ్మణులు వేద వేదాంగ, శాస్త్రాలలో నిష్ణాతులు, వేద విధానంలో యజ్ఞ యాగాలు చేసేవారు. అక్కడ శివ పార్వతులు కొలువై ఉన్న ఒక శివాలయం ఉన్నది. ఆ గ్రామంలో ప్రభాకరుడు అనే బ్రాహ్మణుడు అన్నీ తెలిసిన మహాజ్ఞాని. కాని ఆయన కొడుకు అందగాడే కాని శుద్ధ తెలివితక్కువ దద్దమ్మ. ఉపనయనం జరిగింది కాని వేద విద్య ప్రారంభం కాలేదు. ఊరికే రికామీగా సోమరిగా స్తబ్దుగా ఉండేవాడు.

శంకర భగవత్పాదులు తమ గ్రామం వచ్చారని తెలిసి ప్రభాకరుడు కుమారునితోసహా వారిని దర్శించి, అమాంతం వారి పాదాలపై తండ్రీ కొడుకులు వాలిపోయి సాష్టాంగ నమస్కారం చేశారు. కరుణాశంకరునికి తన కొడుకు గోడు విన్నవించుకొన్నాడు. శంకరులకు ఆ కుర్రాడిపై వాత్సల్యం కలిగి “నువ్వు ఎవరు?” అని ప్రశ్నించారు. అప్పటిదాకా లోకం ఏమిటో, తన చుట్టూ ఉన్న మనుషులు ఎలాంటి వారో కూడా తెలియని అతడు అకస్మాత్తుగా ఆశువుగా 12 శ్లోకాలలో అద్వైత పరమార్థాన్ని చెప్పేశాడు. ఆనందించిన శ్రీశంకరులు అతడిని శిష్యునిగా స్వీకరించి “హస్తామలకాచార్య” అని నామకరణం చేశారు. అరచేతిలో ఉసిరికాయ లాగా అతనికి సర్వ విజ్ఞానం ఒక్కమారు లభించినందున సార్థకంగా ఆ పేరు పెట్టారు.

హస్తామలకుని ప్రతిభాపాండిత్యాన్ని గ్రహించిన శంకరులు ఆయను తన సూత్ర భాష్యంపై వార్తికం రాయమని ఆదేశించారు. అలాగే హస్తామలకుడు రాసి పూర్తి చేశాడు. ఇక్కడ ఒక ఫ్లాష్ బాక్ కథ ఉంది. తెలుసుకొందాం-

ఒక సారి యమునా నదీ తీరంలో ఒక ముని తపోధ్యానంలో ఉన్నాడు,

బ్రాహ్మణ స్త్రీలు స్నానం చేయటానికి వచ్చారు. అందులో ఒకావిడ తన రెండేళ్ళ పిల్లాడిని ఆ ముని దగ్గర వదిలి జాగ్రత్తగా చూడమని చెప్పి యమునా నదీ స్నానికి వెళ్ళింది. ఆ పిల్లాడు నెమ్మది నెమ్మదిగా జారి యమునా నదిలో పడి మునిగిపోయాడు. తల్లి వచ్చి విషయం తెలిసి నిర్ఘాంత పోయింది. సమాధి నిష్టుడైన ముని కళ్ళు తెరిచి చూశాడు. రోదిస్తున్న ఆ మాతృమూర్తి వేదనకు చలించిపోయాడు. తన శరీరాన్ని త్యాగం చేసి ఆ బాలుడిలో చేరిపోయాడు. మునిగి చనిపోయాడు అనుకొన్న బాలుడు బ్రతికి బయటికి వచ్చాడు. ఆ బాలుడే హస్తామలకాచార్య. అందుకే ఆయనలో అంత అగాధమైన జ్ఞానం నిండి ఉన్నది. అది శంకర కరుణతో ఉబికి బయటికి వచ్చి, అద్వైత ధారగా ప్రవహించింది.❁



## 82) కామ శాస్త్రంలో శంకరాచార్యతో వాదించిన విదుషీమణి - ఉభయ భారతి (800)

ఉభయ భారతి మండన మిశ్రుడి భార్య ఈమెను సరస్వతి అంశగా చెపుతారు. ఆది శంకరుదుకి, తన భర్త మండన మిశ్రునికి జరిగిన వాద-వివాదంలో మధ్యవర్తిగా ఉండి వారి గెలుపోటములను నిర్ణయించినది ఈమె.

సత్యలోకంలో జరుగుతున్న మహాసభలో దూర్వాసుడు సామగానం పఠిస్తున్న సంధర్భలో స్వరం తప్పుగా పలికినపుడు సరస్వతి నవ్వగా కోపించిన దూర్వాసుడు చిన్న పెద్దల తారతమ్యం తెలుసుకొనక పరిహసించిన నువ్వు భూలోకంలో మనుష్యజాతిలో పుట్టు అని శపిస్తాడు. బ్రహ్మ క్షమింపమని శాపవిమోచనమిమ్మని అడుగగా నీ అంశతో పుట్టే మండన మిశ్రుని భార్యగా సరస్వతి జన్మిస్తుంది. ఈశ్వరుని అంశతో పుట్టే శంకరుని చూసి అతని ద్వారా పాండిత్యంలో ఓడింపబడినపుడు ఆమెకు శాపవిమోచనమౌతుంది అని చెప్పాడు. మందన మిశ్రునితో గెలుపొందిన శంకరుని చూసి భర్తలో సగం కనుక నన్ను కూడా ఓడిస్తేనే గెలిచినట్టుగా చెప్పి అతడిచే ఓడింపబడి ఆమె శాపవిమోచనం పొందుతుంది.

మాహిష్మతి పట్టణంలో శంకరులు మండన మిశ్రుని ఇంటికి వాదానికి వెళ్ళారు. ఆయన తన తపోశక్తితో వ్యాస భగవానుని జైమిని మహర్షిని ఆహ్వానించి పితృ కార్యం నిర్వహిస్తూ అర్ఘ్యపాద్యాలిస్తున్నాడు. శంకరులు రావటం తెలిసి తన ఇంట సన్యాసులకు ప్రవేశం లేదు కనుక స్వాగతం పలకను అన్నాడు. మహర్షులు అడ్డుపడి నచ్చ చెప్పగా

ఆహ్వానించాడు. మరునాడు శాస్త్ర చర్చ జరపాలని నిర్ణయించుకొన్నారు. న్యాయ నిర్ణేతలుగా వారిద్దరిని ఉండమని ఉభయులు అభ్యర్ధించగా వారు, సరస్వతీ స్వరూపమైన మండన మిశ్రుని భార్య ఉభయ భారతి న్యాయనిర్ణయం చేస్తుందని చెప్పారు. ఆమె అంగీకరించింది. వాదుల మెడలలో పూలమాల వేసి, ఎవరి మెడలో మాల వాడిపోతే వారు వాదంలో ఓడిపోయినట్లు అని నిర్ణయం చెప్పింది ఉభయులు అంగీకరించారు. వాదం చాలా సుదీర్ఘంగా లోతుగా జరిగి చివరికి మండన మిశ్రుని మెడలోని హారం వాడిపోగా భర్త శరీరంలో భార్య సగ భాగం కనుక తానూ కొన్ని ప్రశ్నలు అడుగుతానని చాలా చిక్కు ప్రశ్నలను సంధించింది. అన్నిటికి సవివరంగా ఓపికగా శంకరులు సమాధానం చెప్పారు. చివరగా ఆమె భగవత్పాదులను మన్మధ కళలు ఎన్ని వాటి స్వరూప స్వభావాలేవి, శుక్ల పక్షంలో స్త్రీ పురుషులలో జరిగే మార్పులేమిటి అని అడిగింది. బ్రహ్మచారినైన తాను ఈ ప్రశ్నలకు సమాధానం ఇప్పుడు చెప్పలేనని, గడువు కావాలని కోరగా ఆమె ఒప్పుకున్నది.

వందమంది భార్యలున్న అమరుక మహారాజు చనిపోయాడని తెలిసి శంకరులు, రాజు శరీరం లో పరకాయ ప్రవేశం చేసి, తన శరీరాన్ని జాగ్రత్తగా కాపాడుతూ ఉండమని శిష్యులకు చెప్పి వంద మంది రాజ భార్యలతో అనంగ శాస్త్ర పాండిత్యంలో ఉన్న శ్రద్ధ, ప్రీతి, రతి, ధృతి, కీర్తి, మనోభావ, విమల మోదిని, ఘోర, మదనోత్పాదిక, మద, దీపిని, వశకరి, రంజని, మోహిని అనే 15 కళలు నేర్చి, మళ్ళీ తన శరీరంలో ప్రవేశించి ఉభాయభారతితో కామశాస్త్రంలో వాదం చేసి ఆమెను పరాజితురాలిని చేశారు. మండన మిశ్రుడు తన ఓటమిని అంగీకరించాడు. శంకరులు ఆయనను శిష్యునిగా స్వీకరించి అద్వైత బోధ చేసి "సురేశ్వరా చార్య" నామంతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు.

మండన మిశ్ర ఉభయ భారతులు, ప్రపంచాన్ని రోసి, సన్యాసాశ్రమం స్వీకరించి బ్రహ్మజ్ఞాన బోధ చేస్తూ జీవితాలను అర్ధ వంతం చేసుకొంటున్నారు. ఒక రోజు గంగానది ఒడ్డున అందరి చేత బ్రహ్మజ్ఞాని అని పిలువబడుతున్న ఒక సన్యాసిని ఉభయభారతి శిష్యులతో వెడుతూ ఆయన అన్నీ వదిలేసినా మంచినీళ్ళ కోసం ఉంచుకున్న చిన్న కుండను చూసి దానిని దిండుగా తలక్రింద పెట్టుకొని నేలమీద నిద్రిస్తుండగా సర్వసంగ పరిత్యాగికి ఇంకా కుండమీద అభిమానం, వ్యామోహం పోలేదే? అని ఎద్దేవా చేసింది. ఈ మాటలు విన్న సన్యాసి గారికి కోపం నషాళానికి అంటింది. కుండను విసిరికొట్టి పారేశాడు ఆమె తిరిగివస్తు, గమనించి సన్యాసిగారికి మరో దుర్గుణం అహంకారం కూడా ఉందే అభిమాన, అహంకారాలున్నవాడు జ్ఞాని ఎలా కాగలడు? అని వ్యాఖ్యానించింది. సన్యాసికి కనువిప్పు కలిగి అసలైన సర్వసంగ పరిత్యాగిగా మారి బ్రహ్మజ్ఞాని అయ్యాడు. ఉభయ భారతి భారత దేశమంతా పర్యటించి జ్ఞానబోధ చేసింది. ❁

## 83) తాంత్రిక బౌద్ధశాస్త్ర కర్త -సర్వజ్ఞ మిత్ర -800

స్రగ్ధర సూత్రం రాసిన సర్వజ్ఞ మిత్ర కాశ్మీర్ వాడు. ఇదిటిబెటన్ తాంత్రిక దేవత తార అనబడే శ్రోలమ పై చెప్పిన 37 మంత్రాల సముదాయం. దీనికి జైన రక్షితుడు స్రగ్ధరా స్తోత్ర టీకా అనే వ్యాఖ్యానం రాశాడు. ఆనాటి ప్రభువుకు సహాయకారిగా ఉన్న విక్రమశిల బౌద్ధారామంలో భిక్షువు. రక్షితుడు రాసిన వ్యాఖ్యానాన్ని బట్టి సర్వజ్ఞ మిత్ర కాశ్మీర్‌కు చెందిన మహాకవి దాత. తనకున్న సర్వస్వాన్ని త్యాగం చేసి దేశ సంచారం చేస్తూ వజ్రముకుటుని రాజ్యంలో ప్రవేశించాడు. దారిలో అతి పేద బ్రాహ్మణుడు కూతురి పెళ్ళికి డబ్బులేక బాధ పడటం చూశాడు. ఆ బ్రాహ్మణుడు మహాదాత అయిన సర్వజ్ఞ మిత్రను దర్శించి తన గోడు చెప్పుకొందామనుకొని ఆయనే సర్వస్వము దానం చేసి భిక్షాపాత్ర, పైన ఉత్తరీయంతో తిరుగుతున్నాడని తెలిసి హతాశుడయ్యాడు. దయాళువైన సర్వజ్ఞుడు ఓదార్చి తాను తప్పక సాయం చేస్తానని మాట ఇచ్చాడు. అదే సమయంలో రాజు వజ్రముకుటుడికి ఒకడు ఆయన కోరికలన్నీ తీరాలి అంటే అప్పటికప్పుడు వంద శరీరాలనుండి వేరు చేయబడిన కపాలాలపై కూర్చుని స్నానం చేస్తే తీరుతాయి అని సలహా ఇచ్చాడు. అప్పటికే 99 సంపాదించిన రాజు సర్వజ్ఞమిత్రను అతని బరువుతో సమానమైన బంగారంతో తూకం వేసికొని వందా పూర్తి చేశాడు. ఆ బంగారాన్ని అంతటిని సర్వజ్ఞుడు ఆ పేద బ్రాహణుడికి దానం చేసేశాడు.

సేకరించిన వందమందిని సర్వజ్ఞమిత్రతో సహా వధ్యస్థలానికి రాజభటులు తీసుకువెళ్లారు. తప్పించుకొనే దారి తోచక సర్వజ్ఞుడు 37 స్రగ్ధరా శ్లోకాలు ఆర్య తారా దేవిపై ఆశువుగా చెప్పాడు. అకస్మాత్తుగా వందమంది మృత్యువు నుంచి తప్పించుకొని స్వగృహాలకు చేరారు. సర్వజ్ఞుని మహా భక్తికి ఆశ్చర్యపోయిన రాజు క్షమాపణ వేడి శిష్యుడైపోయాడు. ఇలాంటిదే మరొకథ సర్వజ్ఞ మిత్రపై టిబెటన్ భాషలో ప్రచారంలో ఉంది. దీనిప్రకారం సర్వజ్ఞుడు కాశ్మీర్‌లో పుట్టినా నలంద విశ్వవిద్యాలయ విద్యార్థి.. అక్కడ అనేక శాస్త్రాలలో పాండిత్యం సంపాదించాడు. స్రగ్ధరా స్తోత్ర టీకలో సంస్కృతంలో రాజుపేరు వజ్రముకుటుడు పేరుకు బదులు “శరన” అని టిబెటన్ భాషలో “పాగ్ సాం సాన్ జంగ్” అంటారని ఉన్నది. సర్వజ్ఞ మిత్ర కాలం ఎనిమిదవ శతాబ్ది పూర్వార్ధంగా నిర్ణయించారు.❁



## 84) సిద్ధాంత శిక్షామణి గ్రంథకర్త - జగద్గురువులు - శ్రీ రేణుకాచార్యులు (క్రీ.శ.800)

భారత దేశంలో వీరశైవ ధర్మం అతి ప్రాచీనమైనది. ప్రతియుగంలోనూ ఈ ధర్మం వర్ధిల్లుతుందని వారి నమ్మకం. శివ మహాదేవుని ఆదేశం ప్రకారం జగద్గురువులైన పంచాచార్యులు ప్రతి యుగంలోను లింగాల నుండి జన్మించి వీరశైవ ధర్మ ప్రతిష్టాపన చేశారు. ఈ అయిదు పీఠాలు 1-కర్ణాటకలోని రంభాపురిలో, 2-ఉజ్జయిని, 3-కేదారనాథ్, 4-శ్రీశైలం, 5- కాశీలో ఉన్నాయి. ఈ పీఠాలు ఆధ్యాత్మిక ప్రబోధంతోపాటు మానవ సంక్షేమానికి కూడా సేవలందిస్తున్నాయి. ఈ అయిదు వీరశైవ జాతీయ పీఠాలు.

రంభాపురి పీఠాధిపతి జగద్గురు రేణుకాచార్యులు పదివిడి సూత్రాన్ని అగస్త్య మహర్షికి అందజేశారు. ఉజ్జయిని పీఠ జగద్గురువులు శ్రీ దారుకాచార్యులు "వృష్టి సూత్రాన్ని" దధీచి మహర్షికి ఇచ్చారు. కేదార పీఠ జగద్గురులు శ్రీ ఘంట కర్ణాచార్యులు "లంబన సూత్రాన్ని" వ్యాసమహర్షికి ప్రదానం చేశారు. శ్రీశైల పీఠ జగద్గురువులు శ్రీ ధేనుకా చార్యులు "ముక్తాగుచ్ఛ సూత్రాన్ని" మహర్షి సనందునికి అందించారు. కాశీపీఠ జగద్గురువులు శ్రీ విశ్వకర్ణాచార్యులు "పంచ వర్ణ సూత్రాన్ని" దూర్వాస మహర్షికి అందించారు. ఈ అయిదు సూత్రాలు వీరశైవ మత మూల సూత్రాలు. వీరశైవాన్ని శివాద్వైతం అంటారు. శైవాగమ చక్రవర్తి శ్రీ శివ యోగి శివాచార్య వేద వేదాంగాలలో నిష్ణాతులు ఆయనకు అగస్త్య మహర్షికి జరిగిన సంవాద సారమే వీర శైవ సిద్ధాంత సారం. ఇది వేదం ఉపనిషత్తులు 28 శైవాగమాల సారాంశం. ఈ విషయాలన్నీ నిక్షిప్తం చేయబడిన గ్రంథం "సిద్ధాంత శిక్షామణి". ఇదే వీర శైవానికి మూల గ్రంథం. ఇది 101 స్థలాలుగా ఉన్న అష్టావర్ణ, పంచాచారాలను వివరించే "శతస్థల సిద్ధాంతం"గా రేణుకా చార్యుల అమృతవాణి నుండి వెలువడి "ప్రసాద వాణి"గా పిలువబడుతోంది. దీనికే "ప్రసాదిక" అని మరో పేరుంది. దీన్ని కంఠస్థం చేసినవారికి, అధ్యయనం చేసినవారికి ధన కనక వస్తువాహనాలతోపాటు మోక్షాన్ని కూడా పొందుతారని విశ్వాసం. ఇది పలుభాషలలోకి అనువాదం పొందింది. ఇందులో మొదటి శ్లోకం-

"త్రైలోక్య సంపదాలేఖ్యా సముల్లేఖన భిత్తయే -సచ్చిదానంద రూపాయ శివాయ గురవే నమః"❁

## 85) నిగమాగమ వేత్త - జగద్గురు సదానంద శివ యోగి -800

ద్వాపర యుగానికి చెందిన స్కంద సంహితలో సదానంద శివయోగి గురించి ఉందట. ఆయన నిగమాగమ వేత్త. శ్రీశైల క్షేత్రవాసి. వీర శైవ గురుపీఠాధ్యక్షుడు. శివునికై తపస్సుచేసి సిద్ధులు సాధించాడు. భస్మధారణ రుద్రాక్షలు ధరించి చేతిలో శివ లింగంతో సంచరించేవాడు. హరిప్రియుడు అనే బ్రాహ్మణుడు తన కొడుకుతోపాటు కుష్ఠువ్యాధి గ్రస్తుడైన స్వేతను శివ యోగి వద్దకు పంపితే అతని వ్యాధిని భస్మలేపనంతో నివారించి వీరశైవం బోధించి ఇద్దరినీ శిష్యులను చేసుకొన్నాడు.❀



## 86) తిరుమూల మంత్ర రచయిత - తిరుమూలర్ (800)

భగవాన్ యోగీశ్వర్, పరమహంస స్వామి సిద్ధ, మహాత్మా అని పిలువబడే తిరుమూలారు హిమాలయాలలో చాలాకాలం తపస్సు చేసి స్వగ్రామం తిరిగివచ్చాడు. హిమాలయాల నుండి యోగిపుంగవుడు వచ్చాడని బాగా ప్రచారమైంది. ఒకరోజు మూలన్ అనే పశువులకాపరి పశువులను మేపి సాయంత్రం వాటిని ఇంటికి తోలుకొచ్చి కట్టేశాడు. భార్యకు అతనిలో ఏదో వింత శక్తి కనిపించింది. తరువాత మూలన్ ఒక మఠం చేరి కళ్ళు మూసుకొని ధ్యానంలో గడిపాడు. భార్య ఇంటికి వెళ్లి మర్నాడు ఉదయం వచ్చి చూసింది. అదే ధ్యాన భంగిమలో ఉండిపోయినట్లు గమనించింది. ఆయన కళ్ళ నుంచి వింత కాంతి వెలువడుతున్నట్లు గుర్తించి అందరికి విషయం తెలియజేసింది అందరూ వచ్చి ఆశ్చర్యంగా చూశారు. కళ్ళు తెరిచాక స్వగ్రామం రమ్మని ప్రార్ధించారు. ఒప్పుకోలేదు. సాతనూర్ నుంచి తిరువావా దూతురై వెళ్ళాడు. భార్య ఏడుస్తూ వెళ్ళింది అప్పుడు అసలు విషయం చెప్పాడు. ఆమె భర్త మరణిస్తే

తానూ ఆయన శరీరంలో ప్రవేశించాడు. ఆవులు తనను అతని ఇంటికి తీసుకు వెళ్లాయి. అక్కడ ఆ శరీరాన్ని దాచాడు. మళ్ళీ వచ్చి చూస్తే అది కనపడలేదు. ఇది శివ లీలగా భావించి తానూ అగస్త్య మహర్షిని కలవటానికి హిమాలయాల నుంచి వచ్చానని, దారిలో కాశి, నేపాల్ తిరుకదారం కంచి మొదలైన క్షేత్ర సందర్శనం చేసి ఇక్కడికి వచ్చానని చెప్పగా, అతని వింత ప్రవర్తన అర్ధమైంది. తిరిగి వచ్చినందుకు వారంతా సంతోషించారు. ఆయన సంస్కృత శైవ ఆగమాలు తమిళంలోకి అనువాదం చేశాడు. మళ్ళీ హిమాలయాలకు వెళ్ళాడు. అక్కడ మూడువేల నలభై ఏడు తిరుమూల మంత్రాలు రచించాడు.❀



## 87) న్యాయ బిందు టీక కర్త – ధర్మోత్తర – (800)

బౌద్ధ ప్రమాణాలపై ప్రామాణిక గ్రంథాలు రాసిన ధర్మోత్తర 8వ శతాబ్దికి చెందినవాడు. ధర్మకృతిపై అనేక వ్యాఖ్యానాలు రాశాడు కాని సంస్కృత న్యాయబిందు టీకా ఒక్కటే దక్కింది. ఇవికాక అపోహ నామ ప్రకారణ, క్షణ భంగ సిద్ధి, పరలోక సిద్ధి, ప్రమాణ పరీక్ష, ప్రమాణ వినిశ్చయాటీకా కూడా రచించాడు.❀

## 88) లక్షణ శాస్త్ర కర్త – శకటాయన –818–867

కాశ్మీర్‌కు చెందిన శకటాయణుడు, నైరుక్త కర్త.. వ్యాకరణ వేత్తలలో అతిప్రాచీనుడు. తరువాత వారైన యాస్కుడు, పాణిని ఆయన రచనలను ఉదాహరించటం వలననే లోకానికి తెలియబడ్డాడు. నామ వాచాకాలన్నీ క్రియాజన్యాలేనన్నాడు. దీనినే సంస్కృతంలో "కృత్ ప్రత్యయం" అన్నారు. దీనిపై ప్రముఖ వ్యాకరణవేత్త బిమల్ కృష్ణ మాతీలాల్ "నైరుక్తకారులకు అంటే ఎటిమాలజిస్ట్ లకు పాణినీయులకు అంటే వ్యాకరణ వేత్తలకు మధ్య గొప్ప చర్చ జరిగింది. ఎటిమాలజిస్టులు నామవాచకాలన్నీ కొన్ని క్రియల నుండి ఏర్పడ్డాయన్నారు. నిరుక్తకర్త యాస్కుడు దీనినే సమర్ధించి

శకటాయనునుణుడిని. సమర్ధించి ఉదాహరించాడు. దీనివలమ పదాలన్నీ అత్యంత సూక్ష్మ రూపంలోకి అంటే ధాతు రూపంలోకి విభజించటానికి వీలు కలిగింది. దీనికే ధాతు- ప్రత్యయ వ్యవస్థ అనే పేరు కలిగింది. గార్గ్యుడు శకటాయనుడి అభిప్రాయాన్ని వ్యతిరేకించాడని యాస్కుడు తెలియజేశాడు. యాస్కుడు అన్ని నామవాచకాలు ధాతువుల నుంచే రావాలనే నియమం లేదు అన్నాడు" అని తెలియబరచాడు. విభక్తి ప్రత్యయాలకు ప్రత్యేక అర్థం ఉండదని, శకటాయనుడు అంటే అవి నామవాచకం లేక క్రియలు చెప్పే దాన్ని సమర్ధిస్తాయని గార్గ్యుడు అన్నాడు. ఇలా ప్రాచీనకాలంలో మీమాంసకులకు వ్యాకరణకారులకు సుదీర్ఘ చర్చలు జరిగాయి.. శకటాయనుని రచనను "లక్షణ శాస్త్రం" అంటారు. ప్రాణమున్న, ప్రాణంలేని వాటి లింగాలను తెలుసుకోవటానికి ఇది సహకరిస్తుంది. ఇతను క్రీ.శ.818లో జన్మించి 867లో మరణించాడు. ఈ శకటాయణుడు యాస్క, పాణినిలకు ముందు ఇనుప యుగంలోని వాడు.

క్రీ.శ 9వ శతాబ్దంలో మరొక వ్యాకరణకర్త శకటాయణుడు అమోఘ వర్షుని కాలంలో ఉన్నాడని తెలుస్తోంది.❁

## 89) తత్వ శుద్ధికర్త శృంగేరి జగద్గురువు - శ్రీ శ్రీ జ్ఞానఘన (848-910)

అప్పయ్య దీక్షితులు మెచ్చిన "తత్వ శుద్ధి" సంస్కృత గ్రంథం రాసిన 4వ శృంగేరి జగద్గురుసులు శ్రీ శ్రీ జ్ఞానఘన. గురువంశ కావ్యం ప్రకారం వారు పినాక పాణి భక్తులు. శృంగేరిలో శ్రీ జనార్దనా దేవాలయం వీరి ఆధ్వర్యంలోనే జరిగింది. వీరి గురించిన శ్లోకం -"సత్తా ధనాది తీస్టం తే -ప్రజ్ఞాన్ ఘూనా ఏవేతి తం జ్ఞానఘన మాశ్రయే".❁

## 90) రసాను భూతికర్త - శ్రీ శంకుకుడు- (850)

అభినవ గుప్తునికి ముందే రస విషయాన్ని వివరించిన వారిలో భట్ట లల్లటుడు, శ్రీశంకుకుడు, భట్ట నాయకుడు ఉన్నారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి తన రస సిద్ధాంతాన్ని అభినవ గుప్తుడు ప్రతిపాదించాడు. లక్ష్యంతో కూడిన కథాసంవిధానం, నాయకుడు, అభినయానికి సంబంధించిన మార్పులు, నాటక ప్రదర్శనలో చూసేవారికి కలిగే రసాను భూతి, ఎలా కలుగుతుందో చెప్పాడు. అనుమాన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. శిక్షణ ద్వారా విభానుభావాలను అభినయించి సభికునిలో పాత జ్ఞాపకాలను జ్ఞప్తికి తేవచ్చు కానీ ప్రధాన రసాన్ని ప్రదర్శించి చూపలేము. ప్రధానరసం గమ్యం. మిగిలినవి గమకాలు.. ఇతని సిద్ధాంతాలలో అసంగత విషయాలను తెలుసుకొని మార్పు చేసి తనదైన రస సిద్ధాంతం చెప్పాడు అభినవ గుప్తుడు.❁

**91) ప్రకరణ పంచిక కర్త – శైలకాంత – (900)**


7వ శతాబ్దానికి చెందిన ప్రభాకరుని అనుయాయుడు 9వ శతాబ్ది శైలకాంత. భట్టవాద వ్యతిరేకి. ప్రభాకరుని పూర్వ మీమాంసపై విపులమైన వ్యాఖ్యానం "ప్రకరణ పంచిక" రాశాడు. ప్రభాకర సిద్ధాంతాన్ని పూర్తిగా తెలుసుకోవటానికి శైల కాంత వ్రాసిన ప్రకరణ పంచిక ఒక్కటి మాత్రమే మిగిలింది.❀

**92) రాజ శేఖరుని పూర్వీకులైన కవులు (క్రీ.శ 900)**

9వ శతాబ్దపు రాజశేఖరుని పూర్వీకులు అకాల జాలాద, శూరానంద, తరళ, కవిరాజ అనే నలుగురికి తన పూర్వీకులుగా, కవులుగా పేర్కొన్నాడు. కొన్ని సంస్కృత సంకలనాలలో వారు కొన్ని చాటుపద్యాలు రాసినట్లు ఉంది. వీరు జబల్ పూర్ దగ్గర ఉన్న తివార్ అనే త్రిపురను పాలించిన కాలచూరి రాజుల కొలువులో ఉండి ఉండవచ్చు.❀

**93) ఈశ్వర ప్రతిజ్ఞాభిజ్ఞ కారిక కర్త – ఉత్పలాచార్య –900**

ఈశ్వర ప్రత్యభిజ్ఞ కారిక రాసిన ఉత్పలాచార్యుడు అయిదు అలౌకిక తత్వాలు శివ, శక్తి సదాశివ, ఈశ్వర, విద్య, అయిదు ఆత్మాశ్రియస్థితులు, –కళ , విద్య, రాగనియతి, కాల, వేదాంతం గుర్తించిన మాయ, సాంఖ్యులు ప్రవచించిన పురుషుని నుంచి పృథ్వి వరకు గల 25 తత్వాలు మొత్తం 36 తత్వాలతో కూడినది ఈ సృష్టి అని చెప్పాడు. అభినవ గుప్తుడు 37వ దైన "అమత్తర తత్వం" ప్రతిపాదించి ఇదే అన్నిటికంటే ఉత్కృష్టమైనది అని చెప్పాడు.❀



## 94) న్యాయ మంజరి కర్త – జయంతి భట్టు –900

తొమ్మిదవ శతాబ్దికి చెందిన న్యాయ సిద్ధాంతకారుడు జయంత భట్ట "న్యాయ మంజరి"తోపాటు "ఆగమాడంబర" అనే నాటకం సంస్కృతంలో రాశాడు. 882–902 కాలంలో పాలించిన రాజు శంకరవర్మ తన సమకాలికుడని పేర్కొన్నాడు. ఇతని కొడుకు అభినందన కవి తన "కాదంబరి కథా సారం"లో జయంతి భట్ట తాత 8వ శతాబ్దపు కర్కోటక రాజు లలితా దిత్య ముక్త పీడుని ఆస్థానంలో మంత్రి అని చెప్పాడు. కనుక జయంతి భట్టు 9వ శతాబ్దపు ఉత్తరార్థంలో ఉన్నాడని భావిస్తారు.

కథాసారం ప్రకారం వీరిది గౌడ దేశానికి చెందిన బ్రాహ్మణ కుటుంబమని భారద్వాజ గోత్రమని, పూర్వీకుడు శక్తి అని కాశ్మీర్ రాజ్య సరిహద్దులో దర్వాభిసారలో స్థిరపడ్డారని తెలుస్తోంది. జయంతుని తాతకు రాజు ఉత్తర రాజౌలిలో ఉన్న "గౌర ములక" గ్రామాన్ని దత్తం చేశాడు జయంతుని తండ్రి చంద్ర.

చిన్నతనంలోనే జయంతుడు బాలమేధావిగా గుర్తింపబడి యవ్వనంలోనే పాణిని అష్టాధ్యాయిని అధ్యయనం చేసి గొప్ప వ్యాకరణ పారీణుడై "నవ వృత్తికారుడు" అనే బిరుదు పొందాడని తెలుస్తోంది. న్యాయ శాస్త్రంపై మూడు వ్యాఖ్యానాలు రాశాడు కానీ న్యాయ మంజరి ఒక్కటే మిగిలింది. మిగతా రెండు "న్యాయ కలిక", "న్యాయ పల్లవ". ఈ రెండు "శాద్వద రత్నాకరం"లో పేర్కొనబడ్డాయి కానీ అలభ్యాలు. న్యాయ మంజరిని తాను రాజు చేత అరణ్యంలో నిర్బంధించబడినప్పుడు రాశానని జయంతుడు చెప్పుకొన్నాడు. న్యాయ మంజరి సర్వ స్వతంత్ర గ్రంథమే అనిపిస్తుందికాని అదొక వ్యాఖ్యాన గ్రంథం అనిపించదు. అంతటి న్యాయశాస్త్ర విద్వత్తు జయంత భట్టుది. దీనిని రాయటానికి ముఖ్య కారణం వేద వాగ్మయ సాధికారతను సంరక్షించటం కోసమేనని చెప్పాడు. పూర్వ న్యాయ శాస్త్రకారులు న్యాయాన్ని "అన్వీక్షికమ్" అంటే శాస్త్రీయ విజ్ఞానం అన్నారని తెలిపాడు.

జయంతుడు రాసిన "ఆగమాడంబరం" నాటకంలో నాలుగు అంకాలున్నాయి. ఇది పాక్షిక వేదాంత సంబంధ నాటకం. ఇందులోని నాయకుడు వేద విరుద్ధులను వాదంలో ఓడించి వేద ప్రామాణ్యతను కాపాడటమే ముఖ్య కాదాంశం. దీని ఆంగ్లానువాదాన్ని "క్లే సాంస్క్రిట్ లైబ్రరీ" ప్రచురించింది.



## 95) అవధూత గీతకర్త - దత్తాత్రేయ స్వామి -900-1000

స్వేచ్ఛాగానం అని పిలువబడే "అవధూత గీత" కర్త క్రీ.శ 900-1000 కాలపు దత్తాత్రేయ మహర్షి. ఇది ఎనిమిది అధ్యాయాలతో 298 శ్లోకాల "నాధ యోగ" గ్రంథం. దత్తాత్రేయుడు యోగీశ్వరేశ్వరుడు. ఆత్మజ్ఞాని ఆత్మజ్ఞాన సోపానాలు ఈ గ్రంథం వివరిస్తుంది. సహజామృతాన్ని పంచే గ్రంథం. ఇందులో ఒక శ్లోకభావం గ్రహిద్దాం- "నేనే పరమ శివుడను -అనుమానం వలదు. మిత్రుడా నాకు నేను ఎలా నమస్కారించుకో గలను -ఈశ్వరానుగ్రహ దేవా పుంసా మద్వైతవాసనా -మహాభయ పరిత్రాణ విప్రాణాముపజాయతే

2- ఏనే దం పూరితం సర్వమాత్మనైవా ఆత్మానాత్మని
"నిరాకారం కదం వందేహ్యాభిన్నం
3-పంచ భూతాత్మకం విశ్వం మరీచిజలసన్నిభం -కశ్యాప్యహో నమస్కృత్య
అనాహమేకోనిరంజనః-శివ మవ్యయం ❁

## 96) ఆకాశ గామి - మల్లికార్జున శివాచార్య -900

విశ్వ ఆరాధ్య పీఠాధిపతి మల్లికార్జున శివాచార్య అతీంద్రియ శక్తులున్న మహాయోగి. ఆకాశ గమనంతో సంచారం చేసేవాడు. కారాధ్యసి పాలకుడు జయ నందన రాజు వీరి శక్తికి అబ్బురపడి కర్దమేశ్వర్‌కు గంగకు మధ్య ఉన్న 800 పరగణాలను రాసిచ్చాడు. ఆ దానపత్రం ఇప్పటికీ లభ్యమే. ప్రయాగ, నేపాల్ ఢిల్లీలలో వీర శైవ మఠాలులు నిర్మించాడు. నేపాల్ వెళ్లి రాజు విశ్వమల్లకు వీరశైవం బోధించగా రాజు 300 మూరిభుల భూమిని దానం చేశాడు. ఆ భూమి ఇప్పటికీ భట్టగాఁ గ్రామంలో జగంబుహారీ శైవ మఠాధీనంలోనే ఉంది.❁

## 97) విద్యాశ్రీ కర్త – జ్ఞానోత్తమ – 910–954

శృంగేరి జగద్గురువులలో 5వ వారు శ్రీ జ్ఞానోత్తమ. పూర్వాశ్రమలో దక్షిణా భారతదేశంలో స్థిరపడ్డ గౌదులు. శ్రీ జ్ఞానఘన తర్వాత పీఠాధిపత్యం వహించారు. వీరు వ్రాసిన "విద్యా శ్రీ" శ్రీ శంకర భగవత్పాదుల సూత్ర భాష్యానికి ఉప భాష్యం. వీరి ముఖ్యశిష్యులు విజ్ఞానాత్మ "నారాయణోపనిషత్"కు "తాత్పర్య ద్యోతిని" వ్యాఖ్య రాశాడు. మరొక ముఖ్య శిష్యుడు చిత్సుఖ "తత్వ ప్రదీపిక" అనే అద్వైత గ్రంథం రాశాడు. ఇది గురు ప్రజ్ఞాభారతి. దక్షిణామూర్తి, వ్యాస, శంకర తేజస్సు శ్రీ జ్ఞానోత్తమలో ఉందని భావిస్తారు – "జ్ఞానాముత్తమం జ్ఞానం జ్ఞానముత్తమో యతః –జ్ఞానోత్తమ ఇతి ఖ్యాతం గురుం తామహమాశ్రయే".❀



## 98) స్తోత్ర రత్న కర్త – యామునా చార్య –916–1024

శ్రీ నాథ ముని మనవడైన శ్రీ యామునాచార్యులు వైష్ణవ మాతాచార్యులలో పేరెన్నికగన్నవాడు. తమిళనాడులో వీర నారాయణపురం అంటే నేటి మదురైలో 916లో జన్మించాడు. చిన్నప్పుడే శాస్త్రాలన్నీ 12 ఏళ్లకే నేర్చిన బాలమేధావి. శ్రీమద్ భాష్యాచార్యుల శిష్యుడు. ఆ కాలంలో కోలాహలుడు అనే గర్విష్టి పండితుడుతుండేవాడు. అతని చేతిలో వాదంలో ఓడిపోయినవారిచేత పన్ను కట్టించే వాడు. యామునుని గురువుకూ ఇది తప్పలేదు. కొన్నేళ్లు పన్ను కట్టలేక పోయాడు. ఒకరోజు కోలాహాలుని శిష్యుడు వచ్చి పన్ను చెల్లించమని ఒత్తిడి చేశాడు. 12 ఏళ్ళ యామయునాచార్యులు కొహలుడిని తనతో శాస్త్రార్థ చర్చ చేసి గెలవమని సవాలు విసిరి పంపించాడు. నిజమైన సవాలా ఉత్తుత్తి సవాలా అని మళ్ళీ పంపగా యామునుని గురువు శిష్యుని పక్షాన ఉండి గట్టి సవాలేనని జవాబు పంపాడు.

రాజాస్థానంలో చర్చ రసవత్తరంగా సాగింది. రాణి మాత్రం ఈ బాలుడే గెలుస్తాడని చెప్పగా రాజు కోలాహలుడి హల్ చల్ చేసి గెలుస్తాడని చెప్పాడు. ఇద్దరూపందెం కాశారు దర్బారులో. కుర్రాడు ఓడిపోతే తాను రాణీ దాసికి దాసికి దాసిగా ఉంటానని అంటే రాజు కుర్రాడు గెలిస్తే తన అర్ధరాజ్యాన్ని అతనికి బహుమతిగా ఇస్తానని చెప్పాడు. యమునుడు మూడు వింత ప్రశ్నలను కోహాలునిపై సంధించాడు. వాటిని కాదు అని తిరస్కరించామన్నాడు. 1–మీ అమ్మ వంధ్య కాదు, 2–పాండ్యరాజు మత నమ్మకం లేనివాడు, 3–రాణి సతీ సావిత్రి వంటిది. కొహలుడి నోట్లో పచ్చి వెలక్కాయ పడింది. కక్కా లేక మింగా లేక నిశ్శబ్దంగా ఉన్నాడు. ఈ ప్రశ్నలకు యామునాచార్యులనే సమాధానం చెప్పమనగా అతి సునాయాసంగా చెప్పి అందరి మన్ననలు అందుకొని వాదంలో విజేత అయ్యాడు. రాణి ఈ బాలుడిని 'మహాబాగా మెప్పించావు ఆళ్వాన్దర్" అన్నది. అప్పటినుంచి యామునా చార్యులకు అలవందర్ అనే పేరు స్థిర పడింది. అన్నమాట ప్రకారం పాండ్యరాజు రాజ్యంలో సగ భాగాన్ని యమునాచార్యులకు రాసిచ్చాడు. ఆ రాజ్యాన్ని చాలా సమర్ధవంతంగా పాలించి ప్రజలకు సకల సౌకర్యాలు కలిగించి ప్రజారంజక పాలన చేశాడు. రాజ్య పాలనలో ఇంటిని మర్చిపోతాడేమోనని తాత నాదముని మనవడిపై ఓ కన్నేసి ఉంచమని శిష్యుడు రామ మిశ్రాకు చెప్పాడు.

యమునాచార్యులకు 35 ఏళ్ళు రాగా మిశ్రా ఆయనను శ్రీరంగంలోని శ్రీ రంగనాథ దేవాలయానికి తీసుకు వెళ్ళాడు. స్వామి దర్శనంతో మనోనేత్రం విచ్చుకొని తన జీవిత పరమార్ధం గ్రహించి రాజ్యాన్ని వదిలేసి స్వామి సేవలో, గ్రంథ రచనలో జీవితం గడిపాడు. ఇక్కడే రామానుజాచార్యులు ఈయన శిష్యుడయ్యాడు. యామునాచార్యులవారు సంస్కృతంలో 1–స్తోత్ర రత్నం, 2– ఆగమ ప్రామాణ్యం, 3–సిద్ధిత్రయం, 4–గీతార్ధ సంగ్రహం రాశారు. ఇందులో స్తోత్ర రత్నం చంపు కావ్యం. శ్లోకాలు వచనము ఉంటాయి. నాలుగింటిలో ఇది ఉత్కృష్టంగా భావిస్తారు వైష్ణవులు. యామునా చార్య కథను శ్రీ కృష్ణ దేవరాయలు తన ఆముక్త మాల్యద కావ్యంలో పరమాద్భుతంగా వర్ణించాడు. యామునుడు రాజుగా ఉన్నప్పుడు చేసిన సంస్కరణలను అమలు పరచిన రాజనీతిని గొప్పగా వివరించాడు. దీన్ని ఆధారంగా చేసుకొని ప్రాచార్య శ్రీ శలాక రఘునాథ శర్మగారు "యామునుని రాజనీతి" అనే పుస్తకం రాసి మాన్యశ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి అంకితమిచ్చారు. శర్మగారు ఆపుస్తకాన్ని రాజమండ్రిలో తమను సందర్శించినప్పుడు నాకు ఆత్మీయంగా అందజేశారు.❀

## 99) భోజమహారాజు తండ్రి - సింధు రాజు -950

పారమార వంశంలో మొట్టమొదటి గొప్ప రాజు సింధూరాజా. భోజమహాకవి తండ్రి. మాళవ సింహాసనాన్ని సుమారు ఐదేళ్లు పాలించాడు -తమ్ముడు ముంజరాజు. భోజ శిలాశాసనాలలో తప్ప అతని గురించి వివరాలు తెలియవు. అతని ఆస్థాన కవి పద్మ గుప్తుడు రాసిన "నవసాహసాంక" చరిత్రలో కొంత వివరం ఉంది. అయితే దీనికి చారిత్రిక ఆధారాలు లేవు. 4వ శతాబ్ది కవి మేరుదత్తుడు రాసిన "ప్రబంధ చింతామణి" ప్రకారం సింహదంత భట్ట కుమారుడు. ముంజరాజు తండ్రికి పెంపుడు కొడుకు. ముంజరాజు అనంతరం సింధు రాజరాజ్యానికి వచ్చాడు. సింధు రాజాకు "నవ నారాయణ", "సాహసాంక" బిరుదులున్నాయి. సింధుల సింధాల పేర్లు కూడా ఉన్నాయి. ఆయన్ను "సింధు రాజ దేవ" అని సంబోధిస్తారు.

సింధురాజ చాళుక్య సత్యాశ్రయ రాజును ఓడించి ముంజరాజు తైలపుడికి కోల్పోయిన రాజ్యాలను తిరిగి స్వాధీనం చేసుకొని, హూణ రాజునూ జయించాడని "ఉదయ పూర్ ప్రశస్తి"లో ఉన్నది. కొంకణా శిలహారాలపై కూడా దండయాత్ర చేశాడు. దక్షిణ గుజరాత్ లోని "లాట"ను స్వాధీనం చేసుకొన్నాడు. సింధు రాజ మహాసేనాని మహారాజే కాక మహాకవి కూడా. కళలను, సాహిత్యాన్ని ప్రోత్సహించి కుమార భోజునికి ఆదర్శ ప్రాయమై నిలిచాడు.. భోజుడు తండ్రిని మించిన తనయుడిగా జగత్ ప్రసిద్ధమైన సంగతి మనకు తెలిసిందే..❁

## 100) ఉపమితాభవ ప్రపంచకర్త -సిద్ధ ఋషి - 950-

962లో ఉపమితాభవ ప్రపంచ రాసిన సిద్ధ ఋషి తన గురుపరంపరను - సురాచార్య దెల్లమహా త్తార, దుర్గాస్వామి ముసద్దర్శి శిద్దర్శిగా పేర్కొన్నాడు. దీక్షా గురువు గర్గుడు.❁

## 101) అభినవ గుప్తుని గురువులు -960

శైవాచార్య అభినవ గుప్తుని తండ్రి నరసింహ గుప్తుని వద్ద వ్యాకరణం, వామనాధుని వద్ద ద్వైత తంత్రాలు, భూతి రాజా వద్ద బ్రహ్మ విద్య, భూతి రాజు కుమారుని వద్ద ద్వైతాద్వైత సిద్ధాంతం, లక్షణ గుప్తుని దగ్గర క్రమ, త్రిక పద్ధతులు, ఇందురాజా వద్దధ్వని, భట్ట తౌత వద్ద నాటక కళ, శంభునాధుని వద్ద కుల సిద్ధాంతం అభ్యసించిన జీవన్ముక్తుడు.❁


## 102) జ్ఞాన ప్రమేయసార కర్త - దేవరాజ ముని -975

రామానుజుని పూర్వ అద్వైత గురువు యజ్ఞమూర్తి చివరికి శిష్యుడై దేవరాజముని అయ్యాడు. జ్ఞాన సార, ప్రమేయం సారగ్రంథాలు రచించాడు. గురువు రామానుజుడు వీటిని తీక్షణంగా పరిశీలించి ఆమోదించాడు. వరద రాజస్వామి తిరుమర్దనం బాధ్యతను దేవ రాజమునికి అప్పగించాడు.

రామానుజుని అనుజుడు -గోవింద (1020)

రామానుజాచార్యులవారి తమ్ముడు వరుసయిన గోవింద తమిళ తాయి నెల పునర్వసు నక్షతరంలో పుట్టాడు. రామానుజుని గురువు యాదవ ప్రకాశుడు రామానుజుడిని విషంతో చంపే ప్రయత్నం చేస్తే గోవిందుడే అన్నను ప్రాణ గండం నుంచి బయట పడేశాడు. ఒకసారి ఒక నదిలో స్నానం చేస్తుంటే ముకుంద చేతుల్లోకి ఒక శివలింగం చేరింది. అప్పటికప్పుడు వైష్ణవం వదిలి అద్వైతి అయిపోయాడు ముకుంద. ఆ తర్వాత కొద్దికాలానికే తిరుమలనంబి, రామానుజుల హితవుతో మళ్ళీ విశిష్టాద్వైతి అయ్యాడు. రామానునుజునికి స్నానం చేయించటం ప్రక్క ఏర్పాటు చేయటం నడకలో సాయం చేయటం ఆయన వస్త్రాల జాగ్రత్త ముకుందయే శ్రద్ధగా చేసేవాడు. ముకుంద గొప్పతనాన్ని తెలియబరచే ఒక తనియన్-

"రామానుజ పదశ్చాయా గోవిందా ఆహ్వాన పాయినే -దధాధ్యతా స్వరూపాశ్చ జియాన్ మద్ విశ్రమస్థలే".❁




## 103) మనుస్మృతి భాష్య కర్త - మేధాతిధి -1000

మనువు రాసిన మను స్మృతి అనే న్యాయ శిక్షా శాస్త్రానికి మహా భాష్యం రాసిన తొలి రచయిత మేదాతిది. మనుధర్మ శాస్త్రంగా ప్రాచుర్యం పొందిన ఆ బృహద్గ్రంథ సారాన్ని లోకానికి మేదాతిది భాష్యం రాసి మహోపకారం చేశాడు. మేదాతిది ఎక్కడి వాడు ఏ ప్రాంతంలో భాష్యం రాశాడు అనేది చర్చ నీయాంశంగా ఉన్నది. కాశ్మీరుకు చెందినవాడు అని అందరూ భావిస్తుంటే కాదు దక్షిణ భారత దేశానికి చెందినవాడు అన్నాడు జూలియస్ జాలీ. గార్గ్ బూలర్ చెప్పగా మహా పండితుడు కాణే అంగీకరించింది. మేదాతిది కాశ్మీర్ వాడని, కాదంటే కనీసం ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వాడు అని. రాబర్ట్ లింగాత్ ఈ వాదాలు అనవసరమని మేధా తిది కాశ్మీర్ దేశ కవి అని నిశ్చితాభిప్రాయంగా చెప్పాడు. మేదాతిది తన వ్యాఖ్యానంలో తన ముందు రాసిన వ్యాఖ్యానకర్తల పేర్లను పేర్కొన్నాడు అని కాణే పండితుడు చెప్పాడు. యాజ్ఞవల్క్య స్మృతి వ్యాఖ్యానమైన "మితాక్షర"లో ఉన్నదాని ప్రకారం మేదాతిది మను స్మృతి వ్యాఖ్యానాన్ని క్రీ.శ.820 -1050 మధ్యకాలంలో రాసి ఉంటాడని నిర్ధారించవచ్చు. లింగాత్ మాత్రం మేధాతిధి ది 9- 10 శతాబ్దం కాలం అన్నాడు. డేవిడ్ బ్రిక్ తన 2010వ సంవత్సర "సతీ సహగమనం" సమీక్షలో మేధాతిధి జీవితకాలం క్రీ. శ.1000 అని తేల్చాడు. ఇంతకంటే ఆయన గురించి మనకు తెలిసినది ఏమీ లేదు.❁



## 104) మృత సంజీవని కర్త - హలయూధ -1000


గణిత మేధావి అయిన హలయూధుడు 10వ శతాబ్దానికి చెందినవాడు. పింగళుని చందశ్శాస్త్రానికి "మృత సంజీవిని" వ్యాఖ్య రాశాడు. ఇది ఈనాటి పాస్కల్ త్రిభుజానికి ఆనాడే చెప్పిన సిద్ధాంతం. ఈ కవి రాష్ట్ర కూట రాజుల రాజధాని "మాన్య ఖేట"లో నివసించాడు. రాష్ట్ర కూట రాజు మూడవ కృష్ణుని ఆస్థానంలో ఉండి ఈ వ్యాఖ్యానం రాశాడు. ఈ కవి రాసిన "కవి రహస్యం" రాజు మూడవ కృష్ణుని స్తుతిస్తూ రాసినదే. తరువాత ఉజ్జయినికి పారమార రాజుల కాలంలో చేరాడు. పారమార రాజు ముంజను స్తుతిస్తూ మృతసంజీవని వ్యాఖ్య రాశాడు. పై రెండు గ్రంథాలే కాక "అభిదాన రత్నమాల" అనే సంస్కృత నిఘంటువు కూడా హలయూధుడు కూర్చాడు.❈

## 105) ఆయుర్వేద భాష్యకర్త - ఊవటుడు -1000

భోజుని ఆస్థానంలో ఊవటుడు అనే కాశ్మీర పండితుడుండేవాడు. ఈయన శుక్ల యజుర్వేదానికి భాష్యం రాశాడు. ఇతనితోపాటు "చిత్తపకవి" కూడా ఉన్నాడు.❈

## 106) గొమ్మట సారకర్త - నేమి చంద్ర - 1000

క్రీ. శ 10వ శతాబ్దంలో ఆచార్య నేమి చంద్ర 1- ద్రవ్య సంగ్రహ, 2- గొమ్మట సార అనే జీవ కాండ, కర్మకాండలకు సంబంధించిన గ్రంథాలు రాశాడు. ఇవికాక త్రిలోక సార, లబ్ధిసార క్షిపణ సార గ్రంథాలూ రాశాడు. జైనాచార్యులలో నేమిసారకు అగ్రాసనాధిపత్యం ఉన్నది. ఈయనకే "సిద్ధాంత చక్రవర్తి" అనే పేరుంది. చాముండరాయకు గురువు. నేమి ఆచార్యకు కర్ణాటకలో షిమోగాలో నగర్ తాలూకా పద్మావతి దేవాలయంలో ఒక శాసనం విగ్రహం ఉన్నాయి. చాముండ రాయ కోరికపై నేమిచంద్రాచార్య జైనమత ముఖ్య ఆచార్యుల జీవిత చరిత్రలను "గొమ్మట సార"గా రాశాడు. 3-3-980లో జరిగిన గోమతేశ్వర విగ్రహ అభిషేక కార్యక్రమంలో నేమి ఆచార్య పాల్గొన్నాడు. ఈయన రచన ద్రవ్య సంగ్రహం జైనులకు అతి పవిత్ర గ్రంథం.❈



## తిలోయ ప్రణతి-1001-నుండి 1100 వరకు -11వ శతాబ్దం

## 107) శివ గీత వ్యాఖ్యకర్త - పరమ శివేంద్ర సరస్వతి -1040

పంపాతీరగ్రామంలో పరమశివ కుమారుడు పూర్వాశ్రమంలో శివరామకృష్ణ శ్రీ పరమ శివేంద్ర సరస్వతిగా 57వ కామకోటి జగద్గురువయ్యారు. గురురత్నమాలిక రాసిన మహా బ్రహ్మజ్ఞాని సదాశివ బ్రహ్మేంద్రునికి గురువు. ఈ గురువు ఘనత ఎలాంటిది అంటే సదాశివ బ్రహ్మేంద్రులు వీరి పాదుకలను ఎప్పుడూ శిరస్సుపై పెట్టుకొని తిరిగేవాడు. బ్రహ్మజ్ఞానంతో అవధూతగా మారిన సదాశివేంద్రుని చూసి కొందరు ఆయనకు పిచ్చిపట్టిందని ప్రచారం చేసి గురువు శ్రీ పరమ శివేంద్రకు తెలిపారు. ఆయన "నాకు కూడా అలా అవ్వాలని ఉంది. ఆయనను తాకితే చాలు అది లభిస్తుంది" అన్నారట. అంతటి గొప్ప అవధూత సదాశివ బ్రహ్మేంద్రులు. అంతగొప్ప సంస్కారి వీరు. వీరి గొప్పతనాన్ని సదాశివ బ్రహ్మేంద్రులు "ఆత్మ విద్యా విలాసం"లో అభివర్ణించాడు. వీరు శివగీతకు చక్కని వ్యాఖ్యానం రాశారు. తంజావూర్ వద్ద



## 108) బ్రహ్మసూత్ర భాష్యకర్త – శ్రీపతి పండితారాధ్యుడు –1060

శ్రీపతి పండితారాధ్యుడు 1060లో ఆంధ్ర దేశంలో ఉన్నాడు. వేద వేదాంగ నిష్ణాతుడు బ్రహ్మ సూత్రాలకు శ్రీ క భాష్యం రాశాడు. దీనికి అందరు విపరీతంగా ఆయనను శ్లాఘించారు. ఆయనకు అతిమానవ శక్తులెన్నో ఉండేవి. ఒకసారి శాస్త్రార్థ చర్చలో శివ ప్రసాదం అగ్నికంటే పవిత్రమైనది అని ప్రకటించాడు. దీనిపై పెద్ద గందర గోళమే రేగింది. ఆయనను ఎవరూ సమర్ధించలేదు. కోపావేశంతో పండితారాధ్యుడు అగ్నిని మూటకట్టి శమీ వృక్ష కొమ్మకు వ్రేలాడ దీశాడు. దీనితో ఆ ప్రాంతంలోని అగ్ని హోత్రాలన్నీ ఆరిపోయి ఇళ్లల్లో వంటా వార్పూ లేకుండా పోయింది. ప్రజలందరూ వచ్చి తమ తప్పును మన్నించమని ప్రసాదమే అగ్నికంటే పవిత్రం అని నమ్ముతామని ప్రాధేయపడ్డారు. అప్పుడు కనికరించి అగ్నిని విడుదల చేశాడు.❋

## 109) కథా సరిత్సాగర కర్త –సాంద్రా నంద బోధేంద్ర సరస్వతి – 1061–1099

46వ కామకోటి జగద్గురువులు శ్రీ సాంద్రా నంద బోదేంద్ర సరస్వతి పూర్వనామం సోమేంద్ర. తండ్రి సూర్య. గురువు పరమశివేంద్ర సరస్వతితో విస్తుతంగా దేశాటనం చేశారు "కదా సరిత్సాగరం" రచించారు. దీనికి కానుకగా ధారానగర రాజుభోజుడు ముత్యాలపల్లకి కానుకగా అందజేశాడు. అరుణా చలక్షేత్రంలో మోక్షం పొందారు.❋

## 110) హేమ చంద్రాచార్యను ఓడించిన -శ్రీ చంద్ర శేఖరేంద్ర సరస్వతి -4 (1098-1166)

4వ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి 47వ కామకోటి జగద్గురువు. మరొక పేరు చంద్ర చూడ. కుండీని నది తీర ప్రాంతవాసి. తండ్రి సుఖ దేవుడు. ద్రావిడ బ్రాహ్మణుడు పూర్వాశ్రమనామం శ్రీ కంఠుడు వాద దిగ్విజయ యాత్ర చేస్తూ విద్యాలోల కుమారపాల ఆస్థాన కవి హేమచంద్రాచార్య అనే కుమారపాల చరిత్ర రాసిన కవి, జైన పండితుని వాదంలో ఓడించారు. కృష్ణ మిశ్ర కవి శ్రీకంఠ చరిత్ర రాస్తే మంఖకవి ఆరాధించాడు. హేమ చంద్రునిపై వాద విజయాన్ని జయదేవుడు "భక్తకల్ప లతిక"లో గొప్పగా వర్ణించాడు. కాశ్మీర్ రాజు జయసింహుడు తానూ ఈ జగద్గురువు శిష్యుడనని వినయంగా చెప్పుకున్నాడు.❁

## 111) అలంకార సర్వస్వము కర్త - సముద్ర బంధ -1070

కుంతకుని తర్వాతకాలం 1100కు చెందిన సముద్ర బంధుడు "అలంకార సర్వస్వము" రాశాడు. సంస్కృత అలంకార శాస్త్రంలో అయిదు భిన్న సంప్రదాయాలున్నట్లు చెప్పాడు అవి అలంకార, గుణ, కవి వ్యాపార, భోజకత్వ వ్యంగ్యాలు. సముద్ర బంధుడు మూడవదైన ఫణితీ వైచిర్యానికి సంబంధించిన కవితాకలాపం కావ్యానికి ఉండే విశిష్ట గుణంగా వక్రోక్తి జీవితకారుడు కుంతకుడు గుర్తించాడని చెప్పాడు.❁

## 112) భాస్వతి కర్త - శతానంద -1099

భాస్వతి అనే ఖగోళ శాస్త్ర గ్రంథాన్ని సంస్కృతంలో రాసిన ఒరిస్సా రచయిత శతానంద 1099 కాలం వాడు, ఆయన ఖగోళ శశాస్త్ర నిధిగా గుర్తింపు పొందారు. భాస్వతిపై అనేక వ్యాఖ్యానాలు రాయబడ్డాయి అంటే అతని గొప్పతనం ఏమిటో తెలుస్తుంది. గ్రంథం చివరి శ్లోకంలో తన గురించి చెప్పుకొన్నాడు. తాను పూరి వాసినని, తండ్రి శంకర, తల్లి సరస్వతి అని చెప్పాడు. తన రచన 1099లో పూర్తయిందన్నాడు. గ్రంథం మొదటి శ్లోకంలో తాను మురారి అంటే విష్ణు పదభక్తుడనని, ఈ గ్రంథం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని రాస్తున్నానని తెల్పాడు. శతానంద భాస్వతితోపాటు శతానంద రత్నమాల, శతానంద శనిగ్రహ కూడా రాశాడు. శనిగ్రహ అనేది స్మృతికావ్యం.❁

## 113) కావ్య ప్రకాశికలో కొంత రాసిన -అల్లట /అల్లక -1100

మమ్మటుడు రాసిన కావ్య ప్రకాశికలో వృత్తి మాత్రమే రాశాడని కొందరు, కొందరు మమ్మటుడు "పరికార" వరకే రాశాడని మిగతా దాన్ని అల్లటుడో లేక అలకుడో రాశాడని అంటారు.❁

## 114) మమ్మట కుటంబకవులు -1100

కావ్య ప్రకాశిక వ్రాసిన మమ్మటుని కుటుంబం కావ్య కుటుంబానికి చెందినదే. మమ్మటుని తండ్రి జైయట, తమ్ముళ్లు కైయట, ఉచటలు వేదాలకు వ్యాకరణ శాస్త్రానికి యేన లేని సేవ చేసిన కాశ్మీరీయులని. వీరికాలానికి 500 ఏళ్ళ తరువాతివాడైన భీమసేనుడనే కవి చెప్పాడు కైయటుడు. మహా భాష్యానికి, ఊచటుడు శుక్ల యజుర్వేద సంహితకు వ్యాఖ్యానాలు రాశారు. తమ్ముళ్లకు అన్నగారు మమ్మటుడే గురువు. ఊచటుని రచనల వ్రాత ప్రతులలో గద్యలో ముగింపు పద్యంలో తండ్రి పేరు "వజ్రటుడు" అని ఉంది. తాను ఉజ్జయినిలో భోజుని ఆస్థానంలో ఉన్నకాలంలోనే వ్యాఖ్యానం రాసినట్లు చివరిపద్యంలో ఉంది. మమ్మటుడు భోజరాజు కంటే పెద్దవాడే కాక సమా కాలికుడు కూడా.❁

## 115) కాశికా వృత్తి వ్యాఖ్యాత - పదమంజరి -1100

11వ శతాబ్దికి చెందిన పదమంజరి పాణిని వ్యాఖ్యానమైన కాశిక వృత్తికి వ్యాఖ్యానం రాసినట్లు తెలుస్తోంది. ఈ కీర్తి హరిదత్తు నిది అనే వాదం కూడా ఉంది. హరిదత్తుడు ఆపస్థంభ ధర్మ సూత్రాలు, గౌతమ ధర్మ సూత్రాలు మొదలైన వాటిపై వ్యాఖ్యానం రాశాడు.❁



## 1101-నుండి-1200 -12వ శతాబ్దం

## 116) భగవద్ గుణ దర్పణ కర్త - పరాశర భట్టర్ -1122-1174

కూరత్తాళ్వార్ కుమారుడైన పరాశర భట్టార్ గురువు ఎంబార్ వద్ద సకల శాస్త్రాలు నేర్చి "నడిచే విశ్వ విద్యాలయం" అని పించాడు. విష్ణు సహస్రనామాలపై "విష్ణు సహస్ర నామ భాష్యం అనే "భగవద్ గుణ దర్పణం" రాశాడు. రంగనాధ స్తోత్రం రంగనాధాష్టకం, శ్రీ గుణ రత్న కోశం, క్రియాదీపం, అష్ట శ్లోకి, చతుశ్లోకి , ద్విశ్లోకి, తని శ్లోకి కూడా రాశాడు. ఇతని బాల్యంలో అద్వైత పండితుడు కోలాహలుడు పల్లకీలో ఊరేగుతూ రామానుజుని వాదంలో ఓడించాలని వెడుతున్నాడు. అప్పుడే ఈ బాలుడు గుప్పెడు నిండా ఇసుక తీసుకొని తనదగ్గర యెంత ఇసుక ఉంది అని కోహలుడిని ప్రశ్నించగా సమాధానం చెప్పలేకపోగా "గుప్పెడు ఇసుక ఉంది అని చెప్పలేని నువ్వు భగద్రామానుజులతో వాదానికి వెడుతున్నావా?" అని ఎద్దేవా చేశాడు. కొహలుడు పరాశర బాలుడిని తండ్రి కూరేశుని గురువు ఎంబార్‌ను మెచ్చి ఆశీర్వదించాడు. తర్వాత పరాశరుని శిష్యుడయ్యాడు.❋

## 117) ఇష్ట సిద్ధి, అద్వైత సిద్ధి కర్త - శ్రీ నృసింహ తీర్థ జగద్గురు (1146-1229)

శ్రీ జ్ఞానోత్తమ తర్వాత శ్రీ జ్ఞాన గిరి శ్రీ సింహగిరి వరుసగా జగద్గురువులయ్యారు. వీరితర్వాత శ్రీ ఈశ్వర తీర్థ పిమ్మట శ్రీ నృసింహ తీర్థ పీఠం అధిరోహించారు. వీరంతా గొప్ప విశ్లేషణకారులు శంకర భాష్యాన్ని సురేశ్వరాచార్య వార్తికాలకు భామతి, వివరణలు అయిన సిద్ధి గ్రంథాలు రాశారు. అందులో ఇష్టసిద్ధి, అద్వైత సిద్ధి ఉన్నాయి. ఇవి భవిష్యత్ తరానికి కరదీపికలు - "శృతి మస్తక కూటస్థ మజ్ఞాన ద్విప భోధినాం -శ్రీ మంత్రం రాజా మూర్తిం తం నృసింహ గురుమాశ్రయే".❋



## 118) ప్రపన్న పారిజాత కర్త – వరద విష్ణు ఆచార్య –1165-1278

1165లో జన్మించిన వరద విష్ణు ఆచార్య 110 సంవత్సరాలు జీవించి 1275లో మరణించాడు. సుదర్శనాచార్య అని కూడా పిలుస్తారు. తండ్రి దేవ రాజా పెరుమాళ్, తాత నాదదూర్ ఆళ్వార్. శ్రీ భాష్య సింహాసనాధిపతి అయి, కంచిలో అర్చావిగ్రహ ప్రతిష్టాపన చేశాడు. ఈయన కుల దైవ విగ్రహం తిరువేళ్లూర్‌లో ఉంది. వరద విష్ణు 19 గ్రంథాలు రాశాడు. అందులో ముఖ్యమైనది ప్రపన్న పారిజాతం. ఇది కాక శ్లోక ద్వయి, పరత్వాది పంచక స్తుతి, తత్వ నిర్ణయం తత్వ సారం, సామాన్య అధికారణ వాదం, యతి లింగ సమర్ధనం, హేతి రాజస్తవం, ప్రమేయ మాల శ్రీ భాష్య సంగ్రహం, ఆహ్నిక చూడామణి వంటి గ్రంథాలు రాశాడు. పిల్లాడికి తల్లి వేడిపాలు త్రాగించినట్లు ఈయన కంచి వరద రాజస్వామికి గోరు వెచ్చని వేడిపాలు నైవేద్యం పెట్టేవాడు. స్వామి సంతోషించి "నువ్వు నా తల్లివా?" అన్నాడట. అప్పటి నుంచి ఈయన పేరు "నాదదూ ర్ అమ్మాళ్" అయింది.❋

## 119) బ్రహ్మ విద్యాభరణ  కర్త – శ్రీ అద్వైతానంద బోధేంద్ర సరస్వతి (1166-1200)

48వ కామకోటి జగద్గురువులు శ్రీ అద్వైతానంద బో దేంద్ర సరస్వతి బ్రహ్మ విద్యాభరణం, శాంతి వివరణ, గురు ప్రదీపం గ్రంథాలు రాశారు. నైషధం ఖండనఖండ కావ్య రచయిత హర్షుని, అభినవ గుప్తుని వాదంలో జయించారు. చిదంబరంలో ముక్తిపొందారు.❋

## 120) విహాతి క్షేత్ర సమాస వృత్తి కర్త – సిద్ధ సూరి –1170

యూకేశ గచ్ఛకు చెందిన ఈ కవి 1192లో విహాతి క్షేత్ర సమాస వృత్తి రాశాడు. యూకేశాపురీయా గచ్ఛలోని గురువులు కక్క సూరి, సిద్ధ సూరి, దేవ గుప్త సూరి. గురువు సోదరుడు యశోదేవ ఈ గ్రంథానికి విషయం వివరణ అందించాడు. సిద్ధ సూరి కక్క సూరి శిష్యుడు దేవ గుప్త సూరికి గురువు.❋



## 1201-1300- 13వ శతాబ్దం

## 121) సాయన భాష్య కర్త - శ్రీ విద్యా తీర్థ -1229-1333

"అవిద్యాచ్ఛన్న భావానాం నృపేణ విద్యోపదేశతః ప్రకాశం యతి యస్తత్వం తమ్ విద్యా తీర్థ మాశ్రయే"

శృంగేరి పీఠ 10వ జగద్గురువులు శ్రీ విద్యాతీర్థ. వీరి శిష్యులే విద్యారణ్య శంకరానందాదులు. సకల వేదోపనిషత్ శాస్త్రాలలో మహా ఘనులు. వేదమే ఊపిరిగా గల "మహేశ్వరులు"గా భావిస్తారు. మంత్ర, తంత్ర యోగాలలో నిష్ణాతులు. సింహగిరిలో చాలాకాలం తపోధ్యానాలలో గడిపారు. విజయనగర రాజ్య స్థాపకులైన హరిహర బుక్కరాయలు వీరిని సగౌరవంగా శృంగేరికి తీసుకు వెళ్లారు. ఏకశిలానగరానికి (వరంగల్)కు చెందిన ఈ బ్రాహ్మణ బాలుడు ముముక్షు స్థానానికి అన్ని విధాలా అరుడని జగద్గురువు సన్యాసదీక్షను 1328లో ఇప్పించి భారతీ తీర్థ నామాన్ని ప్రసాదించారు. మూడేళ్ళ తర్వాత ఈయన పెద్దన్నగారు కూడా ఇక్కడికి వస్తే సన్యాస దీక్షనిచ్చి "విద్యారణ్య" పేరు పెట్టారు. భారతీ తీర్థ, విద్యారణ్యులు దక్షిణభారత దేశ సంచారం చేసి అద్వైత బోధతో ప్రజలను చైతన్య పరచారు. సింహగిరిలో ఇప్పటికి ఒక శిల్పం ఉంది దాని నాలుగు వైపులా ఒకవైపు విద్యా తీర్థ వారి శిష్యులు భారతీ తీర్థ విద్యారణ్య, మిగిలిన మూడు వైపులా బ్రహ్మ విష్ణు మహేశ్వర రూపాలు చెక్కబడి ఉంటాయి. దీనిపై లక్ష్మీ నృసింహ, ఆపైన శివలింగం ఉంటాయి.

ఈ చతుర్మూర్తి విద్యేశ్వర శిల్పాన్ని చూసిన ఆచార్యులు భారతీ తీర్థతో తానూ మరొక 12 ఏళ్లలో యోగం వలన ఆ రూపాన్ని పొందుతానని చెప్పారు. అలాగే తుంగా నదికి ఉత్తర తీరాన ఒక లోతైన సమాధి త్రవ్వి ఆచార్యులవారు అందులో సమాధిస్థితులవ్వగానే పైన మూత వేసేశారు. మూడేళ్లు గడిచాక భారతీతీర్థ పర్యటనలో ఉన్నప్పుడు ఆచార్య స్వామి ఏమైపోయారోననే కుతూహలంతో శిష్యులు సమాధిని తవ్వి చూశారు. ఆచార్యుల శరీరం బదులు అక్కడ సింహగిరిలో ఉన్నట్లున్న ఒక శివలింగం కనిపించింది. భారతీ తీర్థ స్వామి తిరిగిరాగానే విషయం గ్రహించి అక్కడున్నవారిపై కోపం ప్రకటించి అది విద్యాశంకర లింగంగా భావించి అద్భుతమైన దేవాలయాన్ని నిర్మించి ఆలింగాన్ని ప్రతిష్ఠించారు. అప్పటినుంచి అది విద్యాశంకర మఠంగా పిలువబడుతోంది. శ్రీ విద్యాశంకరుల ఆధ్యాత్మిక తరంగాలు ఆప్రాంతమంతా వ్యాపించి జ్ఞాన బోధ చేస్తున్నాయని విశ్వసిస్తారు.❁

## 122) మధ్వ విజయ కర్త - నారాయణ పండితాచార్య -1240-1320

ద్వైతమత స్థాపనాచార్యులపై మధ్వ విజయం రాసిన నారాయణ పండితాచార్య శ్రీ మధ్వాచార్యుల ప్రత్యక్ష శిష్యుడు త్రివిక్రమ పండితా చార్య కుమారుడు. మధ్వ విజయం 16 సర్గల మహాకావ్యం. మధ్వాచార్యులు సమకాలీకులవటం వలన ఈ గ్రంథం మన విద్యారణ్యులవారి శంకర విజయంలాగా సాధికారమైనది. దీనికి ఆయనే "సుమధ్వ విజయ" వ్యాఖ్యానం రాశాడు. ప్రకాశిక అనే పేరు కూడా ఉంది. నారాయణ పండితాచార్య శివస్తుతి, 3 వేల శ్లోకాలతో సంగ్రహ రామాయణం, ప్రమేయ నవ మాలిక అనే "అనుమాధవ విజయం" కూడా రాశాడు. ఇది 32 శ్లోకాల మధ్వ సంగ్రహ చరిత్ర. దీనికి రాఘవేంద్ర స్వామి తమ పూర్వాశ్రమంలో వ్యాఖ్యానం రాశారు.

మణి మంజరి, శుభోదయకావ్యాలు కూడా ఈ కవి రాశాడు. మణి మంజరిలో మధ్వాచార్యులు ముందున్న వైష్ణవాచార్యుల చరిత్ర అంతా ఎనిమిది సర్గలలో సరళ సుందరంగా రాశాడు. ఈయన రచనన్నిటిపై విపులమైన వ్యాఖ్యానాలు చాలా వచ్చాయి. మధ్వాచార్యులు దశ ప్రకాశంపై నారాయణ పండితాచార్య ప్రసిద్ధ వ్యాఖ్యానం "విష్ణు తత్వ నిర్ణయ సారం" రాశాడు. ఈ టీకనే "తత్వ మంజరి" అంటారు. అందుకనే ఈయనకు "ప్రాచీన టీకాకారుడు" అని పేరు. కేరళలోని కాసర్ గోడ్‌లో ఇప్పటికీ ఆయన స్వగృహాన్ని చూడవచ్చు. దీనిని గౌరవంగా "కవి మఠం" అంటారు.❁

## 123) పార్శ్వ నాథ చరిత్ర కర్త - సాగర చంద్ర -1252-1276

నేమి చంద్ర శిష్యుడు మాణిక్య చంద్ర గురువు అయిన సాగర చంద్ర పార్శ్వనాథ చరిత్ర, కావ్య ప్రకాశం సంకేతం రాశాడు. ఇతనిని సాగరేందు అని గుణసాగరుని గురువని అంటారు.❁

## 124) ధర్మ శాస్త్ర గ్రంథ కర్త - శంభుకార వాజపేయి -1260-1330

ఒరిస్సాలో 12,13 శతాబ్దాలలో గంగ రాజులకాలంలో స్మృతికావ్యాలు బాగా వచ్చాయి. ఇక్కడే కాదు దేశమంతా గాంగేయ రాజ్యకాలంలో శాస్త్ర గ్రంథాలు విరబూశాయి. ఒరిస్సాను 1279-1303 కాలంలో పాలించిన గాంగేయరాజు రెండవ నరసింహ దేవ శంభుకార వాజ్ పేయి కవి సమకాలికుడు. రాజు నుంచి ఏ రకమైన పారితోషికాన్ని ఆశించని కవి వాజ్ పేయి. అయితే అమరమైన శాస్త్ర రచనతో చిరస్థాయి కీర్తి పొందాడు. శ్రద్ధా పద్ధతిలాగా సంస్కృత ధర్మశాస్త్రం రాశాడు. ఇదికాక విశ్వ పద్ధతి శంభుకార పద్ధతి, శ్రోతద్ధాన పద్ధతి, వివాహపద్ధతి, అగ్ని హోత్ర పద్ధతి, దశ పురాణం శేష్టి, దుర్వాల కర్మ పద్ధతి, స్మార్త రత్నావళి కూడా ఈయన రచనలే. ప్రత్యేక పరిస్థితులలో యోగధ్యానంతో 70వ ఏట 1330లో స్వచ్ఛందంగా శరీర త్యాగం చేశాడు.❁



## 125) విష్ణు పురాణ వ్యాఖ్యాత - విష్ణు చిత్తుడు -1280

రోహిణీ నక్షత్రంలో చైత్రమాసంలో విష్ణు చిత్తుడు జన్మించాడు. శ్రీభాష్యం భాగవత వైభవం ప్రవచనాలతో జీవితం గడిపాడు. విష్ణుపురాణం భాష్యం రాశాడు. ఇదికాక విష్ణు చిత్తీయం సారార్ధ చతుష్టయం, సంగతి మాసం రచించాడు. ఆండాళ్ అని పవిత్రంగా పిలువబడే మహాభక్తురాలు గోదాదేవికి పెంపుడు తండ్రి. గోదాదేవి "తిరుప్పావై" రచించిందని ఆమె తలలో ధరించిన హారాన్నే శ్రీ రంగ నాధుడికి సమర్పించి "చూడికోడుత్తు నాచ్చియార్" అంటే "ఆముక్తమాల్యద"గా గుర్తింపు పొందిందని, రంగనాధుని వలచి వలపింపజేసుకొని అర్ధాంగి అయిందని మనకు తెలిసిన విషయమే.❁

## 126) మల్లయుద్ధ పురాణ కర్త - జ్యేష్ఠ మల్ల -1300

మల్లయుద్ధం రామాయణ భారత కాలం నుండే ఉంది. దీనికి సంబంధించిన నీతి నియమాలు ప్రచారంలో ఉన్నాయి.. సిద్దార్ధ గౌతముడు కూడా గొప్ప మల్ల యుద్ధ విశారదుడు. 1124-1138 వరకు పాలించిన చాళుక్యరాజు మూడవ సోమేశ్వరుడు పండుగ పబ్బాలలో ఖాళీ సమయాలలో "మల్ల వినోదం" ఏర్పాటు చేసినట్లు ఆయనే రాసిన "మానసోల్లాసం"లో ఉంది. మల్లయోధులను వయసు బరువు, బలం ఆధారంగా విభజిస్తారని, వాళ్ళు ఎలా వ్యాయామం చేయాలో, ఏవి తినాలో కూడా వర్ణించాడు. రాజులే మల్లయోధుల బాధ్యత వహించి వారికి కావలసిన ఆహారపదార్ధాలు పాలు మాంసం పప్పు ధాన్యాలు సమకూర్చాలి. వారిని ఆడవారికి దూరంగా ఉంచి శరీరం రాటు దేలేట్లు బాడీ బిల్డింగ్ కోసం శిక్షణ నిప్పించాలి. మల్ల పోరాటంలో కదలికలు దెబ్బలు వగైరా అన్నీ చర్చించాడు రాజు.

అసలు మల్ల యుద్ధంపై ప్రత్యేక పురాణమే రాశాడు. 13వ శతాబ్దానికి చెందిన గుజరాత్ బ్రాహ్మణ మల్లయోధకవి జ్యేష్ఠ మల్లుడు. ఇందులో మల్లురలో ఉండే తేడాలు వారి ఆహారం, సాధన, చేయాల్సిన వ్యాయామాలు, పాటించాల్సిన టెక్నీక్‌లు కుస్తీ గోదా తయారు చేసేపద్ధతి కుస్తీ పట్టేవారు ఏ కాలంలో ఏయే పదార్ధాలు తినాలి అన్న అన్ని

విషయాలు ఇందులో జ్యేష్టమల్ల రాశాడు. ప్రథమాధ్యాయంలో ప్రారంభ శ్లోకం–

"ఏకస్మినన్ కమలాకటాక్ష వివరే సందగ్ధార్యతే – క్షీరాబ్దే రపరత్న దీర్ఘ ధవలైహ్ కల్లోలలోలాత్కరైః

వ్యగ్రస్యాపి సామార్ధితప్రమ నవ్యాపరాలబ్ధో దయా –శ్చత్వారో వితరంతు వాంఛిత ఫలం హరే ర్భగవః"

ధర్మా ధర్మ విదిహ్ ప్రోక్తో బ్రాహ్మన్ సమ్యక్ శ్రుతో మయ –విద్యాశ్చ వివిదాః స్వామిన్ వర్ణ భేదాసత్వనేకధా

మల్ల విద్యా త్వయా ప్రోక్తం మమ సంక్షేపతః పురో –విస్తరేణ మమ బ్రూహి తస్యాం కౌతూహలం హి మే

ఈ మల్లపురాణంలో నారద బ్రహ్మ కృష్ణ బలరామ, సోమేశ్వరుడు అనే బ్రాహ్మణుడుల మధ్య జరిగిన సంవాదం. వీరు తప్ప ఇంక ఎవరి పేరూ ఉండదు. చివరలో తాను కాశ్యప గోత్రీక బ్రాహ్మణుడనని చెప్పుకొన్నాడు కవి. ఇది 18 అధ్యాలున్న గ్రంథం. మొదటి అధ్యాయంలో కంసవధ తర్వాత కృష్ణాదులు ద్వారకకు ప్రయాణమవటం దారిలో శ్రీరాముడు తపస్సు చేసి బ్రాహ్మణులకు ఆవాసం కల్పించిన ధర్మారణ్యంలోని మయూరాంబలం పట్టణానికి రావటం, రెండవ అధ్యాయంలో గర్గ గోత్రీకుడు సోమేశ్వరుడు అడుగగా కృష్ణుడు మల్లయుద్ధాన్ని గురించి వివరించి అతనిని కూడా మల్లయోధుడవమని ప్రోత్సహించటం, ఆయన సందేహాలు అడగటం వాటిని కృష్ణుడు నివారించి మల్ల యుద్ధాన్ని గురించి బోధించటం, చివరి అధ్యాయంలో మల్లశాస్త్ర వివరణ తర్వాత బలభద్రుడు విసుగుతో అరణ్యానికి వెళ్లబోతుండగా ఆపటం మహేశ్వరి బ్రాహ్మి వైష్ణవి శక్తిలను సృష్టించటం సోమేశ్వరుడు మల్ల విద్యాభ్యాసం చేసి కృష్ణుడిని తనకు రక్షగా ఉండమనటం కృష్ణుడు రక్షణకోసం లంబాజాదేవి"ని సృష్టించటం మొత్తం కధాంశం.❁

## 1301–నుండి–1400 –14వ శతాబ్దం

## 127) సాంబ పంచాదశిక కర్త –సాంబ – 1315–1392

సూర్య స్తోత్రం అనే సాంబ పంచాశిక రాసిన సాంబ సూర్య ద్వాదశార్య, సూర్య సప్తార్యలకూ కర్త.❁



## 128) లల్లవాక్యాని కర్త –లల్లాదేవి –1320–1392

లల్లేశ్వరి, లల్లాదేవి, లాల్ దీదీ లల్ల యోగీశ్వరీ అని పిలువబడే 14వ శతాబ్ది సంస్కృత కవయిత్రి కాశ్మీర్ దేశానికి చెందినది. కాశ్మీర్ ప్రజల ప్రేమాభిమానాలు పొందిన యోగిని. "త్వమేవాహం" మంత్రంతో అందర్నీ మంత్రం ముగ్ధులను చేసింది. కులమతాలకు అతీతంగా వ్యవహరించి అందరి హృదయాలలో స్థానం సాధించింది. ఒక రకంగా కాలజ్ఞాని. ఆమె చెప్పిన కవితా ఖండికలను "లల్ల వాక్యాని" అంటారు. 14వ శతాబ్దపు సూఫీ పర్షియన్ యోగి సయ్యద్ ఆలీ హమ్మదానీకి లల్లాదేవి సమకాలీకురాలు.

లల్లాదేవి కాశ్మీర పండిత కుటుంబంలో శ్రీనగర్‌కు నాలుగు మైళ్ళ దూరంలో ఆగ్నేయభాగాన ఉన్న పంద్రే న్దన్‌లో 1320లో జన్మించింది. ఆమె పూర్వ జన్మలో కూడా ఇక్కడే జన్మించి అక్కడి కాశ్మీర పండితుని వివాహమాడినట్లు కథ ప్రచారంలో ఉంది. ఆ జన్మలో ఒక కుమారునికన్నప్పుడు 11వ రోజు బాలసార జరిపించటానికి వచ్చిన పురోహితుడు సిద్ధ శ్రీ కంఠునితో 'ఈ పిల్లాడికి నాకు సంబంధం ఏమిటి? అని ప్రశ్నించింది. ఆయన "వీడు నీ కొడుకు" అన్నాడు. ఆమె "కాదు" వీడు మళ్ళీ కొన్ని గుర్తులతో మరొక చోట నేను చెప్పిన తేదీనాడు నేను చెప్పిన గంటలకు పుట్టినప్పుడు అప్పుడు నేను ఈ ప్రశ్నకు సమాధానం చెబుతానని చెప్పి వెంటనే చనిపోయింది. పండితుడు వాడి పుట్టుక కోసం ఎదురు చూసి సరిగ్గా ఆమె చెప్పిన సమయానికి చెప్పిన చోట పుట్టిన గుర్రపు పిల్లను గుర్తించి మళ్ళీ ప్రశ్నిస్తే, తాను కుక్కపిల్లగా పుట్టినప్పుడు అడగమంటే అడిగితే, అదీ అదే సమాధానం చెబితే ఇక ఓపిక నశించి పండితుడు విచారించటం మానేశాడు. ఇలా ఆరుసార్లు జంతుజన్మ అనుభవించి ఏడవ జన్మలో లల్లాదేవిగా పుట్టి పూర్వజన్మలో తాను కన్న వాడినే వివాహం చేసుకొన్నది. ఆ పురోహితుడే వివాహ తంతు జరిపించాడు. పెళ్లి రోజున తన జన్మ రహస్యాన్ని ఆయనకు తెలియజేసింది. ఆమెకప్పుడు 12 ఏళ్ళు, పెళ్లికొడుకుకు యుక్త వయసు వచ్చింది. ఈ గాథ ప్రకారం లల్లాదేవికి పూర్వజన్మ స్మృతి గొప్పగా ఉందని అర్థమవుతోంది. బాల్యం నుంచే జీవితం వేడి పెనంమీద నీటి బిందువు అనే భావన ఏర్పడింది. పూర్వ జన్మలో ఆమె భర్త ఇప్పుడు మామగారయ్యాడు. లల్లాదేవి దాంపత్యం సవ్యంగా సాగలేదు. కష్టాల కడలిలో అంతూ దరీ లేకుండా గడిపింది.

దీనితో ఆమె మనసు దైవధ్యానంపై కేంద్రీకరించింది. అత్తగారు తిండికూడా

సరిగ్గా పెట్టేదికాదు. ఈ విషయం స్వయంగా చూసిన మామగారు ఆమె తినటానికి కంచంలో ఒక పెద్ద రాయి ముక్క తప్ప ఏమీ లేక పోవటం గ్రహించి మండి పడ్డాడు. కలిపించుకొందామంటే ఆమె గద్దరితనానికి ఝుడిశాడు. ఇలా 12 ఏళ్ళు లల్లాదేవి ఆ కొంపలో ఉండి తన జీవిత గమ్యానికి దారి వెతుక్కుంటూ ఇల్లు వదిలి వెళ్లి "సెడ్ బాయు" అనే శైవ గురువును చేరి ఉపదేశం పొందింది. ఈయన ప్రముఖ శివాచార్యుడైన సిద్ధ శ్రీ కంఠుడు అని గత జన్మలలో పరిచయమున్న వాడని కథనం. ఈయన పంపూర్ గ్రామవాసి అని ప్రసిద్ధ శైవాచార్యుడు వసుగుప్తుని శిష్యుడని అంటారు. గురువు కంటే పరిపూర్ణ జ్ఞానం కలదని వాద చర్చలలో గురువునే ఓడించి దెబ్బలు కొట్టేదని అంటారు.


చివరికి లల్లాదేవి శైవ యోగిని, బ్రహ్మ వాదిని అయింది. కాశ్మీర్ దేశపు వస్త్ర ధారణ వదిలేసి అర్ధ నగ్నంగా పర్యటిస్తూ, ఎవరేమన్నా పట్టించుకోక నిశ్చలమనసుతో దైవ ధ్యానంతో తిరిగింది. ఒకరోజు ఒక వస్త్ర వ్యాపారి ఆమెకు ఒక చీర ఇస్తే దాన్ని రెండుగా చింపి రెండు భుజాలమీద వేసుకొని వాటికి ముదులు వేసి మర్నాడు అదే కొట్టుకు వెళ్లి దాని బరువును చూడమంది. చీర అదే బరువు ఉంది. అప్పుడామె వాడితో "భూషణ దూషణలు సరి తూకంలో ఉన్నాయి" అని చెప్పింది. ఇదే వేదాంత ధోరణిలో ప్రశాంత జీవితం గడిపింది.

భక్తి తన్మయత్వంలో పాడుతూ నాట్యం చేస్తూ తిరిగేది. కాశ్మీర్ ప్రజలు ఆమెను తమగుండెల్లో పెట్టుకొన్నారు. శ్రీనగర్‌కు 25 మైళ్ళ దూరంలో బ్రీజ్ బీహార్ అనే చోట ముసలితనంలో 72వ ఏటా 1392లో లల్లాదేవి తనువు చాలించింది. ఆమె చెప్పిన "లల్ల వాక్యాని" అతిప్రాచీన కాశ్మీర సంస్కృత భాషలో ఉంటుంది. ఆమె కవిత్వంలో అనేక సామెతలు నుదులు దొర్లి ప్రవహించాయి. ఆ కవిత్వంలోని భావాన్ని కొంత తెలుసుకొందాం–

"నువ్వే స్వర్గం నువ్వే భూమి నువ్వే పగలు రేయి గాలి పుట్టిన ప్రతిదానిలో నువ్వున్నావు. నాలోని నువ్వు నేనూ ఒకటే నేనే నువ్వు నువ్వే నేను మనఇద్దరకు మృత్యువే లేదు. నరుడా అంతా ఆయనే. నువ్వే ఆయన ఆయనే నువ్వు ఎందుకీ భేదాలు వాదాలు?

"ఇయి కరు మ్ సూయే –ఇయి రాసిన విచారోమ్ థి మంత్ర–యిహోయి లగామోద హస్ పార్థున్ –సూయే పరశివామ్ తన్తార్ భావం– నేనేమి చేసినా అది దైవ కైంకర్యమే అవుతుంది ప్రభూ! నేనేది పలికినా అది నీప్రార్థనే అవుతుంది. ఈ శరీరం అనుభవించింది అంతా శైవ తంత్రమే అయి పరమ శివ మార్గాన్ని తేజోమయం చేస్తుంది .

1900 సంవత్సరానికి ముందు "త్రిక" అని పిలువబడిన కాశ్మీర్ మార్మిక శైవ సంప్రదాయం లల్లాదేవిది.❀



## 129) నరహరి యతి చరిత్ర కర్త - నరహరి తీర్ధ -1324-1333

మధ్వాచార్య శిష్యుడు, దాస సంప్రదాయ కర్త నరహరి తీర్ధ విజయనగర సామ్రాజ్య రాజగురువు, యతీంద్రుడు 1323లో జన్మించాడు. ఈయనది ఆంధ్ర దేశమేనని భావిస్తారు. పుర్వాశ్రమ నామం శ్యామ శాస్త్రి. కళింగ రాజుల మంత్రిగా 12 ఏళ్ళు ఉన్నానని "నరహరి యతి చరిత్ర"లో చెప్పుకున్నాడు. శ్రీకూర్మం, సింహాచలం దేవాలయ శాసనాలు ఆయన మంత్రిత్వాన్ని రుజువు చేస్తున్నాయి. కన్నడం వాడుకాకపోయినా ఆయన రచనలు కన్నడంలోనే ఎక్కువగా ఉన్నాయి. కళింగ ఆంధ్రలలో చాలామందిని మధ్వ మతంలోకి మార్చినట్లు ఆధారాలున్నాయి. ఆయన వారసులు ఇప్పటికీ సాగరాంధ్రలో ఉన్నారు. హరిదాసు ఉద్యమానికి ఈయనే ఆద్యుడు అంటారుకాని శ్రీపాద రాయలే ఆద్యుడని ఎక్కువమంది భావిస్తారు. కానీ యక్షగానాలు సృష్టికర్త నరహరి తీర్ధ మాత్రమే. అలాగే బాయలత నృత్యానికి ఆద్యుడు ఆయనే. ఈ సంప్రదాయం ఇప్పటికి కర్ణాటకలో కేరళలోని కాసర్ గోడ్ ప్రాంతంలో ఉన్నాయి. ఈయన కృష్ణాజిల్లా శ్రీకాకుళంలో ఆంధ్ర మహా విష్ణువు వెలసిన చోట మఠాధిపతిగా ఉన్నాడని కూచిపూడి నృత్య ప్రదాత అని ప్రచారంలో ఉంది. సంస్కృతంలో "దసరాపదాలు" రాశాడు.❁

## 130) విద్యాచార పద్ధతిధర్మ శాస్త్రకర్త - విద్యాకార వాజపేయి -1330

శంభుకార వాజ పేయి కుమారుడు విద్యాకార వాజ పేయి తండ్రిని మించిన శాస్త్ర జ్ఞాన సంపన్నుడు. నిత్యాచార పద్ధతి అనే శాస్త్ర గ్రంథం రాశాడు. తరువాత ఇదే "విద్యాచార పద్ధతి"గా బహుళ ప్రచారం పొందింది. ఒరిస్సా ధర్మ శాస్త్రాలలో ఇది ఎవరెస్టు శిఖరాయమానం. 1360 కవి విశ్వర భట్టు తన "మదన పారిజాతం"లో దీనిని అపూర్వంగా శ్లాఘించాడు.❁

## 131) భారతీ తీర్థ -1333-1380

"అజ్ఞానం జాహ్నవీ తీర్థం విద్యాతీర్థం వివేకినం -సర్వేషామ్ సుఖదం తీర్థం భారతీ తీర్థ మాశ్రయే"

వరంగల్‌కు చెందిన శ్రీ భారతీ తీర్థ స్వామి శ్రీ విద్యారణ్యస్వామికి తమ్ముడు. శ్రీ విద్యా తీర్థ తర్వాత 11వ శృంగేరి జగద్గురువులయ్యారు. 47ఏళ్ళు అంటే 1380 వరకు పీఠాధిపత్యం వహించారు. ఈ కాలం అత్యంత చిరస్మరణీయమైనదిగా భావిస్తారు. వీరితర్వాత జగద్గురువులైన శ్రీ విద్యారణ్యుల కాలంలోనే విజయనగర రాజ్యస్థాపన 1336లో జరిగింది. ఆది శంకరాచార్యులు శృంగేరి మఠంలో ప్రతిష్టించిన గంధపు చెక్క శారదా విగ్రహాన్ని మార్చి స్వర్ణ శారదా విగ్రహాన్ని ప్రతిష్టించినది శ్రీ భారతీ తీర్థ స్వామియే. ఈ కాలంలోనే విద్యా శంకర దేవాలయ నిర్మాణము జరిగింది. 1336లో హరిహరరాయల తమ్ముడు మారెప్ప అల్లుడు బాలప్పలు శృంగేరినీ దర్శించి జగద్గురువుల తపధ్యానాల కోసం 9 గ్రామాలను రాసిచ్చారు. 40 మంది బ్రాహ్మణులను సేవకులుగా ఏర్పాటు చేశారు. ఈ భూమిని శ్రీ విద్యాశంకర దేవాలయ ప్రతిష్ఠనాడు శ్రీ భారతీ తీర్థ 120 బ్రాహ్మణ కుటుంబాలకు అందజేసి వారక్కడ స్థిరపడేట్లు చేశారు. దీనితోనే శృంగేరి పట్టణ నిర్మాణం ప్రారంభమైంది. 120 మంది వేదశాస్త్ర విద్యావేత్తలకు కూడా ఆవాస భూమిని శ్రీ భారతీతీర్థ అందజేశారు.❁

## 132) సింహ తిలక సూరి - 1345-1395

ధర్మ ప్రభ సూరి శిష్యుడు, మహేంద్ర ప్రభ గురువు అయిన సింహ తిలక సూరి అంచలగచ్ఛ ఆశ్రమవాసి. అంచల గచ్ఛ పత్రావళి ఉన్నదాని ప్రకారం 1345లో పుట్టి, 1352లో దీక్ష పొంది 1371లో ఆచార్యుడై 1393లో గచ్ఛ నాయకుడై 1395లో చనిపోయాడు.❁

## 133) లోచన వ్యాఖ్యాత - అనంత దాసు -1350

సాహిత్య దర్పణం కర్త విశ్వనాధ కవిరాజు కపింజల గోత్రుడు. తండ్రి చంద్ర శేఖరుడు ఛందోవేత్త, కవి 14 భాషలలో ప్రవీణుడు. ఒరిస్సా గజపతిరాజుల ఆస్థానకవి. విశ్వనాధుని కుమారుడు అనంత దాసు తండ్రి రాసిన సాహిత్య దర్పణంకు "లోచనం" అనే వ్యాఖ్యానం రాశాడు. ఇందులో తన తండ్రి ప్రతిభను "కపింజల వంశ పయోనిధి రాకా చంద్రుడు, త్రికళింగ పాలకుని అమాత్యుడు, పలుభాషా కోవిదుడు, సాహిత్య పారావారాన్ని తరింపజేసే మార్గదర్శి, ధ్వని సిద్ధాంత నాయకమణి 18 భాషలలో దిట్ట, అన్నిటికి మించి మహాకవి" అని తెలిపాడు. అనంత దాసు తన తండ్రి విశ్వనాథుడు విజయ నరసింహునిపై ఒక గ్రంథాన్ని రాశాడని చెప్పాడు - "ఆహవే జగదుద్దండ రాజా మండల రాహవే -శ్రీ నృసింహపాల స్వస్త్యస్తు తవ బాహవే". బహుశా ఈ పద్యం ఆ గ్రంథంలోనిదే అయి ఉండవచ్చు.❁

## 134) మహాకవులైన విశ్వనాధ కవిరాజు తాత, చిన తాత తండ్రి - (1350)

విశ్వనాధుని కపింజల వంశం ఒరిస్సాలో సాహిత్య వ్యాసంగానికి ప్రసిద్ధి చెందింది. విశ్వనాధుని తాత నారాయణ దాసు జయదేవుని గీత గోవిందంకు "సర్వాంగ సుందరి" వ్యాఖ్య రాశాడు. నారాయణ దాసు తమ్ముడు చండీదాసు "కావ్య ప్రకాశానికి" "దీపికా" అనే వ్యాఖ్యానం, "ధ్వనిసిద్ధాంత సంగ్రహం"లు రాశాడు. చండీ దాసు పెదనాన్న కూడా బహు గ్రంథకర్త.

విశ్వనాధుని తండ్రి 14 భాషలో ప్రసిద్ధుడు. "పుష్పమాల", "భాషార్ణవం" గ్రంథాలు రాసి నాట్లు సాహిత్య దర్పణంలో ఉంది. ఈయన రాసిన ఒక పద్యంలో "ఉమా వల్లభ" అనే పదం ఉన్నట్లు సాహిత్య దర్పణంలో ఉల్లేఖితమైంది. దీనికి రెండు అర్ధాలు ఉమాపతియైన శివుడు, ఉమా అనే రాణికి భర్త అయిన భామదేవ రాజు. ఇతడే మూడవ భానుదేవుడు 1352-1378 వరకు పాలించాడు.❁

## 135) యతి రాజ వింశతి కర్త - మనవాల మాముని -1370-1450

1370లో జన్మించి 1443లో మరణించిన మనవాల మాముని తమిళనాడు కేదారంలో జన్మించి ప్రబంధాలకు మొదటి వ్యాఖ్యాత అయ్యాడు. తండ్రి వద్దే వేద వేదాంగ శాస్త్రాలు నేర్చాడు. ద్రావిడ వేదాన్ని అభ్యసించాడు. ఎల్లలు లేని అనంత విజ్ఞాన ఘనుడయ్యాడు. వివాహం చేసుకొని వైష్ణవ సంప్రదాయాన్ని చక్కగా పాటించాడు. ఆళ్వార్ తిరునగరి చేరి తిరువాయ్ మోజేహి పిళ్ళై శిష్యుడయ్యాడు. రామానుజులపై విపరీత భక్తియున్న శిష్యుడిని చూసి గర్వపడిన గురువు ఆయనకు ఒక దేవాలయాన్ని తిరునగరిలో నిర్మించాలని భావించి బాధ్యత మామునిపై పెట్టాడు. ఈ సమయంలోనే మాముని 20 సంస్కృత శ్లోకాలతో "యతి రాజ వింశతి" రామానుజులు స్తుతిస్తూ రచించాడు. గురువు అబ్బురపడి "యతీంద్ర ప్రవరనార్" బిరుదును ప్రదానం చేశాడు. గురు మరణం తర్వాత ముని కుటుంబంతో శ్రీరంగం చేరి వానమామలై జియ్యర్ శిష్యుడై అందరి అభిమానం పొంది ఆలయ పూజాదికాలను రామానుజ విధానంలో సంస్కరించాడు. పూర్వపు ఆచార్యుల గ్రంథాలను సేకరించి నకళ్ళు రాయించి భద్రపరచాడు. కంచి, శ్రీ పెరుంబుదూర్, తిరుపతి సందర్శించి కంచిలో కిలాంబి నాయనారు వద్ద శ్రీ భాష్యం చదివాడు. శ్రీరంగం తిరిగివచ్చి గృహస్థ జీవితానికి స్వస్తి చెప్పి సన్యాసం స్వీకరించి, ఆలయ విషయాలలో దృష్టిపెట్టాడు. రామానుజాశ్రమానికి మరమ్మతులు చేయించి, పిళ్ళై లోకాచార్య విగ్రహం దేవాలయంలో నెలకొల్పాడు.

1430 ప్రాంతంలో శ్రీ రంగనాధస్వామి ఉత్సవాలను ఒక ఏడాదిపాటు ఆపేసి నమ్మాళ్వార్ రచించిన తిరుమొయిపై దానికున్న 5 వ్యాఖ్యాలనాధారంగా మలవాల మాముని ప్రవచనం ఏర్పాటు చేశారు. ప్రవచనం పూర్తయ్యాక చివరి రోజున శ్రీరంగ నాధుడే స్వయంగా బాలునిగా వచ్చి మాముని పాదాల చెంత ఒక కాగితం పెట్టాడు. అందులో ఉన్న శ్లోకమే "మలవాల మాముని తనియన్"గా సుప్రసిద్ధమైంది- ఆ శ్లోకం- "శ్రీశైలేశ దయాపాత్రం ధి -భక్త్యాది గుణార్ణవం -యతీంద్ర ప్రవణమ్ వందే రమ్య -జా మంత్రం మునిమ్" భావం- శైలేంద్ర శిష్యుడు, రామానుజునిపై అవ్యాజమైన గౌరవమున్న బుద్ధి వివేకం భక్తి గుణ సముద్రుడు అయిన మనవాల మాముని ప్రవచనానికి శ్రీ రంగనాధుడు ప్రశంసించి ఇస్తున్న నమస్కారం. దీనితో శ్రీరంగనాథునికే ముని గురువైపోయాడని అర్థం. ముని "ఆచార్య హృదయం"కు గొప్ప వ్యాఖ్యానం రాశాడు. ❀

## 136) ఉపనిషత్తులపై "దీపిక"లు రచించిన - శ్రీ శంకరానందేశ్వర సరస్వతి - (1385-1417)

కామకోటి 52వ పీఠాధిపతి శ్రీ శంకరానందేశ్వర సరస్వతి మధ్యార్జున లేక తీరు విడై మరుదూర్‌లో బాలచంద్ర కుమారునిగా మహేశ నామధేయంతో జన్మించారు. పీఠాధిపతి కాకముందు గురువు భారతీ తీర్థతో హిమాలయ పర్యటన చేశారు. కర్ణాటకలో 8 కొత్త అద్వైత మఠాలను స్థాపించిన ఘనకీర్తి వారిది. ఈశ, కేన, ప్రశ్న, బృహదారణ్యక ఉపనిషత్తులకు "దీపిక" వ్యాఖ్యానం రచించారు. 'ఆత్మపూర్ణ'ను, భగవద్గీత వ్యాఖ్యానాన్ని రచించారు. వైష్ణవ, మాధ్వులు అద్వైతంపై చేసిన వ్యతిరేక ప్రచారాన్ని తీవ్రంగా ఖండించి ఎదురు నిలిచారు. కంచిలో ముక్తి పొందారు.❀



## 137) కాశ్మీర్ సర్వజ్ఞ శారదా శక్తిపీఠం (1400)

ఆజాద్ కాశ్మీర్‌లో నీలం నది ఒడ్డున శారదా గ్రామంలో శారదాదేవి శక్తిపీఠ ఆలయం ఉంది. కాశ్మీర్ వేద వేదాంత శాస్త్ర విద్యలకు ప్రముఖ స్థానం. అందుకే కాశ్మీర్‌కు 'శారదా దేశం' అని పేరు. అక్కడ కొలువైయున్న సరస్వతీ మాతయే శారదాంబ. ఆమెను "కాశ్మీర పూర్వ వాసిని" అంటారు. కాశ్మీర ప్రజలు నిత్యం ఈ శక్తి పీఠాన్ని సందర్శించి "నమస్తే శారదా దేవీ కాశ్మీర పురవాసినీ -త్వం హం ప్రార్థయే నిత్యం విద్యాదానం చ దేహిమే" అని భక్తితో స్తోత్రం చేస్తారు.

14వ శతాబ్దానికి ఈ ఆలయం చాలాసార్లు శిధిలమైంది. 19వ శతాబ్దంలో కాశ్మీర్ రాజు మహారాజా గులాబీసింగ్ ఈ ఆలయాన్ని చివరిసారిగా మరమ్మత్తులు చేశాడు. 1948లో ఇండియా పాకిస్తాన్ యుద్ధం ఈ ప్రాంతంలో జరిగి ఈ ప్రాంతం

“ఫస్తూ న్” తెగల ఆక్రమణకు గురై వాళ్ళ అధీనంలో ఉండిపోయింది. తర్వాత ఇది పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ వశంలో ఉన్నది. దీనికి తోడు 2005లో జరిగిన అతిపెద్ద భూకంపంలో ఈ ప్రాంతం దేవాలయం చాలా శిధిలమైపోయింది. అప్పటి నుంచి ఇది మరమ్మత్తులకు నోచుకోలేదు. పాకిస్తానీ హిందువులు అరుదుగా ఈ దేవాలయాన్ని సందర్శిస్తారు. దీనికంటే వాళ్ళు సింధు బలూచిస్తాన్ పంజాబ్ ప్రాంతాలను సందర్శించటానికి ఇష్టపడతారు. అందుకే “కటాస్ రాజ్” దేవాలయానికిచ్చిన ప్రాధాన్యాన్ని పాక్ ప్రభుత్వం దీనిపై చూపటం లేదు.

సతీదేవి శరీర భాగాలు 51 ఎక్కడ పడ్డాయో అక్కడ శక్తి పీఠాలు కాలభైరవ దేవాలయాలు వెలసిన సంగతి మనకు తెలుసు. ఇక్కడ అమ్మవారి కుడి చేయిపడి శారదా శక్తి పీఠమైంది. 18 మహా శక్తిపీఠాలలో ఇది ఒకటి. ఇక్కడ విద్యా దేవతగా శక్తిని ఆరాధిస్తారు అందుకే శారదా పీఠం అయింది. ఈ దేవాలయం బారాముల్లాకు 60 మైళ్ళు, ముజఫర్‌బాద్‌కు 40 మైళ్ళ దూరంలో నీలం లోయలో శారదా అనే కుగ్రామంలో ఉంది. ఇది “లైన్ ఆఫ్ కంట్రోల్”కు వాయవ్య భాగంలో 16 మైళ్ళ దూరంలో ఉంది. ఒకప్పుడు ఈ ప్రాంతం సంస్కృత విద్యకు కాశ్మీరీ పండితులకు గొప్ప ఆవాసభూమి. హిందూ బౌద్ధాలు చక్కగా విలసిల్లిన భూమి. 1277-78 కాలపు జైనుల చారిత్రక గ్రంథం “ప్రభావక చరిత్ర” ప్రకారం ఇక్కడ భద్రపరచబడిన వ్యాకరణ గ్రంథాలను చదివి శ్వేతాంబర జైనుడైన హేమచంద్రాచార్య తన “సిద్ధాంత హేమ” వ్యాకరణ గ్రంథం రాశాడు. భగవద్రామానుజా చార్యులు శ్రీరంగం నుంచి ఇక్కడికి వచ్చి ఇక్కడున్న బ్రహ్మ సూత్రాలపై బోధాయనుడు రాసిన వృత్తిని పరిశీలించి తాము “బ్రహ్మ సూత్ర భాష్యం” అనే “శ్రీ భాష్యం” రాశారు. శారదా దేవాలయం ప్రక్కన సంస్కృత విశ్వ విద్యాలయం ఉండేది. క్రీ.శ 632లో చైనా యాత్రికుడు హుయాన్ సాంగ్ దీన్ని సందర్శించి రెండేళ్లు అధ్యయనంలో గడిపి దీనికున్న చారిత్రిక సాంస్కృతిక వైభవాన్ని ప్రస్తుతించారు.

కాశ్మీర్ శారదా పీఠాన్ని సర్వజ్ఞ పీఠం అంటారు. ఎన్నో అర్హతలున్నవారు మాత్రమే దీనిని అధిరోహిచగలరు. భగవాన్ శంకర భగవత్పాదులు ఇక్కడికి వచ్చి అన్ని మతాల వాదాల వారినీ వాదంలో జయించి సర్వజ్ఞ పీఠం అధిరోహించారు. ఇది అతిప్రాచీన ఆలయము, పీఠమూ. సముద్ర మట్టానికి 11000 అడుగుల ఎత్తున ఉన్నది. భారత ప్రభుత్వాధీన కాశ్మీర్‌కు ఇది వేసవి విడిది. శారదాలయం 142 అడుగుల పొడవు 95 అడుగుల వెడల్పులో వెలుపలి గోడలు 6 అడుగుల వెడల్పు 11 అడుగుల పొడవుగా ఉంటాయి. 8 అడుగుల ఎత్తులో ఆర్చీలుంటాయి. శృంగేరిలో శ్రీ శంకరాచార్య స్వామి ప్రతిష్ఠించిన గంధపు చెక్కతో చేయబడిన శారదాదేవి విగ్రహాన్ని

ఇక్కడి నుండే తీసుకు వెళ్లారని అంటారు.

1148కి చెందిన కల్హణ మహాకవి శారదా దేవాలయం గురించి వర్ణించాడు 8వ శతాబ్దంలో కాశ్మీర్ రాజు లలితాదిత్యుని కాలంలో బెంగాల్ ప్రభువు గౌడరాజు అనుయాయులు శారదాదేవిని దర్శించారని, శంకరాచార్యులవారి "ప్రపంచసారం"లో శారదా దేవి స్తుతి ఉందని ఇక్కడే రాసి ఉంటారని అంటారు. 1030లో ఈ దేవాలయాన్ని సందర్శించిన "అల్ బరూని" అనే చరిత్రకారుడు శారదాదేవి విగ్రహం గంధపు చెక్క–చందన చెక్కతో చేయబడి ఉందని, చెప్పి ఈ ఆలయాన్ని ముల్తాన్ సూర్య దేవాలయం, దానేశ్వర్ లోని విష్ణు చక్రస్వామి దేవాలయం, గుజరాత్‌లోని సోమనాథ దేవాలయంతోను పోల్చి చెప్పాడు. 16వ శతాబ్దంలో అక్బర్ చక్రవర్తి ఆస్థాన నవరత్నాలలో ఒకరైన అబుల్ ఫజల్ కవి ఈ దేవాలయాన్ని వర్ణిస్తూ ఇది మధుమతి నది అంటే నేటి నీలం నది ఒడ్డున ఉందని, ఆలయం బంగారంతో ధగధగా మెరుస్తూ ఉంటుందని ప్రతి శుక్లపక్షం అష్టమినాడు ఇక్కడ అద్భుతాలు జరుగుతాయని రాశాడు.

ఇంత గొప్పగా చరిత్రలో వెలిగిపోయిన శారదాలయం 14వ శతాబ్దంలో మొదటిసారిగా ముస్లింల దాడికి గురైనది. ఆ తర్వాత ఈ ఆలయం ఈ ప్రాంతం, కృష్ణ గంగతో సంబంధం పూర్తిగా భారతదేశపు అధీనం నుంచి తప్పిపోయింది. 19వ శతాబ్దపు డోగ్రారాజు శారదాలయాన్ని పునరుద్ధరించారు. తర్వాత మళ్ళీ మామూలే. ఈ ఆలయాన్ని, అమ్మవారిని ప్రముఖ కర్ణాటక వాగ్గేయకారుడు ముత్తుస్వామి దీక్షితులు కళావతీ కమలాసనా, యువతీ కీర్తనలో ఘనంగా కీర్తించారు. "శాండిల్య మహర్షి ఈ దేవాలయం ప్రక్కన శారదా వనంలో తపస్సు చేశాడు. ఆలయం ప్రక్కనే అమర కుండ్ సరస్సు ఉండే. శాండిల్య మహర్షి తపస్సుకు శారదాదేవి ప్రత్యక్షమైంది. కాశ్మీర్ ప్రజల స్థానిక లిపిని అమ్మవారి పేరుతోనే "శారదాలిపి" అని భక్తిగా చెప్పుకొంటారు. ఉగ్రవాదుల దాడులలో అట్టుడికి పోయిన కాశ్మీర్ నుండి కాశ్మీర్ పండితులు వలస పోయారు. 2007లో కొందరు పండితులు ఆజాద్ కాశ్మీర్ లోని శారదా దేవాలయాన్ని చూడటానికి వెడితే అనుమతించలేదు. అదీ మన చదువుల తల్లి శారదా మాతకు పట్టిన దుర్భర పరిస్థితి. మాటల గారడీ చేసే మోడీ కూడా దీనిపై శ్రద్ధ పట్టకపోవడం, ఇదేకాదు తన గుజరాత్ రాష్ట్రంలోని సముద్ర గర్భంలో ఉన్న ద్వారక పట్టణంపై కూడా దృష్టి సారించకపోవడం బాధగా ఉంది. ఒకప్పుడు వైభవంగా ఉన్న శారదా దేవాలయ సర్వజ్ఞ శక్తి పీఠం నేడు శిధిలాలుగా చూస్తుంటే కడుపు తరుక్కు పోతుంది.❋




## 138) భాగవత భావార్థ దీపిక కర్త - శ్రీధర స్వామి -1400

ఒరిస్సాలోని పూరీ జగన్నాధ క్షేత్ర గోవర్ధన మఠ మహంతు శ్రీ శ్రీధర స్వామి క్రీ.శ 1400 కాలం వారు భాగవత పురాణానికి "భాగవత భావార్థ దీపిక" అనే సంస్కృత వ్యాఖ్యానం రాశారు. అది దేశమంతా బహుళ ప్రచారంలో ఉంది. ఇందులో అద్వైతాన్ని భాగవత భావోద్రేకాలు అనుసంధానం చేస్తూ రాశారు. వీరు మూడవ లేక నాల్గవ నరసింహ దేవరాజు కాలంలో ఉండి ఉంటారు (1307-1414).❋

## 139) హంస సందేశ కావ్య కర్త -పూర్ణ సరస్వతి -1400

కేరళకు చెందిన 14వ శతాబ్దపు కవి పూర్ణ సరస్వతి -పూర్ణ జ్యోతిష్యుని శిష్యుడు. ఉత్తర మలబార్‌లోని కాట్టుమటం ఇల్లాంకు చెందినవాడు. పూర్ణ సరస్వతి వంశాన్ని పరశురాముడు ఆశీర్వదించినట్లు ఐతిహ్యం. అనేక శాస్త్రాలలో విస్తృతపాండిత్యం కవిత్వ రచనలో మేటి అవటం వలన ఆయనకు పూర్ణ సరస్వతి అనేది బిరుదుగా లభించిన పేరు. కావ్యంలో పూర్వభాగం, ఉత్తరభాగం అని రెండు విభాగాలున్నాయి. మొత్తం 102 శ్లోకాలు. కాంచీపురంలో ఒక కన్య ఒక ఉత్సవంలో శ్రీ కృష్ణుని మోహన రూపం చూసి మనసు పారేసుకొన్నది. ఒక హంసతో తన మనోభావాలను బృందావన కృష్ణునికి సందేశంగా పంపటం ఇతి వృత్తం. రాయబారి హంస చేర, పాండ్య దేశాలు చూస్తూ కావేరి, కాళింది, తామ్రపర్ణిలను దాటి తిరువనంతపురం వగైరాలను చూస్తూ బృందావనం చేరింది వీటినన్నిటిని కవి చక్కగా అందంగా వర్ణించాడు. తిరువాన్కూర్ రాజు సర్వకళా వల్లభ వంశీష. ఆయన బలపరాక్రమాలు వర్ణించాడు. బహుశా ఈ రాజు స్వాతి తిరుణాల్ రామవర్మ కావచ్చును. ఆయన రాజరికానికి వచ్చిన 1829-46 కాలంలో ఈ కావ్య రచన చేసి ఉండాలి. ఇందులో సుచీన్ద్రంలోని ప్రసిద్ధ "కై ముక్కు" అంటే వేడి నేతిలో చేయిపెట్టటం కూడా వర్ణితం. దోషి ఎవడైనా శుచీన్ద్రాలయంలో వేడి నేతిలో చేయి పెట్టించి దోషి అవునోకాదో నిర్ణయిస్తారు. దోషి అయితే చేయి కాలిపోతుంది. లేకపోతే ఏమీ కాదు. కావ్యంలో దేవదాసి వ్యవస్థ వర్ణన కూడా ఉన్నది. తామ్రపర్ణి నదీతీర బ్రాహ్మణ అగ్రహారాలు స్నానఘట్టాలు ప్రకృతి సౌందర్యం వర్ణన కూడా కనిపిస్తుంది. బ్రాహ్మణులను భూదేవతలు అని వర్ణించాడు కవి.❋

## 1401-నుండి 1500 -15వ శతాబ్దం

## 140) భ్రమర గీత కర్త - శ్రీ పాద రాజు -1404-1502

కర్ణాటకలో హరిదాస ఉద్యమ పిత. విజయనగర సామ్రాజ్య రాజగురువు కూడా. లక్ష్మీ నారాయణ తీర్థ అనీ అంటారు. కర్ణాటక చెన్నపట్న తాలూకా అబ్బూరులో జన్మిచాడు. ఆయనను ధ్రువుని అవతారంగా భావిస్తారు. ద్వైత, హరిదాసు సాహిత్యానికి, రాజకీయ సాంస్కృతిక మార్పులకు ఆయన అసమాన కృషి చేశాడు. ఒకసారి స్వర్ణ వర్ణ తీర్థ స్వామి అబ్బూరు వచ్చి బాల లక్ష్మీ నారాయణను అబ్బూరు ఎంత దూరం అని అడిగితే, తెలివిగా "అస్తమయ సూర్యుని చూస్తున్నారుకదా. మేము ఇక్కడ ఆడుతున్నాం కదా. యెంత దూరమో మీరే ఊహించండి" అన్నాడు. అంటే చీకటి పడుతుంటే ఇంటికి వెళ్ళటానికి మాకు ఎక్కువ సమయం పట్టదు కదా అంతతక్కువ దూరం అనే భావంతో చెప్పాడన్నమాట. స్వాములవారు ఈ బాలుడు గడుసు పిండమేనని గ్రహించి, తన శిష్యుడిని చేసుకొని సన్యాసమిప్పించి ఉత్తరాధికారిని చేశాడు.

శ్రీపాద రాజ తీర్థ పీఠాధిపతి అయి విజయనగర రాజులు చేసిన బ్రాహ్మహత్యా దోషాలను నివారించాడు. సంస్కృత, కన్నడ భాషలలో గొప్ప పండితుడై చాలా గ్రంథాలు రాశాడు. భ్రమర గీత, వేణుగీత, గోపీ గీత, మాధవ నామ సంస్కృత రచనలు బహుళ వ్యాప్తి పొందాయి. ఆయన తన భక్తి గీతాలను "దేవర నామాలు" అని చెప్పి పాడేవాడు. తన సంతకాన్ని "రంగ విఠల" అని చేసేవాడు. ఆయన రాసిన భక్తిగీతం "భూషణకే భూషణ" అందరి నాలుకలపై నర్తిస్తుంది. కోలార్ జిల్లా ముల్ బగాయ్ తాలూకా నరసింహ తీర్థలో ఆయన "బృందావనం"ను లక్షలాది భక్తులు దర్శిస్తారు.



## 141) సంస్కృత సంకీర్తనాచార్య - అన్నమాచార్య -1409-1503

పద కవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులు 32 వేల సంకీర్తనలు రచించినా లభ్యమైనవి 12 వేలు మాత్రమే. అందులో శృంగార భక్తి జ్ఞాన నీటి ధర్మ వైరాగ్యభావాలను చక్కని తెలుగుపదాల పోహళింపుతో రాసి సొగసు తెచ్చాడు. తిరుమల శ్రీ వెంకటేశ్వర పాద పద్మ భృంగమై అందులోని మకరందాన్ని గ్రోలి మనకు అందించిన సంకీర్తనాచార్యుడు. కులమతాలకు అతీతమైన భావవ్యాప్తి చేసిన సంస్కారి. "బ్రహ్మ మొక్కటే పరబ్రహ్మ మొక్కటే" అని ఎలుగెత్తి చాటిన వేదోపనిషత్ వ్యాఖ్యాత. "ఏ కులజుడైన నేమి ఎవ్వడైన నేమి" అని అందరూ ఒక్కరే నన్న వసుధైక భావన వ్యాప్తి చేసైనా పూర్ణ ప్రజ్ఞుడు. పదకవితా సాహిత్యానికి పట్టాభిషేకం చేసి పదకవితా శారదను బంగారు పల్లకిలో ఊరేగించినవాడు అన్నమయ్య. కలకండ తెలుగుకు మరింత తియ్యదనాన్ని అందించినవాడు. సర్వధారి సంవత్సర వైశాఖ శుద్ధ పౌర్ణమి 22-5-1409న ఈనాటి కడప జిల్లాలోని తాళ్ళపాకలో జన్మించి, 95వ ఏట, దుందుభి నామ సంవత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశి 4-5-1503న శ్రీ వెంకటేశ్వర పద సన్నిధికి చేరిన పుణ్యాత్ముడు. భార్య తిక్కమ్మ "సుభద్రా కళ్యాణం" రాసిన తొలి తెలుగు కవయిత్రి. కొడుకు పెద తిరుమలాచార్యుడు, మనవడు చిన్నయ్య కూడా కవులే. కర్ణాటక సంగీత కూర్పుకు పదకవితలతో ఒక సంచలనం సృష్టించినవాడు అన్నమయ్య. సంకీర్తనాచార్యుడయిన అన్నమయ్య సంస్కృతంలోనూ కీర్తనలు రాసి తన గీర్వాణ పాండిత్యాన్ని ప్రకటించాడు. సుమారు వంద సంస్కృత కీర్తనలు రాసినట్లు తెలుస్తోంది. అందులో కొన్నిటి గురించి తెలుసుకుందాం-

1-పృథుల హేమ కౌపీనధర-ప్రథిత వత్సమే బలం పాతు
సూపాసక్తః సుచి శ్చు లభః-కోప విదూరహ-కులా ధికః

పాపభంజకహ పరాత్పరోయం -గోపాలో మే గుణం పాతు
తరుణః చక్రీ దందా కమండలు-ధర పవిత్రీ దయా పరః
సురాణాం సంస్తుతి మనోహరః -స్థిర శ్చు ద్ధిర్మే ధృతిం పాతు
త్రివిక్రమః శ్రీ తీరు వెంకట గిరి -నివాసోయం నిరంతరం
ప్రవిమల మస్పృణ కబళ ప్రియోమే -దివా నిశాయాం థియమ్ పాతు"
-వామన మూర్తిపై కీర్తనయుడి దీన్ని లతా మంగేష్కర్ పాడారు.
2-భావయామి గోపాల బాలం మనస్సేవితం తత్పదం చింత ఏయం సదా-
కటి ఘటిత మేఖలా ఖచిత మని ఘంటికా -పాతాళ నినాదేన విభ్రాజమానం
కుటిల పద ఘటిత సంకుల శింజితేన తం -చేతుల నటనా సముజ్వల విలాసం
నిరత కర కలిత నవనీతం బ్రహ్మాది సుర నికర భావనా శోభిపదం
తిరు వేంకటాచల స్థితం అనుపమమ్ హరిం -పరమ పురుషం గోపాలబాలం-

మరో కీర్తన చూద్దాం-
3-దేవ దేవం భజే దివ్య ప్రభావం -రావణాసుర వైరి రవి పుంగవం
రాజవరం శేఖరం రవి కుల సుధాకరం -ఆజానుబాహు నీలాగ్రకాయం
రాజారి కోదండ దీక్షా గురుం -రాజీవ నేత్రం రామచంద్రం, రామం
నీల జీమూత సన్నిభ శరీరం -విశాలవక్షం నిబాల జలజ నాభం
కాలాహి నాగ హరమ్ ధర్మ సంస్థాపనం -గో లలనాధిపమ్ భోగి శయనం రామం
పంకజాసన వినుత పరమ నారాయణం -శంకరార్జిత జనక చాప దళనం
లంకా విశోషణం లలిత విభీషణం వెంకటేశం సాదు వినుత వినుతం రామం

మరో ఆణిముత్యం-
4- మాధవ కేశవా మాధవ విష్ణో శ్రీధరా- పదనఖం చిన్తయామి యూయం
వామన గోవిందా వాసుదేవ ప్రద్యుమ్న -రామరామ కృష్ణ నారాయణాచ్యుత
దామోదరానిరుద్ధదైవ పుండరీకాక్ష -నామాత్రయాధీశ నమోనమో
పురుషోత్తమ పుండరీకాక్ష -దివ్య హరి సంకర్షణ అధోక్షజ
నరసింహ హృషీ కేశ నగధర త్రివిక్రమ- శరణాగత రక్ష జయ జయ సేవే
మహిత జనార్దనా మత్స్య కూర్మ వరాహో -సహజ భార్గవ బుద్ధ జయ తురగ కల్కి
విహిత విజ్ఞాన శ్రీ వేంకటేశ శుభకరం -అహమిహ తవపద అనిశం భజామి
అంటూ విష్ణు అవతారాలను చక్కగా స్తుతించాడు అన్నమయ్య కీర్తనలో. ❀

## 142) అభినవ గీత గోవిందకర్త - కవి చంద్ర రాయ్, దివాకర మిశ్ర, ముక్తాబాయి దంపతులు 1409

ఒరిస్సాకు చెందిన కవి చంద్రరాయ్ అతని అర్ధాంగి ముక్తాబాయి సంయుక్తంగా "అభినవ గీత గోవిందం" రచించారు. దివాకరుని తండ్రి వైదీశ్వర. ఈ కావ్యాన్ని గజపతి పురుషోత్తముడికి అంకితమిచ్చాడని అంటారు కాని నిజం కాదన్నారు. ఇతని మరోరచన "భరతమాత మహాకావ్యం". ఇందులో ఉన్నదాన్నిబట్టి ఈ కవి కృష్ణదేవరాయల (1409-1530) ఆస్థానకవి అని తండ్రి, సోదరులు కూడా గొప్పకవులని తెలుస్తోంది.❁

## 143) ద్వితీయ రాజ తరంగిణి కర్త -జోనరాజు (1420-1485)

పుట్టిన రోజు సరిగ్గా తెలియపోయినా "ద్వితీయ రాజతరంగిణి" రాసిన జోనరాజు 1485లో మరణించినట్లు తెలుస్తోంది. ఇతను కల్హణ రాజతరంగిణిని కొనసాగిస్తూ తన రాజు జైన్ ఉల్ అబిదీన్ వరకు (1418-1470) ఉన్న కాశ్మీర్ రాజుల చరిత్ర రాశాడు. పూర్తిగా రాయాల్సినవాడు మరణం వలన పూర్తి చేయలేక పోయాడు. ఇందులో క్రమముగా తగ్గిపోతున్న హిందూరాజుల గురించి క్రమంగా బలపడుతున్న ముస్లిం రాజుల ప్రాబల్యాన్ని గూర్చి జోనరాజు తెలియ జేశాడు.

"సిద్దే యత్ర సతి త్రపాకులమివ స్పర్ధాభి లాష హతేరంతదిం వహతి త్రిలోక మహిమం శేషం నిజార్ధ ద్వయం
స్నేహే కిభవ దాశయద్భయ జయాంక శ్రీవ గాడం మిలహేహార్ధ దవయమస్తు తద్రంగ వతోరద్వైత సంపత్తయే"

రెండు సగభాగాలైన అర్ధ నారీశ్వరులైన శివపార్వతులు ఒకరితో ఒకరు పోటీపడి ముల్లోకాలలో కలిసిపోయి లోకుల చేత ఆరాధింపబడ్డారు. మిగిలిన మిధునం స్నేహం గాఢమైన కోరికలతో కలిసిపోయి మరల మనలను ఆశీర్వదిస్తున్నారు అని భావం.

జోనరాజు సుల్తాన్ సికందర్ చేసిన దేవాలయ నిర్మూలనాలు, యాత్రాస్థలాలపై దాడులు గురించి రాశాడు. 23 రాజుల చరిత్ర రాశాడుజోన రాజు. ఇందులో 13 మంది హిందూ ఒక భూటియా, 9 మంది ముస్లిం రాజులున్నారు. 490 సంవత్సరాలు పాలించిన రాజుల చరిత్ర ఉంది. కవి సికందర్, జైనములబ్దీన్ రాజుల సమకాలికుడు. రచన సాధికారికమైనదే. కల్హణుడు ఎక్కడ ఆపేశాడో అక్కడనుంచి ప్రారంభించాడు జోనరాజు. రెంచాన్ నుంచి ఇస్లాంలోకి మారిన "బుల్ బుల్ షా" గురించి రాయలేదు. ముస్లిం రాజులకు ముందే కాశ్మీర్‌పై 3సార్లు దాడి చేసిన వారి గురించి కూడా రాశాడు. మొదటిసారిగా దుల్చా రెండవసారి రెంచాన్ మూడోసారి అచలలు దాడిచేశారు. తురుష్కుడైన దుల్చా 60 వేల సైన్యంతో దాడి చేశాడు. అతని దాడి "లేడి జాతిపై సింహం దూకుడు"గా ఉందన్నాడు జోన రాజు. రెండవ దాడి చేసిన బౌద్ధుడు రెంచాన్ కేవలం కాశ్మీర్ సిరి సంపదలను దోచుకోవటానికే వచ్చాడు. కాశ్మీర్ గద్దెనెక్కి కోట రాణీతో లాలూచీ పడ్డాడు. మూడవ దాడి చేసిన అచల కోటరాణిని చంపి ఖాళీగా ఉన్న సింహాసనాన్ని ఎక్కాడు. ఇతని తర్వాత రాజైన షా మీర్ కాశ్మీర్ ముఖ చిత్రాన్ని మార్చేశాడు అన్నాడు జోనరాజు. ముస్లింలు ఇతనిని "కుల నాధుడు" అని ఆరాధించారు అన్నాడు. లల్లేశ్వరి, షా అందాన్ యోగుల గురించి జోనరాజు ఒక్కమాట కూడా రాయలేదు. అల్లాఉద్దీన్ కాలంలో కాశ్మీర్‌లో వచ్చిన ఘోర కరువు గురించి రాశాడు. రాజధానిని అందర్కోట నుంచి అల్లాఉద్దీన్ పురకు మార్చి, మళ్ళీ బాక్ టు పెవిలియన్‌లాగా అందర్ కోట్ అనే జయా పీడాపురానికి అక్కడి నుంచి శ్రీనగర్‌కు మార్చాడట. సుల్తాన్ షాబుద్దీన్‌ను లలితాదిత్య మహారాజుతో పోల్చాడు. ❀



## 144) శ్రీ వేంకటేశ్వర సుప్రభాత కర్త – ప్రతివాది భయంకర అనంతాచార్య -1430

తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్య సన్నిధిలో ప్రతిరోజు తెల్లవారుఝామున స్వామిని మేల్కొల్పటానికి ఆలపించే శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం సుప్రభాతాలలో తలమానికమైనది. దీన్ని రాసే అదృష్టం పొందినవాడు ప్రతివాది భయంకర శ్రీ అనంతాచార్య. ఈయననే అన్నాచార్య అంటారు. ఇది క్రీ.శ.1430లో రాయబడిందిగా భావిస్తారు. అనంతాచార్య శ్రీ మనవాల మాముని స్వామి శిష్యుడు. మనవాల స్వామి శ్రీరంగంలో శ్రీరంగనాధ సుప్రభాతం రాసిన శ్రీ వైష్ణవ మహా భక్త శిఖామణి.

శ్రీ వేంకటేశ్వర సుప్రభాతంలో నాలుగు భాగాలుంటాయి-1- శ్రీ వేంకటేశ సుప్రభాతం-29 శ్లోకాలు, 2-శ్రీ శ్రీ వేంకటేశ స్తోత్రం -10 శ్లోకాలు, 3- ప్రపత్తి-16 శ్లోకాలు, 4-మంగళాశాసనం -14 శ్లోకాలు సుప్రభాతంలో మొదటి శ్లోకం వాల్మీకి మహర్షి రచించిన శ్రీ మద్రామాయణంలోని విశ్వామిత్ర మహర్షి శ్రీ రాముని నిద్ర మేల్కొల్పుతూ చెప్పిన "కౌసల్యా సుప్రజా రామా" శ్లోకంతో ప్రారంభమవుతుంది. అనంతా చార్యులు నిత్యం అర్చించిన శ్రీ లక్ష్మీ నారాయణ, శ్రీ భూదేవీ సమేత పద్మనాభ స్వామి విగ్రహాలతోపాటు 12 దివ్య సాలగ్రామ శిలలు ప్రస్తుతం ఆయనకు 15వ తరం వారైన ప్రతివాది భయంకర రాఘవాచార్యులవారి వద్ద ఉన్నాయి. ఇప్పటికీ అవి ఆంధ్రప్రదేశ్‌లోని

విజయవాడలో ఉన్న దివ్య సాలగ్రామ క్షేత్రంలో నిత్యం పూజలందుకొనటం గొప్ప విశేషం.

1) సుప్రభాతం.

1-కౌసల్యా సుప్రజారామా పూర్వా సంధ్యా ప్రవర్తతే -ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యమ్ దైవ మాహ్నికం.

2-4-ఇత్థమ్ వృషాచలపతే రిహసుప్రభాతం - ఏ మానవాః ప్రతిదినం పఠితుమ్ ప్రవృత్తాహ్

తేషామ్ ప్రభాత సమయే స్మృతి రంగ భాజాం -ప్రజ్ఞాన్ పరార్ధ సులభం పరమాం ప్రసూతే.

2) స్తోత్రం

1-కమలాకుచ చూచుక కుంకుమతో -నియతారణ తాతుల నీల తనో

కమలాయత లోచన లోకపతే - విజయీభవ వేంకట శైలపతే.

10-అజ్ఞానినా మయాదోషా న శేషాన్నిహితాన్ హరే -క్షమస్వత్వం క్షమస్వత్వం శేష శైల శిఖా మనే.

3) ప్రపత్తి

1- ఈశాన్యాం జగతోస్య వేంకట పతే ర్విష్ణో పరాం ప్రేయసీం-తద్వక్షస్థల నిత్య వాస రసికాం తత్ క్షాన్తి సంవర్ధినీం

పద్మాలంకృత పాణిపల్లవ యుగాం పద్మాసనే స్థితం -వాత్సల్యాది గుణోజ్వలాం భగవతీమ్ వన్దే జగన్మాతరం.

4) మంగళాశాసనం

1-శ్రియః కాంతాయ నిధయే నిధయేర్థినాం -శ్రీ వేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళం.

14-మంగళా శాసన పరై ర్ మదాచార్య పురోగమైః - సర్వైశ్చ పూర్వై రాచార్యైః సత్కృతాయాస్తు మంగళం.

యాభై అరవై ఏళ్ళ క్రితం శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం పుస్తకం లేని ఇల్లు ఆంధ్ర దేశంలో ఉండేది కాదు. నోటికిరాని వారు ఉండేవారు కాదు. శ్రీమతి ఎం ఎస్ సుబ్బలక్ష్మి తన అమరగానంతో దానికి మరింత వైభవం తెచ్చింది. ఆమె సుప్రభాతం వినకపోతే శ్రీ వేంకటేశ్వరుడు నిద్ర లేచేవాడు కాదు అన్నంతగా ప్రచారమైంది.❋

## 145) ఒరిస్సా గజపతుల కాల సంస్కృత సాహిత్యం -1435-1588

ఒరిస్సాలో సూర్య వంశ గజపతి చక్రవర్తుల కాలం 1435-1466 వరకు పాలించిన కపిలేంద్ర దేవ చక్రవర్తితో ప్రారంభమై 1497-1535 వరకు పాలన చేసిన గజపతి ప్రతాపరుద్ర దేవ వరకు ఉన్నా, 1559-1568 వరకు పాలన చేసిన మొదటి ముకుంద దేవ్ వరకు కొనసాగింది. ఈ కాలంలోనే దేశంలోను ఒరిస్సాలో కూడా సాంస్కృతిక జాతీయ ఉద్యమం నడిచింది. సంస్కృత ఒరియా భాషలలో సాంఘిక, మత సంబంధ గ్రంథాలెన్నో వెలువడ్డాయి. పుణ్య క్షేత్రాల, అందులోని దేవీ దేవతల మహాత్మ్యాలతో, పౌరాణిక సాహిత్యంతో గ్రంథాలు వచ్చాయి. అలంటి వాటిలో పురుషోత్తమ మహాత్మ్యం, కపిల సంహిత, నీలాద్రి మహోదయం, ఏకామ్ర పురాణం, ఏకామ్ర చంద్రిక, ప్రాచీ మహాత్మ్యం, విరాజ మహాత్మ్యం ముఖ్యమైనవి. ఈ కాలపు చక్రవర్తులు కేవలం పాలకులేకాక మహాకవులు కూడా. కవి పోషణ చేసినవారే. కావ్యాలు రాశారు రాయించి కృతికర్తలు భర్తలూ అయ్యారు. గజపతి కపిలేంద్ర దేవ చక్రవర్తి గొప్ప నాయకుడేకాదు మంచి కవిపోషకుడు కూడా. స్వయంగా "పరశురామ వ్యాయోగం" అనే ఉప రూపకం రాశాడు. మొదటి అయిదు శ్లోకాలలో విష్ణు జగన్నాధ రుక్మిణి శ్రీకృష్ణ శివులను స్తుతించాడు. తరువాత శ్లోకాలలో తాను పరశురాముని అవతారంగా చెప్పుకున్నాడు. దీన్ని 1458కి పూర్వం జగన్నాధ స్వామి ఉత్సవాలలో ప్రదర్శించేవారు. ఇందులో చక్రవర్తికి ఉన్న పరమత సహనం కూడా దృశ్యమానమవుతుంది.

కపిలేంద్రుని ఆస్థాన న్యాయాధిపతి నరసింగ మిశ్ర వాజపేయి శంకరాచార్యుల అద్వైతమతానికి పునర్వైభవం తెచ్చి జగద్గురు శంకరాచార్యుల "సంక్షేప శరీర" గ్రంథానికి సంక్షేప శారీరిక వార్తిక రచించాడు. ఈ కవి కాశీలో కొంతకాలముండి "కాశీ మీమాంస" రాశాడు కానీ అలభ్యం. ఈయన మనవడు మృత్యుంజయ రాసిన శాస్త్ర గ్రంథం "శుద్ధి ముక్తావళి" దొరికింది. ఇతని తండ్రి జలేశ్వరుడు వేదంలో చెప్పబడిన హోమాది క్రియలపై "జలేశ్వర పద్ధతి" రాశాడు. 1450 వాడైన కాళిదాస చయని కవి ప్రసిద్ధమైన శాస్త్ర గ్రంథం "శుద్ధి చంద్రిక" రాశాడు. ఇందులో శార్దూల విక్రీడితంలో రాసిన 25 శ్లోకాలు మాత్రమే ఉన్నాయి. మృతుని శరీర శుద్ధి కోసం చేయాల్సిన విధులు చెప్పబడ్డాయి.❀

### 146) మహా భారత మహా వ్యాఖ్య కర్త – అర్జున మిశ్ర –1450–1500

మహా భారతంపై తిరుగులేని వ్యాఖ్య రాసిన అర్జున మిశ్రా 15వ శతాబ్ది సంస్కృత మహా విద్వాంసుడు. గోవర్ధన పాథక్‌కు సమకాలికుడు. బెంగాల్‌లోని వరేంద్ర చంపాహేత్తియ గ్రామంలో జన్మించాడు. బెంగాల్‌ను గణేష్ రాజ్య వంశం పాలిస్తున్న కల్లోల పరిస్థితులలో అంటే 1450 –1500 కాలంనాటి వాడు అన్నమాట. ఆయన మహాభారతంపై 1534లో రాసిన వ్యాఖ్యాన వ్రాతప్రతి ఇప్పటికీ ఉన్నది. మిశ్రా వ్యాఖ్యానంను 17వ శతాబ్దంలో మహాభారతంపై మహా గొప్ప వ్యాఖ్యానం రచించిన వారణాసి మహా పండితుడైన నీలకంఠ విస్తృతంగా ఉదాహరించాడు. ఇంతకంటే అర్జున మిశ్రా వివరాలు మనకు తెలియటం లేదు.❀

### 147) కాతంత్ర కౌముదికర్త – పుండరీకాక్ష విద్యాసాగర్ –1450–1500

శ్రీకంఠ పండితునికుమారుడు, వాసుదేవ సార్వ భౌముని మారుటి సోదరుడు పుండరీకాక్ష విద్యాసాగరుడు నవద్వీపంలో జన్మించాడు. అతడు శ్రీపతి దత్త రాసిన "కా తంత్ర పరిశిష్ట"కు "వాక్తవ్య వివేక" వ్యాఖ్యానం రాశాడు. అలాగే కాతంత్ర వ్యాకరణానికి దుర్గా రాసిన వ్యాఖ్యానానికి ఉప వ్యాఖ్యానం "కాతంత్ర ప్రదీప" రచించాడు. కాతంత్ర కౌముది ఇతని సుప్రసిద్ధ వ్యాకరణ గ్రంథం.❀

### 148) యతి జీతక వృత్తి కర్త – సాధురత్న సూరి –1455

1456లో యతి జీతక వృత్తి రాసిన సాధురత్న సూరి దేవ సుందర సూరి శిష్యుడు. ఉపోద్ఘాతంలో "జినరత్న గుణి క్షమా శ్రమణుడు" సంక్షిప్త జీతకల్ప రచయిత అని చెప్పాడు. సోమప్రభ దీన్ని పెంచి రాస్తే సోమతిలకుండు వ్యాఖ్య రాశాడు. దేవ సుభద్రుని శిష్యుడని యతి జీత కల్ప వృత్తి కర్త అని రాశాడు.❀

## 149) తృతీయ రాజ తరంగిణి కర్త – శ్రీ వరుదు –1459

జోన రాజు శిష్యుడు "శ్రీవరుడు" గురువు పనిని కొనసాగించి "తృతీయ రాజ తరంగిణి" పేరుతో 1459–1486 వరకు ఉన్న రాజుల చరిత్ర రాశాడు.

"ప్రేంణార్ధ వపుషో విలోక్య మిళితం దేవ్య సమం స్వామినో మౌలౌ యస్య నిశాపతి నగస్తుతా వేణీనిషా మిశ్రితః
ఆస్తే స్వామ్యను వర్తనార్ధ మివ తత్త్రుక్త్వా వపుః–ఖండితం దేహోహ్వాయ భావనాం స భగవాన్దేవోర్ధ నారీశ్వరః"

భావం– శివుని ఫాలంపై ఉన్న చంద్రుడు పార్వతి నల్లని జడలో సగ భాగంపై కలిసి పోయి తన యజమాని శివునికి ఆనందం కల్గించాడు. ఈ అర్ధనారీశ్వరం మమ్మల్ని కాపాడుగాక.

కల్హణుడు ప్రారంభించిన అర్ధనారీశ్వర స్తోత్రాన్ని జోనరాజు ఆతర్వాత శ్రీవరుడు కూడా తమ రాజ తరంగిణి భాగాలలో కొన సాగించారు వారి వారి ధోరణిలో. శ్రీవరుడు 15వ శతాబ్ది కాశ్మీర్ రాజులు జనాలుబ్దీన్, కొడుకు హైదర్ షా, మనవడు హాసన్ షాల ఆస్థానంలో ఉన్నాడు. సంగీతంలో కూడా ప్రవీణుడు. కేదార గౌళ, గాంధార, కర్ణాటక రాగాలకు ప్రచారం కల్పించాడు. కాశ్మీర దేశంలోని కరువుకాటకాలు ఉత్సవాలు, వరదలు వగైరాల గురించి కూడా తన రచనలో తెలియజేశాడు. ఈ కవి కథా కౌతుక, శుభాషితా వళి కూడా రాశాడు. కథా కౌతుకం 15 కాండల కావ్యం. కథా వస్తువు పర్షియన్ శృంగర కథ. శుభాషితావళి 400 మంది కవుల చరిత్రవంటి కేటలాగ్ మాత్రమే కాక అజ్ఞాత కవుల గురించి తెలియజేసే రిఫరెన్స్ పుస్తకం.❁

## 150) భారతామృత మహా కావ్యకర్త – కవి చంద్రాచార్య దివాకర మిశ్ర -1464

కవి చంద్రాచార్య దివాకర మిశ్ర వైద్యేశ్వర, ముక్తాదేవి కుమారుడు. భారత దేశంలోనే వ్రేళ్ళ మీద లెక్కింపదగిన సంస్కృత విద్వాంసులలో ఒకడుగా గుర్తింపు పొందాడు. షట్ దర్శనాలపై షట్ శాస్త్రాలపై సాధికారమున్న మహామేధావి పండిత విద్వాంసుడైన కవి. అనాది మిశ్ర రాసిన "మణిమాల" నాటికను చదివితే ఈ కవి వారసులు ముకుంద మిశ్ర, శతంజీవ మిశ్ర అనాది మిశ్ర అందరూ మహా కవులే శాస్త్రవేత్తలేనని తెలుస్తుంది. దివాకర మిశ్ర 9 అద్భుత రచనలు చేశాడు.

మహాభారతం ఆధారంగా "భారతామృత మహా కావ్యం" రాశాడు కానీ అందులో 40వ కాండంలోని 93 శ్లోకాల వరకే దక్కాయి. శల్యవధ అసంపూర్తిగా ఆగిపోయింది. కనుక కావ్యం 48 లేక 50 కాండాల గ్రంథం అనిపిస్తుంది. దొరికిన వ్రాతప్రతిలో 3338 శ్లోకాలు వివిధ ఛందస్సులలో కనిపిస్తాయి. శ్రీహర్షుడు నైషధ చరిత్రలో తన వంశావళి గురించి చెప్పుకున్నట్లు ఈ కవి కూడా తన చరిత్రను పొందు పరచాడు. ఇతని రెండవ రచన "లక్షణాదర్శ మహాకావ్యం" భట్టి కవి రచనపోలి ఉంటుంది. 4 కాండాలు మాత్రమే లభించాయి. భారతంలోని పాండవ చరిత్ర ఇది. అభినవ గీత గోవిందం కూడా ఈ కవి రచనే కానీ గజపతి పురుషోత్తమ దేవుని పేర చెలామణిలో ఉంది. ఈ కవి శ్రీ కృష్ణ దేవరాయల ఆస్థానంలో కూడా ఉన్నాడు.❁



## 151) ముక్తి చింతామణికర్త – గజపతి పురుషోత్తమ దేవ చక్రవర్తి – 1466

గజపతి కపిలేంద్ర దేవుని కుమారుడు గజపతి పురుషోత్తమ దేవ చక్రవర్తి గొప్ప పోరాట యోధుడేకాక మహా కవి కూడా. ముక్తి చింతామణి, గోపాలార్చన, విధి, నామమాలిక, దుర్గోత్సవ, భువనేశ్వరి పూజా పల్లవ రాశాడు. ఇందులో ముక్తి చింతామణి 6 ప్రకారణాలున్న స్మృతి గ్రంథం దీనికి ఆధారం పురాణ, తంత్ర శాస్త్రాలలో విషయాలే. రచనాకాలం 22-2-1767. ఇందులో 15వ శతాబ్దికి ముందున్న పూర్వపు పురాణ తాంత్రిక గ్రంథాలనన్నిటినీ పేర్కొన్నాడు. గోపాలాచార్చన విధిని నీలాద్రి మహోదయం అని అంటారు. పూజా విధి గోపాల పూజా విధిలలో జగన్నాధస్వామి పూజా విధానాన్ని వివరించాడు. జగన్నాధుడు గోపాలకృష్ణుడే అని నిర్ధారించాడు. ఇవి ఒరిస్సా చరిత్రలో మైలురాళ్లుగా నిలిచాయి. దుర్గోత్సవం అనేది ఇంకా అలభ్యమే. భువనేశ్వరి పూజా పల్లవం మాత్రం శాక్తేయంలోని తంత్ర శాస్త్రం. ఇందులో ఉన్నదాని ప్రకారం పురుషోత్తమదేవుడు తండ్రి కపిలేశ్వర దేవ కృష్ణాజిల్లా కొండపల్లిలో 1466లో చనిపోయాక రాజ్యానికి చక్రవర్తి అయినట్లు తెలుస్తోంది. అప్పటికి ఇతను మైనర్, పెద్దకొడుకు కూడా కాదు. దురదృష్టవశాత్తు ఈ గ్రంథం అనేక కారణాల వలన ప్రచురితం కాలేదు. పురుషోత్తముడే రాసిన "అభినవ వేణీ సంహారనాటకం" కూడా ముద్రణ పొందలేదు.❋

## 152) బలభద్ర సంగ్రహకర్త – రాజగురు బలభద్ర మిశ్ర –1466

గజపతి పురుషోత్తమ దేవ చక్రవర్తి ఆస్థాన రాజగురువు బలభద్ర మిశ్ర నరసింగ మిశ్ర కుమారుడు. భట్ట తంత్రాలలో నిధి. అద్భుతమైన 3 స్మృతులు రాశాడు. ఇవే అద్వైత చింతామణి, శారీరక సార–పురుషోత్తమ స్రుమ్తి, బలభద్ర సంగ్రహం. బలభద్ర సంగ్రహం తరువాత కవుల చేత విస్తృతంగా పేర్కొన బడింది.❋

## 153) భక్తి భాగవత మహా కావ్యకర్త- డిండిమ జీవ దేవాచార్య - 1475-1500


1475కు చెందిన కవి డిండిమ దేవాచార్య రాజగురు త్రిలోచన రత్నావళి కుమారుడు. శ్రీ వత్స గోత్రం. ఒరిస్సా గజపతి ప్రతాప రుద్ర దేవ చక్రవర్తి సైన్యాధ్యక్షుడే కాక, రాజగురువు, సంస్కృత విద్యావేత్త మహాకవి. భాగవత దశమ స్కంధం ఆధారంగా "భక్తి భాగవత మహా కావ్యం" రాశాడు. ఇది 32 కాండలలో 3 వేల శ్లోకాల కావ్యం. ఛందో వైవిధ్యం పాటించాడు. ఉపోద్ఘాతంలో ఒరిస్సా చక్రవర్తుల విషయాలను సంక్షిప్తంగా చోడ గంగ దేవ నుంచి పురుషోత్తమదేవ వరకు రాశాడు. ఇతని భక్తి వైభవ కావ్యం ప్రబోధ చంద్రోదయంలాంటి అన్వార్థ రచన. ఉషావతి నాటకం కూడా రాశాడు. యుధిష్ఠురుని యాగాశ్వంను కట్టేసి వెంటవెళ్లిన అర్జునునికితో యుద్ధం చేసి శ్రీకృష్ణ, నారదుల సమక్షంలో పెళ్లి చేసుకొన్న ఉషావతి కథ. జీవ దేవాచార్య రాజగురు త్రిలోచనాచార్య రత్నావళిల కుమారుడు తన కృష్ణ భక్తికి నిదర్శనంగా 9 అంకాల "భక్తి వైభవ నాటకం" రాశాడు. దీన్ని జగన్నాధ స్వామి డోలా యాత్ర సందర్భంగా రాశాడు. మహాభారత కథ ఆధారంగా ఉత్సాహవతి అనే చిన్ననాటకాన్ని రాశాడు. ఈ రూపకాన్ని జగన్నాధ స్వామి శిలాస్తంభ మందిరంలో వసంత కాలోత్సవాలలో ప్రదర్శించేవారు. తన విద్వత్తుకు గుర్తుగా కవి డిండిమ, కవిరాజ, శ్రీమద్భాగవత, పరమాచార్య వంటి సార్ధక బిరుదులూ పొందాడు.

ఈ కవి రాసిన భక్తి వైభవ నాటక కవిత్వ వైభవాన్ని మెచ్చుకొన్న ప్రతాపరుద్ర గజపతి కవికి 8 బంగారు వింజామరలతో, ఒక బంగారు గొడుగుతో ఘనమైన సత్కారం చేసి సభూతో అనిపించాడు. జీవ దేవుని కుమారుడు జయదేవాచార్య పీయూష లహరి వైష్ణవ మతము అనే రెండు సంస్కృత నాటకాలు మధురంగా రాశాడు. ఈ కాలంలోనే ధర్మ శాస్త్రాలపై రెండు అద్భుత గ్రంథాలు "సరస్వతీ విలాసం", "ప్రతిపా అలంతం"లను లాలా లక్ష్మీధర భట్టు, రామకృష్ణ భట్టు రాశారు.



## 154) శ్రీ కృష్ణ భక్తి కల్ప లత ఫల కర్త – జగన్నాధ దాసు –1491–1550

భగ బంధ దాస, పద్మావతిలా కుమారుడు జగన్నాధ దాసు సంస్కృత ఒరియా భాషలలో మహా పాండిత్యమున్నవాడు. ఆయన ఒరియాలో రాసిన "భాగవతం" ఒరిస్సా ప్రజలందరి ఇంటి పారాయణ గ్రంథమైంది. సంస్కృతంలో 8, ఒరియాలో 12 రచనలు చేశాడు. అందులో సంస్కృతంలో రాసిన నీలాద్రి శతకం, ఉపాసన శతకం శ్రీకృష్ణ భక్తికల్ప లతా ఫలం, నిత్యా గుప్త చూడామణి బాగా ప్రసిద్ధమైనాయి.❁



## 155) జగన్నాధవల్లభ నాటకకర్త – రాయ రామానంద –1497–1540

రాయ రామానంద గజపతి ప్రతాపరుద్ర దేవుని ఆస్థాన ఉన్నతాధికారి ఈయన జగన్నాధ వల్లభ అనే 5 అంకాల నాటకాన్ని అద్భుతంగా రాశాడు. ఈకవి కృష్ణ లీలలపై "గోవింద వల్లభ" నాటకమూ రాశాడు.

రాయరామానంద మేనకోడలు మాధవి దాసీ చైతన్యమహా ప్రభు శిష్యురాలు "పురుషోత్తమ దేవ" సంస్కృత నాటకం రాసింది. ప్రతాపరుద్రుని కుమార్తె తుక్కాదేవి శ్రీ కృష్ణ దేవరాయలు పెళ్లాడింది. ఈమె ఎన్నో శ్లోకాలు రాసినట్లు జగన్నాధ మిశ్రుని "రస కల్ప ద్రుమమ్"లో కనిపిస్తుంది.❁



## 156) ప్రౌఢ ప్రతాప మార్తాండకర్త – గజపతి ప్రతాప రుద్ర దేవ – 1497-1535

గజపతి పురుషోత్తమ దేవుని కుమారుడు గజపతి ప్రతాప రుద్ర దేవ్ కళా సంస్కృతులను బహువిధాల వర్ధిల్ల జేసినవాడు. ఎందరో సంస్కృత కవులకు విద్యావేత్తలకు ఆశ్రయమిచ్చి కావ్య రచన చేయించినవాడే కాక తానూ గొప్పకవే. "సరస్వతి విలాసం" అనే గ్రంథాన్ని రాశాడు. ఇదికాక ప్రతాప మార్తాండ లేక ప్రౌఢ ప్రతాప మార్తాండ, నిర్ణయం సంగ్రహం, కౌతుక చింతామణి కర్త కూడా. వీటిలో రెండవది కాశీకి చెందిన రామ కృష్ణ భట్టు సమకూర్చిన గ్రంథం. ఈ కవి ఈ రాజు ఆస్థానకవి –పండిత శిరోమణి బిరుదాంకితుడు కూడా. ఈ బిరుదును ప్రతాప మార్తాండంను పరిశీలించి మెచ్చి రాజగురువు బలభద్ర మిశ్ర అందజేశాడు. 5 ఉల్లాసాల సరస్వతి విలాసాన్ని ఆంధ్రదేశ పండితకవి ప్రతాపరుద్రుని ఆస్థానకవి లక్ష్మీధర పండితుడు సేకరించిన గ్రంథం. 5 ప్రకాశాలతో ఉన్న ప్రౌఢ ప్రతాప మార్తాండం ధర్మ శాస్త్ర రచన. మాధవ భట్టు కుమారుడు రామకృష్ణ భట్టు సేకరణ ఇది. రాజుగారి పేర చలామణి చేశాడు. కౌతుక చింతామణి 5 దీప్తులతో ఉన్న చిత్ర బంధ, చేతబడులు కావ్యం 1520 రచన. నిర్ణయం సంగ్రహం ఇంకా దొరకలేదు.❁

## 157) చైతన్య చంద్రోదయ నాటకకర్త – పరమానంద దాస కవి హర్ష కర్ణపూర –1497

బెంగాల్‌కు చెందిన శివానంద సేన కుమారుడు పరమానంద దాస ఒరిస్సాలో స్థిరపడ్డాడు. గజపతి ప్రతాప రుద్ర దేవ ఆస్థాన కవి. చైతన్య చంద్రోదయ నాటకం అనే 8 అంకాల నాటకం రాశాడు. దీనిని పూరీ జగన్నాథ స్వామి రథోత్సవాలలో ప్రదర్శించేవారు.❁

## 158) ఛందో మంజరికర్త – గంగ దాసు –1500

ఒరిస్సా కవి గంగదాస తండ్రి సంతస దాస. ఈ కవి ఛందో మంజరి రాశాడు. తనకు ముందున్న చింతామణి మిశ్రా రచన "వాఙ్మయ వివేక"ను పలుచోట్ల ఉదహరించారు. అచ్యుత శతకం కంసారి శతకం, దినేశ శతకాలు కూడా రాశాడు.

## 159) ధనుర్వేద కర్త – సారంగధర –1500

15వ శతాబ్దంలో సారంగధరుడు రాసిన బృహత్ సారంగధర పద్ధతిలో ధనుర్వేద విషయాలున్నాయి. దీన్ని ఇంగ్లీష్‌లోకి పీటర్ పియర్సన్ అనువదించి 1888లో బాంబే ప్రెస్‌లో ప్రచురించాడు. దీన్ని గురించి కవి ఇలా చెప్పాడు– "పరమ శివుడు వ్యాసమహర్షికి బోధించిన ధనుర్వేదం నుండి నేను సంగ్రహించి దీన్ని రాస్తున్నాను. సారంగధరుడనే నేను తప్ప ప్రపంచంలో ధనుర్వేదంలో ప్రావీణ్యం ఉన్నవారులేరు. కారణం నాకు శివుడు బోధించాడు కనుక. ఇందులోని విషయాలు శక్తి సమర్థులైన ధనుష్కుడైన చింతామణి చెప్పిన విషయాలను చూసి దీనిపై ఎవరికీ సందేహాలు ఉండాల్సిన పని లేదు. విలుకాండ్రు శ్రద్ధగా నేను చెప్పినట్లు సాధన చేసి మహా ధనుష్కులు కావాలి. సింహం గుహలో ఉంటేనే అరణ్యంలోని జంతువులు వణికి దగ్గరకు రానట్లు మంచి విలువిద్యా వేత్త ఉన్న ఊరిలోకి శత్రువులెవరూ ప్రవేశించే సాహసం చేయరు. శిష్యుల గుణ పరీక్ష చేసి గురువు ఈ విద్య నేర్పాలి. బ్రాహ్మణ శిష్యుడికి ధనుస్సు క్షత్రియునికి ఖడ్గం, వైశ్యునికి బల్లెం, శూద్రునికి గదలలో గురువు శిక్షణ నివ్వాలి. బాహుయుద్ధం 7 రకాలు. వీటిని ధనస్సు, చక్రం, బల్లెం గద, ఖడ్గం చురిక చివరికి చేతులతో యుద్ధం చేయాలి. వీటన్నిటిలో ప్రావీణ్యం ఉన్నవాడిని "సప్త యోధుడు" అంటారు. నాల్గింటిలో శక్తి ఉంటే "భార్గవ" అని రెండు మాత్రమే నేరిస్తే "యోధ" అని ఒక్కటే నేరిస్తే "గణక" అనీ అంటారు. హస్త, పునర్వసు, పుష్యమి, రోహిణి, ఉత్తర, అనూరాధ అశ్విని రేవతి నక్షత్రాలలోను దశమినాడు పుట్టినవారు విలువిద్యలో నేర్పరులౌతారు. ధనుర్విద్య నేర్చుకొనే ముందు గురువుకు బ్రాహ్మణులకు బ్రాహ్మణ స్త్రీలకూ సహ పాఠకులకు విందు నివ్వాలి అంతకు ముందు శివ పూజ చేయాలి. ధనుర్విద్య నేర్చే శిష్యుడు జింక చర్మం ధరించి వింటికి బాణాలకు పూజ చేసి, రెండు చేతులతో నమస్కరించాలి. గురువు శివమంత్రాలు చదువుతూ శిష్యుని చేతులను శుభ్రపరచి వాటిపై తన చేతులుంచాలి. విఘ్న నివారణకు పూజలు చేయాలి. శిష్యుడి జుట్టుకు ముడివేసి దానిపై శివుని శిరసుపై కేశవుని రెండుబాహువులలో, బ్రహ్మను నాభిలో, వినాయకుని తొడలలో ఆవాహన చేయాలి. ఓం హోమ్ మంత్రంతో ఈ దేవతలను స్థాపించిన చోట పూజించాలి –పూర్తి మంత్రం–

"ఓం హోమ్ శిఖా స్థానే శంకరాయనమః -ఓం హోమ్ బాహువో కేశవాయనమః - ఓం హోమ్ నాభి మధ్యే బ్రాహ్మణే నమః -ఓం హోమ్ జంఘాయోర్ గణపతయే నమః "

ఇలా 226 శ్లోకాలతో "శివ ధనుర్వేదం"ను వ్యాస మహర్షి శివుడు బోధించగా రాశాడని సారంగ ధరుడు పేర్కొన్నాడు.❁



## 160) హఠ యోగ ప్రదీపికకర్త - స్వామి స్వాత్మారాం -1500


స్వామి గోరఖ్ నాథ్ (శ్రీనాథ్) శిష్యుడు స్వామి స్వాత్మారాం 15వ శతాబ్దంలో హఠ యోగ ప్రదీపిక రాశాడు. హఠ యోగంపై ఇదే మొదటి గ్రంథం. దీనిలో భౌతిక ఆంతరిక శుద్ధి వివరించాడు. ఆసన, ప్రాణాయామాలపై ఎక్కువ దృష్టిపెట్టాడు. దీనికి ఆంగ్లంలో పంచన్ సినా చక్కని వ్యాఖ్య రాశాడు.

"ఆసనాలపై చెప్పిన మొదటి శ్లోకం" శ్రీ ఆదినాధాయ నమోస్తు తస్మై ఏనాపాదిస్టా హఠ యోగ క్రియా - విభ్రాజతే పరే న్నత రాజయోగం ఆరో ఆరో ధుమి చ చ్ఛోరాది రోహిణీవ"

భావం-హఠ యోగ విజ్ఞానాన్ని వ్యాప్తి చేసిన ఆది దేవుడైన శివునికి ప్రణామం. ఇది రాజయోగాన్ని అధిరోహించటానికి మెట్టుగా తోడ్పడుతుంది

"ప్రణమ్య శ్రీ గురుం నాథం స్వాత్మా రామేణ యోగినా -కేవలం రాజ యోగాయ హఠ విద్యో పాదిశ్యతే"

భావం- స్వాత్మానంద యోగి గురువైన శ్రీనాధునికి నమస్కరించి రాజయోగ మార్గాన్ని దారి చూపే హఠ యోగాన్ని రాస్తున్నాడు.❁



## 161) గౌర కృష్ణోదయ కావ్యకర్త - ఎం. ఎం. గోవింద - 1500

మహా మహోపాధ్యాయ గోవిందను కవి శేఖర గోవింద అంటారు. చైతన్య మహా ప్రభువు జీవిత చరిత్రను ఒరిస్సాలో ఆయన కార్యక్రమాలను తెలియజేసే 18 కాండాల "గౌర కృష్ణోదయ మహాకావ్యం"గా రాశాడు. ఇది చారిత్రిక కావ్యం. ఒరిస్సాలో ప్రచారంలో ఉన్న చారిత్రిక కావ్యాలైన భక్తి భాగవతం కోసలానందం, గంగ వంశాను చరిత చంపు సరసన నిలిచిన కావ్యం. ఇదికాక ప్రద్యుమ్న సంభవం అనే 19 కాండల కావ్యం రాశాడు. ఇది బాగా ప్రసిద్ధిచెందింది.❃

## 1501-నుండి 1600 వరకు - 16వ శతాబ్దం

## 162) రామానంద సంగీత నాటకకర్త - రాయరామ చంద్ర పట్నాయక్ -1509

రామానంద సంగీత నాటకం అనే శ్రీ జగన్నాధ వల్లభ వాటకం రాసిన ఒరిస్సా కవి రాయ రామ చంద్ర పట్నాయక్ 1509 కాలం కవి. వైష్ణవ తత్వ నిధి అయిన భావానంద రాయి కుమారుడు. చైతన్య మహా ప్రభువు ఒరిస్సాకు రాక మునుపే ఇక్కడ రాధా కృష్ణ మధుర భక్తిని వ్యాపింప జేసినవాడు. 5అంకాలున్న ఇతని నాటకం 21 గీతాలు, 68 శ్లోకాలతో వివిధ రాగాలతో వైవిధ్యమైన ఛందస్సులతో రాయబడింది. ఇందులో జయదేవుని గీత గోవింద శైలి కనిపిస్తుంది. ఈ కవి "టీకా పంచకం" రాశాడని అంటారు కాని వ్రాతప్రతి అలభ్యం.❃

## 163) హరి హర చతురంగ యుద్ధ తంత్ర కర్త – రాజగురు గోదావర శర్మ -1515

శబల భద్ర మిశ్ర కుమారుడు రాజగురు గోదావర శర్మ, గజపతి ప్రతాప రుద్ర దేవ చక్రవర్తి ఆస్థాన గురువు, మంత్రి. మిశ్ర తండ్రిలాగానే గొప్ప తంత్ర శాస్త్ర పండిత కవి. గోదావర వర్ధన, కవి పుంగవ, పండిత రాజ బిరుదులున్నవాడు, జయ చింతామణి, ఆచార చింతామణి కర్త. యుద్ధ తంత్రంపై "హరిహర చతురంగ" గ్రంథం రాశాడు. దీని ఆధారంగా ఈ కవి "అద్వైత దర్పణం, అధికార దర్పణం, నీతి చింతామణి, ఆచార చింతామణి, నీతి కల్పలత మొదలైన గ్రంథాలు కూడా రాసినట్లు తెలుస్తోంది.❀

## 164) చైతన్య చరితామృతం కర్త – కృష్ణదాస కవిరాజ గోస్వామి – 1520-1617

భాగీరథ, సునందల కుమారుడైన కృష్ణ దాస బీహార్‌లో కత్వాలోని బర్ద్వాన్ జిల్లా జమాత్ పూర్ దగ్గర సాలారాలో 1520లో బ్రాహ్మణ వంశంలో జన్మించాడు- మరణం 1617. కలలో చైతన్యుడు దర్శనమిచ్చి బృందావనం వెళ్ళమని బోధించాడు. బృందావనం చేరి తన గత జీవితాన్ని ఎవరికి చెప్పలేదు. హరికథలతో హరి కీర్తనలతో కాలక్షేపం చేశాడు. నిత్యానంద స్వామి, మణికేతన రామదాసులు ఆహ్వానితులుగా వచ్చేవారు. విష్ణు దైవం వైష్ణవ భక్తుల సహకారం లేకుండా చైతన్య చరితామృతం రాయలేనని భావించి ప్రతి అధ్యాయంలో చైతన్య ప్రభుని అద్వైత ప్రచారకర్త నిత్యానంద ప్రభులను స్మరించాడు. వ్యాసమహర్షి భాగవతంలో కృష్ణలీలను వర్ణించినట్లే బృందావన గోస్వామి అయిన కృష్ణదాసు చైతన్య లీలా విలాసాలను వర్ణించాడు. దీనిని చైతన్య గౌడీయమతం ప్రచురించింది. మదన మోహనుడు చెబితే నేను ఒక చిలకలాగా మళ్ళీ పలికాను అన్నాడు కృష్ణదాస. దీన్ని రాయటానికి స్వరూప దామోదరుని నోట్స్ ను ఆధారంగా చేసుకున్నాడు. కృష్ణదాస్ హృదయంలో చైతన్య నామం భావం మూర్తి బోధనా భక్తీ అన్నీ సంగమించాయి. చైతన్య చరితకు విశ్వనాధ చక్రవర్తి టీక రాశాడు.

కృష్ణ దాస కవిరాజ స్వగ్రామం జమతాపురలో ఒక చిన్న గుడిలో స్వామి నిత్యానంద పాద ముద్రలున్నాయి. కృష్ణదాసుకు నిత్యానందుని అనుగ్రహం పుష్కలంగా ఉన్నదని శ్రీ కృష్ణ మంత్రం ఉపదేశించాడని స్థానికులు భావించారు. అందుకనే అదే ప్రదేశంలో నిత్యానంద పాదుకలను ఏర్పాటు చేసి స్మరిస్తారు. కాని కృష్ణదాస రఘునాధ గోస్వామివద్ద దీక్ష తీసుకున్నాడని ప్రేమ విలాసలో ఉన్నట్లు చెబుతారు. ఇక్కడి దేవాలయంలో క్రష్ణదాసుని కొయ్య పాదుకలు అంటే పాంకోళ్ళున్నాయి. కృష్ణదాస విగ్రహం, సమాధి రాదా కుండ్‌లో ఉన్నాయి. రఘునాధ దాస స్వామి మరణం తరవాత కృష్ణదాస కవిరాజ గోస్వామి అశ్విని మాసం కృష్ణ ద్వాదశినాడు మరణించాడు.❀

## 165) సింహ వాజపాయ వంశావళి కర్త – నరసింగ మిశ్ర వాజపాయి -1520-1580

మురారి మిశ్రా కొడుకు ధరాధర మిశ్ర మనవడు నరసింగ మిశ్ర ఒరిస్సాలో గొప్ప స్మృతి శాస్త్రకర్త. ఇతడు రాసిన "సింహ వాజపేయి వంశావళి"ని చూస్తే అతని మేధో వికాసం తెలుస్తుంది. సిద్ధేశ్వరీమాత అనుగ్రహంతో షట్ శాస్త్ర పండితుడయ్యాడు. బెంగాల్ తర్క పులి "గండ"ను వాదంలో ఓడించిన "గండర గండడు". 1565–1568 అక్బర్ ఆస్థానాన్ని సంగీతకర్త కృష్ణదాసు మహాపాత్ర, ముకున్దదేవుని రాజ ప్రతినిధిలతో కలిసి సందర్శించాడు. నరసింగ 18 ప్రదీపాలు రాశాడు. ఇందులో మొదటిది "నిత్యాచారప్రదీప"ను బెంగాల్ ఏసియాటిక్ సొసైటీ 1907లో, రెండవదానిని 1908లో ప్రచురించింది. ఈ కవి ఇతర రచనలు –సమయ వర్ష, భక్తి, ప్రాయశ్చిత్త, శ్రద్ధ ప్రతిష్ట, శంకర భాష్య, ఛయాన, వ్యవస్థ ప్రదీప. నిత్యాచార ప్రదీపలో 16వ శతాబ్దపు చారిత్రిక రాజకీయ మత విషయాల గురించి రాశాడు.❁

## 166) ఆయుర్వేద సార సంగ్రహకర్త – విశ్వ నాథ సేన -1530

గజపతి ముకుంద దేవ రాజు ఆస్థాన ప్రముఖ ఆయుర్వేద వైద్య శిఖామణి విశ్వనాథ సేనుడు "ఆయుర్వేద సార సంగ్రహం" గ్రంథాన్ని రాశాడు. దీనితోపాటు "విశ్వనాథ చికిత్స, పత్స్య పత్స్య వినిశ్చియ" గ్రంథాలు ఒరిస్సా అంతా బహుళ ప్రచారంలో ఉన్నాయి.

1550లో విష్ణుశర్మ 8 అధ్యాయాల "స్మృతి సరోజ కలిక" రాశాడు. 1525లో బౌద్ రాజు నారాయణ భంజ దేవ్ ఆరుకాండల "గీత కావ్య రుక్మిణీ పరిణయం"ను జయదేవుని గీత గోవింద శైలిలో రచించాడు. ఇందులో 12 గీతాలు 40 శ్లోకాలున్నాయి.❁

## 167) ప్రాయశ్చిత్త మనోహరకర్త – మురారి మిశ్ర -1550

కహ్ను మిశ్ర కుమారుడు మురారి మిశ్ర గొప్ప సంస్కృత, శాస్త్ర నిధి. ధర్మ శాస్త్రంగా "ప్రాయశ్చిత్త మనోహరం" రాశాడు. ఇది బాగా ప్రచారంలో ఉంది.❁



## 168) ఖేట కౌతుకం కర్త -అబ్దుల్ రహీం ఖాన్ ఎ -ఖానా - (1556-1627)

అక్బర్ నవరత్న మంత్రులలో ఒకడైన కవి అబ్దుల్ రహీం ఎ -ఖానా 1556లో జన్మించి 1627లో మరణించాడు. ఉర్దూ ద్విపదలకు ఖగోళ శాస్త్ర గ్రంథానికి ఆయన మారుపేరు సంస్కృతంలో రెండు గ్రంథాలు రాసిన వైదుష్యం కూడా ఆయనది. ఆయన పుట్టిన ఊరు ఖాన్ ఖానాగా ప్రసిద్ధమైంది. ఇది పంజాబ్ రాష్ట్రంలో నవాన్ షాహి జిల్లాలో ఉంది. అక్బర్‌కు నమ్మకస్తుడు, మార్గదర్శి అయిన బైరం ఖాన్‌కు రహీం కొడుకు. ప్రవాసం నుండి బయట పడి ఇండియా వచ్చిన హుమాయూన్ తన రాజోద్యోగులను జమీందార్ల కూతుళ్లను పెళ్లి చేసుకోమని హుకుం ఇచ్చాడు. తానూ హర్యానాలోని మేవత్ జమీందార్ జమాల్ ఖాన్ పెద్ద కూతుర్ని పెళ్ళాడి తే, బైరం ఖాన్ చిన్నకూతురును పెళ్లి చేసుకొన్నాడు. బైరం ఖాన్‌కు, జమాల్ ఖాన్ కూతురైన భార్యకు పుట్టిన వాడే రహీం. గుజరాత్‌లోని పాతన్ యుద్ధంలో బైరం ఖాన్ చనిపోయాక, ఢిల్లీ నుంచి అహ్మదాబాద్‌కు తీసుకొని రాబడ్డాడు. తర్వాత అక్బర్ కొలువులో రహీం మంత్రి అయ్యాడు. మీర్జాఖాన్ అని పేరుపెట్టారు. రహీం మారుటి తల్లి సలీమా సుల్తాన్ బేగం, కజిన్ అయిన అక్బర్‌ను పెళ్లాడింది. అక్బర్‌కు రహీం ఈ విధంగా కొడుకు వరుస అయ్యాడు. తన నవరత్న మంత్రులలో ఒకనిగా అక్బర్ రహీంను చేశాడు.

రాణా ప్రతాప్ ముస్లిం మహిళలకు రక్షణ కల్పించటం రహీంపై ప్రభావం కలిగించి ముస్లిం అయినా రహీంఖాన్స్ కృష్ణ భక్తుడు అయి ఒక కావ్యం రాసి అంకితమిచ్చాడు. దాతృత్వంలో రహీం చేతికి ఎముక ఉండేది కాదు. దీన్ని తులసీదాసు గమనించి కవిత్వంలో బంధించాడు. రహీం ఇద్దరు కొడుకులను అక్బర్ కొడుకు జహంగీర్ అక్బర్ మరణం తర్వాత తాను చక్రవర్తి అవటానికి అడ్డు వస్తున్నారని భావించి

చంపేశాడు.

రహీంఖాన్ సంస్కృతం లో 1– ఖేట కౌతుకం, 2– ద్వాత్రింశద్యోగావళి కావ్యాలు రాశాడు. ఉర్దూలో లెక్కలేనన్ని దోహాలు రాశాడు. బాబర్ జ్ఞాపకాలైన బాబర్ నామాను పర్షియన్ భాషలోకి అనువదించాడు. రహీం సమాధి మధుర వెళ్లే దారిలో నిజాముద్దీన్‌కు తూర్పున హుమాయూన్ సమాధి ప్రక్కన ఢిల్లీలో ఉంది. దీన్ని 1598లో రహీం తన భార్య కోసం కట్టిస్తే, 1627లో అందులో రహీం పార్థివ దేహాన్ని పెట్టారు. జహంగీర్ చక్రవర్తిగా సలీం సింహాసనం ఎక్కినప్పుడు అతని వద్ద కూడా రహీం మంత్రి పదవి నిర్వహించాడు.❀



## 169) గీత ప్రకాశ సంగీత కర్త – కృష్ణదాసబోధ జేన మహా పాత్ర –1559

ఒరిస్సా కవి కృష్ణదాస బోధజేన మహాపాత్ర సంగీతం శాస్త్రంలో లోతులు ముట్టినవాడు. ఒరిస్సా సంగీత విద్వాంసులకు ఆయన ఎంతగానో పరిచయమున్నవాడు. తన సంగీత జ్ఞానాన్ని “గీత ప్రకాశం”లో నింపి గొప్ప సంగీత శాస్త్రాన్ని రచించాడు. ఇతడు గజపతి ముకుంద దేవుని ఆస్థాన కవి. గజపతి ఈ కవిని అక్బర్ దర్బార్‌కు సంధి ప్రయత్నం కోసం పంపాడు. కవి మంచి స్నేహాన్ని కుదిర్చాడు. ఈ కవి గురించి అక్బర్ ఆస్థాన కవి అబుల్ ఫజల్ గొప్పగా పొగిడాడు. మహాపాత్ర భారతదేశంలోని కవులలో సంగీతజ్ఞులలో సాటిలేనివాడు. అతని గీత ప్రకాశంలో అనేక రాగాల గురించి చాలా సోదాహరణంగా సంస్కృత కావ్యాల నుంచి సంస్కృత హిందీ ఒరియా భాషలలోని అనేక సంగీత గ్రంథాల నుంచి తాను రాసిన వాటి నుంచి ఉదాహరించి వివరించాడు. అంటే ఆయన బహుభాషా పాండిత్యం తెలుస్తోంది.❀

## 170) దశగ్రీవ కావ్యకర్త - మార్కండేయ కవి చక్రవర్తి -1559

మార్కండేయ కవి చక్రవర్తి ముకుంద దేవుని సమకాలికుడు. ఇతడు దశగ్రీవ వధ మహాకావ్యం, ప్రాకృత సర్వస్వము రాశాడు. వీనిలో తన రాజు ముకుందదేవుని ఘనంగా పొగిడాడు. ప్రకృత సర్వస్వమును సాకల్య, భరత, కొహల వరరుచి మొదలైన వారి గ్రంథాలను పరిశీలించి రాశానని చెప్పాడు. ఈ గ్రంథం పూరీలోని వీర ప్రతాపపురిలో రాయబడిందని తెలుస్తోంది. కవి కాశ్యపగోత్రికుడు తండ్రి మంగళ దేవుడని ఆనాటి కవులలో మార్కండేయ కవి చక్రవర్తిగా గుర్తింపు పొందాడని, రామాయణ కథనంతటిని దశగ్రీవ వధ మహాకావ్యంలోని 20 సర్గలలో నిక్షిప్తం చేశాడని సరళ సుందరమైన రచన అని, "విలాస వతి" అనే శతకాన్ని కూడా రాశాడని తెలుస్తోంది.❁

## 171) దుర్గోత్సవ చంద్రిక కర్త - భారతీ భూషణ వర్ధమాన మహా పాత్ర -1568-1600

కవి డిండిమ జీవ దేవ ఆచార్య కుమారుడు, జయదేవ ఆచార్య చిన్నతమ్ముడు భారతీ భూషణ మహాపాత్ర మహా సంస్కృత విద్వాంసుడు. దుర్గోత్సవ చంద్రిక అనే శరత్కాలంలో 16 రోజులు ఒరిస్సాలో జరిగే శ్రీ దుర్గా మాత ఉత్సవ వైభవాన్ని గురించి రాశాడు. ఇది గోదావరి మిశ్రా ప్రవచించి ఒరిస్సా అంతా ప్రచారం చేసి అనుసరిస్తున్న "శరత్ శారదార్చన పద్ధతి". కానీ దీని కర్తృత్వం పోషక రాజైన మొదటి రామచంద్రునిదని ప్రచారంలో ఉంది.❁

## 172) వాఙ్మయ వివేక కర్త - చింతామణి మిశ్ర -1574

గోవింద విద్యాధర రాజు ఆస్థాన కవి గోవింద మిశ్ర వాజ పాయి మనవడు చింతామణి మిశ్ర. తలిదండ్రులు మృత్యుంజయ మిశ్ర, శ్రీదేవి. నీలాచలం అని పిలువబడే పూరీ క్షేత్ర వాసి. తండ్రి కూడా గొప్పకవిగా సుప్రసిద్ధుడు. చింతామణి "వాఙ్మయ వివేక చంద్రిక" అనే అలంకార ఛందో గ్రంథాన్ని 6 అధ్యాయాలలో 3200 శ్లోకాలలో 1574లో రాశాడు. ఇతడు శంబరారి చరిత్ర, త్రిశిరో వధ వ్యాయోగం, కాదంబరి సారం, సభా ప్రమోద, పక్షావలి, కంసవధ, కృత్య పుష్పావళి, సమితి వర్ణన కావ్యాలు రాశాడు. కానీ వివేకం వ్యాయోగం తప్ప మిగిలినవి అలభ్యాలు.❁




## 173) వైదిక నిర్ణయ కర్త - నృసింహ భారతి -5 -1576-1600

"నృసింహతాం ప్రాధాన్యాశు యమాశ్రిత్య జనా భువి - నృసింహ భారతిం వందే ద్విగునోపపదం సదా"
శృంగేరి 23వ జగద్గు రువులు శ్రీ ఐదవ నృసింహ భారతి స్వామి "వైదిక నిర్ణయం" గ్రంథం రాసి అద్వైతమే సర్వ శ్రేష్ఠమని వివరించి చెప్పారు.❀



## 174) రుద్ర భాష్య కర్త - ఆత్మ బోధేంద్ర సరస్వతి -1586-1638

తమిళనాడులోని వృద్ధాచలంలో 1586లో ఈశ్వరగా జన్మించి 58వ కంచి కామకోటి జగద్గురువులయ్యారు. దేశమంతా విస్తృతంగా పర్యటించి అద్వైత భావ దీప్తి కలిగించారు. "శ్రీ రుద్రం"పై వ్యాఖ్యానం రాశారు. అవధూత సదాశివ బ్రహ్మేంద్రను కంచి మఠ గురువులపై "గురు రత్నమాలిక" వ్రాయమని కోరారు. వీరిద్దరికి పరమ గురువులు 57 వ పీఠాధిపతి తిరువేంగాడులో సిద్ధిపొందిన శ్రీ పరమ శివేంద్ర సరస్వతి. దక్షిణ పినాకిని నదీ తీరంలో వీరు 1638న సిద్ధిపొందారు.❀



## 175) పంచ నంది వ్యాకరణ కర్త – బనార్సి దాస్ – 1587-1643

1587లో జన్మించి 1643లో మరణించిన బనారసీ దాస్ తన జీవిత చరిత్ర "అర్ధ కథానక" గ్రంథం రాశాడు. అందులో జైన దేవాలయాలలో జరిగే పూజలు, ఉత్సవాల గురించి వర్ణించాడు. 1635లో జైన గురువు పండిట్ రూప్ చంద్ ఆధ్వర్యంలో జరిగిన జైన సెమినార్ గురించి కూడా పేర్కొన్నాడు. ఆగ్రా జైన సంస్కృతికి పట్టుగొమ్మగా ఉండేదని, 1594లో పండిట్ భగవాన్ దాస్ తన రామ్ నగర్ నుండి ఆగ్రాకు యాత్రగా వచ్చాడని, ఈ మహానగరంలోని "జిన వన్దనం"ను చక్కగా వర్ణించాడు. అప్పుడు ఆగ్రాలో 48 దిగంబర జైన దేవాలయాలున్నట్లు తెలిపాడు. వీటిలో రెండు భట్టారక పీఠాలు. భట్టారక సుఖ కీర్తి తిహునా సాహు జైన దేవాలయంలో ఉండేవాడని, భట్టారక జగత్ భూషణ్ సాహు నారాయణి దేవాలయంలో నివసించేవాడని చెప్పాడు. నగరంలోని జైన దేవాలయాలు వీరిద్దరిలో ఎవరో ఒకరి ఆధీనంలో ఉండేవి. భట్టారకులు పండితులను ఎంపిక చేసి నియమించి దేవాలయాలలో పూజాదికాలు నిర్వహింప జేసేవారు. ఈ పూజారులు తాంత్రిక పూజలూ నిర్వహించేవారు. ఈ దేవాలయాలు ఆధ్యాత్మిక జ్ఞాన కేంద్రాలుగా ఉండేవి. ఉత్తర భారతంలోని ప్రతి దిగంబర దేవాలయంలో లోపలా బయటా ఖాళీ స్థలం ఎక్కువగా ఉండి, సామూహిక పూజా కార్యక్రమాలకు ప్రసంగాలకు అనువుగా ఉండేవి. బలభద్ర జైన్ ఆగ్రా గురించి "ప్రతి జైన దేవాలయంలో ఉదయ, సాయం సమయాలలో జైన మత గ్రంథాల పఠనం ఆరాధన జరిగేవి. తరచుగా తత్వ గోష్ఠి నిర్వహించేవారు" అని రాశాడు.

బనారసీ దాస్ తన గ్రంథంలో "పండిట్ రూప్ చంద్ జైన గ్రంథ నిష్ణాతుడు ఆగ్రాకు వచ్చి తిహున్ సాహు నిర్మించిన దిగంబర దేవాలయంలో ఉన్నాడు. ఈయన ఆధ్వర్యంలో గొప్ప దిగంబర జైన సభ జరిగింది. అందులో ఆయన "గొమ్మట సార"పై గొప్పగా ప్రసంగించి స్ఫూర్తి కలిగించాడు. ఇది భట్టారక పీఠం. ఆధ్యాత్మిక గోష్ఠులను

"విచార" లేక "విచార గోష్ఠి" అనేవారు. దీనినే మనం ఇప్పుడు సింపోజియం అంటున్నాం. కుంద కుందాచార్య రాసిన "సమ్మత సార"పై కూడా గోష్ఠి జరిగేది. ఆరాత్ మల్ ధోర్ అనే ప్రముఖ జైన ఆచార్యుడు తనకు హితోపదేశం చేసినట్లు బనారసీ దాస్ రాసుకున్నాడు. బనారసీ దాస్ "భాషా అర్ధ బొచరై చిత్త" అనే గ్రంథాన్ని తానే స్వయంగా చదివాడు. కానీ పూర్తిగా అర్ధం చేసుకోలేక పోయానని, గోమ్మట సారను రూప్ చాంద్ మార్గ దర్శకత్వంలో చదివిన తర్వాత సమయసారం పూర్తిగా అర్ధమయింది రాశాడు. తన అర్ధ కథానకలో బనారసీ దాస్ "ఇప్పటికి సన్మార్గంలో పడ్డాను. దేవుని స్వభావం ఏమిటో తెలిసింది. ఈ ఆనందం, తపనతో "సమయచార నాటకం" రాశాను" అని చెప్పుకొన్నాడు దాస్. నాటకం చివర విపులమైన వివరణ ఇచ్చాడు .

జైన మత గ్రంథాలపై అవగాహన బాగా ఉన్న పంచ మహానుభావుల సంభాషణలు గోష్ఠులను గురించి సవివరంగా రాశాడు. సమయ సారకు వ్రజభాష అనువాదం కూడా బనారసీదాస్ రాశాడు. దీనికి ఆధారంగా అమృత చంద్రుని సంస్కృత వ్యాఖ్యను ఎంచుకున్నాడు. బనారసీ దాస్ రాసిన సమయ చార నాటకం ఆగ్రా జైన పీఠాలలో గ్రంథమై పోయింది. బనారసీ దాస్ మిగిలిన రచనలను ఆయన మరణానంతరం సేకరించి మొఘల్ సామ్రాజ్య దివాన్ జగ్జీవన్ పంచ మహానుభావులనే జ్ఞాన మండలికి అందజేశాడు. ఇందులో పీతాంబరుడు అనే కవి 1630లో బనారసీ దాస్‌పై స్తుతిగా చెప్పిన కవిత్వం బనారసీ విలాస్ అనే జ్ఞాన్బా వని అనేది ఉంది. దీనిలో దాసు గొప్ప వాణిజ్య వర్తకవేత్త మాత్రమేకాక భక్తిగా గానం చేయగల సత్తా ఉన్నవాడిని మంచి కవి అని వర్ణించబడింది. సుమారు 15 మంది ఆసక్తి ఉన్నవారు బనారసీ దాస్ ఇంటికి వచ్చి ఆయన ఆలపించే కుట్ బాన్ రచించిన "మృగావతి"ని, మంజాన్ రాసిన మధుమాలతిని ఆసక్తిగా వినేవారట. ఈ రెండూ సూఫీ కవుల కవిత్వాలు.

దాస్ –జాన్ పూర్‌లో పండిట్ దేవ దత్తు వద్ద జ్యోతిష, గణిత, ఖాండ స్ఫూట విద్యలు నేర్చాడు. నానార్ధాల "నామ మాల"ను "అనేకార్ధ కోశం"ను అధ్యయనం చేశాడు. అలంకార శాస్త్రం లఘుకోశంపై ఒక ఏడాది దీక్షగా కృషి చేసి సారం గ్రహించాడు. స్వే తాంబర గ్రంథాలు శ్రుత బోధ, చంద్ర కోశలను ప్రసిద్ధ బౌద్ధాచార్యులు బాంచంద్, రామ్‌చంద్‌ల వద్ద నేర్చాడు. తాను సంస్కృత ప్రాకృతాలను నిర్దుష్టంగా పలకగలనని మాట్లాడగలనని వాటిలో రాయగలనని చెప్పుకొన్నాడు. స్వయంగా తీర్చి దిద్దుకోబడిన కవి దాస్. వెయ్యి పద్యాలున్న హిందీ అలంకార శాస్త్ర గ్రంథం రాశాడు. నవ రసాలను చర్చించాడు. జాన్ పూర్ గవర్నర్ చిన్ని కిలిక్ బనారసీ దాస్ శిష్యరికం చేసి ఎన్నో గ్రంథాలు అభ్యసించాడు. సంస్కృత వ్యాకరణం "పంచ సంధి" రాశాడు. జిన సహస్రనామం సూక్తి ముక్తావళి రాశాడు.❁



## 176) సుధా పరిమళ వ్యాఖ్య కర్త - మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి -1595-1671

మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి వెంకట నాథుడుగా తమిళనాడు భువనగిరిలో 1597లో కన్నడ మధ్వ బ్రాహ్మణ కుటుంబంలో తిమన్నభట్ట గోపికాంబ దంపతులకు జన్మించారు. మధురైలో బావ లక్ష్మీ నరసింహాచార్యుల వద్ద శాస్త్రాధ్యయనం చేసి, కుంభకోణం శ్రీమఠంలో చేరి, సరస్వతీబాయిని వివాహమాడి, లక్ష్మీనారాయణ ఆచార్య అనే కుమారునికి తండ్రి అయ్యారు.

సుధీంద్ర తీర్థులవద్ద శిష్యరికం చేసి ఆయన అనుజ్ఞతో 1614లో సన్యాసాశ్రమం స్వీకరించి తమ శ్రీరామ భక్తికి నిదర్శనంగా "రాఘవేంద్రతీర్థ" అయ్యారు. సంస్కృతంలో నిష్ణాతులై వేద, వేదాంత, శాస్త్రాలను బోధించారు. గొప్ప సంగీతజ్ఞులే కాక వీణా వాదనలో గొప్ప నిపుణులు కూడా. 1621లో సుధీంద్రుల తర్వాత శ్రీమఠం పీఠాధిపతి అయి 1671 వరకు ఉన్నారు. దక్షిణ భారతం అంతా విస్తృతంగా పర్యటించి ద్వైతమత ప్రచారం ఉధృతంగా చేశారు. అనేక అద్భుతాలు చేసి ఆశ్చర్యపరచారు. 1801లో బళ్లారి కలెక్టర్ గా ఉన్న థామస్ మన్రో రాఘవేంద్రస్వామి వారి అద్భుతాలను స్వయంగా చూసి అబ్బురపడి కైఫీయత్‌లో రికార్డ్ చేశాడు.

రాఘవేంద్ర స్వామి ద్వైత మత గ్రంథం శ్రీమాన్ న్యాయ సుధకు సంస్కృతంలో "సుధాపరిమళ వ్యాఖ్య" రాశారు. మధ్వా చార్యుల పది ప్రకరణ గ్రంథాలలో ఆరింటిపై స్వామి దశప్రాకారణ వ్యాఖ్యానం రాశారు. బ్రహ్మ సూత్రాలకు "సూత్ర ప్రస్తానం" ఋగ్వేద ఉపనిషత్ ప్రస్థానాలు కూడా రాశారు. గీతా ప్రస్తానం శ్రీ రామ చరిత మంజరి, శ్రీ కృష్ణ చరిత మంజరి, ప్రతాః సంకల్ప గద్య, సర్వ సమర్పణ గద్య కూడా రాఘవేంద్ర స్వామి రచించారు. రాఘవేంద్ర స్వామిపై శ్రీ రాఘవేంద్ర విజయంను వారి మేనల్లుడు, నారాయణాచార్య రాశాడు. అప్పనాచార్య స్వామిపై 32 శ్లోకాల స్తోత్రం రాశాడు. ఇది మఠంలో నిత్య స్తోత్రమైంది. రాఘవేంద్ర స్వామి జీవితంపై, మహాత్మ్యాలపై తెలుగు తమిళభాషలో చాలా సినిమాలు టివి సీరియల్స్ వచ్చాయి. తమిళనటుడు రజనీకాంత్ స్వామిగా నటించాడు. తెలుగు సీరియల్‌లో ప్రసాద్‌బాబు చేసినట్లు జ్ఞాపకం.❀

## 177) వాసుదేవ విజయ కర్త – వాసుదేవ –1600

1600 కాలానికి చెందిన వాసుదేవ కవి కేరళకు చెందినవాడు. "వాసుదేవ విజయం" కావ్యం రాశాడు. ఇది శ్రీ కృష్ణుని కథ మాత్రమేకాక వాసుదేవ కవి విజయం కూడా. పాణిని వ్యాకరణ సూత్రాలకు సందేశాత్మక ఉదాహరణలు తెలియజేయటమే ఇందులో ముఖ్యోద్దేశ్యం. ఇది అసంపూర్తి రచనేకాని నారాయణీయం రాసిన మేలత్తూర్ నారాయణ భట్ట రాసిన ధాతుకావ్యాలలో చోటు చేసుకొన్నది.❋



## 178) శివ గీత వ్యాఖ్యాన కర్త – అభినవ నృసింహ భారతి – 1600–1623

తమ్ సర్వ భూత భయదం విభావర్గై రన్వితం పరం – నరసింహం గురుం చాపి నావం జ్ఞానార్పణం భజే"

మంత్రం శాస్త్రంలో అద్వితీయులైన శ్రీ అభినవ నృసింహ భారతీ స్వామి 24వ శృంగేరి జగద్గురువులు శివగీతాపై వ్యాఖ్యానం రచించారు. 1602లో రుద్రపాదలో రామేశ్వర లింగాన్ని ప్రతిష్టించారు. పశ్చిమ వాహినిలో ఉన్న అగ్రహారాన్ని గురువు పేరిట నర్సింహ పురంగా నామకరణం చేశారు. మహలానికేశ్వర దేవాలయంలో గణపతి విగ్రహం లేకపోవటం గ్రహించి దేవాలయ స్థంభంపైనున్న పశుపు గణపతిని పూజించారు. అప్పటి నుంచి అందరూ దానినే పూజిస్తూ "స్తంభ గణపతి"గా పిలుస్తున్నారు. శివగంగలో ఒక మఠాన్ని స్థాపించి దానికి శ్రీ శంకర భారతి స్వామిని నియమించారు.❋

### 179) హరినాయక రత్నమాలకర్త – హరి నాయక –1600

హరినాయక రత్నమాల, విషన్ ప్రకాశ ప్రబంధకర్త హరినాయక ఒరిస్సా సంస్కృత కవులలో మేలైనవాడు. గజపతి నారాయణ దేవుని సంగీత నారాయణలో 17 సార్లు ఈ కవిని ఉటంకించాడు కనుక హరినాయక ఆనాటి ఒరిస్సా ప్రముఖ సంగీత కర్తలలో ఒకడని భావించాలి.❀



### 180) వేదాంత పరమార్థ గీత వ్యాఖ్యానకర్త – నిజ గుణ శివ యోగి – 1600

వీర శైవంలో నిజగుణ శివ యోగి గొప్ప భక్తుడు. కర్ణాటకలో జన్మించిన తమిళనాడు కోయంబత్తూర్ జిల్లా, కొల్లెగల తాలూకా సమ్మెబాట లింగం గట్ట రాజు. శాస్త్రాలు చదివి అర్థం చేసుకున్నవాడు. రాజ్యంపై కాంక్ష నశించి పర్వతాలకు వెళ్లి శివునికై తపస్సు చేశాడు. సంస్కృతంలో ఆరు గ్రంథాలు రాశాడు. అందులో వేదాంత వ్యాఖ్యానం, పరమార్థ గీత మాత్రమే లభించినా ఇవి బహుళ వ్యాప్తి చెందాయి.❀

## 181) మహా మహిమాన్వితుడు - మల్లికార్జున శివ యోగి -1600

కాశీ విశ్వారాధ్య జగదురువు మల్లికార్జున మహాయోగి ఔరంగ జేబు పాలనలో ఉన్నాడు. ఎల్లప్పుడూ జగంబుహారీ మఠంని శివలింగంపై దృష్టిపెట్టి శివ ధ్యానంలో గడిపేవాడు. ఒకసారి మహాధ్యాన సమాధిలో ఉండగా ఔరంగజేబు వచ్చి సైన్యంతో మఠాన్ని కూల్చేశాడు. సమాధినుంచి బయటికొచ్చిన శివయోగికి విషయం తెలిసి ద్వారం దాకా వచ్చి విపరీతమైన కోపంతో మంత్రోచ్చారణ చేయగా సైన్యం చెల్లాచెదురై పారిపోయింది. ఔరంగజేబు చక్రవర్తి నేలపై మూర్ఛపోయి పడిపోయాడు. జేబు యోగిని విపరీతంగా ప్రాధేయపడి తప్పు కాయమని కోరగా క్షమించాడు. తన సైన్యం కూల్చేసిన ప్రదేశాన్ని అంతటినీ మఠానికి రాసిచ్చేశాడు జేబు. దానపత్రం కాశీలో జగంభారి మఠంలో భద్రంగా ఉంది. దానపత్రంలో “మఠం దగ్గరకు చేరేసరికి అక్కడి నల్లటి శివలింగం కళ్ళలో నుంచి కాలాగ్ని విజృంభించి భూమ్యాకాశాలను కప్పేసింది. భయంతో కంపించి నిలుచుండిపోయి నిశ్చేస్టుడనై ఇక్కడికొచ్చి ఆశ్రయం పొందాను. అందుకే ఈ భూమిని భక్తితో దానంగా రాసిస్తున్నాను” అని ఉంది. శివ యోగి భక్తి తత్పరతకు రేవా రాజు భావ సింగ్ దేవా, అవధ్ సింగ్ దేవాలు మఠ నిర్వహణ కోసం ఒక గ్రామాన్ని దానం చేశారు. ఈ దాన పత్రమూ ఆ మఠంలో చూడవచ్చు.❀

## 182) కేరళలో వివిధ రూపాలో వర్ధిల్లిన సంస్కృత నాటకాలు - 1600-1900

సంప్రదాయ, జానపద పద్ధతులలో సంస్కృత నాటకాలు కేరళలో బహుళ వ్యాప్తి పొందాయి. అభినయ శైలి అద్భుతం. ఈ ప్రదర్శనా రూపకాలు -కుట్టియాట్టం, ఛాక్యార్ కుట్టు, నంగ్యార్ కుట్టు, కృష్ణోత్తం అని వేర్వేరు రకాలు.

1-కుట్టి యా ట్టోమ్ - కేరళలో సంస్కృత నాటకాలు ఆడటం ప్రారంభమైనది దీనితోనే. ఇది దేశంలో మిగిలిన చోట్లకంటే కొంచెం భిన్నంగా ఉంటుంది. అతి ప్రాచీన కళ ఇది. కుట్టి అంటే కూడి అంటే కలిసి అని, అట్టం అంటే నటించటం. అంటే కలిసి నటించటం అన్నమాట. నృత్యనాటకంలో ఉపరూపక విధానం. భరతముని చెప్పిన అన్ని సిద్ధాంతాలను దీనిలో పాటిస్తారు. ఈ కళ 10వ శతాబ్దికి బాగా వ్యాప్తి చెందిన అతి ప్రాచీన ప్రదర్శన విధానం. కులశేఖర వర్మ కేరళలో దీన్ని మొదటిసారిగా ప్రదర్శించారు. దీనిలో ఆంగిక, వాచిక, సాత్విక ,ఆహార్య అభినయాలుంటాయి. ముద్ర, చారి పద్ధతులను వాడతారు. తాళానికి మిలవు, ఇడక్క, కూడంకుల, కూళితాళం ఉపయోగిస్తారు. కుట్టియాట్టోమ్‌లో ప్రదర్శించే సంస్కృత నాటకాలు -శక్తి భద్రుని ఆశ్చర్య చూడామణి నాటకం, సుభద్రా ధనుంజయం, కులశేఖరుని తపతీ స్వయంవరం హర్షుని నాగానందం, నీలకంఠుని కళ్యాణ సౌగంధికం, బోధాయన కవి రాసిన భగవదజ్జుక, భాసుని అభిషేక, స్వప్న వాసవ దత్త, దూత వాక్య నాటకాలు.

2-చాక్వార్ కుట్టు -ఇందులో నంజి యార్, నంబియార్‌లు ఉంటారు. కుట్టియాట్టోమ్‌లో ఇది విదూషక భాగం. ముఖ్యకథను హాస్యపద్ధతిలో అప్పటికాలానికి అన్వయిస్తూ విదూషకుడు చెబుతాడు. ఇది సంఘ దురాచారాలను ఖండించే రూపక విధానం.

3-నగరికుట్టు -ఇందులో ఆడవారే స్త్రీపాత్రలను ధరించటం ప్రత్యేకత. నంబియార్ కుటుంబాలకు చెందిన నంగియార్‌లు నటిస్తారు. శ్రీ కృష్ణ కథలనే ప్రదర్శిస్తారు. వీటిలో ఏకాంకికలూ ఉంటాయి. చేటి నిర్వహణ బాధ్యత తీసుకొని కథావృత్తాన్తమ్ తెలియజేస్తుంది.

4-కృష్ణో ట్టం -ఇది అతిప్రాచీన సంప్రదాయ నృత్యనాటక ప్రదర్శన విధానం. దీనిని 1654లో గురువాయూర్ శ్రీ కృష్ణ దేవాలయంలో మొట్టమొదట ప్రదర్శించారు. ఇందులో శ్రీకృష్ణుని జన్మ వృత్తాన్తమ్ దగ్గరనుంచి స్వర్గారోహణ వరకు 8 కథలను 8 రాత్రులు ప్రదర్శిస్తారు. ఇందులో నృత్య సంగీతాలకే అధిక ప్రాధాన్యం. సంస్కృత సంగీత నాటకాలకు కేరళ ప్రజలు ఇస్తున్న ఆదరణకు ఇవన్నీ అద్దం పడుతూ వారి సాంస్కృతిక అభిరుచికి జోహార్లు అందుకొంటున్నాయి.❀

## 183) హంస సందేశ కావ్య కర్త - పూర్ణ సరస్వతి (1600)

కేరళకు చెందిన 16వ శతాబ్దపు కవి పూర్ణ సరస్వతి -పూర్ణ జ్యోతిష్యుని శిష్యుడు. ఉత్తర మలబార్‌లోని కాట్టుమటం ఇల్లాంకు చెందినవాడు. పూర్ణ సరస్వతి వంశాన్ని పరశురాముడు ఆశీర్వదించినట్లు ఐతిహ్యం. అనేక శాస్త్రాలలో విస్తృత పాండిత్యం కవిత్వ రచనలో మేటి అవటం వలన ఆయనకు పూర్ణ సరస్వతి అనేది బిరుదుగా లభించిన పేరు. కావ్యంలో పూర్వభాగం, ఉత్తరభాగం అని రెండు విభాగాలున్నాయి. మొత్తం 102 శ్లోకాలు. కాంచీపురంలో ఒక కన్య ఒక ఉత్సవంలో శ్రీ కృష్ణుని మోహన రూపం చూసి మనసు పారేసుకొన్నది. ఒక హంసతో తన మనోభావాలను బృందావన కృష్ణునికి సందేశంగా పంపటం ఇతివృత్తం. రాయబారి హంస చేర, పాండ్య దేశాలు చూస్తూ కావేరి, కాళింది, తామ్రపర్ణిలను దాటి తిరువనంతపురం వగైరాలను చూస్తూ బృందావనం చేరింది వీటినన్నిటిని కవి చక్కగా అందంగా వర్ణించాడు. తిరువాన్కూర్ రాజు సర్వకళా వల్లభ వంశీష. ఆయన బలపరాక్రమాలు వర్ణించాడు. బహుశా ఈ రాజు స్వాతి తిరుణాల్ రామవర్మ కావచ్చును. ఆయన రాజరికానికి వచ్చిన 1829-46 కాలంలో ఈ కావ్య రచన చేసి ఉండాలి. ఇందులో సుచీన్ద్రంలోని ప్రసిద్ధ “కై ముక్కు” అంటే వేడి నేతిలో చేయిపెట్టటం కూడా వర్ణితం. దోషి ఎవడైనా శుచీన్ద్రాలయంలో వేడి నేతిలో చేయి పెట్టించి దోషి అవునో కాదో నిర్ణయిస్తారు. దోషి అయితే చేయి కాలిపోతుంది. లేకపోతే ఏమీ కాదు.

కావ్యంలో దేవదాసి వ్యవస్థ వర్ణన కూడా ఉన్నది. తామ్రపర్ణి నదీతీర బ్రాహ్మణ అగ్రహారాలు స్నానఘట్టాలు ప్రకృతి సౌందర్యం వర్ణన కూడా కనిపిస్తుంది. బ్రాహ్మణులను భూదేవతలు అని వర్ణించాడు కవి.❀

## 184) మయూర సందేశ కర్త – ఉదయ (1600)

కేరళ సందేశకావ్యాలలో మయూర సందేశం తలమాని కమైనది. దీనికర్త ఉదయ 16వ శతాబ్ది రాజకవి. ధ్వన్యాలోకానికి అభినవ గుప్తుడు రాసిన లోచన వ్యాఖ్యానికి ఈయన "కౌముది" వ్యాఖ్య రాశాడు. ఉదయ మానాకులం రాజా వంశీకుడు. వీరిపూర్వీకుడు శ్రీకంఠ మహాకవి. శ్రీకంఠుడు అనే నాయకుడు అంటే కవే కున్నాం కులం వద్ద అన్నకారలో ఉన్న తన ప్రేయసి మార చేమంతికి మయూరం ద్వారా తన మనసులో మాటను రాయబారంగా పంపటం. త్రివేంద్రం నుండి అన్నకారకు మాప్ వేసి దారి చూపించదు కవి. సముద్ర తీరం వెంబడి వర్కాల నుంచి క్విలన్‌కు వెళ్లి, అక్కడి నుంచి తూర్పుకు తిరిగి కంటియూర్ మీదుగా కాయముకులం రాజుల రాజధాని కొట్టాయం చేరి, పుల్లా నదిదాటి కొచ్చిన్ రాజులువుండే త్రిపునీతురా వెళ్లి, అల్వాయ్ నదిదాటి చిన్నమంగళం క్రన్ననూర్ మీదుగా బ్రహ్మమక్కాలకు తన ప్రేయసిని చేరుకోవాలి అని రూట్ మాప్ ఇచ్చి పంపాడు. ఇందులో చెప్పబడిన రాజులు మహాకవులు వ్యాఖ్యానాలు రాసినవారు. కోళంబ అనేది కూపకులుల నగరం.❋

## 185) కామ సందేశ కర్త – మాతృ దత్త – (1600)

కేరళకు చెందిన మాతృ దత్త కవి "కామ సందేశం" కావ్యం రాశాడు. మేల్పత్తూర్‌కు చెందిన ఈ కవి వ్యాకరణవేత్త. నారాయణ భట్ కుటుంబానికి చెందినవాడు. కావ్యం మొదటిభాగంలో 66, రెండవభాగంలో 69 శ్లోకాలున్నాయి. భార్యతో ఆనందంగా గడుపుతున్న అతనిని ఒక రాక్షసుడు ఎత్తుకుపోయి చిదంబరంలో ఉంచుతాడు. అక్కడ కామ దేవుని కలిసి తిరునావయలో తన భార్య చంద్ర లక్ష్మికి అతని ద్వారా సందేశం పంపటం ఇతివృత్తం. అందరు సందేశకర్తల లాగానే ఈ కవీ రూట్ మాప్ ఇచ్చి పంపిస్తాడు. దారిలో రెండుసార్లు కొచ్చిన్ రాజు రామవర్మ ప్రస్తావన ఉంది. కావేరి నదికి ఉపనదిని కొల్లిదం అంటారు. కొచ్చిన్ రాజుకు పోర్చుగీసు వారికి మధ్య జరిగిన టోల్ ఒప్పందం కూడా ఇందులో ఉంది. 16వ శతాబ్దంలో త్రిచూర్‌లో కొచ్చిన్ రాజభవన్ నిర్మాణాలు, పాత రాజభవనాల విషయమూ ఉంది. రామవర్మ అంటే 1764 నుంచి 1801వరకు పాలించిన కేశవ రామ వర్మ అని గుర్తించారు. 1774లో కోట గోడలు మట్టితో నిర్మించటం అగడ్తలు త్రవ్వటం కూడా కవి రాశాడు. ఈయన కాలంలోనే పోర్చుగీసులతో ఒప్పందం కుదిరింది. రాజు ముసలితనంలో కాశీ యాత్రకు వెళ్లి అక్కడే కైలాసం పొందాడు. ఈ సందేశంలో కాలికట్ నాయకరాజుల, జమెరియన్ రాజుల వర్ణన ఉన్నది. కావేరి నాదీ తీర బ్రాహ్మణులూ, వివిధ వృత్తులవారు అచ్యుతప్ప నాయకుని ప్రశస్తి ఉన్నాయి.❋

## 186) శుభగ సందేశ కర్త - నారాయణ - (16వ శతాబ్దం)

కేరళ త్రిసూర్‌కు చెందిన నారాయణకవి శుభగ సందేశం రాశాడు. అంతకంటే జీవిత విశేషాలు తెలియవు. ఏవో కొన్ని అనివార్య కారణాలవల్ల దెయ్యం బారినపడి కన్యాకుమారిలో ఉండవలసి వచ్చి త్రిసూర్‌లో ఉన్న భార్యకు దూరమయ్యాడు. విరహవేదన తట్టుకోలేక పోతున్నాడు. కన్యాకుమారి అమ్మవారి పూజారి స్నాతక బ్రాహ్మణుడైన సుభగ పరిచయమవగా భార్యకు అతనితో సందేశం పంపటమే కథ. కవి జయసింహనాడు పాలకుడు రామవర్మ ఆశ్రితుడు. రాజు ఆశ్రిత పోషణ గురించి వర్ణించాడు. పరిశోధకుడు ఉల్లూర్ ఈ రామవర్మ అంటే విజయనగర రాజులతో యుద్ధం చేసిన ఉదయ మార్తాండ వర్మ సోదరుడు అని చెప్పాడు. కొట్టాయంలోని చంపకాస్సేరి దేవాలం, దాని కోశాధికారి యజ్ఞనారాయణను రాజా రామవర్మ నియమించటం ఉన్నాయి.❀


## 187) ప్రయోగ రత్నమాల వ్యాకరణ కర్త - మహా మహోపాధ్యాయ పురుషోత్తమ విద్యా వాగీశ (1600)

16వ శతాబ్దం నుండి అస్సామ్‌లో సంస్కృత వ్యాకరణంలో కొత్త వ్యాకరణ సిద్ధాంత బోధన మొదలైంది. దీనికి ప్రాతిపదికగా మహా మహోపాధ్యాయ పురుషోత్తమ వాగీశ "ప్రయోగ రత్నమాల వ్యాకరణం" 1568లో రాశాడు. దీనితో అస్సామ్ లోయ ప్రాంతంలో పాణినీయ వ్యాకరణ బోధ మానేసి ఈ వ్యాకరణాన్ని బోధించటం ప్రారంభించారు. బెంగాలీ భాష మాట్లాడే బారక్ లోయలో మాత్రం "కలాపా", "ముగ్ధ బోధ" వ్యాకరణాలు బోధిస్తున్నారు. వీటిలోని అక్షరమాల తంత్ర సిద్ధాంతంపై ఆధారపడి ఉంటాయి. ఈ వ్యాకరణమే కాక పురుషోత్తమ వాగీశుడు 1-షడ బేధ ప్రకాశం, 2-ఊష్మ భేద, 3- "వకార" నిర్ణయం, 4-అంకురావలి కోశ, 5-హారావలి కూడా రాశాడు.❀

## క్రీ.శ 1601-నుండి 1700 వరకు- 17వ శతాబ్దం-

## 188) యానక భాగవత కర్త - కవి రత్న పురుషోత్తమ మిశ్ర - 1606-1680

నారాయణ గజపతి గురువు కవితారత్న పురుషోత్తమ మిశ్రా శాండిల్య గోత్రీకుడు "యానక భాగవత మహా కావ్యం" రచించాడు. నీలాద్రి శతకం, సుబంత, ప్రదీపిక, అనర్ఘ రాఘవ నాటక టీకా, రామచంద్ర ప్రబంధం, తాళ శనిగ్రహం వంటి రచనలెన్నో చేశాడు. 1606 జన్మించి 1680లో చనిపోయాడు.❀



## 189) కోసలానంద మహాకావ్య కర్త – గంగాధర మిశ్ర –1620

17వ శతాబ్ది పూర్వార్ధ కవి గంగాధర మిశ్ర కోసలానంద మహాకావ్యం రాశాడు. ఇందులో 21 కాండలు, 1200 శ్లోకాలున్నాయి. బలంగీర్ సోనేపట్, సంబల్పూర్ పాలకులైన చౌహాన్ రాజుల సంక్షిప్త చరిత్ర ఈ కావ్యం.❁




## 190) రామ చంద్ర మహోదయ కర్త – శ్రీ సచ్చిదానంద భారతి – 1623-1663

25వ శృంగేరి జగద్గురువులు శ్రీ సచ్చిదానంద భారతి రామ చంద్ర మహోదయం, గురుస్తుతి శతకం, రామ భుజంగ స్తోత్రం మీనాక్షి అష్టకం మీనాక్షి శతకం రాశారు. మదురై జిల్లాలో జన్మించిన వీరు బాల్యంలోనే వేదం అంతా నేర్చిన ప్రజ్ఞాని. వెంకటప్ప నాయకుని ఆహ్వానంపై కిక్కిరి దర్శించి అక్కడనుండి కొల్లూరులో మూకాంబికా దేవి సందర్శనం చేశారు. వెంకటప్ప కొడుకు వీరభద్ర నాయక్ కిక్కిరి సింహాసనం అధిష్టించిన కొద్దికాలానికే భైరవుడు అనే కళాశాల ముఖ్యుడు దాడిచేసి రాజ్యంలో శృంగేరి కూడా ఉన్న ఒక చిన్న భాగాన్ని ఆక్రమించాడు, మూర్ఖత్వం తలకెక్కి భైరవుడు శృంగేరి గురువుకు తమ మఠ ఆస్తులన్నీ స్వాధీనం చేయమని తాఖీదు పంపాగా స్వామీజీ తిరస్కరించారు. వాడు మూర్ఖంగా శృంగేరిపై పడి, మఠ సంపదను దోచుకొని మఠాన్ని రక్షించటానికి నాయక రాజుసైన్యాన్ని ఓడించి రెండో సారీ వచ్చి దోచుకొని

మూడవసారీ రాగా, సహాయానికి నాయక సైన్యం వచ్చినా మఠాన్ని రక్షించాలంటే తన తపస్సు తప్ప వేరే మార్గం లేదని గ్రహించి తీవ్ర తపస్సమాధిలో ఉండిపోయారు. అప్పుడు ఆయనకు శృంగేరిలో సకల దేవతలు శత్రువును ఎదిరించి పోరాడినట్లు గ్రహించారు. సమాధినుండి బయటకు రాగానే భైరవ సైన్యం ఓడిపోయిందన్న వార్త విన్నారు శ్రీ సచ్చిదానంద భారతీస్వామి. ఈ ఆనంద సమయంలోనే వారు రామచంద్ర మహోదయం రాశారు. వీరభద్ర శివప్ప భద్రప్ప హనుమప్ప నాయకులు శృంగేరి శారదా పీఠానికి అనేక అమూల్య సంపదను కానుకలుగా పంపారు. బెద్నూర్‌ను సందర్శించి వచ్చాక స్వామీజీ మహానికారేశ్వర దేవాలయంలో భవానీ దేవిని ప్రతిష్టించి, అనేక ఉత్సవాలు రథోత్సవం నిర్వహింప జేశారు – "సత్య స్వరూపం సదా జ్ఞాన నిష్టం సాక్షాచ్చివం పరం –సదా దానరతం దాంతం సచ్చిదానంద మాశ్రయే".❁

## 191) వసంతోత్సవ మహా కావ్య కర్త – హాలాధర మిశ్ర –1623–1647

ఒరిస్సా ఖుర్దా సంస్థాన రాజు గజపతి నరసింహ దేవకాలంలో హలధర మిశ్ర గొప్ప సంస్కృత కవిగా గుర్తింపబడ్డాడు. ఈయన "వసంతోత్సవ మహాకావ్యం", "సంగీత కల్పలత" గ్రంథాలు రాశాడు. వసంతోత్సవ కావ్యం 22 కాండాలతో వైశాఖ శుద్ధ విదియ నాడు రాజు నరసింహ దేవ ప్రారంభించిన పూరీ జగన్నాధ రథోత్సవ వర్ణన ఉన్నకావ్యం. కావ్య ప్రారంభంలో గజపతి వంశ సంస్థాపక రాజు గజపతి రామ చంద్ర దేవుని నుంచి ప్రస్తుత రాజు నరసింహ దేవ వరకు వంశ చరిత్ర చెప్పాడూ కవి. ఇదికాక "హలధర కారిక" వ్యాకరణ గ్రంథం రాశాడు, సద్బ్రాహ్మణ వంశంలో శంభుకార మిశ్రాకు కొడుకు, కృష్ణదాసు కవితో పోటీగా సంగీత కల్పలత సంగీత గ్రంథం కూడా రాశాడు. దీనిలో 17 స్తభకాలున్నాయి, ఈయన రాసిన మరొక గ్రంథం "హలధర ప్రకాశం"లో వాననగర హరిచందన, హీనంగ భీమా, మదుపుర నరేంద్ర, అనంగ భ్రమర్దర్, గజపతి ముకుంద, గజపతి రామ చంద్ర దేవ్ గజపతి ప్రతాపరుద్ర దేవ, మేనకాదీ కానల పతమహాదీ అనే కొందరు కొత్తకవులను పేర్కొన్నాడు.❁



## 192) లక్ష భగవన్నామ శ్లోక కర్త – బోధేంద్ర సరస్వతి – 1638–1692

కంచిలో కేశవ పాండురంగ సుగుణలకుమారుడుగా 1610లో జన్మించి శృతి స్మృతులలో అశేష పాండిత్యం సాధించి, రామ నమ నామ సంకీర్తనలో తరించి, రోజుకు లక్షసార్లు రామనామము చేస్తూ శ్రీ ఆత్మ బోదేంద్ర సరస్వతి దృష్టిలో పడి లక్ష్మీధరుడు రాసిన భగవన్నామ కౌముదిని, పూరీలో ఆయనవద్దనే అభ్యసించి, దానినాధారంగా ఒక లక్ష భగవన్నామాలు వ్రాయమని ఆదేశించి తర్వాత కంచికి రమ్మని కోరారు. అలాచేయగానే 59వ జగద్గురువుగా అభిషేకించారు. దేశ పర్యటన చేస్తూ వీరు కావేరీ డెల్టా ప్రాంతంలో పర్యటిస్తూ అక్కడి ప్రకృతి అందాలకు మురిసి అక్కడే మహా సిద్ధిని 1638లో పొందారు.❁




## 193) కాళీపూజ కర్త – కృష్ణానంద వాగీశ –1650

వారెందర బెంగాలీ బ్రాహ్మణుడైన కృష్ణానంద వాగీశ 1650లో చైతన్య ప్రభు జన్మించిన నవ ద్వీపంలో మహేశ మిత్రునికి జన్మించాడు. గొప్ప పండితుడు, సాధకుడు. వేదాన్ని తంత్ర శాస్త్రాన్ని మధించినవాడు. అనేక శాస్త్రాలు చదివినందువలన మహామహోపాధ్యాయ బిరుదు పొందాడు. తమ్ముడు సహస్రాక్ష మిత్ర గొప్ప వైష్ణవ భక్తుడు. శ్రీ కృష్ణ ఉపాసకుడు. ప్రణతోషిణి రాసిన రామతోష ఖుడికి 7వ తరం వాడు. బెంగాల్ ప్రాంతంలో తాంత్రిక విద్య వ్యాప్తి చేసిన వారిలో ప్రధముడు.

"ఆగమేశ్వరికాలి మా" అనే నవద్వీప పూజా విధానాన్ని ప్రారంభించాడు. బీర్భంలోని మోల్లెపూర్‌లో యోగ సాధన చేస్తూ తనువు చాలించాడు.


కలకత్తాదక్షిణ కాళీ ఆరాధన ప్రారంభించింది కూడా ఈయనే. ఒక రోజు కాళికా దేవి కలలో కన్పించి, మర్నాడు ఉదయం ఆయనకు ఎవరు ఏ రీతిలో కనిపిస్తే ఆ రీతిలో తనను పూజించే పద్ధతిని ప్రచారం చేయమని కోరింది. మర్నాడు ఉదయం లేవగానే ఒక యువతీ ఆవుపేడతో పిడకలు చేసి గోడకు కొడుతూ ఉండటం చూశాడు. గోడకు పిడక కొట్టేటప్పుడు ఆమె "ఆలీఢ భంగిమ"లో కుడి పాదం ముందుకు చాచి, కృష్ణానందను చూడగానే ఆమె కంగారుతో నాలుకను దంతాల మధ్య పెట్టి కనిపించింది. కృష్ణానంద ఈ భంగిమను మరింత వాస్తవాని దగ్గరగా మలచి కాళీ మాత పూజా విధానాన్ని ఏర్పాటు చేశాడు. క్రిష్ణానందుడు కాళీ భక్తులకు, కవి రాం ప్రసాద్ సేన్‌కు గురువు.❀

## 194) సంగీత నారాయణ కర్త - గజపతి నారాయణ దేవ-1650

17వ శతాబ్ది ఒరిస్సా నేలిన పార్ల క్షేముండి రాజ వంశానికి చెందిన ప్రఖ్యాత మహారాజు గజపతి నారాయణ దేవ చిరస్మరణీయమైన సంగీత గ్రంథం "సంగీత నారాయణ" రచించాడు. దీనికి ఒరిస్సాలోని కాక ఆంధ్ర, బెంగాల్ కర్నాటకాది రాష్ట్రాలలో కూడా బాగా ప్రాచుర్యం ఉంది. ఈ రాజు "అలంకార చంద్రిక" కూడా రాశాడు. సంగీత నారాయణలో భారతీయ సంగీత నాటక పిత ప్రసిద్ధ ఆలంకారికులైన భరత మునిని ప్రస్తుతించి మిగిలిన అలంకారికులనూ మెచ్చుకున్నాడు. ఇతని తండ్రి పద్మనాభ దేవ.❀

## 195) మనోహారిణి టీక కర్త - కవి రత్న నారాయణ మిశ్ర -1650

మహా మేధావి. కావ్యనాటక అలంకార సంగీత నిధి కవితారత్ననారాయణ మిశ్ర కవితారత్న పురుషోత్తమ మిశ్ర కుమారుడే. హరీశ దూతకు మనోహారిణి టీకా రాశాడు. ఇదే ఆ గ్రంథానికి మొట్టమొదటి టీకా. దీనికి ఒరిస్సా బెంగాల్‌లలో మంచి గిరాకీ ఉంది. సంగీత నారాయణ కర్త నారాయణ మిశ్ర అని, కానీ రాజు గజపతి నారాయణ దేవుని పేరు పెట్టాడని లోకంలో ప్రచారం ఉంది.❀



## 196) కళానిధి - దేవర్షి శ్రీ కృష్ణ భట్ -1675-1761

17వ శతాబ్దపు జైపూర్ రాజు రెండవ సవాయ్ జైసింగ్‌కు సమకాలికుడైన శ్రీ కృష్ణ భట్ కవి, సంస్కృత పండితుడు చరిత్రకారుడు వ్యాకరణ వేత్త. బుండీ, జైపూర్ రాజాస్థానాలలో సంస్కృతం వ్రజ భాషలకు విశేష ప్రాచుర్యం కలిగించినవాడు. ఆంధ్రప్రదేశ్‌లో వెలనాటి కుటుంబంకు చెందిన వీరు 15వ శతాబ్దిలో ఉత్తరదేశాలకు వలస వెళ్లి అక్కడే రాజాస్థానాలలో స్థిరపడ్డారు. తండ్రి లక్ష్మణ భట్టు.

**తెలంగాణా నుంచి జైపూర్‌కు**

జైపూర్ రాజు రెండవ సవాయ్ జైసింగ్ (1688-1743) సాహితీ సమరాంగణ సార్వ భౌముడు. ఆయన రాజ్య పాలనలో దేశంలోని సంస్కృత విద్వాంసులను కవి గాయక నర్తకులను శిల్ప చిత్రకారులకు తన ఆస్థానానికి సగౌరవంగా ఆహ్వానించి ఆస్థాన విద్వాంసులుగా నియమించాడు. అలా వచ్చినవారిలో మనకవి దేవర్షి శ్రీ కృష్ణభట్టు ఉన్నాడు. మహారాజు 1716లో చేసిన అశ్వమేధ యాగానికి, 1734లో నిర్వహించిన వాజపేయానికి జైపూర్ నగర నిర్మాణానికి మన కవి సాక్షీభూతుడు. కృష్ణ భట్టు రాసిన "ఈశ్వర విలాసం" మహాకావ్యం జైసింగ్ మహారాజు ఆతని కుమారుడు ఈశ్వరసింగ్‌ల రాజ్యపాలనా చరిత్రను వర్ణించినదే.

హరి హర భట్టు రాసిన "కుల ప్రబంధం"లో తెలంగాణాకు చెందిన భట్టు వంశీయుల మొదటి తరం వారు. అక్కడినుంచి ఇక్కడికి వచ్చి చేరారో తెలియ జేస్తుంది. శ్రీ శంకరాచార్య, శ్రీ వల్లభాచార్య లవంటి గురువుల శిష్యులై, వారి దేశాటనంలో భాగస్వాములై వీరు ఉత్తర భారతానికి చేరారట. వీరి ప్రతిభా పాండిత్యాలకు రాజులు అబ్బురపడి తమ సంస్థానాలలో గౌరవ స్థానాలు అందజేశారట. వీరిలో రాజ గురువులైనవారు ఆస్థాన కవులు ఆస్థానపండితులు ఆస్థాన విద్వాంసులు అయిన వారెందరో ఉన్నారట. కాశీలాంటి పట్టణాలలో విద్యాభ్యాసం కోసం వచ్చిన వారి సామర్ధ్యాన్ని గుర్తించి రాజాస్థానాలకు ఆహ్వానించి ఉన్నత స్థానాలను రాజులు కల్పించారట. క్రమంగా వీరు తమ తెలుగును మర్చిపోయి హిందీ లేక తాము ఉన్న ప్రాంత భాషకు

అలవాటు పడిపోయారని కుల ప్రబంధం తెలియజేస్తోంది.

ఇలా వచ్చినవారిలో తెలంగాణాలోని దేవర కొండకు చెందిన బావాజీ దీక్షిత కుటుంబం వల్లభాచార్యుల వారితో 15వ శతాబ్దిలో ఉత్తర భారతదేశానికి చేరింది. ఆనాటి విద్యా కేంద్రాలైన కాశీ, ప్రయాగలలో దీక్షితులు విద్య నేర్చి స్థిరపడ్డాడు. సంతానమూ ఇక్కడే ఉండి పోయింది. అప్పుడు ఈ రెండుప్రాంతాలూ మధ్యప్రదేశ్‌కు చెందిన రేవా సంస్థానంలోనే ఉండేవి. దీనికి ప్రయాగ సరిహద్దు. బావాజీ దీక్షితుల మనవడు మండన దీక్షితుల ప్రతిభావికాసాలను గుర్తించిన రాజు గోపాల్సింగ్ తన రాజగురువుగా రేవా సంస్థానానికి ఆహ్వానించి "దిద్రికీయ" గ్రామాన్ని రాసిచ్చి గౌరవించాడు. ఈ గ్రామం పేరు ఆంధ్రప్రదేశ్‌లోని వారి గ్రామం పేరు దేవరకొండను జ్ఞాపకం చేసేదిగా పెట్టుకొనగా క్రమంగా ఇంటిపేరు "దేవర్షి" అయింది. ఈ వంశంలోనే కవి కళానిధి దేవర్షి శ్రీ కృష్ణ భట్టుకవి జన్మించాడు. 1755-1809 వరకు రేవాను పాలించిన అజిత్ సింగ్ అనే బాంధవ్ నరేష్ పాలనలో ఈ కుటుంబం ఉన్నది.

బుండీ సంస్థానంలో గౌరవ స్థానం.

రేవా, బుండీ రాజులు పరస్పరం వియ్యం అందుకోవటం వలన రెండు రాజ్యాలు మరింత సన్నిహితమయ్యాయి. భుండీ రాజులూ కవి పండితాభిమానులు అందువలన కవిపండితులు రేవా నుంచి బుండీకి ఆహ్వానించి తమ ఆస్థానంలో గౌరవ స్థానాలలో నియమించి గౌరవించారు. అలా కవి కళానిది దేవర్షి శ్రీ కృష్ణ భట్టు 1696-1735 కాలంలో బుండీని పాలించిన రాజా బుద్ సింగ్ ఆస్థాన పురోహితుడై రాజుకు అత్యంత సన్నిహితుడైనాడు.

వేద వేదాంగ పురాణ, ఉపనిషత్ వ్యాకరణ సంగీతాలలో అసమాన ప్రాభావమున్న క్రష్ణభట్టుకు బుండీ రాజ్యంలో ప్రజలలకు అత్యంత గౌరవాభిమానాలుండేవి. వీటితోపాటు కవిత్వంలోనూ అపార ప్రతిభ ఉన్నందున సంస్కృత, ప్రాకృత, వ్రజ భాషలలో గొప్ప కావ్యాలు రచించాడు. మహా వక్త కూడా అయిన క్రష్ణభట్టు వాక్ ప్రవాహానికి జనం ముగ్దులయ్యేవారు. ఆయన రచించిన "అలంకార కళానిధి", "శృంగార రసమాధురి", "విదగ్ధ రస మంజరి" మంచి ఖ్యాతిని ఆర్జించాయి.

**బుండీ నుండి జైపూర్‌కు**

కృష్ణ భట్ట కవి అసాధారణ ప్రతిభకు ముగ్ధుడైన బుండీ రాజు బుద్ సింగ్ బావగారు అంబర్ అంటే జైపూర్ మహారాజు రెండవ జైసింగ్ బావగారిని ఒప్పించి భట్టు అంగీకారంతో కవి కళానిధి దేవర్షి కృష్ణభట్టును సర్వలాంఛనాలతో తన జైపూర్ సంస్థానానికి సగౌరవంగా "రాజ పురోహితుని"గా ఆహ్వానించి గురు గౌరవం కలిగించాడు. ఈ విషయాలన్నీ అనేక చారిత్రిక గ్రంథాలలో ఉల్లేఖించబడి ఉన్నాయి -"బుండీ పతి బుధ సింహ సౌరి ల్యే ముఖ సౌరి యాచి" అంటే జై సింగ్ బుండీ బుద్ సింగ్ నుస్వయంగా

ముఖతా వేడుకొని శ్రీకృష్ణ భట్‌ను అంబర్ పేట్ అంటే జైపూర్‌కు తీసుకొని వెళ్ళాడు" అని ఒక డాక్యుమెంట్ ఉన్నది.

కృష్ణ భట్టు "ఉత్తర భారతీయ ఆంధ్ర తెలంగాణ భట్టు వంశ వృక్షం" గ్రంథంలో తమ భట్టు వంశం వారు ఆంధ్రనుండి ఉత్తరభారతానికి వలస వెళ్ళిన వివరాలు వర్ణించి చరిత్ర తెలియజేశాడు. ఇందులోనే "వెలనాడు తెలంగాణా బ్రాహ్మణ వంశం ఉత్తర భారతం చేరిన వైనమూ ఉన్నాది. భట్టు కుటుంబంలో ద్వారకానాద భట్టు, జగదీశ్ భట్టు, వాసుదేవ భట్టు మండన భట్టు, దేవర్షి రమణయ్య శాస్త్రి, భట్ట మధురానాద శాస్త్రి, దేవర్షికాలనాధ శాస్త్రి వంటి సంస్కృత కవి దిగ్గజాలవంటి వారెందరో ఉన్నారు.

**రామ రాస కావ్యం**

కృష్ణ భట్టు ప్రతిభా సామర్థ్యాలకు మెచ్చిన జైసింగ్ మహా రాజు "కవికళానిధి", "రామ రాసా చార్య"అనే ఉత్తమ బిరుదులూ ప్రదానం చేసి సన్మానించాడు. రామ రాసాచార్య బిరుదు నివ్వటం వెనుక ఆసక్తికరమైన ఒక చిన్న కథ ఉంది. ఒకరోజు రాజా జైసింగ్ రాజదర్బారులో అకస్మాత్తుగా "శ్రీ కృష్ణ రాస లీలలు"లాగా "శ్రీరామ రాస లీలలు" గ్రంథం ఉందా? అని అడిగాడు. సభ అవాక్కైంది. ఎవరూ చెప్పలేక పోయారు. సభలో కృష్ణ భట్టూ ఉన్నాడు. అప్పుడు భట్టు లేచి "కాశీలో "రామ రాసలీలలు" పుస్తకం ఉందని చెప్పాడు. రెండు నెలలలోగా ఆ పుస్తకాన్ని సంపాదించి తనకు చూపించమని రాజు ఆనతిచ్చాడు. కృష్ణ భట్టు ఇంటికి వచ్చి దానిపైనే ఆలోచించటం ప్రారంభించాడు. అలాంటి పుస్తకం లేదని తెలుసు. కాని సభలో ఉందని తానే చెప్పాడు ఎలా? ఇక తానే రెండు నెలల గడువు లోపల రాసి పూర్తి చేసి, రాజుకు చూపించాలనే నిర్ణయానికి వచ్చాడు. అంతే "రామ రాస" కావ్యాన్ని వ్రజభాషలో రామాయణంలాగా రాయటం ప్రారంభించి గడువు లోపల పూర్తిచేసి సభలో జైసింగ్ మహారాజుకు సమర్పించాడు. పరమానంద భరితుడైన మహారాజు భట్టును విశేష ధన కనక వస్తువాహనాలతో సత్కరించి "రామ రాసాచార్య" అనే బిరుదు ప్రదానం చేశాడు.

**కృష్ణ భట్ట కవితా గీర్వాణం**

కవి కళానిధి కృష్ణ భట్టు – "ఈశ్వర విలాస మహాకావ్యం", వ్రజభాషలో అలంకార కళానిధి, సుందరీస్ట వరద, పద్య ముక్తావళి, వృత్తి ముక్తావళి, జాజౌ యుద్ధ, రామ చంద్రోదయ, వ్రజ భాషలో శృంగార రరసమాధురి, వృత్త చంద్రిక, వేదాంత పంచదశి, సంభర యుద్ధ, రామ రాస, జయసింహ గుణ సరిత, విదగ్ధ మాధురి, టీకా ఉపనిషత్, నఖ శిఖ వర్ణన, బహుదుర విజయ, రామగీతం, దుర్గా భక్తి తరంగిణిమొదలైనవి రచించాడు. రామకృష్ణ భట్టు 1761లో 86వ ఏట శ్రీ రామ, శ్రీ కృష్ణ విలాసానికి శాశ్వతంగా వెళ్లిపోయాడు. ❋

## 197) గురు కృతి కర్త – ఉత్తక్కోడు వేంకటకవి (వెంకట సుబ్బయ్యర్) – 1700-1765

ఊత్తుకాడు వెంకటసుబ్బయ్య అయ్యర్ 1700లో తమిళనాడులో జన్మించి గర్వించదగ్గ గొప్ప వాగ్గేయకారుడయ్యాడు. వెంకట కవిగా ప్రసిద్ధుడు. సంస్కృత, తమిళ మరాఠీ భాషలలో 500కు పైగా కృతులు రచించాడు. ఇవి ఆయన సంగీత శాస్త్ర పాండిత్యానికి ఉదాహరలుగా నిలిచాయి. కావడి చిందు, తిల్లానా, కృతులు ఆయన ప్రత్యేకం. పురందరదాసుకు కర్ణాటక సంగీత త్రయానికి వారధిగా వేంకటకవిని భావిస్తారు. సంగీతంలో సరైన గురువును అణ్వేషిస్తూ చాలాకాలం గడిపి చివరికి ఊత్తుక్కాడు కళింగ నర్తన ఆలయంలో శ్రీకృష్ణుడిని గురువుగా భావించాడు. కృష్ణ భగవానునుని ప్రేరణ చెంది ఆరభి రాగంలో "గురుపాదారవిందం కోమలం" కృతి రాశాడు. తన గురుదేవుడైన కృష్ణుడిపై కనీసం 15గురు కృతులు రాసి అంకితమిచ్చాడు. ఆయన ఫిలాసఫీ "భక్తియోగ సంగీత మార్గమే పరమపావన మహునే". అనేక రాగాలను ఉపయోగించాడు. అరుదైన బాలహంస, రసమంజరి రాగాలను ఆలపించి కృతులు రాశాడు. మధ్యమావతిలో "శంకరి రాజరాజేశ్వరి" సుందరనంద కుమారకృతులు మాధుర్యానికి పరాకాష్ట. ఖండ ధ్రువ, సంకీర్ణ మధ్యమ వంటి అనేక తాళాలపై గొప్ప ప్రయోగాలు చేశాడు. సాహిత్య వైవిధ్యాన్ని చాలా అద్భుతంగా పోషించాడు. ఉదాహరణకు అభోగి రాగ పల్లవి "మహశ్యాయ హృదయ" మాధ్యమ కాల విధానంలో 1-మధుకర చంపక వన విహార మనమోహన మధుసూదన నవభూషణ, 2-మధుకర చంపక వనవిహార నవపల్లవ పదకర మదన గంభీర, 3-మధుకర చంపక వనవిహార గోవర్ధనధర భుజగ నర్తన చరణ"

ఇదే కాక గౌళరాగంలో "అగణిత మహిమ"లో కూడా ఇలాంటి వైవిధ్యాన్ని ప్రదర్శించాడు. ధన్యాసిరాగంలో కూర్చిన "భువనమోహన"లో ఆరుసార్లు పునరావృత్తమై 11సార్లు వినిపించి అలౌకిక ఆనందాన్ని సృష్టించాడు. సంస్కృతంలోని ఈ రచన కర్ణామృతమే –"అతినూతన కుసుమాకర, వ్రజమోహన సరసీరుహ దళ లోచన

మమమానస పటు చోరసు –స్వరగీతసు –మురళీధర సుర మోదిత భవమోచన" ఆయన సంస్కృత పాండిత్యం అమోఘం. దానిలోని సొగసులన్నీ కృతులలో దింపేశాడు. ఆయన ప్రసిద్ధ తమిళకృతి తోడిరాగంలోని "తాయి యశోద" సంగీత కచేరీలలో తప్పనిసరి అయి శ్రీ కృష్ణలీలకు పరమ భాష్యమై నిలిచింది. ఇందులో 8 చరణాలున్నాయి. ఒక్కో చరణం లో ఒక్కో లీల దర్శనమౌతుంది. రాధా కృష్ణకల్యాణాన్ని కృతి మాధ్యమంగా రాశాడు. మహాభారతం దక్షయజ్ఞం ప్రహ్లాద చరితంలకూ కృతి గౌరవం కల్పించి శాశ్వతత్వంచే కూర్చాడు. సామూహిక కృతులైన సప్త రత్న, కామాక్షి నవ రత్నం, ఆంజనేయ రత్నం వంటివీ రాశాడు. మాధవ పంచకం, నృసింహ పంచకం, రంగనాధ పంచకం వంటి స్తోత్రాలుకూడా రాశాడు. "త్యాగ రాజ పంచరత్నాలు" వంటి "సప్త రత్న కృతులు" రాశాడు. –1 నాట రాగంలో "భజనామృత", 2–గౌళ రాగంలో "అగణిత మహిమ", 3–కళ్యాణిరాగంలో "మాధవ హృది కేళిని", 4–కీరవాణిరాగంలో ''బాలసరస మురళి'', 5–తోడి రాగంలో ''జటధార, 6–పరాస్ రాగంలో "అలవందెన్నెలో", 7–మాధ్యమావతి రాగంలో "సుందర నంద కుమార".

ఆంజనేయ సప్తవర్ణ సంస్కృత కృతులలో హనుమ వైభవ విశేషాలన్నీ చూపించాడు– 1–వసంత రాగం లో – "పవన కుమార", 2–కేదార గౌళలో –"వీక్షితోహం", 3–తోడిరాగం లో –"అంజనానందన అమ్బోధి చంద్ర", 4–సురటి రాగంలో –శ్రీరాఘవ దూతం, 5–మాధ్యమావతి రాగంలో –"భక్త భాగ ధేయ", 6–రసమంజరి రాగంలో –"సత్వ గుణ విరచితాంగ", 7–మలయ మారుత రాగంలో "వాహిని తట".

దసరాలలో శ్రీ విద్యపై పాడే నవ వర్ణకృతులు వినాయక స్తుతి, ధ్యాన స్తుతి ఫలస్తుతి కూడా రాశాడు. కూచిపూడి భరతనాట్య, కథక్, ఒడిశా నృత్యకళాకారులు ఆయన కృతులకు నాట్య ఆకృతులను కూర్చి బహుళ వ్యాప్తి చేశారు. అందులో వైజయంతిమాల, కమలా లక్ష్మణ్ బిర్జు మహారాజ్ పద్మా సుబ్రహ్మణ్యం వెంపటి చినసత్యం వంటి వారెందరో ఉన్నారు. ఆయన రాసిన హరికథలను శ్రీ కృష్ణ ప్రేమి అన్న, గురు హరిదాసు గిరి వంటి హరికథా కళాకారులు వీనుల విందుగా వినిపించి ప్రచారం చేశారు. ఆయనకే ప్రత్యేకమైన – "కళింగ నర్తన నటంగం, కృష్ణ పాదాది కేశాంతవర్ణనం" నభూతో అనిపిస్తాయి. భజన సంప్రదాయంలో కూడా వేంకటకవి రచనలు స్థానం పొందాయి. శివ తాండవం ఆయన సంస్కృత భాషా పటిమకు పరమ భక్తికి తార్కాణంగా నిలిచింది. నిత్య జీవితంలో పారాయణకు తోడ్పడి ప్రతి ఇంటా మార్మోగుతూ వినిపిస్తాయి. 65 సంవత్సరాలు జీవించి శ్రీ కృష్ణ శిష్యుడైన వేంకటకవి 1765లో శ్రీ కృష్ణ ధామం చేరాడు.❀

## 198) యంత్ర చింతామణి కర్త – దామోదరభట్ – 1700

16వ శతాబ్ది ఉత్తరార్ధంలో జీవించిన సంస్కృత విద్వాంసుడు దామోదర భట్టు "యంత్ర చింతామణి" లేక "కల్ప చింతామణి" అనే గ్రంథాన్ని రాశాడు. ఇది పూర్తిగా "అభిచార" పద్ధతులను తెలియజేస్తుంది. ఈ గ్రంథం ఆధారంగానే ప్రాంతీయ భాషలలో దానికి సంబంధిన పుస్తకాలు ప్రచురితమయ్యాయి. ఈ గ్రంథాన్ని మొట్టమొదటి సారిగా అధ్యయనం చేసి, 1939లో ఫ్రెంచ్ భాషలోకి అనువదించినవాడు జీన్ మార్కేస్ రివేర్రీ. ఇటీవలి కాలంలో హన్స్ జార్జ్ టూర్బ్నిగ్ దీనిపై విపులమైన వ్యాఖ్యానం రాశాడు. గుడున్ బూహేన్మాన్ ఈ గ్రంథాన్ని సంక్షిప్తం చేసి "యంత్రాస్ అండ్ మండలాస్" పేరిట ప్రచురించింది.❀

## 199) త్రికాండ శేఖర నిఘంటుకర్త – పురుషోత్తమ దేవ –1700

త్రికాండ శేష హారావాలి ఏకాక్షర కోశ ద్విరూప కోశ అనే నాలుగు నిఘంటువల కర్త పురుషోత్తమ దేవుడు. మహా సంస్కృత పండితుడుకనుకనే ఇన్ని కోశాలకు కర్త కాగలిగాడు. వీటిలో అతను ఉపయోగించిన పదజాలాన్ని చూస్తే ఒరిస్సా సముద్ర తీరదక్షిణ ప్రాంత కవి అనిపిస్తాడు. మహేంద్ర పర్వత సమీపంలో రుషికుల్య లోయలో వైతరణి ప్రాంతపు కవి.❀

## 200) దుర్గా యజ్ఞ దీపిక కర్త – జగన్నాధ ఆచార్య –1700

17వ శతాబ్దంలో ఒరిస్సాలో తంత్ర, శాక్తే యాలు మిగిలిన రాష్ట్రాలలో లాగానే వ్యాప్తి చెంది వాటి గ్రంథ రచన కూడా సాగింది. జగన్నాధ ఆచార్య "దుర్గా యజ్ఞ దీపిక" సంస్కృతంలో రాశాడు. యితడు గొప్ప తంత్ర శాస్త్రవేత్త. దీనికి 1695 రాజు గజపతి దివ్య సింగ్ దేవుని కాలంలో రంగుని మహాపాత్ర కాపీ రాశాడు. ఈ వ్రాతప్రతి వలన ఈ కవి కాలం 17వ శతాబ్దంగా భావించారు.❀

## 201) కౌముది వ్యాఖ్యాత – అభిరామ విద్యాలంకార –1700

వంద్య ఘటీయ కుటుంబానికి చెందిన గాయాఘర శాఖలో అభిరామ విద్యాలంకార జన్మించాడు. సంక్షిప్త సార లేక సార పదీయకు గోయిచంద్ర రాసిన కారకపద వ్యాఖ్యానానికి విద్యాలంకార కౌముది వ్యాఖ్యానం రాశాడు.❀

## 202) సారార్ధ దీపిక కర్త – గోపాల చక్రవర్తి –1700

వంద్య ఘటీయా గయాఘరా శాఖలో 17వ శతాబ్దిలో జన్మించిన గోపాల చక్రవర్తి కవి చంద్ర శిష్యుడు. క్రమాదీశ్వరుని సంక్షిప్త సారకు "సారార్ధ దీపిక" వ్యాఖ్య రాశాడు.❀

## 203) ఘోరండ సంహిత కర్త - ఘోరండ - 1700

హఠ యోగంపై ఉన్న మూడు ప్రసిద్ధ గ్రంథాలలో "ఘెరండ సంహిత" ఒకటి మిగిలిన రెండు హఠ యోగ ప్రదీపిక, శివ సంహితలు, ఘెరండుడు చంద్ర కాపాలికి బోధించిన హఠ యోగం ఇది. 17వ శతాబ్దికి ఈ చెందిన ఈ గ్రంథం హఠయోగానికి విజ్ఞాన సర్వస్వము. దీనిలో సప్త విధ యోగాలు చెప్పబడినాయి. 1- శతికర్మ - బాహ్యాభ్యంతర శుచికి, 2- ఆసన -బలానికి, 3-ముద్ర -నిశ్చలత్వానికి, 4-ప్రత్యాహార -ప్రశాంతికి, 5-ప్రాణాయామ -తేలికకు, 6-ధ్యాన దర్శనానికి, 7-సమాధి - తాదాత్మ్యానికి చెప్పబడ్డాయి. ఇది "ఘటస్థ యోగం"కు చెందినదిగా కూడా భావిస్తారు. సమాధి ప్రకరణంలో పతంజలి చెప్పినదానికంటే అనేక పద్ధతులు దీనిలో చెప్పబడ్డాయి. ఒక శ్లోకం -

"అదృశ్య సేతే పద యుగ్మ వ్యస్తం పృష్టే నిధియాపి ధృతం కరాభ్యాం - ఆకుంచ సంయ ద్యుదరాస్తు గాఢం ఉష్టం ఉచ్చం చ పీఠం యాతాయో వదంతి" (ఉష్ట్రా సన వర్ణన)

భావం- ముఖం కిందకు వంచి రెండుకాళ్లు వెనక్కిమడిచి, పాదాలను చేతులతోపట్టుకొని పొట్ట. మూతి అక్కలిస్తే ఉష్ట్రాసనం.❁

## 204) శివ సంహిత కర్త - అజ్ఞాత కవి -1700

హఠ యోగంపై మరోగ్రంథమే శివసంహిత శివుడు పార్వతికి తంత్ర శాస్త్రాన్ని గురించి బోధించిన గ్రంథం. 17వ శతాబ్దిలో దీన్ని వారణాసిలో ఒక అజ్ఞాత కవి రాసినట్లు దీనిపై డి. ఫిల్ పరిశోధన రాసిన డా. మాలిన్సన్ అభిప్రాయపడ్డాడు. దీన్ని తంత్ర శాస్త్రమని కవి చెప్పాడు. ఇందులో 84 ఆసనాలు చెప్పబడ్డాయి. కానీ అయిదింటిని మాత్రమే పూర్తిగా వివరించి చెప్పాడు. సామాన్య గృహస్తు కూడా దీన్ని అభ్యాసం చేయచ్చు ననికవి భరోసా ఇచ్చాడు. అనేక ఆంగ్లానువాదాలున్నాయి కానీ 1884లో లాహోర్‌కు చెందిన శ్రీ చంద్ర వాసు అనువాదం పరిపుష్టిగా ఉందని విశ్లేషకులు భావిస్తారు. ఒక శ్లోకం చూద్దాం -

"ఏకం జ్ఞానం నిత్య మాధ్యంత శూన్యం క్విద్వత్తే తే వస్తు సత్యం -యద్దేవారి మన్నింద్రి యోపాధినా వై జ్ఞానస్యాయ భాసతే నాణ్య యైవ"

భావం- జ్ఞానమొకటే శాశ్వతం అది ఆద్యన్తరహితం. సత్యమైనది వేరొకటి లేదు ప్రపంచంలో మనం చేసే వైవిధ్యం ఇంద్రియ సంబంధమైనదది. ఈ భావం నశిస్తే ఉన్నదొక్కటే సత్యమనే జ్ఞానం.

2-సత్యం కేచిత్ ప్రశంసంతి తపః శోచం తథాపరే -క్షమాం కేచిత్ప్రశంసంతితథైవ సమ్మార్జనం"

భావం- కొందరు సత్యాన్ని కొందరు స్వచ్ఛతను మరికొందరు సన్యాసాన్ని పొగుడుతారు. కొందరు క్షమను కొందరు సమానత్వాన్ని రుజుత్వాన్ని పొగుడుతారు.❁



## 1701-నుండి 1800 వరకు- 18వ శతాబ్దం

### 205) మార్తాండ శతక కర్త - మార్తాండ వర్మ -1705-1758

111 శ్లోకాలున్న మార్తాండ శతకకర్త రాజా వీర మార్తాండ వర్మ. ఇది తిరువాన్కూర్ మహారాజు స్వాతి తిరుణాల్ మార్తాండ వర్మ చరిత్ర. మొదటిశ్లోకంలోనే అయన వంశం వర్ధిల్లుగాక అని మొదలు పెట్టాడు. కార్తీక మాసం అశ్వినీ నక్షత్రంలో పుట్టాడని చెప్పి నాలుగవ శ్లోకంలో భారత దేశ రాజులలో గ్రాడ్యుయేట్ అయిన మొట్టమొదటి రాజు ఆయనేనని, 8వ శ్లోకంలో ఆయన అన్నగారు కేరళవర్మ గురించి, తర్వాత రాజమాత మరణం పిమ్మట రాజు దేశాటనంలో హిమాలయ సందర్శనం రాసి మిగతాదానిలో ఆయన గుణగణాలను ప్రజాహిత పాలనను వర్ణించాడు. మంత్రులు హితైషులు ఎందరు ఉన్నా నిర్ణయాలు స్వయంగానే తీసుకొనేవాడని, అబద్ధాన్ని సహించేవాడు కాదని కవి తెలియజేశాడు.❁

### 206) మూకాంబికా స్తోత్ర కర్త - రెండవ సచ్చిదానంద భారతీ స్వామి - 1706-1741

"సచ్చితాంబుజ మిత్రాయ సచ్చరిత్ర యుజే నమః -సచ్చిదానంద భారత్యై సచ్చిదానంద మూర్తయే"

ఈ స్వామీజీకి గోకర్ణ మహా బలేశ్వరస్వామి, కొల్లూరు మూకాంబికా దేవిలకు పరమ భక్తులు. వీరు రాసిన శృంగేరి శారదా స్తోత్రం మూకాంబికా స్తత్రాలు నవరాత్రి ఉత్సవాలలో భక్తులు పరవశంతో గానం చేస్తారు. శృంగేరిలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించేవారు. దీనికి రామనాథపురం జమీందార్ సేతుపతి విధిగా హాజరయ్యేవారు. విద్యాశంకర లింగాన్ని రామేశ్వరంలో ప్రతిష్టించారు. శృంగేరిమఠానికి వచ్చే వందలాది వేద విదులను ఘనంగా సత్కరించి పంపేవారు. ఎన్నెనో దేవాలయాలకు, యతులకు కానుకలు పంపేవారు.❁

**207) సత్యనారాయణ పాంచాలీ కర్త – భరత చంద్ర రే (1712–1760)**

భరత చంద్ర రే గుణకార్ 18వ శతాబ్ది ప్రముఖ సంస్కృత బెంగాలీకవి. రాజాస్థాన కవి కూడా. అన్నపూర్ణ మంగళ కావ్యంతో సుప్రసిద్ధుడయ్యాడు. భరత చంద్రగా సుపరిచితుడు. నాడియా మహా రాజు కృష్ణ చంద్ర "గుణకార్" బిరుదు ప్రదానం చేసి సత్కరించాడు. అప్పటి నుంచి "రే గుణకార్ భరత చంద్ర" అని అందరూ పిలువ సాగారు.

నరేంద్ర నారాయణ రే, భవానీ దంపతులకు 1712లో బెంగాల్ లోని "పెన్రో భూర్సట్" గ్రామంలో జన్మించాడు. ఈ గ్రామం ఇప్పుడు హౌరా జిల్లాలో ఆమ్టాకు దగ్గరలో ఉంది. నలుగురు సంతానంలో చివరివాడు. తండ్రి – వర్ధమాన రాజు కీర్తి చంద్ర రేతో అస్తి తగాదా పడి రాజమాత బిష్ణు కుమారిని అవమానించాడు. దీనితో రాజు కినిసి వీళ్ళ భూములన్నీ స్వాధీనం చేసుకొన్నాడు. చేతిలో చిల్లిగవ్వ కూడా లేని తండ్రి నారాయణ రే ఊరు వదిలి పారిపోయాడు. కొడుకు భరత చంద్రను మాతా మహుల ఇంట్లో నయాపారాలో ఉంచారు. అక్కడే ఉంటూ దగ్గర గ్రామం తాజ్‌పూర్‌లో సంస్కృతం అభ్యసించాడు. 14 ఏళ్ళకే సంస్కృతంలో అద్వితీయ పాండిత్యాన్ని సాధించి తలమానికమై భాసించాడు. ప్రక్కనే ఉన్న శారద గ్రామానికి చెందిన నరోత్తమ ఆచార్య కుమార్తెను వివాహం చేసుకొన్నాడు.

తిరిగి స్వగ్రామానికి చేరిన తమ్ముడు భరత చంద్ర సంస్కృత పండితుడైనందున ఆ భాష కూడు గుడ్డ పెట్టదని ఈసడించి అన్నలు అవహేళన చేశారు. అవమానం పొందిన భరతచంద్ర స్వగ్రామం వదిలేసి హుగ్లీ జిల్లాలోని బాష్ బెరియాలోని దేబానంద పురకు వెళ్ళాడు. అక్కడ రామచంద్ర మున్షి ఇంట్లో ఉంటూ పర్షియన్ భాష నేర్చి పట్టు సాధించి మాస్టర్ అనిపించుకొన్నాడు. పిత్రార్జిత సంపదను కాపాడుకోవటానికి మోఖ్తార్ అయ్యాడు. అన్నలతో ఆస్తితగాదాలు, వారిని సంప్రదించకుండా వివాహమాడటంతో మళ్ళీ ఇల్లు వదిలి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఎక్కడా నిలువ నీడ లేక దేశాటనం చేస్తూ కొంతకాలం మహారాష్ట్ర పాలనలో ఉన్న ఒరిస్సాలోని కటక్‌లో ఉన్నాడు. మళ్ళీ బెంగాల్

వెళ్ళిపోయాడు.

చందర్ మగూర్‌లోని ఇంద్ర నారాయణ చౌదరి అనే ఫ్రెంచ్ ప్రభుత్వ దివాన్ ఇంట్లో అద్దె కున్నాడు భరతచంద్ర. చంద్ర లోని విద్యాపటిమను గుర్తించి, న దివాన్ కృష్ణ నగర్ మహారాజు కృష్ణ చంద్ర ఆస్థాన కవిగా నియమించే ఏర్పాటు చేశాడు. మహారాజు కవిగారి విద్వత్తుకు తగిన "రే గుణకార్" బిరుదునిచ్చి గౌరవించి సన్మానించటమే కాక మూలజోర్‌లో అనేక వందల ఎకరాల భూమిని ప్రదానం చేశాడు. బెంగాలీ భాషలో "ప్రథమ ప్రజాకవి"గా భరత చంద్ర గుర్తింపు పొందాడు. బెంగాలీ భాషను తన కవిత్వం, రచనలతో భరత చంద్ర సుసంపన్నం చేసి శాశ్వత కీర్తి తనకూ భాషకూ సాధించి చిర కీర్తి పొందాడు.

భరతచంద్ర రచనలలో ముఖ్యమైనది 1752లో రచించిన "అన్నదా మంగళ్" అనే అన్నపూర్ణ మంగళ్. ఇది మూడుభాగాలు. మొదటి భాగంలో "అన్నదా మంగళ్" అనే అన్నపూర్ణా దేవి స్తోత్రం ఉంది. రెండవ భాగం "కాళికా మంగళ్". ఇందులో విద్యా, సుందరుల కథ ఉంది. మూడవది అయిన చివరి భాగంలో మొదటి మాన్సింగ్, అన్నపూర్ణ మంగళ్ అనే భవానంద మజుందార్‌ల చరిత్ర ఉన్నది. భానుదత్తుడు మైథిలీ భాషలో రచించిన "రసమంజరి"ని బెంగాలీ భాషలోకి భరతచంద్ర అనువదించాడు. భరతచంద్ర సంస్కృత బెంగాలీ భాషా పటిమకు నిదర్శనంగా నిలిచిన రచన "నాగాస్టకం". సంస్కృత ఛందస్సుపై తన సాధికారతను రుజువు చేసిన రచన ఇది. ఇదికాక సంస్కృతంలో గంగాస్టకం రాశాడు. చండీ నాటకంతో పాటు మరొక అసంపూర్ణ రచన "సత్యనారాయణ పాంచాలీ" కూడా రాశాడు.

మధ్యయుగ బెంగాలీ గీతాల నుంచి ఆధునిక బెంగాలీ గీతాల వరకు అనేక వందల పాటలు రాసి భాషా సౌందర్యంతో తీర్చిదిద్దిన ప్రజాకవి భరత చంద్ర. కేవలం దేవీ దేవతలకు మాత్రమే పరిమితమైన "మంగళ గానం"ను ప్రజా పరం కూడా చేసి భాషకు, సంగీతానికి సొగసులు దిద్దాడు. స్వేచ్ఛగా మంగళగానం చేసే వీలుకల్పించాడు. రాధాకృష్ణుల శృంగారాన్ని, ప్రణయాన్నీ "పదావళి కీర్తనలు"గా రచించాడు. దీనిద్వారా రాం ప్రసాద్ సేన్, నిధుబాబు అనబడే రాం నిధి గుప్తాలకు మార్గ దర్శి అయ్యాడు.

భరతచంద్ర రచన "అన్నదా మంగళ్"ను "గేరాసీ లెబ్ దేవ్" రష్యన్ భాషలోకి అనువాదం చేశాడు. భరతచంద్ర సంగీతం సమకూర్చిన వాటినీ కలకత్తాలో నాటకాలకు వాడుకొన్నాడు. 48 ఏళ్ళు మాత్రమే జీవించినా, శాశ్వత యశస్సు సాధించిన గుణకార్ భరతచంద్ర ఈనాటి 24 పరగణాలలో ఉన్న ములజోర్‌లో 1760లో మరణించాడు. ❁

## 208) మణిమాల నాటక కర్త – ఆదికవి –1713

గొప్ప నాటకకర్తగా వనమాలికి పేరుంది. "హరి భక్తి సుధాకర రూపకం"కర్త, దీన బంధు మిశ్ర, రసగోష్ఠి రూపకకర్త అనాది కవి ఒరిస్సాలోని ఖండవల్లి రాజు వనమాలి ఆస్థాన కవులే. వనమాలి రాసిన మణిమాల నాటకంలోని 51వ అంకంలో బోయి వంశరాజు ఖుర్దా పాలకుడు గజపతి వీరకేసరి దేవగురించి ఉంది. అనాది కవి 18 శతాబ్ది పూర్వార్ధం వాడు. ఇతడు భారద్వాజ గోత్రీకుడని తండ్రి ముదిత మాధవ గీతి కావ్యకర్త శతంజీవ అని మణిమాల నాటక ఉపోద్ఘాతంలో ఉంది.❀

## 209) చాతక సందేశ కర్త – ఒక బ్రాహ్మణకవి (1724–1798)

కేరళ మలబార్ ప్రాంత తిరువంతం కుంజులోని నంబూద్రి బ్రాహ్మణకవి తిరువాన్కూర్ మహారాజ రామవర్మకు ఒక చాతకపక్షి ద్వారా తనకు ఆర్థికసాయం చేయమని పంపిన సందేశం. 1787లో టిప్పూ సుల్తాన్ మలబారును ఆక్రమించినపుడు ఈ బ్రాహ్మణుడు తిరువాన్కూర్ మహారాజు కార్తీక తిరుణాల్ ఆశ్రయం పొందాడు. కొంతకాలానికి అకస్మాత్తుగా జబ్బు చేసి రాజుకు తెలియ బరచకుండా తన స్వగ్రామం చేరాడు. అక్కడ కాళికాదేవి పూజలో గడిపాడు. అక్కడ ఒక వనంలో చాతకపక్షి కనిపిస్తే దానికి తన గోడు చెప్పి రాజుగారికి వెళ్ళగక్కమని సందేశానికి పంపటం ఇతివృత్తం. ఇందులోనూ దారిలో ఉన్న పట్టణాలు ప్రజా సమూహాలు రాజులవర్ణన యధాప్రకారం కవి దట్టించాడు. ఇందులో కొచ్చిన్ మంత్రి రాజగోపాల్ ప్రస్తావన ఉంది. ఈయన పి.రాజగోపాలాచారి అని కొచ్చిన్ దివాన్గా 1896–1901 వరకు ఉన్నాడు అన్నది చారిత్రిక సత్యం. ఎడ ప్పల్లి బ్రాహ్మణ రాజుల వర్ణనా ఉంది. వాళ్ళు దాంతాలి నాయకులు కావచ్చు.❀

## 210) శివాష్టపది కర్త – అయిదవ చంద్ర శేఖర స్వామి –1746–1783

కంచి మఠం కంచి నుంచి కుంభకోణంకు కర్ణాటక యుద్ధాల సమయంలో మారటం వలన వీరి వివరాలు తెలియలేదు. వీరు 62వ జగద్గురువులు. జయదేవుని అష్టపదులకు వివరణ రాశారు.

211– 64వ కామకోటి జగద్గురువులైన 6వ చంద్ర శేఖరేంద్ర సరస్వతి కుంభకోణంలో కంచిమఠానికి ప్రక్కనే ఉన్న ఇంట్లో వెంకట సుబ్రహ్మణ్య నామధేయంతో జన్మించి 37వ ఏట కంచి కామకోటి పీఠాధిపతి అయ్యారు. మహా శ్రీ విద్యోపాసకులుగా గొప్ప పేరు పొందారు. కంచికామాక్షి అమ్మవారి ఆలయానికి మహా కుంభాభిషేకం చేయాలన్న తలంపుతో వీరు మద్రాస్లో కొంతకాలం విరాళాల సేకరణ కోసం ఉన్నారు.

ఒకరోజు అమ్మవారు కలలో కనిపించి కంచికి తిరిగి వచ్చెయ్యమని చెప్పగా వెళ్లి పోయి మహా కుంభాభిషేకాన్ని అనన్య సాధారణంగా నిర్వహించారు. విరాళాల వెల్లువ కొనసాగి అద్భుతంగా కార్యక్రమం జరిగింది. తిరువనైక్కాల్‌లో అఖిలాండేశ్వరి అమ్మవారికి తాటంక ప్రతిష్టను రాజకీయ పార్టీల వారు అడ్డుపడినా దిగ్విజయంగా నిర్వహించారు. తంజావూర్ మహారాజు కలలో శివుడు ప్రత్యక్షమై ఆదేశించగా శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతికికి కనకాభిషేకం చేశాడు. ఇది కంచి కామ కోటి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖియింపబడిన అద్భుత ఘట్టం. తాటంక ప్రతిష్టకు జరిగిన ఖర్చు అంతా మహారాజే భరించాడు 1850లో సిద్ధిపొందారు. మళ్ళీ కంచి పరమాచార్యులు శ్రీ చంద్రశేఖర యతీంద్రులకు సువర్ణాభిషేకం జరిగిందని మనకు తెలుసు. కంచి చరిత్రలో ఇది రెండవ కనకాభిషేకం.❁

## 211) విదగ్ధ ముఖ మండనం కర్త - ధర్మ దాసు -1748

1748లో ధర్మదాసు "విదగ్ధ ముఖ మండనం" శబ్దం, దాని శక్తిపై గ్రంథాన్ని దానికి వ్యాఖ్యానాన్ని కూడా రచించాడు. ఇందులో సంఖ్య, లింగం సమ్మేళనం మొదలైనవి చర్చించాడు.

ధాత్వార్థ సాధన, ప్రయోగ మంజరీలను గంగానాధ దేవ శర్మ రాశాడు. ఆఖ్యాత ప్రకరణంపై "ధాతు పాఠం"ను ఒక అజ్ఞాత కవి రాశాడు.

ఈ విధంగా అస్సామ్‌లో వ్యాకరణ గ్రంథాలు వెలువడి తానూ ఏ రాష్ట్రానికీ తీసిపోనని ప్రాగ్జ్యోతిషం తన వ్యాకరణ జ్యోతిని వెలిగించింది.❁

## 212) సమృద్ధ మాధవ నాటక కర్త – కవి భూషణ గోవిందసమంతరాయ్ (1750)

ఒరిస్సాలోని బంకిరాష్ట్ర ఖుర్దా రాజ్య పాలకుడు వీర కిషోర్ దేవ్ ఆస్థానకవి కవిభూషణ గోవిందా సమంతరాయ్ 18 శతాబ్దం వాడు. గౌడీయ వైష్ణవ మత అనుయాయి. "సమృద్ధ మాధవ నాటకం" గీత గోవిందం మాదిరిగా, రూప గోస్వామి నాటకం విదగ్ధ మాధవానికి అనుకరణగా రాశాడు. గొప్ప సంస్కృత విద్వాంసుడైన ఈ కవి మరెన్నో రచనలు చేసి ఉంటాడు. కానీ సూరి సర్వస్వము వీర సర్వస్వము అనే మరి రెండు గ్రంథాలు మాత్రమే లభ్యమైనాయి.❁

## 213) కళా నిర్ణయ, శ్రద్ధా నిర్ణయ ధర్మశాస్త్ర కర్త – రఘునాథ దాస్ – 1750

18వ శతాబ్ది ఒరిస్సా కవి రఘునాథ దాస్ వాసుదేవ దాసు కుమారుడు శ్రీనివాసుని మనవడు. సంస్కృత ధర్మ శాస్త్ర గ్రంథాలైన కళా నిర్ణయ, శ్రద్ధా నిర్ణయ గ్రంథాలు రచించాడు. తత్వ శాస్త్రంగా "న్యాయ రత్నావళి" రాశాడు. తన మనవళ్లు నారాయణ, సదాశివల కోసం "అమర కోశం"కు టీకా రాశాడు. ఇవికాక వ్యాకరణంపై వర్ధమాన ప్రకాశం అనే టీకాను వర్ధమాన మిశ్ర వ్యాకరణమైన వర్ధమాన ప్రకాశం వ్యాకరణానికి రాశాడు. తారక నిర్ణయం ఇతని మరొక గ్రంథం. దుశ్శకునాలపై "ఉత్పాత తరంగిణి" రాశాడు. ఇతని సాహిత్య భూషణం విశ్వనాథ కవిరాజు సాహిత్య దర్పణానికి పూర్తిగా అనుకరణ.❀

## 214) సప్త తాళేశ్వర కర్త – వీణ వెంకట సుబ్బయ్య –1750–1839

మైసూర్‌లోని ప్రసిద్ధ వైణిక కుటుంబంలో 1750లో తంజావూర్ జిల్లా కపిస్తలంలో జన్మించిన వీణ వెంకటసుబ్బయ్య మైసూర్‌ను పాలించిన హైదరాలి కాలంవాడు. తర్వాత మూడవ కృష్ణరాజ ఒడియార్‌కు సంగీత గురువై, ఆస్థాన సంగీత విద్వాంసు డయ్యాడు. దివాన్ పూర్ణయ్యపంతులు మైసూర్ రాజ్యాన్ని విజయనగర సామ్రాజ్యంలాగా సాంస్కృతిక కేంద్రం చేయాలని చాలా కృషి చేశాడు. వెంకటసుబ్బయ్య రీతి గౌళరాగంలో ఎనిమిది సులాది తాళాలతో రచించిన "సప్త తాళేశ్వర గీతం" సుప్రసిద్ధమైనది. 88 ఏళ్ళు జీవించిన వీణ వెంకటసుబ్బయ్య జీవిత వీణ 1838లో ఆగిపోయింది.❀

## 215) మధ్వ మత వ్యాఖ్యాత – అడవి విజయ తీర్థ స్వామి – 1756–1806

విష్ణు తీర్థ అనబడే అడవి జయ తీర్థాచార్య 1756లో జన్మించి 50 సంవత్సరాలు మాత్రమే జీవించి 1806లో మరణించారు. మహా విద్వాంసుడు, ముని, కవి, మధ్వాచార్య మత గ్రంథ వ్యాఖ్యానకర్త. సావానూర్ దగ్గర సిద్దాపురంలో జన్మించాడు. గురువు సత్యవ్రత తీర్థ వద్ద సన్యాస స్వీకారం చేశాడు. గురువుగారితో కలిసి బృందావనం సందర్శించి, కొప్పల్‌కు 6 మైళ్ళ దూరంలో ఉన్న మదునూర్‌లో తన బృందావనంలో చేరాడు. 19 ఉద్గ్రంథాలు రాశాడు. అందులో ముఖ్యమైనవి– భాగవత సారోద్ధార, ఆజ్ఞాపత్ర, ఆత్మ సుఖ బోధిని, షోడశి, చతుర్దశి, అధ్యాత్మామృత తరంగిణి.❀

## 216) అబ్ద దూత కర్త - కృష్ణ శ్రీ చందన -1760

ఒరిస్సా కవులలో దూత కావ్యాలు ప్రారంభించి రాసిన తొలికవి కృష్ణ శ్రీ చందన. 18వ శతాబ్ద తొలికాలపు కవి. కాళిదాసుని మేఘ దూతానికి సమానంగా ఒరిస్సాలో సంస్కృతంలో ఈ కవి "అబ్ద దూతం" రాశాడు. ఇది 36 ఫోలియోలలో 149 శ్లోకాల కావ్యం. కథ శ్రీరాముడు దండకారణ్యం నుండి లంకలోని సీతకు మేఘం ద్వారా సందేశం పంపటం. రాముడు సీతా విరహంతో సహజజ్ఞానం కోల్పోయి మాల్యవంత పర్వతంపై సంచరిస్తున్న మేఘానికి బ్రతిమాలి తన సందేశాన్ని అర్ధాంగి సీతకు తెలియజేయమని ప్రార్ధిస్తాడు. మందా క్రాంత శ్లోకాలలో కావ్యం రామణీయకంగా ఉంటుంది. దీనికి "మనోరమ" అనే వ్యాఖ్యానాన్ని కవి ప్రభువైన భీమ ధర్మ దేవ ప్రభువు రాశాడు.❁

## 217) గంగ వంశాను చరిత కర్త - వాసుదేవ రధ్ సోమజతి - 1761-1770

వాసుదేవ రధ్ సోమజతి గంగ వంశాను చరితం కావ్యాన్ని 1771-1770 మధ్య రాశాడు. దీనికి చారిత్రిక, సాహిత్య ప్రశస్తి లభించింది. ఇది కళింగ గంగుల రాజుల చరిత్ర.❁

## 218) గోవింద భాష్య కర్త - బలదేవ విద్యా భూషణ్ -1764

బలదేవ్ విద్యాభూషణ్ ఆనాటి సంస్కృత మహా పండితులలో శ్రేష్ఠుడు. 18వ శతాబ్దికి చెందినవాడు. రూప గోస్వామి స్తవమాలకు టీకా రాశాడు. వ్యాకరణ అలంకార శాస్త్ర నిధి. చిలక సరసు అవతలి తీరపు ప్రసిద్ధ పండిత శిష్యరికం చేసి ఎన్నో శాస్త్రాలలో పట్టు సాధించాడు, వేదం న్యాయం నేర్చి మైసూర్ వెళ్లి వేదాంతం అధ్యయనం చేసి తత్వవాది అయి అనేక పండిత ప్రకాండులను వాదంలో ఓడించాడు. పూరికి తిరిగి వచ్చి, తత్వ వాద మతంలో చేరాడు. రసికానంద గోస్వామి శిష్యుడు రాధా దామోదర్ చేత దీక్ష పొంది "సత్ సందర్భం" అధ్యయనం చేసి సన్యాస దీక్ష తీసుకొని "ఏకాంతి దాస్"గా ప్రసిద్ధి పొందాడు. "గోవింద భాష్యం" రాసి బలదేవ్ విద్యా భూషణ్ ప్రఖ్యాతి చెందాడు.❁

## 219) వరరుచి వ్యాకరణ కర్త – మహా మహోపాధ్యాయ వేదాంత వాగీశ భట్టాచార్య (1765)

విద్యా వాగీశ చక్రవర్తి అని పిలువబడే మహా మహోపాధ్యాయ వేదాంత వాగీశ భట్టాచార్య. 1765లో "వరరుచి వ్యాకరణం" రాశాడు. రామ భద్ర సర్వ భూషణ భట్టాచార్య "సమాస వివేచనం" రాసి సమాసాలను నవ్య న్యాయం ఆధారంగా విస్తృతంగా చర్చించాడు.❁

## 220) ఉత్తర నైషధ కర్త – ఆరూర్ మాధవన్ అతితిరి – (1765–1836)

ఆరూర్ మాధవన్ అతితిరి కేరళలో 1765లో జన్మించి 1836లో 71వ ఏట మరణించాడు. వ్యాకరణంలో ఆరి తేరిన పండితుడు. కోజి కోడ్‌కు చెందిన మనోరమా తాంపు రాచ్చి అనే ప్రసిద్ధ వ్యాకరణ వేత్తకు శిష్యుడు. కేరళ సంస్కృత విద్యావేత్తలలో ఎన్నదగిన పాండిత్యమున్న వాడు. యువరాజు గోదా వర్మకు గురువు. సిద్ధాంత కౌముది బోధించాడు. పంతాలం సుబ్రహ్మణ్య శాస్త్రి వద్ద నైషధం నేర్చి, "ఉత్తర నైషధ మహా కావ్యం" రాశాడు. ఇందులో 16 కాండలున్నాయి. శ్రీ హర్షుని నైషధానికి ఇది అనుబంధ కావ్యం. కొచ్చిన్ రాజు రామవర్మ ఆస్థానకవిగా మాధవన్ అతితిరి కవి విరాజిల్లాడు.❁

## 221) నీల కంఠ సందేశం కర్త – శ్రీధరన్ నంబి –1774–1830

నెమలి సందేశం అనే సందేశకావ్యాన్ని శ్రీధరన్ నంబి రాశాడు. కేరళ పట్టాంబి వంశం వాడు. భారత పిశరాట్టి శిష్యుడై గొప్ప జ్యోతి శ్శాస్త్రవేత్త అయ్యాడు. ఈ వంశం వారు కాలికట్ రాజుల ఆస్థాన కవులు జ్యోతిష శాస్త్రవేత్తలు అయ్యారు. ఈ కవి విక్రమాదిత్య చరిత్ర కూడా రాశాడు. నాయకుడు నాయకికి నీలకంఠం అంటే నెమలి ద్వారా పంపిన సందేశం. జామోరీ రాజులకు హైదర్ జంగ్‌కు జరిగిన యుద్ధం, యూరోపియన్ జంటలు వాహనాలమీద తిరగటం, బ్రాహ్మణులు వేద వేదాంత శాస్త్రాలు నేర్పటం వగైరా వర్ణనలన్నీ ఉన్నాయి.❁

## 222) శబ్ద బోధ కర్త - విరజానంద వాగీశ -1777-1868

పంజాబ్‌లోని జలంధర్ దగ్గరున్న కర్తార్ పూర్‌లో 1778లో మొహియాల్ వంశంలో విరజానంద జన్మించాడు. చిన్నప్పుడే 5వ ఏట మసూచికం వచ్చి కంటి చూపు పోయింది. ప్రాధమిక సంస్కృత పాఠాలు నేర్పిన తండ్రి చనిపోయాడు. ఆదుకోవాల్సిన అన్నా వదినల దాష్టీకం భరించలేక ఇంటి నుండి వెళ్లి పోయాడు. దేశాటనం చేస్తూ హృషీకేష్ చేరి అక్కడే తపస్సు ధ్యానంతో గడిపాడు. దైవ ఘటన వలన విరజానంద హరిద్వార్ చేరాడు. అక్కడ పూర్ణ నాద్ అనే యోగి, సంస్కృత పండితుడు విరజానంద్‌కు సన్యాసం ఇచ్చి, సంస్కృత వ్యాకరణం బోధించి, ఆర్ష సంప్రదాయాన్ని బాగా వంట పట్టించి, హిందూత్వాన్ని బలంగా హృదయంలో నాటాడు. అన్ని సంస్కృత సాహిత్య శాఖలలో ఆరి తేరి కొంతకాలం విద్యాబోధనా చేశాడు విరజానంద.

విద్యలకు కాణాచి అయిన కాశీ చేరి 10 ఏళ్ళు గడిపి మీమాంస, ఆయుర్వేద, వేదాలను క్షుణ్ణంగా అభ్యసించి గొప్ప విద్వాంసుడై కాశీలోని విద్వాంసులలో ముఖ్యుడయ్యాడు. గయకు వెళ్లి ఉపనిషత్తులపై సాధికారత సాధించి, కలకత్తా వచ్చి దేశంలోనే ప్రముఖ సంస్కృత విద్వాంసుడనే ఖ్యాతి పొందాడు. తనకున్న సంస్కృత వ్యాకరణ సాహిత్య పాండిత్యంతో మంత్రముగ్ధమైన స్వరంతో సమ్మోహపరచాడు. నగరంలో నుంచి బయటపడి గంగానది ఒడ్డున గడియా ఘాట్ వద్ద నివాసమేర్పరచుకొని ఉండగా ఆల్వార్ మహారాజు విరజానంద్‌ను దర్శించి, ప్రభావానికి లోనై, ఆహ్వానించగా ఆల్వార్ వెళ్లి ఆస్థానంలో ఉండి, రాజు కోరికపై "శబ్ద బోధ" రాశాడు. దీని వ్రాత ప్రతి ఆల్వార్ లైబ్రరీలో భద్రపరచబడి ఇప్పటికీ అతి విలువైనదిగా పరిగణింప బడుతోంది. ఆల్వార్ నుండి సోరోన్, అక్కడి నుంచి మధురకు విరజానంద చేరుకొన్నాడు.

మధురలో ఒక పాఠశాల స్థాపించి నడిపాడు. దేశంలోని పలు ప్రాంతాలనుండి విద్యార్థులు వచ్చి చేరి చదువుకున్నారు. ఈ సంస్థ నిర్వహణ రాజుల విరాళాలతో నిర్వహించబడింది. అదే సమయంలో సరైన గురువుకోసం దయానంద సరస్వతి దేశమంతటా అన్వేషిస్తూ మధుర చేరాడు. అక్కడ పూర్ణ శర్మ స్వామి అనే యోగి వలన

తగిన గురువు విరజానంద ఒక్కడే అని తెలుసుకొన్నాడు. 1860లో మధురలో విరజానందను దర్శించాడు. విద్య పరమార్ధం ఏమిటి అని విరజానంద దయానందను అడిగి, ఆయన "కౌముది", "సారస్వత" అనే రెండు ప్రముఖ వ్యాకరణ గ్రంథాలు ఆపోసన పట్టాడని తెలుసుకొని ఆ రెండిటిని యమునా నదిలో విసిరేసి తనదగ్గరకు రమ్మన్నాడు విరజానంద.

విరజానందనే గురువుగా భావించి ఆయన చెప్పినట్లే చేసి కాళ్ళపై పడ్డాడు దయానంద. అంధుడైనా విరజానంద విద్యా బోధన చాలా క్రమశిక్షణతో నడిచేది. శిష్యుల అనుమానాలను పుస్తకం లేకుండానే తీర్చగల సర్వ సమర్ధుడు విరజానంద గురువు. దయానందను తీర్చిదిద్ది తనంతటి వాడిని చేశాడు. విరజానంద దయానందను హిందూమత పునరుద్ధరణమే తన గురుదక్షిణగా కోరాడు. ఆర్ష, వేద సాహిత్య వ్యాప్తికి అంకిత మవమని శిష్యుని ఆదేశించాడు. గుర్వాజ్ఞను శిరసావహించి దయానంద మహర్షి వేద ఆర్ష సాహిత్య వ్యాప్తి చేస్తూ హిందూమతాన్ని పునరుద్ధరించటానికి జీవితం ధార పోశాడు. విరజానంద 90వ ఏట 14-9-1868న మహాసమాధి చెందాడు. గురువు మరణానికి స్పందిస్తూ శిష్యుడు స్వామి దయానంద "ఇవాళ వేద వ్యాకరణ తేజో భానుడు అస్తమించాడు" అన్నాడు. కేంద్ర ప్రభుత్వం 14-9-1971న విరజానంద స్మారక పోస్టల్ స్టాంప్ విడుదల చేసి గౌరవించింది.❀

## 223) ముస్లిం అభిమానం పొందిన - 16వ మహా దేవేంద్ర సరస్వతి - 1783-1813

63వ కామకోటి జగద్గురువులు శ్రీ మహా దేవేంద్ర సరస్వతి కుంభకోణంలో జన్మించి 31వ ఏటపీఠాధిపతి అయ్యారు. ధర్మ శాస్త్రాలలో మహానిధి. అందుకని ముస్లిం రాజులు కూడా ధర్మ విషయంలో వీరి తీర్పును అభిప్రాయాన్ని శిరసా వహించేవారు. యుద్ధాలు జరుగుతున్నా వీరికీ భక్తులకు పుణ్య క్షేత్ర సందర్శనాలకు ఆటంకాలు కలిపించేవారు కాదు. కుంభకోణంలో ఆది కుంభేశ్వర దేవాలయంలో వీరు సోమ స్కంద మండపం కట్టించారు. కుంభకోణంలో 1813లో సిద్ధి పొందారు.❀



## 224) సంస్కృత-సంస్కృత నిఘంటు కర్త - రాధా కాంత దేవ్ - 1784-1867

కలకత్తా కన్జర్వేటివ్ హిందూ సంఘనాయకుడు, మహా సంస్కృత విద్వాంసుడు రాధా కాంత దేవ్ మహా రాజా నవ కృష్ణ దేవ్ పెంపుడు కుమారుడూ, రాజ్యానికి వారసుడు. సంస్కృత, పర్షియన్ అరబిక్ భాషలో గొప్ప పాండిత్యం ఉన్నవాడు. "శబ్ద కల్పద్రుమ" అనే సంస్కృత-సంస్కృత నిఘంటువును కూర్చినవాడు రాధాకాంత దేవ్. దీని టాగూర్ వంశానికి చెందిన హర కుమార్ టాగూర్ అనే మరో ప్రసద్ధ సంస్కృత విద్వాంసుడు సహాయకారిగా ఉన్నాడు. ఈశ్వర చంద్ర గుప్త గారి పత్రిక "సంబద్ ప్రభాకర్"లో దేవ్ చాలా ప్రయోజనాత్మకమైన వ్యాసాలు రాశాడు. హిందువులు ఇంగ్లీష్ నేర్చుకోవాలని, బాలికలకూ విద్య చాలా అవసరమని ప్రచారం చేశాడు. ఇన్ని మంచి భావాలున్నా దేవ్ సనాతన సంప్రదాయవాది. సతీ సహగమనం వాళ్ళ వంశంలో లేక పోయినా ప్రభుత్వం దాన్ని నిషేధించాలని ప్రయత్నించినపుడు వ్యతిరేకించాడు. లార్డ్ విలియం బెంటిక్ బెంగాల్ గవర్నర్‌గా ఉన్నప్పుడు 1829 డిసెంబర్‌లో ఒక రెగ్యులేషన్ యాక్ట్ ద్వారా సతీ సహగమనాన్ని రద్దు చేసినపుడు దేవ్ తనతోటి ఇతర సనాతన హిందువులతో కలిసి తండ్రి గోపీ మోహన దేవ్ స్థాపించిన "ధర్మ సభ సంస్థ" ద్వారా వ్యతిరేక ప్రదర్శనలు చేసి గవర్నర్ జనరల్‌కు నిషేధ అజ్ఞను రద్దు చేయమని విజ్ఞాపన పత్రం సమర్పించాడు. 83 ఏళ్ళు జీవించిన రాధా కాంత దేవ్ 1867లో మరణించాడు.❁

## 225) రుషికవి - స్వామి పరమానంద (1792-1885)

కాశ్మీర్ రుషి సత్తముడుగా పేరొందిన స్వామి పరమానంద మార్మిక కవి, మహాయోగి. గ్రామ పట్వారి ఉద్యోగం వదిలేశాడు. తల్లి సరస్వతి దేవి తండ్రి కృష్ణ పండిట్. మట్టాన్ దగ్గర సీర్‌లో జన్మించాడు. అక్కడి మోటు వాతావరణంలోనే పెరిగాడు. ప్రాధమిక విద్య పర్షియన్ భాషలోనే నేర్చాడు. ఆభాషలో "గరీబ్" అనే కలం పేరుతో

కవిత్వం రాశాడు. తండ్రి మహాభారతాన్ని పర్షియన్ భాషలోకి అనువదించిన గొప్ప పండితుడు. ఇది ఈ నాటికీ భద్రపరచబడింది. వ్యంగ్య మేధో కవిత్వం అలవడింది పరమానందకు. చిన్ననాటి స్నేహితురాలు మాల్ దేద్‌ను పెళ్లి చేసుకొన్నాడు. కాని ఆమె ఆడపెత్తనాన్ని భరించలేక పోయాడు. తండ్రి మరణించాక ఆయన పర్షియా భాషలోకి అనువాదం చేసిన భారతం చదివి స్ఫూర్తి పొందాడు. తాను ఉపనిషత్తులను అభాషలోకి అందంగా అనువదించాడు. దీనికి యువరాఉ దారా శిఖాత్ సాయం చేశాడు. శైవ, శాస్త్ర వేదాంత ప్రసంగాలను లల్లాదేవి, నంద రిష్ కవిత్వాలను శ్రద్ధగా వినేవాడు. గురువు పండిట్ ఆత్మారాం కుండలిని విద్య బోధించాడు. గ్రంథ సాహెబ్‌ను చదివేవాడు. ముస్లిం ఫకీర్‌లతో కలిసి చర్చించేవాడు. మొదట్లో కాశ్మీరీ కలసిన సంస్కృత కవిత్వం చెప్పి క్రమంగా అచ్చమైన సంస్కృత కవిత్వం అల్లి మెప్పు పొందాడు.

సుదామ చరిత, రాధా స్వయం వరం, శివ లగ్న మొదలైన రచనలు చేశాడు. యోగాపై రాసిన గ్రంథాలు ఇప్పటికీ అనుసరణీయంగా ఉన్నాయి. ప్రాణాయామంలో నిష్ణాతుడయ్యాడు.

పరమానంద కవిత్వ భావనలు– 1–సుదామ జీవుడు స్నేహితుడైన సుదర్శనుని దగ్గరకు వెళ్ళాడు. సుదాముని భారం స్నేహితుడే వహించాడు. 2–సుదాముడికి అక్కడ కృష్ణుడు, అతని ప్రేమ తప్ప వేరే ప్రపంచం కనిపించలేదు. తాను అందులో లీనమైపోయాడు.

పరమానంద చెప్పిన కొన్ని జీవిత సత్యాలు –1–బతికి ఉండగా చావటం భగవంతుని క్రీడ–2–కొందరు శక్తి అంటే మరికొందరు శివ అంటారు. కాని అది పరమానందం అనుభవైక వేద్యం. 3–ద్వంద్వం కాని నువ్వుకాని నేనుకాని లేము. ఆయనలో మనం ఉన్నాం. కనిపించేది సత్యం కాదు. అతనొక్కడే సత్యం.

చనిపోయే రోజు జ్వరంతో బాధపడుతూ సిద్ధాసనంలో కూర్చుని శిష్యులను దగ్గర కూర్చోబెట్టుకొని సాధన చేస్తూ ఓంకార ప్రణవాన్ని ఉచ్చరిస్తూ కపాల భేదం జరిగి సునాయాసంగా దేహం చాలించి పరమానంద పరమానంద యోగం పొందాడు.

పి.యెన్.రజ్దాన్ పరిశోధకుడు పరమానంద రచనలపై అధ్యయనం చేశాడు. ఆయన చెప్పిన దాని ప్రకారం పరమానంద 1791లో జన్మించి 1885లో మరణించాడు.




## 226) సౌందర్య లహరి వ్యాఖ్యాత ప్రాతస్మరణీయుడు - చార్లెస్ ఫిలిప్ బ్రౌన్-1796-1884

**తెలుగు వారి ప్రాతస్మరణీయుడు - చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్**

బ్రౌన్ అనగానే మనకు ఆయన కూర్చిన బ్రౌణ్య నిఘంటువు, వేమన శతకం మాత్రమే ముందుగా గుర్తుకొస్తాయి. ఆయన సేకరించిన అనేక తాళపత్ర గ్రంథాలు, వాటిప్రచురణ తరువాత జ్ఞాపకమొస్తాయి. కాని తెలుగు భాషా సేవకుడు బ్రౌన్ మహాశయుడు శంకర భగవత్పాదులు వ్రాసిన "సౌందర్య లహరి"పై ఒక విపుల వ్యాఖ్యానం రాశాడని, మనలో చాలామందికి తెలియదు. అలాగే భారతీయ ఆధ్యాత్మిక విజ్ఞానంపై ఎన్నో పరిశోధనలు చేసిన జాన్ ఉడ్రాఫ్ భారత దేశమంతా పర్యటించాడని, సౌందర్యలహరిపై ఆంగ్లంలో వ్యాఖ్యానం రాశాడని కూడా మనకు తెలియదు. సర్ విలియం బ్రౌన్ సౌందర్య లహరిలోని ప్రతి శ్లోకానికి చిత్రపటం సేకరించి ప్రచురించాడనీ, శాక్తేయ వాదంపై గొప్ప ఉపోద్ఘాతం రాశాడని, అమెరికాలోని ఫిలిప్పైన్స్ యూని వర్సిటీలో సౌందర్య లహరిపై అధ్యయనం జరుగుతోందని కూడా అతి తక్కువలో తక్కువ మందికి మాత్రమే తెలిసిన విషయాలు. ఈ విషయాలన్నిటినీ డా. సామవేదం షణ్ముఖ శర్మ గారు "భక్తి మాసపత్రిక" 2016 జూన్ సంచికలో "సౌందర్య లహరి" వ్యాసంలో తెలియ జేశారు.

బ్రౌన్ దొర కూడా గీర్వాణ సాహిత్యాన్ని ప్రోత్సహించాడని అర్థమైంది కనుక ఆయన భాషా సేవను తెలియ జేస్తున్నాను సంక్షిప్తంగా. చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్ 10-

11-1796న ఇండియాలోని కలకత్తా నగరంలో జన్మించాడు. తండ్రి డేవిడ్ బ్రౌన్ అనాధ శరణాలయ నిర్వాహకుడు, సంస్కృతంతో సహా అనేక భాషలలో పండితుడైన మిషనరీ స్కాలర్. తండ్రి మరణంతో ఇంగ్లాండ్ వెళ్ళిన బ్రౌన్ మళ్ళీ ఇండియాకు 1817 చేరి మద్రాస్‌లో ఇండియాలో సివిల్ సర్వీస్ ఉద్యోగానికి శిక్షణ పొందాడు. ఆనాటి గవర్నర్ థామస్ మన్రో ఇండియాలో పని చేసే అధికారులందరూ విధిగా స్థానిక భాషను తప్పని సరిగా నేర్వాలని అప్పుడే పరిపాలన సవ్యంగా చేయగలుగుతారని ఆదేశామిచ్చాడు. దాని ప్రకారం బ్రౌన్ సివిల్ పరీక్ష, తెలుగు పరీక్ష ఒకేసారి 1820లో పాసయ్యాడు. కృష్ణా జిల్లా మచిలీపట్నం, గోదావరి జిల్లా రాజమండ్రిలలో పనిచేశాడు. గుంటూరు జిల్లాకు 1824లో మహా కరువు వచ్చినప్పుడు అడ్మిని స్ట్రేటర్‌గా సమర్ధంగా వ్యవహరించాడు. 1834లో మళ్ళీ లండన్ వెళ్లి, నాలుగేళ్ళు గడిపి 1838లో మద్రాస్‌కు తిరిగొచ్చి పర్షియన్ భాషానువాదకుడుగా ఈస్ట్ ఇండియా కంపెనీకి పని చేసి, మద్రాస్ కాలేజి బోర్డ్ మెంబరై, అనారోగ్యం వలన 1854లో రిటైరై, లండన్‌కు తిరిగి వెళ్లి లండన్ కాలేజిలో తెలుగు ప్రొఫెసర్‌గా పని చేస్తూ 12-12-1884న 88వ ఏట లండన్‌లో మరణించాడు. తండ్రిలాగానే బ్రౌన్ కూడా బహుభాషా కోవిదుడు. తెలుగుతోపాటు సంస్కృతం పర్షియన్, గ్రీకు లాటిన్ భాషలలో గొప్ప పాండిత్యం ఉన్నవాడు.

### బ్రౌన్ భాషా సేవ

బ్రౌన్ కడపలో, మచిలీపట్నంలో మేజిస్ట్రేట్‌గా పని చేసినప్పుడు రెండేసి స్కూళ్ళను ఆ రెండు పట్టణాలలో స్థాపించి విద్యార్థులకు ఉచిత భోజన వసతులు కల్పించి ఉచితంగా తెలుగుతో సహా విద్య నేర్పించాడు. బ్రౌన్ భాషా సేవ మూడు దశలుగా జరిగింది. తాను తెలుగులో రాశాడు, పురాతన తెలుగు తాళపత్ర గ్రంథాలను సేకరించాడు. వాటిని ప్రచురించాడు. 1824లో వేమనపై దృష్టిపడి, ఆయన పద్యాల సేకరణ చేశాడు. తెలుగు ఛందస్సు వ్యాకరణాలను శ్రీ తిప్పాభట్ల వెంకట శివ శాస్త్రి, శ్రీ వఠ్యం అద్వైత బ్రహ్మ శాస్త్రి అనే ఉద్దండ పండితుల వద్ద అధ్యయనం చేశాడు. 1825లో రాజమండ్రికి బదిలీ అయి తెలుగు సాహిత్యాధ్యయనాన్ని తీవ్రంగా కొనసాగించాడు. శిథిలమై పోతున్న తెలుగు కావ్యాల వ్రాత ప్రతులనును సేకరించి, సమర్థులైన వ్రాయస గాళ్ళను నియమించుకొని కొత్త కాపీలను రాయించాడు. ఆంధ్ర మహా భారతం, మహా భాగవతంలను పునర్ముద్రించాడు.

తెలుగు నేర్చుకోవాలనుకొన్న ఆంగ్లేయులకు తేలికగా భాష అలవడటం కోసం తెలుగు వ్యాకరణ, ఛందస్సు పుస్తకాలు రాశాడు. తెలుగు-ఇంగ్లీష్ నిఘంటువు తయారు చేశాడు. సాహిత్య పత్రికలలో ఎన్నో మోనోగ్రాఫ్స్ రాశాడు. చాలా కావ్యాలను అనువదించాడు.

బ్రౌన్ రచనా సర్వస్వం అంతా మనకు మద్రాస్ ఓరియెంటల్ లైబ్రరీలో దర్శనమిస్తుంది.

వ్రాత రూపంలో లేని జానపదుల నాలుకలపై నర్తించే లెక్కకు మించి వ్యాసాలూ, కవితలు, కథలు సేకరించి ప్రచురించాడు. 1824 నుండి పోతన తిక్కన, వేమన గ్రంథాలను సేకరించటం ప్రారంభించాడు. 1835-నుండి 38వరకు లండన్‌లో ఉన్నకాలంలో బ్రౌన్ దక్షిణ భారత భాషలలోని 2,106 వ్రాత ప్రతులను ఇండియన్ హౌస్ లైబ్రరీ నుండి సేకరించి, ఇండియాలోని మద్రాస్ లైబ్రరీకి పంపాడు.

చాలా తెలుగు, సంస్కృత గ్రంథాలను బ్రౌన్ సంపాదకత్వంలో వెలువరించాడు. మద్రాస్ జర్నల్ ఆఫ్ లిటరేచర్ అండ్ సైన్స్‌కు బ్రౌన్ సంపాదకుడుగా ఉన్నాడు. లండన్‌లోని ఏషియాటిక్ జర్నల్‌లో తాను సేకరించిన గ్రంథాలపై ఆసక్తికరమైన కథనాలు రాశాడు. దాదాపు 30 వేల రూపాయల స్వంత ధనాన్ని ఆనాడే బ్రౌన్ ఖర్చు చేసి చీకటిలో మ్రగ్గిపోతున్న తెలుగు, సంస్కృత గ్రంథ ముద్రణకు తోడ్పడి వాటిని వెలుగులోకి తెచ్చాడు. అందుకే బ్రౌన్‌ను తెలుగు భాషా సూర్యుడు అంటారు. కనుకనే బ్రౌన్ మనకు డెల్టా శిల్పి సర్ ఆర్థర్ కాటన్‌లాగా ప్రాతస్మరణీయుడు. కాటన్ ఆనకట్టలు నిర్మించి పంటలకు సాయం చేసి సస్య శ్యామలం చేస్తే, అముద్రిత గ్రందాలనెన్నిటినో వెలికి తీసి బ్రౌన్ సాహిత్య పంట పండించాడు. ఒకరు కుక్షి నింపి సంతృప్తి పరిస్తే, మరొకరు మనసుకు ఆనందాన్నిచ్చి పరవశింప జేశారు.

**అగణిత బ్రౌణ్య భాషా సేవ**

1- బ్రౌణ్య నిఘంటువు అనే తెలుగు-ఇంగ్లీష్ డిక్షనరీ
2- గ్రామర్ ఆఫ్ తెలుగు లాంగ్వేజ్
3- ఎ డిక్షనరీ ఆఫ్ మిక్స్‌డ్డయలెక్ట్స్ అండ్ ఫారిన్ వర్డ్స్ యూజేడ్ ఇన్ తెలుగు
4- ది తెలుగు రీడర్ (తెలుగు వాచకం)
5- ఏ లిటిల్ లెక్సికన్
6- డయలాగ్స్ ఇన్ తెలుగు అండ్ ఇంగ్లీష్
7- ఆంధ్ర గీర్వాణ చందము
8- వేమన శతకం
9- లోకం చేత వ్రాయబడిన శుభ వర్త మానములు (బైబిల్ కథలు)
10- రాజుల యుద్ధములు
11- తెలుగు-ఇంగ్లీష్, ఇంగ్లీష్-తెలుగు నిఘంటువు
12- నల చరిత్ర
13- హరిశ్చంద్రుని కష్టాలు
14- నన్నయ ఆంద్ర మహా భారతం

15- రామ రాజ భూషణుని వసు చరిత్ర
16- పోతన భాగవతం
17- తిక్కన భారతం
18- శ్రీనాధుని పల్నాటి భారతం

ఇవి కాక బ్రౌన్ 1-బసవ పురాణం, 2-పండితారాధ్య చరిత్ర, 3-రంగనాథ రామాయణం, 4-ఉత్తర రామాయణం, 5-విజయ విలాసం, 6-సారంగ ధర చరిత్ర, 7-హరివంశం, 8-కాశీ ఖండం, 9- అని రుద్ధ చరిత్ర, 10-కుచేలోపాఖ్యానం, 11-రాధికా సాంత్వనం, 12-విక్రమార్క చరిత్ర గ్రంథాలకు ప్రెస్ కాపీలు రెడీ చేశాడు. వీటిని బ్రౌన్ మరణానంతరం తమిళనాడు ఆంధ్ర దేశంలలోని వివిధ సంస్థలు ప్రచురించాయి.


**బ్రౌన్ ప్రత్యేకతలు**

ప్రజలు పరంపరగా చెప్పుకొనే కథలు గాధలు పాటలు చాటువులు సేకరించి ప్రచురించటం బ్రౌన్ ప్రత్యేకత. పాండిత్య ప్రకర్ష ప్రకటించే రచనలపై ఎక్కువ అభిరుచి లేకపోయినా బ్రౌన్, చాలా తెలుగు బృహద్గ్రంథాలు సేకరించి ప్రచురించాడు. తాను చేసిన అనువాద గ్రంథాలను ఇతరులతో చేయించినవీ ముద్రించాడు. ప్రతిపుస్తకంలో విషయ సూచిక, పదాలకు అర్థాలు, వ్యాఖ్యానం ఉండేట్లు చేయటం బ్రౌన్ మరో ప్రత్యేకత. తాను వ్యాఖ్యానం రాయటానికి కారణం ఆ పద్యాలు ముఖతా వేరేవారితో అర్థాలు చెప్పించుకొని భావం తెలుసుకోవటం అనే అవసరం కుండా చేయాలనే ఉద్దేశ్యంతోనే అని చెప్పాడు. తన నిఘంటువులో చాలా వాడుక పదాలను చేర్చటం మరొక ప్రత్యేకత.

**బ్రౌన్‌కు సార్థక బిరుదులు**

"ఆంధ్ర భాషోద్ధారకుడు" అనే సార్థక బిరుదును తెలుగు ప్రజలే బ్రౌన్ మహాశయునికి ఇచ్చి గౌరవించి గుండె గుడిలో ప్రతిష్టించు కొన్నారు. ఆంధ్ర భాషా సంరక్షకుడు బ్రౌన్.

హైదరాబాద్‌లో టాంక్ బండ్‌పై ప్రభుత్వం బ్రౌన్ కాంశ్య విగ్రహాన్ని నెలకొల్పి గౌరవించింది. కడపలో బ్రౌన్ బంగాళాలో బ్రౌన్ కాలేజిని బ్రౌన్ లైబ్రరీని, సేవా సంస్థను ఎకాడేమి ఏర్పాటు చేసి ఆయన సేవలకు నివాళులు అర్పించారు. బ్రౌన్ సేవా సంస్థ గ్రంథాలయం స్థాపనలో ముఖ్య పాత్రధారి కవి, రచయితా గ్రంథకర్త, విమర్శకులు, విశ్లేషకులు కీ.శే. శ్రీ జానుమద్ది హనుమ త్శాస్త్రి గారిని మర్చిపోతే సరస్వతీమాత మనలను క్షమించదు.❀



## 227) స్వర జతులకర్త - మైసూర్ వాసుదేవ రావు -1799-1879

కర్ణాటకలో 1799లో జన్మించిన సంగీతవేత్త మైసూర్ వాసుదేవరావు త్యాగ రాజస్వామి శిష్యుడు వాలాజపేట వెంకటరామణ భాగవతార్ శిష్యుడు. గురువు ఈయనను మైసూర్ మహారాజు మూడవ కృష్ణ రాజ ఒడియార్‌కు పరిచయం చేయగా ఆ సంగీత ప్రతిభకు మెచ్చి ఆస్థాన విద్వాంసుని చేశాడు. క్షేత్ర సందర్శనం చేసి ప్రతి దేవునిపైనా కృతులు చాలాభాగం తెలుగులో కొన్ని సంస్కృతంలో రాశాడు. స్వరజతులు వర్ణాలు కృతులు తిల్లానాలు సంస్కృత తెలుగు భాషలలో రాశాడు. ఆయన కృతులన్నీ రాగభావంతో సాహిత్య సౌందర్యంతో అలరిస్తాయి. హరికాంభోజి రాగంలో రాసిన సంస్కృత కీర్తన – "సాకేత నగరనాధ" శ్రీమతి ఎం.ఎస్.సుబ్బులక్ష్మి గాత్రంతో బహుళ ప్రచారం పొందింది. తెలుగులో మాయామాళవ గౌళరాగంలోని "దేవాది దేవ ననుకావ సమయమురా", ఆఠణా రాగంలో – "వాచామ గోచరుండని", కమాస్ రాగంలో– "పరమాద్భుతమైన నీ సేవ" హంసధ్వనిలోని స్వరజతి – "రామాభిరామా" మొదలైనవి ఆయన ప్రతిభకు స్వరగోపురాలు. 1879, 80 ఏళ్ళ వయసులో మరణించాడు.

## 228) మహా భారత అద్వైత వ్యాఖ్య కర్త – నీల కంఠ చతుర్ధర -1800

17వ శతాబ్ది ఉత్తరార్ధంలో వారణాసిలో నివసించిన సంస్కృత మహాపండితుడు నీల కంఠ చతుర్ధర. ఈయన జీవిత విశేషాలూ మనకు దొరకకపోవటం మన దురదృష్టం. గోదావరీ తీరంపై నివసించిన మహారాష్ట్ర సంస్కృత విద్వాంసుడు ఈయన. ఇక్కడ నుంచి వారణాసి చేరి వేద వేదాంగ, మీమాంస, శ్రౌత, యోగ శైవ, తర్క, అద్వైత వేదాంత శాస్త్రాలను గొప్ప గొప్ప విద్వాంసుల వద్ద అధ్యయనం చేసి పారమెరిగాడు. అప్పుడు వారణాసి మహా విద్వాంసులకు నిలయంగా సరస్వతీ దేవి కొలువు కూటంగా భాసించేది. తన గురువులు లోకమాన్య, లక్ష్మీ నారాయణ, నారాయణ తీర్ధ అని తానే చెప్పుకున్నాడు. నీలకంఠుని అద్వైత రచనలు వ్యాఖ్యానాలు మధుసూదన సరస్వతి, నృసింహాశ్రమ, అప్పయ్య దీక్షితులవంటి మహా మహోపాధ్యాయులను ప్రభావితం చేశాయి.

మహాభారతంపై "భారత భావదీప" అనే ఉద్గ్రంథం అనితర సాధ్యంగా, పరమ ప్రామాణికంగా నీల కంఠ రచించాడు. అద్వైత వేదాంత భూమికగా రచించిన ఈ వ్యాఖ్యానాన్ని మించినది ఇంతవరకు లేదు అనిపించుకొన్నది. ఇప్పటికీ దానినే అందరూ ఉదాహరిస్తూ సందేహాలు తీర్చుకొంటూ, భారత ఆమ్నాయంలోని అనర్ఘ రత్న మాణిక్యాలను దర్శిస్తూ ఆ వెలుగులలో జీవితం ధన్యం చేసుకొంటున్నారు.

ఈ వ్యాఖ్యానాన్ని మొదటిసారిగా కేసరీమోహన్ గంగూలీ ఇంగ్లీష్‌లోకి అనువదించి ప్రపంచ దృష్టికి తెచ్చాడు. దాని అనుభవం వర్ణనాతీతం. మహా భారతానికి మహా వ్యాఖ్యానం నీల కంఠ దీక్షితుని "భారత భావ దీపం" నిజంగానే వెలుగులు చిమ్మింది.❀

## 229) ప్రబోధ చంద్రిక కర్త – వైజాల దేవ రాజు –1800


చౌహాన్ రాజు వైజాల దేవుడు ప్రబోధ చంద్రిక అనే వ్యాకరణ గ్రంథం రాశాడు. కావ్య విశేషాలనుబట్టి వైజాల దేవుడు విక్రమాదిత్య మహారాజు, దేవేరి చంద్రావతిల కుమారుడు. ఇతని కొడుకు హీరాధరుడు. ఇతని కోసమే దీన్ని రాశాడు.❀

## 230) విద్యా హృదయ నందన కావ్య కర్త – ప్రహరాజ మహా పాత్ర – 1800

యోగి ప్రహారాజ్ మహా పాత్ర అని పిలువబడే ఈ కవి సంగీత వైద్య కళాజ్యోతిష శాస్త్రాలలో అపార జ్ఞాన సమున్నతుడు. ఇతని రచన "విద్యా హృదయ నందన" కావ్యం. దీనివలన రాజా విక్రమ దేవుని రాజధాని ఒరిస్సాలోని కోరాపుట్ జిల్లాలోని నందపూర్ అని తెలుస్తోంది. ఇతనిది మరోకటి స్మృతికావ్యమైన "సంక్షిప్త స్మృతి దర్పణం". ఈ కవి 18వ శతాబ్ది మధ్యకాలం వాడు. ఈకవి వంశం అంతా తరతరాలుగా ఒరిస్సా ప్రభువుల ఆస్థాన విద్వావంశులే, కవులే.❀

## 231) తంత్ర కళాసుధ కర్త – రామ చంద్ర ఉద్గాత –1800

18 శతాబ్ది కవి రామ్ చంద్ర ఉద్గాత "తంత్ర కళాసుధ" రాశాడు. 8 ఫోలియోల గ్రంథం. ఒరియా అక్షరాలలో సంస్కృతంలో రాయబడింది. మంగళాచరణ శ్లోకాలలో కవి ఏకామ్ర లింగ రాజ. శివ స్తుతి చేశాడు. ఇందులో "రుద్ర యమా కాళికా స్తుతి, కూళ చూడామణి, కుమారి తంత్ర, కాళికాపురాణ, తంత్ర చూడామణి ఉత్తర తంత్ర, దక్షిణామూర్తి సంహిత మొదలైన తాత్రిక గ్రంథాలను పేర్కొన్నాడు. దీని నకలు 18-10-1779 నవమి సోమవారం నాడు తీయబడింది.❀



## 232) సిద్ధాంత దర్పణం కర్త – సమంత చంద్ర శేఖర –1800

ఖగోళ శాస్త్రాన్ని అవపోశనపట్టిన మహా మహోపాధ్యాయ సమంత చంద్ర శేఖర "సిద్ధాంత దర్పణం" అనే గొప్ప ఖగోళ శాస్త్రం రాశాడు. పూరీ జగన్నాధస్వామి మహాభక్తుడైన ఈ కవి స్వామిపై ఎన్నో శ్లోకాలు భక్తి పురస్సరంగా రాశాడు. ఇవికాక దర్పణం సార దర్పణం దీపికా కూడా రాశాడు. దర్పణం సారంలో గ్రహాల గమనం పర్వతాల ఎత్తు కొలిచే విధానం, అమావాస్య, సంక్రాంతి తిధులను గణించే విధానం ఉన్నాయి.

ఒరిస్సా రధోత్సవం గురించి ఆలయ చరిత్ర గురించి తెలియజేసే గ్రంథం "జగన్నాధ స్థల వృత్తాంతం", శిల్ప శాస్త్రం "శిల్ప ప్రకాశం" శిల్ప విద్య కామబంధం, విశ్వనాధ మహా పాత్రుని "కంచి విజయ మహా కావ్యం" (ఇందులో పురుషోత్తమ దేవ మహారాజు కంచి రాణిని వివాహమాడటం) గ్రంథాలున్నాయి.

ఆధునిక కాలంలో కూడా ఒరిస్సాకవులు పండిట్ ప్రబోధ కుమార్ మిశ్ర, పండిట్ సుదర్శనచర్య, పండిట్ చంద్ర శేఖర సారంగి, డా. ప్రఫుల్లకుమార్ మిశ్ర, డా. హరేకృష్ణ శత పథి, పండిట్ గోపాల కృష్ణ దాస్ వంటి వారెందరో సంస్కృతంలో అద్భుత రచనలు చేస్తూ ప్రసిద్ధి చెందారు.❁

## 233) ఆశుబోధ వ్యాకరణ కర్త – నారాయణ చంద్ర విద్యా భూషణ – 1800

నారాయణ చంద్ర విద్యా భూషణ–ఆశుభోద వ్యాకరణం రచించాడు. శౌరి దత్త భట్టా చార్య –రత్నమాల వ్యాకరణస్య టీకాతోపాటు "గీతాయాః తత్వ సారాః" రాశాడు.❁


## 234) పద్మనాభోదయం కర్త - శంకు కవి -1800

శంకర లేక శంకుకవి కేరళకు చెందిన 18వ శాతాబ్ది పూర్వభాగపు కవి. తిరువనంతపురంలోని శ్రీ అనంత పద్మనాభ స్వామి క్షేత్ర మహాత్మ్యంగా "పద్మనాభోదయ" కావ్యం యువరాజు రామవర్మ అభ్యర్ధనపై రాశాడు. కవి తమిళనాడు బ్రాహ్మణుడు. కావ్యం నాలుగు పద్ధతులు అంటే భాగాలలో 142 శ్లోకాలలో ఉంది. దివాకర యతి అనుగ్రహంతో అనంత పద్మనాభ స్వామి అనంత వైభవాన్ని ఆనంద పారవశ్యంగా రాశాడు. రామవర్మ మాట తనకు దైవ శాసనమే అన్నాడు. రామవర్మ రాజు మూర్తీభవించిన ధర్మస్వరూపం అని, ధర్మాన్ని నిత్యజీవితంలో ఆచరించి మార్గదర్శకుడవటం వలన ఆయన శీల ప్రవర్తనాదుల వల్ల ఆయనను రామవర్మ అనికాకుండా ధర్మరాజు అనే ప్రజలు పిలిచేవారని చెప్పాడు.❁

## 235) చంద్రికా వీధి నాటక కర్త - రామ పనివాద (1800)

కేరళకు చెందిన 18వ శతాబ్ది సంస్కృత కవి రామపనివాద గొప్ప సంస్కృత విద్వాంసుడు. ఆ కాలపు ఎందరో రాజుల సంస్థానాలలో మన్ననల నందుకున్నవాడు. ప్రాకృతభాషలోనూ అసామాన్య పాండిత్యం ఉన్నవాడు సంస్కృత, ప్రాకృతాలలో చాలా రచనలు చేశాడు. వెత్తట్టు నాడు ప్రభువు వీర రాయల కోరికపై "చంద్రికా వీధి"ని, అమలప్పుళ రాజు దేవనారాయణ కోరికపై "లీలావతి వీధి"ని, తిరువనంతపురం సామ్రాజ్య స్థాపకుడు మార్తాండ వర్మ కోరగా "సీతారాఘువ నాటకం" చెన్నమగళం సైన్యాధియతి కుబేర బిరుదాంకితుడు పలియాత్ అచ్చన్ అడగగా "విష్ణు విలాసకావ్యం", కున్నమకులంలో మానాకులం కుటుంబంలో ప్రసిద్ధుడైన ఆర్య శ్రీకంఠ రామవర్మ కోరికపై "ముకుంద శతకం" రాసి ప్రభువుల సైన్యాధికారులు, ఉన్నత కుటుంబీకుల గౌరవ మన్ననలు పొందాడు. రామ "పని వాద మంచి పనివాడు" అనిపించుకున్నాడు. పనివాద పేరును బట్టి ఆయన నంబియార్ కుటుంబం వాడని భావించారు. ఈ వంశం వారు ఛాక్యార్‌లకు సంస్కృత నాటక ప్రదర్శనలో "మిలవు" అనే డ్రమ్‌ను వాయిస్తూ సహాయపడేవారు. రామపని వాద నారాయణీయం రాసిన నారాయణ భట్టు శిష్యుడు. తన రచనలన్నిటిలో గురుపాదుని సంస్మరించాడు.

ఆయన రాసిన రాఘువీయ మహా కావ్యంలో 20 కాండలు, 1572 శ్లోకాలున్నాయి. ఇవికాక మదన కేతు చరిత ప్రహసనం, ముకుంద, శివ, సూర్య శతకాలు, అంబర నాధీశ స్తోత్రం భాగవత చంపు, వృత్త వార్తిక, తాళ ప్రస్తార కావ్యం, రాసక్రీడతోపాటు కొన్ని సంస్కృత వ్యాఖ్యానాలు శాస్త్రీయ రచనలు చేశాడు. ఆయన రాసిన రాఘువీయానికి విష్ణువిలాసం మేలత్తూర్ దాతుకావ్యంగా భావిస్తారు. సుకుమార రాసిన కృష్ణ విలాసంపై విలాసిని, వివరణ అనే వ్యాఖ్యలు రాశాడు. వరరుచి రాసిన ప్రాకృత ప్రకాశకు వ్యాఖ్యానం, కంస వధ , ఉషానిరుద్ధ లఘుకావ్యాలు. లలితా రాఘవ, పాదుకా పట్టాభిషేక నాటకాలు లీలాశుకుని "గోవిందాభిషేకం"కు వ్యాఖ్యానం కూడా కూడా ఈయన రచించాడని ఎం. కృష్ణమాచారియార్ తెలిపాడు.❁



## 1801-నుండి 1900 వరకు- 19వ శతాబ్దం

## 236) తంజావూర్ సంగీత చతుష్టయం - 1801-1856

తంజావూర్‌కు చెందిన చిన్నయ్య, పొన్నయ్య, శివానందం వడివేలు అనే నలుగురు సోదరులను తంజావూర్ సంగీత చతుష్టయం అంటారు. భరతనాట్యం కర్ణాటక సంగీత వ్యాప్తికి వారి కృషి మరువలేనిది. తంజావూర్ మహారాజు షెర్ఫోజి ఆస్థాన సంగీత విద్వాంసులుగా ఉండేవారు. తరువాత తిరువాన్కూర్ మహారాజు స్వాతి తిరుణాల్ కొలువులో చేరారు. దీక్షితార్ వంటి మహా విద్వాంసుల వద్ద సంగీత శిక్షణపొంది లోతులను తరచారు. వీరిలో వడివేలు పిళ్ళై ఏక సంధాగ్రాహి అని ముత్తుస్వామి దీక్షితార్ ప్రశంసించాడు. గురువుగారికి కానుకగా "నవరత్న మేళ" కూర్చారు సోదరులు. వడివేలును ఆస్థాన గాయకునిగా స్వాతి తిరుణాల్ నియమించాడు. వడివేలు మహాజ్ఞాని. వయోలిన్ కూడా నేర్చి సంస్థానంలో వాయించి రాజు మెప్పుపొందాడు. కల్పిత సంగీతాన్ని మనోధర్మ సంగీతాన్ని వయోలిన్‌పై పలికించవచ్చునని రుజువు చేశాడు వడివేలు. ముత్తుస్వామి దీక్షితులు సోదరుడు బాలు స్వామి ఒక పాశ్చాత్యుని వద్ద వయోలిన్ నేర్చి రాజు కొలువులో వాయించగా వడివేలు "మోహిని అట్టం"ను సృష్టించి ఆడించాడు. అప్పటివరకు కేరళలో కథాకళి మాత్రమే ఉండేది. అదీ మగవారికి మాత్రమే పరిమితం. రాజు స్వాతి తిరుణాల్ తో కలిసి వడివేలు మోహినీ అట్టంను సమగ్రంగా తీర్చిదిద్దాడు. దీనితో ఆడవారికి కూడా నాట్యం చేసే అవకాశం కలిగింది.

ఈ తంజావూర్ సంగీత చతుష్టయం సంస్కృత, తెలుగు భాషలలో కృతులు, వర్ణాలు అనేకం రాశారు. అందులో ముఖ్యమైనవి- నీలాంబరిలో అంబ సౌరాంబ, అంబ నీలాంబ, పూర్వీకళ్యాణిలో - "సాటిలేని".❁

## 237) సంస్కృతంలో క్రైస్తవ సాహిత్యం -1808-1978

1808లోనే బైబిల్‌కు సంస్కృత అనువాదం ప్రారంభమైంది. 1843లో కలకత్తా బాప్టిస్ట్ మిషన్ హీబ్రూ భాషలోని బైబిల్‌ను సంస్కృతంలోకి అనువదించి ముద్రించింది. కలకత్తాలోని సేరమ్‌పూర్‌లో విలియం కారీ మూల గ్రీకు భాషలోని న్యూ టెస్టమెంట్, లార్డ్ అండ్ సేవియర్ ఆఫ్ జీసస్ క్రైస్ట్‌లను మూడు భాగాలుగా సంస్కృతంలోకి అనువదించాడు. వీటి ముద్రణకు మూడేళ్లు పట్టి మూడవది 1811లో విడుదలైంది. 1821లో మళ్ళీ న్యూ అండ్ ఓల్డ్ టెస్టమెంట్‌లు సంస్కృతానువాదం పొందాయి. 1843లో హీబ్రూ భాషలోని "బుక్ ఆఫ్ జెనెసిస్"ను సంస్కృతంలోకి అనువాదం చేసి బాప్టిస్ట్ మిషన్ ముద్రించింది. కలకత్తా స్కూల్ బుక్ సొసైటీ, బాప్టిస్ట్ మిషన్ "సాల్మన్ సామెతలు"ను సంస్కృతీకరించి 1842, 1846లలో తెచ్చింది. 1845లో కలకత్తా బాప్టిస్ట్ మిషన్ ప్రెస్ "ప్రాఫెట్ ఐసయ్య"ను సంస్కృతంలో తర్జుమా చేసి ప్రచురించింది. 1860లో లండన్‌లోని జె.ఆర్.బాలన్ టైన్ సంస్కృతం, ఇంగ్లిష్‌లలో బైబిల్ వ్యాఖ్యానం రాశాడు. ఆ తర్వాత నుంచి వరుసగా సంస్కృత అనువాదాలు వస్తూనే ఉన్నాయి. బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా1962లో న్యూ టెస్టమెంట్‌ను "ప్రభున యేసు క్రీస్తేన నిరూపితస్య నియమస్య గ్రంథ సంగ్రహం"గా సంస్కృతాను వాదం తెచ్చింది. 1878లో నలుగురు క్రిస్టియన్ ఎవాంజలిస్ట్‌ల "గాస్పెల్స్"ను ఒకే పుస్తకంగా "క్రైస్త చరితం-అరతో మతి -మార్క -లూకా -యోహానైర్ విరచితం సుసంవాద చతుష్టయం"గా కలకత్తా బాప్టిస్ట్ మిషన్ ముద్రించింది. తరువాత ఒక్కొక్కరి గాస్పెల్స్‌కు సంస్కృతానువాదం విడివిడిగా తెచ్చింది. అవే "మార్క లిఖిత సు సంవాదం", "సత్య ధర్మ శాస్త్రం", యేసు క్రీస్టియ చరిత దర్పణం 1878, 1884లలో వచ్చాయి. 1878లో "లూకా లిఖిత సు సంవాదః" వస్తే బెంగళూర్ నుంచి "యోహాను లిఖిత సంవాద" వచ్చింది.

1928లో ఢిల్లీ లోని లక్ష్మీధర శాస్త్రి "సె ర్మన్ ఆన్ ది మౌంట్"ను సంస్కృతీకరించి ప్రచురించాడు. దీనికి మళ్ళీ మూడు స్వేచ్ఛా సంస్కృతానువాదాలు వచ్చాయి. అనువాదాలే కాకుండా సృజనాత్మక క్రైస్తవ సంస్కృత సాహిత్యం కూడా 19, 20 శతాబ్దాలలో విస్తృతంగా వచ్చింది. ఈశ్వరోక్త శాస్త్ర ధార "పరమ స్తవ", "క్రీస్తు ధర్మ కౌముది", "క్రీస్తు ధర్మ కౌముది సమాలోచనం" వంటివి సంస్కృతంలో డజనుకుపైగా రచింపబడ్డాయి.

1977లో కేరళకు చెందిన సంస్కృత విద్యావేత్త మహాకవి పి.సి.దేవాస్సియా "క్రీస్తుభాగవత మహాకావ్యం" 33 కాండలలో, 1600 శ్లోకాలతో 433 పేజీలలో రాసి అకాడెమీ బహుమతిని అందుకున్నాడు. ఈవిధంగా క్రైస్తవ సాహిత్యమూ గీర్వాణ గౌరవాన్ని పొంది సముచిత స్థానం సంపాదించుకున్నది. ❁

## 238) కనకాభిషేకం పొందిన - శ్రీ చంద్ర శేఖరేంద్ర సరస్వతి -6 (1813-1850)

64వ కామకోటి జగద్గురువులైన 6వ చంద్ర శేఖరేంద్ర సరస్వతి కుంభకోణంలో కంచిమఠానికి ప్రక్కనే ఉన్న ఇంట్లో వెంకట సుబ్రహ్మణ్య నామధేయంతో జన్మించి 37వ ఏట కంచి కామకోటి పీఠాధిపతి అయ్యారు. మహా శ్రీ విద్యోపాసకులుగా గొప్ప పేరు పొందారు. కంచికామాక్షి అమ్మవారి ఆలయానికి మహా కుంభాభిషేకం చేయాలన్న తలంపుతో వీరు మద్రాస్‌లో కొంతకాలం విరాళాల సేకరణ కోసం ఉన్నారు. ఒక రోజు అమ్మవారు కలలో కనిపించి కంచికి తిరిగి వచ్చెయ్యమని చెప్పగా వెళ్లి పోయి మహా కుంభాభిషేకాన్ని అనన్య సాధారణంగా నిర్వహించారు. విరాళాల వెల్లువ కొనసాగి అద్భుతంగా కార్యక్రమం జరిగింది. తిరువనైక్కాల్‌లో అఖిలాండేశ్వరి అమ్మవారికి తాటంక ప్రతిష్టను రాజకీయ పార్టీల వారు అడ్డుపడినా దిగ్విజయంగా నిర్వహించారు. తంజావూర్ మహారాజు కలలో శివుడు ప్రత్యక్షమై ఆదేశించగా శ్రీ చంద్ర శేఖరేంద్ర సరస్వతికికి కనకాభిషేకం చేశాడు. ఇది కంచికామ కోటి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖియింపబడిన అద్భుత ఘట్టం. తాటంక ప్రతిష్టకు జరిగిన ఖర్చు అంతా మహారాజే భరించాడు 1850లో సిద్ధిపొందారు. మళ్ళీ కంచి పరమాచార్యులు శ్రీ చంద్రశేఖర యతీంద్రులకు సువర్ణాభిషేకం జరిగిందని మనకు తెలుసు. కంచి చరిత్రలో ఇది రెండవ కనకాభిషేకం. ❀

## 239) సంస్కృత కీర్తనకర్త - పాల్ఘాట్ పరమేశ్వర భాగవతార్ - 1815-1892

కేరళలో నూరానిలో 1815లో జన్మించి 1892లో మరణించిన పాలఘాట్ పరమేశ్వర భాగవతార్ కర్ణాటక సంగీత వాగ్గేయకారుడు. తిరువాన్కూర్ రాజు, ప్రముఖ వాగ్గేయ కారుడు స్వాతి తిరుణాల్‌కు చాలా సన్నిహితుడు అభిమానమైనవాడు కూడా. స్వాతి తిరుణాల్ రాసిన వాటికి పరమేశ్వర్ నకలు రాసేవాడు. గొప్ప వీణ విద్వాంసుడు. స్వరబత్ వాయిద్యంలోను దిట్ట. హరికథాగానంతో జనాలను ఉర్రూత లూగించేవాడు. స్వాతి రాజాస్థాన సంగీత విద్వాంసుడు గురువు వడివేలు మరణించాక భాగవతార్‌ను ఆస్థాన విద్వాంసుని చేశాడు రాజు పరమేశ్వర భాగవతార్ సంస్కృతంలో కీర్తనలు రాశాడు. అవి అచ్చు స్వాతి తిరుణాల్, ముత్తుస్వామి దీక్షితార్ కీర్తనలాగానే ఉంటాయి. అనేక వర్ణాలూ రాశాడు. ఆయన రాసిన కీర్తనలలో నాటరాగంలోని "సరసిజనాభ", "శ్రీ మహా గణపతిం భజే" కీర్తనలు మంచి గుర్తింపు తెచ్చి కచేరీలకు వరమయ్యాయి. 87వ ఏట 1892లో భాగవతార్ మరణించాడు. మలయాళంలో కూడా కీర్తనలు రాశాడు. ❀

## 240) సంగీత సార సంగ్రహ కర్త – మతుకు మిల్లి నరసింహ శాస్త్రి – 1816–1873

కృష్ణాజిల్లా తోట్లవల్లూరు రాజాస్థానంలో ఇమ్మడి నాగన్న నాయుడు ఆస్థాన విద్వాంసుడు మతుకు మల్లి నరసింహశాస్త్రి. మలయాద్రి నరసింహ స్వామి భక్తుడు. 1816–1873 ప్రాంతం వాడు. నాగన్న గారి ఆస్థాన కవి, పరీక్షాధకారి. శంకరాచార్య పీఠ విద్వాంసులతో తర్క, మీమాంస శాస్త్రాలలో వాదం చేసి గెలిచినవాడు. ఆంధ్ర మేఘ సందేశం ,ఆంధ్ర సిద్ధాంత కౌముది, ఇందుమతీ పరిణయం (చెన్నపురీ విలాసం జ్యోతిశ్శాస్త్ర సంగ్రహం, పుండ్ర నిర్ణయ చంద్రిక, భారత శాస్త్ర సర్వస్వం, వేంకటాచల యాత్రా చరిత్ర, శ్రీ కృష్ణ జల క్రీడా విలాస నాటకం, శ్రీ లక్ష్మీ నృసింహ శతి, సహస్ర నామా వళి , సంగీత సార సంగ్రహం వంటి ఎన్నో గ్రంథాలు రాశాడు. విభిన్న ప్రక్రియలలో రచనలు చేసిన విద్వన్ మణి మతుకుమిల్లి నరసింహ శాస్త్రి గారు. నవద్వీప పండితుడు కురుగంటి అయ్యప్ప శాస్త్రులు, పరిమి శివయ్య, ప్రభల సుందర రామమూర్తిలను పరీక్షించి రాజు గారిచే తర్క శాస్త్ర బహుమతులిప్పించారు మతుకు మిల్లి వారు. మంత్రవాది లక్ష్మీ నారాయణ శాస్త్రి, కొమాండూరి రఘునాధాచార్యులను వ్యాకరణంలో పరీక్ష చేసి రాజు గారితో సన్మానం చేయించారు. ఎల్లే పెద్ది రాఘవ శాస్త్రులు, వంక మామిడి, రామ శాస్త్రులను వేదాంతంలో పరీక్షించి సన్మానించాడు. పండితులను పరీక్షించటంలో దిట్ట అనిపించుకొన్నాడు జమీందారు గారికి వీరి మాట వేద వాక్కే.❀

## 241) తిరువనంతపురం స్థల పురాణకర్త – కుట్టి కుంజన్ తంగాచ్చి– 1820–1904

కుట్టికుంజన్ తంగాచి ఇరై మాన్ తంబీ ఏకైక కుమార్తె. కేరళలో 1820లో పుట్టి 1904లో చనిపోయింది. తండ్రి స్వాతి తిరుణాల్ ఆస్థాన సంగీత విద్వాంసుడు. తండ్రి వద్దే సంగీతం నేర్చింది. హరిప్పద కోచిప్పిల్ల వారియర్ వద్ద సంస్కృతం అభ్యసించి సంస్కృత, మళయాళ భాషలో గొప్ప విదుషీమణి అయింది. నృత్యం కూడా తండ్రివద్దే నేర్చి దానిలోనూ ప్రతిభ చాటింది. పార్వతీపరిణయం శ్రీమతి స్వయంవరం అనే అట్టకాలు రాసింది. సంస్కృతంలో తిరువనంతపురం స్థలపురాణం, గజేంద్ర మోక్షం, నలచరిత్రం రాసింది. అనేక కృతులు, వర్ణాలు రచించింది. అందులో కాంభోజిరాగంలో "కాత్యాయని మాం" కళ్యాణిరాగంలో "సామజహరే" మంచి గుర్తింపు పొందాయి. సంస్కృత తిల్లానా కూడా రాసింది. కేరళలో కీర్తనలు రాసిన ప్రధమ మహిళా వాగ్గేయకారిణిగా ఆమె గుర్తిపు పొందింది. 84వ ఏట 1904లో మరణించింది.❀



## 242) శృంగార లహరి కర్త - లింగ రాజ అర్స్- (1823-1874)

మైసూర్ మహారాజా మూడవ కృష్ణరాజ ఒడియార్ అల్లుడు అలియ లింగ రాజ అర్స్ కన్నడ సంస్కృతాలలో అందెవేసిన చేయి. సంగీతకర్త. హెగ్గద దేవనకోట వాస్తవ్యుడు. లలిత కళాభిజ్ఞుడు. అనేక నాటకాలు, యక్షగానాలు, 50కి పైగా కృతులు రచించాడు. లింగ, లింగేంద్ర, లింగరాజ అనే కలం పేరుతో రాసేవాడు. సంస్కృతంలో పంచ వింశతి లీల "అంబకీర్తన బాగా ప్రసిద్ధం. అతని నీలాంబరి రాగం చిత్త స్వరంలో "శృంగార లహరి" సంస్కృత కృతి అత్యద్భుతం. 51 ఏళ్ళు మాత్రమే జీవించి అర్స్ 1874లో అసువులు బాశాడు.❁

## 243) జ్యోతిష చింతామణి సంకలనకర్త - చింతామణి రఘునాధాచార్య (1828)

తమిళనాడులో 3-17 -1828న జన్మించిన చింతామణి రఘునాధాచార్య 17వ ఏటనే మద్రాస్ ఖగోళ వేదశాలలో సహాయకునిగా పనిచేశాడు. "జ్యోతిష చింతామణి" సంస్కృత గ్రంథం సంకలనం చేశాడు. "దృగ్గణితం" పంచాంగం ముద్రణ ప్రారంభించి చనిపోయాడు కుమారులు దీన్ని పూర్తి చేశారు.❁



## 244) సంస్కృత - కాశ్మీర- సంస్కృత నిఘంటు కర్త, కాష్మీర్ పాణిని - పండిత ఈశ్వర కౌల్ -1833-1893

సంప్రదాయ సంస్కృత భాషా కుటుంబంలో 4-7-1833లో పుట్టిన పండిట్ ఈశ్వర కౌల్ మూడేళ్ళ చిన్నతనంలోనే తండ్రి పండిట్ గణేష్ కౌల్‌ను కోల్పోయాడు. పండిట్ తిక్కారాం రజ్దా మొదలైన సంస్కృత ఉద్దండుల వద్ద బెనారస్ నుండి మహారాజా రన్బీర్ సింగ్ వద్ద పని చేయటానికి వచ్చిన పండిట్ దయాకృష్ణ జోషీ వద్ద సంస్కృతం నేర్చి, పర్షియన్ భాషా లోతులూ తరచి, అరబిక్ భాష అంతు చూశాడు. 1861లో మహారాజా ఈయనకు పర్షియన్ అరేబిక్ గ్రంథాలను సంస్కృతంలోకి హిందీలోకి అనువదించే పని అప్పగించాడు. ఈ పని పూర్తి చేశాక 1871లో రాజు మహారాజా సంస్కృత పాఠశాలలో సంస్కృత హెడ్ టీచర్‌గా నియమించాడు.

కాశ్మీర్ పండిట్‌లు అంటే వ్యాకరణ నిష్ణాతులు. టిబెటన్ గుజరాతీ వ్యాకరణాలను మొదట రాసింది కాశ్మీర్ పండిట్‌లే. అలాగే మొదటి కాశ్మీర వ్యాకరణాన్ని కౌల్ గ్రియర్సన్‌తో కలిసి తయారు చేశాడు. పాణిని అష్టాధ్యాయి ఆధారంగా హేమచంద్ర తన వ్యాకరణం రాశాడు. ఇప్పుడు కౌల్ "కాశ్మీర్ శబ్దమిత్ర" అనే వ్యాకరణం రచించాడు. ఇదికాక "కాశ్మీరీ-సంస్కృత కోశంజ' నిఘంటు నిర్మాణం ప్రారంభించి సగంలో ఉండగా మరణిస్తే గ్రియర్సన్ దాన్నిపండిట్ ముకుంద రామ్ శాస్త్రి పండిట్ నిత్యానంద శాస్త్రి సహకారంతో 1932లో పూర్తి చేశాడు. కాశ్మీరు పదాలను మొట్టమొదటిసారిగా దేవ నాగర లిపిలో తన వ్యాకరణం నిఘంటువులలో రాసిన ఘన చరిత్ర ఈశ్వర కౌల్ ది. క్లిష్టమైన కాశ్మీర హల్లులను ఉచ్చరించటానికి మాండలిక గుర్తులను హారిజాంటల్ బార్, హలంతాలను ఉపయోగించిన భాషావేత్త కౌల్. 1881లో కాశ్మీర్ రాజ్య అనువాద శాఖలో డైరెక్టర్‌గా నియమించబడ్డాడు. మహారాజా రన్బీర్ సింగ్ మరణించేదాకా 1884 వరకు పనిచేశాడు తరువాత ప్రభువు ప్రతాప సింగ్ కౌల్ ను తన ఆస్థానం లో ముఖ్య జ్యోతిష్య పండితునిగా నియమించి గౌరవించాడు. ఈ పదవిలో 28-8-1893లో మరణించేదాకా ఉన్నాడు. పండిత ఈశ్వర కౌల్ వ్యాకరణ సేవను శ్లాఘించిన సర్ అరుల్ స్టెయిన్ ఆయనను "కాశ్మీర్ పాణిని" అని గౌరవనామంతో కీర్తించాడు.❀



## 245) కృష్ణ యజుర్వేద పీఠిక కర్త –న్యాయ రత్న – మహేష్ చంద్ర భట్టాచార్య –1836-1906

22-2-1836న కులీన బ్రాహ్మణ కుటుంబంలో మహేశ చంద్ర భట్టాచార్య బెంగాల్‌లో జన్మించాడు. నారిత్‌కు చెందిన ఈ కుటుంబం తరతరాలుగా సంస్కృత భాషా పాండిత్యంలో పండిపోయింది. ఆ కుటుంబం వారందరూ దాదాపు సంస్కృత మహా విద్వాంసులే. తండ్రి హరినారాయణ తర్క సిద్ధాంతంలో అద్వితీయుడు. ఒక బాబాయి గురుప్రసాద్ తర్క పంచానన బిరుదు పొందితే మరో బాబాయి ఠాకూర్ దాస్ చౌరామణి విశిష్ట పండితునిగా గుర్తింపు పొందాడు. పెద్దన్న పండిట్ మాధవ చంద్ర "సార్వ భౌమ" బిరుదు నందుకుని మహిషాదల్ రాజ్య సభా పండితుడైనాడు.

హుగ్లీలోని జహానాబాద్‌కు చెందిన పండిత రామచంద్ర తర్క వాగీశ కుమార్తె మందాకినిని వివాహమాడి మనోరమ, మన్మధ నాద విద్యార్ధ భట్టాచార్య, మునీంద్రనాథ్ భట్టాచార్య, మహిమ నాథ భట్టాచార్యలకు తండ్రి అయ్యాడు. పెద్దకొడుకు మద్రాస్ రాష్ట్ర మొదటి ఇండియన్ అకౌంటెంట్ జనరల్. మహేశ భట్టాచార్య 70వ ఏట 12-4-1906న మరణించాడు.

1876లో ప్రసన్న కుమార్ సర్వాధికారి స్థానంలో సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ అయ్యాడు. ప్రిన్సిపాల్‌గా 19 ఏళ్ళ పాలనలో సంస్కృతంలో ప్రతిభ గల విద్యార్ధులకు అర్హతలను బట్టి గౌరవ స్థానాలను కల్పించాడు. స్వగ్రామం నారిత్‌లో ఆంగ్లో – సాంస్క్రిట్ సెకండరీ స్కూల్ ఏర్పాటు చేశాడు. కావ్య ప్రకాశ, మీమాంస దర్శన, కృష్ణ యజుర్వేదాలను విలువైన పీఠికలు రాసి సంపాదకత్వం వహించి ప్రచురించాడు. దయానంద సరస్వతి

వేద భాష్యం పైనా, తులసీ ధర మీమాంస పైనా, మృచ్ఛకటిక కర్త పైనా, లుప్త సంవత్సరంపైనా అనేక పత్రాలు రాశాడు. దయానంద భాష్యంపై భట్టాచార్య చూపించిన అభ్యంతరాలకు దయానంద స్కూల్ సంస్కృత విద్వాంసుడు తెలియబరచిన వివరాలను ఒక పుస్తకంగా ప్రచురించాడు. సంస్కృత విద్యా వ్యాప్తికి భట్టాచార్య కృషి ప్రశంసనీయం. సంస్కృత విద్యాలయాలకు కావలసిన నిధి సేకరణ కూడాచేసి వాటి నిర్వహణకు తోడ్పడ్డాడు.

నారిత్ గ్రామంలోను, పరిసరాలలోనూ మంచి రోడ్ల నిర్మాణం చేబట్టాడు. స్వంత జిల్లా హౌరాలోని ట్రాం రోడ్ల విషయం లోనూ శ్రద్ధ చూపాడు. 16-2-1887న విక్టోరియా రాణి పట్టాభిషేక రజతోత్సవనాడు “మహా మహోపాధ్యాయ” బిరుదాన్నిచ్చి గౌరవించారు. “మోస్ట్ ఎమినేంట్ ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్” భట్టో పాధ్యాయ గుర్తింపు పొందాడు. భారతీయ సంస్కృత విద్వాంసులు “న్యాయ రత్న” బిరుదంతో సత్కరించారు. హంగేరిలోని బుడాపెస్ట్‌లో ఉన్న “హంగేరియన్ అకాడెమి ఆఫ్ సైన్సెస్” ఫారిన్ మెంబర్‌గా ఎన్నుకో బడ్డాడు. కలకత్తా విశ్వవిద్యాలయం, బెంగాల్‌లోని టెక్స్ట్ బుక్ కమిటీ, బీహార్ సాంస్క్రిట్ సమాజ్ బొంబాయిలోని ఆంధ్రో పలాజికల్ సొసైటీలలో గౌరవ సభ్య స్థానం పొందాడు. హిందూ హాస్టల్ కమిటీ జాయింట్ సెక్రెటరిగా, బెతూన్ కాలేజి మెంబర్‌గా, హౌరా ఇంజినీరింగ్ కాలేజికి విజిటర్‌గా ఉన్నాడు. బెంగాల్ ప్రెసిడెన్సిలో అంటే బెంగాల్ బీహార్ ఒరిస్సా ప్రాంతాల సంస్కృతానికి న్యాయరత్న స్థాయిలో ఇంచార్జిగా సేవలు అందించాడు. ఉత్తర కలకత్తాలోని శ్యాం బజార్‌కు “భట్టా చార్య బజార్” అని గౌరవ నామం పెట్టి గౌరవించారు. వందలాది ఆయన వద్ద విద్య నేర్చి సంస్కృత మహా విద్వాంసులయ్యారు.❋

## 246) ప్రబంధ సారం కర్త - గంగా సహాయ్ -1840

రాజ పుటానాలోని షికార్ జిల్లా పటాన్‌లో ఉన్నత బ్రాహ్మణవంశంలో సహాయ జన్మించాడు. అక్కడే చదివి పండితుల ప్రబోధంతో ఉన్నత విద్య కోసం కాశీ వెళ్ళాడు. అక్కడ గొప్ప పండితులవద్ద వేద, శాస్త్ర, పురాణ ఉపనిషత్తులను రెండేళ్లలో అధ్యయనం చేసి తిరుగులేని మహా విద్వాంసుడు అనిపించుకొన్నాడు. అక్కడి ఆచార్యులు సహాయ్ వైదుష్యానికి ఆశ్చర్యపడి ఆయన తమకు మరింత విజ్ఞాననం ప్రసాదించి మార్గదర్శకం చేయాలని కోరారు. బుండీ మహారాజు గంగా సహాయను దర్శించి తన బుండీ రాజ్య పాలన అత్యంత సమర్ధ వంతంగా నిర్వహించటానికి మార్గదర్శనం చేయమని అభ్యర్ధించాడు. దీనితో సంస్కృత పండిత కవి గంగా సహాయ్. 1877 నుంచి 1913 వరకు బుండీ రాజ్యానికి దివాన్‌గా వ్యవహరించాడు. న్యాయ శాస్త్రంలో మహా విద్వాంసుడు. భాగవత మహాపురాణాన్ని లిప్యంతరీకరణ (ట్రాన్సిలరేట్) చేసి, అనువదించి వ్యాఖ్యానించాడు. అంటే పండితులకు మాత్రమే ఆనాడు అర్ధమయ్యే రీతిలో ఉన్నభాషను ఆధునికంగా అందరికి సులభంగా అర్ధమయ్యే రీతిలో రాశాడన్నమాట. దీనికి ఆయన "అన్వితార్ధ ప్రకాశిక" అనే సార్ధక నామాన్ని పెట్టాడు. 1901లో దీనిని బొంబాయిలోని వేంకటేశ్వర ప్రెస్ ముద్రించింది.

1877 నుంచి 1930 వరకు ఆయన 127 గ్రంథాలు రాసి ప్రచురించాడు. ఇందులో బుండి రాజ్య చరిత్ర అయిన "వంస్ ప్రకాష్" కూడా ఉంది. "కాందార్, "పండిత" బిరుదులు పొందాడు. 1880లో "ప్రబంధ సార" రచించాడు. రాజస్థాన్‌లో ఇదే అతి ప్రాచీన న్యాయ శాస్త్ర గ్రంథం. అంతకు ముందు వరకు రాజస్తాన్‌లో స్థానిక న్యాయ చట్టాలు సంప్రదాయం, ఆచార వ్యవహారాలమీద ఆధారపడి ఉండేవి. బుండీ నగర ద్వారాల్లో ఒక దానికి "పండిట్ గంగా సహాయ్" పేరు పెట్టి గౌరవించారు.❀



## 247) స్యేన సందేశం కర్త - వాయ స్కార ఆర్యన్ నారాయణ్ నంబూద్రి -1841-1902

1841లో జన్మించి 1902లో మరణించిన వయాస్కార ఆర్యన్ నారాయణన్ కేరళ నంబూద్రి కుటుంబానికి చెందినవాడు. అష్టవైద్యన్ బిరుదుపొందిన ఈకవి "స్యేన సందేశం, నక్షత్ర వృత్తావలి, చిత్ర ప్రబంధాలు రాశాడు.❀



## 248) సంస్కృత కృతికర్త - వీణ పద్మనాభయ్య- 1842-1900

కర్ణాటక చిత్తనాయక హళ్ళికి చెందిన వీణ పద్మనాభయ్య 1842లో జన్మించి 58వ ఏట 1900లో మరణించాడు. సంస్కృతం ఆంధ్రంలలో అనేక స్వరాలు కృతులు జావళీలు వర్ణాలు, తోడిరాగంలో సప్త తాళేశ్వరం రచించాడు. నాట కురంజి రాగంలో "శ్రీ హేరంబ మీడే", నాగేశ్వరావళి రాగంలో "భావయామి తవపాదం" బాగా ప్రసిద్ధమైనవి. కన్నడంలో ఒకే ఒక్క జావళి రాశాడు. మిగిలినవి సంస్కృతం, తెలుగులలో రాశాడు.❁

## 249) కర్ణాటక జాతీయ గీత కర్త - బసవప్ప శాస్త్రి -1843-1891

కర్ణాటక రాష్ట్ర జాతీయ గీతం "కాయో శ్రీ గౌరీ" రాసిన బసవప్ప శాస్త్రి 1843లో మైసూర్ జిల్లా నరసాంద్ర గ్రామంలో జన్మించాడు. సంస్కృతాంధ్రాలలో మహా పండితుడు. కాళిదాసుని శాకుంతల మాళవికాగ్నిమిత్ర మొదలైన సంస్కృత నాటకాలను షేక్స్పియర్ ఒదెల్లో నాటకాన్నీ కన్నడీకరించాడు. "కర్ణాటక నాటక పితామహ" బిరుదాంకితుడు. తన రత్నావళి, ఉత్తరరామ చరిత నాటకాలకు చాలాపాటలు కూర్చాడు. 1891లో చనిపోయాడు.

తంజావూర్ చిన్నయ్య (1803-1856) తంజావూర్ జిల్లాలో పుట్టి మైసూర్ రాజాస్థాన సంగీత విద్వాంసుడయ్యాడు. సంస్కృతం తెలుగులలో వర్ణాలు కృతులు జావళీలు విశేషంగా రాశాడు. ఆయన ఆరభిరాగంలో రాసిన "అంబాసౌరంబ" నీలాంబరితో రాసిన "అంబా నీలాంబరి" కృతులు చిత్త స్వరాలతో విశేష ప్రాభవాన్ని తెచ్చాయి.❁



## 250) 72 మేళకర్త రాగాలతో రాగమాలిక అల్లిన - మహా వైద్య నాథ శివన్ (అయ్యర్) -1844-1893

అలవోకగా మహా సంగీతం పాడే గొప్ప సంగీతకర్త మహా వైద్య నాథశివన్. 1844లో తంజావూర్ జిల్లా వియచేరి గ్రామంలో పుట్టాడు. తండ్రి దొరైస్వామి అయ్యర్ గొప్ప సంగీతజ్ఞుడు. ఆనై అయ్యా బ్రదర్స్ వద్ద సంగీత శిక్షణ పొందాడు. తర్వాత త్యాగరాజస్వామి శిష్యుడు మానాంబు చావడి వెంకట సుబ్బయ్యర్ వద్ద మెళకువలు గ్రహించాడు. రాగాలాపనలో శివన్ శివమెత్తిస్తాడు. తమ్ముడు రామస్వామి శివన్‌తో కలిసి కచేరీలు చేసి కర్ణాటక సంగీత తొలి జంటగా రికార్డ్ సృష్టించాడు. "గుహదాస" అనే ముద్రతో రాశాడు. సంస్కృతం తెలుగు తమిళంలో చాలా కృతులు రాశాడు. సంస్కృతంలో జన రంజని రాగంలో - "పాహిమాం రాజ రాజేశ్వరి" 'రాగమాలికలో - "ప్రణతార్తి హర ప్రభో పురారే", నాగ స్వరాలిలో - "శ్రీ శంకర గురువరం" శివన్ సంగీత పాండిత్యానికి మచ్చు తునకలు. సారాంగిరాగ తెలుగు కృతి - "నీ కేల దయరాదు" సుప్రసిద్ధమైనది.❁



## 251) అభినవ కల్హణ -పండిత గోవింద కౌల్ -1846-1899

1846లో ఆనాటి ప్రపంచ ప్రసిద్ధ సంస్కృత విద్వాంసుడైన పండిత బల భద్ర కౌల్ పెద్ద కుమారునిగా జన్మించిన గోవిందకౌల్ తండ్రి తాత అందరూ మహా విద్వాంసులలే. ఈయన పూర్వీకుడు కాశ్మీర్ రాజు రంజిత్ సింగ్‌ను కాశ్మీర్‌ను ఆఫ్ఘన్ కబంధ హస్తాల నుంచి విముక్తి చేయమని ప్రేరేపించినవాడు. సంస్కృత పారసీకాలతో పాటు ఆంగ్లాన్నీకూడా కౌల్ నేర్చాడు. కాశ్మీర్‌లో ఇంగ్లిష్ నేర్చిన మొదటితరం వారిలో ఈయన ఉన్నాడు. ప్రపంచ విషయాలన్నీ కూడా బాగా అవగాహన చేసుకోగలిగారు. అలంకార వ్యాకరణ న్యాయ శాస్త్రాలలో శైవ సూత్రాలలో అఖండుడు అనిపించాడు. 28 ఏళ్లకే గొప్ప విద్యావేత్తగా ప్రసిద్ధి చెందాడు. 1874 ప్రభుత్వ అనువాద శాఖలో


ఉద్యోగంలో చేరి కాశ్మీర్ సంస్కృత సాహిత్యాన్ని హిందీలోకి అనువదించాడు. పదేళ్ల తర్వాత ప్రాజెక్ట్ మూతపడి ఉద్యోగం లేక శ్రీనగర్ ప్రభుత్వ పాఠశాల సంస్కృత టీచర్‌గా చేరాడు. అదీ ఊడగా, యూరోపియన్ ఇండాలజిస్ట్ జార్జ్ బూలర్ కౌల్ ప్రజ్ఞను గుర్తించి స్టెయిన్‌కు పరిచయం చేయగా ఆయన చేస్తున్న కల్హణుని రాజతరంగిణి అనువాదానికి 1888 నుంచి 1896 వరకు సహకరించాడు. దీని తర్వాత మహారాజా రన్బీర్ సింగ్ కోరికపై స్టెయిన్‌తో కలిసి జమ్మూలోని రఘునాధ ఆలయంలోని రణబీర్ సింగ్ లైబ్రరీలో 6 వేళా సంస్కృత వ్రాత ప్రతులకు కేటలాగ్ తయారు చేశాడు. ఇదికాక స్టెయిన్‌తో కలిసి కాశ్మీర్ జానపద కథలను సేకరించి 1917లో కౌల్ వివరణలతో "హాతిమ్ కథలు"గా ప్రచురించాడు. గ్రియర్సన్‌కు కాశ్మీర్ నిఘంటు నిర్మాణంలో తోడ్పడ్డాడు.

1899 జూన్‌లో పండిత గోవింద కౌల్ మరణించినప్పుడు దుఃఖాన్ని తట్టుకోలేని స్టెయిన్ "like another Kalhana departed as my best Indian friend beyond all hope of reunion in this Janma". Paying fulsome tributes to him, Stein wrote: "Whenever Govind Kaul was by my side, whether in the dusty exile of Lahore or alpine coolness of Mohand Marg in Kashmir, I was in continuity with the past as the historical student of India. His personality embodied all that change of ages indicated and showed as the mind and psyche of India" అని ఆధునిక కల్హణుడుగా కౌల్‌ను ప్రస్తుతించి నివాళులర్పించాడు.❋




## 252) జానకీ రామ భాష్య కర్త – ఆనంద రామ బారువా –1850–1889

అస్సామ్‌లో మొట్టమొదటి ఐ సి ఎస్, మొదటి గ్రాడ్యుయేట్, లాయర్ సంస్కృతాంగ్లాలలో మహా విద్వాంసుడు ఆనంద రామ్ బారువా 1850లో జన్మించి 39 ఏళ్లకే 1889లో మరణించాడు. ఆయన 1–భవభూతి మహా విరచితం, 2–సరస్వతీ కంఠాభరణం, 3–నామ లింగాను శాసనం, 4–జానకీరామ భాష్యం సంస్కృతంలో రచించాడు. ఆంగ్లంలో భవ భూతి అండ్ హిస్ ప్లేస్ ఇన్ సంస్కృత లిటరేచర్, ఎ ప్రాక్టికల్ ఇంగ్లిష్ సంస్కృత డిక్షనరీ, హయ్యర్ సంస్కృత గ్రామర్ –జెండర్ అండ్ సింటాక్స్, ఏన్షెంట్ జాగ్రఫీ ఆఫ్ ఇండియా, ఎ కంపానియన్ టు ది సాన్ స్క్రిట్ రీడింగ్ అండర్ గ్రాడ్యుయేటస్ ఆఫ్ ది కలకత్తా యూనివర్సిటీ, కంపారిసన్ ఆఫ్ ఎ కాంప్రెహెన్సివ్ డిక్షనరీ ఆఫ్ ఆల్ డయలెక్ట్స్ ఆఫ్ బెంగాల్.❋



## 253) భారత మహిళ కర్త - మహామహోపాధ్యాయ - హర ప్రసాద శాస్త్రి -1853-1931

6-12-1853న జన్మించి 17-11-1931న మరణించిన మహా మహోపాధ్యాయ హర ప్రసాద శాస్త్రి బెంగాల్ సంస్కృత విద్వాంసుడు. బెంగాలీ ప్రాచీన కృతి ఛాయా పదను కనుగొన్నవాడు. బెంగాల్‌లో ఖులీనా జిల్లా కురుమ గ్రామంలో (ఇప్పటి బంగ్లాదేశ్) జన్మించాడు. ఇంటిపేరు భట్టాచార్య. కలకత్తా ప్రెసిడెన్సి కాలేజిలో సంస్కృతం చదివి ఈశ్వర చంద్ర విద్యాసాగర్‌తో కలిసి 1877లో శాస్త్రి పట్టా పొందాడు. ఎం.ఏ లో ఫస్ట్ క్లాస్ వచ్చినవారికి శాస్త్రి డిగ్రీ ఇస్తారు. ఆ బాచ్‌లో ఈయన ఒక్కడే దాన్ని సాధించాడు. 1883లో సంస్కృత కాలేజి ప్రొఫెసర్‌గా, అసిస్టెంట్ ట్రాన్స్‌లేటర్‌గా బెంగాల్ లైబ్రేరియన్‌గా, సంస్కృత శాఖ అధ్యక్షుడుగా వివిధ హోదాలలో పని చేశాడు. 1900 -1908 వరకు ప్రిన్సిపాల్ చేసి గవర్నమెంట్ బ్యూరో ఆఫ్ ఇన్ఫర్మేషన్‌లో చేరి, ఢాకా యుని వర్సిటీలో సంస్కృత బెంగాలీ భాషా ప్రొఫెసర్‌గా 1921-24 వరకు ఉన్నాడు. ఏసియాటిక్ సొసైటీ బంగా సాహిత్య పరిషత్‌లకు ప్రెసిడెంట్ అయ్యాడు. రాయల్ ఏసియాటిక్ సొసైటీ గౌరవ సభ్యుడు కూడా. ఆయన రాసిన "భారత మహిళ" బాగా పేరు తెచ్చింది. బౌద్ధ పురాణాలను అనువదించాడు. క్రమంగా బెంగాలీ భాషపై దృష్టిపెట్టి ఆ భాషలో వ్రాతప్రతులు సేకరించి ముద్రించాడు. అందులో ముఖ్యమైనది ఛాయాగీత్ లేక ఛాయా పద. చాలా ప్రాచీన గ్రంథాలు సేకరించి ప్రచురించాడు. సంస్కృత కల్చర్ ఇన్ ఎండర్న్ ఇండియా, డిస్కవరీ ఆఫ్ లివింగ్ బుద్ధిజం ఇన్ బెంగాల్. మగధ లిటరేచర్ ఆయన ఆంగ్ల రచనలు. వ్యాపారి కూతురు -బెనియెర్ మెయి అనే ఆయన రచన వాడుక భాషలో రాసినది. కాంచనమాల కూడా రాశాడు. ❁



## 254) వేదాధికార నిరూపణకర్త - కట్టాంబి స్వామి -1853-1924

కేరళకు చెందిన కట్టాంబి స్వామి హిందూ వేదాంతి గొప్ప సంఘ సంస్కర్త. భారతీయ తత్వ శాస్త్రానికి యోగం జ్ఞానం ఉచ్వాస నిస్వాసాలు అని చెప్పాడు. అద్వైత బ్రహ్మ స్వరూప దర్శనానికి ఇవే మార్గదర్శకాలు. కేరళలో రాజకీయ, మత, సాంఘిక, సాహిత్యాలలో సంస్కరణలు చేయాలని భావించాడు. 1853 ఆగస్టులో కేరళలో తిరువనంతపురం దగ్గర కొల్లూర్‌లో జన్మించాడు. తండ్రి వాసుదేవ శర్మ. తల్లి నాగమ్మ. చిన్నప్పుడు అందరూ కుంజు అని ముద్దుగా పిలిచేవారు. అదే తర్వాత కుంజుపిళ్లగా మారింది. తలిదండ్రులకు చదువుచెప్పించే స్తోమత లేకపోవటంతో పెట్టియిల్ రామం పిళ్ల ఆసన్ నడిపే గురుకులంలో చేరాడు. క్లాస్ లీడర్ అయినందున "కట్టాంబి" అనే పేరు వచ్చి అదే స్థిరమైంది. స్వామినాథ దేశికుల వద్ద తమిళం, సుందరం పిళ్ల వద్ద తత్వ శాస్త్రం, టిక్కట్టు అయ్యావు వద్ద యోగా నేర్చాడు. ఒక సంచారస్వామి ఆ ఊరికి వచ్చి బాల సుబ్రహ్మణ్య మంత్రోపదేశం చేశాడు. దీన్ని నిత్యం జపం చేసి గొప్ప అనుభూతిపొంది "షణ్ముఖ దాస" బిరుదు పొందాడు. కుటుంబ భారం మీద పడగా చిన్నచిన్న పనులు చేస్తూ డబ్బు సంపాదించి పోషించాడు. త్రివేంద్రం ప్రభుత్వ సెక్రెటేరియట్‌లో గుమాస్తాగా చేశాడు.

తమిళనాడు వెళ్లి శుభా జట పాటిక అనే శాస్త్ర కోవిదుని శిష్యుడై చాలా కాలం ఉండి సంస్కృతం శాస్త్రాలు, సిద్ధ వైద్యం, సంగీతం మార్షల్ ఆర్ట్ వగైరా నేర్చాడు. హిందూ, క్రిస్టియన్, ముస్లిం మత పెద్దల వద్ద, అవధూతల వద్ద ఎన్నో విషయాలు తెలుసుకొన్నాడు. ఒక గొప్ప విద్యావేత్తగా, మహర్షిగా మారి కేరళకు తిరిగిరాగా నారాయణ గురు 1882లో ఈయన్ను కలిసి, ఆయన కొట్టాంబి శిష్యుడైపోయాడు. ఇద్దరూ కలిసి హిందూమతంలోని మూడాచారాలను సంస్కరించాలని నిర్ణయించారు. ముందుగా మహిళా విమోచన ఉద్యమం చేబట్టి వారికి అన్నిటా సమాన ప్రాతినిధ్యమివ్వాలని ఉద్యమించారు. మత మార్పిడులను ఎదిరించారు.

కిట్టాంబి స్వామి రచనలు ఆయన మేధో శక్తిని వివరిస్తాయి. సంస్కృతంలో ఎన్నో ముక్తకాలు భజన గీతాలు, వ్యాసాలూ రాశాడు. ఆయన రచనలో "వేదాధికార నిరూపణ" ప్రసిద్ధ గ్రంథం. అద్వైత పద్ధతి, ఆదిభాష, క్రీస్తు మత నిరూపణం, దేవీ మానస స్తోత్ర వ్యాఖ్యానం, నిజానంద విలాసం, సర్వమత సామరస్యంలు కూడా బహుళ ప్రచారంలో ఉన్నవే. ఆయనను "కవి వస్త్రం లేని సన్యాసి" అంటారు. 1924లో పన్మన వద్ద కిట్టాంబి స్వామి 71వ ఏటమహా సమాధి చెందాడు. ఆయనను విద్యాధిరాజా అని, విద్యారాజరాజతీర్థ పరామభట్టార అని కేరళ ప్రజలు గౌరవంగా సంబోధిస్తారు.



## 255) సంగీత సుబోధిని కర్త – మైసూర్ కరగిరి రావు –1853–1927

1853లో కర్ణాటక తుంకూర్‌లో పుట్టిన కరగిరిరావు సంగీత నిధి. 200ల దేవర నామాలకు సంగీత స్వరాలు కూర్చాడు. ఆయన కృతులన్నీ చిత్త స్వరాలతో చిత్తాన్ని ఆకర్షిస్తాయి. సంగీత సుబోధిని, గాన వాద్య రహస్య ప్రకాశిని అనే గొప్ప సంగీత గ్రంథాలు రాశాడు. మోహనరాగంలో "నెనరుంచిర", సరస్వతి రాగం లో "సరస్వతి భగవతి" కృతులు మంచి పేరు తెచ్చాయి. 74వ ఏట మరణించాడు.❁

## 256) జ్యోతిర్గణిత సంకలనకర్త – వేంకటేశ బాపూజీ కేత్కర్ –1853

క్రీ.శ.1853లో కేత్కర్ జన్మించాడు విద్యాశాఖలో ఉపాధ్యాయ వృత్తి చేశాడు రుగ్వేది. చిత్ పావన బ్రాహ్మణుడు. గార్గేయ గోత్రజుడు బాగల్ కోట ఆంగ్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తండ్రి గొప్ప ఖగోళవేత్త. 1890లో కేత్కర్ "జ్యోతిర్గణితం" పేరిట సంస్కృతంలో గొప్ప గ్రంథాన్ని సంకలనం చేశారు. ఫ్రెంచ్ అల్మోనాటికల్ గ్రంథాలను ఆధారంగా దీన్ని తయారు చేశాడు. చాలా నిర్దుష్టమైన గణితం ఇందులో కనిపిస్తుంది. ట్రిగొనామెట్రీ, లాగరదిమ్స్ తెలియని వాళ్ళు కూడా తేలికగా నిర్వగలిగే విధంగా గ్రంథం ఉండటం విశేషం ఒకరకంగా కరతలామలకం. అయితే ఈ గ్రంథం ముద్రణ భాగ్యం పొందక పోవటం దురదృష్టం.❁

## 257) వ్రతారాధన కర్త – వల్లాన సేరి వాసున్ని మూసద్ – 1855–1914

1855లో పుట్టి 1914లో 59వ ఏట మరణించిన వల్లాన సేరి వాసున్ని మూసద్ కేరళ నంబూద్రి కుటుంబం వాడు. విజ్ఞాన చింతామణి "సంస్కృత పత్రిక నడిపాడు. ఈయన రాసిన గ్రంథాలలో వ్రతారాధన మాల, సంస్కృత పాఠావలి, శ్రీ పాదాది కేశ పంచాంగిక, మాయాస్తవం, మాన విక్రమ సామూత్రి మహారాజా చరితం మొదలైనవి ఉన్నాయి.❁

## 258) కుల శేఖరీయం కర్త – ఇందూర్ కేశవన్ నంబూద్రి – 1855-1932

కేరళ నంబూద్రి బ్రాహ్మణుడైన ఇంచూర్ కేశవన్ నంబూద్రి 1855లో తిక్క వరూర్ దేశంలో పుట్టి 87 ఏళ్ళు జీవించి 1932లో మరణించాడు. ఇతని కులశేఖరీయం యదువంశ చంపు ప్రసిద్ధమైనవి.❀




## 259) "మృగ శీర్ష" (ఓరియన్) గ్రంథకర్త – లోకమాన్య బాలగంగాధర తిలక్ -1856-1920

మహా దేశభక్తుడు బాలగంగాధర తిలక్ 1856లో జులై 23 మహారాష్ట్రలో జన్మించి పూనా ఫెర్గూసన్ కాలేజిలో గణిత, ఖగోళ శాస్త్ర ప్రధాన ఆచార్యుడుగా ఉన్నాడు. 1893లో మృగశీర్ష (ఓరియన్) అనే ఉద్గ్రంథం రాశాడు. దీనిలో వేద కాలాన్ని చాలా ఖచ్చితంగా నిర్ణయించాడు విషువత్తులు మృగ శీర్ష నక్షత్రంలో ఉన్నకాలంలోనే అంటే శక సంవత్సరానికి 4,000 సంవత్సరాలకు పూర్వమే వేద సూక్తాలు సంకలనం అయినాయని తెలియజేశాడు. 1-8-1920న 64వ ఏట మరణించాడు. భారత స్వాతంత్రోద్యమ నాయకుడు రచయితా సంస్కర్త, లాయర్ అయిన తిలక్ ప్రభావం నాటి జాతీయ నాయకులపై అమోఘం. ఆయన తీవ్రభావాలకు బ్రిటిష్ ప్రభుత్వం "ది ఫాదర్ ఆఫ్ ఇండియన్ అన్ రెస్ట్" అని ముద్ర వేసింది. అంటే బ్రిటిష్ వారి గుండెల్లో ఎంత భయోత్పాతం కల్పించాడో తెలుస్తుంది భారతీయులకు ఆయన "లోకమాన్య తిలక్". "స్వరాజ్యం ణా జన్మ హక్కు" అని చాటిన మొట్టమొదటి దేశభాక్తుడు తిలక్. దక్కన్ ఎడ్యుకేషన్ సొసైటీ స్థాపకుడు తిలక్ సహచరుడు గోపాలకృష్ణ గోఖలే ఆనాటి రాజకీయంలో "లాల్ బాల్ పాల్" త్రిమూర్తులు. కేసరి పత్రిక స్థాపించి స్వాతంత్ర ఉద్యమానికి ఊపిరులు ఊదాడు. భారత విప్లవవాదులకు వెన్ను దన్నుగా నిలిచాడు బ్రిటిష్ ప్రభుత్వం అరెస్ట్ చేసి మాండలే జైలులో పెట్టింది. అనిబిసెంట్ స్థాపించిన హోంరూల్ లీగ్‌కు సహాయ సహకారాలు అందించాడు. తిలక్ రాసిన "గీతా వ్యాఖ్యానం" బహు ప్రచారం పొందింది. స్వామి వివేకానందతో కలిసి రైలు ప్రయాణం చేశాడు. సంస్కృత మరాటీ, ఆంగ్ల భాషలలో అద్వితీయ పాండిత్యం ఉన్నవాడు. లోకమాన్యుడు "యుగపురుషుడు" అని అందరూ భావిస్తారు.❀

## 260) కేరళలో మరికొన్ని సంస్కృత సందేశ కావ్యాలు -1858-1926

కవి సార్వ భౌమ కొకుణ్ణి తంపురన్ కోటు నల్లూర్ (1858-1926) “విప్రసందేశం”, 18వ శతాబ్దికి చెందిన రామపనివాద “122 శ్లోకాల శారికా సందేశం” 1858-1926 కాలపు కవి సార్వభౌమ కొకుణ్ణి తాంపురన్ కోటు నల్లూర్ “విప్ర సందేశం “అజ్ఞాతకవి విరచిత” చకోర సందేశం, పులియనల్లూర్ తెక్కపట్టు అనే నంబూద్రి బ్రాహ్మణకవి “సంపాతి సందేశం”, వాయస్కర కు చెందిన ఆర్యన్ నారాయణ మసాటు “స్యేన సందేశం” కేరళలో సందేశ కావ్యాలుగా చరిత్రకెక్కి సంస్కృత వాఙ్మయంలో స్థానం పొందాయి. ఇవన్నీ మూస కావ్యాలుగా కనిపించినా వాటిలో చారిత్రిక నేపథ్యం ఉన్నది. ఆకాలపు రాజుల, ప్రజల జీవిత విధానాలకు అవి అద్దం పట్టాయి. వీటిపై ప్రత్యేక పరిశోధనలు జరిగి వాటిలోని చారిత్రిక విషయాల నిగ్గు తేల్చారు పరిశోధకులు. ఆ రకంగా ఇవి చారిత్రిక సందేశ కావ్యాలుగా రాణ కెక్కాయి.❋



## 261) “వైనాయ కీయ ద్వాదశాధ్యాయీ” తాజిక గ్రంథకర్త - వినాయక పాండురంగ ఖానాపూర్కర్ - (1858)

జమదగ్ని గోత్రం రుగ్వేది దేశస్త బ్రాహ్మణుడు పాండురంగ. సాంప్రదాయ విధానంలో సంస్కృత ఖగోళ శాస్త్రాధ్యయనం చేశాడు కేరోపంత్ నానా చత్రే , రామోజీ మొరేశ్వర దేవకులే వంటి ప్రసిద్ధ గురువుల వద్ద శిష్యరికం చేశాడు. 1874లో పూనాలో స్థాపించబడిన “వేద-శాస్త్రోత్తేజక” సభవారు వీరిని పరీక్షించి మెచ్చారు. “వైనాయకీయ ద్వాదశాశాధ్యాయీ” అనే తాజిక గ్రంథాన్ని సంకలనం చేశాడు దీని వలన సంవత్సర ఫలితాలు సులభంగా తెలుసుకోవచ్చు. “కుంద సారం”, “అర్థ కాండ” పేర్లతో యూక్లిడ్ గణితం, సిద్ధాంత సారాలకు సంస్స్కృత శ్లోకాలు రాశాడు. రెండవదానిలో భూమి భ్రమణంపై పాశ్చాత్యుల అభిప్రాయాలను క్రోడీకరించి చేప్పాడు.❋



## 262) దీర్ఘ వృత్త లక్షణ కర్త - సుధాకర ద్వివేది - (1860)

1860లో జన్మించిన సుధాకర ద్వివేది ప్రస్తుతం వారణాసి సంస్కృత కళాశాలలో గణిత, ఖగోళ శాస్త్ర ప్రధానోపాధ్యాయులుగా ఉన్నాడు. ఇదే కాలేజీ గ్రంథాలయ కమిటీ అధ్యక్షులుగా సేవలు అందించాడు. బ్రిటిష్ ప్రభుత్వం వీరికి మహా మహోపాధ్యాయ బిరుదునిచ్చి సత్కరించింది. 1878లో "దేర్ఘ వృత్త లక్షణములు" గ్రంథ సంకలనం చేశాడు. ఇందులో గ్రహణాల లక్షణాలు సిద్ధాంతాలను వివరించాడు. "విచిత్ర ప్రశ్న" గ్రంథంలో 20 గణిత క్లిష్ట సమస్యలకు సమాధానాలు తెలియజేశాడు. 1882లో "ద్యుచర చార" గ్రంథం రాసి ఆధునిక పాశ్చాత్య ఖగోళ విజ్ఞానాన్ని పొందుపరచాడు. 1885లో "పింద ప్రభాకరం" వాస్తు గ్రంథం రాశాడు.❀

## 263) సంస్కృత-అరేబిక్ దిట్ట, అనర్గళ వక్త - పండిట్ సహజ భట్ - 1862-1935

కాశ్మీరీ పండిత కుటుంబంలో 1862లో జన్మించిన సహజ భట్ సహజంగానే జన్మతహా వచ్చిన సంస్కృతంలో అరేబిక్ భాషలలో నిష్ణాతుడై, ఒక్క పొరబాటు శబ్దం లేకుండా ఆ రెండు భాషలలో అనర్గళంగా మాట్లాడేవాడు. తండ్రి చిన్నప్పుడే చనిపోతే రాజాస్థానంలో వైద్యుడుగా ఉన్న పెద్దన్న సత్ కాక్ పెంచి పోషించాడు. సీబీఐ ఏం స్కూల్ లో ఆంగ్లం చదవమని చేర్పిస్తే అందులో "నో" ముందు వచ్చి "ఎస్" తర్వాత వస్తుంది కనుక దాన్ని చదవమని చెప్పి సంస్కృత అరేబిక్ పర్షియన్ భాషాలు చదివి నిష్ణాతుడయ్యాడు. వీటిని ఇంటివద్దే గురువుల వద్ద నేర్చాడు. యునానీ వైద్యమూ నేర్చి గొప్ప భిషగ్వరుడిగా పేరు పొందాడు. మూర్తీభవించిన సంప్రదాయి అయినా భావాలలో


చాలా ఉదారుడు. జీవిత కాలంలో కాశ్మీర్ దేశంలో మహా గొప్ప యునానీ వైద్యుడని ప్రసిద్ధి పొందాడు. పొడవుగా మూర్తీభవించిన కాశ్మీరీ పండిత వస్త్ర ధారణతో ఆయన మహా దర్జాగా కనిపించేవాడు. భట్ బహుభాషా పాండిత్యాన్ని గుర్తించిన మహారాజు అనువాదం శాఖలో ఉద్యోగిగా నియమించాడు. ఈయన సంస్కృతంలో ఉన్న ఎన్నో వేదాంత, న్యాయ, వైద్య గ్రంథాలను పరిశీలించి ముద్రించి అనువాదాలు చేశాడు. 1890లో డిపార్ట్మెంట్ హెడ్ అయ్యాడు. సర్ అరుల్ స్టెయిన్ పండిట్ ముకుంద శాస్త్రిలాతో కలిసి భట్ 6 వేల గ్రంథాల వ్రాతప్రతులు కేటలాగ్ తయారు చేశాడు. దీన్ని 1894లో బొంబాయి ప్రెస్‌లో ముద్రించారు. "For the most conscientious and scholarly manner in which Sahaz Bhat discharged it, I feel all the more obliged as I can well realize how irksome a great portion of the work e.g. the careful reproduction of innumerable classical errors and apashabdas of the manuscripts must have been to his Pandit instinct. His learning and thorough acquaintance with the methods of Indian scholarship especially in the shastras traditionally cultivated in Kashmir have on many occasions most usefully supplemented my printed source of references" అంటూ స్టెయిన్ పండిత సహజ భట్ సాహిత్య ఔన్నత్యాన్ని భాషా పాండిత్యాన్ని తనకు అందజేసిన సహకారాన్ని వేనోళ్ళ పొగిడాడు.

ఇదేకాక కాశ్మీర్‌లో ఉన్న సంస్కృత కథనాలను చరిత్రలను హిందీలోకి స్టెయిన్ గోవింద కౌల్ సహాయంతో రాజు అభ్యర్థనపై తర్జుమా చేశాడు. 1899లో కౌల్ మరణంతో ఈ ప్రాజెక్ట్ ఆగిపోయింది. 1935లో 73వ ఏట పండిట్ సహజ భట్ సహజ మరణం చెందాడు 1905లో వియన్నాలో ఉన్న అరుల్ స్టెయిన్ తన పూర్వ సహచరుడు భట్ విద్యా వైదుష్యాన్ని గురించి రాసిన ఉత్తరం చిరస్మరణీయం– "I gathered my old entourage. It was pleasure to talk the language of gods and though my interests have now moved far northward, I shall try to keep my old friend Pandit Sahaz Bhat by me when I occupy winter quarters at Gupkar where he had been with me and Govind Kaul in the old days".



## 264) ఆంగ్ల సామ్రాజ్య కావ్యకర్త – ఎ.ఆర్. రాజరాజ వర్మ – 1863–1953

ఆంగ్ల సామ్రాజ్య సంస్కృత మహా కావ్యం రాసిన ఏ.ఆర్. రాజరాజ వర్మ కోయి తంపురన్ కేరళ దేశీయుడు. తల్లి కుంజి కావు తంబురాట్టి, తండ్రి వాసుదేవన్ నంబూద్రి. ఆయన రాసిన 30 గ్రంథాలలో దీనికి అత్యధిక ప్రాధాన్యం ఉంది. ఇది 23 సర్గలలో 1910 శ్లోకాల కావ్యం. లండన్ నగర వైభవ వర్ణనతో కావ్యం ప్రారంభమై క్రమంగా ఆంగ్ల సామ్రాజ్య చరిత్రను ఈస్ట్ ఇండియా కంపెనీ ఏర్పాటును రాశాడు కవి. ప్రతిశ్లోకం కావ్య గౌరవాన్ని పెంచేట్లుగా రాయటం కవి ప్రతిభకు నిదర్శనం. దీనిని 1901లో టి గణపతి శాస్త్రి సంక్షిప్తంగా ముందుమాట రాసి ప్రచురించాడు. ఈ కవి ఇతర రచనలో విటవిభావరి లేక రాధా మాధవం నాలుగు భాగాలైన “యమ”లతో అలరారే చిన్నకావ్యం. తిరువనంతపురంలో సంస్కృత బోధపై “గైర్వాణి విజయం” రాశాడు. ఉద్దాలక చరిత వచన రచన, తులాభారం ప్రబంధం, ఋగ్వేదకారిక. పాణిని అష్టాధ్యాయికి దీటుగా సంస్కృత వ్యాకరణం “లఘుపాణినీయం”. ఈ గ్రంథం ఆయనను “కేరళ పాణిని” చేసింది.❁



## 265) రామాయణం స్వరకర్త – మైసూర్ వాసుదేవాచార్య – 1865–1961

28–5–1865న కర్ణాటకలో లోమధ్వ బ్రాహ్మణకుటుంబంలో జన్మించిన సుప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వాంసుడు, త్యాగరాజస్వామి శిష్యుడు మైసూర్ వసుదేవాచార్య పద్మ భూషణ పురస్కార గ్రహీత. మైసూర్ మహారాజా ఆస్థాన వైణిక విద్వాంసుడు వీణ పద్మనాభయ్య వద్ద సంగీతం అభ్యసించాడు. సంస్కృతం వ్యాకరణ కావ్య అలంకార, తర్క పురాణ, ఇతిహాసాదులను మహారాజా సంస్కృత కళాశాలలో విడిగా సంగీతం నేర్చుకొంటూనే అభ్యసించాడు. మహారాజూ అందజేసిన పారితోషికంతో ప్రసిద్ధ సంగీత విద్వాంసుడు పట్నం సుబ్రహ్మణ్య పిళ్ళై దగ్గర, కావేరి డెల్టాలోని అనేక ప్రసిద్ధ సంగీత విద్వాంసుల వద్ద సంగీతపు లోతులు తరచి తెలుసుకొన్నాడు. ❁



## 266) సంస్కృత జావళికర్త - వీణ శివ రామయ్య -1866-1946

వీణ పద్మనాభయ్య కుమారుడు శివరామయ్య. మైసూర్ రాజ్య ఆస్థాన సంగీత విద్వాంసుడు. సంస్కృత తెలుగు కన్నడాలలో చాలా కృతులు జావళీలు స్వరాలు కూర్చాడు 72 మేళ రాగ కృతులు రాశాడు. శ్రీరాగంలో "వాణీ వీణాపాణి", ధర్మావతి రాగంలో "శ్రీరాజ రాజేశ్వరి" సుప్రసిద్ధాలు.❋



## 267) జ్యోతిర్మఠ పీఠాధిపతి - శ్రీ చక్ర ఉపాసకులు - స్వామి బ్రహ్మానంద సరస్వతి (1868 -1953)

20-12-1868న జన్మించిన రాజారావు సన్యాసి అయి 150 ఏళ్ళు ఖాళీగా ఉన్న ఉత్తర భారత దేశంలోని బదరీ క్షేత్రానికి దగ్గరలో ఉన్న జ్యోతిర్మఠ ఉత్తర ఆమ్నాయ పీఠాధి అవటం వింతయైన కథ.

అయోధ్య దగ్గర గణ గ్రామంలో "మిశ్ర" అనే బ్రాహ్మణ కుటుంబం లో రాజా రావు పేరుతో జన్మించి ,ఆధ్యాత్మిక భావ లహరిలో మునిగి తేలుతూ మహాయోగి రాజు అనిపించుకొని, మన ఆది శంకరాచార్యుల వలె 9వ ఏట తగిన గురువును అన్వేషిస్తూ ఇల్లు వదిలి పెట్టి వెళ్ళాడు. కాని ఒక పోలీసు గుర్తుపట్టి ఇంటికి తీసుకు వచ్చి అప్పగించాడు. తనకు గృహస్తాశ్రమంలో ఇష్టం లేదని సన్యసించాలని ఉందని చెప్పాడు. పెళ్లి చేసుకోమంటే వద్దన్నాడు. ఇంటి పురోహితుని అడిగారు. ఆయన కుర్రాడి యోగ జ్ఞానానికి అబ్బుర పడి అతని ఇష్టం ప్రకారమే చేయమని సలహా ఇచ్చాడు. తలిదండ్రులకూ కొడుకు రాజారాం ఆధ్యాత్మిక బలం అర్ధమై సరేనన్నారు. రెండు రోజులతర్వాత ఎవరికీ చెప్పకుండా ఇల్లు వదిలి తపస్సుకోసం హిమాలయాలకు వెళ్ళాడు. సరైన గురువుకోసం అణ్వేషిస్తూ ఎందరినో చూసి వారెవ్వరూ తన ఆధ్యాత్మిక దాహం తీర్చే సమర్ధులుకారని నిర్ణయించుకున్నాడు. హరిద్వార్ రుషీ కేష్‌లకు వెళ్ళాడు. 14వ ఏట ఉత్తర కాశిలో స్వామి కృష్ణానంద సరస్వతిని దర్శించి ఆయనే తగిన గురువని శిష్యుడయ్యాడు.

ఆయన "బ్రహ్మ చైతన్య బ్రహ్మచారి" అనే పేరుపెట్టాడు రాజారామ్‌కు. గురువు చెప్పినట్లు సాధన చేస్తూ ప్రక్కనే ఉన్న గుహలో తపస్సు చేసి వారానికి ఒక్కసారి మాత్రమే గురు దర్శనం చేసేవాడు. 25వ ఏట గుహ నుండి బయటికి వచ్చి గురువుగారి ఆశ్రమంలో ఉండిపోయాడు. 34వ ఏట కుంభమేళ సమయంలో గురువు శిష్యునికి సన్యాస దీక్షనిచ్చి స్వామి బ్రహ్మా నంద సరస్వతి అనే దీక్షా నామం ఇచ్చాడు. ఇక్కడి నుంచి మధ్య భారతం చేరి ఒక గుహలో ఏకాంతంగా తపోధ్యానాలతో 40 ఏళ్ళు ఉన్నాడు.

70వ ఏట అనేక విద్యావంతులు బ్రహ్మానందను అప్పటికి 150 సంవత్సరాలుగా తగిన పీఠాధిపతి దొరకకక ఖాళీగా ఉన్న జ్యోతిర్మఠ పీఠాదిపత్యం వహించటానికి ఆయనే సర్వసమర్ధుడు అని అందరూ అనేకసార్లు కోరగా సరే నని "మీరు అరణ్యంలో స్వేచ్చగా తిరిగే సింహాన్ని బంధిస్తున్నారు. మీరందరి ఇష్టం ప్రకారంమీ మాటలను గౌరవించి పీఠాదిపత్యాన్ని స్వీకరించి ఆది శంకరాచార్యుల అడుగు జాడలలో నడుస్తాను" అన్నాడు. దీనికి ముఖ్య ప్రేరకుడు కరపత్ర స్వామి. నియమించే "ధర్మ మహా మండలి" ఎంతో సంతోషంగా ఆహ్వానించింది 1941 ఏప్రిల్ 1న పీఠాదిపత్య విధానం అంతా వారణాశి పండితులు, పూరీ శంకరాచార్య శ్రీ శ్రీ భారతీ కృష్ణ తీర్ధ, శృంగేరి శంకరాచార్యులు శ్రీ చంద్రశేఖర భారతి స్వాముల సమక్షంలో మహా వైభవంగా నిర్వహించారు. గర్వాల్, వారణాసి, దర్భంగా మహా రాజులు ఎందరెందరో మత ప్రముఖులు హాజరయ్యారు. వేదంలో చెప్పబడిన సర్వ లక్షణ సంశోభితుడు స్వామి బ్రహ్మానంద సరస్వతి అని అందరూ శ్లాఘించారు.

బ్రహ్మానంద సరస్వతి మొదటిసారిగా జ్యోతిర్మఠాన్ని పునర్నిర్మించాడు. ఆప్రాంతమంతా స్థానికుల ఆక్రమణలో ఉంటే స్థానిక డిప్యూటీ కమీషనర్ స్థానిక పెద్దల సహకారంతో ఖాళీ చేయించి 30 గదులతో రెండస్తుల భవన నిర్మాణం చేసి "జ్యోతిర్మఠ పీఠ భవనం" అని పేరు పెట్టాడు. దీనికి వంద గజాల దూరంలో దర్భంగా మహారాజు మొదలుపెట్టిన "పూర్ణ గిరి దేవి "దేవాలయాన్ని బ్రహ్మానంద పూర్తీ చేయించాడు. సంప్రదాయ అద్వైత మత ప్రచారానికి ఉత్తర భారతంలో జ్యోతిర్మఠం అతి ముఖ్యమైన గొప్ప కేంద్రం. జ్యోతిర్మఠ శంకరాచార్యునిగా ఉత్తర భారత దేశమంతా పర్యటించి ప్రబోధాత్మక ప్రసంగాలతో శంకరాద్వైత భావ వ్యాప్తి చేశాడు. మహర్షి మహేష్ యోగి కరపత్రి స్వామి, స్వామి స్వరూపానంద సరస్వతి, స్వామి శాంతానంద సరస్వతి మొదలైన వారు బ్రహ్మానంద సరస్వతి ముఖ్య శిష్యులు. భారత ప్రధమ రాష్ట్రపతి డా. బాబూ రాజేంద్ర ప్రసాద్, ఫిలసాఫికల్ ప్రెసిడెంట్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బ్రహ్మానంద సరస్వతిని దర్శించి ఆశీర్వాదాలు పొందారు. రాధాకృష్ణన్ "మూరీ భవించిన వేదాంతం సత్య స్వరూపం స్వామి బ్రహ్మానంద సరస్వతి" అన్నారు. 1953లో 85వ ఏట బ్రహ్మైక్యం చెందటానికి 5 నెలల ముందు స్వామి బ్రహ్మానంద వీలునామా రాసి తన తదనంతర పీఠాధిపతిస్వామి శాంతానంద సరస్వతి అని పేర్కొన్నాడు.

స్వామి బ్రహ్మానంద గొప్ప శ్రీ చక్ర ఉపాసకుడు ఆయన వద్ద అరుదైన రూబీ

శ్రీ చక్రం ఉండేది. ఆయన పీఠాదిపత్య కాలంలో ఎందరెందరో రాజులు ధనికులు ఆశ్రమానికి వచ్చి విలువైన కానుకలు సమర్పించేవారు. మంత్ర దీక్ష స్వీకరించేవారు. ఈ ధన సంపద పీఠ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సద్వినియోగమయ్యేది. "మహర్షి మహేష్ యోగి 2008లో "మహేష్ యోగి ట్రస్ట్" ఏర్పరచి బ్రహ్మానంద సరస్వతి పేరుతో దేశంలోని 30 వేల వేద పండితులకు ఆసరా కలిపించి గురు ఋణం తీర్చుకున్నాడు. కారణజన్ముడు స్వామి బ్రహ్మానంద సరస్వతి శంకరాచార్య.❀



## 268) స్తవ రత్నావళికర్త - సంస్కృత మున్షి - కె.సి .కేశవ పిళ్ళై - 1868-1914

ప్రముఖ సంగీత విద్వాంసుడు, కేరళ రాష్ట్ర ఆస్థానకవి కె.సి .కేశవ పిళ్ళై మళయాళ సాహిత్యానికి ఎన లేని సేవ చేశాడు. కేరళలో క్విలన్ అనే కొల్లాం జిల్లాలో పరవూర్‌లో 1868లో జన్మించాడు. 5వ క్లాస్ వరకే చదువుకున్నా సంగీతంలో మహా పాండిత్యాన్ని సాధించాడు. కథాకళి నాట్యంలోని వేషధారణా, ముద్రలు మెలకువలన్నీ గ్రహించాడు. 15వ ఏటనే "అట్టాకథ" రచించాడు. కాని సంస్కృతం నేర్చుకొంటే ఇంకా బాగా రాసే వీలుందని అందరూ చెబితే పరవూర్ వి.కేశవన్ అసాన్ వద్ద సంస్కృతాన్ని, తన వరుస సోదరుడు ఎన్న కట్టు రాజ వర్మ దగ్గర వ్యాకరణం నేర్చాడు. 1896లో కొల్లాం మలయాళం స్కూల్‌లో టీచర్‌గా చేరి, అయిదేళ్ళలో "సంస్కృత మున్షి"గా పదోన్నతి పొందాడు. 46వ ఏటనే కేశవ పిళ్ళై 1914లో మరణించాడు. "సంగీత సాహిత్య కోవిద కేరళ వర్మ వాలియ కోయి దధాంపురం" సంస్థ పిళ్ళైకు "సరస గాయక కవి మణి" బిరుదునిచ్చి సత్కరించింది.

సంగీత మంజరి, స్తవ రత్నావళి, సంగీత మాలికా, ఈశ్వర స్తోత్రాంగ, స్తవ రత్న మాలిక మొదలైన గ్రంథాలను పిళ్ళై రచించాడు. పిళ్ళై కొన్ని అట్టకథలు రచించాడు. అందులో 15వ ఏట రాసిన ప్రహ్లాద చరితం ఉంది. దీనినే తరువాత "హిరణ్యాసుర వధం"గా పేరు మార్చాడు. సూర పద్మాసుర వధం, శ్రీ కృష్ణ విజయం కూడా రాశాడు.

"ఆసన్న మరణ చింత శతకం" మళయాళ, సంస్కృత, తమిళ ఇంగ్లీష్ భాషా మిశ్రమంగా "ఆదిమలారిన" అనే రాగ మాలిక, సత్య స్వరూప విభో, కోటి దివాకర, వగైరా కీర్తనలు ఎన్నో రాశాడు. పిళ్ళై నాలుగు నాటకాలు - లక్ష్మీ కల్యాణం, రాఘవ మాధవం, విక్రమోర్వశీయం, సదారమ రచించాడు. భగవంతునిపై 100 కీర్తనలు రాశాడు. కేశవ పిళ్ళై రచించిన కీర్తనలు కేరళ ప్రముఖ వాగ్గేయ కారులు స్వాతి తిరుణాల్, ఇరాయిమ్మాన్ ధంపిల కీర్తనల స్థాయిలో ఉంటాయని ప్రముఖ సంగీత విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.❀



## 269) చతుర్వర్గ చింతామణి కర్త - హేమాద్రి పంత్ -1868-1953

దేవగిరి యాదవ రాజ మంత్రి హేమాద్రి లేక హేమాద్రి పంత్. కరణాధిపుడు అని పిలుస్తారు. 1263లో పండరీపురంలోని పాండురంగ విఠల దేవాలయ నిర్మాణంలో హేమాద్రి భూరి విరాళ మందించినట్లు శిలాఫలకం ఉంది. గొప్ప పరిపాలనా దక్షుడేకాక సంస్కృత కావ్యాలు కూడా రాశాడు. ఆయన సంస్కృత రచన "చతుర్వర్గ చింతామణి"లో అనేక వ్రతాలు నోములు వాటిని ఆచరించే విధానాలు అన్నీ సవివరంగా ఉన్నాయి. ఇదికాక "మోడీ లిపి"ని తయారు చేసి ప్రచారంలోకి తెచ్చాడు. 1272 వరకు దేవ గిరిరాజు రామచంద్ర దేవ్ ముఖ్యమంత్రిగా ఉన్నాడు. మరాఠీ భాషపైనా గొప్ప అభిమానం ఉన్నవాడు. ఆ భాషలోనూ రచనలు చేశాడు. ఆయన మత సహనం మెచ్చదగినది. జైనమతానికీ సహాయం చేశాడు. అనేక దేవాలయాలు నిర్మించాడు. ఆయన శిల్ప శాస్త్రంలో ప్రావీణ్యుడు ఆయన తనదైన శైలిలో నిర్మించిన ఆలయాలను "హేమాద్రి దేవాలయాలు" అంటారు. దక్షిణ భారత దేశంలో హేమాద్రి వందలాది ఆలయాలు కట్టించాడు. చతుర్వర్గ చింతామణిలో దేవాలయ రకాలు విగ్రహాల రకాల వివరాలన్నీ పొందు పరచాడు పంత్. ఆయన గ్రంథాలు శిల్పాలు దేవాలయాలు ఆయన సంస్కృతీ మూర్తిమత్వానికి ప్రతీకలుగా నిలిచాయి.

కర్ణాటకల దక్షిణ కన్నడ జిల్లా హేమాద్రి గ్రామంలో బ్రాహ్మణ కుటుంబంలో హేమాద్రి జన్మించాడు. శుక్ల యజుర్వేదీ శ్రీ వత్సగోత్రీకుడు సప్తర్షి ప్రవరుడు. తండ్రి కామదేవుడు బాలుని బాల్యంలోనే మహారాష్ట్రకు చేరాడు. సంస్కృత మహా విద్వాంసుడు శిల్ప శాస్త్రవేత్త. యాదవ మహాదేవ రాజు, రామ చంద్ర దేవ రాజుల ఆస్థాన మంత్రిగా గొప్ప చాకచక్యం సమర్థతతో రాచకార్యాలు నిర్వహించాడు. ఆయన మంత్రిత్వంలో రాజ్యం సుభిక్షమే కాక అన్ని విధాలా అగ్రస్థానంలో నిలిచి చరిత్ర సృష్టించింది. హేమాద్రి పదవీ విరమణ తర్వాత ఢిల్లీ రాజు అల్లాఉద్దీన్ ఖిల్జీ ఈ రాజ్యాన్ని ఆక్రమించి యాదవరాజ్య వినాశనం చేశాడు.

హేమాద్రి పంత్ "ఆయుర్వేద రసాయనం", "అష్టాంగ హృదయం" అనే ఆయుర్వేద గ్రంథాలు రాసి అనేక వ్యాధులు వాటి చికిత్సా విధానాలు తెలిపాడు. ఆయన

జీవిత చరిత్రపై "హేమాద్రి పంత్ బఖార్" వ్రాయబడింది. రాజ్య పాలనా సౌకర్యం కోసం రాజ్యాన్ని "మేస్ట కాలు"గా ఏర్పాటు చేశాడు. మరాఠీ భాషను సంస్కరించి పరిపాలనలో "మోడీ లిపి"ని ప్రవేశ పెట్టాడు. మహారాష్ట్రలో వర్షాధార పంటగా "పెర్ల్ మిల్లెట్" సజ్జ పంటను పండించే కృషి చేశాడు.

మహారాష్ట్రలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆరాధనకు విశేష ప్రాచుర్యం తెచ్చాడు. ఎందరో కవులకు కళాకారులకు ఆశ్రయం కల్పించి వారి సృజనకు ప్రోత్సాహమిచ్చి సత్కరించాడు. బోపదేవ కవిని సన్మానించి అయన రచనలపై చక్కని వ్యాఖ్యానం రాసి ప్రచారం కలిగించాడు.

హేమాద్రిపంత్‌నే రఘునాథ దండో ల్కర్ అనీ అంటారు. ఈయన షిరిడి సాయిబాబా భక్తుడు ఆయన జీవితంపై శ్రీ షిరిడీ బాబా సచ్చరిత్ర "మరాఠీ భాషలో రాశాడు. ఇది ఇవాళ చాలా సాధికార గ్రంథం. అన్నిభాషలలోకి అనువాదం పొంది సాయి సచ్చరిత్ర పారాయణ గ్రంథమైంది. ఇందులో సాయిబాబా జన్మ కాలాన్ని హేమాద్రి 1838గా నిర్ణయించాడు. బాబా గురువు వద్ద 12 ఏళ్ళు ఉన్నాడని ఆ గురువు పేరు "వేణూక్ష" లేక సెలుకు చెందిన సూఫీ ఫకీర్ గోపాల్ రావు దేశ్ ముఖ్ కావచ్చునని చెప్పాడు. 1854లో షిరిడీలో ఒక వేప చెట్టు కింద కూర్చుని ఉండగా మొదటిసారిగా అందరూ బాబాను చూశారని తెలియజేశాడు. మిగిలినవన్నీ మనకు తెలిసిన విషయాలే.



## 270) చాణక్య అర్థశాస్త్ర ప్రచురణకర్త - అర్ధ శాస్త్ర విశారద - రుద్ర పట్నం శ్యామ శాస్త్రి -1868-1944

1868లో కర్నాటక రాష్ట్రం కావేరీ తీరాన రుద్రపట్నం గ్రామంలో శ్యామ శాస్త్రి జన్మించాడు. సాంకేతి బ్రాహ్మణుడు. పుట్టిన చోటే చదివి మైసూర్ వెళ్లి సంస్కృత పాఠశాలలో చదివి సంస్కృత విద్వత్ - డిగ్రీ ఉత్తమ శ్రేణిలో పొందాడు. ఆయన ప్రతిభను గుర్తించిన మద్రాస్ యూనివర్సిటి సంస్కృతంలో బి. ఏ డిగ్రీ ఇచ్చింది. మైసూర్

రాజ్య దివాన్ శేషాద్రి అయ్యర్ ప్రోద్భలంతో శాస్త్రి ప్రభుత్వ ఓరియెంటల్ లైబ్రరిలో లైబ్రేరియన్‌గా చేరాడు. ఇక్కడ పనిచేస్తూ వేద, వేదాంగాలను క్లాసికల్ సంస్కృతాన్ని, ప్రాకృత, ఇంగ్లీష్, కన్నడ, జర్మన్, ఫ్రెంచ్ భాషలను స్వయంగా అభ్యసించి గొప్ప వాడయ్యాడు.

1891లో ఓరియెంటల్ రిసెర్చ్ ఇన్‌స్టి ట్యూట్ "మైసూర్ ఓరియెంటల్ లైబ్రరి"గా మారింది. అందులో వేలాది సంస్కృత తాళపత్ర గ్రంథాలున్నాయి. నిత్యం వీటిని పరీక్షిస్తూ వీటిని కేటలాగ్ చేస్తూ వాటిలోని విషయాలను సేకరించాడు. ఆ కుప్పలో 1905లో అర్థశాస్త్రం ఆయన కంట బడింది. మూడేళ్ళు కష్టపడి శిధిలమౌతున్న దానిని ఓపికగా కాగితాలపై రాసి తన సంపాదకత్వంలో ముద్రించి లోకానికి మొట్టమొదటి సారిగా కౌటిల్యుని అర్థశాస్త్రాన్ని తెలియ బరచాడు. దానిని తానే ఇంగ్లీష్‌లోకి అనువదించి 1915లో ప్రచురించాడు. ఇక్కడ అర్థశాస్త్రం మూల గ్రంథ రూపంలో లభిస్తే, దేశంలోని ఇతర ప్రాంతాలలో దాని నకళ్ళు దొరికాయి. దీనిని తంజావూర్‌లోని ఒక సంస్కృత పండితుడు ఈ లైబ్రరీకి ఎప్పుడో ఇచ్చాడట. ఇప్పటి దాకా అర్థ శాస్త్రం దండి, బాణుడు, విష్ణు శర్మ, మల్లినాద సూరి మెగస్తనీస్ మొదలైన వారు వారి రచనలలో ఉదాహరించినదే అందరికి తెలుసు. అసలు అర్థశాస్త్రం గ్రంథ రూపంలో శ్యామ శాస్త్రి ప్రచురించి మహోపకారం చేశాడు. ఇది ఒక చారిత్రాత్మక సన్నివేశంగా నిలిచింది. తరువాతనే ఫ్రెంచ్ జర్మన్ మొదలైన భాషలలోకి అనువాదం పొందింది అర్థశాస్త్రం.


శాస్త్రి మైసూర్ ఓరియెంటల్ లైబ్రరీలో 1912 వరకు పని చేసి తర్వాత బెంగుళూరులోని శ్రీ చామ రాజేంద్ర సంస్కృత పాఠశాల ప్రిన్సిపాల్ అయి 1915 వరకు ఉన్నాడు. 1918లో మళ్ళీ పాత స్థానం చేరి, క్యురేటర్ అయి, మైసూర్‌లోని ఆర్కిలాజికల్ రిసేర్చేస్‌కు డైరెక్టర్ అయి 1929 వరకు రిటైర్ అయ్యేదాకా పని చేశాడు. అర్థశాస్త్రాన్ని కనుక్కోవటంతో ఆగిపోకుండా శ్యామశాస్త్రి వేద కాలం, వేద ఖగోళం మొదలైన విలువైన విషయాలపై పరిశోధన చేశాడు. క్రీ.పూ. 8 శతాబ్దానికి చెందిన "వేదాంగ జ్యోతిషం", గ్రహణాలపై "ద్రప్ప", ఎక్లిప్స్ కల్ట్ ఇన్ వేదాస్ కొరాన్ అండ్ బైబిల్ అనే ద్రప్పకు అనుబంధ గ్రంథం, వేదకాలంపై "గవ అయన", ఇవల్యూషన్ ఆఫ్ ఇండియన్ పాలిటి, "ది ఆరిజినల్ ఆఫ్ దేవ నాగరి ఆల్ఫబెట్స్" అనే గొప్ప రచనలు చేశాడు శ్యామ శాస్త్రి. వీటిని దేశీయ, విదేశీయ సంస్కృత విద్వాంసులు అందరూ మహోన్నత రచనలుగా కీర్తించారు. భారతదేశంలో ఆశుతోష్ ముఖర్జీ, రవీంద్రనాథ టాగూర్ బాగా మెచ్చారు. 1927లో శాస్త్రి గాంధీజీని నంది హిల్స్‌లో కలిశాడు. శాస్త్రి పరిశోధనల వలన మైసూర్ ఓరియెంటల్ లైబ్రరీకి అంతర్జాతీయ గుర్తింపు గౌరవం దక్కాయి.

ఇండాలజిస్టులు, ఓరిఎంటలిస్టులు అయిన జూలియస్ జాలీ, మొరిజ్ విత్నిజ్, ఎఫ్ డబ్ల్యు థామస్, పాల్ పెల్లి యాట్, ఆర్థర్ బెర్రిన్ గ్డేల్ కీత్, స్టెయిన్ కొ నోవ్

మొదలైన వారు శాస్త్రి కృషికి నీరాజనాలు అందించారు. జే.ఎం.ఫ్లీట్ "భారత దేశ సామాన్య చరిత్రను అందజేసినందుకు శ్యామశాస్త్రికి మనం ఎల్లప్పుడు రుణపడి ఉండాలి" అన్నాడు. వాషింగ్టన్ డిసిలోని ఓరియంటల్ యూనివర్సిటి 1919లోను, 1921లో కలకత్తా యూనివర్సిటి శ్యామశాస్త్రికి గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించాయి. రాయల్ ఏషియాటిక్ ఫెలోను చేసి గౌరవించారు. కాంప్ బెల్ మెమోరియల్ గోల్డ్ మెడల్ ప్రదానం చేసి సత్కరించారు.

శ్యామ శాస్త్రి కృషికి "అర్ధ శాస్త్ర విశారద", బిరుదును మైసూర్ మహారాజా ఇస్తే, భారత ప్రభుత్వం "మహా మహోపాధ్యాయ" బిరుదును, వారణాసి సంస్కృత మండల్ "విద్యాలంకార, పండిత రాజ" బిరుదులూ ప్రదానం చేసి ఆయన కీర్తిని పెంచాయి. ఆయన అంతర్జాతీయ కీర్తికి ఉదాహరణగా ఒక ఉదంతాన్ని అందరూ చెప్పుకొంటారు. ఒకసారి మైసూర్ మహా రాజు నాలుగవ జయ చామరాజ ఒడియార్ జర్మనీ సందర్శించినప్పుడు ఒక యూనివర్సిటి వైస్ చాన్సెలర్ "మీరు శ్యామ శాస్త్రి గారి మైసూర్ నుంచి వచ్చారా" అని ఆశ్చర్యంగా అడిగాడట. రాజు మైసూర్‌కు తిరిగి వచ్చి శ్యామశాస్త్రిని నభూతోగా సత్కరించి "మేము మైసూర్‌లో మహా రాజులం మీరు మా పౌరులు. కాని జర్మనీలో మీరు గురువులు, మీ వలననే మేము, మా ప్రజలు గౌరవం, కీర్తి పొందాము" అని అత్యంత వినయంగా గౌరవంగా అన్నారట.

శ్యామ శాస్త్రి తర్వాత కూడా ఇండాలజీ సమస్యలపై పరిశోధనలు కొనసాగించి క్యురేటర్ అయ్యాడు. మైసూర్ రాజ్య ఆర్కి యాలజి డైరెక్టర్‌గా ఉంటూ ఎన్నెన్నో శిలా ఫలకాలు, రాగి రేకులు కనిపెట్టాడు. మైసూర్ చాముండి పురంలోని తన స్వగృహానికి ఆశుతోష్ ముఖర్జీ గౌరవార్ధం "ఆశుతోష్" అని నామకారణం చేశాడు శ్యామ శాస్త్రి. 1944లో 76వ ఏట అర్ధ శాస్త్రాన్ని కనుగొని లోకానికి అందించిన రుద్రపట్నం శ్యామ శాస్త్రి మహా రుద్ర సన్నిధానానికి చేరుకున్నాడు.❀



## 271) శబ్ద మంజరి కర్త - చంద్ర కాంత విద్యాలంకార - 1870

1870కి చెందిన చంద్ర కాంత విద్యాలంకార 1-శబ్ద మంజరి 2-పదమంజరి 3-ధాతు మంజరి 4-మండలాధ్యాయం రాశాడు.❀

## 272) లంకావతార సూత్రకర్త - సతీష్ చంద్ర విద్యాభూషణ్ - 1870-1920

మహామహోపాధ్యాయ డా.సతీష్ చంద్ర విద్యాభూషణ్ 30-7-1870న ఇస్లామిక్ బంగ్లాదేశ్‌లో ఫరీద్ పూర్‌లోని కాల్కువ గ్రామంలో జన్మించాడు. తండ్రి పీతాంబర విద్యా వాగీశుడు ప్రముఖ సంస్కృత పండితుడు. అన్న విశ్వంభర జ్యోతిష్ణవ ఇతని కంటే 12 ఏళ్ళు పెద్ద. మిద్నపూర్ కాలేజీ మొదటి ప్రిన్సిపాల్ గంగాధర ఆచార్య కుమార్తెను 1889లో పెళ్లి చేసుకున్నాడు. అయిదవ ఏటనే విష్యాభ్యాసం ప్రారంభించి తోటి వారిలో తలమానికంగా నిలిచాడు. ప్రవేశ పరీక్షలో ఆ డివిజన్ ఫస్ట్ వచ్చి నవద్వీప్‌లో హిందూ స్కూల్‌లో చేరాడు. 1888లో కలకత్తా యూనివర్సిటీ ఎంట్రన్స్ పరీక్ష పాసై స్కాలర్షిప్ పొంది సిటీ కాలేజీలో చేరాడు. ఎఫ్ ఏ పాసై కృష్ణానగర్ కాలేజీకు వలసవెళ్లాడు. 1892లో సంస్కృతంలో బి. ఏ.ఆనర్స్ పొందాడు. 1893లో కలకత్తా యూనివర్సిటీ నుంచి ఎం.ఏ సాంస్క్రిట్ డిగ్రీ సాధించాడు. నవద్వీపంలోని విదగ్ధ జనని సభ నిర్వహించిన సంస్కృత భాషా సాహిత్య పోటీలో విజయం సాధించి ''విద్యాభూషణ'' పొందాడు. 1893-నుండి రెండేళ్లు సంస్కృతకావ్యాలను మహామహోపాధ్యాయ అజిత్ నాథ న్యాయ రత్న వద్ద అభ్యసించాడు. సంస్కృత న్యాయ శాస్త్రాన్ని మహామహోపాధ్యాయ జరునాథ సార్వ భౌమవద్ద చదివాడు. 1897 - 1900 వరకు టిబెట్ భాషను ప్రముఖ లామా ఫంగ్ చాంగ్ వాంగ్ డాన్ వద్ద లాసాలో నేర్చాడు. 1901లో పాళీ భాషను శ్రీలంక బర్మా షర్మాన్ వద్ద చదివి పాళీలో ఎం.ఏ సాధించాడు.

1893లో కృష్ణానగర్ సంస్కృత కాలేజి ప్రొఫెసర్‌గా చేరి, బౌద్ధ సొసైటీ ఆధ్వర్యం లో పాళీ భాషలో పుస్తకాలకు సంపాదకత్వంలో ప్రచురించాడు. 1897-90 వరకు డార్జిలింగ్‌లో గవర్నమెంట్ ప్రాజెక్ట్‌లో టిబెటన్ -ఇంగిలీషు నిఘంటు నిర్మాణం చేశాడు. 1900లో కలకత్తా వచ్చి కలకత్తా కాలేజీ సంస్కృత ప్రొఫెసర్ అయ్యాడు. 1906లో గవర్నర్ జనరల్ మహా మహోపాధ్యాయ బిరుదు ప్రదానం చేశాడు. 1908లో కలకత్తా యూనివర్సిటీ పి.హెచ్‌డి నిచ్చింది. 1910లో సంస్కృత కాలేజి ప్రిన్సిపాల్ అయ్యాడు.

సతీష్ చంద్ర 1897లో బెంగాల్ భాషలో ఆత్మతత్వ ప్రకాశం రాశాడు. తరువాత వరుసగా భవభూతి అండ్ హిజ్ డ్రామా, లంకావతార సూత్ర, కాత్యాయన్స్ పాళీ గ్రామర్, టిబెటన్ ప్రీమియర్ రెండుభాగాలు, రత్న నౌట్ట, నోట్స్ ఆన్ రత్నావళి గ్రిమ్స్ ఫోనెటిక్ లా ఆఫ్ ఇండో-యూరోపియన్ లాంగ్వేజెస్, బుద్ధ స్తోత్ర సంగ్రహ, స్రగ్ధర స్తోత్ర ఆఫ్ సర్వజ్ఞ మిత్ర, హిస్టరీ ఆఫ్ మిడీవల్ స్కూల్, ఆఫ్ లాజిక్, అమరకోశ సాంస్క్రిట్ విత్ టిబెటన్ వెర్షన్ రెండుభాగాలు, అమరారికా కామధేను, అవధాన కల్పలత,

న్యాయ సూత్ర ఆఫ్ గౌతమ, బై లింగ్యువల్ ఇండెక్స్ ఆఫ్ న్యాయ బిందు, హిస్టరీ ఆఫ్ ఇండియన్ లాజిక్ మొదలైన ఉద్గ్రంథ రచయిత సతీష్ చంద్ర. 25-4-1920న యాభై ఏళ్లకే మహామహోపాధ్యాయ సతీష్ చంద్ర విద్యాభూషణ్ పరమపదించాడు.❀



## 273) ప్రౌఢ లేఖక్ - పండిట్ దామోదర్ -1870

కాశ్మీర్ మహారాజా "మదర్సా" ముఖ్య ఉపాధ్యాయుడైన సాహెబ్ రామ్ కుమారుడు దామోదర్ సంస్కృతంలో మహా మేధావి. సూక్ష్మగ్రాహి మహావక్త. వ్రాయసగాడుగా ప్రసిద్ధి చెందాడు. వ్యాకరణ న్యాయ శైవాలలో అఖండ పాండిత్యమున్నవాడు. సంస్కృత కావ్యాలను ఆయన శ్రావ్యమైన కంఠంతో గానం చేస్తూ వ్యాఖ్యానిస్తుంటే శ్రోతలకు పరవశం కలిగేది. మంచికవి అయిన దామోదర్ రాజతరంగిణిని కొనసాగించి పూర్తి చేయలేకపోయాడు. "లేఖా సాహిత్యాన్ని" సుసంపన్నం చేసి "ప్రౌఢ లేఖక్‌గా గుర్తింపు పొందాడు. శ్రీహర్ష, బాణ, సుబంధు కావ్య మాధుర్యాన్ని జుర్రి అందరకు జున్నులాగా పంచి పెట్టినవాడు. కాశ్మీర పండిత విద్యావేత్తగా గుర్తింపుపొందారు. ఈయన సోదరుడు దయారామ్ హిస్టరీ జాగ్రఫీలలో నిధి. బూలర్ దామోదర్ ప్రజ్ఞను ప్రశంసిస్తూ "produce Sanskrit prose or verse alike from the sleeve of his garment"అన్నాడు. నీలమత పురాణం ఆహటాయసం రాజ తరంగిణిలలోని చారిత్రిక భౌగోళిక విషయాలను అతి సునాయాసంగా అందరకు అర్ధమయ్యే రీతిలో రాశాడు. పండిట్ దామోదర్ చాలాకాలం బ్రతికి ఉంటే కల్హణుడు రాసిన రాజతరంగిణి ఇతని రచనతో పూర్తి అయి ఉండేదని అరుల్ స్టెయిన్ అభిప్రాయం పడుతూ "Had Pandit Damodar been spared to complete it, his work would have shown that Kalhana could have found generations past no worthier successor" అన్నాడు.❀



## 274) తైత్తిరీయ ఉపనిషత్ భాష్యకర్త, సంస్కర్త - పండిట్ నిత్యానంద శాస్త్రి -1871

కాశ్మీర పండిత కుటుంబంలో 1874లో జన్మించి జమ్మూ కాశ్మీర్‌లో విద్యావ్యవస్థ లేకపోయినా ప్రయివేట్‌గా చదివి అప్పటివరకు, మెట్రిక్ పాసయిన ఇద్దరిలో ఒకరుగా రికార్డ్ సృష్టించి, సంస్కృతంలో గాఢ పాండిత్యాన్ని సాధించి ఆంగ్లం చదవాలన్న కోరికతో, సంప్రదాయ జీవి అయినా తండ్రికి ఇష్టం లేనందున రహస్యంగా శ్రీకాంత్ ఖాజాన్సీ వద్ద చదివి మాస్టరీ సాధించి, లాహోర్‌లో అరుల్ స్టెయిన్ అనే ఓరియెంటలిస్ట్ పరిచయమై ఆయన ఆధ్వర్యంలో నిర్వహింప బడే పంజాబ్ యూనివర్సిటీలో సంస్కృత ప్రజ్ఞ పరీక్ష రాసి పాసయ్యాడు. స్టెయిన్‌తో ఈపరిచయం జీవితాంతం కొనసాగింది. స్టెయిన్‌కు కాశ్మీర్ సంస్కృత గ్రంథాలను ఆంగ్లంలోకి అనువదించటానికి శాస్త్రి ఎంతో తోడ్పడ్డాడు. శాస్త్రీవలన గీయర్సన్, వోగెల్ వింటర్నిటీజ్, వేరీజ్ మొదలైన పాస్చాత్య పండితులు సంస్కృతం విషయంలో ఎంతగానో సాయం పొందారు.

16వ ఏటనే నిత్యానంద శాస్త్రి ప్రభుత్వ పాఠశాలలో సంస్కృత ఉపాధ్యాయుడై సంస్కృత బోధ చేశాడు. తర్వాత సంస్కృతంలో శాస్త్రి డిగ్రీ పొంది, 1916లో శ్రీనగర్ ప్రతాప్ కాలేజీ సంస్కృత ప్రొఫెసర్ అయ్యాడు. ఆంగ్లం చదివి మేధావి అయినా కాలేజీకి సంప్రదాయ కాశ్మీర్ పండిత వస్త్ర ధారణతోనే వెళ్ళేవాడు. 1897లో స్వామి వివేకానంద కాశ్మీర్ సందర్శించినప్పుడు ఆయనను దర్శించిన నలుగురైదుగురు కాశ్మీర్ పండితులలో నిత్యానంద ఒకరు. ఆయనతో గ్రూప్ ఫోటో దిగాడు. 1906లో వైస్ రాయ్ లార్డ్ కర్జన్ శ్రీనగర్కు వచ్చినప్పుడు సంస్కృతంలో ఆయనకు సన్మాన పత్రం రాసి చదివాడు శాస్త్రి. ఆనాటి కాశ్మీర్ పండితులు విద్యా వ్యాసంగంలోనే కాక అనేక సాంఘిక ఆర్థిక రాజకీయ కార్యక్రమాలలో ముందు ఉండేవారు. అలాంటివారిలో శాస్త్రి కూడా ఒకరు.

ఆయన శిష్యులలో రాయబారి టి.యెన్ కౌల్, చరిత్రకారిణి పపుల్ జయకర్ ఉన్నారు. 1930లో నిత్యానంద ప్రొఫెసర్‌గా రిటైర్ అయినపుడు కౌల్ వీడ్కోలు ప్రసంగం చేశాడు.

పండిత మదన మోహన మాలవ్యాకు కాశ్మీర్ పండితులంటే విపరీతమైన ఆరాధన ఉండేది. ఆయన 1929 అఖిల భారత హిందూ మహా ధర్మ సమ్మేళన సభకు రావల్ పిండి వచ్చినప్పుడు నిత్యానంద ఆయనను కలిశాడు. మాలవ్యా శాస్త్రిని బెనారస్ విశ్వ విద్యాలయ ఫాకల్టీలో చేరవలసిందిగా ఆహ్వానించగా కుటుంబ పరిస్థితులవలన రాలేనని చెప్పగా "మా యూనివర్సిటీ తలుపులు మీకోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయి. ఎప్పుడొచ్చినా సంతోషమే" అన్నాడు మాలవ్యా. స్టెయిన్ కూడా ఎక్స్ ఫర్డ్‌కు ఆహ్వానించినా తిరస్కరించాడు. నిత్యానంద శాస్త్రి విజ్ఞాన సర్వస్వము వంటివాడు. కాశ్మీర్ వదలి వెళ్లాలని ఉండేది కాదు కాని, శీతాకాలంలో విద్యాలయాలు మూసివేసినప్పుడు మాత్రం దేశంలోని సంస్కృత విద్యాలయాలను సందర్శించేవాడు. సంస్కృత విద్వాంసులను కలుసుకొనేవాడు. తన కార్య క్షేత్రానికి విద్యకు మాత్రమే పరిమితం చేయకుండా శాస్త్రి సాంఘిక సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించాడు. 1930లో ఏర్పడిన సంస్కృత సాహిత్య పరిషత్‌కు మొదటి అధ్యక్షుడయ్యాడు. విధవలకు అనాధలకు ఆశ్రయం కోసం "వనితా ఆశ్రమం" స్థాపించాడు. ప్రతినెలా తనజీతంలో పదిశాతాన్ని అనేక దాన ధర్మాలకు ఖర్చు చేసిన వితరణం శీలి శాస్త్రి. హార్వర్డ్ యూనివర్సిటీలో సంస్కృతం ప్రారంభించినపుడు స్పూనర్ కోరికపై 1913లో "తైత్తిరీయ ఉపనిషత్"కు నాలుగు భాగాల సంస్కృత వ్యాఖ్యానం రాసి పంపాడు. అది ఆ యునివర్సిటీ లైబ్రరీలో భద్రంగా ఉంది. ❁



## 275) పంచస్థని వ్యాఖ్యాత శైవాగమవాఙ్మయ దీధితి – పండిట్ హరభట్ట శాస్త్రి జాదూ –1874-1951


కాశ్మీర్ పండిత కుటుంబాలు సంస్కృతానికి కళా సంస్కృతులకు చేసిన సేవ నిరుపమానం. 1874లో కాశ్మీర్‌లో జన్మించిన అనేక శైవ గ్రంథాలు రచించిన పండిత హరిభట్ట శాస్త్రి జాదూ వ్రేళ్ళపై లెక్కింపదగిన ఆధునిక సంస్కృత మహా పండితుడు. కానీ ఆయన గురించి ఆ కుటుంబంలోని కాశ్మీర పండితులకే చాలామందికి తెలియక పోవటం ఆశ్చర్యం. ఈయనపై అధ్యయనం చేయాలని అమెరికా హార్వర్డ్ యునివర్సిటీ నుంచి కాశ్మీర్ వచ్చిన ప్రొఫెసర్ డేవిడ్ బ్రేనార్డ్ స్పూనర్ హరిభట్ట శాస్త్రి వంటి ఉద్దండుల వద్ద సంస్కృతాధ్యయనం చేయాలని వచ్చి ఆయన గురించి తెలిసిన కొన్ని విశేషాలకే ఉబ్బి తబ్బిబ్బై అంతటి శైవ వాఙ్మయ నిర్మాతను గురించి లోకానికి పూర్తిగా తెలియకపోవటం బాధ కలిగించింది. కాశ్మీర్ రీసెర్చ్ స్కాలర్ల వలన ఆయన జీవితం గురించి తెలిసిన విషయాలు ఇప్పుడు తెలుసుకొందాం.

హరభట్ట జాదూగా కాశ్మీర్ సంస్కృతానికి విశేష సేవలందించిన పండిత కుటుంబంలో 1874 జన్మించి, శరీరంలోని ప్రత్యణువు సంస్కృతం పొంగి పొర్లి పొరలుతుండగా సునాయాసంగా సంస్కృతం అధ్యయనం చేశాడు. తండ్రి పండిట్ కేశవ భట్ట జాదూ కాశ్మీర్ రాజు మహారాజా రన్బీర్ సింగ్ ఆస్థాన జ్యోతిష్కుడు. మహారాజు ఎందరెందరో కవి పండితులకు ఆశ్రయమిచ్చి పోషించి పెంచాడు. ఈయన అన్న కొడుకు జగద్ధార్ జాదూ "నీల మత పురాణం" మొదటి ప్రతికి ప్రొఫెసర్ కాంజిలాల్‌తో కలిసి సంపాదకత్వం వహించాడు. దక్షిణ కాశ్మీర్‌లో బ్రిజే హర దగ్గరున్న జాదీపూర్ అనే గ్రామం జాదూ కుటుంబ ఆవాస గ్రామం. తర్వాత శ్రీనగర్‌కు వల్లస వెళ్లి ఇంటిపేరును జాదూగా ఉంచుకొన్నారు. హారభట్టు కాశ్మీర్‌లోని రాజకీయ పాఠశాలలో చేరి 1895లో సంస్కృతంలో డిగ్రీ పొంది హరభట్ట శాస్త్రి అయ్యాడు. ఈతని సునిశిత మేధావితనానికి మెచ్చి మహారాజా జమ్మూ-కాశ్మీర్ ఓరియంటల్ రీసెర్చ్ సెంటర్‌లో

మొదట పండిట్‌గా నియమించగా క్రమంగా ఎదిగి హెడ్ పండిట్‌గా 1931లో రిటైర్ అయ్యాడు. విద్యావంతులైన పండితులంటే మహారాజుకున్న ప్రత్యేక శ్రద్ధకు ఇది గొప్ప ఉదాహరణ.

శైవ వాఙ్మయంలో హరభట్ట శాస్త్రికున్న సునిశిత మేధాశక్తి కాశ్మీర్‌లోనే కాదు, లక్నో యూనివర్సిటీ మహా సంస్కృత విద్వాంసుడైన కె. సి పాండే , బాంబే కాలేజ్ ఆఫ్ ఓరియంటల్ లాంగ్వేజెస్ అండ్ ఫిలాసఫీ ప్రొఫెసర్ జేమ్స్ హెడ్ వుడ్ వంటి ఉద్దండులు కూడా అబ్బుర పడ్డారు. అందుకనే ప్రముఖ భాషా శాస్త్రవేత్త ప్రొఫెసర్ సునీల్ కుమార్ ఛటర్జీ భట్టు జాదూ పాండిత్యానికి ఆకర్షితుడై శ్రీనగర్ వచ్చి ఆయన వద్ద కాశ్మీర శైవ గ్రంథాధ్యయనం చేశాడు. పైన చెప్పిన డేవిడ్ స్పూనర్ కాశ్మీర్‌కు వచ్చి ఇక్కడి విషయాలన్నీ పూర్తిగా అవగాహన చేసుకున్నాక అమెరికా వెళ్లి హార్వర్డ్ యూనివర్సిటీలో మొట్ట మొదటిసారిగా సంస్కృతాన్ని ఒక సబ్జెక్ట్‌గా 1905 నుంచి బోధించటం ప్రారంభించాడు. ఒకరకంగా ఇది హరభట్ట శాస్త్రి ప్రభావ మహిమే. అప్పుడున్న 5 వేల మంది విద్యార్థులలో సంస్కృత విద్యార్థులు కేవలం 9 మంది మాత్రమే.

హరభట్ట శాస్త్రి తన విద్వత్తును వృధా కానీకుండా విస్తృత గ్రంథ రచన ప్రారంభించాడు. కాశ్మీర్‌లోని సంస్కృత భాషా గ్రంథాలపై విస్తృతమైన వ్యాఖ్యానాలు రాశాడు. అందులో మొదటిది అమ్మవారిపై ఉన్న "పంచస్థని"కి వ్యాఖ్యానం. తనకున్న అపూర్వ శైవ శాక్తేయ విజ్ఞానమంతా ఈ వ్యాఖ్యానంలో ముఖ్యంగా లఘుస్తవం, చార స్తవంలలో పొందుపరిచాడు. వీటినే ఆయన పేరు మీదుగా "హారభట్టి" అని గౌరవంగా పిలుస్తారు. ఈ మంత్రాలన్నీ అతి ప్రాచీనకాలం నుండి కాశ్మీర్‌లో ప్రతి ఇంటా మారు మోగుతూ ఉన్నాయి. ఈయన వ్యాఖ్యలు "త్రిక" సిద్ధాంతానికి వెలుగులనిచ్చాయి. వీటిని రాసింది శంకరాచార్యులా కాళిదాసా, అభినవ గుప్తుడా అనే చర్చ చాలాకాలం నడిచింది. చివరకు హరభట్ట వీటిని "ధర్మాచార్య" మాత్రమే రాశాడని సాక్ష్యాధారాలతో రుజువు చేశాడు. దీన్ని స్వామి లక్ష్మణ జూ కూడా సమర్థించాడు. హారభట్ట మొత్తం 9 శైవ గ్రంథాలను వాటి అర్థ తాత్పర్యాలతో సహా రాశాడు. ఇదికాక ఉత్పలుడు రాసిన "ఆపద్ ప్రమత్త సిద్ధి" వ్యాఖ్యానాన్ని, బోధ పంచదశిక, పరమార్ధ చర్చ"లపై వివరణలు రాశాడు. ఇంతటి శైవ మహా పండిత విద్వాంసుడు 1951లో 77వ ఏట శివ సాన్నిధ్యానికి చేరాడు. ఈయన అమెరికా శిష్యుడు స్పూనర్ తరచుగా హరభట్ట, ప్రొఫెసర్ నిత్యానంద శాస్త్రి, పండిత మధుసూదన శాస్త్రిలకు రాస్తూ తన గురుభక్తిని వ్యక్తపరచేవాడు. దురదృష్టవశాత్తు ఆ లేఖలు కాలగర్భంలో కలిసిపోయాయి. ❁



## 276) "విద్యాధనం సర్వధనాన్ ప్రధానం"గా జీవించిన - అత్తూర్ కృష్ణ పిశోరడి - (1875-1964)

29-9-1875న కేరళలో వాడక్కేదతు నారాయణ నంబూద్రి, పాపికుట్టి పిశరస్యార్ దంపతులకు త్రిసూర్ జిల్లా అత్తూర్ అనే కుగ్రామంలో కృష్ణ పిశోరడి జన్మించాడు. స్వగ్రామంలోనే ప్రాధమిక విద్య పూర్తి చేసి మేనమామ భారత పిశోరడి ప్రేరణతో సంస్కృతం నేర్చాడు. తర్వాత వ్యాకరణం, కావ్యాలలో వెలదాతు రామున్ని నంబియార్ వద్ద నేర్చి పండితుడైనాడు. వెంగేరి వాసుదేవ నంబూద్రి అనే బాబాయ్ తన ఇంటికి ఆహ్వానించి అలంకార వ్యాకరణ న్యాయ శాస్త్రాలలో నిష్ణాతుని చేశాడు. చేరువన్నూర్ సభామఠంలో వృద్ధ పెదనాన్న నిర్వహించే వేద పాఠశాల నిర్వహణలో రెండేళ్ళు సహాకయకుడుగా ఉన్నాడు. ఈ నిర్వహణ బాధ్యత ఇష్టం లేక దాచుకొన్న పాతిక రూపాయలతో కొడుంగలూర్ కోవిలక్కంకు వెళ్ళిపోయాడు.

అప్పటికే అలంకార న్యాయశాస్త్రాలలో ఉద్దండుడైన అత్తూర్ కృష్ణ భట్టాశ్రీ గోదావర్మ తంపు రాన్ వద్ద న్యాయంలో ప్రత్యేక శిక్షణ పొందాడు. ఇక్కడ ఆయన జీవితాన్ని చక్కగా తీర్చి దిద్దుకున్నాడు. 22వ ఏట పూర్ణ ప్రజ్ఞతో స్వగ్రామం చేరి సంస్కృత భాషను నేర్పటం ప్రారంభించాడు. తాను అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని మూప్పి నాయరు కృష్ణ మొదటి శిష్యుడు. నాయర్‌కు సంస్కృతం నేర్పుతూ ఆయనవద్ద వీణ నేర్చుకొన్నాడు. 25వ ఏట నన్ని కుట్టిని వివాహమాడాడు. మామగారు భారత పిశోరడి గొప్ప వైణిక విద్వాంసుడు. కూతురూ మంచి వైణికురాలు. భార్య, మామగారు వైణికులు అవటంతో అత్తూర్ వీణా సాధన అద్వితీయంగా సాగింది. వీరిఅన్యోన్య దాంపత్యం 56 ఏళ్ళు నిరాఘాటంగా కొనసాగింది. తరువాత భార్య మరణించింది. అలట్టూర్ హైస్కూల్‌లో టీచర్‌గా జీవితం ప్రారంభించి, తర్వాత 5 ఏళ్ళు త్రిసూర్‌లోని భారత విలాసం ప్రెస్‌లో పని చేశాడు. కేరళ పాణిని బిరుదాంకితుడైన ఎ.రాజరాజ వర్మ ఆహ్వానంపై తిరువనంతపురం మహారాజా కాలేజిలో సంస్కృత ప్రొఫెసర్‌గా వర్మ స్థానంలో చేరాడు. ఓరియెంటల్ డిపార్ట్‌మెంట్‌కు 16 ఏళ్ళు అధ్యక్షుడిగా ఉన్నాడు. 1927లో తిరువాన్కూర్ మహారాజుకు ట్యూటర్‌గా నియమింపబడి అయిదేళ్ళున్నాడు.

పదవీ విరమణ తర్వాత స్వగ్రామం త్రిస్సూర్ వెళ్లి అనుక్షణ వ్యాపకంతో సుఖ జీవనం గడిపాడు. "శ్రీ తిలకం" అనే స్వగృహం నిర్మించుకొని దానిని సంగీత గురుకులంగా నిర్వహించి ఎందరికో సంగీత విద్య నేర్పాడు. కవి, సంగీతకారుడు, నాటక రచయిత, వ్యాసరచయిత మహావిద్వాంసుడు, పరిశోధకుడు సంస్కృత, మళయాళ భాషా పండితుడు అయిన కృష్ణ "విద్యాధనం సర్వ ధన ప్రధానం" అనే సూక్తిని "విద్యా దదాతి వినయం" అనే సూక్తిని త్రికరణ శుద్ధిగా నమ్మి ఆచరించినవాడు. వినయం, సర్వోత్కృష్ట గుణ సంపన్నుడు. నేర్పటం ఎంత ఇష్టమో ఇతరుల వద్ద నేర్చుకోవటమూ ఆయనకు అంతే ఇష్టం అని గురువు కె.పి నారాయణ పిశోరడి అన్నమాటలు పూర్తి సత్యాలు.

భారత విలాసం ప్రెస్‌లో పని చేసినప్పుడు "మణి దీపిక"పై వ్రాసిన సమీక్ష రాజరాజ వర్మ దృష్టిలో పడి మహారాజా కాలేజికి ఆహ్వానించాడు. రాజరాజ వర్మవద్ద పరిశోధనకు సంబంధించిన మెళకువలు గ్రహించాడు. భాస నాటకాలను వెలికి తీసి ప్రచురించిన గణపతి శాస్త్రితో పరిచయం మంచి మార్పు తెచ్చింది. ప్రాథమిక వ్యాకరణ గ్రంథం "బాలరత్నం" రాసి, చారిత్రిక భాషా సాహిత్య గ్రంథంగా "లీలాతిలకం" రచించాడు. అనేక విషయాలపై బహు గ్రంథాలు రాశాడు. "రసిక రత్నం" జర్నల్ స్థాపించి వెలుగు చూడని ఎన్నో కావ్యాలను వెలుగులోకి తెచ్చాడు. మహాకవి కాళిదాసు శాకుంతల నాటకమను "కేరళ శాకుంతలం"గా 1937లో రాసి ప్రచురించాడు. దీన్ని మెచ్చిన కొచ్చిన్ మహారాజు "పండిత రాజ" బిరుదు ప్రదానం చేసి సత్కరించాడు.

ఆయన ప్రతిభా సర్వస్వంగా సంగీతంపై అనేక సంవత్సరాలు పరిశోధన చేసి రచించిన "సంగీత చంద్రిక" 1954లో ప్రచురించాడు. 12 అధ్యాయాలతో 700 పేజీలున్న బృహత్ గ్రంథమిది. ఇందులో నాద, శ్రుతి స్వర, వీణ గ్రామ మూర్ఛన, మేళ తాళ, వర్ణాలంకార, గమకస్థాయి, ప్రబంధ రాగ, గీత అధ్యాయాలున్నాయి. 1728 సూత్రాలకు మూలం, సూత్ర భాష్యం రాశాడు. చివరి అధ్యాయం "గీత"లో రామాయణానికి సంబంధించిన కథలకు చెందిన 443 గీతాలు దేనికదే ప్రత్యేక రాగం, తాళంలున్నాయి. వీటికి సాహిత్యం స్వరమూ కూడా కూర్చాడు. గ్రంథం అద్భుత విశ్లేషణాత్మక వివరణగా ప్రత్యేకంగా రూపొందించాడు. ఇందులో భరతుని నుంచి ఆధునిక కాలం వారి వరకు ఉన్న వారి వ్యాఖ్యానాలన్నీ పొందుపరచాడు.

**పిశోరడి రచనలు–** సంగీత చంద్రిక, భాష్యవుం, సాహిత్యవుం, కేరళ సాహిత్య చరితం, కేరళ చరితం, విద్యా వివేకం, భాష దర్పణం, ఉత్తర రామాయణం (అనువాదం), శాకుంతలం (అనువాదం), లీలాతిలకం –వ్యాఖ్య. జీవితంలో చివరి రోజు వరకు సాహిత్య సంగీత కృషి చేస్తూనే 5-6-1964న స్వగృహం "శ్రీతిలకం"లో బంధు మిత్రులందరి సమక్షంలో 89వ ఏట మహా సంస్కృత సంగీత విద్వాంసుడు అత్తూర్ కృష్ణ పిశరోడి శ్రీకృష్ణ లోకానికి చేరుకొన్నాడు.❁




## 277) రక్షా రుద్రాక్ష చంద్ర మార్తాండ కర్త - ముదిగొండ నాగ లింగ శాస్త్రి - 1876-1948

శ్రౌత శివాద్వైత వేదాంత నిష్ణాతులు శ్రీ ముదిగొండ నాగ లింగ శాస్త్రిగారు 1876లో గుంటూరు జిల్లా తిక్కన కొండ గ్రామంలో జన్మించారు. అఘోరనాధ్యాయ జ్వాలాంబికల కుమారుడు. కుటుంబమంతా వేద వేదాంగ తర్క వ్యాకరణ ఆయుర్వేద జ్యోతిష శాస్త్ర శిరోమణులే. అనేక శివాలయాలలో శివలింగ ప్రతిష్టాపన చేసిన సమర్ధులే. కృష్ణాజిల్లా పమిడిముక్కలలోని మల్లంపల్లి వీరేశలింగారాధ్యులవద్ద కొంతకాలం చదివి శ్రీకాళహస్తి చేరి 15 వ ఏట అపరపతంజలి శ్రీనివాస శాస్త్రి వద్ద పాణినీయం నేర్చి సంస్కృతంలో విద్వావంసుడై, 19వ ఏట తమిళనాడులోని నదుక్కావేరి వెళ్లి తర్క మీమాంస నీలకంఠ, శంకర రామానుజ మధ్వాచార్య భాష్యాలు గ్రహించి, అప్పయ్య దీక్షిత నీలకంఠ దీక్షితుల శైవాగమాలన్నీ అవలోడనం చేసి, శంకర పద వాక్యప్రమాణ సాధికారత సాధించారు. సంస్కృత తమిళాలలో వీరశైవ గ్రంథాలెన్నో రాశారు. "శైవ విద్యాపత్రిక"కు సంపాదకులైనారు. గురువుతో 28 శైవ ఆగమనాలను క్షుణ్ణంగా చర్చించారు. ఆ లేత వయసులోనే సంస్కృతంలో "రక్షా రుద్రాక్ష చంద్ర మార్తాండం" ఉద్గ్రంథం రాశారు. దీనిని తమిళంలోను రాసి గురుదేవునికి అంకితమిచ్చారు. గురువు శ్రీ శ్రీనివాస శాస్త్రి అనుగ్రహంతో నాగ లింగ శాస్త్రిగారికి శైవ సిద్ధాంత గ్రంథం "నీలకంఠ భాష్య" తాటాకుల ప్రతిని బహుకరించారు.

నాగ లింగ శాస్త్రిగారు ప్రింటింగ్ ప్రెస్ స్థాపించి "శ్రౌత శైవ ప్రకాశిక" పత్రికను నడుపుతూ అనేక సంస్కృత తెలుగు గ్రంథాలు ముద్రించారు. అప్పయ్య దీక్షితుల "బ్రహ్మ తర్క స్తవం, భారత, రామాయణాలు, చతుర్వేద తాత్పర్య సంగ్రహం, శివ కర్ణామృతం, పంచ రత్న స్తుతిలను విస్తృత సంస్కృత వ్యాఖ్యానాలతో ప్రచురించారు. ఇవికాక అయిదు సంస్కృత రచనలు చేసి వాటికి సంస్కృత ఆంధ్రాలలో వ్యాఖ్యానం రాసి ప్రచురించారు -అవే 1-శైవ సిద్ధాంత సంగ్రహం, 2-శివ ఏవ కారణం, 3-శ్రౌతమేవాహి శైవ చిహ్నావి, 4-శ్రౌతమేవాహి ధరణం -లింగస్య, 5-శిష్ట సర్వే శివమ్

ప్రపన్నాః. ఇవన్నీ 1900-3లో మూడేళ్ళలో ప్రచురితాలు. ఇవి శివజ్ఞానలహరి పేరిట ఆంగ్లాను వాదం పొందాయి. పవిత్ర శైవ క్షేత్ర సందర్శనం చేసి శైవ మత ప్రచారమూ చేశారు శాస్త్రిగారు. మొత్తం 100కు పైగా శైవ సిద్ధాంత గ్రంథాలు రాశారు. నాగ లింగ శాస్త్రిగారు నీలకంఠ భాష్యానికి "శివ చింతామణి ప్రభ" వ్యాఖ్య రాశారు. 1930లో అప్పయ్య దీక్షితుల "శివార్క మణి దీపిక"ను వేద వ్యాసమహర్షి చెప్పిన 545 బ్రహ్మ సూత్రాలతో సంస్కృతంలో రాస్తే దీన్ని వీరి మరణానంతరం శిష్యుడు శ్రీ ముదిగొండ వీరేశలింగ శాస్త్రి 1950లో ప్రచురించారు . ఈ సంస్కృత భాష్యం తెలుగు మళయాళ తమిళ, కన్నడ భాషలలో లభ్యంగా ఉంది. ఈ భాష్యం ఇంగ్లిష్ అనువాదం పొంది "తత్వ త్రయం" అయిన జీవ, జగత్, ఈశ్వర తత్త్వం ప్రపంచమంతా వ్యాపించాలని శాస్త్రిగారు భావించారు.

1937లో నాగ లింగ శాస్త్రి గారికి విజయవాడలో దుర్గా కళా కళామందిరం ఎదురుగా ఉన్న శైవ మహాపీఠంలో షష్ట్యబ్ది పూర్తి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శాస్త్రిగారు 1930 నుంచి 1948 మరణ పర్యంతం ఎన్నో వ్యాసాలూ వ్యాఖ్యాన గ్రంథాలు శైవ సిద్ధాంతంపై రాశారు. ఈ కాలంలోనే 545 బ్రహ్మ సూత్రాలపై విపులమైన వ్యాఖ్యానం రాశారు. వీటినన్నిటిని శ్రీ ముదిగొండ వీరేశలింగ శాస్త్రిగారు ఆ తర్వాత ప్రచురించారు. మచిలీపట్నంలోని శ్రీ కాశీనాధుని వీరేశలింగం అయ్యవారు శాస్త్రిగారి మరణానికి సంతాప సందేశం పంపుతూ "He was a learned man with whom, one can discuss the sastras, to one's satisfaction, imbibed with all good qualities, a great poet, one who understood the essence of the vedas, one who worshipped Siva with great Devotion, a great commentator of the Veda Vagmayam without compromise or contradiction. May he alone bear this Bharatiya samskruti like the thousand hooded serpent king Sesha, bearing the weight of this entire universe and inspire the younger generations, on Indian values for years to come" అని చంపకమాల శ్లోకాలలో ప్రస్తుతించారు. ❋



## 278) ప్రసూనాంజలి కర్త – న్యాయా చార్య పండిత రాజ మండిత – కుంచు నంబూద్రి –1877–1959

శాస్త్ర శర్మ (కుంచు) నంబూద్రి కేరళలో 1877లో సుబ్రహ్మణ్య నంబూద్రి కిరనాంజల్ పార్వతి దంపతులకు జన్మించాడు. అన్న వాసుదేవ నంబూద్రి గొప్ప వ్యాకరణవేత్త. తమ్ముడు సుబ్రహ్మణ్య నంబూద్రి న్యాయ శాస్త్రవేత్త. 7వ ఏట ఉపనయనం జరిగి అన్నగారి వద్దనే వేదం నేర్చి తర్వాత త్రిస్సూరు బ్రహ్మస్వామి మఠంలో 15వ తేదు వరకు చదువుకున్నాడు .ఆ సమయంలోనే వ్యాకరణ న్యాయ శాస్త్రాలను కిరంగాట్ మనలో ఉన్న ప్రసిద్ధ పండితుడు రామస్వామి శాస్త్రి వద్ద క్షుణ్ణంగా అభ్యసించాడు. న్యాయ శాస్త్రంలో అడ్వాన్స్డ్ ట్రెయినింగ్‌ను కుడుంగ ల్లూర్ గురుకులంలో విఖ్యాత భట్ట గోదావర్మ రాజ వద్ద నేర్చాడు. ఆయన మేనకోడలిని వివాహమాడాడు.

కొచ్చిన్ రాజు తర్కాలంకార బిరుదు ప్రదానం చేసి త్రిపుని తురలోని సంస్కృత పాఠశాలలో న్యాయ శాస్త్రాచార్యునిగా నియమించాడు. 1931 వరకు అక్కడే పని చేసి, రిటైర్ అయినా కూడా తన విద్యావ్యాసంగాన్ని బోధనను మానకుండా చేశాడు. జీవిత కాలమంతా న్యాయ సదస్సులకు న్యాయనిర్ణేతగా కొనసాగాడు.

న్యాయ శాస్త్రంలో ఆయన చేసిన కృషి అనిర్వచనీయం. నాచన్ రత్నమాలిక, దీనిపై “నూతనాలోకనం” అనే వ్యాఖ్య, సుబోధినీ టీకాలను రచించాడు. గంగాతరంగిణి అనే 24 తరంగిణులకు ఒక్కొక్కదానికి 14 శ్లోకాల కావ్యం రాశాడు. కాశీ విశ్వేశ్వరునిపై అచంచల భక్తి ఉన్న కుంచు నంబూద్రి వ్యాఖ్యాన టీకా “ప్రసూనాంజలి” రాసి తన శివ భక్తి గరిమను చాటుకున్నాడు. చిన్నదే అయినా అత్యంత ప్రసిద్ధి చెందింది. చాతక సందేశం అనే సందేశ కావ్యాన్నీ రాశాడు. 82 ఏళ్ళ వయసులో కుంచు నంబూద్రి 1959లో శివసాయుజ్యం పొందాడు.❀



## 279) 108 చాముండీ అష్టోత్తర కృతికర్త - ముత్తయ్య భాగవతార్ - 1877-1945

సంస్కృత కన్నడ తెలుగులలో అనేక కృతులురాసి హరికథ గానంతో ప్రేక్షకులను పరవశం కలిగించిన హరికేశ నల్లూరు ముత్తయ్యభాగవతార్ 1877లో తిరునల్వేలిలో పుట్టి 20వ శతాబ్దపు ఉత్తమ సంగీత స్వరకర్తగా పేరు పొందారు. వర్ణాలు కృతులు రాగమాలికలు తిల్లానాలతో వైవిధ్య రచన చేసి మెప్పు పొందాడు. నిరుపనం, పాదంలకు ఆయన పెట్టింది పేరు. 108 చాముండేశ్వరి అష్టోత్తర కృతులురాసిన మహాభక్తుడు. ఖామాస్ రాగంలో "మాతే మలయధ్వజ" కర్ణ రంజనిలో "వాంఛతోను" బాగా పేరు తెచ్చాయి. "నిరోష్ట" వంటి అనేక కొత్తరాగాలు సృష్టించాడు. 68వ ఏట చాముండేశ్వరి సన్నిధానం చేరుకొన్నాడు.❀



## 280) సంగీత సాహిత్య శిరోమణి, త్యాగరాజ ఆరాధనోత్సవ ప్రారంభకురాలు - బెంగళూర్ నాగరత్నమ్మ - (1878-1952)

కర్నాటక నంజన్ గూడ్‌లో నాగరత్నమ్మ జన్మించింది. శాస్త్రి అనే మైసూర్ మహారాజాస్థాన సంస్కృత విద్వాంసుడు నాగరత్నమ్మకు సంస్కృతం సంగీతం నేర్పాడు. అయిదవ ఏట వయోలనిస్ట్ అయిన మేనమామ వెంకటస్వామి అప్ప దగ్గరకు చేరి దేవదాశి అయింది. తెలుగు కన్నడ ఆంగ్లాలను క్షుణ్ణంగా నేర్చింది. నృత్య, సంగీతాలలో మేటి అనిపించుకొన్నది. 15వ ఏటనే వయోలిన్, డాన్స్ ప్రోగ్రాంలు ఇచ్చింది.

సుస్వరగాత్రం నాగరత్నమ్మ స్వంతం. దానితో ఆనాటి మేటి సంగీత విద్వాంసులతో దీటుగా కచేరీలు చేసి కర్నాటక సంగీతంలో తనకు ఎవరూ సాటి లేరని నిరూపించింది. ఈమె ప్రతిభా పాండిత్యాలను గుర్తించిన మైసూర్ రాజా జయ చామ రాజ ఒడియార్ నాగరత్నమ్మను మైసూర్ సంస్థాన "ఆస్థాన విదుషి"గా నియమించి కళకు అత్యంత గౌరవం కల్గించాడు. తిరువాన్కూర్ మహారాజు బొబ్బిలి, విజయనగరం మహారాజులు ఆమెను ఆహ్వానించి సత్కరించారు. మద్రాస్ హై కోర్ట్ జస్టిస్ నరహరి రావు ఆమెను మద్రాస్‌లో ఉండి పొమ్మని సలహా ఇచ్చాడు. మద్రాస్ చేరి సంగీతంలో తన సత్తా నిరూపించింది.

త్యాగ రాజస్వామి అంటే విపరీతమైన ఆరాధనా భావం ఉన్న నాగరత్నమ్మ ఆయనకు తగిన ఆరాధనా మందిరాన్ని నిర్మించాలని కలలు కనేది. అందుకే పూర్తిగా అన్నీ విసర్జించి సన్యాసినిగా జీవించింది. ప్రముఖ సంగీత విద్వాంసుడు బిడారం కిష్టప్ప ద్వారా త్యాగరాజ సమాధి శిధిలమై పోతోందని తెలిసి కలత చెందింది. సంగీత కారులు రెండు వర్గాలుగా చీలిపోయి ఆ సమాధి వద్దనే సంగీత కచేరీలు చేసేవారు. 1903లో బిడారం శిష్యులు కృష్ణ, సుందర భాగవతార్‌లు ఒక చిన్న కట్టడం నిర్మించి మార్బుల్ విగ్రహం పెట్టి త్యాగరాజ సంగీత ఉత్సవాలు చేశారు. దీనితో ప్రేరణ పొందిన నాగరత్నమ్మ అక్కడ త్యాగరాజ స్వామికి ఒక పవిత్ర దేవాలయం నిర్మించాలని భావించి 1921లో తన దగ్గరున్న సర్వస్వం 30 వేల రూపాయలు ఖర్చు చేసి సమాధిని పునరుద్ధరించి త్యాగరాజ విగ్రహంతో సహా ఆలయం నిర్మించి, తన చిరకాల మనోవాంఛ నెర వేర్చుకొన్నది. హరికథాగానం లోనూ సాటి లేని ప్రతిభ ఉన్న ఆమె అక్కడ తొలి హరికథ చెప్పటానికి సిద్ధమైంది. ఆమెను అనుమతించలేదు. అప్పటిదాకా అక్కడ మగవాళ్ళ పెత్తనమే సాగేది. దీనితో ఆమె పోటీ సభ ఏర్పరచి కార్యక్రమాలు చేసింది. ఈమె గ్రూప్‌ను "పెంగాల్ కచ్చి" అన్నారు అంటే "ఆడ ముఠా". 1941లో ఆమె కృషి ఫలించి వైరివర్గమే దారికొచ్చి ఈమె గ్రూప్‌లో చేరి కార్యక్రమాలలో పాల్గొన్నది. అప్పటినుంచి తిరువయ్యార్‌లో "త్యాగరాజ ఆరాధనోత్సవాలు" ఘనంగా జరుగుతూ దేశ విదేశాలలో ప్రస్తుతింప బడుతున్నాయి. దేశంలోని కర్నాటక సంగీత కళాకారులంతా పుష్య బహుళ పంచమినాడు ఇక్కడికి విచ్చేసి "త్యాగరాజ పంచ రత్న కీర్తనలు", భక్తితో గానం చేసి ఆ మహా వాగ్గేయకారునికి ఘన నివాళి సమర్పిస్తున్నారు. ఇదంతా నాగరత్నమ్మ ఒంటరిపోరాట ఫలితమే.

తంజావూర్ ఆస్థానకవి ముద్దుపళని రాసిన "రాధికా సాంత్వనం" విశ్రుంఖల శృంగార కావ్యమని సంప్రదాయ కవులు ప్రక్కన పెడితే నాగరత్నమ్మ దాని ముద్రణ బాధ్యత తీసుకొని లోకానికి అందజేసింది. స్త్రీ పక్ష పాతి అని పేరున్న వీరేశలింగం గారు దీన్ని సమీక్షించి అసభ్య శృంగార కావ్యమన్నారు. ఆయననూ ఎదిరించి తనవాదన సరియైందే నని రుజువు చేసింది నాగరత్నమ్మ. కావ్యం నిషేధానికి గురైతే టంగుటూరి ప్రకాశం గారు ముఖ్యమంత్రి కాగానే నిషేధాన్ని తొలగించారు. పోరాటాలలో అలసి

సొలసిన నాగరత్నమ్మ 74వ ఏట త్యాగరాజ సన్నిధి చేరింది. ఆంధ్రజాతి బెంగళూర్ నాగరత్నమ్మ గారికి సంగీత సాహిత్య పరంగా ఎంతో రుణపడింది. నాగరత్నమ్మ సంస్కృత భాషా పాండిత్యానికి ఆనాటి గీర్వాణ పండితులు ఆశ్చర్యపోయేవారు. కృతులలో సంస్కృత శబ్దాలను ఆమె పలికినంత స్వచ్ఛంగా నిర్దుష్టంగా ఏ గాయనీ గాయకుడూ ఆ రోజుల్లో పలకగలిగే వారు కాదు.

తిరువయ్యార్‌లో లాగానే త్యాగరాజు స్మృతి మందిరం మైసూర్‌లోనూ నిర్మించాలని ఆరాట పడింది. కాని సఫలం కాలేదు. ఆమె జననం 3-11-1878. మరణం-19-5-1952.❁

## 281) తిలపర్వత దానకర్త - కృష్ణన్ భట్టాద్రి పాది -1879-1964

కృష్ణన్ భట్టాద్రి పాద 1879లో కేరళలోని త్రిస్సూర్ జిల్లా పెరువనం దేశ మనలో కున్నట్టూర్ పడి నంజరే దాతు అనే తంత్ర సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. తండ్రి పేరుకూడా కొడుకు పేరే. తల్లి చిత్తూరు మన నుండి వచ్చింది, తొమ్మిది మంది సంతానంలో ఆరవ వాడు. నలుగురు సోదరులు, నలుగురు సోదరీమణులు.

ఉపనయనానంతరం ఋగ్వేదాన్ని కంఠోపాఠం చేశాడు. జీవితమంతా వేదం అధ్యన అధ్యాపనంలో గడిపాడు. అడ్వాన్సేడ్ సంస్కృతాన్ని సాహిత్యాన్ని చన్నమంగళం అయ్య శాస్త్రి వద్ద నేర్చాడు. కోడంగూర్ గురుకులంలో తర్కాన్ని అభ్యసించాడు. వంశ పారంపర్యంగా వస్తున్న తంత్ర శాస్త్రంలో నిష్ణాతుడై, తచు శాస్త్రంలో మహా పాండిత్యాన్ని సాధించాడు. భట్టాద్రి పాద ముఖ్య శిష్యుడు 2000వ సంవత్సరంలో చనిపోయిన తంత్ర మహా నిష్ణాత కలక్కూజ దివాకరాన్ నంబూద్రి. భట్టాద్రి ఆధ్వర్యంలో అరుదైన మహా గొప్ప తిలపర్వత యజ్ఞాన్ని నభూతోగా కొచ్చిన్ మహా రాజు కోరికపై నిర్వహించారు. ఈ మహా క్రతు విధానాన్ని సంపూర్ణంగా నంబూద్రి పుస్తకంగా రచించి "తిలపర్వత దానం" శీర్షికతో ముద్రించాడు. ఆయన రాసిన మరో గ్రంథం "సాహిత్య చింతామణి". ఇందులో "త్రిసంధ", సన్యాసక్రియ మొదలైన కర్మకాండ నంతటిని చక్కగా వివరించి రాశాడు. 85వ ఏట మరణించాడు.❁



## 282) ధర్మ శాస్త్ర చరిత్ర కర్త - భారత రత్న పాండురంగ కాణే - 1880-1972

7-5-1880న జన్మించి 8-5-1972న 92వ ఏట మరణించిన మహా మహోపాధ్యాయ, భారతరత్న పాండురంగ వామన్ కాణే గొప్ప ఇండాలజిస్ట్. సంస్కృత మహా విద్వాంసుడు. విద్యారంగంలో 40 ఏళ్ళు సుదీర్ఘంగా విజయవంతంగా గడిపిన కాణేకు భారత ప్రభుత్వం 1963లో 6,500 పేజీల ఉద్గ్రంథం "ధర్మ శాస్త్ర చరిత్ర" (హిస్టరీ ఆఫ్ ధర్మ శాస్త్ర) రచించి నందుకు భారతదేశ అత్యున్నత జాతీయ పురస్కారం "భారత రత్న" అందజేసి గౌరవించింది. చరిత్రకారుడు రాంచరణ్ శర్మ "గొప్ప సంస్కృత పండితుడైన పాండురంగ కాణే సాంఘిక సంస్కరణలను ప్రోత్సహిస్తూనే సంప్రదాయ శాస్త్రౌన్నత్యాన్ని పరి రక్షించాడు" అని మెచ్చాడు. 5భాగాలుగా ప్రచురింపబడిన "ధర్మ శాస్త్ర చరిత్ర" ప్రాచీన సాంఘిక న్యాయాలు, ఆచారాలకు విజ్ఞానసర్వస్వంగా నిలిచింది. ప్రాచీన భారతంలో సాంఘిక మార్పు సోపానాన్ని విస్పష్టంగా ఈ గ్రంథం తెలియజేసింది.

ధర్మశాస్త్ర చరిత్రను ఇంగ్లీష్‌లో రాసి దానికి ఉప శీర్షికగా "భారత దేశంలో ప్రాచీన, మధ్యయుగాల మతాలు, పౌర న్యాయాలు" అని పేరు పెట్టాడు. ఈ ఉద్గ్రంథం ఆయన "మాగ్నం ఓపస్"గా అంటే- మేథో సర్వస్వంగా భావిస్తారు. పరిశోధనాత్మకమైన ఈ మహా గ్రంథం భారతీయ శిక్షాస్మృతి యొక్క పరిణామ దశలను అనేక శతాబ్దాలలోని గ్రంథాలను వ్రాత ప్రతులను పరిశీలించి రాయబడింది. 1932లో మొదటిభాగం 1962 అంటే 30 ఏళ్ళ తర్వాత చివరిదైన 5వ భాగం ప్రచురింప బడ్డాయి. తన రచనకు ఆధారాలను ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ బాంబే, భండార్కర్ ఓరియెంటల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మొదలైన చోట్లల నుండి సేకరించాడు. మహాభారతం, పురాణాలు, చాణక్యం మొదలైన వన్నీ తిరగేసి లోతుగా తరచి, సారాన్ని నిక్షిప్తం చేశాడు. ఎంత కఠోర శ్రమ చేశాడో అర్ధమవుతుంది. నిగూఢంగా ఉన్న అనేక రహస్యాలను వెలుగులోకి తెచ్చాడు. రచనలో నాణ్యత ఆయనకు సంస్కృత భాషలో ఉన్న లోతైన పరిజ్ఞానానికి, అవగాహనా శక్తికి దర్పణమై నిలిచింది. వ్యతిరేక భావాలున్న గ్రంథాలను కూడా తృణీకరించి వదిలి వేయకుండా వాటినీ సమగ్రంగా అధ్యయనం చేయటం కాణే పండితుని గొప్ప సంస్కారం. అదే విజయమై నిలిచింది కూడా.

కాణే పండితుడు సంస్కృతంలో "వ్యవహార మయూఖా" అనే గ్రంథాన్ని రాశాడు.

అంతే కాక తన ధర్మ శాస్త్ర చరిత్రకు విస్తృత ఉపోద్ఘాతం రాసి అందులో తన గ్రంథంలో చెప్పబడిన ముఖ్య విషయాలను తెలియజేసి దానిపై గొప్ప అవగాహన కల్పించి గ్రంథంపై అభిమానం కలిగేట్లు చేశాడు. ఇంత కష్టపడి రాసినా సంస్కృతంలోని "ధర్మ" అనే పదానికి ఇంగ్లీష్‌లో సమానమైన సరైన పదం దొరకలేదని బాధపడ్డాడు మహామహోపాధ్యాయ కాణే పండితుడు. సంస్కృతం, ఇంగ్లీష్, మరాటీ భాషలలో కాణే పండితుని రచనా సర్వస్వం 15,000 పేజీలు ఉండటం మహాశ్చర్యం కలిగిస్తుంది.

మూడు భాషలలో చేసిన సాహిత్య కృషికి కాణే పండితుడు ''మహా మహోపాధ్యాయ" బిరుదు నందుకొన్నాడు. బొంబాయ్ యూనివర్సిటి వైస్ చాన్సెలర్‌గా పని చేశాడు. కురుక్షేత్రంలో భారతీయ భాషాధ్యయనం కోసం "కురుక్షేత్ర విశ్వ విద్యాలయం" ఏర్పాటు చేయటంలో కాణే పండితుని అకుంఠిత దీక్షా, పట్టుదల, విజయము కనిపిస్తాయి. ధర్మశాస్త్ర చరిత్ర గ్రంథం 4వ భాగానికి సంస్కృత అనువాదం విభాగం పరిశోధనకుగాను 1956లో సాహిత్య అకాడెమి అవార్డ్ పొందాడు. భారతీయ విద్యాభవన్‌కు గౌరవ సభ్యులుగా కాణే పండితుని నియమించి గౌరవించారు. విద్యారంగంలో చేసిన సుదీర్ఘ కృషికి కాణే పండితుని రాజ్య సభ సభ్యత్వమిచ్చారు. అన్నిటికంటే అత్యున్నతమైన "భారత రత్న" పురస్కారాన్ని భారత ప్రభుత్వం 1963లో అందించి ఆ మహామహో పాధ్యాయుని భారత రత్నను చేసింది.

భారత రాజ్యాంగం ఇండియాలో ఉన్న సనాతన భావ పరంపరకు గండి కొట్టి భారత ప్రజలకు హక్కులే కాని బాధ్యతలు లేవు అన్న అభిప్రాయం కలిగించింది అని కాణే పండితుని నిశ్చితాభిప్రాయం. సాధికారిక విజ్ఞాన సర్వస్వం అయిన కాణే బృహద్రచన అనేక రాజకీయ దుమారాలకు ఆయువుపట్టు అయింది. కేంద్రంలో అటల్ బిహారీ వాజ్ పేయి ప్రభుత్వం అధికారంలో ఉండగా ప్రాచీన భారతీయులు ఆవు మాంసం తిన్నారు అన్న విషయంపై రెండు వర్గాలు ఏర్పడి రెండు వైపుల వారూ కాణే గారి ఉద్గ్రంథంలోని భాగాలనే విస్తృతంగా ఉదహరించటం తమాషా అయిన విశేషం. ఈ సమస్య గోవును మాతఃగా పవిత్రంగా చూసే హిందువులకు చాలా ముఖ్యమై, గోమాంసాన్ని తినటంపై నిషేధం విధించాలని గట్టి పట్టుబట్టారు. రెండవ సమస్య– ప్రాచీన భారతంలో బాలికలకు యజ్ఞోపవీతం వేసుకొనే హక్కు అయిన ఉపనయనం చేసేవారు అని, కాలక్రమంలో ఇటీవలి కాలంలోనే అది మగ పిల్లలకు మాత్రమే హక్కుగా మారింది అనేది.

మహా మహోపాధ్యాయ కాణే పండితుని స్మృతి చిహ్నంగా ఆయన మరణానంతరం ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ ముంబే వారు "ప్రాచ్య భాషాధ్యయనాన్ని ప్రోత్సాహించటం కోసం, 1974 లో "డా.పి .వి.కాణే ఇన్‌స్టిట్యూట్ ఫర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ అండ్ రిసెర్చ్" సంస్థను స్థాపించారు. అంతేకాక వేద ధర్మ శాస్త్రం లేక అలంకార శాస్త్రంలో అత్యద్భుత కృషి చేసిన వారికి మూడేళ్ళ కోకసారి డా.పి.వి కాణే స్వర్ణ పతకాన్ని ప్రదానం చేస్తున్నారు.❋

## 283) శివ సూత్ర విమర్శన కర్త – పండిత ముకుంద రామ శాస్త్రి – 1880–1921

మహా మహోపాధ్యాయ పండిత ముకుందరామ శాస్త్రి గొప్ప కాశ్మీరీ సంస్కృత మహాపండితుడు. తన అసమాన ప్రతిభ చేత దేశంలోను విదేశాలలోనిఅత్యంత ప్రాముఖ్యత పొందాడు. జీవితకాలంలో "లెజెండ్" అనిపించుకొన్నాడు. గణేష్ భట్ గంగో పాధ్యాయ, అమరావతి దంపతుల కుమారుడు. స్థానిక ప్రభుత్వ సంస్కృత పాఠశాలలో పండిత దయా రామ్ కౌల్ వద్ద చదివి శాస్త్రి డిగ్రీ సాధించి పంజాబ్, లాహోర్‌ల నుండి ఇక్కడకు వచ్చి చేరి చదివిన వారిని తీర్చిదిద్ది తన ఖ్యాతిని దేశమంతా చాటుకున్నాడు. యవ్వనంలోనే పర్షియన్ గ్రంథాలను సంస్కృతంలోకి పండిట్ రామ్ జూ ధర్ పర్యవేక్షణలో అనువదించాడు. దీన్ని గమనించిన జమ్మూకాశ్మీర్ రాజు రణబీర్ సింగ్ ముకుంద శాస్త్రిని టిబెటన్ బౌద్ధ గ్రంథాలైన "కంగూర్", "తంగుర్"లను సంస్కృతంలోకి అనువదించమని కోరాడు. థామస్ టాంసెల్ వద్ద టిబెటన్ భాష అభ్యసించి 1 లక్షా 50 వేల శ్లోకాలలో వాటిని అనువదించి తన సామర్థ్యాన్ని నిరూపించాడు. దీనితో ఆయన ప్రతిభ ద్విగుణీకృతమై మహారాజు నుండి 500 రూపాయల అత్యధిక నగదు పారితోషికం పొందాడు. ఆనాడు అదే చాలా గొప్ప బహుమానం.

ఈ ప్రయత్నాన్ని మెచ్చిన మహారాజు కాశ్మీర్‌లోని ఖట్వార్‌లో ఉన్న పొద్దార్‌లో లామా గురేను అనుసరించమని కోరాడు. అక్కడ నీలం రాళ్లు బాగా లభిస్తాయి. దానిపై పరిశోధన చేయాలని రాజు ఆదేశం. ఇక్కడే యూరోపియన్ ఓరియెంటలిస్ట్ పోప్ వేద్‌తో పరిచయమైంది. అప్పుడు కాశ్మీర్ వ్యాకారణంపై వేద్ గ్రంథం రాస్తున్నాడు. దానికి శాస్త్రి పూర్తిగా సహకరించాడు. కొద్దికాలం తర్వాత శ్రీనగర్‌లో క్రిస్టియన్ మిషనరీలు నడిపే సి ఏం ఎస్ స్కూల్‌లో సంస్కృత పండితునిగా నియామకం పొందాడు. ఒక ఏడాది మాత్రమే పని చేసి కాశ్మీర్‌కు వచ్చిన అరుల్ స్టైయిన్ అనే ఆయనకు రాజతరంగిణి అనువాదంలో 1899లో సహకరించాడు. తర్వాత ఆయన సలహాపై

గ్రియర్సన్‌కు లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియాకు 20 ఏళ్ళు తోడ్పడ్డాడు. ఈ సమయంలోనే కాశ్మీర్ భాషా నిఘంటువు, కృష్ణ జూ రజ్దాన్ రచన "శివ పరిణయ"లను తన సంపాదకత్వంలో వెలువరించాడు. 1900లో పంజాబ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎ.డబ్ల్యు.స్టాటన్ అభ్యర్ధనపై "కటక్ భాషా సూత్ర" అనే అత్యంత విలువైన గ్రంథం రెండేళ్లు శ్రమించి రాశాడు.

1912లో మహారాజా రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేసి శాస్త్రిని హెడ్‌గా నియమించాడు. రీసెర్చ్ అండ్ ఆర్కిలాజికల్ డిపార్ట్ మెంట్ ఆఫీసర్ ఇన్‌ఛార్జ్‌గా 1919 వరకు ఉన్నాడు. 1908లో భారత ప్రభుత్వ పురావస్తు శాఖ సర్వేకు కాశ్మీర్‌లోని శారదా, దేవనాగర లిపులపై శాసనాలు శిధిలమవుతుంటే వాటి అర్ధభావాలను విశ్లేషించి భద్రపరచాడు. జైన రాజు రాసిన "జైన రాజ తరంగిణి"పై పరిశోధిస్తున్న స్పూనర్‌కు సాయమందించాడు. రీసెర్చ్ డిపార్ట్‌మెంట్‌లో ఉండగా కాశ్మీర శైవానికి చెందిన 23 శైవ గ్రంథాలను తన సంపాదకత్వంలో వెలువరించిన ఘన కీర్తి పొందాడు. ఇవన్నీ "కాశ్మీర్ సిరీస్"గా వెలువడ్డాయి. ఇవి కాక శివ సూత్రం, తరంగిణి, స్పందన కారిక, తంత్రలోక, తంత్ర సారా, ఈశ్వర ప్రతిభిజ్ఞా, పరాత్రిమాశిక, పరార్ధ సారలను కూడా ప్రచురించి అద్వితీయ సాహితీ సేవ చేశాడు ముకుంద శాస్త్రి. అతిప్రాచీన కాశ్మీర్ సంస్కృత గ్రంథం "మహా నయా ప్రకాష్"కు కూడా సంపాదకుడు. జార్జి గీయర్సన్ లల్లాదేవి రచనలను "లల్లవాక్యాని"గా తీసుకురావటంలో శాస్త్రి తోడ్పాటు మరువ లేనిది. ఇదే కాక ఈశ్వర కౌల్ రచన "సదమృత"ను గీయర్సన్ ప్రచురించటలో యెనలేని సాయమందించాడు.

ముకుంద శాస్త్రి అపార శాస్త్ర జ్ఞానానికి తగిన "మహా మహోపాధ్యాయ" బిరుదు గౌరవం లార్డ్ హార్డింజ్ చేతుల మీదుగా లభించింది. 1921లో ఈ మహామేధావి అసామాన్య సంస్కృత పాండితీ గరిమ ఉన్నపండిత ముకుంద శాస్త్రి 1921లో ముకుంద ధామం చేరుకొన్నాడు. ❀


## 284) లఘురత్నమాల కర్త - శివనాధ భుజర్బారువా -1880-1964

1880-1964 కాలపు పండిత శివనాధ భుజ ర్బారువా "లఘురత్నమాల" వ్యాకరణ గ్రంథం రాశాడు. ఇదికాక పీతాంబర సిద్ధాంత వాగీశుని "దయాకౌముది"పై "ప్రబోధిని" వ్యాఖ్య రాశాడు. ఆచార విజ్ఞాన, హిందూక్రిస్టి మొదలైనవి రచించాడు.❀




## 285) 108 రాగాలతో 108 కీర్తనల కర్త -ఎన్నపాదం వెంకటరామ భాగవతార్ -1880-1965-414

కేరళలో కొచ్చిన్‌లోని ఎన్నపాదంలో వెంకటరామ భాగవతార్ 1880లో జన్మించి 1961లో 81వ ఏట మరణించాడు. హరికథాగానంలో సాటిలేని మేటి. సంస్కృత తెలుగు కన్నడ మిళ మళయాళ భాషలో హరికథలు రాసి, చెప్పి, ఒప్పించిన హరికథా గాన సరస్వతి. తిరువనంతపురం కొచ్చిన్ మైసూర్, బరోడా మొదలైన సంస్థానాలలో హరికథా గానం చేసి మెప్పుపొంది సత్కారాలు అందుకొన్నాడు. అనేక కొత్తరాగాలు సృష్టించాడు. కృష్ణ అష్టోత్తర శతనామ కీర్తనలు "108 రాగాలలో 108 కీర్తనలు అంటే నామానికి ఒక్క కీర్తనగా రచించిన భక్త శిఖామణి. ప్రకాశిని రాగంలో "గుహం ఆశ్రయామి", సుముఖిరాగంలో "మాతంగ ముఖం" కీర్తనలు ప్రసిద్ధి చెందాయి.❀



## 286) దర్శన మాల కర్త - నారాయణ గురు -1885-1928

కేరళలో తిరువనంతపురంలోని చెంపలంతిలో 1885లో నారాయణ గురు జన్మించాడు. తండ్రి మదన్ ఆసన్, తల్లి కుట్టిఅమ్మ. గురుకుల పద్ధతిలో ప్రాధమిక విద్య ఉన్నత విద్య 1887 వరకు నేర్చాడు. ఈ కాలంలోనే తర్క, వ్యాకరణ కావ్య నాటక వేదాంతాలు క్షుణ్ణంగా అభ్యసించాడు. సకల సద్గుణ రాశిగా పేరు పొందాడు. మంత్రవేత్తగా ఉపన్యాసకుడుగా గురువుగా బోధకుడుగా సన్యాసిగా ప్రముఖుడయ్యాడు. కేరళలో హిందూమత, పునరుద్ధరణకు, అందులోని మూఢ ఆ ఛారాలను తొలగించి సంస్కరణ చేసినందుకు నారాయణ గురును సదా సంస్మరించుకొంటారు.

సంఘంలో అట్టడుగున ఉన్న అణగారిన కిందికి తొక్కబడిన జాతులవారిని కులమత భేదాలు లేకుండా చేరదీసి వారినీ సమాజంలో సమాన హోదాగలవారినిగా చేయటానికి చైతన్యవంతులను చేశాడు. తోటివారిని మానవులుగా గుర్తించాలే తప్ప హిందూ ముస్లిం క్రైస్తవాదులుగా గుర్తించరాదని బోధించాడు. వేద, ఉపనిషత్తులు సర్వశాస్త్రాలు బాగా ఆకళింపు చేసుకున్నవాడు కనుక వాటిలోని పరమ రహస్యాలను అర్ధం చేసుకొని ఆచరణ సాధ్యం చేశాడు. మనిషి వ్యక్తిత్వ వికాసానికి తోడు పడ్డాడు. దేశసంచారం చేస్తూ కట్టాంబి స్వామిని కలిసి ఆయన శిష్యుడై ఇద్దరూ కలిసి సంఘ దురాచార నిర్మూలనకు నడుం కట్టారు. యోగ విద్యనూ సాధించాడు. వివాహమైందికాని సఫలం కాలేదు.

నారాయణ గురు అరివిప్పురంలో ఒక శివ లింగ ప్రతిష్ఠచేసి గుడికట్టించి

దాన్ని గొప్ప యాత్రాస్థలంగా మార్చాడు. 1895లో డా.పల్పును కలుసుకోవటంతో సాంఘిక సేవకు మంచి ఊపు లభించింది. 1903లో "శ్రీ నారాయణ గురు ధర్మ పరిపాలన యోగం" స్థాపించి అదో జగత్ సహోదరులను ఆదుకున్నాడు. నారాయణ గురు యజ్వ కులంలో పుట్టాడు. ఆకులం వారికి అప్పుడు విద్యాలయాలలో ఉద్యోగాలలో దేవాలయాలలో ప్రవేశం లేదు. ప్రముఖ మలయాళ కవి కుమార ఆసన్ ఈయన శిష్యుడే. ఆ సంస్థకు సెక్రెటరీగా ఉన్నాడు. సంస్థ "వివేకోదయం" దిన పత్రికను ఆసన్ సంపాదకుడుగా ప్రారంభించింది. వీరి కులాలలో కెట్టు కళ్యాణం అనే శాస్త్ర బద్ధమైన ఖర్చుతో కూడిన తంతు చేసుకొన్నవారికే వివాహ యోగ్యత ఉండేది. ఈ పద్ధతిని మానిపించి సూటిగా తక్కువ ఖర్చుతో ఆదర్శ వివాహ పద్ధతిని జరిపించి సఫలుడయ్యాడు నారాయణ గురు. శివ గిరిలో శారదా మఠం అలివిప్పురం మొదలైన చోట్ల ఆశ్రమాలు కట్టించి, తాలస్సేరిలో జగన్నాథ దేవాలయం నిర్మించి అందరికి దేవాలయ ప్రవేశం కల్పించి గాంధీ, ఠాగూర్‌లను ఆహ్వానించి మన్ననలు పొందాడు.

వేదాంత సంబంధమైన గ్రంథాలెన్నో నారాయణ గురు రాశాడు. కొన్ని సమాజ ఉద్ధరణకు రాశాడు. ఆయన సంస్కృత రచనలలో దర్శన మాల, ఆత్మోపదేశ శతకం, దైవ దశకం, అనుకంప దశకం, జటిలాక్షణం, చిచ్చ దా చింతనం, శివశతకం, అద్వైత దీపికా, జనని నవారత్న మంజరి, నిర్వృతి పంచకం, వినాయకాష్టకం, జ్ఞాన దర్శనం, చిదంబర శతకం, ఇంద్రియ వైరాగ్యం శ్రీ కృష్ణ దర్శనం కలినాటకం మొదలైనవి ఉన్నాయి. 1928లో ఈ ఆధ్యాత్మిక పుణ్య పురుషుడు నారాయణ గురు 43 ఏళ్లకే నారాయణ సన్నిధానం చేరాడు.❁



## 287) "ఋగ్ భాష్య భూమిక"కర్త, మహోన్నత వేదవేత్త, మహా సంస్కృత పండితుడు - కపాలి శాస్త్రి -1886-1953

టి.వి కపాలి శాస్త్రి తమిళనాడులోని మద్రాస్‌లో మైలాపూర్‌లో 1886 లో తంత్ర శాస్త్ర బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. తల్లి ఉగ్గుపాలతోనే సకల శాస్త్ర వేద సారం గ్రహించాడు.

12వ ఏటనే సంస్కృత రామాయణాన్ని 12సార్లు చదివేశాడు. అప్పటికే శ్రీ విద్యోపాసకుడై లలితా త్రిపుర సుందరి పరమ భక్తుడయ్యాడు. 1907లో ఒక దేవాలయంలో మొదటి గురువు శ్రీ కావ్యకంఠ వాసిష్ఠ గణపతిముని దర్శనం కలిగి, శిష్యుడై నాలుగేళ్లు ఆయన వద్ద విద్య నేర్చి, ఆయనతో రెండవ గురువు రమణ మహర్షిని సందర్శించి శిష్యుడయ్యాడు. "మహర్షి సందర్శనమే లేకుంటే నేను అరవిందుల దర్శనం చేసుకొనే వాడిని కాదు" అన్నాడు శాస్త్రి. మూడవ గురువు శ్రీ అరవిందులు. 1914లో అరవిందాశ్రమ పత్రిక "ఆర్య"ను చదివిన శాస్త్రి అరవిందులను దర్శించాలని కోరిక కలిగి పాండి చేరి వెళ్లి 1917లో మొదటిసారి దర్శించి సంస్కృత శ్లోకాలతో స్తుతించాడు. అరవిందులు శాస్త్రిని "సంస్కృతం కాక వేరే భాష వచ్చునా?" అని అడిగాడు. 1923లో మళ్ళీ ఒకసారి దర్శించి ఆయన బంగారు ఛాయను చూసి అప్రతి భుడయ్యాడు శాస్త్రి. మాతార విందుల కోరికపై చేస్తున్న సంస్కృత ఉపాధ్యాయ పదవికి రాజీనామా చేసి ఆశ్రమంలో చేరి 1953 ఆగస్టు 15 అరవిందుని జన్మదినం నాడు చనిపోయే వరకు 15-8-1953 అక్కడే ఉన్నాడు. అంతరాత్మ ప్రబోధించినప్పుడు మాత్రమే ఏదైనా రాసేవాడు.

టి.వి కపాలి శాస్త్రి అంటే 20వ శతాబ్దపు అరుదైన వేద వేత్త మహా సంస్కృత విద్వాంసుడు అని యీ కాలం వారికి పెద్దగా తెలియదు. ఋగ్వేద విషయంలో కపాలి అపర పరమేశ్వరుడే అని అరవిందులే అన్నారు. అరవిందుల ప్రఖ్యాత ఆంగ్ల కవిత "హు"ను కపాలి శాస్త్రి సంస్కృతంలోకి అనువదించాడు. ఇదీ ఆ కవితలో మొదటిపాదం - "In the blue of the sky, in the green of the forWhose is the Hand that has painted the glow? శాస్త్రిని జ్ఞానాంబునిధి అన్నాడు ఆయన శిష్యుడు చిన్మయి. అరవిందాశ్రమ మదర్ గురించి శాస్త్రి ఆంగ్లంలో "ఫ్లేమ్ ఆ ఫ్ ది వైట్ లైట్"

అనే అపూర్వ గ్రంథం రాశాడు  దీనిని శాస్త్రి కోరికపై చిన్మయి బెంగాలీ భాషలోకి "సదా జ్యోతి శిఖా"గా అనువదించాడు. 1997లో సాక్షి ట్రస్ట్ వారు "అరవింద కపాలి శాస్త్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వేదిక్  కల్చర్" స్థాపించి వేద, అరవిందుల సందేశాన్ని విశ్వ వ్యాప్తం చేశారు.

జీవితకాలమంతా రమణ మహర్షి, అరవింద యోగిల వేదాంతతత్వాన్ని వ్యాపింప జేయటానికే కృషి చేశాడు శాస్త్రి. ఉపాధ్యాయుడుగా అనువాదకునిగా, విశ్లేషకునిగా, వ్యాస రచయితగా కవిగా, తంత్ర శాస్త్ర వేత్తగా శాస్త్రి లబ్ధ ప్రతిష్టుడు. అరవిందుల వద్ద సాధన చేస్తున్నా, శాస్త్రి రమణమహర్షిపై ఆరాధనా భావం వదలలేదు. ఏ క్షేత్రంలో పనిచేసినా శాస్త్రి దాని లోతులు తరిచాడు.  ప్రాచీన భావధారకు అధునాతన విధానానికి గొప్ప సేతువు కపాలి శాస్త్రి. వేదాలలోని మహత్తర భావాలను అంతర్ దృష్టి యోగసాధనలతో వెలికిదీసి లోకానికి అందించిన పూర్ణ పురుషుడు శాస్త్రి.  ఋగ్వేద ప్రధమ అస్టకానికి కపాలి శాస్త్రి సంస్కృతంలో రచించిన వ్యాఖ్యానం "ఋగ్భాష్య భూమిక" అనితర సాధ్యమైనదిగా ప్రసిద్ధి చెందింది.  సాయనా చార్యుల కర్మ సిద్ధాంతానికి అతీతంగా రాసిన వ్యాఖ్య ఇది. ఇది ఆంగ్లంలోనూ వెలువడింది అందుకనే 20వ శతాబ్దపు అత్యుత్తమ సంస్కృత వేదవేత్తగా కపాలి శాస్త్రిని గౌరవిస్తారు.  వేదంలోని స్వర్ణమయ కాంతులను దర్శించి, లోకానికి ఆదర్శన భాగ్యాన్ని ప్రసాదించినవాడు శాస్త్రి.  వేద, తంత్ర, ఉపనిషత్తుల విజ్ఞాన బాండాగారాన్ని తెరచి ఆ దివ్య నిధిని లోకానికి అందించిన అనితర సాధ్య సాధకుడు శాస్త్రి.  ఆయన మంత్రాలతో దేవతలను ఆహ్వానిస్తుంటే క్షణం ఆలస్యం చేయకుండా అక్కడ ప్రత్యక్షమయ్యేవారు దేవతలు.  ఉపనిషత్తులు ఆత్మవిద్యా సాధనకు కరదీపికలు అని అరవిందులు భావించినట్లే శాస్త్రీజీ కూడా భావించాడు.

24 సంవత్సరాలు పాండిచ్చేరిలో శ్రీ మాతారవిందుల అంతేవాసిగా ఉండి అరవిందుల పూర్ణయోగ సాధనలో పండిపోయి దాన్ని గొప్పగా ప్రచారం చేశాడు శాస్త్రి. శాస్త్రి రాసిన గ్రంథాల వివరాలు–

సంస్కృత గ్రంధాలు–1ఋగ్వేద భాష్య –సిద్ధాంజన –ఋగ్ భాష్య భూమిక, 2–ఋగ్వేద సంహిత –మొదటి అష్టకం –సంస్కృతంలో పదం అర్ధం భాష్యం వివరణ, 3–వాసిష్టమునిరాసైనా –ఉమాసహస్ర కావ్యం –ఆయన జీవిత చరిత్ర వాసిష్ఠ వైభవం అనే కాపాలి శాస్త్రి రచన, 4–సంస్కృత మంత్రాలు శ్లోకాలు –వ్యాఖ్యానం అనువాదం, 5–షట్ దర్శన భాష్యం, రమణగీతప్రకాశం,  సావిత్రి, 6–కొన్ని తెలుగు సంస్కృత రచనలు.

ఆంగ్లంలో –లైట్స్ ఆన్  ది వేదాస్, ఉపనిషత్స్, లైట్స్ ఆన్ టీచింగ్స్  వేదిక్  సిక్రెట్స్ ఇన్ కాంపాక్ట్ ఫార్మ్, ఫర్దర్ లైట్స్ ఆన్ ది వేదాస్, ది మహర్షి మొదలైనవి. కపాల శాస్త్రి పేరు ప్రతిభ 1953లో ఆయన చనిపోయిన తర్వాత లోకానికి బాగా తెలిసింది.❁




## 288) పతంజలి భాష్య వ్యాఖ్యాత- పద్మ భూషణ్ - గోపీ నాధ్ కవిరాజ్ -1887-1976

బెంగాల్ తత్వ వేత్త వైకుంఠ నాద కుమారుడే గోపీనాధ కవి రాజ్. ప్రస్తుత బంగ్లాదేశ్‌లోని ఢాకా జిల్లా ధర్మరాయ్ గ్రామంలో జన్మించాడు. అక్కడే ప్రాధమిక విద్య పూర్తిచేసి ఢాకాలోని కె.ఎల్.జూబిలీ హై స్కూల్‌లో 7వ తరగతిలో చేరి 10వ తరగతి పాసైనాడు. ఇంటిపేరు బాగ్చి. కవి రాజ్ ఆయన బిరుదు.


1906లో జైపూర్ చేరి నాలుగేళ్ళు మహారాజా కాలేజిలో చదివి డిగ్రీ పాసయ్యాడు. అలహాబాద్ యూనివర్సిటీ నుండి ఎం.ఏ. పొందాడు. గురువులు మధుసూదన ఓఝా, షాశ్ధర్ తర్క చూడామణి. తరువాత వారణాసిలోని దేవనాధ పురం చేరి ఎం.ఏ. డిస్టింక్షన్‌లో పాసైనాడు. వారణాసిలో చివరి ఏడాది చదువు ఆర్థర్ వెనిస్ వద్ద సాగింది. ఆయన ఈయన్ను వారణాసి సంస్కృత కాలేజి సరస్వతిభవన్ లైబ్రరీకి లైబ్రేరియన్‌గా నియమించాడు. ఈ కాలంలో తంత్ర శాస్త్రంపై దృష్టి పెట్టాడు. వారణాసిలో అనేక తంత్ర శాస్త్రాలను అధ్యయనం చేశాడు. 1918లో శ్రీ విశుద్ధానంద భారతి స్వామిని దర్శించి, ఆయన టిబెట్ దగ్గర జ్ఞాన్ గంజ్‌లో చూపిన యోగ విన్యాసాలకు ఆశ్చర్యపడ్డాడు.

1924లో సంస్కృత కాలేజి ప్రిన్సిపాల్ అయి, తర్వాత వారణాసిలోని సంపూర్ణానంద సంస్కృత యూనివర్సిటి ప్రిన్సిపాల్ అయ్యాడు. సరస్వతి భవన్ గ్రంథమాలకు ఎడిటర్ అయ్యాడు. రిసెర్చ్ మీద అమితాసక్తి ఉండటం, స్వీయ ఆధ్యాత్మికానుభవ సాధనకోసం స్వచ్ఛందంగా 1937లో గురువు విశుద్ధానంద మరణం తర్వాత పదవీ విరమణ చేశాడు. తర్వాత పూర్తికాలాన్ని తంత్ర సాధన, పరిశోధనలో గడిపాడు. వారణాసిలోని గురువుగారి ఆశ్రమ సంరక్షణ చేస్తూ, కాశీపై అమిత భక్తితో అక్కడే ఉండిపోయాడు. పద్మ విభూషణ్ స్వీకరించటానికి మాత్రమే కాశీని వదిలి వెళ్ళాడు అంతే. అనిర్వణ్ అనే విద్వాంసునితో కలిసి కాశ్మీర్ శైవ మతాన్ని అధ్యయనం చేయటానికే కాలం వెచ్చించాడు. జీవిత చరమాంకంలో 1928లో మొదటిసారి దర్శించిన మాతా ఆనంద మాయికి గాధ భక్తుడైపోయాడు.

సంస్కృత భాషా సేవకు 1934లో మహా మహోపాధ్యాయ బిరుదును పొందాడు. తర్వాత వారణాసిలోని వారణాసీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన "యోగ – తంత్ర డిపార్ట్మెంట్‌కు అధిపతిగా 1964 నుండి 1969 వరకు పని చేశాడు. ఆరోగ్యం సహకరించక పదవికి రాజీనామా చేసి భాదైని ప్రాంతంలో ఉన్న మాతా ఆనంద మాయి ఆశ్రమంలో గడిపాడు.

తూర్పు బెంగాల్‌లో విద్వద్ వంశానికి చెందిన కుసుమ కుమారిని 1900లో వివాహమాడి ఇద్దరు పిల్లలకు తండ్రి అయ్యాడు. గోపీనాధ కవిరాజ్ 1–భారతీయ సంస్కృతీ ఔర్ సాధన, 2–తాన్త్రిక్ వాఙ్మ మే శాక్త దృష్టి, 3–శ్రీ కృష్ణ ప్రసంగ, 4–కాశీకీ సారస్వత్ సాధన, 5–పత్రావళి, 6–స్వ సంవేదన్, 7–అఖండ మహాయోగేర్ పదే, 8–విశుద్ధానంద ప్రసంగ, 9–తాన్త్రిక్ సాహిత్య, 10–సాదు దర్శన్ ఏవం సత్ ప్రసంగ. గోపీ నాద కవి రాజ్‌పై నాలుగు గ్రంథాలు వెలువడినాయి.

మహామహోపాధ్యాయ, పద్మ విభూషణ్‌లతోపాటు కవి రాజ్ డి.లిట్, సాహిత్య వాచస్పతి, దేశికోత్తమ, సాహిత్య అకాడెమి పురస్కారం, సాహిత్య అకాడెమి ఫెలోషిప్ అందుకున్నాడు. 12–6–1976న కవిరాజ్ 89వ ఏట పరమపదించాడు. కేంద్ర ప్రభుత్వం ఆయన గౌరవార్థం ప్రత్యేక స్టాంప్ విడుదల చేసింది.❀



## 289) సమన్వయ యోగ ప్రచారకులు –స్వామి శివానంద (1887–1963)


తమిళనాడులో తిరునల్వేలి వద్ద పత్తమదైలో స్వామి శివానంద సరస్వతి కుప్పుస్వామిగా 8–9–1887న జన్మించారు. తంజావూరు మెడికల్ స్కూల్‌లో చదివి "ఆంబ్రోసియా" అనే మెడికల్ జర్నల్ నడిపారు. మెడిసిన్ పూర్తిచేసి డాక్టర్ ప్రాక్టీస్ చేశారు. పేదలకు ఉచిత చికిత్స చేశారు. మనసులో ఆధ్యాత్మిక భావనలు పూర్తిగా చుట్టుముట్టి 1923లో మలయా వెళ్లి ఇండియా తిరిగి వచ్చి కాశీ ప్రయాగ ఋషీకేశ్ చేరి స్వామి విశ్వానంద సరస్వతిని దర్శించి కైలాన ఆశ్రమ మండలేశ్వర 'విష్ణుదేవానంద'తో కలిసి "విరజా హోమం" నిర్వహించి సన్యాసాశ్రమం స్వీకరించి శివానంద ఆశ్రమనామం పొంది, రిషీకేశ్వర్‌లో లక్షణ ఝూలా వద్ద 1927లో స్థిరపడి

వైద్య కేంద్రంపెట్టి రోగులకు ఉచిత వైద్య సేవ చేస్తూ యాత్రికులకు సాయం చేస్తూ, తపస్సు ధ్యానాలతో గడిపారు.

పరివ్రాజకునిగా దేశమంతా పర్యటించి ఆధ్యాత్మ ప్రబోధం చేస్తూ సంకీర్తన చేస్తూ, అరవిందాశ్రమం దర్శించి స్వామి శుద్ధానంద భారతి దర్శనం చేసి, వారికి "మహర్షి" బిరుదు ప్రదానం చేసి, రమణ మహర్షి జన్మదినాన మహర్షిని దర్శించి వారి సన్నిధిలో భజనలు కీర్తనలు తన్మయత్వంతో పాడి కేదారనాధ్ బద్రీనాధ్ మానస సరోవరాలు దర్శించి ఋషీకేశ్‌కు తిరిగి వచ్చారు. దేశమంతటా ఆయనకు వేలాది శిష్యులేర్పడ్డారు.

1936లో ఋషీకేశ్‌లో "డివైన్ లైఫ్ సొసైటీ"ని ఏర్పాటు చేసి తన ప్రవచనాలను పుస్తకాలుగా ప్రచురించి అందుబాటులోకి తెచ్చారు. సత్యానందం సరస్వతి వంటి శిష్యులేర్పడి "సత్యానందం యోగం" ప్రచారం చేశారు. 1945లో శివానంద ఆయుర్వేద ఫార్మసీ" స్థాపించి ప్రసిద్ధ ఆయుర్వేద మందులను తయారు చేయించారు. "ఆల్ వరల్డ్ రెలిజియన్స్ ఫెడరేషన్"ను "ఆల్ వరల్డ్ సాధున ఫెడరేషన్"ను 1947లో నిర్వహించారు. 1948లో "యోగ వేదాంత ఫారెస్ట్ అకాడెమి" ఏర్పాటు చేశారు. తన యోగాను "యోగా ఆఫ్ సింథసిస్" అంటే సమన్వయ యోగం అంటారు.

భారత రాష్ట్రపతులందరికి స్వామి శివానంద ఆరాధ్యులు. వారి దర్శనంతో తరించామని చెప్పేవారు. స్వామి శివానంద 14-7-1963న మహా సమాధి చెందారు. ఋషీకేశ్‌లో శివానందాశ్రమం తప్పక దర్శించి అనుభూతి పొందాలి. దాదాపుగా 19 60 నుండి వారి పేరు వింటూనే ఉన్నా వారినీ ఆశ్రమాన్ని దర్శించాలన్న గాఢమైన కోరిక మనసులో ఉండిపోయింది. '1998లో మేము అంటే నేనూ మా శ్రీమతి ప్రభావతి, మా అక్కయ్య శ్రీమతి దుర్గ బావగారు శ్రీ వేలూరి వివేకానంద్ కలిసి కేదార్ నాధ్ బద్రీనాధ్ యాత్ర చేసినప్పుడు ఋషీకేశ్‌లో శివానందాశ్రమ సందర్శించి తరించాము వారి గ్రంథాలను అప్పటి ఆశ్రమాధికారి అయిన స్వామీజీ మాకు కానుకగా ప్రసాదించటం మరువ లేని జ్ఞాపకం.❁



## 290) కొత్త సంగీత రూపం "నగ్మ" సృష్టికర్త – వీణ వెంకట గిరియప్ప -1887-1952

కర్ణాటకలో హెగ్గేడ దేవకోటలో పుట్టి మైసూర్ పాలస్ ఆర్కెస్ట్రా డైరెక్టర్ అయిన వీణ వెంకట గిరియప్ప 1887లో పుట్టాడు. వీణలో అసాధారణ ప్రతిభ సాధించి భారత దేశమంతా పర్యటించి తన వీణాగాన మాధుర్యాన్ని పంచాడు. సంస్కృత, తెలుగు, కన్నడాలలో చాలా కృతులు రాశాడు. కొత్త సంగీత రూపం ''నగ్మా''ను సృష్టించాడు. ఇది హిందూస్థానీ గతులను కలిగి ఉండటం విశేషం. ఈయన కృతులలో భువన గాంధారి రాగంలోని "లలితాంబికే శ్రీ మాతే" బేహాగ్ రాగంలో "శ్రీ జయలలితే" ప్రత్యేకంగా పేర్కొనదగినవి.❁

## 291) కాళిదాస జన్మస్థలంపై పరిశోధించిన జ్యోతిష కర్త – లక్ష్మీధర్ కల్లా -1890

కల్లా లక్ష్మీధర శాస్త్రి ఢిల్లీ యూనివర్సిటి సెయింట్ స్టీఫెన్స్ కాలేజి సంస్కృత రీడర్ సంస్కృత విభాగానికి అధ్యక్షునిగా 27 ఏళ్ళు 1922 నుంచి 1947 వరకు పని చేశాడు. ఆయన రాసిన గ్రంథాలలో "ది హోం ఆఫ్ ఆర్యాస్", ది బర్త్ ప్లేస్ ఆఫ్ కాళిదాస, ఆల్ ఇండియా కాశ్మీరి పండిట్ – సోషల్ రిఫార్మ్ మూమెంట్, వేదిక్ పద్ధతి యాజ్ కరెంట్ అమాంగ్ కాశ్మీరి పండిట్స్ మొదలైనవి ఉన్నాయి.❁



## 292) మహాభాష్య ఆంగ్లకర్త – పిఎస్. సుబ్రహ్మణ్య శాస్త్రి – 1890–1978

సంస్కృత, తమిళ భాషలలో అద్వితీయ పండితుడైన డా.పి.ఎస్. సుబ్రహ్మణ్య శాస్త్రి తమిళనాడు తిరుచిరాపల్లిలో చదివి గణితంలో డిగ్రీ పొంది, తిరు వైయ్యార్‌లో శ్రీనివాసరావు హయ్యర్ సెకండరి స్కూల్‌లో లెక్కల మాస్టర్‌గా చేరి, తర్వాత తిరుచిలో నేషనల్ హైస్కూల్‌లో పని చేశాడు. వ్యాకరణ తత్వశాస్త్ర పండితుడైన నీలకంఠ శాస్త్రి వద్ద సంస్కృతం అభ్యసించి, న్యాయ, అలంకార శాస్త్రాలను ఎస్. కుప్పు స్వామి శాస్త్రి వద్ద అధ్యయనం చేశాడు. బెనారస్ హిందూ యూనివర్సిటిలో చిన్నస్వామి శాస్త్రి దగ్గర మీమాంస శాస్త్రం నేర్చి ఎం. యే, పాసై, తర్వాత మద్రాస్‌లో సైదా పేట ట్రెయినింగ్ కాలేజిలో ఎల్. టి.పాసయ్యాడు. సంస్కృతంతో పాటు తమిళాన్నీ బోధించేవాడు.

కుప్పుస్వామి శాస్త్రి ఈయనకు ఇండో ఆర్యన్ భాషల కంపారటివ్ ఫైలాలజిని క్షుణ్ణంగా బోధించాడు. ప్రేరణ పొందిన శాస్త్రి తమిళ భాషను, వ్యాకరణాన్ని సంప్రదాయ బద్ధంగా బోధించేవాడు. "హిస్టరీ ఆఫ్ గ్రమాటికల్ థీరీస్ ఇన్ తమిళ్ అండ్ దెయిర్ రిలేషన్ టు గ్రమాటికల్ లిటరేచర్ ఇన్ సాంస్క్రిట్" అనే పరిశోధన వ్యాసం రాసి 1930లో మద్రాస్ యూనివర్సిటి నుంచి పి.హెచ్.డి. అందుకొన్నాడు. తమిళంలో రాసిన ఈ మొట్టమొదటి పరిశోధనకు మొట్టమొదటి పి.హెచ్ డిని శాస్త్రికి అందజేసింది రికార్డ్‌కు కారణమైంది.

తిరుచి ఎస్.పి.జి.కాలేజిలో ప్రొఫెసర్ ఆఫ్ ఓరిఎంటల్ స్టడీస్‌గా ఫాదర్ గార్డినర్ చేత నియమింపబడిన శాస్త్రి 1917 నుండి 1926 వరకు 9 ఏళ్ళు సేవ చేశాడు. మద్రాస్ యూనివర్సిటి "తమిళ లెక్సికన్" పత్రికకు అసిస్టెంట్ ఎడిటర్‌గా 1932 వరకు ఉండి, చివర్లో ఒక నెల ఎడిటర్‌గా పని చేశాడు. తిరువయ్యార్ రాజా కాలేజి ప్రిన్సిపాల్‌గా 1932 నుంచి 42 వరకు 10 ఏళ్ళు ఉన్నాడు. 1942–47 కాలంలో

అన్నామలై యూనివర్సిటి సంస్కృత శాఖాదిపతిగా సేవలందించాడు. తాను చేరినప్పుడు సుప్తావస్థలో ఉన్న ఆనర్స్ కోర్స్‌కు పునరుజ్జీవనం కల్పించాడు. సంస్కృత, తమిళ భాషాశాస్త్ర బోధనలను తులనాత్మకంగా బోధించి విద్యార్థుల మనసులను ఆకర్షించేవాడు. ఇంగ్లాండ్ సంస్కృత విద్వాంసుడు, ఆక్స్‌ఫర్డ్‌లో బోడేన్ ప్రొఫెసర్ ద్రవిడియన్ ఎటిమలాజికల్ నిఘంటుకు సహా సంపాదకుడు అయిన టి.థామస్ బర్రో అన్నామలై యూనివర్సిటీలో శాస్త్రి సంస్కృత బోధనా క్లాసులకు హాజరై ఆనందాన్ని అనుభవించేవాడు.

సుబ్రహ్మణ్య శాస్త్రికి "తోలక్కాప్పియం" అంటే మహా అభిరుచి దానిని ఇంగ్లీష్‌లోకి అనువదించి ప్రపంచ దృష్టికి తెచ్చి ప్రపంచవ్యాప్త భాషా శాస్త్రవేత్తల అభినందనలు అందుకున్నాడు. తోలక్కాప్పియం అంటే తమిళ సాహిత్యమూ భాషాశాస్త్రము. అందులో వర్ణక్రమం, వర్ణ నిర్మాణం, పద నిర్మాణం, అర్థ విచారం, ఛందస్సు ఉన్నాయి. ఇదేకాక "ఎఝుత్తు", పూను లాదికారం"లను కూడా అనువదిస్తే కుప్పు స్వామి రిసెర్చ్ సెంటర్ ముద్రించింది. "సోల్లాదికారం" అనువాదాన్ని అన్నామలై యూనివర్సిటి ప్రచురించింది. తోలక్కాప్పియంకు శాస్త్రి ఇంగ్లీష్, రోమన్ భాషలలో చేసిన అనువాదాలు ప్రపంచ వ్యాప్త కీర్తి పొందాయి. అన్నామలైలో ఉండగా శాస్త్రి పతంజలి మహాభాష్యాన్ని రెండు భాగాలుగా తమిళంలో, ధ్వన్యాలోకానికి తమిళానువాదం "తూని విలక్కు", హిస్టరీ ఆఫ్ సాంస్క్రిట్ లిటరేచర్ అండ్ లాంగ్వేజ్" తమిళంలో, రెండు భాగాలుగా, ఇంగ్లీష్‌లో తమిళ్ రీడర్ వంటివి రాశాడు.

ఉద్యోగ విరమణ తర్వాత తిరువయ్యూర్ వెళ్లి కంచి మహా స్వాములు శ్రీ శ్రీ చంద్రశేఖర యతీంద్రుల ఆదేశంతో "మహా భాష్యం"ను ఆంగ్లంలోకి 14 భాగాలుగా 4 వేల పేజీలలో అనువాదం ప్రారంభించి 1953లో పూర్తి చేశాడు. మహాభాష్యం లోని ప్రతి సూత్రానికి ముందు విపులమైన ఉపోద్ఘాతం రాసి అందులో వ్యాఖ్యానించబోయే విషయాలను తెలియబరచి, మూలాన్ని దేవ నాగర లిపిలో రాసి ప్రతి శ్లోకాన్ని అనువదించాడు. తన వ్యాఖ్యానానికి ఆధారంగా కయ్యాటుని "ప్రదీప" నాగేశ భట్టు రాసిన "ఉద్యోత"లలోని వివరాలను అధో సూచికలలో పేర్కొన్నాడు. పాఠాంతరాలనూ తెలియజేశాడు. పద సూచీ కూడా చేర్చి కొత్తదనం చేకూర్చాడు.

సుబ్రహ్మణ్య శాస్త్రి విద్వత్తుకు తగిన విద్యారత్న, విద్యానిధి, విద్యాభూషణ, మహా మహోపాధ్యాయ, వాణీ- త్రివేణి బిరుదులూ పొందాడు. వాణీ-త్రివేణి బిరుద ప్రదానం చేస్తూ శ్రీ పరమాచార్య సంస్కృత, తమిళ భాషలు గంగా, యమునా నదులని ఇంగ్లీష్ అంతర్వాహిని అయిన సరస్వతి అని శాస్త్రి ఈ మూడు నదుల త్రివేణీ సంగమం అని కొనియాడారు. నిరంతర పఠనం, రచన ఉన్న మహా విద్వాంసుడు శాస్త్రి. శాస్త్రి జర్మన్ ఫ్రెంచ్, తెలుగు కన్నడ మలయాళంలలో కూడా గొప్ప పాండిత్యం ఉన్నవాడు.

ఇంతటి మహా విద్వాంసుడైన శాస్త్రి. అతి సామాన్య జీవితం గడిపేవాడు. పాకీ పని చేసుకొనే కార్మికుడికి రుగ్, యజుర్, అధర్వ వేదాలను బోధించి నేర్పిన మహా పురుషుడు, మహా సంస్కారి. పైన చెప్పినవే కాక మరొక 40 పుస్తకాలు రాసిన విద్యావేత్త. శ్రీ సుబ్రహ్మణ్య స్వామి విద్యకు ప్రతీక. ఆ నామాన్ని సార్ధకం చేసుకొన్న డా. సుబ్రహ్మణ్య శాస్త్రి 20-5-1973న 88వ ఏట సుబ్రహ్మణ్య స్వామి సన్నిధి చేరాడు.❁

## 293) మణిప్రవాళ స్వరరాగ కర్త - తమస్సేరి కృష్ణన్ భట్టాత్రి 1890-1963

1890లో పుట్టి 1963లో చనిపోయిన తమస్సేరి కృష్ణన్ భట్టాత్రి కేరళలో జన్మించాడు. సంస్కృత మళయాళ భాషలలో గొప్ప ప్రజ్ఞావంతుడు. ఈ రెండు భాషలు కలిపి మణిప్రవాళ శైలిలో కృతులు రాశాడు. బేగడ రాగంలో "శ్రీరాఘవ పరిపాలయ", ఆనంద భైరవిలో "ఆనంద నంద నందనం నమామి" మొదలైనవి ప్రసిద్ధ కీర్తనలు.❁

## 294) వీర శైవ ఉద్గ్రంథ ప్రచురణకర్త - శ్రీ సిద్దేశ్వర శివాచార్య -1890

ఉజ్జయిని వీరశైవ పీఠ జగద్గురువులుగా ఉన్న సిద్దేశ్వర శివాచార్య కాలంలో అత్యంత వైభవంగా వర్ధిల్లింది. 1890 లో కర్ణాటక చిత్ర దుర్గ జిల్లా జగలూరు తాలూకా బంగానహళ్లి గ్రామంలో జన్మించారు. తలిదండ్రులు చిన్న బసవాచార్య, గురు సిద్దాంబే. సిద్ధలింగ పేరుతో అందరూ పిలిచేవారు. 13వ ఏటఉజ్జయినిలో మరుల సిద్దేశ్వర స్వామిని మొదటిసారిగా దర్శించారు. అక్కడి రథోత్సవం కన్నులపండువు అనిపించింది. తలిదండ్రులు తమకుమారుడు జగద్గురువు అవుతాడని ఊహించనేలేదు. ఉజ్జయినిలో శివ పీఠంలో ఆయనకు శివదీక్ష నిచ్చారు. మారుల సిద్దేశ్వర స్వామి దర్శనం చేసి తలిదండ్రులతో స్వగ్రామంకు తిరిగి వచ్చారు.

జగద్గురువులు మరుల సిద్ధ శివాచార్యులు చిన్నారి సిద్ధ లింగనిలో అనేక మహిమలు విభూతి చూశారు. ఈ పిల్లవాడిని పిలిపించి 1906లో 16వ ఏటనే ఉజ్జయిని "సద్ధర్మ పీఠానికి" పీఠాధిపతిని చేసి శ్రీ జగద్గురు సిద్ధలింగ శివాచార్య దీక్షానామ ధేయమిచ్చారు. ఈ యువ జగద్గురువు సంస్కృత, శాస్త్ర, తర్క వేదాంత వ్యాకరణాలను శ్రీ వేద బసవప్ప శాస్త్రి మొదలైనవారు వద్ద నేర్చుకొన్నారు. వీరశైవ వేదాగమాలతో సహా సర్వశాస్త్ర పారంగతులయ్యారు. అన్నిమతాలవారు ఈస్వామికి ఆప్తులయ్యారు. అందరిపై అనుగ్రహం ప్రసరింపజేసి అందరికి అందుబాటులోకి పీఠాన్ని తెచ్చారు. నుదుట ధరించే విభూతికి పరమ వైభవాన్ని తెచ్చారు. పాఠశాల గోశాల, భోజనశాల గ్రంథాలయం నిర్మించారు. నందే భద్రే సురభి, సుశీల సుమన వంటి గోవులను ప్రత్యేకంగా

పెంచారు.  ఆవుపేడతోనే విభూతి తయారు చేయించేవారు.

తాము సంస్కృతంలో మహా నిష్ణాతులైనందున వీరశైవ ధరానుష్టానికి సంస్కృతం యొక్క ఆవశ్యకత గుర్తించి ఆభాషకు విశేష సేవలు చేశారు. 1920లో పీఠంలోనే సంస్కృత వైదిక పాఠశాల ఏర్పాటు చేశారు.  మద్రాస్‌లోని వీరశైవ విద్యార్ధక ఫండ్‌కు 5 వేల రూపాయలు విరాళమిచ్చారు. అనేక పాఠశాలలు స్థాపించారు.  శ్రీవారికి మహారాష్ట్ర భక్తులు మంచి ఆత్మీయులైనారు.   1922లో సద్ధర్మ జ్ఞానగురు విద్యాపీఠం నెలకొల్పి శివాగమాలపై శిక్షణనిస్తూ వేదం, శాస్త్ర, శైవ గ్రంథ ప్రచురణ చేశారు. శ్రీపీఠం లోను శాఖామఠములలోను వేదం, సంగీత పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఇదంతా ఒక అద్భుత గురు కులం అనుభూతిని కలిగిస్తుంది.  పండితులను కళాకారులను విద్యావేత్తలు ఆహ్వానించి సత్కరించి నగదు పారితోషికమిచ్చేవారు. 27ఏళ్ళు అత్యంత సమర్ధవంతంగా సంప్రదాయబద్ధంగా  పీఠాధిపత్యం నిర్వహించి సమాజానికి బహువిధ సేవలు అందించారు.  వారి ముఖ్యోద్దేశ్యం భక్త రక్షణ,వారి  బాగోగులు .తమ పీఠమేకాక మిగిలిన నాలుగు పీఠాలసర్వతోముఖాభి వృద్ధికి కృషి చేసిన మహానుభావులు శ్రీ సిద్ధ లింగ శివాచార్య జగద్గురువులు.  ఉత్తరాధిపతిగా శ్రీ శివానంద శివచార్యులను ప్రతిటించి 1936లో  శివైక్యమయ్యారు.❁

## 295) డాన్ క్విక్సోట్ సంస్కృతానువాదకర్త – ప్రొఫెసర్ జగద్ధార్ జాదూ –1890–1975

ప్రొఫెసర్ జగద్ధార్ జాదూ కాశ్మీర్‌లో బ్రిజేహరాలోని జాదీపూర్‌లో జన్మించి తర్వాత శ్రీనగర్‌కు వలస వెళ్లిన జాదూ కుటుంబానికి చెందినవాడు.  తాత కేశవ భట్టు మహారాజు ఆస్థాన జ్యోతిష్యుడు, అధర్వ వేదంలోని పిప్పలాది శాఖ పరిశోధనలో బ్రూలర్‌కు  సాయపడినవాడు.

జగద్ధార్ పంజాబ్ యూనివర్సిటీ నుంచి సంస్కృతంలో 14వ ఏటా 1904లో ప్రజ్ఞా పరీక్ష పాసై 1920లో అదే యుని వర్సిటీ నుంచి సంస్కృతంలో శాస్త్రి డిగ్రీ సాధించి, 1920లో మాస్టర్ ఆఫ్ ఓరియంటల్ లాంగ్వేజస్ అయ్యాడు. 1921లో ప్రభుత్వ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్‌లోహెడ్ పండిట్‌గా చేరి 1924 వరకు పనిచేసి 1924 నుండి 27 వరకు జమ్మూలోని ప్రిన్స్ ఆఫ్ వేల్స్ కాలేజీలో సంస్కృత బోధిస్తూ, 1931లో శ్రీనగర్ ప్రతాపకాలేజి సంస్కృత ప్రొఫెసర్ అయి మళ్ళీ రీసెర్చ్ డిపార్ట్మెంట్ హెడ్ అయి 1946 వరకు ఉన్నాడు.  తర్వాత ప్రభుత్వ మహిళా కాలేజీలో సంస్కృతం బోధిస్తూ 1951–53 వరకు గద్దెపై  ప్రిన్సిపాల్ అయి 1975 వరకు సేవ చేసి రిటైర్ అయ్యాడు.

1924లో ప్రొఫెసర్ ఆర్ కె కాంజిలాల్‌తో కలసి "నీలమత పురాణం మతం" క్రిటికల్ గ్రంథాన్ని మొట్టమొదటిసారిగా తన సంపాదకత్వంలో ప్రచురించి లోకానికి వెల్లడించి సాహిత్యలోకం నుంచి ప్రశంసలు అందుకొన్నాడు. కాశ్మీర దేశానికి చెందిన ఆధ్యాత్మిక మత ఆచార నమ్మకాల సాంఘిక సాంస్కృతిక సర్వస్వాన్ని లోకానికి మొట్ట మొదటిసారిగా ప్రజలు తెలుసుజానే అవకాశం కల్పించాడు. ఇదికాక బౌద్ధ పంచ దశకం, పరమార్ధ చర్చ అనే బౌద్ధ వేదాంత గ్రంథాలతోబాటు, పంచస్తవి టీకా, పరాత్రింశిక లఘు వృత్తి, పరాత్రిం శిక వివృత్తి, పరాత్రింశిక తాత్పర్య దీపిక మొదలైన అతి విలువైన 16 గ్రంథాలను తన సంపాదకత్వంలో వెలువరించి గొప్ప సాహితీ సేవ చేశాడు. భారతీయ వాస్తు శిల్పకళలపై "ప్రసాద మండపం", ప్రభావతీ ప్రద్యుమ్న నాటకం, చిత్ర ప్రదీప, అలంకార కుతూహల, సోమా శంభుని "కర్మ కాండ క్రమావళి"లకు కూడా సంపాదకత్వం వహించాడు.

జగద్ధార్ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి-జాపనీస్, రష్యన్ సంస్కృత విద్యావేత్తలతో కలిసి 1913లో 20 ఏళ్ళ వయసులో కాశ్మీర్ శైవ గ్రంథాలపై పరిశోధన చేయటం. భాసమహాకవి స్వప్న వాసవి దత్త నాటకాని రష్యన్ భాషలో అనువదించటానికి తోడ్పడ్డాడు. ఇదేకాక ప్రముఖ స్పానిష్ రచయిత సెర్వాంటిస్ రాసిన "డాన్ క్విక్సోట్" నవలను పండిట్ నిత్యానందశాస్త్రితో కలిసి సంస్కృతంలోకి 1936లో అనువాదం చేశాడు. ఒక యూరోపియన్ భాషా గ్రంథాన్ని సంస్కృతంలోకి కాశ్మీరీ భాషలోకి అనువదింపబడిన మొట్టమొదటి గ్రంథమై రికార్డ్ సృష్టించింది. కాశ్మీర కవి పరమానంద రాసిన రాధా స్వయం వరం, సుధామ చరిత్రలను హిందీలోకి అనువదించాడు. ప్రొఫెసర్ జగద్ధార్ జాదూ సంస్కృత పాండిత్య గరిమను మెచ్చి ద్వారకా పీఠాధిపతి 1955లో "విద్యా మార్తాండ" బిరుదు ప్రదానం చేసి సత్కరించారు. ప్రయాగ విద్వత్ పరిషత్ "మహా మహోపాధ్యాయ" బిరుదునిస్తే శ్రీనగర్ శారదా పీఠ రీసెర్చ్ సంస్థ "గౌరవ డాక్టర్ ఆఫ్ ఇండాలజీ" అందజేసింది. 1976లో జమ్మూ కాశ్మీర్ ప్రాదేశిక సంస్కృత పరిషత్ జాదూ గీర్వాణ గరిమకు గౌరవ సత్కారాలు అందించింది. 85వ ఏట జ్ఞాన వయో వృద్ధ పండిత జగద్ధార్ జాదూ జగదాధారునిలో కలిసిపోయాడు.❁

## 296) అద్వైత సభ నిర్వహించిన – శ్రీ చంద్ర శేఖరేంద్ర సరస్వతి –6 (1891–1907)

66వ కామకోటి జగద్గురువులు ఆరవ శ్రీ చంద్ర శేఖరేంద్ర సరస్వతి చెంగల్పట్టుజిల్లా ఉదయం బాక్కంలో స్వామినాధగా జన్మించారు. జననీజనకులు మల్లికాంబిక, సీతారామ పండిత. 7వ ఏటనే పీఠాధిపతి అయ్యారు. మహావక్తగా సుప్రసిద్ధులు. అద్వైత వేదాంతాన్ని వ్యాప్తి చెందించటానికి మొదటిసారిగా "అద్వైత సభ"ను ఏర్పాటు చేసి ఘనంగా నిర్వహించారు. 1907లో వెల్లూర్ జిల్లా కలవైలో సిద్ధి పొందారు.❁

## 297) జాతకాదేశ కర్త – శంకరం నంబూద్రిపాద్ కానిప్పయ్యూర్ –1891

శంకరం నంబూద్రిపాద్ కానిప్పయ్యూర్ గొప్ప వాస్తు శిల్ప శాస్త్రవేత్త. జ్యోతిష పండితుడు, సంస్కృత విద్వాంసుడు, సాంఘిక సంస్కర్త. 1891లో త్రిచూర్ జిల్లా కున్నాంకులంలో జన్మించాడు. గురుకులంలో శాస్త్రాధ్యయనం చేశాడు. పంచాగమ ప్రెస్ పెట్టాడు యోగక్షేమ సభ నిర్వహించాడు. కోచి మహారాజు "పండిత రత్న" బిరుదునిచ్చాడు. జాతకాదేశం, పంచ బోధం, మనుష్యాలయ భాష, తంత్ర సముచ్చయం సంస్కృత మళయాళ నిఘంటు ఔషధ నిఘంటు వంటి సంస్కృత గ్రంథాలు, అనేక మళయాళ గ్రంథాలు రాశాడు.❁

## 298) యక్ష ప్రశ్న నాటక కర్త – జగ్గు సింగరాచార్య –1891

జగ్గు తిరునారాయణ అయ్యంగార్ వెంగడాంబకు 20-11-1891న కర్ణాటకలోని మేల్కొటేలో జగ్గు సింగరార్య జన్మించాడు. మైసూర్ మహారాజా సంస్కృతకాలేజి మేల్కొటే సంస్కృత కాలేజీలలో చదివాడు. సంస్కృతంలో అమోఘ పాండిత్యం సాధించి యదునాథ చంపు కృష్ణ కథారహస్య కావ్యం, దాశరధి దర్శన కావ్యం, వెంకటేశ పాదా వలంబన స్తోత్రం, కావ్యకల్పకం యక్షప్రశ్న నాటకం, శిబి వైభవం శౌరి శౌర్యం నాటకాలు, ధర్మవ్యాధి దర్శనం ఏకాంకిక, అతిమానుష స్తవం, కావ్యకల్పకం మొదలైన చాలా గ్రంథాలు రచించాడు. కన్నడంలో నిధి సర్వావలి బాలినాభాగ్య, వైరముడి వైభవం రాశాడు. మైసూర్ మహారాజా నలువది కృష్ణ రాజా వడియార్, శృంగేరి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖర స్వామి, ఉడిపి పెజావర్ స్వామి మున్నగు వారి చేత సత్కరింపబడ్డాడు. కర్ణాటక రాష్ట్ర పురస్కారంతోబాటు అనేక సాహిత్య సంస్థల నుండి సన్మానాలు పొందాడు. అభినవ భవభూతి, నూతన కాళిదాస, కులభూషణ బిరుదులూ అందుకున్నాడు.

ఆయన రాసిన యదు శైల చంపు తన స్వగ్రామం మేల్కొటేపై ఆరు అధ్యాయాలలో సత్పురపంచ పేరిట రాశాడు. కృష్ణ కథా రహస్యాన్ని కన్నడ తెలుగులలో ముద్రించాడు. ఇది ఎస్ ఎస్ ఎల్ సి కి పాఠ్య గ్రంథంగా ఉన్నది. మూడు ప్రపంచాలతో దాశరధి దర్శనం రాశాడు. మొదటి అధ్యాయానికి పాదుకా పట్టాభిషేక, రెండవ ప్రపంచకానికి చిత్ర కూటోదంత, మూడవదానికి రామ పట్టాభిషేకం అని పేర్లు పెట్టాడు. మహాభారత ధర్మవ్యధ ఉపాఖ్యానాన్ని ధర్మ వ్యధ దర్శన నాటకంగా రచించాడు. మోహాన్ని శ్లేషలో వర్ణించాడు – “పత్నీ మోహ పుత్రమోహార్మోహః –పృధివీ మోహో దేహగే హాది మోహః –ఏవం మోహైర్నాపి నాపై సౌఖ్యం నాశాంతిహ్ –జ్ఞాని తస్మాన్ నైవ ముహ్యత్విహ యేసు”. వీరి శిబి వైభవాన్ని సాహిత్య అకాడెమి ముద్రించింది. శౌరి శౌర్యం భాగవత కృష్ణకథ.❁



## 299) వాసుదేవ కర్ణామృత కర్త – వాసుదేవన్ నంబూద్రి (1891–1947)

1891లో జన్మించిన వాసుదేవన్ నంబూద్రి కవి, వక్త. ఆయన భాగవత ప్రవచనం ఆపాత మధురం. వేదం సకల శాస్త్రాలు కావ్యాలు నేర్చాడు. హరివిలాసంలో సంస్కృత విద్యాలయం స్థాపించాడు. ఈయన భాగవత కథా ప్రశస్తికి మెచ్చి రెండు చేతులకు కోచ్చిరాజు బంగారు వీర శృంఖలాలు బహుమానం ఇచ్చాడు. రవివర్మ "భక్త శిరోమణి" బిరుదునిచ్చాడు. సంస్కృతంలో వాసుదేవ కర్ణామృతం, భాగవత సంగ్రహం, భాగవత సంగ్రహ గాథ, శ్రీధరాచార్య భాగవత మకరందం రాధా మొదలైనవి రచించాడు. సామాన్యుడిని భాగవతంవైపుకు ఆయనలాగా ఆకర్షించేట్లు చేయగలిగిన నేర్పున్న వారెవరూ లేరు. ఆయనపై పి. హెచ్ డి చేశారు. మహా భాగవతోత్తముడు వాసుదేవన్ నంబూద్రి 1947లో చనిపోయాడు.❀



## 300) 34వ శృంగేరి పీఠాధిపతి – శ్రీ శ్రీ చంద్ర శేఖర భారతీ స్వామి – 1892–1954

16–10–1892న గోపాలశాస్త్రి లక్ష్మమ్మ దంపతులకు నరసింహగా శ్రీ చంద్రశేఖర భారతీతీర్థ స్వామి జన్మించారు. 6–4–1912న 20వ ఏట శృంగేరి శారదాపీఠ 34వ పీఠాధిపతిగా అభిషిక్తులయ్యారు. అనుక్షణం ఆత్మదర్శనం పొందుతూ

సమాధి స్థితిలో ఉండేవారు. ఛందస్సుపై అపూర్వ అధికారం ఉండటం వలన అలవోకగా ఎన్నో శ్లోకాలు చెప్పేవారు. వాటిని భక్తులకు అందుబాటులోకి తేవటానికి ముద్రించారు. వాటిలో పాదా వలంబన స్తుతి, నవరత్నమాల, తోటకాష్టోత్తరం, శ్రీమదాచార్యేంద్ర స్తవం, ఆచార్య పాదా వలంబన స్తుతి, దత్త నవరత్న మాలిక. దక్షిణామూర్తి మంత్రమార్కస్తవం, సన్ముక్త భుజంగ స్తుతి మొదలైనవి. శంకరాచార్యుల వివేకా చూడామణికి వ్యాఖ్యానం, భగవద్గీతకు శంకరభాష్యంపై వ్యాఖ్యానం మొదలైన శాస్త్ర గ్రంథ రచన చేశారు.

పాదా వలంబన స్తుతిలో - "స్థితే నూపురమకరాండ పూర్ణే -జగద్గురోః పాద సహస్ర పాత్రే - కిమన్యతో ధా వసి చిత్త భృంగ -ప్రయాహి తత్రైవ రామస్వ నిత్యం. "భావం -ఓ మనస్సనే తుమ్మెదా! అనుగ్రహ గురు పాదపద్మం ఉండగా అటూ ఇటూ దేనికోసమో వెతుకుతావేమిటి. ఆపాద పద్మాలపైనే వ్రాలి చిరకాలం ఉండిపో.

నవరత్నమాల - "కామాది శృంగి పరిచ్ఛేదన వజ్ర పాణే -నామావధూత నిఖిలా ఘ చయో మనశ్వీ-సామాది గిర్భి పరిగీత నిజ స్వరూపః -దృగ్గోచరో భవతు దేశికరాన్ మమాసు". భావం- గురు దేశికులు తక్షణం ప్రత్యక్షం కావాలి. ఇంద్రుడు పిడుగును సంహరించినట్లు నా ఆరుగురు లోపలి శత్రువులను దునుమాడి, ఉపనిషత్ సార సంగ్రహమైన గురుదేవుడు ప్రత్యక్షం కావాలి.

స్వామిజీ జీవితకాలంలో అనేక అద్భుతాలు ప్రదర్శించారు. కళ్ళు లేనివారికి నేత్ర జ్ఞానం బాధితులకు వినికిడి వారి స్పర్శ వలన లభించేవి కనుక వారిని "స్పర్శామాత్ర గురుదేవులు" అని అందరూ చెప్పుకునేవారు. వీరు పీఠాధిపతులుగా ఉన్నకాలంలో శృంగేరి శారదాపీఠం పరమ వైభవాన్ని సాధించింది. ఎందరెందరో తత్వవేత్తలు శాస్త్రవేత్తలు విద్యాధికులు పండితులు రాజకీయ ప్రముఖులు స్వామీజీ సందర్శనం చేసి ఉపశమనం పొందేవారు. అలాంటివారిలో డా.రాజేంద్రప్రసాద్ సర్వేపల్లి రాధాకృష్ణన్, కృష్ణరాజ ఒడియార్ వంటి ప్రముఖులున్నారు 26-9-1954న స్వామీజీ మహాసమాధి చెందారు. ❀

**301) యదు వంశ మహా కావ్యకర్త - గలగరి రామాచార్య -1893**

1893లో కర్నాటక రాష్ట్రంలో బిజాపూర్ జిల్లాలో కృష్ణానదీ తీరాన ఉన్న గలగలి గ్రామంలో రామాచార్య జన్మించాడు. సంస్కృతంలో మహాపండితుడు. రెండు మహాకావ్యాలు రాసిన మహాకవి. 1981లో 88వ ఏట మరణించాడు. ఆయన గురుపరంపర గలగలి కూర్మాచార్య, కృష్ణాకార్య, సత్యధ్యానతీర్ధ స్వామీజీ.

రామాచార్య 1-యదు వంశ మహాకావ్యం, 2-స్వరాజ్య రాత్నాకరః అనే రెండు మహాకావ్యాలను రచించాడు. ఈ రెండూ కాక దేవీ వాసంతి, కోహం అనే గద్య రచనలు చేశాడు. లఘుకావ్యాలుగా 1- దేవ మందిర క్రందనం, 2-ముని-మేనక సంవాదః రచించాడు. పాహిమాం మురళీధర, వెంకటేశశతకం గీతాలను "సతి చింతామణి" అనే సంస్కృత నవలను రాశాడు. కృష్ణకవి రాసిన అలంకార ముక్తావళి, సత్యనాద తీర్ధ రచించిన రుగ్ భాష్య టీకా ప్రకాశ, నరహరి తీర్ధ రచన యమక భారత టీకా, పద్మనాభ తీర్ధుని శ్రీ గీతా తాత్పర్య నిర్ణయ ప్రకాశిక, ఆనంద తీర్ధుని ఆహ్నిక కౌస్తుభ మొదలైన గ్రంథాలకు సంపాదకుడిగా పని చేశాడు.

ప్రయాగలోని భారతీయ సంస్కృత సంస్థాన పరిషత్ రామాచార్యకు "మహా మహోపాధ్యాయ బిరుదునిచ్చి సత్కరిస్తే, ఎడిటోరియల్ బోర్డ్ ఆఫ్ సంస్కృతం "సాహిత్య రత్న"ను, సనాతన ధర్మ మండలి "అభినవ బాణ"ను, అఖిల భారత సాహిత్య సమ్మేళనంలో "కవికుల తిలక" బిరుదునిచ్చి సన్మానించాయి. సంస్కృత సేవకు రామాచార్య రాష్ట్రపతి పురస్కారాన్నీ అందుకొన్నాడు.❁



## 302) సంస్కృత డైరీ రాసిన యాత్రా సాహిత్య పిత – రాహుల్ సాంకృత్యాయన్ -1893-1963

కేదార్ నాథ పాండే– రాహుల్ సాంకృత్యాయన్ మహా పండిత రాహుల్ సాంకృత్యాయన్ అంటే నిరంతర యాత్రాశీలి, వ్యాసకర్త యాత్రకు సాహిత్య గౌరవం కలిగించిన బహుభాషావేత్త. 9-4-1893న తూర్పు ఉత్తర ప్రదేశ్‌లో అజాం ఘర్ జిల్లాలో కేదార్ నాథ్ పాండేగా జన్మించాడు. స్థానికంగా విద్య ప్రారంభించినా తర్వాత సంస్కృత హిందీ ఇంగ్లిష్, పాళీ భోజ్ పూరి, ఉర్దూ, పర్షియన్ అరబిక్, తమిళం కన్నడ, టిబెటన్, సింహళీస్, ఫ్రెంచ్, రష్యన్ భాషలు నేర్చి రాయగల సమర్ధత సాధించిన బహు భాషా వేత్త. ప్రారంభంలో ఆర్య సమాజం దయానంద సరస్వతి బోధనలపై ఆకర్షణ ఉండేది. తర్వాత బౌద్ధం అతనిని పూర్తిగా మార్చేసింది. దేవునిపై నమ్మకం లేకపోయినా పునర్జన్మను విశ్వసించాడు. తర్వాత మార్క్సిస్ట్ సోషలిజం మోజులో పడి దాన్నీ వదిలేశాడు. ఆయన రాసిన "దర్శన్ – దిగ్దర్శన్" గ్రంథం ప్రపంచ తత్వ శాస్త్రాన్ని కూలంకషంగా వివరించింది. ఇందులో రెండవ భాగం – "ధర్మ కృతి ప్రమాణ వార్తికం"కు అంకితమై రాసినట్లు కనిపిస్తుంది. దీని మూలాన్ని టిబెట్ ఆ భాషలో ఉంటే సేకరించాడు.

**విస్తృత యాత్రికుడు**

విస్తృత నిరంతర యాత్రికుడైన సాంకృత్యాయన్ లడక్, కిన్ననూర్, కాశ్మీర్, నేపాల్, టిబెట్, శ్రీలంక, ఇరాన్, చైనా రష్యాలను సందర్శించాడు. చాలాకాలం బీహార్‌లో శరన్ జిల్లా పరసాగడ్‌లో ఉన్నాడు. ఈ గ్రామ ప్రవేశ ద్వారానికి "రాహుల్ గేట్" అని పేరు పెట్టారు. టిబెట్‌కు బౌద్ధ సన్యాసిగా వెళ్ళాడు. చాలాసార్లు టిబెట్ వెళ్లి విలువైన పాళీ, సంస్కృత వ్రాత రాతులను, చిత్రాలను సేకరించి తెచ్చుకొన్నాడు. ఇవి విక్రమశిల, నలందా విశ్వ విద్యాలయాలకు చెందినవి. వీటిని ఇండియాకు 23 కంచర గాడిదలపై తెచ్చి పాట్నా మ్యూజియంలో భద్ర పరచాడు.

## బహుభాషా గ్రంథ రచన

అనేక భాషలలో నిష్ణాతుడైన రాహుల్ గొప్ప సృజనశీలి. 20లలో రచన ప్రారంభించి దాదాపు 100 పుస్తకాలు అనేక విషయాలపై-సోషియాలజీ, హిస్టరీ ఫిలాసఫీ, బౌద్ధం టిబెటాలజీ, లేక్సికోగ్రఫీ వ్యాకరణం, సైన్స్ జానపదం నాటకం వ్యాసం రాజకీయం మొదలైన వాటిపై రాశాడు. ప్రాకృతంలోని "మైఝిమ నికాయ్"ను హిందీలోకి అనువదించాడు. రాహుల్ ప్రసిద్ధ రచన హిందీలో రాసిన "ఓల్గా సే గంగ". చార్త్రిత్రాత్మక ఫిక్షన్. ఇందులో క్రీ.పూ 6000 కాలం నుండి 1942 వరకు గాంధీ క్విట్ ఇండియా ఉద్యమం వరకు చరిత్ర ఉంది. అన్నిభాషలలోకి అనువాదం పొంది ప్రపంచ ప్రసిద్ధమైంది. ఆయన రాసిన పుస్తకాలు 10కి పైగా బెంగాలీలోకి అనువాదం పొందాయి. చరిత్రకారుడు కాశీప్రసాద్ జైస్వాల్ సాంకృత్యాయన్‌ను గౌతమ బుద్ధునితో సమానం అన్నాడు. స్కూలు విద్య లేకపోయినా అన్నీ స్వయంగా సాధించాడు. సోవియెట్ రష్యా వెళ్లి లెనిన్ గ్రాడ్ యూనివర్సిటిలో ఇండాలజీ ప్రొఫెసర్‌గా 1937-38 వరకు మళ్ళీ 1947-48 వరకు పని చేశాడు.

**వివాహం వగైరా**

బాల్యంలోనే రాహుల్ వివాహం "సంతోషి"తో జరిగింది. ఆ తర్వాత ఆ బాల వధువు ఏమైందో ఆయనకు తెలియదు. వయసు 40లలో రెండోసారి రష్యా వెళ్ళినప్పుడు సంస్కృత, ఫ్రెంచ్, ఇంగ్లీష్, రష్యన్ భాషలలో ప్రవీణురాలైన మంగోలియన్ స్కాలర్ "లోలా"తో సన్నిహితంగా ఉన్నట్లు ఆయన డైరీ వలన తెలుస్తోంది. టిబెటన్-సంస్కృత

నిఘంటు నిర్మాణానికి ఆమె ఆయనకు తోడ్పడింది. ఇద్దరూ పెళ్ళిచేసుకొని "ఇగార్" అనే కొడుకుకు జన్మనిచ్చారు. ఆయనతో వాళ్ళిద్దరూ ఇండియా రావటానికి స్టాలిన్ రష్యా అనుమతినివ్వ లేదు. తర్వాత కమల అనే ఇండియన్ నేపాలీని పెళ్లి చేసుకొని జయ, జేత అనే అమ్మాయిని అబ్బాయిని సంతానంగా పొందాడు. జేత నార్త్ బెంగాల్ యూనివర్సిటిలో ఎకనామిక్స్ ప్రొఫెసర్. జయ డెహ్రాడూన్‌లో ఉండేది.

## సుదీర్ఘ యాత్ర

రాహుల్ శ్రీలంక యూనివర్సిటిలో పని చేస్తుండగా విపరీతమైన మాదుమేహ వ్యాధి, అతి రక్తపు పోటు వలన గుండెపోటు వచ్చి డార్జిలింగ్‌లో 1963 ఏప్రిల్ 14న 70వ ఏట సుదీర్ఘ యాత్రలో సుదూర తీరాలకు చేరుకొన్నాడు. ఆయన పేర అవార్డులను అందజేస్తున్నారు.

### సాంకృత్యాయన్ సాహిత్య సర్వస్వం

హిందీలో దివోదాస్, మధుర స్వప్న, విస్మృతి యాత్ర మొదలైన 8 నవలలు, వోల్గా సే గంగ, బహురంగి మధుపురి వంటి 4 కథా సంపుటులు, 3 భాగాలుగా "మేరీ జీవన్ యాత్ర" అనే స్వీయ చరిత్ర, సర్దార్ ప్రిద్వి సింగ్, బచ్ పన్ కి స్మృతి యాన్, కప్తాన్‌లాల్, మహామానవ్ బుద్ధ, స్టాలిన్, లెనిన్ మొదలైన 16 జీవిత చరిత్రలు, మాన్సిక్ గులామీ, రుగ్వేదిక్ ఆర్య, ఘుమక్కార్ శాస్త్ర, దర్శన్ – దిగ్దర్శన్, మధ్య ఆసియా కా ఇతిహాస్ సామ్యవాద్ హి కోన్ వంటి ఇతర రచనలు, భోజ్పురి భాషలో 2, నేపాలీ భాషలో 1, టిబెటన్ భాషలో 7 పుస్తకాలు రచించాడు.

బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రచనలు చేసినందుకు మూడుసార్లు అరెస్ట్ అయిన జాతీయ వాది రాహుల్. ఆయన విజ్ఞానం మహా పండితుని విజ్ఞానం. 1963లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం అందజేసి సన్మానించింది. తన దిన చర్యను డైరీలో నిత్యం సంస్కృతంలోనే రాసుకోనేవాడు. దీని ఆధారంగానే అనేక రచనలు చేయగలిగాడు సాంకృత్యాయన్.❁



## 303) శిలాతామ్ర శాసన లిపి పరిశోధకుడు – పద్మభూషణ్ వాసుదేవ విష్ణుమిరాశీ -1893-1995

డా.వాసుదేవ విష్ణు మిరాసీ మహారాష్ట్రలో మధ్యతరగతి కార్హేడ్ బ్రాహ్మణ కుటుంబంలో రత్నగిరి జిల్లా దియోగడ్ తాలూకా కావెల్ గ్రామంలో 1893 మార్చి 13న జన్మించాడు. 82 జీవించి 3-4-1985లో మరణించాడు. శాసన పరిశోధకుడు సంస్కృత విద్వాంసుడు, ఇండాలజిస్ట్. 20వ శతాబ్దపు మహా విద్వాంసులలో పేరెన్నిక గన్నవాడు. ప్రాచీన భారత దేశపు నాణాలు, శిలా తామ్ర శాసన పరిశోధకుడు. వీరి మహా విద్వత్తుకు బ్రిటిష్ ప్రభుత్వం 1941లో మహా మహోపాధ్యాయ బిరుదునిచ్చి సత్కరిస్తే భారత స్వాతంత్ర్యానంతరం భారత రాష్ట్రపతి 1975లో పద్మ భూషణ్ పురస్కారంతో సత్కరించారు. కొలాపూర్‌లో ప్రాధమిక విద్య పూర్తిచేసి పూణే చేరి డిగ్రీ పాసై, పూనాలోని దక్కన్ కాలేజి నుండి సంస్కృతం లో ఎం.ఏ.పొందాడు. బొంబాయి వెళ్లి, ఎల్ఫిన్ స్టోన్ కాలేజిలో సంస్కృత ప్రొఫెసర్‌గా పని చేశాడు. తర్వాత నాగపూర్‌లో సంస్కృత పీఠాదిపతి పోస్ట్‌కు ఆహ్వానింపబడి చేరాడు. 1942లో ప్రిన్సిపాల్ అయ్యాడు. 1947 నుంచి 1950 వరకు అమ్రోతిలోని విదర్భ మహా విద్యాలయం ప్రిన్సిపాల్‌గా పని చేశాడు. 1957 నుంచి 9 ఏళ్ళు 1966 వరకు నాగపూర్ యూనివర్సిటిలో "ఆనరరి ప్రొఫెసర్ ఆఫ్ ఏన్షేంట్ ఇండియన్ కల్చర్ అండ్ హిస్టరీ మరియు హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచింగ్ ఇన్ హుమానిటీస్‌గా సేవలు అందజేశాడు.


మిరాశీ 30కి పైగా ఇంగ్లీష్ హిందీ మరాటీ భాషలలో పరిశోధనా పత్రాలు రాశాడు. 275కు పైగా ఇండలాజికల్ జర్నల్స్‌లో వ్యాసాలూ రాశాడు. ఆయన రాసిన 'ఇన్ స్క్రిప్షన్స్ ఆఫ్ ది కాలచూరి – చేది ఎరా" బాగా ప్రసిద్ధి పొందింది. "ఇన్ స్క్రిప్షన్స్ ఆఫ్ వాకాటాస్", "ఇన్ స్క్రి ప్షన్స్ ఆఫ్ సిలహరాస్", శాతవాహన -క్షాత్రప శిలాశాసనాస్" అన్నీ అన్నే. విలువైన సమాచారంతో శోభిల్లేవే. ఇండాలజీ, కాళిదాస, భవభూతి మహాకవులపైనా గ్రంథాలూ వ్యాసాలూ రాశాడు.

లార్డ్ లిన్ లిత్ గొ 1941లో మిరాశీకి "మహా మహోపాధ్యాయ" బిరుదునిచ్చి సత్కరించాడు. 1966లో సంస్కృత భాషా సేవకు. రాష్ట్రపతి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. "1977 భారత రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ ఆలీఅహ్మద్ "పద్మ భూషణ్" పురస్కారం ప్రదానం చేసి గౌరవించారు. 1970లో భారత పురాతత్వ శాఖ గౌరవ కరేస్పాండెంట్ పదివినిచ్చి గౌరవించింది. నాగపూర్ సాగర్ మొదలైన యూనివర్సిటీలు డి.లిట్ ప్రదానం చేశాయి. ఆలిండియా హిస్టారికాన్గ్రేస్ అధ్యక్షునిగా ఉన్నాడు. నూమేస్మాటిక్సొసైటీ ఆఫ్ ఇండియా ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఫెలోషిప్ అందజేసి సత్కరించాయి.❋



### 304) "జయతి జయతి భారత మాత" దేశ భక్తి గీత కర్త – మయూరం విశ్వనాధ శాస్త్రి -1893-1958

తమిళనాడులోని మయూరం గ్రామంలో 1893లో పుట్టిన విశ్వనాధశాస్త్రి రచించిన దేశభక్తి గీతం "జయతి జయతి భారత మాత"తో సుప్రసిద్ధుడయ్యాడు. ఆనాడు పాడని కర్ణాటక సంగీత గాయకులు ఉండేవారు కాదు. నామక్కల్ నరసింహ అయ్యంగార్, కాసవాద్యం వెంకట రామ అయ్యంగార్ వంటి వద్ద సంగీతం అభ్యసించాడు. తెలుగు సంస్కృతాలలో 160 దాకా కృతులు రాశాడు. 65 ఏళ్ళు జీవించి మరణించాడు.❁



### 305) నడయాడే దైవం దుర్గా స్తోత్రకర్త – కంచిపరమాచార్య శ్రీ శ్రీ చంద్ర శేఖరసరస్వతి యతీంద్ర మహాస్వాముల వారు -1894-1994

కంచి కామకోటి 68వ పీఠాధీశ్వరులు శ్రీ శ్రీ చంద్ర శేఖరేంద్ర సరస్వతీ మహాస్వాములవారు సర్వ దేవతా స్వరూపులు. నేలమీద నడిచే దైవం. స్వామి ఉనికి కృత యుగంకంటే గొప్పది. "కృతా దవ్యతి రిచ్యతే". స్వామి భక్తిజ్ఞాన వైరాగ్యాల అవతారమే. స్వామి దర్శనం సర్వ దేవతా దర్శనమే. స్వామిని గురించి ఒక భక్త కవి – "సమాగతో నా భావ దీక్షణ–ప్రక్షీణ సర్వాక్షమలోమలాన్తరః –నిక్షిప్త చిత్తో భాగవత్యధోక్షజే –ముముక్షు వర్యో భవతి క్షణేన వై" అని స్తుతించాడు. అంటే – "మీ కడగంటి చూపులు ప్రసరిస్తే చాలు ఇంద్రియ చాపల్యం నశిస్తుంది. మనస్సు పరి శుద్ధమవుతుంది. అంతఃకరణం మీ పాదపద్మ సంలగ్నమౌతుంది. ఇదంతా మీ కడగంటి చూపు ప్రసరించిన క్షణ కాలంలోనే జరిగిపోతుంది. కంచిలో శ్రీ కామాక్షీదేవి అమ్మవారు స్వామి రూపంలో మనమధ్య నడయాడుతుంది. కాంచీ కామకోటి యతి రాజదర్శనంతో పునరపి జననం

పునరపి మరణం ఉండదని గాఢమైన విశ్వాసం. చందోలులోని మహా తపస్సంపన్నులు బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రి గారు స్వామిని "నడుస్తున్న బ్రహ్మ పదార్థం. వారిని గూర్చి అసలు చెప్పటం అసాధ్యం". యతో వాచో నివర్తన్తే" అన్న ఉపనిషద్వాక్యం మహాస్వాముల యెడ పూర్ణ సత్యం" అన్నారు.

సూర్యుడు అధి దేవతయై వృశ్చిక రాశికి చెందిన అనూరాధ నక్షత్రంలో మహాస్వామి జన్మించారు. "నాన్ మురుగన్" అంటే నేను షణ్ముఖుడు అయిన సుబ్రహ్మణ్య స్వామిని" అని వారే చెప్పుకొన్నారు. స్వామి పూర్వాశ్రమనామం స్వామి నాధుడే అనగా సుబ్రహ్మణ్యేశ్వరుడే. స్వాములందరికి స్వామి స్వామినాధుడు–సుబ్రహ్మణ్యుడే. మధురకవి శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు గారు స్వామివారిని "శ్రీమద్భారత కాంచీ–దామాయిత కాంచి నగర దామునకు నవి –ద్యామయ హరణ సుధాకల–శీ మంజుల దర్శనునకు సిద్ధ పదునకున్" అని – "పరమశమ నిరతునకు శం –కర దేశిక కామకోటి కల్పిత పీఠ–స్థిర మంగళ దీపశ్రీ –చరణునకున్ మాదృశ ప్రసన్న శివునకున్" అని కైమోడ్పు పలికారు. ఎవరైనా తలిదండ్రులతో స్వామి దర్శనానికి వెడితే ముందుగా తలిదండ్రులకు నమస్కరింపజేసి తరువాత తమకు నమస్కరించమని సంస్కార యుతంగా చెప్పేవారు. స్వామివారు శంకర భగవత్ పాదుల వారిలా అద్వైత మత ప్రచారాన్ని చేసినా సర్వమతములు స్వామివారికి సమ్మతములే. ఇతరమతాలకు అద్వైతం అంటే కన్నేర్రగా ఉన్నా అద్వైతానికి దేనిలోనూ విరోధం కనిపించదు. అద్వైతం అంటే "సర్వతః సంప్లుతోదక స్థితి" అన్నారు. శివ విష్ణువుల అభేదాన్ని స్వాములవారు తరచుగా చెబుతూ కాళిదాస మహాకవి శ్లోకం ఉదహరిస్తారు అని శ్రీ విశాఖ తెలియజేశారు. "ఏకైవ మూర్తి ర్బిభిధే త్రిదాసా –సామాన్య మేషాం ప్రథమావరత్వం – విష్ణో ర్హరస్తస్య హరిః కదాచిత్ –వేదాస్తయోస్తావపి ధాతురాద్యాః".

మనం ఏదో మూట కట్టుకొని ఈలోకానికి వచ్చామని, ఆ మూటను ఇక్కడే దులిపేసుకొని వెళ్ళిపోవాలని, దానికి దారి చూపేది త్రిపుర సుందరి అని, ఆమె అనుగ్రహం కోసం పరితపించమని బోధిస్తారు స్వామి. "ఆమ్ర తరుమూల వసతే–రాదిమ పురుషస్య నయన పీయూషం –ఆరబ్ద యవ్వనోత్సవ –మామ్నాయ రహస్య మంతరవలంబే" అన్న మూక కవి శ్లోకాన్ని పదే పదే గుర్తు చేస్తారు. శ్రీ వారి జ్ఞాపక శక్తి పరమాద్భుతం. ఆర్యా ద్విశతి గురించి చెబుతుండగా అదెక్కడ దొరుకుతుందని శ్రీ విశాఖ అడిగినప్పుడు అలవోకగా "వందే గజేంద్ర వదనం – వామాంకా రూఢ వల్లభాశ్లిష్టం–కుంకుమ పరాగ శోణం–కువలయి నీరజకోరకాపీడం"తో మొదలుపెట్టి చాలా శ్లోకాలు చెప్పారట. ఇది శ్రీ శంకరాచార్యుల "ప్రపంచ సారం"లో ఉన్నదని ఆర్యా వృత్తంలో వ్రాయబదిందని ఎరుక పరచారు. "వ్యక్తాన్ని సాధన గా చేసుకొని అవ్యక్తాన్ని సాధించాలి" అన్నది స్వామి ముఖ్య బోధ అంటే గురువు ద్వారానే ఏదైనా సాధించాలని భావం. ఉపాసనం

అంటే ధ్యానమే- "ధ్యానమేవ ఉపాసనం" అంటారు. "మనం చేసే అన్వేషణే ఆనందం సుఖం" అంటారు. శివాజీ మహారాజు కంచి ఆచార్యులవారికి కనకాభిషేకం చేసి కప్పిన శాలువాను భద్రంగా దాచి తనకు కనకాభిషేకం చేసే సమయంలో బయటకు తీసి కప్పుకొని ఇంతకంటే గొప్ప కనకాభిషేకం ఉంటుందా అని ప్రశ్నించారు. స్వామి నిత్య ఉపవాస కృశి. ఉజ్వల తపోనిస్టాగరిస్టులు, మహా తేజస్వి, మౌని, బ్రహ్మ విద్యా సంప్రదాయ ప్రవర్తకులు, మంత్ర ద్రష్ట అయిన రుషి పుంగవులు. ఇవే వారిలో వెలుగుకు ముఖ్య కారణం అంటారు శ్రీ విశాఖ.

మహా తపో సంపన్నులు బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రి గారు పరమాచార్యులపై రచించిన ఉపాస్తిలో

1-స్వస్మై నమః పదమహం కరవాణి వాణి-మత్తో నహీతర దనేక మద్వైకకం వా
అస్మాదసత్తదధివా స్వరస ప్రాసారా - దావివత్వమాకమః ప్రతి యోగి త్వం త్వం.

2-శ్రీచంద్ర శేఖర పదాంకిత సంయమీంద్ర-శ్రీ పూజ్య పాద మహనీయ వపుర్విశేషే
నారాయణాధిపద రాఘవ పూర్వ నామ - ప్రహ్వం వపుర్భవతు సంవ్యవహారి హారి

అని సంస్తుతించారు. అలాంటి మహాస్వాముల జీవిత చరిత్ర తెలుసుకొన్న జీవితం ధన్యం. ఆ చరిత్రతోపాటు వారి గీర్వాణ కవితనూ తరువాత దర్శిద్దాం.

**జనన విద్యాభ్యాసాలు**

కంచికామకోటి 68వ పీతాదిపతులు శ్రీ శ్రీ చంద్ర శేఖర మహాస్వామి వారు 20-5-1894న అనూరాధా నక్షత్రంలో తమిళనాడు దక్షిణ ఆర్కాట్ జిల్లాలోని విల్లిపురంలో సనాతన సద్బ్రాహ్మణ కుటుంబంలో శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రి అనే జిల్లా విద్యాశాఖాధికారి గారికి ధర్మపత్ని శ్రీమతి మహాలక్ష్మికి జన్మించారు. ఇలవేల్పు పేరుగా స్వామినాధన్ అనే పేరుపెట్టారు. దక్షిణ ఆర్కాటు జిల్లాలోని తిండివనంలోని అమెరికన్ మిషన్ హైస్కూల్‌లో ప్రాధమిక విద్య నేర్చారు. అపూర్వ మేధావి అవటంతో అన్నిటా మొదటి స్థానం పొందేవాడు. 1905లో ఉపనయనం జరిగింది. అన్న సదాశివ శాస్త్రిని అందరూ "శివం సార్" అని పిలిచేవారు.

**మహర్జాతకులు -68వ పీతాదిపతులు**

తండ్రి స్వామినాధన్ కొడుకు జాతకాన్ని ఒక గొప్ప జ్యోతిష్ శాస్త్రవేత్తకు చూపించాడు. ఆయన అమాంతం కుర్రాడి పాదాలపై వ్రాలి "ఏదో ఒక రోజు ప్రపంచమంతా ఈ కుర్రాడి పాదాలపై వ్రాలుతుంది" అని చెప్పాడు. కంచి 66వ పీఠాధిపతి తిండీవనం సమీపంలో చాతుర్మాస్య దీక్ష చేస్తున్నారు. తండ్రి ఈ పిల్లాడితో

స్వామి దర్శనం చేసుకొనగా స్వామి ఈ బాలునిపై అవ్యాజ కటాక్షం చూపారు. 1907లో ఈ బాలుడి తండ్రికి అతని మేనమామ కొడుకుని 67వ పీఠాదిపతిగా ఎంపిక చేశామని కబురుచేసి రమ్మని ఆహ్వానించారు. అప్పటికే స్వామివారు మసూచికంతో తీవ్రంగా బాధ పడుతున్నారు. ఎక్కువ కాలం జీవించే పరిస్థితి లేక చనిపోగా కొత్తగా వచ్చిన 67వ స్వామి కూడా వెంటనే చనిపోగా, వెంటనే స్వామినాథన్‌ను 68వ అధిపతిగా "శ్రీచంద్ర శేఖర సరస్వతి దీక్షా నామధేయం"తో 9-5-1907న అప్పటికప్పుడు కుంభకోణం మఠంలో పట్టాభిషేకం చేసేశారు. గార్డియన్‌గా శ్రీ వెంకట రమణ అయ్యర్ ఉన్నారు. స్వామికి 21వ సంవత్సరం రాగానే 1915 శంకర జయంతినాడు పూర్తి బాధ్యతలతో పీఠాదిపతి అయ్యారు. 1913 నుండి 15 వరకు వేద వేదాంగాలను కుంభ కోణం మఠంలో అభ్యసించారు. మహా విద్యావంతులై తపస్సాదనలో ఆధ్యాత్మికాను భవం పొంది జగద్గురువులయ్యారు. ధర్మ శాస్త్రాలన్నీ స్వయంగా చదివి మథించి నిష్ణాతులయ్యారు.

**ఆధ్యాత్మిక కార్యక్రమ పరంపర**

కాలినడకన ఆసేతు హిమాచల పర్యంతం అనేక సార్లు ప్రయాణం చేసి గ్రామ సీమలలో అద్వైత మత ప్రచారాన్ని చేశారు. ఎన్నో పురాతన దేవాలయాలను పునరుద్ధరించారు. ముఖ్యంగా శ్రీ కాళహస్తి దేవాలయ చరిత్రను త్రవ్వి తీయించి లోకానికి చాటారు. సదాశివ బ్రహ్మేంద్ర యతి సమాధిని మనమదురైలో గుర్తించి వైభవం తెచ్చారు. వేద పాఠ శాలలను నెలకొల్పి వేద విద్యా వ్యాప్తి చేశారు. దీనికోసం వేద రక్షణ నిధిని ఏర్పాటు చేశారు. అన్ని వేద శాఖలలో విద్యార్థులు చేరేట్లు చేసి శాఖలను పునరుజ్జీవింప జేశారు. అధర్వ వేదంలోని శౌనిక శాఖను, సామవేదంలోని రనయయిన శాఖలను శిధిలం కాకుండా కాపాడారు. కన్యాకుమారిలో వివేకానంద రాక్ మెమోరియల్ ఏర్పాటుకు నాటి ముఖ్యమంత్రి భక్త వత్సలం అడ్డుపడుతుంటే దాని రూపశిల్పి శ్రీ ఏకనాథ్ రానడే పరమాచార్యను కలిసి వివరించగా భక్తవత్సలం వెంటనే ఒప్పుకున్నాడు. తిరుపతిలో వేద పరిరక్షణ స్కీంను తిరుమల తిరుపతి దేవస్థానంతో ఏర్పాటు చేయించిన ఘనత పరమాచార్యుల వారిదే స్వామి వారు రచించిన "మైత్రీం భజతా" అనే సంస్కృత గీతాన్ని ఐక్య రాజ సమితిలో 23-10-1965న ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవంనాడు భారత రత్న సంగీత సామ్రాజ్ఞి శ్రీమతి ఎం.ఎస్.సుబ్బులక్ష్మి గారు గానం చేసి చిరస్మరణీయం చేశారు.

**ఆది శంకరుల దివ్య సేవలో పరమాచార్య**

ఆది శంకరాచార్య అంటే మహాస్వామికి అవిపరీతమైన ఆరాధనా భావం

ఉంది. అందుకనే శంకరాచార్య జన్మించిన కాలడి, తిరిగిన ప్రదేశాలైన శ్రీశైలం, ప్రయాగ, రామేశ్వరంలలో స్మృతి చిహ్నాలను నెలకొల్పారు. కాలడిలో కంచి మఠం తరఫున కీర్తి స్థంభం అనే 8 అంతస్తుల భవనాన్ని నిర్మించి ఆచార్యుల పాదుకలు మొదలైనవి భద్రపరచారు. కంచిదగ్గర ఎనతూర్‌లో 60 అడుగుల ఆదిశంకరాచార్య విగ్రహం ప్రతిష్టించారు. స్వామి వారు పీఠాదిపతులుగా ఉన్నకాలాన్ని స్వర్ణయుగం అంటారు. 8-1-1994న మహా స్వామి మహాసమాధి చెందారు.

## పెరియ స్వామి వారి గీర్వాణ రచన

పెరియ స్వామి అని అందరి చేత పిలువబడే పరమాచార్యులవారు రచించిన "మైత్రీం భజతా" అనే సంస్కృత గీతాన్ని ఐక్య రాజ్య సమితిలో సమితి వార్షికోత్సవం నాడు శ్రీమతి ఎం.ఎస్.సుబ్బులక్ష్మి గానం చేసినట్లు చెప్పుకొన్నాం. ఆ గీత వైభవం దర్శిద్దాం-

"మైత్రీం భజతా అఖిల హృజ్జేత్రీం-ఆత్మా వదేవ పరానాపి పశ్యంతా
యుద్ధం త్యజతా స్వార్ధం త్యాజ్యతా - త్యాగతా పరేషు అక్రమమాక్రమణం
జననీ పృధ్వీ కామ దుఘాస్తే-జనకో దేవా సకల దయాళూ
దామ్యతా దత్తా దయాద్వం జనతాః-శ్రేయో భూయాత్ సకల జనానాం
శ్రేయో భూయా సకల జనానాం- శ్రేయో భూయాత్ సకలజనానాం.

భావం- స్నేహం వినయం అందరి హృదయాలను గెలుస్తాయి -నీలాగా అందరినీ చూడు. యుద్ధం త్యజించు. స్వార్ధాన్ని త్యజించు. ఆవేశపూరిత దాడిని, ఆక్రమణను త్యజించు. భూమి తల్లి మన కోరికలన్నీ తీరుస్తుంది. అందరికీ ఉన్న ఒకే ఒక తండ్రి పరమేశ్వరుడు. హద్దులో ఉండటం, ఇతరులకు దానం చేయటం, పరులపై కరుణ చూపటం అలవాటు చేసుకో. ప్రపంచ ప్రజలారా సుఖసంతోషాలతో వర్ధిల్లండి.

మనకు భూసూక్తం ఉన్నది. దానికి సాటిగా స్వామివారి రచన సాగింది. వారినోటి నుంచి వచ్చిన ప్రతి వాక్యమూ అమృత తుల్యమే. ఈ గీతం విశ్వవేదికపై గానం చేయబడటం భారతీయ ఆకాంక్ష కీర్తికి ఎత్తిన పతాక. ఇదే అంతర్జాతీయ గేయంగా వర్ధిల్లితే ఎంతో హృద్యంగా ఉంటుంది.

అదీ పరమాచార్యుల ఉత్తమోత్తమ ఉన్నతోన్నత భావ లహరి. అందుకే జగద్గురువులయ్యారు.

శ్రీ వారు శ్రీ దుర్గా ప్రతిష్ట సందర్భంగా "శ్రీ దుర్గా పంచ రత్న స్తోత్రం" రచించినట్లు శ్రీ విశాఖ పేర్కొని దానిని "జగద్గురు బోధలు -10"లో ఇచ్చారు. దానిని ఇప్పుడు దర్శిద్దాం-

1-తే ధ్యాన యోగానుగతా అపశ్యన్ -త్వా మేవ దేవీం స్వగుణై ర్నిగూఢతాం

త్వమేవ శక్తిః పరమేశ్వరస్య -మాం పాహి విశ్వేశ్వరి మోక్ష దాత్రి
2-దేవాత్మ శక్తిః శ్రుతి వాక్య గీతా -మహర్షి లోకస్య పురః ప్రసన్నా
గుహా పరం వ్యోమ సతః ప్రతిష్ఠా-మాం పాహి విశ్వేశ్వరి మోక్ష ధాత్రి.
3-పరాస్య శక్తిః వివిధవ శ్రూయతే -శ్వేతాశ్వ వాక్యోదిత దేవి దుర్గే
స్వాభావికీ జ్ఞాన బలక్రియాతే - మాం పాహి విశ్వేశ్వరి మోక్ష ధాత్రి.
4-దేవాత్మ శబ్దేన శివాత్మ భూతా -యత్కూర్మ వాయవ్య వచో విప్రుత్యా
త్వం పాశ విచ్ఛేదకరీ ప్రసిద్ధా - మాం పాహి విశ్వేశ్వరి మోక్ష ధాత్రి.
5-త్వం బ్రహ్మ పుచ్ఛా వివిధా మయూరీ -బ్రహ్మ ప్రతిష్టా స్యుపదిష్ట గీతా
జ్ఞాన స్వరూపాత్మతయాఖిలానాం - మాం పాహి విశ్వేశ్వరి మోక్ష ధాత్రి.

స్వామివారు "శ్వేతాశ్వవాక్యోదిత దేవి దుర్గే" అన్నారు. శ్వేతాశ్వతరుడు అనే రుషి ఉన్నాడని శ్రీ వారు చెప్పేదాకా చాలా మందికి తెలిసి ఉండదు. శ్వేతాశ్వ వాక్యోదిత దుర్గ ఎలా ఉన్నది-అన్నదానికి శ్రీ విశాఖ ఒక శ్లోకం ఉటంకించారు-

"భూతాని దుర్గా భువనాని దుర్గా -స్త్రియో నరా శ్చాపి పశుశ్చ దుర్గా-
యద్యద్ధి దృశ్యం ఖలుసైవ దుర్గా -దుర్గా స్వరూపా దపారం న కించిత్"

అంటే సర్వభూతాలు సర్వలోకాలు, స్త్రీ పురుష పశువులు అంతా దుర్గా స్వరూపమే. కనిపించింది, కనిపించనిది అంతా దుర్గా స్వరూపమే. దుర్గా స్వరూపం కానిది ఏదీ లేదు. దుర్గ ఏక ప్రాభవ శాలిని, అఖండ చైతన్య స్వరూపిణి.

పాల్ బర్టన్ వంటి పాశ్చాత్యులు మహాస్వామిని దర్శించి స్ఫూర్తి పొందారు. మన కళ్ళముందు నడయాడిన దైవం శతమానం జీవించి 8-1-1994న శంకర సన్నిధికి చేరుకొన్నారు. వారి సంస్కృత రచనలు నాకు ఈ రెండు మాత్రమే లభించాయి. ఎవరి వద్ద అయినా వారి రచనలు ఉంటే నాకు పంపితే వాటినీ చేర్చి సంతృప్తి చెందుతాను. ఆధారం- సాధన గ్రంథ మండలి తెనాలి వారు శ్రీ విశాఖతో అనువాదం చేయించి ప్రచురించిన సద్గురు బోధలు -10వ భాగం.

స్వామివారు వారి అంతరంగికులు బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రిగారు సుమారు 30 సంవత్సరాల క్రితం మా ఉయ్యూరుకు విచ్చేసి ఒక వారం అనుగ్రహ భాషణం చేశారు. దీనికి రూపకర్త స్వర్గీయ చల్లా శర్మగారు అనే కె.సి.పి ఉద్యోగి, పరమాచార్యులవారిపై భక్తివిశ్వాసాలున్న వారు. అప్పుడు కెసిపి వారి ఆద్వర్యంలో జరిగిన సభలలోపై ఇద్దరు మహానుభావులను దర్శించి, వినే భాగ్యం పొంది జన్మ చరితార్ధం చేసుకొన్నాను. ఈ సందర్భంగానే "నడయాడే దైవం" గ్రంథావిష్కరణ జరిగింది. ఆ తర్వాత రెండుసార్లు కంచిలో మహాస్వాముల దర్శన భాగ్యం పొందిన అదృష్టం నాది. ❀

## 306) గణేష్ గీత మాలాస్తోత్ర కర్త – చతుర్భాషాపండితుడు – గోటూర్ వెంకటాచలశర్మ –1894

తమిళనాడు దంకిని కోటలో జన్మించిన గోటూర్ వేంకటాచల శర్మ చామరాజేంద్ర సంస్కృత కాలేజీ నుండి సాహిత్య విద్వాన్ పొందాడు. పండిత రత్న, విద్యా విశారద, సరస కవి రత్న బిరుదులు అందుకున్నాడు. సంస్కృతం తెలుగు ఇంగ్లీషు కన్నడ భాషలో రచనలు చేశాడు. సంస్కృతంలో గణేశ గీతమాలా స్తోత్రం, శ్రీ చౌడేశ్వరీ గీతాకాదంబకం, స్తోత్రమాల భగవాన్ గీత మాలిక వంటివి రాశాడు. సుబ్రహ్మణ్య శాస్త్రి ఆఫ్ ఆనెకాల్ జీవిత చరిత్ర ఇంగిలీషులో రచించాడు. మోహ ముద్గరంకు కన్నడ వ్యాఖ్యానం, తెలుగులో ఆటవెలది గీతమాల రాశాడు.❋



## 307) సంస్కృత తిల్లాన కర్త – వయోలిన్ విద్వాంసుడు – టి. చౌడయ్య –1894–1967

చోడయ్య వయోలిన్ అంటే చెవులు కోసుకోవటం అందరికి తెలిసిందే. మైసూర్లోని కావేరీ తీరంలో తిరుముక్కడాల్ నర్సిపురంలో 1894లో జన్మించి వయోలిన్‌కు విశ్వ విఖ్యాతి కలిగించి ఎన్నో పురస్కారాలు బిరుదులూ సన్మానాలు అందుకొన్నటి చౌడయ్య 73వ ఏట మరణించాడు. బెంగుళూర్‌లో ఆయన పేర ఒక వీధి ఉంది. మైసూర్ రాజాస్థాన సంగీత విద్వాంసుడు, గాన విశారద బిడారం కృష్ణప్ప శిష్యుడు. వయోలిన్ మాధుర్యం పెంచటానికి తార షడ్జమ, మంద్ర షడ్జమ మొదలైన కొత్త తీగలను ఏర్పాటు చేసి సప్త తంత్రులతో వయోలిన్ వాయించేవాడు. దీన్ని గురువు బిడారం అంగీకరించక ఎందుకుఈ ప్రయోగం అని అడిగితే బాగా వెనక ఉన్నవాళ్లకూ స్పష్టంగా వినబడటానికే అన్నాడు. వీణ శేషన్న దీన్ని అంగీకరించగా చివరికి గురువు కూడా సంతోషంతో ఒప్పుకున్నాడు. లెక్కలేనంతమంది శిష్యులను చౌడయ్య తయారు చేశాడు. సంగీత కళానిధి సంగీత శిఖామణి బిరుదులు పొందాడు. 19–1–1967న మహావాయులీన విద్వాంసుడు చౌడయ్య మరణించాడు. చౌడయ్య సంస్కృత తెలుగు కన్నడాలలో కృతులు రచించాడు. అందులో ప్రసిద్ధమైనవి–కాంభోజి రాగంలో "శ్రీ వేణుగోపాల, "ధన్యాసి రాగంలో"', "దేవి పూర్ణ మంగళా" చెప్పుకోదగ్గ కృతులు.❋



## 308) మహమ్మద్ ప్రవక్త సంస్కృత చరిత్ర కర్త – కె ఎస్ నీలకంఠన్ ఉన్ని –1895–1990

మళయాళ, సంస్కృతాలలో ఉద్దండ పండితుడు నీలకంఠన్ ఉన్ని 1895లో కేరళలో కొట్టాయం జిల్లా కావిల్ మదం గ్రామంలో జన్మించాడు. ఈ వంశంవారు తెక్కునూర్ రాజవంశానికి రాజ గురువులు. స్వగ్రామంలో కన్నం పల్లి మధు ఆసాన్ వద్ద ప్రాధమిక విద్యనేర్చి, తిరువాన్కూర్ రాయల్ సంస్కృత కాలేజిలో చదివి శాస్త్రి, మహోపాధ్యాయ డిగ్రీలు సాధించాడు. మలయాలం మున్షిగా 35 ఏళ్ళు వివిధ విద్యా సంస్థలలో పని చేశాడు. కొట్టాయంలోని ఎం.డి సేమినరి హైస్కూల్‌లో రిటైర్ అయ్యాడు.

ఉన్ని ఎన్నో మళయాళ గ్రంథాలు రాశాడు. దేవాలయాలు ఉత్సవ సంప్రదాయాలు, ప్రాచీన విధానాలపై విస్తృతంగా వ్యాసాలూ రాశాడు. కాళిదాస కవి శాకుంతలం మేఘ దూతంలను మలయాళంలోకి అనువాదం చేశాడు. ఆయన కూర్చిన "పంచ మహా నిఘంటు" చాలా ప్రఖ్యాతమైంది. కథాకాళీలో వాడే మూడు అట్టకాలు రచించాడు.

మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను సంస్కృత కావ్యంగా రాసిన ఘనత ఉన్నిది. దీనికి "విశుద్ధ నబి చరితం" అని సార్ధక నామం పెట్టాడు. అయోధ్య సంస్కృత పరిషత్ ఉన్ని సంస్కృత సేవకు "సాహిత్య రత్న, విద్యాభూషణ్ బిరుదులిచ్చి సత్కరించింది. 1890లో ఉన్ని 95వ ఏట మరణించాడు. ఆయన మరణానంతరం 4-4-2011న ఆయన సంకలం చేసిన అద్భుత గాధలను "ఐతిహ్యా కధాకల్" పేరిట ప్రచురించారు. ఇది కొట్టారతి సంకున్ని సంకలం చేసిన "ఐతిహ్యా మాల" తర్వాత అంతటి ప్రాచుర్యం పొందింది.❋

## 309) నివాపాంజలికర్త – అచ్యుత వాసుదేవ మూసన్ –1895–1983

అచ్యుత వాసుదేవ మూసద్ 1895లో జన్మించి 1959లో 69వ ఏటా చనిపోయాడు. పుంజసిరి నంబి శిష్యుడు, నివాపాంజలి, మరక్కాధా నాలుక రాశాడు.❋


## 310) వేద వృత్తి ప్రకాశిక కర్త – క్షేత్రేశ రామచంద్ర ఛట్టోపాధ్యాయ – 1896

27–10–1896న బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాలలో హుగ్లీ జిల్లా నమ్ తా గ్రామంలో కులీన చట్టోపాధ్యాయ కుటుంబంలో జన్మించిన క్షేత్రేశ చంద్ర చటోపాధ్యాయ వేద వ్యాకరణ, పాళీ, ప్రాకృత, ఫైలాలజీలో మహా విద్వాంసుడు. బంకిం చంద్ర చటోపాధ్యాయ కుటుంబ వారసుడేకాక ఆయన నుంచి పునరుజ్జీవన భావధారనూ అందిపుచ్చుకున్నాడు. కలకత్తా యూని వర్సిటి నుండి మెట్రిక్ పాసై, ప్రెసిడెన్సి కాలేజిలో చేరి చదివి ఇంటర్ పాసయ్యాడు. తర్వాత ఆగ్రా ఔద్ యునైటెడ్ ప్రావిన్స్‌కు ప్రవాసిగా వెళ్లి అలహాబాద్ యూనివర్సిటి నుండి బి.ఏ.బెనారస్ యూనివర్సిటి నుండి 1919లో సంస్కృతంలో ఎం.ఏ. పాసైనాడు. కలకత్తా యూనివర్సిటి నుండి 1921లో వేదం, 1922లో వేదాంతంలలో ఎం.ఏ. పాసయ్యాడు. కాలేజీలో చదివే రోజుల్లో నేతాజీ సుభాస్ చంద్రబోస్‌కు అతి సన్నిహిత మిత్రుడుగా ఉన్నాడు. క్షేత్రేశ– డా.గంగా నాద ఝూ శిష్యుడు.

1924లో అలహాబాద్ యూనివర్సిటిలో సంస్కృత లెక్చరర్‌గా పని చేసి, 1950లో రీడర్‌గా పదోన్నతి పోంది, 1956లో ప్రొఫెసర్ అయి రెండేళ్ళు పని చేశాడు. తర్వాత బెనారస్‌లో సంపూర్ణానంద యూనివర్సిటిలో రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ అయి విస్తృత పరిశోధనలకు అవకాశాలు కల్పించాడు. సరస్వతి భవన గ్రంథ మాల ధారావాహిక గ్రంథాలకు సంపాదకత్వం వహించాడు. సరస్వతి సుసమ అనే పత్రికకు ఎడిటర్‌గా ఉన్నాడు. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలోని తిరుపతి కేంద్రీయ సంస్కృత విద్యా పీఠంలో "వేదం– అవెస్తా"ల తులనాత్మక అధ్యయనానికి స్పెషల్ స్కాలర్‌గా ఎంపిక చేయబడినాడు. 1960లో కలకత్తా యూనివర్సిటి ఈయనను కంపారటివ్ రెలిజియన్‌పై స్టీఫెన్ నిర్మలేందు ఘోష్ లెక్చరర్‌గా నియమింప బడ్డాడు.

1924 డిసెంబర్‌లో మద్రాస్‌లో జరిగిన ఆలిండియా ఓరియెంటల్ కాన్ఫరెన్స్‌లో క్రియా శీలక పాత్ర వహించాడు. 1937లో త్రివేంద్రంలో వేదం, ఇండో ఆర్యన్ పై జరిగిన సభకు అధ్యక్షుడై నడిపాడు. 1955లో అన్నామలై యూనివర్సిటిలో 18 సెషన్‌లో వేదంపై జరిగిన సభకు ఆధ్యక్షం వహించాడు. 1946 కరాచీలో జరిగిన అఖిల భారతీయ హిందీ సాహిత్య సమ్మేళనం ఫైలాలజి సెక్షన్‌కు అధ్యక్షుడిగా ఉన్నాడు. క్షేత్రేశుని సంస్కృత భాషావైదుష్యానికి మెచ్చి 1966లో రాష్ట్ర పతి పురస్కారం అందజేయబడింది.

ఈశ, కేన ఉపనిషత్ "వేదవృత్తి ప్రకాశిక, స్టడీస్ ఇన్ వేదిక్ అండ్ ఇండో ఇండియన్ రెలిజియన్ అండ్ లిటరేచర్ గ్రంథాలను రాశాడు.❁



## 311) భారత జాతీయ గీతం కావాల్సిన "జయజయ ప్రియ భారత జనయిత్రి పుణ్య ధాత్రి" గీత కర్త - దేవులపల్లి కృష్ణ శాస్త్రి -1897-1980

దేవులపల్లి కృష్ణశాస్త్రి తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం దగ్గరలోని రావు వారి చంద్రపాలెం అనే గ్రామంలో ఒక పండిత కుటుంబంలో1897 నవంబరు 1న జన్మించాడు. అతని తండ్రి, పెదతండ్రి గొప్ప పండితులు. వారింట్లో నిరంతరం ఏదో సాహిత్య గోష్ఠి జరుగుతూ ఉండేది. కృష్ణశాస్త్రి చిన్న వయసునుండే రచనలు ఆరంభించాడు. పిఠాపురం హైస్కూలులో అతని విద్యాభ్యాసం సాగింది. పాఠశాలలో తన గురువులు కూచి నరసింహం, రఘుపతి వెంకటరత్నం ఆంగ్ల సాహిత్యంలో తనకు అభిరుచి కల్పించారని దేవులపల్లి చెప్పుకొన్నాడు. 1918లో విజయనగరం వెళ్ళి డిగ్రీ పూర్తి చేసి తిరిగి కాకినాడ పట్టణం చేరాడు. పెద్దాపురం మిషన్ హైస్కూలులో ఉపాధ్యాయవృత్తి చేపట్టాడు.

ఆ కాలంలో వ్యావహారిక భాషావాదం, బ్రహ్మసమాజం వంటి ఉద్యమాలు ప్రబలంగా ఉన్నాయి. కృష్ణశాస్త్రి తన అధ్యాపక వృత్తిని వదలి బ్రహ్మసమాజంలో చురుకుగా పాల్గొన్నాడు. అదే సమయంలో సాహితీ వ్యాసంగం కూడా కొనసాగించాడు. 1920లో వైద్యం కోసం రైలులో బళ్ళారి వెళుతూండగా ప్రకృతినుండి లభించిన ప్రేరణ కారణంగా "కృష్ణపక్షం కావ్యం" రూపు దిద్దుకొంది. 1922లో భార్యా వియోగానంతరం

అతని రచనలలో విషాదం అధికమయ్యింది.

తరువాత మళ్ళీ వివాహం చేసుకొని, పిఠాపురం హైస్కూలులో అధ్యాపకునిగా చేరాడు. కాని పిఠాపురం రాజుగారికి కృష్ణశాస్త్రి భావాలు నచ్చలేదు. కృష్ణశాస్త్రి ఆ ఉద్యోగం వదలి బ్రహ్మసమాజంలోను, నవ్య సాహితీ సమితిలోను సభ్యునిగా, భావ కవిత్వోద్యమ ప్రవర్తకునిగా దేశమంతటా ప్రచారంలో పాల్గొన్నాడు. ఈ సమయంలో ఎందరో కవులతోను, పండితులతోను పరిచయాలు కలిగాయి. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాన్ని అధ్యయనం చేశాడు. పిఠాపురంలోని హరిజన వసతి గృహంతో సంబంధం ఏర్పరచుకొని హరిజనోద్ధరణ కార్యక్రమాలలో పాల్గొన్నందున బంధువులు అతనిని వెలివేశారు. అయినా వెనుకాడని కృష్ణశాస్త్రి వేశ్యావివాహ సంస్థను ఏర్పాటు చేసి ఎందరో కళావంతులకు వివాహాలు నిర్వహించాడు. సంఘ సంస్కరణా కార్యక్రమాలు నిర్వహిస్తూనే "ఊర్వశి" అనే కావ్యం వ్రాశాడు.

1929లో విశ్వకవి రవీంద్రనాథ టాగూరుతో పరిచయం ఏర్పడింది. వారిద్దరి మధ్య సాహితీ సంబంధాలు ఏర్పడ్డాయి. 1933-41 మధ్య కాలంలో కాకినాడ కాలేజీలో తిరిగి అధ్యాపక వృత్తిని చేపట్టాడు. 1942లో బి.ఎన్.రెడ్డి ప్రోత్సాహంతో మల్లీశ్వరి చిత్రానికి పాటలు వ్రాశాడు. తరువాత అనేక చిత్రాలకు సాహిత్యం అందించాడు. 1957లో ఆకాశవాణిలో చేరి తెలుగు సాహిత్య ప్రయోక్తగా అనేక గేయాలు, నాటికలు, ప్రసంగాలు అందించాడు.

భావ కవిగా, 'ఆంధ్రాషెల్లీ'గా ప్రసిద్ధులైన దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి, బి.ఎన్.రెడ్డి ప్రోత్సాహంతో 'మల్లీశ్వరి (1951)'తో చిత్రరంగంలో అడుగుపెట్టారు. సినిమా పాటకు కావ్య గౌరవం కలిగించారు. ఆపాత మధురమైన కృష్ణశాస్త్రి సాహిత్యం ఇక్షురసార్ణవం వంటిదని శ్రీశ్రీ శ్లాఘించారు. లాలిత్యం, సారళ్యం, ప్రకృతి సౌందర్యం కృష్ణశాస్త్రి పాటల్లోని ప్రధాన లక్షణాలు. భావోద్వేగాలకు, హృదయ స్పందనలకు అక్షర రూపమిచ్చి భావ కవితలంత సుకుమారంగా ప్రణయ విరహ గీతాల్ని రాసిన కవి. ఆత్మ నివేదన, ఆరాధన గల భక్తిగీతాలు కూడా అనేకం. రాజమకుటం, సుఖదుఃఖాలు, కలిసిన మనసులు, అమెరికా అమ్మాయి, గోరింటాకు మొదలైన చిత్రాల్లో 170 పాటలు మాత్రమే రాసిన కృష్ణశాస్త్రి, ఈ పన్నెండుగురు పద నిర్దేశకుల్లోనూ తక్కువ పాటలు రాసిన కవి.

'భక్త ప్రహ్లాద (1931)'తో ప్రారంభమైన తెలుగు సినిమా పాట ఎనభయ్యో పడిలో

అడుగుపెట్టింది. ఈ ఎనిమిది పదుల కాలంలో సుమారు 400 మంది కవులు దాదాపు 34 వేల పాటల్ని (అనువాద గీతాల్ని మినహాయించి) రాశారు. ముఖ్యమైన జాబితాలో ఎవరు ఎంపిక చేసినా మహా అయితే మరో ఏడెనిమిది మంది కవుల కంటే ఆ జాబితాలో చోటు చేసుకోరు. ఇలా గుర్తింపు పొందిన కవులను కూడా జల్లెడ పడితే, తమ ప్రత్యేకతలతో తెలుగు సినిమా పాటకు దిశానిర్దేశం చేసిన కవులు 12 మంది మాత్రమే అంటే కించిత్ ఆశ్చర్యం కలగక మానదు. అందులో ఒకరు దేవులపల్లి కృష్ణశాస్త్రి.

గొప్ప వక్తగా, రచయితగా, భావకవుల ప్రతినిధిగా పేరుపొందిన కృష్ణశాస్త్రి గొంతు 1963లో అనారోగ్య కారణంగా మూగవోయింది. కాని అతని రచనా పరంపర కొనసాగింది. అతనికి అనేక సన్మానాలు ప్రశంసలు లభించాయి. 1980 ఫిబ్రవరి 24న కృష్ణశాస్త్రి మరణించాడు.

కృష్ణశాస్త్రి మేనగోడలే కర్ణాటక, లలిత, జానపద సంగీత కళానిధి, వింజమూరి సోదరీమణులలో ఒకరైన కళాప్రపూర్ణ అవసరాల (వింజమూరి) అనసూయాదేవి.

**పురస్కారాలు-**

1975 - ఆంధ్ర విశ్వవిద్యాలయం - కళాప్రపూర్ణ

1978 - సాహిత్య అకాడమీ అవార్డు

1976 - పద్మ భూషణ్

**ప్రముఖుల అభిప్రాయాలు**

మహాకవి శ్రీశ్రీ- నేను కృష్ణశాస్త్రి కవితాశైలినే అనుకరించేవాడిని. కానీ, మా నారాయణబాబు కృష్ణశాస్త్రి సింహం జూలును కూడా అనుసరించి, దాన్ని రోజూ సంపెంగ నూనెతో సంరంక్షించుకునేవాడు. నాకెప్పుడూ పద్యం మీద ఉన్న శ్రద్ధ జుట్టు మీద ఉండేది కాదు.

విశ్వనాథ సత్యనారాయణ- మనకు కీట్సు, షెల్లీ, వర్డ్సు వర్తులవంటి కవులు లేరు. ఆ కవులు మన దేశములో కృష్ణశాస్త్రిగారుగా పుట్టినారని నా యభిప్రాయము.

**రచనలు**

కృష్ణ పక్షము : ఇది కృష్ణశాస్త్రి కవితా ప్రస్థానంలోనూ, తెలుగు సాహితీ చరిత్రలోనూ ఒక ముఖ్య ఘట్టం. ఒకసారి ఆయన బెజవాడ నుండి బళ్ళారికి రైలులో వెళుతుండగా చుట్టూ ఉన్న పొలాల సౌందర్యానికీ, రైలు లయకూ పరవశించి "ఆకులో ఆకునై, పూవులో పూవునై" అని పలవరించారట. అది తెలుగు భావకవితా యుగంలో ఒక

ముఖ్య క్షణం. 1922లో సంభవించిన భార్యా వియోగం ఆయన కవితలను మరింత వేదనా భరితం చేసింది. ఊహా ప్రేయసి, ఆత్మాశ్రయత్వం, ప్రవాసము, ఊర్వశి వంటి కవితలు ఈ ఖండకావ్య సంపుటిలో ఉన్నాయి.

ఊర్వశి కావ్యము–
అమృతవీణ – 1992 – గేయమాలిక
అమూల్యాభిప్రాయాలు – వ్యాసావళి
బహుకాల దర్శనం – నాటికలు, కథలు
ధనుర్దాసు – నాలుగు భక్తి నాటికలు,
కృష్ణశాస్త్రి వ్యాసావళి – 4 భాగాలు
మంగళకాహళి – దేశభక్తి గీతాలు
శర్మిష్ఠ – 6 శ్రవ్య (రేడియో) నాటికలు
శ్రీ ఆండాళ్ళు తిరుప్పావు కీర్తనలు, నాటిక 1993
మేఘమాల – సినిమా పాటల సంకలనం – 1996
శ్రీ విద్యావతి – శృంగార నాటికలు
యక్షగానాలు – అతిథిశాల – సంగీత రూపకాలు
మహాతి
దేశభక్తి గీతంఃభారత మాత

జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ, దివ్యధాత్రి!
జయ జయ జయ శత సహస్ర నరనారీ హృదయనేత్రి!
జయ జయ జయ లల..
జయ జయ సశ్యామల సుశ్యామల చలచ్చేలాంచల!
జయ వసంత కుసుమలతా చలిత లలిత చూర్ణ కుంతల!
జయ మదీయ హృదయాశయ లాక్షారుణ పదయుగళా!
జయ జయ జయ లలలల.
జయ దిశాంత గత శకుంత దివ్య గాన పరితోషణ!
జయ గాయక వైతాళిక గళవిశాల పథవిహరణ!
జయ మదీయ మధుర గేయ చుంబిత సుందర చరణ!
జయ జయ జయ లలలల.❋




## 312) నైషధ తిలక కర్త, త్రయోదశ భాషావేత్త – పద్మభూషణ్ – కృష్ణ కాంత హాండీకీ –1898–1982

20–7–1898న అషోమ్ కుటుంబంలో అస్సామ్‌లో కృష్ణకాంత హాండీకి జన్మించాడు. జోర్హాట్ ప్రభుత్వ పాఠశాలలో చదివి గౌహతికి వెళ్లి 1913లో కాటన్ కాలేజీలో చేరి రెండేళ్లు చదివి కలకత్తా వెళ్లి కలకత్తా యునివర్సిటీలో 1920 నుండి 23 వరకు సంస్కృతం చదివి, ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ నుంచి మోడర్న్ హిస్టరీలో ఎం.ఏ పాసై, పారిస్ జర్మన్ ఫ్రాన్స్ యునివర్సిటీలలో విద్య నేర్చి, గ్రీఎక్ స్పానిష్ జర్మన్ ఫ్రెంచ్, ఇటాలియన్, లాటిన్, రష్యన్ భాషలలో మహా ప్రావీణ్యం పొంది, ఆ భాషా సాహిత్యాలకు చెందిన 2 వేలకు పైగా అరుదైన గ్రంథాలను తనతో అస్సామ్‌కు తెచ్చుకున్నాడు.

టీ ప్లాంటర్స్ కుటుంబానికి చెందిన వాడవటంతో తండ్రికున్న టీ ఎస్టేట్స్ నిర్వహణలో నూతన సాంకేతిక విధానాలను ప్రవేశపెట్టి అభివృద్ధి చేశాడు. హేమలత ఐదియిను వివాహమాడి ప్రభుత్వ ఉద్యోగం చేయటానికి ఇష్టపడక, జోర్హాట్‌లో జె బి కాలేజీ వ్యవస్థాపక ప్రిన్సిపాల్ అయ్యాడు. అస్సామ్‌లో అదే మొట్టమొదటి ప్రయివేట్ కాలేజీ ఈనాటికీ సమర్ధవంతంగా వర్ధిల్లుతోంది. ఈ కాలేజీ ప్రిన్సిపాల్‌గా 17 ఏళ్ళు పనిచేసి ప్రపంచ వ్యాప్తంగా గొప్ప ఇండాలజిస్ట్‌గా అస్సామ్‌లో అత్యంత విశిష్ట విద్యావేత్తగా గుర్తింపు పొందాడు.

హాండీకి అనేక వ్యాసాలూ చాలా విషయాలపై పత్రికలకు రాశాడు –ఔబాదర్ కథ, స్పానిష్ సాహిత్యత్ రోమియో జూ లియట్, జర్మన్ సాహిత్యత్ సపోన్ నాటక,

గ్రీక్ నాటకార్ గణ్ ,సోక్రటీసర్ మతే క్వీర్ ప్రకృతి మొదలైనవి. గ్రంథాలుగా వచ్చినవి నైషధ చరిత, యశస్తిలక సంస్కృతంలో, ఆంగ్లంలో సేతు బంధూస్ ప్రవర సేన. ఈ మూడు ఆయన పరిణత మేథో వికాసనానికి తార్కాణాలు అంటారు వేత్తలు.

1948లో హాండీక్‌ను గౌహతి యూనివర్సిటీ వ్యవస్థాపక వైస్ ఛాన్సలర్‌గా నియమించారు. ఇందులో 9 ఏళ్ళు 1957 వరకు గొప్ప సేవలందించారు. తన భార్య స్మృతి చిహ్నంగా జోర్హాట్‌లో "హేమలత హాండీకి మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్" నెలకొల్పాడు.

గౌహతి యునివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా సేవలందించి తనకున్న అత్యంత విలువైన 11 భాషలలోని స్వంత లైబ్రరీ గ్రంథాలను గౌహతి యునివర్సిటీకి సమర్పించి అందరికి ఉపయోగంలో ఉండేట్లు చేసిన త్యాగమూర్తి హాండీకి. 1937లో అసోం సాహిత్య సభకు ప్రెసిడెంట్‌గా 39 ఏళ్ళ అతి తక్కువ వయసులో నియమింపబడి చరిత్ర సృష్టించాడు. 1951లో లక్నోలో 1961లో శ్రీనగర్‌లో జరిగిన అఖిలభారత సంస్కృత పరిషత్ సభలకు కృష్ణ కాంత హాండీకి అధ్యక్షులుగా వ్యవహరించాడంటే ఆయన సమర్ధత ఏమిటో మనకు తెలుస్తుంది.

హాండీకి గొప్ప సంస్కృత విద్వావంసుడు మేధావి మాత్రమే కాదు, గొప్ప వితరణశీలి ఇండాలజిస్ట్‌లకు మార్గదర్శి. అంకిత భావంతో అత్యున్నత విలువలతో జీవించిన ఆదర్శమూర్తి. అస్సామ్‌లో విద్యావ్యాప్తికి అవిరళ కృషి చేసినవాడు 7-.-6-1992న 94 ఏళ్ళ పరిపూర్ణ జీవితాన్ని గడిపిన మహా విద్యావేత్త కృష్ణకాంత హాండీకి అమరుడయ్యాడు. ఆయన గౌరవార్ధం 7-10-1983న భారత ప్రభుత్వం ప్రత్యేక తపాలాబిళ్ళను విడుదల చేసింది. అస్సామ్ ప్రభుత్వం "కృష్ణకాంత హాండీకి స్మారక పురస్కారం ఆయన సంస్కృత విద్యావ్యాప్తికి" గౌరవార్ధంగా ఏర్పాటు చేసింది. ఎనిమిది విదేశీ భాషలో, అయిదు స్వదేశీ భాషలో మహా పండితుడు, కీర్తి, పదవి, అధికారం, ప్రచారాల కోసం తాపత్రయం పడని అరుదైన వ్యక్తిత్వం దార్శనికత, సాంఘిక నైతిక నిబద్ధతతో అస్సామ్ సర్వతోముఖాభివృద్ధికి యెనలేని కృషి చేసిన చిరస్మరణీయుడు కృష్ణకాంత హాండీకి.❁

## 313) ఆమ్నాయ మతానాం కర్త – ఎర్కార రామన్ నంబూద్రి – 1898–1983

1898లో జన్మించి 85 ఏళ్ళు జీవించి 1983లో చనిపోయిన యెర్కార రామన్ నంబూద్రి వేద వేదాంగాలలో నిష్ణాతుడు. అనేక సోమయాగాలు అతిరాత్రాలు నిర్వహించిన ఘనుడు. "ఆమ్నాయ మతానాం", శ్రౌత కర్మ వివేకం గ్రంథకర్త. 32 రోజుల పౌండరీక యజ్ఞంలో సుప్రసిద్ధుడు. 1942–43లో గురువాయూర్‌లో "మురహోమం" దగ్గరుండి జరిపించాడు. సంస్కృతం శాస్త్రాలలో ఆయన పాండిత్యం అపారం. ఒకసారి ''కౌశికీయత బ్రాహ్మణం'' గడగడా అప్పగించి అందర్నీ ఆశ్చర్యపరచాడు. 1970లో తిరుపతి దేవస్థానం ఆహ్వానంపై వెళ్లి దీన్ని చదివి రికార్డ్ చేయించాడు. దీంతో జాతీయ, అంతర్జాతీయ కీర్తి పొందాడు. శ్రౌత స్మార్తాలలో భారత దేశంలో ఆయనదే తుది తీర్పుగా ఉండేది. భారత రాష్ట్రపతి ప్రశంసా పత్రంతోపాటు "వేదార్ధ రత్న" వంటి బిరుదులెన్నో పొందాడు. 22 ఏళ్ళ వయసులో శ్రీమతి పార్వతిని వివాహమాడి 4గురు కుమారులు 5 గురు కుమార్తెలను ఈ దంపతులు సంతానంగా పొందారు. జీవితకాలంలో 99 యాగాలు స్వయంగా చేసి అనేక యాగాలు ఇతరులతో కలిసి నిర్వహించిన యజ్ఞ నిర్వహణ దక్షుడు రామన్ నంబూద్రి.❀

## 314) పిప్పలాద సంహిత పరిశోధకుడు – ప్రొ. దుర్గామోహన్ భట్టాచార్య (1899–1965)

13–10–1899న ఢాకాలో దుర్గామోహన భట్టాచార్య జన్మించాడు. 1900లో కుటుంబం ముర్షీదాబాద్ జిల్లా సహనగర్ లాల్ బాఘ్‌కు తరలి వెళ్ళింది. నిరుపేద కుటుంబం అయినందున పిల్లలను ఆంగ్ల మాధ్యమ పాఠశాలకు పంపించలేక పోయారు. వీధిబడిలో బెంగాలీ సంస్కృతాలు బెంగాలీ భాషా మాధ్యమంలో మాత్రమే నేర్చాడు. దుర్గామోహన్ బుద్ధి తీక్షత చాలా ఎక్కువ కనుక 1915 నాటికే అంటే 16వ ఏటనే అనేక సంస్కృత ఉపాధి పరీక్షలు రాసి అగ్రభాగాన నిలిచాడు. కావ్య, సాంఖ్య, పురాణాలలో అత్యుత్తమ డిగ్రీ పొంది "భాగవత రత్న" బిరుదు అందుకొన్నాడు.

విధవరాలైన తల్లి, తమ్ముడితో కలకత్తాలో ఉన్న మాతామహుల ఇంటికి చేరాడు. మేనల్లుడి ఆంగ్ల భాషాధ్యయనం కోరిక తీర్చటానికి పెద్ద మేనమామ అతనిని ప్రసిద్ధ కలకత్తా టౌన్ హైస్కూల్ హెడ్మాస్టర్ సురేష్ చంద్ర కుందు వద్దకు తీసుకు వెళ్ళాడు. అప్పటికే 16 ఏళ్ళు రావటం వలన 10 ఏళ్ళ కోర్సును కేవలం ఒక్క ఏడాదిలో చదవాల్సి వచ్చింది. శ్రమకోర్చి ఇష్టంగా కష్టపడి చదివి 1917లో యూనివర్సిటీ ఎంట్రన్స్ పరీక్ష రాసి ప్రధమ తరగతిలో ఉత్తీర్ణుడై అందరికీ ఆశ్చర్యం కలిగించి అసాధ్యాన్ని సుసాధ్యం

చేసి చూపించాడు. పట్టుదల ఓర్పు ఉంటే సాధించలేనిది లేదని నిరూపించాడు. 1919లో విద్యాసాగర్ కాలేజి నుంచి ఇంటర్ పాసై, 1921లో స్కాటిష్ చర్చ్ కాలేజి నుండి సంస్కృతంలో బి ఏ ఆనర్స్ డిగ్రీని పొందాడు. 1923లో కలకత్తా యూని వర్సిటీ నుంచి సంస్కృత ఎం.ఏ డిగ్రీ తీసుకొన్నాడు.

దుర్గా మోహన్ తన దృష్టిని విద్యారంగంపై నిలిపాడు. హౌరాలో నరసింహ దత్ కాలేజీ సంస్కృత ప్రొఫెసర్‌గా చేరి, తర్వాత స్కాటిష్ చర్చ్ సంస్కృత ప్రొఫెసర్ అయి 30వ ఏటనే హెడ్ అయ్యాడు. 1952లో వెస్ట్ బెంగాల్ సీనియర్ ఎడ్యుకేషనల్ సర్వీస్‌లో సంస్కృత కళాశాల పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రెయినింగ్ అండ్ రిసెర్చ్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్ ఆఫ్ వేదిక్ లాంగ్వేజ్ లిటరేచర్ అండ్ కల్చర్‌గా నియమింపబడ్డాడు. అర్హతను బట్టి ఉద్యోగాలు వెతుక్కొంటూ వచ్చి నిలిచాయి. చనిపోయేదాకా ఈ పదవిలోనే ఉన్నాడు. భట్టాచార్య సమర్ధతను గుర్తించి ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్, ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ బాంబే, భండార్కర్ ఓరియెంటల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వంటి అగ్రశ్రేణి సంస్థలు ఆహ్వానించి వేదం మొదలైన విషయాలపై ప్రసంగాలను ఏర్పాటు చేసి గౌరవించాయి. సంస్కృతం, వేద వాఙ్మయంలో ఆయన కృషికి ఈ సంస్థలు స్వర్ణ పతకాలను అందజేసి సత్కరించాయి.

అందరూ అనుకొంటున్నట్లు భారత దేశంలో అధర్వ వేదం కనుమరుగు కాలేదని అనేక పరిశోధనలవలన విషయ సేకరణ వలన నిర్ధారించాడు. దీనికి తగిన సాక్షాధారాల సేకరణ కోసం దేశంలోని అనేక ప్రాంతాలను సందర్శించాడు. చనిపోవటానికి కొన్నేళ్ళ కిందటనే ఒరిస్సాలోని "గుహిపాల్" గ్రామంలో అధర్వ వేదాధ్యయనం నిరంతరంగా కొనసాగుతోందని ప్రత్యక్షంగా చూసి సంతృప్తి చెందాడు. గుహిపాల్‌లోనే అధర్వ వేదంలోని తొమ్మిది సంహితలలోముఖ్యమైన "పిప్పలాద సంహిత" ఒరియా భాషలో అనేక వ్రాత ప్రతులలో కనిపించింది. దుర్గామోహన భట్టాచార్య ఆనందానికి అవధులు లేకపోయింది. అన్వేషణ ఫలించి అధర్వ వేదం అంతరించి పోలేదని లోకానికి సాక్షాధారాలతో నిరూపించి ఒక రకంగా అధర్వ వేద పునః ప్రతిష్ట చేసి దాని ప్రతిష్టను కాపాడి ఉనికిని చాటాడు. ఈ పరిశోధన విశ్వవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించి భట్టాచార్యను "అధర్వ వేదోద్ధారకుడు"గా సన్మానించారు.

పిప్పలాద సంహితపై అనేక సంవత్సరాలు పరిశోధించి, దాని ప్రచురణకు పూనుకొని ప్రపంచ వ్యాప్త గీర్వాణ విద్యా వేత్తల ప్రశంసలు పొందాడు. దురదృష్టవశాత్తు కేన్సర్ వ్యాధి సోకి దుర్గా మోహన భట్టాచార్య 12-11-1965న 66వ ఏట పరమపదించాడు. మధ్యలో ఆగిపోయిన ఈ పనిని కుమారుడు దీపక్ భట్టాచార్య పూర్తిచేసి మొదటి 18 కాండల గ్రంథాన్ని తయారు చేయగా కలకత్తా ఏషియాటిక్ సొసైటీ మూడు భాగాలుగా 1997, 2008, 2011లో ప్రచురించి లోకానికి అందజేసింది. భట్టాచార్య భార్య భవానీదేవి 1992లో మరణించింది. ఆ దంపతులకు అయిదుగురు కుమారులు నలుగురు కుమార్తెలు.❀



## 315) వ్రజ విలాస కర్త – కమల లోచన ఖడ్గ రాయ్ –1900

వ్రజ విలాస కర్త –కవి చంద్ర కమల లోచన ఖడ్గ రాయ్, కవి భూషణ గోవింద సమంతరాయ్ మనవడు. సంగీత చింతామణి రాశాడు. గీత ముకుందంను గీత గోవిందానికి అనుకరణగా రాశాడు. ఇవికాక వ్రజ యువ విలాస, భగవత్ లీలా విలాసం రాశాడు. వ్రజ విలాసం 17 సర్గల కావ్యం. రాధా గోపిక కృష్ణుల లీలా విలాసమే ఇది. ఖుర్దా రోడ్ సంస్థాన కవి. నాగపూర్ రాజు భోంస్లే ఆశ్రితుడు కూడా. లీలాచింతామణి వ్రాతప్రతిని మహా మహోపాధ్యాయ సదాశివ మిశ్ర అనే ప్రముఖ సంస్కృత పండితుడు పూరీలో గుర్తించి వెలికి తీసి ముద్రించాడు. 1500 శ్లోకాల గ్రంథం. భాగవతానికి వ్యాఖ్యానమే. కవి భారద్వాజ గోత్రీకుడైన ఒరియా బ్రాహ్మణుడు. ❁



## 316) వేద సార రత్నావళి కర్త – పద్మభూషణ్ – ఉప్పులూరి గణపతి శాస్త్రి –1900

వేద శాస్త్ర విశారద, పద్మభూషణ వంటి 27 గౌరవ బిరుద పురస్కారాలు అందుకొని, తాత గణపతి శాస్త్రి తండ్రి గంగాధర శాస్త్రి కూడా పిఠాపురం ఆస్థాన కవిపండితులైన కుటుంబంలో శ్రీ ఉప్పులూరి గణపతి శాస్త్రి 1864లో జన్మించారు. 8వ ఏట రాజదర్శనం జరిగి, బాలుడి ముఖకాంతికి రాజావారు ఆశ్చర్య సంభరితులై ఆస్థానంలోకి సగౌరవంగా ఆహ్వానించి అతని విద్వత్తుకు మురిసిపోయి ఏడాదికి 116 రూపాయల పారితోషికం ఏర్పాటు చేసి ఆతర్వాత గణపతి శాస్త్రిగారిని ఆస్థాన విద్వాంసుని చేసి ఏడాదికి 407 రూపాయల గౌరవ భ్రుతి కల్పించారు. ఇలా తాత, తండ్రి, మనవడు ముగ్గురూ ఆస్థాన విద్వాంసులవటం అరుదైన విషయం.

1929లో శాస్త్రిగారు మచిలీపట్నం వెళ్ళగా మహాపండితుడు శ్రీ పురాణం సూరిశాస్త్రిగారు గణపతి శాస్త్రి గారి చేత 20 రోజులు వేద వేదాన్గాలపై ఉపన్యాసాలను ఇప్పించారు. వీరికి వేదంపై ఉన్న అపార ప్రజ్ఞాపాటవాలకు మచిలీపట్నం ప్రజలు అబ్బురపడి అపూర్వ గౌరవ సత్కారాలు చేసి "వేద భాష్య విశారద" బిరుదు ప్రసాదించారు.

1930లో కంచి పరమాచార్య శ్రీ చంద్రశేఖర యతీంద్ర స్వాములు కాకినాడకు పీఠంతో సహా తరలిరాగా శాస్త్రిగారిని ఆహ్వానించి కంచి విద్వాంసులతో "వేదార్థ చర్చ" చేయమని కోరారు. శాస్త్రిగారు చేసిన చర్చలోని భాగాలు విద్యారణ్యుల వారి భాష్యానికి అనుగుణంగా ఉన్నాయా అని మహాస్వాములు ప్రశ్నిస్తే ఇంటికి వెళ్లి భాష్యాన్ని తెచ్చి చూపించి భేష్ అనిపించారు. అంతటి వేద విద్వత్తు వారిది.

1935లో శాస్త్రిగారు దయాల్బాఘ్ మహారాజాస్థానంలో వ్యాకరణ వేత్త పండిట్ మణిరాం శాస్త్రితో శాస్త్రార్ధ చర్చ చేసి విజయం సాధించారు. 1955లో బొంబాయి శంకరమఠంలో మహా సంస్కృత విద్వాంసుడు టి.ఎ.వెంకటేశ్వర దీక్షితార్‌తో శాస్త్రార్ధం జరిపారు. భారత రాష్ట్రపతి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ హైదరాబాద్ సందర్శనలో శాస్త్రిగారిని చూసి భారతదేశంలో అతి అరుదైన వేద విదులు శాస్త్రిగారు అని మెచ్చుకొన్నారు. శృంగేరి జగద్గురువులు "వేద భాష్యాలంకార" బిరుదునిచ్చి సత్కరించారు. ఖండవల్లి వారి ఆధ్వర్యంలో వెలువడిన "సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశం"లో యజుర్వేదంపై శాస్త్రిగారిని వ్రాయమనగా విపులంగా రాశారు. శ్రీ రామానుజ జీయర్ స్వామి "వేద భాష్యాచార్య" బిరుదు ప్రదానం చేశారు. 1975లో జరిగిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభలలో శ్రీ శాస్త్రిగారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. 1979లో తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసుని చేసి "ఆమ్నాయ సరస్వతి" బిరుదునిచ్చి గౌరవించింది. 1981లో ముఖ్యమంత్రి శ్రీ టి.అంజయ్య శాస్త్రిగారిని రాష్ట్ర ఆస్థాన వేదపండితునిగా నియమించి సత్కరించారు. కళాసరస్వతి వంటివి ఎన్నో బిరుదులూ శాస్త్రిగారి కీర్తికిరీటాన్ని అలంకరించాయి. 97వ ఏట భారత ప్రభుత్వం శాస్త్రిగారి వేద విద్వత్తుకు "పద్మ భూషణ్" పురస్కారాన్ని ప్రకటించగా వయోభారం వలన ఢిల్లీకి వెళ్లి స్వయంగా రాష్ట్రపతి చేతులమీదుగా అందుకోలేక పోయారు. 1985లో రాష్ట్ర ప్రభుత్వం దానిని వారికి అందజేసింది.

ఉప్పులూరి గణపతి శాస్త్రిగారు రచించిన గ్రంథాలలో రెండుభాగాలుగా రచించిన "వేద సార రత్నావళి" ప్రాముఖ్యాన్ని పొందింది. ఇంతటి మహా వేదవిదుని జీవిత చరిత్ర గురించి వికీ పీడియాలోసమగ్రంగా లేకపోవటం మన దురదృష్టం. సుమారు పదేళ్ళక్రితం నేను కాకినాడలో ఉంటున్న రిటైర్డ్ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ ఆంధ్ర ఆంగ్ల సంస్కృతాలలో మహాదిట్ట, గొప్ప కథానికా రచయితా విమర్శకులు బహు గ్రంథకర్త, తండ్రి శ్రీ సామవేదం జానకి రామ శర్మగారి పద్యరామాయణాన్ని ముద్రించినవారు.

"రామాయణ పావని"వంటి గ్రంథకర్త వాల్మీకి, విశ్వనాథ రామాయణాలపై అథారిటీ, ఎన్ని గంటల సేపైనా వాటిపై అనర్గళంగా ప్రసంగించగల మహావక్త 1994లో రాజమండ్రిలో భారతీయ సాహిత్య పరిషత్ సభలలో నాకూ మా బావమరది ఆనంద్‌కు పరిచయమై ఆమూడు రోజులు వదలకుండా మమ్మల్ని అంటి పెట్టుకోన్నవారూ, ఆ తర్వాత ఉయ్యూరు మా ఇంటికి వచ్చి అనుకోకుండా నేను ఏర్పాటు చేసిన సభలో రెండు గంటలు కల్ప వృక్షంపై మాట్లాడి, సాహితీ రస గంగలో ముంచి తేల్చినవారూ మా శ్రీమతితో కలిసి కాకినాడ వెళ్ళినప్పుడల్లా మాతో సరస సాహితీ చర్చ చేసిన వారూ శ్రీ సామవేదం జానకి రామశాస్త్రి గారు అనే "జానకీ జాని" గారు నాతో "మీకు ఉప్పులూరి గణపతి శాస్త్రి గారు తెలుసా?" అని అడగగానే తెలియదని షేక్స్ పియర్ మొహం పెట్టా. అప్పుడు వారు శాస్త్రిగారి విద్వత్తును కళ్ళకు కట్టించేట్లు చెప్పి గణపతి శాస్త్రిగారు తమ శ్రీమతికి మేనమామ గారు అని తెలియజేశారు.

**వేద పరమా(త్మ)ర్ధం**

వేదం ఎందుకు చదవాలి, అందులో ఉన్న పరమార్ధం ఏమిటి, ఎందుకు దానికి దూరమైపోతున్నాం, పాశ్చాత్యులు వేదంను సరిగ్గా అర్ధం చేసుకోకుండా, ఏవేవో చదివి విపరీతార్ధాలను ఎలా రాశారు, దానివలన వేద పరామార్ధానికి ఏర్పడిన ఇబ్బంది ఏమిటి అన్న విషయాలను నాలుగు వేదాలు ఉపనిషత్తులు, మహాభారత భాగవత రామాయణ, మనుస్మృతులు మీమాంసాది శాస్త్రాలు స్వర్గీయ ఉప్పులూరి గణపతి శాస్త్రి యజ్ఞాల ఘట్టాలు అధ్యయనం, పారాయణ యజ్ఞం చేసిన దానితో సమానమే అన్నారు. స్వాధ్యాయ ప్రవచానలకు మించిన యజ్ఞమే లేదు. బ్రహ్మ జ్ఞానమే మానవ జీవిత పరమార్ధం. భూత భవిష్యత్ వర్తమానాల మీద ఆధిపత్యం ఎవరికి ఉందో, ఎవరు ఈ ప్రపంచానికి అతీతంగా ఉన్నాడో, ఆయనే శాశ్వతుడు నిత్య నూతనుడు. ఆయనే మర్త్య ప్రపంచంలో ఉన్న అమర్త్యుడు, అతడు మృత్యువుకు భయపడడు. గాఢంగా కోరుకొనే వారికి పరమ ధామంలో ప్రతిదీ ఏక రూపం ధరించినట్లే ఉంటుంది. అన్నిటిలోను పని చేసే ఏక సూత్రమే బ్రాహ్మన్ అని ఆరణ్యకాలు అంటున్నాయి. అందరిలోనూ ఉన్నది ఒకటే ఆత్మ. ఇవాళ ఉన్నది రేపు ఉండబోయేది ఆయన ఒక్కడు మాత్రమే. పరమ పదంలో దివ్య రూప రహితుడైన పురుషుడి నుంచే దేవ మనుష్య జీవరాశులన్నీ ప్రభ విస్తున్నాయని ముండకో పనిషత్ అంటోంది. దేవతలైనా బ్రాహ్మన్‌ను దాటి ముందుకు పోలేరు. ఈ మహా సత్యమే వేద సారం. ఆ సత్యం తెలియక పోతే సారాంశం బోధపడదు. "నా వేద విన్మనుతే తమ బృహంతం". శాస్త్రిగారి వారసులు "శ్రీ ఉప్పులూరి గణపతి శాస్త్రి వేద శాస్త్ర పరిషత్" ఏర్పరచి ప్రతి ఏడాది వారిని స్మరిస్తూ వేదసభలను పెద్ద ఎత్తున నిర్వహించటం ముదావహం.❁

## 317) కేరళ విలాస కావ్యాలు -1900

కేరళకు చెందిన 19వ శతాబ్ది మన విక్రమకవి కేరళపై కేరళవిలాస కావ్యం రాశాడు. ఈయన కాలికట్ వాడు. కేరళోత్పత్తి ఆధారంగా దీన్ని 105 శ్లోకాలలో రాశాడు. ఏళత్తూర్‌కు చెందిన రామస్వామి శాస్త్రి 1882లో వైశాఖం తిరుణాల్ మహారాజా కాశీయాత్రను వర్ణిస్తూ '120 శ్లోకాల కాశీయాత్ర వర్ణన రాశాడు. సుబ్బరామ పట్టారు "ఆ పద్దీప" అనే 33 శ్లోకాల కావ్యాన్ని జమోరిన్ రాజ్యాన్ని విడిచి వెళ్లిన ఒక దీన బ్రాహ్మణ కుటుంబ గాధను వారు కొచ్చిన్ మహారాజు ఆశ్రయం పొందటానికి సహకరించిన అద్భుత అదృశ్య శక్తి గురించి చెప్పాడు. తిరువాన్కూర్ రాజవంశ చరిత్రను గణపతి శాస్త్రి లఘుకావ్యంగా "శ్రీమూల చరిత్ర" రాశాడు. అనంతగిరి "గురు దిగ్విజయ" పేరిట ఆది శంకరాచార్య చరిత్రను, తుళు బ్రాహ్మణులు తుళునాడు వదలి కొళత్తూర్ ఉదయవర్మ రాజ్యానికి చేరే కథను "బ్రాహ్మణ ప్రతిష్ట" కావ్యంగా, కొళత్తూనాడు ఉదయవర్మపై 8 శ్లోకాల "దేశ్యాష్ట కం", కొచ్చిన్‌కు చెందిన పరీక్షిత్ తంపురాన్ రాసిన చిన్నకావ్యం "మాల", వైశాఖం తిరుణాల్ మహారాజాపై కేశవన్ వైద్యం రాసిన "విశాఖ విలాసం" మద్రాస్ గవర్నర్ లార్డ్ నేపియర్ 1883లో త్రివేంద్రం సందర్శనను ఏళత్తూర్ రామస్వామి శాస్త్రి "గౌణ సమాగమం" కావ్యంగా, కద త్తనాడు రాజు నిర్వహించిన మహా మృత్యుంజయ యాగాన్ని వర్ణిస్తూ మీథలే మాదంకు చెందిన శంకరవారియర్ రచించిన "మహా మృత్యుంజయ చరిత్ర", కొచ్చిన్ మహారాజు మహా వాగ్దోరణిని, షష్టిపూర్తి ఉత్సవాన్నీ వర్ణిస్తూ నెల్లూరు కాండీకి చెందిన కృష్ణన్ నంబూద్రి రాసిన "మాతామహిషా షష్టి పూర్తి దశకం, తిరువాన్కూర్ వైశాఖం తిరుణాల్ మహారాజు చేసిన సేతుయాత్రపై టి.గణపతి శాస్త్రి రాసిన "సేతుయాత్రావర్ణన" మొదలైనవి కేరళలో ఉద్భవించిన సంస్కృత లఘు విలాస కావ్యాలుగా చరిత్ర ప్రసిద్ధి చెందాయి.❋



## 1901 నుండి 2000 వరకు - 20వ శతాబ్దం

### 318) భారత పర్యటన కర్త -కుట్టి కృష్ణ మారార్ -1900-1991

కేరళలో పట్టాంబిలో 14-6-1900న జన్మించిన కుట్టి కృష్ణ మారార్ బారతీయ సాహిత్య వ్యాఖ్యాత, వ్యాసరచయిత విమర్శకుడు. తప్పు అనిపించినది ఏదైనా ఎవరైనా లెక్క చేయకుండా విమర్శించే నిర్భీతి ఉన్నవాడు. సాహిత్య వ్యాప్తికి అవిరళ కృషి చేసినవాడు. మహాభారతంపై "భారత పర్యటనం" అనే చాలా గొప్ప గ్రంథాన్ని రాశాడు. ఇది చాలా ప్రాముఖ్యాన్ని తెచ్చి పెట్టింది. ఇది ఐ.సి.ఎస్.ఇ.సిలబస్‌లో బోధనా గ్రంథంగా ఉన్నది. మహాభారతంలోని పాత్రలు, పర్యటన స్థలాలు వాటి ప్రత్యేకతలపై రచించిన గ్రంథం ఇది.

పట్టాంబి సంస్కృత కళాశాలలో సాహిత్య శిరోమణి పాసై, కేరళ కళామండలంలో 15 ఏళ్ళు సాహిత్యాచార్యగా పని చేశాడు. ప్రముఖ మలయాళ మహాకవి వల్లతోల్ నారాయణ మీనన్‌తో కలిసి గ్రంథాలను ముద్రించాడు. మళయాళ ప్రముఖ పత్రిక మాతృభూమిలో ప్రూఫ్ రీడర్‌గా పని చేశాడు. పట్టాంబి శ్రీ నీల కంఠ సంస్కృత కాలేజి "సాహిత్య రత్న" పురస్కారం అందించింది. ఎం.పి.పాల్ అవార్డ్ కూడా లభించింది.

మళయాళ భాషా వాడకంపై రాసిన "మళయాళ శైలి" గ్రంథం చాలా పేరు తెచ్చి కేరళ సాహిత్య అకాడెమి అవార్డ్ పొందింది. సాహిత్య సల్లాపం, దంతగోపురం, కైవిలక్కు (సాహిత్య విమర్శ సంపుటి) మొదలైన 19 గ్రంథాలు రాశాడు. మారార్ రాసిన కళాజీవితం దన్నె (జీవితమే ఒక కళ) ఉత్తమ సాహిత్య స్థాయికి చెందినవి. 6-4-1973న 73వ ఏట మారార్ మరణించాడు.❀



## 319) "శుద్ధి సర్వస్వ"కర్త – తర్క తీర్థ పద్మ భూషణ్ లక్ష్మణ శాస్త్రి – 1901-1994

బ్రాహ్మణ కుటుంబంలో అర్చకత్వ శాఖలో 1901లో జన్మించిన లక్ష్మణ శాస్త్రి జోషి 14వ ఏట కృష్ణానదీ తీరాన ఉన్న దేవాలయాలకు నిలయమైన "వాయి" గ్రామం చేరి సంస్కృతంలో, హిందూ ధర్మ తత్వశాస్త్రాలలో నిధి అయ్యాడు. అక్కడ సంస్కృత పాఠశాల నెలకొల్పాడు దీనిలో సంస్కృతం నేర్పటానికి ఆంధ్ర నుంచి సంస్కృత పండితులు వచ్చేవారు. తర్క శాస్త్రంలో ప్రావీణ్యం పొంది తర్క తీర్థ అయ్యాడు. భారత స్వాతంత్రానంతరం ఏం యెన్ రాయ్ వంటి వారి ప్రభావానికి గురై, పాశ్చాత్య తత్వ శాస్త్రాన్ని అవలోడనం చేశాడు. ఆనాడు సంస్కృతంలో పేరున్నవారు, వారిని అనుసరిస్తున్నవారు నిజమైన హిందూ ధర్మాన్ని అనుసరిస్తున్నారా అనే ఆలోచనలతో "వైదిక్ సంస్కృతీ చ వికాస్" అనే గ్రంథాన్ని 1951లో రాశాడు. ఇవి పూనా యూనివర్సిటీలో ఇచ్చిన ఆరు ఉపన్యాసాల సారాంశం. వేద సంస్కృతీ ఆవిర్భావం భారతదేశంపై దాని ప్రభావాలను ఇందులో వివరించాడు. ఆధునిక భారతీయులు భౌతిక ప్రపంచానికి ఆధ్యాత్మిక ప్రపంచానికి మధ్య నలిగిపోతూ దారి తెలియక బలహీనులైపోతున్నారని చెప్పాడు. దీనివల్ల సామరస్యం కోల్పోయి కులమత వర్గాలలో కూరుకు పోయారని వ్యధ చెందాడు. తన మేధో వికాసనాన్ని చూపినందుకు 1955లో కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు పొందాడు. సాంప్రదాయ చాందస భావాలను త్యజించాలని పిలుపునిచ్చాడు జోషీ.

సంప్రదాయాన్ని ధిక్కరించి గాంధీమహాత్ముని అనుచరుడై ఉద్యమించాడు. అస్పృశ్యత నివారణకు హరిజనుల దేవాలయ ప్రవేశానికి పూనుకొని సఫలుడయ్యాడు.

హిందూ ధర్మంపై ఎవరికి ఏ సందేహం వచ్చినా జోషీ తీర్పు ఫైనల్‌గా ఉండేది. 1932లో ఆయన 29వ ఏట స్వాతంత్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నందుకు బ్రిటిష్ ప్రభుత్వం అరెస్ట్ చేసి జైలులో పెట్టింది. జైలులో ఉండగా హిందూ ధర్మ పండితునిగా దేశవ్యాప్త కీర్తి పొందాడు. వినోబాభావే వాయి గ్రామం వచ్చినప్పుడు ఆయన సలహాతో కేవలానంద సరస్వతి వద్ద ఇంగ్లీష్ నేర్చాడు. గాంధీ గారు కోమటి కులానికి చెందిన తన కుమారుడు రామ దాసుకు బ్రాహ్మణ కులానికి చెందిన చక్రవర్తుల రాజగోపాలాచారి గారి కూతురు లక్ష్మినిచ్చి కులాంతర వివాహం చేస్తే హిందువులందరూ తీవ్రంగా వ్యతిరేకించారు. రెండవ గవర్నర్ జనరల్‌గా ఉన్న రాజాజీ యువకుడైన జోషీ పండితుని ఈ వివాహం హిందూ ధర్మసమ్మతమమో వ్యతిరేకమో తేల్చి చెప్పమని కోరాడు. సర్వ శాస్త్ర పారంగతుడైన జోషి అది హిందూ ధర్మ సమ్మతమేనని తీర్పు చెప్పటమేకాక దగ్గరుండి వివాహం జరిపించి చరిత్రకెక్కాడు.

1960లో మరాఠీ భాషాభివృద్ధి కోసం జోషీ "మరాఠీ కోశం" తయారు చేశాడు. "విశ్వ కోశం" అనే విజ్ఞాన సర్వస్వాన్ని సంకలనం చేశాడు. వేదమంత్రాల నాధారంగా మరాఠీ భాషలో "ధర్మకోశం" రాశాడు. లక్ష్మణశాస్త్రి జోషీ విద్వత్తును గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 1976లో పద్మ భూషణ్‌ను, 1992లో పద్మవిభూషణ్ పురస్కారాలనిచ్చి గౌరవించింది. బాంబే యూనివర్సిటీ ఎల్ ఎల్ డి డిగ్రీ ప్రదానం చేసింది. ప్రధమ భారత ప్రధాని జవహర్లాల్ నెహ్రు ఉన్నత విద్యకు, భారీ పరిశ్రమలకు కేటాయిస్తున్న నిధులపై హర్షం వ్యక్తపరచిన దూరదర్శి జోషి. 94వ ఏట 1994లో జోషీ పండితుడు మహాప్రస్థానం చెందాడు.

జోషీ పండితుడు ప్రప్రధమంగా సంస్కృతంలో "శుద్ధి సర్వస్వము" అనే గ్రంథాన్ని రాసి కులాంతీ కరణ ఎలా చేయాలో వివరించాడు. 26 భాగాలతో 18 వేల పేజీలతో క్రీ.పూ 1500 కాలం నుండి 18వ శతాబ్దం వరకు ఉన్న హిందూ ధర్మాన్ని సకల వేద శాస్త్రాలు వాటి వివిధ వ్యాఖ్యానాలు కూలం కషంగా అధ్యయనం చేసి నిగ్గు తేల్చి "ధర్మ కోశం" అనే ఉద్గ్రంథాన్ని రచించాడు. మరాఠీ భాషలో "ఆనంద- మీమాంస" అనే గ్రంథాన్ని రసం, సౌందర్యంలను చర్చిస్తూ రాశాడు. 1940లో సంస్కృతంలో "హిందూ ధర్మం" గ్రంథ రచన చేశాడు. భారత, పాశ్చాత్య దేశాలలో భౌతిక ప్రవృత్తితత్వ శాస్త్ర విధానాలపై తులనాత్మక పరిశోధన చేసి హిందూయిజం జాద్వాడ్ పుస్తకం 1941లో రాశాడు. 1958లో "వైదిక సాంస్కృతి చ వికాస్" గ్రంథం రాశాడు. 18 ఉపనిషత్తులను మరాఠీలోకి అనువదించిన సాహితీ మూర్తి జోషీ.❁

## 320) కాశ్మీర్ సమస్య నాటక కర్త – నిరపజే భీమ దత్త –1903

కర్ణాటకలో దక్షిణకన్నర జిల్లా కాన్యన్ గ్రామంలో 1903లో భీమదత్త నిరపజే జన్మించాడు. తండ్రి శంకర భట్. కాశ్మీర సంధాన సముద్యమ, హైదరాబాదా విజయ అనే రెండు నాటకాలు సంస్కృతంలో రాశాడు. మొదటిది విద్యార్థి దశలోనే రాసిన నాటకం. చారిత్రాత్మక రాజకీయ నాటకం. 7 అంకాకాలలో కాశ్మీర సమస్యపై రాశాడు. సమకాలీన రాజకీయాన్ని ప్రతిబింబించిన నాటకం. స్త్రీ పాత్రలేని నాటకం కూడా. రెండవదైన హైదరాబాద విజయం నాటకంలో భారత స్వాతంత్ర అనంతర పరిస్థితులు హైదరాబాద్ రాష్ట్రం ఇండియన్ యూనియన్‌లో చేరటంమొదలైన పది దృశ్యాలున్న నాటకం. ఈ రెండు నాటకాలలో నిరాపజే భారత దేశ సమగ్రతను గట్టిగా సమర్ధించి దేశభక్తిని చాటాడు.❋



## 321) రుక్ విసర్గసంధి కర్త – వట కృష్ణ మోహన్ –1905–1950

1905లో జన్మించి 45 ఏళ్ళు మాత్రమే జీవించి 1950లో మరణించిన బెంగాల్‌కు చెందిన బ(వ)ట కృష్ణ ఘోష్ భారతీయ భాషా శాస్త్రవేత్త మాత్రమే కాక ఇండో యూరోపియన్ భాషలను ప్రత్యేకంగా అధ్యయనం చేసిన వాడు. సంస్కృతం ఇండో యూరోపియన్ భాషా శాస్త్రాలపై ఎన్నో గ్రంథాలు రాశాడు. పాళీ భాషపై విలెం గ్రీగర్ జర్మన్ భాషలో రాసిన పుస్తకాన్ని ఇంగ్లీష్‌లోకి అనువదించి కలకత్తా యూనివర్సిటీ నుండి ప్రచురించాడు. సంస్కృతంలో ఆయన మొదటి రచన– "లెస్ ఫార్మేశంస్ నామినేల్స్ఎట్ వేర్బెల్స్ ఎం పు డు సాంస్క్రిట్"

**వట కృష్ణ ఘోష్ ఇతర రచనలు–** ఆపస్తంభ అండ్ గౌతమ, గోదే అండ్ హిస్ ఫాస్ట్, కలెక్షన్స్ ఆఫ్ ది ఫ్రాగ్ మెంట్స్ లాస్ట్ బ్రాహ్మణాస్ పాణిని, ఇండో యూరోపియన్ ఆరిజిన్ ఆఫ్ సాంస్క్రిట్, వేదిక్, పాళీ లిటరేచర్ అండ్ లాంగ్వేజెస్, ఎసర్వే ఆఫ్ ఇండో యూరోపియన్ లాంగ్వేజెస్, ఏ లా ఆఫ్ విసర్గ సంధి ఇన్ రుక్ సంహిత, విజ్ఞాన బాడ, హిందూ ఐడియా ఆఫ్ లైఫ్ అకార్డింగ్ టు గృహ్య సూత్రాస్ అండ్ శ్రౌత సూత్రాస్ ధర్మ శాస్త్ర, అర్ధ శాస్త్ర అండ్ కామ సూత్ర, లింగ్విస్టిక్ ఇంట్ర డక్షన్ టు సాంస్క్రిట్.❋

## 322) సర్వజ్ఞ చంపు కర్త - హిట్టన హళ్లి గోవింద్ -1905

హిట్టనహళ్లి గోవిందభట్ట 1905లో కర్ణాటకలో దక్షిణ కెనరా జిల్లా మారుమూల గ్రామంలో జన్మించాడు. తండ్రి నీలకంఠ భట్ తల్లి భాగీరధి. హోసమానే రామచంద్ర శాస్త్రి గణేశ శాస్త్రి కూలంకషంగా శాస్త్రాధ్యయనం చేశాడు. శ్రీ సర్వజ్ఞేంద్ర చంపును, శ్రీ బ్రహ్మానంద గణేశా యోగేశ్వరాణాం జీవన చరితం అనే చారిత్రాత్మక రచన చేశాడు. శ్రీ సర్వజ్ఞేంద్ర చంపు అనంత భట్టు చంపూ భారతాన్ని అనుకరించి రాసింది. ఇది చారిత్రిక చంపు. స్వర్ణవాలి మఠ చరిత్ర ఉన్నది. వేదాంతానికి దీన్ని అంకితమిచ్చాడు -ఇలామొదలౌతుంది-

"కవితా సవితానాహం కిమపి లేహ్యం లిఖేచ్చమే హస్తా -తదపిచ విబుధైర్ దయయా పరుగుణ పరమాణుతుస్థిర అభిగ్రాహ్యం

మరో మనోజ్ఞ చంపు-


"తహా యతీంద్రో వ్యవహార ధుర్యః తహా తపస్యయా వాపి దుర్య దుర్యహా -యధా మృగేన్ద్రో మృగరాజా రాజాః -తదా యతీన్ద్రో నటరాజ ఆసీత్"

శ్రీయ బ్రహ్మానంద గణేశయోగేశ్వరాణాం జీవన చరితంలో 8 కాండలు ఉన్నాయి. బ్రహ్మానంద యతీశ్వరులే కథానాయకులు.❀



## 323) శౌనక శిక్ష కర్త - కె యెన్ ఏం దివాకరన్ నంబూద్రి -1906

కేరళలో కోతకార దగ్గర నంది కులంలో కె యెన్ ఏం దివాకరన్ నంబూద్రి1906లో జన్మించాడు. త్రిపుంతూర్ సంస్కృత కాలేజీ లెక్చరర్. శాస్త్ర దివాకర, శాస్త్ర రత్న బిరుదులూ పొందాడు. శంకరాచార్య చరితం శౌనక శిక్ష, వర్ణోచ్చరణ దీపికా , ఋగ్వేద జ్యోతిషం సంస్కృతంలోను ఆది శంకరాచార్య అండ్ కాలడి ఇంగ్లిష్‌లోను రచించాడు.❀



## 324) క్రీస్తు భాగవత మహాకావ్య కర్త – పి.సి.దేవా స్సియా – 1906-2006

కేరళకు చెందిన సంస్కృత కవి, మహా విద్వాంసుడు పి.సి.దేవాస్సియా 1906లో జన్మించి నూరేళ్ళ నిండుజీవితం గడిపి 2006లో మరణించాడు. ఆయన రచించిన క్రీస్తు భాగవత మహాకావ్యం బహు ప్రశస్తి చెంది ఎన్నో పురస్కారాలను అందించింది. ఇది 1976లో రాస్తే 1977లో ప్రచురితమైంది. 33 కాండలలో 1600 శ్లోకాలతో 433 పేజీల కావ్యం ఇది. సంస్కృత మహా కావ్య లక్షణాలన్నీ ఉన్నకావ్యం. 33 కాండాలు యేసు క్రీస్తు జీవించిన 33 ఏళ్లకు ప్రతీక కావచ్చు. ప్రతి సంస్కృత శ్లోకం తర్వాత ఇంగ్లిష్ అనువాదం కూడా ఉండటం ప్రత్యేకత. మూడు పేజీల ఉపోద్ఘాతంలో కవి ఈ రచనకు ఐదేళ్లు పట్టిందని తెలిపాడు. బైబిల్‌ను ఏదో ఆషామాషీగా సంస్కృతంలోకి మార్చటం తన ఉద్దేశ్యం కాదని మహాకావ్యంగా దాన్ని మలచటమే ధ్యేయమని కవి చెప్పుకొన్నాడు. దీనికి వి రాఘవన్ ముందుమాటలు వ్యాఖ్యానం రాస్తే, కుంజున్నిరాజా ప్రశంసా వాక్యాలు రాసి కావ్య గౌరవం కల్గించారు. K. R. Srinivasa Iyengar wrote that "The Gospel-story is retained in essentials, but...

...the sonority of Sanskrit gives a fresh morning splendour and resonance to Jesus' divine ministry. Mary held Joseph' hand as Arundhati did Vasishtha; Just as Vasudeva hid his son Krishna in Nanda' house, so did Joseph take Jesus to Egypt for his safety; Lazarus' sisters embraced him as he emerged out of his tomb, even as Devayani embraced Kacha as he revived after death.... in betraying Jesus with a kiss, wasn' t Judas anticipating Godse who was to kill the Mahatma after first saluting him? The similes come naturally, and rather bring out the basic unity of texture that binds all human history.[3]:xvi అని మెచ్చాడు. ఈ కావ్యానికి 1979లో మహారాణి

సేతు పార్వతీబాయి అవార్డు వచ్చింది. 1980లో సంస్కృత రచనకు దేవాప్సియాకు సాహిత్య అకాడెమి పురస్కారం ఇచ్చింది.

ఈ కావ్య శ్లోక శోభ చూద్దాం–

"భిక్షా త్వయ దక్షి జహాస్ట దత్తా నా జీవియాత్రాః వామకరైజ తేస –ధన్యస్య చైవం నిభృతాం కృతస్య పితా ఫలం దాశ్యతి గుప్తా దర్శి"–

"యువం మా సై కి నూత నిధిమ్ ఆత్మార్థం ఉర్వ్యం హి యస్మాత్ –కిటిద్యాస్ తం కాయం ఉపనయన్తి అత్ర మూల్జంతి చౌరాసి స్వర్గ తన్ – సైల్చింయుత విభవిం యేహి తైర్ న హ్రి యంతే విత్తం యస్మిన్ భవతి భువనే తత్ర చిత్తం చ వైల్సితే"

"క్వ మే నిర్వియాతి బుద్ధిః క్వ శ్రియే సుమహి కది –మోహిద్ భువి మై రురుక్తి జుర్ లిమాయివి మహి గిరిమ్"

"కిరు ష్జతి ద్రమతే క్రమస్వ భో అపరిధమ్ కృతం ఏ భిర్ ఇద్రసం –యద్ ఇమే నా విదుః స్వకర్మ వినా చ వీ త్వ త్కరు ష్జిమ్ అపి ప్రభో"❁



## 325) అద్వైత బోధ దీప్తికర్త – స్వామి కరపత్ర –1907–1982

1907లో ఉత్తరప్రదేశ్ ప్రతాపగడ్ దగ్గర భాటిని గ్రామంలో హరినారాయణ ఓజాగా కరపత్రి స్వామి జన్మించాడు. హిమాలయ దశనామి ముని సంప్రదాయానికి చెందినవాడు. జ్యోతిర్మఠ శంకరాచార్య స్వామి బ్రహ్మానంద సరస్వతికి ముఖ్య శిష్యుడు. వారణాసిలో "ధర్మ సంఘం" స్థాపించాడు. జీవితంలో ఎక్కువకాలం కాశీలోనే గడిపాడు. అద్వైత వేదాంతాన్ని బహుళ ప్రచారం చేసిన వారిలో కరపత్ర స్వామి ఒకడు 1948లో "రామరాజ్య పరిషత్" అనే రాజకీయ పార్టీ నెలకొల్పాడు. 1951లో లోక్ సభకు జరిగిన మొదటి ఎన్నికలలో ఈ పార్టీ 3 సీట్లు ఉత్తర ప్రదేశ్‌లో గెలిచింది. దీనిద్వారా హిందూ కోడ్ బిల్లును వ్యతిరేకిస్తూ ప్రచారం చేశాడు. భారతీయులందరికీ ఒకే సివిల్ కోడ్ ఉండాలని, అది ధర్మ శాస్త్రాలపై ఆధారపడి ఉండాలని కరపత్రి స్వామి వాదన. కాని ఆపలేక పోయాడు 1958లో తన పార్టీని జనసంఘ్ పార్టీలో స్వామి విలీనం చేశాడు. 1966లో గో సంరక్షణ ఉద్యమం చేబట్టి ఆవులను చంపరాదని, గో మాంసాన్ని నిషేధించాలని తీవ్రంగా దేశవ్యాప్త ఉద్యమం చేశాడు. సనాతన ధర్మాన్ని ప్రచారం

చేయటానికి 1948 ఏప్రిల్ 18న "సన్మార్గ" అనే దిన పత్రిక పెట్టి నడిపాడు. 1982లో 75వ యేట మరణించాడు.

కరపత్ర స్వామి సంస్కృతంలో "అద్వైత బోధ దీపిక" అనే గ్రంథాన్ని 12 అధ్యాయాలతో రాశాడు ఇది. తమిళ ఇంగ్లీష్ భాషలలో అనువాదమైంది. "టాక్స్ విత్ రమణ మహర్షి"ని రికార్డ్ చేసిన మునగాల వెంకట రామయ్య 8 అధ్యాయాలను ఇంగ్లీష్ లోకి అనువాదం చేశాడు. అద్వైత బోధ దీపిక శంకరాచార్యులవారి అద్వైతాన్ని అతి సులభంగా తేలికగా అర్ధం చేసుకోవటానికి వీలు కలిగించింది. భగవాన్ రమణ మహర్షి ఎవరికైనా సందేహాలుంటే అద్వైత కర దీపికను చదివి హాయిగా అనుమాన నివృత్తి చేసుకోవచ్చునని దీనిని రికమెండ్ చేసేవారు. "శ్రీ విద్య -వరివస్య" అనే కరపత్రిస్వామి వ్యాసాలను సంకలనం చేసి స్వామి దత్తాత్రేయానంద అనే సీతారామ కవిరాజ ప్రచురించాడు.❀



## 326) ఉత్తర రాఘవ ప్రచురణ కర్త, సంస్కృత సంగీత విద్వాంసుడు - వి.రాఘవన్ -1908-1979

1908లో జన్మించి 71వ ఏట 1979లో మరణించిన వి.రాఘవన్ సంగీతంలో సంస్కృతంలో సవ్యసాచి. అనేక గ్రంథాల రచయిత, అత్యున్నన్నత పురస్కార గ్రహీత. 120 గ్రంథాలు, 1200 పరిశోధన వ్యాసాలు రాసిన మహా రచయిత రాఘవన్. 1963లో భోజుని బృహత్ గ్రంథమైన శృంగార ప్రకాశికను అనువదించాడు. దీని అనువాదానికి, అత్యున్నత వ్యాఖ్యానానికి 1966లో సాహిత్య అకాడెమి అవార్డ్ పొందాడు. దీన్ని హార్వర్డ్ ఓరియెంటల్ సిరీస్ వారు మళ్ళీ ప్రచురించారు. రవీంద్రుని మొదటి నాటకం "వాల్మీకి ప్రతిభ"ను అనువదించాడు. బోయవాడు పరిణామం చెంది వాల్మీకి మహర్షిగా మారిన కథను టాగూర్ అపూర్వంగా సృష్టించాడు. మయూరజుని "ఉత్తర రాఘవం" నాటకాన్ని శోధించి సాధించి వెలువరించాడు. 1958లో "సంస్కృత రంగ" అనే నాటక శాల స్థాపించి చాలా సంస్కృత నాటకాలు ప్రదర్శించాడు. కర్ణాటక సంగీతంలో ప్రావీణ్యం సాధించి మద్రాస్ మ్యూజిక్ అకాడేమికి 1944 నుండి మరణించే దాకా సెక్రెటరిగా ఉన్నాడు. ఆయన కుమార్తె నందినీ రమణి గొప్ప కళా విమర్శకురాలు.

ఆయన మరణానతరం "వి.రాఘవన్ రిసెర్చ్ సెంటర్"ను నెలకొల్పారు. 2008లో రాఘవన్ ప్రధమ శత జయంతిని ఘనంగా నిర్వహించారు. రాఘవన్‌పై "స్మృతి కుసుమాంజలి" అనే ప్రత్యేక సావనీర్ ప్రచురించారు. అందులో ప్రెసిడెంట్ సర్వేపల్లి రాధాకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ వి.వి.గిరి గార్ల ప్రశంసలున్నాయి. ప్రముఖ రచయిత వ్యాఖ్యాత కపిల్ వాత్సాయన్ "No work on Indian aesthetics is complete without its quoting Dr. Raghavan" అన్నమాటలు యదార్థం.❋

## 327) శిల్ప కళాధ్యయన శీలి పద్మభూషణ్ – కంబార్ శివ రామమూర్తి -1909-1983

భారతీయ మ్యూజియాలజిస్ట్, కళా చరిత్రకారుడు, చెన్నై గవర్నమెంట్ మ్యూజియం క్యురేటర్, గొప్ప సంస్కృత విద్వాంసుడు సి.శివరామమూర్తి. అనేక మోనోగ్రాఫుల, గైడ్ పుస్తకాల రచయిత. సౌత్ ఇండియన్ ఎపిగ్రఫీపై సాధికారికత ఉన్నవాడు. ఎకడమిక్ విద్యానంతరం చెన్నై ప్రభుత్వ మ్యూజియం క్యురేటర్‌గా ఉద్యోగంలో చేరి, తర్వాత భారత పురాతత్వ శాఖలో కలకత్తా ఆర్కియలాజికల్ సెక్షన్ సూపరింటెండెంట్ అయ్యాడు. తరువాత జాతీయ మ్యూజియం కీపర్ అయి, చివరకు డైరెక్టర్ అయ్యాడు. ఇంటర్ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మ్యూజియమ్స్‌లో ఎక్సి క్యూటివ్ మెంబర్ అయి, చైర్మన్‌గా సేవలు అందించాడు. అనేక విషయాలను శోధించి, పరిశోధించి విలువైన పత్రాలు రచించి సమర్పించి ప్రచురించాడు. ప్రముఖ ఆర్కియాలజిస్ట్ జువాలజిస్ట్ ఫ్రెడరిక్ హెన్రి గ్రేవ్లితో కలిసి 1938లో ఘనంగా "యాంటి క్విటీస్ అండ్ ఇండస్ట్రియల్" ప్రదర్శన నిర్వహించాడు. శివ రామమూర్తి ఫ్రెంచ్ భాషలో రాసినఉత్తమ గ్రంథమైన "ఎల్ ఆర్ట్ ఇండే"కు దాదాభాయ్ నౌరోజీ పురస్కారం లభించింది. ఇది జర్మని, ఇటలి, ఇంగ్లీష్ మొదలైన భాషలలోనూ ముద్రణ పొందింది. జవహర్లాల్ నెహ్రూ మెమోరియల్ ఫండ్ ఏర్పరచినపుడు ట్రస్టీలు మొదటిసారిగా మూర్తి ప్రతిభా విశేషాలు గుర్తించి సత్కరించారు.

భారతీయ సాహిత్యంలో నటరాజ మూర్తి గురించి రెండేళ్ళు విస్తృతమైన పరిశోధనలు చేసి శివ రామమూర్తి "నటరాజ ఇన్ ఆర్ట్ థాట్ అండ్ లిటరేచర్" అనే అపూర్వ గ్రంథం రచించాడు. తన తలిదండ్రులకు అంకితం చేసిన ఈ మహత్తర గ్రంథం ఆయన ప్రతిభా సర్వస్వంగా ఉంది. 412 పేజీలతో వెలువడిన ఈ ఉద్గ్రంథం

నటరాజ విశ్వ నృత్య హేల "శివ తాండవం"ను, దానికి కరణాలుగా సహకరించిన బ్రహ్మ, విష్ణువులను సమగ్ర సర్వ స్వరూపంగా ఆవిష్కరించి చిరస్మరణీయం చేసింది. ఈ శివ తాండవ నృత్యానికి మూలాధారం వేదాలలో ఉన్నది. నటరాజ తత్త్వం భారతీయ సరిహద్దులు దాటి విశ్వ వ్యాప్తమైంది. దీనికి ముఖ్య కారకుడు శివరామ మూర్తి. ప్రముఖ చిత్రకారుడు, చరిత్రకారుడు ఆనంద కుమారిల స్వామి కూడా నటరాజ విగ్రహంపై పరిశోధన చేసినట్లు మనకు తెలుసు.

శివ తాండవ నటరాజ మూర్తి చిదంబరంలో ఉన్నాడు. ఆ మూర్తి వైభవం వర్ణించటానికి ఆది శేషుడు కూడా చాలడు అంటారు. శివ తాండవంలో సత్యం శివం సుందరం సమ్మిళితమై ఉంటాయని స్పష్టం చేశారు. కాలానికి, కాల రాహిత్యానికీ ఈ శిల్పం మనోహరమైన ఉదాహరణ. సంప్రదాయం ఆధునికతల మేళ వింపు ఉన్న మూర్తి. శివ రామ మూర్తి బక్కపలుచగా నుదుట విభూతి, కుంకుమ బొట్టుతో ఉండి మహా మహోపాధ్యాయ అప్పయ దీక్షితుల వంశానికి చెందిన వాడనిపిస్తాడు. ఆయన తండ్రి గొప్ప సంస్కృత విద్వాంసుడు, సివిల్ ఆఫీసర్. "సుందర రామాయణం" రచించిన కలంబూర్ సుందర శాస్త్రి.

1983లో శివరామ శాస్త్రీ నటరాజ స్వామి విభూతిపై ప్రసంగిస్తూ అకస్మాత్తుగా గుండెపోటుతో 74వ ఏట మరణించి నటరాజ సాన్నిధ్యాన్ని చేరుకొన్న ధన్యజీవి. మూర్తి గ్రేట్ బ్రిటన్, ఐర్లాండ్ దేశాల రాయల్ ఏషియాటిక్ సొసైటీల గౌరవ ఫెలోషిప్ పొందినవాడు. కంచి పరమాచార్యులు శ్రీశ్రీ చంద్ర శేఖరేంద్ర స్వామివారు మూర్తిని సన్మానించి "విచిత్ర చిత్త" అనే సార్థక బిరుదు ప్రదానం చేశారు. 8వ శతాబ్దపు పల్లవ రాజు మహేంద్రవర్మకు ఈ "విచిత్ర చిత్త" బిరుదు ఉండేదని, కుడుమియామలైలోని మహేంద్ర వర్మ చెక్కించిన బ్రహ్మ విష్ణు మహేశ్వర త్రిమూర్త్యాత్మక శిల్ప విగ్రహం వద్ద శిలా శాసనంపై ఉన్నదట. ఎన్నో అవార్డులు రివార్డులు అందుకొన్న మూర్తికి 1975లో భారత ప్రభుత్వం పద్మ భూషణ పురస్కారం అందజేసి సన్మానించింది. దేశ విదేశాలలో అనేక యూనివర్సిటీలకు వెళ్లి గెస్ట్ లెక్చర్లు ఇచ్చాడు. దాదాపు 35 గ్రంథాలు రచించాడు. మూర్తి మరణానంతరం బాంబే ఏషియాటిక్ సొసైటీ "కాంప్ బెల్ మెమోరియల్ గోల్డ్ మెడల్"ను అందజేసింది.

**శివరామ మూర్తి రచనా సర్వస్వం**

- Mahabalipuram (1952)
- Early Eastern Chalukya Sculpture (1962)
- Indian Epigraphy and South Indian Scripts (1966)
- Nataraja in Art, Thought, and Literature (1974)

- L'Art en Inde (1977)
- Chitrasutra of the Vishnudharmottara (1978)
- Kalugumalai and Early Pandyan Rock-cut Shrines
- Sanskrit Literature and Art: Mirrors of Indian Culture
- La stupa du Barabudur (in French)
- An Album of Indian Sculpture
- Rishis in Indian art and literature
- Royal conquests and cultural migrations in South India and the Deccan
- Vijayanagara paintings
- Numismatic parallels of Kalidasa
- Sculpture inspired by Kalidasa
- Sri Lakshmi in Indian art and thought
- Ramo Vigrahavan dharmah-Rama embodiment of righteousness
- Birds and animals in Indian sculpture
- Sanskrit literature and art
- Mirrors of Indian culture
- Satarudriya -- Vibhuti of Siva' Iconography
- Panorama of Jain art
- Shiva
- Ethical fragrance in Indian art and literature
- Indian Painting
- Approach to nature in Indian art and thought
- The art of India
- Expressive Quality of Literary flavour in Art
- Early Andhra Arts and Iconography
- Indian Bronze
- The Chola temples: Thanjavur, Gangaikondacholapuram & Darasuram
- Early eastern Chalukya sculpture

- Harappan Art
- Indian epigraphy and South Indian scripts
- Bhagavatpada-Sri Sankaracharya
- Epigraphical echoes of Kalidasa
- 5000 years of the art of India: with Mario Bussagli
- An Introduction to South Indian Temple Architecture and Sculptures, co-authored with F. H. Gravely
- Illustrations of Indian Sculptures, co-authored with F. H. Gravely
- Guide to the Archaeological Galleries, co-authored with F.H.Gravely
- Notes on Hindu Images, co-authored with F. H. Gravel❀

## 328) మణి దీప కర్త - కె.పి.యెన్.పిశోడి - 1909-2004

95 ఏళ్ళు పూర్ణాయుస్సుతో వర్ధిల్లిన కె.పి.నారాయణ పిశరోడి 23-8-1909న కేరళలోని పాలకాడు జిల్లా పట్టాంబి దగ్గర పుతిస్సేరి పశుపతి నంబూద్రి, నారాయణి పిశురస్యార్ దంపతులకు జన్మించాడు. మహా విద్వాంసులైన పున్నస్సేరి నంబి నీల కంఠ శర్మ, అత్తూర్ కృష్ణ పిశరోడిల వద్ద సంస్కృత కావ్యాలు శాస్త్రాలు అధ్యయనం చేశాడు. 1932లో పట్టాంబిలోని సంస్కృత కళాశాల నుండి సాహిత్య శిరోమణి పరీక్ష ఉత్తీర్ణుడై చాలా స్కూళ్ళు, కాలేజీలలో సంస్కృత, మళయాళలను బోధించాడు. కేరళ వర్మ కాలేజిలో రిటైర్ అయ్యాక యూనివర్సిటి గ్రాంట్స్ కమిషన్ ఫెలోషిప్ సాయంతో పరిశోధన చేశాడు. మణి దీపం, కళాలోకం, శ్రుతి మండపం, ధనంజయం, తోరణాయుధాంకం, కాళిదాస హృదయం, అత్తూర్, నాట్య శాస్త్రం (అనువాదం) రచించాడు. సాహిత్య నిపుణ, పండిత తిలకం, సాహిత్య రత్నం బిరుదులు పొందాడు. కేరళ ప్రభుత్వసాహిత్యం సేవకు అందజేసే అత్యున్నత "ఎదు తచ్చన్" పురస్కారం అందుకున్నాడు. 20-3-2004న 95వ ఏట నారాయణ పిశరోడి నారాయణ లోకం వైకుంఠం చేరుకున్నాడు.❀

## 329) ఉషానిరుద్ధ నాటకకర్త - విఘ్నేశ్వర శర్మ -1909

తండ్రి వెంకట రమణ పండిట్. గురువు సుబ్బన్న భట్. ఇతని రచనలు- సంస్కృతంలో సృజన రచనలు, కన్నడ రచనలు, పాటలు కలగూర అని విభజించారు. చనిపోయే నాటికి వెలుగు చూడలేదు.

సంస్కృతంలో రాసిన ఉషానిరుద్ధం నాటకం అచ్చుకాలేదు. రత్నాంగుళీయకం హాస్య రచన హస్త కౌస్తుభం, ధర్మ విప్లవం, కామినీ కౌరవమ్. భార్గవి చారిత్రాత్మక నాటకం ప్రచురణ కాలేదు. ఇందిరా వైభవం ఖండకావ్యం- ఇందిరాగాంధీ జీవిత చరిత్ర. ఇందిరాగాంధీపై చాలాశ్లోకాలు గీతాలు రాశాడు. మూకాంబికాస్తుతి, శివ గౌరీ స్తుతి, వాణీ వందనం మొదలైనవి చాలా రాశాడు. రేణుకా ఖండకావ్యం రాశాడు. విఘ్నేశ్వర శర్మ కవిత్వంలో సంగీతం ప్రతిధ్వనించి చెవులకు పరమానందం కలిగిస్తుంది.❀



## 330) లోక్ సభకు ఎన్నికైన సంస్కృత, మైథిలీ భాషా కవి - సురేంద్ర ఝా (సుమన్) -1910-2002

"సుమన్ జీ" అని అందరూ గౌరవంగా పిలిచే సురేంద్ర ఝా సుమన్ సుప్రసిద్ధ మైథిలీ కవి, రచయిత, పబ్లిషర్, ఎడిటర్, శాసన సభ్యుడు, పార్లమెంట్ సభ్యుడు. మైథిలి సంస్కృతిని పరిరక్షించి వ్యాప్తి చేసినవాడు. 40 దాకా మైథిలి భాషలో పుస్తకాలు రచించాడు. సంస్కృతం హిందీ, మైథిలి పుస్తకాలకు సంపాదకత్వం వహించాడు. అనేక ప్రభుత్వపాలనా సంస్థలలో సభ్యుడై సేవలందించాడు.

సురేంద్ర ఝా 10-10-19 10న బీహార్ రాష్ట్రం సమస్తిపూర్ జిల్లా బల్లిపూర్ గ్రామంలో జన్మించాడు. తండ్రి భువనేశ్వర్ ఝా ప్రసిద్ధ ఆయుర్వేద భిషక్. కుటుంబం తరతరాలుగా సంస్కృత పండితులకు నిలయం. ముజఫర్ నగర్‌లోని ధర్మరాజ సంస్కృత కళాశాలలో చేరి చదివి సాహిత్యాచార్య (డిగ్రీ) బెంగాలీ భాషలో "కావ్య తీర్ధ" పాసైనాడు. 25వ ఏట బెగూ సరాయ్‌కి చెందిన గంగాదేవిని వివాహమాడి ఒక కుమారుడికి ఇద్దరు కుమార్తెలకు తండ్రి అయ్యాడు. దర్భంగా ఎల్.యెన్.ఎం.యు.యూనివర్సిటీలో

మైథిలీ భాషచార్యుడుగా రిటైర్ అయ్యాడు. 6వ లోక్‌సభకు దర్భంగా నుంచి జనతా పార్టీ టికెట్‌పై ఎన్నికయ్యాడు.

సుమన్ జీ గద్య పద్యాలలో సవ్య సాచి. బహుభాషా కోవిదుడు. అందువలననే ఆనాటి రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ గారి చేత పురస్కారం అందుకొన్నాడు. 1981లో సాహిత్య అకాడెమీ అవార్డ్, పాట్నాలోని మైథిలీ అకాడెమి నుంచి “విద్యాపతి” పురస్కారం పొందాడు.

సాహిత్య అకాడెమీలో మైథిలీ భాష ప్రతినిధిగా, మైథిలి సలహా సంఘ సభ్యుడిగా ఉన్నాడు. అఖిలభారత మైథిలీ సాహిత్య పరిషత్‌కు అధ్యక్షుడై ఆ భాషకు విలువైన సేవలు అందించాడు. దర్భంగాలోని వైదేహి సమితితో సన్నిహిత సంబంధాలున్నాయి. ఆధునిక మైథిలి భాషలో సర్వోత్కృష్ట స్థానం సుమన్‌జీకి ఉన్నది. వర్ణనలు అలంకారాలతో ఆధునిక మైథిలీ సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ఏకైక రచయితగా గుర్తింపు పొందాడు.

సుమన్ ప్రకృతి అందాలు, అద్భుతమైన భావనా పటిమ సరళత, గ్రామీణ సౌందర్యవర్ణనలతో రచించిన 25 కవితల సంపుటి “పయస్విని” 1971లో సాహిత్య అకాడెమి అవార్డ్‌ను పొందింది. అందులో రూపకాలంకారంపై గొప్ప ప్రయోగాలు చేసి అద్భుతః అనిపించాడు. కవిత్వాన్ని పాడి ఆవుతో పోలుస్తూ అధర్వ వేదంలోని పృధ్వీ సూక్తం, బృహదారణ్యక ఉపనిషత్‌లోని “వాగ్ధేనువు”ను “పర బ్రహ్మం”తో పోల్చినట్లు రచించాడు. ఇందులో వర్ష ఋతువు తామసిలాగా మంచిదని, మృత్యుంజయ, పాడి ఆవు, నదిలను రసవంతి అంటే అందమైన కృశించిన స్త్రీతోను, పర్వతాన్ని ముసలివాడు, యువకుడు, చిన్నపిల్లవాడితోను పోల్చాడు.

1962లో రాసిన “దత్తావతి” చైనా ఇండియా యుద్ధాన్ని వర్ణిస్తే, “భారత్ వందన్”, “అంతర్నాద్”లలో దేశభక్తి కనిపిస్తుంది. మహా భారతంలోని “ఉత్తర”పై ఖండ కావ్యం రాశాడు. ఆయన కవిత్వంలో సంస్కృత పదాడంబరం, ఉపమ, ఉత్ప్రేక్ష అలంకార వైభవం ప్రాచీన సంస్కృత కావ్యాల ఛందస్సు ఉన్నట్లు దండిగా ఉండటం ప్రత్యేకత. వృక్షంపై మహాద్భుత భావగీతం రాశాడు. ఇది ప్రపంచ సాహిత్యంలో ఉన్న గొప్ప కవితలతో సరి తూగుతుంది అని విశ్లేషకుల అభిప్రాయం. ఇస్మాయిల్ కవి “చెట్టు నా ఆదర్శం” కవిత ఇక్కడ మనకు గుర్తుకు రావటం సహజమే.

బెంగాలీ, సంస్కృత భాషా రచనలను సుమన్ జీ అనువదించాడు. మైథిలి కవిత్వంపై సంస్కృత ప్రభావం అనే పుస్తకం రాశాడు. వైదేహి పత్రికకు సంపాదకుడై అస్సామీ మైథిలీ బెంగాలీ, మణిపూరీ, నేపాల్ ఒరియా రచనలను ఆంగ్లీకరించాడు. 92 ఏళ్ళ వయసులో 5-3-2002న దర్భంగాలో సుమంజీ మరణించాడు. ఆయన గౌరవార్థం ఆచార్య సుమన్ చౌక్‌ను దర్భంగాలో ఏర్పాటు చేశారు.❁

## 331) ధ్రువ చరిత్ర కర్త – కానరాది విఠలో పాధ్యాయ –1910

కానరాది విఠలోపాధ్యాయ 1910లో కర్ణాటక కానరాదిలో సుబ్బలక్ష్మీ అమ్మ, సుబ్రహ్మణ్య ఉపాధ్యాయలకు జన్మించాడు. ఉడిపి సంస్కృత కాలేజిలో శ్రీనివాసభట్టు వద్ద సంప్రదాయ విధానంలో స్సంస్కృతం చదివాడు. ధ్రువ చరిత్రం, ప్రహ్లాద చంపు ఆయన సంస్కృత రచనలు. కన్నడంలో గోపాల దండకం, మంగళాష్టకం రాశాడు. ధ్రువ చరిత్రం 15 ఆశ్వాసాల కావ్యం. ధ్రువుడు కుబేరునితో చేసిన వీరోచిత పోరాటాన్ని చక్కగా చిత్రించాడు. ధ్రువుని ప్రజారంజక పాలన అతను నక్షత్రమవ్వటంతో సమాప్తం. కావ్యం ఆధ్యాత్మిక వీర రసకావ్యం. రెండు విషయాలను చక్కగా నిర్వహించాడు. ఋగ్వేదంలోని –ధ్రువాద్యోర్ ధృవ పృథ్వీ ధ్రువ శ్చ పర్వతఇమే –ధృవం విశ్వం ఇదం జగద్ ధ్రువో రాజా విశా మయం –ధ్రువం తే రాజా వరుణో ధృవం దే వొ బృహస్పతిః –ధృవంతే ఇంద్రశ్చా గ్నిశ్చ రాష్ట్రం ధార్యతాం ధృవం" అనే మంత్ర భావార్థాలను కావ్యంలో నిక్షిప్తం చేశాడు. కాళిదాస భవ భూతులలాగానే శ్రీ తో కావ్యారంభం చేశాడు–

"శ్రియం త్రయా ప్రతి ప్రజా శాంతికారణం –ధ్రువస్య పదాంబు జయోర్ హృది –
నిధాయ బాధం కరవాని వందనం–గురుస్తై లోకస్య భారతి పతేః"

చక్కని సుభాషితాలు చెప్పాడు– ప్రాక్తేర్ యువ జనస్యహి లుబ్ధా ,గుణవతః సకలం హ్యా గుణాన్వితం"

భక్తితో ఊగిపోయేట్లు రచన చేశాడు కవి– "జగన్నిదానం హరిమాదిదేవమ్ –జగన్నివాసం ప్రలయే హ్యనంతం –జగద్ధశాన్తం రమయా లసంతం –జగన్నివాన్తారం అహం నమామి"

8వ ఆశ్వాసంలో చిత్రకావ్య విధానాలన్నీ గుప్పించాడు. ధ్రువుని తీవ్ర తపస్సును దాన్ని భగ్నం చేయటానికి జంతువులు చేసిన విఫలప్రయత్నాలను నిర్జర ఏకాంత అరణ్య సౌందర్యాన్ని బహు చక్కగా వర్ణించాడు. శాంతరసంతో కావ్యం భాసించి చారిత్రాత్మకంగా నిలిచింది. ప్రహ్లాద చంపును భక్తి భావ బంధురంగా శార్దూల మాలిని స్రగ్ధర, వంశస్థ స్వాగత, వసంతతిలక, భుజంగ ప్రయాత పృథ్వి, వియోగిని, ప్రహర్షిణి శాలిని, స్రగ్విణి, హర్షిణి, రదోద్ధత మున్నగు ఛందస్సులతో రసప్లావితం చేశాడు. నిజమైన భక్తుడుగా ఉపాధ్యాయ తన కవిత్వాన్ని దైవానికి అంకితం చేసి ధన్యజీవి అయ్యాడు.❋

## 332) గౌరీ కళ్యాణ శతక కర్త – కె.నంజుండ ఘనాపాఠీ –1910

కర్ణాటకలోని కూడలిలో 5–8–1910న నంజుండ జన్మించాడు. లక్ష్మీదేవి కృష్ణ ఘనపాఠి తలిదండ్రులు. సంస్కృత సాహిత్యం అద్వైత వేదాంతంలలో విద్వాన్ అయ్యాడు. వేదాన్ని ఆమూలాగ్రం అధ్యయనం చేశాడు. భద్రావతిలోని భద్ర సంస్కృత కాలేజిలో సంస్కృతం బోధించాడు. శృగేరి ద్వారకా, కూడలి పీఠాధిపతులచే సన్మానాలు పొందాడు. గౌరీకళ్యాణం భక్త మయూర ధ్వజ చరిత్రం అనే రెండు ఖండకావ్యాలు సంస్కృతంలో రాశాడు. గౌరీ కళ్యాణం శతక కావ్యం. దేవతాస్తుతి చేశాక గిరిజాదేవి కళ్యాణ మండపానికి రావటానని గొప్పగా వర్ణించాడు. ధ్వన్యనుకరణను అమోఘంగా నిర్వహించాడు–

"ఝూన జిహానాత్ కరణ నూపురాద్య –సుమాల్య వస్త్రాభనైర్ ఉపేతా –సుమంగళీ సంస్తుత దివ్య శీలా – మన్దమ్ శివా ప్రాప వివాహ వేదిం"


"నముల్ ప్రత్యయాన్ని అద్భుతంగా ప్రయోగిస్తూ –భోజం భోజం భక్ష్య భోద్యాని నిత్యం –పాయం పాయం పాయసాదిన్ సుపే యన్–దర్శం దర్శం దైవతా శైవ లీలాః –భారం భారం శైలరాజం సాసాంసుః"

జైమిని భారత అశ్వమేద పర్వంలోని మయూరధ్వజ చరిత్రలో వేద వేదాంత సాహిత్యాల త్రివేణీ సంగమంగా రచించాడు. సంప్రదాయాన్ని చక్కగా పాటించి భారతీయ ఆధ్యాత్మిక ఆముష్మిక విలువలకు ఎత్తిన పతాకగా తీర్చిదిద్దాడు.❁



## 333) ఋగ్వేద భాష్యభాష్య కర్త – ఓ.ఏం. సి. నారాయణన్ నంబూద్రి – 1910–1989

కేరళలోని ఓలాపమన్న మన్న వంశీకుడైన నారాయణన్ నంబూద్రి పండిత వంశ సంజాతుడు. 1910లో జన్మించి 1989లో చనిపోయాడు. ఋగ్వేదంలో మహా నిష్ణాతుడు. త్రిచూర్ బ్రాహ్మణ సర్వస్వం అధ్యక్షుడు. ఋగ్వేదాన్ని కరస్పాండెన్స్ కోర్స్ ద్వారా నేర్పిన ప్రయోగశీలి. "ఋగ్వేద లక్షణార్చన" ప్రారంభకుడు. ఆయన సంస్కృత రచన "ఋగ్వేద భాష్యా భాష్యం"ను ఆయన మేధోసర్వస్వముగా భావిస్తారు. ఆయన పేరిట "దేవీ ప్రసాదం ట్రస్ట్" ఏర్పరచి ప్రతి యేటా వేద, సంస్కృత, సంగీత, కథాకళీలలో నిష్ణాతులకు పురస్కార సమ్మానాలు అందజేస్తున్నారు.❁



## 334) లయకు ప్రాధాన్యమిచ్చిన - జి.యెన్.బాల సుబ్రహ్మణ్యం - 1910-1965

"జి యెన్ బి"గా లబ్ధ ప్రతిష్ఠుడైన జి.యెన్.బాలసుబ్రహ్మణ్యం తమిళనాడు మాయవరంలోని గుడలూర్‌లో 6-1-1910 జన్మించాడు. తండ్రి నారాయణ స్వామి అయ్యర్ సంగీతజ్ఞుడు. అరియకపూడి రామానుజ అయ్యర్ మానసిక గురువు. లా పాసై మద్రాస్ లజ్ కార్నర్‌లో లాయర్‌గా బాగా ప్రసిద్ధి చెందిన సంగీతకారుడు. ఇంగ్లిష్‌లో బి.ఏ ఆనర్స్ పాసై, అన్నామలై యూనివర్సిటీలో సంగీతాన్ని టీఎస్ సబేష అయ్యర్ వద్ద అభ్యసించాడు. అనారోగ్యం వల్ల మానేసి మద్రాస్ యూనివర్సిటీలో డిప్లమా కోర్స్ చేసి ప్రిన్సిపాల్ టైగర్ వరదా చారి అభిమానం పొంది కచేరీ చేయటానికి తగిన విద్వత్తు సాధించి 1928లో మొదటి కచేరి చేశాడు. భామావిజయం సినిమాలోనూ, శకుంతల సినిమాలో ఎం.ఎస్.సుబ్బులక్ష్మితోను నటించాడు. జి యెన్ బి శైలికి ఎం ఎస్ ఆకర్షితురాలై మొదట్లో అదే బాణీలో పాడేది. తర్వాత సంగీతానికి అంకితమయ్యారు బాలు. సంస్కృత తెలుగు తమిళాలలో 250కి పైగా కృతులు రాశాడు. కొత్తరాగాలు కనిపెట్టాడు. వందలాదిమందికి సంగీతం బోధించి లెక్కలేనన్ని కచేరీలు చేశాడు. మద్రాస్ రేడియోలో కర్ణాటక సంగీత డెప్యూటీ చీఫ్ ప్రొడ్యూసర్‌గా పని చేశాడు. అప్పుడు లలిత సంగీత ప్రొడ్యూసర్‌గా మంగళంపల్లి బాలమురళీకృష్ణ, సెమ్మంగుడి శ్రీనివాసయ్యర్ కర్ణాటక సంగీత ప్రొడ్యూసర్‌గా ఉండేవారు. 1964లో కేరళ తిరువనంతపురంలోని స్వాతి తిరుణాల్ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ అయ్యాడు. 55 ఏళ్ళ వయసులో 1-5-1965న మరణించాడు. గమకాలను తగ్గించి లయకు అత్యంత ప్రాధాన్యమివ్వడంతో జి యెన్ బి సంగీతం కర్ణ పేయంగా ఉండేది.

సంస్కృతంలో ఆయన రాసిన -మోహనరాగంలోని- "భువనత్రయ", నాట రాగంలో- "కరిముఖ వరద", పూర్వి కల్యాణిలో- "మధురాపురి కల్యాణి", మోహనలో "సదా పాలయ సారసాక్షి" సరస్వతిరాగంలో- "సరస్వతి నమోస్తుతే", శివ శక్తిరాగంలో- "చక్రరాజ నిలయే", కామ వర్ధనిలో- "శివానంద కామవర్ధని", హంసధ్వనిలో- "వరవల్లభ రామ" కృతులకు సంగీత సాహిత్యాలతో ప్రాణ ప్రతిష్ట చేశాడు.❁

## 335) నాచరమ్మ విజయ కర్త – కవి శేఖర హెచ్.వి నారాయణ శాస్త్రి – (1910)

కర్ణాటక హళ్లి మైసూర్‌లో వెంకటరామ నవధ్వని, తిమ్మాం బికలకు 1910లో ఆగస్టు 15న నారాయణ శాస్త్రి జన్మించాడు. బెంగళూర్ చామ రాజేంద్ర కాలేజ్ నుంచి సంస్కృత సాహిత్యరత్న పొంది, అక్కడే లెక్చరర్ అయ్యాడు. శ్రీశైల జగద్గురువులచేత కవిశేఖర బిరుదును కర్ణాటక ప్రభుత్వ పురస్కారాన్ని పొందాడు. సంస్కృతంలో శ్రీశైల జగద్గురు చరిత, శ్రీనాచరమ్మ విజయం, శ్రీ కృష్ణ భిక్ష, గుణ పరీక్షణం, సోదర స్నేహ నాటకాలు, శ్రీ విద్యారణ్య కథా తరంగిణి కావ్యం, శ్రీ లక్ష్మీ కేశవ సుప్రభాతం, కర్ణాటక మహిమ్న స్తోత్రం, కాశీ విశ్వేశ్వర సుప్రభాతం రాశాడు.

శ్రీ నాచరమ్మ విజయం– ఇది సాంకేతి బ్రాహ్మణ చరిత్ర. వారి పుట్టుపూర్వత్తరాలు నివాసం మొదలైనవి చారిత్రిక ఆధారంగా రాశాడు. ఇందులో తమిళనాడుకు చెందిన నాచారమ్మ అనే సదాచార మహిళ కథ ఉన్నది. ఆమె విజయనగర రాజ్యస్థాపకులైన శ్రీ విద్యారణ్య స్వామి సమకాలికురాలు. నాచారమ్మ సాక్షాత్తు సరస్వతీ దేవి అవతారం. ఆమె విద్వత్తుకు అసూయ చెందిన ఆనాటి బ్రాహ్మణ పండితులను చూసి తమిళనాడు నుండి కర్ణాటకకు భర్తతో సహా వెళ్లి స్థిరపడింది. ఆమెను అక్కడివారందరూ దేవీ సమానంగా భావించి ఆరాధించారు. అనేక సంఘటనలను అత్యంత రమణీయంగా శాస్త్రి వర్ణించి కావ్య గౌరవం కలిగించాడు.

గురు పరీక్షణం– 5 అంకాల నాటకం. కట్నాలు కానుకలు, లంచాలు నిరుద్యోగంలపై రాశాడు. నాలుగవ అంకంలో ఆత్మహత్య ఉంది. హాస్య వ్యంగ్యాలను దట్టించి రాశాడు. చిదంబర అనే జ్యోతిష్యుని వికటంగా చిత్రించాడు. అతని మాటలు– ఘ్రాణం పాతుం నశ్యా దేవ –నశ్యం జాతం ఘ్రాణా దేవ –ఉదరం జాతం కోఫీమ్ –కోఫీ జాతా ఉదరం గన్తుమ్" సంస్కృతంపై గొప్ప నమ్మకంతో నాటకం రాశాడనిపిస్తుంది. విదేశీ సంస్కృతీ వ్యామోహాన్ని బాగా ఎండగట్టిన నాటకం.

శ్రీ విద్యారణ్య కథా తరంగిణి 14 తరంగాల కావ్యం. విద్యారణ్యస్వామి బహుముఖీన ప్రతిభకు పట్టం కట్టిన రచన. కథావతరణం కర్ణాటక వర్ణనం మాధవ జననం విజయనగర నిర్మితి మొదలైన అధ్యయాలున్నాయి. తాను చెప్పిన ప్రతివిషయాన్ని అదో సూచికలతో సమర్థించాడు.❁

**336) ఉన్మత్త కీచకం కర్త - కె.ఎస్.నాగరాజన్ -1911**

ఆంధ్ర ప్రదేశ్‌లో సోధం గ్రామంలో1911 ఏప్రిల్ 11న నాగాంబికా శేషం అయ్యంగార్‌లకు నాగరాజన్ జన్మించాడు. సంస్కృత సాహిత్యంలో "కాశ్మీర్ పాత్ర" అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందాడు. రాష్ట్ర అకౌంట్ జనరల్ ఆఫీస్‌లో అకౌంటంట్ జెనరల్‌గా పనిచేశాడు. ఆధునిక సంస్కృత సాహిత్యాన్ని తన అమోఘ రచనలతో సుసంపన్నం చేశాడు. శ్రీ సీతాభ్యుదయం అనే 16 కాండలకావ్యం రామాయణం ఆధారంగా రాశాడు. శ్రీ శబరీ విలాసం అనే ఖండకావ్యం, ఉన్మత్త కీచకం అనే అయిదు అంకాల నాటకం, భారత వైభవం అనే దేశభక్తి గీతం, గాంధీ విజయం అనే అయిదంకాల నాటకం, లవలీ పరిణయం నాటకం, 6 అంకాల గురుశాపం, భారత దేశ భక్తులగురించి "భారతీయ దేశ భక్త విజయం" రాశాడు. కన్నడం లోసాహిత్య విచార, సుభాషిత మంజరి భాస్కరాచార్యుని లీలావతి అనువాదం చేశాడు. సుభాషితాలు సుభాషిత వాణిగా ఇంగ్లీష్ లోకి అనువదించాడు. సాహిత్యాలంకార, బిరుదు అయోధ్య సంస్కృత అకాడెమి, కవిభూషణను శ్రీ ద్వారకా శంకరాచార్య ప్రదానం చేశారు. వ్యాఖ్యాన వాచస్పతి అనేది ఆయన పాండితీ ప్రకర్షకు లభించిన విశేష బిరుదు.

ఉన్మత్త కీచకం నాటకంలో కీచకుడు ఉత్తముడు నిజంగానే ద్రౌపదిని ప్రేమిస్తాడు. భీముడు సహించలేక కీచకవద చేస్తాడు. వాడి చావుకు ద్రౌపది కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది. మొదటి అంకంలో కీచక స్తుతి నాలుగులో విరాట స్తుతి ఉన్నాయి. ఇద్దర్నీ స్తుతిస్తూ చెప్పిన శ్లోకాలు-

"జయతు విజయ లక్ష్మీ శీలస్త సర్వాంగ శోభాః -జయతు పశుబలానాం వృద్ధికారా బలిస్టాః - జయతు జయ పతాకాలంకృత స్వీయ మార్గే -జయతు పరబలాంతఃకీచః ఖ్యాత కీర్తిః"

జయతు నరవరేణ్యసత్యదామ ప్రతిస్టో-జయతు జన సుఖానాం వృద్ధికర్తా దయాళుః- జయతు గుణగణానాం సన్నిదిర్ దీన బందూ -జయతు చిరమిల్యాం మత్స రాజో

విరాటః"

ఈ నాటకంలో కీచకుడు విషాదాంత నాయకుడు చనిపోయే ముందు కీచకుడు మాట్లాడిన మాటలు హృదయాన్ని తరుక్కు పోయేట్లు చేస్తాయి కన్నీరు తెప్పించి అతనిపై సానుభూతి కలిగిస్తాయి.

గురూపదేశం పౌరాణికకద దేవరాజ బహదూర్ ప్రైజ్ పొందింది తనకు ప్రేరణ ఉత్తేజం కలిగించిన కైలాసంకు అంకితమిచ్చాడు. నాగరాజన్ ఇందులో హీరో కర్ణుడిని ఉదాత్తంగా చిత్రించాడు. నిమ్న కుల సంజాతుడు అయినందువల్ల అణగతొక్కబడ్డాడని చెప్పాడు. భాసుడు చెప్పిన "చక్రారాప ణీకీర్తిర్ ఇవ గచ్చతి భాగ్యపంక్తి" అన్నదాన్ని "భాగ్య పంక్తిర్ఇవ సర్వ నరాణాం చంచలేతి విదితా మనులోకే" అని చెప్పాడు మనిషికి విలువ గుణం బట్టికాని జన్మబట్టి కాదుఅని బోధిస్తూ కవి– "గుణతాః పూజ్యతే లోకే మానవో న తు జన్మతః –తదాదీన గుణాః సర్వే జన్మ దైవ వశే భవేత్" దీనికి స్ఫూర్తి భవభూతి చెప్పిన "గుణాః పూజ స్థానం గుణిషు నచ ణ లింగం న వయః" బాణుని వేణీసంహారంలోని కర్ణుని వచనాలు స్ఫూర్తిగా తీసుకున్నాడు నటరాజన్.

శ్రీ శబరీ విలాసంలో శబ్దార్థ సౌందర్యంతో కవితాత్మకంగా రాశాడు. గాంధీ మహిమలో "ఏకో దేవో నేక రామాభిరామః –రామో బుద్ధా కృష్ణా అల్లాఇతీః –నానారిత్యా దృశ్యతే పూజ్యతేచ" అంటూ ఋగ్వేదంలోని "ఏకం విప్రా బహుద వదంతి"ని వివరించి చెప్పాడు. కవికి సంస్కృతంపై వీరాభిమానం. –అందుకే "ఏతి సంస్కృతం మృతేతి వదంతి తే ఏవ మృతాః" అని బల్లగుద్ది సంస్కృతం చనిపోయింది అనే వారు నిజమగానే చనిపోయినవాళ్ళు అన్నాడు.

"జయతు జయతు ధన్యా భారతాంబా పవిత్రా –జయతుజయతు గాంధీ సత్యమార్గాను వర్తీ –జయతు జయతు యుద్ధం చస్మాద్రియంనవీనం –జయతు జయతు సర్వో భారతీయాః ప్రపంచాః" అని ఉదాత్తమైన ఉపదేశం చేశాడు. సంప్రదాయ పద్ధతిలో సంస్కృతం చదివినవాడు కాకపోయినా ఒక సంస్థ నిర్వాహకుడుగా తీరికలేకున్నా సంస్కృతంలో సృజనాత్మక రచనలు చేసి విఖ్యాతుదయ్యాడు నాగరాజన్. జాతీయ సమైక్యతా, సర్వ మానవాభ్యుదయం ధ్యేయంగా పౌరాణిక కథలను ఆధునిక విధానంలో వ్యాఖ్యానించాడు. ❋

## 337) కుంభాభిషేక చంపు కర్త - కృష్ణ జాయిస్ -1912


1-8-1912న కదూర్ కృష్ణ జాయిస్ కర్ణాటక శృంగేరిలో శేషమ్మ, సుబ్బా జాయిస్ దంపతులకు జన్మించాడు. అలంకార, అద్వైతాలలో విద్వాన్ డిగ్రీ పొంది హోల్ నరసాపూర్, ఆధ్యాత్మ ప్రకాశం కార్యాలయంలో పని చేశాడు. తర్వాత బెంగుళూర్ శృంగేరి శంకర మఠంలో ఆధ్యాత్మ వేదాంత ప్రొఫెసర్ అయ్యాడు. కన్నడ సంస్కృతాలలో విశేష పాండిత్యం పొంది ఆ రెండు భాషల పత్రికాధిపత్యం వహించాడు. శృంగేరి స్వాములు "పండితవర" బిరుదునిచ్చి సత్కరించారు. సంస్కృతంలో కృషికి రాష్ట్రపతి ప్రశంసాపత్రం, కన్నడ సేవకు రాష్ట్ర అవార్డు అందుకున్నాడు. సంస్కృతంలో కుంభాభిషేక చంపు, శారదా నవరాత్రి చంపు, మూల విద్యాభాష్య వార్తిక సమ్మతం, శంకర దర్శనామ ప్రకాశం రాశాడు. సంస్కృత దశ శ్లోకికి సంపాదకత్వం వహించాడు. కన్నడంలో సంబంధ వార్తిక, ధర్మ శాస్త్ర రాశాడు. దశ శ్లోకిని, వివేక చూడామణిని చంద్రశేఖర భారతీతీర్థ వ్యాఖ్యానంతో సహా కన్నడాను వాదం చేశాడు. శారదా నవ రాత్రి చంపును 1976లో ముద్రించాడు. అందులో శారదా అభిషేక ఉత్సవం, నవరాత్రి ఉత్సవాలను వర్ణించాడు. ఆధునిక సంస్కృత కవులలో చంపుకు మళ్ళీ వైభవం తెచ్చినవాడు కృష్ణ జాయిస్.❁

## 338) చిత్రోదయ మణికర్త - సాంబశివ శాస్త్రి - 1912-1991

కేరళకు చెందిన సాంబశివ శాస్త్రి "చిత్రోదయమణి" కావ్యం రాశాడు. తిరువనంతపురం మహారాజు చిత్ర తిరుణాల్, ఆయన వంశ పురుషుల గురించి రెండు సర్గలలో వర్ణింపబడిన కావ్యం. చేర రాజులలో చెంగుత్తవన్ ప్రస్తావన చేసి ఆయనను చేరమాన్ పెరుమాళ్ అన్నాడు కవి. తర్వాత ముకుందమాల కర్త కులశేఖర ఆళ్వార్‌ను ప్రస్తుతించారు. మిగిలిన రాజులైన స్తాను రవి, భాస్కర రవి, గోవర్ధన మార్తాండ, సంగమాది రవివర్మ, కేరళవర్మ, మార్తాండ వర్మ, శ్రీమూలం తిరుణాల్, చిత్ర తిరుమాళ్ మహారాజుల జీవిత వర్ణన చేశాడు.❁

## 339) భారతీయ శాస్త్ర దర్శన కర్త – జి.విశ్వనాధ శర్మ – 1912-1998

కేరళలోని మంగుళూరులో 1912లో జన్మించిన విశ్వనాథ శర్మ సంస్కృతం శాస్త్రాలను విద్వాంసులైన గొప్ప పండితులవద్ద అభ్యసించాడు. కాలడిలోని ఆశ్రమ విద్యాలయం తీపిని తూర సంస్కృత విద్యాలయాలలో రామాపురం టీచర్స్ ట్రెయింగ్ సెంటర్‌లో సంస్కృత ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. వేదాంతంలో స్వర్ణపతకం పొందిన మేధావి. విద్యాభూషణ, పండిత రత్న బిరుదాంకితుడు.❁



## 340) భవానీ నామ సహస్ర స్తుతికర్త – జానకీ నాధ కౌల్ (కమల్) – 1914-242

కమల్ కలం పేరుగా రచనలు చేసిన జానకీనాధ కౌల్ శ్రీనగర్‌లో 1914లో జన్మించాడు. సంస్కృత కాశ్మీరీ ఆంగ్లాలలో అనేక సుప్రసిద్ధ రచనలు చేశాడు. చిన్నప్పుడే తలిదండ్రులను కోల్పోయి అనాథ అయి, బడికి వెళ్లి చదువుకొనే స్థితిలేక స్త్రీ సంక్షేమ శాఖలో కొద్దికాలం పని చేసి పొట్టపోసుకొని, 30వ ఏట టీచర్‌గా డి.ఎ.వి.ఇన్స్టిట్యూట్‌లో పనిచేసి, జూనియర్ లెక్చరర్ అయి, క్రమంగా సంస్కృతంలో బి. ఏ, ఎం.ఏ ప్రభాకర డిగ్రీలు పొంది, శ్రీనగర్‌లో పరమానంద రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో రీసెర్చ్ ఆఫీసర్‌గా చేరి శ్రీరామకృష్ణ ఆశ్రమ పత్రికకు సంపాదకుడై విశిష్ట సేవలు అందించాడు.

ఆధ్యాత్మిక విషయాలలో ఆరితేరి, తనకున్న విశిష్ట సంస్కృత విజ్ఞానంతో శైవ శాక్తేయాలను తంత్ర విద్యాశాస్త్రాన్ని అధ్యయనం చేసి అసలైన జిజ్ఞాసువు, భక్తుడై స్వామి రామతీర్థ రాసిన గ్రంథాలు చదివి కవిగా తన సత్తా చాటాడు. నీలకంఠ పండితుని ఆశ్రయంలో భగవద్గీతా ధ్యయనం చేసి శంకర, శంకరానంద భాష్యాలు జీర్ణం చేసుకొని నీలకంఠ ప్రభుత్వ సర్వీస్ నుంచి రిటైరయి ఋషీకేశ్ చేరి స్వామి శివానందగా సన్యాస దీక్ష పొంది అక్కడ శివానందాశ్రమమం నెలకొల్పాడు. వెళ్లేముందు శాస్త్రిని మరొక గొప్పపండితుడు స్వామి లక్ష్మణ జూకు అప్పగించి వెళ్ళాడు. స్వామి

మహాసమాధి చెందాక ఆయన జీవితంపై అనేక వ్యాసాలూ భక్తి గీతాలు చాలా పత్రికలకు రాశాడు.


లక్ష్మణ జూతో ఉన్న గాఢ అనుబంధం వలన ఆధ్యాత్మికత మరింతగా పెరిగి సంస్కృత ఆంగ్లాలో భక్తి కవిత్వం పారించాడు. అవి వివిధ జర్నల్స్‌లో పరుచురితమైనాయి. తర్వాత కాశ్మీర శైవంపై అభిరుచి కలిగి దాని ఆవిర్భావం గురించి పరిశోధన చేసి రాయటమేకాక అనేక శైవ గ్రంథాలకు వ్యాఖ్యానాలు రాశాడు. ప్రాణాయామ, ధ్యానాలపై పుస్తకాలు రాశాడు. ఆశ్రమానికి దగ్గరలో ఉన్న ఈషాబీర్ నుండి "విద్యారణ్య పంచదశి" అభ్యసించాడు. సృజనకర్తగా వ్యాఖ్యానకర్తగా అనువాదకునిగా కౌల్ ప్రజ్ఞ అసాధారణమై భాసించింది. జీవితం మొదట్లో పొందిన కస్టాలు మరచిపోయి జీవితాలకు ఉపయోగపడే అద్భుత రచనలు చేశాడు. ఆయన కవిత "శివ శంకర సాంబు" బాగా ప్రసిద్ధమైంది.

జానకీ నాథ కౌల్ ప్రతిభాసర్వస్వంగా ఆయన రాసిన "భవానీ నామ సహస్ర స్తుతి"ని భావిస్తారు. ఇది ఇంగ్లిష్, హిందీలలోకి అనువాదం పొందింది. దీనికి వ్యాఖ్యానమూ రాశాడు. రెండవది "శివ సూత్ర విమర్శ" అనే హింది గ్రంథం 3 పంచస్తవికి ఆంగ్లానువాదం వ్యాఖ్యానం రాశాడు. కౌల్ గ్రంథ రచనకు రామకృష్ణ మతం అధిపతి స్వామి రంగనాథానంద ప్రశంసించారు.❁

## 341) గాంధీ మోహనాయన కావ్య కర్త – బొమ్మలాపురపు వెంకట రామ భట్టు -1915

బొమ్మలాపుర వెంకట రామభట్ట కర్ణాటకలోని బొమ్మలాపురంలో 1-1-1915న జన్మించాడు. సరోబాలో సంస్కృత టీచర్. సంస్కృత కన్నడ హిందీలలో కవిత్వం చెప్పాడు రాశాడు. సంస్కృతంలో మహాత్మాగాంధీ జీవితంపై "మోహన యానం" కావ్యం, శంకర చరితం, భామినీ మాధవ కావ్యం, సతీ మహాస్వేత, విశ్వరూప దర్శనం, సత్యవిషయం నాటకాలు, అంగద సంవాదం, ఏకం నా ద్వితీయం, నాథయ సంస్కృత భేరి, భార్గవ శతకం, యాజ్ఞ వల్క్య బోధాయన, భువనేశ్వరీ సుప్రభాతాలు, శంకరాలోకం భావతరంగిణి సంస్కృత వచన రచనలు, సత్యనీయ రీతి అనే స్వీయ చరిత్ర, మంత్రం వేదాంత శాస్త్రాలనాధారంగా వెయ్యి ఆర్యా వృత్త శ్లోకాల "ఆర్యా సహస్రి" రాశాడు.

సంస్కృత కావ్యాలను కన్నడంలోకి కన్నడ రచనలు సంస్కృతంలోకి అనువదించి ప్రజ్ఞ ఆయనది. కన్నడ సంస్కృత నిఘంటు నిర్మాణము చేశాడు. కన్నడ భాషకే ప్రత్యేకమైన షట్పదిని సంస్కృతంలో ప్రవేశపెట్టిన ఘనత వెంకట రామభట్టుది. మోహనయానంలో భామినీ షట్పదిని నేర్పుగా ప్రయోగించాడు.❁



## 342) గీతా జ్ఞాన యజ్ఞ సారథి - స్వామి చిన్మయానంద సరస్వతి (1916-1993)

కేరళలోని ఎర్నాకులంలో 8-5-1916న స్వామి చిన్మయానంద బాలకృష్ణ మీనన్‌గా జన్మించారు. తండ్రి కుప్పుస్వామి కొట్ట మీనన్ ప్రసిద్ధ జడ్జి, ఈయన కొచ్చిన్ మహారాజుకు సమీప బంధువు. తల్లి పాఋకుట్టి అమ్మ. చిన్మయ బాల్యంలోనే చనిపోయింది. కొచ్చి, త్రిసూర్, ఎర్నాకులంలలో చదివి డిగ్రీపొంది లక్నో వెళ్లి లిటరేచర్, లా జర్నలిజంలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ అయ్యారు.

1936లో రమణాశ్రమంలో రమణ మహర్షిని సందర్శించినప్పుడు వారి దృష్టి ఈయనపై పడటంతోనే ఆధ్యాత్మిక భావ పరంపరలు మనసంతా నిండిపోయి జ్ఞాన ప్రకాశానుభూతి పొందారు. క్విట్ ఇండియా ఉద్యమంలో బాలన్ తీవ్రంగా పాల్గొన్న దేశభక్తుడు. అరెస్ట్ చేస్తారని తెలిసి అండర్ గ్రౌండ్‌లోకి వెడుతూ సహచరులను స్ట్రైక్‌లు చేయమని కరపత్రాలు పంచమని సలహా ఇచ్చారు. తర్వాత అరెస్ట్ అయి జైలులో ఉన్నారు. జైల్లో పారిశుధ్యలోపం వలన టైఫాయిడ్ వచ్చి, మిగతా రోగులతోపాటు రోడ్డుమీద పారేయ బడ్డారు. ఒక క్రిస్టియన్ మహిళ జాలిపడి ఇంటికి తీసుకు వెళ్లి డాక్టర్‌ను పిలిపించి చికిత్స చేయించి నయం చేసింది.

ఆరోగ్యం బాగుపడగానే "నేషనల్ హెరాల్డ్" పత్రిక పిలిచి ఉద్యోగమిచ్చింది. అందులో ఎన్నెన్నో వ్యాసాలు సాంఘిక విషయాలపై రాశారు. అవి మంచిపేరు, గుర్తింపు తెచ్చాయి. సాధువుల జీవితాలపై ధారావాహికంగా రాశారు. ఋషీకేశ్ వెళ్లి స్వామి శివానందను దర్శించారుకాని ఆధ్యాత్మిక అనుభవం కోసం కాదు అని చెప్పుకున్నారు. 1947లో శివానందా శ్రమానికి కొద్దీ దూరంలో ఉంటూ ఒకసారి కుతూహలంగా వెళ్లి స్వామిని దర్శించి ప్రభావితులై సన్యాసిగా మారిపోయారు. హిందూ గ్రంథాలు అధ్యయనం చేసి స్వామి ఈయనతో దాగి ఉన్నజ్ఞానం గ్రహించి "గీతా కమిటీ" నిర్వహించామని కోరారు. 25-2-1949లో తిరిగివచ్చి మహాశివరాత్రి నాడు సన్యాసం దీక్షపొంది బాలన్ స్వామి చిన్మయానంద" దీక్షానామం పొందారు.

స్వామి శివానంద ఆజ్ఞతో ఉత్తర కాశీలోని ఆ కాలపు వేదాంత దిగ్గజం "తపోవనం మహారాజ్" వద్ద వేదాంత అధ్యయనం చేశారు. అత్యంత దీక్షతో భారతీయ ఆధ్యాత్మిక సాహిత్యాన్ని మథించి సారం గ్రహించారు. 1951లో గురువు ఆదేశంతో సకలమానవాళికీ వేదాంత భావన కలిగించాలని విస్తృత పర్యటన చేస్తూ ప్రసంగిస్తూ ప్రజాభిమానం సంపాదించారు. ఆంగ్లంలో స్వామి చిన్మయానంద ప్రసంగాలు గంగా ప్రవాహ సదృశాలు. వారి సభలకు వేలాది మంది అత్యంత శ్రద్ధాశక్తులతో వచ్చి విని తెలుసుకునేవారు. విషయాలను విడమర్చి సూటిగా హృదయంలోకి చొచ్చుకొని పోయేట్లు చెప్పే నేర్పు అనితర సాధ్యమనిపిస్తుంది. తిరుమలలో 1970లో జరిగిన విశ్వ హిందూపరిషత్ సమ్మేళనంలో స్వామి చిన్మయానందను చూసి వారి ప్రసంగాన్ని విన్న అదృష్టం నాకు దక్కింది. దీనికి నన్ను ప్రోత్సాహించి తీసుకువెళ్లిన స్వర్గీయ మండా వీరభద్ర రావును మర్చిపోలేను. వారి "ఉపనిషద్ జ్ఞాన యజ్ఞం గీతాజ్ఞాన యజ్ఞాలు" అత్యున్నత అత్యంత ఆధారణం పొందాయి. మందార మకరదమే వారి వాగామృతం అందులో తడిసి తరించాల్సిందే.


చాలాసార్లు ప్రజలు ఆయన పేర ఒక మిషన్ ప్రారంభించామని కోరినా తిరస్కరిస్తూ వచ్చి చివరికి మద్రాస్ ప్రజలు మరీ పట్టుబడితే "చిన్మయ మిషన్" 6-3-1965లో స్థాపించారు. 18 దేశాలలో 39 ప్రముఖ నగరాలలో 28 ఏళ్ళు ఏక దీక్షగా పర్యటించి హిందూ ధర్మ ప్రచారం చేశారు. అమెరికాలో ప్రత్యేక చిన్మయా మిషన్ ఏర్పాటైంది. ప్రపంచ హిందువుల సమైక్యతకు ప్రత్యేక వ్యాసాలూ రాసేవారు. చివరికి వారికోరిక తీరి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రచారక్ బాబా సాహెబ్ ఆప్టేతో కలిసి 1964 ఆగస్టులో పూనాలో "సాందీపని ఆశ్రమం" స్థాపించారు. ఇది విశ్వ హిందూపరిషత్‌కు దారితీసి దానికి మొదటి అధ్యక్షులుగా స్వామి చిన్మయానంద ఎంపికయ్యారు.

హృదయ వ్యాధితో చాలాకాలం బాధపడుతూ 1969లో మొదటిసారి హార్ట్ ఎటాక్ వచ్చింది. బెంగళూర్‌లో ఏర్పడిన చిన్మయా నంద హాస్పిటల్లోలో ఆయనే మొదటి పేషేంట్. ఆరోగ్యం కుదుటపడి 1980లో అమెరికాలో చాలా జ్ఞానయజ్ఞాలు చేశారు. టెక్సాస్‌లో మల్టిపుల్ హార్ట్ బైపాస్ సర్జరీ చేయాల్సి వచ్చింది. 26-7-1993లో సాన్ డియాగోలో శ్వాస సమస్య ఏర్పడి ఎమర్జెన్సీ హార్ట్ బైపాస్ సర్జరీ తప్పని సరైంది. పరిస్థితి విషమించగా లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌పై ఉంచారు. ఫలించక 3-8-1993న స్వామి చిన్మయ శాశ్వత చిన్మయానంద సమాధిలోకి వెళ్లిపోయారు. 7-8-1993న వారి పార్థివ శరీరం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు చేరగా వేలాది ప్రజలు కన్నీటితో చివరి దర్శనం చేసుకొన్నారు. తరువాత హిమాచల్ ప్రదేశ్‌లో సిద్ధ బారిలో వారి అంత్యక్రియలు

పరమ వేదోక్తంగా నిర్వహించి మహాసమాధిలో ఉంచారు. 24-12-1991లో వారికి బొంబాయిలో "స్వర్ణ తులాభారం" జరిపారు. దీనిని చిన్మయామిషన్ వైద్య, విద్యాకార్యక్రమ నిర్వహణకు స్వామి అందజేశారు.

భగవద్గీతపై చిన్మయానంద వ్యాఖ్యానం శిరోభూషణంగా నిలిచింది. 34 గ్రంథాలు రచించారు. 2-12-1992న ఐక్య రాజ్య సమితిలో స్వామి చిన్మయ "ప్లానెట్ ఇన్ క్రైసిస్" అనే చారిత్రాత్మక ప్రసంగం చేశారు. అమెరికా మ్యాగజైన్ "హిందూ యిజం టు డే" ఆయనకు "హిందూ రినైసెన్స్ అవార్డు"తోపాటు "హిందూ ఆఫ్ ది ఇయర్" బిరుదునిచ్చి సత్కరించింది. 1993లో చికాగోలో జరిగిన "ప్రపంచ మత సమ్మేళన "శత జయంతి" హిందూమత అధ్యక్షునిగా ఎంపిక చేశారు.


8-5-2015న ప్రధాని మోడీ స్వామి చిన్మయ జన్మ దినోత్సవ స్మారక నాణెం విడుదల చేసి గౌరవించారు.❀



## 343) బాహుబలి నాటక కర్త - యెన్.రంగనాధ శర్మ -1916-2014

సంస్కృత కన్నడ వ్యాకరణాల లోతులు తెరచిన యెన్ రంగనాధ శర్మ 7-1-1916న కర్ణాటకలో నాడహళ్లిలో జన్మించాడు. బెంగుళూరు చామరాజేంద్ర సంస్కృత కళాశాలలో 1948 నుండి 1976 వరకు నాలుగు దశాబ్దాలు సంస్కృత కన్నడాలు బోధించాడు. ప్రముఖరచయిత జి.వి.గుండప్పకు సహాధ్యాయి. సంస్కృతంలో బాహుబలి విజయం, ఏక చక్రం అనే చారిత్రిక, పౌరాణిక నాటకాలు, గురు పరే మిత చరితం, గోమతేశ్వర సుప్రభాతం, గుమ్మటేశ పంచకం రాశాడు. కన్నడంలో చాలా విస్తృత రచనలు చేశాడు. ఎన్నో అనువాదాలు రచించాడు.

కర్ణాటక రాష్ట్ర బహుమతి రాష్ట్రపతి ప్రశంసాపత్రం, రాజ్యోత్సవ పురస్కారం ఉత్తమ అధ్యాపక అవార్డు, మొట్టమొదటి డి వి జి మెడల్, మహామహోపాధ్యాయ, గౌరవ డాక్టరేట్, సంస్కృత గ్రంథ రచన పురస్కారం వంటివి ఎన్నో అందుకున్నాడు. 25-1-2014న 98 ఏళ్ళ నిండువయసులో రంగనాధశర్మ శ్రీరంగ ధామం చేరాడు.❀



## 344) సంస్కృత చలన చిత్ర దర్శకుడు - జి వి అయ్యర్ - 1917-2003

సంస్కృతాన్ని రచనలద్వారా వ్యాప్తి చెందించిన వారినీ, నాటక ప్రదర్శనల ద్వారా వ్యాప్తి చెందించిన ఎందరి గురించో తెలుసుకొన్నాం. ఇప్పుడు మహానుభావుల చలన చిత్రాలను సంస్కృతంలో నిర్మించిన సంస్కృత భాషావ్యాప్తి చేసిన డా.జి.వి.అయ్యర్ జీవిత విశేషాలను గురించి తెలుసుకొందాం.

గణపతి వెంకట రమణ అయ్యర్ అంటే ఎవరికీ తెలియదు. జి వి అయ్యర్ అంటే చాలామందికి తెలుసు. సంస్కృత చలన చిత్ర నటుడు దర్శకుడు అయిన అయ్యర్ 3-9-1917న కర్ణాటకలో మైసూర్ జిల్లా నంజన్ గూడలో జన్మించాడు. భారతీయ చలన చిత్ర దర్శకులలో సంస్కృత చలన చిత్రాలను నిర్మించి దర్శకత్వం చేసిన ఒకే ఒక్కడు అయ్యర్. అందుకనే ఆయనను "కన్నడ భీష్మ" అంటారు. 8వ ఏటనే గుబ్బి వీరన్న దియేటర్ గ్రూప్‌లో చేరి నటుడయ్యాడు. "రాధారమణ" సినిమాలో మొదటిసారిగా నటించి సినీ నటుడయ్యాడు. తరువాత మహాకవి కాళిదాసు, సోదరి, హేమావతి, హరి భక్త, బేదర కన్నప్ప మొదలైన సినిమాలలో నటించాడు.

అయ్యర్ ఆ తర్వాత స్వంతంగా సినిమాలకు దర్శకత్వం చేయాలని భావించి "హంస గీతే" అనే కన్నడ సినిమాను డైరెక్ట్ చేశాడు. దీనికి డా.మంగళంపల్లి బాలమురళీకృష్ణ సంగీత దర్శకత్వం చేశారు. టి.జి.లింగప్ప, బి.వి.కారంత్ మొదలైన వారు నటించారు. ఈ సినిమా విపరీతంగా విజయం సాధించి అందరికి మంచి పేరు తెచ్చింది. అయ్యర్ కీర్తి దశ దిశలా వ్యాప్తి చెందింది. ఇక వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. కథా, స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అన్నీ తానే సమకూర్చుకొని అయ్యర్ వరుసగా చాలా కన్నడ సినిమాలు తీశాడు, డైరెక్ట్ చేశాడు. ఆయన గొప్ప చిత్రం "రణధీర్ కంఠీరవ". 1970 వరకు కమ్మర్షియల్ చిత్రాలే తీశాడు.

కన్నడ, సంస్కృతాలలో గొప్ప పాండిత్యం ఉన్న అయ్యర్ దృష్టి సంస్కృత చిత్రాలపై

పడింది. 1983లో మొట్టమొదటి సారిగా "ఆది శంకరాచార్య" సంస్కృత సినిమాను నిర్మించి డైరెక్ట్ చేశాడు. సర్వ దమన బెనర్జీ శంకరాచార్యగా, భరత్ భూషణ్ శివగురువుగా, శ్రీమతి శారదారావు ఆర్యాంబగా, శ్రీమతి లీలా నారాయణరావు ఉభయభారతిగా జివి.అయ్యర్ వేదవ్యాసునిగా ప్రముఖ పాత్రలు పోషించారు. సంగీతాన్ని గానగంధర్వ మంగళంపల్లి బాలమురళీకృష్ణ సమకూర్చారు. ఈ సినిమా జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రం, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ సినిమాటోగ్రఫీ, ఉత్తమ ఆడియోగ్రఫీలకు బహుమతులను అందుకున్నది. కళాఖండంగా ఈ సంస్కృత చిత్రం చిర స్థాయిగా నిలిచి పోయింది. అయ్యర్ ప్రతిభ అందర్నీ అప్రతిభులను చేసింది. ఈ సినిమా అయ్యర్‌పై గొప్ప ప్రభావం చూపింది. ఈ సినిమా తీసిన తర్వాత అయ్యర్ జీవన విధానమే మారిపోయి చెప్పులు వేసుకోవటం కూడా మానేశాడు.

తర్వాత కన్నడంలో "మధ్వాచార్య" తమిళంలో "రామానుజాచార్య" సినిమాలు తీశాడు అయ్యర్. 1933లో సంస్కృతంలో రెండవ సినిమాగా "భగవద్గీత" తీశాడు. ఇది ఉత్తమ చిత్రంగా జాతీయ స్థాయిలో బహుమతి పొందింది. ఇది "బగోటా ఫిలిం ఫెస్టివల్"లో ప్రదర్శింప బడింది.

అయ్యర్ కొన్ని టెలివిజన్ సీరియల్స్ తీశాడు. అందులో "నాట్య రాణి శాంతల" అనేది హొయసల రాణి శాంతలపై నిర్మించిన చారిత్రాత్మక సీరియల్. ఆమెను వైష్ణవ రాజుకిచ్చి వివాహం చేశారు. దీన్ని హిందీ, కన్నడ భాషలలో లోనూ తీశారు.
స్వామి వివేకానంద జీవితాన్ని హిందీ చలన చిత్రంగా నిర్మించాలని నిశ్చ యించుకొన్న అయ్యర్ మిదున్ చక్రవర్తిని శ్రీ రామకృష్ణ పరమ హంస పాత్రకు ఎంపిక చేసి నటింప చేశాడు. మిదున్‌కు బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా జాతీయ బహుమతి వచ్చింది. మిదున్ పరమహంసగా తన నటనా విశ్వరూపాన్ని ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. సర్వదమన బెనర్జీ వివేకానందునిగా నటించాడు. హేమామాలిని కూడా ఉంది. కాని ఈ సినిమా కమ్మర్షియల్ సక్సెస్ పొందలేదు.

సంజయ దత్తును రావణాసుర పాత్రగా రామాయణాన్ని తీయాలని సంకల్పించాడు అయ్యర్. దురదృష్టవశాత్తు అయ్యర్ 21-12- 2003న 87వ ఏట అకస్మాత్తుగా మరణించాడు. బెంగళూర్ దగ్గర కేంగేరిలో దొడ్డ అలదమార దగ్గరున్న భరద్వాజ ఆశ్రమంలో అయ్యర్ అంత్యక్రియలు నిర్వహించారు.

అయ్యర్ మొత్తం మీద రెండు సంస్కృత, ఒక హిందీ, ఒక తమిళ చిత్రాలను, 23 కన్నడ చిత్రాలను నిర్మించి దర్శకత్వం వహించాడు. 2001లో కృష్ణలీల తీయాలని ప్రయత్నించాడు. 10 సినిమాలో అయ్యర్ నటుడుగా నటించి రాణించాడు.❀

## 345) భాషా సౌందర్య లహరిస్తోత్ర కర్త – శ్రీధరన్ నంబూద్రి చంద్రమన -1917-1960

1917లో పుట్టిన శ్రీధరన్ నంబూద్రి చంద్రమన అసమనూర్ వాసి. ఆయన "మాస్టర్ ఆఫ్ ఆల్ ఆర్ట్స్" జ్యోతిషంతో సహా ఆయనకు రాని శాస్త్రమే లేదు. కథాకళీ నేర్చి ప్రదర్శనలిచ్చారు. సంస్కృతంలో భాషా సౌందర్య లహరి స్తోత్రం, కిరాతావాసిష్ఠం, విశ్వా మిత్ర మేనకా రాశాడు. కవన కౌతూహలం మేగ జైన్‌లో ఎక్కువగా రచనలు చేశాడు. ❋



## 346) కేరళోదయ కావ్యకర్త – డా. కె యెన్ ఎళుత్తచ్చన్ – 1917-1981

సంస్కృత, మళయాళ భాషలలో విస్తృత రచనలు చేసిన కేరళ పండితుడు డా. కె యెన్ ఎళుత్తచ్చన్. పాలకాడు జిల్లా చెరుపుల సెటిలో 21-5-1911న జన్మించాడు. విద్వాన్ పరీక్ష పాసై, రెండు పాఠశాలలో పని చేసి బొంబాయి వెళ్లి తిరిగొచ్చి సంస్కృత, మళయాళ, ఇంగ్లిష్‌లలో మాస్టర్స్ డిగ్రీ 1953లో పొందాడు. మద్రాస్ యూనివర్సిటీలో లెక్చరర్‌గా చేరి "భాషా కౌతళీయం"లో పరిశోధన చేసి పి.హెచ్‌డి పొంది, కాలికట్ యూనివర్సిటీ లెక్చరర్ అయ్యాడు. కేరళ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజెస్‌లో సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ అయ్యాడు. ద్రవిడియన్ లింగ్విస్టిక్ అసోసియేషన్ ఫెలోషిప్ పొంది, కాలికట్ యునివర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్ చేశాడు. మళయాళ వ్యాకరణంపై విస్తృత పరిశోధన చేసి మళయాళ వ్యాకరణ చరిత్ర రాశాడు. మూడు చిన్న కథా సంపుటాలు, మూడు కవితా సంపుటాలు ప్రచురించాడు. మళయాళ భాషా సేవకు సాహిత్య అకాడెమి అవార్డు పొందాడు.


సంస్కృతంలో రాసిన కేరళోదయ చారిత్రిక కావ్యం 21 సర్గలలో 2,500

శ్లోకాలతో ఉన్నది. ఇది 1977లో ప్రచురితమైంది. చరిత్రకావ్యాలలో ఇది అగ్రభాగాన నిలిచింది. కవి సృజన శక్తికి, కవితాప్రతిభకు, శైలికి ఇది గొప్ప నిదర్శనంగా నిలిచింది. ఈ మహాకావ్యంలో జాతీయ సమైక్యతను చక్కగా చాటి చెప్పాడు. కావ్యాన్ని స్వప్నమంజరి స్మృతిమంజరి, ఐతిహ్య మంజరి, బోధామంజరి చిత్ర మంజరి అనే అయిదు గుచ్ఛాలుగా విభజించాడు. కేరళ దేశం పరశురామ మహర్షి వలన ఏర్పడిందనే ఐతిహ్యంతో మొదలు పెట్టి చేర రాజుల, జామోరీ రాజుల పాలన పోర్చుగీసుల రాక, ఆధునిక కేరళ చరిత్ర అంతా సవివరంగా వర్ణనాత్మకముగా రాశాడు. మహాత్మాగాంధీ, బాలగంగాధర తిలక్ వంటి జాతీయ నాయకుల చరిత్రనూ కలిపాడు. ఆధునిక భావాలను కూడా హాయిగా సుందరంగా సరళమైన సంస్కృతంలో రాయవచ్చునని కవి రుజువు చేసి చూపాడు. 28-10-1981న 70వ ఏట మరణించాడు.❀



## 347) సంగీత దర్పణం కర్త - వి. రామనాథం -1917-2008

గీత కళాకారుడు రచయితా టీచర్ ప్రిన్సిపాల్ వి. రామనాథం 1917లో జన్మించి 70 ఏళ్ళు సంగీతంలో మునిగి తేలి 2008లో చనిపోయాడు. మైసూర్ సంగీతరత్న శిష్యుడై, మైసూర్ యూనివర్సిటీ మ్యూజిక్ డాన్స్ కాలేజీ మొదటి ప్రిన్సిపాల్ అయి 1987లో రిటైరయ్యాడు. సుమారు 25 కృతులు సంస్కృత తెలుగు కన్నడాలలో రాశాడు. 3 గ్రంథాలు స్వయంగా కానీ ఇతరులతో కలిసి కాని రాశాడు. కర్ణాటక సంగీత శాస్త్రంపై విలువైన గ్రంథాలు రాశాడు. అందులో ముఖ్యమైనవి -సంగీత దర్పణం, కర్ణాటక సంగీత సుధ, సంగీత శాస్త్ర పరిచయం, కర్ణాటక సంగీత లక్ష్య లక్షణ సంగ్రహం, అపూర్వ వాగ్గేయ కృతిమంజరి మొదలైనవి.❀



## 348) రవీంద్ర భావ ప్రచారక్ – కె.టి పాండురంగి –1918

పాండురంగి 1918లో ఫిబ్రవరి 1న జన్మించి వేదాంత విద్వాన్ అయ్యాడు. మీమాంస శిరోమణి, సంస్కృతంలో ఎం.ఏ సాధించాడు. మహామహోపాధ్యాయ కుప్పుస్వామి శాస్త్రి గారి శిష్యుడు. దార్వార్ శంకరాచార్య పాఠశాల, పూనా శంకరేశ్వర మఠ్‌లో మైసూర్ మహారాజా కాలేజి, అన్నామలై, బెనారస్ హిందూ యూనివర్సిటీలలో చదివాడు. కర్నాటక కాలేజి దార్వార కోలారు ప్రభుత్వ కాలేజీలలో పని చేసి బెంగుళూర్ యూనివర్సిటి సంస్కృత ప్రొఫెసర్‌గా రిటైర్ అయ్యాడు. "విశ్వ మంగళ" కలం పేరుతో సంస్కృత రచనలు చేశాడు. దర్శనరత్న, మీమాంస విభూషణ, శాస్త్రనిధి, పండితరత్న విద్యామాన్య ప్రశస్తి, బిరుదులతోపాటు ఉత్తరప్రదేశ్ సంస్కృత సంస్థాన్ నుంచి విశిష్ట పురస్కారం, తిరుపతి సంస్కృత విద్యా సంస్థాన్ నుంచి రాష్ట్రపతి నుంచి ప్రతిభా పురస్కారాలు అందుకున్నాడు.

తన సంస్కృత రేడియో నాటికలను "నభోవాణి రూపకాని"గా తెచ్చాడు. రవీంద్రుని నాటికలను సంస్కృతీకరించి "రవీంద్ర రూపకాని"గా వెలువరించాడు. సంస్కృత పత్రికాని ఇతిహాసః, చంద్రం గతోమానవః, భారత భాగ్య చక్రం రాశాడు కన్నడంలో కూడా మంచి రచనలే చేశాడు తన రచనలన్నిటిలో ఉపనిషద్ భావాలను ప్రకాశింప జేయటం పాండురంగి ప్రత్యేకత. రవీంద్ర సందేశాన్ని ఆయన నాలుగు నాటికలు సన్యాసి మాలిని నృప మహిషాచ, కర్నా –కుంతీ చగా సంస్రుృతానువాదం చేసి వ్యాప్తి చేశాడు. రంగి కుమార సంభవం 5వ కాండను "తపః ఫలః రేడియో నాటికగా తీర్చిదిద్దాడు. సీతాత్యాగః ఏకాంకిక మూడు దృశ్యాలతో సీత పరిత్యాగ కథగ, తన 35 కవితలను "కావ్యాంజలి"గా తెచ్చాడు. ప్రాచీన ఆధునిక సంస్కృత సాహిత్య వారధి పాండురంగి. ఆయనలో శాస్త్రీయ భావన కవితా వేశం పుష్కలంగా ఉన్నాయి.❁



## 349) సంస్కృత వీర బ్రహ్మేంద్ర సుప్రభాతకర్త - కొండవీటి వేంకటకవి -1918-1991

ప్రసిద్ధ కవి, హేతువాది చలనచిత్ర సంభాషణ రచయిత. వీరి అసలు పేరు కొండవీటి వెంకటయ్య. వీరు గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకా విప్పర్ల గ్రామంలో జన్మించారు. వీరు నారాయణ, శేషమ్మ దంపతులకు జనవరి 25, 1918 సంవత్సరంలో జన్మించారు. ఈయన ప్రాథమిక విద్యాభ్యాసము తండ్రివద్ద జరిగింది. ఆ తరువాత నరికొండ నమ్మాళరాజు వద్ద సంస్కృత కావ్య పఠనము, దువ్వూరి వేంకటరమణశాస్త్రి వద్ద ఉన్నత విద్య గడించాడు. 1936లో కిసాన్ కాంగ్రెస్‌కు సహాయకార్యదర్శిగా పనిచేశాడు. 1946 నుండి 1952 వరకు వెంకటకవి జిల్లా బోర్డు ఉన్నత పాఠశాలలో తెలుగు పండితునిగా పనిచేశాడు. బాబాలను విమర్శిస్తూ ఉపన్యాసాలిచ్చారు. ఈనాడులో అనేక వ్యాసాలు రాశారు.

1932లో కర్షకులమీద, 1946లో చెన్నకేశవ శతకం రచించారు. తరువాత కాలంలో త్రిశతి పేరుతో బుద్ధుడు, వేమన, గాంధీలను గురించి మూడు శతకాలు రచించారు. 1942లో హితబోధ, 1944లో ఉదయలక్ష్మీ నృసింహ తారావళి రచించారు. 1984 ప్రాంతంలో బ్రహ్మంగారి మఠానికి ఆస్థాన కవిగా ఉన్నారు. మఠాధ్యక్షుల ఆదేశానుసారం శ్రీ వీరబ్రహ్మేంద్ర సుప్రభాతం సంస్కృతంలో రచించారు.

నందమూరి తారకరామారావు వీరిని 1977లో పిలిపించి దానవీరశూరకర్ణ చిత్రానికి సంభాషణలు రాయించారు. తరువాత శ్రీమద్విరాటపర్వం, శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర చిత్రాలకు కూడా సంభాషణలు సమకూర్చారు.

ఆంధ్ర విశ్వకళా పరిషత్తు వీరిని 'కళా ప్రపూర్ణ' పురస్కారంతో గౌరవించింది. 1953 జనవరిలో కవిరాజు అనే బిరుదును కూడా పొందాడు. ప్రసిద్ధ కార్టూనిస్టు శ్రీధర్ ఈయన గురించి సోక్రటీసులాగా తన ప్రపంచంతప్ప మరోటి తెలియనివారు, అతి సామాన్యుడిగా కనిపించే అసాధారణ తాత్వికుడు, వేదాంతి అన్నారు. కవులైనవారు మానవులందర్నీ ఏకం చేసేలా, వారిని సంఘటిత పరచి వారిలో సౌభ్రాతృత్వం పెరిగేలా చేయాలి. ప్రజల్ని విడదీసేలా రచనలు చేయకూడదు అంటూ ఆయన విభజనతత్వాన్ని

ఆనాడే ఖండించారు. 1944-45లో శరభయ్యగుప్త హైస్కూల్లో తెలుగు పండితునిగా ఉద్యోగం ప్రారంభించారు. 1946 నుంచి 1952 వరకు మాచర్లలో జిల్లా బోర్డు ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా ఉన్నారు. 1952 జులై నుంచి పొన్నూరు శ్రీ భావనారాయణస్వామి సంస్కృత కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా పనిచేశారు. వీరు ఏప్రిల్ 7, 1991 సంవత్సరం పరమపదించారు.

పెళ్ళికాక పూర్వం అచల మతంలో దిగంబరిగా వూళ్ళు తిరిగాడు. 1945 ప్రాంతాల్లో కమ్యూనిస్టులు ఒక్కొక్క బాబాగురించి వివరాలు తెప్పించి, వాస్తవాలే సన్మాన పత్రంగా సమర్పించారట. ఏ బాబా ఎలాంటి వాడు, ఆయన పూర్వాపరాలు ఏమిటి లాంటివి. వసుచరిత్ర అవలీలగా పాడి వినిపించేవాడు. భట్టుమూర్తి అంటే ఆయనకు విపరీత ప్రేమాభిమానం. వెంకటకవికి ఇంగ్లీషు రాదు. అష్టావధానాలు చేశాడు. భువన విజయాలలో పాల్గొన్నాడు. లౌకిక వివాహాలు చేయించాడ్ను అంటే మంత్రాలు లేకుండా, త్రిపురనేని రామస్వామి రాసిన పెళ్ళి సూత్రాలు చదివించి, వివాహాలు జరిపించడం. ఇలా ఆవుల మంజులత గారి పెళ్ళి, హైదరాబాదు ఎగ్జిబిషన్ మైదానంలో జరిపించారు. ఆయన పురోహితుడు. ఇన్నయ్య తోటి పురోహితుడు.

కొండవీటి వెంకటకవి హాస్యప్రియుడు. తన షష్ఠి పూర్తి రాబోతున్నదనీ, తానేమంతగా ఆశించడం లేదనీ, ఎందుకైనా మంచిదని ముందుగా చెబుతున్నానేవాడు. తనకు పెద్దగా కోరికలు లేవనీ, ఏనుగుపై వూరేగించి, కాలుకు గండ పెండేరం (రత్నాలు బంగారం అయితే సరేసరి, లేకుంటే చత్తతోడా (గడ్డితో చేసిన కడియం) అయినా సరే అనేవాడు.

**వెంకటకవి కృతులు**

1. కర్షకా! (1932)
2. హితబోధ (1942)
3. భాగవతులవారి వంశావళి (1943)
4. ఉదయలక్ష్మీ నృసింహతారావళి (1945)
5. చెన్నకేశవా! (1946)
6. భావనారాయణ చరిత్ర (గద్యకావ్యము) (1953)
7. దివ్యస్మృతులు (1954)
8. నెహ్రూ చరిత్ర - ప్రథమ భాగము (1956)
9. త్రిశతి (1960)
10. నెహ్రూ చరిత్ర - ద్వితీయ భాగము (1962)
11. బలి (1963)

మట్టినీ, మనిషినీ ప్రేమించినవారే గొప్ప సృజనాత్మక శక్తితో రాణించగలుగుతారు. సత్తెనపల్లి వీధుల్లో రెండు లక్షల అశేష జనవాహిని మధ్య కవితా బ్రహ్మోత్సవం జరిగిన సందర్భం ఒక్కటి చాలు ఆయన సాధించిన విజయమేమిటో తెలుసుకోవడానికి. అదే భారతం. అందరూ అవే మాటలు రాశారు. కానీ నిర్మాణపరంగా లోపాలున్నా ఆయన రాసిన 'దాన వీర శూరకర్ణ' చిత్ర సంభాషణలకు అశేష ఆంధ్రావని బ్రహ్మరథం పట్టింది. శ్రీమద్విరాట్పర్వం, శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర, తాండ్ర పాపారాయుడు, ఏకలవ్య, విశ్వనాథనాయకుడు, వీరాంజనేయ తదితర సంభాషణల రచయితగా 1983 నుంచీ కీర్తిశేషులయ్యేంత వరకు 'ఈనాడు'లో రాసిన 'పరదేశి పాఠాలు' రచయితగా, అనేక కావ్యాలందించిన కవిగా తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు. తెలుగు సమాజాన్ని సంస్కరించే దిశగా ఎంతో దూరం నడిచారు. ఎంతోమందిని చైతన్యవంతం చేశారు. ఆ వైతాళికుడే కొండవీటి వేంకటకవి. ప్రసిద్ధ కార్టూనిస్టు శ్రీధర్ మాటల్లో చెప్పాలంటే సోక్రటీసులాగా తన ప్రపంచంతప్ప మరోటి తెలియనివారు, అతి సామాన్యుడిగా కనిపించే అసాధారణ తాత్వికుడు, వేదాంతి. ఎద్దులు బండియున్ గలిగి యెన్నియొ గేదెలు గాదెలుండినం జద్దికి జాలదయ్యె వ్యవసాయమొనర్చిన నొండు వృత్తి మీ వద్దకు జేరదయ్యె గనుపట్టును దీనికి ముఖ్య కారణం బెద్దియటన్న పాలకుల హీనపుబుద్ధియ సుమ్ముకర్షకా దశాబ్దాలనాడు కవిరాజు చెప్పినది నేటికీ వర్తిస్తుంది... పాలకులే ప్రజల నొసటి రాతలు రాస్తున్నారు. మిరపకు ధర పలుకుతోందని మిరప పైరువేస్తే పంట చేతికి రాగానే దాని ధర తగ్గిపోతుంది. ఒకటా రెండా... ఎన్నో దశాబ్దాలుగా అన్ని పంటల స్థితీ ఇలాగే ఉంది. కొండవీటి వేంకట కవి చెప్పిన మాట పొల్లుపోకుండా నేటికీ వర్తిస్తోంది... ఆయన కవుల బాధ్యతను కూడా స్పష్టం చేశారు. "కవులై దేశహితమ్ముగోరుచు మహాగ్రంథంబులన్ సర్వ మానవ సౌభ్రాతృత బెంపునింపవలె దానంగల్గు మోక్షమ్ము మూర్ఖవిధిన్ ద్వేషపు బీజ సంతతుల గూర్పన్ లాభమే చెన్నకేశవ మాచెర్ల పురాంతరాలయ నివాసా పాహిమాం పాహిమాం...

కవులైనవారు మానవులందర్నీ ఏకం చేసేలా, వారిని సంఘటితపరచి వారిలో సౌభ్రాతృత్వం పెరిగేలా చేయాలి. ప్రజల్ని విడదీసేలా రచనలు చేయకూడదు... అంటూ ఆయన విభజనతత్వాన్ని ఆనాడే ఖండించారు. ఆచార్య తూమాటి దొణప్ప కొండవీటి వేంకటకవి గురించి ఇలా రాశారు- "సహృదయాహ్లాదనముగా, సంస్కార ప్రతిపాదనముగా, సమాజ ప్రబోధ సాధనముగా నిర్దిష్టమైన లక్ష్యముతో నిర్దుష్టమయిన సాధన సామాగ్రితో సాహితీ సమారాధనమును సాగించిన సత్కవులు చాల అరుదు. "ఉత్పాదకా నబహవః కవయః శరభా ఇవ" అన్న బాణోక్తి మేరకు సుకవులు అల్ప సంఖ్యాకులు. ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసములు గల కవులు ద్వాతకులు. ఈ కోటిలో

పరాంకోటికెక్కిన మేటి కవి మన కొండవీటి వేంకటకవి... "నిజమే... పద్యం రాసినా గద్యం రాసినా కొండవీటి వేంకటకవి శైలే వేరు. ఆశ్చర్యమేమిటంటే అంతటి ప్రౌఢకవి, కర్షక కవి గురించి తెలుగు సాహిత్యంలో అందుబాటులో ఉన్న జీవితచరిత్రల్లో ఆయనమీద ఒక్క వ్యాసమైనా అందుబాటులో లేకపోవడం. "ప్రతిభామూర్తులు", "తెలుగు పెద్దలు"... "మహనీయులు", "సారస్వతమూర్తులు"... ఇలా అందుబాటులో ఉన్న అనేక వ్యాస సంకలనాల్లో ఆయన గురించి ఒక్క వ్యాసమైనా లేకపోవడం ఈ రంగంలో కృషి చేసిన వారి పక్షపాత వైఖరికి నిదర్శనమనిపిస్తుంది.

నందమూరి తారకరామారావు అనుబంధంతో, ఈనాడు అనుబంధంతో కొండవీటి వేంకటకవి సృష్టించిన ఆలోచనలు, తార్కికత, ప్రాచీన కావ్యాల్ని కొత్తకోణం నుంచి వివేచన చేసే విమర్శనాత్మక దృష్టి ఆయన్ని నిత్య చైతన్య కవిగా మలచిందనడంలో అతిశయోక్తి లేదు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకా విప్పర్ల గ్రామంలో శేషమ్మ, నారాయణయ్య దంపతులకు 1918 జనవరి 25న జన్మించారు కొండవీటి వేంకటకవి. తండ్రి వద్దే తెలుగు కావ్యాలు చదివారు. మరోవైపు స్వాతంత్ర్య పోరాటాల్లో పాల్గొంటున్న మహామహుల్ని చూశారు. వారి జీవన విధానంలో భాగమైన సామాజిక సేవను అవగతం చేసుకొన్నారు. సంస్కరణభావాల్ని ఒంట పట్టించుకొన్నారు. సరికొండ నమ్మాళరాజులు వద్ద సంస్కృతం నేర్చుకుని కావ్యాలు అభ్యసించారు. దువ్వూరి వెంకటరమణ శాస్త్రుల వద్ద ఉన్నత విద్య అభ్యసించారు. మహాత్మాగాంధీకి జై అంటూ స్వాతంత్ర్యోద్యమంలో ఉరికారు. ప్రజల్లోకి వెళ్లారు. ప్రజల్ని సంఘటితం చేశారు. పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నారు. అందుకే 1936లో జిల్లా కిసాన్ కాంగ్రెస్ సహాయ కార్యదర్శి పదవి చేపట్టారు. ఒకవైపు రాజకీయాలు, మరోవైపు కావ్యరచన, వృత్తి ధర్మమైన విద్యా బోధన... మూడు రంగాల్లోనూ ఆయన రాణించారు.

1944-45లో శరభయ్యగుప్త హైస్కూల్లో తెలుగు పండితునిగా ఉద్యోగం ప్రారంభించారు. 1946 నుంచి 1952 వరకు మాచర్లలో జిల్లా బోర్డు ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా ఉన్నారు. 1952 జులై నుంచి పొన్నూరు శ్రీ భావనారాయణస్వామి సంస్కృత కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా పనిచేశారు. అక్కడ ఆయన బోధించింది సంస్కృత వ్యాకరణం. పదవీ విరమణ తర్వాత హైదరాబాద్లో 'ఈనాడు' ప్రత్యేక అనుబంధంతో వెలలేని ఆణిముత్యాల వంటి అనేక వ్యాసాలనందించారు. 1953 జనవరిలోనే కవిరాజు బిరుదం పొందిన కొండవీటి వేంకటకవి పలు గ్రంథాల్ని రాశారు. "పంచీకరణ భాష్యము" వంటి ఆదిశంకరుల రచనలు సైతం అందరికీ అర్థమయ్యేలా అనువదించారు. 1932లో ఆయన "కర్షకా" అనే నూటొక్క పద్యాల కృతి అందించారు. అప్పుడు ఆయన వయస్సు పధ్నాలుగేళ్లు మాత్రమే. అయినా పండితుల ప్రశంసలందుకొనేలా ఆ కావ్యం రాశారు. ఆ తర్వాత పదేళ్లకి "హితబోధ" అందించారు.

"భాగవతులవారి వంశావళి గ్రంథాన్ని 1943లో రాశారు. "ఉదయలక్ష్మి నృసింహ తారావళి" గ్రంథాన్ని 1945లో రాశారు. వీటి తర్వాత కొండవీటి వేంకటకవికి గొప్ప పేరు తెచ్చిన కావ్యం "చెన్న కేశవ శతకము". "చెన్నకేశవ మాచర్ల పురాంతరాలయ నివాసాపాహిమాం పాహిమాం" అన్న మకుటంతో సాగే ఈ కావ్యంలో వేంకట కవి భాషా పటిమ ప్రతి పద్యంలోనూ కనిపిస్తుంది. ఈ కావ్యం తర్వాత "భావ నారాయణ చరిత్ర" అనే గద్య కావ్యం రాశారు. 1954లో రాసిన "దివ్య స్మృతులు" ఆయనకు మళ్లీ గొప్ప పేరు తెచ్చింది. యుగకర్తలైన వేమన, వీర గురుడు సిద్ధప్ప, తరిగొండ వేంకమాంబ, అలరాజు కృష్ణదేవరాయలు, గుంటూరు మస్తానయ్య, మూర్తికవి నాగార్జునుడు, చిన్నయసూరి, వీరేశలింగం, గురజాడ అప్పారావు, త్రిపురనేని, కట్టమంచి, ఏటుకూరి వెంకట నరసయ్య, తిరుపతి వేంకటకవులు, పొట్టి శ్రీరాములు... వంటివారి మీద స్మృతి చిహ్నాలైన ఖండ కావ్యాలు రాశారు. తర్వాత "త్రిశతి" పేరుతో వేమన శతకంలాంటి శతకం రాశారు. నెహ్రూ చరిత్రను ప్రథమ, ద్వితీయ, తృతీయ ఖండాలుగా మూడు సంపుటాల మనోహర కావ్యం రాశారు. దీన్ని పి.వి.నరసింహారావు హిందీలోకి అనువదించడం విశేషం. రాజర్షి, బలి, మేలుకొలుపు, శ్రీకృష్ణ వ్యాసావళి వంటి కావ్యాల తర్వాత "పంచీకరణ భాష్యము" రాశారు. ఆయన పలికితే పద్యం, పిలిస్తే పద్యం... అంతగా ఆయనకి పద్యంపై పట్టు ఉండేది. ప్రాచీన సాహిత్యాన్ని మథించి రసాస్వాదన చేసిన కొండవీటి వేంకటకవి కవిరాజుగా, కళాప్రపూర్ణగా పండితుల, సామాన్య పాఠకుల మన్ననలు పొందారు. కొండవీడు అన్న పేరు వింటేనే కదలి ఆశువుగా గలగలా పద్యం చెప్పగల ఆయన..

"ప్రోలయ వేమన ప్రోదిచేసిన నేల
వామనభట్టు దైవాఱుతావు
కాటయ వేమన్న కత్తిపట్టిన చోటు
కొమర గిరీంద్రుండు కుదురు నెలవు
అనవేమసార్వభౌముని విహారస్థలి
శ్రీనాథుసు కవి కాలూను వసతి
శంభుదాసుడు పదాబ్జములు మోపిన యిక్క యోగి వేమన నిల్చు త్యాగభూమి ...

ఇటువంటి కొండవీటి సీమ నుంచి ప్రభవించిన వేంకటకవి 1991 ఏప్రిల్ ఏడో తేదీ పరమపదించారు. గురుపీఠాన్ని అలంకరించి వేదాంతోపదేశికులయ్యారు. కవిగా, వ్యాఖ్యాతగా, దేశికునిగా భాష్యకారుడిగా, వేదాంతిగా ఆయన అఖండకీర్తిని పొందారు. అనంత భావదీప్తితో ప్రకాశించారు. సామాజిక న్యాయం కోసం పోరాడిన యోధుడాయన. ఒక సంస్కర్త... సాహితీ, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో ఒక ఎవరెస్టు శిఖరం. ❋

## 350) స్తోత్రాలకర్త - బాలగణపతి భట్ -1919

బాలగణపతి భట్ట 1919 జనవరి 6న శృంగేరిలో పుట్టి, సాహిత్య విద్వాన్ కన్నడ పండిట్ రాష్ట్రభాషా విశారద డిగ్రీలు పొందాడు. చామరాజ కాలేజిలో బోధించాడు. లెక్కలేనన్ని భక్తి రచనలు సంస్కృతంలో చేశాడు. ఇందులో గణపతి సుప్రభాతం ప్రసిద్ధి చెందింది. -"దశభుజ యుత దేవం సింహవాహం క్రుతే త్వం -భజతి శిఖి సువాహనం సిద్ధిదం బాహు సత్వం-యుగ కర సహితం త్వం రక్షకాయం గజాస్యం -యుగయుగం అఖిలో వై హస్తయుగ్మం సితాంగం"

భావం- కృతయుగంలో జనం నిన్ను 10 భుజాలవానిగా సింహవాహనునిగా, త్రేతాయుగంలో ఆరు చేతులు నెమలివాహనం ఉన్నవాడిగా, ద్వాపరంలో నాలుగుబుజాలు ఏనుగు ముఖంతో ఉన్న నిన్ను పూజించారు. కలియుగంలో ద్విభుజునిగా శ్వేత వర్ణం గలవానినిగా నిన్ను అర్చిస్తున్నారు.

శ్రీ సత్యనారాయణ సుప్రభాతం శ్రీ గంగాధర సుప్రభాతం కూడా రాశాడు. బాలభట్టు -గజారిహరి నాగ జాతిహారి -గజాస్య మోదో.నగజాస్తామదః❀

## 351) మేదర చన్నయ్య కర్త - ఏం జి నంజుండా చార్య -1919

1919 ఆగస్ట్ 1న పుట్టిన నంజుండా రాధ్యతలిదండ్రులు వీరమ్మ గంగాధరయ్య. సిద్ధనగ్ర బెంగళూర్ జయచామరాజ కాలేజీలలో సంస్కృతం నేర్చి సాహిత్యంలోనూ శక్తి విశిష్టాద్వైతంలోను మాస్టర్ డిగ్రీలు పొందాడు. కన్నడ హిందీ డిగ్రీలు సాధించాడు. సంస్కృతంలో "మేదర చన్నయ్య" నాటకంతో భక్తిగీతాలు చాలా రాశాడు. వీటిని సుప్రభాతాలు స్తోత్రాలుగా పేర్లు పెట్టాడు. శ్రీకర భాష్యం రెండుభాగాలుగా రాశాడు. ముండక ,కైవల్య ఉపనిషత్తులను సదాశివ భాష్యం, రేణుకా గీత భాష్యంలుగా వీర శైవ ప్రయోగ మంత్రం, శ్రీకరభాష్యం చతుశ్లోకీ మొదలైనవి ప్రచురించాడు. మైసూర్ మహారాజా ఆస్థాన విద్వాంసుని చేసి గౌరవించగా, కర్నాటక రాష్ట్రం అవార్డ్‌ను, ఇవ్వగా సాహిత్య రత్న, శివతత్వ చింతామణి శివాద్వైత భూషణ, విద్యావారిది బిరుదులూ తన విద్వత్తుకుకు తగినవిగా పొందాడు. సంస్కృత కన్నడ సాహిత్యాలకు తన రచనా పతిభ వలన నంజుండా రాధ్య పరిపుష్టి కలిగించాడు.❀



## 352) అనేక సంస్కృత రచనలకర్త - పండిట్ సుధాకర శుక్ల - 1919-1985

పండిట్ సుధాకర్ శుక్లా మధ్య ప్రదేశ్‌లో 1913లో జన్మించి 1985లో మరణించాడు. ద్వైతీయలో స్థిరపడ్డాడు. అనేక కాండల సంస్కృత మహా కావ్యాలు, దీర్ఘ కవితలు రాశాడు. నాటకాలు కవితలూ కూడా రచించాడు. రాష్ట్రంలోను దేశమంతటా పేరు ప్రఖ్యాతులు పొందాడు అనేక బిరుదులూ, పురస్కారాలు గౌరవ డాక్టరేట్‌లు లభించాయి. గ్వాలియర్ జివ్వాజి యునివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చి ఘనంగా సన్మానించింది. ఇంత ప్రసిద్ధుడైన ఈ కవి గురించి పూర్తి సమాచారం లభించకపోవటం దురదృష్టం.❀



## 353) దేవీ విలాస కర్త - కె ఎస్ భాస్కర భట్ట - 1920

1920లో కర్నాటకసాగర్ తాలూకా భీమన కొనే గ్రామంలో భాస్కర భట్ట జన్మించాడు. అలంకార శాస్త్రంలో విద్వాన్, కన్నడంలో పండిట్ అయ్యాడు. చాలా స్కూళ్ళలో పనిచేసి రెండూ బోధించాడు. అయోధ్య సంస్కృత పరిషత్ సాహిత్య భూషణ, ఇస్తే లింగరాజు సంస్థ ప్రైజ్ మైసూర్ మహారాజు దేవీ విలాస ఖండకావ్యానికి ప్రదానం చేశాడు. దీనితోపాటు గురు కృపాతరంగిణి రాశాడు. రామచంద్ర మఠంలోని శ్రీరాముని వర్ణిస్తూ-

"యన్నామ సంకీర్తన రసప్లవ చిత్త వృత్తీ -నిష్కల్మషః కులపథిః ప్రధమః కవీనాం రామాయణం నవవరాంబునిధిం వ్యతాన్తీ-తం రామ చంద్ర మనీషంప్రణమామి.

శాంతరసానికి ప్రాధాన్యత నిచ్చాడు. అవసరమైన చోట్ల మంచి శుభాషితాలను కూర్చాడు.

"కర్మాణి స్వతహా ప్రవృత్తిం అపూర్వ న్యకా మానవాః -వీత రాగిణా పరార్ధ సాధకా హిసర్వవదా

వేదాంత భావన అపూర్వ పద సమ్మేళనం తో పరవశం కలిగించే శ్లోకాం-

"కేవలం నిరంజనం నిరాకారం నిరీహికం -జన్మ మృత్యు నాశకం భావార్ణస్య తారకం -నిత్య శుద్ధ బుద్ధ ముక్తం అనుభావికం పరం -తత్ పదం నిజ స్వరూపం ఆపనుయాం అహం కదం?" కవిపై వాల్మికి కాళిదాస జయదేవుల ప్రభావం ఉన్నది.❀

### 354) క్రియా సూత్ర కర్త – ఆత్మేశ్వరానంద విద్యారత్న బాలాజీ – 1920

8వ ఏటనే క్రియా యోగాశ్ర మంలో చేరి చదివి, వేదాంతంలో ఎం.ఏ చేసి "లా" కలకత్తా యునివర్సిటీలో చదివి, పి హెచ్ డి చేసి, పూరి గోవర్ధనమఠ శంకరాచార్యుల వద్ద సన్యాసం తీసుకొని 12 ఏళ్ళు హిమాలయాలలో ఏకాంతంలో తపస్సులో గడిపి గురువు మహాముని బాబాజీ వద్ద "క్రియా సూత్రాలు పూర్ణ క్రియ పొంది, యోగిగా మారి సంస్కృతంలో విద్యా రత్న పొంది, అమెరికా సందర్శించి 55 గ్రంథాలు రచించారు ఆత్మేశ్వరానంద.

క్రియాసూత్రాలు–1

తత్త్వం– అత ఆత్మా జిజ్ఞాసా –స్వరూపేవస్థానం ఆత్మా దర్శనం – సర్వజ్ఞః నిత్యం పూర్ణ మిదానమంతమాత్మా –తస్య ప్రకాశః ప్రణవః –ప్రణవ శబ్ద ఏవ పంథా –జగత్ సృష్టిమయా ఈశ్వరస్య తస్య హేతురవిద్యా –చిత్త వృత్తిః హేయ హేతుః"❁

### 355) నిత్యకామ్య కర్మ మీమాంస కర్త – బ్రహ్మశ్రీ రేమెళ్ళ సూర్య ప్రకాశ శాస్త్రి –1920

బ్రహ్మశ్రీ రేమెళ్ళ సూర్య ప్రకాశ శాస్త్రి 20–8–1920న జన్మించి కృష్ణ యజుర్వేదం, తైత్తిరీయ శాఖ శ్రౌతమ్, ఆపస్తంభ సూత్రం లక్షణ శాస్త్రం మీమాంసాశాస్త్రాలలో ఉద్దండ పండితులయ్యారు. నిత్య కామ్య కర్మ మీమాంస "గ్రంథాన్ని సంస్కృతంలో రాశారు తెలుగులో "వేదారిదోపన్యాసాలు", వేదార్ధ జ్ఞాన దీపికమొదలైనవి రాశారు. మహా మహోపాధ్యాయ బిరుదాంకితులు. సంఘ వేదార్ధ సామ్రాట్ అభినవ విద్యారణ్య, శాస్త్రరత్నాకర, వేద మీమాంస సార్వ భౌమ బిరుదు పురస్కారాలతోపాటు వేద, సంస్కృత సేవకు రాష్ట్రపతి అవార్డు అందుకున్నారు వేద ఉపనిషత్ శాస్త్రాలపై కొన్ని వందల ఉపన్యాసాలిచ్చారు. శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి "వేద నిధి" బిరుదప్రదానం చేసి సత్కరించారు. బెంగుళూరు భారతీ విద్యాభవన్ "వేద రత్న"నిచ్చి గౌరవించింది.

శాస్త్రిగారు రాజమండ్రి గౌతమి సంస్కృత విద్యా పీఠ ప్రిన్సిపాల్‌గా చేసి రిటైరయ్యారు. తిరుపతి దేవస్థానానికి చాలాకాలం సలహాదారుగా అనేక వేద శాస్త్ర పరిషత్తులకు గౌరవాధ్యక్షులుగా, వేదసంఘానికి పలుమార్లు అధ్యక్షులుగా ఉన్నారు.

అవధానులుగారు 25–9–1948న తూర్పుగోదావరి పొగడపల్లిలో జన్మించారు. తండ్రి శ్రీ వి.సూర్యనారాయణ తల్లి శ్రీమతి లక్ష్మీ నరసమ్మ.❁

## 356) పంచ ఐశ్వర్య నాటక కర్త – శ్రీలంక ఆగమ పండిట్ – కైలాసనాధ కూరుక్కల్ –1921–2000

15–8–1921న జన్మించి 15–8–2,000న 79వ ఏట చనిపోయిన కె.కైలాస నాద కురుక్కాల్ శ్రీలంకలో జాఫ్నా జిల్లా నల్లూర్‌లో తమిళ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ప్రాధమిక విద్య నల్లూర్‌లోని మంగయార్క రాసి విద్యాలయంలో పూర్తి చేసి, జాఫ్నాలోని తిరునల్వేలి కాలేజిలో చదివి, లండన్ మెట్రిక్, ఇంటర్ మీడియెట్ పాసయ్యాడు. పెరదేనియాలోని సిలోన్ యూని వర్సిటిలో సంస్కృతం పాళీ లాటిన్ ఇంగ్లీష్ జర్మన్, ఫ్రెంచ్ భాషలు నేర్చి పండితుడయ్యాడు. ఆయన సంస్కృత గురువు ప్రొఫెసర్ బెట్టీ హేమన్. గురువే స్నేహితుడు, గైడ్ అయ్యాడు. 1948లో సంస్కృత ఎం.ఏ.డిగ్రీ పొంది అదే యూనివర్సిటిలో సంస్కృత లెక్చరర్‌గా చేరి పని చేశాడు.

భారతీయ ఇతిహాస, పురాణ కాలాలపై పరిశోధన చేసి "ఏ స్టడీ ఆఫ్ ఎపిక్ అండ్ పురాణిక్ పీరియడ్స్" థీసిస్ రాసి 19 60లో డాక్టరేట్ పొందాడు. యూనివెర్సిటి ఆఫ్ సిలోన్ రివ్యులో చాలా పరిశోధనాత్మక వ్యాసాలు రాశాడు. 1974లో జాఫ్నా యూనివర్సిటీలో మొట్టమొదటిసారిగా "డిపార్ట్ మెంట్ ఆఫ్ హిందూ సివిలిజేషన్" ఏర్పడినపుడు దాని అధ్యక్షుడిగా పని చేశాడు. ఆర్ట్స్ ఫాకల్టికి "కో–డీన్"గా 1976–78 మధ్య ప్రొఫెసర్ ఎస్.గామ్లత్‌తో కలిసి పని చేశాడు. ఫైన్ ఆర్ట్స్ అనే రామనాధన్ ఫైన్ ఆర్ట్స్ అకాడెమికి హెడ్ అయ్యాడు.

శ్రీలంక, ఆస్ట్రేలియాలలో చేసిన ఎన్నో యజ్ఞాలకు ముఖ్య పురోహితుడుగా వ్యవహరించాడు. శ్రీలంకలోని పుట్లాం జిల్లాలోని మున్నేశ్వరం దేవాలయానికి ముఖ్య పూజారులలో ఒకరుగా ఉన్నాడు. శ్రీలంకలోని "పంచ ఐశ్వర్య దేవాలయాలలో" ఇదొకటి.

సంస్కృత గ్రంథాలపై హిందూ సంస్కృతీ నాగరకతలపై విస్తృత పరిశోధన చేశాడు కైలాసనాధ కురుక్కాల్. శ్రీలంకలో ఇతర దేశాలలో జరిగిన చాలా సెమినార్లలో పాల్గొని వీటిపై పైశోధన వ్యాసాలూ రాసి సమర్పించాడు. 1997లో లండన్‌లోని "శ్రుతి లయ సంఘం" పంచ ఐశ్వర్యంపై ఒక నృత్యనాటకాన్ని ప్రదర్శించాలని సంకల్పించి,

కైలాసనాథ కురుక్కాల్‌ను సంప్రదిస్తే తానూ ఒక ఐశ్వర దేవాలయంతో సంబంధం ఉన్నవాడు కనుక ఆ సబ్జెక్ట్‌పై కూలంకషంగా రిసెర్చ్ చేసి విషయాలను సమగ్రంగా అందజేసి వారికి సహకరించాడు. లండన్ లోలండన్ యూనివర్సిటి లోగాన్ హాల్‌లో 16-10-1999న "పంచ ఐశ్వర్యం" నృత్య నాటకం ప్రదర్శించారు. గొప్ప స్పందన లభించి కురుక్కాల్ వైదుష్యానికి బహుదా ప్రశంసలు లభించాయి. ప్రదర్శనకు కొద్దికాలం ముందే కురుక్కాల్ భార్య పరమపదించింది. అయినా లండన్ వెళ్లి ప్రదర్శనలో పాల్గొని అందరి అభిమానం పొందాడు.

1988లో జాఫ్నా యూనివర్సిటి కురుక్కాల్‌కు డిలిట్‌ఇచ్చి గౌరవించింది. అసోసియేషన్ ఆఫ్ ఆర్ట్స్ వారు గౌరవించి సత్కరించారు. 1993లో శ్రీలంక ప్రభుత్వం "వేదాగమ మామణి" బిరుదునిచ్చి సన్మానించింది. 1998లో కురుక్కాల్ రిటైర్ అయ్యాక కూడా జాఫ్నా యూనివర్సిటి ఆయన్ను "ప్రొఫెసర్ ఎమిరిటస్"గా గౌరవించింది.

శ్రీలంకలో హిందూ కర్మకాండ అధ్యయనంలో, నిర్వహణలో కురుక్కాల్ అద్వితీయుడు. శ్రీలంకలో ఉన్న అతి కొద్దిమంది బ్రాహ్మణ కుటుంబాలు అవసరం వచ్చినప్పుడు ఆయన సలహా సంప్రదింపులు తీసుకొంటూ హిందూ ధర్మ విధులను నెర వేరుస్తారు.

కురుక్కాల్ -సంస్కృత ఈజీ ట్యూటర్, హిస్టరీ ఆఫ్ సాంస్క్రిట్ లిటరేచర్, రిట్యువల్స్ ఇన్ శైవ టెంపుల్స్, హిందూ కల్చర్ -సమ్ దాట్స్" వంటివి చాలా పుస్తకాలు రాశాడు. ❁

## 357) కాతంత్ర, చంద్ర కలాప వ్యాకరణ సిద్ధికర్త - పండిట్ దీనానాథ్ యక్ష -1921

పండిత దీనానాథ యక్ష 12-6-1921న కాశ్మీర్‌లో పండిత కుటుంబంలో జన్మించి పంజాబ్ యునివర్సిటీ నుంచి సంస్కృత శాస్త్రి డిగ్రీ పొంది, ఆ కాలపు మహోన్నత సంస్కృత విద్యావేత్తలతో గాఢ సాన్నిహిత్యం సాధించి స్థానిక పాఠశాలలో కర్మ కాండ నేర్చి, పండిట్ రామ్ జూ కోకిలూ, పండిట్ రఘునాథ కోకిలూల వద్ద వ్యాకరణం అభ్యసించి పండిత కేశవ భట్ జ్యోతిష దగ్గర జ్యోతిషం నేర్చి, పండిట్ పరశురామ్ శాస్త్రి పండిట్ కాకారాంశాస్త్రిల దగ్గర అడ్వాంస్డ్ సంస్కృతం వ్యాకరణాలలో నిష్ణాతుడై, పండిట్ ఆనంద కాక్, పండిట్ నాథ్ రామ్ శాస్త్రిల సమక్షంలో న్యాయ శాస్త్రం కావ్య

శాస్త్రం నేర్చి శాస్త్రి డిగ్రీ అందుకున్నాడు. సంస్కృత భాషా సాహిత్యాలపై అమేయ మైన పట్టు సాధించి కాశ్మీర్ రాజ్యశాస్త్ర శిరో భూషణుడయ్యాడు.

1945లో సంస్కృత రీసెర్చ్ ఇన్స్టిట్యూట్‌లో కాపీయిస్ట్‌గా చేరి, 1976లో హెడ్ పండిట్‌గా రిటైరయ్యాడు. తాను చేరినప్పుడు 213 మాత్రమే ఉన్న సంస్కృత గ్రంథ వ్రాత ప్రతులను 5000 వరకు తన నిత్య పరిశోధనా కృషివలన చేర్చి కీర్తి పొందాడు. ఇక్కడే తన సంపాదకత్వంలో రామచంద్ర సూరి రచన ప్రభావతి ప్రద్యుమ్న సంస్కృత నాటకం, సుఖానంద జాదూ కృతి శివ సూత్ర వివరణ, వాసుదేవకవి రాసిన శివ సూత్రవివరణ మంసారాం మోంగా కృతి స్వతంత్ర దీపికా, నీలకంఠుని భవ చూడామణి , క్షేమరాజకృతి శివ సూత్ర విమర్శిని, విద్యాకంఠుని తంత్ర గ్రంథం భావ చూడామణి, ఈశ్వర కౌల్ కాశ్మీర్ దుర్భిక్షంపై రాసిన "దుర్భిక్షితా దరుదయ" మొదలైన అమూల్య గ్రంథాలను లోకానికి అందించాడు. లెక్కకు మించి విమర్శనా వ్యాసాలను సంస్కృత హిందీ, ఇంగ్లీషులలో రాసి ప్రచురించిన నిత్య పరిశీలనాశీలి. రీసెర్చ్ సెంటర్ ప్రచురించి లైబ్రరీకి అందజేసిన వ్రాత ప్రతుల కేటలాగ్‌కు సహ సంపాదకత్వం వహించాడు.

తర్వాత స్ట్రాల్ ఏషియన్ స్టడీస్ కేంద్రానికి రీసెర్చ్ అసోసియేట్‌గా ఐదేళ్లు సేవలందించాడు. పిమ్మట ఆర్కిలాజికల్ డిపార్ట్ మెంట్‌లో ఒక ఏడాది పనిచేశాడు. భారత ప్రభుత్వ సంస్కృత సంస్థాన్‌లో ఐదేళ్లు పనిచేసి తన విద్వత్‌కు తగిన "శాస్త్ర చూడామణి" ఫెలోషిప్ పొందాడు. ఇంతటి సాహిత్య పిపాసి తన ఇంటి లైబ్రరీలో సేకరించి భద్ర పరచుకున్న 9 వేల ప్రచురణ గ్రంథాలను, 500ల అపూర్వ అత్యంత విలువైన సంస్కృత గ్రంథ వ్రాత ప్రతులను వదిలేసి 1990లో ఉగ్రవాదుల దాడులకు భయపడి ప్రవాసానికి పారిపోవాల్సిన దుస్థితి కలిగింది. ఆ కాశ్మీర శారదా మాత ఎంతగా దుఖించిందో ఊహకు అందరాని విషయం.

కాశ్మీరు పండితులు పాణిని నుంచి అందరూ గొప్ప వ్యాకరణవేత్తలు, ఆ సంప్రదాయాన్ని అవిచ్చిన్నంగా కొనసాగించిన అపార పాణినీ మూర్తులు. పండిత దీనా నాథా యక్ష అపూర్వ వ్యాకరణ సంప్రదాయాలైన కాతంత్ర, చంద్ర, కల్ప విధానాలపై సాధికారత సాధించాడు. కాశ్మీర్ సంస్కృతీ వేదాంతం హిస్టరీ జాగ్రఫీలంటే ఆయనకు మహాప్రాణం. ఆయన ప్రసంగాలలో, వ్రాతలలో తరచుగా రాజతరంగిణి, నీల కంఠ మత శ్లోకాలను ఉల్లేఖించేవాడు. పతంజలి మహాభాష్యాన్ని చాలా క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. ఆయన సంస్కృత రచనలో భవభూతి బాణ, శ్రీ హర్షుల శైలి ఉంటుంది. వ్యాకరణ మంటే కీకారణ్యమే. అందులోకి ప్రవేశం దుర్లభమనిపిస్తుంది. దాన్ని బోధించటమూ కష్టమైన పనే. దాన్ని అత్యంత సులభంగా కరతలామలకంగా బోధించే

నేర్పు ఉన్నవాడు పండిట్ దీనానాథా యక్ష. తాను ఈ బోధనా శైలిని ప్రముఖ కాశ్మీర్ కవి సాహిబ్ కౌలా నుంచి నేర్చుకున్నానని కృతజ్ఞతగా చెప్పుకున్నాడు.


లైబ్రరీలోని మేక్ బెత్ నాటకం చదివి ఆంగ్లంపై దృష్టిపడి, ఆంగ్ల సాహిత్యాధ్యయనం చేసి షేక్స్పియర్ సాహిత్యాన్ని అంతటినీ సంస్కృతీకరించిన విద్యావేత్త. ఆంగ్లాన్ని సంస్కృతం ద్వారా నేర్చిన మహాజ్ఞాని. సాంప్రదాయ పండితుడైన భావాలలో ఆధునికత, శాస్త్రీయత ఉన్నవాడు. కాశ్మీర్ శైవంలోని క్రమ సిద్ధాంతాన్ని ఎందరో విద్యార్థులకు బోధించి రీసెర్చ్‌కు గైడ్‌గా ఉన్నాడు. "ఇండియన్ కావ్య లిటరేచర్" రచయిత ఏ కె వార్డర్‌తో కలిసి పనిచేశాడు. ఆయన కాశ్మీర్ శారదామాత దివ్య కంఠాభరణం. ❁

## 358) శ్రీకృష్ణ కంఠాభరణ మహాకావ్యకర్త – గలగిరి పందరి నాథాచార్య -1922-2015

గలగరి పండరీనాథాచార్య 22-7-1922న కర్ణాటకలోని గలగరి అనే కుగ్రామంలో జన్మించాడు. తండ్రి కూర్మా చార్యులు. చిన్నతనంలో చదువు ఒకటవ తరగతితో ఆగిపోయింది. వెంటనే వేదాధ్యనం తండ్రివద్ద ప్రారంభించాడు. 1944 నుంచి 1960 వరకు బాగల్ కోట్ లోని శంకరప్ప సంస్కృత హైస్కూల్‌లో సంస్కృత ఉపాధ్యాయుడిగా పని చేశాడు. 1961లో గడగ్ వెళ్లి వీరనారాయణ సంస్కృత పాఠశాల ప్రారంభించాడు. 1971లో వేద సాహిత్యమాల సంస్థ స్థాపించి అష్టాదశ మహా పురాణాలను నలభయి ఏళ్ళు కృషిచేసి కన్నడంలోకి అనువదించాడు. మధురవాణి, వైజయంతి సంస్కృత పత్రికలకు, శ్రీ సుధా, పంచామృత కన్నడ పత్రికలకు సంపాదకుడుగా ఉన్నాడు. ఆయన సంస్కృత వచన రచన శైలి బాణభట్టును పోలి ఉంటుంది. కవిత్వ శైలి కాళిదాసుకు సమానంగా ఉంటుంది. సృజన సాహిత్యంలో ఆయన అందరికంటే ఉన్నతస్థాయిలో ఉన్నాడు అన్ని ప్రక్రియలూ స్పృశించాడు. సంస్కృతంలో 22 సృజన రచనలు చేశాడు. అవి వేదాంత తుండ స్తవం, రామరసాయన మహాకావ్యం, శ్రీ కృష్ణ కంఠాభరణ మహాకావ్యం, పవన పావన చంపు, శ్రీ పాండురంగ విఠల చంపు, శ్రీ రాఘవేంద్ర అశ్వధాటి, తాత్యా తోపీతా హ గాంధీ టోపీ పర్యంతం, విప్లవ వీరుడు సుభాష చంద్రబోసుపై "క్రాంతి స్ఫులింగ మొదలైనవి. కన్నడంలో రాసిన 21 రచనలలో –మహాభారత కోశ, రాగ విరాగ, భామతి, కర్ణాటక కోశకారు, కలణ రాజ తరంగిణి మొదలైనవి ఉన్నాయి. ఇవికాక ముందే చెప్పినట్లు 18 పురాణాలనకు కన్నడానువాదం చేశాడు.

పండరీనాథాచార్యులు తన ప్రతిభకు తగిన పురస్కారాలు ఎన్నో అందుకొన్నాడు. అందులో సాహిత్య అకాడెమి పురస్కారం, రామకృష్ణ దాల్మియా, రాష్ట్రపతి అవార్డు,

కన్నడ కాళిదాస బిరుదు, రాజ్య ప్రశస్తి, మహామహోపాధ్యాయ, విద్వత్కవి తిలక, సచ్ఛాస్త్ర ప్రవచన విచక్షణ, సంస్కృతివాహక, విద్యారాజా మొదలైనవి ఎన్నో బిరుదులూ, పురస్కారాలు అందుకొన్న మహాసంస్కృత విద్వాంసుడు గలగరి పండరినాధ ఆచార్య. సాహిత్య వ్యాసంగంతో పండిపోయిన పండరినాథాచార్య 93వ ఏట పండిన వయసులో 29-8-2015లో పండరినాధుని చేరుకొన్నాడు.❁



## 359) పంచరత్న గీతకర్త - సత్యానంద సరస్వతి -1923-2009

వేద శాస్త్రాలలో అఖండ పాండిత్యం సాధించిన స్వామి సత్యానంద సరస్వతి దేశంలో ప్రముఖ సంస్కృత విద్వాంసులు, 60కి పైగా సంస్కృతంతో సహా పలుభాషలలో రచనలు చేశారు. హిందూధర్మ రక్షణకు కంకణం కట్టుకొన్న మహానుభావులు. గురువు నుండి 1971లో దీక్ష పొంది వేద విజ్ఞానాన్ని సంస్కృతం చండీ పఠంలను గురువు శివానంద సరస్వతి "డివైన్ లైఫ్ సొసైటీ"లో చేరి శ్రీ అమృతానంద సరస్వతి నుండి పొందారు .

హిమాలయాలలోని బాక్రేశ్వర్ వద్ద మంచుకాలంలో వేసవిలో దేన్నీ లెక్క చేయకుండా చండీ పఠం కంఠస్థం చేశారు. హిమాలయ పర్వత శ్రేణువులలో 15 సంవత్సరాలు ఆ చివరనుంచి ఈ చివర వరకు ఆయన తిరగని ప్రదేశమే లేదు. సంస్కృతంపై ప్రత్యేక ఆరాధన ఏర్పడి దాన్ని ఆమూలాగ్రం నేర్చి బెంగాల్, హిందీలలో కూడా ప్రావీణ్యం సాధించారు. శ్రీ రామకృష్ణ పరమహంస బోధలు అధ్యయనం చేసి ప్రచారం చేశారు. 1979లో శారదామాతను సందర్శించారు. దేశ మంటా పర్యటిస్తూ పూజలు హోమాలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తూ ప్రజలకు మార్గదర్శి అయ్యారు.

1984లో అమెరికా వచ్చి "మాతృ మందిర్" స్థాపించి నఫా, కాలిఫోర్నియాలలో బాగా ప్రచారం చేశారు. పంచ రత్నాలు అంటే గీతా మహాత్మ్యం విష్ణు సహస్రనామ స్తోత్రం భీష్మ స్తవం, అనుస్మృతి, గజేంద్ర మోక్షం. వీటిలోని భావార్ధాలను చక్కగా వివరించి చెప్పారు.❁

## 360) భావలయకు ప్రాణం పోసిన – ఏం డి బి రామనాధన్ – 1923–1984

"ఎండి బి"గా ప్రసిద్ధుడైన మంజప్ర దేవేశ భాగవతార్ రామనాథన్ 20–5–1923న తమిళనాడులోని పాలకాడు జిల్లా మంజప్ర గ్రామంలో జన్మించి, భావ లయలకు ప్రాధాన్యమిచ్చిన వాగ్గేయకారుడిగా పేరు పొందారు. తండ్రి దేవేశ భాగవతార్ సంగీత ఉపాధ్యాయుడు. పాలక్కాడు విక్టోరియా కాలేజీలో చదివి ఫిజిక్స్‌లో డిగ్రీ పొంది, మద్రాస్ వచ్చి తండ్రి వద్దనే సంగీత మర్మాలు గ్రహించాడు. అదే సమయంలో రుక్మిణి అరండేల్ కళాక్షేత్రంలో సంగీత శిరోమణి కోర్స్ 1944లో ప్రారంభిస్తే మొదటి బాచ్‌కి ఎన్నికైన ఏకైక విద్యార్థి మన ఏం డి బి ఒక్కడే. అక్కడి గురువు టైగర్ వరదాచారి ముఖ్య ఏకైక శిష్యుడై సంగీతంతో మరీ దగ్గరయ్యాడు. అక్కడే అసిస్టెంట్‌గా చేరి సంగీత ప్రొఫెసర్ అయి కళాక్షేత్ర ఫైన్ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ అయ్యాడు. నెమ్మదిగా పాడటం ప్రారంభించి శ్రోతలను తనతోపాటు తీసుకువెడుతూ సాహిత్యంలోని అందాలను అనుభవించేట్లు చేయటం ఈయన ప్రత్యేకత. కథాకళీలోని విలంబిత కాలగానం తనను బాగా తీర్చి దిద్దిందని చెప్పేవాడు. ప్రముఖుల కృతులు పాడేటప్పుడు సాహిత్యాన్ని మార్చిపాడి విమర్శకు గురయ్యేవాడు. మరో ప్రత్యేకత అనుపల్లవితో ప్రారంభించి తర్వాత పల్లవి పాడటం. ఇది బాగా నచ్చేది అందరికి. మూడుభాషలలో 300కుపైగా కృతులు రాశాడు. 1984 ఏప్రిల్ 27న 61 ఏళ్ళవయసులో చనిపోయాడు.

ఎం డి బి రచించిన సంస్కృత కృతులు–బేహాగ్ రాగంలో – "భజభజ మనుజ", ఆరభిలో – "భారతేశ నుతే", శ్రీ రాగం లో– "దుర్గాదేవి", హంసధ్వనిలో– "గజవదన" కానడలో– "గురు చరణం", ధన్యాసిలో "గురువారం భజ మనసా", ధీర శంకరాభరణం లో– "జనని నతజనపాలిని"–బాగేశ్వరిలో – "సాగర శయన విభో", కాపీరాగంలో తిల్లాన, కేదారంలో– "త్యాగరాజ గురుం",
1974లో పద్మశ్రీని కేంద్ర సంగీత అకాడెమీ పురస్కారాన్ని, 1976లో సంగీత శిఖామణి, 1983లో సంగీత కళానిధి బిరుదు పొందాడు.❀

## 361) మిలీనియం సంస్కృత పురస్కార గ్రహీత – పద్మశ్రీ దేవదత్త శర్మ -1924

డోగ్రీ సాహిత్యాన్నీ హిమాలయ పర్వత ప్రాంత సాహిత్యాన్ని పెంచి పోషించిన సంస్కృత పండితుడు కవి దేవీ దత్త శర్మ 23-10-1924న ఉత్తరాఖండ్‌లోని కుమాన్ జిల్లాలో జన్మించాడు. ఆగ్రా యూనివర్సిటి నుండి ఎం.ఏ డిగ్రీ పొంది, బనారస్, పంజాబ్ యూనివర్సిటీల నుంచి రెండు డాక్టోరల్ డిగ్రీలు సాధించాడు. పంజాబ్ యూనివర్సిటి నుండి డి.లిట్ అందుకొన్నాడు. 28 గ్రంథాలు ,200 పరిశోధనా పత్రాలు రచించాడు. 56 రిసెర్చ్ గ్రంథాలు వారి విద్వత్తును చాటుతాయి. ఆయన 8 భాగాలుగా రాసిన “సోషియో కల్చర్ ఆఫ్ ఉత్తరాఖండ్” గొప్ప ప్రాచుర్యం పొందింది. మూడు భాగాల “జ్ఞాన కోశం” సంతరించాడు. చండీగర్ లోని పంజాబ్ యూనివర్సిటిలో సంస్కృత ప్రొఫెసర్‌గా దీర్ఘకాలం పని చేసిన అనుభవం దేవీ దత్తశర్మది.

ఆయన విద్వత్తుకు తగిన గౌరవ పురస్కారాలు లభించాయి. గర్వాల్ యూనివర్సిటి “జీవిత సాఫల్య పురస్కారం”, న్యు ఢిల్లీ లోని గ్యాన్ కళ్యాణ్ దత్యా న్యాస్ సంస్థ “అఖిలభారత విద్వత్ సమ్మాన్”ను, సంపూర్ణానంద సంస్కృత విశ్వ విద్యాలయం “సంస్కృత విద్వత్ సమ్మాన్”, కేంబ్రిడ్జిలోని ఇంటర్నేషనల్ బయాగ్రాఫికల్ సెంటర్ 2000 సంవత్సరంలో “మిలీనియం అవార్డ్”ను, అదే ఏడాది భారత ప్రభుత్వం “మిలీనియం సంస్కృత పురస్కారం”, 2001లో భారత రాష్ట్రపతి గౌరవ సర్టిఫికేట్, 2011లో భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం అందజేసి సత్కరించాయి.❁

## 362) లజపతి తరంగిణి కర్త – హరిశ్చంద్ర రేన పుర్కార్ -1924

1924లో మహారాష్ట్రలో రేనాపూర్ గ్రామంలో 1924 సెప్టెంబర్ 17న హరిశ్చంద్ర రేన పుర్కార్ జన్మించాడు. సంస్కృతంలో ఎం.ఏ డిగ్రీ పొంది కర్నాటక, ఆంధ్రా కాలేజీలలో బోధించి ప్రస్తుతం గుల్బర్గాలో ఉంటున్నాడు. ఎన్నో సంస్కృత పత్రికలలో రచనలు చేసి పేరు పొందాడు. ప్రస్తుతం సంఘ విలువలు దిగజారి పోతున్నందుకు వ్యధ చెందాడు. జాతీయ నాయకులైన దయానంద, గాంధి, నెహ్రూ, సత్వలేకర్ ఇందిరా గాంధీ మొదలైనవారిపై కవితలల్లాడు. భారతీయ స్వాతంత్ర సమరంపై “లజపతి తరంగిణి” అనే 89 శ్లోకాల కావ్యం రాశాడు. శాస్త్రి శ్లోక లహరి, ఇందిరా హౌతమ్యం కూడా రాశాడు. దేశంలోని దారుణ కరువుపై “భీషణం దుర్భిక్షం” కవిత రాశాడు. సమకాలీన విషయాలపై పుంఖాను పుంఖంగా పారిజాతం సంస్కృత భవితవ్యం మొదలైన మేగజైన్‌లలో కవితలు రాశాడు.



## 363) కాశ్మీర్ శైవ దర్శన కర్త – నీలకంఠ గుర్తు –1925


2–1–1925న కాశ్మీర్‌లోని శ్రీ నగర్‌లో నీలకంఠ గుర్తు జన్మించాడు. సంస్కృత సాహిత్యంలో అడ్వాన్సేడ్ సాంస్క్రిట్ వ్యాకరణం, భాషా సాహిత్యాలలో పాండిత్యాన్ని పండిట్ లాల్ కాల్ లాంగూ, పండిట్ హరిభట్ట శాస్త్రి, పండిట్ సర్వ దనద హాన్డూ, పండిట్ మహేశ్వర నాద నెహ్రూ, పండిట్ జానకి నాథ దార్ వంటి ప్రసిద్ధ గురువుల వద్ద అభ్యసించాడు. సంస్కృతంలో వరుసగా ప్రజ్ఞ, విశారద, శాస్త్రి డిగ్రీలను శ్రీనగర్ సంస్కృత యూనివర్సిటి నుండి పొందాడు. ప్రభాకర్ డిగ్రీ సాధించాక, సంస్కృతంలో బి.ఏ.కూడా అందుకొన్నాడు. సంస్కృత శైవ సాహిత్యాన్ని పండిట్ బాలాజీ నాథ, పండిట్ స్వామి, లక్ష్మణ్ జుల వద్ద అభ్యసించి ప్రావీణ్యం సాధించాడు.

కాశ్మీర్‌లోని త్రాల్‌లో ఉన్న ప్రభుత్వ సంస్కృత విద్యాలయంలో సంస్కృత టీచర్‌గా ఉద్యోగం ప్రారంభించి ఉద్యోగం చేస్తూనే సంస్కృత హిందీలలో ఎం.ఏ.చదివి పాసైనాడు. జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వ రిసెర్చ్, ప్రచురణ విభాగంలో సోయేర్ కాలేజి, అమర్ సింగ్ కాలేజిలకు పని చేశాడు. “గుర్తు” 18–12–2008న అల్జీమర్స్ వ్యాధితో మరణించాడు అనేక తీపి “గుర్తు”లను మిగిల్చి.

గుర్తు సాధించిన సాహితీ విజయాలు అద్భుతమైనవి. సంస్కృత సాహిత్యంలోని చాలా వాటిని హిందీలోకి అనువదించాడు. అందులో ముఖ్యమైనవి – పరాత్రిశక వివరణను హిందీ వ్యాఖ్యానంతో ప్రచురించాడు. స్పందకారికను కల్లట వృత్తితోను, హరేశ్వర మహాత్మ్యంను ఆంగ్లానువాదంతోను, పరమార్ధ సారంను హిందీ వ్యాఖ్యతో, సాంబ పంచాశికను క్షేమరాజ వ్యాఖ్యతోను, ఉత్పలదేవుని శివ స్తోత్రావలిని క్షేమరాజ వ్యాఖ్యానంతో, సంస్కృత హిందీ భాషలలో, క్షేమరాజు రాసిన పర ప్రవేశికకు కాశ్మీరీ భాషలో వివరణ, కాశ్మీర శైవ దర్శన బృహత్ కోశంను రెండుభాగాలుగా “నీలకంఠ గుర్తు” గుర్తుండి పోయేలా వెలువరించాడు, కీర్తి గుర్తు మిగిల్చాడు.❁

## 364) కావ్య తరంగిణి కర్త - సి.జి.పురుషోత్తం -1925

పురుషోత్తం 1925లో జన్మించి, చుంచున కట్టే గురుకులంలో చంద్రశేఖర భట్ట, రంగాచార్ లవద్ద సంస్కృతం నేర్చి సంస్కృతం చరిత్రలలో ఎం.ఏ.అయ్యాడు. మైసూర్ మహారాజా కాలేజిలో సంస్కృత ప్రొఫెసర్ అయ్యాడు. రెండుభాగాలుగా కావ్య తరంగిణి, ఆది చుంచు గిరి సుప్రభాతం, సర్వజన వచనాని రాశాడు. కన్నడ మహాకవి "కువెంపు" కవితలతో పాటు అనేక కన్నడ హిందీ కవితలను సంస్కృతంలోకి అనువదించి కావ్య తరంగిణి రాశాడు. నాలుగవ భాగంలో తన స్వంత కవితలను రాశాడు. ఆది చుంచు సుప్రభాతంలో 27 శ్లోకాలున్నాయి. ఇవి 27 నక్షత్రాలకు ప్రతీక. తారావళి అనచ్చు. కర్నాటక స్టేట్ అవార్డ్, చుంచుగిరి మఠపురస్కారం పొందాడు. కువెంపు కవి కన్నడ నాటకాలను కూడా గీర్వాణంలోకి అనువదించి సంస్కృత సేవ చేశాడు.❋



## 365) స్వర్ణ పుష్ప కర్త - పద్మశ్రీ వి.వెంకటాచలం -1925-2002

శ్రీ విశ్వనాథం వెంకటాచలం తమిళనాడు తిరునల్వేలి జిల్లా కోయిలపట్టిలో జన్మించాడు. మద్రాస్, శ్రీపెరుంబుదూర్ సంస్కృత కాలేజీలలో చదివి గోల్డ్ మెడల్ సాధించాడు. సంస్కృత ఇంగ్లిష్ వ్యాసరచన డిబేటింగ్ మొదలైన వాటిలో ఎన్నో బహుమతులు పొందాడు. మద్రాస్ యూనివర్సిటీ నుండి సంస్కృత గణితాలలో డబుల్ డిగ్రీ సాధించి గొడవయ్యారి ప్రయిజ్‌ను సంస్కృతంలో అందుకొన్నాడు. అద్వైత వేదాంతంతో శిరోమణి పరీక్షలో మొదటి రాంక్ పొందినందుకు పుట్టి మునుస్వామి చెట్టి బంగారు పతకం పొందాడు. నాగపూర్ వెళ్లి సంస్కృత అలంకార, క్లాసికల్

సంస్కృతంలో ఎం.ఏ డిగ్రీ అందుకొని దాజి హరి గోండ్వానాన్కర్ గోల్డ్ మెడల్ అందుకొన్నాడు. తరవాత ప్రొఫెసర్ అయి తమిళ హిందీ మలయాళ ఇంగ్లిష్ సంస్కృతాది బహుభాషలలో నిష్ణాతుడయ్యాడు. విక్రమ్ యూనివర్సిటీనుంచి జర్మన్ భాషలో సర్టిఫికెట్ పొందాడు.

1945లో మద్రాస్ వివేకానంద కాలేజీ సంస్కృత లెక్చరర్గా చేరి ఉజ్జయిని మాధవ్ కాలేజీలో సంస్కృత ప్రొఫెసర్ అయ్యాడు. మధ్యప్రదేశ్ బర్వాణి ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపాల్ అయి విక్రమ్ యూనివర్సిటీ ఉజ్జయిని సంస్కృత రీడర్ హెడ్గా మారి, 1972లో షాజాపూర్ యూనివర్సిటీ గవర్నమెంట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీ ప్రిన్సిపాల్ అయ్యాడు. మళ్ళీ విక్రమ్ యునివర్సిటీకి వెళ్లి సంస్కృతాచార్యుడై, సింధియాఓరియెంటల్ ఇంస్టిట్యూట్ డైరెక్టరయ్యాడు. 1986–89లో వారణాసి సంపూర్ణానంద యుని వర్సిటీ వైస్ ఛాన్సెలర్ చేసి, 1992లో ఢిల్లీలోని భోగీలాల్ లెహెర్ చాంద్ ఇంస్టి ట్యూట్ ఆఫ్ ఇండాలజీ డైరెక్టరయి, రెండవసారి సంపూర్ణానంద యునివర్సిటీ వైస్ ఛాన్సలర్గా ఆహ్వానింపబడి లాల్ బహదూర్ శాస్త్రి సంస్కృత విద్యాపీఠ్ గౌరవ వైస్ ఛాన్సలర్ అయి, కామేశ్వర సింగ్ దర్భాంగా యునివర్సిటీ వైస్ ఛాన్సలర్ అయి, 1997 నుంచి ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలసాఫికల్ రీసెర్చ్ చైర్మన్గా ఉన్నాడు. ఎంసైక్లోపీడియా ఆఫ్ హిందూయిజం బోర్డు ఆఫ్ ఎడిటర్స్లో ఉన్నాడు. మలయా సింగపూర్ ఇటలీ ఫ్రాన్స్ జర్మనీ అమెరికా ఇంగ్లాండ్ బాలి నేపాల్ సౌత్ ఆఫ్రికా కెనడా మొదలైన దేశాలలో పర్యటించి విలువైన ప్రసంగాలు చేశాడు.

వెంకటాచలం అద్వైత సిద్ధాంతంపై ఎక్కువ కృషి చేశాడు. సంస్కృత సాహిత్యం భోజ కాళిదాసులపై ప్రత్యేక పరిశీలన చేశాడు. 100పైగా రీసెర్చ్ పేపర్లు రాసి ప్రచురించాడు. 1962లో "న్యూ అప్రోచ్ టు కాళిదాస" అనే నూత్న ప్రాజెక్ట్ చేబట్టాడు. పారమార రాజు భోజునిపై ప్రత్యేక కృషి చేశాడు. మధ్యప్రదేశ్ హయ్యర్ సెకండరీ సంస్కృత పాఠ్యగ్రంథం "స్వర్ణ పుష్ప" రాశాడు. వివిధ విద్యా విచార చతుర ప్రచురించాడు. భోజ అండ్ ఇండియన్ లె ర్నింగ్, కాళిదాస రిఫ్లెక్షన్స్, విశ్వదృష్టి అనే సంపూర్ణానంద శతజయంతి సంచిక, శంకరాచార్య –షిప్ ఆఫ్ ఎన్లైటెన్మెంట్" వంటి 12 గ్రంథాలు రాశాడు. ఆయన సంస్కృత విద్వత్తుకు 1986లో రాష్ట్రపతి సర్టిఫికెట్, 1989లో పద్మశ్రీ పురస్కారం, 1997లో మహామహోపాధ్యాయ బిరుదు అందుకొన్నాడు. 7-6-2002న 77వ ఏట వెంకటాచలం వెంకటేశ్వర సాన్నిధ్యం చేరాడు.❁

## 366) మహా మానవ చంపు కర్త - జయంత మిశ్ర (1925-2010)


15-10-1925 జన్మించి 7-9-2010 చనిపోయిన మహా మహోపాధ్యాయ జయంత మిశ్ర సంస్కృత, మారాఠీ భాషలో ఉత్కృష్ట కవి. మహామహోపాధ్యాయ, కాళిదాస సమ్మాన్, వన భట్టా అవార్డులు పొందినవాడు. 1995లో సాహిత్య అకాడెమి పురస్కారం లభించింది.❁

## 367) మల్లినాధ మనీష కర్త - పరిశోధకుడు - ప్రొఫెసర్ ప్రమోద్ గణేష్ లాల్యే -1926

1928లో జన్మించిన ప్రమోద్ గణేష్ లాల్యే సంస్కృతంలో మహోన్నత విద్వాంసుడు. హిందీ సంస్కృతాలలో ఎం.ఏ చేశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పి.హెచ్‌డి పొంది, అందులో సంస్కృత ప్రొఫెసర్‌గా పని చేసి, శాఖాధ్యక్షుడుగా రిటైర్ అయ్యాడు. ఎన్నో విలువైన గ్రంథాలు రాసి పేరు తెచ్చుకొన్నాడు. పూనాలో భండార్కర్ ఓరియెంటల్రిసెర్చ్ ఇన్స్టిట్యూట్లో "మైక్రో ఫైల్మింగ్ ప్రాజెక్ట్"ను పర్య వేక్షించాడు. హైదరాబాద్ సంస్కృత అకాడెమి డైరెక్టర్. ఆయన 75వ జన్మ దినోత్సవాన్ని యూని వర్సిటి 2003లో ఘనంగా నిర్వహించి "ప్రమోద సింధు" అనే ప్రత్యేక సంచికను ఆయన గౌరవార్ధం ప్రచురించింది. వ్యాఖ్యాన చక్రవర్తి. మల్లి నాదసూరిని వివిధ కోణాలలో పరిశోధించి ఇంగ్లీష్‌లో "మల్లినాధ" మోనోగ్రాఫ్‌ను రాస్తే సాహిత్య అకాడెమి ప్రచురించింది.

ప్రొఫెసర్ లాల్యేవి ఇంగ్లీష్, ఫ్రెంచ్, సంస్కృతం, మరాఠీ నాలుగు భాషలలో 63 రచనలు, 93 ప్రచురణలు 431 లైబ్రరి హోల్డింగ్స్ ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి కొన్ని తెలుసుకొందాం. లౌకిక న్యాయ కోశ, నవ రస మంజరి, మల్లినాధ మనీష, శ్రీ కృష్ణ లీలా తరంగిణి, శివాజీపై కవిత, వరదాభ్యుదయ చంపు, లలితాసహస్రనామ స్తోత్రం, స్టడీస్ ఇన్ దేవి భాగవతం, ఫ్రీ ఇండియా ఫోర్జేస్, ది కార్ప్స్ అండ్ బౌన్స్ ఇన్ ది వాల్మీకి రామాయణ, ఫ్రీ ఇండియా ఫోర్సెస్ యెహెడ్, నిఘంటు నిర్మాణం, మాపులు తయారు చేయటం వ్యాఖ్యానాలు, జీవిత చరిత్ర రాయటం ఆయన చాలా ఇష్టపడి చేశాడు.


లాల్యే పండితుడు మల్లినాధునిపై రాసిన మోనోగ్రాఫ్ ఆధార భూమికగా, మరెందరో మహాకవులు రాసి భద్ర పరచిన విషయాలు సేకరించి నేను "వ్యాఖ్యాన చక్రవర్తి మల్లినాధ సూరి మనీష" శీర్షికతో అంతర్జాలంలో విస్తృతంగా 56 ఎపిసోడ్‌లు రాశాను. బహుశా తెలుగులో ఇంత పెద్ద రచన వేరెవరూ చేసి ఉండరని, ఆ అదృష్టం నాకు దక్కిందని భావిస్తాను.❁



## 368) భోజతత్వ ప్రకాశ వ్యాఖ్యాత - వి ఎస్.పాఠక్ - 1926-2003

1926లో హోషంగా బాద్‌లో జన్మించి, 2003 డిసెంబర్ 19న 76వ ఏట పరమ పదించిన వి.ఎస్.పాఠక్ సంస్కృత విద్వాంసుడు, ఇండాలజిస్ట్ చాలా గ్రంథాలను రచించాడు. అందులో జీవిత చరమాంకంలో భోజ మహారాజు రచించిన తత్వ ప్రకాశను వ్యాఖ్యానం చిరస్మరణీయంగా నిలిచింది. బెనారస్ హిందూ యూనివర్సిటి నుండి మొదటిసారి పి.హెచ్.డి.పొంది, 58 సంవత్సరాలు ప్రొఫెసర్ అర్.బి .పాండే సంపాదకత్వంలో వెలువడుతున్న "భారతి" పత్రిక కు సహ సంపాదకుడుగా ఉన్నాడు. దీన్ని బెనారస్ యూనివర్సిటి "ఏన్షేంట్ ఇండియన్ హిస్టరీ", "కల్చర్ అండ్ ఆర్కియాలజీ" శాఖ ప్రచురించేది.

యాభైలలో పాఠక్ సాగర్ యూనివర్సిటికి మారాడు. సోయాస్‌లోని లండన్ యూనివర్సిటి నుండి రెండవ పి.హెచ్ .డి.ని, ఏ.ఎల్.భాషం ఆధ్వర్యంలో సాధించాడు. తరువాత గోరఖ్‌పూర్ యూనివర్సిటిలో హిస్టరీ, ఆర్కియాలజీ, కల్చర్ డిపార్ట్ మెంట్ ప్రధానాదిపతిగా, తర్వాత వైస్ చాన్సెలర్‌గా పని చేశాడు. చండీఘర్‌లోని పంజాబ్ యూనివర్సిటిలో "ప్రొఫెసర్ జగన్నాథ అగర్వాల్ స్మారక ఉపన్యాసాలను" చేయవలసినదిగా ఆహ్వానిస్తే వెళ్లి చేసి అందర్నీ మెప్పించాడు. ఆయన రాసిన పుస్తకాలలో "హిస్టరీ ఆఫ్ శైవ కల్ట్ ఇన్ నార్దర్న్ఇండియా" ఏన్షేంట్ హిస్టోరియన్స్ ఆఫ్ ఇండియా- ఎ స్టడి ఆఫ్ హిస్టారికల్ బయాగ్రఫీస్" వంటివి ఉన్నాయి.❀



## 369) పతంజలి భాష్య వ్యాఖ్యాత, ఆధునిక పాణిని - శివరామ దత్తాత్రేయ జోషి -1926-2013

మహారాష్ట్రలోని కొంకన్ తీర రత్నగిరికి చెందిన సంస్కృత మహా విద్వాంసుడు మహా వ్యాకరణవేత్త శివరామ దత్తాత్రేయ జోషి. కుటుంబం సంస్కృత పండిత కుటుంబం. చిన్నప్పుడే తండ్రిని కోల్పోయిన అభాగ్యుడు. 1958లో కళావతి భగవత్ అనే సహచర విద్యార్థిని వివాహం చేసుకొన్నాడు. 87 ఏళ్ళ వయసులో జోషి 29-7-2013న మరణించాడు.

ప్రాధమిక విద్య పూనాలో బాబాయి మహేశ్వర శాస్త్రి జోషి వద్ద నేర్చాడు. 20 ఏళ్ళకే సంస్కృత వ్యాకరణాన్ని మధించి సారం గ్రోలాడు. బెంగాల్, బరోడా, పూనా యూనివర్సిటీలనుండి అనేక డిగ్రీలు సాధించాడు. పూణే సంస్కృత కాలేజిలో లెక్చరర్గా జీవితం ప్రారంభించి 1947-55లో ప్రిన్సిపాల్గా సేవ చేశాడు. 1950లో డేనియల్ ఇంగాల్స్ వద్ద టీచర్గా చేరి, తన విద్యా సంపత్తితో అభిమానం పొంది, సంప్రదాయ పద్ధతిలో సంస్కృతం అభ్యసించటం వలన 1955లో బి.ఏ చదివి డిగ్రీ పొంది హార్వర్డ్ యూనివర్సిటీలో ఫెలోషిప్ సాధించాడు. 1960లో హార్వర్డ్ నుంచి ఇంగాల్స్ గైడ్గా "సంస్కృత నిఘంటు అర్ధ విచారణ" (సాంస్క్రిట్ లెక్సికల్ సెమాంటిక్స్)పై పరిశోధన చేసి పి.హెచ్.డి పొందాడు.

1960లో ఇండియాకు తిరిగివచ్చి పూనా దక్కన్ కాలేజిలో సంస్కృత నిఘంటు విభాగంలో చేరాడు. 1964లో పూనా యూని వర్సిటిలో "సెంటర్ ఆఫ్ అడ్వాన్సేడ్ స్టడీ ఇన్ సాంస్క్రిట్''లో రీడర్ గా పని చేశాడు. 1970 లో సంస్కృత, ప్రాకృత భాషాశాఖాధ్యక్షుడైనాడు. 1974 నుంచి 1987 వరకు సెంటర్ ఫర్ అడ్వాన్సేడ్ స్టడీ ఇన్ సాంస్క్రిట్కు డైరెక్టర్గా ఉన్నాడు. 1987 నుంచి దక్కన్ కాలేజి సంస్కృత నిఘంటు ప్రాజెక్ట్లో పని చేశాడు. 1971 నుంచి ఒక ఏడాది హార్వర్డ్ యూనివర్సిటిలోను, 1976-77లో నాగోయా యూనివర్సిటి విజిటింగ్ ప్రొఫెసర్గా ఉన్నాడు.

జోషి పతంజలి మహాభాష్యానికి 11 భాగాల వ్యాఖ్యానం రాశాడు. పాణిని వ్యాకరణానికి 15 భాగాల వ్యాఖ్యానమూ రచించాడు. 1991లో భారత రాష్ట్రపతి చేత జాతీయ పండిత పురస్కారాన్ని అందుకున్నాడు. "ఆధునిక పాణిని"గా జోషిని భావిస్తారు. ❁




## 370) సత్య సాయి గాయత్రి మంత్ర కర్త - డా. ఘండికోట వెంకట సుబ్బారావు -1926-2003

బ్రహ్మశ్రీ ఘండికోట వెంకట సుబ్బారావు గారు 7-11-19 26న రాజమండ్రిలో జన్మించారు. తండ్రి శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రి తల్లి శ్రీమతి రామలక్ష్మి. భారద్వాజ గోత్రం కృష్ణ యజు శ్శాఖ. తండ్రి వేద వేదాంతాలలో క్రతు నిర్వహణలో నిష్ణాతులు. కొడుకు జన్మించాలని పుత్ర కామేష్టి చేసిన కర్మిష్టి. విజయనగర మహారాజు తన ఆస్థాన విద్వాంసుని చేశాడు శాస్త్రి గారిని. విజయనగరం చేరి కొడుకుకు ఆంగ్ల, భారతీయ విద్యా విధానంలో విద్య నేర్పించారు. తండ్రి గారు మహారాజాతోపాటు ప్రయాణాలు చేయటం వలన రావుగారు విజయనగరం మద్రాస్ బెంగుళూరులలో చదివారు. 1940లో స్వాతంత్ర ఉద్యమకాలంలో భారత దేశ కీర్తి వైభవాలను కీర్తిస్తూ సైన్యాన్ని బ్రిటిష్ వారిని ఎదిరించమని కోరుతూ పాటలు రాసి అచ్చు వేయించి కంటోన్ మెంట్ ప్రాంతంలో పంచి పెట్టారు. ప్రభుత్వం అరెస్ట్ చేసింది కాని కుర్రాడుకదా అని వదిలేసింది. మొదటి నుంచి సంప్రదాయ పద్ధతిలో విద్య నేర్చిన రావు 20వ ఏట తల్లి మరణం బాధ కల్గించింది. 1942లో శ్రీమతి తంగిరాల లక్ష్మీ దేవిని వివాహమాడారు. 62ఏళ్ళ వివాహ జీవితం అవిచ్చిన్నంగా సాగింది అయిదుగురు మగపిల్లలు కలిగారు.

మద్రాస్ లయోలా కాలేజి నుంచి ఎకనామిక్స్‌లో బి ఏ ఆనర్స్ డిగ్రీ పొంది, విజయనగరంలో ఎం.ఏ.చేసి అక్కడే లెక్చరర్‌గా కొంతకాలం పని చేశారు. 1949లో అమెరికాలో న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటిలో ఎం.ఏ, పి, హెచ్‌డి చేశారు. ప్రొఫెసర్ సిఫార్స్‌తో న్యూయార్క్‌లో యునైటెడ్ నేషన్స్ సెక్రెటేరియట్‌లో ఎకనామిక్స్

వ్యవహారం చూసే బాధ్యత 1951లో తీసుకున్నారు. 34ఏళ్ళ సుదీర్ఘకాలం ప్రపంచ వ్యవహార సంస్థలో సేవలందించారు తెలుగు బిడ్డ. భారతీయ విధానాన్ని ఏమాత్రం మర్చిపోకుండా దంపతులు జీవించారు. పిల్లలను అలాగే పెంచారు. భార్య ఇరగవరానికి చెందిన తంగిరాలవారి ఆడబడుచు. వారిల్లు గురుకులంగా ఉండేది. నాలుగేళ్ళు ఇక్కడ పని చేశాక రావు గారిని బాంగ్ కాక్‌లోని యుయెన్ అకాడెమిక్ కమిషన్‌కు బదిలీ చేశారు. డాగ్ హేమర్ షెల్డ్, యు దాంట్‌లు రావుగారి సహోద్యోగులు. 1958లో మళ్ళీ న్యూయార్క్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ సోషల్ అఫైర్స్‌లో పని చేశారు. యువ ఆర్థికవేత్తగా గొప్ప గుర్తింపు పొందారు.

1960లో ఇండియా వచ్చి కుటుంబంతో గడుపుతుండగా అప్పటికే తండ్రి శాస్త్రిగారు సత్యసాయిబాబా ముఖ్య శిష్యులై సలహాదారై సాయి భగవానుని అవతారమని ప్రచారం చేస్తున్నారు. రావు గారి నాలుగు తరాల కుటుంబ సభ్యులు పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి వెళ్లి బాబా దర్శనం చేసుకున్నారు. శాస్త్రిగారిని బాబా ప్రశాంతి నిలయ ఆస్థాన విద్వాంసుని చేశారు. ఆయన ఆధ్వర్యంలో దసరాలలో యజ్ఞం నిర్వహించారు కూడా.

1961లో రావు గారు ఢిల్లీలో యునిసెఫ్‌లో పని చేశారు. సీనియర్ ప్లానింగ్ ఆఫీసర్ అయ్యారు. దక్షిణ, ఆగ్నేయ ఆసియాలో స్త్రీ శిశు పోషకాహారం కౌమార, యవ్వన విషయాల సమస్యల పరిష్కారంపై పని చేశారు. వేదోపనిషత్‌లపై సాధికారత సాధించి బదరీనాద్, కేదార్ నాద వంటి పుణ్య స్థల దర్శనం చేశారు. ఇండియాలో యునిసెఫ్ పని పూర్తవగానే మళ్ళీ న్యూయార్క్ వెళ్లి ఎనర్జీ సెక్షన్ హెడ్ అయ్యారు. ఇరవై ఏళ్ళు దీనిలో పని చేసి, ఆయిల్ ఎకనమిస్ట్‌గా ప్రపంచ ప్రసిద్ధి పొందారు. ఒపెక్ సంస్థలతో నిరంతర చర్చలు జరుపుతూ 1973లో వచ్చిన ఆయిల్ సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రయత్నం చేశారు. అలగప్పన్ అనే అతనితో కలిసి న్యూయార్క్ లో ఒక ఆధ్యాత్మిక కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో “నార్త్ అమెరికా టెంపుల్ హిందూ సొసైటీ” స్థాపించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారితో సంప్రదించి న్యూయార్క్‌లోని ఫ్లాషింగ్‌లో గణేష్ దేవాలయంను సంప్రదాయ హిందూ పద్ధతిలో నిర్మించారు. అప్పటికే సాయి భజన ఇంటివద్ద చేస్తున్నారు దానిని దేవాలయానికి మార్చారు. ఉత్తర అమెరికాలో ఇదే మొట్టమొదటి హిందూ దేవాలయం. ఇదే ఆ తర్వాత ఎందరికో ప్రేరణ కలిగించి అనేక దేవాలయాలు ఏర్పడేట్లు చేసింది. ఇది సుబ్బారావు గారి పుణ్యమే. వ్యవస్థాపక అధ్యక్షులుగా నిర్విరామ కృషి చేసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతివారం తానే వేద ఉపనిషత్ గీతలపపై ప్రేరణాత్మక ప్రసంగాలు చేసేవారు. అన్ని మత విశ్వాసాలకు ఆలవాలంగా “సత్య సాయి సర్వ ధర్మ ‘చిహ్నం” ఏర్పాటు చేశారు.

మొదటిసారిగా సత్య సాయి స్టడీ సర్కిల్ అమెరికాలో ఏర్పరచి భారతీయ విద్యాభవన్ నిర్మాణానికి కృషి చేశారు స్వామి చిన్మయానంద ప్రభుపాద రామకృష్ణ పరమహంస వివేకానంద మహేష్ యోగి బోధనలన్నీ క్షుణ్ణంగా చదివి జీర్ణించుకొన్నారు. న్యుయార్క్‌లో మొట్టమొదటి "తెలుగు సాహిత్య సాంస్కృతిక సంస్థ" ఏర్పరచారు. ప్రతి ఉగాదినాడు పంచాంగ శ్రవణం చేసేవారు.

రెండేళ్ళ కోసారి కుటుంబంతో ఇండియా వచ్చి తప్పని సరిగా బాబా దర్శనం స్పర్శనం సంభాషణం చేసేవారు. 1981 రావు గారి నాలుగవ కొడుకు సంజయ్ ఉపనయనం పుట్టపర్తిలో చేసి బాబా యజ్ఞోపవీతం సృష్టించి ఇస్తే వేయించి గాయత్రీ మంత్రోపదేశం చేయించారు. అతనికి అక్కడే సత్యసాయి హయ్యర్ ఎడుకేషన్ సెంటర్‌లో సీటు ఇచ్చారు. మరొక అబ్బాయి రవి శంకర్ కూడా అక్కడే చదివి బాబా గారి బెంగళూర్ బృందావన్ కాలేజి లెక్చరర్ అయ్యాడు. ఇదీ ఆ కుటుంబానికి బాబాకు ఉన్న అనుబంధం.

1984లో ఇండియాకు వచ్చినప్పుడు 90 ఏళ్ళ తండ్రి శాస్త్రిగారు "ఇండియాకు ఎప్పుడు వచ్చేస్తావు? అని అడగటం బాబా అనుగ్రహంతో రావుగారిని బాబా ప్రశాంతి నిలయానికి రమ్మని ఆహ్వానించటం జరిగిపోయి 1985లో యుయెన్ సర్వీస్ నుండి 58వ ఏట రిటైర్ అయి, మెరిట్ సర్వీస్ అవార్డ్ పొంది, పుట్టపర్తిలో ఉన్న తండ్రి గారి సేవలో, బాబా సేవలో 18 సంవత్సరాలు గడిపారు. తండ్రిగారు రావు గారి చేతులమీదుగా చనిపోయారు. స్వామి పుస్తక ప్రచురణ విభాగంలో రావుగారు పని చేశారు. పిల్లలకు బాబా కాలేజీలలో ఉద్యోగాలు ఇచ్చారు. ఆశ్రమ మేగజైన్ "సనాతన సారధి"లో తెలుగు ఇంగ్లీష్‌లలో వ్యాసాలూ రాస్తూ సంపాదకత్వం వహిస్తూ సేవ చేశారు. పితృ ఋణం తీర్చుకున్న రావుగారు మిగిలిన కాలమంతా బాబా సన్నిధిలో సేవలోనే గడిపారు. విదేశీ భక్తులకు ఇంగ్లీష్‌లో రావుగారు అనర్గళ ఉపన్యాసాలు ఇస్తూ సాయి భావాలను సులభంగా అర్థమయేట్లు చెప్పేవారు. అప్పటికే ముగ్గురు కుమారుల వివాహాలు చేసిన రాగారిని బాబా మిగిలిన ఇద్దరు అబ్బాయిల పెళ్ళిళ్ళు త్వరగా చేయమని చెప్పి ఎర్రమిల్లి సత్యమూర్తి గారి అమ్మాయిలు ఆహ్లాదిని, సుమనలను కుదిర్చితన నివాసం "త్రయీ బృందావన"లో ఎంగేజ్‌మెంట్ జరిపించి బెంగుళూరు బృందావన్‌లో అన్ని ఖర్చులు తామే భరించి అత్యంత వైభవంగా తమ చేతులమీదుగా ఏప్రిల్ 20న వివాహాలు జరిపించారు. ఘండికోట కుటుంబీకులందరూ పాల్గొని ఆశీర్వదించారు. మంగళసూత్రాలను స్వామి సృష్టించి వారికి అందజేశారు.

భగవాన్ బాబా తనపై కురిపించిన అపూర్వ దయావర్షానికి పులకితులైన సుబ్బారావు గారు దాన్ని సార్థకం చేసుకోవాలని భావించి 21వ శతాబ్ది ప్రారంభంలో

భక్తులు సులభంగా అర్చించటానికి "సాయి యంత్రం" తయారు చేశారు. సాయి త్రిచక్రాలు అంటే సత్య సాయి గాయత్రి సత్యసాయి సూర్య గాయత్రి సత్యసాయి హిరణ్య గర్భ గాయత్రిలను 1977, 1997, 1999లలో రచించి అందజేసి తన జీవితం ధన్యమైందని భావించారు. భగవాన్ వీరి కృషిని హృదయపూర్వకంగా మెచ్చి హర్షించారు. వీటినే రావుగారు – "త్రి సాయి –మంత్రం యంత్రం తంత్రం" అని రాశారు సంస్కృతం తెలుగు స్పానిష్ మొదలైన అనేక భాషలలోకి ఇవి అనువాదమయ్యాయి.

భారతీయ సంప్రదాయం సంస్కృతులను పూర్తిగా అనుసరిస్తున్న రావుగారిని మనసారా అభినందించిన బాబా ఆయన ముగ్గురి మనవళ్ళ ఉపనయనాలు కూడా తానే దగ్గరుండి జరిపించారు. మూడు యజ్ఞోపవీతాలను సృష్టించి గాయత్రీ మంత్రోపదేశంతో చేశారు. 29-3-2003 ఉదయం ఘండికోట వెంకట సుబ్బారావు గారు 74వ ఏట సత్య సాయిబాబాలో ఐక్యంయ్యారు. కర్మ కాండలన్నీ యధావిధిగా జరిపించారు. బాబా 13వ రోజు కుటుంబ సభ్యులకు ఏది కావాలో అడిగి వాటితో సంతృప్తిగా భోజనం పెట్టారు. 1700 మందికి "నారాయణ సేవ"గా భోజనాలు పెట్టించారు. ప్రాత్య పాశ్చాత్య సంస్కృతీ మేళనం సుబ్బారావు గారు అనిబాబా మెచ్చుకొనేవారు. 2004 జనవరి 17న రావుగారి చితా భస్మాన్ని మద్రాస్ అడయార్‌లో ఉన్న అష్టలక్ష్మి దేవాలయం వద్ద బీచ్‌లో నిమజ్జనం చేయమని చెప్పి చేయించారు.

సుబ్బారావు గారు రాసిన పుస్తకాలు –"మాన్ విత్ మైటీ మిరకిల్స్, మైండ్ బొగ్లింగ్ మిరకిల్స్ ఆఫ్ సత్యసాయి, ఇంటర్వ్యూస్, ఇన్నర్ మోస్ట్ విస్టాస్ అండ్ ఇన్ మోస్ట్ విజన్స్"

సుబ్బారాగారు రాసిన సాయి మంత్రాలు–

1-సాయి (ఈశ్వర) గాయత్రి– ఓం సాయీశ్వరాయ విద్మహే – సత్య దేవాయ ధీమహి –తన్నో సర్వాః ప్రచోదయాత్ (24-12-1977)

2-సాయి సూర్య గాయత్రి–ఓం భాస్కరాయ విద్మహే –సాయి దేవాయ ధీమహి – తన్నోః సూర్యాః ప్రచోదయాత్ (22-9-1997)

3-సాయి హిరణ్య గర్భ గాయత్రీ–ఓం ప్రేమాత్మనాయ విద్మహే –హిరణ్య గర్భాయ ధీమహి –తన్నః సత్యాఃప్రచోదయాత్ (15-2-1999)


4-సాయి పంచాక్షరి –సాయి శివోహం (15-2-1999) ❁

## 371) బాణ భట్ట రచనలో ప్రేక్ష్యా విలాస పరిశోధకుడు – రాంజీ ఠాకూర్ (1926)

నేపాల్‌లో ఫుల్గమ ప్రాంతంలో రాంజీ ఠాకూర్ జన్మించాడు. వైష్ణవ కవి గోవింద ఠాకూర్, ప్రసిద్ధకవి, సవతి సోదరుడు రుచికర్ ఈ కవి పూర్వీకులు. లక్ష్మీ కాంత్ ఝా, వి ఆర్ శర్మ, పండిత్ శోభాకాంత్ జయదేవ్ ఝా వంటి సుప్రసిద్ధ సంస్కృత విద్వాంస గురువులవద్ద విద్య నేర్చాడు. రాం ప్రతాప్ సంస్కృత కాలేజి, మహారాజ్ లక్ష్మీ సింగ్ కాలేజీలలో సంస్కృత లెక్చరర్‌గా చేశాడు. పాట్నాలోని బీహార్ సంస్కృత సమితి నుండి 1956లో ఆచార్య డిగ్రీ, 1960లో ఎం.ఏ లో గోల్డ్ మెడల్, 1981లో దర్భంగా లలిత్ నారాయణ్ మిథిలా యూనివర్సిటి నుండి "బాణ భట్టస్య రచనస్య ప్రేక్షా విలాసః "పై పరిశోధన చేసి పి.హెచ్‌డి. అందుకొన్నాడు. దర్భంగా లోని లలిత్ నారాయణ్ మిథిలా యూనివర్సిటి సంస్కృత ఆచార్యుడుగా రిటైర్ అయ్యాడు.

రాంజీ ఠాకూర్ సంస్కృతంలో కావ్యం, ఖండకావ్యాలు, ముక్తకావ్యాలు రచించాడు. అతని ప్రసిద్ధ కావ్యం–గీతామాధురి. ఖండకావ్యాలు–వైదేహీ పాదాంకం, రాధా విరహం, ప్రేం రహస్యం, బాణేశ్వరి చరితం, గోవింద చరితామృతం, మాతృ స్తన్యం. ముక్తకావ్యాలు–ఆర్య విలాసః, లఘుపద్య ప్రబంధ త్రయికావ్య కోశః . ఇటీవల ప్రచురించినవి –పర్యాయ చరితం కావ్యం, అమృత మంధనమ్.

1912లో రాంజీ ఠాకూర్ లఘు పద్య మంజరికి కేంద్ర సాహిత్య అకాడేమీ పురస్కారం అందుకొన్నాడు.❁



## 372) పాథేయ శతక కర్త - డా.రామ్ కరణ్ శర్మ -1927

ప్రఖ్యాత సంస్కృత విద్యావేత్త, కవి డా రామ్ కరణ్ శర్మ 20-3-1927లో బీహార్‌లోని శరన్ జిల్లా శివపురిలో జన్మించాడు. పాట్నా యూనివర్సిటీ నుంచి సంస్కృత ఎం.ఏ డిగ్రీ బీహార్ సంస్కృత సంస్థ నుంచి సాహిత్యాచార్య వేదాంత శాస్త్రి న్యాయ వ్యాకరణ శాస్త్రి బిరుదులందుకొన్నాడు. అమెరికాలోని కాలిఫోర్నియా యునివర్సిటీనుండి పి.హెడి పొంది ప్రొఫెసర్ ఏం బి ఎమెన్యుతో కలిసి పనిచేశాడు. చికాగో కొలంబియా కాలిఫోర్నియా వర్సిటీలకు విజిటింగ్ ప్రొఫెసర్. 2006లో ఢిల్లీలో స్థిరపడ్డాడు.

శర్మ సంస్కృతాంధ్రాలలో చాలా రచనలు చేశాడు. సంస్కృతంలో "సంధ్య" కవితాసంపుటి, పాథేయ శతకం, వీణ నవలలుగా రాయిసా, సీమలు రాశాడు. భారతీయ కావ్యాలు వైద్య గ్రంథాలు, పురాణాలను అనువదించాడు. వందలాది రీసెర్చ్ పేపర్లు రాసి ప్రచురించాడు. ఆంగ్లంలో "ఎలిమెంట్స్ ఆఫ్ పోయెట్రీ ఇన్ మహా భారత" అనే గ్రంథం రాసి భారతం ఉపమా రూపకాలంకారాలను విశ్లేషించాడు. పణిక్కర్ రాసిన "యాంథాలజి ఆఫ్ మిడీవల్ ఇండియన్ లిటరేచర్, శివ సహస్రనామ శతకం శివ సుకీయం గగనావని, చరక సంహిత మొదలైన వాటికి సంపాదకత్వం వహించి వెలువరించాడు. సంస్కృతంపై అనేక అంతర్జాతీయ సెమినార్లు నిర్వహించాడు. 1889లో సాహిత్య అకాడెమీ అవార్డు, భారతీయ భాషా పరిషత్ అవార్డు, ఢిల్లీ సంస్కృత అకాడెమీ అవార్డు, 2005లో కృష్ణకాంత హాండీకి అవార్డును ప్రధాని మన్మోహన్ సింగ్ నుండి పొందాడు. ఈ అవార్డు అందుకున్న రెండవ అరుదైన వ్యక్తి రామ్ కరణ్ శర్మ. రాయల్ ఏషియన్ సొసైటీ ఫెలో. అమెరికన్ ఓరియంటల్ సొసైటీ మెంబర్. బీహార్ ప్రభుత్వ సివిల్ సర్వీస్‌లో ఉద్యోగించి అనేక ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలనుండి లెక్కలేనన్ని పురస్కారాలందుకొన్న సాహితీమూర్తి శర్మ.❀




## 373) శైవాగమ గ్రంథపరిశోధనాచార్య - ఎస్.సంబంధ శివాచార్య (-1927)

పాండిచ్చేరిలో ఫ్రెంచ్ ఇన్‌స్టిట్యూట్‌లో రీసెర్చర్‌గా ఉన్న 89 ఏళ్ళ జ్ఞాన వయోవృద్ధుడు ఎస్ సంబంధ శివాచార్య సంస్కృత సేవకు శైవ మత సిద్ధాంత వ్యాప్తికి రాష్ట్రపతి ప్రశంసా పత్రం అందజేశారు. తాళపత్ర గ్రంథవ్రాత ప్రతులను చదవటంలో నిష్ణాతుడు. శైవాగమాలలో అనన్య సామాన్య ప్రతిభా సంపన్నుడు. శైవాగమనాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిశోధించి ప్రచురించాడు. శైవ సిద్ధాంత పరిణామ చరిత్రను ఆమూలాగ్రంగా మధించి రాశాడు. పురాతన శైవ గ్రంథాలను 300కు పైగా క్రోడీకరించి, అనువదించిన మహా విద్వాంసుడు. రాష్ట్ర పతిపురస్కారంతోపాటు 5 లక్షల నగదు పారితోషికాన్ని స్వీకరిస్తున్నప్పుడు ఆయన అతి వినయంగా "నేను పూర్వ జన్మలో చేసుకొన్న పుణ్యఫలితమే ఈ సంస్కృత ప్రశంసా పత్రం పారితోషికం" అన్నాడు.

1969లో ఈ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరిన ఈ ఆచార్యకు ఫ్రెంచ్ ప్రభుత్వం అత్యుత్తమ సివిల్ అవార్డును 2008లో అందజేసింది. ఆలిండియా ఆది శైవ శివాచార్య సేవాసంఘం 2011లో "ఆగమ భూషణ" పురస్కారమిచ్చింది. అర్చక కుటుంబంలో 6-1-1927న జన్మించిన శివాచార్య ఏడవ ఏట నుంచి దేవాలయంలో అర్చనాదులు చేయటంలో సిద్ధ హస్తుడయ్యాడు. తండ్రి డి సుబ్రహ్మణ్య గురుక్కళ్ వద్ద వేదం శాస్త్రాలు వివిధ పండితులవద్ద నేర్చి మధురాంతకంలోని అహోబిల మత సంస్కృత పాఠశాలలో, తిరువయ్యారు, మైలాపూర్ సంస్కృత కాలేజీలలో చదివి చెన్నైలోని థియసాఫికల్ సొసైటీ వ్రాత ప్రతుల డిపార్ట్‌మెంట్‌లో, ప్రభుత్వ మన్యు స్క్రిప్ట్ లైబ్రరీలో పనిచేసి తంజావూర్ సరసవతిమహల్ లైబ్రరీతో సంబంధం కలిగి, మైసూర్ ఓరియంటల్ లైబ్రరీలో పని చేసి తరువాత పాండిచ్చేరిలో ఈ రీసెర్చ్ సంస్థలో చేరారు . 8400 తాటాకు గ్రంథాలు ఈ ఇంస్టి ట్యూట్ లో ఉన్నాయని .అందులో ఎక్కువగా శైవాగమాగ్రంథాలేనని మిగిలినవి జ్యోతిష, దక్షిణ భారత దేశ వైద్యగ్రంథాలు, సంస్కృత సాహిత్య గ్రంథాలు, తమిళ ఆధ్యాత్మిక గ్రంథాలు ఉన్నాయని చెప్పాడు.

ఈ వ్రాతప్రతులు తమిళలిపిలో రాయబడిన సంస్కృతమే ఉందని మిగిలినవి శారదా, నందినగరి, నెవారి తిలగరి గ్రంథ, తమిళం తెలుగు ఒరియా, తుళు గ్రంథాలు. ప్రతి తాళపత్ర కట్టలో అతి చిన్న అక్షరాలలో అనేక గ్రంథాలున్నాయని సంబంధ శివాచార్య చెప్పారు. దాదాపు 5 దశాబ్దాలుగా శివాచార్య రోజుకు 10 గంటలకు పైగా పనిచేస్తున్నారు. దేశంలోని వివిధ ప్రదేశాలనుంచి వివిధ భాషలలో ఉన్న వ్రాత ప్రతులను తెప్పించి పరిశీలించి శుద్ధ ప్రతి తయారుచేసి ప్రచురిస్తున్నారు. ప్రస్తుతం "సూక్ష్మా గమం"పై కృషి చేస్తున్నారు. క్రిందటి శతాబ్దంలో సంస్కృతం గ్రంథ లిపి నుంచి దేవనాగరి లిపిలో రాయబడుతూ బాగా ప్రాచుర్యంలో ఉందని చెప్పారు. స్వంత ప్రింటింగ్ ప్రెస్‌ను గ్రంథ, దేవనాగరి లిపులతో ఏర్పాటు చేసుకొని ఎన్నెన్నో శైవాగమ గ్రంథాలు ప్రచురించారు. ప్రస్తుతం పంచాంగాలు, తిరుకొయిల్, అనుష్టాన వాక్య పంచాంగంపై కృషి చేస్తున్నారు. స్వయంగా 15 ఏళ్ళనుంచి పబ్లిషింగ్ కంపెనీ నడుపుతున్నారు.



## 374) లాల్ బహదూర్ శాస్త్రి సంస్కృత పీఠ స్థాపకుడు - మండన మిశ్ర -1929-2001

మండన మిశ్ర అంటే ఆది శంకరాచార్యుల శిష్యుడు కాదు ఆధునిక భారతంలో సంస్కృతానికి విశేష వ్యాప్తి తచ్చిన రాజస్థాన్ సంస్కృత మహా విద్వాంసుడు. 7-6-1929న రాజస్థాన్‌లో జయపూర్‌కు 50 కి.మీ దూరంలో ఉన్న అనూతియా అనే చిన్న గ్రామంలో జన్మించి, తన సంస్కృత భాషా సేవావ్యాప్తితో దాన్ని ప్రపంచ ప్రసిద్ధం చేసిన మహనీయుడు. తండ్రి హిందూ పండితుడు. తల్లి సామాన్య గృహిణి. ఏడుగురు సంతానంలో మిశ్రా పెద్దవాడు. శ్రీమతి భారతి మిశ్రను వివాహమాడి, ఒక కుమార్తె ముగ్గురు కుమారులకు తండ్రి అయ్యాడు కుమార్తె ఈ మధ్యనే చనిపోయింది. పెద్దకుమారుడు భాస్కర మిశ్ర లాల్ బహదూర్ శాస్త్రి సంస్కృత విశ్వవిద్యాలయంలో సంస్కృత ప్రొఫెసర్.

ప్రాథమిక విద్య స్వగ్రామంలో చదివి, ఉన్నత విద్య పట్టాభి రామశాస్త్రి అనే గొప్ప విద్వాంసుని వద్ద అమర్సార్‌లో నేర్చాడు. ఈ గురు శిష్య సంబంధం ఆదర్శమై ప్రాపంచవ్యాప్తి ప్రసిద్ధి చెందింది. సంస్కృత భాషా వ్యాప్తికి అంకిత భావంతో విశేష

సేవ, కృషి  చేసిన ఏకైక వైస్ చాన్సలర్‌గా దాదాపు అందరు భారత ప్రధానమంత్రులు, రాష్ట్రపతులు మిశ్రాను గుర్తించి అభినందించి, అమిత గౌరవం చూపారు.  మండన మిశ్ర నేతృత్వంలో ఒక బృందం అమెరికాకు వెళ్లి అక్కడ సంస్కృత విద్యావ్యాప్తికి బీజారోపణచేసి, ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందింది.

జైపూర్‌లోని మహా రాజా సంస్కృత  కాలేజిలో లెక్చరర్‌గా జీవితం ప్రారంభించిన మిశ్రా, సంస్కృత ప్రొఫెసర్ అయ్యాడు.  పండిత మదనమోహన మాలవ్యా స్థాపించిన సంస్కృత అసోసియేషన్‌కు అనుబంధంగా ఏర్పడిన "అఖిలభారత సంస్కృత సాహిత్య సంస్థ"కు డా.మండన మిశ్ర 1956లో మంత్రిగా, 1959లో మినిస్టర్–ఇన్ చీఫ్‌గా ఎన్నుకోబడ్డాడు.  అప్పుడే అఖిల భారతీయ సంస్కృత సాహిత్య సంస్థకు సరైన దీటైన నాయకుడు అవసరమయ్యాడు.  తన శక్తి యుక్తులు ధారపోసి, సంస్థ శాఖలను అన్ని రాష్ట్రాలలో ఏర్పాటు చేసి వ్యాప్తి చేశాడు.  శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి మండన మిశ్రలోని అకుంఠిత దీక్షను గుర్తించి, రాజస్థాన్ ప్రభుత్వం నుంచి ఆయన సేవలను తీసుకొని శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి సంస్కృత విద్యాపీఠంకు శాశ్వత డైరెక్టర్‌ను చేశాడు.

మిశ్రా ఆలోచనలతో "ప్రపంచ సంస్కృతశతాబ్ది ఉత్సవాలు" రూపుదిద్దుకొని, భారతదేశంలోసంస్కృతానికి ఒక కొత్త యుగాన్ని సాధించాడు.  ఇది ఫలవంతమై, మిశ్రా చొరవ కృషి వలన 1961లో కలకత్తాలో చారిత్రాత్మకంగా "అఖిల భారతీయ సంస్కృత సాహిత్య సంస్థ" ఏర్పడి భారత ప్రధమ రాష్ట్రపతి డా.రాజేంద్ర ప్రసాద్ అమృత హస్తాలమీదుగా ప్రారంభోత్సవం జరుపబడింది.  ఈ సభ దిగ్విజయంగా జరిగి ఢిల్లీలో "సంస్కృత విద్యా పీఠం" ఏర్పాటుకు మరొక చారిత్రాత్మ తీర్మానం చేయబడింది.  డా. రాజేంద్ర ప్రసాద్ గారి పూనిక, సలహా, అత్యున్నత విద్యావేత్తలైన పంజాబ్ గవర్నర్ శ్రీ నరహరి విష్ణు, భారత ప్రభుత్వ హోంశాఖ స్టేట్ మినిస్టర్ శ్రీ బలవంత నాగేష్ దత్తా, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ శాంతి ప్రసాద్ మొదలైనవారు రాజస్థాన్ ప్రభుత్వంతో సంప్రదించి డా.మండన మిశ్రా సేవలను ఢిల్లీలో స్థాపించే సంస్కృత విద్యాపీఠానికి అవసరమని నొక్కి చెప్పి ఒప్పించి, 1962లో ఢిల్లీ సంస్కృత విద్యాపీఠాన్ని మిశ్రా ఆధ్వర్యం ఏర్పాటు చేశారు.

ఆ కాలంలో సంస్కృత విద్యాబోధనకు నిధులు పెద్దగా ఉండేవికావు.  కేంద్ర ప్రభుత్వం సంస్కృత విద్యా సంస్థలకు ఏడాదికి కేవలం ఒక వెయ్యి రూపాయలు మాత్రమే అందజేసేది.  అది ఏమూలకూ చాలేది కాదని గ్రహించి డా.మిశ్రా, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వాన్ని ఒప్పించి 95 శాతం ఆర్థిక సహాయాన్ని అన్ని సంస్కృత విద్యాసంస్థలకు అందజేసేట్లు కృషి చేసి సంస్థలకు ఆర్థిక పరిపుష్టి కలిగించాడు.  దీని ఫలితంగా ఇప్పుడు ఆ సంస్థలకు లక్షలాది కేంద్ర ప్రభుత్వ నిధులు సమకూరుతున్నాయి.  దేశంలోని అన్ని సంస్కృత సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేసి సంస్కృత విద్యావ్యాప్తికి డా.మిశ్రా చేసిన అనితర సాధ్య కృషి ఇది.

అదృష్టవశాత్తు ఆనాటి ప్రధానమంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి  అఖిల

భారతీయ సంస్కృత సాహిత్య సంస్థకు చైర్మన్‌గా ఉండటానికి అంగీకరించి, డా. మిశ్రాను మినిస్టర్ -ఇన్ -చీఫ్‌గా ఎన్నిక చేశారు. రాజస్థాన్ ప్రభుత్వం అనుమతి సుదీర్ఘ సంస్కృత సేవ దేశంలోని విద్యావేత్తలందరి సహకారం వలన ముఖ్యంగా ప్రధాని శాస్త్రి గారి ప్రేరణ వలన ఈ బాధ్యతను స్వీకరించి మిశ్రా సమర్ధంగా అంకిత భావంతో జీవితకాలమంతా పని చేసి గొప్ప విజయాలు సాధించి దేశమంతటా సంస్కృత విద్యా వ్యాప్తికి ఎనలేని కృషి చేసి అందరి మెప్పు పొందాడు. లాల్ బహదూర్ ఆకస్మిక మరణంతో ప్రధాని అయిన ఇందిరాగాంధీ, డా. సంపూర్ణానంద్ సలహాతో డా.మిశ్రా ఈ సంస్థ పేరును శాస్త్రి గారి గౌరవార్ధం "లాల్ బహదూర్ శాస్త్రి సంస్కృత విద్యాపీఠం"గా మార్చి భారత ప్రభుత్వానికి అప్పగించాడు. ఈ సంస్థకు సంస్థాపక డైరెక్టర్‌గా మిశ్రా ఉండిపోయాడు. మిశ్రా అవిశ్రాంత కృషి, దీక్షా, దక్షత వలన ఈసంస్థ 1989లో డీమ్డ్ యూనివర్సిటి అయింది. 23-6-1989న భారత ప్రభుత్వం డా.మిశ్రాను డీమ్డ్ యూనివర్సిటి మొట్టమొదటి వైస్ చాన్సలర్ పదవిలో నియమించి గౌరవించింది. అయిదేళ్ళుమొదటి వైస్ చాన్సలర్ పని చేసి మిశ్రా 1994లో రిటైర్ అయ్యాడు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మిశ్రా అమోఘ వ్యక్తిత్వానికి తగినట్లు 1-1-1996న వారణాసిలోని డా.సంపూర్ణానంద్ సంస్కృత యూని వర్సిటి వైస్ చాన్సలర్ పదవినిచ్చి గౌరవించింది. ఇక్కడ పని చేసిన మూడేళ్ళ కాలం ఆ విశ్వవిద్యాలయానికి స్వర్ణ యుగమే అయింది. అన్ని పరీక్షలను నిర్దుష్ట కాలంలో నిర్వహించటం, తరగతులను క్రమం తప్పకుండా జరపటం, 115 గ్రంథాలను ప్రచురించటం, సరస్వతి దేవి ఆలయాన్ని నిర్మించటం, మహా వైభవోపేతంగా దానిని ప్రారంభించటం, ఇద్దరు రాష్ట్రపతులు డా.శ్రీ శంకర దయాళ్ శర్మ, శ్రీ కె.ఆర్.నారాయణన్‌లను ముఖ్య అతిధులుగా ఆహ్వానించి, రెండు ప్రముఖ సభలను పెద్ద ఎత్తున నిర్వహించటం, డా.మురళీ మనోహర్ జోషీ పాల్గొనటం ఆ విశ్వవిద్యాలయ చరిత్రలో చిరస్మరణీయ ఘట్టాలుగా నిలిచిపోయేట్లు చేసి, డా.మిశ్రా చైతన్య స్ఫూర్తికి దర్పణంగా నిలిచాయి.

డా.మిశ్రా వారణాసిలో "శ్రీ పట్టాభి రామశాస్త్రి వేద మీమాంస రిసెర్చ్‌సెంటర్"ను తన గురువు, ప్రముఖ సంస్కృత మీమాంసాచార్య శ్రీ పట్టాభిరామాచార్య గౌరవార్ధం అధునాతన వసతి సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన భవనంలో స్థాపించి అందరి ప్రశంసలను అందుకొన్నాడు. ఈ సెంటర్‌కు డా.మిశ్రాను ఫౌండర్ చైర్మన్‌గా శ్రీ కంచి శంకరాచార్య నియమించి గౌరవించారు. 2000 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం డా.మిశ్రాకు పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసి సత్కరించింది. డా.మిశ్రా రాజస్థాన్ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా పని చేస్తూ 15-11-2001న 72వ ఏట మరణించాడు. కేంద్ర ప్రభుత్వం కనీసం పద్మ విభూషణ్ అయినా అందజేసి ఉంటే ఆయన సేవలకు తగిన గౌరవం ఇచ్చినట్లుగా ఉండేది.



## 375) బలదేవ చరిత్ర మహాకావ్య కర్త – శ్రీనివాస రథ్ –1930–2014

మధ్యభారతంలోని ఉజ్జయినికి చెందిన సంస్కృత కవి శ్రీనివాస రథ్. కాళిదాస అకాడెమి సంరక్ష బాధ్యతలను సమర్ధ వంతంగా నిర్వహించాడు. 1930లో ఒరిస్సాలోని పూరీలో జన్మించాడు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్, మారేనాలలోను ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసిలోను విద్య నేర్చాడు. తండ్రి సంప్రదాయ సంస్కృత పండితుడు. తండ్రి వద్దనే వ్యాకరణాది శాస్త్రాలు నేర్చాడు. ఆయన అభిమాన ముఖ్య గురువు బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలోని ప్రొఫెసర్ బలదేవ ఉపాధ్యాయ. రథ్ సాహెబ్ అని అందరి చేతా ఆప్యాయంగా పిలువబడే రథ్ ఉజ్జయినిలోని మాధవ కాలేజిలో సంస్కృత అధ్యాపకునిగా ఉద్యోగంలో చేరి విక్రం యూనివర్సిటిలో సంస్కృత ప్రొఫెసర్‌గా రిటైర్ అయ్యాడు. ఆయన వద్ద చాలా యూనివర్సిటీ విద్యార్ధులు పరిశోధనలు చేసి డాక్టరేట్‌లు పొందారు. అనేక జాతీయ, అంతర్జాతీయ సెమినార్లు నిర్వహించాడు. ప్రతి ఏడాది ఉజ్జయినిలో జరిగే "కాళిదాస సమారోహ్"ను అత్యంత వైభవంగా నిర్వహించటంలో సమర్ధుడు అనిపించుకొన్నాడు. ఉజ్జయిని నాటకశాలను ఏర్పాటు చేయటం నాటక ప్రదర్శనలు నిర్వహించటంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాడు. అనేక సంస్కృత నాటకాలను ప్రదర్శన యోగ్యంగా మలచి ప్రదర్శించి ప్రజారంజనం చేశాడు.

యవ్వనంలోనే కవిత్వ రచన ప్రారంభించాడు. తన కవితలను అన్నిటినీ కలిపి "తదేవ గగనం సా ఏవ ధరా" (అదే ఆకాశం అదేభూమి) కవితా సంపుటిని రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ 1990లో ప్రచురించింది. ద్వితీయ ముద్రణ పొందిన దీనికి 1999లో సాహిత్య అకాడెమి పురస్కారం లభించింది. భారత రాష్ట్రపతి ప్రత్యేక పురస్కారాన్ని అందుకున్నాడు. సంస్కృతంలో అసమాన గీత రచయిత (లిరిసిస్ట్)గా ప్రసిద్ధి చెందాడు. ఆయన పాటలలో సంస్కృత మహాకావ్యాల అనునాదం, నవీన భావనల నేపధ్యంగా, మహా కళాత్మకంగా నూతన అనుభూతిని కలిగిస్తుంది. ఆయన మధుర కంఠస్వరంతో సంస్కృత కావ్యాలను చదివి వినిపిస్తుంటే తన్మయులమై వినే మహా భాగ్యం కలుగుతుంది. కవి సామ్రాట్ విశ్వనాధ సత్యనారాయణగారు తన

కావ్యాలు చదువుతుంటే కలిగిన అనుభూతిగా ఉంటుంది. ఆయన ఒక సంస్కృత కవి దిగ్గజం. యువతరంపై, యువకవులపై ఆయన ప్రభావం ప్రబలంగా ఉన్నది.

**రథ్ బృహద్రచన "బలదేవ చరిత" అనే మహా కావ్యం.**


శ్రీనివాస రథ్ కవితలలో మన సంస్కృతీ వైభవం, దేశభక్తి, సాంఘిక సంస్కరణ, మానవత్వ విలువలు, దాతృత్వ విశేషాలు ఉన్నాయి. కవిత్వం సహజ సుందరంగా సరళంగా సూటిగా మనసుకు హత్తు కోనేట్లు రాయగల నైపుణ్యం రథ్ ప్రత్యేకత. మాధుర్యం శ్రోతృ ప్రియత్వం, మనోహర శైలి, రథ్ కవిత్వానికి ముఖ్య లక్షణాలు. ఆధ్యాత్మిక అనుభూతికి విలువనిచ్చాడు. సంఘంలో ఉన్న దురాచారాలు, మూఢ విశ్వాసాలను ఖండించాడు. సాంఘిక రాజకీయ కాలుష్య నివారణే ధ్యేయంగా ఆయన కవిత్వం సాగుతుంది.

ఉజ్జయిని విక్రం యూనివర్సిటి నుండి సంస్కృత ప్రొఫెసర్‌గా, కాళిదాస అకాడెమీ డైరెక్టర్‌గా రిటైర్ అయ్యారు. 10వ అంతర్జాతీయ సంస్కృత కవి సమ్మేళనం 7-1-1977న బెంగుళూరులోని తరలబాబు కేంద్రంలో జరిగినప్పుడు శ్రీనివాస రథ్ దానికి చైర్మన్‌గా వ్యవహరించాడు. ఎడిన్ బర్గ్‌లో 13వ అంతర్జాతీయ సంస్కృత సభ జరిగినప్పుడు "కవి సమవాయ" కార్యక్రమంలో శ్రీనివాస రథ్ తన సంస్కృత గేయాన్ని పాడినందుకు తన్మయులై విని మురిసిపోయిన రసిక ప్రేక్షకజనం గౌరవంగా లేచి నిలబడి కరతాళ ధ్వనులతో అభినందించటం చారిత్రాత్మక విషయమైంది. 2002 డిసెంబర్ 14-16 తేదీలలో పూరీలోని జగన్నాథ సంస్కృత విశ్వవిద్యాలయంలో 41వ అఖిల భారత ఓరి ఎంటల్ కాన్ఫరెన్స్‌లో శ్రీనివాస రథ్ కవిత్వంపై పరిశోధన పత్రం సమర్పించ బడింది. సంస్కృత మహాపండితులైన డా.హర్ష దేవ మాధవ్, డా. హరే కృష్ణ మెహర్‌లు రథ్ కవిత్వంపై విశ్లేషణాత్మకమైన వ్యాసాలను "దృక్" అనే సంస్కృత సాహిత్య పత్రికలో రాశారు. రథ్‌పై ఉన్న అపార గౌరవంతో ఆయన జీవిత సాహిత్యాలపై ముద్రించిన ప్రత్యేక అభినందన సంచికకు ఎస్.పి.నారంగ్ సంపాదకత్వం వహించాడు.

ఆధునిక సంస్కృత సాహిత్య వ్యాప్తికి అసమాన, అమూల్య కృషి చేసిన శ్రీనివాస రథ్ సాహెబ్ ఉజ్జయినిలో 30-6-2014న 84వ ఏట కవితా "రద్"లో "శ్రీనివాస" ధామం చేరుకొన్నాడు.❁

## 376) మదిరా విలాస ప్రహసన కర్త – నారాయణ మధ్యస్థ –1930

1930 జనవరి 10న కేరళలో నీల్చర్లులో పుట్టిన నారాయణ మధ్యస్త సంస్కృత సాహిత్య శిరోమణి కన్నడ పండిట్ హిందీ రాష్ట్ర భాషా విశారద. సంస్కృతంలో మదిరావిలాస ప్రహసనం, అఖండ పురాణం, కాలే వర్షతు పర్జన్య అనే మూడు నాటకాలు రాశాడు. ❀



## 377) బృహద్భారత కర్త – జ్ఞాన పీఠ పురస్కార గ్రహీత –సత్యవ్రత శాస్త్రి –1930

**ఇంతింతై**

29–9–1930న సంస్కృత మహా పండితుడు చారుదేవ శాస్త్రి కుమారుడుగా జన్మించిన సత్యవ్రత శాస్త్రి తండ్రిని మించిన పాండిత్యం ఉన్నవాడు. వారణాసి వెళ్లి పండిట్ సుఖదేవ్ ఝా, డా.సిద్దేశ్వర వర్మల వద్ద విద్య నేర్చాడు. పంజాబ్ యూనివర్సిటి నుండి సంస్కృతంలో బి.ఏ. ఆనర్స్ ఎం.ఏ.లను బెనారస్ హిందూ యూనివర్సిటి నుండి పి.హెచ్‌డి పొందాడు. ఢిల్లీ యూనివర్సిటిలో సంస్కృత ఉపన్యాసకుడుగా చేరి హెడ్‌గా పండిట్ మన్మోహన నాద దార్ ప్రొఫెసర్ ఆఫ్ సాంస్క్రిట్‌గా డీన్‌గా 45 ఏళ్ళు పనిచేశాడు. తర్వాత పూరీ జగన్నాధ సంస్కృత విశ్వ విద్యాలయ వైస్ చాన్సెలర్‌గా సేవలందించాడు. బాంగ్ కాక్‌లోని చూల లొంగు కారన్, సిల్పకారన్ యూనివర్సిటీలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉన్నాడు. నార్త్ ఈస్ట్ బుద్ధిష్ట్ యూనివర్సిటి, థాయ్ లాండ్, జెర్మని , బెల్జియంలోని కేధలిక్ యూని వర్సిటి, కెనడాలోని అల్బర్టా యూనివర్సిటిలకు కూడా విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉన్నాడు. థాయ్ లాండ్ ప్రిన్సెస్ మహా చక్రి సింధు కారన్‌కు

సంస్కృతం నేర్పాడు.

**మహా రచన**

శాస్త్రి సంస్కృతంలో 3 మహాకావ్యాలు, 3 ఖండ కావ్యాలు, 1 ప్రబంధం, ఒక పత్ర కావ్యం, 5 విశ్లేషణాత్మక గ్రంథాలు రాశాడు. అందులో రామకృతి మహాకావ్యం, బృహత్తర భారతం, శ్రీ బోధి సత్వ చరితం, వైదిక వ్యాకరణం, శర్మణ్యా దేశ సూత్రం విభాతి ముఖ్యమైనవి. అనేక భాగాలుగా "డిస్కవరీ ఆఫ్ సాంస్క్రిట్ ట్రెజర్స్"ఒక గొప్ప ఉద్గ్రంథం. థాయ్ లాండ్ రామాయణం రాయల్ థాయ్‌ను రాజు అభ్యర్ధనపై సంస్కృతీకరించి శ్రీ రామకృతి మహాకావ్యంగా రాశాడు. దీనికి ముందుమాట మహారాణి రాసింది. థాయ్ లాండ్‌లోని హిందూ దేవాలయాలు, వాటిలోని సంస్కృత లిపిపై పరిశోధన చేశాడు. కాళిదాస రచనలపై గొప్ప వ్యాఖ్యానం రాశాడు. యోగ వాసిస్టంకు వివరణ రాసి ప్రచురించాడు. ఈశాన్య ఆసియాలో సంస్కృత పదజాలం, శ్రీరాముడులపై విస్తృత పరిశోధన చేశాడు. న్యు ఢిల్లీ లోని "జవహర్ లాల్ నెహ్రూ స్పెషల్ సెంటర్ ఫర్ సాంస్క్రిట్"కు గౌరవ ప్రొఫెసర్‌గా శాస్త్రి ఉన్నాడు.

**అంతర్జాతీయ పురస్కార వైభవం**

సత్య వ్రత శాస్త్రికి రాయల్ నేపాల్ అకాడెమి గౌరవం, బెల్జియం యూనివర్సిటి విశిష్ట పతకం, కెనడాలోని అట్టావా అంతర్జాతీయ ఫెలోషిప్, బాంగ్ కాక్ యూనివర్సిటి గౌరవ డాక్టరేట్, ఇటలిలోని సివిల్ అకాడెమి అవార్డ్, కెనడా వారి కాళిదాస సమ్మాన్, ఇటలిలోని టోరినో వారి స్పెషల్ అవార్డ్, గోల్డెన్ ప్రైజ్, ఇండోనీషియా ప్రభుత్వ అవార్డ్, థాయ్ లాండ్ రాయల్ డెకరేషన్, రోమానియా ప్రభుత్వ ఎక్సెలెన్స్, అవుట్ స్టాండింగ్ టీచర్ అవార్డ్‌లు, ఇటలిలోని అగ్రిగెంటో నుండి ఫెలోషిప్, డాక్టర్ ఆఫ్ ఆనర్ వంటివి లెక్కలేనన్ని అంతర్జాతీయ అవార్డ్‌లు లభించాయి.

**జాతీయ పురస్కార హేల**

సాహిత్య అకాడెమీ పురస్కారం, ఢిల్లీలోని సాహిత్య కళా పరిషత్ గౌరవం, సిఖ్ గురుద్వారా పురస్కారం, భారత రాష్ట్రపతి పురస్కారం, శిరోమణి సంస్కృత సాహిత్య కార్, విశిష్ట సాహిత్య పురస్కార, గీతా రాణా పురస్కార, సాంస్క్రిట్ సేవా సమ్మాన్, సాంస్క్రిట్ సాహిత్య పురస్కార, ఇందిరా బెహరే గోల్డ్ మెడల్, పండిత జగన్నాధ పద్య రచన పురస్కార్, కాళిదాస పురస్కార, పండిట్ క్షమారావు పురస్కార, వాగ్విభూషణ బిరుదు, దేవ వాణీ రత్న సమ్మాన్, రాజస్థాన్ వారి అఖిలభారత సంస్కృత తొలి పురస్కార,

వాచస్పతి పురస్కార, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వ పురస్కారాలు, మహా మహోపాధ్యాయ బిరుదు, జ్ఞాన పీఠ పురస్కారం, పద్మ భూషణ్ వంటి జాతీయ పురస్కారాలు 76 వరకు అందుకొన్న సాహితీమూర్తి శ్రీ సత్యవ్రత శాస్త్రి. ఆయన్ను సన్మానించి గౌరవించని సాహిత్య సంస్థ, ప్రభుత్వం లేదు అంటే అతిశయోక్తి కాదు.

**సాహిత్య సరస్వతి**

పైన చెప్పిన గ్రంథాలే కాక హ్యూమన్ వాల్యూస్ డెఫినిషన్స్, సంస్కృత రైటింగ్స్ అండ్ యూరోపియన్ స్కాలర్స్, వర్డ్స్ ఆఫ్ హ్యూమన్ వాల్యూస్ ఇన్ సాంస్క్రిట్ వంటి 15 ఎకడమిక్ రచనలు చేశాడు.

బృహత్ భారతం శ్రీ బోధి సత్వ చరితం, ఇందిరా గాంధి చరితం, థాయ్ దేశ విలాసం, న్యు ఎక్స్ పరి మెంట్స్ ఇన్ కాళిదాస, చాణక్య నీతి, భవి తవ్యనం ద్వారానీ భవంతి సర్వత్ర" అనే స్వీయ చరిత్ర మున్నగు సాహిత్యపరమైన 12 రచనలు చేశాడు. ❁

## 378) సామవేద ఘనాపాఠీ - తోత్తం ఆర్యన్ నంబూద్రి -1930

కేరళలోని పంజాల్‌లో జన్మించిన ఆర్యన్ నంబూద్రి సంప్రదాయ బద్ధంగా సామవేదం నేర్చి వేద పండిత బిరుదు పొంది, కాలడిలోని శ్రీ శంకరాచార్య సంస్కృత విశ్వ విద్యాలయంలో పనిచేసి, సామవేదాన్ని పఠించటానికి ఇంగ్లాండ్ నుండి ఆహ్వానం అందుకొని, అక్కడ పఠించి మన్ననలు పొంది తిరిగివచ్చాడు. కంచి శ్రీ జయేంద్ర సరస్వతి నంబూద్రికి "కీర్తి ముద్ర" బంగారు పతకం ప్రదానం చేశారు. కాలడి శ్రీ శంకరాచార్య సంస్కృత విద్యాలయం కోసం సామవేదాన్ని పఠించి రికార్డ్ చేశాడు. కేరళ దేశాన్ని ఈ మహానుభావులందరూ వేద వేదాంగ శాస్త్ర సారంతో పునీతం చేసిన పుణ్యమూర్తులు. ❁

## 379) అద్వైత గీత కర్త – మధురకవి ఉమాపతి పద్మనాభ శర్మ (1930–2017)

తెలంగాణా రాష్ట్రం సిద్దిపేటలో శ్రీ ఉమాపతి పద్మనాభ శర్మ జన్మించారు. వీరిది పండిత వంశం. పితృ, పితామహులందరూ సంగీత సాహిత్యాలలో దిగ్దంతులే. తండ్రి నారాయణ శాస్త్రి పండితులేకాక ప్రతిభా వ్యుత్పన్నులు, సంగీత కళా మర్మజ్ఞులు. మేనమామ, విద్యా గురువు శ్రీకొరిడే సీతారామ శర్మగారి ఆదేశంతో దేవీ మానస పూజను ఒక సంవత్సర కాలం దీక్షగా పారాయణ చేసి ఆత్మ గతం చేసుకొన్నారు. దీనితో వారిలో మధుర కవితా ధార పెల్లుబికింది. “బ్రహ్మోమాపతి పద్మనాభ నుత! శుంభత్పద్మసింహాసనా” మకుటంతో అమ్మవారిని స్తుతించిన నపద్యాలలో త్రిమూర్త్యాత్మక రూపిననిఖైన అమ్మవారే కాకుండా కవి గారూ దర్శనమిస్తారు. తొలితరం తెలంగాణా కథకులలో శర్మగారు అగ్రేసరులు. 1960 కాలంలో వారి కథలు, వ్యాసాలూ, విమర్శలు, గేయాలు భారతి, సాధన, కృష్ణాపత్రికలలో ప్రచురితాలు. “చతురంగం”, “నవ కథా విపంచి” వీరి కథా సంపుటాలు. “చివరి ఘడియలు” అముద్రితం.

శర్మగారు వేణువు, వయోలిన్, హార్మోనియం వాయిద్యాల వాదనలో అసమాన ప్రజ్ఞావంతులు. వీరి గాత్రం సుస్వర బద్ధమై వీనుల విందు చేసేది. భువన విజయంలో రామరాజ భూషణుడుగా జీవించేవారు. వీరి పద్య కవితాగానం మైమరపించేది. కాళిదాస కవిత్వాన్ని ఎంతగా ఆరాదరించేవారో ఓ హెన్రీ కథలనూ అంతగా ఆస్వాదించేవారు. తెలంగాణా ప్రాంతీయ దేశ్య పదాలు, ప్రాచీన కవుల ప్రయోగాలపై శర్మగారి వ్యాసాలు ఆణిముత్యాలు. ప్రముఖ పరిశోధకులు నిడదవోలు వెంకటరావు మల్లంపల్లి సోమశేఖర శర్మగార్ల ప్రశంసలు పొందాయి. దివాకర్ల వెంకటావధాని, పుల్లెల రామ చంద్రుడు, దోర్బల విశ్వనాధ శర్మ వంటి సాహితీ ప్రముఖులు శర్మగారి పాండితీ గరిమకు నీరాజనాలు

పలికారు. "అజో–విభో" పురస్కారం సద్గురు శివానందమూర్తి గారి అమృత హస్తాలనుండి అందుకొన్న పుణ్యమూర్తి. భావకవిత్వోద్యమ ప్రభావంతో "మధురకవి"గా గుర్తింపు పొందారు .ఆయన అధ్యయన శీలత అచ్చెరువు గొల్పుతుంది. ఉద్యోగం చేస్తూ సాహిత్య కృషి కొనసాగిస్తూ, వేదాంత వాఙ్మయ మధనమూ చేశారు. దీని ఫలితంగా పదకొండు వ్యాసాల "హంసనాదం" వెలువడింది. అద్వైత, శివాద్వైత విశిష్టాద్వైత సిద్ధాంతాలను సహేతుకంగా తర్కించి "శివా ద్వైత దర్శనం" రచించి దిగ్భ్రాంతి కలిగించారు. శ్రీ శంకర భగవత్పాదుల "శ్రీ దేవీ మానసిక పూజ"ను శంకరుల అంతర్ దృష్టికి తగినట్లు ఆంధ్రానువాదం చేశారు.

అవసరమైతేనే మాట్లాడే నియమమున్న శర్మగారి మౌన అంతరంగం నుండి 108 శ్లోకాల "అద్వైత గీత" జాలువారి యోగ సాధకులకు దిశా నిర్దేశంగా భాసించింది. తామే దీనికి సులభ వ్యాఖ్య రాయగా "దర్శనం" మాసపత్రికలో ప్రచురింపబడింది. సహాధ్యాయులైన శ్రీ అప్పాల వాసు దేవ శర్మ గారితో కలిసి "దేవీ సప్త శతి" శ్లోకాలను తెలుగులో లోతైన తాత్విక భావనతో రాశారు. "తొగుట –రాంపురం"లోని శ్రీ గురు మదనానంద సరస్వతీ పీఠాధిపుల ఆజ్ఞమేరకు సంస్కృత భాగవత శ్రీధరీయ వ్యాఖ్యను ద్వితీయ, దశమ స్కంధాలకు తెలుగు సేత చేశారు. జ్యోతిశ్శాస్త్రంలోనూ శర్మగారు అఖండులే. శృంగేరి జగద్గురువులు శ్రీ శ్రీ భారతీ తీర్థ స్వాములు తెలంగాణా గజవల్లిలో పర్యటించినపుడు సన్మానపత్రం రచించి శర్మగారు శ్రీవారి అభినందన పొందారు. మనసులాగానే స్వచ్ఛ శ్వేత వస్త్రధారణతో, ఆలోచనా ముద్రతో శర్మగారు కనిపించేవారు.

శర్మగారి మరణానికి సరిగ్గా నెల రోజులక్రితం తెలంగాణా ప్రభుత్వ తృతీయ ఆవిష్కరణ మహోత్సవం నాడు ముఖ్యమంత్రి శ్రీ చంద్రశేఖర రావు గారి చేతుల మీదుగా పండిత పురస్కారం అందుకొన్నారు. ప్రచారార్భాటం ఇష్టపడని శర్మగారు ఈ కాలపు కవి యోగి పుంగవులు.

పుంభావ సరస్వతులైన శ్రీ ఉమాపతి పద్మనాభ శర్మగారు 2017 జులై 4 న ఉమాపతి సాన్నిధ్యం చేరారు.❁

## 380) పద్మశ్రీ - వేదకుమారి ఘూయ్ -1931

16-12-1931న జమ్మూలో ప్రతాప్ మొహల్లాలో జన్మించిన వేద కుమారి ఘూయ్ పాఠశాల విద్య జమ్మూలోనే పూర్తి చేసి, పంజాబ్ యూనివర్సిటి నుంచి 1953 సంస్కృతంలో ఎం.ఏ.పాసై, భారతీయ ప్రాచీన చరిత్ర, సంస్కృతీలో కూడా 1958లో ఎం.ఏ పాసై, బెనారస్ హిందూ యూనివర్సిటి నుండి సంస్కృతంలో 1960లో పి.హెచ్‌డి సాధించింది. సంస్కృత విద్వాంసుడైన రాం ప్రతాప్‌ను వివాహమాడింది.

జమ్మూలోని పెరేడ్‌లో ఉన్న మహిళా ప్రభుత్వ కళాశాలలో సంస్కృత లెక్చరర్‌గా వృత్తిలో ప్రవేశించి, జమ్మూ యూని వర్సిటిలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయి సంస్కృత శాఖ హెడ్‌గా 31-12-1991న రిటైర్ అయ్యేవరకు పని చేసింది. 1966-67లోను, 1978-80 కాలంలోను డెన్మార్క్‌లోని కోపెంహాగ్ యూనివర్సిటి ఇన్‌స్టిట్యూట్‌లో లెక్చరర్‌గా సంస్కృత పాణిని వ్యాకరణాన్ని, సాహిత్యాన్ని బోధించింది. ఆమె డోగ్రి భాషలో మహా విద్వాంసురాలు. హిందీలోను పండితురాలు. సాంఘిక సేవలోను వేద కుమారి ముందున్నది. అమరనాథ దేవాలయం బోర్డ్‌లో ఆమె సభ్యురాలు కూడా.

వేదకుమారి ఘూయ్ సంస్కృత విద్వత్తుకు కేంద్రప్రభుత్వం "పద్మశ్రీ" పురస్కారం అందజేసి సత్కరించింది. భారత రాష్ట్రపతి గౌరవ పురస్కారమూ అందుకున్నది. సామాజిక సేవకు గుర్తింపు లభించి జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం స్వర్ణ పతాకాన్ని అందజేసింది. 1997లో సంస్కృత సేవకు ప్రెసిడెంట్ అవార్డ్ లభించింది. 2005లో "డోగ్రా రత్న", 2009లో జీవిత సాఫల్య పురస్కారం, 2010లో "స్త్రీ శక్తి పురస్కారం" అందుకున్న విదుషీమణి వేద కుమారి ఘూయ్. ❁

## 381) నృసింహ స్తుతి కర్త - శ్రీ విశ్వపతి తీర్థ -1931

ఉడిపిలోని పెజావర్ మఠ స్థాపకులు శ్రీ అధోక్షజ తీర్థ శ్రీ మధ్వాచార్యుల శిష్యులలో ఒకరు. ఇక్కడి దైవం శ్రీ విఠలుడు. ఆచార్య పరంపరలో 18వ ఆచార్యులు శ్రీ విజయధ్వజ తీర్థ. వీరు భాగవత పురాణానికి వ్యాఖ్య రాశారు. అది "విజయధ్వజ తీర్థీయం"గా ప్రసిద్ధి చెందింది. 18వ ఆచార్య శ్రీ విశ్వపతి తీర్థ నృసింహ స్తుతి కాక మధ్వ విజయంపై వ్యాఖ్యానం రాశారు.

ప్రస్తుత పీఠాధిపతి 32వ వారైన శ్రీ విశ్వేశ తీర్థులు 1931లో జన్మించి 1938లో సన్యాస దీక్ష పొందారు. 1953లో అఖిల భారత మధ్వ సమ్మేళనాన్ని ఉడిపిలో భారీఎత్తున నిర్వహించారు. కృష్ణ దేవాలయ గోడ, రాజంగానే గ్రామంలో విశాలమైన ఆడిటోరియం నిర్మించారు. శ్రీ విశ్వ ప్రసన్న తీర్థను ఉత్తరాధికారిగా నియమించారు. అన్ని ధార్మిక సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. ప్రధాని మోడీ వీరిని సందర్శించారు.❁

## 382) భూకైలాస నాటక కర్త - సాంబ దీక్షిత్ -1934

1934 ఫిబ్రవరి 14న సాంబ దీక్షితులు కర్నాటకలోని గోకర్ణ క్షేత్రంలో జన్మించాడు. తండ్రి దామోదర దీక్షితులు. ఋగ్వేద ఘనాపాటి, వ్యాకరణ విద్వాన్. భాష్య కావ్య తీర్థ, హిందీ సాహిత్య విశారద. గోకర్ణ మేధా దక్షిణామూర్తి సంస్కృత కాలేజి ప్రిన్సిపాల్‌గా మహర్షివేద యూనివర్సిటి వైస్ చాన్సలర్‌గా ఉద్యోగం. బెంగుళూరు వేద ధర్మ పరిపాలన సభ "విద్యా వారిది", గోకర్ణం విద్వత్ సభ "వేద విద్వాన్" బెంగుళూరు భారతీయ విద్యాభవన్ "వేద రత్న" పురస్కారాలు ఇచ్చాయి.

దీక్షితులు సంస్కృతంలో "నిత్యానంద చరితం" లఘు కావ్యంతోపాటు మూడు నాటకాలు–మహాగణపతి ప్రాదుర్భావం, భూకైలాస శతకం, వర దక్షిణనాటకం రాశాడు. చివరిది సాంఘిక నాటకం, అగ్ని సహస్రనామాలు అగ్ని రాజసూయం, గృహ్యాగ్ని జార, వాయుజ సహస్ర నామ స్తోత్రాలను తన సంపాదకత్వంలో ప్రచురించాడు. మహారాష్ట్రలోని స్వామి నిత్యానంద ఆశ్రమ మహిమలను వివరించినదే "నిత్యానంద చరితం". గోకర్ణ క్షేత్ర పురాణగాథ ఆధారంగా "భూకైలాసం" రాశాడు. సాంబ దీక్షితులు నిత్యాగ్ని హోత్రి. మహా వేద విద్వాంసుడు.❁



## 383) నవ్య న్యాయ గ్రంథకర్త – బిమల్ కృష్ణ మాతీలాల్ – 1935–1997

1935లో బెంగాల్‌లో జన్మించి 56 ఏళ్ళు మాత్రమే జీవించి 1991లో మరణించిన బిమల్ కృష్ణ మాతీలాల్ భారతీయ తత్వశాస్త్రాన్ని, సంప్రదాయాన్ని మథించి పాశ్చాత్య తత్వశాస్త్ర ధోరణులపై వీటి ప్రభావాన్ని ప్రదర్శించినవాడు. 1977 నుండి 1991 వరకు ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటిలో "స్పాల్డింగ్ ప్రొఫెసర్ ఈస్టర్న్ రెలిజియన్ అండ్ ఎదిక్స్"గా ఉన్నాడు.

చిన్ననాటి నుంచే సంస్కృతంలో ధారాళంగా మాట్లాడే నేర్పు అబ్బింది. గణితం, తర్క శాస్త్రాలపై దృష్టిపడి, సంస్కృత కళాశాలలో చదివి ఉద్దండులైన పండితులవద్ద తత్వశాస్త్రాధ్యయనం చేసి అక్కడే 1957 నుంచి అయిదేళ్ళు సంస్కృత పండితునిగా ఉన్నాడు. ఆయన గురువులు మహా మహులైన తారాకాంత తర్క తీర్ధ, కాళీపాద తర్కా చార్య. పండిత అనంతకుమార్ న్యాయ తర్క తీర్ధ, మధుసూదన న్యాయాచార్య, విశ్వబంధు తర్క తీర్ధలకు సన్నిహితుడయ్యాడు. 1962లో "ఉపాధి" అంటే "మాస్టర్ ఆఫ్ లాజిక్" డిగ్రీ ప్రదానం చేశారు.


సంస్కృత కాలేజిలో పని చేస్తూ ఉండగానే హార్వర్డ్ యూనివర్సిటి ఇండాలజిస్ట్ డేనియల్ ఇంగాల్స్‌తో పరిచయమై, ఆయన కోరిక మేరకు పి.హెచ్‌డి కోసం అక్కడ చేరాడు. ఫుల్ బ్రైట్ స్కాలర్షిప్ లభించి "నవ్య న్యాయం"పై పి.హెచ్‌డి 1962–65లో పూర్తి చేశాడు. ఇక్కడ ఉన్నప్పుడే విల్లార్డ్ వాన్ ఒర్మాన్ క్వైన్ వద్దనూ విద్య నేర్చాడు. తర్వాత టొరంటో యూనివర్సిటి సంస్కృత ప్రొఫెసర్‌గా చేరి, 1977లో డా.సర్వేపల్లి రాధాకృష్ణన్, రాబర్ట్ చార్లెస్ జేనర్ తర్వాత ఆక్స్‌ఫర్డ్ స్పాల్డింగ్ ప్రొఫెసర్ అయ్యాడు.

న్యాయ వైశేషిక, మీమాంస, బౌద్ధ వేదాంతంలపై సాధికారిక గ్రంథాలు నేటి తత్వశాస్త్ర చర్చలకు ఉపయోగ పడేలా రాశాడు మాతీలాల్. This was in contrast with the German approach to Indian studies, often called Indology, which prefers minute grammatical study as opposed to a concern

for the development of the ideas as a whole in the general philosophical context. Thus, Matilal presented Indian Philosophical thought more as a synthesis rather than a mere exposition. This helped create a vibrant revival of interest in Indian philosophical tradition as a relevant source of ideas rather than a dead discipline.

మాతీలాల్ "ఇండియన్ ఫిలసాఫికల్ జర్నల్" వ్యవస్థాపకుడు కూడా. 1990లో భారత ప్రభుత్వం పద్మ భూషణ్ పురస్కారం అందజేసి సత్కరించింది. ఆయన రాసిన ముఖ్య గ్రంథాలు– 1–ఎపిస్టమాలజి, లాజిక్ అండ్ గ్రామర్ ఇన్ ఇండియన్ ఫిలసాఫికల్ అనాలిసిస్, 2–లాజిక్, లాంగ్వేజ్ అండ్ రియాలిటి –యాన్ ఇంట్రడక్షన్ టు ఇండియన్ ఫిలసాఫికల్ స్టడీస్, 3–పెర్సేప్షన్ – యాన్ ఎస్సే ఆన్ క్లాసికల్ ఇండియన్ దీరీ ఆఫ్ నాలెడ్జ్, 4–లాజికల్ అండ్ ఎదికల్ ఇస్స్యూస్, 5–నవ్య న్యాయ–డాక్ట్రిన్ ఆఫ్ నెగెషన్, 6–ది వర్డ్ అండ్ ది వరల్డ్ – ఇండియాస్ కంట్రీబ్యూషన్ టు ది స్టడి ఆఫ్ లాంగ్వేజ్, 7–ది కారక్టర్ ఆఫ్ లాజిక్ ఇన్ ఇండియా, 8–నీతి, యుక్తి ఓ ధర్మ (బెంగాలీభాషలో)

కేన్సర్ వ్యాధితో 8–6–1991న బిమల్ కృష్ణ మాతీలాల్ 56వ ఏట మరణించాడు.❁



## 384) సంస్కృత వ్యాప్తి చేస్తున్న ముస్లిం సంస్కృత పండిట్ – పండిట్ దస్తగిరి –1935

మహారాష్ట్ర షోలాపూర్ జిల్లా శిఖాల్ గ్రామంలో పండిట్ దస్తగిరి జన్మించాడు. అక్కడే సెకండరీ విద్య పూర్తిచేసి ప్రభుత్వ సంస్కృత కళాశాలలో చేరాడు. 50 మంది బ్రాహ్మణ విద్యార్థుల మధ్య తానొక్కడే ముస్లిం విద్యార్థిని అని చెప్పుకొన్నాడు. కానీ

సంస్కృత గురువు తనపై ప్రత్యేక అభిమానంతో శ్రద్ధతో చక్కగా బోధించి తీర్చిదిద్దాడని కృతజ్ఞతతో చెప్పాడు. అక్కడే ఆయనే వేదాలు శాస్త్రాలు వగైరా క్షుణ్ణంగా నేర్పాడని పొంగిపోయాడు దస్తగిరి. "1950లో బొంబాయి చేరి మరాఠా సంస్థాన్ నిర్వహణలో ఉన్న "మరాఠీ మీడియం ఓర్లి హై స్కూల్"లో సంస్కృత ఉపాధ్యాయుడిగా చేరి అన్ని తరగతులకు సంస్కృతం బోధించాడు.

ఇండియాలో ఎమెర్జెన్సీ పూర్తయి, జనతా ప్రభుత్వం ఏర్పడ్డాక తాను జనసంఘ్ ఆర్ ఎస్ ఎస్‌లను ఏదో నెపంతో సమర్ధిస్తున్నాని అనుమానించి విచారణ జరిపి అది శుద్ధ అబద్ధమని తేల్చారని తన నిజాయితీని ప్రశంసించారని తెలియజేశాడు దస్తగిరి.

1980లో ఇందిరాగాంధీ మళ్ళీ ప్రధాని అయ్యాక దస్తగిరిని పిలిపించి ఆయన మహమ్మద్ ప్రవక్త వంశీకుడైన సదవంశస్తుడు అని గ్రహించి, 1982లో ఆయనను "రాష్ట్రీయ సంస్కృత ప్రచారకునిగా నియమించేట్లు విద్యాశాఖను ఆదేశించిందని, వాళ్ళు కక్కా లేక మింగా లేక నీళ్లు నములుతుంటే, ముందు ఉద్యోగం పూర్తి స్వతంత్రంతో ఇచ్చి తర్వాత ఆయన పని తీరును చూడమని హెచ్చరించింది. ఆమె తనను కలవటానికి చాలాసార్లు వచ్చిందని తానుకూడా తరచుగా కలిసేవాడినని అన్నాడు. 50వ ఏటా1987లో సంస్కృతంలో ఎం.ఏ డిగ్రీ పొందాడు. రిటైర్ అయ్యేదాకా సంస్కృతం బోధిస్తూ హిందుత్వానికి ఇస్లాంకు ఉన్న పోలికలను వివరిస్తూ ప్రపంచంలో అతిప్రాచీన భాష అయిన సంస్కృతం యొక్క ఉత్కృష్టతను వివరిస్తూ బోధన సాగించాడు పండిట్ దస్తగిరి. రాష్ట్రీయ స్వయం సేవక సంఘం అన్ని పీఠాల శంకరాచార్యులు తనకు అత్యంత గౌరవం ఇస్తున్నారని తమలో ఒకనిగా భావిస్తూ ఆదరిస్తున్నారని గర్వంగా చెప్పుకొన్నాడు పండిట్ దస్తగిరి. సంస్కృతంపైన ఉన్నమక్కువ ఆయనను ఇస్లాంకు దూరం చేయలేదు. తనలాగా చాలామంది ముస్లిం సంస్కృత పండితులు దేశంలో ఉన్నారని కానీ వారు ఆర్ధికంగా వెనకబడి ఉండటంతో ముందుకు రాలేక పోతున్నారని విచారం వ్యక్తం చేశాడు దస్తగిరి. భార్య వహీదా గొప్ప సహకారాన్నిస్తోంది. కొడుకు బడీ ఉజ్జమా సంస్కృత స్కాలర్. కూతురు గ్యాసున్నీసా షోలాపూర్‌లో సంస్కృత రీసెర్చ్ సెంటర్ నిర్వహిస్తోంది. ధన్యమైన కుటుంబం పండిట్ దస్తగిరిది.❋



## 385) ఆఖ్యాన వల్లరి కర్త - జీవన సాఫల్య పురస్కార గ్రహీత - దేవర్షి కాలనాధ శాస్త్రి -1936

**మార్గదర్శి**

భాషా శాస్త్రవేత్త అయిన శాస్త్రి సంస్కృతం, ఇంగ్లీష్ హిందీ భాషలలో విస్తృతంగా రచనలు చేసిన బహుభాషావేత్త. భారతీయ భాషలకు సాంకేతిక పదాలను సంతరించి, హిందీకి గౌరవ స్థానాన్ని తన రాష్ట్రంలోను, భారతదేశమంతటా చేకూర్చి, హిందీని అధికార భాషగా చేయటంలో సఫలీకృతుడైన వాడు.

ప్రాచీన భాష సంస్కృతానికి ఆధునిక సాహిత్య ప్రక్రియలు, నూతన భావ వ్యక్తీకరణ విధానాలను సంతరించిన తండ్రి మధురా నాద శాస్త్రి భట్ ఆధునిక సంస్కృత సాహిత్యానికి మార్గదర్శి. దాదాపు 25 సంస్కృత గ్రంథాలను రచించి, దాదాపుగా అన్ని సంస్కృత ఇంగ్లీష్ హిందీ గ్రంథాలకు సంపాదకం వహించాడు కాలనాధ శాస్త్రి. తత్వశాస్త్ర, సాహిత్య ఉద్గ్రంథాలను అనువదించిన పండితుడు. ప్రాకృత, వ్రజభాష, రాజస్థాని ఇతర భారతీయ భాషలలోని ఉత్తమ సాహిత్యాన్నీ అనువదించిన భాషాప్రియుడు.

కాలనాధ శాస్త్రి దాదాపు వెయ్యి వ్యాసాలను సంస్కృతం హిందీ భాషలో దేశ, విదేశ ప్రముఖ పత్రికలకు రాసిన సాహితీ సంపన్నుడు. సంస్కృత హిందీ ఇంగ్లీష్‌లలో సుమారు 200కు పైగా రేడియో, టెలివిజన్ ప్రసంగాలు చేశాడు. శాస్త్రి సాహిత్య చరిత్రకారుడు విమర్శకుడు విశ్లేషకుడు. ఆధునిక సంస్కృత సాహిత్యంలో ఫిక్షన్ రాసి దారి చూపి, నవలలు, కథలు, స్వీయ అనుభూతులు రచించి 20వ శతాబ్దపు సంస్కృత సాహిత్యానికి తుష్టి, పుష్టి చేకూర్చాడు. రాజస్థాన్ సంస్కృత అకాడెమికి 1995 నుంచి 98 వరకు చైర్మన్‌గాను, సంస్కృత విద్యాభాషా విభాగాలకు డైరెక్టర్‌గాను, 1976 నుండి 1994 వరకు 18 ఏళ్ళు సేవ చేశాడు.

**గీర్వాణ కవుల కవితా గీర్వాణం-3**

**ఆధునిక సంస్కృతానికి జవ జీవాలు చేకూర్చిన కాలనాధ శాస్త్రి**

15-7-1936న రాజస్థాన్‌లోని జైపూర్‌లో రాష్ట్రపతి పురస్కారాన్ని అందుకొన్న సంస్కృత మహా విద్వాంసుడు భట్ మధురా నాద శాస్త్రి, గిరిధర్ శర్మ చతుర్వేది, పండిట్ పట్టాభి రామశాస్త్రి, పండిట్ హరిశాస్త్రి పండిట్ జగదీశ్ శర్మ మొదలైన ఉద్దండ పండితుల శిష్యరికంలో కాలనాధ శాస్త్రి సంస్కృతం, అలంకార శాస్త్రం, వేదాలు సకల శాస్త్రాలు, తులనాత్మక భాషా శాస్త్రాలు నేర్చాడు. సంస్కృత భాషాశాస్త్ర, అలంకార శాస్త్రాలలో సాటిలేని మేటి అయ్యాడు. తరువాత హిందీ, ఇంగ్లీష్ సాహిత్యాలు చదివి దిట్ట అనిపించుకొన్నాడు.

**ఉద్యోగ సోపానం**

ఇంగ్లీష్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ ప్రధమ శ్రేణిలో సాధించి, రాజస్థాన్ యూనివర్సిటి పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజిలో 8 ఏళ్ళు ఇంగ్లీష్ భాషా సాహిత్యాలను బోధించాడు. తరువాత రాజస్థాన్ ప్రభుత్వ విద్యాశాఖలో డిప్యూటీ డైరెక్టర్ అయి, భాషా విభాగానికి తరువాత డైరెక్టర్‌గా పదోన్నతి పొంది 1994లో రిటైర్ అయ్యాడు. రాజస్థాన్ ప్రభుత్వ సంస్కృత విద్యకు డైరెక్టర్‌గా, రాజస్థాన్ సంస్కృత అకాడేమికి చైర్మన్‌గా, జైపూర్‌లోని జగద్గురు రామచంద్రాచార్య సంస్కృత విశ్వ విద్యాలయంలో కవి శిరోమణి భట్ట మధురానాధ శాస్త్రి సంస్కృత పీఠం సంస్థాపన చైర్మన్‌గా, రాజస్థాన్ ప్రభుత్వ హిందీ లా కమిటీలో శాశ్వత సభ్యునిగా, కేంద్రీయ సంస్కృత బోర్డ్, నేషనల్ బుక్ ట్రస్ట్, సాహిత్య అకాడెమి సభ్యునిగా సేవలు అందించాడు. అనేక ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలలో సంస్కృత హిందీ భాషలకు చాలా హోదాలలో పని చేశాడు. జైపూర్ లోని "మంజునాద్ స్మృతిసంస్థాన్"కు సంస్థాపక అధ్యక్షుడుగా శాస్త్రి ఉన్నాడు. 2013 నుంచి "దేవర్షి" కాలనాధ శాస్త్రి భారత ప్రభుత్వ సంస్కృత కమిషన్ సభ్యుడుగా ఉన్నాడు.


**బిరుదులు, అవార్డులు, రివార్డులు**

దేశ విదేశాలలోని అనేక యూనివర్సిటీలు సాహిత్య విద్యాసంస్థలు కాలనాధ శాస్త్రి త్రిభాషా పాండిత్యాన్ని గుర్తించి గౌరవించి సత్కరించాయి. 2008లో రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం "మహా మహోపాధ్యాయ" బిరుదునిచ్చి సన్మానించింది. సాహిత్య మహోదధి, సాహిత్య శిరోమణిలతోపాటు రాజస్థాన్ ప్రభుత్వం నుంచి, ఉత్తర ప్రదేశ్ సంస్కృత సంస్థాన్ నుంచి సంస్కృత భాషా సేవకుగాను "జీవన సాఫల్య పురస్కారం" అందుకొన్నాడు. 2004లో కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డ్‌ను, కేంద్ర మానవ వనరుల శాఖచే గౌరవ పురస్కారాన్ని, 1998లో సంస్కృతంలో విశిష్ట సేవకు రాష్ట్రపతి పురస్కారాన్ని

రాష్ట్రపతి శ్రీ కే.ఆర్ నారాయణన్ గారి చేతులమీదుగా అందుకొన్నాడు. సంస్కృత భాషా సేవలో పండిన కాలనాథ శాస్త్రిని “రాజర్షి” అన్నారు.

**కాలనాథీయ భాషాశాస్త్రీయం**

ఆఖ్యాన వల్లరి అనే సంస్కృత కవితల సంపుటి, జీవనస్య పృష్ఠ ద్వయం, కవితావల్లరి, కదానక వల్లరి, విద్వజ్జన చరితామృతం, భారతీయ సంస్కృతీ, ఆధునిక సాంస్క్రిట్ సాహిత్య, సంస్కృత నాట్య వల్లరి, సుధీ జనావృత్తం, సాంస్క్రిట్ కే యుగ పురుష్, మేకర్స్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్, భారతీయ దర్శన్ కా ఇతిహాస్, వర్క్స్ ఆఫ్ పండిత జగన్నాధ పోయెట్రి, సాంస్క్రిట్ కే గౌరవ షికార్, ఆధునిక కాల్ కా సంస్కృత గద్య సాహిత్య, వన్ హండ్రెడ్ యియర్స్ ఆఫ్ ఫిలాసఫీ మొదలైనవి. “భారతి” సంస్కృత పత్రికకు శాస్త్రి సంపాదకుడు.❁



## 386) నాట్య శాస్త్ర నిధి – కమలేష్ దత్త త్రిపాఠీ –1936

త్రిపాఠి అంటేనే మహా పండితుడు అనే అర్థం లోకంలో ఉంది. కమలేశ్ త్రిపాఠి నాటక నాట్య రంగ ప్రముఖుడైన సంస్కృత విద్వాంసుడు. బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో డిపార్ట్మెంట్ ఆఫ్ రెలిజియన్స్ అండ్ ఆగమిక్ స్టడీస్‌లో ఎమిరిటస్ ప్రొఫెసర్. ఇందిరాగాంధి నేషనల్ సెంటర్ ఆఫ్ ఆర్ట్స్‌కు 2007లో సలహాదారు. యూరప్‌లో అనేక దేశాల యూనివర్సిటీలలో విజిటింగ్ ప్రొఫెసర్. జాతీయ అంతర్జాతీయ జర్నల్స్‌లో విస్తృతంగా ఫిలాసఫీ నాటకం సాహిత్యంలపై రచనలు చేశాడు. “అమరు శతకాన్ని” హిందీలోకి అనువదించాడు. చాలా సంస్కృత గ్రంథాల ప్రచురణకు సంపాదకత్వం వహించాడు. సంస్కృత నాటక రంగం ఆయన కృషికి ఎంతో రుణ పది ఉంది. కమలేశ్ అంటే నాట్య నాటక రంగాలే గుర్తుకు వస్తాయి. అంతటి విశిష్ట సేవ చేశాడు. ఆయన నాట్య వ్యాప్తి కుటియాట్టం నుంచి అస్సాంలోని అంకీయ నాట్ వరకు విస్తరించింది. సంప్రదాయం అన్నిటా కొత్త వచ్చినట్లు దర్శనమిస్తుంది. అదే ఆయన ప్రత్యేకత, నిబద్ధత.

సంస్కృత నాటక రంగాన్ని ఆధునికం చేయటంలో గొప్ప కృషి చేయటానికి పండిట్ మధురా ప్రసాద్ దీక్షిత్ తోడ్పాటు పొందాడు. అభిజ్ఞాన శాకుంతలం, మాలవికాగ్ని

మిత్రం, ఉత్తర రామ చరితం, ముద్రా రాక్షసం వేణీ సంహారం మొదలైన సంస్కృత నాటకాలను ప్రదర్శించటంలో ఎన్నో మెళకువలు తీసుకున్నాడు. డి.ఫిల్ పొంది, వారణాసిలోని సంపూర్ణానంద యూనివర్సిటి నుంచి ఆచార్య బిరుదు అందుకొన్నాడు. అక్కడే తబలా వాయించటమూ నేర్చాడు.

ఉజ్జైన్ కాళిదాస అకాడెమి చైర్మన్‌గా సమకాలీన సంస్కృత గ్రంథవ్యాప్తికి ప్రచురణకు అద్వితీయ కృషి చేశాడు. భాస, కాళిదాస కవుల నాటకాలను పూర్తిగా అర్థం చేసుకొని అంకిత భావంతో వందలాది ప్రదర్శనలను చేసిన సంస్కృత నాటక పరివ్యాప్తి దీక్షాతత్పరుడు. భాసుని నాటకాల గొప్ప తనాన్ని ఆధునికులు అర్థం చేసుకోవటానికి వీలుగా "బాల చరిత్ర" మొదలైన వాటిని హిందీలో రాశాడు. ప్రొఫెసర్ కమలేశ్ దత్త త్రిపాఠి నాట్యశాస్త్ర నిధిగా గుర్తింపు పొందాడు. 2006లో సాహిత్య అకాడెమి పురస్కారం 2007లో భారత రాష్ట్రపతి ప్రశంసా పత్రం అందుకొన్నాడు. 2008లో స్వామి హరిహరానంద సరస్వతి సమ్మాన్ అందుకొన్నాడు. ప్రయాగ హిందీ సాహిత్య సంమేలన్ "మహా మహోపాధ్యాయ" బిరుదు ప్రదానం చేసి గౌరవించింది. నాటక, నాటక రంగాలలో అపార అనుభవం, వైదుష్యం ఉన్నందున కైలాస్ నాధను సంగీత నాటక అకాడెమి ఫెలోను చేసి గౌరవించింది. ❀



## 387) సంస్కృత అంతర్జాల ప్రవేశకర్త - వి ఆర్ పంచముఖి -1936

వాడిరాజాచార్య రాఘవాచార్య పంచముఖి లేక వాచస్పతి పంచముఖి 17-9-1936న కర్ణాటకలోని ధార్వార్‌లో జన్మించాడు. తండ్రి వైద్యరత్న ఆర్.ఎస్.పంచముఖి. తల్లి కమలాబాయి. తండ్రి ప్రసిద్ధ ఎపిగ్రఫిస్ట్, ఆర్కియాలజిస్ట్ ఇండాలజిస్ట్ చారిత్రాత్మక పరిశోధనలో జీవితమంతా గడిపినవాడు. దాస సాహిత్య పరిశోధనలో పండిపోయినవాడు. తండ్రివద్దనే వాడిరాజు సంస్కృతం తత్వ శాస్త్రం అభ్యసించాడు. 1956లో కర్ణాటక యునివర్సిటీ నుండి సంస్కృతం గణితంలలో 82.5 శాతం మార్కులతో ఫస్ట్ క్లాస్‌లో ఫస్ట్ రాంక్ సాధించాడు. రెండేళ్ళ తర్వాత బాంబే యునివర్సిటీ నుండి ఎకనామిక్స్‌లో ఫస్ట్ క్లాస్ ఫస్ట్ రాంక్‌తోపాటు గోల్డ్ మెడల్ పొందాడు. 1963లో ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో "అప్లికేషన్ ఆఫ్ గేమ్ ధీరీ ఆఫ్ ఎకనామిక్స్

పాలిసీ"పై దీసీస్ రాసి పి.హెచ్‌డి అందుకొన్నాడు.

ఆర్థిక రంగంలో పంచముఖి సేవలు నిరుపమానమైనవి. నోబెల్ లారియట్ జాన్ టిన్ బెర్జిన్‌తోను జెనీవాలో టాంజానియా మాజీ ప్రెసిడెంట్ జూలియస్ నైరేరీతోను కలిసి పనిచేశాడు. అలీన దేశాల అభివృద్ధి చెందుతున్న దేశాలకు రీసెర్చ్ ఇన్ఫర్మేషన్ సిస్టం తయారు చేసిన ఘనత సాధించాడు. ఇండియా ప్లానింగ్ కమిటీ సెక్రెటరీగా 1977లో పనిచేశాడు. దీనివలన ఆర్థిక సరళీకరణ విధానం ధ్రువ పడటానికి సహకరించాడు.

ఆర్థికరంగంలో దూసుకుపోతున్నా సంప్రదాయంగా వచ్చిన సంస్కృతంలోనూ అద్వితీయ ప్రతిభ ప్రదర్శించి అనేక పుస్తకాలు కవితలు సంస్కృతంలో రచించాడు పంచముఖి. తిరుపతి సంస్కృత విద్యాపీఠానికి 1998 నుండి 2008 వరకు రెండుసార్లు ఛాన్సలర్ అయ్యాడు. శ్రీ వెంకటేశ్వర వేద విశ్వ విద్యాలయ రాజ్యాంగ నిర్మాణంలో స్థాపనలో విశేష కృషి చేశాడు. సంస్కృత –సైన్స్ ఎక్సిబిషన్ నిర్వహణలో, సంస్కృత నెట్ ఏర్పాటులో, ప్రాచీన సంస్కృత గ్రంథాల డిజిటలీకరణలో ఆయన సేవ అపారం. భగవద్గీతపైనా మేనేజ్‌మెంట్ పైనా విశేష కృషి చేశాడు. సంస్కృతాన్ని ఆధునిక శాస్త్రీయ పద్ధతిలో బోధించే ఆలోచన చేసి అమలులోకి తెచ్చాడు.

పంచముఖి సంస్కృతంలో– 1–భారతీయ ఆర్థిక సర్వేక్షణ, 2–కావ్య కుసుమాకర, 3–బ్రహ్మ సూత్ర దీపికా, 4–విచార వైభవం, 5–భారతీయ అర్థ శాస్త్ర మొదలైనవి 12 రాశాడు.

ఎకనామిక్స్‌లో– ట్రేడ్ పాలిసీస్ ఆఫ్ ఇండియా, ప్రొడక్షన్ అండ్ ప్లానింగ్, టీచింగ్ ఎకనామిక్స్ ఇన్ ఇండియా, ఫిస్కల్ మేనేజ్ మెంట్ ఆఫ్ ఇండియన్ ఎకానమీ టు వార్డ్స్ యాన్ ఏషియన్ ఎకనామిక్ ఎరా మొదలైన 15 గ్రంథాలు రాశాడు. ఆయన ప్రతిభకు తగిన పదవులు వరించాయి. ఇండియన్ కౌన్సిలాఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ ఛైర్మన్‌గా, ఇండియన్ ఎకనామిక్స్ జర్నల్ మేనేజర్‌గా, 8వ వరల్డ్ ఎకనామిక్స్ కాంగ్రెస్ కన్వీనర్‌గా ఇన్ స్టి ట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్‌కు ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా అఖిలభారత మధ్వ సమ్మేళనం ప్రెసిడెంట్‌గా ఇవికాక మరో 30 సంస్థలలో సభ్యుడుగా సలహాదారుగా గౌరవాధ్యక్షుడుగా ఉన్నాడు.

2003లో భారత రాష్ట్రపతి నుంచి సంస్కృతంలో ప్రతిభా పురస్కారం, రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్–ఢిల్లీ నుంచి విశిష్ట సంస్కృత సేవా వ్రతి, ఢిల్లీ లాల్ బహదూర్ యునివర్సిటీ నుండి వాచస్పతి పురస్కారం, విశ్వేశ్వరయ్య ప్రశస్తి పురస్కారం, కర్ణాటక రాజ్యోత్సవ పురస్కారం, గురుసార్వభౌమ రాఘవేంద్ర అనుగ్రహ పురస్కారం, విశాఖలోని గీతం యునివర్సిటీ పురస్కారం వంటివి ఎన్నో బహుముఖ సేవకు పంచముఖిని వరించాయి.❀

## 388) విషాద లహరి కర్త – కవి చక్రవర్తి ద్విభాష్యం విజయ సారధి – 1936

10–3–1936న శ్రీ భాష్యం నరసింహాచార్య, గోపమాంబ దంపతులకు శ్రీ విజయ సారధి కరీంనగర్ దగ్గర గ్రామంలో జన్మించారు. తల్లి, అమ్మమ్మ గానం చేసే జయదేవుని అష్టపదులు సంస్కృత శ్లోకాలను వింటూ ఆ భాషపై అభిరుచి సంగీతంపై మమకారం పెంచుకొన్నారు. వరంగల్ శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలలో చదివి ఉత్తీర్ణులై అక్కడే ఉపన్యాసకులుగా చేరి విద్యాబోధన చేశారు. వీరి ముఖ్య శిష్యులు శ్రీ అష్టకాల నరసింహశర్మ, డా. శ్రీ కె. కోదండ రామాచార్యులు. విద్యార్థిగా ఉన్నప్పుడే "మనోరమ" నవల రాసి తోటి విద్యార్థులకు చదివి వినిపిస్తూ విశ్లేషణ చేసి చెబుతూ బెనారస్‌లోని ముకుంద భట్టాచార్య, మల్లావఝల సుబ్బరామశాస్త్రి కరపాత్ర స్వామి, పశుపతినాథ శాస్త్రి వేదాల తిరువెంగళాచార్య వంటి సంస్కృత ప్రకాండుల మన్ననలు అందుకొన్న ప్రజ్ఞానిధి. కాశీ, కాశ్మీర్ విద్యాపీఠ పండిత ప్రశంసలూ పొందారు. వాగ్వాదినీ సరస్వతి వీరికి సుప్రసన్నురాలు.

1980లో కలకత్తా సంస్కృత విద్వత్సభలో విజయసారధి గారు–

"ఆకతి మందాకినీ, చకతి మందాకినీ–తకతి మందాకినీ మధురేణ పూరేణ –చలతి మందాకినీ, జలతి మందాకినీ
సలతి మందాకినీ విమలేన సలిలేన" అంటూ కావ్యగానం చేసి దాతు ప్రయోగ వైచిత్రికి భావజాలానికి పండిత ప్రకాండులను మంత్ర ముగ్ధులను చేసి మందాకినీ నది సోయగాలను కనుల ముందు నిలబెట్టారు. దీనికి పరవశించి మహా మహోపాధ్యాయ తర్క వాగీశ భట్టాచార్య–

"యుగ కర్తా –యుగో ద్ధర్తా –చక్రవర్తీ యుగస్యచ –సరస్వతీ సుతోత్తంసః –జీయాత్

విజయ సారథిహ్" అని మనః పూర్వకంగా ఆశీర్వదించి విజయసారధి గారు రాసే ప్రతి రచనలోనూ ఈ ఆశీర్వాద శ్లోకాన్ని ముద్రించమని అనునయ శాసనం చేశారు. సభలోని పండిత వరేణ్యులు కరతాళ ధ్వనులతో ఆ ఇద్దరినీ అభినందించారు.

శ్రీ భాష్యం వారు జ్యోతిష, వాస్తు అలంకార, వైదిక మంత్రార్థ వివరణలపై గొప్ప గ్రంథాలు రాశారు. రాజకీయ నాయకులపై "విషాద లహరి" రాశారు. అందులో–

"సాధూన్ దీన దరిద్ర భారత జవాన్ మాయావినో నాయకాః –సమ్మే శేషు మృషాదయోక్తి కుశలాస్తాన్ ప్చయిత్వా పరం"

"సంచిస్వంతి లోక రాజ్య పరిషత్ స్థానాన్య నూనాని భోహ్ –కష్టం ప్రాప్త మనన్యవార్య మధునా శంభాలాయైనాన్ ప్రభో"

భారత్ సైనికుల త్యాగనిరతిని– "యస్య శక్తి ర్మహా కాళరాత్రి –విభీత భారత పాలన దీక్షితౌ బభూవ

పరమ భారత స్వాతంత్ర్య సమరవీర –వివిధ సైనిక నికురంబ మానతోస్మి" అని శ్లోకంతో వారి త్యాగానికి జేజేలు పలికారు.

"రూప సూక్తం"లో రూపాయ మహిమ వర్ణిస్తూ– "అక్షరాన జ్ఞోపి, సేవ్యాయతే కోపి– అక్షరాభి జ్ఞోపి సేవకీయతి కోపి" అని చమత్కరించారు–అంటే అక్షరజ్ఞానం లేకపోయినా డబ్బు, పదవీ ఉంటే మనిషి పూజింపబడుతున్నాడు /అక్షరజ్ఞాని ఉద్యోగంలో సేవాకా వృత్తి చేస్తున్నాడని వ్యంగ్యం.

భగద్రామానుజా చార్యుల సుందర రూపం మధురమానసం, మాట వైదగ్ధ్యాలను వర్ణిస్తూ– "జయతి భువన దీప సంప్హృతార్తాను తాపాః –నియమ ధృత వికారో నిశ్చి తామ్నాయ సారః –

ప్రియా వచన వితానః ప్రీత సూరి ప్రతాపః –స్మయహర యతి వర్యస్వామి యతి రామానుజార్యః" అని శ్లోకం చెప్పారు. భావ జాలం తరుముకొస్తూ ఉంటే కొన్ని వేల శ్లోకాలు రాసి సరస్వతీ కంఠాభరణం చేశారు శ్రీ భాష్యం విజయ సారధిగారు.

మనోరమతోపాటు సుశీల నవల, దంభ యుగం ప్రహసనం, ఆర్ష భారతి ఏకాంకిక, అమర సందేశహ్ నాటకం, రామ, రామానుజ, రఘునాధ దేశిక ఉదాహరణ కావ్యాలు, 11 సుప్రభాతాలు, ప్రహేళికలు వంటివి ఎన్నో రాశారు. అముద్రిత గ్రంథాలూ చాలానే ఉన్నాయి.

శ్రీ బొమ్మ వెంకటేశ్వర్ ఇచ్చిన స్థలంలో "సర్వ వైదిక సంస్థానం" అనే సంస్థను

స్థాపించి యజ్ఞ వరాహ స్వామి, రత్నగర్భ గణపతి, రమాసహిత సత్యనారాయణ స్వామి, అనంత నాగేంద్ర స్వామి, వసుధా లక్ష్మి నవ దుర్గ, వాగ్వాదిని సరస్వతి, అభయ ఆంజనేయస్వామిలతో ఒక గొప్ప దేవాలయాన్ని నిర్మించి "సంగచ్ఛధ్వగమ్, సంవద ధ్వగమ్" అంటూ సర్వమత సామరస్యాన్ని ప్రబోధించారు శ్రీ భాష్యంవారు. ఈ పుణ్య ప్రాంగణంలో శ్రీరామాయణ మహాక్రతువు, చతుర్వేద హవనం, ప్రజాపత్య విజయం, సారస్వత, రక్షోఘ్న వంటి ఇష్టులు, క్రతువులు ఎన్నెన్నో నిర్వహించి ఆస్తిక జనములకు మార్గదర్శనం చేస్తున్నారు.


వీరి సాహిత్య ధార్మిక సేవకు సాహిత్య అకాడెమీ, తెలుగు విశ్వ విద్యాలయం బిర్లా ఫౌండేషన్ వంటి ప్రసిద్ధ సంస్థలు పురస్కారాలు అందజేసి సన్మానించాయి. తమ విద్వత్తుకు నీరాజనంగా "కవి చక్రవర్తి", మహాకవి, వాచస్పతి, వైదిక కర్మానుష్ఠాపనా చార్య మొదలైన బిరుదులూ అందుకున్నారు. ఈ ఏడాది ఆగస్టు 15న భారత స్వాతంత్ర దినోత్సవంనాడు సరస్వతీ సమార్చనా తత్పరులు జ్ఞాన వయోవృద్ధులు శ్రీ భాష్యం విజయ సారధి మాన్య మహోదయులను తెలంగాణా ప్రభుత్వం ఘనంగా సత్కరించి గౌరవించింది.

"కవి మూర్ధన్యుడు పండిత ప్రముఖుడై కావ్యాశు సంక్రీడ, వాగ్భవ కూలంకష గీష్పతి ప్రతిభుడున్ గైర్వాణ వాణీ ప్రభా -
ప్రవరుండవ్యయ భావుడున్ విజయ సారధ్యాహ్వాయి దున్నేడు తా-స్తవ నీయుం డయె ముఖ్య మంత్రి కర కంజ స్నాతుడై వెల్గెడున్" (అష్టకాల నరసింహ శర్మ)

ఆధారం- 2017 సెప్టెంబర్ దర్శనం-మాసపత్రికలో డా.శ్రీ కె.కోదండ రామాచార్యుల "సంస్కృత విజయ కేతనం శ్రీ భాష్యం" వ్యాసం.❁

**389) భాగవతాచార్య – వైశ్రవ నాథ రామన్ నంబూద్రి –1940**

సంస్కృత విద్వాంసుడు, గాంధీ అనుచరుడు వైశ్రవనాద రామన్ నంబూద్రి కేరళలో పాలఘాట్ జిల్లాలో జన్మించాడు. సంస్కృత, మళయాళ ఉపాధ్యాయునిగా పని చేశాడు. తరువాత భాగవతాచార్యగా మారాడు. భాగవత సత్రం ఆచార్యులలో చాలా ప్రముఖుడిగా గుర్తింపు పొందాడు. తర్క, సైన్స్ శాస్త్రాలలో ఎం.యే.డిగ్రీ వ్యాకరణ సిద్ధాంత మహాపండితునిగా ప్రసిద్ధుడు. 100కు పైగా వేద, ఉపనిషత్ మొదలైన సంస్కృత మహా గ్రంథాలను సరళ మళయాళ భాషలోకి అనువదించాడు. దీనివలన సామాన్య మలయాళీలకు వాటిలోని సారం అర్థమయింది. భాగవతంలో చెప్పబడిన దశావతార వర్ణన వలన డార్విన్ సిద్ధాంతాన్ని అర్థం చేసుకోగలిగారు. ఇతర సంస్కృత విద్వాంసులతో కలిసి గురువాయూర్ వంటి ప్రముఖ దేవాలయాలలో హరిజన ప్రవేశం కోసం చేసిన "గురువాయూర్ సత్యాగ్రహం"లో ప్రముఖ పాత్ర పోషించాడు. ఆలయాల వెలుపల భాగవత సప్తాహాలు చేసి ప్రజల దృష్టిని భాగవత సత్రం ఆకర్షించింది. అనంగ నాడి హయ్యర్ సెకండరి స్కూల్‌లో ఆడిటోరియం నిర్మించి తన ఉపన్యాసాలకు తగిన వేదిక చేసుకొన్నాడు నంబూద్రి. ఆయన మరణాంతరం దానిపేరు "రామన్ నంబూద్రి స్మారక మందిరం"గా మార్చి గౌరవం కల్పించారు. గాంధీజీ పిలుపు మేరకు కేరళలోనూ గుజరాత్‌లోని పోర్ బందర్‌లోను రామన్ నంబూద్రి ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నాడు.❁



## 390) బ్రహ్మ సూత్ర నామావళి కర్త – వ్యాసంకర ప్రభంజనాచార్య – 1940

భారత దేశ అత్యున్నత సంస్కృత విద్వాంసులలో ఒకరుగా పేరెన్నిక గన్నవాడు వ్యాసంకర ప్రభంజనా చార్య. మధ్వాచార్యుల ద్వైత మత ప్రచారకుడు. మధ్వవేదాంత శాస్త్రంపై అనేక గ్రంథాలు రాశాడు. దేశ, విదేశాలలోని ఎన్నో సంస్థలు ఆయనకు విశేష బిరుదులను ప్రదానం చేసి సన్మానించాయి. 1994లో బెంగళూర్‌లో జరిగిన అఖిలభారత మధ్వ వేదాంత సభకు చైర్మన్‌గా వ్యవహరించాడు. బెంగళూర్‌లోని ఫస్ట్ గ్రేడ్ గవర్నమెంట్ కాలేజి ప్రిన్సిపాల్‌గా పని చేశాడు. స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసి వేదాంత భావ వ్యాప్తికి జీవితాన్ని అంకితం చేశాడు. "జయతీర్థ వ్రాత ప్రతి గ్రంథాలయం' స్థాపించి అంతవరకూ ముద్రించని, అరుదైన భారతీయ తత్వ శాస్త్ర గ్రంథాలను ప్రచురించాడు. ప్రచురించిన వాటిలో భారత, భాగవత, భగవద్గీత వంటి విలువైనవి ఎన్నో ఉన్నాయి.

"వ్యాస మధ్వ సంశోధన ప్రతిష్టాన ట్రస్ట్" నెలకొల్పి, భారతీయ సంస్కృతీ, విలువలు, సంప్రదాయాలను పరిరక్షించి వ్యాప్తి చెందించే కార్యక్రమాన్ని చేబట్టాడు. "ఐతరేయ ప్రకాశన" అనే ముద్రణాలయం ఏర్పరచి ఎన్నో విలువైన గ్రంథాలను ముద్రించాడు. వైష్ణవ సంప్రదాయానికి చెందిన వందలాది స్తుతులను స్తోత్రాలను సేకరించి "స్తోత్రమాలిక"గా వెలువరించాడు. శ్రీమతి జయశ్రీని వివాహమాడి ఒక కుమారుడిని పెంచుకున్నారు.

ప్రభంజనాచార్య సంస్కృత సాహిత్య సేవకు భారత రాష్ట్రపతి 2005లో పురస్కారం అందజేశారు. ఆచార్యుల వారి రచనా ప్రభంజనం– శ్రీ జయ తీర్థ దర్శన, బ్రహ్మ సూత్ర నామావళి, పూర్ణ ప్రజ్ఞదర్శన, సదాచార వినోద, శ్రీ వేద వ్యాస దర్శన, శ్రీ బ్రహ్మణ్య తీర్థారు, ప్రవచన భారతి, శ్రీ మధ్వాచార్య కాల నిర్ణయ, శ్రీ రాఘవేంద్ర దర్శన. ❁



## 391) రాళ్లబండి కవితాప్రసాద్ "ఒంటరి పూల బుట్ట" సంస్కృతీకరణ - రాణి సదాశివ మూర్తి -1940

తూర్పు గోదావరిజిల్లా ఏనుగల మహల్‌లో శ్రీ రాణీ సదాశివ మూర్తి జన్మించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో సంస్కృతం చదివి ఎం.ఏ పొందారు. "వైదిక ఛందస్సు"పై పరిశోధన చేసి పి.హెచ్‌డి అందుకొన్నారు. వీరి డిగ్రీలను చూస్తే దిమ్మ తిరిగి పోతుంది. సంస్కృత, ఇంగ్లీషులో ఎం.ఏ., వేదాంత విద్యాప్రవీణ, జ్యోతిష ఆచార్య. పొయేటిక్స్, వేదిక్ ప్రాసడి, తంత్ర సంస్కృత సైన్స్‌లలో పట్టభద్రులు. ఎం.బి.ఏ కూడా చేశారు. సంస్కృతాధ్యాపకులుగా చేరి పని చేశారు. 2000 సంవత్సరంలో తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం సంస్కృత ఆచార్యులుగా చేరి పని చేస్తున్నారు. శ్రీ సదాశివమూర్తి గారు ఇప్పటిదాకా 40కి పైగా గ్రంథాలు రాశారు. ప్రాచీన గ్రంథాలలోని అనేకానేకమైన వైజ్ఞానిక విశేషాలను ఎన్నో వ్యాసాల ద్వారా తెలియజేశారు. దేశ విదేశాలలో జరిగిన 80కి పైగా జాతీయ అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని విలువైన పరిశోధనా పత్రాలను సమర్పించారు. 15కు పైగా సదస్సులకు తామే నేతృత్వం వహించారు. ఆయన ప్రచురించిన పరిశోధనా వ్యాసాల సంఖ్య 50కి పైమాటే. రాష్ట్రీయ విద్యాపీఠంకు శ్రీ సదా శివమూర్తి చేసిన కృషికి గుర్తింపుగా 2007లో "వ్యాసభారతి" జాతీయ పురస్కారాన్ని, ప్రజ్ఞా భాస్కర బిరుదు అందుకున్నారు.

నాట్యంలో మంచి ప్రావీణ్యం ఉన్నవీరిని, నాట్య రవళి వంటి పలు సంస్థలు సత్కరించాయి. సంస్కృత నృత్య నాటికలు రచించారు. నాటకాలు రాశారు. అనేక అరుదైన గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. వీరి సంస్కృత భాషా సేవను గుర్తించిన సాహిత్య అకాడెమి ఇటీవలే పురస్కారం అందించింది. ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా పని చేసిన ద్విశతావధాని, బహు గ్రంథకర్త స్వర్గీయ డా.రాళ్ళ బండి

కవితా ప్రసాద్ రచించిన "ఒంటరి పూల బుట్ట" కవితా సంకలనాన్ని శ్రీ రాణీ సదాశివ మూర్తి సంస్కృతంలోకి అనువదించారు. దీనికి కేంద్ర సాహిత్య అకాడెమి 50 వేల రూపాయల నగదు పురస్కారాన్ని ప్రకటించింది. ఈ పురస్కారాన్ని, తామ్ర పత్రాన్ని త్వరలో ఢిల్లీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో సదాశివ మూర్తి గారికి అందించి సత్కరించింది. "ఇంతటి గుర్తింపు, గౌరవం దక్కటం జీవితంలో మరిచి పోలేను. ఇన్నాళ్ళుగా నేను సాగించిన సాహిత్య కృషి ఫలించింది అని భావిస్తాను" అని శ్రీ రాణీ సదాశివమూర్తి అత్యంత వినయంగా చెప్పారు.

"హిడింబ భీమ సేనం" అనే సంస్కృత ఫీచర్ ఫిలింకు ప్రొఫెసర్ సదాశివ మూర్తి దర్శకత్వం వహించారు. "ఎలెక్ట్రానిక్ సెర్చ్ ఆఫ్ మహా భారత" అనే వీరి పరిశోధన చాలా విపులం. మూలాలకు అత్యంత సమీపంగా ఉన్నది. అందులో 18 విషయాలపై పరిశోధన ఉన్నది. అవి – పర్వ, ఉపాఖ్యాన, అధ్యాయ, శ్లోక పరిశోధన, సారాంశ, చిత్ర ప్రదర్శన, అస్త్ర, యుద్ధ వ్యూహ మొదలైన వాటిపై విపుల పరిశోధన ఇది. అంతేకాదు హరివంశంతో కూడా కలిసి ఉన్న 1 లక్షా పది వేల శ్లోకాల మహా భారతంపై మహా పరిశోధన ఇది. ఇందులో వారి కుశాగ్రబుద్ధి "రాణీ"గా రాజ్య మేలింది. దీనికి ప్రొఫెసర్ శ్రీపాద సత్యనారాయణ మూర్తి ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ అయితే, ఆచార్య సదాశివమూర్తి కొ-ఆర్డినేటర్. ఒకే ఒక్క ఏడాదిలో ఈ బృహత్ పరిశోధన పూర్తి చేయగా తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించింది.

సంస్కృతంలోనే కాక పాశ్చాత్య భాషా విమర్శనలోనూ నిపుణులు. జాతీయ స్థాయిలో జరిగే సాంస్కృతిక ఉత్సవాలకు వ్యాఖ్యాతగా గొప్ప ప్రసిద్ధి పొందారు. (ఆధారం -23-2-17 ఆంధ్రజ్యోతి)❋

## 392) సోమలతను గుర్తించిన - వైద్య భైరవ దత్త -1940

వైద్య భైరవ దత్త హిమాలయ మూలికలపై సాధికారత కలవాడు. లివింగ్ అథారిటి. ఒకసారి స్వామి రామాతో తాను సోమలతను తెస్తానని దాని ఫలితాలు చూపిస్తానని అంటే స్వామి డబ్బు ఇచ్చి పంపాడు. సోమలత హిమాలయాలలో 11 వేల అడుగుల ఎత్తు ప్రదేశాలలో ఒకటి రెండుచోట్ల మాత్రమే పెరుగుతుంది. యజ్ఞాలలో సోమరసం వాడటం అందరికి తెలిసిన విషయమే. వేదంలో చాలాసార్లు దాని ప్రస్తావన వస్తుంది. అన్నట్లుగానే దత్త ఒక పౌను బరువు గల సోమలతను శోధించి సాధించి తెచ్చాడు.

సోమలత నుంచి సోమ తయారు చేసి మార్జువానా, హషీష్‌లకు అలవాటు పడిన సాదువులపై ప్రయోగించారు. అది వారిలో భయ రాహిత్యాన్ని కలిగించింది. పాశ్చాత్యులు "సైకేడిలిక్ మష్రూమ్స్" పై పరిశోధించి చెప్పినట్లే ఈ సాధువులూ ప్రవర్తించారు. అయితే హెర్బాలజిస్ట్ దత్త మాత్రం అనేక రకాల మష్రూమ్స్ ఉన్నాయని అవీ ఇలాంటి ప్రబావాన్నే కలిగిస్తాయని సోమలత ఆ కుటుంబానికి చెందిన్దికాదని ఇది ప్రత్యేకమైనదని తెలియ జేశాడు. సోమలత కుంచించుకు పోయే స్వభావం ఉన్న జాతికి చెందినది అన్నాడు. అనేక ఆయుర్వేద గ్రంథాలలో వివిధ పుట్టగొడుగుల విషయాలన్నీ ఉన్నాయి. వాటిని వాడిన వారికి సైకిక్ అనుభవాలు కలుగుతాయి అని చెప్పబడింది. కాని వాటిలో సోమలత పేరు లేదు. మిగతా ముడుచుకుపోయే రకాలు ఈ ప్రభావాన్ని కలిగించవు. అగారికస్ హైషిమస్. స్ట్రామోనియం అనేవి విష పూరితమైనవి కాని కొద్ది మోతాదులో సేవిస్తే భ్రాంతి విభ్రమ కలిగిస్తాయి. సరైన మొతాదులోనే వాడాలి లేకపోతె వీటివలన ప్రాణ హాని తప్పదు.

సోమ, పాదరసాలను ఎలా వాడాలో అనేక రకాలుగా మనవాళ్ళు వర్ణించి వివరించారు. యోగ విధానంలో ఇలాంటి బయటి ప్రేరకాల వాడుక నిషేధం. కొద్దిమంది కింది స్థాయి సాధువులు వీటిని వాడి మత్తుగా స్తబ్దుగా ఉండిపోతారు తప్ప యోగ సాధనలో వృద్ధి పొందలేరు. అలాగే హోమియోపతి వైద్యంలో ఆర్సెనిక్ 10 ఎం, గరళం అతి తక్కువ డోసులో చనిపోయే రోగికిస్తే భయం నుంచి బయట పడతారు. గ్రీకులు ఈజిప్ట్ వారూ దీన్ని రోగులపై ప్రయోగించారు. అలాగే సోమ రసాన్ని వాడితే మనసు అంతర్ముఖమఔతున్దని హిమాలయ హేర్బాలజిస్ట్‌లు వాడుతూ ఉంటారు. వారి ఉత్సవాలలో కూడా దీన్ని పవిత్రంగా వాడినట్లు ఆర్యుల చరిత్రలో ఉన్నది.

పతంజలి మహర్షి కూడా యోగ సూత్రాలలో నాలుగవ అధ్యాయం మొదటి శ్లోకంలో ఔషధీ వనమూలికల నుండి తయారు చేయబడిన మందు మానసిక అనుభావలనిస్తుంది అని చెప్పాడు. అయితే ఇది తాత్కాలికమే కనుక దీనిపై ఆధారపదరాదన్నది ముఖ్య విషయం. సాధనే దారి. ప్రాచీన సాహిత్యంలో సోమరసాన్ని తెలివి తక్కువ విద్యార్ధులకు అంటే కుదురుగా ఆసన బద్ధులుగా ఎక్కువ సేపు కూర్చోలేని వారికి ఇస్తే, అది వారి నాడీ వ్యవస్తపై ప్రభావం చూపి, అనేక విధాలుగా పరిగెత్తే మానసిక ఆలోచనలు ఏకీ కృతమౌతాయని చెప్పబడి ఉంది. అప్పుడు శరీరం స్వాధీనమై

చెప్పినట్లు విని బాధ లేకుండా కూర్చోవటానికి వీలవుతుంది. కనుక ఇలా నిష్టగా ఆసన బద్ధులు కాలేని వారు సాధనకు ముందే చేసే కొన్ని కార్యక్రమాలలో సోమరసాన్ని తీసుకుంటారు. దీని వాడకం ఇష్టం వచ్చినట్లు చేయరాదు. హిర్బాలజిస్ట్ సలహాపైనే వాడాలి.

వైద్య భైరవదత్త ఇలాంటి ప్రేరకాలను మంత్రాలతో జోడించి రోగులకు వాడుతాడు. ఈ మంత్రాలను ఒంటరిగా ఉండి ఉపవాసంతో చదువుతాడు. దీనికి తోడూ కొన్ని తంత్ర క్రియలూ చేస్తాడు. కొందరు సాధువులు ఈ ప్రక్రియలో చాలా అనుభవం సాధించిన వారున్నారు. ఈ విధానం అంతా లేకుండా వాటిని వాడితే పరమ ప్రమాదం. నాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయి. భ్రమలు పెరిగి సైకిక్ అయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. కొందరికి భావాతీత అనుభవాలు కలగవచ్చు కాని యోగికి అవి సహకరించవు. తరువాత వ్యతిరేక ప్రభావం కలిగిస్తాయి.

భైరవ దత్త తానూ చాలాసార్లు సోమ రసాన్ని నిర్భయంగా వాడానని మంచి ధనాత్మక ఫలితాలిచ్చాయని ఉన్నత స్థితి కలిగిందని చెప్పాడు స్వామి రామతో. కాని దాన్ని పదే పదే వాడితే వ్యతిరేక ఫలితం కలగటం ఖాయమని చెప్పాడు. మానసిక రోగాలు వస్తాయన్నాడు .

ఒకరోజు ఉదయం దత్త "అస్టావర్గ" రసం తయారు చేసి దానిలో సోమరసం కలిపి స్వామితో సహా అందరికీ ఇచ్చాడు తాగమని. స్వామికి అది చేదుగా వగరుగా అనిపించింది. భైరవ దత్త మంత్రాలు చదువుతూ ఊగిపోతూ డాన్స్ చేయటం ప్రారంభించాడు. చివరికి బట్టలన్నీ విప్పి విసిరిపారేసి కరాళ నృత్యం చేశాడు. స్వామి రామ్‌కు తలనొప్పి వచ్చింది. కాసేపటికి శిష్యులకు ఎందుకు వీళ్ళు అలా ప్రవర్తిస్తున్నారో తెలియలేదు. హీర్బాలజిస్ట్ భైరవ దత్త డాన్స్ చేస్తూ "నేను శివుడిని ఈ విశ్వానికి అధిపతిని. నా పార్వతి ఎక్కడ ఆమెతో శృంగారం చేయాలి" అని అరిచాడు. అయిదుగురు ఆయనను ఆపటానికి ప్రయత్నం చేసినా ఆపలేక పోయారు. వాళ్ళని ఒక్కొక్కరిని తోసి పరేశాడు. ఈ ఉదంతమంతా స్వామి రామా ఉత్తర కాశిలో ఉజాలి ఆశ్రమంలో జరిగిందని రాశాడు. ఇలాంటి అనేక అనుభావాల వలన స్వామిరాం ఈ హెర్బల్ మూలికలు కొద్దిగా మంచి చేస్తే చేయవచ్చునేమో కాని ఎక్కువగా కీడు చేస్తాయని తెలియజేశాడు.

దక్షిణ భారత దేశంలో ఆయుర్వేద, సిద్ధ ఔషధాలలో సోమలత వాడకం ఉన్నది. దీని బొటానికల్ పేరు "సార్కో స్టెమ్మా అసిడం". ఋగ్వేద హోమాలోనే కాక ఇరాన్ దేశ హోమాలలో కూడా సోమలతను వాడారు. మనవాళ్ళు "దేవతలకోసం దేవుడు" అని సోమలతను అన్నారు. ఋగ్వేదం "దేవుళ్ళను సృష్టించేది సోమలత" అన్నది. ఇంద్రునికి సోమలతకు అవినాభావ సంబంధం ఉన్నది. రాక్షసులపై యుద్ధానికి వెళ్ళిన ప్రతిసారీ సోమ రసం పుచ్చుకొని వెళ్ళేవాడని మంచి ప్రేరకంగా పని చేస్తుందని ఉన్నది. తపస్సుకు ముఖ్యమని చెప్పబడింది. కాంతికీ సోమలతకు సంబంధం ఉన్నదని అందుకే కాంతి అధిదేవత ఇంద్రునికి అది ఇష్టమైనది అని ఋగ్వేదంలో ఉంది. ఇక చాలించి "సోమమత్తు"లో నుంచి బయటపడదాం.❀

## 393) గణిత వేదాంతకర్త - చక్రవర్తి -1940

గణితానికి వేదాంతానికి సంబంధం ఏమిటి? బోడిగుండుకు మోకాళ్ళకు ముడి పెట్టటంలాగా ఉందనుకొంటున్నారా. దిగితేకాని లోతు తెలియదు. లెక్కలలో 1 సంఖ్య ఉంది. మిగిలిన అన్ని సంఖ్యలు దీని గుణకాలే. అలాగే ఉన్నది ఒకే ఒక్క శుద్ధ సత్యం. ఆ శుద్ధ సత్యం యొక్క గుణకాలే విశ్వంలో విభిన్న నామాలు, రూపాలు. జీవితం సమ భుజ త్రిభుజం. శరీర కోణం, శరీరాంతర్గత స్థితి కోణాలు, బాహ్యప్రపంచ కోణం కలిస్తే సమాన కోణ సమానభుజాలున్న జీవితం యొక్క సమబాహు త్రిభుజం. సంఖ్యలన్నీ ఒక స్థిర బిందువునుంచి వచ్చినట్లే, ఆ బిందువును కొలవలేనట్లే, ఈ విశ్వమంతా గణింప శక్యం కాని శూన్యం నంచి ఏర్పడింది. జీవితం ఒక చక్రం. దీన్ని సున్నా లేక వృత్తంతో పోల్చవచ్చు. వృత్తం అంటే బిందువు యొక్క పరి వ్యాప్తి అన్నమాట. అయితే జీవితంలో రెండు బిందువులున్నాయి ఇవే పుట్టుక, మరణం. ఈ రెండు బిందువులను కలిపే సరళ రేఖయే జీవితం. జీవితం యొక్క తెలియని భాగమంతా అనంతం రేఖ.

ముందు ఒక సున్నా పెట్టి దాని తరువాత 1 అంకె వేస్తే 01 అవుతుంది. ఒకటి వేసి దానితర్వాత సున్నా పెడితే 10 అవుతుంది. సున్నాలు పెంచిన కొద్దీ విలువ పెరుగుతుంది 100 1000 వగైరా. ముందు ఒకటి లేకుండా ఎన్ని సున్నాలు పెట్టినా ఆ సున్నాకు విలువే లేదు. సృష్టిలో అన్ని వస్తువులు సున్నాలే. ఏక పరబ్రహ్మ సత్య భావన లేకపోతే ఈ వస్తువులకు దేనికీ విలువ లేదు. ఆ ఏక సత్య పరబ్రహ్మ ఎరుక కలిగితే జీవితం విలువైనది అవుతుంది. లేకపోతే భారమవుతోంది.

కనుక గణితం ధనాత్మక సైన్స్. అన్ని సైన్స్‌లకు మూలాధారం. ఇది సాంఖ్య వేదాంతంపై ఆధార పడిందే. వేదాంతాలలో అతి ప్రాచీనమైనది సంఖ్య 0. ఇది శరీరాన్ని అందలి లోపలి విషయాలను మనసు చేసే క్రియలను తెలుసుకోవటానికి ఉపయోగ పడుతుంది యోగ అనేది ఆచరణాత్మక విజ్ఞానం (ప్రాక్టికల్ సైన్స్). ఇది అతీంద్రియ చేతన (సూపర్ కాన్షస్) కలిగిస్తుంది. సందేహ నివృత్తికి సాంఖ్య యోగం తప్పనిసరి.

ఈ విషయాలన్నీ స్వామి రామాకు "చక్రవర్తి" అనే గణిత శాస్త్రవేత్త అయిన

స్వామి బోధించాడు. ఆయన గణిత శాస్త్రంలో ప్రొఫెసర్. చక్రవర్తీస్ మాధేమాటిక్స్ గ్రంథ రచయిత. తర్వాత జీవితంలో సారం లేదని గ్రహించి సన్యసించి హిమాలయ గుహలలో తపస్సులో గడిపాడు. ఆయనకు మరొక గొప్ప శక్తి ఉంది అదే "తదేక దృష్టి". దేనిమీద అయినా ఆయన దృష్టిపెడితే దానిప్రభావం గొప్పగా ఉంటుంది. దీనిని "త్రాటకం" అంటారు. ఇంగ్లీష్‌లో గేజింగ్ అంటారు. ఈ దృష్టి బయట వాటిపై కేంద్రీకరిస్తే దాన్ని త్రాటకం అంటారు. అదే దృష్టిని అంతర్ముఖ చేస్తే దాన్ని ఏకాగ్రత అంటారు. కేంద్రీక రింపబడిన మనసుకు అత్యంత శక్తి లభిస్తుంది. కొందరు దృష్టిని భృమధ్యమంలో కేంద్రీకరిస్తారు. శివుడు మూడవ కంటి దృష్టిని కేంద్రీకరిస్తేనే మన్మధుడు కాలి బూడిదయ్యాడు. భూతద్దంతో సూర్యకాంతిని కేంద్రీకరిస్తే కాగితం ఫిలిం దూది మొదలైనవి తగలబడటం మనకు అనుభవమే.

స్వామిరామా దీన్ని ప్రత్యక్షంగా చూపించమని కోరాడు. సరేనని దగ్గరలో ఉన్న కోర్టులో ఏ ఖైదీ అయినా అనవసరంగా అరెస్ట్ అయి విచారణ ఎదుర్కుంటున్నాడేమో చూసి వచ్చి చెప్పమన్నాడు. సరే అని వెళ్లి అక్కడి లాయర్ల ద్వారా పాపం ఒకతను ఏ నేరమూ చేయకుండా కోర్టులో విచారణకు గురౌతున్నాడని తెలుసుకొని స్వామి చక్రవర్తికి చెప్పాడు. అప్పుడు చక్రవర్తి "ఆ ఖైదీ విడుదలవుతాడు. జడ్జి చెప్పే జడ్జిమెంట్ ఎలా ఉంటుందో నీకు ప్రత్యక్షరం తెలియజేస్తాను. కాగితం మీద రాసి టైప్ చేసి ఎవరికీ తెలియకుండా జాగ్రత్త చేయి. జడ్జిమెంట్ రాగానే నేను చెప్పింది జడ్జి చెప్పింది పోల్చి చూడు" అని చెప్పటం రామా రాయటం టైప్ చేయటం అందులో మూడు టైప్ తప్పులు దొర్లటం జరిగాయి. రెండుమూడు రోజుల తర్వాత జడ్జి తీర్పు చెప్పాడు. దాని కాపీ తెప్పించి రామా తాను టైప్ చేసిన దానితో పోల్చి చూశాడు. అక్షరం పొల్లు పోకుండా తానూ చేసిన మూడు తప్పులతో సహా జడ్జి మెంట్ కాపీ ఉంది. ఆశ్చర్యపోయి చక్రవరి త్రాటక విద్య అమోఘమైనది గ్రహించాడు. అంటే ఎక్కడో సుదూరంలో ఉండి కూడా మనసును కేంద్రీకరించి అవతలి వారిపై ప్రభావం చూపించవచ్చు అని అర్ధమయింది. అప్పుడు రామా "స్వామీ! మీరు ఈ ప్రపంచ గతిని మార్చగలరా?" అని అడిగాడు. దానికాయన "అది నా పనికాదు అతడు అన్యాయంగా కేసులో ఇరుక్కున్నాడనే జాలితో నా దృష్టిని జడ్జి మనసుపై కేంద్రీకరించి ప్రభావం చూపి జడ్జిమెంట్ అలా వచ్చేట్లు చేయగలిగాను. మనిషి నిగ్రహంతో ఉంటే ఎక్కడున్నా, యెంత దూరంలో ఉన్నా అవతలివారి మనసుపై ప్రభావం కలిగించవచ్చు అని నీకు తెలియజేయటానికే ఇలా చేశాను" అన్నాడు.

చక్రవర్తి యోగి సంఖ్యామానంలోని సున్నా నుంచి 100 వరకు ప్రతి అంకెను ఉపనిషత్‌లోని ఒక్కొక్క శ్లోకంతో జత చేసి వ్యాఖ్యానించి చెప్పేవాడు. వాటిలోని వేదాంత భావనలను విశదీకరించేవాడు.❁



## 394) కాశ్మీర్ పంచాంగ కర్త – పండిట్ ఆనంద శాస్త్రి-1940

కాశ్మీర దేశంలో పంచాంగం రాసి కాశ్మీర్ పండుగలను ఉత్సవాలను జన నుండి అంత్యేష్టివరకు జరపాల్సిన కర్మకాండలు రచించటమే కాక ఆడియో కేసెట్స్‌గా తెచ్చిన ఘనత పండిత ఆనంద శాస్త్రిది. ఆయన రాసిన పంచాంగం అత్యంత నిర్దుష్టమైనదిగా ప్రశస్తి పొందింది. ఆయన రచించిన "విజయేశ్వర జంత్రి" బాగా ప్రచారమైంది. కాశ్మీర్ పండిట్లను అక్కడినుంచి తరిమేసే ప్రయత్నం విస్తృతంగా జరుగుతున్నప్పుడు ఆయన వారు ఎక్కడ ఉన్నా అవలంభించాల్సిన విధులన్నీ ఇందులో పొందు పరచాడు. అదే ఇప్పుడు వారికి కరదీపికగా నిలిచింది. 1989లో పండితులను కాశ్మీర్ నుంచి బయటికి నెట్టి వేస్తున్న సందర్భంలో ఆయన తీవ్రంగా ఆలోచించి పండితులు ప్రవాసంలో కూడా అను సారించాల్సిన విధి విధానాలు ఇందులో రాశాడు. ఆడియో కేసెట్లు కరపత్రాలు అందుబాటులోకి తెచ్చాడు. సంప్రదాయం అవిచ్ఛిన్నంగా కొనసాగాలన్న ఆయన తపన అత్యంత శ్లాఘనీయం. కర్మకాండ దీపికా, శివరాత్రి పూజ, శాండీయ, అంతిమ సంస్కారం జన్మదిన పూజలు కాశ్మీర్ పండితులకు ప్రవాసంలో గొప్ప మార్గ దర్శకాలైనాయి. శాస్త్రి పంచస్తవి, భవాని సహస్ర నామం, మహిమాపార్, భగవద్గీత లల్లేశ్వరి వాక్యాలపై తన స్వరంతో తెచ్చిన ఆడియో కేసెట్లు ప్రతి పండిత కుటుంబంలోనూ మారు మోగుతాయి. కాశ్మీరీ భాషను నేర్వటం మాట్లాడటం రాయటం మరిస్తే జరిగే అనర్థాన్ని ఎలుగెత్తి చాటి భాషను కాపాడుకోవాల్సిన అవసరాన్ని చెప్పాడు. శారదా లిపిని సంస్కరించి ఆధునిక పండిట్ల కోసం 'శారదా ప్రయిమర్' రాసిన భాషా సంస్కృతీ అభిమానిశాస్త్రి.

కాశ్మీర పండిత సంప్రదాయానికి నిలువెత్తు దర్పణంపండిత ఆనంద శాస్త్రి. వేషధారణలో భాషలో కాశ్మీర పండితుని లక్షణాలన్నీ కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి. పండిత వస్త్ర ధారణను "ఫెరేన్" అంటారు. తలపై టర్బన్ ఉంటుంది. ఆయన ఇంట్లో చదువుకొనే, రాసుకొనే గదికూడా సంప్రదాయానికి మచ్చు తునకగా ఉంటుంది. బీరువాలు షెల్ఫ్‌లు, కుర్చీలు, సోఫాలు ఉండవు. కింద కూర్చుని రాసుకొనే వ్రాత బల్ల మాత్రమే ఉంటుంది. ఆయన దిన చర్య అత్యంత క్రమ బద్ధంగా ఉంటుంది. అయన ముఖంలో వేద విజ్ఞాన జ్యోతి దర్శనమిస్తుంది. కనులలో కాంతి మిరుమిట్లు గొలుపుతుంది. ఆయనతో మాట్లాడటమే గొప్ప ఎడ్యుకేషన్. ఇంత గొప్ప పండితుని జీవిత వివరాలు తెలియకపోవటం విచారకరమే.❁

## 395) బసవ భాస్కరోధయ మహా కావ్యకర్త – పరాడ్డి మల్లికార్జున – 1940

పరాడ్డి మల్లికార్జున 1940లో కర్ణాటకలో సావడిలో పుట్టి, సంస్కృతంలో ఎం.ఏ. పి.హెచ్‌డి చేసి దార్వార్ సంస్కృత యూని వర్సిటి ప్రొఫెసర్ అయ్యాడు. బసవ భాస్కరోదయం అనే మహాకావ్యం, గంగాధర, చెన్న విలసద మొదలైన శతకాలు, సంస్కృత కావ్యమాలిక, సంస్కృత కావ్య మందాకినీ కావ్యాలు రాశాడు. కబీర్ కవితల్ని కబీర్ దా శతకంగా అనువదించాడు. దీనికి సాహిత్య అకాడెమి అవార్డ్ పొందాడు. అక్కమహాదేవి, బసవేశ్వర శతకాలు కన్నడం నుంచి సంస్కృతంలోకి మార్చినవి. మల్హనా స్తోత్రం చిత్రగ్రీవ విజయం, జగద్గురు సిద్దేశ్వర చంపులకు సంపాదకత్వం వహించాడు. విశ్వారాధ్య విశ్వభారతీ పురస్కార గ్రహీత మల్లికార్జున.

బసవ భాస్కరోదయం 16 కాండల బసవని చరిత్ర కావ్యం. వైవిధ్య ఛందస్సులతో రాసీభూత రసానందం కలిగించాడు. గంగాధర శతక నాయకులు గంగాధర రాజ యోగీంద్రులు. 16వ జనం దినం నాడు రాశాడు. స్వామీజీ బహుభాషా పాండిత్యాన్ని తెలియజేశాడు. స్వామి నిర్మించిన సత్రాలు లైబ్రరీలు హాస్పిటల్స్ హాస్టల్స్ వివరాలన్నీ పేర్కొన్నాడు. మతసామరస్యానికి సంస్కృత వ్యాప్తికి స్వామీజీ చేసిన కృషి వివరించాడు. సంస్కృత కావ్య మందాకిని వివిధ అంశాలపై రాసిన 32 శ్లోకాల సమాహారం. "విరలో మనీషా" అనేది డా.సర్వేపల్లి రాదా కృష్ణన్ మహోన్నత వ్యక్తిత్వాన్ని తెలియబరచే ఘన నివాళి. శైవుడైన మల్లికార్జున పరాడ్డి గొప్ప కవి అనువాదకుడు, పరిశోధకుడు. ఆధునిక సంస్కృత మహా విద్వాంసుడు కవి "అభి రాజేంద్ర మిశ్ర" మచ్చ రాదేయం సుకవి సుప్రూదయం చ పి సౌమ్యం పరాడ్డిం" అని ఘనంగా మల్లికార్జునుని కీర్తించాడు.



## 396) భారత ధ్వని దర్శనకర్త – ప్రాచార్య శ్రీ శలాక రఘునాధ శర్మగారు -1941

**జనన విద్యాభ్యాసాలు**

సంస్కృతాంధ్రాలలో మహా విద్వత్తు కలిగిన మహా పండితప్రకాండులు శ్రీ శలాక రఘునాధ శర్మ గారు కృష్ణాజిల్లా నూజివీడు తాలూకా గొల్లపల్లిలో 23-7-1941న శ్రీ శలాక నరసయ్య శ్రీమతి దుర్గాంబ దంపతులకు జన్మించారు. గొల్లపల్లి హైస్కూల్‌లో సెకండరీ విద్య పూర్తి చేశారు. ఆగిరిపల్లిలో ప్రసిద్ధ శ్రీ మార్కండేయ సంస్కృత కళాశాలలో 1955 -56లో చేరి శ్రీ పేరి వెంకటేశ్వర శాస్త్రి గారి వద్ద సంస్కృత వ్యాకరణం అభ్యసించారు. శ్రీ రామచంద్రుల కోటేశ్వర శర్మగారి దగ్గర కావ్యాలు నేర్చారు. ప్రైవేట్‌గా మెట్రిక్ చదివి ఉత్తీర్ణులై 1960 తెలుగు సంస్కృతాలలో భాషా ప్రవీణ ప్రథమ శ్రేణిలో పాసయ్యారు. ప్రైవేట్ గానే చదివి బి.ఎ.డిగ్రీ కూడా 1963-64లో పొందారు. 1965-67 మధ్యకాలంలో ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగులో ఎం ఏ.చదివి మొదటి తరగతి డిస్టింక్షన్‌లో కృతార్థులై స్వర్ణ పతకం పొందారు. వీరి గురుపరంపరలో డా. దివాకర్ల వెంకటావధాని, డా.పాటి బండ్ల మాధవ రామ శర్మ, ఆచార్య బిరుదురాజు రామ రాజు గారు ఉన్నారు. 1975లో శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో "మహా భారతంలో ధ్వని సిద్ధాంత సమన్వయము"పై పరిశోధన చేసి పి.హెచ్.డి.పొందారు. ఇదే "భారతంలో ధ్వని దర్శనం"గా పుస్తక రూపంలో వెలువడింది. వీరి గైడ్ పరిశోధన పర బ్రహ్మ ఆచార్య కోరాడ మహాదేవ శాస్త్రి గారు.

### ఉద్యోగ సోపానం

1960 నుండి 65 వరకు అయిదేళ్ళు హైస్కూల్, హయ్యర్ సెకండరీ స్కూల్స్‌లో తెలుగు పండితులుగా పని చేశారు. శ్రీ దేవులపల్లి రామానుజరావు గారు నిర్వహిస్తున్న ఆంధ్ర సారస్వత పరిషత్‌కు చెందిన హైదరాబాద్ తిలక్ రోడ్‌లోని ఓరియెంటల్ కాలేజిలో 1967-68లో ఒక ఏడాది ఆంధ్ర సంస్కృత లెక్చరర్‌గా ఉద్యోగించారు. 1968

అనంతపురం శ్రీ కృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయంలో గీర్వాణాంధ్ర లెక్చరర్‌గా చేరి 17 ఏళ్ళు పని చేసి, శాఖాధ్యక్షులుగా, డాక్టోరియల్ ప్రొఫెసర్‌గా, డీన్‌గా క్రమంగా పదోన్నతి పొంది 16 ఏళ్ళు పనిచేసి మొత్తం 33 సంవత్సరాలు సర్వీస్ చేసిన ఘనత పొంది 2001లో పదవీ విరమణ చేశారు.

తెలుగు సంస్కృత వ్యాకరణాలపై శర్మగారికి అభిమానం జాస్తి. సంప్రదాయ సాహిత్యమన్నా, సాహిత్య విమర్శనమన్నా కూడా విపరీతమైన ఆసక్తి ఉన్నది. రిసెర్చ్‌పై మక్కువ ఎక్కువ. ఎన్నో విషయాలపై పరిశోధన చేసి దాదాపు 40 విలువైన గ్రంథాలను ప్రచురించారు. 100 సెమినార్లలో పాల్గొని రిసెర్చ్ పేపర్లు రాసి సమర్పించారు. 3 రిసెర్చ్ ప్రాజెక్ట్‌లు నిర్వహించారు. 80 దాకా ప్రత్యేక వ్యాసాలూ రాశారు. శర్మగారి వద్ద 24 విద్యార్థులు పరిశోధనలు చేసి పి.హెచ్‌డి పొందారు. 23మందికి ఎం.ఫిల్‌కు మార్గ దర్శనం చేశారు.

శాస్త్రి గారి విద్యా విశేషాలకు తగిన గుర్తింపు లభించింది. ప్రశాంతి నిలయంలోని సత్య సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో 15 ఏళ్ళు మెంబర్‌గా ఉన్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం, కాకతీయ విశ్వ విద్యాలయం ఉస్మానియా విశ్వ విద్యాలయం, తిరుపతి పద్మావతీ మహిళా కళాశాల, నాగార్జున విశ్వవిద్యాలయంలలో బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో సభ్యులుగా గౌరవం పొందారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అకాడెమిక్ సెనేట్, హయ్యర్ పవర్ కమిటీలలో సభ్యులుగా పని చేశారు. స్టేట్ లైబ్రరి కమిటీ, అనంతపూర్‌లోని చిన్మయా మిషన్ ఎక్సి క్యూ టివ్ కౌన్సిల్, హైదరాబాద్ యూని వర్సిటి స్కూల్ బోర్డ్ ఆఫ్ హ్యూమానిటీస్‌లో మెంబర్. అనంతపూర్ శ్రీ రమణ సత్సంగ్‌కు అధ్యక్షులు.

**వివాహం-సంతానం**

నూజివీడుకు చెందిన శ్రీ చెరుకుపల్లి సుందర శివ శర్మ శ్రీమతి బుచ్చిరామ కృష్ణమ్మ దంపతుల కుమార్తె శ్రీమతి రాజ రాజేశ్వరి గారిని శ్రీ రఘునాధ శర్మగారు 26-5-1962లో వివాహమాడారు. ఈ దంపతులకు అయిదుగురు కుమార్తెలు. వారందరి వివాహ బాధ్యతలు తీర్చి, ప్రస్తుతం రాజమండ్రిలో ఉంటున్నారు.

**శ్రీ శలాక వాఙ్మయ స్రవంతి**

1-దండి "దశకుమార చరిత్ర"ను తెలుగులోకి అనువదించి వ్యాఖ్యానం రాశారు. 2-బాణుని "హర్ష చరితాను వాదం వ్యాఖ్య, 3-శ్రీ బ్రహ్మ దత్త జిజ్ఞాసువు హిందీలో రాసిన "సరలతమ విధి"ని తెలుగులోకి తర్జుమా చేశారు. 4-భారతధ్వని దర్శనం అనే పి

హెచ్.డి థీసిస్ – రెండుసార్లు ముద్రణ పొంది ఖ్యాతి చెందింది. 5–సంస్కృత వ్యాకరణం "లఘు సిద్ధాంత కౌముది"ని అనువదించారు. 6–నన్నయ భారతంపై "భట్టారక భారత భారతి" రాశారు. 7–మహా భారత విరాట పర్వాన్ని తెనిగించారు. 8–"షట్పది కనక దారలు" 2 స్తోత్రాలకు వ్యాఖ్యానం రచించారు. 9–మహా భారతంలోని ఉద్యోగ పర్వం, విదుర నీతి, యక్ష ప్రశ్నలు అనువాదం చేశారు. 10–అంతరంగ నివేదనం అనే కవితా సంపుటి, 11–సహృదయ భావ లహరి అనే సాహిత్య వ్యాస సంకలనం, 12–సనత్సుజాతీయం, భాగవత నవనీతం, మహా భారతం–శాంతి పర్వం–ఆర్ష భావ చంద్రికలు, అనుగీత కరదీపిక, స్ఫురణ దీప కలికలు, జగద్గురు శ్రీ పాదార్చన, ఉత్తర గీత సౌరభం వంటివి ఎన్నో రచనలు చేశారు. 13–కవిత్రయ భారతం మొత్తంలో 120 రమణీయ పద్యాలను ఎంపిక చేసి విస్తృత వివరణ రచించారు. 14–ప్రశ్నోపనిషత్ సౌరభవం రాశారు. 15–పంచామృత రసవాహిని భాగవత నవనీతం ఉత్తర గీత సౌరభం రచించి ఎన్నెన్నో విలువైన విషయాలను వెలుగులోకి తెచ్చారు.

శ్రీ శర్మగారు ప్రస్తుతం శ్రీపమిడి ఘంటం కోదండ రామయ్య గారి "ఆర్ష విజ్ఞాన ట్రస్ట్" ఆధ్వర్యంలో వేదవ్యాస మహా భారతాన్ని శ్లోక తాత్పర్యాలతో తెలుగులోకి అనువదించే బృహత్ కృషిలో మునిగి ఆర్ష సేవ చేస్తున్నారు. ఇప్పటికి దాదాపు అన్ని పర్వాలు పూర్తి చేశారు. ఇదొక వాఙ్మయ దీక్షాతపస్సు. శర్మ గారు మాత్రమే చేయ గలిగిన, చేయదగ్గ వాఙ్మయ యజ్ఞం.

ఎందుకోకాని శర్మ గారి దృష్టి వాల్మీకి రామాయణంపైనా, ఇతర రామాయణ రచనలపైనా పడినట్లు లేదు. పడి ఉంటే వాటిలోని అనర్ఘ రత్న రాశులను కూడా తవ్వి తలకెత్తే వారు అనిపించింది నాకు.

శర్మ గారి కంఠం శంఖ ధ్వనిని పోలి ఉంటుంది. ఏ విషయంపై ప్రసంగించినా అమృత ధారా ప్రవాహంగా, మూలాలను తరుస్తూ, చేతిలో పుస్తక సాయం లేకుండానే సంస్కృతాంధ్ర వాఙ్మయంలోని సకల విషయాలను సందర్భోచితంగా వివరిస్తూ తన్మయం చెందిస్తారు. దూరదర్శన్‌లో ధర్మ సందేహాలు తీర్చారు మరో వ్యాసునిలా. రేడియోలో సాహిత్య, ధార్మిక ఆధ్యాత్మిక ప్రసంగాలను లెక్కకు మించి చేశారు. ఏది చేసిన శ్రోతృ పర్వంగా, రమణీయంగా ఉండటం శర్మగారి ప్రసంగ ప్రత్యేకత.

**బిరుదులూ–సత్కార సన్మానాలు**

ఇంతటి విస్తృత పరిశోధన, రచన, ప్రవచనం చేస్తున్న శ్రీ శలాక శర్మగారి విద్వద్వైభవానికి తగిన సత్కారా సన్మానాలు అందుకొన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతి సంస్థలు పోటీ పడి ముందుకొచ్చి వారిని గౌరవించి వాఙ్మయ సరస్వతీ సమార్చన

చేశాయి.

1986లో బెస్ట్ టీచర్ అవార్డ్‌ను ప్రభుత్వం నుంచి పొందటంతో ప్రారంభమైన ఈ పురస్కార వేడుక అప్రతి హతంగా సాగి కవిత్వవేది నారాయణరావు అవార్డ్, పేరాల భరతశర్మ మెమోరియల్ అవార్డ్, భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియలవార్డ్, సద్గురు శ్రీ శివానంద ఎమినెంట్ట్ సిటిజెన్ ప్రైజ్, ఏలూరు గుప్తా అవార్డ్, శ్రీకాకుళం మహతి విశిష్ట సాహితి అవార్డ్, మంత్రాలయం రాఘవేంద్ర స్పెషల్ అవార్డ్, తణుకు శ్రీ నన్నయ భట్టారక పీఠం పురస్కారం, శ్రీ పులికంటి కృష్ణారెడ్డి సాహితీ సత్కీర్తి పురస్కారం, మల్లాప్రగడ శ్రీ రంగరాయ స్మారక పురస్కారం, శృంగేరి శారదాపీఠ పురస్కారం, రాజమహేంద్రవర కళాగౌతమి సన్మాన పురస్కారం, రాజమండ్రి విరించి చారిటీస్ వారి నుండి "సువర్ణ కంకణ ప్రదానం" శ్రీ కంచి కామకోటి పీఠ పురస్కారం, అజో–విభో–కందాళం వారి విశిష్ట సాహితీ మూర్తి పురస్కారం వంటివి ఎన్నో అందుకుని పులకింపజేసేదాకా వచ్చింది. సాహితీ సరస్వతి స్వరూపులు శ్రీ శలాక రఘునాధశర్మ గారు అని నిశ్చయంగా చెప్పవచ్చు. 2015 ఉగాది వేడుకలలో సరసభారతి శ్రీ శర్మ గారిని సగౌరవంగా ఆహ్వానించి మా తలిదండ్రులు కీ.శే.లు గబ్బిట భావానమ్మ, మృత్యుంజయ శాస్త్రి గారల స్మారక పురస్కారాన్ని అందజేసి, వారి సమక్షంలో నా రచన "గీర్వాణ కవుల కవితా గీర్వాణం"ను హైదరాబద్ రేడియో స్టేషన్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మాన్య శ్రీ మంగళగిరి ఆదిత్యప్రసాద్ గారి చేతుల మీదుగా ఆవిష్కరింపజేసి ధన్యులమయ్యాం.

ఒక్కమాటగా చెప్పాలంటే శ్రీ శర్మ గారితో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్. వారికి సరసభారతి రచనలు పంపినప్పుడల్లా ఫోన్ చేసి, అందిందని చెప్పే సంస్కారం వారిది. వారిని శృంగేరి జగద్గురువులు శ్రీ భారతీతీర్థ స్వాముల వారు తరచూ పిలిపించి సంస్కృత కవిసమ్మేళణాలు, ధార్మిక ప్రసంగాలు వారి ఆధ్వర్యంలో జరిపిస్తూ సత్కరిస్తూ సమ్మానిస్తున్నారు. ఇంతటి మహనీయులు శర్మగారు సంస్కృతంలో కూడా యేవో రచనలు చేసి ఉంటారని అనిపించింది. వారి గురించి నెట్‌లో వెదికితే నాకేమీ కనిపించలేదు. తప్పక శర్మ గారి గురించి రాయాలి అనిపించి వారి ముఖత వారి వివరాలు తెలుసుకొందామని నేను నాలుగు రోజుల క్రితం వారు విశాఖలో ఉండగా ఫోన్ ద్వారా ఇంటర్వ్యూ చేసినప్పుడు చాలా ఓపికగా నాకు కొన్ని వివరాలు చెప్పారు. అప్పటికప్పుడు నేను నోట్ చేసేసుకొన్నాను. తమ సంస్కృత రచనలు, సంస్కృత కవిసమ్మేళనాలలో పృచ్ఛకులుగా సంధించిన ప్రశ్నలు, పూరణల వివరాలు త్వరలోనే నాకు పోస్ట్‌లో పంపిస్తామని చెప్పారు. ఈ ఉదయం హైదరాబాద్ నుండి వారి మనుమడిగారి ద్వారా ఇంగ్లీష్‌లో ఉన్నవారి బయోడేటా అంతా మెయిల్‌లో పంపారు. ఈ రచనకు నా ఫోన్ ఇంటర్వ్యూ, వారి బయోడేటా ఈ రెండూ ఆధారం.❀

**397) హరిహరేశ్వర సుప్రభాత కర్త - ధర్మ శాస్త్ర విద్వాన్ - గణపతి పాఠక్ -1941**

శంకర గణపతి పాఠక్ 1940లో కర్ణాటకలో జన్మించాడు. సాహిత్యంలో శిరోమణి, ధర్మ శాస్త్రంలో విద్వాన్. సంస్కృతంలో ఎం.ఏ సంస్కృతంలో శ్రీ హరి హరేశ్వర సుప్రభాతం హరనర్తన, వసంత తిలక ఛందస్సులో 38 శ్లోకాలతో పాటు దండకంతో కావ్యం రాశాడు. కర్ణాటకలోని కారకాలలో ఉన్న హరిహర నాద దైవంపై రాసిన కావ్యమిది. మహారాష్ట్ర నుంచి వచ్చి స్థిరపడిన చిత్పవన బ్రాహ్మణుల గ్రామం ఇది. వేదాధ్యయనానికి బాగా ప్రసిద్ధి. చిత్పవనుల ముఖ్య ఆరాధ్యదైవం హరిహరనాధుడు. సుప్రభాతంలో స్వామి మహిమ ఈ క్షేత్ర మహిమ అంతా కళ్ళకు కట్టినట్లు ఉంటుంది. కవి దీనిని కన్నడంలోకి కూడా అనువదించాడు.❁

**398) తేజస్సంక్రమణం కర్త - గురుపాద హెగ్డే -1941**

గురుపాద హెగ్డే 1941లో మే 18న జన్మించి, సాగర్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి కాలేజిలో విద్యాబోధన చేశాడు. సంస్కృతంలో "తేజస్సంక్రమః" అనే నాటకం, ఆధ్యాత్మ స్తోత్ర మంత్రం భావ గీతం రాశాడు. సంస్కృత సాహిత్య విమర్శగా "శ్లేష సిద్ధాన్తః" మరియు "కన్నడ వాఙ్మయ వికాసే సంస్కృతస్య ప్రభావః" రచించాడు. కొన్ని గీతి కావ్యాలు రాశాడు. కన్నడ రచనలూ చేశాడు. సంస్కృతంలో "పన్ అండ్ శ్లేష ఇన్ సాంస్క్రిట్" రాశాడు. కర్నాటక రాష్ట్ర పురస్కారం పొందాడు. తేజస్సంక్రమః ఏకాంకిక. రామ పరశురామ సంవాదం. రేడియోలో ప్రసారమైంది. అనేక చోట్ల ప్రదర్శింప బడింది. భావగీతాలు హెగ్డే రాసిన భక్తిగీతాలు.❁



## 399) క్షణ విముక్తి నవలాకారుడు - హెచ్ వి నాగరాజారావు -1942

నాగరాజారావు 10-9-1942న కోలారు జిల్లా సోమన హళ్లిలో జన్మించాడు. వెంకట నారాయణప్ప లక్ష్మమ్మ తండ్రీ తల్లి. మైసూర్ సంస్కృత కాలేజి నుంచి వ్యాకరణ, అలంకార శాస్త్రాలలో విద్వాన్ అయి, మైసూర్ యూనివర్సిటి, అమెరికాలోని సియాటిల్ యూనివర్సిటీల నుంచి ఎం.ఏ అయి, మైసూర్ ఓరియెంటల్ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్‌లో సీనియర్ రిసెర్చ్ స్కాలర్ అయ్యాడు. సంస్కృతంలో విదులాపుత్రీయం, సముద్యతా, దాంపత్య కలహం అనే నాటకాలు రాశాడు. బొంబాయ్ భారతీయ విద్యాభవన్ వీటిని ప్రచురించింది. వరన్వేషణం, మాలవి కథ అనే రెండు కథలు కూడా రాశాడు. క్షణ విముక్తి నవల, శారదా దర్శనం అనే యాత్రిక సాహిత్యం, ఉపాఖ్యాన యుగ్మకం అనే వచన రచన, సిద్ధ గంగాయాః సుధా చేతనాఃఅనే సిద్ధ గంగ స్వామీజీ జీవిత చరిత్ర రాశాడు.

వేంకటాధ్వరి సుభాషిత కౌస్తుభం, అన్యాపదేశ శతకం నీలకంఠ దీక్షితుని ఆనందసాగర స్తవంలకు సంపాదకత్వం చేశాడు. వేద వేదాన్గాలపై ఆయన రాసిన పరిశోధనా పత్రాలను బెంగుళూర్ భారతీయ విద్యాభవన్ ప్రచురించింది. హెచ్ ఏం నాయక కన్నడ రచన. నమ్మ మనేయ దీప ''ను''అస్మాకం గృహం దీపఃగా సంస్కృతీకరించాడు. చిన్న కథలు రాసే ప్రసిద్ధ కథకుల చేత కథలు రాయించి “విపంచిక”గా ప్రచురించాడు. అలాగే అప్పయ్య దీక్షితుని వరద రాజస్తవం, నీల కంఠదీక్షితుని రామాయణ సంగ్రహం, రఘు వంశ స్తుతి, గౌరీ శంకరస్వామి భావనా లహరి, శంకరాచార్యుల “శివ పాదాది కేశాంత స్తోత్రం”లను కన్నడీకరించాడు.


శేఖావతీ సంస్కృత యూనివర్సిటి “వేద వ్యాస ప్రశస్తి పురస్కారం అందజేసింది. విజిటింగ్ ప్రొఫెసర్‌గా చికాగో, విస్కాన్సిన్ జెరూసలెం యూనివర్సిటీలకు వెళ్లి బోధించాడు. వరాన్వేషణంలో కట్నాలు ఇవ్వలేక పెళ్లి కొడుకులు దొరక్క తల్లి దండ్రులు పడే బాధలు చూపాడు. ఉద్యోగ పర్వంలోని విదుల అనే ఉత్తమ స్త్రీ కథ “విదులా పుత్రీయం”. వార్తాపత్రికలలో వచ్చే సమకాలీన విషయాలపై రాసింది. “సముద్యతా” భార్యా భర్తల “డిషుం డిషుం” కథ – “దాంపత్య కలహం అన్నమాట”. ఊర్వశి, శకుంతల గురించి ఉపాఖ్యాన యుగ్మకం వచనంలో రాశాడు. ఎవరూ ముట్టుకొని, ఎవరూ రాయని అరుదైన విషయాలపై రాయటం నాగ రాజారావు పత్యేకత.❀



## 400) హర్ష నైషధ చరిత్రకర్త, వ్యాకరణ ఘనాఘనుడు - హరినామ దత్త శాస్త్రి -1943-1985

హర్యానాలో జగద్రి అంటే నేటి హర్యానాలో 1943లో జన్మించి 1915లో 82వ ఏట మరణించిన "చుళికీకృత పాణిని వ్యాకరణ పారావారాన్నిధి" హరనామ దత్త శాస్త్రి. తండ్రి మురారి దత్తు. వారణాసిలో సంస్కృతం చదివి "భాష్యాచార్య" అంటే సంస్కృత భాషాశాస్త్రం వ్యాకరణ శాస్త్రనియమాలను క్షుణ్ణంగా బోధించ గలిగే సామర్థ్యం ఉన్న మహా పండితుడు అయ్యాడు. తరువాత రాజస్థాన్‌లోని "చురు"లో పాణిని వ్యాకరణ బోధనలో మహా నిష్ణాతుడనే పేరు పొందాడు. చూరులో తానే తన తాత గారి పేరుమీద "పండిట్ హరనామ దత్త శాస్త్రి సంస్కృత పాఠశాల" నిర్మించి పాణిని వ్యాకరణ బోధనకు ప్రాశస్త్యం తెచ్చాడు. ఆయన శిష్యులలో ప్రసిద్ధమైనవారు శ్రీ గిరిధర్ శర్మ చతుర్వేది, విద్యావాచస్పతి బాలచంద్ర జి, పండిట్ రామానంద జీ మహా రాజ్, పండిట్ జైదేవ్ జి మిశ్ర, పండిట్ విలాస రాయ్ జీ ఉన్నారు.

తాత హరనాథ దత్త జీవిత విశేషాలపై పై శిష్యుడు విద్యా వాచస్పతి విద్యాధర శాస్త్రి "హరనామామృతం" అనే సంస్కృత మహాకావ్యం రచించాడు. ఆధునిక సంస్కృత కావ్యం ఎలా ఉండాలో కవి తన రచన ద్వారా తెలియజేశాడు. ఇందులో 16 కాండలున్నాయి. ఆయన జీవిత విశేషాలు, యాత్రలు, పాఠశాల స్థాపన, విద్యా వ్యాప్తి, సంస్కృతీ సంప్రదాయ పరిరక్షణం వగైరాలు చాలా కవితాత్మకంగా వర్ణించాడు కవి.❀





## 401) హస్మత్ చంపుకర్త, పంచ భాషా కవితావల్లభ - ఆర్యార్ శ్రీరామ శర్మ -1943

కర్నాటకలోని మెల్కోటేలో ఆర్యార్ శ్రీరామశర్మ 1943 ఆగస్ట్ 28 జన్మించాడు. తండ్రి శ్రీనివాస అయ్యంగార్. సాహిత్య, న్యాయ, విశిష్టాద్వైతాలలో ఎం.ఏ మెల్కోటే సంస్కృత కాలేజి ప్రిన్సిపాల్ పంచ భాషా కవితా వల్లభ, బిరుదు సంస్కృత ప్రాకృత కన్నడ తమిళ హిందీ భాషలలో రచనలు చేయటం వలన పొందాడు. సంస్కృతంలో అస్మత్ చంపు కథా కదంబకం కథా సాహిత్యం గాలి శతకం, పాంచ జన్య శతకం ప్రకీర్ణ కల్లోలిని హంస ప్రతి సందేశః, క్షుద్రకాంత, క్షుద్ర కాదంబరి శ్రీ విజయ ధ్వని మొదలైనవి రాశాడు.

సంస్కృత విమర్శన గ్రంథాలుగా సంస్కృత కథా ప్రబంధం, శాస్త్ర ప్రబంధం, లఘుకావ్య ప్రబంధం, సంశోధన ప్రబంధం విమర్శన ప్రబంధం, ధ్యాని ప్రబంధం ఇతిహాస ప్రబంధం, సాహిత్య మాత్రిక రాశాడు. ప్రాకృతంలో ప్రాకృత ముక్త వచయ, ప్రాకృత పుష్పా పచయః రాశాడు. ప్రాకృతంలో విశ్లేషణాత్మక విమర్శనాత్మక రచనలూ చేశాడు. రాజ శేఖరుని కావ్య మీమాంసను కన్నడీకరించాడు. కన్నడంలో విస్తృత కవితలు వ్యాసాలూ రాశాడు. పింగళ భారత, రహస్య రత్నమాల మొదలైన తమిళ రచనలు, హిందీలో చాలా వ్యాసాలూ రాసి సంపుటులుగా తెచ్చాడు.

కావ్య కల్లోలిని స్వయం సంస్కృత కవితలు వాటిని 7 కల్లోలాలు అంటే 7 అధ్యాయాలు-మంగళ, వస్తు గీత, కథ, సంస్కృత, శృతి, ప్రకీర్ణ కల్లోలాలుగా విడగొట్టాడు వీటిని శృంగారం అంగారం దేశభక్తి సమకాలీనత, ఆధ్యాత్మికత, హాస్యం అన్నీ రంగరించి రాసినవి. అస్మత్ చంపులో సాంప్రదాయత ఆధునికత జోడించాడు. రామానుజాచార్యుల జీవితం, విశిష్టాద్వైత మత విషయాలున్నాయి. చివరిది "నిద్రా వైభవం"లో విష్ణుమూర్తి దశావతారాలు వివిధ భంగిమలు వర్ణిస్తూ మానవుని మేల్కొలపటానికి జాగృత పరచటానికి రాశాడు. ❋



## 402) అంకపదీయ కర్త - నిశ్చలానందసరస్వతి -1943

ఋగ్వేద భూమికపై ఏర్పడిన పూరీ గోవర్ధన పశ్చిమ ఆమ్నాయ పీఠాధిపతి శ్రీ భారతి కృష్ణ తీర్థ మహారాజ్ పూర్వాశ్రమంలో "ఫాదర్ ఆఫ్ వేదిక్ మాథేమాటిక్స్"గా పేరు పొందారు. 1925లో పూరీ పీఠాధిపతి అయ్యారు. అప్పటినుంచి ఈ పీఠం వేద గణితానికి ప్రాముఖ్యం పొందింది.

వీరి తరువాత పీఠాధిపత్యం వహించిన శ్రీ నిశ్చలానంద సరస్వతి కూడా గొప్ప గణిత శాస్త్రవేత్త. వేదగణితంపై 7 ఉద్గ్రంథాలు 1-అంకపదీయం, 2-స్వస్తిక గణితం, 3-గణిత దర్పణం మొదలైనవి రాశారు. వేదిక మాథ్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియాకు వీరి ఆశీస్సులున్నాయి.

1943లో ఉత్తర భారతంలో హరిపూర్ భిక్షాటల్‌లో "నీలాంబర్"గా జన్మించి, లెక్కలు సైన్స్ సంస్కృతాలు చదివి, 16వ ఏట ఆధ్యాత్మిక మార్గాన్ని పట్టి, ఢిల్లీ వెళ్లి జ్యోతిర్మఠ శంకరాచార్యులవారివద్ద దీక్ష పొంది "ధ్రువ చైతన్య" దీక్షానామం పొందారు. 1970లో దేశ సంచారం చేస్తూ అనేక క్షేత్ర సందర్శనం చేసి, ఆత్మ జ్ఞానం పొంది, 1974లో నిశ్చ లానంద స్వామి నామధారులయ్యారు. వేదోపనిషత్తులను గణిత శాస్త్రాలను లోతుగా అధ్యయనం చేశారు. వీరి జ్ఞాన పరాకాష్టకు వీరిని 1994లో పూరీ గోవర్ధన పీఠ 145వ శంకరాచార్యులుగా ప్రతిస్థాపనం చేశారు. అప్పటినుంచి దేశ సంచారం చేస్తూ వేద ప్రాశస్త్యాన్ని భారతదేశ సమైక్యతను బోధిస్తున్నారు.❋



## 403) ముస్లిం మహిళకు వేదాంత మార్గదర్శి – డా.ఆర్.గంగాధర నాయర్ –1946

2–10–1946న కేరళలోని వజూర్‌లో జన్మించిన గంగాధర నాయర్ సంస్కృత పండిత వంశం వాడు. తండ్రి స్వాతంత్ర సమర యోధుడు, సంస్కృత విద్వాంసుడు దేశీయ వైద్యుడు అయిన వి.కె.గోపాల పిళ్లే. నాయర్ చత్తంపి స్వామికల్ ప్రశిష్యుడైన స్వామి విద్యానంద తీర్థ పాద వద్ద సంప్రదాయ పద్ధతిలో సంస్కృత వ్యాకరణం నేర్చాడు. సంస్కృత వ్యాకరణాన్ని ఇటు ఓరియెంటల్, అటు పాశ్చాత్య విధానం రెండిటిలోనూ తిరువనంతపురంలోని ప్రభుత్వ సంస్కృత కళాశాలలోను, కేరళ యూనివర్సిటిలోను అధ్యయనం చేశాడు. కేరళ యూనివర్సిటిలోని రష్యన్ డిపార్ట్‌మెంట్ ద్వారా రష్యన్ భాషా సాహిత్యంపై మాస్టర్ డిగ్రీ పొందాడు. ప్రొఫెసర్ ఎం.ఎస్.శాస్త్రి ఆయన గురువు. గురువు తర్వాత నాయర్ ప్రభుత్వ సంస్కృత కళాశాల ప్రొఫెసర్ అయ్యాడు. ప్రొఫెసర్ వెంకట సుబ్రహ్మణ్య అయ్యర్, డా.ఆర్ కరుణాకరన్‌ల వద్ద సంస్కృతంలో ప్రాచీన సంస్కృత శబ్ద వ్యుత్పత్తి శాస్త్ర గ్రంథాలలోని “ఊనాది సూత్రాల”పై పరిశోధన చేసి పి.హెచ్‌డి అందుకున్నాడు.

కాలడిలోని శ్రీ శంకరాచార్య సంస్కృత విశ్వవిద్యాలయం సంస్కృత వ్యాకరణ విభాగం అధిపతిగా, ప్లానింగ్ అండ్ డెవలప్ మెంట్ శాఖ డైరెక్టర్‌గా పని చేశాడు. కొచ్చిన్ యూనివర్సిటి సైన్స్ అండ్ టెక్నాలజీ సెనేట్ మెంబర్‌గా, తిరుపతి రాష్ట్రీయ సంస్కృత యూనివర్సిటి సెనేట్ మెంబర్‌గా కూడా ఉన్నాడు. మధ్యప్రదేశ్‌లోని రేవాలో ఉన్న ఓరియెంటల్ స్టడీస్ ఆఫ్ ఏ.పి.సింగ్ యూని వర్సిటి ఫాకల్టి ఎక్సర్ట్ మెంబర్‌గా పని చేశాడు. కలకత్తాలోని రవీంద్ర భారతి యూనివర్సిటి డి.ఆర్.ఎస్.ప్రోగ్రాముల సలహా సంఘానికి యు జి సి నామినేట్ సభ్యుడు. కాలడి సంస్కృత యూనివర్సిటి డీన్‌గా పని చేసి రిటైర్ అయ్యాడు. కొచ్చిన్‌లోని సుక్రుతీంద్ర ఓరియెంటల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అకాడెమిక్ కౌన్సిల్ చైర్మన్. దాని మేగజైన్‌కు సంపాదకుడు. పురాతన సంస్కృత పత్రాల విశ్లేషణలో అవిశ్రాంతంగా విశేష కృషి చేసి ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందినవాడు గంగాధర నాయర్. నారాయణ భట్టపై పాణినీయేతర ప్రభావం అన్న ఆయన విశ్లేషణాత్మక వివరణాత్మక పరిశోధన పెద్ద గుర్తింపు తెచ్చింది. ఇది పాణిని

వ్యాకరణ అధ్యయనానికి కొత్త దారులు చూపింది.

కాలడి యూనివర్సిటీలో రిటైర్ అయ్యాక నాయర్ ప్రపంచ వ్యాప్తంగా సంస్కృతాన్ని వాడుక భాషగా మలచటానికి తీవ్ర కృషి చేస్తున్నాడు. ఇండియా అమెరికాల యూనివర్సిటీలలో విస్తృతంగా పర్యటించి ప్రసంగాలు చేస్తూ సంస్కృతాన్ని జీవద్భాషగా, ప్రజలు మాట్లాడుకొనే భాషగా మార్చటానికి సర్వశక్తులు ధార పోస్తున్న సంస్కృతాభిమాని నాయర్. తాను పదవిలో ఉండగా ఎంతో ధైర్యంతో ఒక ముస్లిం మహిళ శ్రీమతి ఫాతిమా బీవికు భారతీయ వేదాంతంలో పి.హెచ్‌డి పొందటానికి రిసెర్చ్ గైడ్‌గా నాయర్ ఉండి అందరి అభిమానాన్ని పొందాడు.❁



## 404) 7వ శతాబ్ది మహా కావ్య పరిశోధకుడు – రహస్ బిహారీ ద్వివేది – 1947

2-1-1947న ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో జన్మించిన రహస్ బిహారీ ద్వివేది సంస్కృతంలో ఆచార్య (ఎం.ఏ) సాహిత్య రత్న, ఎం.లిట్ డిగ్రీలు పొందాడు. 1960లో వచ్చిన సంస్కృత ఇతిహాస పద్యాల (ఎపిక్ పోయెమ్స్)పై పరిశోధన చేసి జబల్పూర్ రాణి దుర్గావతి యూనివర్సిటి నుండి 1977లో పి.హెచ్‌డి అందుకొన్నాడు. తరువాత జబల్ పూర్ యూనివర్సిటిలో సంస్కృత ఆచార్యునిగా చేరి, తన సర్వీస్ కాలంలో 16 మందికి డాక్టోరల్ డిగ్రీ సాధించటానికి మార్గదర్శకం వహించాడు. విద్యా తృష్ణ తీరక "విద్యా వాచస్పతి" డిగ్రీని కూడా అందుకొన్నాడు.

సంస్కృత, హిందీ, ఇంగ్లీష్ భాషలలో చాలా గ్రంథాలు రాశాడు. వివిధ అంశాలపై 50కి పైగా పరిశోధనా పత్రాలను రచించాడు. ముఖ్యమైన రచనలు– 1-సంస్కృత మహాకావ్యోం కా సమలోచానాత్మక్ అధ్యయన్ అంటే 7వ శతాబ్ది సంస్కృత మహాకావ్యాలపై విశ్లేషణాత్మక పరిశోధన, 2-పి హెచ్ డికోసం రాసిన దీసీస్ "1947-1970 కాలంలోని సంస్కృత ఇతిహాస పద్యాలు"లో 156 శ్లోకాలను ఉదాహరించాడు. 3-అర్వాచీన సంస్కృత మహాకావ్యాను శీలనం. అంటే ఆధునిక సంస్కృత ఇతిహాసాల సమీక్ష అనే 134 పేజీల రచన. 4-సాహిత్య విమర్శ (రిసెర్చ్ పత్రాల సంపుటి). 5-స్వస్తి సందేశ్. 6-స్వరిత సందేశ్. 7-సంస్కృత వాణి మయే విజ్ఞాన్. 8-తీర్ధ భారతం (భారతీయ యాత్రా స్థలాలపై కవిత్వం)

రహస బిహారీ ద్వివేదికి 2012లో సంస్కృత సేవకు భారత రాష్ట్రపతి గౌరవ పురస్కారం అందజేశారు. 2016లో ఉత్తర ప్రదేశ్ సంస్కృత సంస్థాన్ "వాల్మీకి పురస్కారం" అందజేసి సత్కరించింది.❁



## 405) వేదగణిత గ్రంథకర్త - డా. రేమెళ్ళ అవధానులు -1948

భారతీయ భాషలను మొట్టమొదట కంప్యూటరీకించి, వేదాలనూ కంప్యూటరైజ్ చేసిన భారతీయ మేధావి డా. శ్రీ రేమెళ్ళ అవధానులు. యజుర్వేద సంహితలో టు టు ది పవర్ ఆఫ్ 19 వరకు అంకెల ప్రస్తావన ఉంది. దీన్ని "లోక" అంటారు. వాల్మీకి రామాయణంలో "మహౌమ" ఉంది అంటే పది టు ది పవర్ ఆఫ్ 62. పైథాగరస్ కనిపెట్టాడని చెప్పుకొంటున్న లంబ కోణ త్రిభుజ సూత్రం బోధాయన "శుల్బ సూత్రాలలో" ఉంది. "ఇన్ఫినిటీ" గురించి "పూర్ణ మదః పూర్ణ మిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే" శ్లోకంలో ఎప్పుడో మనవాళ్ళు చెప్పారు. హైడ్రోజెన్ ఐసోటోపుల ప్రస్తావన కృష్ణ యజుర్వేదంలో కనిపిస్తుంది. ఏకతాయ స్వాహా ద్వితాయా స్వాహా త్రితాయా స్వాహా"లోని ద్వితా డ్యుటీరియం, త్రిథా ట్రిటీనీయంగా మార్చి నట్లు అనిపిస్తుంది. ట్రిగనా మెట్రీని అందరికంటే ముందుకనుక్కొని, ఆర్య భట్టు వరాహమిహిరుడు సైన్, కాస్‌ల విలువలను ముందే చెప్పారు. "స్టీమ్" అనే పదం పాణిని అష్టాధ్యాయిలో ఉంది. "స్టీమ అర్జీ భావే" అంటే ఆవిరి అవటం. న్యూటన్ కంటే ముందే గురుత్వాకర్షణ శక్తిని భాస్కరాచార్యుడు 12వ శతాబ్దంలో తన "సిద్ధాంత శిరోమణి"లో భూమ్యాకర్షణ శక్తిగా చెప్పాడు. ఆధునిక భౌతిక రసాయన వైద్య వైమానిక శాస్త్రాలలో ఉన్న సమాచారం అంతా వేదాల్లో నిక్షిప్తమై ఉంది. అందుకే "అన్నీ వేదాల్లోనే ఉన్నాయష" అనే సామెత వచ్చింది. "ఇది వెటకారం కాదు పచ్చినిజం" అంటారు అవధానులు గారు.

తనకు మంత్రాలపై మంచి అవగాహన ఉండేదని, కానీ పరమాణు భౌతిక శాస్త్రంలో ఏం ఎస్ సి చేశానని చెప్పారు. అప్పుడే ఒక ప్రయివేట్ కంపెనీ మొదటిసారిగా కంప్యూటర్ కోర్సు ప్రకటన చేసిందని, అందులో చేరి డిప్లొమా పొంది, తర్వాత రాజోలు కాలేజీ ఫిజిక్స్ లెక్చరర్‌గా పని చేస్తూ సాయం కాలలలో ప్రక్కనే ఉన్న వేద పాఠ శాలలో వేదం నేర్చుకొంటూ, 1971లో హైదరాబాద్‌లో యి.సి.ఐ.ఎల్.లో టెక్నికల్ ఆఫీసర్‌గా చేరి పని చేశారు. మన దేశంలో మొదట కంప్యూటర్ తయారు చేసింది ఈ కంపెనీయే. ఇక్కడ శిక్షణలో ఉన్నప్పుడు కొన్ని పుస్తకాలు చదువుతుంటే ఏ ప్లస్ బి హోల్ స్క్వేర్ చరిత్ర కనిపించింది. దీన్ని 3 వేల సంవత్సరాల క్రితమే భారతీయులు కనుక్కొన్నట్లు తెలిసి ప్రాచీన గ్రంథాలపై ఆసక్తి పెరిగిందట. ఇక్కడ పని చేస్తూకూడా వేదం

నేర్చుకొంటూ, అప్పటికి ఏ భారతీయ భాషా కంప్యూటరీకరించ బడలేదని గ్రహించి మొదటగా తెలుగును కంప్యూటరీకించాలన్న ఆలోచనవచ్చి ఆయన స్నేహితులతో కలిసి 6 నెలలు శ్రమించి తెలుగు అక్షరాలను కంప్యూటర్‌లోకి ఎక్కించారు. ఇలా 1976లో భారతీయ భాషలలో తెలుగు భాష ఒక్కటే మొట్టమొదటిసారిగా కంప్యూటరైజ్ అయి అవధానులు బృందానికి ఘనకీర్తి నిచ్చింది. అప్పటి అధికార భాషా సంఘం అధ్యక్షులు శ్రీ వావిలాల గోపాల క్రష్ణయ్య గారు కంపెనీకి వచ్చి అభినందించారట. కానీ ఆఫీసు వారి ప్రోత్సాహం కరువై ముందుకు సాగలేదన్నారు.

తెలుగు కంప్యూటర్‌లోకి ఎక్కిందన్న సంచలన వార్త పార్లమెంట్‌ను కుదిపేసి, హిందీని కూడా చేర్చమని కంపెనీ అధికారులపై ఒత్తిడి వస్తే, అవధానులు బృందం దాన్నీ ఎక్కించారు. పార్లమెంటరీ కమిటీ వచ్చి చూసి సంతృప్తి చెంది అభినందించింది. 1978లో ఢిల్లీలో "భారతీయ భాషల కంప్యూటీకరణ" అనే అంశంపై సదస్సు నిర్వహించారు, కానీ ప్రోత్సాహం కరువై ఆగిపోయింది. 1991లో నిమ్స్‌లో పని చేస్తున్నప్పుడు గోదావరి పుష్కరాలలో తిరుమల దేవస్థానం గ్రంథాలు చదివి 1131 వేదం శాఖలకు కేవలం 7 శాఖలే మిగిలాయని చదివి అశ్రద్ధ చేస్తే ఇవి కూడా త్వరలోనే అంతరించిపోతాయేమోననే భయమేసి ఎలా రక్షించుకోవాలన్నా ఆలోచనవచ్చి రికార్డ్ చేయిస్తే అంచిదనిపించి, యజుర్వేదం నేర్చుకొంటూ, మరీ ప్రమాదలో పడిపోయిన ఋగ్వేదం నేర్చిన వారెవరైనా ఉన్నారేమోనని అన్వేషణ చేస్తూ, మహారాష్ట్రలో ఒకాయన ఉన్నారని తెలిసి కుటుంబ సమేతంగా ఆహ్వానించి పోషణ బాధ్యత తీసుకొని వారితో ఋగ్వేదాన్ని 1992లో రికార్డ్ చేయించటం ప్రారంభించారు.

అదే సమయంలో తిరుపతి దేవస్థానం వారు "అఖిల భారత వేద శాస్త్ర సమ్మేళనం" నిర్వహిస్తున్నప్పుడు తనను వేదాలపై ఒక ప్రదర్శన ఇవ్వమని కోరగా "నమకం"లోని మూడుమంత్రాలను వాటి అర్థాలను సి లాంగ్వేజ్ సాయంతో కంప్యూటర్‌లో పెట్టగా దాన్ని చూసిన ఉపరాష్ట్రపతి శ్రీ శంకర దయాళ్ శర్మ అవధానులుగారిని మనస్ఫూర్తిగా అభినందించి తనకు 10 నిమిషాల సమయాన్ని మాత్రమే ఇచ్చినా, శర్మగారు 45 నిమిషాలుదాకా మాట్లాడి ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా వేదాలను కంప్యూటర్‌లో పెట్టిన ఈ విలువైన ప్రాజెక్ట్‌ను పూర్తి చేయమని కోరారు. కంప్యూటర్ కొనాలంటే లక్షల మీద ఖర్చు. దీనికి అశ్విని హెయిర్ ఆయిల్ అధినేత సుబ్బారావు గారు వెంటనే ఒక లక్షా ఇరవై వేల రూపాయలు ఉచితంగా ఉదారంగా అందజేయగా అవధానులుగారు అత్యాధునిక కంప్యూటర్ కొన్నారు. పని చేయటానికి కుర్రాళ్ళు కావాలి వాళ్లకు జీతాలు తన జీతంలో నుంచి ఇచ్చేవారు. తానూ వారితో పంచేస్తూ "వేద భారతి ట్రస్ట్" ఏర్పాటు చేయగా విరాళాలు అంది పని నిరాటంకంగా సాగింది. 1995 వేదానుక్రమణిక రాస్సారు. ఈ విషయాలు తెలుసుకొన్న రాష్ట్రపతి శ్రీ శంకర

దయాళ్ శర్మ ఢిల్లీకి ఆహ్వానించారు. యజుర్వేదానికి చెందిన 7 అనుక్రమణికలు కంప్యూటరీకించి, దేశంలోనే మొదటిసారి మల్టీ మీడియాలో ఆయనకు చూపించారు. ఆయన మహా గొప్పగా ఆనందించి అభినందించారు. 2000 నాటికి ఋగ్వేదాన్ని సి డి లలో పొందుపరచారు. వీటిని ప్రధాని శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయీ ఆవిష్కరిస్తూ "మా చిరకాల స్వప్నం సాకారమైంది" అని మెచ్చుకొన్నారు.

బెంగుళూరులో వైదిక సరస్సు జరుగుతుంటే పాల్గొనాలని వెడితే తనకు ఏ శాస్త్రంలోను ప్రవేశం లేదుకనుక అనుమతి లేదని చెబితే పట్టుబట్టి రాజమండ్రి ఓరియంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ అయిన తన బాబాయి శ్రీ రేమెళ్ళ సూర్య ప్రకాశ శాస్త్రిగారి వద్ద మీమాంస శాస్త్రం నేర్చుకొన్నారు. తర్వాత సంస్కృతం జ్యోతిషంలలో ఎం.ఏ చేసి, "వేదాలలో సైన్సు, భూకంపాలు-జ్యోతిషం"లపై పి.హెచ్‌డి చేసి, వేదగణితం వేద విజ్ఞానాలపై చానళ్లలో కార్యక్రమాలు చేశారు. అవధానులుగారు చేసిన "మల్టీ మీడియా వేదిక డేటా బేసిక్ డిజైన్"కు భారత ప్రభుత్వం పేటెంట్ హక్కునిచి "సంస్కృత మిత్ర" బిరుదుతో సత్కరించింది.

వేద భారతి ట్రస్ట్ ద్వారా ఇప్పటికి 700కు పైగా గంటల రికార్డ్ పూర్తయింది. ఇది 200కుపైగా ఆడియో మల్టీమీడియా సిడిలుగా తెచ్చి ప్రజలకు అందుబాటులో ఉంచారు. మిగిలిన వేద శబ్దాన్ని రికార్డ్ చేయటానికి ఇంకా 2500 గంటలు కావాల్సి వస్తుందన్నారు. అంత ఆర్థిక స్తోమత తమకు లేదని వదాన్యులు ముందుకు వచ్చి ప్రోత్సహించి వేద విజ్ఞానాన్ని సంరక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అవధానులుగారు "వేద గణితం, రామాయణ భాగవత భారతాలలో జ్యోతిశ్శాస్త్ర విశేషాలు, ఉపనిషత్ రత్నావళి, సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్ వేదాస్ అండ్ శాస్త్రాస్" గ్రంథాలు రాశారు. ఇంట గొప్ప పరిశోధకులు క్రియాశీలి వేద గణితంపై అధారిటీ అయినా శ్రీ అవధానులు గారి గురించి ఇంత ఆలస్యంగా గీర్వాణ కవుల కవితా గీర్వాణంలో రాయటం క్షమించరాని నేరమే. అయినా ఇప్పటికైనా రాయగలిగా నని ఒక ప్రక్క సంతోషిస్తున్నాను.

అవధానులుగారు 25-9-1948న తూర్పుగోదావరి పొగడపల్లిలో జన్మించారు. తండ్రి శ్రీ వి.సూర్యనారాయణ, తల్లి శ్రీమతి లక్ష్మీ నరసమ్మ.

మేము అమెరికా నుంచి రాగానే అక్టోబర్ 8 ఆదివారం సాయంత్రం అవధానులుగారి దర్శనానికి వెళ్లాం. ఎంతో సహృదయతతో ఆహ్వానించారు. మన గీర్వాణం-2 మొదలైన గ్రంథాలు వారికి అందజేసి నూతన వస్త్రాలు సమర్పించాను. వారు తాము తిరుపతి దేవస్థానం ఆధిక సాయంతో ప్రచురించిన రెండు భాగాల "భారతీయ గణిత జ్యోతిష శాస్త్ర చరిత్ర" అనే అమూల్య మైన రిసెర్చ్ ఉద్గ్రంథాలను కానుకగా ఇచ్చారు. నిత్య కృషీవలురు అవధానులుగారు వారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నవంబర్ 10, 11, 12 తేదీలలో అఖిలభారత సంస్కృత సెమినార్ నిర్వహించారు. ❁




## 406) చార్వాక లోకాయత కర్త - రామ కృష్ణ భట్టాచార్య -1947

10-12-1947న కలకత్తాలో జన్మించిన రామకృష్ణ భట్టాచార్య కలకత్తా యూనివర్సిటిలో చదివి ఇంగ్లీష్‌లో బి.ఏ ,ఎం. ఏ, పి.హెచ్‌డిలను 1966, 68, 1986లలో పాసైనాడు. ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్‌లో రీడర్‌గా ఆనంద మోహన్ కాలేజిలో చేరి 31-12-2007న రిటైర్ అయ్యాడు. ఇంగ్లీష్‌లో ఎమిరిటస్ ఫెలో, యూనివర్సిటి గ్రాంట్స్ కమిషన్ సభ్యుడు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలసాఫికల్ రిసెర్చ్‌కు విజిటింగ్ ప్రొఫెసర్. ప్రస్తుతం కలకత్తా పావ్ లోవ్ ఇన్ స్టిట్యూట్ ఫెలోగా ఉన్నాడు.

8వ శతాబ్ది నుండి 12 వ శతాబ్ది వరకు ఉన్న చార్వాక లేక లోకాయత భౌతిక వాదంపై శాస్త్రీయ పరిశోధన చేసి, దాని కనుమరుగుకు కారణాలు అన్వేషించి తెలియజేశాడు. చార్వాకంలో మత భేదాలు చాలా ఉన్నప్పటికీ అవగాహన విషయంలో అందరిదీ ఏకాభిప్రాయమే అని రుజువు చేశాడు. చార్వాకు లందరూ ఇంద్రియ వాదులు అనే అభిప్రాయం తప్పు అని సాదికారికంగా రుజువు చేశాడు. చార్వాకమతానికి ముందుకూడా ఈ భావనలు ఇండియాలో ఉన్నాయని, కాని దానిపైనే చార్వాకం వృద్ధి చెందింది అని చెప్పటానికి ఆధారాలు లేవని వివరించాడు. మణిమేఖలలో దొరికిన ఆధారాలను బట్టి మహా భారతంలో అప్రత్యక్షంగా చెప్పబడిన విషయాలను బట్టి ఈ రెండు వ్యవస్థలు ఒకేసారి ఏర్పడి ఉంటాయని భావించాడు.

భట్టాచార్య ఇంగ్లీష్‌లో "గ్రౌండ్స్ ఫర్ హోప్, స్టడీస్ ఆన్ ది చార్వాక, ఎమేర్జెంస్ ఆఫ్ మెటీరియలిజం ఇన్ ఇండియా" గ్రంథాలు రాశాడు బెంగాలీలో 20 దాక పుస్తకాలూ రాశాడు. చార్వాకంపై 25 దాకా వ్యాసాలూ రాసి ప్రచురించాడు. 8 పుస్తకాలకు సంపాదకత్వం వహించాడు.❁



## 407) సంజ్ఞానామవాచక పరిశోధన కర్త – సమీరన్ చంద్ర చక్రవర్తి – 1950

భారతీయ భాషా పరిశోధకుడు, సంజ్ఞా నామవాచాకాలపై (ఓమాస్టిక్స్) విశేష కృషి చేసిన సమీరన్ చంద్ర చక్రవర్తి బెంగాల్‌లో జన్మించాడు. వేదాధ్యయనంపై నాపరిశోధన చేసిన సంపాదకుడు. ప్రస్తుతం కలకత్తా యూనివర్సిటిలో ఎమిరిటస్ ఫెలోగా, జర్మన్ గెస్ట్ లెక్చరర్‌గా ఉన్నాడు. రామకృష్ణ మిషన్ ఇన్‌స్టిట్యూట్ సెంటర్ ఫర్ ఇండలాజికల్ స్టడీస్ అండ్ రిసెర్చ్‌కు గౌరవ విజిటింగ్ ప్రొఫెసర్. రవీంద్ర భారతి యూనివర్సిటిలో స్కూల్ ఆఫ్ వేదిక్ స్టడీస్‌లో మాజీ రిటైర్డ్ డైరెక్టర్ అండ్ ప్రొఫెసర్. ఆపస్తంభ సామాన్య సూత్రలేక యజ్ఞ పరిభాష సూత్రను, బ్రాహ్మణ సంగ్రహంను రాశాడు. ఆంగ్లంలో "సం ఆస్పెక్ట్స్ ఆఫ్ వేదిక్ కల్చర్, బుద్ధిజం అండ్ వరల్డ్ కల్చర్, ఏ స్టడీఆఫ్ పరిప్లవ, ది పరిభాషాస్ ఇన్ అశ్రౌత సూత్రాస్, ఆన్ ది ట్రాన్స్ లేషన్ ఆఫ్ వేదిక్ సాక్రిఫిసియల్ లోర్, ది పొజిషన్ ఆఫ్ ది పరిభాషాస్ ఇన్ ది టెస్ట్యువల్ ఆర్డర్ ఆఫ్ ది ఆపస్థంభ సూత్రాస్ మొదలైన గ్రంథాలు రచించాడు.

సంస్కృత విద్యా చక్రవర్తి అయిన సమీరన్ చంద్ర చక్రవర్తి గ్రిఫ్ఫిత్ మెమోరియల్ అవార్డ్, రాష్ట్రీయవేద విద్యా ప్రతిస్టాన్ పురస్కారం, ఇంటర్నేషనల్ పెంగ్విన్ పబ్లిషింగ్ హౌస్ నుంచి "రైజింగ్ పర్సనాలిటి" అవార్డ్, కలకత్తా భారతీయ విద్యా భవన్ నుండి సాంస్క్రిట్ దే అవార్డ్, 2009లో రాష్ట్ర పతి పురస్కారం, బొంబాయి భారతీయ విద్యాభవన్ నుంచి గురు గంగేశ్వరానంద వేద రత్న పురస్కారం అందుకొన్నాడు.❀



## 408) రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ వైస్ ఛాన్సలర్ – డా. వెంపటి కుటుంబ శాస్త్రి –1950

1950లో జన్మించిన వెంపటి కుటుంబ శాస్త్రి మహా భారతీయ విద్యావేత్త. 2003 నుంచి 2008 వరకు భారతీయ సంస్కృత సంస్థాన్‌కు వైస్ చాన్సలర్‌గా పని చేసిన సర్వ సమర్ధుడు. అంతర్జాతీయ సంస్కృత అధ్యయన సంస్థకు అధ్యక్షుడు. 15వ ప్రపంచ సంస్కృత మహాసభ నిర్వహణ కమిటీ సభ్యుడు. "వైదర్ అసోసియేషన్ ఆఫ్ వేదిక్ స్టడీస్" గవర్నింగ్ బోర్డ్ మెంబర్ కూడా. టోరినో నుండి ప్రచురింపబడే "ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాంస్క్రిట్ స్టడీస్ జర్నల్‌కు "ఇండో లాజికా టార్నీషియా" సంపాదక వర్గంలో ఉన్నాడు. భారతీయ వేదాంతంపై విపరీతమైన అభిమానం. అందులో అద్వైత వేదాంతం అంటే మహా ఇష్టం. సంస్కృత మహాకావ్యాలపై మహా అభిమానం. లెక్కలేనన్ని మోనో గ్రాఫులు, ఆంథాలజీలు రాశాడు. అద్వైత వేదాంతంపై ఎన్నో పరిశోధన పత్రాలు రాసి సమర్పించాడు. భారత దేశంలోని అనేక రాష్ట్రాలు శ్రీ శాస్త్రిని ఆహ్వానించి ప్రసంగాలు చేయించి బిరుద ప్రదానం చేసి సత్కరించాయి. కెనడాలోని విండ్సర్ యూనివర్సిటి శాస్త్రి గారి సంస్కృత భాషావ్యాప్తికి చేసిన కృషికి పురస్కారం అందజేసింది.

ఇంతకంటే ఈ మహానుభావుని గురించి వివరాలు తెలియలేదు. బహుశా వీరు కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందినవారు. వారు కాళిదాస మహాకావ్యాలపై సంస్కృతంలో చేసిన ప్రసంగాలు యుట్యూబ్‌లో చూసి ఆనందించవచ్చు. శాస్త్రి గారు గుజరాత్ రాష్ట్రంలో వేరావల్‌లో ఉన్న శ్రీ సోమనాద్ సంస్కృత విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్‌గా పని చేసి రిటర్ అయి ఢిల్లీలో ఉంటున్నారు. 2017 మార్చిలో విజయవాడ శివరామ క్షేత్రంలో జరిగిన బ్రహ్మశ్రీ మద్దులపల్లి మాణిక్య శాస్త్రి గారి శత జయంతి చివరి రోజు కార్యక్రమంలో వారిని చూసే భాగ్యం కలిగింది సంప్రదాయ వేషధారణ, పిలకతో ఆయన అనిపించి ఆశ్చర్యపరచారు గొప్ప ప్రసంగం చేసి ప్రేరణ కలిగించారు. ఈ సభలోనే న్యాయ రత్న బ్రహ్మశ్రీ గబ్బిట ఆంజనేయ శాస్త్రి గారు గీర్వాణం–2లో నేను మద్దులపల్లివారిపైనా, గబ్బిట వారిపైనా వ్రాసిన వ్యాసాలతో ఒక కరదీపిక

ఉయ్యూరులోనే తయారు చేయించి మద్దులపల్లి వారికి అంకితమిచ్చి గురు భక్తిని చాటారు. ఇందులో ఉడతాభక్తిగా నేనూ సాయపడినందుకు ఆనందంగా ఉంది. ఆ సభలో మద్దులపల్లి వారిపై గురుభక్తిగా ప్రసంగించిన ప్రముఖుల ప్రసంగాలనన్ని తిని కలిపి ఒక అమూల్య గ్రంథంగా తీసుకొస్తే బాగుంటుంది అని సభలో నేను తెలియజేశాను.❁

## 409) శివానంద విలాస మహా కావ్య కర్త – రామ కృష్ణ భట్టు –1950

వెంకమ్మ, కృష్ణ భట్టులకు మంగుళూరు వద్ద కుంబ్లాలో రామ క్రష్ణభట్టు జన్మించాడు. ఢిల్లీ హిందూ కాలేజీలో సంస్కృత ప్రొఫెసర్‌గా ఉన్నాడు. విద్యాభాస్కర విద్యాసాగర కవితా చతుర బిరుదులను స్వామి శివానంద, ద్వారకా శంకరాచార్యుల నుండి పొందాడు. సంస్కృతంలో 11 కాండల "శివానంద విలాసం" పురాణకావ్యం, గీతికావ్యంగా "శ్రీరామ దాస గీత" శ్రీ రామకృష్ణ సహస్ర నామ స్తోత్రం, గురు చరితం గురు సపర్య భక్తి గీతాలు, అర్జున అనే వచన పుస్తకం, కావ్యోద్యానం, కావ్య మంజరి అనే స్వీయ సంస్కృత శ్లోక కదంబం రాశాడు. వరాహ మిహిరుని "బ్రహ్మ సంహిత"కు సంపాదకత్వం వహించాడు.

కావ్యమంజరిలోని రెండు స్తబకాలలో 2 వేల శ్లోకాలు రాశాడు. మొదటి స్తబకంలో ఆరు భాగాలకు బాహ్య పుష్ప, పాంచజన్య పుష్ప, ఆతపత్ర పుష్ప, సుమానుష పుష్ప, సూనృత పుష్ప అని పేరు పెట్టాడు. రెండవ స్తబకాన్ని శతక స్తబకం అన్నాడు. ఇందులో వియోగినీ శతకం, మందా క్రాంత శతకం, ఉపజాతి శతకం, మృత్యు పాశీయం అనే 4 శతకాలున్నాయి.

శివానంద విలాసం స్వామి శివానంద జీవిత చరిత్ర. మహాకావ్య లక్షణాలన్నీ పుష్కలంగా ఉండి, మంచి శైలీ విన్యాసంతో భక్తీ భావ బంధురంగా రచించాడు. అర్జున వచనరచన హృద్యంగా ఉంటుంది. కావ్యోద్యానంలో భాగవతం సారస్వతం పత్ర పుష్పం, సాప్తపదీనం, మౌక్తికం భాగాలున్నాయి. వైవిధ్యభరిత రచన ఇది. అతని వైదుష్యానికి ప్రతీకగా నిలుస్తుంది.❁

## 410) సిద్ధ లింగ మహాకావ్య కర్త – బసవ రాజ శాస్త్రి – (1950)

బసవ రాజ శాస్త్రి సంగమాంబ, రుద్ర మూర్తి దంపతులకు 1950లో కర్ణాటకలో జన్మించి వ్యాకరణ తీర్ధ, వ్యాకరణ శాస్త్రి సాహిత్య శిరోమణి డిగ్రీలను పొందాడు. 1971లో 26 కాండల 4 వేల శ్లోకాల "సిద్ధ లింగ మహా కావ్యం" సిద్ధ లింగేశ్వరుని జీవితంపై రాశాడు. శక్తి విశిష్టాద్వైతాన్ని, శక్తి స్థల మహాత్మ్యాన్ని చాలా గొప్పగా వర్ణించిన కావ్యం. ఇంద్ర వజ్ర, ఉపేంద్ర వజ్ర, ద్రుత విలంబిత, మందా క్రాంత వృత్త శ్లోకాలతో రామణీయకత కల్పించాడు. కవి పొందిన డిగ్రీలకు గొప్ప సార్ధకత కల్పించిన మహా కావ్యమిది.❁

**411) యమ గోపాల కర్త – సి.జి.పురుషోత్తం –1950**

మైసూర్‌కు చెందిన పూర్వపు సంస్కృత ప్రొఫెసర్‌కు వెంపు అనబడే కే వి పుట్టప్ప అనే కన్నడ రచయిత రాసిన “నంద గోపాల”ను సంస్కృతంలో “యమగోపాల”గా అనువదించాడు. దీనిని బెంగుళూర్ జయ మూర్తి ప్రకాశాన్ 1992లో అచ్చు వేసింది.❀

**412) భోజ విలాస ఏకాంకికకర్త – వాసుదేవ భల్లాల –1952**

కర్నాటక ఉడిపిలోని అమ్బులపడిలో వాసుదేవ భాల్లాల పుట్టాడు. బెంగుళూరు సరస్వతి విద్యామందిర్ హై స్కూల్‌లో బోధించాడు 1976లో “భోజ విలాసం” అనే ఏకాంకిక రాసి ప్రచురించాడు. భోజమహారాజు జీవితం సాహిత్యం పాలన వివరిచాడు. ఇందులో 6 దృశ్యాలున్నాయి.❀

**413) గాంధీ సంస్మరణ సంభ్రమ ఏకాంకిక కర్త – ఎస్.ఆర్.లీల – 1952**

ఇంగ్లీష్‌లో ప్రసిద్ధ ఏకాంకికలైన “ది వాలియేంట్”, “రిమెంబర్ సీజర్”లను ఎస్ ఆర్ లీల “అమరనాయకం” గాంధీ స్మరణ సంభ్రమంగా సంస్కృతంలోకి అనువర్తనం చేసింది. దానిని బెంగుళూర్ కే వి ఆర్ మహిళా కాలేజి 1991లో “సంప్రయోగం” పేరుతో ప్రచురించింది.❀

## 414) వాసుదేవ వాగ్వేణు కర్త – డా. ఉమా చంద్రశేఖర వైద్య –1952

19-9-1952లో పంజాబ్‌లో జన్మించిన డా. ఉమావైద్య కవికులగురు కాళిదాస సంస్కృత యునివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా పని చేశాడు. సంస్కృత మరాఠీ హిందీ ఇంగ్లీష్‌లలో అపార పాండిత్యం సంపాదించాడు. అనర్గళ వక్త కూడా. సంస్కృత పాళీ వ్యాకరణంలో మొదటి రాంక్‌లో ఎం.ఏ, సంస్కృత వ్యాకరణంలో పి.హెచ్‌డి సాధించాడు. వైస్ ఛాన్సలర్ కాకపూర్వం బొంబాయి భద్రకార్ సంస్కృత ఇన్‌స్టిట్యూట్ సంస్కృత శాఖాధ్యక్షుడుగా, ఠాగూర్ చైర్ ఆఫ్ కంపారేటివ్ లిటరేచర్‌కు గైడ్‌గా ఉన్నాడు. పాళీ భాషలో అధారిటీ ఉన్నవాడు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సంస్కృత నాటక పోటీలకు న్యాయనిర్ణేతగా ఉన్నాడు. అనేక సాహిత్య ప్రసంగాలు రేడియో ప్రసంగాలు చేసిన వక్త. సంస్కృత వాడుక భాషపై అనేక వర్క్ షాపులు నిర్వహించాడు. ఈయన వద్ద 10 మంది రీసెర్చ్ చేసి పి.హెచ్‌డి లయ్యారు.

సంస్కృతంలో "వాసుదేవ వాగవేణుతోపాటు అభిజాతా సంస్కృత సాహిత్య చరిత్రీహాసం, అప్షనల్స్ ఇన్ సంస్కృత లాంగ్వేజ్ అండ్ పాణిని, మిస్టిక్స్ ఇన్ వరల్డ్ రెలిజియన్స్ గ్రంథాలు రాశాడు. వివిధ అంశాలపై 80కి పైగా రీసెర్చ్ పేపర్లు రాసి ప్రచురించాడు.

బొంబాయి బ్రాహ్మణసభ "ప్రజ్ఞావంత పురస్కారం, రాష్ట్రీయ గౌరవ పురస్కారం, ఉత్తమ దేశిక, ప్రబోధ పురస్కారం, సంస్కృత సేవ, సంస్కృత సాహిత్య పురస్కారం వంటివి ఎన్నో అందుకొన్నాడు.

2001 నుంచి 2008 వరకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా జపాన్, అమెరికా, ఇటలీ, ఆస్ట్రేలియా, మారిషస్‌లు సందర్శించాడు.

సాహిత్య అకాడెమి ప్రచురించిన భారతీయ అలంకార శాస్త్ర విజ్ఞాన సర్వస్వం ప్రాజెక్ట్‌లో తనవంతు కర్తవ్యమ్ నిర్వహించాడు. చైనా యూనివర్సిటీలలో ఒకదానిలో ప్రవేశపెట్టే సంస్కృత కోర్సు తయారు చేశాడు. సౌరాష్ట్ర బొంబాయి ఔరంగాబాద్ వగైరా యూనివర్సిటీలలో రిఫ్రెషర్ కోర్స్‌లు నిర్వహించాడు. చాలా విశ్వ విద్యాలయాలకు కన్సల్టింగ్‌ఎక్సపర్ట్‌గా ఉన్నాడు.❁



డా.నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి

## 415) వెయ్యి శ్లోకాల "చైతన్య నందనం"కర్త – నిష్ఠల సుబ్రహ్మణ్య శాస్త్రి -1953

మాణిక్యం తాను వెలుగులోకి రాదు. దానిని మనమే వెతికి వెలుగులను దర్శించాలి. అలాగే కొందరు మహానుభావులు తమ గురించి ప్రచారం చేసుకోరు. ఎవరో వారి ప్రతిభ గురించి చెబితే మనం వారిని కలిసి కాని, వారితో పరిచయం ఉన్నవారి ద్వారా వారిని తెలుసుకొని పరిచయం చేయాలి. వారు ఇలాంటి ఆరాటం, ఆర్భాటం కోరుకోరు. వారిని గురించి తెలియజెబితే ఎందరికో వారి చరిత్ర స్ఫూర్తి దాయకమై ప్రేరణ పొందుతారు. అందుకే నా తపన. నా ఈ ఆరాటాన్ని అర్ధం చేసుకొన్నవారు డా. శ్రీ తూములూరు శ్రీ దక్షిణామూర్తి శాస్త్రిగారు. రెండవ గీర్వాణానికి ప్రోత్సాహక, ప్రోద్బలాలు వారివే. సంక్రాంతి ముందు వారికి శుభాకాంక్షలను ఫోన్ ద్వారా తెలియజేస్తుంటే వారు "ప్రసాద్ గారూ! మన రెండవ గీర్వాణంలోనే చోటు చేసుకోవాల్సిన మహా సంస్కృత విద్వాంసులు, 30 ఏళ్ళు నాతో పొన్నూరు సంస్కృత కాలేజిలో సంస్కృత లెక్చరర్గా పని చేసి రిటైర్ అయిన వారు, రోజూ ఉదయం కనీసం అయిదారు గంటలు తపోధ్యానాలతో నిష్ఠగా గడిపేవారు రసానందకావ్యం, నవగ్రహ స్తుతి వంటి గొప్ప సంస్కృత రచనలు చేసిన నా మిత్రులు శ్రీ నిష్ఠల సుబ్రహ్మణ్య శాస్త్రి గారి గురించి మీరు గీర్వాణం-3లో తప్పకుండా రాయాలి" అని చెప్పి వారి ఫోన్ నంబర్ ఇచ్చి మాట్లాడమన్నారు. నేను శాస్త్రిగారితో మాట్లాడి నా కృషి వివరించి,

వారిని గురించి రాసే అవకాశం నాకు కల్పించమని వారి పరిచయం, బయోడేటా, పుస్తకాలు నాకు పంపమని, లేదంటే మా పుస్తకాలు వారికి పంపాక చూసి అప్పుడు పంపమని" అన్నాను. వారు "సంతోషం. నేనే మీకు ముందు పంపిస్తాను" అన్నారు. సంతోషం వేసింది. ఇవాళే వారి నుంచి 4 పుస్తకాలు వారి బయోడేటా కొరియర్‌లో నాకు అందాయి. ఈ సందర్భంగా శ్రీ తూములూరు వారికీ, శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రి గారికీ కృతజ్ఞతలు అందజేస్తున్నాను.

**వంశ చరిత్ర**

శ్రీ నిష్ఠల సుబ్రహ్మణ్య శాస్త్రి గారు 17-9-1953న విజయ నామ సంవత్సర భాద్ర పద శుద్ధనవమి నాడు శ్రీమతి కామేశ్వరమ్మ, శ్రీ సన్యాసి శర్మ దంపతులకు జన్మించారు. విజయనగరం దగ్గర "ఇంగిలాపల్లి" అగ్రహారం వీరి ప్రాచీనుల నివాసం. వీరి మూల పురుషులు శ్రీ వేంకట భట్టు అరికాళ్ళలో శంఖ చక్రాలున్న మహా యోగులు. వీరి కుమారులు శ్రీ అప్పన్న శాస్త్రి గారు కొండా కోనలలో తపస్సు చేసేవారు. ఒకసారి గజపతి నగరం మహా రాజు ఏదో సమస్యతో బాధపడుతూ ఉన్నప్పుడు శ్రీ అప్పన్న యోగి కలలో కన్పించి పరిష్కారం సూచించారు. రాజు సమస్య తీరి ఆనందంతో యోగిగారికి ఒక అగ్రహారం బహూకరించారు. రెండవ కుమారులు శ్రీ కామ శాస్త్రి శ్రీ చక్రార్చనా నిష్ణాతులు. వీరు నిష్ఠగా అమ్మవారిని పూజించే సమయంలో అమ్మవారు ఘలు ఘల్లున శబ్దం చేస్తూ అందెల రవళి వినిపిస్తూ, నడిచి వచ్చేదట. వీరి పెద తాతగారు మహా వైయాకరణులు బ్రహ్మశ్రీ తాతా సుబ్బారాయ శాస్త్రి గారి శిష్యులు. తాతగారు శ్రీ సింహాచల శాస్త్రి గారు. వీరు "లక్షణాపరిణయం" భద్రాచల మహాత్మ్యం మొదలైన 6 గ్రంథాలు రాశారు. వీరు ప్రముఖ ఆయుర్వేద వైద్యులేకాక మహా పౌరాణికులు కూడా. లక్షణా పరిణయానికి శ్రీ కట్టమంచి రామలింగా రెడ్డి గారు పీఠిక వ్రాశారు. ఇది 1955-59 కాలంలో భాషా ప్రవీణ సిలబస్‌లో ఉన్నది.

**జనన విద్యా వృత్తి విశేషాలు**

సుబ్రహ్మణ్య శాస్త్రి గారి తండ్రి గారు శ్రీ సన్యాసి శర్మగారు. సాహిత్య వేదాంత పండితులు. సుబ్రహ్మణ్య శాస్త్రి గారు పొన్నూరు, తెనాలి సంస్కృత కళాశాలలో గీర్వాణ ఆంధ్ర సాహిత్యాలు అభ్యసించారు. వీరు తండ్రిగారి వద్దా, బ్రహ్మశ్రీ సూరి రామ కోటి శాస్త్రి, శ్రీ పోతుకూచ్చి సుబ్రహ్మణ్య శాస్త్రి, శ్రీ ముళ్ళపూడి సుబ్రహ్మణ్య శాస్త్రి, శ్రీమాన్ అప్పన్న, శ్రీమాన్ వేదాంతమ్ సీతారామాచార్యులు, శ్రీమాన్ పరాశరం కృష్ణమాచార్యులు,

శ్రీ ఉప్పల కోటయ్య గార్ల వద్ద విద్య నేర్చారు. తెనాలి, పొన్నూరు సంస్కృత కళాశాలలో సంస్కృతం తెలుగు బోధించారు. సాహిత్య విద్యాప్రవీణ, భాషా ప్రవీణ, వ్యాకరణంలో ఎం.ఏ. దర్శనాలలో ఎం.ఏ అలంకార శాస్త్రంలో ఎం.ఏ తెలుగులో ఎం.ఏ విద్యావారధి, పి.హెచ్‌డి పూనే యూనివర్సిటి, తిరుపతి యూనివర్సిటీలలో శిక్షణ పొందారు. ఆకాశవాణిలో బహు ప్రసంగాలు చేసిన దిట్ట.

పొన్నూరు శ్రీ భావనారాయణ స్వామి సంస్కృత పాఠశాలలో సంస్కృతపండితులుగా, చిట్టి గూడూరు శ్రీ నారసింహ సంస్కృత కళాశాలలో సంస్కృత ఉపన్యాసకులుగా, చెన్నైలో శ్రీ శంకర విద్యాలయంలో సంస్కృత పండితులుగా పని చేశారు. 30 ఏళ్ళు పొన్నూరు శ్రీ భావనారాయణ స్వామి సంస్కృత కళాశాలలో సంస్కృత అధ్యాపకులుగా పని చేసి రిటైరయ్యారు.

**ఉపాసన-జ్యోతిష్యం**

శాస్త్రిగారు గొప్ప హనుమత్, సుబ్రహ్మణ్య, దత్తాత్రేయ, దుర్గా ఉపాసకులు. జాతక ముహూర్తాలు చెప్పటం ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేయటంతో వీరు కాలాన్ని సద్వినియోగం చేస్తున్నారు. శ్రీ ధర్మ సంవర్దనీ పరిషత్‌ను స్థాపించి ధర్మ ప్రచారం చేస్తున్నారు. శాస్త్రి గారు "సాహిత్య శిరోమణి" బిరుదాంకితులు. వాస్తు శాస్త్రంలో ఉద్దండ పండితులు. గుంటూరు ఓంకార క్షేత్రం, తెనాలి బ్రాహ్మణ సంఘం సమ్మానాలు పొందారు. చెన్నై సంస్కృత కళాశాల అధ్యాపక నియామకంలో ఇంటర్వ్యూ మెంబర్‌గా, రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ గ్రంథ ప్రచురణకు పరిశీలకులు, రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ విద్యావారిదికి పంపబడే పరిశోధనా గ్రంథాల పరిశీలకులుగా శాస్త్రి గారి సేవలను విని యోగించుకుంటున్నారు. ఆసియన్ అమెరికా వారి "ఎవరెవరు" అనే గ్రంథం మూడవ సంపుటిలో శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రి గారి పేరు చేర్చి వారి భాషా సేవకు గౌరవ స్థానం కల్పించారు.

**రచనా శాస్త్రీయం**

సుమారు 55 పత్రికలలో సాహిత్య, ఆధ్యాత్మిక వ్యాసాలు రాశారు శాస్త్రిగారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో సంస్కృత పాఠాలు, ప్రసంగాలు సుమారు 50 దాకా చేశారు. ఎన్నో దేవాలయాలలో ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. ధర్మ జ్యోతి మాసపత్రికలో ఆధ్యాత్మిక వ్యాసాలూ జ్యోతిష ప్రశ్నావళి నిర్వాహిస్తున్నారు.

1985లో "సాహితీ మేఖల" తరపున "రత్నకవి సాహిత్యాను శీలనం" అనే

250 పేజీల పరిశోధనా వ్యాసం రాసి ప్రథమ బహుమతి పొంది సత్కారం అందుకున్నారు. 1986లో "భాగవతము-అద్వైతం" అనే పరిశోధనా వ్యాసానికి బహుమతి నిచ్చి భీమవరంలో సన్మానం చేశారు. మేఘ సందేశం, కళ్యాణ చంపువు మొదలైన కావ్యాలకు పీఠికలు చేకూర్చారు. సంస్కృత పత్రికలు సంవిత్, సూర్యోదయః సప్తగిరి, బాలభారతి గైర్వాణిలలోను, తెలుగు పత్రికలు రామకృష్ణ ప్రభ, భారతి, ఆరాధన, ముముక్షువు, పాపయా రాధ్య, శ్రీ శైల ప్రభ, వేద పరిషత్ ద్యానమాలిక, ఆత్మ జ్యోతి, ధర్మ జ్యోతి, బ్రహ్మ తేజంలలో లెక్కకు మించి వ్యాసాలూ రాశారు. బ్రహ్మ తేజం పత్రికలో "ధర్మ శాస్త్రాలలో బ్రాహ్మణుడు" సీరియల్ రచన చేశారు.

శాస్త్రిగారి పరిశోధనా పత్రాలలో ముఖ్యమైనవి - కుజ దోష సర్వస్వం కుజ దోష చర్చ, స్తానివద్భావం

**సంస్కృత గ్రంథ రచన**

1-నవ గ్రహ స్తుతి (సంస్కృత -తెలుగు వ్యాఖ్యానంతో), 2-రసానందం (ఖండ కావ్యం), 3-రత్నకవి సాహిత్యాను శీలనం (రత్న కవి రచనలపై విమర్శనాత్మక గ్రంథం), 4-చైతన్య నందనం (1000 శ్లోకాల కావ్యం), 5-వీరభద్ర విజయం, 6-శ్రీ బాలా త్రిపుర సుందరీ సుప్రభాతం, 7- శ్రీ వీరభద్ర కరావలంబ స్తోత్రం, 8-శ్రీ త్రిపురాంతకేశ్వర స్తోత్రం, 9- కావ్య మంజరి (దత్తాత్రేయ అష్టకం) శ్రీ దత్త మధుమతీయం (3 సర్గలు) చందన కృష్ణం (150 శ్లోకాలు) ప్రేమామృత మహా కావ్యం (19సర్గలు) సుందర సుందరం (సుందర కాండ) మొదలైనవి.

**తెలుగు రచనలు**

వీరభద్ర విజయం, కవితా మకరందం, మీరూ సంస్కృతం నేర్చుకోండి, విజయబాల నాటిక, జాతక రాజీయం తెలుగు అనువాదం, పరశు రామాయణం, శ్రీ కుమార నాగ దేవతా సర్వస్వం, మంచి-చెడు మహా శక్తి పూజా విధానం, భారతీయ సంస్కృతీ మూడుభాగాలు, మనకోటప్ప, అయ్యప్పస్వామి వ్రత కల్పం, దుర్గా సప్తతి తెలుగు అనువాదం భావ కేరళులు-జ్యోతిష గ్రంథం, ధర్మ గంగ రెండుభాగాలు నవభారతం -300 పద్యాలు, స్వయంవర కళా స్తోత్రం - శ్రీ దుర్వాసముని స్తోత్రానికి తెలుగు అనువాదం, పూజాకుసుమాలు.

**శాస్త్రి గారి గీర్వాణ కవితా గీర్వాణం**

శాస్త్రి గారి సంస్కృత రచనా పాటవం అనిర్వచనీయం. వారు రాసిన వాటిలో నాకు పంపిన శ్రీ బాలాత్రిపుర సుందరీ సుప్రభాతం, రసానందం చైతన్య నందనం, కావ్య మంజరిలను సంక్షిప్తంగా పరిచయం చేస్తాను.

1-శ్రీ బాలా త్రిపుర సుందరీ సుప్రభాతం

దీనిని తమ గురువరేణ్యు లు మహోపాసకులు శ్రీ శ్రీ త్రిపురానందనాధస్వామికి అంకితమిచ్చారు.

"త్రిపురానంద నాధస్య పాదపంకజ రేణుభిః-ప్రోత్థితాకవితాధారా నిరంతర రసోదయా" అంటూ వారి నిరంతర కవితా రసోదయాన్ని అభివర్ణించారు.

"శ్రీ గురోః పదాముపేయుషో విదః - జిహ్వికా భారతి శారదాంబికా - దుర్జనావలి చపేటికా -చంద్రికా శరది జా సచేతసాం "గురువుగారి శిష్యునినాలుకపై శారదాదేవి కొలువై ఉంటుందని తెలియజేశారు.

గురు చరిత్ర కర్త శ్రీ మేళ్ళచెర్వు వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి గారు నిష్ఠల వారి "చైతన్య నందన కావ్యం"ను అభినందిస్తూ- "చైతన్య నందన వనీ చిర చార మత్తః - బృందావనస్య సదృశీం సుషమా మవేక్ష్య -రోమాంచ రమ్య వనదంతు రితాంగ యష్టిః -సారూప్య మాస్య వనికా జనకం స్తవీమి" అని రోమాంచనంగా కావ్య అర్చన ఉందన్నారు. మోక్షం అనిపిస్తోందని చెప్పారు.

"త్రయం స్త్రింశత్కోట్యో దధాతి వసతిం నందన వనే -మఘోనో దాసాస్తే, తవ నవ నవే నందన వనే -మహా దేవా అసన్ శతమఖ కిరీటార్చిత పదాః-అతోహం గృహ్ణీయా మిద మది గుణం నీప విసినం" అని నందనవన నవ్య నవనీత నాధుని సోయగం ఇంద్రాది దేవతల ఆరాధన బహు సుందరంగా వర్ణించారని తెలియజేశారు.

అవధాన చతురానన డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్- "నిష్ఠలాన్వయ పాండిత్య నిష్ఠాతత్వ నిరూపకాః-దృష్ట్వాగ్రంథాస్త్రయీ మూలాఃత్రయం క్షోదక్షమా ముదా" అని కీర్తించి శ్రీ దేవిపూజా విధి, వీరభద్ర సత్కథమొదలైన రచనలు ఆబాల పండితులను ఆకర్షించాయని చెప్పారు.

తర్వాత కవిగారు కొద్దిగా ప్రస్తావన చేసి ఇందులో స్తుతి, ప్రపత్తి, మంగళాశాసనం ఉన్నాయని "బాలే కృపాజలనిధే కురు సుప్రభాతః౯"అనే మకుటంతో త్రిపురసుందరీ దేవిని కీర్తించానని, రుక్ సంహిత భారతం, యాజ్ఞ్య వల్కియంలను ప్రమాణాలుగా తీసుకొని రాశానని సంస్కృతంలో వివరించారు.

1-శ్రీ మాతర్మంగలే బాలే పూర్వా సంధ్యా ప్రవర్తతే -ఉత్తిష్ట దేవతా పూజ్యే కర్తవ్యమ్

లోక పాలనం"తో మేలుకొలుపు ప్రారంభం చేసి, "ఉత్తిస్తోత్తిస్టశ్రీ విద్యే ఉత్తిస్టాధార కుమ్మతః-ఉత్తిష్ట లలితా చేతః త్రిలోకీ మంగళం కురు" అని మూడులోకాలకు మంగళం చేకూర్చమని వేడుకొని-

"నైశేన నీలతమసా వసనేన లోకః -విద్యోతమాన భగణాంబక భాస మానః-త్వాం సేవితుం సముప సర్పతి సత్ప్రకాశః - బాలే కృపా జలనిధే కురు సుప్రభాతం" అని సుప్రభాత గీతికమొదలు పెట్టారు. బాలా త్రిపుర సుందరీ పద భక్తుడైన శ్రీ పాపయారాధ్యుని స్మరిసూ- "శ్రీ పాపయార్య పరికల్పిత సన్నిధానా-కళ్యాణ యుక్త్రిపుర నాద సమాశ్రితాంఘ్రే- షట్పంకజేషు బహుధా పరి ద్రుష్యమానే -బాలే -"అంటూ- చివరగా -"ఆనంద సంధాయక సుప్రభాతం -సర్వార్తి పీడాహర సుప్రభాతం -దయాంబు రాశే కురు సుప్రభాతం -బాలే నమస్తే కురు సుప్రభాతం" అని ఫలశ్రుతితో మొత్తం 29 శ్లోకాలతో ముగించారు.

తరువాత 11 శ్లోకాల స్తుతి రాశారు. "నత దాపి భవత్పద కన్జరజో -మహిమాన మనంత ఫలం విదితుం -విధి విష్ణు గిరీశ,ముఖాః ద్యుసదః -ప్రభవః పరిపాహి దృశా జగతీం" అని ప్రారంభించి- "జగదంబుజ మాంబ సుదేశ దళం - వికచం తవ పాద తలే పతతి-ప్రతిభాసిత జీవ మహా ప్రతిభే -పరిషించ సుధాం కరుణా తటినీ - " అని చక్కని లయాన్వితంగా ఊపు నిచ్చి - "పురుష ప్రకృతీ భవతీ జననీ -రవి మండల భాసిని విశ్వ మయి - బహు చిత్ర మయూఖ మయూఖ రుచిః -సకలాపద ఉద్దర దుర్గతి నుత్" అని దుర్గతి నాశినిగా కీర్తించి చివరికి "బృహతీం బృంహణమయీం నౌమి బాలాం స్మితాననాం-బానిలాగ్ని జలపృద్వీహేతూనాం మూల కారణం" అని అమ్మ సుస్మిత వదన సౌందర్యాన్ని వర్ణిస్తూ ముగించారు.

తరువాత 16 శ్లోకాలలో శ్రీబాలా ప్రతిపత్తి రాశారు.

"ఐం కాం త్రుకతా ముపేత్య విశదాహారోజ్వలా వాక్ప్రదా-క్లీంకారాకృతి రిక్షు దండ కలితా సౌందర్య సార ప్రదా

సౌ రూపం చ విధాయ భీమ రిపు సంక్షోభం సమాతన్వతీ-సా వేద త్రయి రూపిణీ విజయతే బాలా నతాస్తాం శివాం" అని శ్రీదేవి దివ్య విభూతిని ఆవిష్కరించి-

"సౌభాగ్య భాగ్య గరిమాభి నవ ప్రకాశే -వాత్సల్య మార్దవ దయాపరమావకాశే -రాత్రిం దినం భజతు చిత్తమనాద నాదే - శాంత్యైసమస్త జగతస్తవ పాదపద్మం" అని సమస్త జగత్తుకు శాంతి చేకూర్చమని ప్రార్థిస్తూ మంగళాశాసనంగా -బాలై పరతత్వైక రూపాయై సర్వ తేజసే - హంస మానస సంచారి హంస్యై మంగళ మస్తుతే"తో ప్రారంభించి చివరి 14వ శ్లోకం- "కల్హార పండరీకాంబుజాతా భ చణద్వయే-మంగళం మంగళ

తనో జగన్మంగళ హేతవే"తో ముగించారు.

**2- లౌకిక నృసింహ స్తుతి**

"నృణాం గుణైర్యః శ్రుతి శాస్త్ర గీతైః-ప్రష్ఠోభవత్తేన సకీర్త్యతే ద్ధా -సైమాస్తనో ర్ధారణ తో హి నస్యాత్ -సోవ్యాన్నృసింహ సింహః" అని మొదలు పెట్టి 15వ శ్లోకం - "పశుతానరతాభి మేలనాత్ -అమరత్వం వరదత్వ మద్భుతం నమః -దివిషద్వర సంభవః కదా తే-మతి హీనాన్ సుమతీన్ కురుష్వ దేవ"తో సమాప్తి చేసి నృసింహావతార గాథామృతాన్ని పంచి బుద్ధిహీనులను మతిమంతులను చేయమంటూ ప్రార్థించారు.

**3- రసానందం**

రసానంద కావ్యాన్ని "సంస్కృతాంధ్ర మనోజ్ఞ సాహితీ పరి పుష్టు-సత్కావ్య పరిణేత సరసహృదయులు" సత్క్రియా శౌన్డ, ప్రౌడార్ధ సర్వ హృద్యు"లైన ఆచార్య ఎస్వీ జోగారావు గారికి శాస్త్రిగారు అంకితమిస్తూ- "శిష్టాన్వయ సుధా మూర్తే జోగారావ మహాశయ- రసానందాభిదాకావ్య కన్యేయం పరి గృహ్ణాతాసు" అని కోరారు. ఇది రెండు సర్గల ఖండకావ్యం. కవి గారే దీని విషయం చెబుతూ ఇది నాయిక ప్రధానమని, విప్రలంభ శృంగారం దట్టించానని, రసమే నాయిక అని, గణకుడు నాయకుడు. రసో వై సహః అన్న శ్రుతివాక్యానికి అర్థం వివారించే కావ్యంఅని కల్పిత కథ అని కవి కల్పనా విహార భూమిగా రాసిన ఖండకావ్యమని చెప్పారు. కథ సూక్ష్మంగా-పూర్వం రస గణకా అనే క్షత్రియుడు ఉండేవాడు యుద్ధంలో రాజుకు గణకుడు సాయం చేశాడు. విరహ బాధ. వగైరా కావ్య లక్షణాలు ఉన్నాయి. ఇష్ట దేవతా స్తుతి చేశారు. "కుమార హంతర్భువనస్య శం మే -కుమారతాం దేహి వివేక యుక్తాం-కుమారా ప్రవృద్ధిం సుకుమార గాత్రా -కుమారా భోశ్శంభుగుమాసుతః త్వం" -తర్వాతగురు స్తుతి కుకవి నింద, సుకవి ప్రస్తుతి యధా ప్రకారం చేసి కావ్య ప్రారంభం చేశారు.

ఇది పూర్వ శృంగార కావ్యాలపై అధిక్షేపణ. వాటిల్లో సభ్య శృంగారం తక్కువగా ఒకే మూసలో ఉండటం వలన జనాలకు శృంగార కావ్యాలపై అయిష్టత కలిగిందని, దానివలన కావ్య ప్రయోజనానికి నష్టం వాటిల్లినదని కనుక వాటికి భిన్నంగా తాము దీన్ని రాశామని నేను ఈ రోజు ఫోన్ చేసి అడుగగా వివరంగా తమ కావ్యాల గురించి తెలియజేస్తూ చెప్పారు. ఇందులో నాయికా నాయకులు భార్యా భర్తలేనని, విప్రలంభ శృంగారం ప్రధానంగా రాశామని, చివరకు ఇద్దరూకలవటం ధర్మ శృంగారానికి కులపాలికా ప్రణయానికి విలువ నిచ్చామని, దంపతుల మధ్య స్నేహం వర్ధిల్లాలన్నది ఆశయమని, పూర్వపు కవులు నాయిక బాహ్య సౌందర్యాన్ని తెగ వర్ణించి జుగుప్స కలిగించారని స్త్రీ అంతస్సౌన్దర్యంపై వారి దృష్టి పడలేదని, తాము అంత స్సౌన్దర్యానికి

అధిక ప్రాధాన్యమిచ్చి రాశామని, దివ్యమైన, ఆదర్శ శృంగారమే తమ ధ్యేయ మని తెలియజేశారు.

"కాచిత్కాంతా చలిత వసనా లంబనా స్విన్నపాణిః –లోలే నేత్రే ప్రియ విరహ జాన్ స్వేద బిందూన్ ధరంతీ–పుష్పాశ్రీకం రణభువి జయశ్రీ సమేతస్య గంతుం –సేనాభర్తుశ్చలిత కరణా సద్య మత్యుఃప్రతస్తే" అని మొదటి సర్గ ప్రారంభించారు. రెండవ సర్గ – "స్వల్పం కాలం బహుమివ తతో వైపరీత్యం విధాత్రీ – ఇచ్ఛాశక్తి ర్జయతి మహతస్సర్వ వేత్రుః స్మరారేః–శ్రుత్వా వాచం పతి నిగదితాం సా రసాసారసాక్షీ –మోహోచ్ఛిత్తే రాభవదివ సద్యోగినీభర్తు హృష్టిః" అని ముగించారు.

ఇందులోనే మరొక చిన్న 51 శ్లోకాల "మాయా మర్కరికం" కూడా ఖండకావ్యం ఉంది. దీని కథ సంగ్రహంగా తెలిపారు కవి.

**4– చైతన్యానందనం**

దీన్ని తమ పితృపాదులు శ్రీ సన్యాసి శర్మగారికి అంకితమిచ్చారు. ఇది విశ్వ చైతన్యానికి అనునాదం అని, కవి ప్రతిభ పలుపోకడలు పోయి అద్భుత ఆవిష్కారం చేశారని ఆచార్య ఎస్వీ జోగారావు కీర్తించారు. ఇందులో "స్వర్ణధారా స్తుతి", కుమార స్తుతి, గణేశ పంచరత్నమాల, తెలుగులో శ్రీరామ సీసమాలిక, శ్రీకంఠ శతకం శ్రీ శక్తి నుతి, ఉపగ్రహనుతి, శుకాలాపం, స్త్రీ విద్యా, నందనాశోకం మొదలైనవి ఉన్నాయి.

ఇందులో అమ్మవారి శక్తి స్వరూప వర్ణన చేశారు. దీనికి ప్రేరణ శ్రీ కావ్య కంఠగణపతి ముని రచించిన "ఉమా సహస్రం "శంకరాచార్యులవారి" సౌందర్య లహరి" అని నాకు ఫోన్‌లో చెప్పారు. ఇందులో దిక్పాలక స్తోత్రాలు కూడా ఉన్నాయి. యమ ధర్మ రాజును ధర్మ ప్రభువుగా పక్షపాత రహిత ప్రవర్తకునిగా, దయా స్వరూపునిగా నచికేతునికి ఆత్మ దర్శనం బోధించిన మహా యోగిగా తాము వర్ణించినట్లు తెలిపారు. ఎవరూ ఉపగ్రహాలపై రాయలేదని తాము రాశామని చెప్పారు. ఇందులోని హనుమ దండకంలో ఆయన నవ వ్యాకరణ పాండిత్యానికి అద్దంపట్టేట్లు వ్యాకరణ ప్రయోగాలతో స్వామి శక్తి భక్తీ అనుగ్రహ శక్తి వర్ణించామన్నారు. "జయ జయ జయ సీతా హృదంత రస్థ శోకాగ్ని నిర్వాపకాంభోజ మిత్రా త్సమాదీన సౌ శబ్ద వాచా సమాకృష్ట మోమోద్యమా నౌ ర్మిలే యాగ్రజ! అని ప్రారంభించి 'శ్రియం శేముషీ జ్ఞాన వైరాగ్యం ప్రదస్వ రామనామేన హృస్వాత్మ జీవనం చిరం భాహి మచ్చేతసి శ్రీ హనూమాన్ నమస్తే నమస్తే నమస్తే నమః" అని ముగించారు.

నందనా శోకంలో అశోకుని ఆధ్యాత్మిక మార్గాన్ని వివరించామని అన్నారు.

**5-కావ్య మంజరి**

ఇందులో దత్తాత్రేయాష్టకం, వారాణసేయం (లఘుకావ్యం) చందన కృష్ణం, శ్రీ దత్త మధు మతీయం, శ్రీ రత్నావళీ, ప్రేమామృత మహాకావ్యం, సుందర సుందరం, అధికారిక పురుష స్తుతి, శ్రీ దశ విద్యాధ్యానం ఉన్నాయి. ఉపోద్ఘాతంలో శాస్త్రిగారు శ్రీ హర్షాది మహాకవుల ప్రేరణ వలన తాము కావ్య మంజరి రాశామని, హర్షుని వలెనె తామూ అక్కడక్కడ గూఢంగా మంత్రం శాస్త్రాన్ని నిక్షిప్తం చేశామని, నారాయణంలోని మంత్రం శాస్త్రాన్ని మధుమతీయంలో చూపానని, దత్తాత్రేయ మాయనూ, సుందర సుందరంలో మంత్ర శాస్త్రార్ధాన్ని వివరించామని తెలియజేసి తమ మంత్ర శాస్త్ర మహా పాండిత్యాన్ని మహాకావ్యాల గూఢ నిర్మాణ చాతుర్యాన్ని తమ కావ్యాలలో ప్రతిఫలింపజేసి తరించి మనలనూ తరింప జేశారు. అన్నీ చక్కగా తాపీగా చదివి ఆనందించి అనుభవించాల్సిన కృతులే. వారి మేధో వికసనానికి, పాండిత్య గరిమకు, శాస్త్ర పాండిత్యానికి ఇవన్నీ మచ్చు తునకలే. కొన్ని శ్లోక రత్న కాంతుల్ని దర్శిద్దాం-

1-దత్తాత్రేయాష్టకంలో- "జ్ఞానం స్వార్జిత మా దదాతిహి చతుర్వశాత్మకం సేవినాం రమ్యం సాంకృత యే విధూత చరితం చక్రే కృతార్ధం దదత్ -భక్తంస్థాపయతి స్మయో హృజాగాకార స్థితౌ నిర్మలః

-స శ్రీ మన్నారసింహ సద్యతివరో దృష్ట్వా పిశాచాన్తకః -సోహం దత్త దిగ్బరో వసతుమే చిత్తే మహాన్ సున్దరః"

2-శ్రీ వారాణసేయం-శ్రీశైల భూద్రే శ్రిత కల్ప కోటే రార్త్రైరస్యా ధ్వరసంగామేషు -నిత్యాన్న దానేన యశః ప్రకాశీగానస్య మాహూయ గురుప్రియం మాం.

"కురంగ నేత్రీ భువన ప్రసూః స్వయం విశాలనేత్రీ మభి వీక్ష్య ముగ్ధా-వివాద మండోరుభయో ర్వివిస్యయా-కురంగి కాగత్య చాలా విలజ్జితా.

3-చందన కృష్ణం -శ్రీ కృష్ణో నవ మేఘః పాయాత్సహిత్యజలనిదీ రుచిరః -బాహ్యాభ్యంతర శుచినం రసోద్రేకః"

"కృష్ణస్య చందన మయస్య పరీమలోయ - ముజ్జుంభతే హి కుసుమేషు వనేషు చంద్రే -ఆత్మాను భూతిరివ దివ్యకలాసు గోపీ-శ్రుత్యంగనాస్తు కుసుమాయుధ బాణ పాతః" అంటూ పరమ సుకుమారంగా కుసుమ కోమలంగా చందన చర్చలా రాశారు.

4-సుందర సుందరంలో సంగ్రహంగా సుందర కాండను చెప్పారు.

5-ప్రేమామృతంలో బుద్ధ భగవానుని అహింస దయ సానుభూతి, అనుకంప గురించి చెప్పామని,బుద్ధుడు బౌద్ధ సిద్ధాంతం అనేదేమీ బోధించలేదని, ఆయనకు ఆతీత, అనాగత జ్ఞానం ఉన్నదని అందుకే రాబోయే కాలంలో వచ్చే శంకర, రమణమహర్షి శ్రీ రామకృష్ణులు

చెప్పే సమన్వయ మార్గాన్ని ముందే చెప్పాడని ఆయన బోధించింది భారతీయ సంస్కృతీ, సర్వ మత సమానత్వమేనని తాను ఇందులో తెలియజేశానని శ్రీ శాస్త్రి గారు ఈ రోజు నాకు ఫోన్‌లో తెలియజేశారు.

భారవి మాఘ కావ్యాలోని ప్రకృతి, జ్యోతిషం, చంద్రునికి చుట్టూ గుడి కట్టటం మొదలైన వానిలో ఉన్న విజ్ఞాన విషయాలను, విశేషాలను తాను మళ్ళీ తన భాషలో లోకానికి ఎరుక బరచానని అన్నారు. "ఆధికారిక పురుష స్తుతి" భాగవతంలో చెప్పబడిందని, అందులో మహా యోగులు సర్వ కాల సర్వా వస్థలలో సూక్ష్మ రూపంలో ఉంటారన్న విషయాన్ని వివరించామని తెలియజేశారు. "దశ మహా విద్యా ధ్యానం"లో ఒకే శ్లోకంలో దేవతలందరూ వచ్చేట్లు రాశానని చెప్పారు.

"యా దేవీ జీవ శక్తిః ప్రణవ ర్వినిహితా వాఙ్మయీసత్య రూపా –జాగ్రత్స్వప్న ద్యవస్థాస్వపి లాసన పరా కాశారుణా శుభాంగీ
విద్యుత్ప్రా షాగ్నికాంతి ర్వ్యపగతాని నదోచ్చార్య మాణా సుభాగ్యా –స్వాంతాంతిక్రాంతి విద్ దావతమ సమాహితా పాతువిశ్వంభరా నః"అనే శ్లోకంతో మంజరికి సమాప్తి పలికారు. శ్రీ నిష్ఠల సుబ్రహ్మణ్య శాస్త్రి గారి వైదుష్యం మహా దొడ్డది. వారి కావ్యాలూ మహోన్నత భావ పరంపరతో అలరారేవి. వాటిలోని అర్థాన్ని, పరమార్థాన్ని గ్రహించటానికి ఎంతో విద్వత్తు, అవగాహన ఉండాలి. అవి ఉన్న వారు అందులో రసానందాన్ని బ్రహ్మానంద సహోదరత్వాన్ని తప్పక అనుభవిస్తారు. సామాన్యులు అర్థం చేసుకోవటానికి వాటిని తెలుగు లిపిలో రాయటం, భావాన్ని వివరించటం కావ్యాలలో విషయాన్ని సంక్షిప్తంగా తెలుగులో చెప్పటం అవసరం. శాస్త్రిగారే ఆ పని చేసి లోకోపకారం చేయాలని నిండు మనసుతో వారిని ప్రార్థిస్తూ, వారి నుండి మరిన్ని అనర్ఘ రత్న రాశులు వెలువడాలని ఆశిస్తూ, వారిని పరిచయం చేసే అవకాశం నాకు లబించినందుకు గర్విస్తూ, వారు వాత్సల్యం ప్రేమతో నాతో ఫోన్‌లో మనస్ఫూర్తిగా మాట్లాడి, నా అజ్ఞతను మన్నించి వారి హృదయాన్ని ఆవిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలుపుకొంటూ, వారిని గూర్చి రాయాల్సిన అవసరాన్ని నాకు ఫోన్‌లో బోధించి, వారి ఫోన్ నంబర్ నాకు ఇచ్చి వారితో మాట్లాడించిన సహృదయులు, మార్గదర్శి డా.శ్రీ తూములూరు శ్రీ దక్షిణా మూర్తి శాస్త్రిగారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

నిష్ఠళ వారిని సరసభారతి మర్చి 26న నిర్వహించిన శ్రీ హేవలంబి ఉగాది వేడుకలకు ఆహ్వానించి వారికి సభాక్తికంగా మా తలిదండ్రుల పేరిట ఉగాది పురస్కారం అందజేసి ధన్యులమయాం.❋

## 416) విజ్ఞాన భైరవతంత్ర కర్త – సత్య సంగానంద సరస్వతి –1953

1953లో పశ్చిమ బెంగాల్ చందర్ నగర్‌లో జన్మించిన స్వామి సత్య సంగానంద సరస్వతిని "స్వామి సత్సంగీ" అని గౌరవంగా పిలుస్తారు. చిన్నతనం నుంచి ఆధునిక సంప్రదాయం వేషభాషలలో పెరిగినా ఆమెకు అనేకమైన ఆధ్యాత్మికానుభవాలు దర్శనమవటంతో అన్నీ పరిత్యజించి స్వామి సత్యానంద సరస్వతి గురువు అనుగ్రహంతో దశమి విధానంలో 6-7-1982లో సన్యాసిని అయింది. తరువాత గురువు సత్యానందంతో కలిసి దేశమంతటా విదేశాలలోని విస్తృతంగా పర్యటించింది. గురువు అనుగ్రహం పుష్కలంగా లభించటంవలన మంత్రం తంత్ర వేదం తత్వ శాస్త్రాలలో మహానిధి అయింది. యోగం తంత్రంలపై అద్భుతమైన గ్రంథాలు రాసి వాటికి అందరికీ కరతలామలకం చేసింది. ఆమె రాసిన "విజ్ఞాన భైరవ తంత్ర" చాలా ప్రసిద్ధమైంది. శంకరాచార్యుల వారి ఆధ్యాత్మిక గ్రంథం సౌందర్య లహరి కి అనుభూతిపరమైన గొప్ప వ్యాఖ్యానం రచించింది. "తత్వ శుద్ధి" అన్న ఆమె గ్రంథం చాలా వ్యాప్తి చెందింది. "ది తాంత్రిక్ సైన్స్ ఆఫ్ ఇన్నర్ ఫీలింగ్" గ్రంథంలో ఆంతరిక శుద్ధిని చక్కగా వివరించింది. పరంపరాగతంగా వస్తున్న యోగ తంత్రాలను ఆధునికకాలానికి అన్వయిస్తూ ఆమె చెప్పిన తీరు బహుధా ప్రశంశనీయం.

1989లో స్వామి సత్యానందం తన అంతర్ దృష్టిలో దర్శించిన జార్ఖండ్‌లోని రిఖియా అనే ప్రదేశానికి వెళ్లి అక్కడ నిర్జన ప్రదేశంలో ఒక ఆశ్రమాన్ని నిర్మించి యోగ సాధన చేయాలని సంకల్పించాడు. అదే సత్యానందం తపోభూమి అయింది. దానికి దారి రోడ్డు ఫోను కరెంట్ కూడా లేని అతి చిన్న ప్రదేశం. 21వ శతాబ్దపు ఆధునికతకు అత్యంత సుదూరంలో ఉన్నది. 1989లో రిఖియా గ్రామం దర్శించి గురువుగారి రాకకు అన్ని ఏర్పాట్లు చేసింది. అప్పటినుంచి అక్కడే ఉండిపోయి సమాజం చేత బహిష్కరింపబడిన సమాజం దృష్టిలో లేని అధో జగత్ సహోదరులకు అన్నీ తానే అయి వారి సర్వతో ముఖాభివృద్ధికి తీవ్రంగా కృషి చేసింది. ఆ ఆశ్రమానికి "శివానంద మఠం" అని పేరుపెట్టింది. ముంగేరులో ఉన్న ఆ ప్రాంతం ఆమె అవిరళ కృషివలన గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లింది.

2007లో సత్య సంగానంద సరస్వతి రిఖియా పీఠ్‌కు పీఠాధిపతి అయింది. శివానంద సరస్వతి బోధించిన సేవ, ప్రేమ దానం అనే మూడింటిని త్రికరణ శుద్ధిగా అనుసరించి అక్కడి ప్రజల భౌతిక ఆధ్యాత్మిక అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేస్తోంది. గురు వరేణ్యులైన శివానంద సత్యానంద సరస్వతుల అడుగు జాడలలో నడుస్తూ దేశ విదేశాలలో వారి భావ ధారను వ్యాప్తి చెందిస్తూ గురువుకు తగిన శిష్యురాలుగా సేవలందిస్తోంది. ❁

## 417) సంస్కృత హైకూ కర్త – హర్ష దేవ మాఖన్ –1954

గుజరాతీ సంస్కృత భాషలలో దిట్ట మైనకవి హర్ష దేవ మాధవ్ 20-10-1954న గుజరాత్‌లోని భావనగర్ జిల్లా వార్తెజ్‌లో మన్ సుఖలాల్, నందన్ బెన్ దంపతులకు జన్మించాడు. ప్రాధమిక విద్య స్వగ్రామంలోనే పూర్తి చేసి, సెకండరీ విద్యను కొలియాక్‌లోని మాధ్యమిక పాఠశాలలో చదివి 1971లో ఎస్.ఎస్.సి పాసయ్యాడు. 1975లో గుజరాత్ యూనివర్సిటీలో ఎక్స్టెర్నల్ విద్యార్థిగా పరీక్ష రాసి బి.ఏ డిగ్రీ అందుకొన్నాడు. టెలిఫోన్ ఆఫీస్‌లో పని చేస్తూనే సౌరాష్ట్ర యూనివర్సిటి నుండి 1981లో సంస్కృతం ఎం.ఏ. డిగ్రీ ప్రధమ శ్రేణిలో సాధించాడు. అహమ్మదాబాద్‌లోని హెచ్,కె.ఆర్ట్స్.కాలేజిలో లెక్చరర్‌గా పని చేశాడు. 1983లో బి.ఎడ్,1990లో పి.హెచ్.డి.గుజరాత్ యూనివర్సిటి నుండి అందుకున్నాడు. "ముఖ్య పురాణాలలో శాపాలు ప్రభావాలు" అనే అంశంపై పరిశోధన చేసి గుజరాతీ భాషలో దిసీస్ రాసి పి.హెచ్‌డి పొందాడు. శ్రీమతి సృతిజానిని వివాహమాడి రుషి రాజ్ జానికి తండ్రి అయ్యాడు.

**కవిత్వంలో ప్రత్యేకతలు**

హర్ష దేవ మాధవ్ జపాన్ "హైకూ", "తంకా"లను, కొరియన్ "సిజో"ను సంస్కృత భాషలో రాసి గీర్వాణ భాషకు కొత్త వెలుగులు అద్ది తన ప్రత్యేకతను చాటుకొన్నాడు. "సంస్కృత కవులలో ఆధునిక, విప్లవ కవులలో ఒకడు" అని సమీర్ కుమార్ దత్తా, హర్షను ప్రశంసిస్తూ హర్షం వెలిబుచ్చాడు. Harshadev Madhav is a modern poet in true sense of the term. He thinks that poetry should appeal first to intellect and thereafter to emotion. In the eternal controversy between intellectuality and emotionalism

Harshadeva takes side of intellectuality. Harshadev happens to be one of the most profound modern Sanskrit poets. He betrays the great influence exerted on him by modern vernacular poetry and some of the images carved out by modern vernacular poets.

**హర్ష దేవ్ సంస్కృత రచనలు**

1-అలకానంద, 2 మృగయా, 3-బృహన్నల, 4-లవ రస దిగ్దాఃస్వప్న మయా పర్వ తాః, 5-ఆశిచ్ఛ మే మనసి, 6-నిష్క్రాంతాః సర్వే, 7-మృత్యుస్వం కస్తూరి మృగోస్తి అనే పేరుతో సంస్కృత నాటకాలు వ్యాసాల సంకలనం, 8-బుద్ధస్య భిక్ష పత్రే, 9-భావాస్థిరాని జననాంతర సౌహృదాని, 10-కన్నఖ్యా క్షిప్తం మాణిక్య నూపురం, 11-భాతితే భారతం అనే సంస్కృత ప్రతికావ్యం. 1992 నాటికే 2,200 కవితలను సంస్కృతంలో రాసిన పోస్ట్ మోడరన్ సంస్కృత కవి హర్షదేవ మాధవ్.

**"మాధవ" గుజరాతీయం**

1-హత్ ఫంఫోసే ఆంధియా సుగందినే (కావ్యం). 2-మహాకవి మాఘ. 3-శ్రీవాణి చిత్ర శబ్ద కోశ (సంస్కృతం -ఇంగ్లీష్ -హిందీ -గుజరాతి బొమ్మల నిఘంటువు (పిక్చర్ డిక్షనరి).

**ఆంగ్ల "దేవం"**

హర్ష దేవ మాధవ్ ఇంగ్లీష్‌లో "మోడరన్ సాంస్క్రిట్ పోయెట్రి ఆఫ్ గుజరాత్ అప్ టు ది ఎండ్ ఆఫ్ 20త్ సెంచరి (కంట్రి బ్యూషన్ ఆఫ్ గుజరాత్ టు సాంస్క్రిట్ లిటరేచర్ - 1998)

"హర్షా"తిశయ పురాస్కారాలు

హర్ష దేవమాధవ్ 1994లో గుజరాత్ సంస్కృత అకాడెమి అవార్డ్ అందుకొన్నాడు. 1997-98లో భారతీయ భాషా పరిషత్ అవార్డ్ పొందాడు ఆయన రచించిన "నిష్క్రాన్తయః సర్వే" సంస్కృత రచనకు 1997లో అఖిలభారత కాళిదాస సమ్మానాన్ని మధ్య ప్రదేశ్ కాళిదాస అకాడెమి నుండి పొందాడు. 2006లో "తవ స్పర్శే స్పర్శే" సంస్కృత కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డ్ అందుకొన్నాడు. 2010లో గుజరాత్ సాహిత్య గౌరవ పురస్కారం గ్రహించాడు. ఎడిన్ బర్గ్‌లో జరిగిన 13వ ప్రపంచ సంస్కృత సభలో జరిగిన కవి సమ్మేళనంలోను. క్యోటోలో జరిగిన ప్రపంచ సంస్కృత సదస్సులోనూ పాల్గొని గౌరవ పురస్కారాలు అందుకొన్నాడు.❁



## 418) మాణిక్య ప్రభ కర్త - భాషాశాస్త్రవేత్త, న్యాయ విద్యా ప్రవీణ, వేదాంతాచార్య శ్రీ గబ్బిట ఆంజనేయశాస్త్రి -1954

డా.శ్రీ గబ్బిట ఆంజనేయ శాస్త్రి 15-8-1956న కృష్ణాజిల్లా పెదపారు పూడి మండలం యలమర్రు గ్రామంలో జన్మించారు. తండ్రి శ్రీ గబ్బిట మేధా దక్షిణామూర్తి శాస్త్రి గారు, తల్లి శ్రీమతి భ్రమరాంబా సావిత్రి గారు. కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యా పీఠంలో చదివి ఆంధ్ర విశ్వ విద్యాలయంలో చేరి 1980లో ఎం.ఏ పాసైనారు. 1979లో శ్రీమతి పద్మావతి గారిని వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు కుమారులు శ్రీ సుబ్రహ్మణ్య సీతారామ శర్మ, జయ మాణిక్య శాస్త్రి, శ్రీ శ్రీనివాస యజ్ఞ దక్షిణామూర్తి శాస్త్రి. 82లో గుంటూరు విద్వత్ పరిషత్, గౌరవ డాక్టరేట్‌నిచ్చి గౌరవించింది. తిరుపతి కేంద్రీయ సంస్కృత విద్యాపీఠం 1985లో గౌరవ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పురస్కారమిచ్చి సన్మానించింది.

గుంటూరులో డాక్టర్ శ్రీ కొలచల వెంకట కృష్ణ శాస్త్రి గారి సంస్కృత కళాశాలలో 1977నుండి 83వరకు లెక్చరర్‌గా పని చేసి 1983-88 కాలంలో తిరుపతిలోని న్యాయ సంస్కృత విద్యాపీఠంలో సేవలందించి, తర్వాత బెనారస్‌లోని న్యాయ వైదిక దర్శన సంస్కృత కళాశాలలో రీడర్‌గా ఉన్నారు. 1988 నుండి బెనారస్ హిందూ సంస్కృత విశ్వ విద్యాలయంలో సంస్కృత శాఖాధ్యక్షులుగా పని చేస్తున్నారు. 1997 నుంచి తర్క, వేదాంత శాస్త్రాలలో ప్రొఫెసర్‌గా ఉన్నారు.

శాస్త్రి గారి గీర్వాణ రచనలు- 1982లో జగదీశ భట్టాచార్య తర్కామృతంపై "మాణిక్య ప్రభ" రాశారు. 1995 మాధురీ గాదాధరీ మత భేద విమర్శ రచించారు. 1987లో "పంచలక్షణ శత కోటి"కి సంపాదకత్వం వహించారు. రామ రుద్రీయ వ్యుత్పత్తి వాదం మొదలైన వాటిపై ధారా వాహికంగా 1978 నుండి 1981 వరకు నాలుగేళ్ళు విజయవాడ ఆకాశవాణిలో తర్క శాస్త్ర వైభవం, అనిత్యః శబ్దః, పరమాణు స్వరూపం, వ్యక్తి వివేక విమర్శనం మున్నగు అంశాలపై ప్రసంగాలు చేశారు.

శ్రీ ఆంజనేయ శాస్త్రిగారు 1984-88 వరకు తిరుమల తిరుపతి దేవస్థాన

ఉపన్యాసకులుగా ఉన్నారు. వారణాసి కే.కే. డి.లో, హైదరాబాద్‌లోని డివైన్ లైఫ్ సొసైటీలో సభ్యులు, వక్తలుగా ఉండి భాగవత, రామాయణ, స్కాంద పురాణాం తర్గత కాశీ ఖండాలపై ప్రవచనం చేశారు. సంప్రదాయ న్యాయ మీమాంస వేదాంత శాస్త్రాలను బోధించటమే శాస్త్రిగారి ముఖ్య అభిరుచి. ఈ శాస్త్రాలలో వీరికి గురువులు మహా మహోపాధ్యాయ బ్రహ్మశ్రీ మద్దులపల్లి మాణిక్య శాస్త్రి గారు, పండిత రాజ ఎస్.సుబ్రహ్మణ్య శాస్త్రి గారు, పండిత రాజ, పద్మభూషణ్ పి.యెన్.పట్టాభి రామశాస్త్రి గారు, న్యాయ వేద వేదాంత విద్వాన్ శ్రీ ధూళిపాళ రామచంద్ర శాస్త్రి గారు, కవితార్కిక చక్రవర్తి శ్రీ దోర్బల ప్రభాకర శర్మ గారు.

1670 కాలపువాడైన నాగేశ భట్టు భట్టోజీ దీక్షితుల భారతీయ పంచాంగం ప్రకారం కాల, తిధి నిర్ణయంపై "తిధి నిర్ణయం" అనే సంస్కృత శాస్త్ర గ్రంథాన్ని ప్రకాశింప జేశారు. జగదీశ భట్టాచార్యుడి తర్కామృత గ్రంథంపై సంస్కృతంలో శాస్త్రిగారు "మాణిక్య ప్రభ సంస్కృత వ్యాఖ్యా విభూషితం" చేశారు. శాస్త్రిగారి ద్వితీయ పుత్రులు, పూరీ జగన్నాధ సంస్కృత విశ్వ విద్యాలయంలో తర్క శాస్త్రంలో అసోసియేట్ ప్రొఫెసర్ అయిన శ్రీ జయమాణిక్య శాస్త్రి "మణిప్రభ హిందీ వ్యాఖ్య" సంవలితం చేశారు. దీనిని వారణాసి శారదా సంస్కృత సంస్థానం 2012లో ప్రచురించింది. ఇది న్యాయ తత్వ శాస్త్రంపై మహా వ్యాఖ్యానం. జ్యోతిశ్శాస్త్రంపై కాళిదాసుని "కాలామృతం"కు చింతలపాటి వెంకట యజ్వ రచించిన "ఉజ్వలా వ్యాఖ్యానం"ను శాస్త్రి గారు సంపాదకులుగా వెలువరించారు. దీన్ని తిరుపతి వేద విశ్వవిద్యాలయం ముద్రించింది. క్రీ.శ.1600 కాలం వాడైన మధురానాథ తర్క వాగీశుని "మాధురీ" 17,18 శతాబ్దాలకు చెందిన గదాధర భట్టాచార్య రాసిన "గాదాధరీ", 13వ శతాబ్దికి చెందిన గంగేశుని "తత్వ చింతామణి" వ్యాఖ్యానాలను తులనాత్మకంగా పరిశోధించి శాస్త్రిగారు "మాధురీ గాదాధర్యోర్మత భేద విమర్శ" అనే ఉద్గ్రంథాన్ని రాశారు. దీన్ని తిరుపతి పద్మావతీ ప్రకాశన సంస్థ ప్రచురించింది. రామరుద్ర భట్టాచార్యులు రాసిన "వ్యుత్పత్తి వాద వ్యాఖ్యానాన్ని" మద్రాస్‌లోని అడయారు లైబ్రరీ నుంచి కంచి కామకోటి పీఠ ఆస్థాన విద్వాంసులైన మహా మహోపాధ్యాయ శ్రీ ఎస్.ఆర్.కృష్ణ మూర్తి శాస్త్రిగారి ద్వారా తెప్పించి "వ్యుత్పత్తి వాదః –రామ రుద్రీయ వ్యాఖ్యన సహితః" అని ప్రకాశనం చేశారు. దీనిని న్యు ఢిల్లీ సంస్కృత సంస్థానం ముద్రించింది. ఆదిత్యాచార్య వైదిక కర్మకాండలపై రాసిన "షడ శీతి"పై నంద పండిత వ్యాఖ్యాన పరామర్శ రాశారు. దీన్ని ఉజ్జైన్‌లోని ఇండలాజికల్ రిసెర్చ్ సంస్థ ముద్రించింది.

డా. శ్రీ ఆంజనేయ శాస్త్రిగారు అనేక మంది విద్యార్థులకు తర్క, వేదాంత, మీమాంస శాస్త్రాలను బోధిస్తూ పరిశోధనకు ప్రోత్సహిస్తూ సుమారు 25 మందిచే తర్క

వేద వేదాంత శాస్త్రాలలో పి.హెచ్.డి సాధించటానికి మార్గ దర్శనం చేశారు. ప్రస్తుతం వీరి మార్గ దర్శనంలో 10 మంది పి.హెచ్. డి.,పి.డి.ఎఫ్ చేస్తున్నారు. కంచి కామకోటి పీఠాదిపతులు శ్రీ శ్రీ చంద్ర శేఖరేంద్ర సరస్వతి స్వామి వారి సన్నిధిలో శాస్త్రిగారు శాస్త్రార్ధం చేసి స్వర్ణపతకం పొందారు .శ్రీ వారి అనుగ్రహం తో శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారికి తర్క శాస్త్రాన్ని వినిపించారు. ఆంధ్ర పీఠమైన పుష్పగిరి శంకరాచార్యులు శ్రీ విద్యా నృసింహ భారతీ స్వామి వారి ఆదేశంతో వారి ఉత్తరాధికారి, ప్రస్తుత పీఠాదిపతి శ్రీ విద్యాశంకర భారతీ స్వామివారికి తర్క వేదాంత శాస్త్రాలను కాశీలో శ్రీ శాస్త్రి గారి ఇంటి వద్దనే శ్రవణం చేయించారు. అనేక మంది పీఠాదిపతుల వద్ద గోలోకం, కాళీ శాంకరి, బచ్యార్యూ "అద్వైత సిద్ధి, బ్రహ్మానందీయ క్రోడ పత్ర" విషయాలపై శాస్త్రార్ధాలు చేసి జగద్గురువుల అనుగ్రహం పొందారు. కంచి, శృంగేరి, ద్వారక, పుష్పగిరి, ఉడిపి పీఠాలలో శాస్త్రార్ధ చర్చ చేసి "శాస్త్ర విద్వన్మణి", "న్యాయరత్న , "ఆర్షవిద్యా భూషణ" బిరుదులను అందుకున్నారు. శ్రీ జయేంద్ర సరస్వతీ స్వామి వారి ఆజ్ఞానుసారం మహా మహోపాధ్యాయ శ్రీ మద్దులపల్లి మాణిక్య శాస్త్రి గారి ఇంటిలో అంతేవాసిగా ఉండి తర్క వేదాంత శాస్త్రాలను ఆపోసన పట్టారు.

"న్యాయ విద్యా ప్రవీణ" మరియు వేదాంతాచార్య "బిరుదులు శ్రీ ఆంజనేయ శాస్త్రి గారి న్యాయ, మీమాంసా శాస్త్ర పాండిత్యానికి, వేదాంత ప్రతిభకు సార్ధకతను చేకూర్చాయి. "న్యాయ విద్యా ప్రవీణ" మరియు వేదాంతాచార్య" బిరుదులు శ్రీ ఆంజనేయ శాస్త్రి గారి న్యాయ, మీమాంసా శాస్త్ర పాండిత్యానికి, వేదాంత ప్రతిభకు సార్ధకతను చేకూర్చాయి. 2017 మార్చిలో విజయవాడలో తమ గురువర్యులు బ్రహ్మశ్రీ మద్దులపల్లి మాణిక్య శాస్త్రి గారి శాత జయంతి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించటానికి కుటుంబ సమేతంగా వారణాసి నుంచి తరలివచ్చి దగ్గరుండి జరిపించి, మద్దులపల్లి వారిపై ఒక చిన్న కరదీపిక ముద్రించి ఆవిష్కరింప జేసిన వారు అందులో మద్దులపల్లి, గబ్బిట వారలపై నా వ్యాసాలూ ఉండటం నేను చేసుకొన్న పుణ్యఫలం.❋

## 419) సాక్షి శీల కర్త – హెచ్ వి.సత్యనారాయణ శాస్త్రి –1954

గో.రు.చన్నబసప్ప కన్నడ నాటకం "సాక్షికల్లు"ను హెచ్ వి నారాయణ శాస్త్రి "సాక్షి శీల"గా సంస్కృతీకరించగా బెంగుళూరు పల్లవ ప్రకాశన్ 1989లో ముద్రించింది.❋



## 420) విశ్వనాధ "వేయిపడగలు" నవలను సంస్కృతీకరించిన విదుషీమణి – డా. అయ్యగారి ప్రభావతీదేవి –1955

ఆకాశంలో సగభాగం అయిన మహిళలు సాధించరానిది ఏమీ ఉండదు అని నిరూపించిన తెలుగింటి ఆడపడుచు డా. అయ్యగారి ప్రభావతీ దేవి. చురుకైన మేధ, తలిదండ్రుల వారసత్వం, తీర్చి దిద్దిన గురుదేవులు, స్వయం కృషి, పట్టుదల, సాహసం తనను తాను నిరూపించుకోవాలనే మనోనిశ్చయం వలన శ్రీమతి ప్రభావతీ దేవి గారు అనుకున్నవన్నీ సాధించారు. స్వయం సిద్ధ అయిన ఆమె జీవితం స్ఫూర్తి దాయకం.

**దేవీ విలాసం–తాత తండ్రిల వారసత్వం**

విద్వాత్కవులు, పురాణ పరమేష్టి, ఆంధ్ర వ్యాసులు, సంస్కృత తకళాశాల ప్రిన్సిపాల్, డీన్ శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్యగారు శ్రీమతి ప్రభావతీ దేవి గారి గురించి రాసిన "దేవీ విలాసం" వలన ఈమె దేశభక్తుడు, స్వాతంత్రోద్యమంలో జైలుకు వెళ్లి, దానికి సంబంధించిన ఏ విధమైన ప్రతి ఫలం ప్రభుత్వం నుంచి ఆశించని త్యాగశీలి అయిన శ్రీ అయ్యగారి సుబ్బారావు గారి కుమార్తె అని, తల్లి శ్రీమతి శ్యామలంబ అని, తండ్రి ప్రయాగలో ఒక పుష్కర కాలం ఉండి సంస్కృతం, హిందీలలో ప్రావీణ్యం సాధించారని, తాతగారు కుమార స్వామిగారు చతురాశ్రమ నిష్టా గరిస్టులని, వీరి సన్యాసాశ్రమ నామం "కేశవానంద సరస్వతి" అని స్వగ్రామం తూర్పు గోదావరి జిల్లా కొత్తపేట తాలూకా బండారులంక అని, తాత, దండ్రుల సంస్కృత భాషాభిమానం, అభినివేశం ఈమెకు సంక్రమించిందని తెలుస్తోంది. తండ్రికి ఈ కుమార్తెపై ఆ శ్రీదేవి మీద భక్తి ఉన్నంత వాత్సల్యం ఉండేది. ప్రాణం కన్నా ఎక్కువగా పెంచారు. వారి వ్యక్తిత్వమే ఈదేవిగారికి అబ్బింది. తండ్రి గొప్ప గణిత శాస్త్రాభిమాని. ఆయన స్వయంగా రూపొందించి గ్రంథస్థం చేసిన "దీరమ్స్" చాలా ఉన్నాయి. ప్రభావతీ దేవిగారి అన్నగారు శ్రీ భుజంగరావు ఆల్విన్ సంస్థలో ఉద్యోగించి స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన కమ్యూనిస్ట్ అభిమాని. తనకు పదవీ విరమణ సమయంలో కంపెనీ ఇచ్చిన ధనాన్నంతా పార్టీకే

సమర్పించి, సఫిల్ గూడాలో ఉంటున్న త్యాగి.

**దేవి విద్యా సోపానం**

ప్రభావతీ దేవి 29-6-1955లో జన్మించారు. 1988లో ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి చదివి తెలుగు ఎం.ఏ పొందారు. 1991లో ఇంగ్లీష్‌లో ఎం.ఏ ను ప్రైవేట్‌గా చదివి సాధించి, తర్వాత అదే యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజిలో చదివి సంస్కృతం లోనూ ఎం.ఏ అందుకొన్నారు. "సంస్కృతాంధ్ర భాగవతాష్టమ స్కంధాను శీలనం"పై ఎం.ఫిల్ పట్టా పొందారు. విద్యాదాహం తీరని దేవి 1996లో జర్నలిజం కోర్సు చేసి, హైదరాబాద్ తెలుగు విశ్వ విద్యాలయంలో "జ్యోతిషం" డిప్లొమా తరగతులకు హాజరై జ్యోతిషం నేర్చారు కాని జాతకాలు వేయరు చెప్పరు. హిందీ తమిళ, ఉర్దూలను అభ్యసించిన వీరు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ లాంగ్వేజెస్‌లో 1998లో స్పానిష్ భాషలో ప్రిలిమినరి కోర్సు చేశారు. ఆచార్య బూరగడ్డ నరసింహాచార్య వద్ద ఉస్మానియాలో "సంస్కృత వాఙ్మయే నీతి కావ్యాని" అనే విషయంపై పరిశోధన చేసి 2004లో పి.హెచ్‌డి పొందారు.

**ఉద్యోగ సోపానం**

ప్రభావతీ దేవి గారికి నాట్యం వృత్తి కాదు కాని పాఠశాల వార్షికోత్సవాలలో నాట్యం చేసేవారు. శ్రీ కృష్ణుడు వీరి అభిమాన పాత్ర. కాళిదాసు శకుంతల సంస్కృత నాటకంలో శకుంతల పాత్ర, మరికొన్ని సంస్కృత నాటకాలలో ముఖ్య పాత్రలనూ పోషించారు. ఉపాధ్యాయ వృత్తిపై అభిమానం ఉండటంతో కొంతకాలం రంగారెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్స్‌లో తెలుగు పండితులుగా పనిచేసి స్వచ్ఛందంగా విరమించి, సికందరాబాద్ మెహబూబ్ డిగ్రీ కాలేజిలో సంస్కృతం లెక్చరర్‌గా 1996లో చేరి పనిచేస్తూ, సంస్కృత పరిచర్య చేస్తూ 2007లో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. 2010 నుంచి అమెరికాలో ఉంటున్నారు. 1988లో హైదరాబాద్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నేషనల్ ఓరియెంటల్ కాన్ఫరెన్స్‌లో 1-శ్రీ రాయప్రోలు సుబ్బారావు "అమలిన శృంగార తత్త్వంలోని ఔచిత్యం, 2-సంస్కృత వాఙ్మయే ప్రహేళిక" అనే రెండు పరిశోధన పత్రాలను సమర్పించారు. 1988లో తిరుపతిలో జరిగిన విశ్వ హిందూపరిషత్ ధర్మ సమ్మేళనంలో "హిందూ ధర్మ ఇన్ సాంస్క్రిట్ లాంగ్వేజ్" పేపర్‌ను, 2002 మార్చి లో వారణాసిలో జరిగిన అఖిల భారత సంస్కృత సమ్మేళనంలో "వైదిక, లౌకిక సాహిత్య కరణా దృస్టౌ నారి" పేపర్‌ను సమర్పించారు.

## దేవి సామాజిక సేవ

బహుముఖ ప్రజ్ఞాశీలి శ్రీమతి ప్రభావతీదేవికి విద్యాతృష్ణ తోపాటు సాంఘిక సేవాభిలాష కూడా ఎక్కువే. తండ్రి నుంచి సంక్రమించిన స్వతంత్ర దృక్పథం ఆమెను అన్నిరంగాలలో అగ్రేసర స్థానంలో నిలబెట్టింది. తండ్రి కాంగ్రెస్, అన్న కమ్యూనిస్ట్ అయితే దేవి గారు భారతీయ జనతాపార్టీలో చేరి 1990 నుండి రెండేళ్ళు రంగారెడ్డి జిల్లా స్త్రీ విభాగంలో అవిరామంగా పనిచేశారు. 1993లో భా.జ.పా.కార్యవర్గ సభ్యురాలిగా సేవలందించారు. ఆ భావ ధారఉన్న సంస్థలకు తన సేవలను కొనసాగిస్తూనే ఉన్నారు. సఫిల్‌గుడా లయన్స్ క్లబ్ చార్టర్ మెంబర్‌గా, ప్రెసిడెంట్‌గా ఒక దశాబ్దంపైగా ఉండి వివిధ సేవాకార్యక్రమాలను చేబట్టి నిర్వహించారు. బోలారం మహాకాళీ దేవాలయ ధర్మకర్తృత్వ సంఘ సభ్యురాలుగా చాలాకాలం ఉన్నారు. స్మార్తం క్షుణ్ణంగా అభ్యసించి కావాలనుకొనే వారికీ పౌరోహిత్యమూ నిర్వహిస్తున్నారు.

## వివాహ బంధం

శ్రీ ఏలూరి పాటి వారి "దేవీ విలాసం" వలన ప్రభావతీ దేవిగారు సౌదీ అరేబియాలో ఇంజినీర్‌గా పని చేసి ప్రస్తుతం అమెరికాలో సివిల్ ఇంజనీర్‌గా ప్రముఖ పదవిలో ఉన్న పని శ్రీ రాచపూడి హరగోపాల శర్మగారిని వివాహమాడి, సుగాత్రీ శర్మ, లలితా సుహాసినీ అనే కుమార్తెలను, కళ్యాణ చక్రవర్తి అనే కుమారుని ఆ దంపతులు సంతానంగా పొందారని, అందరకూ వివాహాలు చేసి బాధ్యతలు తీర్చుకున్నారని తెలుస్తోంది.

## దేవి వ్యక్తిత్వ వికాసం

బహుముఖీన వ్యక్తిత్వ వైదుష్యాలు పెంచుకొంటూ పిల్లల విద్యాభివృద్ధికి దోహదపడుతూ, అన్ని రంగాలో అనుక్షణం ప్రశంసనీయ కృషి చేస్తూ తన తన గురు పండితాదులకు చేసే సేవ నిరుపమానం అంటారు అనంత రామయ్యగారు. ఒక చేతితో చేసే దాతృత్వం రెండో చేతికి తెలియకుండా చేసే గుణ సంపన్నురాలు. పాఠశాల వార్షికోత్సవాలకు హాజరవుతూ వారి వికాసానికి దోహదపడుతూ ఆమె చేస్తున్న సేవ ఆమె నిరహంకార వ్యక్తిత్వానికి దర్పణం. ప్రాచీన పద్ధతిలో శాస్త్రాధ్యయనం చేసిన వారంటే ఆమెకు ప్రత్యేక గౌరవం. శ్రీ కేరళ సుబ్రహ్మణ్య శాస్త్రి సాహిత్య శాస్త్ర గురువుగా, శ్రీ రామ స్వామి శాస్త్రి ఘన పాఠి గారు వ్యాకరణ శాస్త్ర గురువుగా, ఆమె ప్రత్యేకంగా చెప్పుకొని గౌరవిస్తారు. అలాగే ఉస్మానియాలో తన గురువు, మార్గదర్శి శ్రీ బి నరసింహాచార్య అంటే వల్లమాలిన భక్తీ వినయం ప్రదర్శిస్తారు. ఆమె ఆరాధ్యదైవం శ్రీ

లలితా పరా భట్టారికను అనునిత్యం పూజించి సహస్రనామ పారాయణ చేయనిదే ప్రభావతీ దేవిగారు ఆహారం స్వీకరించరు. పారాయణ సమయంలో ఎవ్వరితోనూ మాట్లాడని దీక్ష ఆమెది దేవి ముందు చేసిన ప్రతిజ్ఞ అతిక్రమించదు. ప్రతి ఏడాది ఆమె నిర్వహించే చండీ హోమం రుద్రాభిషేకం చూసి తీరవలసిందేకాని మాటలతో వర్ణించేది కాదంటారు ఏలూరి పాటి వారు. "ఒకరు చెప్పింది చేయదు తనకు తోచింది చేయక మానదు. వట్టి "చండిక" అంటారాయన. ఆపదలలో ఉన్నవారిని ఆదుకోవటానికి ఎంత దూరమైనా వెడుతుంది ఎంత ఖర్చైనా పెడుతుంది. సామాన్యులకు ఆమె మాట సుగ్రీవాజ్ఞ. గుణ గ్రాహిణి, ఏక సంథ గ్రాహిణి. సంస్కృత సాహిత్య శాస్త్రంలో రసవంతాలైన శ్లోకాలెన్నో ఆమె జుహ్వాగ్రంపై నర్తిస్తాయి. ఆకాశవాణి కేంద్రంలో అమరవాణి కార్యక్రమాలలో ఆమె చేసిన ప్రసంగాలు, స్వీయ కవితలు సమ్మోహనాలు, చిరస్మరణీయాలు అంటారు అనంతరామయ్యగారు. హైదరాబాద్ దూరదర్శినిలో ప్రసారమైన "పద్యాల తోరణం" కార్యక్రమంలో మూడుసార్లు ఆమె స్థాననిర్ణేతగా వ్యవహరించి సమర్ధత చాటారు. అదే సంస్థలో ఎర్రా ప్రగడ కవిత్వంపై ముఖాముఖి కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. ఒక ఓరియెంటల్ కార్యక్రమంలో "అమలిన శృంగారం" వాదాన్ని ఆక్షేపించి వచ్చిన ప్రతివాదాన్నీ ఎదుర్కొని సమాధానం చెప్పి నెగ్గిన తీరు మర్చిపోలేని దంటారు శ్రీ ఏలూరి పాటి. నల్లకుంట శంకర మఠం మొదలైన దేవతా స్థానాలలో "దేవీ భాగవత సప్త శతి" మొదలైన ఆధ్యాత్మిక గ్రంథాలలోని పరమాద్భుత విశేషాలను వివరిస్తూ చేసిన ప్రసంగాలు స్తవనీయాలు. పురుషాధిక్యాన్ని ధిక్కరించే తత్త్వం శ్రీ దేవిగారిది. శ్రీ మాడుగుల నాగఫణిశర్మ, శ్రీ గరికపాటి నరసింహారావు శ్రీ రాళ్ళబండి కవితాప్రసాద్‌లవంటి లబ్ద ప్రతిష్టులైన అవధానుల తెలుగు సంస్కృత కవి సమ్మేళనాలలో పృచ్ఛకులుగా వ్యవహరించారు. శ్రీమతి ప్రభావతీ దేవిగారికి శ్రీ పుష్పగిరి పీఠాదిపతుల అమోఘ ఆశీస్సులున్నాయి.

**రచనా ప్రభావతీయం**

అభిజ్ఞాన శాకుంతలంపై సమీక్ష రాశారు. ఆంధ్రభూమి దినపత్రికలో 2001-2002 కాలంలో "శ్రీకృష్ణ కర్ణామృతం" ధారావాహికగా ప్రభావతీదేవి గారు రచించారు. 1987లో "శ్రీ బోలారం మహాకాళీ సుప్రభాతం 2-2001"కు తోవా మానుష్యం" (మానవత్వం ఎక్కడ), 3-2004లో శశిరేఖా విజయం అనే నాటకం, 4-బాలికా పంచాశికా, 5) కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి "వేయి పడగలు" నవలను సంస్కృతంలోకి "సహస్ర ఫణాః" పేరుతో అనువదించారు. దీని వ్రాత ప్రతి ఆవిష్కరింపబడింది. పుస్తక రూపంలో ఇంకా వెలువడలేదు. 6 "గురు ధిక్కారం-శిష్య

వాత్సల్యం" కూడా ముద్రణ పొందాలి.

**దేవీ పురస్కార వైభవం**

ప్రభావతీ దేవిగారి ప్రతిభకు తగిన పురస్కారాలు లభించాయి. 1977లో "మధుర కవయిత్రి" బిరుదును కంటోన్‌మెంట్ టీచర్స్ యూనియన్ ప్రదానం చేసింది. 1987లో "భారతీ ప్రభ" బిరుదునిచ్చి "సువర్ణ కంకణం" బహూకరించి బోలారం మహా కాళి దేవాలయం సత్కరించింది. 2003లో "గీర్వాణ భాషా సుభాషా" నవ్య కళాసాగర్ సాహిత్య సంస్థ ప్రసిద్ధ రచయిత శ్రీ పోతుకూచి సాంబశివరావు చేత సువర్ణ కంకణంను రైల్వే మంత్రి శ్రీ బండారు దత్తాత్రేయ గారి చేతుల మీదుగా అందజేసింది. ఆధారం- 1-శ్రీమతి ప్రభావతీ దేవి గారి సంస్కృత రచన "కుతోవా మానుష్యం"లో శ్రీ ఏలూరి పాటి అనంత రామయ్యా గారి వ్యాసం "దేవీ విలాసం".

2- డా.బి.నరసింహాచార్య గారిని నాకు ఫోన్‌లో పరిచయం చేసిన వారు మా శ్రీ మైనేని గోపాలకృష్ణ గారు (అమెరికా). ఆచార్యులగారు తమ పుస్తకాలను నాకు పంపారు. వారితో సంభాషించేటప్పుడు వారు శ్రీమతి అయ్యగారి ప్రభావతీదేవి గారి వైదుష్యాన్ని ఆమె వేయి పడగలును సంస్కృతంలోకి అనువదించటాన్ని, ఆమె అద్భుత కవితా సామర్థ్యాన్ని తెలియజేసి ఆమెపై కూడా 3వ గీర్వాణంలో నన్నుతప్పక రాయమని ప్రోత్సహించి ఆమె ఫోన్ నంబర్ ఇచ్చారు. వారితో సంభాషించాను. ఆమె వ్యక్తిత్వం నచ్చింది. ఫోన్‌లోనే ఇంటర్వ్యూ చేశాను. కొన్ని వివరాలు చెప్పారు. శ్రీ ఏలూరి పాటివారు విపులంగా తనను గురించి రాశారని ఆ పుస్తకం తనవద్ద ప్రస్తుతం లేదని చెప్పారు. ఆమె మెయిల్ అడ్రస్‌కు సరసభారతి టపాలు పంపుతున్నాను. రెండవ గీర్వాణం, మాణిక్యాలు, సీతారామయ్య, దైవ చిత్తం, మా అన్నయ్య పుస్తకాలు పోస్ట్‌లో పంపాను డిసెంబర్ 26న హైదరాబాద్ వెళ్ళినప్పుడు ఆమె తనకు పుస్తకాలు అందాయని మెయిల్ రాశారు. సమాధానంగా మేము హైదరాబాద్‌లో నాచారం దగ్గర మల్లాపూర్‌లో ఉన్నామని రాశాను. వెంటనే మమ్మల్ని మాకు దగ్గరలోనే ఉన్న మెట్టుగూడాలోని తమ అపార్ట్‌మెంట్ కు రమ్మని ఆహ్వానించారు. సరేనని వెళ్లాం. గీర్వాణం మొదటిభాగం కూడా అప్పుడు వారికి అందజేశాను. అప్పుడు ఆమె రచనలు మూడు పుస్తకాలు ఇచ్చారు. నేను ఆమెను ఇంటర్వ్యూ కూడా చేశాను. అన్నిటికీ చక్కని సంతృప్తికర సమాధానాలు చెప్పారు. తమ పౌరోహిత్య పాటవాన్ని సెల్ ద్వారా రికార్డ్ చేసింది వినిపించారు. ఇవన్నీ కూడా ఈ రచనకు ఆధారాలే. దీనికి కంతటికీ కారణ భూతులైన శ్రీ మైనేని శ్రీ నరసింహా చార్య శ్రీమతి ప్రభావతీ దేవి ప్రభావతీదేవి ప్రతిభా సర్వస్వం- "సహస్ర ఫణాః"గా వేయిపడగలు సంస్కృతానువాదం.

విశ్వనాథ వేయిపడగలు అంటే ఆయన "మేగ్నం ఓపస్"గా భావింపబడే ఆధునిక నవలేతి హాసం. వెయ్యి పేజీల బృహత్ నవల. దీనిని సంస్కృతంలోకి తర్జుమా చేయమని గురుస్థానీయులు శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్యగారు సూచించటం వెంటనే ఆ కార్యక్రమాన్ని చేబట్టి దిగ్విజయంగా పూర్తి చేయటం శ్రీమతి ప్రభావతీదేవికే చెల్లింది. అది ప్రభావతీ మేధో సర్వస్వమే అయింది. డిసెంబర్ 28వ తేదీన వారి అపార్ట్‌మెంట్‌కు మేము వెళ్ళినప్పుడు వేయిపడగలు వ్రాత ప్రతి ఆమె టేబుల్‌పై దర్శన మిచ్చింది. ముత్యాలవంటి స్వదస్తూరితో చక్కని వరుసక్రమంలో ఆమె వెయ్యి పేజీలలో సంస్కృతంలోకి అనువాదం చేశారు. ముచ్చటవేసింది ఆ సంస్కృత ప్రతి చూడగానే ఫోటోలు తీశాను. పుస్తకం ఆవిష్కరణ జరిగిందని విన్నానే ఎలా చేశారు అని అడిగితే డి.టి.పి. చేసిన సుమారు వంద పేజీల స్పైరల్ బైండింగ్ చూపించి దానినే ఆవిష్కరించామని చెప్పారు. దీని ఫోటో కూడా తీసుకొన్నాను. "అనువాదంలో మీ స్త్రీవాద ప్రభావం పాత్రలపై పడిందా?" అని అడిగాను. "లేదు. ఏ పాత్రనూ నేను ముట్టుకోలేదు. విశ్వనాథ వారు ఏది ఎలాచేప్పారో దాన్ని తు.చ తప్పకుండా సంస్కృతంలో రాశాను. కనుక పాత్రలపై నా ప్రభావం పడే అవకాశం లేదు, నేను తీసుకోనూ లేదు"అని చెప్పారు. ఇంతటి బృహద్రచన అనువాదం చేయటానికి ఎంతో ఓపికా సమయం కావాలి కదా. ఎంతకాలంలో రాశారు? అని అడిగితే "ఏలూరి పాటి గురువు గారి ఆదేశం, ఆశీస్సు, ప్రోత్సాహం ఉండటం వలన ఎక్కడా ఆగకుండా జయప్రదంగా 2001లో ప్రారంభించి మూడేళ్ళలో 2004కు పూర్తి చేశాను" అన్నారు. "ఆయన ఆదేశంపై రాశానని అన్నారు కదా అసలు ఆ నవలపై మీకు అంతకు ముందు ఎలాంటి అభిప్రాయం ఉంది?" అని అడిగితే "ఆ నవల గురించి వినటమేకాని, పూర్తిగా చదవలేదు కాని అనువాదం కోసం చదవటం మొదలు పెడితే అద్భుతం అనిపించింది. రెట్టించిన ఉత్సాహంతో రాసుకుంటూ వెళ్ళిపోయాను" అన్నారు. "మరి ఈ కాలానికి సంస్కృతానువాదం పనికొస్తుందా?" అని అడిగా. "అది కాలం నిర్ణయిస్తుంది. మన ప్రయత్నం మనం చేయాలి" అని చెప్పారు. అందులోని ఏ పాత్రలు మీకు నచ్చాయి? అని ప్రశ్నిస్తే "మంగమ్మా, భర్తలు బాగా నచ్చిన పాత్రలు. కారణం జవం జీవం ఉన్నపాత్రలు కనుక" అని ఠకీమని చెప్పారు. "అందరికి ధర్మారావు అరుంధతి నచ్చుతారు కదా" అన్నాను. "వారి విషయం ఏమోకాని ధర్మారావు విశ్వనాథ వారి "టైలర్ మేడ్ షర్ట్" (ఈ మాట ఆమె అనలేదు కాని ఆమె భావానికి నేను పెట్టిన పేరు మాత్రమే) అనిపిస్తాడు నాకు. మొదటి అరుంధతి అభిమాన పాత్ర. రెండో అరుంధతి నచ్చలేదు" అన్నారు. "అనువాదానికి న్యాయం చేశారని అనుకొంటారా?" అనగానే "నూటికి నూరు శాతం న్యాయం చేశాననే సంతృప్తి, సంతోషం నాకున్నాయి" అని ధీమాగా

అన్నారు. "నవల ముద్రణ ఎందుకు చేయలేకపోయారు?" అని అడిగా "నేను వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవటం, అమెరికాలో ఎక్కువ కాలం ఉంటూ ఉండటం డి.టి.పి చేసిన కాగితాలలో తప్పులు సరి చేయటానికి సంస్కృతం తెలిసిన వారు దొరకక పోవటమే ముఖ్య కారణాలు. 2010లో ముద్రణకు ఇస్తే ఇంతవరకు అది పూర్తి కాలేదు" అని కొంత నిర్వేదంగా అన్నారు. నేను ఆమెకు చెప్పలేదుకాని సద్గురు శివానంద చారిటబుల్ ట్రస్ట్ వారికి కాని వారణాసిలోని సంస్కృత విద్యాసంస్థాన్ వారికి కాని ఇచ్చి ఉంటే ఎప్పుడో సంస్కృత వేయిపడగలు వెలుగు చూసి ఉండేదేమో అని పించింది. ఏమైనా "స్త్రీ సాహసం"గా ప్రభావతీదేవి గారు తెలుగు వారంతా గర్వపడే గొప్పపనిగా "సహస్ర ఫణాః"ను తెలుగువారికి అందించి ధన్యులయ్యారు.

2- "కృతో వా మానుష్యం". (మానవత్వం ఎక్కడ?")

ప్రభావతీ దేవిగారి మరొక సృజన "కృతోవా మానుష్యం ఖండకావ్యం. "52 శ్లోకాల ఈ కవిత్వాన్ని నాగర లిపి, తెలుగు లిపిలోనూ ఇచ్చి ఇంగ్లీష్‌లోకి ఆమె కుమార్తె శ్రీమతి లలితా సుహాసిని అనువదిస్తే, శ్రీ ఏలూరి పాటి అనంతరామయ్యగారు తెలుగు అనువాదమూ చేసి మరింత శోభ చేకూర్చారు. ఈ చతుర్వేణీ సంగమ కవితా ధార మధురం, సుందరం ఆలోచనా స్పందనం. ఇందులో లోకంలోని అన్యాయాలను ఎత్తి చూపి మానుష్యం యెటు పోతోంది అని ప్రశ్నించారు ప్రభావతీ దేవి. ఈ అన్యాయాలలో బ్రిటిష్ వారు చేసినవే కాక సమకాలీన కాలంలో పాకిస్తాన్, నేటి క్రికెట్ చేసే అన్యాయాలనూ ఏకరువు పెట్టారు. ఆతంక వాదుల ఆకతాయి తనం బాలబలాత్కారాలు, గురుకుల విద్యార్థుల వధలు, జైళ్ళల్లో చావులు, అయోగ్యుల పదవీ అందలం, మతోన్మాదం రక్తపాతం వంటి సమస్యలలెన్నిటినో స్పృశించి తన లోకజ్ఞాత అచాటుకొన్నారు. సోదరులు ఆడపడుచులను ఆదుకోవటం లేదని బాధ పడుతారు. శ్రీ శ్రీకి లోకబాధే తనబాధ అయినట్లు దేవిగారికీ అంతే. ఈ కృతిని తమ స్నేహితులు బి.జే.పి. సీనియర్ నాయకులు కేంద్రమంత్రి శ్రీ బండారు దత్తాత్రేయ గారికి అంకితమిచ్చారు. శిఖరిణీ వృత్తంలో రాసిన ఈ శ్లోకాలు ఆమె చేతి పెంపుడు నెమలిలా నాట్యమాడాయి. ఇందులోని కొన్ని సొగసులు చూద్దాం-

మొదటి శ్లోకం- "పవిత్రం త్వన్నామ ప్రథమ పదమాభాతి చ విధేః-ద్వితీయం సోపానం భవతి భవతాం దర్శన విధిః

భావద్విస్సల్లాపో నయతి నియతే రంతిమ పదం -కృతార్థాం త్వత్ స్నేహే తదియ భగవాన్ చిన్తయతుమాం"

భావం- పవిత్రమైన నీపేరు పవిత్రతకు మొదటి మెట్టుగా ఉండి, నిన్ను దర్శించటం రెండవ మెట్టు అయింది నీతో సంభాషణ భాగ్యానికి చివరి స్థానానికి చేరుస్తుంది.

నన్ను నీ స్నేహం కృతార్ధురాలిని చేస్తుంది. కనుక భగవాన్! నన్ను గురించి ఎప్పుడూ నువ్వు ఆలోచిస్తూ ఉండు.

19వ శ్లోకం– 'ఇమే ప్రౌఢా బాలాఃభ్రమర సరణాసక్త మతయః –సరోషాఃనిర్లజ్జాః స్వహిత పర నిస్టాః పరవశాః

అహంకారేణాంధాః స తు కర్తుం చ కుశలాః –పిత్రూన్ నిర్ భర్ త్స్యేతేసుఖమివ హి జీవంతి తనయాః .

భావం– తాడి చెట్లలాగా ఎదిగి వీదుల వెంట బలాదూర్ తిరుగుతూ తమ బాగే చూసుకొనే పరాన్నభుక్కులైన ఈ కుర్రాళ్ళకు ముక్కు మీద కోపం సిగ్గులేని తనం పొగరుతో కళ్ళు మూసుకుపోయి కన్నవారిపై కస్సు బుస్సుమంటూ సుఖంగానే బతుకుతున్నారు.

24– "వర్షేస్మిన్ వృషనామ్నిమూఢ మతయః కార్తీక మాసే చతు-ర్దశ్యా మధ్య తిదౌచ దక్షిణ మహా యానే గురౌ వాసరే

అస్మద్భారత దేశ ముఖ్య నగరే, ధిల్ల్యాంసభాయాం ప్రగే–సార్థైకాదశ వాదనేచ సమయే గ్న్యస్త్రాణ్య ముంచన్ శఠాః"

భావం– 13-12-2001 గురువారం పగలు 11-30కి ఢిల్లీ పార్లమెంట్ వద్ద మూఢ బుద్ధులైన ఆతంక వాదులు బాంబులు ప్రయోగించారు అని తిదివార నక్షత్రాలతో సహా తెలియజేశారు.

27వ శ్లోకంలో నాటి ప్రధాని వాజ్ పాయ్ పాకిస్తాన్‌కు గౌరవ ప్రదమైన మాటలతో యుద్ధాన్ని ఆపే ప్రయత్నం చేస్తే, ఆ మోసగాళ్ళు భారత సైన్యంపై విరుచుకుపడి నరమేధం సృష్టించారు. మానవత్వం ఎక్కడుంది ఆపపేరైనా ఎక్కడుంది అని ప్రశ్నించారు.

47వ శ్లోకం– "ప్రజా తంత్రే తదపి చ భవేత్సెక్యులరితో – న హిందూ నే సాయీ జిన యవన భేదో న తు పరం

మహాన్త స్సంక్షోభా మత విషయకా రక్త సరితః –కుతో వా మానుష్యం బత తదభిదానం చ భవతి.

భావం– ప్రజా స్వామ్యమైన మన మతా తీత రాజ్యంలో హిందూ ముస్లిం క్రైస్తవ జైన భేదం లేదు. కానీ మత సంబంధ కొట్లాటలు కాట్లాలకు అంతు లేదు. రక్తం ఏరులై ప్రవహిస్తోంది. మానవత్వమెక్కడ దాని అడ్రస్ ఎక్కడుంది?

52– "అయం కాంగ్రెస్ నేతా లయగమన రక్తో మునివరః –అయం లంపాకానాం ప్రతినిధి రయం సాదు చరితః

హతో రాగ్యా దుష్టైరదివ సమయే లోక పురతః –కుతో వా మానుష్యం బత తదభిధానం చ భవతి

భావం– కాంగ్రెస్ పార్టీ నాయకుడు, దైవ భక్తుడు, లంబాడీ ప్రజల ప్రతినిధి, ఉత్తమ

నడవడిక గలవాడు అయిన రాగ్యా నాయక్ నుపట్టపగలే అంతా చూస్తుండగా దుర్మార్గుల చేతిలో బలైపోయాడు. ఇంకెక్కడి మానవత్వం? దాని చిరునామా యేద?

ఏ సమస్యనైనా హాయిగా సులభంగా సుందరంగా శిఖరిణిలో మలిచి వన్నె తెచ్చి, ఇంత తేలికగా సంస్కృతంలో రాయవచ్చా అని ఆశ్చర్య పరచారు ప్రభావతీదేవి. ఈ కావ్యం మానవత్వానికి ఎత్తిన విజయ పతాక అనిపిస్తుంది.

3–బాలికా పంచాశికా–

ఇది కూడా 53 ముక్తకాలవంటి శ్లోకాలున్న లఘుకావ్యం. సమాజ స్వరూప చిత్రణలో ఆమె విశ్వరూపం చూడవచ్చు. చివరి పంక్తి "యఏతజ్జానీహి బాలికే" (బాలా ఇది తెలుసుకో) అనే మకుటం. ఉద్వేగం ఉత్సాహం అన్యాయాన్ని సహించలేని స్థితి ఇందులో ఉన్నాయి. దీనికీ నాగరలిపి, తెలుగు లిపిలో శ్లోకాలు, ఆంగ్లంలో వారమ్మాయి శ్రీమతి లలితా సుభాషిణి చక్కని అనువాదం, కృతీ స్వీకర్త డా.రామానుజా చార్యులవారే స్వయంగా చేసిన తెలుగు అనువాదం ఉన్నాయి. ఈ కావ్యాన్ని కేవలం 24 గంటల వ్యవధిలో రాసినట్లు ప్రభావతీదేవి గారు చెప్పుకున్నారు.

ముందుగా తన గురుదేవులకు "సుబ్రహ్మణ్య సమారంభాం శ్రీ రామ స్వామి మాధ్యమాం–భీమ సేన నృసింహాం తాం వందే గురు పరంపరం" అంటూ భక్త్యంజలి ఘటించారు. మొదటి శ్లోకంలోనే పెద్ద బాంబే పేల్చేశారు. "నాస్తి మాతృ సమా దేవీ –నాస్తి భర్తృసమో యమః –నాస్తి సుహృత్సమో బన్ధుః– ఏతజ్జానీ హి బాలికే"

భావం– అమ్మకు సాటి దైవం లేదు భర్తకు సాటి యముడూ– "లేదు, మిత్రుని వంటి బంధువూ లేడు. లోకంపోకడ తెలుసుకో బాలికా.

6వ శ్లోకం– "పుత్రక్షేమార్థినీ మాతా –సుఖం త్యజతి సర్వదా –భ్రుశం స్నిహ్యత్య మూన్ దృష్ట్వా – ఏతజ్జానీ హి బాలికా

భావం– పిల్లల సుఖం కోసం తన సుఖాన్ని త్యాగం చేసి బిడ్డ సంపూర్ణ –తుష్టి కి ఆనందించే అమ్మ సంగతి తెలుసుకో బాలికా

9– "యత యోపి భవా పేతాః–జననీం చానమన్–అకుర్వన్ మృత సంస్కారాన్ ః"

భావం– బంధ విముక్తులైన సన్యాసులు కూడా అమ్మప్రేమకు దాసోహమై, ఆమెకు మృత సంస్కారాలు చేశారు. అలాంటి అమ్మ స్థానం తెలుసుకో అంటూ శంకరాచార్య వృత్తాంతాన్ని పరోక్షంగా చెప్పారు.

16– "జన్మ దత్వా పిత పుత్రాన్ – యది నా వేక్షతే తదా – మృత తుల్యోహి స జ్ఞేయః "

భావం– పిల్లల్ని కనగానే కాదు, ప్రేమగా పెంచినవాడే తండ్రి–కానప్పుడు చచ్చినవాడితో సమానం అని లోక ప్రవృత్తిని చూపారు.

20- అంగా దంగా త్సుతో జాత - ఇతీదం వచనం పితా -యది నాద్రియతే తంతు"
భావం- పుత్రుని గాఢా శ్లేషణంతో పులకించని తండ్రిమృతప్రాయుడే అంటూ శాకుంతలంలో శకుంతల దుష్యంతునితో అన్నమాటల భావాన్ని పొందు పరచారు (పుత్ర గాత్ర పరిష్వంగ సుఖమ్ము మేలు)

22- "చాతుర్వర్ణ్యం మయా సృష్ట -మితీదం తు హరేర్వచః -అదృశ్యోయుజ్యతే నైవ ః
"

భావం- నాలుగే కులాలనునాడు కృష్ణుడు చెబితే నేడు నాలుగు వందలైనాయి. అందుకే కులం ఒక చీడపురుగు

25- "ఉద్యోగ పాఠశాలాసు -సర్వత్రాసన రక్షణం -తేన విజ్నో విన స్తార్థః"
భావం- ఉద్యోగం విద్యార్జన లలో రిజర్వేషన్ల వలన తెలివి తేటలకు స్థానం లేదు.

30- "విరుద్ధ వచనైః క్రుత్యైః-యో హితం స హరిణా తుల్యః"
భావం- సమ్మెలు ,ధర్నాలు చేస్తూ సామాన్యుని చంపే వైద్యుడు శ్రీహరితో యెట్లా సమానమౌతాడని ప్రశ్నించారు. వైద్యో నారాయణోహరిఃఅన్నదానికి విరుద్ధంగా ప్రవర్తిస్తూ "హరీ", "మని" అనిపిస్తున్నారు అని భావం.

35- "కామ క్రోధ జనిశ్చాయం -ఈర్ష్యా దాస్య సహోదరీ -గూఢ హాని కరో హ్యేషః
"

భావం- "బాధ" గురువు తలిదండ్రులు కామక్రోధాలు. సోదరి ఈర్ష్య. 'గూఢ హాని వృత్తి'అని బోధగురువులకంటే బాధ గురువులెక్కువై చేటు తెస్తున్నారని జ్ఞానోదయం చేశారు. అలాగే ఉపదేశ ధర్మం వదిలేసి సమదృష్టి లేక పక్షపాత దృష్టితో ఉన్నవాడే నేటి గురువుగా చలామణిలో ఉన్నాడని మరో శ్లోకంలో దెప్పారు. మరో దానిలో డబ్బు "పొగడ్తల డప్పు"లతో శిష్యుడు గురువును కొనేస్తున్నాడు, గురువూ శిష్య వశుడై పోతున్నాడని ఆవేదన చెందారు.

40- "పాశ్చాత్య వనితాః దృష్ట్వా -అస్మన్నాగరకాధమాః-లజ్జా హీనాశ్చ బాదంతేః"
భావం- పాశ్చాత్య దేశాల నుండి వచ్చే స్త్రీ పురుష యాత్రికులను లజ్జా హీనులైన మన పౌరులు బాదిస్తున్నారని "మూర్ఖాః" అనే ఈ కవితలో ఆవేదన చెందారు. అందుకే వారు మనదేశానికి రావటం తగ్గించేశారు అని మరో కవిత చెప్పారు. దీనికే కొనసాగింపుగా-

44- శ్లోకం- "విదేశీ యేష్విదం కృత్యం -విదిత్వా దోష సంయుతం -పరాభవాన త ముఖాః"
భావం- విదేశీయులను ఈ విధంగా మనవారు అవమానిస్తుంటే మన నాయకులు తల దించుకొంటున్నారు అమ్మాయీ తెలుసుకో.

45– "హిందూ ధర్మస్య రక్షార్థం – యతనీయం వివేకిభిః–తద్వినాశే జగన్నాశః"
భావం– హిందూ ధర్మాన్ని అందరూ కలిసి రక్షించాలి. అది నశిస్తే జగత్తే నశిస్తుంది అని తెలుసుకోవాలి.
అనైక మత్యం మన స్వంతం, అమర్యాద మనరాజ్యం స్వమతా క్షేపం మన నైజం అయింది. మన లక్షణమేమితో తెలుసుకో అని మరో శ్లోకంలో ఎరుక కలిగించారు.
49–శ్లోకం– "మంత్రేషు పరి వాదాశ్చ –వేదానామవమాననా –అస్మాకం తు స్వభావోహి –స్వభావో దురతిక్రమః"
భావం– మంత్రాలను వెక్కిరించటం, వేదాలను అవమానించటం, మనందరి స్వభావమై పోయింది. దాన్ని దాటి రావాలి.
53–చివరి శ్లోకం– "ప్రభుత్వంరక్షక భటః–న్యాయాదీ శ్చ భూమిపాః–ధర్మం సర్వే పి రక్షంతు –నైకో పి స్యాదధర్మగః"
భావం– అధర్మం నశించి ప్రభుత్వ రక్షక భటులు న్యాయాదీసులు, అధికారులు అందరూ ధర్మాన్ని రక్షించాలని అంటూ ముగించారు. "ధర్మో రక్షతి రక్షితః" అన్న ఆర్యోక్తిని గుర్తుకు తెచ్చారు.
"సంస్కృతంలో ఆదర్శవాదంతో కూడిన స్త్రీవాద సాహిత్యంలేని లోటును ప్రభావతీదేవి పూరించి పురుషాధిక్య సమాజానికి సవాల్ విసిరారు" అని శ్రీ బండారు దత్తాత్రేయ గారు రాసిన ముందు మాటలు నూటికి నూరు పాళ్ళు యదార్థం. ఆధునిక భావాలకు నిలువెత్తు స్వరూపంగా దేవి భాసించారు.
4– శశిరేఖా పరిణయం అనే 3 అంకాల రూపకం–
దీనిపై స్పందించిన డా. శివనూరి విశ్వనాధ శర్మగారు సంస్కృతంలో దేవిగారికి ఆశీరభినందనలు రాసి చివరగా–
"శశి రేఖా విజయాఖ్యం రూపకమేవ తత్ప్రభావతీ దేవ్యా–రచితం రమణీయ తయా ప్రహసనమిహ రాజతాం సతం" అని మెచ్చుకొన్నారు. దీన్ని ప్రహసనం అన్నారు.
ఆమె బోధ గురువు డా. బి నరసింహాచార్య ఆంగ్లంలో శ్రీ అనే పేరుతో ముందుమాట రాశారు. సంస్కృత రూపకం సమాజాన్ని చిత్రిస్తుందని, ఇది దశ రూపకాలలో నాటిక విభాగానికి చెందినదని, నాయిక శశిరేఖకు ఇందులో ప్రాధాన్యం ఉండటమే ఈ పేరుకు తగినదని, ఇది విడంబన తరహా రూపకమని, ఇందులో శశి రేఖతో పాటు నారదుడు, విలేవన, అజ్ఞానం అనే పాత్రలున్నాయని, త్రిమూర్తులు సెల్ ఫోన్‌లో సంభాషించుకొంటారని, ఈ రూపకం దేవి గారి సృజన అని, ఇందులో వైదర్భి శైలి ఉందని, హీరోయిన్ శశిరేఖా మూడులోకాలూ తిరిగి త్రిమూర్తులతో సహా అందరినీ ప్రశ్నలతో వేధించి, తన లక్ష్య సాధనకు ధర్నాలు సమ్మెలు చేస్తుందని కనుక ఈ రూపకం


సంప్రదాయబద్ధమై కొత్త విషయానికి ఆధారమైనదని ఇందులో సమాజ క్షేమమే ముఖ్యమని రుజువు చేసిందని, రచన సరళ సుందరంగా పాత్రోచితంగా జరిగిందని, కద ప్లాట్ రచయిత్రి స్వంతమని, ఇందులో అద్భుత రసం చిప్పిలిందని సెంటిమెంట్‌కు ప్రాదాన్యముందని, యూనిటీ ఆఫ్ యాక్షన్, ప్లేస్, టైం ఉందని, కాని కృత్రిమంగా ఉందనిపించిందని అయినా హాయిగా చూసి చదివి ఆనందించ దగ్గ లక్షణం ఉందని ప్రేక్షకుల హృదయాలలోకి సూటిగా దూసుకుపోయే లక్షణం దీనిలో ఉందని ఫెమినిజంపై రచయిత్రికున్న అభిమానం అంతఃస్రవంతిలా సాగటం గుర్తించాలని అణగ తొక్కబడిన వారి పక్షాన నిలిచి వారికి సానుభూతి చూపించటం హర్షించదగినదని సుప్రభాతాలతో మొదలైన దేవి సంస్కృత సాహిత్య యాత్ర అనేక దశలలో విస్తరిల్లి మహాకావ్య నిర్మాతగా వర్ధిల్లిందని కీర్తించారు. డా.ఎస్ జి రామానుజాచార్యులు ఆమెను “చైతన్య స్ఫూర్తి” అని ఆశీర్వ దించారు. పుస్తకంలో ఈ రూపకానికి తెలుగు అనువాదమూ ఉండటంతో అందులోని భావం అందరూ గ్రహించే వీలు కలిగింది. చివరగా ప్రభావతీ దేవిగారి మనోభావం 54వ శ్లోకంలో చక్కగా వివరించారు. మొత్తం రూపకంలో సంభాషణలే కాక 54 శ్లోకాలున్నాయి. అవీ సందర్భోచితంగా అమరాయి.

“న భవతు మత యుద్ధో మాస్తు శార్య ప్రకోపకః– న భవతు నర మేధో శ్రున్మాతిర్మస్తునృపాం భావతువిమాలి చిత్తః సర్వదా తోష దాయీ –సకల సుజన మిత్రం ధర్మ వృత్తోస్తు రాజా”

భావం– మత యుద్ధాలు జరుగ కూడదు తీవ్రవాదం ప్రకోపించరాదు .నరమేధం జరగ రాదు. ఆకలి చావులు ఉండకూడదు. పాలకులు నిర్మల మనసుతో ప్రజలకు సంతోషాన్ని కలిగిస్తూ అందరికి మిత్రులై ధర్మ చరితులై నడుచుకోవాలి. ఇదీ ఆమె ఈ రూపకంలో కోరుకొన్న ఉన్నత భావలహరి. అలా జరగాలని జరుగుతుందని ఆశిద్దాం.

గొప్ప ప్రతిభా, కవితా సామర్ధ్యం, ఊహ, వర్ణన నైపుణ్యం. సంస్కృతాంధ్ర సాహిత్యాలలో లోతైన అవగాహనా, పురాణ వేద శాస్త్రాలలో నిష్ణాతృత్వం ఉన్న శ్రీమతి ప్రభావతీ దేవిగారు శాశ్వత కావ్యం ఆధునికభావాలతో సంప్రదాయంగా రచించి వాసి కెక్కాలని కోరుతున్నాను. వారిని ఈ తరానికి పరిచయం చేయటం నా ధర్మగా అదృష్టంగా భావిస్తున్నాను.

“కవితా కన్యక గుణములు కవికన్న రసజ్ఞుడెరుగు కవి ఏమెరుగున్ –భువిలో కన్యక గుణములు ధవుడెరుగును కాక కన్న తండ్రే మెరుగున్” అన్న పద్యాన్ని తన “నామాట”లో కోట్ చేసి, రసజ్ఞులు తన కావ్యాలను చదివి ఆనందిస్తే తాను ఆనందంగా మరో కావ్యారంభం చేస్తానన్నారు ప్రభావతీ దేవి.శుభం భూయాత్.❋



## 421) నైషధ ధర్మ శాస్త్రీయ ప్రతి ఫలన కర్త - హరే కృష్ణ మెహర్ - 1956

### జనన విద్యా విశేషాలు

సంస్కృత విద్వాంసుడు, పరిశోధకుడు, కవి, రచయిత, విమర్శకుడు, గీత రచయిత, స్వరకర్త, వక్త, అనువాదకుడు అయిన హరేకృష్ణ మెహర్ ఒరిస్సాలో న్యుపారాజిల్లా సినపాలలో 5-5-1956న కవితా సంపన్న కుటుంబంలో జన్మించాడు. తండ్రి నారాయణ భారసా మెహర్ ప్రసిద్ధ కవి. తల్లి సుమతి మెహర్. తాత మనోహర్ మెహర్ పశ్చిమ ఒరిస్సాలో గానకవిగా సుప్రసిద్ధుడు. హరేకృష్ణ విద్యలో ప్రతి స్థాయిలో ఉన్నత ప్రమాణాలతో పాసయ్యాడు. సంస్కృతంలో బి.ఎ ఆనర్స్‌ను ఉత్కల్ యూని వర్సిటి రవేన్ షా కాలేజి నుంచి, సంస్కృతంలో ఎం.ఎ, పి.హెచ్‌డి లను బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం నుంచి సాధించాడు.

### ఉద్యోగం

ఒరిస్సా విద్యా శాఖలో సంస్కృత లెక్చరర్‌గా చేరిన మెహర్ బర్గాలోని ప్రభుత్వ పంచాయత్ కాలేజి, బాలాసోర్‌లోని ఫకీర్ మోహన్ కాలేజిలోను పని చేసి ఈ మధ్యనే భవానీపట్నంలోని ప్రభుత్వ అటానమస్ కాలేజిలో సీనియర్ రీడర్‌గా సంస్కృత శాఖాధ్యక్షునిగా పదోన్నతి పొందాడు. ప్రస్తుతం సంబల్‌పూర్‌లోని గంగాధర్ మెహర్ అటానమస్ కాలేజిలో సంస్కృత పోస్ట్ గ్రాడ్యుయెట్ కాలేజిలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు.

### రచనా మెహరీయం

సాహిత్యం సంగీతంలలో అనేక వ్యాసాలూ రాశాడు హరే కృష్ణ. ఆధునిక సంస్కృత సాహిత్యంలో ప్రసిద్ధ గీత రచయితగా ప్రసిద్ధి చెందాడు. సరళ సుందరంగా ఆధునిక భావ సంపదతో రాయటం మెహర్ ప్రత్యేకత. సుప్రసిద్ధ ఒరియా రచయిత గంగాధర్ మెహర్ రచించిన "తపస్విని" కావ్యాన్ని సంస్కృత, హిందీ, ఇంగ్లీష్ భాషలలో అనువాదం చేసి హరే కృష్ణ మెహర్ తన త్రిభాషా వైదుష్యాన్ని, ప్రతిభను ప్రదర్శించాడు. రాష్ట్రీయ, జాతీయ అంతర్జాతీయమైన అనేక వర్క్‌షాప్ సెమినార్లలో పాల్గొని తన సాహిత్య సంపన్నతను రుజువు చేసుకున్నాడు. ప్రపంచ సంస్కృత సమ్మేళనాలలోను పాల్గొన్న

ఘనత మెహర్‌ది. తన ప్రతిభా సర్వస్వాన్ని రుజువు చేసే అనేక గ్రంథాలను రచించి ప్రచురించాడు.

**మెహర్ సృజన**

1-పి.హెచ్‌డి థీసిస్‌గా "ఫిలసాఫికల్ రిఫ్లెక్షన్స్ ఇన్ నైషధీయ చరిత, 2- నైషధీయ కావ్యే - ధర్మ శాస్త్రీయ ప్రతి ఫలనం, 3-సాహిత్య దర్పణ అనే అలంకార శాస్త్రంను ఒరియా,సంస్కృత వ్యాఖ్యానాలతో రచించాడు. 4-మనోహర్ మెహర్ రచించిన సంస్కృత శ్లోకాలను "మనోహర్ పద్యావళి"గా సంకలనం చేసి ప్రచురించాడు. 5-శ్రీ కృష్ణ జన్మ, 6-మాతృ గీతికాన్జలిః" అనే ఆధునిక సంస్కృత గీతికావ్యం, 7-గంగాధర్ మెహర్ కవి ఒరియా భాషలో రచించిన "తపస్విని" కావ్యానికి, 8-హిందీ అనువాదం, 9-ఇంగ్లీష్ అనువాదం, 10-సంస్కృతానువాదం, 11-కాళిదాస మేఘ దూత కావ్యానికి "కోసలీ భాష"లో అనువాదం.

**హరే కృష్ణ అనువాద ప్రతిభ**

1-భర్తృహరి మహాకవి రచించిన నీతి శృంగార, వైరాగ్య శతకత్రయ అనువాదం, 2-శ్రీ హర్ష మహాకవి నైషధీయ చరిత -9వ కాండ అనువాదం, 3-కాళిదాస మహాకవి కుమార సంభవ కావ్యంలోని 1,2,5,7,8 సర్గల అనువాదం, 4-రఘువంశం -2వ సర్గ, 5-శివ తాండవ స్తోత్రం, 6-రామ రక్షా స్తోత్రం, శివ రక్షా స్తోత్రంతో కలిపి, 7-విష్ణు సహస్ర నామ, 8-గాయత్రీ సహస్ర నామ.

**బిరుదులు, పురస్కారాలు**

ప్రతిభకు తగిన గుర్తింపు లభించి అనేక బిరుదులూ సత్కార సన్మానాలు, పురస్కారాలు అందుకున్నాడు హరే కృష్ణ మెహర్. అందులో ముఖ్యమైనవి- 1-గంగాధర సమ్మాన్, 2-గంగాధర సారస్వత సమ్మాన్, 3-జయ కృష్ణ మిశ్ర కావ్య సమ్మాన్, 4-విద్యా రత్న ప్రతిభా సమ్మాన్, 5-జయదేవ ఉత్సవ ప్రశంసా పురస్కారం, 6-అశోక్ చందన స్మృతి గంగాధర పురస్కారం, 7-ఆచార్య ప్రఫుల్ల చంద్ర రే స్మారక పురస్కారం, 8-హరిప్రియ ముండ మెమోరియల్ పురస్కారం, 9-డా.నీల మాధవ పాణిగ్రాహి పురస్కారం, 10-వాచస్పతి గణేశ్వర రథ్ వేదాంతాలంకార పురస్కారం, 11-విశ్వ సంస్కృత దివస్ సమ్మాన్- ఇంత ప్రతిభా ఉత్పత్తులున్న ఈ సంస్కృత కవికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఏ రకమైన పురస్కారం ఇంతవరకు లభించక పోవటం ఆశ్చర్యమే కాదు, మన ప్రభుత్వపు అలక్ష్యం కూడా.❀



## 422) సంస్కృత ధ్వని విజ్ఞానకర్త - పద్మశ్రీ దేవీ ప్రసాద్ ద్వివేదీ -1956

20-10-1956న ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జన్మించిన దేవీప్రసాద్ ద్వివేదీ, బెనారస్ విశ్వ విద్యాలయం నుంచి సోషియాలజీలో ఎం.ఏ తోపాటు సాహిత్యాచార్య, ఆచార్య డిగ్రీలను లింగ్విస్టిక్స్‌లో సంపూర్ణానంద్ సంస్కృత కాలేజి నుంచి అందుకున్నాడు. అదే యూనివర్సిటి నుండి పి.హెచ్‌డి.,డి.లిట్‌లూ పొందాడు. సంపూర్ణానంద యూనివర్సిటిలో ఆధునిక భాషాశాఖలో లింగ్విస్టిక్స్ ప్రొఫెసర్‌గా చేరి, అందులోని యోగ సాధనా కేంద్ర, శంకరాచార్య మండప్‌లకు డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేశాడు. ఎందరో విద్యార్థులకు రిసెర్చ్ గైడ్‌గా వ్యవహరించి పరిశోధనలకు సహకరించాడు.

బౌద్ధ దర్శన మీమాంస, చిత్ర చంపూ కావ్యస్య ససమీక్షణం సంపాదనం, సంస్కృత ధ్వని విజ్ఞానం, కావ్య శాస్త్రీయ పారిభాషిక్ శబ్దోంకి నిరుక్తి (హిందీ) మొదలైన గ్రంథాలు రచించాడు ద్వివేది. ఆకాశవాణికి వార్తా సంపాదకుడిగా, రాష్ట్రీయ, మీర్జాపూర్ శ్రీ వేణీమాధవ పూర్ ట్రస్ట్‌కు ట్రస్టీగా, కాశీ విశ్వేశ్వర దేవాలయ ఆచార్యునిగా ఉన్నాడు. జనవార్త హిందీ దైనిక్ పత్రికకు వారణాసి విలేకరిగా, రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ క్రమశిక్షణ కమిటీ మెంబర్‌గా సేవ చేశాడు. ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ అభియాన్‌కు ప్రచారకుడిగా కమిటీ మెంబర్‌గా ఉన్నాడు.

విద్యా ప్రాభవానికి తగిన పురస్కారాలు బిరుదులూ ద్వివేదీ అందుకున్నాడు. కేరళ ప్రజాస్సి రాజా చారిటబుల్ ట్రస్ట్ "ఆచార్య రత్న" బిరుదునిచ్చి సన్మానించింది. చత్రపతి శివాజీ సమ్మాన్ "వేద పండిత పురస్కారం" అందజేసింది. 2011లో "కాశీ గౌరవ అలంకార్" లభించింది. అదే ఏడాది భారత ప్రభుత్వం శ్రీ దేవీప్రసాద్ ద్వివేదీకి "పద్మశ్రీ" పురస్కారం అందజేసి గౌరవించి సత్కరించింది.❀




## 423) సూర్య శతక కర్త – డా.దేవీ ప్రసాద్ మిశ్రా(1956)

పాండిచ్చేరి ఫ్రెంచ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇండాలజిస్ట్ డా. దేవీ ప్రసాద్ మిశ్రా యువ సంస్కృత విద్యావేత్తగా "మహర్షి బాదరాయణ వ్యాస సమ్మాన్" పురస్కారం 2015లో అందుకున్నాడు. దీనికి ఒక లక్ష రూపాయల పారితోషికం ఇచ్చారు. ఈ పురస్కారాన్ని భారత రాష్ట్రపతి శ్రీ ప్రణవ్ ముఖర్జీ చేతుల మీదుగా 2016 అందుకున్న అదృష్టవంతుడు మిశ్రా.

ఒరిస్సాలో నయాగరా జిల్లాకు చెందిన మిశ్రా, 1999లో పాండిచ్చేరి ఫ్రెంచ్ ఇన్‌స్టిట్యూట్‌లో సంస్కృత రీసెర్చ్ స్కాలర్‌గా చేరాడు. సంస్కృతంలో "సూర్య శతకం" రాయటమే కాక, శైవాగమాలపై విపరీతమైన కృషి చేశాడు. ఈ సంస్థలో మిశ్రా 3,500 వ్రాత ప్రతులను క్రోడీకరించాడు. నేను ఈ సంస్థలో చేరి పి.హెచ్‌డి చేస్తుండగా ఈ కేటలాగింగ్ చేసే అదృష్టం నాకు కలిగింది" అంటూ పొంగిపోయి చెప్పాడు మిశ్ర. ఈ సంస్థలో 8, 400కు పైగా తాళపత్ర గ్రంథాల కట్టలున్నాయని, అందులో శైవాగమాలు కర్మకాండ గ్రంథాలే ఎక్కువని, మిగిలినవి ఆలయ శిల్పకళా, జ్యోతిషం ఖగోళ శాస్త్రామ్, తిరుక్కురళ్ దక్షిణ భారత దేశ వైద్యం, సంస్కృత సాహిత్యం, తమిళ ఆధ్యాత్మికంకు చెందినవని అన్నాడు.

వీటిలో చాలా గ్రంథాలు "తమిళ బ్రాహ్మణుల" "గ్రంథ లిపి"లో రాయబడిన సంస్కృత గ్రంథాలని, మిగిలినవి కాశ్మీరీ శారదా లిపి, నందినాగర, నెవారి, తీగలారి, గ్రంథ, తెలుగు ఒరియా, తుళు పుస్తకాలని, ప్రతి తాటాకు కట్టలో చిన్న చిన్న అక్షరాలలో డజన్ల కొద్దీ గ్రంథాలుంటాయని పరిశోధకుడు దేవీ ప్రసాద్ మిశ్రా తెలియజేశాడు. ❋



## 424) తత్వ చింతామణి సిద్ధాంజన కర్త - డా.ఇనగంటి ఉమారావు - 1956


డా. ఇనగంటి ఉమా రామారావు 10-8-1956న పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరుకు దగ్గరోని త్యాజం పూడి గ్రామంలో శ్రీ ఇనగంటి సీతారామ మార్కండేయ శర్మ, శ్రీమతి సూర్య ప్రకాశమ్మ దంపతులకు జన్మించారు. సంప్రదాయ విద్యను కొవ్వూరు లోని ఆంధ్ర గీర్వాణ విద్యా పీఠంలోను తిమ్మ సముద్రంలోని శ్రీ గోరంట్ల వెంకన్న సంస్కృత విద్యా పీఠంలోను అభ్యసించారు. వీరి న్యాయ, అలంకార శాస్త్ర గురువులు వీరి తండ్రిగారితోపాటు, శ్రీ బొక్కా వీరభద్ర శాస్త్రి, శ్రీ రామ చంద్ర కోటేశ్వర శర్మ, శ్రీ దోర్బల ప్రభాకర శర్మ, శ్రీ దుర్భా శ్రీ రామచంద్ర మూర్తి గార్లు. శ్రీ రామారావు న్యాయంలో విద్యా ప్రవీణ, అలంకార శాస్త్రంలో ఎం.ఏ. డిగ్రీలను ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి పొందారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి విద్వాన్ పట్టా అందుకున్నారు. వీరికి న్యాయ శాస్త్ర బోధనలో 36 సంవత్సాల అనుభవం ఉన్నది. ప్రస్తుతం తిమ్మ సముద్రం సంస్కృత విద్యా పీఠం ప్రిన్సిపాల్గా పని చేస్తున్నారు. “విష్ణు ధర్మోత్తర పురాణం”ను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాజెక్ట్లో భాగంగా ఇప్పుడు అనువాదం చేస్తున్నారు.

శ్రీ ఉమా రామారావు 2015లో కులపతి ఆచార్య హరే కృష్ణ శత పథి ముఖ్య సంపాదకులుగా, తాము సంపాదకులుగా శ్రీ అన్నం భట్టు విరచిత “తత్వ చింతామణ్యాలోక సిద్ధాంజనం” (మంగల వాదః) గ్రంథాన్ని ప్రచురించారు. దీనిని తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం ప్రచురించింది. ఈ గ్రంథం 17వ శతాబ్దికి చెందిన అన్నం భట్టు

రచించిన "సిద్ధాంజనం" ఇప్పటి వరకూ ప్రచురింపబడని వ్రాత ప్రతి నాధారంగా ప్రచురింపబడింది. ఇది 13వ శతాబ్దానికి చెందిన గంగేశ ఉపాధ్యాయ రచించిన నవ్య న్యాయ పాఠ్య గ్రంథంపై పక్షాధర మిశ్ర అనబడే జయదేవ "ఆలోక" పేరిట రాసిన ఉప వ్యాఖ్యానం.

తత్వ చింతామణిలోని "మంగల వాదం" అనేది తత్వ చింతామణికి ప్రత్యక్షర ఖండంలో ఒక భాగం ఇందులో అనేక విషయాలపై చర్చ ఉన్నది. పూర్వపు విద్యా వేత్తలైన పక్షధార, నరహరి, రుచిదత్త, మహేశ, మధు సూదనల సిద్ధాంతాలపై అన్నం భట్టు చేసిన ఆలోచనాత్మక విశ్లేషణాత్మక వివరణమే ఇది. వీటిని అన్నిటినీ తులనాత్మకంగా పరిశీలించి నిగ్గు తేల్చిన గ్రంథం. ఈ గ్రంథంలో మరో విశేషం- తత్వ చింతామణి ఆలోక వ్యాఖ్యానాల మూల రూపాలను యధాతథం దీనితోపాటు చేర్చి ప్రచురించి చదువరులకు సౌలభ్యం కలిగించటం. సంక్షిప్త ఉపోద్ఘాతం నోట్స్ వగైరా అందజేయటం కూడా లభించింది.

ఆధారం-11-3-17న విజయవాడ శివరామక్షేత్రంలో మహామహోపాధ్యాయ బ్రహ్మశ్రీ మద్దులపల్లి మాణిక్య శాస్త్రి గారి శతజయంతి మూడురోజుల ఉత్సవాల మొదటిరోజున నన్ను శ్రీ గబ్బిట ఆంజనేయ శాస్త్రి గారు తమ వెంటబెట్టుకొని సభలో పాల్గోనేట్లు చేయగా, నేను రచించిన "గీర్వాణ కవుల కవితా గీర్వాణం-రెండవభాగం" నుండి శ్రీ మాణిక్య శాస్త్రి గారు, శాస్త్ర విద్వాన్మణి, ఆర్ష విద్యా భూషణ, న్యాయ రత్న భాషా శాస్త్రవేత్త, న్యాయ విద్యా ప్రవీణ వేదాంతాచార్య డా.శ్రీ గబ్బిట ఆంజనేయ శాస్త్రి గార్లపై నేను రాసిన వ్యాసాలను సంగ్రహించి ప్రత్యేక బుక్‌లెట్‌గా ప్రచురించి, ఈ రోజు ఆవిష్కరణ చేసిన సందర్భంగా డా. శ్రీ ఇనగంటి ఉమా రామా రావు గారు పరిచయమై నాకు అందజేసిన "తత్వ చంతామణ్యాలోక సిద్దాంజనం" గ్రంథం.❀



## 425) మహా మృత్యుంజయ మంత్ర భాష్య కర్త – స్వామి స్వరూపానంద -1960

స్వామి స్వరూపానంద దక్షిణ భారత దేశ చిన్మయ విశ్వ విద్యాలయ పీఠం ట్రస్ట్ అంటే యూనివర్సిటీ ఫార్ సాంస్క్రిట్ అండ్ ఇండిక్ ట్రెడిషన్‌కు చైర్మన్. దీనికి పూర్వం స్వామి –ఆస్ట్రేలియా ఇంగ్లాండ్, మిడిలీస్ట్, ఫారీస్ట్, ఆఫ్రికాలలోని చిన్మయ మిషన్‌కు రీజినల్ హెడ్‌గా ఉండేవారు. ప్రస్తుతం కోయంబత్తూర్‌లోని చిన్మయ ఇంటర్ నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ డైరెక్టర్. స్వామి తేజోమయానంద ఆశీస్సులతో ఇప్పుడు వరల్డ్ వైడ్ చిన్మయ మిషన్ అధిపతిగా కూడా వ్యవహరిస్తున్నారు.

ఇండియాలో బాగా వాణిజ్య వ్యాపార కేంద్రమైన బొంబాయి నగరంలో జన్మించిన స్వరూపానంద చిన్నప్పటి నుండి భౌతిక జీవితంపై కంటే ఆధ్యాత్మిక జీవితంపై ఆసక్తి పెంచుకొన్నారు. నాయనమ్మ బోధించే భారత రామాయణ కథలు మహర్షుల జీవితాలు ఆయనపై బాగా ప్రేరణ కలిగించాయి. స్వామి చిన్మయానంద బోధలు ఆకర్షించాయి. జీవిత పరమార్ధం అర్ధమై 1984లో హాంగ్‌కాంగ్‌లోని స్వంత వ్యాపార సంస్థను, ఇంటిని వదిలేసి స్వామి చిన్మయానంద స్వామి తేజోమయానందల వద్ద బొంబాయిలో సాందీపని ఆశ్రమంలో శిక్షణ పొందారు. 1992లో సన్యాసం దీక్ష పొంది వేలాది ప్రజల హృదయంలో స్థానం పొందారు. అన్ని మతాల సారాన్ని గ్రహించి మత ఐక్యత కోసం కృషి చేశారు. స్వీయ వ్యక్తిత్వ వికాస సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు.

మహా మృత్యుంజయ మంత్రానికి అద్భుత భాష్యం రాశారు. సంకట మోచన్, ఇక్ ఓంకార్లకు రాసిన వ్యాఖ్య బాగా పేరు తెచ్చింది. సమకాలీన జీవిత శైలిపై “సింప్లిసిటీ ఇన్ మెడిటేషన్, స్టార్మ్ టు పెర్ఫార్మ్, అవతార్, మేనేజింగ్ ది మేనేజర్ జర్నీ ఇంటు హెల్త్ ఆంగ్ల గ్రంథాలు రాశారు. సీనియర్ కార్పొరేట్ ఎక్సిక్యూటివ్‌లకు “హోలిస్టిక్ మేనేజ్ మెంట్” సెమినార్‌లు నిర్వహించటంలో స్వామి మంచి సమర్ధత చాటారు. లండన్ బిజినెస్ స్కూల్ ఫోర్డ్ మొదలైన సంస్థలలో ఆహ్వానంపై ధార్మిక ప్రసంగాలెన్నో చేశారు. సెల్ఫ్ డెవలప్ మెంట్ కోర్స్ అంటే మహా ఇష్టం. దీనిని భారత దేశంలోనే కాక అనేక విదేశాలలో నిర్వహించి ప్రజల ఆలోచనా శైలి విధానాలలో గణనీయమైన మార్పులు తెచ్చారు.❀

## 426) శ్రాద్ధ హాస్య నాటకకర్త - ఎస్.జగన్నాధం -1956

ఎస్.జగన్నాధ 1956 అక్టోబర్ 12 కర్ణాటకలో జన్మించి, సంస్కృతంలో ఎం.ఏ ఫ్లూట్‌లో విద్వాన్ అయ్యాడు. సంస్కృతంలో "అంధకాసుర సంహారం కౌటి ల్యాభరణం" నృత్య నాటికలు రాశాడు. శ్రాద్ధ అనే హాస్య హాస్యనాటకమూ రాశాడు. కాదంబరిని "పుండరీకం" పేరుతో పిల్లలకోసం రాశాడు. మందా క్రాంత వృత్తంలో "తీరం" ఖండకావ్యం, కాళిదాస మేఘ దూతంకు పేరడీగా "మేఘదూతం శంకరాచార్యుల ప్రస్థాన త్రయ భాష్యంపై "బ్రహ్మ కావ్య" అనే పురాణకావ్యం, అర్థాలంకారాలపై 111 అలంకారాలను ఉదాహరిస్తూ వ్యాఖ్యానంతో "లోకాలంకార పాణి కీయం", "ఆభానక జగన్నాధ" పేరిట 500 కొత్త సంస్కృత సామెతలను రాసాడు.

బాల సాహిత్యంగా "రుజు రోహిత" అనే 21 కథలు ప్రబంధ సౌద అనే వ్యాస సంపుటి, వందనామాలిక అనే సంగీత కృతులు, ఉత్తరాలు ఎలా రాయాలో తెలియజేస్తూ "పత్ర సౌదః" బసవేశ్వరుని 200 వచనాలను "వీచి మాలికా"గా సంస్కృతంలో రాశాడు. భాష శిల్పాలపై గొప్ప పట్టు ఉన్నవాడు జగన్నాధ.❀



## 427) దేవాలయస్య దీపః కర్త - పద్మశ్రీ శ్రీమతి నాహీద్ అబీదీ - 1961

1961 ఉత్తర ప్రదేశ్ మీర్జాపూర్‌లో ముస్లిం జమీందారీ కుటుంబంలో నహీద్ ఆబిదీ జన్మించింది. సంస్కృతం అభిమాన విషయంగా తీసుకొని కమలామహేశ్వరి కాలేజీ నుండి డిగ్రీని, మీర్జాపూర్ కె.వి.డిగ్రీ కాలేజీ నుంచి ఎం.ఏ డిగ్రీ సాధించింది. అడ్వొకేట్ ఇహ్తేషామ్ ఆబిదీని వివాహం చేసుకున్నాక దంపతులు వారణాసిలో కాపురం పెట్టారు. మహాత్మా గాంధీ కాశీ విద్యా పీఠ్ నుంచి పి.హెచ్‌డి పొందింది. ఆమె థీసిస్ "వేద సాహిత్యంలో అశ్వినుల రూపం" రాసి ప్రచురించింది.

2005లో బనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో చేరి, జీతం లేకుండా

లెక్చరర్‌గా పని చేసింది. తర్వాత మహాత్మా గాంధీ కాశీ విద్యాపీఠ్‌లో రోజు వారీ వేతనంపై పార్ట్ టైం లెక్చరర్ చేసింది. సంస్కృత లెక్చరర్‌గా పని చేసిన మొట్టమొదటి ముస్లిం సంస్కృత విద్యావేత్తగా రికార్డ్ పొందినా, ఉద్యోగంలో వివక్షతకు గురై ఇబ్బంది పడింది. 2008లో మొదటి పుస్తకం "సాంస్క్రిట్ సాహిత్యమే రహీం" సంస్కృత సాహిత్యంలో లోతులు తరచిన అబ్దుల్ రహీం ఖాన్ -ఏ ఖానాపై రాసింది. తర్వాత పుస్తకం మీర్జా గాలిబ్ రాసిన "చైరాగ్ ఏ ధైర్"ను సంస్కృతంలో "దేవాలయస్య దీప"గా అనువాదం చేసింది. మూడవ పుస్తకం 50 ఉపనిషత్తులను మొగల్ యువరాజు దారా షికొ పర్షియా భాషలో రాసినదానికి హిందీ అనువాదం "సిర్ర్ ఏ అక్బర్". దారా పెర్షియన్ భాషలో అనువదించిన వేదాంత గ్రంథానికి, దారా రాసిన సూఫీ గ్రంథాలకు హిందీ అనువాదం చేసింది. నహీద్ అబీదీ భర్త, పిల్లలతో కాశీలోని శివపురిలో కాపురం ఉంటోంది.

నహీద్ సంస్కృత సేవను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆమెకు 2014లో పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేసి సన్మానించింది. లక్నో యూనివర్సిటీ "డి.లిట్ ఇచ్చి గౌరవించింది. సంపూర్ణానంద సంస్కృత విశ్వ విద్యాలయం ఆమెను ఎక్సిక్యూటివ్ కౌన్సిలర్‌ను చేసింది. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం డా. నహీద్ అబీదీకి "యష్ భారత్" పురస్కారమిచ్చి 11 లక్షల నగదు అందజేసింది. 2007లో రాష్ట్రపతి డా.అబ్దుల్ కలాం ఆమెను రాష్ట్రపతి భవనానికి ఆహ్వానించి సత్కరించారు.❁

## 428) సోక్రటీస్ నాటక కర్త - ఆత్మారామ శాస్త్రి -1962

గ్రీకు తత్వవేత్త సోక్రటీసు జీవితంపై సంస్కృతంలో "సోక్రటీస్" నాటకం రాశాడు. సంస్కృత ప్రొఫెసర్ ఆత్మా రామశాస్త్రి. బొంబాయ్ భారతీయ విద్యాభవన్ మేగజైన్ "సంవిత" ఆగస్ట్ సంచికలో ప్రచురితం.❁



## 429) ప్రస్థాన త్రయ భాష్య కర్త – భద్రేశ్ దాస స్వామి –1964

### స్వామి మేధో సర్వస్వం (మాగ్నం ఓపస్)

సంస్కృత మహా విద్వాంసుడు "బోచసన్వాసి అక్షర పురుషోత్తమ స్వామి నారాయణ్ సంస్థ" (B.A P.S) యోగిపుంగవుడు భద్రేశ్ దాస్ స్వామి. భగవద్గీత బ్రహ్మ సూత్రాలు, ఉపనిషత్తులు అనే ప్రస్థాన త్రయంపై 5 భాగాల స్వామి నారాయణ భాష్యాన్ని సంస్కృతంలో రచించిన మహానుభావుడు. అక్షర పురుషోత్తమ వేదాంతాన్ని వ్యాప్తి చేసినవాడు. అక్షర బ్రహ్మ ,పరబ్రహ్మ, మోక్ష, భక్తి, ఉపాసనా మార్గాలను విస్తృతంగా ఇందులో చర్చించి మార్గదర్శనం చేశాడు. శంకర, రామానుజ, మధ్వాచార్య సంప్రదాయాలను అనుసరించి విస్తృతంగా "ప్రస్థాన త్రయం"పై రాసిన మొట్టమొదటి సమగ్ర సంస్కృత వ్యాఖ్యానం ఇది.

### విద్యా ఉద్యోగ ప్రస్థానం

సంస్కృతం, షట్దర్శనాలలో ఎం.ఎ.డిగ్రీని బెనారస్ సంపూర్ణానంద్ సంస్కృత యూనివర్సిటి భారతీయ విద్యాభవన్‌ల నుండి 1996లో పొంది, కర్ణాటక యూనివర్సిటి నుండి భగవద్గీతపై థీసిస్ రాసి 2005లో పి.హెచ్‌డి అందుకున్నాడు. ఉపనిషత్, భగవద్గీతలపై విస్తృత పరిశోధన చేశాడు. మహర్షి సాందీపని వేద విద్యాప్రతిస్టాన్‌లో సభ్యుడయ్యాడు. న్యు ఢిల్లీలోని స్వామి నారాయణ ఇన్‌స్టిట్యూట్‌లో, గుజరాత్‌లోని వేరావల్ సోమనాథ సంస్కృత విశ్వ విద్యాలయంలోను సంస్కృత, భారతీయ వేదాంతంలపై విద్యార్థులకు మార్గదర్శనం చేశాడు. గుజరాత్‌లో సారంగపూర్ యజ్ఞ పురుష పాఠశాలలో సంస్కృత శాఖాధ్యక్షుడిగా పని చేసి తత్వ శాస్త్రం, న్యాయ దర్శనం, వేదవిజ్ఞానం, పాణినీయం, శాస్త్రీయ సంగీత శాస్త్రంలో తబలా, ఫ్లూట్ వయోలిన్‌లపై శిక్షణ నిచ్చాడు. ఢిల్లీలోని రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మేనేజర్‌గా సమర్ధవంతంగా విధి నిర్వహణ చేశాడు.

ప్రస్తుతం వేదాలకు భాష్య రచనలో తలమునకలై పని చేస్తున్నాడు.

**శ్రేయాంసి బహు విఘ్నాని**

పి.హెచ్‌డి పొందిన తర్వాత గురువు ప్రముఖ్ స్వామి మహారాజ్ భద్రేశ్ స్వామిని "ప్రస్థాన త్రయం"పై విపులమైన భాష్యం రాయవలసినదిగా ఆదేశించగా స్వామినారాయణ భాష్యం రాశాడు. 2007జూన్‌లో సారంగాపూర్ జిల్లాలోని ఒక పల్లెటూరులో ఆశ్రమంలోని బేస్‌మెంట్‌లోని చిన్నగదిలో రచన ప్రారంభించి రాస్తుండగా విపరీతమైన వర్షాలు వరదలు వచ్చి రాసిన 25,00 పేజీల రచన, నోట్సు అంతా నీటిలో కొట్టుకు పోయింది. డిసెంబర్ 2007కు భాష్యం పూర్తికావాల్సి ఉంది. ఏమి చేయాలో పాలుపోకుండా ఉంటే గురుమహరాజ్ వచ్చి ఆశీర్వదించి పునః ప్రారంభించమన్నారు. రోజుకు 20 గంటలు అదే ధ్యానంగా రాసి స్వామినారాయణ భాష్యాన్ని 20,150 పేజీలతో పూర్తి చేసి 17-12-2017న సంస్థ శత వార్షికోత్సవం రోజున అహ్మదాబాద్‌లో ఆవిష్కరింప జేశాడు. శంకరాచార్యుల వారు (780-820) రాసిన ప్రస్థాన త్రయ భాష్యం తరువాత భద్రేశ్ దాస్ స్వామి రచించిన ఈ భాష్యం 15వ మహాభాష్యంగా జబల్ పూర్ యూనివర్సిటి ఫిలాసఫీ ప్రొఫెసర్ ఎస్.పి దూబే అభివర్ణించాడు. ఎన్నో యూని వర్సిటీల నుండి మేధావులు ఫిలాసఫర్లు ఈ భాష్య ప్రత్యేకతను వేనోళ్ళ శ్లాఘించారు.

**సన్మాన సత్కార ప్రస్థానం**

భద్రేశ్ స్వామి భాష్యానికి గుర్తింపుగా నాగపూర్‌లోని కాళిదాస సంస్కృత యూనివర్సిటి డి.లిట్‌ను, మహా మహోపాధ్యాయ బిరుదును ఇచ్చి గౌరవించి సత్కరించింది. మైసూర్ యూనివర్సిటి నుండి జి.ఏం.మెమోరియల్ అవార్డ్, "దర్శన కేసరి పురస్కారం" అందుకొన్నాడు. 2015లో బాంకాక్‌లో జరిగిన ప్రపంచ సంస్కృత సమ్మేళనంలో థాయ్‌లాండ్‌లోని సిల్పకారన్ యూనివర్సిటి "వేదాంత మార్తాండ సమ్మాన్" ప్రదానం చేసి భద్రేశ్ స్వామిని ఘనంగా సత్కరించింది.

.

భద్రేశ్ స్వామి భద్ర రచనా వైభవం

1-ప్రస్థాన త్రయంపై స్వామినారాయణ భాష్యం, 2-ఉపనిషత్ స్వామి నారాయణ భాష్యం, 3-చాన్దోగ్యోపనిషత్‌పై స్వామి నారాయణ భాష్యం, 4-ముక్తి మీమాంస, 5-ఉపనిషత్ సారం మొదలైనవి. సార్థక జన్ములు భద్రేశ్ స్వామీ మహారాజ్.❁



## 430) నడయాడే సంస్కృత సర్వస్వం - పండిట్ ముఫ్తి మొహమ్మద్ సర్వర్ ఫరూకీ -1968

వేదాలనూ, ఖురాన్‌నూ, హిందూ మతాచార్యుల సిద్ధాంతాలను, మహమ్మద్ ప్రవక్త సూక్తులను అనర్గళంగా, సభా రంజకంగా చెప్పగలిగే సమర్ధుడు, సంస్కృత పండితుడు, లక్నోలోని నద్వతుల్ ఉలేమా లేక నద్వా మదరసా పండితుడు. 1968లో జన్మించాడు. వారణాసిలోని "విశ్వ సంస్కృత ప్రతిష్టాన్" జనరల్ సెక్రెటరీ. మహారాష్ట్ర ప్రభుత్వ సంస్కృత స్టాండింగ్ కమిటీ సభ్యుడు కూడా. భారత దేశంలో ముస్లిం సంస్కృత పండితులలో దస్తగిరి, ఫరూకీ, బిరాజ్ దార్ వంటి ఉద్దండులు వ్రేళ్లమీద లెక్కింప దగిన సంఖ్యలో మాత్రమే ఉన్నారు.

ఫత్వాలలో ప్రసిద్ధుడైన ఫరూకీ సంపూర్ణానంద్ యునివర్సిటీ నుండి సంస్కృతంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పొందాడు. అన్ని భాషలూ నేర్వాలన్న ఖురాన్ వాక్యాన్ని ఆయన తరచూ చెబుతాడు. ఈ మధ్యనే ఘాజీపూర్‌లో అతిపెద్ద హిందూ సమ్మేళనంలో ఫరూకీ ప్రసంగించి ప్రేరణ కలిగించాడు. మొదట్లో శ్రోతలు "ఈయన్ని పిలిచారేమిటి? ఏమి మాట్లాడగలడు?" అనుకొన్నారు కానీ ఉపన్యాసం అయ్యాక "అసలైన సమర్ధుడైన వక్త వచ్చి మనకు మార్గదర్శనం చేశాడు" అని ఎంతో సంతృప్తి చెందారు. ఖురాన్ పైనా, మరెన్నో విషయాలపైనా ఫరూకీ చాలా పుస్తకాలు హిందీలో రాశాడు. ఫరూకీని "నడయాడే సంస్కృత సర్వస్వము" అని గౌరవిస్తారు. "నమాజ్ అంటే నమోనమః" అని గొప్ప అర్థం చెప్పాడు.

ఫరూకీ లాగానే మిరాజ్ దార్ అనే ఆయననూ "నడిచే సంస్కృత సర్వస్వము" అంటారు. ఈయన మహారాష్ట్రలోని షోలాపూర్‌కు చెందినవాడు. 1934లో పుట్టాడు. పగటిపూట పొలాలలో పని చేసి రాత్రివేళ రాత్రిపాఠశాలలో చదువుకున్నాడు. తన చుట్టూ ఉన్న పిల్లలు సంస్కృత మంత్రాలు వల్లే వేస్తుంటే ముచ్చటపడి శ్రద్ధగా విని కంఠస్తం చేసేవాడు. బ్రాహ్మణ పిల్లలకు మాత్రమే పరిమితమైన ఆ పాఠశాల ఉపాధ్యాయుడు మిరాజ్ కోసం రూల్స్‌ను ప్రక్కకు పెట్టి చేర్పించి నేర్పించాడని గర్వంగా కృతజ్ఞతతో చెప్పుకొన్నాడు మిరాజ్. హిందువులు ఆయనతో వివాహాది శుభకార్యాలు, పూజా పునస్కారాలు అంత్యక్రియలు చేయించమని కోరుతారు కానీ అవి పూర్తిగా మత


సంబంధమైనవి కానుక తాను అందులో వేలుపెట్టనని వినయంగా తిరస్కరిస్తాడు. కానీ ఆసక్తి ఉన్నవారికి ఆ విధానాలు నేర్పిస్తాడు. 75 ఏళ్ళ మిరాజ్ దార్ ఇంట్లో బీరువాలన్నీ వేద ఉపనిషత్తులు శాస్త్ర ఇతిహాస పురాణ గ్రంథాలు, ఖురాన్ దానిపై వ్యాఖ్యానాలతో నిండి ఉంటాయి.

ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రు యూనివర్సిటీ సంస్కృత శాఖ అధ్యక్షుడు రామనాధ్ ఝా "భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక చాలామంది ముస్లిం నాయకులు, పెద్దలు సంస్కృతం అధికార భాషగా ఉండాలని సమర్ధించారని, కానీ హిందీ గెలిచిందని తెలియజేశాడు. ఆలీఘర్ ముస్లిం యూనివర్సిటీ నుండి 20 మంది సంస్కృతంలో పి.హెచ్డి, 12 మంది ఏం.ఫిల్ పొందారు అని దాని సంస్కృత హెడ్ డా.ఖలీద్ బిన్ యూసఫ్ అన్నాడు. మొహమ్మద్ ఖాన్ దురాని భారత దేశంలో సంస్కృతంలో మొట్టమొదట డాక్టరేట్ పొందిన ముస్లిం సంస్కృత విద్యావేత్త.

ఉత్తర ప్రదేశ్‌లోని మహారాజ్ గంజ్ ముస్లిం సంస్కృత విద్యావేత్త ఆశబ్ ఆలీ వేదాలను, రామాయణ, భారతాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఇప్పుడు వేదాలను ఖురాన్‌ను తులనాత్మకంగా పరిశోధిస్తున్నాడు. ఇస్లాంకు వేదం హిందూమతానికి మధ్య చాలా సన్నిహిత సంబంధం ఉంది. రెండిటిలో ఏకేశ్వరోపాసనే ఉన్నదని ఇస్లాంలో లాగానే వేదాలలో కూడా పునర్జన్మ లేదని ఇలాంటి భావాలే తనను బాగా ఆకర్షించాయి" అన్నాడు. 61 ఏళ్ళ గోరఖ్ పూర్ యూనివర్సిటీ సంస్కృత శాఖాధ్యక్షుడు ఆశబ్ ఆలీ.❀

## 431) తత్వ చింతామణి కర్త – సచ్చిదానంద మిశ్ర – (1971)

1-3-1971న ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసిలో బస్తీ గ్రామంలో జన్మించిన వారణాసి సంస్కృత మహా విద్వాంసుడు సచ్చిదానంద మిశ్ర. ఆయన మాతృవిద్యాలయం సంపూర్ణానంద సంస్కృత విశ్వ విద్యాలయం. బెనారస్ హిందూ యూనివర్సిటిలో ఫిలాసఫీ, రెలిజియన్ ప్రొఫెసర్‌గా పని చేశాడు. ఆయన సంస్కృత భాషా సేవను గుర్తించి ఆయనకు 2009లో రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభా పాటిల్ "మహర్షి బాదరాయణ వ్యాస పురస్కారం" ప్రదానం చేశారు. సంస్కృత వ్యాకరణం భారతీయ ఫిలాసఫీలపై గొప్ప అధ్యయనం చేసి గ్రంథాలు రచించాడు. అందులో ముఖ్యమైనవి "తత్వ చింతామణి ప్రతిభ", మానసోల్లాసం– మానసోల్లాస వార్ధిని అనే ఆనంద కుమార వ్యాఖ్యతో, ఆపదేవ వ్యాఖ్యతో సదానందుని వేదాంత సార, న్యాయ దర్శన్ మే అనుమాన, వ్యుత్పత్తి వాద హిందీలో విపుల వ్యాఖ్యతో రచించాడు.❀



## 432) "సంస్కృతం -మానవ భాషా పరిణామం" గ్రంథకర్త - సంపదానంద మిశ్ర -1971

ఒరిస్సాకు చెంది, పాండిచ్చేరి సంస్కృత విద్వాంసుడైన సంపదానంద మిశ్రా 17-11-1971న జన్మించాడు. కుటుంబం సంస్కృత విద్యలో పునీతమైంది. ఉత్కల్ యూనివర్సిటి నుండి సంస్కృతంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పొంది, పాండి చేరి యూని వర్సిటిలో డా. వెంపటి కుటుంబ శాస్త్రి వద్ద సంస్కృతంలో ఎంఫిల్ చేసి, స్వర్ణ పతకం అందుకున్నాడు. "సంస్కృతం-మానవ భాషా పరిణామం"పై థీసిస్ రాసి ఉత్కల్ యూనివర్సిటి నుండి పి.హెచ్‌డి పొందాడు. పాండిచేరిలో అరవిందో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహింప బడుతున్న "అరబిందో ఫౌండేషన్ ఫర్ ఇండియన్ కల్చర్"కు ప్రస్తుతం డైరెక్టర్‌గా ఉన్నాడు.

విద్యార్థి, అధ్యాపక బృందాలకు సంస్కృతం మంత్రం, యోగ, భగవద్గీతలపై నిత్యమూ మిశ్రా వర్క్ షాపులు, ట్రెయినింగ్ ప్రోగ్రాములు, పునశ్చరణ తరగతులు నిర్వహిస్తూ ఉంటాడు. సంస్కృత, ఇంగ్లీష్, ఒడియా భాషలో పత్రికలకు వ్యాసాలూ కవితలు పాటలూ రాస్తూ ఉంటాడు. సంగీతం కూరుస్తాడు. అరవింద సొసైటీ నిర్వహించే 24 గంటల సంస్కృత రేడియో ప్రోగ్రాంతోపాటు, అనేక సంస్కృత ప్రాజెక్ట్‌లను సమర్థంగా మమేకమై నిర్వహిస్తాడు.

మిశ్రా రాసినవి, సంపాదకత్వంలో వచ్చినవీ పుస్తకాలు-సాంస్క్రిట్ అండ్ ఇవల్యూషన్ ఆఫ్ హ్యూమన్ స్పీచ్, ఏ బుక్ ఆఫ్ హిమ్స్ అండ్ ప్రేయర్స్, ది సెంచరి ఆఫ్ లైఫ్ ఆఫ్ శ్రీ అరబిందో విత్ ది ఒరిజినల్ వెర్సెస్ ఆఫ్ భర్తృ హరి, అరబిందో అండ్ సాంస్క్రిట్, ది వండర్ దట్ ఈజ్ సాంస్క్రిట్, హాస్య రంజని, ఎ హాండ్ బుక్ ఆఫ్ సాంస్క్రిట్ ప్రోసడి.

వందేమాతరం ట్రస్ట్‌కు మిశ్రా ముగ్గురు సభ్యులలో ఒకడు. 500 మత, మతాతీత సంస్కృత గ్రంథాలను అనువాదాలతో సహా ప్రచురించటం ఈ సంస్థ లక్ష్యం. మూర్తి క్లాసికల్ లైబ్రరి ఆఫ్ ఇండియాకు దీటుగా, అంతకంటే నాణ్యంగా, సాధికారికంగా, సాంస్కృతిక నేపథ్యంతో భారతీయ ఆత్మ ప్రతిబింబించేట్లు సంస్కృత గ్రంథ ముద్రణ తేట సరళ అనువాదాలతో ప్రచురించటమే "వందేమాతరం ట్రస్ట్" ముఖ్య ఉద్దేశ్యం

అని మిశ్రా వినమ్రంగా ప్రకటించాడు. ఈ బృహత్ ప్రచురణలో రామాయణ భాగవత భారతాలు వేదాలు ఉపనిషత్తులూ ఉండటం మనమందరం గర్వించదగిన విషయం.

2012లో సంపదానంద మిశ్ర సంస్కృత సేవా ధర్మానికి భారత రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభా పాటిల్ నుండి "మహర్షి బాదరా యణ వ్యాస పురస్కారం" అందుకున్నాడు. సంస్కృత వ్యాకరణ అధ్యయన, అధ్యాపనంలో మిశ్రా జీవితం చరితార్ధక మౌతోంది.❋




## 433) బ్రహ్మ సూత్ర భాష్య పద భేదవివరణ కర్త - వీర నారాయణ పాండురంగి -1973

4-7-1973న బెంగుళూర్‌లో జన్మించి, రాజస్థాన్‌లో జైపూర్‌లో సంస్కృత అధ్యాపకుడుగా పని చేసి కర్నాటక సంస్కృత సాయంకాల కాలేజి ప్రిన్సిపాల్‌గా ఉన్న వీరనారాయణ పాండురంగి మహర్షి బాదరాయణ వ్యాస అవార్డ్‌ను ప్రెసిడెంట్ ప్రతిభా పాటిల్ నుండి 2011లో అందుకొన్నాడు. ప్రస్తుతం రాజస్థాన్ జైపూర్‌లోని జగద్గురు రామచంద్రాచార్య సంస్కృత యూనివర్సిటి దర్శన విభాగ డీన్‌గా ఉన్నాడు. వీర నారాయణ దర్శన శాస్త్రంలో మహా ప్రసిద్ధుడు.

పాండు రంగి మార్తాండ దీక్షిత్, మాణిక్య శాస్త్రిల వద్ద అధ్యయనం చేసి నవ్య న్యాయ, ద్వైత వేదాంతాలలో విద్వాన్ డిగ్రీ, పూర్వ మీమాంసలో విద్వాన్ మాధ్యమ డిగ్రీ, సాహిత్యంలో మాస్టర్ డిగ్రీ పొందాడు. ద్వైత వేదాంతంలో విద్యా వారధి (పి.హెచ్‌డి) ఢిల్లీలోని రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ నుండి పొంది, తిరుపతి సంస్కృత విద్యాపీఠం నుండి నవ్య న్యాయంలోనూ పి.హెచ్‌డి అందుకొన్నాడు. బెంగుళూర్‌లోని పూర్ణ ప్రజ్ఞ విద్యాపీఠ సంస్కృత కాలేజిలో 1995 నుంచి 99 వరకు నవ్య న్యాయ లెక్చరర్‌గా, 1999 నుండి 2005 వరకు పాండిచేరి ఫ్రెంచ్ ఇన్‌స్టిట్యూట్లో రిసెర్చర్‌గా 2005 నుండి రామచంద్రాచార్య సంస్కృత విశ్వ విద్యాలయంలో దర్శన శాఖ అసిస్టంట్ ప్రొఫెసర్‌గా 2007 నుండి దానికి డీన్‌గా పని చేస్తున్నాడు.

8 గ్రంథాలను 20కి పైగా రిసెర్చ్ పేపర్లను పాండురంగి రచించాడు. 2006లో సంస్కృతంలో "సమవాయ విమర్శను", "బ్రహ్మ సూత్ర భాష్యే పదభేద విచారః"లను రచించి ప్రచురించాడు. హిందీలో సదాచార స్మృతి, క్రష్ణామృతార్ణవహః అనే అనువాద రచనలు చేశాడు. సంస్కృతంలో న్యాయ సుధా, తాత్పర్య చంద్రిక ముక్తితత్త్వం, తర్కనవనీతం శక్తివాద గ్రంథాలను తన సంపాదకత్వంలో ప్రచురించాడు.❋



## 434) వనౌషధి నిఘంటుకర్త - పరాశరం భావనాచార్యులు -1976

15-6-1976న శ్రీమాన్ పరాశరం భరద్వాజ లక్ష్మణాచార్య శ్రీమతి జయలక్ష్మి దంపతులకు శ్రీ భావనారాయణాచార్యులు జన్మించారు. "శ్రీ వైఖానస నిగమాగమిక ప్రవర" ఉత్తీర్ణులై, సంప్రదాయ జ్యోతిష వాస్తులలో పాండిత్యం సాధించారు.

కృష్ణాజిల్లా నిమ్మకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రధాన అర్చకులుగా 1992 నుండి 2000 వరకు పనిచేశారు. తరువాత గుంటూరు జిల్లా పొన్నూరు శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థాన ఆస్థాన పండితులుగా 2000-2009 వరకు ఉన్నారు. పిమ్మట తిరుపతి లోని శ్రీ వేంకటేశ్వర వేదవిశ్వ విద్యాలయ వైఖానస ఆగమ అసిస్టంట్ ప్రొఫెసర్గా 2009 నుండి ఉద్యోగిస్తున్నారు.

ఆచార్యులవారి గురు పరంపర - మహా భాష్యాంత వ్యాకరణ శిరోమణి, విద్యా భూషణ, శ్రీ నైమిశారణ్య ఆలయ నిర్మాత శ్రీ పరాశరం వెంకట రామాచార్యులు, శ్రీ హయగ్రీవ పాదు కాంతానుస్టాన తత్పర, ఆగమ, శిల్ప జ్యోతిష వాస్తు ఆయుర్వేద వైద్యాలంకార శ్రీ వేదాంతం అనంత పద్మనాభాచార్యులు, శ్రీ వైఖానస ఆర్ష విద్యా వాచస్పతి, దత్త పీఠ ఆస్థాన పండితులు, వైద్య విద్వాన్, శ్రీ శాస్త్ర పురాణ శ్రీ అగ్ని హోత్రం శీనివాసాచార్యులు.

తిరుపతి వేద విశ్వ విద్యాలయం ప్రచురించిన "వైష్ణవార్చన సార సంగ్రహం"కు సంపాదకులుగా ఆచార్యులవారున్నారు. అదే యూనివర్సిటి ప్రచురించిన "వనౌషధి నిఘంటు" నిర్మాణానికీ సంపాదకత్వం వహించారు. తిరుపతి వేదిక్ యూనివర్సిటి వారి ఆగమ సమన్వయ సదస్సుకు కన్వీనర్, ఎడిటర్. తిరుపతి పరాశర పబ్లికేషన్స్ వారి "రామ మహిమాన్వేషణం" తెలుగు రచనకు ముఖ్య సంపాదకులు. శ్రీ వేంకటేశ్వర వేద విశ్వ విద్యాలయ "ధృవార్చ యజ్ఞ విధి"కి సంపాదకులు.


ఆచార్యులవారి బిరుదులు-సత్కారాలు -1993లో ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావు నుంచి "ఉత్తమ అర్చక " చెన్నైలోని తిరువలిక్కేని నుండి "శ్రీ వైఖానస ఆగమ వాచస్పతి, "మైసూర్ దత్త పీఠాదిపతి శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి నుంచి "శ్రీ దత్త వెంకటేశ్వర దేవాలయ మహా సంప్రోక్షణ" పురస్కారం అందుకున్నారు.

విద్యావారధి శ్రీ నిష్ఠల సుబ్రహ్మణ్య శాస్త్రి గారు సంపాదకులుగా, శ్రీ పరాశరం భావనారాయణాచార్యులుగారు ఉపసంపాదకులుగా శివ పార్వతుల కల్యాణంగా ప్రముఖ

శైవాగమ వేత్త, వాసి రెడ్డి వెంకటాద్రి నాయుడి ఆస్థానకవి, గురు వరేణ్యులు, శ్రీ చక్రార్చన ధురీణులు, అభినవ కాళిదాస బిరుదాంకితులుశ్రీ ములుగు పాపయారాధ్య కవి శ్రేష్టులు రచించిన "కళ్యాణ చంపువు" అనే అరుదైన సంస్కృత కావ్యాన్ని విశేషమైన ఉపోద్ఘాతం, పరామర్శతో వెలువరించారు. దీనిని జైపూర్‌లోని లిటరరీ సర్కిల్ ప్రచురించింది. ఈ కావ్యంలో చంపూ లక్షణాలన్నీ సమగ్రంగా ఉండటమే కాక నవరస పోషణా జరిగింది.

ప్రస్తుతం తిరుపతిలోని తిరుచానూర్‌లో శ్రీ పరాశరం భావనారాయణాచార్యుల వారు ఉంటున్నారు.

ఈ రచనకు ఆధారం– విద్యా వారధి "శ్రీ నిష్ఠల సుబ్రహ్మణ్య శాస్త్రిగారు ఆదరంతో ఈ రోజే నాకు పంపిన వారి రచనలు 1–పూజా కుసుమాలు, 2–మీరూ సంస్కృతం నేర్చుకోండి, 3–నవగ్రహ స్తుతిఃతో పుస్తకాలతోపాటు పంపిన అరుదైన సంస్కృత గ్రంథం శ్రీ ములుగు పాపయారాధ్య విరచితమై తమ సంపాదకత్వంలో వెలువరించిన "కళ్యాణ చంపువు" కావ్యం. శ్రీ శాస్త్రిగారికి కృతజ్ఞతలు అందజేస్తున్నాను.❀



## 435) "ప్రమాణ మీమాంస" వెలువరించిన – జైన విద్యావేత్త – సుఖలాల్ సంఘ్వి –1978

పండిట్ సుఖలాల్జీ అని అందరూ గౌరవంగా పిలిచే సుఖలాల్ సంఘ్వి జైన విద్యావేత్త ఫిలాసఫర్. జైనంలోని స్తనక్ వాసి సంప్రదాయం వాడు. చిన్నప్పుడే విపరీతంగా మసూచికం బారి పడి నెమ్మదిగా కోలుకొని జైన గ్రంథాలలోని తర్క గ్రంథాలు చదివి బెనారస్ హిందూ యూనివర్సిటీలో ప్రొఫెసర్ అయ్యాడు. జైన మతాన్ని అద్భుతంగా వివరించి చెప్పగల సామర్థ్యం సంఘ్వికి బాగా ఉన్నదని పాల్ దండాస్ అన్నాడు. ప్రసిద్ధ జైన విద్యావేత్త పద్మనాభ జైన్‌కు మార్గదర్శి. సాహిత్య అకాడెమి అవార్డ్, పద్మ భూషణ్ పురస్కారం అందుకొన్నాడు.

గుజరాత్‌లోని సౌరాష్ట్రలో లిమ్డి గ్రామంలో 8–12–1880న జన్మించాడు. వణిక్ కులానికి చెందినవాడు. తండ్రి తల్సి సంఘ్వి. తల్లి మణిబెన్. నాలుగో ఏట తల్లి చనిపోయింది. దూరపు బంధువుల పెంపకంలో పెరిగాడు. జైన గురువుల బోధలు శ్రద్ధగా వినేవాడు. బెనారస్‌లో యశో విజయ జైన్ సంస్కృత పాఠశాలలో చేరి

మూడేళ్ళలో సిద్ధ హేమ వ్యాకరణం, తర్క సంగ్రహ, ముక్తావళి, వ్యాప్తి చంద్రికలను అనేక వ్యాఖ్యానాలతో సహా చదివాడు. రఘువంశం, మేఘ సందేశం, నైషధీయాలను ఆమూలాగ్రం చదివేశాడు. అలంకార శాస్త్రాలు కోశాలను అధ్యయనం చేసి సాధించాడు. 1911లో మిథిల, కాశీలకు వెళ్లి సాహిత్యం, ఫిలాసఫీ నేర్చాడు. ఆగ్రా వెళ్లి "పంచ ప్రతిక్రమణ" అనే దేవేంద్ర సూరి నాలుగు కర్మ గ్రంథాలలో మొదటి దానిని తన సంపాదకత్వంలో వెలుగులోకి తెచ్చాడు. హరి భద్ర సూరి రాసిన యశోదర్శన, యోగ వింశికలను కూడా ప్రచురించాడు. న్యాయా చార్య పరీక్ష పాసై జైన పాఠశాలలో బోధించి ముని జిన్ విజయ, ముని లలితా విజయ, ముని పుణ్య విజయలకు గురువై బోధించాడు.

1922లో గుజరాత్ విద్యాపీఠంలోని పురాతత్వ మందిర్‌లో భారతీయ తత్వ శాస్త్రం బోధించాడు. సిద్ధ సేన దివాకరుని 5 భాగాల సన్మతి తర్కకు సంపాదకత్వం వహించి ముద్రించాడు. 1933 నుంచి 10 ఏళ్ళు బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో జైన ఫిలాసఫీ ప్రొఫెసర్‌గా ఉన్నాడు. సంస్కృత హిందీ గుజరాతీ భాషలలోని విలువైన గ్రంథాలకు అనువాదాలకు ఎన్నిటికో ఎడిటర్‌గా ఉన్నాడు. తత్వార్ధ సూత్రా, న్యాయావతారలను గుజరాతీ భాషలోకి అనువాదం చేశాడు. హేమ చంద్ర సూరి రచన ప్రమాణ మీమాంసకు సంపాదకుడుగా ఉన్నాడు. జయ రుషి రాసిన తతావప్లవను వెలుగులోకి తెచ్చి గొప్ప కీర్తి పొందాడు. ఇది చార్వాకంపై ప్రసిద్ధ గ్రంథం. బౌద్ధ తత్వంపై కొత్త వెలుగులు ప్రసరింప జేశాడు. 1944లో రిటైరై భారతీయ విద్యా భవన్‌లో చేరి జైనముని ఆచార్య జినవిజయాజి వద్ద పని చేశాడు. 1957లో బరోడాలోని ఎం.ఎస్.యూనివర్సిటి ఆహ్వానంపై భారతీయ తత్వ శాస్త్రంపై 5 గొప్ప ఉపన్యాసాలు చేశాడు. ఇవి గుజరాతీ, హిందీ ఇంగ్లీష్‌లలో ప్రచురింపబడ్డాయి. ఆత్మ-పరమాత్మ, సాధనలపై ఆయన గుజరాత్ విద్యాసభలో చేసిన ప్రసంగాలను బాంబే యూనివర్సిటి "ఆధ్యాత్మ విచారణ" పేర ముద్రించింది.

నాథూరాం ప్రేమి ప్రభావం ఈయనపై ఎక్కువ దిగంబర జైనులతో కూడా చాలాస్నేహంగా ఉండేవాడు. జైనం బాగా అర్ధం కావాలంటే పాళీ భాష బాగా నేర్వాలి అనేవాడు. ఎందరో యువకులను మార్గదర్శనం చేశాడు. ఆయన అశేష శేముషి అందరినీ ఆశ్చర్య పరుస్తుంది. ఈయన విద్వత్తుకు తగిన బిరుదులూ పురస్కారాలు లభించాయి. విజయ ధర్మ సూరి జైన్ సాహిత్య స్వర్ణపతకం, మద్రాస్ యూనివర్సిటి డి.లిట్,1958లో కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారం, 1961లో కేంద్ర ప్రభుత్వం సంస్కృత సేవకు యోగ్యతా పత్రం, 1974లో పద్మభూషణ్ అవార్డ్, 1975లో బీహార్ నవ నలంద విహార్ నుండి విద్యావారిధి బిరుదు పొందారు. డా. సర్వేపల్లి రాదా కృష్ణన్ సంఘ్విని జ్ఞాన యజ్ఞం చేస్తున్న మహానుభావుడు అని అభివర్ణించారు. 97వ ఏట 2-3-1978న పండిట్ సుఖలాల్జి సంఘ్వి మరణించాడు.



## 436) ప్రజ్ఞా చక్షు రామభద్రా చర్య కర్త – నిత్యానంద మిశ్ర – 1982

ఉత్తర ప్రదేశ్‌లో లక్నోకు చెందిన నిత్యానంద మిశ్ర సైంటిస్ట్ కుటుంబంలో 24–8–1982న జన్మించాడు. తండ్రి జే. డి. మిశ్ర కెమిస్ట్రిలో పి. హెచ్‌డి జునాగడ్‌లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్‌లో గ్రౌండ్నట్ రిసెర్చ్ డైరెక్టర్. నిత్యానంద గుజరాత్ యూనివర్సిటి నుండిఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ డిగ్రీ పొందాడు. ప్రస్తుతం ముంబాయ్ సిటీ గ్రూప్‌లో ఉన్నాడు.

సంస్కృతంలో డిగ్రీ లేక పోయినా ఆ భాషను అనర్గళంగా మాట్లాడేవాడు. చాలా పుస్తకాలకు సంపాదకత్వం వహించాడు. ఎన్నో పుస్తకాలను అనువదించాడు. స్వామి రామభద్రాచార్య శిష్యుడు. నిత్యానంద మిశ్రా హనుమాన్ చాలీసాపై విపుల వ్యాఖ్యానం "మహావీరీ" ఇంగ్లీష్‌లో రాసి ప్రసిద్ధి పొందాడు తెచ్చాడు. తులసీదాసు చాలీసాకు ఇంగ్లీష్‌లో దీనికి మించినది లేదని ప్రపంచవ్యాప్తంగా భావిస్తారు. ప్రతిపదానికి అర్థం భావం తాత్పర్యం విశేష వివరణ, స్వర లిపి, నోటేషన్లుతో మహాద్భుతం అనిపిస్తుంది.

నిత్యానంద మిశ్ర సంస్కృతంలో "ప్రజ్ఞా చక్షు రామ భద్రా చర్య" మరియు "మహేశ్వర సూత్రేషు రామకథ", "సంభాషణా సందేశ్" రాశాడు.

ఇంగ్లీష్‌లో "అల్గారిదమ్స్ ఇన్ ఎమెర్జింగ్ ఏసియన్ మార్కెట్", "అధ్యాత్మ రామాయణంలో పాణినీయం, గోస్వామి నారాయణ దాస అండ్ రామ భద్రాచార్య, రామభాద్రాచార్య రచించిన శ్రీ భార్గవ రాఘవీయం"కు సంపాదకత్వం వహించి ముద్రించాడు. మిశ్రా ప్రస్తుతం ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ ఇండస్ట్రికి స్టాటిస్టికల్ అనలిస్టుగా పని చేస్తున్నాడు. ఇతని తల్లి బయో కెమిస్ట్రీలో ఎం ఎస్ సి చేసి కేంద్రీయ విద్యాలయంలో లెక్చరర్. పెద్దక్క గాంధీ నగర్ ప్లాస్మా రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో సైంటిస్ట్.❁



## 437) "సామాన్య నికృతి క్రోడపత్ర" కర్త – డా. శ్రీ గబ్బిట జయ మాణిక్య శాస్త్రి – 1983

కృష్ణాజిల్లా పామర్రు దగ్గర ఎలమర్రు గ్రామానికి చెందిన శ్రీ గబ్బిట జయ మాణిక్య శాస్త్రి కృష్ణాజిల్లా నందిగామలో డా. శ్రీ గబ్బిట ఆంజనేయ శాస్త్రి, శ్రీమతి పద్మావతి దంపతులకు 3-10-1983న జన్మించారు. తిరుపతిలోనే చదువు ప్రారంభించి, శాస్త్రాధ్యయనం కొనసాగించారు. తర్కశాస్త్రంలో మహాపండితులైన తండ్రి శ్రీ ఆంజనేయ శాస్త్రి గారి వద్దనే తర్క భాష్యాన్ని అధ్యయనం చేసి, శ్రీ ప్రద్యోత్ కుమార్ ముఖోపాధ్యాయ శ్రీ సుధాంశు శేఖర్ శాస్త్రి గార్ల వద్ద లోతులు తరచి నిష్ణాతులయ్యారు. మూడు గ్రంథాలు-1-తర్కామృతం-మాణిక్య ప్రభకు హిందీ వ్యాఖ్యానం, 2-కారికావళి గురుకృపకు హిందీ వ్యాఖ్యానం, 3-సామాన్యని కృతికి క్రోడపత్రం రాశారు. ఇవికాక 3 గ్రంథాలు 1-శాస్త్ర దీపిక, 2-చైతన్య, 3- కాళికా స్తుతి సంస్కృత వ్యాఖ్యలకు సంపాదకత్వం వహించారు.

శ్రీ మాణిక్య శాస్త్రి గారి విద్వత్‌కు తగిన పురస్కారాలు పొందారు. 1-బెనారస్ హిందూ యూనివర్సిటి నుండి 2006 శాస్త్రి ఆనర్స్ పరీక్షలో ప్రథమ స్థానం సాధించినందుకు స్వర్ణ పతాకాన్ని భారత రాష్ట్రపతి శ్రీ ఎ.పి.జే.అబ్దుల్ కలాం గారి చేతుల మీదుగా అందుకొన్నారు. 2-మరొక బంగారు పతాకాన్ని 2007లో ఆచార్య పరీక్షలో మొదటి స్థానం పొందినందుకు ప్రధాని శ్రీ మన్మోహన్ సింగ్ గారి నుండి స్వీకరించారు. 3 మహా మహోపాధ్యాయ గోపీనాధ పురస్కారం, 4-సంస్కృత భారతి నుండి మనోరమ పురస్కారం అందుకుని విద్యా "జయ"కేతనం ఎగురవేసి తర్క న్యాయశాస్త్రాలలో "మాణిక్యం"గా ప్రకాశిస్తున్నారు శాస్త్రిగారు. నిజంగా విద్వత్‌లో "శాస్త్రి" అనిపించారు.

శ్రీ మాణిక్య శాస్త్రి గారు 40 జాతీయ సెమినార్లలోను, 10 అంతర్జాతీయ సెమినార్లలోను పాల్గొని తమ అనుభవాలను ఇతర మేధావులతో పంచుకొని సెమినార్లకే విలువ పెంచారు. ప్రముఖ సంస్థల ఆహ్వానంపై తర్కం, మీమాంస, వేదాంత శాస్త్రాలపై

10 దాకా మహోపన్యాసాలనిచ్చి రాణించారు. ప్రస్తుతం పూరీలోని శ్రీ జగన్నాథ సంస్కృత విశ్వ విద్యాలయంలో న్యాయశాఖలో ప్రొఫెసర్‌గా, హెడ్‌గా సేవలందిస్తున్నారు.

4-12-17 ఆదివారం సరసభారతి "గీర్వాణ కవుల కవితా గీర్వాణం-2 రెండవ భాగం" శాసన సభ ఉప సభాపతి మాన్యశ్రీ శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి చేతుల మీదుగా ఆవిష్కరింపబడిన కార్యక్రమంలో శ్రీ మాణిక్య శాస్త్రి గౌరవ అతిధిగా విచ్చేసినప్పుడు మా తలిదండ్రుల స్మారక పురస్కారాన్ని అతనికి అందించిన అదృష్టం మాది. నన్ను తాతగారూ అని మా శ్రీమతిని మామ్మగారూ అనీ సంబోధించే చనువున్నవాడు. అతని తండ్రిగారు శ్రీ ఆంజనేయ శాస్త్రి గారు మాత్రం నన్ను "అన్న గారూ!" అని సంబోధిస్తారు.❁



## 438) ప్రాచ్యసాఖ్యాన వివరణకర్త - డా.గబ్బిట శ్రీనివాస శాస్త్రి - 1987

**కుటుంబ నేపధ్యం**

తండ్రి, అన్న మహా న్యాయ మీమాంసా చార్యులైన డా. గబ్బిట ఆంజనేయ శాస్త్రి, డా. గబ్బిట జయమాణిక్య శాస్త్రి గారల కుటంబంలో జన్మించిన గబ్బిట శ్రీనివాస శాస్త్రి ఇంగువ కట్టిన గుడ్డగా అదే వైదుష్యాన్ని సాధించి గబ్బిట వారి వంశకీర్తిని ఉత్తరాదిన వెదజల్లుతున్నాడు. ముగ్గురూ ముగ్గురే. ఆ తండ్రీ తనయుల అనుబంధం, సంస్కృత విద్యా వైశిష్ట్యం ఎంత చెప్పుకున్నా తరగని గని. ఆంజనేయ శాస్త్రి గారి ముగ్గురు కుమారులలో చివరివాడైన శ్రీనివాస శాస్త్రి గీర్వాణ కవితా గీర్వాణ విశేషాలను తెలుసుకొందాం.

**జనన విద్యాభ్యాసాలు వివాహం**

గబ్బిట శ్రీనివాస శాస్త్రి శ్రీ గబ్బిట ఆంజనేయ శాస్త్రి, శ్రీమతి పద్మావతి దంపతులకు 19-4-1987న జన్మించాడు. శాస్త్రిగారిది కృష్ణాజిల్లా యలమర్రు స్వగ్రామం. తండ్రిగారు వారణాసిలో సంస్కృత విశ్వవిద్యాలయంలో న్యాయశాఖ ప్రొఫెసర్‌గా ఉండటం వలన శ్రీనివాస్ విద్య కూడా అక్కడే ఆరంభమైంది. 2001లో "పూర్వ మధ్యమ" (టెన్త్) సంపూర్ణానంద్ సంస్కృత విశ్వ విద్యాలయంలో చదివి

ఉత్తీర్ణుడయ్యాడు. 2005లో "ఉత్తర మధ్యమ" (12) ఢిల్లీలోని రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ నుండి అందుకొని, 2008లో కొత్త ఢిల్లీలోని రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ నుంచి శుక్ల యజుర్వేదంలో "శాస్త్రి" (బి ఏ) డిగ్రీ ప్రథమ శ్రేణిలో పొందాడు. శుక్ల యజుర్వేదంలోనే 2010లో ఢిల్లీ రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ నుండి "ఆచార్య" (ఎం.ఏ)నూ 2015లో వేదంలో "విద్యా వారిధి" (పి.హెచ్.డి)ని కాంచీపురం డీమ్డ్ సంస్కృత విశ్వ విద్యాలయం నుంచి అందుకున్నాడు. కంచి కామకోటి పీఠాధిపతుల వద్ద వేద విద్యనూ అధ్యయనం చేశాడు. శ్రీమతి శ్రీకళను శ్రీనివాస శాస్త్రి వివాహమాడి సంతానం పొందాడు.

శాస్త్రి గురువులలో ముఖ్యమైనవారు తండ్రి శ్రీఆంజనేయ శాస్త్రిగారితో పాటు, శ్రీ మద్దులపల్లి మాణిక్య శాస్త్రి గారి శిష్యులైన డా.ముళ్ళపూడి జయ సీతారామ శాస్త్రి గారు వంటి ప్రముఖులున్నారు. వీరితోపాటు శ్రీ ఆర్.వెంకట రామ ఘనాపాటీ, శ్రీ కె వి యెన్ అవధాని, ప్రొఫెసర్ శ్రీ పి కె ముఖోపాధ్యాయ గురు పరంపర వద్ద శాస్త్రి విద్య నేర్చాడు.

## గీర్వాణ రచనా సామర్థ్యం

తిరుపతి వేద విశ్వ విద్యాలయంలో జరిగిన అంతర్జాతీయ వేద సభలో "ప్రతిషఖ్యానం -పరిచయః"పై పరిశీలన పత్రాన్ని రచించి ప్రచురించాడు. బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం-అఖిల భారతీయ శాస్త్ర సంగోష్టి ఫాకల్టిలో "కృష్ణ యజుర్వేదే అర్ధ వాద వ్యాఖ్యానం" అనే పత్ర సమర్పణ చేశాడు. వారణాసి బెనారస్ హిందూ విశ్వ విద్యాలయ "సంస్కృత విద్యా పత్రిక"లో "శ్రౌత స్మార్త కర్మాణి" శీర్షికతో వ్యాసాలను, "మీమాంస సారం"పైనా రాశాడు. ఇవిగాక "ప్రాచ్య సాఖ్యాయనం వివరణం", "ఆపస్తంభీయ పంచ దశ కర్మాను క్రమాణిక" రచించాడు.

### పురస్కారాలు

2000 సంవత్సరంలో 15వ ఏటనే లక్నోలోని ఉత్తర ప్రదేశ్ సంస్కృత సంస్థాన్ వారి "వేద పండిత పురస్కారం", రాష్ట్ర గవర్నర్ శ్రీ విష్ణు కాంత శాస్త్రి గారి చేతులమీదుగా శ్రీనివాస శాస్త్రి అందుకొన్నాడు. వారణాసిలోని దేవాలయ, మఠాలలో నిత్య వేద పారాయణ చేస్తున్నాడు. కృష్ణ యజుర్వేద క్రమాంత పరీక్ష మొదటి తరగతిలో కృష్ణాజిల్లా మచిలీపట్నం బృందావన పురంలోని కామకోటి శంకర మఠం నుండి ఉత్తీర్ణుడయ్యాడు. తిరుమల తిరుపతి దేవస్థానం శాస్త్రిని వేద పారాయణ దారునిగా నియమించింది. ఇందులో రెండేళ్ళు పని చేశాడు.

ప్రస్తుతం శ్రీనివాస శాస్త్రి తండ్రిగారికి సహాయంగా వారణాసిలో ఉంటూ శ్రౌత స్మార్త కర్మలను ఆచరిస్తున్నాడు. గబ్బిట సోదరులు వారి తండ్రి గారితోపాటు ఈ గ్రంథంలో స్థానం పొందటం అపూర్వమైన విషయం.❁

## 439) వేదాంగ శిక్ష కర్త – డా. కె. హయగ్రీవ శర్మ –2000

తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో సంస్కృత ప్రొఫెసర్ శ్రీ హయగ్రీవ శర్మ కృష్ణ యజుర్వేదాన్ని క్రమాంతం శ్రీ వెంకటేశ్వర వేదాగమ పాఠశాలలో చదివారు. వ్యాకరణం ముఖ్య విషయంగా సంస్కృత ఎం.ఏ మొదటి తరగతిలో పాసై స్వర్ణ పథకం సాధించి, పి.హెచ్‌డి పొందారు. 29 ఏళ్ళుగా సంస్కృత ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. సాహిత్యం, వ్యాకరణం, వేద సాహిత్యం వెంకటేశ్వర అధ్యనాలపై ఆసక్తి. వేదాంత శిక్షపై పరిశోధన చేశారు. 5 గురు విద్యార్థులకు పి.హెచ్‌డికి గైడ్‌గా ఉన్నారు. 4గురు వీరివద్ద ఎం.ఫిల్ చేశారు. వీరి విద్వత్‌కు భారత ప్రభుత్వం శిక్షా విద్యాపురస్కారం అందించింది. వేంకటేశ్వర విశ్వ విద్యాలయం ఉత్తమ అధ్యాపక పురస్కారం ఇచ్చింది.

యు.జి కర్రిక్యులం సబ్జెక్ట్ కమిటీలో మెంబర్‌గా, బి ఓ ఎస్ చైర్మన్‌గా ఎక్స్టర్నల్ మెంబర్‌గా ఉన్నారు. నెదర్లాండ్‌లోని మహర్షి మహేష్ యోగి వేదిక్ యూనివర్సిటి వేదంగా, శిక్ష ప్రాజెక్ట్‌కు చీఫ్ ఎడిటర్‌గా పని చేశారు. తిరుమల దేవ స్థానం ప్రచురించిన స్కాంద పురాణాన్ని తెలుగులో అనువాదం చేశారు. యక్ష నిరుక్తాన్ని సాయన వ్యాఖ్యానమున్న కొన్ని ఋగ్వేద మంత్రాలను తెలుగులో అనువదించారు. పాణినీయ శిక్షకు సంపాదకత్వం వహించారు. తైత్తిరీయ ఉపనిషత్, తెలుగు అనువాదం చేశారు. వామన–పంచ మహా కావ్యాలపై పరిశోధన చేశారు. వామన–మల్లినాదలను తులనాత్మకంగా పరిశోధించి, యజుర్వేదాన్ని వేదంగా శిక్ష ఆకారం గా ,పరిశీలించారు .వేదంగ సమీక్షా, సంస్క్రుతస్య వైశిష్యం ,గౌతమ ధర్మ సూత్రా మనుసరేణ శాసనం పాలనం, గౌతమ ధర్మ సూత్రేషు ప్రతిబింబిత సమాజ స్థితి, వేదోక్త వర్ణ ధర్మః, అధర్వ వేద ఔషధ విజ్ఞానం, ది రోల్ ఆఫ్ ఆస్ట్రాలజి ఇన్ పర్సనల్ డెవలప్‌మెంట్ మున్నగు విషయాలపై 13 రిసెర్చ్ పేపర్లు రాసి ప్రచురించారు.

తిరుమల దేవస్థాన పత్రిక సప్తగిరిలో వేదాంత మహత్వం, తైత్తిరీయారణ్యకం, అన్న ప్రాశస్త్యం, ఆది శంకరులు మొదలైన విషయాలపై చాలా వ్యాసాలూ రాశారు.❀



## 440) కర్నాటక సంస్కృత గ్రామాలు - మత్తూర్, హంసహల్లి -2000

సంస్కృతభాషలో కవిత్వం, నాటకం, నవల, వ్యాసం వ్యాఖ్యానం రాసి గీర్వాణ సేవ చేసిన మహానుభావుల నెందరినో గీర్వాణ కవుల కవితా గీర్వాణంలో పరిచయం చేసుకోన్నాం. ఆ తర్వాత సంస్కృతంలో సినిమాలు తీసిన శ్రీ జి వి అయ్యర్ గురించీ తెలుసుకొన్నాం. అంతకంటే ఆశ్చర్యకరమైన మరో విషయం ఇప్పుడు తెలుసుకోబోతున్నాం. అసలు సంస్కృతం మృత భాష, దాన్ని ఎవరు చదువుతారు అందులో ఎవరు రాస్తారు, చాదస్తంగా మీలాంటి వాళ్ళు ఇంకా దాన్ని పట్టుకొని పాకులాడుతున్నారు అని చాలా మంది అనుకొంటారు. కానీ ఈ 21వ శతాబ్దంలో ఎనిమిదోదో, తోమ్మిదోదో అయిన వింత ఒకటి వింటే అవాక్కై పోతాం. అదే కర్నాటక రాష్ట్రంలో మత్తూరు, హోసన హల్లి అనే రెండు గ్రామాల ప్రజలు నిత్య వ్యవహారాలలో కూడా సంస్కృతంలోనే మాట్లాడు కొంటారని తెలిస్తే నాబోటి వాళ్ళం ఎగరలేక పోయినా గంతులేస్తాం. వారి సంస్కృతీ భాషా పరిరక్షణకు జేజేలు పలకాల్సిందే.

### సంస్కృత గ్రామాలు

మత్తూరు, హోసనహల్లి అనే రెండు గ్రామాలు కర్ణాటకలో తుంగా నదీ తీరంలో శివ మొగ్గకు దగ్గరలో ఉన్నాయి. ఆ గ్రామాలను "సంస్కృత గ్రామాలు" అంటారు అక్కడ గుడి, బడి, అంగడి వీధులలో, ఇళ్ళల్లో చిన్నా పెద్ద, ఆడా మగా అందరూ సంస్కృతంలోనే మాట్లాడుతారు. అలా మాట్లాడుతున్నందుకు వాళ్ళు చాలా గర్వంగా భావిస్తారు. కొత్తవారు ఈ గ్రామాలలోకి వెళ్ళంగానే వాళ్ళు "భవత్ నాం కిం?" అని అడుగుతారు. అంటే "అయ్యా! తమ పేరేమిటి?" అని అర్థం పేరు చెప్పాక "కతమ్ ఆస్తి?" అనగా "తమరు ఎలా ఉన్నారు?" అని అడుగుతారు. ఇలాసంభాషణ కొనసాగిస్తారు. ఈ గ్రామస్తులకు సంస్కృతం తప్ప ఇంకా ఏ భాషా తెలియదు అనుకొంటే

"భాషా పప్పు"లో కాలేసినట్లే మనం. వారికి తెలుగు కన్నడం మలయాళం హిందీ ఇంగ్లీష్ భాషలలో అనర్గళంగా మాట్లాడే ప్రావీణ్యం ఉంది. కుటుంబంలో ఒక్కరైనా ఇంజనీరింగ్ చదివి ఉత్తీర్ణులైన వారున్నారు. అయినప్పటికీ వారందరూ సంస్కృతంలోనే విధిగా మాట్లాడాలని దృఢ నిశ్చయంలో ఉన్నారు. దీనికి కారణం భారత దేశంలో సంస్కృత భాషా వ్యాప్తికి కృషి చేస్తున్న "సంస్కృత భారతి" అనే స్వచ్ఛంద సంస్థ.

**సంస్కృత భారతి సేవ**

1981లో సంస్కృత భారతి మత్తూరు గ్రామంలో "సంస్కృత భాష గొప్పదనం – ప్రస్తుతం దేశంలో దాని వైభవ పతనానికి కారణాలు" అనే అంశంపై 10 రోజులపాటు వర్క్ షాప్ నిర్వహించింది. చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు చాలా మంది వచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో ఒకాయన "సంస్కృతంలో ఒకడు అనర్గళంగా మాట్లాడితే అతడిని పండితుడు అంటారు. కానీ ఊరి వారంతా సంస్కృతంలో మాట్లాడితే ఏమనాలి? అనే ప్రశ్న వేసుకొని అలాంటి గ్రామాన్ని "సంస్కృత గ్రామం" అనాలి అని నిర్ణయించారు. సంస్కృత భారతి చెప్పిన ఈమాటనుపై రెండు గ్రామాల వారికీ బాగా నచ్చి, అందరూ సంస్కృతం నేర్చుకోవటం మొదలుపెట్టి సంస్కృతంలో మాట్లాడటం ప్రారంభించి సంస్థ ఆశయాన్ని ఆచరణలోకి తెచ్చి తమ ప్రత్యేకతను చాటి చెప్పి దేశంలోనే సంస్కృత భాషాపరంగా ఆదర్శ గ్రామాలు అనిపించారు. సంస్కృతంతో పాటు మరొక మిశ్రమభాష "సంకేతి"ని కూడా వీరు మాట్లాడుతారు. ఇది సంస్కృత, కన్నడ తెలుగు, తమిళ మిశ్రమ భాష. ఇది వ్యావహారిక భాష. దీనికి లిపి లేదు దేవ నాగరి లిపినే వాడుతారు. సుమారు 600 ఏళ్ళ క్రితం కేరళ నుంచి సంకేతి బ్రాహ్మణ కుటుంబాలు ఇక్కడికి వచ్చి స్థిరపడ్డాయి. వీరి దినదిన జీవితమంతా సంస్కృతం చుట్టూనే పరిభ్రమిస్తుంది. సంస్కృతమే అందరూ మాట్లాడుతారు కదా అని అందరూ పిలక పెట్టుకొని పంచె లేక లుంగీతో ఉంటారు అనుకొంటే పొరబడ్డట్టే. జీన్స్ పాంట్ వాళ్ళూ చెవుల్లో సెల్లుల వాళ్ళూ మోటార్ బైక్ రాయుళ్ళూ అందరూ ఉంటారు. కాని మాట్లాడేది మాత్రం సంస్కృతమే. ఒకరకంగా ఈ జంట గ్రామాలు పురాతన ఆధునికతలకు తీపి గుర్తులు.

**గుడే బడి**

ఈ గ్రామాల దేవాలయాలలో సంస్కృతం నేర్పించే పాఠశాలలు ఉన్నాయి. వీటిని "వేద శాలలు" అంటారు. శిధిలావస్థలో ఉన్న ప్రాచీన తాళపత్ర గ్రంథాలను ఇక్కడే తిరగ రాసి, కంప్యూటరైజ్ చేస్తారు. ఈ రెండు గ్రామాల వారే సంస్కృతంలో సంభాషిస్తున్నారు కాని ఇతర గ్రామాలవారెవ్వరూ ముందుకు రావటం లేదు. కాని

జర్మని, రష్యా వంటి విదేశీ యువత సంస్కృతం నేర్చుకోవటానికి అమితాసక్తి చూపిస్తున్నారు. జర్మనీ యూనివర్సిటీలలోని సంస్కృత కోర్సులకు ఏటా వేల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నా వారిలో పదుల సంఖ్యలలోనే విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. కారణం సంస్కృతం బోధించే ప్రొఫెసర్లు తగినంత మంది లేకపోవటమే . అందుకే విదేశాలనుండి ఎందరో విద్యార్థులు ఇక్కడికి వచ్చి సంస్కృతం అభ్యసిస్తున్నారు. ఈ జంటగ్రామాల గోడలపై రాతలూ సంస్కృతంలోనే ఉంటాయి.

**మహా పండితులకు జన్మస్థానం**

ఇక్కడి ఈ జంట గ్రామాల ప్రజల జీవనాధారం వ్యవసాయం. ఇక్కడి ప్రధాన పంట వక్కలు (పోచెక్కలు). మత్తూరు నుంచి 30కి పైగా సంస్కృత పండితులు బెంగళూరు మంగళూరు, మైసూరు మొదలైన ప్రాంతాలలో యూనివర్సిటి ప్రొఫెసర్లుగా ఉన్నారు. భారతీయ విద్యాభవన్ పాఠశాలను ఇక్కడ స్థాపించిన మత్తూరు కృష్ణమూర్తి, వయోలిన్ విద్వాంసుడు వెంకటరాం, కన్నడ శాస్త్రీయ సంగీత కారుడు హెచ్.ఆర్.కేశవమూర్తి వంటివారు జన్మించిన భూమి మత్తూరు.

**గమక సంగీత రూపక సంప్రదాయ పునరుద్ధరణ**

సంస్కృతాన్ని మాత్రమే పునరుజ్జీవింప జేయటం కాదు వీరి కన్నడ శాస్త్రీయ "గమక" సంగీత రూపక సంప్రదాయం అంతరించి పోతుంటే వీరందరూ జాగరూకులై దాన్ని అంతరించి పోనివ్వకుండా పునరుజ్జీవింపజేసి కాపాడారు. గమక అంటే కన్నడ సంగీత రాగంలో కథను వివరించటం. దీనినే "కావ్య వచన" అంటారు వీళ్ళు. కన్నడ దేశంలో గమక ప్రదర్శనకు జనం విపరీతంగా హాజరై ఆనందిస్తారు.

ప్రధాని నరేంద్ర మోడీ సి.బి .ఎస్.ఇ.సిలబస్‌లో ఉన్న జర్మన్ భాష బదులు సంస్కృతంను ప్రవేశ పెట్టే ప్రణాళికలో ఉన్నారని తెలిసి ఈ గ్రామస్తులు పరమానంద భరితులవుతున్నారు.

ఆధారం- 1-ఆంధ్రజ్యోతి -29-1-17 ఆదివారం స్పెషల్ 2- వీకీ పీడియా ❁

## 441) ఆధునిక అస్సామ్‌లో సంస్కృత వ్యాప్తి -20వ శతాబ్దం

వేద పురాణ కాలంలో అస్సామ్‌ను కామరూప లేక ప్రాగ్జోతిషపురం అనేవారు. భారత దేశంలోని మిగిలిన రాష్ట్రాలలో లాగానే మేఘాలయ, మిజోరం, నాగాల్యాండ్‌లతో కూడిన ప్రాచీన అస్సామ్‌లో సంస్కృతంతో బాటు అన్ని శాస్త్రాలు అధ్యయనం చేశారు. 7వ శతాబ్ద ప్రాగ్జ్యోతిష రాజుల కాలంలో లభించిన తామ్ర శాసనాలను బట్టి అప్పుడు సంస్కృతం ఎన్నో శతాబ్దాలనుండి ప్రజల వాడుక భాషగా ఉన్నట్లు తెలుస్తోంది. మధ్యయుగంలో అంటే 9వ శతాబ్దంలో ఇక్కడ "కాళికా పురాణం" వంటి సంస్కృత గ్రంథాలు అస్సామ్‌లో రాయబడినాయి. అప్పటినుంచే తంత్ర, ధర్మ, జ్యోతిష వ్యాకరణ గ్రంథాలు కూడా ఇక్కడ రచించబడినాయి. వీటికి సంస్కృత వ్యాఖ్యానాలు వాటితోపాటు సంస్కృత సాహిత్య రచనలు వచ్చాయి.

ధర్మ శాస్త్రాలలో కామరూప సిద్ధాంతాన్ని "కౌముది"లు రచించి మహా మహోపాధ్యాయ పీతాంబర సిద్ధాంత వాగీశుడు సుసంపన్నం చేశాడు. పశ్చిమ అస్సామ్‌ను పాలించిన కామాట, కొచ్చి వంశ రాజులు, మధ్య అస్సామ్ పాలకులు మహామాణిక్య అతని వారసులు, ఉత్తర అస్సామ్ రాజులు సంస్కృత భాషను బాగా పోషించారు. ఉత్తర భారతంలోనే వాల్మీకి రామాయణాన్ని మొదటిసారిగా ప్రాంతీయ భాషలోకి అంటే అస్సామీ భాషలోకి అనువదించి రికార్డ్ సృష్టించాడు. మహేంద్ర కందాలి కవి. సంస్కృత వ్యాకరణంలో మాత్రం పెద్దగా గ్రంథాలు రాలేదు కానీ వచ్చిన విమాత్రం బాగా గుర్తింపు పొందాయి. ❀

## 442) జయమతి ఖండ కావ్య కర్త - భావ దేవ భగవతి - 20వ శతాబ్దం

20వ శాతాబ్దికవి పండిత భావ దేవ భగవతి జయమతి అనే ఖండ కావ్యం రాశాడు. పేరుకు ఇది ఖండకావ్యమే కాని చారిత్రాత్మక కావ్యం. భర్త ప్రాణాలను రక్షించటం కోసం భార్య భగవతి నరరూప రాక్షసుడైన రాజు చేత చిత్ర హింసలుపడి ప్రాణాలు కోల్పోయిన చారిత్రిక కథ. ఆశుకవిగా ప్రసిద్ధుడైన మహా మహోపాధ్యాయ ధీరేశ్వరాచార్య తాను రాసిన సంస్కృత శ్లోకాలను "వృత్తమంజరి" అనే సంపుటిగా ప్రచురించాడు. ❀

## 443) భక్తి వివేక వ్యాఖ్య కర్త - జీవేశ్వర గోస్వామి- 2000

17వ శతాబ్దంలో భక్తిపై వైకుంఠ నాథ భట్టాచార్య సమగ్రంగా రాసిన "భక్తి వివేకం"పై సమగ్ర వ్యాఖ్యానాన్ని పండిత జీవేశ్వర గోస్వామి 20వ శతాబ్దంలో రాశాడు. ❀

**444) శాక్త దర్శన కర్త - చక్రేశ్వర భట్టాచార్య -2000**

పండిట్ చక్రేశ్వర భట్టాచార్య 20వ శతాబ్దంలో "శాక్త దర్శనం" రాశాడు. శక్తి ఆరాధనే సర్వ శ్రేష్టం అని ఇందులో తెలియజేశాడు.❁

**445) పతాకామ్నాయ కర్త - మనోరంజన్ శాస్త్రి -2000**

ఆచార్య మనోరంజన్ శాస్త్రి పతాకామ్న్యాయం రచించాడు. దీనితోపాటు భారత జాతీయ పతాకంపై సంస్కృతంలో వ్యాఖ్యానం రాశాడు. ప్రకామ కామ రూపం" అనే ఖండకావ్యాన్ని ప్రాచీన అస్సామ్‌కు పేరైన కామరూప వైభవాన్ని రచించాడు. అకాలపు చారిత్రాత్మక సంఘటనలను కవితాత్మకంగా వర్ణించాడు. ఉత్తాంక భాష్యం" అనే నాటిక కూడా రాశాడు.❁

**446) శ్రీకృష్ణ లీల కర్త - పండిట్ వైకుంఠ నాథ చక్రవర్తి -2000**

అస్సాంకు చెందిన పండిత వైకుంఠ నాథ చక్రవర్తి శ్రీ కృష్ణునిపై శ్రీ కృష్ణలీలలు కావ్యం 30వ శతాబ్దిలో సంస్కృతంలో రాశాడు.❁


**447) అవినాశి నవలా కారుడు - డా. విశ్వనారాయణ శాస్త్రి -2000**

డా. విశ్వనారాయణ శాస్త్రి "అవినాశి" అనే చారిత్రాత్మక నవల రాశాడు. ఈ కథ 7వ శతాబ్దిలో భాస్కర వర్మకు దేవదాశీకి మధ్య జరిగిన ప్రేమ కథ. చివరికి భాస్కరవర్మకు హర్ష వర్ధనునికి స్నేహం కుదురుతుంది. ఈ నవలకు సాహిత్య అకాడెమి భారతీయ భాషాపరిషత్, ఉత్తర ప్రదేశ్ సంస్కృత అకాడెమీలు పురస్కారాలను అందజేశాయి. ఈ కవి రచించిన చిన్న కథలు, కథలూ కలిపి "హృదయ సంవాద చయనం" సంపుటిగా వచ్చింది.❁

**448) వ్యంజనా ప్రపంచ సమీక్ష కర్త - డా. ముకుంద మాధవ వర్మ - 2000**

డా. ముకుంద మాధవ శర్మ అనే ప్రముఖ సంస్కృత కవి విమర్శకుడు, సంగీతకారుడు.

"వ్యంజనా ప్రపంచ సమీక్ష"ను డి.లిట్ పరిశోధనా గ్రంథంగా 20వ శతాబ్దిలో అస్సాం నుంచి వెలువరించాడు.❁



## 449) బౌద్ధ వేదాంత పరిశోధకుడు - డా. కాళీప్రసాద్ సిన్హా -2000

అస్సాం కవి డా. కాళీ ప్రసాద్ సిన్హా బౌద్ధ తత్త్వంపై 20వ శతాబ్దిలో గొప్ప పరిశోధన చేసి రచన చేశాడు. కొన్ని ప్రాంతీయ రచనలు కూడా సంస్కృతంలోకి తర్జుమా అయ్యాయి. రవీంద్రుని గీతాంజలిని కామినీ కుమార అధికారి సంస్కృతంలోకి అనువదించాడు. ఆచార్య మనోరంజనశాస్త్రి కేతకీ కావ్యాన్ని రఘునాథ చౌదరి, నవమల్లికను పండిట్ బిపిన్ చంద్ర గోస్వామి సంస్కృతంలోకి అనువాదం చేశారు.❀

## 450) విదేశీ భాషా గ్రంథాలపై సంస్కృత ప్రభావం -2000

ఫిలిప్ గ్లాస్ రాసిన "సత్యాగ్రహ ఒపేరా"లో భగవద్గీత శ్లోకాలను సంస్కృతంలో పాడటం జరిగింది. ది మార్క్సిస్ట్ రివల్యూషన్"లో "బృహదారణ్యక ఉపనిషద్" ప్రార్థన ఉంది. ప్రఖ్యాత మడోన్నా మ్యూజిక్ ఆల్బమ్‌లోని "సైబర్ రాగ"లో సంస్కృత మంత్రోచ్చారణ ఉంది. 1998లో మడోన్నా గ్రామీ అవార్డు అందుకున్న ఆల్బమ్ "రే ఆఫ్ లైట్"లో "అష్టాంగ విన్యాస యోగ" మంత్రాలున్నాయి. అసలు లిరిక్కే ఓం శాంతిశాంతితో ప్రారంభమవుతుంది. సంగీత కర్త జాన్ విలియమ్స్ "ఇండియానా జోన్స్ అండ్ ది టెంపుల్ ఆఫ్ డూమ్"లో "స్టార్ వార్" ఎపిసోడ్‌లో సంస్కృత శ్లోకాల కాయిర్ సింగింగ్ ఉంది. 2004 నాటి "బాటిల్ స్టార్ గాలాక్టికా" అంతా ఋగ్వేదంలోని గాయత్రీ మంత్రమే. ఎనిగ్మాతా రాసిన "లిరిక్స్ ఆఫ్ చైల్డ్ ఇన్ యు ఎస్‌లో సంస్కృత శ్లోకాలు ఉన్నాయి. (ఆధారం: సాంస్క్రిట్ -గీకీ పీడియా)❀

## 451) మధ్యప్రదేశ్ రాష్ట్ర గీర్వాణ భాషా సేవ -2000

మధ్యప్రదేశ్‌లో డా. కైలాష్ నాధ్ కట్జూ తర్వాత 1957లో ముఖ్యమంత్రి అయినపండిట్ రవి శంకర్ శుక్లా హయ్యర్ సెకండరీ స్కూల్స్‌లో సంస్కృతభాషను కంపల్సరీ చేశాడు. డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలలో సంస్కృతం అభ్యసించేవారికి సదుపాయాలూ ప్రోత్సాహకాలు రెట్టింపు చేశాడు. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఒక బోర్డును ఏర్పరచి సంస్కృత వ్యాప్తికి కృషి చేశాడు. ఆర్ధికమంత్రి విద్యామంత్రి నాలుగు యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు సంస్కృత కాలేజి ప్రిన్సిపాల్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్స్ట్రక్షన్, విద్యా సెక్రెటరీ, ప్రభుత్వ సెక్రెటరీ దీనిలో సభ్యులు. ఈ బోర్డు సూచనలను తక్షణమే అమలు జరిపాడు. 87 శాతం హయ్యర్ సెకండరీ పాఠశాలలో సంస్కృత ఉపాధ్యాయులను నియమించాడు. అదనంగా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీలలో సంస్కృతాన్ని ప్రవేశపెట్టాడు. ఆకర్ష వంతమైన జీత భత్యాలు ఏర్పాటు చేశాడు. సంస్కృత విద్యార్థులకు స్కాలర్షిప్‌లు, ప్రోత్సాహకాలు కల్పించాడు. సంస్కృత నాటకాలను విద్యార్థులతో ఆడించాలని ఉత్తర్వులు జారీ చేశాడు ముఖ్యమంత్రి రవి శంకర్ శుక్లా.

### కాళిదాస్ సమారోహ్

1958 నవంబర్ 20న మధ్యప్రదేశ్ ప్రభుత్వం "కాళిదాస్ సమారోహ్"ను ఉజ్జయినిలో ఏర్పరచి భారత ప్రధమ రాష్ట్రపతి డా.రాజేంద్ర ప్రసాద్ చేత ఆవిష్కరింపజేసి వారం రోజులపాటు ఉత్సవాలు నిర్వహించారు. భారత దేశంలో ఇది మొట్టమొదటి అత్యంత ప్రధాన సాంస్కృతిక ఉత్సవంగా పరిగణింప బడింది. భారత దేశంలోని అనేక ప్రముఖులు, రష్యా జపాన్ చైనా ఇరాన్, జర్మన్ విద్యా బృందాలు అత్యుత్సాహంగా పాల్గొని దిగ్విజయం చేకూర్చాయి. విక్రమ్ విశ్వ విద్యాలయ సంస్కృత ప్రొఫెసర్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తే, ఇటలీలోని ట్యూరిన్ సంస్కృత విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డా.మేరియో వల్లూరి, పశ్చిమ జర్మనీ మ్యూనిచ్ విశ్వవిద్యాలయ సంస్కృత ప్రొఫెసర్ డా.గుస్టేవ్ రోత్ ముఖ్యఅతిథులుగా పాల్గొని కాళిదాసుపై సెమినార్ పత్రాలు రాసి చదివారు. నాట్య సమారోహం, శిల్ప చిత్ర ప్రదర్శన బాగా ఆకట్టుకొన్నాయి. మద్రాస్ యూనివర్సిటీ సంస్కృత ప్రొఫెసర్ వి. .రాఘవన్, కలకత్తా యునివర్సిటీ ప్రభుత్వ సంస్కృత కాలేజ్ ప్రిన్సిపాల్ డా.గౌరీ నాథ శాస్త్రి "మాళవికాగ్ని మిత్రం" అభిజ్ఞాన శాకుంతలం తాము నటిస్తూ దర్శకత్వం చేస్తూ "నాటకాలు ప్రదర్శించారు. 1957లో చైనాలోని పెకింగ్‌లో శకుంతల నాటకంను డైరెక్ట్ చేసి ప్రదర్శించిన డబ్ల్యు.షుజ్ కూడా

పాల్గొన్నాడు. ఈ కార్యక్రమమం అంతర్జాతీయంగా బ్రిటిష్ ఓరియెంటలిస్ట్ డా.ఏ.ఎల్ భాషం, జపాన్ కోట్యో బుద్ధిష్ట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హీమో కుమరా, వెస్ట్ జర్మనీకి చెందిన పాల్ థీమ్, వాల్టర్ లీఫెల్ వంటి ప్రముఖులతో పాటు అందర్నీ ఆకర్షించి సంస్కృతంపై అభిమానం పెంచింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ ఉత్సవం నిర్వహిస్తున్నారు.

**కాళిదాస్ అకాడెమి**

ఉజ్జయినిలో 1977లో కాళిదాస అకాడెమీ ఏర్పాటు చేశారు. ఏదో కంటి తుడుపుగా ఆ మహాకవి పేరు మీద ఏర్పాటు చేయటం కాదు, సంస్కృత భాషను సంస్కృతీ సంప్రదాయాలను సజీవంగా నిలబెట్టటానికి పూర్వ వైభవం సంతరించటానికి ఏర్పడిన సంస్థ. విక్రమ్ కీర్తిమందిరం పురాతన వస్తు ప్రదర్శనశాల ఏర్పాటైంది. ఈ రెండు సంస్థలు, విక్రమ్ యుని ర్సిటీ కలిసి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు రూపొందించి నిర్వహిస్తున్నాయి. ఇతర దేశ నాటక సమాజాలను ఆహ్వానించి ప్రదర్శనలిప్పిస్తున్నారు. ప్రతి సంవత్సరం దేశంలోని సంస్కృత విద్యావేత్తలు ఆహ్వానించి ప్రసంగాలు ఏర్పాటు చేసి వారి సృజనకు "కాళిదాస సమ్మాన్" పురస్కారం అందిస్తున్నారు. మన కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు ఈ పురస్కారం అందుకొన్నారు.

**మధ్య ప్రదేశ్ సంస్కృత అకాడెమి**

1985లో మధ్యప్రదేశ్ సంస్కృత అకాడెమి ఏర్పడింది. సామాన్య ప్రజలకు సంస్కృతాన్ని దగ్గరకు తెచ్చింది. సృజనాత్మక రచనలను ప్రోత్సహించి ఘనమైన నగదు బహుమతులను ఇస్తోంది. యువతకు అవసరమైన సంస్కృత జ్ఞానాన్ని అందిస్తోంది.

**సంస్కృత సాహిత్య సృజన**

సాగర్ యునివర్సిటీ సంస్కృత ప్రొఫెసర్ డా. రాధావల్లభ త్రిపాఠీ గొప్ప సంస్కృత కవి విద్యావేత్త. ఇరవయ్యవ శతాబ్ది ఆధునిక సంస్కృతంలో మంచి ప్రవేశం ఉన్నవాడు. ఆధునిక విధానంలో సంస్కృతం నేర్పే అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాడు. పండిత ఉర్వీ దత్త శాస్త్రి "సుల్తాన్ జహాన్ వినోద మహాకావ్యంను 2 వేల శ్లోకాలతో 1935లో భోపాల్‌లో రాశాడు. జబల్‌పూర్‌కు చెందిన డా.రహస విహార్ ద్వివేదీ, ఇండోర్ వాసి శ్రీపాద శాస్త్రి హసుర్కర్ (1888-1974) ఉజ్జయిని విక్రమ్ యునివర్సిటీ సంస్కృత శాఖాధ్యక్షుడు డా.కె యెన్ జోషి వంటివారెందరో సృజన రచనలతో సంస్కృత సాహిత్యాన్ని రసప్లావితం చేశారు.❀



## 452) త్రిపుర కాంగ్రెస్ స్వాగతానంద కల్లోలః కర్త - పండిట్ లోకనాధ శాస్త్రి - 2000

మధ్యప్రదేశ్ జబల్పూర్‌కు చెందిన పండిత లోకనాథ శాస్త్రి భారతదేశ సమకాలీన రాజకీయాలపై "త్రిపుర కాంగ్రెస్ స్వాగతానంద కల్లోలః" అనే సంస్కృత కావ్యం రాశాడు. ఇదికాక అనేక భక్తి అష్టకాలు రచించాడు.

ఇండోర్‌కు చెందిన పండిట్ గజానన రామచంద్ర కల్మార్కర్ 100కు పైగా సంస్కృత రచనలు చేశాడు. ఆయన కవిత్వం జాతీయ భావాలకు ఆటపట్టు. మధుర మంజుల కవిత్వం ఆయన సొత్తు. సాగర్ వాసి, ప్రస్తుత వారణాసి. నివాసి డా.రామాజీ ఉపాధ్యాయ వచన సంస్కృతం బాగా రాశాడు. "ద్వా సుపర్ణ" రచనలో శ్రీ కృష్ణ సుదాముల మైత్రిని గొప్పగా వర్ణించాడు. ఇందులో గాంధీ గారి జీన జనోద్ధరణ గ్రామ వికాసం, చేతిపనుల పునర్వైభవం రంగరించాడు.❁

## 453) గాంధీ శతశ్లోకి కర్త - పండిట్ గణపతిశుక్ల -2000

మధ్య ప్రదేశ్ ఉత్తర నిర్మార్ జిల్లా ఖర్గాన్‌కు చెందిన పండిత గణపతి శుక్లా "కథామృతం" అనే చిన్నకథలను, చిన్నపిల్లలకు సరళమైన కవిత్వాన్నీ సంస్కృతంలో రాశాడు. స్వాతంత్ర్య ఉద్యమ ప్రభావంతో గాంధీ మహాత్మునిపై "గాంధీ శత శ్లోకి" రాశాడు. "భూదాన యజ్ఞ గాథ" కూడా రచించాడు.❁

## 454) రామ వనగమన నాటక కర్త – శ్రీమతి డా.వనమాలా భావల్కర్ –2000

మధ్యప్రదేశ్‌లోని సాగర్, ఉజ్జయిని, నాగపూర్ యునివర్సిటీలలో సంస్కృత ప్రొఫెసర్ శ్రీమతి వనమాలా భావల్కర్ సంస్కృత నాటకాలు కవితలు రాసింది. అందులో "రామ వన గమనం" నాటకం ప్రసిద్ధమైనది. ఇదికాక "పార్వతీ పరమేశ్వరీయం, "పాద దంద"లలో ఆమె కవిత్వం పరవళ్లు తొక్కింది. సంగీతానికి అనువుగా ఉండటంతో శ్రవణ సుభగంగా ఉంటాయి ఆమె కవితలు.❁

## 455) అజాత శత్రు నవలా కారుడు – డా.శ్రీనాథ శాస్త్రి –2000

మధ్యప్రదేశ్ ఇండోర్‌కు చెందిన డా.శ్రీపాద శాస్త్రి హాసూర్కార్ కుమారుడే శ్రీనాథ శాస్త్రి. ఉద్యోగ విరమణ తర్వాత ఆయనలోని సంస్కృత సాహిత్యం కట్టలు తెంచుకొని ప్రవహించింది. జాతీయ భావాలతో గొప్ప నవలలు రాశాడు. అందులో "అజాత శత్రు", "ప్రతిజ్ఞాపూర్తి", "సింధుకన్య", దావానలః, చెన్నమ్మ నవలలు విశేష ప్రాచుర్యం పొందాయి. సింధుకన్య నవలకు సాహిత్య అకాడెమి పురస్కారం లభించింది. దీనికే మధ్యప్రదేశ్ సాహిత్య అకాడెమి భోపాల్ ఉత్తరప్రదేశ్ సంస్కృత సంస్థాన్‌లు శాస్త్రి సృజనాత్మక సంస్కృత ప్రతిభను మెచ్చి అవార్డులను అందించి గౌరవించాయి.❁

## 456) గణిత వేదాంత కర్త - చక్రవర్తి - 2000

**గణిత వేదాంతం**

గణితానికి వేదాంతానికి సంబంధం ఏమిటి? బోడిగుండుకు మోకాళ్ళకు ముడి పెట్టటంలాగా ఉందనుకొంటున్నారా. దిగితేకాని లోతు తెలియదు. లెక్కలలో 1 సంఖ్య ఉంది. మిగిలిన అన్ని సంఖ్యలు దీని గుణకాలే. అలాగే ఉన్నది ఒకే ఒక్క శుద్ధ సత్యం. ఆ శుద్ధ సత్యం యొక్క గుణకాలే విశ్వంలో విభిన్న నామాలు, రూపాలు. జీవితం సమ భుజ త్రిభుజం. శరీర కోణం, శరీరాంతర్గత స్థితి కోణాలు, బాహ్యాప్రపంచ కోణం కలిస్తే సమాన కోణ సమానభుజాలున్న జీవితం యొక్క సమబాహు త్రిభుజం. సంఖ్యలన్నీ ఒక స్థిర బిందువునుంచి వచ్చినట్లే, ఆ బిందువును కొలవలేనట్లే, ఈ విశ్వమంతా గణింప శక్యం కాని శూన్యంనుంచి ఏర్పడింది. జీవితం ఒక చక్రం. దీన్ని సున్నా లేక వృత్తంతో పోల్చవచ్చు. వృత్తం అంటే బిందువు యొక్క పరివ్యాప్తి అన్నమాట. అయితే జీవితంలో రెండు బిందువులున్నాయి ఇవే పుట్టుక, మరణం. ఈ రెండు బిందువులను కలిపే సరళ రేఖయే జీవితం. జీవితం యొక్క తెలియని భాగమంతా అనంతం రేఖ.

ముందు ఒక సున్నా పెట్టి దాని తరువాత 1 అంకె వేస్తే 01 అవుతుంది. ఒకటి వేసి దానితర్వాత సున్నా పెడితే 10 అవుతుంది. సున్నాలు పెంచిన కొద్దీ విలువ పెరుగుతుంది 100 1000 వగైరా. ముందు ఒకటి లేకుండా ఎన్ని సున్నాలు పెట్టినా ఆ సున్నాకు విలువే లేదు. సృష్టిలో అన్ని వస్తువులు సున్నాలే. ఏక పరబ్రహ్మ సత్య భావన లేకపోతే ఈ వస్తువులకు దేనికీ విలువ లేదు. ఆ ఏక సత్య పరబ్రహ్మ ఎరుక కలిగితే జీవితం విలువైనది అవుతుంది. లేకపోతే భారమవుతోంది.


కనుక గణితం ధనాత్మక సైన్స్. అన్ని సైన్స్‌లకు మూలాధారం. ఇది సాంఖ్య వేదాంతంపై ఆధారపడిందే. వేదాంతాలలో అతి ప్రాచీనమైనది సాంఖ్య 0. ఇది శరీరాన్ని అందలి లోపలి విషయాలను మనసు చేసే క్రియలను తెలుసుకోవటానికి ఉపయోగ పడుతుంది. యోగ అనేది ఆచరణాత్మక విజ్ఞానం (ప్రాక్టికల్ సైన్స్). ఇది అతీంద్రియ చేతన (సూపర్ కాన్షస్) కలిగిస్తుంది. సందేహ నివృత్తికి సాంఖ్య యోగం తప్పని సరి.

ఈ విషయాలన్నీ స్వామి రామాకు “చక్రవర్తి’ ’అనే గణిత శాస్త్రవేత్త అయిన

స్వామి బోదించాడు. ఆయన గణిత శాస్త్రంలో ప్రొఫెసర్. చక్రవర్తీస్ మాథేమాటిక్స్ "గ్రంథ రచయిత". తర్వాత జీవితంలో సారం లేదని గ్రహించి సన్యసించి హిమాలయ గుహలలో తపస్సులో గడిపాడు. ఆయనకు మరొక గొప్ప శక్తి ఉంది అదే "తదేక దృష్టి". దేనిమీద అయినా ఆయన దృష్టిపెడితే దానిప్రభావం గొప్పగా ఉంటుంది. దీనిని "త్రాటకం" అంటారు. ఇంగ్లీష్‌లో గేజింగ్ అంటారు. ఈ దృష్టి బయట వాటిపై కేంద్రీకరిస్తే దాన్ని త్రాటకం అంటారు. అదే దృష్టిని అంతర్ముఖ చేస్తే దాన్ని ఏకాగ్రత అంటారు. కేంద్రీకరింపబడిన మనసుకు అత్యంత శక్తి లభిస్తుంది. కొందరు దృష్టిని భృమధ్యమంలో కేంద్రీకరిస్తారు. శివుడు మూడవకంటి దృష్టిని కేంద్రీకరిస్తేనే మన్మధుడు కాలి బూడిదయ్యాడు. భూతద్దంతో సూర్యకాంతిని కేంద్రీకరిస్తే కాగితం, ఫిలిం, దూది మొదలైనవి తగలబడటం మనకు అనుభవమే.

స్వామిరామా దీన్ని ప్రత్యక్షంగా చూపించమని కోరాడు. సరేనని దగ్గరలో ఉన్న కోర్టులో ఏ ఖైదీ అయినా అనవసరంగా అరెస్ట్ అయి విచారణ ఎదుర్కుంటున్నాడేమో చూసి వచ్చి చెప్పమన్నాడు. సరే అని వెళ్లి అక్కడి లాయర్లద్వారా పాపం ఒకతను ఏ నేరమూ చేయకుండా కోర్టులో విచారణకు గురౌతున్నాడని తెలుసుకొని స్వామి చక్రవర్తికి చెప్పాడు. అప్పుడు చక్రవర్తి "ఆ ఖైదీ విడుదలవుతాడు. జడ్జి చెప్పే జడ్జిమెంట్ ఎలా ఉంటుందో నీకు ప్రత్యక్షరం తెలియజేస్తాను, కాగితం మీద రాసి టైప్ చేసి ఎవరికీ తెలియకుండా జాగ్రత్త చేయి. జడ్జిమెంట్ రాగానే నేను చెప్పింది జడ్జి చెప్పింది పోల్చి చూడు" అని చెప్పటం రామా రాయటం టైప్ చేయటం అందులో మూడు టైప్ తప్పులు దొర్లటం జరిగాయి. రెండుమూడు రోజుల తర్వాత జడ్జి తీర్పు చెప్పాడు. దాని కాపీ తెప్పించి రామా తానూ టైప్ చేసిన దానితో పోల్చి చూశాడు. అక్షరం పొల్లు పోకుండా తాను చేసిన మూడు తప్పులతో సహా జడ్జి మెంట్ కాపీ ఉంది. ఆశ్చర్యపోయి చక్రవరి "త్రాటక విద్య" అమోఘమైనది గ్రహించాడు. అంటే ఎక్కడో సుదూరంలో ఉండికూడా మనసును కేంద్రీకరించి అవతలి వారిపై ప్రభావం చూపించవచ్చు అని అర్ధమయింది .అప్పుడు రామా "స్వామీ !మీరు ఈ ప్రపంచ గతిని మార్చగలరా?" అని అడిగాడు. దానికాయన "అది నా పనికాదు అతడు అన్యాయంగా కేసులో ఇరుక్కున్నాడనే జాలితో నా దృష్టిని జడ్జి మనసుపై కేంద్రీకరించి ప్రభావం చూపి జడ్జిమెంట్ అలా వచ్చేట్లు చేయగలిగాను. మనిషి నిగ్రహంతో ఉంటే ఎక్కడున్నా , యెంత దూరంలో ఉన్నా అవతలివారి మనసుపై ప్రభావం కలిగించవచ్చు అని నీకు తెలియ జేయటానికే ఇలా చేశాను" అన్నాడు.

చక్రవర్తి యోగి సంఖ్యామానంలోని సున్నా నుంచి 100 వరకు ప్రతి అంకెను ఉపనిషత్‌లోని ఒక్కొక్క శ్లోకంతో జత చేసి వ్యాఖ్యానించి చెప్పేవాడు. వాటిలోని వేదాంత భావనలను విశదీకరించేవాడు.❁



## 2001 నుండి 21వ శతాబ్దం-

## 457) టీనేజ్ సంస్కృత బోధకులు - చి. అశోక్ - (2001), చి. సిద్దార్ధ - (2004)

9 ఏళ్ళ అశోక్, 11 ఏళ్ళ సిద్దార్ధ అమెరికాలో పెన్సిల్వేనియా కుర్రాళ్ళు. వాళ్ళ గురువుగారు భారతీయ భోజనం ఎలా చేయాలో బోధించినందుకు సంస్కృత శ్లోకంలోః "నమో నమః ఆవయోవ గురు భారతస్య భోజనస్య పద్ధతిమ్ ఆవామ్ వర్ణిత వాన్" అంటూ గురు స్తుతి చేసిన వినయ సంపన్నులు. యు ట్యూబ్‌లో "సాంస్క్రిట్ కార్నర్"ను ఈ చిచ్చర పిడుగులు యెర్ర కుర్తాలతో ఫాలభాగాన విభూతి రేఖలతో పంచామృత ప్రసాదం శ్లోకాలు చదువుతూ వీడియోలో కనిపిస్తారు. ఈ వీడియోని ఇప్పటికి 50 వేలకు పైగా జనం చూసి మెచ్చారు. సంస్కృత కార్నర్‌కు 800కు పైగా సబ్ స్క్రైబర్స్ ఉన్నారు. ఈ లెక్కలు ఇదివరకటి దాకా ఈ సోదరులకు ఒక ఇన్స్పిరేషన్‌గా ఉండేది. ఇప్పుడు బాగా ప్రచారంలో ఉన్నారు కనుక వాటిపై దృష్టి లేదు అంటారు.

ఇప్పుడు టీనేజ్‌లో ఉన్న ఈ సోదరద్వయం ధారాళంగా సంస్కృతం రాస్తారు, ధారాళంగా మాట్లాడుతారు. బి.ఏ తో సమానమైన "కోవిద" కోర్సు చదివి డిస్టింక్షన్‌లో సిద్దార్ధ ఉత్తీర్ణుడయ్యాడు. ఇప్పుడు సంస్కృత పంచకావ్యాలు అధ్యయనం చేస్తున్నాడు. ఒకప్పుడు హాబీగా ప్రారంభమైన సంస్కృతం ఇప్పుడు ఈ సోదరుల నిత్య జీవిత వ్యాపకమే అయింది. 2010లో సంస్కృతాన్ని తీవ్రంగా అధ్యయనం చేయాలన్న కోరికతో చెన్నైకి చేరుకున్న ఈ సోదరులలో 16 ఏళ్ళ సిద్దార్ధ చెన్నై రామకృష్ణ మఠంలో సంస్కృతాన్ని 10 ఏళ్ళ పిల్లలనుంచి సీనియర్ సిటిజెన్ల వరకు 10 రోజుల ఇంటెన్సివ్ వర్క షాప్‌లో బోధిస్తున్నాడు. దీనిపై సిద్దార్ధ స్పందిస్తూ "ఈ వర్క్ షాప్ లో నేను బాలుర నుంచి వృద్ధుల వరకు సంస్కృతంను ఒక్క తమిళ మాటకాని ఒక్క ఇంగ్లీష్ మాటకాని వాడకుండా అంతా సంస్కృతంలోనే బోధించటం గొప్ప అనుభూతిగా ఉంది. ఇది నాకు పెద్ద మానసిక శ్రమ కనుక నేను అనేక ఆధారాలు సాంకేతికాలు (ప్రాప్స్ అండ్ సైన్స్)లపై ఆధార పడాల్సి వచ్చింది" అని నిజాయితీగా చెప్పాడు.

ఈ సోదరుల తల్లి శ్రీమతి విజయ విశ్వనాథన్ వీళ్లకోసమే చెన్నైకి వచ్చి వారికి స్ఫూర్తిగా నిలిచింది. సుమారు 15 ఏళ్ళక్రితం స్వామి దయానంద సరస్వతి ప్రవచనాలతో స్ఫూర్తి పొంది భగవద్గీత, ఉపనిషత్తులు బ్రహ్మ సూత్రాలు అధ్యయనం

చేస్తూ సంస్కృతంలో గట్టిగా కృషి చేసింది. అమెరికాలో "సంస్కృత భారతి"లో నేనూ నా పిల్లలతో పాటు సంస్కృతం నేర్చుకున్నాను. మేము ముగ్గురం కలిసి సంస్కృత పరీక్షలు రాశాం. మా ఇంట్లో సంస్కృతం ఒక అఫీషియల్ సీక్రెట్ మాకు" అంటూ చిరునవ్వుతో ఆమాతృమూర్తి "వార్టన్ బిజినెస్ స్కూల్" పూర్వ విద్యార్థిని, భర్తతో కలిసి "ఫార్మా స్యూటికల్ కన్సల్టింగ్ ఫర్మ్" నిర్వహిస్తున్న శ్రీమతి విజయ మాధవన్ చిరునవ్వుతో చెప్పింది.

పెన్సిల్వేనియాలో ఉన్నత వర్గాల వారు చదివే ప్రయివేట్ స్కూల్‌లో చదువుతున్న తన ఇద్దరు పిల్లలను ఆ స్కూల్ మాన్పించి ఇంటి వద్దనే తానే వారికి విద్య బోధించటం ప్రారంభించింది. దీనికి ఆమె చెప్పిన కారణాలు "మా వాళ్ళు చదివే స్కూల్ ఉన్నత వర్గాల పిల్లలు చదివేది పాప్ కల్చర్ బాగా ఒంటబట్టిన వారి మధ్య మా పిల్లలు ఉంటే మన విలువలు మృగ్యమై పోతాయనే వ్యథతో మాన్పించి నేనే మన విద్యను ఇంటివద్దే నేను ఫిజిక్స్ లెక్కలు నేర్పించాను. ఇంగ్లిష్ , ఫైన్ ఆర్ట్‌లను ఆన్‌లైన్‌లో నేర్చుకొన్నారు. రెగ్యులర్‌గా ఆన్‌లైన్ పరీక్షలు రాసి పాసవుతున్నారు" అని గర్వంగా చెప్పింది ఆ తల్లి.

ఇండియాకు తిరిగి వచ్చాక స్కూల్‌లో చేరారుకాని కొద్దికాలానికే మానేశారు. ప్రస్తుతం అశోక్, సిద్దార్థ ఇద్దరు "స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ" ఆన్ లైన్ హై స్కూల్ కర్రిక్యులం చదువుతూ స్టాన్డర్డ్ పరీక్షలు రాస్తున్నారు. సాధారణ స్కూల్ విద్య చదవ లేదనే దుగ్ధ వారికి లేదని చెప్పారు. సమయం ఎక్కువగా ఉండటం వలన సంగీతం, వయోలిన్ నేర్చుకొంటూ వేద క్లాసులకు వెడుతూ సంస్కృతం బోధిస్తున్నారు. కర్ణాటక సంగీతాన్ని శ్రీమతి జి.సీతాలక్ష్మి అమ్మాళ్ వద్ద, వయోలిన్ శ్రీమతి చారుమతి రఘురామన్ వద్ద అభ్యసిస్తున్నారు. అరుదైన సంగీత కాంపోజిషన్స్‌ను పద్మశ్రీ ఎస్.ఆర్ జానకీరామన్ వద్ద నేర్చుకొంటున్నారు. వేదం పాఠాల తర్వాత తగినంత సమయం ఉంటోంది కనుక తమకిష్టమైన వాటిని కష్టపడకుండా ఇష్టపడి నేరుస్తున్నామని సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ టీనేజీ కుర్రాళ్ళు "మా ఇంట్లో టి వి లేదు. ఒక సెల్ ఫోన్, ఒక కంప్యూటర్ మాత్రమే ఉన్నాయి. వాటిని కూడా విద్యా వ్యాసంగానికే వాడుతాము. మా ఇంట్లో వేరే ఏ పరికరము లేదు. అందువల్ల మా అబ్బాయిలు వాళ్లకు కావాల్సిన విషయాల మీద పూర్తిగా దృష్టి పెట్టి చదివి ఉన్నతి సాధిస్తున్నారు. అదే మా అందరికి పరమానందంగా ఉంది అదే మాకు సంతృప్తి" అన్నది ఆ బంగారు బాబుల మహాతల్లి శ్రీమతి విజయ మాధవన్. ఈ ఆదర్శ కుటుంబం అందరికీ ఆదర్శం అనిపించి వీరి గురించి గీర్వాణంలో రాశాను.

(ఆధారం- దీపా వెంకట్రామన్ 20-12-16న ది హిందు పత్రికలో రాసిన "ది టీనేజ్ సాంస్క్రిట్ స్కాలర్స్")❁

## 458) 6వ శతాబ్ద రామాయణంకనుగొన్న కలకత్తా ఏషియాటిక్ సోసైటీ - 21వ శతాబ్దం

కలకత్తాలోని ఏషియాటిక్ సొసైటీ లైబ్రరీ రీసెర్చ్ స్కాలర్స్ వారు 6వ శాతాబ్దానికి చెందిన "వహ్ని (అగ్ని) పురాణంపై పరిశోధిస్తుంటే అందులో ఒక అసంపూర్తి వ్రాతప్రతి గ్రంథం చూసి ఆశ్చర్య పడిపోయారు. అప్పుడు జర్మన్ స్కాలర్ Aufrecht గోబర్ రిపాజిటరీగా సంస్కృత గ్రంథాలపై తయారు చేసిన "కేటలాగో కేటలాగం"ను పరీక్షగా చూడగా ఒకే రకమైన రెండు వ్రాత ప్రతులు ఉన్నట్లు గమనించారు. ఒకటి లండన్‌లోని ఇండియా ఆఫీస్ లైబ్రరీ వారు భద్రపరచినది, రెండవది శతాభి చరిత్ర కలిగిన కలకత్తా సంస్కృత సాహిత్య పరిషత్ భద్ర పరచిందిగా తెలుసుకొన్నారు. వారి ఉత్సాహం పెరిగి అగ్నిపురాణం వ్రాతప్రతి బూజు దులిపి దాని సంపూర్ణ ప్రతిని పట్టుకొన్నారు. దీన్ని విశ్లేషిస్తుండగా "దశగ్రీవ రాక్షస వధ"కు వహ్నిపురాణానికి ఏమీ సంబంధం ఉన్నట్లు కనబడ లేదు. ఈ పురాణంలో అకస్మాత్తుగా మరొక రకమైన కథా శ్లోకాలు ఎలా చేరాయో అర్థం కాలేదు వారికి . నిదానంగా ద్రుష్టి సారిస్తే వారికి తాము చదువుతున్నది అనేక చేర్పులు మార్పులతో ఉన్న 6వ శతాబ్దపు రామాయణ గ్రంథం అని అర్థమైంది. ఆర్కిమిడీస్ లాగా "యురేకా" అని ఆనందంతో కేకలేసుకొన్నారు. అసలైన వాల్మీకి రామాయణం క్రీ.పూ 4వ శతాబ్దానికి చెందింది.

ఈ 6వ శతాబ్ది రామాయణంలో 7 కాండలకు బదులు 5 కాండలు మాత్రమే ఉన్నాయి. బాలకాండం ఉత్తర కాండలు లేవు. రావణ వధ తర్వాత రామాదులు అయోధ్యచేరి పట్టాభిషేకం జరుపుకోవటంతో ఈ రామాయణం సమాప్తం. ప్రారంభం కూడా దశరధుని శాపం రాముడిని అరణ్యాలకు పంపటం లేదు. దీని బదులు శుక్రాచార్యుల భార్యను విష్ణుమూర్తి సంహరించినందుకు ఆయన లక్ష్మీ దేవిని శపించటం, చనిపోయిన రాక్షసులను బ్రతికించటంతో కథ ప్రారంభమౌతుంది. రెండవ శాపం నిరంతరంగా జరుగుతున్న దేవ దానవ యుద్ధానికి ధరిత్రి వ్యధ చెందగా లక్ష్మీ నారాయణులు బాధ్యత తమపై వేసుకొని తామిద్దరం శాప ఫలంగా భూమిపై జన్మిస్తామని తెలియజేయటం జరుగుతుంది. ఈ రామాయణం భార్యా భర్తల వియోగానికే ప్రాధాన్యం తప్ప తండ్రీ కొడుకుల వియోగాన్ని ప్రాధాన్యమివ్వలేదు. ఇందులో రాముడు దేవుడుగా కాక మానవత్వమున్న ఉన్నత మానవునిగా కనిపిస్తాడు.

(ఆధారం- న్యూ రామాయణ డిస్కవరీ అ స్టాండ్ స్కాలర్స్ ఇన్ కలకత్తా :ఝిమి ముఖర్జీ పాండే). ❁

## 459) సంస్కృతాన్ని శిరోభూషణంగా భావిస్తున్న – ఉత్తరాఖండ్ – 21వ శతాబ్దం

కర్ణాటకలో ఒకటి రెండు గ్రామాలలో ప్రజలందరూ సంస్కృతంలోనే మాట్లాడుకొంటారని మనం తెలుసుకున్నాం. దేవతా భూమి అయిన ఉత్తరాఖండ్ తానేమీ వెనకబడి లేదని నిరూపించింది. అక్కడ సంస్కృతాన్ని రెండవ భాషగా చేసి ప్రోత్సహిస్తున్నారు. స్కూల్స్‌లో సంస్కృతం తప్పనిసరి చేశారు. పుణ్యస్థలి ఋషీకేశ్‌ను సంస్కృత సిటీని చేసింది ప్రభుత్వం. అక్కడి “భంటోలీ” గ్రామ ప్రజలందరూ ఏడాది న్నర కాలం నుంచి సంస్కృతంలోనే మాట్లాడుకొంటున్నారు. ముఖ్యంగా మహిళలు ఫోన్ పలకరింపుల్లో కూడా “హరి ఓం నమస్తే , భవాన్ కదం అస్థి” అని అంరంటారు. వీళ్ళు కాషాయం కట్టుకున్నవాళ్ళు కాదు సాధారణ గ్రామజీవులు. ఉత్తరాఖండ్‌లో భాంటోలి దేహరాడూన్‌కు 450 కిలో మీటర్ల దూరంలో ఉన్న కుగ్రామం. వారి మాతృ భాష స్థానిక “కుమోని” కానీ ఇప్పుడు శతాబ్దాల తరబడి వస్తున్న సంస్కృతం భాంటోలిలోని 500 గ్రామస్తులందరు గీర్వాణమే మాట్లాడుతారు. దీనికి కారణం సుమారు ఏడాదిన్నర క్రితం ఉత్తరాఖండ్ ప్రభుత్వం భాంటోలి గ్రామాన్ని “భాంటోలి సంస్కృత గ్రామం”గా ప్రకటించటమే. 30 ఏళ్ళ శ్రీ మనోజ్ అధికారి మొదటి సంస్కృత ఆచార్యుడుగా ఇక్కడికి వచ్చి గ్రామస్తులకు సంస్కృతం నేర్పటం ప్రారంభించాడు. ఇప్పుడు దేశంలో 5వ సంస్కృత గ్రామంగా భాంటోలి రికార్డ్ సృష్టించింది. మిగిలిన నాలుగు కర్ణాటకలోని మత్తూర్, హోషనహల్లి, మధ్యప్రదేశ్‌లోని మోహద్, ఝిరీ గ్రామాలు. ఈ అయిదు సంస్కృత భారతి అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి.

బయటి గ్రామాలనుంచి భాంటోలి గ్రామానికి వచ్చిన వారికి గ్రామస్తులు అంతా సంస్కృతంలోనే మాట్లాడుతుంటే కలా నిజమా, తాము 5వ శతాబ్దంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతుంది. సంస్కృతం దేవ భాష అని వీరందరూ విశ్వసించి అనుసరిస్తున్నారు. ఇప్పుడు హరిద్వార్‌లో ఉన్న ఉత్తరాఖండ్ సంస్కృత విశ్వ విద్యాలయం సంస్కృతంలో బీఎడ్ క్లాసులు నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం జనవరి నుంచి సంస్కృతాన్ని రెండవ భాషగా హిందీని మొదటి భాషగా డిక్లేర్ చేసి ప్రోత్సహించింది. సంస్కృతంలో శాస్త్రి కోర్సు పూర్తి చేసినవారు డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉన్నవారికే సంస్కృత బీఎడ్‌కు అరులు. ఆగస్టు 15 నుంచి అడ్మిషన్లు ప్రారంభమై 175 మంది విద్యార్థులతో 12 మంది అధ్యాపకులతో కళకళలాడుతోంది. హరిద్వార్–రూర్కీ జాతీయ రహదారిలో సంస్కృత యునివర్సిటీ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. యూనివర్సిటీ మొదట ఇద్దరు డిగ్రీ సంస్కృత విద్యార్థులతో ప్రారంభమై ఇప్పుడు యోగా, కంప్యూటర్ జరలిజం లైబ్రరీ సైన్స్ అండర్ గ్రాడ్యుయేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్‌కు చెందిన 150 మంది విద్యార్థులతో నిండుగా ఉంది.

భారత దేశంలో ఉత్తరాఖండ్ రాష్ట్రం ఒక్కటే సంస్కృతాన్ని మొట్టమొదటిసారిగా

రెండవ అధికార భాషగా ప్రకటించింది. ఈ బిల్లు 2009లో పాసయింది. కాళిదాస మహాకవి ఉత్తరాఖండ్‌లో జన్మించాడని ఇక్కడి ప్రజల పూర్తి విశ్వాసం. రాష్ట్రంలో అనేక సంస్కృత మీడియం పాఠశాలలు కాలేజీలు సంస్కృత విద్యావ్యాప్తికి సహకరిస్తున్నాయి. ప్రభుత్వం కూడా వీటికి తగినంత సహాయ మందిస్తోంది. నిత్యవాడకంలో సంస్కృతాన్ని ఉపయోగించటం, పోటీ పరీక్షలలో పాల్గొని బహుమతులు సాధించటం కోసం ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రథమా, ద్వితీయ తృతీయ బహుమతుల కోసం ఒక లక్షా, యాభై వేలు, 25 వేలు నగదు పారితోషికాన్నిస్తోంది. ప్రభుత్వం ఆధ్వర్యంలో 100 దాకా సంస్కృత పాఠశాలలు కాలేజీలు నడుస్తున్నాయి. వీటన్నిటికీ ప్రభుత్వం పూర్తి గ్రాంట్ సమకూరుస్తోంది. సంస్కృత యూనివర్సిటీతోపాటు మరి 4 యూనివర్సిటీలలో సంస్కృతం బోధిస్తున్నారు. ఉచిత మధ్యాహ్న భోజనంతోపాటూ కంప్యూటర్లు స్కాలర్షిప్‌లు ఇచ్చి మరింతగా ప్రోత్సహిస్తోంది.


ఉత్తరాఖండ్ సంస్కృత అకాడెమీ కూడా తనదైన శైలిలో సంస్కృత భాషాభివృద్ధి చేస్తోంది. సంస్కృత నాటకాలు నృత్యాలు సంగీత కచేరీలు, ఆశుభాషణం జనరల్ నాలెడ్జి బృందగానం కార్యక్రమాలు జిల్లాస్థాయి రాష్ట్ర స్థాయిలో నిర్వహించి బహుమతులు అందిస్తోంది. సంస్కృత నాట్య యాత్రలు సంస్కృత కుటుంబ సమ్మేళనాలు, సంస్కృత గ్రామానిర్మాణం నిర్వహిస్తోంది.

వీటికి మించి హరిద్వార్‌లోని ఉత్తరాఖండ్ సంస్కృత అకాడెమి భారత దేశంలోనే మొట్టమొదటిసారిగా సంస్కృత టి.వి. ఛానల్ ప్రారంభించి ఆదర్శప్రాయంగా నిలిచింది. వార్తలేకాక సంస్కృత సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇది మాత్రమేకాదు ఉత్తరాఖండ్ ప్రభుత్వం అంతర్జాతీయ సంస్కృత సమ్మేళనంను సెప్టెంబర్‌లో నిర్వహించింది. ఇలా గీర్వాణ భాషకు గొప్పతనం అన్ని కోణాలలో అన్ని రూపాలలో సంతరిస్తున్న ఉత్తరాఖండ్ ప్రభుత్వం అభినందనీయం.❁

## 460) హర్యానా విశ్వ విద్యాలయ సంస్కృత పరిశోధన - 21 శతాబ్దం

హర్యానాలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సాన్ స్క్రిట్ అండ్ మైథలాజికల్ స్టడీస్ వారి ఆధ్వర్యంలో వెలువడిన సంస్కృత గ్రంథాలు-

1-శ్రీ దిగ్వే కర్ రచించిన -కురుక్షేత్ర మాహాత్మ్యం, 2-నాగేశభట్టు రాసిన -పరమ లఘుమంజరి, 3-డా జి ఏం భట్టాచార్య రాసిన మేఘ దూత టీకా, 4-నారాయణ తీర్థుల -కుసుమాంజలికారికా వ్యాఖ్య, 5-రాజానక ఆనందకవి కృత-షత్రింశత్తత్వ సందోహ, 6-డా కపిల్ దేవ శాస్త్రి రచన -గాణాపత్య, 7-డా బల్దేవ్ సింగ్ కృత - పాదపదార్థ సమీక్ష, 8-ధర్మోత్తర వ్యాఖ్యతో న్యాయబిందు, 9-డా ఎస్ యెన్ శాస్త్రి రాసిన -దయానంద దర్శన, 10-డా ఎస్ యెన్ శాస్త్రి కృత -వేదం ప్రామాణ్య తదా ఋషి దయానంద.❁



## 461) మధ్య ప్రదేశ్ సంస్కృత గ్రామాలు – ఝిరి, మోహద్ బాగువార్ (21వ శతాబ్దం)

మధ్యప్రదేశ్‌లో చిన్నగ్రాం ఝిరీ. అక్కడి రైతు చోహాన్ పొలం దున్నుతూ ఎద్దులని "శీఘ్రతరం శీఘ్రతరం" అనగానే అవి అర్థం చేసుకొని వేగంగా నడుస్తూ దుక్కి దున్నటం చాలామంది చూశారు. అతని దృష్టిలో సంస్కృతం దేవతల భాష కాదని తమ మూలాలలోనే నిండి ఉందని అంటాడు. రచ్చబండ కింద కూర్చుని ఊసుకోలు కబుర్లాడుకొన్నా, నడుస్తున్నా, పనులలో ఉన్నా బడిలో గుడిలో కూడా ఆ గ్రామంలో అందరూ సంస్కృతంలోనే మాట్లాడతారు. "నమోనమః త్వం కుత్రా అసి" అని పలకరిస్తారు. ఇండోర్‌కు వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ శివారు గ్రామం ఝిర్సి గ్రామప్రజలు తమ స్థానిక మాల్వి భాషను మాట్లాడారు, సంస్కృతంలోనే సంభాషిస్తారు. సంస్కృత సంస్కృతీ వారి జీవన జీవిత విధానాలను ప్రభావితం చేసింది. ఇక్కడ ఒకే ఒక బ్రాహ్మణ కుటుంబం ఉన్నది. స్థానిక పాఠశాలలో సంస్కృతం బోధించే ఉపాధ్యాయిని విమలా పన్నా 24 ఏళ్ళ ఒరాన్ తెగకు చెందిన మహిళ. ఆడవారిలో సంస్కృత వ్యాప్తికి విశేషంగా కృషి చేస్తోంది. తల్లులు మాట్లాడుతుంటే, పిల్లలకు ఆటోమాటిక్‌గా సంస్కృతం వచ్చేస్తోంది. ఈ గ్రామంలో క్షత్రియ, ఠాగూర్ సొంధీ, సుతార్‌లతోపాటు భిల్లులు కూడా ఉంటారు. ఈ సంవత్సరం 250 మంది సంస్కృతంలో స్కూల్ ఫైనల్ పరీక్ష రాశారు. గ్రామంలో రవాణా సౌకర్యం ఇంకా రావాలి ఇంటర్నెట్ లేదు. పంచాయితీ కూడా సంస్కృతానికి మంచి ప్రోత్సాహమిస్తోంది.

ఝిరి గ్రామంతో పాటు మోహద్, భాగువార్ గ్రామాలాలో కూడా సంస్కృతం ప్రజల నరనరానా జీర్ణించుకు పోయింది. 2002లో సంస్కృత భారతి ఈ గ్రామాలలో "సంస్కృత భాషణం" ప్రారంభించింది. దాన్ని తేలికగా అందుకొని ఆ గ్రామాలలోని ముస్లింలు క్రైస్తవులు షెడ్యూల్డ్ కులాల వారు షెడ్యూల్డ్ జాతులవారు ఒకరేమిటి ఆబాల

## 462) 21వ శతాబ్దంలో గీర్వాణ భాషాభ్యసనంలో నవీన విధానాలు – బి.యెన్.శశికిరణ్, హరి రవికుమార్ (జూన్ 2017)

చిన్మయ అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యంలో "సంస్కృతంలో నూతన ఎల్లలు, భారతీయ విజ్ఞానం"పై 2017 జూన్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో శ్రీ బి.యెన్.శశికిరణ్, శ్రీ హరి రవికుమార్‌లు సంయుక్తంగా ఒక పరి శోధనాపత్రాన్ని సమర్పించారు. అందులోని ముఖ్య విషయాలు మీ ముందు ఉంచుతున్నాను.

"ప్రపంచంలో భారత దేశానికి సంస్కృతభాష దైవమిచ్చిన విశేష వరం. అనేక విధాలుగా దాని ప్రత్యేకత ఉంది. వ్యాకరణంలో పాణిని పద్ధతి ఉత్కృష్టమైనది. భాషకు అది గొప్పశక్తి సామర్థ్యాలను చేకూర్చింది. శబ్దోత్పత్తికి దాని తోడ్పాటు చిరస్మరణీయం. ఇతర భాషాబోధనా విధానాలు సంస్కృతానికి నప్పవని, శ్రీ సచ్చిదానందేంద్ర సరస్వతి, శ్రీ ఆర్ జి భండార్కర్, ఎ.ఎ.మాగ్డోనెల్, డి యెన్.షాన్ బాగ్ మొదలైన ప్రముఖులు, సంస్కృత భారతి, బెనారస్ హిందూ యూనివర్సిటి, రాష్ట్రీయ సాంస్క్రిట్ సంస్థాన్, సుర సరస్వతి సభ, కర్నాటక స్టేట్ ఓపెన్ యూనివర్సిటి ప్రసిద్ధ సంస్థలు ఆధునిక కాలంలో వారి వారి విధానాలలో సంస్కృతం నేర్పుతున్నారు. ఇందులో కొన్ని సత్ఫలితాలనిస్తే, మరికొన్ని అంతగా ప్రయోజనం చేకూర్చలేదు. కనుక ప్రాక్, పశ్చిమ దేశాలలో సంస్కృత బోధనకు "కావ్య ఆధార విధానం" (కావ్య సెంట్రిక్ అప్రోచ్) చాలాబాగా ప్రయోజనాన్ని కలిగిస్తుంది అని అధ్యయనంలో తేలింది. ఇది సంప్రదాయ విధానం ఆధారంగా ఉన్నప్పటికీ, ఆధునిక సాంకేతికను సమకూర్చటంతో విశేష ఫలితాలు వస్తున్నాయి. వ్యక్తి విధానానికి అనుకూలంగా ఉంటూ, నేర్చేవారిని 1–సంస్కృతంతో ఏమాత్రం పరిచయం లేనివారు, 2–భారతీయ సంస్కృతిపై అవగాహన ఉన్నా, ప్రాంతీయ భాషపై అవగాహన లేనివారు, 3–భారతీయ భాషా సంస్కృతి, పరంపరాగత భాషలో అవగాహన ఉండి ఏదో ఒక భాష బాగా తెలిసినవారు, 4– ఒకప్పుడు సంప్రదాయ పద్ధతిలోనో వేరొక విధానంలోనో నేర్చి, మరలా దానిపై అభిమానంతో నేర్వాలనుకోనేవారుగా విభజన చేశారు. పైన చెప్పిన ద్వయం వీరందరికోసం ఎనిమిదిరకాల భాషాభ్యసన పరికరాలను (లెర్నింగ్ టూల్స్) తయారు చేశారు. ఇవి రెడీమేడ్ దుస్తులులాగా ఎవరికి ఏది కావాలంటే వారికి అది సరిపోయేటట్లుగా.❀

వృద్ధులు అందరూ సంస్కృతంలోనే మాట్లాడుతూ ఆధునిక ప్రపంచానికి గొప్ప సందేశం అందిస్తున్నారు. వారి గీర్వాణ భాషారాధనకు నమోవాకాలు.❁

## "గీర్వాణ భాషా వైభవం"

మనవి– నేను రచించి సరసభారతి ప్రచురించిన "గీర్వాణకవుల కవితా గీర్వాణం –2 రెండవ భాగం" ఆవిష్కరణ సందర్భంగా "గీర్వాణ భాషా వైభవం" శీర్షికతో 4-12-2016న నిర్వహించిన పద్య కవిసమ్మేళనంలోని కవితలను "గీర్వాణ కవుల కవితా గీర్వాణం –3 మూడవ భాగం"లో చేర్చి ముద్రిస్తున్నందుకు సంతోషంగా ఉంది. కవులు తమ అమూల్య భావాలను పద్య సుమమాలగా రూపొందించి గీర్వాణ భాషా సరస్వతికి అమూల్యా భరణంగా సమర్పించారు. వారందరికీ సరసభారతి కృతజ్ఞతలు తెలియజేస్తోంది.

ఈ సురభిళ సుమమాలను సరస్వతీ పుత్రులు, నడయాడే దైవం కంచి జగద్గురువులు, పరమాచార్య శ్రీ శ్రీ చంద్ర శేఖర సరస్వతీ మహా స్వాములకు సవినయంగా అంకితమిస్తున్నాము. **– దుర్గాప్రసాద్** ❁

## "గీర్వాణ భాషా వైభవం"

### 1) గీర్వాణ భాషా వైభవం

**–డా రామడుగు వెంకటేశ్వర శర్మ** (గుంటూరు) – 9966944287

1. సీ– రామ నీరద సుదర్శన మాత్ర కవన నృత్యతా కేకి వాల్మీకి! అంజలు లివె
శ్రుతి పురాణార్ధ భారత పద్మ వికసనోల్లాస వేద వ్యాస! ప్రణతి వినుతి
ప్రతిభా సమేత రూపక దీపికా వాస! భాసా నమోస్తు
కమ్రోపమాన సత్కవితా విలాస శ్రీ కాళిదాసా! నమస్కార శతము
మహిత మమృతమ్ము జ్ఞాన సంపత్తి కోరి, నవ్య మానంద సంస్పంద నంబు తోడ

రామడుగు వేంకటేశ శర్మ యొసంగు- అక్షర సువర్ణ సీస పద్యాల మాల.

2. సీ- "కవి భారవే రర్ధ గౌరవ" ఖ్యాతి చేకొన్న భారవి! ఏటి కోళు లివియె
శబ్ద లాలిత్యైక సంపస్సముద్దండి! దండి మహా కవీ దండమయ్య
మల్లినాథ ప్రశంసా "మాఘ మేఘేతి" వాక్య కారక మాఘ! ప్రణతి శతము
శివ మహిమ్న స్తోత్ర కవి గాధ భక్తాగ్ర గణ్య సత్కీర్తి సౌజన్య! నతులు
మహిత మమృతమ్ము జ్ఞాన సంపత్తి కోరి- నవ్య మానంద సంస్పంద నంబు
తోడరామడుగు వేంకటేశ శర్మయె యొసంగు- అక్షర సువర్ణ సీస పద్యాల
మాల.

3. సీ - నవ విద్వ దౌషధ నైషద కవితా ప్రవర్ష, హర్షా! ఇదే ప్రణుతి శతము
కాదంబరీ రసజ్ఞాన దాయక బాణ! బాణ భట్టారకా వందనములు
"సరస పద్మావతీ చరణ చారణ చక్ర వర్తి" యౌ జయదేవ వందనములు
"కృష్ణ కర్ణామృత లీలాశుకా"! జ్ఞాన చింతామణి కవీంద్ర! చేతు నతులు
మహిత మమృతమ్ము జ్ఞాన సంపత్తి కోరి- నవ్య మానంద సంస్పంద నంబు
తోడరామడుగు వేంకటేశ శర్మయె యొసంగు- అక్షర సువర్ణ సీస పద్యాల
మాల.

4. సీ- కరుణా రసైక సత్కవన గోదావరీ వర భూతి, భవ భూతి! వందనములు
గుణ్య సామాన్య నైపుణ్య జీవన రూపకా! మృచ్ఛ కటికాఖ్య కర్త! నతులు
చాణక్య రాజ్యాంగ చతురతా పూర్ణ "ముద్రారాక్షస" విశాఖ దత్త నతులు
తృతీయ పంథా ప్రధానా! "అనర్ఘ రాఘవ రూపకా! నమస్కార శతము
బంధుర రసానంద పరీమళ"! కుందమాలా కార! వందనములు
నిర్మల ప్రియదర్శినీ రూప నవ్య నాగానంద హర్షాధిపా నమోస్తు
మహిత మమృతమ్ము జ్ఞాన సంపత్తి కోరి - నవ్య మానంద సంస్పంద నంబు
తోడరామడుగు వేంకటేశ శర్మయె యొసంగు- అక్షర సువర్ణ సీస పద్యాల
మాల. ❁

## 2) పద్య మందార మాలతో అభినందన చందనం

- డా. తూములూరు శ్రీ దక్షిణామూర్తి శాస్త్రి
పొన్నూరు - 8106766197

1. జయశీలంబును, కార్య శూరతయు, సౌజన్యంబు రూపంబు దా
ల్చి, యపూర్వంబుగ దీర్చి దిద్దిన గీర్వాణ కళాక్షేత్రంబు" గీర్వాణ వా
ణి", యమూల్యంబగు భావ సంపదల నున్మేషింప, సారస్వత
ప్రియు లిద్దాని గుణంబులన్ గని, ప్రహర్షింపన్, సమర్థంబగున్.
2. ఘనులై సంస్కృత భాష నధ్యయనమున్ గావించి, కావ్యాలు
వ్రాసిన, ఆయా కవి జీవితంబుల ప్రశస్తిన్, జ్ఞాన విజ్ఞాన భా
వనలన్, ప్రోది యొనర్చి, భావి తరముల్ భద్రంబు లై వర్ధిలం
గను, గీర్వాణ కవి ప్రణీతములు సద్గ్రంథంబులన్ దెల్పుచున్.
3. తరువుల్ బూచిన పుష్ప సౌరభము, లుత్సాహంబుతో, వాయు
వెల్లరకున్ బంచిన రీతి, సంస్కృతుల సంలాపంబు, లాంధ్రోక్తి సుం
దరమై భాసిల జేయు సత్కవులు, సత్కారార్హులాత్మోన్నతిన్
బర మార్థంబు గ్రహించి, లోకులకు జెప్పన్, సద్విర్మంబగున్.
4. అభినందించు బ్రపంచ మీ కృతికి, నత్యంతంబు సత్యంబు, దు
ర్లభౌ, సంస్కృత కావ్యముల్ విబుధు లౌరా! యంచు గీర్తింప, ద
చ్ఛుభ సందర్భ, ముదాహరించుచు, కవీశుల్ మెచ్చ సాహిత్య, సౌ
రభ ముల్, దిక్కుల నింపు మీ కృషి, సువర్ణం బై విరాజిల్లెడున్.
5. తినబోవన్ రుచి గూర్చి చెప్పవలెనా? తియ్యందనం, భిక్షుఖా
దన మన్నన్ బునరుక్తి కాదొకొ? ప్రసాదంబిట్టి దౌనంచు, వ
ర్ణన గావింపగ శక్యమే? సవిత నారాధింప, దీపంబు జూ,
పిన చందంబిది, గబ్బిటాన్వయ మణీ! విద్వద్విమర్శాగ్రణీ". ❁

## 3) వందేహం గీర్వాణీం

**శతావధాని శేఖర, కాశీకవి, విద్యావారిధి, అసమాన అవధాన సార్వభౌమ, అవధాన కళాతపస్వి - డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్**

**విజయవాడ -9440346287**

1. సంస్కృతస్య ప్రతిస్థేద్వే సంస్కారః సంస్కృతిస్తధా-వ్యక్తీనాం చ సమాజస్య మార్గోప దేశం భజే"
2. బాసల గన్న బాస ముది బాసల ముందటి బాస, చాల మేల్-బాస, పరాయి బాస తెలబారగ వెల్గెడు బాస, తన్ను రా
   జేసిన పెక్కు బాసలకు చిక్కులు దీసిన వేల్పు బాస ఈ-బాస యొసంగు గాక
   సరి బాటను, కైతను, కట్టు బాటులన్.
3. మాతృ స్తన్యేన కొ భ్రస్టః పుష్ప ఏవ సదా భవేత్ - గీర్వాణ భాషయాసర్వాః భాషా వర్ధంత ఇత్యలం"
4. వందేహం గీర్వాణీం -వాణీ మజ్నాన తిమిర దీపాం త్వాం
   చతురోక్తి రూప హేలాం - లీలా రస మార్గ మోక్ష సంధాత్రీం"
5. జయతు జయతు వాణీ సంస్కతాఖ్య పురాణే-సురస సరస ధునీ భారతీ చేక్షు పాణీ
   బహు యుగ పరిదీప్తా దుర్గ మార్ధ ప్రదాత్రీ - రసమయ కవితోక్తిః వేద వేదాంగ మూర్తిః"❁

# 4) సంస్కృత సంస్కృతి

– డా.ధూళిపాళ రామ కృష్ణ
విజయవాడ –9963668214

1. దుర్గా ప్రసాద కవితా సరసాసుర భారతీ – ఆసక్తి కర సంలగ్నా భూయాత్ కవి యశః కరీ
2. రాజ్యాది భోగ నిష్కామాః రస సిద్ధాః కవీశ్వరాః–ఏయే కామ దుఘా జాతా అమరాన్ తానుపాస్మహే
3. కాంతా సంమితకావ్య మంజుల పదైః రమ్యోప దేశా గిరః – రామాజ్యాచరణ ప్రబోధ రసికా ఉత్తేజ యంత్యఃప్రజాః
   ధర్మా ధర్మ వివేక పావన ధియః కుర్వంత్య ఏవానిశం –ఆవేదాత్ సుకవీశ్వరావధి సఖే గీర్వాణ వాణ్యాం స్థితాః"
4. వక్తహ గణికాస్యేవం మాకస్యా పేతి సంస్కృతా–తచ్చూద్రక వచో మూలం మానిషాదేతి మంగళం
5. స్త్రీ వ్యాద ద్విజ సంవాదే పరిణీతేన కర్మణా–సర్వ తోషణ మాదిష్టం వ్యాసేనాద్భుతకర్మణా"
6. భవ వత్స విమత్సరస్సదా–ధృవ మాతా యదవచో దాత్మ జాతం
   మనశ్శమ మాదిమ గురుః–సురభాషైవ దిదేశ లక్ష్య సిద్ధా"
7. లోక జ్ఞాన దర్శితౌ కావ్యే కణ్వవ్యాధౌ వనౌకసౌ – శాకున్తలే భారవేచ సంస్కృతే సంస్రుతి స్తదా"
8. గుణేషు క్రియతాం యత్నః గుణ లుబ్ధాహి సంపదః – విమృశ్య కారితా తత్ర ధర్మ రాజేన బోధితా"
9. ఏతద్వ్రతం మమేత్యాహ రాజా రామో మహా యశాః–సర్వాభయ ప్రదానం హి సర్వ దానాధికం మతం"❋

## 5) మంజుల మంజూష - సుందర సుర భాష

- డా. గుడిసేవ విష్ణు ప్రసాద్
అవనిగడ్డ -9441149608

1. అ.వె.శ్రీకరములొసగి చెలు వారు మా తల్లి - జనని భారతంబ జయము జయము
జ్ఞాన సుధలు నింపి జగమేలు మా తల్లి-జనని శారదాంబ జయతు జయతు.
2. సీ-రామయణాఖ్యంబు రఘువర చరితంబు- వాల్మీకి సృజన గీర్వాణ భాష
పంచమ వేదంబు భారతకావ్యంబు -వ్యాస ముఖోధిత శ్వాస భాష
విశ్వ వందిత గీత విజ్ఞాన సముపేత -శ్రీ కృష్ణ పరమాత్మ శ్రేయ భాష
కవికుల గురువర్యు కాళిదాస సుకవి-కావ్య నాటకముల శ్రావ్య భాష
ఆ.వె.-వేద విషయ జ్ఞాన, వేదాంత శాస్త్రంబు -వైద్య వ్యోమ శాస్త్ర వర్ణితంబు
శ్రుతి సుఖ నినదంబు స్మృతిహిత వరదంబు -సుందరసుర భాష శోభితంబు.
3. సీ-వేద ప్రవచనంబు విజ్ఞాన సారంబు -వివరించి తెల్పెడి వేదభాష
నాక లోకము నందు పాకారి ప్రముఖులౌ -దేవతల వచియించు దేవ భాష
అద్వైత తత్వమౌ ఆధ్యాత్మ బోధనల్-సంతరించు కొనిన జ్ఞాన భాష
అతి పురాతన భాష అతి సనాతన భాష -నిత్య నూతన మైన నిగమ భాష
ఆ . వె.-భాషలకు భాష గీర్వాణ వాణి భాష - అన్నిభాషల మూలమౌ నమర భాష
సకల సుజ్ఞేయ భాష సంస్కార భాష -సరళమౌ భాష నరయంగ సంస్కృతంబు

.

4. ధ్యానంబు చేయ నధ్యయనంబు చేయంగ -సహకరించెడి భాష సంస్కృతంబు
నిత్య పూజల యందు నిలిచి యుండెడిభాష -సాఫల్యమగు భాష సంస్కృతంబు
శబ్దార్థ జ్ఞానంబు చక్కగా వివరించు -శక్తి గల్గిన భాష సంస్కృతంబు
అన్ని భాషలకు ఆధారముగా నుండి - సంస్కరించిన భాష సంస్కృతంబు
ఆ.వె.-మధురమైన మంజుల భాష -సదమల హృదయంబు సంస్కృతంబు
నరనరముల నిలిచి నాదమై పలికెడి -సరిగమల సరిభాష సంస్కృతంబు❀ .

## 6) గీర్వాణ వాణి

**మధురకవి శ్రీమతి ముదిగొండ సీతారావమ్మ - విజయవాడ -9299303035**

1-కం. ఆమునులే ప్రార్థించిరి -ఆ మహాదేవుని, వినగనె, ఆర్తిని బాపన్
డమరుకమును మ్రోగించెను -అమలంబౌ భాష నొసగె అవనికి దయతో.

2-కం. ఆకాశమందు మ్రోగగ-సాకారము చెందినట్టి చక్కని భాషే
చీకాకులు తొలగించెను -నాకదునీ ధరుడొసంగె నవ గీర్వాణిన్.

3-కం. గీర్వాణ భాష ఇయ్యది -గీర్వాణికి సాటి యగును కీర్తిని పెంచున్
గీర్వాణ గతుల నరసిన -గీర్వాణ కవీశ్వరులకు కేలును మోడ్తున్.

4-కం. గీర్వాణ వాణి తెలిసిన -గీర్వాణుల గూర్చి వ్రాతు గీర్వాణముగా
గీర్వాణ వైభవంబిల -గీర్వాణముతో వచింప కీర్తియె నాకున్.

5-ఆ.వె.- సూరిగాదు అతడు సూర్యుడై వెలుగిచ్చె -మల్లినాథ సూరి మహిత గుణుడు
అతడు చేసినట్టి వ్యాఖ్యానమె మనల -సంస్కృతంబు దరికి సాగ నిచ్చె.

6- సీ- వేద పురాణాలు వివిధ శాస్త్రంబులు -సంస్క్రుతమందున సాగు చుండు
పూజలు వ్రతములు పుణ్య యాగంబులు -సంస్కృత మంత్రాల సాగు చుండు
పుట్టిన గిట్టిన పుణ్య కార్యములును -సంస్క్రుతమందునె సాగు చుండు
అష్టోత్తరంబులు, ఆ సహస్రంబుల-స్తోత్రములన్నియు సంస్క్రుతంబె
అ.వె.దివ్యమైనదిదియె దేవభాషనబడు-సాటి లేని మేటి సంస్క్రుతంబు
జనని యగును గాదె జగతి భాషలకును -భారతాన పుట్టె భాగ్య వశము.

7-సీ- వేద వేదాంగాలు విడదీసి ప్రకటించె-వ్యాసుదు భారత భాగ్య దాత
ఆ పురాణమ్ములు లఖిలేతి హాసాలు -మనకు చేకూర్చిన మాన్యు డితడు
వాల్మీకి రచియించె వన్నెకెక్కు విధాన -రామాయణమ్మును రమ్యముగను
చాణిక్య చరకులు చక్కగ వ్రాసిరి -నీతులు, వైద్యమ్ము నిత్యముగను
కాళిదాసు రచియించె కాళికా శక్తి చే కావ్య నాటకములు కమ్మగాను
భవ భూతి చూపించె భవ్యమౌ కరుణను -కాదంబరిని గూర్చె గద్య దండి
అర్ధ గౌరవమును సార్ధకముగా జూపె-భారవి కావ్యాన భవ్యముగను
మాఘుదు కావ్యాన మాధుర్యమును నింపి -శిశుపాల వధ వ్రాసె శేముషిగను
హర్షుడు నైషధం హర్షాన వెలయించె-విద్వదౌషధమన్న విభవ మందె
పాణిని కౌముదిన్ పరమ మయ్యెను భాష -వ్యాకరణ ప్రతిభా వైభవమున
తే.గీ -భరత భూమిని గీర్వాణ భాష యందు -పెక్కు శాస్త్రాలు కావ్యాలు పేర్మి వ్రాసె
దివ్యతమమును చేసిరి దివ్యులంత-నాటి కీర్తిని మరువక నడచు టొప్పు.❀

## 7) సంస్కృత సంస్కృతి

- శ్రీ తుమ్మోజు రామ లక్ష్మణాచార్యులు - విజయవాడ -9703776650

1-వాల్మీకిన్నుతియింతుసీత చరితం బత్యద్భుతంబై మహా -వాల్మీకంబయి ధర్మ
సూత్రవిలసద్వాణీ పతీయంబునై
వ్రేల్మిన్ తానొనరించె సత్కృతిని భావింపన్మహా మౌనికిన్ -కాల్మొక్కేను మదీయ
భావనల నెక్కొలంబు దీవింపగన్.

2- వ్యాసుడు విష్ణు సన్నిభుడు వైదిక మార్గ వివర్ధనుం డహో-దీసము దెవ్వరాతనికి
తీరిచి దిద్దెను వేద సంహతిన్
భాసుర భారతంబు మరి భాగవతంబు పురాణ గాధలన్ -భాసిలు భారతీయతకు
పాటిలు తాత్విక బ్రహ్మ సూత్రముల్

3- ఉపమకు కాళిదాసు సమయోచిత భావ ప్రభారవీంద్రుడున్ -సుపద మనోహరాల
సుమ శోభకు దండి త్రయంపు మాఘుడున్
సుపధము చూప సంస్కృత యశో విభవంబు ప్రపంచ కావ్యమై -సుపఠన
పాఠనంబుల రసోచిత బంధ మెలర్ప జేయరే.

4- ఆధ్యాత్మ జ్ఞానంబు నంద గోరితివేమొ-ఉపనిషత్తుల తనివొంద జూడు
భక్తి తత్పరుడవై ముక్తి గోరితివేమొ-బహు పురాణమ్ముల పఠన మేలు
సంస్కృత పాండిత్య సాధనే లక్ష్యమా -కావ్య పంచక మీవు కాంచి చదువు
గద్య కవిత్వంపు హృదయ సౌందర్యమ్ము -భట్టు బాణు నడుగు భళిర జూపు
భారతీయాత్మకు పావన మూలమ్ము -వేదాల సారమ్ము వెల్లడించు
కావ్య నాటక గీతికా వైభవానంద -గంధ మిచ్చును నీకు కాళిదాసు
అంగాంగ రసబంధ శృంగార సూత్రాలు -వాత్సాయనంబునై వాసి గాంచె
శృంగార గీతాల భృంగీ రావాలేన్నొ-నిష్టంబు జయదేవు నష్టపదుల
లలిత లలిత పద కలిత స్వరితము, నారాయణ తీర్థ తరంగ హేల
వైప్లవ్య భావాల విక్రాంతి శూద్రకు -మృచ్ఛ కటికము నందచ్చమగును
ఎన్నెన్నొ చందంబు లెన్నెన్నొప్రక్రియల్ -గీర్వాణ మందుండె నేర్వ గాను
పాణినీయంబును పాతంజలంబును- చరక సంహితకూ సంస్కృతంబె
నాదు సంస్కృత సంస్కృతి సాదు సాదు -అఖిల భారత భాషల కాత్మ యగును
దివ్య భారత వెలుగుల దిశల చివర -శాశ్వతంబుగా నిలిపెనా సంస్కృతంబు. ❀

## 8) సంస్కృత భాషా ప్రాశస్త్యం

**– శ్రీ శ్రిష్టి శ్రీనివాస శర్మ -నిమ్మకూరు -9849036311**

1– భారత భారతి వైభవ –భారతి సంస్కృతముకాదె భాషలకెల్లన్
"సారస భారతి" ఇచ్చిన –హారతి సంస్కరణము సంస్థలకెల్లన్.

2– బీజాక్షరముల మంత్రము –పూజా విధుల పఠన మగుచు భువిలో మహిమన్
భూజము వోలెనిలిపి, తా–భాజనమగు సంస్కృతాన భాగ్యము కలుగన్.

3– సంస్కృతము చదువ భాషా –సంస్కృతులబ్బునిజము, శాస్త్రోపజ్ఞా
సంస్కారోపస్కారపు –సంస్కృతిచేతనుమనుజులు సద్గతి కనరే?

4– భారత గౌరవ కారణ –మీరెంటి వలన నిలిచెను ఇమ్ముగ నేడున్
పారంపరమౌ సంస్కృతి–చారణ కృత సంస్కృతమును సంపద కాగన్.

5– సంస్కృతము సనాతన భాష, శాస్త్ర భాష లకును శక్తి నిచ్చిన భాష –లక్షణముగ
గడన కెక్కిన భాష, కంప్యూటరు మడమ తొక్కు –భాష, నిత్య నూతనమగు
భద్ర భాష.

6– దేవనాగరి ప్రాచీన దేవ భాష – యనగ నెట్లు చెల్లు? గణన యంత్రములకు
చక్కగ యమరునని శాస్త్ర సాధకులును –తెలుపు చుండ నట్టి కీర్తి నిలుప
వలదె?❁

## 9) గీర్వాణ భాషా వైభవం

- శ్రీమతి వారణాసి సూర్య కుమారి - మచిలీపట్టణం -9849812443

1. సీ. గీర్వాణ భాషలో గీతా మహాత్మ్యమున్ - పరమాత్మ బోధించె పార్థునకును
గీతాలాపనన్ గీతామృతమ్మును -గ్రోలినంతనె కల్గు మేలు మనకు
ఉపనిషత్సారమ్ము నుపదేశమున గీత -సామాన్యులు తరియించ సాధనమ్ము
దైవ సన్నిధి చేరు త్రోవ ను "పదునెంది"-అధ్యాయముల చూపు నదియె గీత
తే.గీ.-భక్తి పారవశ్యమునొంది ప్రణతులనెడు-రీతి గీర్వాణ భాష పై ప్రీతి గొలుప
స్తోత్ర పారాయణ ము విన సొంపు గూర్చు -దైవ దత్తమగు వరమె దేవ
భాష.

2. సీ- గీర్వాణ భాషను నేర్చుకొనిన మేలు -సకల పురాణముల్ చదువ గలరు
వేదసారమ్మునూ విదితమై సంస్కృత -పండితులనుపేరు బడయ గలరు
దేవ భాషను నేర్చి దివ్య తేజము నంది -ఆదర్శమూర్తులై అలరగలరు
శాస్త్ర విజ్ఞానమున్ సార్వజనీనతన్ -సర్వ సమర్థులై సాగగలరు

తే.గీ.- ఉత్తమోత్తమ గ్రంథముల్ ఉదధి నురుకు -కెరటముల వలె నెల్లరి దరి జేర
తెలుగున కనువదించి యందించ గలరు -జన్మ సార్థకంబై వారు ధన్యులగును.

3-సీ- పద్య మూలంబగు "పదగతౌ" సంస్కృత- ధాతువుపద్య పథమును నడుపు
నియమ బద్ధమగుచు నిర్ణీత పరిధిలో -హృద్యమంబుగా సాగు పద్య లహరి
భాష యశ్వంబన భావమ్ము రథమైన -ఛందో పథము సాగు సారధి కవి
యతియు ప్రాసలను సంస్కృత భూయిష్ట మౌ -పద్యముల వ్రాయు విద్య
ఘనము

తే.గీ- వారసత్వమ్ము నబ్బిన వరమె మనకు -పద్య మన్న నతిశయోక్తి పదము కాదు

శోభ గూర్చెడు గీర్వాణ  శ్లోకములకు –తెలుగు పద్య రూపము నిచ్చు తెగువ వరమె.

4–సీ– సాహిత్య సంపద సంస్కృతమ్మునెతొలి–ప్రాదుర్భవించంగ ప్రణతు లందె
ప్రాక్రుతుడైనను ప్రాచేతసుడు  వ్రాసె–ఆదికావ్యంబు రామాయణమ్ము
సంస్కృత కావ్యముల్ సంస్తవమ్మును చేసె–ప్రాజ్ఞు లు తెలుగున భాగ్య వశము
వ్యాస భారత భాగవతముల్ కవిత్రయం –పోతన వ్రాసిరి రపూర్వముగను

తే.గీ.– తొలుత మునులు పురాణముల్ పలురకములు – దేవ భాషను వ్రాసిరి దివ్యముగను
పిదప భవభూతి కాళిదాసేతరులు ను –విశ్వనాధాది విబుధులు వివిధ కవులు–
కలము పట్టిరి భాషపై కాంక్ష తీర.

5–సీ.– సంస్క్రుతమును నేర్చు సంస్కృతి పెరిగిన –దేవనాగరలిపి తెలియవచ్చు
భాష యౌన్నత్యమున్ బాగుగా నెరిగిన –భాషాభిమానమ్ము పట్టు పెరుగు
తరచిన పూర్వ వృత్తాంతము లనెల్ల–మూలపు రాణి ప్రాముఖ్య మెరుగు
ఆ పుణ్య గాధల నద్భుతమగు పాత్ర–లాదర్శ ప్రాయమై యవధరించు

తే.గీ.– రామ చంద్రుని వంటి కుమారు ననగ–సీత వలెసుగుణాల రాశి తనయగను
భారత లక్ష్మణుల వంటి సోదరులుగలుగ–కోరు కుందురు జనులెల్ల కుశల మరసి.❁

## 10) గీర్వాణ భాష గొప్పతనం

**– శ్రీమతి వడ్డాది లక్ష్మీ సుభద్ర – విజయవాడ –8885803170**

1– మహర్షి వాల్మీకి రామాయణం కదు రమ్యం –దేశ విదేశాలలోఘన
తకెక్కి, భారతీయుల గౌరవం ఇనుమ –డింప జేసిన సాహిత్యము.
2 భారతీయుల సంస్కృతి ఆచార వ్యవహా –రము వ్యాసుని ఉపనిష–
తత్తులు, వేదములు అనుసరణీయము –ప్రపంచం లోగణుతి కెక్కె
3– రసజ్ఞుల హృదయాలపై చిరు జ–ల్లులు కురిపించు మన
స్సుమై మరపించె దేవ భాష – సుధ లొలుకు కన్న తల్లి.❁

# 11) జయహో సంస్కృత భాష

- శ్రీమతి సింహాద్రి వాణి - విజయవాడ -7799381133

1-ఉ- భారత జాతి కంతటికి భాగ్య సమూహములై వెలుంగుచున్ -
ధారుణి నీతి మార్గమును ధర్మము న్యాయము బోధ సల్పుచున్
భూరిగ జ్ఞానమిచ్చు కడు పూజిత గ్రంధము లెన్నియో కవుల్
కూరిచె సంస్కృతమ్మునను గొప్పగ మ్రొక్కెద వారికి నెల్లవేళలన్.
2-అ వె. -సంస్కృతమ్ము జనని సకలభాషలకును -ఆది భాష అదియె అమృతభాష
అందమైన భాష ఆదికావ్యపు భాష -తేనె రుచులపంచు తేటభాష.
3-తే.గీ.-వ్యాస వాల్మీక విరచిత వాణి భాష -కాళిదాసు కలమ్మున కావ్యభాష
వేదముల వెలసిన మేటి వేల్పు భాష -గిరిధరుడు నుడివిన గొప్ప గీత భాష.
4-ఆ.వె.- మందిరములలోన మంత్రాల స్తుతి యించి -వేల్పులను కొలిచెడి వేల్పు భాష
పరిణయమ్ముల యందు ప్రఖ్యాతి నొందిన -మంత్రముల వెలిగెడి మధురభాష.
5-ఆ.వె.- యజ్ఞ యాగములను ప్రజ్ఞతో గావించు -మేటి పండితులకు మేలు భాష
సుప్రభాత వేళ శోభాయమానమై-దేవళముల వెలుగు దేవ భాష.
6-తే.గీ. -ఎన్నోగ్రంథాలు శాస్త్రాలు ఎసగ వ్రాసి - భారత మాతకు విలువైన భాగ్య మిచ్చి
సంస్కృతమ్మునఎనలేని సాగు చేసి -అమరమై నిలిచె భువిని అమరకవులు.

## 12) తల్లి గీర్వాణమ్మె

**– శ్రీ చీమలమర్తి వెంకట బృందావన రావు – విజయవాడ –99663399189**

1– సప్త ద్వీప ప్రవేస్టితాఖిల చిరస్థాయిగత మ్మొచు – సం
దీప్తమ్మైన సమస్త లోకము న నెందేనిం బ్రవర్తిల్లు చుం
బ్రాప్తంబై చను సర్వ భాషలను దీవ్యల్లీల శోధింప
వ్యాప్తంబైన సుసంస్కృత మ్మయిన గీర్వాణమ్మె కాన్పించెదున్.

2– ఎల్లబాసలకు తల్లి గీర్వాణ మ్మె–కదుపురాతనంపు నుడియు నదియె
దేవ భాష నుండి దేశ భాషలు వచ్చె–పలుకు చెలికి వింత జిలుగులిచ్చె.

3– పంచదార లోన పాలన్నికలిసిన –చెలగి వేరు జేయ జాలనట్లు
తేనె యూటవంటి తెలుగున కలిసె–స –పర్వ భాష లోని ప్రౌఢిమమ్ము.

4– వ్యాసుడు, వల్మికోద్భవుడు, భారవి, మాఘుడు, కాళిదాసుడున్
భాస, మయూర, భామహులు బాణుడు, శూద్రక ముఖ్య సత్కవుల్
ధీ సముపేత నిర్భర మతిన్ వెలయించిరి దీప్త సత్కృతుల్
ఈ సువిశాలలోకమున హిందు సుసంస్కృతి మిన్ను ముట్టగన్.

5– అమ్రుతతుల్యమైన అమరవాణి నేడు –మృతమటంచు ధూర్త మతులు యంద్రు
విశ్వ స్తుత్యమైన విమల వాఙ్మయ రాశి –యెసగు బాస –మృత మదెట్టులగును?

6– హైందవ జీవధారకును యాదిమ మూలము సస్కృతమ్ము –నే
డెందరుధర్మ భ్రష్టులు–పరేంగిత దాసులు –ఏడ్చి చచ్చినన్
సుందర భారతీయ రుషి సూక్తము సుసభ్యత కింత సేగి రా
దందునె గుంటనక్కలకు ఆకసమంటెడు ద్రాక్ష గుచ్ఛముల్.❋

## 13) గీర్వాణ భాషా వైభవం

- శ్రీ జి.వి.ఎస్.డి.ఎస్.వరప్రసాద శర్మ - నున్న -9290618317

1-ఆ.వె. -ఎల్లభాశాలకును తల్లిగా నొప్పారి -సంస్కృతంబు నిలిచె సన్నుతముగ
వర్ణమాల లెల్ల పలికించి ,ఢమరుకం-తంద్రిగాగ శివుని తాను వినిచె.

2-తే.గీ- సృష్టి కాలంబు నుండియు చిన్మయంపు -భాష గీర్వాణమేదేవ భాష యయ్యె
సకలజీవుల భావాల సరిగ తెలుప - వాణి వినసొంపు శబ్దాల పరగ గూర్చె.

3-తే.గీ. -ఆది నుండియు సంస్కృతంబతిశయముగ - ఆర్యావర్తాన వేదాల నార్షమగుచు
సకల శాస్త్రాల కావ్యాల సరణి నిలిచి -మంత్రం తంత్రాల యజ్ఞాల మహిని నిండె.

4-తే.గీ. బ్రహ్మ సృష్టితో యజ్ఞాల బ్రతుకు బాట -ముందు చూపుతోసృజియించి మురిసిపోయె
దైవ సంతృప్తి యజ్ఞాన దాన వాన -పుడమి జీవ రాసులకెల్ల పూర్ణ జయము.

5-తే.గీ.- ఆది కవియైన వాల్మీకి హరియు బొంగ -రామకథా లోన గాయత్రి రమణ నిలిపె
వేద వ్యాసుండు విడమర్చి వేద రాశి -ఆర్తి భారత భాగవతాది కృతుల -పదియు నెనిమిది పౌరాణ ప్రతుల గూర్చె.

6-తే.గీ- కాళిదాసుని యుపమాన ఘనత జూడ -భారవీయర్ధ గౌరవంబట్టేచూడు
దండి దేవ పదలాలిత్య డాబు లెంచ -మాఘు శిశుపాలవధ లోని మర్మమాయె.

7-తే.గీ- భాస భవభూతి మయూర భర్తృహరులు -సంకుసాల నృసింహాది శంకరులును
అష్టపదివ్రాయుజయదేవ, ఆర్య శుకులు - శాఖ లన్నింట గైర్వాణి సాగ జేస్రి.

8-తే.గీ. ఇతర భాషల యజ్ఞాలు ఇముడవయ్య -కర్మ బంధాలు గీర్వాణి గదిసి యుండె
మోక్ష విద్యకు నిద్దియ మొదటి గురువు -సంస్కృతానికి ఏ భాష సాటి రాదు.

9- విశ్వ మేలిన భాషగా ఇనుతికెక్కి -నాడు గీర్వాణ మెన్నోట నాట్యమాడె
ఆంగ్ల మే నేడు విశ్వాన నదిక మగుచు -అమృత భాషకు మృతభాష యనగ రోత
బాణ కవిదైన కాంద్రింపు భంగి యాంగ్లి.
"జయంతే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః"❀

## 14) అహో సంస్కృతం అద్భుతం నిరంతరం

– శ్రీ పంతుల వెంకటేశ్వరరావు – విజయవాడ –9908344249

1–తే గీ–జనని సంస్కృతంబని బుధ జనులు పొగడ –నాల్గు వేదాల సారమ్ము వెల్గ జూప
ఋషులు, ప్రాజ్ఞులు, పండితుల్ రుక్కులనగ–భాష గీర్వాణము మనలో భాగమయ్యె.
2–సీ– మానిషాద యనెడు మాట శ్లోకంబయ్యె–లీలగా నాడు వాల్మీకి నోట
ఆదికావ్యంబయ్యె నారాముని చరిత –ఏడేడు లోకాల నిలుచుండ
సద్గురువైన వ్యాసభగవానుడు వ్రాయ –సారమై నిలచెను భారతమ్ము
పూర్వమందు జరిగె ముక్తిప్రదాతయై –అష్టాదశ పురాణ సృష్టి యంత
ఆ.వె. అద్భుతమున నిల్చె నా భగవద్గీత –భర్తృహరి రచన సుభాషితంబు
ఆది శంకరుని శివానంద లహరి యున్–భాషలో సతతము వాసి గాంచె.
3–ఉ– గుప్తుల రాజభాష యయి గొప్పగ వెల్గుచు సంస్కృతంబు–సం
తృప్తి యు నిచ్చెవారలకు దేశ విదేశ జనుల్ నుతించగన్
గుప్త ధనంబుగన్ బుధులు కొందరు భావన సేసిరేయనం
తృప్తియు లేక జీవితము తీయగ హాయిగ వెళ్ళ బుచ్చుచున్.
4–సీ– నవరత్నములనేడు కవులను పోషించె–రాజసంబున తాను భోజరాజు
రఘువంశ కావ్యంబు రసరమ్యమై నిల్చె–కమ్మగా వ్రాయంగ కాళిదాసు
దండి భారవి కవిత్వంబులన్ జూచినన్ – గీర్వాణ భాషకే గీటు రాళ్ళు
హర్షుని నైషద మానాటి కాలమున్ – భాష పటుత్వంబు పరిధ విల్లు
తే.గీ– శత సహస్ర నామంబులు వెతలు దీర్చు – దండకంబులు దైవ మంత్రంబులకును
పేరు దెచ్చిన గోప్పదౌ వేద భాష –భారతీ యశము పెంచు గీర్వాణ భాష.❁

## 15) గీర్వాణ భాషా వైశిష్ట్యః

- డా.గబ్బిట జయమాణిక్య శాస్త్రి - పూరీ -0860847403

1- అధ్యక్ష సరసస్వభాసు విలసత్ భారత్సుదీత సంసదః-క్షత్ర వేదయ మహాంధ్ర వేదమయ విద్యాలం క్రుతి శ్రీనిధిః
మిత్రశ్రీ సురమందిరానిలజ సద్గాధాప్రసంగోజ్వలః -శ్రీమద్గబ్బిట వంశ మౌక్తికమణిః దుర్గా ప్రసాద కృతీ.

2- పూర్వాంగ్ల కవి ప్రపంచ సరసల్లాప ప్రసారోదరః -మాణిక్య మలమానినీ సుచరితయా శ్రీ రంజనా భాషణాః
జ్యోతిశ్లేషణ సాహితి సుకవితా విద్వత్వ సంశ్లిష్ట ధీః-శ్రీమద్గబ్బిట వంశ మౌక్తిక మణిః దుర్గా ప్రసాద కృతీ.

3- విజ్ఞానామలం బోధనోజ్వల కళానైపుణ్య విఖ్యాతధీః-ఉర్మి గ్రామ రసాకృతి సకల సచ్ఛాత్ర ప్రియ ప్రాభవః
సేవానంద విధాయి భాషణాలసత్ సంస్కార సంస్త్రాశ్రయః - శ్రీమద్గబ్బిట వంశ మౌళి మౌక్తిక మణిః దుర్గా ప్రసాద కృతీ.

4- శ్రీమృత్యుంజయ శాస్త్రిణః శుభ భవానీ మాతృః అచ్ఛాత్మజః %--%శ్రీ మృత్యుంజయ నారసింహ రమణా శ్రీకృష్ణ లక్ష్మ్యాత్మజః
శ్రీ దుర్గా సువివేకం బంధు రందః పత్నీ ప్రభావత్యసు - శ్రీమద్గబ్బిట వంశ మౌళి మౌక్తిక మణిః దుర్గా ప్రసాద కృతీ.

5- గీర్వాణాత్మ సుదీకవి ప్రవర గైర్వాణ యాద్ర ప్రహుద్వాక్ వపుః-శ్రీమత్ శంకర కాళిదాస కవిరాట్ వ్యాసాది భాషా ప్రియః
బాణ ప్రాణ ఉదాత్త భద్ర చరితం జీయాత్ శతం వత్సరాన్ - శ్రీమద్గబ్బిట వంశ మౌళి మౌక్తిక మణిః దుర్గా ప్రసాద కృతీ

6- శ్రీమద్గబ్బిట వంశ మౌక్తిక మణిం దుర్గా ప్రసాద సుధీః-
నిర్మాయాంధ్ర మయించ దివ్య కవితా గీర్వాణవాణి విదాం
లోకానాముపకార మద భుమహో సమ్యక్ వ్యదాత్ శ్రద్ధయా -వార్ధక్యే పరమేశ దివ్య కృపయా భాసతాం.

7- ఏతద్ కృత్యా మిహోదయః సర్వ జననా సంతోష సంపాదకం -చైక త్రేవ సమస్త దివ్య విదుషాం వాగ్వైఖరీ జీవనాం
జాతుం శక్యమతో అన్య గ్రంథ పఠనం కర్తవ్య మేవాస్తినా -విద్వత్తల్లజ శక్తి రపి అసులభా విజయతే వై ధృవం.

8- ఉయ్యూరిత్యాని మంగలే జనిమతాం కృష్ణా తటిన్యా తటై -భ్రాజత్ పుత్ర మిత్ర పౌత్ర నివహేస్యంత శోభావతాం
శ్రీమద్గబ్బిట వంశ పూర్ణ జలధే ఉదయత్ ప్రభా భాసతాం-పూజ్యానాం ప్రణతిః మమాదయ భవతాత్ దుర్గాప్రసాదద్రుతాం.

**శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారిపై శ్లోకం**

"మండల్యాస్య సుసద్వంశో కృష్ణారాయ సుపుత్రకః -బుద్ధప్రసాద ఇత్యాఖ్య రాజతే అసౌ కవిప్రియః"

**శ్రీ మైనేని గోపాల కృష్ణ గారిపై శ్లోకం**

"శ్రీమైనేని సుసద్వంశ విఖ్యాతః క్రుతిరాట్ స్వయం -గోపాల కృష్ణ ఇత్యాఖ్యయః రాజతే అమెరికా వాసీ". ❁

## 16) గీర్వాణ భాషా వైభవం

**- శ్రీమతి లక్కరాజు వాణీ సరోజిని - విజయవాడ -9346978829**

1-సీ- భాషలందున రాజ భాష గీర్వాణమై -మనసు దోచిన గొప్ప మధుర భాష
వేద వేదాంగాల వెల్లి విరిసి నట్టి -సత్యవాక్కుల జాటు సౌమ్య భాష
శబ్ద మధురిమల శోభిల్లు చుండెడి -వీనుల విందగు వేద భాష
ప్రాచీన భాషగా ప్రాచుర్య మొందిన -అద్భుతమైనట్టి అమర భాష

ఆ.- ఆది కవినుండి కవిత కాల వాలమనగ-ఎన్నదగిన రచనలున్న భాష
కవులు పండితులకు ఘనకీర్తి నొసగి-వాఙ్మయమున నెంతో వాసి కెక్కె.

2-సీ. భవ్య భాగవతాది దివ్య గ్రంధావళి -తొలుత గీర్వాణాన వెలసె నిలను
అష్ట పదులతోడ నిష్ట దేవత గొల్చి -జయదేవ కవి పొందె జగతి కీర్తి

పలు ప్రశంసల నొంద పంచ తంత్రము వ్రాసి -విశ్వ విఖ్యాతి బడసె విష్ణు శర్మ
భర్తృ హరి రచియించె భాష గీర్వాణాన -భక్తి వైరాగ్య సుభాషితముల
ఆ. రాజ పూజ్యంబై వెలిగిన రమ్య భాష -దేవనాగరి యనబడు దివ్య భాష
శబ్ద మాధుర్య రసభావ లబ్ది నొంది -తనరె గీర్వాణ భాషగా తరతరాల.

3-సీ- వాల్మీకి కృతమై వరలె రామాయణం -సంస్కృతాన జనులు సన్నుతింప
కాళి యాశీస్సుల గీర్వాణ కవిగనై-ఖ్యాతి గాంచెను కవి కాళిదాసు
ఆచార్య శంకరుం దద్భుత స్తోత్రాలు -సంస్కృత భాషలోన సంకలించె
పండితోత్తము లెంతో ప్రస్తుతించిన యట్టి - సంస్కృత భాషయే శ్రావ్య మిలను
తే. రాజు లెందరొ మెచ్చిన రాజభాష -కవుల కారాధ్యమైనట్టి కావ్య భాష
దివ్య రచనలు విలసిల్లు భవ్య భాష -భాష గీర్వాణమును బోలు భాష కలదె.

4-సీ- భరత దేశము నందు భాష లందంన్నింట -మూలమై నిల్చు నమూల్య భాష
గీర్వాణ పదములు గణనీయముగా జేరి - తెలుగుజిలుగు లెంతొ తేజరిల్లె
సంస్కృతోద్భవ గ్రంథ సముదాయము లనెన్నొ-ఆంధ్రీకరించిరి ఆదికవులు
శృతి లయాత్మకమైన సంస్కృతంబిలలోన-అసమానమగు నట్టి అమరభాష
తే. మంత్ర తంత్రాల కాధార మైన యట్టి -దేవతలు మెచ్చి దీవించు దివిజ భాష
యజ్ఞయాగాది కార్యాలు ప్రజ్ఞ తోడ - ఆచరించగా తోడ్పడు ఆది భాష.

5-సీ- సంస్కృతంబు దెలియ సులభ సాధ్యంబౌను -పెక్కు భాషలలోని చక్కదనము
ఆదికవులు నాడు ఆంధ్రీకరించిన -గీర్వాణ గ్రంధాలు గంతికేక్కె
ఉభయ భాషలలోన యుద్దండ రచనల -ప్రతిభ చాటిరి వారు ప్రజ్న తోడ
వివిధ ప్రక్రియల లో వెలలేని గ్రంధాలు -అవతరించెను జగతి అద్భుతముగ
తే- అమ్మ వాగ్దేవిఆశేస్సులందు కొనిన -ఆణి ముత్యములను బోలు ఆది కవులు
జన్మ ధన్యత నొంద జగతి నందు -తల్లి భారతి సేవించి తనరి రిలను. ❁

## 17) మా నిషాద

**– శ్రీ పువ్వాడ తిక్కన సోమయాజి**

1–చెట్టపట్టాల్ పట్టి చెలిమి పట్టము గట్ట–నట్ట నడవి నెగడు చెట్టు చేమ
నిలువెత్తు మ్రాకులన్ నెయ్యము కీల్గొల్పి –వీడని బంధముల గడుసు లతలు
నేలపై చల్వ పందిళ్లు తీరిచి వెలుగు –చీకటుల్ రంగరించిన సొబంగు
ఃఅనిలుడన్ విద్వాంసు దవనిజ సంశ్లేష –మందగా ప్రబులు వాజ్యముల
రవళి
అల్లదియె తాపస విహార మమర వాస–మాశ్రమోపాంత మశ్రాంత విశ్రమమ్ము
జంతు సహజీవన వన మనంత విపుల –శబ్ద సృష్టి విశిష్ట శబ్ద వేది.
2–కల కలారవముల్ పలు ఖగమ్ముల మూలములై జనించు నా
కుల గలగల్గలల్ తదను కూలము లౌచు ప్రతిధ్వనించు సం
కుల మృగ గర్జనల్ ప్రకృతి గుండె నదల్చు, నటం జరింత్రు వ
ల్కల ధరులై ఋషులు ,కఠిన కార్ముక ధారులనై కిరాతకుల్.
3–ఱెక్క లార్చుచు వచ్చి యొక్క కొమ్మను జేరె –కంటికింపగు పక్షిజంట యొకటి
ఒకదాని వెన్నంటి యొకటి యుండునె గాని –ఏకతమ్మెరుగని వె కతమున
వేడ్క మీరగ నొండు వేరుకొమ్మను జేర –యదవదనొంది తా వెదుక బోవు
నెట నుండొ "కూ"యన నిటనుండి "కూ"యని –యట నటతారాడి
తటమటించు
ముక్కు ముక్కున పుణికి గోమును రచియింప –ఱెక్క లల్లార్చి తీపి
కోర్కినిగుణింప పాత్ర సంపుటి తెరమాటు పక్షి యుగళి –సంబర పడు సాంగత్య
సమయమందు.
4–తమసా స్నానమునకు జను –సుమనస్వి తపస్వి యటవి సొబగుల నెమకున్
స్వమనోరథ నిరత పరి –శ్రముడు కిరాతుడు కాగా మృగ చయమును వెదకున్
5–విచ్చియు విచ్చని విరులం –దెచ్చిన కౌతుకమునన్ మునీశ్వరు దృష్టుల్
చచ్చెర తనదు శరమ్ముల –చచ్చు విహగముల కొఱకు నిషాదుని చూపుల్.
6–ఎవ్వడెరుగు భవితవ్యము–చివ్వనదత్సరము ద్రుమము శిఖరము దాఁకెన్

క్రొవ్వున నవ్వె కిరాతుడు -కెవ్వుమని ఖగ మొరగె భువిని గిలగిలలాడన్.


7-రెపరెపలాడి రెక్కల చప్పుడు మిన్ను ముట్టి, పా
పాదప నివహమ్ము నంగల పతంగ చయమ్మెటు పోయెనో, సఖుం
డపగత జీవుడౌట పతగగన గుండియ వ్రస్సె, నయ్యెడన్
తపసి దురంత దృశ్య పరితప్త హృదంతర వేదనాత్ముడై.

8-పిచ్చుకపై బ్రహ్మాస్త్రము -విచ్చిన చురకత్తి వ్రేటు విరజాజులపై
హెచ్చిన గర్వాతురునకు -నుచ్చము నీచమ్ము లెట్టు లుండును చెపుమా.

9-శోకము మూర్తిమంతముగజోడును కోల్పడి పిచ్చిపిచ్చిగా
నేకత మేడ్చు క్రౌంచమున కెయ్యది దిక్కిక నంచు మ్రోడు తా
నై కనులార గాంచిన మనమ్మున నుమ్మలి కంబు గ్రమ్మ, వా
ల్మీకి మహర్షి వాక్కు రవడించెను శోకము శ్లోక కంఠమై.

10-"మా నిషాధ ప్రతిష్ఠాం త్వ -మగమ శ్శాశ్వతీ స్సమాః
యత్క్రౌంచ మిధునా దేక -మవధీః కామ మోహితం".

11-ఋషి కవియై పల్కినయది -మృషగాదు, వ్యధా విచలిత హృద్రస కూలం
కషమున పెల్లుబికిపొరలు-విషమ్ము నమృతమ్ము తత్వ వేత్తలకెరుకౌ. ❀



## 18) కంచి పరమాచార్య శ్రీ శ్రీ చంద్ర శేఖర సరస్వతీ స్వామి

### ఎల్లలు లేని భాష సంస్కృతం

"సంస్కృత భాష ప్రజలందరిది. దానికి ఒక నియమిత ప్రదేశం లేక ఏదో ఒక దేశానికి చెందినది అంటూ ఏమీ లేదు. దానికి ఏ భౌగోళిక పరిస్థితి అడ్డులేదు. నాచిన్నప్పుడే మా అన్న చనిపోయాడు. మా అమ్మ ఏడవ లేదు ఆమె జ్ఞాని. నేను ఆమెను "అమ్మా! నేను చనిపోయినా నువ్వు ఏడవవా?" అని అడిగాను. ఆమె జ్ఞానికనుక "వాడు శరీరంతో మరణించాడు నువ్వు నీ బుద్ధిలో చనిపోతావు" అన్నది. అంటే ఆమె ఉద్దేశ్యం నాకు చనిపోయిన బుద్ధి ఉన్నదని అంటే దేనికీ సంబంధం లేకుండా జీవిస్తానని అర్ధం. అలాగే కొందరు సంస్కృతం మృత భాష అంటారు. అది తప్పు. సంస్కృతం కూడా ఇలాంటిదే" అన్నారు పరమాచార్య.

"మనదగ్గర ఏదో ఒక విశేషం ఉంటే అది పోతుందేమోననే భయం ఉంటుంది. సంస్కృతం అన్ని ప్రాంతలోనూ వ్యాపించే ఉంది అన్ని భాషలలో సంస్కృత పదాలు చేరి ఉన్నాయి. చాల భాషలు సంస్కృత జన్యాలే. మా తమిళభాషలో చెప్పలేనన్ని సంస్కృత పదాలున్నాయి. అయితే చావు లేక మృతి అంటే ఏమిటి? ఏది చనిపోగలుగుతుంది? శరీరం చస్తుంది. జీవ శ్వాస ఆగిపోతే శరీరం మరణిస్తుంది. సంస్కృతం అన్నిభాషలకు జీవ ప్రదం. మన మతం మన సంస్కృతీ అన్ని ప్రదేశాలలోనూ ప్రపంచ మంతటా విస్తరించి ఉన్నాయి. మన మతానికి పునాది వేదమే. మళ్ళీ మనమంతా కలుస్తాం ఒకటౌతాం. ఈ విషయాన్ని అందరికి నవ్వుతూ ద్వేషం లేకుండా చెబితే అందరూ ఆసక్తిగా వింటారు. అప్పుడు మనలను కళ్ళలో కళ్ళు పెట్టి చూస్తారు. అప్పుడే

మనమతం విశ్వ వ్యాప్తమౌతుంది" అన్నారు పూజ్య శ్రీ చంద్ర శేఖర మహా స్వామి వారు.

"తిరుక్కురళ్"ను తమిళంలో రాసిన తిరువల్లువార్ కవి ఒక సారి మదురై వెళ్ళాడు. అక్కడ అందరూ ఆయన రచనను తెగ పొగిడారు. ఆయనను తమిళం సంస్కృతంలలో ఏది గొప్పది అని అడిగారు అక్కడ. అప్పుడు తిరువల్లువార్ "రెండూ దేనికదే గొప్పవి. "మరి సంస్కృతం గొప్ప అని ఎందుకు అంటారు?" అని ఒకరు అడిగితే ఆ కవి "వేదాలు సంస్కృత భాషలో ఉన్నాయి కనుక" అని స్పష్టం చేశాడు. ఈ విషయం భారతీయ విద్యాభవన్ –బొంబాయి వారు 2000 సంవత్సరంలో ప్రచురించిన "హిందూ ధర్మ"లో 47వ పేజీలో ఉన్నది. సర్వమానవాళి భాష సంస్కృతమే. అది దేవభాష. అంటే గీర్వాణ భాష. తమిళ కవి సార్వ భౌముడు "కంబార్" దానిని దేవ భాష అంటే సంస్కృత కవి దండి "దైవీ వాక్" అన్నాడు తన "కావ్యా దర్శ"లో – "సంస్కృతం నామ దైవీ వాక్" (హిందూ ధర్మలో 328 పేజి)

"800 ఏళ్ళ క్రితం సంస్కృతం భారత దేశమంతటనే కాకుండా "విశాల భారత దేశం" అంటే సియాం, కంబోడియా, జావా, ఇండొనేషియా (బాలి)లలో కూడా అధికార భాషగా ఉండేది. అక్కడ శిలా ఫలకాలలో, రాగి రేకులలో సంస్కృతం కనిపించింది. సంస్కృతంలో అస్పష్టమైన అక్షరం అనేది లేదు. మూలం అనేది లేకుండా ఏ పదమూ అందులో ఉండదు. ఏ పదాన్ని అయినా విడదీసి అందులో ఉన్న అర్థాన్ని తెలుసుకోవచ్చు. శ్రావ్యమైన పవిత్ర భాష అది. అలాంటి ఉత్కృష్ట మైన భాషను సంకుచిత దృష్టితో ఒక ప్రాంతానికి మాత్రమె చెందినది అని అనుకోవటం తప్పు".

"సంస్కృతంలో అన్ని ప్రాధమిక శబ్దాలు (ఫోనీమ్స్) ఉన్నాయి. ఆ భాషలో లేని ఏ శబ్దమూ మానవుడు పలికిన దాఖలాలు లేవు. దానిలో "ఎఫ్" శబ్దం ఉంది. అందరూ ఊహించినట్లు "ఝ" శబ్దం లేదు. ఇది తమిళానికికి మాత్రమే చెందింది. యజుర్వేదంలోని "ద"ను సామవేదంలో ఝ"గా ఉచ్చరిస్తారు. మూడు చుక్కల గుర్తు సంస్కృతంలోకూడా ఉంది. "ఆహ్ పాక్ కాప్" అని పాణిని సూత్రం ఉంది. దీనిప్రకారం ఏదైనా శబ్దం క అక్షరానికి ముందు విసర్గతో ఉంటే ఉదాహరణకు – రామః ఆహ్ కరుణాకరః అప్పుడుముందు చెప్పినట్లు ఆహ్ ఉండకుండా ఆయతంలో వస్తుంది ఇక్కడవిసర్గే ఆయతనం ప –కర ముందు ఎఫ్ అవుతుంది".

తమిళులు చెప్పే "క్రుతియాలుకరం" సంస్కృతంలో కూడా ఉంది. సంస్కృతంలో

ర్, ల్‌లు హల్లులలో కలిసి ఉండవు. అవి అచ్చులుగానే పరిగణింప బడుతాయి. సంస్కృతంలో హ్రస్వ "ఇ", "ఒ"లు లేవు. ఇది ఆ భాషలో లోపం అని నాకు అనిపించింది. కాని పాణిని సూత్రాలపై పతంజలి వ్యాఖ్య చదివాక అవికూడా ఉన్నాయని ఊరట చెందాను. సామవేదంలో "సత్యముగ్రి రనయానియ శాఖ"లో హ్రస్వ ఇ హ్రస్వ ఒలను ఉపయోగించినట్లు పతంజలి తెలియజేశాడు. కనుక సంస్కృతంలో అన్ని శబ్దాలు ధ్వనులు ఉన్నాయని ఖచ్చితంగా చెప్ప వచ్చు. ప్రతి అక్షరం యొక్క ఉచ్చారణ నిర్దుష్టంగా చెప్పబడింది. (హిందూ ధర్మ -294-295 పేజీలు). దైవ భాష అవటం వలన సంస్కృతం దైవ కృప కలిగి ఉన్నది. సంస్కృత శబ్దాల ఉచ్చారణ నాడులలో ధనాత్మక, కంపనాలవలను కలిగించి ప్రయోజనాత్మక బలాన్ని ఇస్తాయి. నాడీ వ్యవస్థ బాగు పడి శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. (హిందూ ధర్మ -328 పేజి)

**సంస్కృతం శాకాహారిగా మార్చింది**

పండ్లు మొదలైన సాత్వికాహారం గొప్ప తనాన్ని తెలియ జేస్తూ స్వామి వారు "ఒక బ్రిటిష్ ఆయనకు ఇండియా ఆహార అలవాట్లు, మనుషులు అనాగరకం అని భావించి అమెరికా నుంచి మాంసం తెప్పించుకొని తినేవాడు. అతడు సంస్కృతం నేర్చుకోవటం ప్రారంభించాడు. "సుఖైః తృణైః వనగజాః బలినో భవంతి" అన్న మాట విన్నాడు. వెంటనే మనసు మార్చుకొని మాంసాహారం తినటం మానేశాడు. ఏ జంతువు బలమైనది? ఏనుగు. అది ఏం తింటుంది? గడ్డి, ఆకులు. మీరు ఏనుగుకన్నా సింహం బలమైనది కదా అని అనిపించవచ్చు అది నిజం కాదు. సింహం ఎద్దులాగా బరువైనవి మోయలేదు. కనుక మాంసాహార జీవులు వినాశానానికే పనికొస్తాయి. శాకాహారికి ప్రపంచమంతా అందంగా కనిపిస్తుంది. (కృష్ణా జిల్లా ఉయ్యూరులో 25-1-1968న శ్రీ పరమాచార్య తెలుగులో చేసిన ప్రసంగం)

"వేద భాష సంస్కృతం కాదు ఛందస్సు మాత్రమే. ఛందస్సు అంటే గణ యతులు మాత్రమే కాదు. వాటిలో చెప్పబడిన వేద భాష. మామూలు భాషలో కవిత్వం పురాణం కావ్యాలలో ఇతరత్రా ఉన్నది సంస్కృతమే. వేద భాష మాత్రమే ఛందస్సు. వేదాల గురించి పాణిని చెబుతూ "ఇతి చందసి" అన్నాడు. సంస్కృతాన్ని గురించి చెప్పేటప్పుడు పాణిని దానిని "లోకే" అన్నాడు. సంస్క్రతం సంస్కరింప బడినప్పుడు వేద భాషలోని అనేక శబ్దాలను తీసుకొన్నది. ఏదైనా భాష పూర్తిగా

శబ్దాల, ధ్వనులమీద మానవాళి సంక్షేమం కోసం ఏర్పడిందీ అంటే అది "ఛందస్సు" అంటే వేద భాష మాత్రమే. కృతం అంటే సృష్టింప బడినది అని అర్థం. సంస్కృతం అంటే చక్కగా సంస్కరింపబడి సృష్టింపబడిన భాష అని అర్థం. కనుక సంస్కృత భాష చాలా శ్రమతో జాగ్రత్తగా సృష్టింప బడింది అని మనం గ్రహించాలి. (హిందూ ధర్మ – 740 పేజి) అని శ్రీ కంచి పరమాచార్య జగద్గురువులు శ్రీ శ్రీ చంద్ర శేఖర మహా స్వామి వారు ప్రవచించారు.

ఇవన్నీ మీకు అందించినందుకు నా జన్మ ధన్య మైనదని భావిస్తాను.

"గీర్వాణ భాషా వైభవం" కవి సమ్మేళనంలో వచ్చిన కవితలలో ఈ మూలాలను లోతుగా ఎవరూ తరచలేదని పించి, ఈ రెండు వ్యాసాలూ మీకు అందజేశాను. దీనితో "గీర్వాణ భాషా వైభవం"కు స్వస్తి పలుకుతున్నాను.❀ **– గబ్బిట దుర్గా ప్రసాద్**